ఆధ్యాత్మిక అమృతవాహిని

శ్రీ రామకృష్ణ ప్రభ

జనవరి 2014

₹10





సుబోధ

శ్రీరామకృష్ణులు: తీర్థయాత్రలు చేయడం, మెడలో మాలను ధరించడం మొదలైన ఆచారాలు ఆధ్యాత్మిక జీవిత ప్రారంభంలో ఆవశ్యకాలు.

పదహారు రూపాయలను అణాలుగా మారిస్తే అదొక పెద్ద కుప్పలా ఉంటుంది. దాన్ని రూపాయలుగా మారిస్తే అంత పెద్దగా కనిపించదు. దాన్ని ఒక బంగారు నాణెంగా మారిస్తే మరింత చిన్నదిగా అగుపడుతుంది. చిన్న వజ్రంగా మార్చితే అది ఉన్నట్లే కనిపించదు.

అలాగే, భగవద్దర్శనం కలిగితే బాహ్యాడంబరాలు క్రమక్రమంగా తగ్గిపోతాయి. తరువాత మిగిలేది భగవన్నామ జపం, స్మరణ, చింతన మాత్రమే!

సాధకులలో పలు రకాలున్నారు. సాత్త్విక సాధకులు – ఇతరులకు తెలియకుండా గోప్యంగా సాధనలు చేస్తారు. చూడడానికి సామాన్యుల లాగా కనపడతారు.

రాజసిక సాధకులు – డాబు ప్రదర్శిస్తారు; కంఠంలో మధ్య మధ్యలో బంగారు పూసలు కూర్చిన జపమాల, ప్రత్యేకమైన దుస్తులు, కాషాయ వస్త్రాలు, పట్టుపంచె మొదలైన బాహ్యాడంబరాలు వారిలో కానవస్తాయి. వారంతా 'ప్రకటన ఫలకం' తగిలించుకొని వ్యాపారం చేసే వ్యక్తుల లాంటివారు.

ఏ మతమైతే మాత్రం ఏమిటి? ఏ మార్గం అయితే మాత్రం ఏమిటి? అందరూ ఆ ఒకే ఒక్క భగవంతుణ్ణే ప్రార్థిస్తున్నారు. అందుకే ఏ మతాన్నీ, ఏ మార్గాన్నీ ద్వేషించరాదు; కించపరచ రాదు. వేదాలు ఆయనను సచ్చిదానంద బ్రహ్మంగా పేర్కొంటున్నాయి. భాగవతాది పురాణాలు సచ్చిదానంద కృష్ణునిగా పిలుస్తున్నాయి, తంత్రాలు సచ్చిదానంద శివునిగా పేర్కొంటున్నాయి. అన్నీ ఆ ఏకైక సచ్చిదానందమే.

ఒక చెట్టు మీద ఓ ఊసరవెల్లి ఉంది. ఒకడు దాన్ని చూసినప్పుడు అది ఆకుపచ్చరంగులో ఉంది, మరొకడు చూసినప్పుడు ఎర్రగా ఉంది, ఇంకొకడు చూసినప్పుడు పసుపుపచ్చ రంగులో ఉంది. ఈ విధంగా పలువురు పలు రంగులలో ఆ ఊసరవెల్లిని చూశారు. తరువాత అది ఆకుపచ్చ అనీ, ఎరుపు అనీ, పసుపుపచ్చ అనీ వారు తమలో తాము కలహించుకోసాగారు. చివరికి ఆ చెట్టు క్రింద వసిస్తూ ఉన్న వ్యక్తిని అడిగినప్పుడు అతడు, 'నేను ఈ చెట్టు క్రిందే రేయింబవళ్ళు ఉంటున్నాను. అదొక ఊసరవెల్లి. క్షణక్షణమూ అది తన రంగును మార్చుకుంటూ ఉంటుంది. కొన్ని సమయాల్లో ఏ రంగూ లేకుండా ఉంటుంది' అని చెప్పాడు.

భగవంతుడు సగుణుడు, నిర్గుణుడు, నానారూపధారి, ఏ విధమైన రంగూ రూపం లేనివాడు, మనోవాక్కులకు అతీతుడు.

భగవంతుణ్ణి ఎవరైనా, ఎలాగైనా పిలవవచ్చు. మనోవ్యాకులత ఉంటే చాలు. హృదయాంతరాళాల నుండి పిలిస్తే నిశ్చయంగా ఆయనను దర్శించవచ్చు. ❖

శ్రీరామకృష్ణ ప్రభ
రామకృష్ణ మఠం, దోమల్‌గూడ, హైదరాబాద్–500 029
ఫోన్: 040–27667799, మొబైల్: 8801849494
E-mail: sriramakrishnaprabha@gmail.com

నిర్వాహక సంపాదకులు: **స్వామి జ్ఞానదానంద** సంపాదకులు: **స్వామి పరిజ్ఞేయానంద**

వివేకానంద రథయాత్ర



(2013 సెప్టెంబర్ 1వ తేదీ నుండి నవంబర్ 30వ తేదీ వరకు)











స్వామి వివేకానంద 150వ జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని హైదరాబాద్ రామకృష్ణ మఠం 2012 సెప్టెంబర్ 11వ తేదీ నుండి 'వివేకానంద రథయాత్ర'ను రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తోంది.

ప్రకాశం, నల్లగొండ, మహబూబ్‌నగర్, రంగారెడ్డి, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ జిల్లాల్లో 2013 సెప్టెంబర్ 1వ తేదీ నుండి నవంబర్ 30వ తేదీ వరకు రథయాత్ర కొనసాగింది. ఆయా జిల్లాల్లోని శ్రీరామకృష్ణ సేవాసమితుల సహకారంతో హైదరాబాద్ రామకృష్ణ మఠం పర్యవేక్షణలో సుమారు 180 పట్టణ, గ్రామాల్లో వివేకానంద రథం పర్యటించింది. సుమారు రెండు లక్షల మంది పుర ప్రజలు, విద్యార్థులు రథాన్ని దర్శించుకున్నారు. రథయాత్రలో సుమారు రూ.14 లక్షల విలువైన వివేకానంద సాహిత్యాన్ని కొనుగోలు చేశారు. ❖
















Vol.71-1, Sri Ramakrishna Prabha (Telugu Monthly) January 2014, Regd. with the Registrar of Newspaper for India Under No.1120/57.
Postal Registration No. HD-1071/2013-15. Licensed to Post Under WPP : AP/CPMG/HC-13/WPP/2013-14. Date of Publication : 18th of every month.



'ప్రభ'ంజనానికి పాఠకుల ప్రోత్సాహం

మానవజీవన వికాసానికీ, మహోన్నత సనాతనధర్మ విస్తృతికీ విశేషకృషి చేస్తోన్న 'శ్రీరామకృష్ణ ప్రభ'ను ఆదరాభిమానాలతో ముందుకు తీసుకువెళుతున్న అశేష పాఠకులకు అభివందనాలను తెలియజేస్తున్నాం. 1,10,000 ప్రతులతో తెలుగు ప్రజల ముంగిళ్ళకు ఆధ్యాత్మిక తోరణాలు కడుతున్న ఈ మాసపత్రిక ఆబాలగోపాలాన్నీ అలరిస్తున్నందుకు ఆనందిస్తున్నాం.

మానవీయ విలువల పరివ్యాప్తికి పాటుపడుతున్న ఈ అక్షరక్రతువును మరింత సుసంపన్నం చేయాలన్నది మా సంకల్పం. అత్యున్నతమైన భారతీయ ధార్మిక సారస్వతాన్ని ఆధునిక జనావళికి అనుగుణంగా మలచి అందిస్తున్న ఈ అక్షరామృతాన్ని మీ వరకే పరిమితం చేసుకోకుండా, మీ ఆత్మీయులకూ అందించాలని అభిలషిస్తున్నాం.

బంధుమిత్రులకూ, విద్యాలయాలకూ, గ్రంథాలయాలకూ మీ అభిమాన కానుకగా 'శ్రీరామకృష్ణ ప్రభ'ను బహూకరిస్తూ ఓ సరికొత్త సంప్రదాయానికి శ్రీకారం చుట్టాలని ఆశిస్తూ ఉన్నాం. అపురూపమైన ఈ అభిరుచితో మీ ఆత్మీయుల మనస్సులో చెరగని ముద్రను వేసుకోవాలనీ, మూర్తిత్రయ ఆశీస్సులకు పాత్రులు కావాలనీ ఆకాంక్షిస్తున్నాం.

అధ్యక్షులు
రామకృష్ణ మఠం, హైదరాబాద్

ఆధ్యాత్మిక అమృతవాహిని
శ్రీ రామకృష్ణ ప్రభ
సంపుటం: 71 సంచిక: 1 జనవరి 2014



నమ ఉగ్రాయ వీరాయ సారంగాయ నమో నమః।
నమః పద్మ ప్రబోధాయ మార్తాండాయ నమో నమః॥
తప్తచామీకరాభాయ వహ్నయే విశ్వకర్మణే।
నమస్తమోఽభి విఘ్నాయ రవయే లోకసాక్షిణే॥

ఉగ్రుడవు, వీరుడవు, వేగంగా పయనించునట్టివాడవు అయిన నీకు నమస్కారం. పద్మములను వికసింపజేయు నీకు నమస్కారం. బ్రహ్మాండ పునఃసృష్టికి హేతువైన నీకు నమస్కారం. కరిగిన బంగారు వన్నెగలవాడవు, అగ్ని రూపుడవు, జగత్కారణుడవు, అంధకారాన్ని పోగొట్టువాడవు, ప్రకాశస్వరూపుడవు, లోకసాక్షివి అయిన నీకు నమస్కారం. – ఆదిత్యహృదయం

స్వామి వివేకానంద 150వ జయంత్యుత్సవాలు 2013 జనవరి - 2014 జనవరి




స్వామీజీకి ఘననివాళి


స్వామి వివేకానంద 150వ జయంత్యుత్సవాలను పురస్కరించుకొని 2013 జనవరి సంచిక నుంచి 2014 జనవరి సంచిక వరకు 'శ్రీరామకృష్ణ ప్రభ' స్వామీజీ ముఖచిత్రంతో, ప్రత్యేకవ్యాసాలతో పాఠకులను అలరించిందని భావిస్తున్నాం.

ఈ పదమూడు సంచికల్లో మహాజ్ఞాని, మహాభక్తుడు, మహాయోగి, మహాప్రవక్త, మహాదేశభక్తుడు, ధ్యానసిద్ధుడు, యతిశ్రేష్ఠుడు, యుగాచార్యుడు, స్ఫూర్తిప్రదాత అయిన స్వామి వివేకానంద జీవితంలోని విభిన్న పార్శ్వాలను స్పృశించే ప్రయత్నం చేశాం. స్వామీజీకి సంబంధించిన విశ్లేషణాత్మక వ్యాసాలనూ, బోధనలనూ, సంఘటనలనూ, స్మృతులనూ, సూక్తులనూ, వారి సందేశంతో ప్రభావితులైన మహోన్నతుల అనుభూతులనూ ప్రచురించాం. ఆ మహాప్రవక్తకు పదమూడు నెలల పాటు అక్షరాంజలిని అర్పించి, స్మరించుకొనే భాగ్యానికి నోచుకున్నాం.

స్వామీజీకి సంబంధించిన ఈ ప్రత్యేక వ్యాసాల ద్వారా పొందిన స్ఫూర్తితో ఆయన ఆశయాలకు అనుగుణంగా మన జీవితాలను తీర్చిదిద్దుకొందాం. అదే ఆ మహనీయునికి మనం అర్పించగల ఘననివాళి. ❖ – సంపాదకులు



శ్రీరామకృష్ణ ప్రభ శాశ్వత నిధి





ఆధ్యాత్మిక జ్ఞానాన్ని పంచి పెట్టేందుకు 'శ్రీరామకృష్ణ ప్రభ' కృషి చేస్తోంది. నిధుల కొరత లేకుండా ఈ జ్ఞానయజ్ఞం నిరంతరాయంగా సాగేందుకు 'శ్రీ రామకృష్ణ ప్రభ శాశ్వతనిధి'కి ధన దానం చేసి ప్రోత్సహించాల్సిందిగా కోరుతున్నాం. దాతల పేర్లు పత్రికలో ప్రచురిస్తాం.

మహారాజ పోషకులు...... రూ. 10,000/-, అంతకన్నా ఎక్కువ విరాళం ఇచ్చేవారు.
రాజ పోషకులు............ రూ. 5,000/-, అంతకన్నా ఎక్కువ విరాళం ఇచ్చేవారు.
పోషకులు................. రూ. 1,000/-, అంతకన్నా ఎక్కువ విరాళం ఇచ్చేవారు.

	దాత పేరు / చిరునామా	రూ.
మహారాజ పోషకులు	: డాక్టర్ వి. రామకృష్ణ రాజు, భీమవరం, ప.గో. జిల్లా (కీ॥శే॥ వి.వేంకటేశ్వరరాజు, రాజేశ్వరి గార్ల జ్ఞాపకార్థం)	10,000
మహారాజ పోషకులు	: శ్రీ ఆర్.ఎల్. మనోహర రెడ్డి, అక్కనవారి వీధి, ఫతేఖాన్‌పేట, నెల్లూరు - 524 003	10,000
పోషకులు	: శ్రీమతి పి.సి.ఆర్. రమాదేవి, యాదగిరి నగర్, గ్రీమ్స్‌పేట, చిత్తూరు - 517 002	1,116
పోషకులు	: శ్రీ ఆర్. మూలారావు, హుడాకాలనీ, చందానగర్, హైదరాబాద్	1,116
పోషకులు	: శ్రీ మహేశ్వరం సుభాష్ రెడ్డి, దమ్మన్నపేట, వరంగల్ జిల్లా - 506 316	1,000

'శ్రీరామకృష్ణ ప్రభ' కానుక పథకం

యువతరానికి 'శ్రీరామకృష్ణ ప్రభ'ను మరింత చేరువ చేయాలని సంకల్పించాం. రాష్ట్రంలోని వివిధ పాఠశాలలు/ కళాశాలలు/ గ్రంథాలయాలకు పత్రికను పంపించడానికి మీ సహాయాన్ని కోరుతున్నాం. ఈ కానుక పథకం క్రింద చందా చెల్లించిన దాత పేరున (మీరు సూచించిన లేదా మేము ఎంపిక చేసిన) విద్యాసంస్థకు పత్రికను పంపుతాం. కానుక చందా రూ.1,500/- అంతకన్నా ఎక్కువ ఇచ్చిన దాత పేరు, విద్యాసంస్థ పేరు పత్రికలో ప్రచురిస్తాం.

దాత పేరు	విద్యాసంస్థ
శ్రీ యార్లగడ్డ బ్రహ్మం, కె.పి.హెచ్.బి. హైదరాబాద్	ఎస్.కె.ఎ.వి.ఎస్. ఉన్నత పాఠశాల, ఇడుపులపాడు, ప్రకాశం జిల్లా
డా॥ సి. శివరామకృష్ణారావు, ఉయ్యూరు, కృష్ణా జిల్లా	3 విద్యాసంస్థలకు పత్రికను 5 సంవత్సరాలకు స్పాన్సర్ చేశారు.
శ్రీ వరుపుల సూర్యప్రకాశరావు & కృష్ణవేణి, విశాఖపట్టణం	ఎమ్.పి. ప్రాథమిక పాఠశాల, రెడ్డిపల్లి అగ్రహారం, విశాఖపట్టణం
డా॥ కె. జగన్‌మోహన్, రాజంపేట, కడప జిల్లా	3 విద్యాసంస్థలకు పత్రికను 12 సంవత్సరాలకు స్పాన్సర్ చేశారు.
శ్రీ టి. లక్ష్మారెడ్డి, సోమాజీగూడ, హైదరాబాద్	సెంట్రల్ ప్రాథమిక పాఠశాల, కందనెల్లి, రంగారెడ్డి జిల్లా



సంక్రాంతి శుభాకాంక్షలు

'శ్రీరామకృష్ణ ప్రభ' పాఠకులకు, రచయితలకు,
రచయిత్రులకు, ఏజెంట్లకు, ప్రకటనకర్తలకు, దాతలకు,
శ్రేయోభిలాషులకు మా హృదయపూర్వక
సంక్రాంతి శుభాకాంక్షలు. *- సంపాదకులు*

చందా వివరాలు		భారతదేశంలో	విదేశాలలో
విడి ప్రతి	:	₹ 10	-
సంవత్సర చందా	:	₹ 100	₹ 1,500
మూడు సంవత్సరాలకు	:	₹ 280	₹ 4,500
ఐదు సంవత్సరాలకు	:	₹ 450	₹ 7,500
ఇరవై సంవత్సరాలకు	:	₹ 1,500	₹ 22,000

గమనిక: డిమాండ్ డ్రాఫ్ట్, మనియార్డర్లలో Ramakrishna Math, Hyderabad అని వ్రాయాలి.
పంపవలసిన చిరునామా: Sri Ramakrishna Prabha, Ramakrishna Math, Domalguda, Hyderabad - 500 029.

చందాను ఆన్‌లైన్ http://kinige.com/srkp ద్వారా చెల్లించవచ్చు.

లోపలి పేజీల్లో...

శ్రీరామకృష్ణ ప్రభ చందాదారులకు విన్నపం

ప్రియ పాఠకులారా!

- 'శ్రీరామకృష్ణ ప్రభ' పత్రిక కవరు మీద చిరునామాకు పైన మీ చందా నంబరు, కుడి వైపున మీ చందా గడువు ముగిసే నెల ఉంటాయి. మీ చందా గడువు పూర్తయ్యే నెలకు ముందుగానే సొమ్మును చెల్లించి చందాను పునరుద్ధరించుకోండి.
- మీ ఉత్తర ప్రత్యుత్తరాలన్నింటిలో తప్పనిసరిగా చందా నంబరు పేర్కొనాల్సిందిగా మనవి.
- మీ చిరునామా మారిన పక్షంలో 7వ తేదీ లోగా మాకు తెలియపరచినట్లయితే, వచ్చే నెల సంచిక నుండి మీ కొత్త చిరునామాకు పంపబడును.
- ప్రతీ నెల 26 లేదా 27వ తేదీల్లో పత్రిక పోస్ట్ అవుతుంది. మీకు పత్రిక 15వ తేదీ లోపుగా చేరనట్లయితే, వెంటనే మాకు తెలియజేయగలరు.

శ్రీరామకృష్ణ ప్రభ ద్వారా అవిచ్ఛిన్నంగా సేవలు అందించాలన్నదే మా ఆకాంక్ష. అందుకు మీ సహకారం కోరుతూ.... – సర్క్యులేషన్ మేనేజర్

'శ్రీరామకృష్ణ ప్రభ' పత్రిక చందాను ఆన్‌లైన్ http://kinige.com/srkp ద్వారా చెల్లించవచ్చును.

ఎటో వెళ్ళిపోతోంది యువత!



‘ప్రపంచంలో ఏ దేశానికీ లేని యువశక్తి కేవలం భారతదేశానికే ఉంది. అది మనకు గొప్ప వరం. కానీ, ఆ వరమే మన దేశానికి శాపంగా పరిణమిస్తోంది’ అని మేధావి వర్గమంతా మథనపడుతూ ఉంది. నిజానికి యువతరం మన దేశానికి వరమా? లేక శాపమా? పరవళ్ళు తొక్కుతూ ప్రవహించే యువశక్తి హద్దులు దాటితే వినాశనాన్ని సృష్టిస్తుంది. అదే యువశక్తిని మార్గనిర్దేశం చేసి, సన్మార్గంలో పయనింపజేస్తే పురోగమనానికి సోపానమవుతుంది.

‘యువతరం – సినిమా, టీవీ, సెల్‌ఫోన్, ఇంటర్‌నెట్ మొదలైన ఆధునిక ఆకర్షణల మోజులో పడి పెడదోవ పడుతోంది. దురలవాట్ల సునామీలో కొట్టుకుపోతోంది’ అని యువతరాన్ని విమర్శించేవాళ్ళేగానీ, వారిని సంస్కరించేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నామని ఆలోచించేవారు అరుదు.

తప్పుపట్టడం కాదు, ఒప్పేమిటో చెప్పు! చేతికి దొరికిన కాగితాన్నల్లా చింపేయడం ఓ నాలుగేళ్ళ పిల్లవాడికి అలవాటు. కరెన్సీ నోటు చేతిలో పడినా అదే తీరు. తల్లితండ్రులు ఎంత తిట్టినా, ఎంత కొట్టినా అతడి అలవాటు మాత్రం మారలేదు. పిల్లవాడి వింత చేష్టను మానిపించలేని తల్లితండ్రులు, ఒక మానసిక వైద్యుడి దగ్గరకు తీసుకువెళ్ళి విషయం చెప్పారు.

మానసిక వైద్య నిపుణుడు ఆ పిల్లవాణ్ణి గదిలోకి తీసుకువెళ్ళి, ఓ ఐదు నిమిషాల తరువాత తిరిగి తీసుకువచ్చాడు. అబ్బాయి తల్లితండ్రులతో ఆ వైద్యుడు ‘ఇప్పుడు మీ అబ్బాయికి కరెన్సీనోటు ఇవ్వండి’ అని చెప్పాడు. ఐదు వందల రూపాయల నోటును ఆ అబ్బాయి చేతిలో పెట్టారు. ఆ అబ్బాయి ఆ నోటును చింపకుండా తిరిగి తల్లితండ్రులకు ఇచ్చేశాడు. “ఎన్నో రోజులుగా మేము మాన్పించలేని అలవాటును మీరెలా మాన్పించగలిగారు?” అని తల్లితండ్రులు ఆశ్చర్యంగా అడిగారు. అప్పుడు వైద్యుడు “మీరు ఇన్నాళ్ళూ కాగితాన్ని చింపొద్దు అని మాత్రమే చెప్పారు. కానీ నేను కాగితాన్ని ఎందుకు చింపకూడదో చెప్పాను. ఈ కాగితం (కరెన్సీ నోటు)తో దుస్తులు, చాక్లెట్‌లు, ఆటవస్తువులు కొనుక్కోవచ్చని చెప్పాను” అని సమాధానమిచ్చాడు.

అందువల్ల తప్పు చేశారంటూ పిల్లల్ని నిందించడంతో సరిపెట్టకుండా, వారికి ఉన్నత విలువలను బోధించాలి. అందుకే **“పిల్లల్ని ‘మీరు చెడ్డవారు, ఎందుకూ పనికిరారు’ అని నిందించవద్దు. ‘మీరు మంచివారు, ఇంకా మంచివారిగా తయారుకావాలి’ అని ప్రోత్సహించాలి. వారిలో సకారాత్మక, స్ఫూర్తిదాయక ఉన్నత భావాలను పెంపొందింపజేయాలి”** అని అంటారు స్వామి వివేకానంద.

వెలుగుబాట వైపు యువ సారథులు: ‘మంచిమాటలు చెబితే నేటితరం పిల్లలు వింటారా?’ అని నిరుత్సాహాన్ని వ్యక్తపరిచేవాళ్ళు చాలామంది ఉన్నారు. కానీ ఈ అపోహ నిజం కాదు. యువతకు సన్మార్గంలో నడవాలనీ, తమ జీవితాలను ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలనీ ఆసక్తీ, తపనా, ఉత్సాహం ఉన్నాయి. అందుకు నిదర్శనంగా స్వామి వివేకానంద 150వ జయంత్యుత్సవాలను పురస్కరించుకొని సుమారు పదహారు నెలల పాటు రాష్ట్ర వ్యాప్తంగా కొనసాగిన ‘వివేకానంద రథయాత్ర’ సభల్లో పాల్గొన్న కొంతమంది విద్యార్థినీ విద్యార్థుల స్పందన, నిజజీవిత అనుభవాలూ కొన్నింటిని ఇక్కడ తెలియజేస్తున్నాం:

ఒక ఊరిలో రోడ్డు పక్కన ఉన్న సంచార పుస్తక విక్రయశాల వద్ద చాలా మంది వివేకానంద పుస్తకాలు కొనుక్కుంటున్నారు. అదే దోవలో వెళుతున్న ఒక కళాశాల విద్యార్థి అక్కడ ఆగి చాలాసేపు ఏదో ఆలోచిస్తూ నిలబడ్డాడు. అతణ్ణి చూసిన ఓ కార్యకర్త “ఏమిటి అంత దీర్ఘంగా ఆలోచిస్తున్నావు?” అని అడిగాడు. అందుకు ఆ విద్యార్థి “నా దగ్గరున్న ఇరవై రూపాయలతో సినిమా చూడడానికి వెళ్ళాలా? లేక వివేకానంద పుస్తకాలు కొనుక్కోవాలా? అని ఆలోచిస్తున్నాను” అన్నాడు.

అప్పుడు ఆ కార్యకర్త “సినిమా రేపైనా చూడొచ్చు. నువ్వు ఒక్కసారి ‘భారతజాతికి నా హితవు’ అనే స్వామి వివేకానంద పుస్తకాన్ని చదువు” అని సలహా ఇచ్చాడు. అతడు చెప్పిన ప్రకారం ఆ విద్యార్థి పుస్తకాన్ని కొనుక్కొని ఇంటికి వెళ్ళి, చదివిన తరువాత మళ్ళీ అక్కడకు వచ్చి ఇంకో వంద రూపాయలతో స్వామి వివేకానంద జీవిత చరిత్ర, మరికొన్ని పుస్తకాలను కొని, ‘ఈ రోజు మీ సలహా పాటించి ఉండకపోతే ఎంతో విలువైన సందేశాన్ని కోల్పోయి ఉండేవాణ్ణి’ అంటూ కార్యకర్తకు ధన్యవాదాలు తెలిపాడు.

ఒక నగరంలో పాఠశాల విద్యార్థులను ఉద్దేశిస్తూ ఓ స్వామీజీ,'మీరంతా వివేకానంద సూక్తిని రోజుకు ఒక్కటైనా పఠించండి. అప్పుడు మీలో ఏకాగ్రత, శ్రద్ధ పెరుగుతాయి' అని సూచించారు. ఆ సభలో 8వ తరగతి చదువుతున్న ఓ అమ్మాయి, స్వామీజీ సూచన ప్రకారం రోజూ వివేకానంద సూక్తులను పఠించడం మొదలుపెట్టింది. అప్పటి వరకూ అల్లరి చిల్లరగా తిరిగిన ఆ అమ్మాయి ఉదయాన్నే లేచి దైవ ప్రార్థన చేస్తోంది. శ్రద్ధగా చదువుకుంటోంది. అమ్మాయిలో హఠాత్తుగా వచ్చిన ఈ మార్పును గమనించిన ఆమె తల్లితండ్రులు 'నీలో ఇంత మార్పు ఎలా వచ్చింది?' అని అడిగారు. అందుకు 'స్వామి వివేకానంద బోధలే నాలో పరివర్తనకు కారణం. మీరు నాకు స్వామీజీ గురించి ఇంతవరకు ఎందుకు చెప్పలేదు?' అంటూ తల్లితండ్రులను ప్రశ్నించింది ఆ చిన్నారి.

ఒక గ్రామంలో జరిగిన విద్యార్థుల సదస్సులో 2,000 మంది విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు. తరగతి గదిలో 45 నిమిషాల పాటు కూడా నిశ్శబ్దంగా ఉండలేని విద్యార్థులు ఆ సభలో సుమారు మూడు గంటల పాటు స్వామి వివేకానంద బోధించిన ఆత్మవిశ్వాసం, మనోనిగ్రహం, కార్యదీక్ష, ఆత్మస్థైర్యం, సేవ, త్యాగాల గురించి వింటూ తన్మయులైపోయారు. ఆ సభ చివరిలో విద్యార్థినీ విద్యార్థులు తమ స్పందన తెలియజేశారు. అందులో ఒక వికలాంగ విద్యార్థి మాట్లాడుతూ, "స్వామి వివేకానంద స్ఫూర్తితో జీవితంలో దేనినైనా సాధించవచ్చు అన్న సంకల్పబలం నాలో పెరిగింది. స్వామీజీ సందేశాన్ని మాకు పరిచయం చేయకపోవడం వల్లనే పెదదోవ పడుతున్నాం. స్వామీజీ సందేశాన్ని చదివినవారిలో ఎలాంటి బలహీనతలనైనా ఎదుర్కోగలశక్తి కలుగుతుంది అని నా ప్రగాఢ విశ్వాసం" అని చెమ్మగిల్లిన కళ్ళతో నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపాడు.

మనోరుగ్మతలకు మందు: "మనోరుగ్మతలకు స్వామీజీ సందేశం ఓ దివ్య ఔషధం. ఆయన బోధలు చదివినవారిలో నిరాశా నిస్పృహలు తొలగి ఆత్మస్థైర్యం పెంపొందుతుంది" అని స్వామీజీ సందేశానికి ఉన్న శక్తిని పండిట్ నెహ్రూ శ్లాఘించారు.

ఒక పట్టణంలో రథయాత్రలో పాల్గొన్న ఒక విద్యార్థి, ఓ స్వామీజీతో 'స్వామీజీ! నేను స్వామి వివేకానంద సాహిత్యాన్ని చాలా చదివాను. స్వామీజీ గురించి ఇంకా తెలుసుకోవాలని ఉంది. ఇప్పుడు కొత్త పుస్తకాలు ఏమైనా ఉన్నాయా?' అని అడిగాడు. ఆ విద్యార్థితో స్వామీజీ, 'స్వామీజీ సాహిత్యాన్ని చాలా చదివావు కదా! స్వామీజీ సందేశ సారాంశాన్ని ఒక్క వాక్యంలో చెప్పు' అని అన్నారు. 'స్వామి వివేకానంద బోధనలు చదివితే పక్షవాతం వచ్చినవారిలోనైనా పరుగెత్తగలనన్న ఆత్మవిశ్వాసం కలుగుతుంది. మానసిక వైకల్యం తొలగి పోతుంది' అని పెల్లుబికిన ఉత్సాహంతో బదులిచ్చాడు.

ఒక విద్యార్థుల సభలో ఓ మంత్రి గారు పాల్గొన్నారు. ఆ సభలో ఓ స్వామీజీ, పిల్లలతో వివేకానంద సూక్తులను చెప్పించారు. వివేకానందుల జీవితంలోని స్ఫూర్తిదాయక సంఘటనలను వివరించారు. ఆ తరువాత మంత్రిగారు మాట్లాడుతూ, "మానసిక బలహీనతలను పారద్రోలే స్వామీజీ దివ్యసందేశాన్ని ఆస్వాదించిన మీరందరూ నిజంగా ధన్యులు. నేను విద్యార్థిగా ఉన్నప్పుడు స్వామీజీ గురించి వినే భాగ్యం నాకు కలగనందుకు బాధపడుతున్నాను. జీవితంలో నేను ఏం కోల్పోయానో ఇప్పుడు అర్థమైంది. కాబట్టి ఇక నుండి స్వామీజీ సాహిత్యాన్ని చదువుతాను" అని ఆర్ద్రమైన హృదయంతో చెప్పిన మాటలు విద్యార్థుల మనస్సులను కదిలించాయి.

యువతరానికి మార్గదర్శి... యువ నాయకుడు: ప్రపంచంలో స్వామి వివేకానందకున్న యువ అనుచరులు, అనుయాయులు మరెవరికీ లేరు. ఎందుకంటే స్వామీజీ భారతీయ యువతరానికి ఇచ్చినంత స్ఫూర్తిని మరెవ్వరూ ఇవ్వలేదు. యువతరం ఉన్నతి గురించి స్వామీజీ తపించినంతగా ఎవరూ తపించలేదు. యువతరంపై ఆయనకున్న విశ్వాసం మరెవరికీ లేదు. అందుకే, "నా ఆశలన్నీ యువతరం పైనే, ఆధునిక తరం పైనే! సింహాల్లా పోరాడి వారి సమస్యలను వారే పరిష్కరించు కోగలుగుతారు" అని స్వామీజీ అన్న మాటలే యువతరంపై ఆయనకున్న విశ్వాసానికి నిదర్శనం.

యువతరానికి స్ఫూర్తిప్రదాత, ప్రేరణదాత స్వామీజీయే అని ముక్తకంఠంతో చాటిన మహాత్ముల్లో కొందరి అభిప్రాయాలు:

> **"స్వామి వివేకానంద తన ప్రసంగాల ద్వారా విద్యార్థుల్ని ప్రభావితం చేసినట్లు దేశంలో ఏ ఇతర నాయకులూ చేయలేదు. ఆయన బోధలు చదివితే ఆత్మవిశ్వాసం, ఆత్మగౌరవం పెంపొందుతాయి."**
> *- నేతాజీ సుభాష్ చంద్రబోస్*

> **"నా విద్యార్థి దశలో స్వామి వివేకానంద బోధలు చదివి ఎంతో స్ఫూర్తి పొందాను. ఆయన బోధలు నా జీవిత దృక్పథాన్నే మార్చేశాయి."**
> *- లాల్ బహదూర్ శాస్త్రి*

> **"స్వామీజీ బోధనలు స్పృశిస్తేనే చాలు నా దేహం విద్యుద్ఘాతం తగిలినట్లుగా ప్రకంపిస్తుంది. ఆయన బోధలు మనలో నిద్రాణమై ఉన్న ఆత్మశక్తిని జాగృతం చేస్తాయి."** *- రోమారోలా*

> **"శక్తికి కేంద్రమైన స్వామి వివేకానంద నుండి భారత యువత స్ఫూర్తిని పొంది, ఉన్నతి సాధించాలని ఆశిస్తున్నాను."** *- జవహర్ లాల్ నెహ్రూ*

యువతకు మార్గదర్శి యువ నాయక వివేకానందే అనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. అందుకే భారత ప్రభుత్వం స్వామి వివేకానంద జన్మదినమైన (ఆంగ్ల తేదీ ప్రకారం) జనవరి 12వ తేదీని 'జాతీయ యువజన దినోత్సవం'గా 1985లో ప్రకటించింది. అప్పటి నుంచి ఏటా ఆ తేదీన యువజన దినోత్సవం జరుపుకొంటున్నాం.

ఏ దేశంలోనూ లేనంతటి యువశక్తి మన దేశంలో ఉంది కాబట్టే ఆ యువశక్తిని జాగృతం చేయడానికి స్వామి వివేకానంద భారతదేశంలో ఆవిర్భవించారు.

ఇప్పుడు తల్లితండ్రులూ, ఉపాధ్యాయులూ, విద్యావేత్తలూ, ఉన్నతాధికారులూ, నాయకులూ చేయాల్సింది ఏమిటంటే **'ఎటో వెళ్ళిపోతోంది యువత'** అని కలతచెందకుండా స్వామీజీ భావాల్ని భావిపౌరులకు అందేలా కృషిచేయాలి. అప్పుడు యువత మన దేశానికి సిసలైన వరంగా పరిణమిస్తుంది. ❖

పిల్లలకు ఉన్నత భావాలను బోధించండి. ఇప్పుడు మనం వారికి చేయాల్సిన సహాయం ఇదే! తరువాత వారి జీవితాలలో దాని ప్రభావం సహజంగానే ప్రతిఫలిస్తుంది. -స్వామి వివేకానంద

గోరుముద్ద - స్వామి సుప్రియానంద

సాగిపో... నేస్తమా!

స్వామి వివేకానంద 150వ జయంతి వేడుకలకు ముగింపు ఉందా? ముగింపు అంటూ ఉంటే అది ముందుకు సాగిపోవడానికి ఒక మహా ప్రేరణగా మనం గ్రహించాలి.

మాయాజాలంలో చిక్కుకున్న మనిషికి బయటపడడానికి 'వివేకానంద లింక్ - వివేకానంద భావజాలం' దొరికింది. దానిని కాపాడుకోవాలి, సద్వినియోగం చేసుకోవాలి. ఈ మహా ప్రేరణ మన నరనరాల్లో జీర్ణించుకోవాలి.

స్వామీజీ 1899 నవంబర్‌లో అమెరికాలోని 'రిడ్జ్‌లీ మేనర్' అనే ఇంట్లో ఉన్నప్పుడు ఆంగ్లంలో ఒక కవితను వ్రాశారు. ఆ కవితను మిస్ మెక్లౌడ్‌కు అందిస్తూ ఇది 'నా ఆత్మకు'(To my soul) అన్నారు.

ఇప్పుడు అదేమిటో చూద్దాం. అంతే కాదు. ఈ 'మహాత్మ్య'ను మన హృదయాల్లో పదిలపరచుకొని, అమరమైన దివ్యత్వాన్ని పొందుదాం.



నా ఆత్మకు

వర్తమానం చీకటిగా ఉన్నా
భవిష్యత్తు ఆశావిహీనంగా కన్పించినా
ధీర హృదయమా
ఈ జీవనభారాన్ని విడువకు
ఓపికతో ఒకింత నిరీక్షించు.

ఒకప్పుడు
పర్వతాల నెక్కుతూ దిగుతూ
మరొకప్పుడు
అరుదైన సముద్రాలను సులభంగా దాటుతూ
నువ్వూ నేనూ కలిసి
ఈ ప్రయాణం మొదలుపెట్టి
ఎన్నో యుగాలైంది అని అనిపిస్తుంది.

నా మనస్సులో ఆలోచనలు
మసలడానికి ఎంతో ముందే
నువ్వు నాకు
అత్యంత దగ్గరివాడివై
ప్రకటించుతావు.

ప్రతి ఆలోచనను ప్రతిబింబిస్తూ
నాతో పరిపూర్ణంగా ఐక్యమైన
నిజమైన అద్దానివి నువ్వే.

సాక్షీ!
ఇప్పుడు మనం ఇద్దరం విడిపోవడం
ఉచితమా! చెప్పు?
నిజమైన నేస్తానివి, నమ్మకస్తుడివి
నువ్వొక్కడివే.

నాలో
దురాలోచనలు చెలరేగుతున్నప్పుడు
అనలసుడవై హెచ్చరించావు
నీ హెచ్చరింపులను
నిర్లక్ష్యం చేసినా
నన్ను విడిచిపోని
శుభమైన నిజమైన
మిత్రుడవు నువ్వే!

- స్వామి వివేకానంద



సందడిగా సంక్రాంతి లక్ష్మి

– డాక్టర్ అపర్ణా శ్రీనివాస్

మన తెలుగువారి పండుగలన్నింటిలోనూ సంక్రాంతి పెద్ద పండుగ. ఇది మూడు రోజుల ముచ్చటైన పండుగ. మొదటి రోజు భోగి. ఆ రోజు వేకువనే లేచి అరిష్టశక్తుల నాశనార్థం భోగిమంటలు వేస్తారు. గోదాదేవి, శ్రీరంగనాథుని పరిణయ మాడిన రోజు కనుక ఆ రోజున ఆలయాల్లో గోదా కల్యాణం నిర్వహిస్తారు. శ్రీకృష్ణుని కోసం గోపికలు వ్రతం ఆచరించి పొందినట్లుగా, అయోనిజ అయిన గోదాదేవి తిరుప్పావై (మంచి వ్రతం)ని ఆచరించి, ఆ శ్రీరంగనాథుణ్ణే భర్తగా పొందింది.

భోగి అంటే భోగం. ఆ భోగం పరమాత్మానుభవమే! భోగి నాడు సాయంత్రం చిన్న పిల్లలకు దృష్టి దోషాలను పోగొడుతుందని రేగుపళ్ళతో దిష్టి తీసే ఆచారం చాలా ప్రాంతాలలో ఉంది.



ఇక రెండవ రోజు మకర సంక్రాంతి. సూర్యుడు నెలకొక రాశిలో ప్రవేశిస్తాడు, అలా పన్నెండు నెలలలో పన్నెండు రాశులలో చేరే ప్రతీ కాలమూ – సంక్రాంతే. అయితే మకర సంక్రాంతికి ప్రత్యేకత ఉంది. ఆ రోజు సూర్యుడు మకరరాశిలోకి ప్రవేశిస్తాడు. మిగతా సంక్రాంతులలో ప్రకృతి మార్పు అంత స్పష్టంగా గోచరించదు కానీ సూర్యుడు మకరరాశిలోకి ప్రవేశించినప్పుడు ఉత్తరాభిముఖుడవుతాడు, ప్రకృతిలో ఒక మార్పు కనిపిస్తుంది. దీర్ఘమైన రాత్రి సమయం తగ్గుతూ పోయి, భూమిని కాంతిమంతం చేసే పగటి సమయం పెరుగుతూ వస్తుంది. ఈ సంక్రాంతితో దక్షిణాయనం పూర్తయి ఉత్తరాయణం ఆరంభం అవుతుంది.

ఈ సందర్భంలో చేతనజగత్తుకి ప్రాణదాత అయిన ఆ సూర్యభగవానుని నిష్కామకర్మను ఒకసారి స్మరించుకుందాం. ఆయన విరామమెరుగడు. నిందాస్తుతులకు అతీతుడు. సర్వజీవులకూ సమాన హితాన్ని కలుగజేస్తాడు. కార్య సాధకునికి ఉండవలసిన లక్షణాలు ఇవే కదా! ఇది స్ఫూర్తిదాయకమైన సత్యం కదా!

ఇక సూర్యుడు ఉత్తరాభిముఖుడైనందున, ఈ రోజు నుండి ఆరునెలల కాలం వరకు ఉత్తరాయణమని పేరు వచ్చింది. ఈ ఉత్తరాయణ పుణ్యకాలం కోసమే కదా... కురుకుల పితామహుడైన భీష్ముడు అంపశయ్యపై వేచి ఉన్నది! ఆయన నిరీక్షణ వల్ల లోకానికి మహోపకారం జరిగి, విష్ణు సహస్రనామ స్తోత్రం లభ్యమైంది. మహాత్ముల ఆశయాల వెనుక లోకహితమే ఉంటుంది.

ఈ సంక్రాంతి సంబరాలు పల్లెలలో హృద్యంగా, కడు రమణీయంగా కనిపిస్తాయి. ప్రతీ ఇంటి గుమ్మంలో తీర్చిదిద్దిన రంగవల్లులు, వాటి మధ్య పసుపు కుంకుమలతో అలంకరించిన గొబ్బెమ్మలు కనువిందు చేస్తాయి. హరినామస్మరణ చేసే హరిదాసులు ఎర్రని పంచె కట్టుతో, మెడలో పూలదండతో, తలపై ఇత్తడి పాత్రను ఉంచుకుని, తంబూరా మీటుతూ, చిడతలు వాయిస్తూ, 'కృష్ణార్పణం' అంటూ ప్రతి ఇంటి దగ్గర ఆగుతూ, వారిచ్చే ధాన్యాన్ని స్వీకరిస్తూ ఉంటే అదో ఆత్మీయ అనుభూతి. ఇంకో పక్క రంగు రంగుల ఆకర్షణీయమైన వస్త్రాలు ధరించి, గంగిరెద్దును అలంకరించి, చేతితో డమరుకాన్ని మోగిస్తూ, గంగిరెద్దుల మువ్వల సవ్వడితో గొంతు కలిపి పాడే డూడూ బసవన్నల సందడి వర్ణనాతీతం. ఇది పంటలు ఇంటికి చేరుకునే కాలం. పంటచేలు పచ్చగా పండి, కుప్పనూర్పిళ్ళతో రైతుల లోగిళ్ళు ధాన్యపు రాశులతో కళకళలాడుతూ కనిపిస్తాయి. ఇంటి ముందుకు వచ్చిన యాచకులందరికీ సంతృప్తిగా ధాన్యాన్ని పంచిపెడుతూ, తనకు లభించినది నలుగురితో పంచుకోవాలనే పెద్దల ఔదార్యం ఈ పండుగ వెనుక కనిపిస్తుంది.

మూడవ రోజైన కనుమ పండుగ నాడు పశుసంపదను లక్ష్మీస్వరూపంగా భావించి అర్చిస్తారు. పాడిపంటలు, పశువులు మనలను పోషించేవి. వాటిలో దాగిన పోషకశక్తి భగవత్స్వరూపమే అని తెలియజేసే విధంగా వాటిని పూజించడం జరుగుతుంది. ఈ విధంగా సంక్రాంతి లక్ష్మి కళకళలాడుతూ అందరిళ్ళలోనూ కలిమిని నింపి, సందడి చేస్తుంది. ❖


(జనవరి 14వ తేదీ మంగళవారం 'సంక్రాంతి')

నేను ఇప్పుడు మీ దోషాలను సవరించాలని ప్రయత్నించడం లేదు. మన పూర్వులు నిర్దేశించిన నియమాలనూ, విలువలనూ ఆచరణాత్మకం చేయమని మాత్రమే విజ్ఞప్తి చేస్తున్నాను. -స్వామి వివేకానంద



భజ గోవిందమ్
భజ గోవిందమ్

**గురుచరణాంబుజ నిర్భరభక్తః
సంసారా దచిరాద్భవ ముక్తః।
సేంద్రియమానస నియమాదేవం
ద్రక్ష్యసి నిజహృదయస్థం దేవమ్ ॥**



ముక్తి ప్రాప్తించుగాక!

– స్వామి జ్ఞానదానంద

కాశీక్షేత్రంలో కాటికి కాలు చాచిన వయస్సులోనూ బతుకుతెరువు కోసం వ్యాకరణ పాఠాలు వల్లె వేస్తున్న ఓ సాంసారిక జీవిని చూసి జగద్గురువు శంకరభగవత్పాదులు ఆశ్చర్యావేదనలకు లోనయ్యారు. ఆశువుగా **'భజగోవిందం... భజగోవిందం'** అంటూ మేడిపండు లాంటి లోకం పొట్ట గుట్టువిప్పి చూపించారు. ముక్తాయింపుగా ముక్తిమార్గాన్నీ ప్రబోధించారు. ఆదర్శగురువై ఆదిశంకరాచార్యులు తనదైన రీతిలో ఈ శ్లోకపరంపరను కొనసాగించారు. తప్పటడుగులను వేస్తున్న తనయుడిని చూసి తండ్రి హెచ్చరించిన తీరులో, ఆశామోహాల్లో పడి అపసవ్య దిశలో ప్రయాణిస్తున్న మానవుడిని అప్రమత్తం చేశారు. 'మూర్ఖుడా!' అంటూ కడు కఠినంగా తమ సందేశానికి శ్రీకారం చుట్టి, తరువాత మనం ఎక్కడ నిరాశలో కూరుకు పోతామోనని 'ఓ తమ్ముడా!' అంటూ ఆత్మీయతతో ప్రియసోదరుడై అనునయించారు. అడ్డదారుల్లో వెళుతున్న అవివేకుల్ని అసలు దారిలోకి తెచ్చే ప్రయత్నం చేశారు. చివరకు సమర్థుడైన గురువులా 'నీకేం భయం లేదు; నీవూ తరించే మార్గముంది!' అంటూ అభయమిచ్చారు.

**గురుచరణాంబుజ నిర్భరభక్తః; సంసారా దచిరాద్భవ ముక్తః
సేంద్రియమానస నియమాదేవం; ద్రక్ష్యసి నిజహృదయస్థం దేవమ్**

'గురుచరణ కమలాలపై మిక్కిలి భక్తిగల ఓ సాధకుడా! ఈ సంసార బంధనాల నుంచి శీఘ్రంగానే ముక్తిని పొందుదువు గాక! నీ ఇంద్రియాలనూ, మనస్సునూ అదుపులో పెట్టినవాడవై నీ హృదయంలోనే ఉంటున్న భగవంతుడిని దర్శించెదవు గాక!' అంటూ ఆశీఃపూర్వకంగా స్వస్తివచనాలు పలికారు. శిష్య సమేతంగా గానం చేసిన 'ద్వాదశ మంజరికా స్తోత్రం', 'చతుర్దశ మంజరికా స్తోత్రం' సారాన్నంతా శంకరాచార్యులు ఈ 'భజగోవిందం' ముగింపు శ్లోకంగా చెప్పారు.

గురుభక్తే తరించే మార్గం: గురుచరణాలపై భక్తిప్రపత్తులతో మెలిగే సాధకుడు సులువుగా సంసార బంధాల నుంచి విముక్తిని పొందుతాడని జగద్గురువులు స్పష్టం చేస్తున్నారు. మన సనాతన ధర్మంలో గురువుకు అత్యున్నత స్థానం కల్పించారు. సాక్షాత్తూ భగవంతుడు కూడా శ్రీరామకృష్ణ పరమహంస, రమణమహర్షి తదితర అవతారాల్లో గురువై ఎందరో శిష్యప్రశిష్యులతో ధర్మసంస్థాపన గావించాడు. అందుకే విష్ణుసహస్రనామాల్లో భీష్మాచార్యులు భగవంతుడిని **'గురుర్గురుతమో ధామ, సత్యస్సత్య పరాక్రమః...'** అంటూ కీర్తించారు. గురువులలో కెల్లా పరమగురువు భగవంతుడని ప్రస్తుతించారు. అలాంటి గురువు పాదాలను నమ్ముకొని, శరణాగతితో ముందుకు వెళితే లౌకికబంధాలు వాటంతట అవే సడలిపోతాయి. ఒకసారి శ్రీరామకృష్ణ పరమహంసతో ఓ భక్తుడు 'గృహస్థులకు భగవద్దర్శనం కలుగుతుందంటారా?' అన్న సందేహాన్ని వ్యక్తం చేశాడు. అప్పుడు శ్రీరామకృష్ణులు "తప్పకుండా అందరికీ ముక్తి కలుగుతుంది. గురువు ఉపదేశం మేరకు నడుచుకోవాలి. పెడదోవ పడితే తిరిగి రావడం చాలా కష్టం. ముక్తి కలగడానికి సుదీర్ఘకాలం పడుతుంది. మనస్సులో భగవంతుణ్ణి నిలుపుకొని నిత్యకర్మలను చేస్తే సులభంగా ముక్తి లభిస్తుంది. ఒక వ్యక్తి గురువు రూపంలో వచ్చి ఆధ్యాత్మిక చైతన్యాన్ని జాగృతం చేస్తున్నాడంటే, ఆ సచ్చిదానందుడే ఈ రూపం ధరించాడని గ్రహించు. నిన్ను చేయి పుచ్చుకొని నడిపించే సహచరుని లాంటివాడు గురువు" అంటారు.

ఆత్మతత్త్వ ప్రబోధకుడే ఆచార్యుడు: సత్ ప్రవర్తన, స్వాధ్యాయం, భగవద్భక్తి, ధ్యానం తదితర సత్ క్రియలన్నీ భగవదనుభూతికి అవసరమైనవి. బోధగురువులందరూ వీటన్నింటిలో శిక్షణనిచ్చి లోకాన్ని చూపిస్తే, ఆచార్యుడైన గురువు మనకు పరమతత్త్వాన్నీ, ఆత్మతత్త్వాన్నీ అనుగ్రహిస్తాడు. అలాంటి గురువుల మార్గదర్శకత్వంలో జీవితాల్ని ఉద్ధరింప చేసుకోవాలి.

అయితే ఆధునిక కాలంలో అంత జిజ్ఞాస కలిగిన శిష్యులు, అంత ఆధ్యాత్మిక శక్తి సంపత్తులైన గురువులు లుప్తమవుతున్నారు. సంసార లంపటం నుంచి, మానసిక సమస్యల నుంచి ఉపశమనం పొందేందుకు ఎన్నో తాత్కాలిక పరిష్కారాలు వెతుక్కునేందుకే ఆధునికులు వెంపర్లాడుతున్నారు. వారి బలహీనతల్ని ఆసరాగా చేసుకొని చిలకపలుకుల్లా నాలుగు సాంత్వన వచనాల్ని పుక్కిటపట్టి కొందరు అవకాశవాదులు గురువులుగా ప్రచారం చేసుకుంటూ ఆకర్షిస్తున్నారు. నిజానికి ఇలాంటి కుహనా గురుశిష్యులకు జ్ఞానం వంటబట్టదు; వంట బట్టినా జీవితానికి ఉపయోగపడదు. అందుకే కఠోపనిషత్తు...

నా విరతో దుశ్చరితాన్నాశాంతో నా సమాహితః।
నా శాంత మానసోవాపి ప్రజ్ఞానేనైన మాప్నుయాత్ ॥

'చెడు ప్రవర్తన నుంచి బయటకు రాలేనివారూ, ఇంద్రియ లౌల్యాన్ని నిగ్రహించుకోలేని వారూ, ధ్యానపరులు కానివారూ, ప్రశాంతమైన మనస్సు లేనివారూ జ్ఞానం చేత కూడా ఆత్మను అర్థం చేసుకోలేర'ని తేల్చి చెప్పేసింది. ఇలా గురువులైనా, శిష్యులైనా మౌలికంగా కొన్ని అర్హతలను సముపార్జించాలి.

నిగ్రహంతోనే అనుగ్రహం: పారమార్థికంగా లబ్ధిని పొందాలంటే ఈ పాంచభౌతిక శరీరం నియమనిష్ఠలను, నిగ్రహాన్ని పాటించాలి. అరుణాచల ఆశ్రమంలో ఒకనాడు భగవాన్ రమణమహర్షిని ఓ భక్తుడు, 'మహాత్మా! పశువులాగా బతుకుతున్నానే! నేను ఎదిగేది ఎలా?' అని ప్రశ్నించాడు. అప్పుడు భగవాన్ రమణులు 'నాయనా! ఇంద్రియాల కన్నా, మనస్సు కన్నా బలమైన శక్తిని మేల్కొల్పడం వల్లనే ఇది జరుగుతుంది. నీలో ఉన్న ఆ శక్తిని మేల్కొలిపి, పెంపొందించు కోగలిగితే అన్నింటినీ జయించవచ్చు. ధ్యానధారను నిరంతరాయంగా కొనసాగించాలి. మితమైన ఆహారం తీసుకోవడం వల్ల, ఇతర నియమాలను పాటించడం వల్ల సమభావాన్ని నిలుపుకోవచ్చు. నీవు శరీరంతో తాదాత్మ్యం చెందినంత కాలం లైంగిక భావాలనూ, ఇతర ఆకర్షణలనూ తప్పించుకోలేవు' అంటారు.


శంకరాచార్యులు కూడా తమ ఈ 'భజ గోవిందం' చివరి శ్లోకంలో **'సేంద్రియమానస నియమాదేవం..'** అన్నారు. కానీ మనలో చాలామంది ఇలాంటి ప్రాథమికమైన సాధనలు ఏవీ చేయకుండానే ఏదో ప్రాప్తించాలనుకుంటున్నారు. అందువల్లే 'యోగ' పేరుతో ఎన్ని ఆసనాలు వేసి ఒళ్ళు వంచినా, 'ధ్యానం' పేరిట ఎన్ని తరగతులకు వెళ్ళి కళ్ళు మూసుకొని కూర్చున్నా, అటు నేర్పేవారికీ, ఇటు నేర్చుకునేవారికీ ప్రయోజనం కలగదు. ముందు నిత్యజీవితంలో కొన్ని అలవాట్లను నియంత్రించుకోవాలి; సరళమైన నడవడికను అలవరచుకోవాలి. బహిర్ముఖ సంకల్పాలను తగ్గించుకుంటూ ఉండాలి. మానసిక, శారీరక నియంత్రణ ఓ వైపు, ఆధ్యాత్మిక సాధనలు మరోవైపు సమాంతరంగా సాగిపోవాలి.

ఆయన అంతర్యామి: బాహ్య, అంతర సాధనలన్నీ పూర్తయ్యాక ఆ భగవంతుడు వేరెక్కడో లేడనీ, అంతర్యామిగా ఆయన మన హృదయంలోనే నెలకొన్నాడనీ అర్థమవుతుంది. అంతరాత్మగా ఆ సర్వేశ్వరుడు సతతమూ మనకు సన్మిత్రుడై దోవ చూపుతూనే ఉంటాడని స్ఫురిస్తుంది. అద్దం లాంటి కొలనులో అందమైన చందమామ ప్రతిబింబించినట్లు, అంతశ్శుద్ధి కలిగిన మనస్సులో మాధవుడు ప్రతిష్ఠితమవుతాడు. అదే భక్తిభావంతో శ్రీరామచంద్రమూర్తిని స్తుతిస్తూ **'అన్నీ నీవనుచు అంతరంగమున... తిన్నగ వెదకి తెలుసుకొంటి నయ్య, నిన్నె గాని మది నెన్నజాల నొరుల...'** అంటారు శ్రీత్యాగరాజస్వామి. అయితే ఇంతటి అత్యున్నత ఆధ్యాత్మికస్థితికి చేరుకోవాలంటే పరోక్షంగా భగవంతుడి కృప, ప్రత్యక్షంగా గురువరేణ్యుల కటాక్షం మనపై ఉండాలి. కానీ మనలో చాలా మంది ఆ భగవంతుడిని పుణ్యక్షేత్రాలకూ, దేవాలయాలకే పరిమితం చేస్తూ ఉంటారు. ఆయనను సర్వాంతర్యామిగా దర్శించుకోలేరు. అలా సర్వేశ్వరుడు సర్వాంతర్యామి అని అనుకోలేనంత కాలం ఆయనతో మనకు నిజమైన బాంధవ్యం ఏర్పడదు. మనకు ప్రియమైన వాళ్ళు ఎంత దూరంలో ఉన్నా, తలచుకొనగానే ఏదో తెలియని ఆనందం కలుగుతుంది. అలాగే ఆ దేవదేవుని దివ్యస్మృతే మన మనస్సును ఆనందసీమల్లో విహరింపజేయాలి. తిరుపతి కొండకు వెళ్ళకుండానే తిరుమలవాసుడిని గుండెలో దర్శించుకోగలగాలి; అదీ భగవద్భక్తి అంటే! అందుకే 'ఎవరైతే నేను షిరిడీలో మాత్రమే ఉన్నానని అనుకుంటారో, వారు నన్ను నిజంగా గ్రహించలేదని తెలుసుకో!' అంటారు షిరిడీ సాయిబాబా. ఇలాంటి పారమార్థిక పరమోన్నత స్థితికి చేరుకునే ప్రస్థానంలో జగద్గురువులు శంకరాచార్యుల సన్మార్గ ప్రబోధక దివిటీలను చేపట్టి ముందుకు సాగిపోతే ఈ సంసారకూపంలో కూరుకుపోకుండా, ఆ ఆపద్బాంధవుడే ఆదుకుంటాడు. ❖

('శ్రీరామకృష్ణ ప్రభ'లో 2011 ఆగస్టు నుంచి ధారావాహికంగా ప్రచురితమవుతున్న శ్రీఆదిశంకరాచార్యుల 'భజగోవిందం' శ్లోకాలపై విశ్లేషణాత్మక వ్యాఖ్యానం ఈ సంచికతో సమాప్తం).

ముక్తి మిచ్ఛసి చేత్తాత విషయాన్ విషవత్ త్యజ।
క్షమాఽఽర్జవం దయా శౌచం సత్యం పీయూషవత్ భజ॥

'ముక్తిని కోరుకుంటే విషయవాంఛలను విషంతో సమానంగా భావించి విడిచిపెట్టు. సహనశీలత, ధైర్యం, సరళత, వినమ్రత, విశ్వాసం, ఔదార్యం, దయ, పవిత్రత, సత్యాలను అమృతంలా స్వీకరించు' - చాణక్యుడు



మన మనస్సులో కోర్కెలు ఉన్నంతవరకూ మనం సత్యాన్ని గ్రహించలేం. సత్యాన్ని దర్శించాలను కునేవారు ఇహ, పర లోకాల్లో పొందే సుఖభోగాలను పూర్తిగా త్యజించాలి. -స్వామి వివేకానంద


ఆనందమే ఆధ్యాత్మికత



– స్వామి భాస్కరానంద

ముభావంగా, గంభీరంగా ఉండడమే ఆధ్యాత్మిక జీవితమని చాలామంది భ్రమపడుతూ ఉంటారు. కానీ ఉల్లాసంగా, ఆనందంగా ఉండడం, నలుగురికీ దాన్ని పంచడమే నిజమైన ఆధ్యాత్మిక జీవితమని రామకృష్ణ సంఘ సాధువులు ప్రగాఢంగా విశ్వసిస్తారు. స్వయంగా భగవాన్ శ్రీరామకృష్ణులు కూడా ఒకసారి జగన్మాతను 'అమ్మా! నన్ను శుష్కసాధువుగా మాత్రం చేయవద్దు. ఉల్లాసంగా, ఉత్సాహంగా ఉంటూ ఆనందాన్ని ఆస్వాదించే భక్తుడిగా ఉంచు తల్లీ!' అని ప్రార్థిస్తారు. వారు తమ దగ్గరకు వచ్చే భక్తబృందాన్నీ, అభిమానుల్నీ నిరంతరం నవ్విస్తూ, ఆనందంలో ముంచెత్తుతూ ఉండేవారు. అందుకే రామకృష్ణ సంఘంలో చాలామంది సన్న్యాస సోదరులు సున్నితమైన హాస్యోక్తులతో, నవ్వుతూ, నవ్విస్తూ కనిపిస్తూ ఉంటారు.

దీనికి సంబంధించి షిల్లాంగ్ రామకృష్ణ ఆశ్రమంలో ఒకసారి ఆసక్తికరమైన సంఘటన సంభవించింది. అక్కడి ఆశ్రమానికి ఆనుకునే ముఖర్జీ వంశీకుల కుటుంబం ఒకటి ఉండేది. ఆ కుటుంబసభ్యులు రోజూ ఇక్కడి సన్న్యాసుల దినచర్యను గమనిస్తూ ఉండేవారు. ఒకరోజు సాధు బృందమంతా రాత్రి భోజనం చేస్తున్న సందర్భంలో హఠాత్తుగా పక్కింట్లో నుంచి ఆ ఇంటి పెద్ద ముఖర్జీ ప్రత్యక్షమయ్యాడు. అప్పుడు షిల్లాంగ్ రామకృష్ణ ఆశ్రమానికి స్వామి సౌమ్యానంద అధ్యక్షులుగా వ్యవహరిస్తూ ఉన్నారు. ముఖర్జీ అకస్మాత్తుగా తాము భోజనం చేస్తున్న దగ్గరకు వచ్చేసరికి, స్వామి సౌమ్యానంద ఆశ్చర్యపోతూ "ఏం ముఖర్జీ! ఇలా వచ్చావు. ఏమైనా ముఖ్యమైన పనుందా?" అని అడిగారు.



అప్పుడు ముఖర్జీ "క్షమించండి స్వామీజీ! ఇలా రావడం పొరపాటే! కానీ మా ఆవిడతో చిన్న వివాదం తలెత్తింది. దాన్ని పరిష్కరించుకునేందుకే ఇక్కడకు ఈ వేళలో రావాల్సి వచ్చింది" అన్నాడు.

"ఏమిటది?" అని స్వామీజీ ప్రశ్నించారు.

"మీ భోజనాల గదికి కొన్ని అడుగుల దూరంలోనే మా ఇల్లని మీకు తెలుసు కదా! మీరు మధ్యాహ్నం, రాత్రి సమయాల్లో భోజనం చేసేటప్పుడు ఎంతో సరదాగా, నవ్వుకుంటూ మాట్లాడుకుంటూ ఉంటారు. అది విని మా ఆవిడ 'స్వామీజీలు మంచి, మంచి వంటకాలతో భోజనం చేస్తూ ఉంటారేమో! అందుకే ఎప్పుడూ అంత ఉల్లాసంగా ఉంటారు' అని అంటుంది. కానీ నేను ఆమెతో, 'లేదు! ఆశ్రమం ఆర్థికంగా అంత మంచి స్థితిలో ఏమీ లేదు. అన్ని రకాల వంటలు చేసుకునే అవకాశమే లేదు. అలాంటప్పుడు పాపం, స్వామీజీలు రుచికరమైన పదార్థాలు ఎలా తినగలుగుతారు? వాళ్ళు సహజంగానే సంతోషంగా ఉంటారు' అని అంటూ ఉంటాను. మా ఆవిడ నా మాటలను అంగీకరించడం లేదు. అందుకే నేను స్వయంగా చూసి అసలు విషయం తెలుసుకుందామని వచ్చాను" అన్నాడు ముఖర్జీ.

అప్పుడు స్వామి సౌమ్యానంద నవ్వుతూ, "ముఖర్జీ! దయచేసి మీరూ కూర్చోండి. ఈ రోజుకు మాతో కలసి భోజనం చేయండి. అప్పుడు మీకూ ప్రత్యక్షంగా విషయమేంటో అర్థమవుతుంది" అన్నారు. కానీ ముఖర్జీ సున్నితంగా తిరస్కరిస్తూ, కేవలం భోజనం చేస్తున్న సాధువులను గమనిస్తూ కూర్చున్నాడు. అతి సాధారణమైన అన్నం, పప్పు, కూరే భోజనాల్లో ఉండడం చూసి ముఖర్జీ ఆశ్చర్యపోయాడు. ఆ రోజు నుంచి ముఖర్జీ కుటుంబసభ్యుల అపోహలన్నీ తొలగిపోయి, ఆశ్రమ సాధువులకు మరింత దగ్గరయ్యారు. విశేష పర్వదినాల్లో ముఖర్జీ సతీమణి స్వయంగా మిఠాయిలు, ఇతర ప్రత్యేక వంటకాలు తయారుచేసి ఆశ్రమానికి పంపిస్తూ ఉండేది.

ఇలా ఆనందానికీ, ఆధ్యాత్మికతకూ అవినాభావ సంబంధం ఉందనడానికి సంఘ వరిష్ఠ సాధువులెందరో నిదర్శనం. భగవాన్ శ్రీరామకృష్ణుల ప్రత్యక్షశిష్యులుగా స్వామి వివేకానంద నుంచి స్వామి శివానంద మహరాజ్ వరకు ఎందరో తమ జీవితకాలంలో ఎలాంటి అరమరికలూ లేకుండా ఎప్పుడూ ఒకరితో మరొకరు ఉల్లాసంగా గడుపుతూ, గృహస్థ భక్తులకే కాకుండా, మాలాంటి సన్న్యాస సోదరులకు కూడా ఆదర్శంగా నిలిచారు. ❖



వివేకానంద సూక్తి సుధ

దేశస్యాస్య వినాశోఽభూ చ్ఛ్రద్ధాలోపవశాత్కిల ।
అపేక్షితా భవన్త్యద్య దేశేఽస్మిన్ ధీరమానవాః ॥

శ్రద్ధ లోపించడం వల్లనే ఈ దేశానికి వినాశం కలిగింది. ఈ దేశానికి ఇప్పుడు ధీరులైన మానవులు అవసరమై ఉన్నారు.

కఠోరబ్రహ్మచర్యస్య పాలనేనైవ బాలకాః ।
శ్రద్ధావిశ్వాససంపూర్ణా భవన్తీతి న విస్మరేత్ ॥

కఠోరమైన బ్రహ్మచర్యాన్ని పాలించినప్పుడే బాలకులు శ్రద్ధావంతులు, విశ్వాసవంతులు అవుతారన్నమాట విస్మరించరాదు.

న కదాఽపి చ వేదాంతో పాపమంగీకరోత్యథ ।
నీచస్త్వం దుర్బలః పాపీ శక్తిహీన ఇతీదృశమ్ ॥
కథనం శ్రుతిదృష్ట్యా స్యాదపరాధో మహాన్ కిల ।

వేదాంతం ఎన్నటికీ పాపాన్ని అంగీకరించదు. 'నీవు నీచుడవు, దుర్బలుడవు, పాపివి, శక్తి హీనుడవు' అనే ఇలాంటి మాటలు వేద దృష్టిలో గొప్ప తప్పిదమవుతుంది గదా!

పరోపకృతి రల్పాఽపి శక్తి మంతర్గతాం తవ ।
వృద్ధిం నయతి సచ్చిన్తా దత్తే సింహోపమం బలమ్ ॥

నీవు చేసే పరోపకారం స్వల్పమే అయినా అది నీలోని శక్తిని పెంపొందిస్తుంది. సద్విషయకమైన ఆలోచన సింహసదృశమైన బలాన్ని సమకూరుస్తుంది.

దరిద్రాణాం కృతే యస్య హృదయం పరితప్యతే ।
స మహాత్మేత్యహం వచ్మి తద్విరుద్ధో దురాత్మకః ॥

ఎవని హృదయం పేదల కొరకై పరితపిస్తుందో అతడినే నేను మహాత్ముడంటాను. అందుకు విరుద్ధంగా ప్రవర్తించేవాడు దురాత్ముడు.

సంఖ్యాబలం చ సంపచ్చ విద్యా వక్తృత్వమేవ చ ।
ప్రభావితం న కుర్వన్తి సమాజం కిన్తు పశ్యత ॥
పవిత్రతా సదాచారః స్వానుభూతి స్తథైవ చ ।
దర్శయన్తి ప్రభావం స్వం సంఘే సర్వత్ర నిస్తులమ్ ॥

సంఖ్యాబలం, సంపద, విద్యాబలం, వక్తృత్వం ఇవేవీ సమాజాన్ని ప్రభావితం చేయలేవు. కానీ గమనించండి! పవిత్రత, సదాచారం, స్వానుభవం – అనేవి సంఘంలో అంతటా తమ ప్రభావాన్ని చూపుతాయి.

పంచాశదధికశతతమ వర్షజయంత్యుత్సవే యతీంద్రస్య ।
సంస్కృతవాచా గ్రథనం సూక్తీనాం బుధముదావహం భవతు॥

శ్రీవివేకానంద యతీంద్రుని 150వ జయంత్యుత్సవంలో సంస్కృతవాక్కులలో వారి సూక్తుల కూర్పు బుధులకు ముదం కలిగించుగాక! **రచన: డాక్టర్ సముద్రాల లక్ష్మణయ్య**

('వివేకానంద సూక్తి సుధ' సమాప్తం)

స్వామి వివేకానంద క్విజ్

1. మతానికి స్వామీజీ ఇచ్చిన ముఖ్యమైన నిర్వచనం ఏమిటి?
2. భారతదేశ పురోగతి గురించి ప్రముఖ దేశభక్తుడు కేల్కర్‌తో స్వామీజీ ఏం చెప్పారు?
3. స్వామీజీ సోదరుడు భూపేంద్రనాథ్ స్వామీజీపై రచించిన పుస్తకం ఏమిటి?
4. స్వామి ప్రేమానంద 'వేదాధ్యయనం వల్ల ప్రయోజనం ఏమిటి' అని అడిగినప్పుడు స్వామీజీ ఏమని సమాధానమిచ్చారు?
5. స్వామీజీ గంగాతీరంలో ఒక స్థలాన్ని చూపించి 'నేను ఈ దేహాన్ని త్యజించాక దానిని ఇక్కడ దహనం చేయండి' అని ఎవరితో అన్నారు?
6. స్వామీజీ అమర్‌నాథ్ శివుణ్ణి దర్శించినప్పుడు ఏమి కోరుకున్నారు?
7. స్వామీజీ మహాసమాధి చెందేరోజు హీనస్వరంలో ఏమి అన్నారు?
8. స్వామీజీ ఎప్పుడు మహాసమాధి చెందారు?
9. స్వామీజీ మహాసమాధి చెందేనాటికి ఆయన వయస్సు ఎంత?
10. స్వామీజీ ఎత్తు ఎంత?
11. స్వామీజీ ఛాయాచిత్రాలు ఎన్ని లభించాయి?
12. స్వామీజీ శరీరనిర్మాణం గురించి శరీర ధర్మ శాస్త్రజ్ఞులు ఏమి చెప్పారు?
13. స్వామీజీ కంఠం గురించి సుప్రసిద్ధగాయని మేడమ్ ఎమ్మా కాల్వే ఏమని వర్ణించారు?
14. స్వామీజీ ప్రసంగం గురించి సోదరి క్రిస్టిన్ ఏమి చెప్పారు?
15. స్వామీజీ గురించి మాతృమూర్తి శ్రీశారదాదేవి ఏమని చెప్పారు?

(జవాబుల కోసం 12వ పేజీ చూడండి)

నిస్వార్థత ఎంతో ప్రయోజనకరం. కానీ దానిని అలవరచుకునే ఓర్పు మనకు లేదు. ప్రేమ, సత్యం, నిస్వార్థత మనకు మహోన్నత ఆదర్శాలేగానీ, నైతిక భాషాలంకారాలు కావు. - స్వామి వివేకానంద

స్వామి వివేకానంద క్విజ్ - జవాబులు

(1) మనిషిలో నిక్షిప్తమైవున్న దివ్యత్వాన్ని అభివ్యక్తపరచడమే మతం.

(2) 'భారతదేశం పురోగతి చెందాలంటే దాని అభివృద్ధి మన ప్రాచీన సంప్రదాయాలను పాటించి, అంతరంగం నుండి వచ్చే సహజమైన ప్రగతి పథంలో ఉండాలి'.

(3) స్వామి వివేకానంద - ది పేట్రియాట్ సెయింట్ ఆఫ్ ఇండియా.

(4) మూఢనమ్మకాలు నిర్మూలనమవుతాయి.

(5) తమ సోదర సన్న్యాసి స్వామి ప్రేమానందతో.

(6) ఇచ్ఛామరణం.

(7) ఈ వివేకానంద ఏం చేశాడో ఎవరికి అర్థమవుతుంది? బహుశా మరో వివేకానంద ఉండివుంటే అర్థం చేసుకోగలడు. అయితే ఏం? కాలక్రమంలో ఇంకా ఎందరో వివేకానందలు ఉద్భవించనున్నారు.

(8) 1902 జూలై 4వ తేదీ శుక్రవారం, రాత్రి దాదాపు 9 గంటలకు.

(9) 39 సంవత్సరాల 5 నెలల 24 రోజులు.

(10) 5 అడుగుల $8^{1/2}$ అంగుళాలు

(11) దాదాపు 94

(12) 'నిగూఢ రహస్యాలను సైతం తెగింపుతో తెలుసుకోగల మహోన్నత వ్యక్తి'.

(13) 'స్వామీజీ కంఠస్వరం ఆనందభరితంగా ఉండేది. అది పురుషోచిత కంఠస్వరం. తారాస్థాయి కంఠస్వరానికి మామూలు కంఠ స్వరానికి మధ్యమస్వరంగా (baritone) చైనా జేగంట కంపనతో కూడినదై ఉండేది'.

(14) 'స్వామీజీ ప్రసంగించే ముందు తమ ఆధ్యాత్మిక శక్తితో శ్రోతల అవగాహన స్థాయిని పెంచేవారు. అందువల్ల స్వామీజీ భావనలు శ్రోతలకు సులభంగా అర్థమయ్యేవి'.

(15) 'నరేన్ (స్వామి వివేకానంద) చేసిన కార్యం, కాలాల పర్యంతం నిలిచి ఉంటుంది. అతడు ఈ మహత్కార్యార్థమే జన్మించాడు. లోకానికి వెలుగు అందించే ఆచార్యునిగా, జగద్గురువుగా అతణ్ణి వేలాది మంది ప్రశంసిస్తారు'.

('వివేకానంద క్విజ్' సమాప్తం. సంకలనం: బ్రహ్మచారి జయకృష్ణ)



అన్నమయ్య పదామృతం

కామధేనువిదే...కల్పవృక్షమిదే
ప్రామాణ్యము గల ప్రపన్నులకు
హరినామ జపమే ఆభరణంబులు
పరమాత్ముని నుతి పరిమళము
ధరణీధరు పాదసేవే భోగము
పరమం బెరగిన ప్రపన్నులకు
దేవుని ధ్యానము దివ్యాన్నంబులు
శ్రీవిభు భక్తే జీవనము
ఆ విష్ణు కైంకర్యమే సంసారము
పావనులగు యీ ప్రపన్నులకు
యేపున శ్రీవేంకటేశుడే సర్వము
దాపై యితని వందనమే విధి
కాపుగ శరణాగతులే చుట్టాలు
పైపయి గెలిచిన ప్రపన్నులకు

కామధేనువిదే... కల్పవృక్షమిదే

– శ్రీమతి బి.కృష్ణకుమారి

భక్తుడి జీవననందనవనంలో పుష్కలంగా ఫల పుష్పాదులు ప్రసాదించే కల్పతరువు... శాంత్యానందాల క్షీరధారలు కురిపించే కామధేనువు ఆ భగవంతుడు ఒక్కడే! అహంకారాన్ని వీడి, అన్నీ నీవేనంటూ ఆశ్రయించిన వారి బతుకు భారాన్నంతా ఆయనే భరిస్తాడు. అయితే అడిగినవన్నీ కాకుండా అవసరమైనవే ఇచ్చే విజ్ఞత కలిగిన విశ్వంభరుడు ఆయన! అందుకే బిడ్డ ఎంత మారాం చేసినా, ప్రమాదకరమైన ఆటబొమ్మలేవీ ఇవ్వకుండా, ఆడుకోగలిగే బొమ్మలే ఇచ్చే కన్నతండ్రిలా ఆ కరుణాంతరంగుడు ఎవరికి ఏది అమరుతుందో దానినే అనుగ్రహిస్తాడు. కోర్కెలు తీర్చే ఆశ్రితపక్షపాతే కాదు; కంటికి రెప్పలా కాపాడుకునే ప్రేమమూర్తి కూడా! అలాంటి ఆ ఆనందప్రదాతను ఈ పదకవితా పితామహుడు సురలోకపు సురభిగా, సుఖశాంతులనిచ్చే దేవతరువుగా పోలుస్తున్నాడు. అలాంటి పరమాత్ముడే పరమావధిగా బతుకును దిద్దుకుంటే తాపత్రయాలకు తావే ఉండదు. అందుకే భగవాన్ శ్రీరామకృష్ణులు "భగవంతుని శరణు జొచ్చినవారు భరింపరాని దుఃఖంలో పూర్తిగా మునిగిపోరు. కొన్ని ఎదురుదెబ్బలు తగిలినా తిరిగి నిలకడస్థితిని పొందుతారు. ఆయనను విశ్వసించకుండా అహంకారులై విర్రవీగేవారు, అల్పశక్తితో చిన్న తెప్పల్లా అదుపుతప్పి తలకిందులై పూర్తిగా మునిగిపోతారు" అంటారు.

కామధేనువు... కల్పతరువు

అలనాడు క్షీరసాగర మథనంలో పుట్టినవే – కామధేనువు, కల్పవృక్షం. పాలసంద్రంలో అవి ఆవిర్భవించేందుకు దేవతలు, రాక్షసులు ఎన్నో కష్టనష్టాలను ఓర్చుకోవలసి వచ్చింది. కానీ కలియుగంలో కేవలం భగవన్నామాన్ని భక్తితో, ప్రేమతో స్మరించి, జపిస్తే చాలు! ఆయన కామధేనువై, కల్పతరువై సాక్షాత్కరిస్తాడు. ఆ భావనతోనే అన్నమయ్య... **కామధేనువిదే...కల్పవృక్షమిదే, ప్రామాణ్యము గల ప్రపన్నులకు** అంటున్నాడు. సర్వేశ్వరుడిని తన సొంత మనిషిగా చేసుకునే శరణాగతుడికి శాస్త్రప్రమాణాలన్నీ పరమాత్ముడేనని ప్రబోధిస్తున్నాడు. 'ప్రపన్నుడు' అంటే శరణాగతుడని అర్థం. అలా తమకు దిక్కైనవాడు ఆ దేవదేవుడేనని గుర్తించినవారిని ఎన్నటికీ వదిలేది లేదని ఎన్నో రూపాల్లో ఆయన నిరూపించాడు. భక్తుల నమ్మకాన్ని నిజం చేశాడు. ఆ పరంపరలో శ్రీరామచంద్రుడు...

సకృదేవ ప్రసన్నాయ, తవాస్మీతి చ యాచతే।
అభయం సర్వభూతేభ్యో, దదామ్యేతద్వ్రతం మమ॥

"ఎవరైనా తనకు శరణాగతి గావించి, 'నేను నీ వాడను' అని ప్రార్థిస్తే, అతనికి సర్వభూతాల నుంచి అభయాన్ని కలుగజేస్తా"నని అధ్యాత్మ రామాయణం ఉద్ఘాటించింది.

పరమాత్ముడి నుతి పరిమళం!

మన జీవితానికి విలువనూ, వైభవాన్నీ ఇచ్చేది ఏదో తెలియక వ్యర్థమైనవాటి కోసం వెంపర్లాడుతూ ఉంటాం. ప్రాపంచికులు రమ్యమైనవని అనుకుంటున్నవన్నీ రసహీనమైనవని ఎప్పటికో తెలుస్తుంది.

(మిగతా 32వ పేజీలో...)

పారమార్థికతకూ, సంఘనీతికీ, సాధుత్వానికీ, ప్రియవర్తనకూ భారతదేశమే మాతృభూమి. ఈ విషయంలో ఎప్పటికీ మనదే ప్రథమ స్థానమని సాహసంతో చెబుతున్నాను. - స్వామి వివేకానంద



పరిప్రశ్న

- స్వామి భూతేశానంద

(రామకృష్ణ సంఘ 12వ సర్వాధ్యక్షులు)

రామకృష్ణ సంఘ 12వ సర్వాధ్యక్షులు - స్వామి భూతేశానందజీ మహరాజ్ (1901-1998) భక్తుల ఆధ్యాత్మిక సందేహాలకు సరళమైన రీతిలో ఇచ్చిన సమాధానాలను 'శ్రీరామకృష్ణ ప్రభ' పాఠకుల ప్రయోజనార్థం 2013 జులై సంచిక నుండి ధారావాహికంగా ప్రచురిస్తున్నాం.

భక్తుడు: భగవత్సాక్షాత్కారం అంటే ఏమిటి?

స్వామీజీ: భగవత్సాక్షాత్కారం అంటే - భగవంతుని నిజతత్త్వాన్ని తెలుసుకోవడం, ఆయనతో సన్నిహిత సంబంధాన్ని కలిగివుండడం, ఆయన తత్త్వాన్ని అలవరచుకొని చివరగా ఆయనతో మమేకమవడం.

భక్తుడు: భగవంతుడి దర్శనం ఎలా లభిస్తుంది?

స్వామీజీ: భగవంతుణ్ణి దర్శించాలని అందరికీ ఉంటుంది. కానీ ఆయన్ని ఎక్కడ చూడగలం? భగవంతుడు సర్వాంతర్యామి అని అంటాం. అయినప్పటికీ ఆయన్ని ఎక్కడ దర్శించగలం అని అడుగుతూ ఉంటాం.

'మనం కళ్ళు మూసుకున్నప్పుడు భగవంతుడు కనిపించి, కళ్ళు తెరచినప్పుడు ఆయన మాయమైపోతాడా?' అని శ్రీరామకృష్ణులు చమత్కరించేవారు. నిజానికి భగవంతుణ్ణి దర్శించాలంటే ప్రప్రథమంగా కావలసింది పరిశుద్ధమైన మనస్సు. మన మనస్సు పరిశుద్ధమైతే సర్వాంతర్యామి అయిన భగవంతుణ్ణి ఎప్పుడైనా, ఎక్కడైనా దర్శించవచ్చు. అందువల్ల 'మనస్సనే పరికరాన్ని పరిశుభ్రం చేసుకోవాలి' అని అంటారు శ్రీరామకృష్ణులు. మనం చేయాల్సిన సాధనంతా మలినపడిన మనస్సును పరిశుద్ధం చేయడానికే అన్న విషయాన్ని మరువకూడదు.



భక్తుడు: జపం చేయడం వల్ల సిద్ధులు లభిస్తాయా?

స్వామీజీ: భగవంతుణ్ణి సాక్షాత్కరించుకోవడమే సిద్ధికి నిజమైన నిర్వచనం. అందుకు జపం ముఖ్యమైన సాధనం. ఆధ్యాత్మిక జీవితంలో అభివృద్ధి సాధిస్తున్న కొద్దీ ప్రపంచం పట్ల మనకున్న అవగాహన మారుతుంది. మనలో చోటుచేసుకున్న సందేహాలూ, దురభిప్రాయాలూ తొలగిపోతాయి. మన ఆలోచనల్లో సానుకూల దృక్పథం ఏర్పడుతుంది.

నిజమైన భగవద్భక్తుడు ప్రాపంచిక సంపదల కోసం జప సాధనలు చేయడు. ఎలాంటి కష్టాలు ఎదురైనప్పటికీ చలించడు. ఈ జీవితంలో మనం అనుభవించే కష్టసుఖాలు స్థిరం కాదనే నిశ్చితాభిప్రాయం కలిగి ఉంటాడు. అలాంటి సాధకుడు ప్రాపంచికమైన కోరికలను తీర్చే సిద్ధులను కోరడు. 'నాకు కావలసింది కేవలం ఆ భగవంతుడు మాత్రమే!' అన్న సంపూర్ణ విశ్వాసంతో సాధనలు చేస్తాడు. భగవంతుణ్ణి సిద్ధింపజేసుకోవడమే తన లక్ష్యంగా భావిస్తాడు.

భక్తుడు: గృహస్థ జీవితం గడుపుతూ భగవంతుణ్ణి ప్రార్థించడమెలా?

స్వామీజీ: 'ఒక చేత్తో భగవంతుని పాదపద్మాలను పట్టుకొని, రెండో చేత్తో సంసార విధులను నిర్వర్తించండి. తీరిక సమయంలో భగవంతుని పాదపద్మాలను రెండు చేతులతో పట్టుకోండి' అని శ్రీరామకృష్ణులు బోధించారు. ఈ ప్రపంచంలో జీవిస్తూ భగవంతుణ్ణి ఎలా సాక్షాత్కరించుకోవాలో 'శ్రీరామకృష్ణ కథామృతం'లో సోదాహరణంగా వివరించారు. కాబట్టి శ్రీరామకృష్ణుల బోధలు క్షుణ్ణంగా చదివి అర్థం చేసుకున్నట్లయితే మనలో కలిగే సందేహాలన్నీ తప్పక నివృత్తి అవుతాయి. గృహస్థ జీవితం గడుపుతూ కూడా భగవంతుణ్ణి సాక్షాత్కరించుకోవచ్చునే విశ్వాసం పెరుగుతుంది. ❖

పండుగలు-పర్వదినాలు

జనవరి - 2014

01	బుధవారం	: కల్పతరు దినోత్సవం
06	సోమవారం	: స్వామి శారదానంద జయంతి
11	శనివారం	: వైకుంఠ ఏకాదశి
12	ఆదివారం	: జాతీయ యువజన దినోత్సవం
14	మంగళవారం	: సంక్రాంతి, స్వామి తురీయానంద జయంతి
23	గురువారం	: స్వామి వివేకానంద జయంతి (తిథి ప్రకారం)
27	సోమవారం	: ఏకాదశి

ఫిబ్రవరి - 2014

01	శనివారం	: స్వామి బ్రహ్మానంద జయంతి
03	సోమవారం	: స్వామి త్రిగుణాతీతానంద జయంతి
04	మంగళవారం	: సరస్వతీ పూజ
10	సోమవారం	: ఏకాదశి
14	శుక్రవారం	: స్వామి అద్భుతానంద జయంతి
25	మంగళవారం	: ఏకాదశి
27	గురువారం	: మహాశివరాత్రి

ఎవరికి నమస్కరించాలి?

ఆశీస్సులు కీలకం: పెద్దవారి దీవెనలు శ్రేయస్కరం కాబట్టి, వాళ్ళ ముందు సాష్టాంగపడి, ఆశీస్సులను అర్థించాలి. అలా పెద్దల ముందు ఎవరైనా నమస్కరించినప్పుడు ఆ నమస్కారం స్వీకరించే వ్యక్తి తన శుభాశీస్సులను అందజేయాలి. చిరకాలం జీవించమంటూ, 'చిరంజీవీ భవ' అని ఆశీర్వదించాలి.

నమస్కారం - ఎవరికి? ఎందుకు?: నిద్ర నుంచి లేవగానే - తల్లికీ, తండ్రికీ, ఆచార్యునికీ, అటు తరువాత పెద్దలకూ నమస్కరించాలి. అలాగే, విద్యలో, వయస్సులో, గొప్పతనంలో తన కన్నా మిన్న అయినవాళ్ళను చూడగానే నమస్కరించాలని శాస్త్రం చెబుతోంది. అధికారులకూ, దుఃఖితులకూ, విద్యాధికులకూ, గర్భవతులకూ, బరువు మోసేవాళ్ళకూ, చిన్నపిల్లలకూ, వికలాంగులకూ పక్కకు తప్పుకొని దారి ఇవ్వాలని పేర్కొంటోంది. అదే విధంగా జ్ఞాని, గోవు, వృద్ధుడు - వీరిలో ఎవరైనా ఎదురుగా వస్తే పక్కకు తొలగి, దారి ఇవ్వాలి.



అసలు నమస్కారం ఎందుకు చేయాలనే దానికి కూడా శాస్త్రాలు వివరణనిచ్చాయి. తమ కన్నా పెద్దవారు ఎదుటకు వచ్చినప్పుడు చిన్నవారి ప్రాణాలు పైకి లేచిపోతాయట! అప్పుడు చిన్నవారు గనక లేచి నమస్కరిస్తే, తిరిగి వస్తాయని శాస్త్ర వచనం. కాబట్టి, పెద్దలకు నమస్కరించాలి. వారికి ఆసనం ఇవ్వాలి. సేవించాలి.

అయితే, ఆలయంలో దేవుడి సన్నిధానంలో ప్రభువులు, పీఠాధిపతుల ఎదుట వ్యక్తులకు నమస్కరించడం నిషిద్ధం.

ఏడు దిక్ నమస్కారాలు: ఇవన్నీ ఇలా ఉండగా, ఎదురుగా ఉన్న పెద్దలకూ, దైవానికే కాక, దిక్కులకు నమస్కరించడమనే మహత్తరమైన విశేషం భారతీయ సంస్కృతీ సంప్రదాయాల్లో ఉంది. సంధ్యోపాసన చేస్తున్నప్పుడు ఈ దిక్కులకు నమస్కారం చేయడమనే విధి కనిపిస్తుంది. దీన్ని సాధారణంగా 'సప్త దిఙ్నమస్కారాలు' (దిక్ + నమస్కారం = దిఙ్నమస్కారం) అంటారు. ఏ మంత్రంతో ఏ దిక్కును నమస్కరిస్తారన్నది 'తైత్తరీయ సంధ్యోపాసనం'లో ఇలా పేర్కొన్నారు:

తూర్పు దిక్కుకు...

ఓం నమః ప్రాచ్యై దిశేయాశ్చ దేవతా ఏ తస్యాం ప్రతి వసన్త్యే తాభ్యశ్చ నమః ।

'తూర్పు దిక్కునకు నమస్కారం. ఈ తూర్పు దిక్కులో నివసించే దేవత అయిన ఇంద్రుడు మొదలైనవారికి నమస్కారం.'

దక్షిణ దిక్కుకు...

నమో దక్షిణాయై దిశేయాశ్చ దేవతా ఏ తస్యాం ప్రతి వసన్త్యే తాభ్యశ్చ నమః ।

'దక్షిణ దిక్కునకు నమస్కారం. ఈ దక్షిణ దిక్కులో నివసించే దేవత అయిన యమధర్మరాజు మొదలైనవారికి నమస్కారం.'

పశ్చిమ దిక్కుకు...

నమః ప్రతీచ్యై దిశేయాశ్చ దేవతా ఏ తస్యాం ప్రతి వసన్త్యే తాభ్యశ్చ నమః ।

'పడమర దిక్కునకు నమస్కారం. ఈ పశ్చిమ దిశలో నివసించే దేవత అయిన వరుణ దేవుడు మొదలైనవారికి నమస్కారం.'

ఉత్తర దిక్కుకు...

నమ ఉదీచ్యై దిశేయాశ్చ దేవతా ఏ తస్యాం ప్రతి వసన్త్యే తాభ్యశ్చ నమః ।

'ఉత్తర దిక్కుకు నమస్కారం. ఈ ఉత్తర దిశలో నివసించే దేవత అయిన కుబేరుడు మొదలైన వారికి నమస్కారం.'

ఊర్ధ్వ దిక్కుకు...

నమ ఊర్ధ్వాయై దిశేయాశ్చ దేవతా ఏ తస్యాం ప్రతి వసన్త్యే తాభ్యశ్చ నమః ।

'ఊర్ధ్వ దిక్కుకు ఊర్ధ్వంగా ఉన్న స్వర్లోక భాగానికి నమస్కారం. ఊర్ధ్వ దిక్కులో నివసించే దేవతలకూ నమస్కారం.'

క్రింది దిక్కుకు...

నమో ధరాయై దిశేయాశ్చ దేవతా ఏ తస్యాం ప్రతి వసన్త్యే తాభ్యశ్చ నమః ।

'క్రింది దిక్కుకు నమస్కారం. క్రింది దిక్కులో నివసించే దేవతలకూ నమస్కారం.'

అవాంతర దిక్కులకు...

నమోఽవాన్తరాయై దిశేయాశ్చ దేవతా ఏ తస్యాం ప్రతి వసన్త్యే తాభ్యశ్చ నమః ।

'భూమ్యాకాశాల నడుమన ఉన్న దిక్కయిన అంతరిక్షానికీ, తూర్పు మొదలైన దిక్కుల మధ్యలో ఉండే ఆగ్నేయ, నైరుతి, వాయవ్య, ఈశాన్యాలనే అవాంతర దిశాధిపతులకూ, వారి అనుచరులకూ నమస్కారం. అంతరిక్షంలో వసించే పితృదేవతలకు నమస్కారం.'

మామూలుగా ఈ 'సప్త దిక్ నమస్కారాల'ను ప్రాతః, సాయం సంధ్యల్లో మాత్రమే చెప్పాలి. మధ్యాహ్న వేళ చేసే సంధ్యలో దిఙ్నమస్కారం లేదు. ❖

(మరిన్ని విశేషాలు... వచ్చే సంచికలో)

హిందువు భోజనం చేసినా, నడచినా, నిద్రించినా ఇలా ఏ పని చేసినా అందులో భగవద్భక్తి ఇమిడి ఉంటుంది. దీనివల్ల భారతజాతికి ప్రాణం ఆధ్యాత్మికతయే అని తేటతెల్లమవుతుంది. -స్వామి వివేకానంద



నాటికీ నేటికీ

'మన భారతదేశ యువతరానికి స్వామి వివేకానందుల రచనలు, ఉపన్యాసాలు అత్యంత స్ఫూర్తినీ, ప్రేరణనూ ఇచ్చి వారిలో దేశభక్తినీ, ఆత్మశక్తినీ జాగృతం చేసి ముందుకు నడిపిస్తాయని భావించి స్వామీజీ జన్మదినమైన – జనవరి 12ను 'జాతీయ యువజన దినోత్సవం'గా ప్రకటిస్తున్నాం' అని 1985వ సంవత్సరంలో ఆనాటి ప్రధానమంత్రి రాజీవ్‌గాంధీ వివరించారు. కానీ చాలా మంది యువతకు ఈ విషయం తెలియదు! రామకృష్ణ మిషన్, మరికొన్ని ఇతర సంస్థలు తప్ప, జాతీయ యువజన దినోత్సవాన్ని ఎవరూ జరుపుకోవడం లేదు! ఇది ఎంతో శోచనీయం!

ఎందుకు స్వామి వివేకానంద యువతకు ఆదర్శం? కేవలం ముప్పై తొమ్మిదిన్నర సంవత్సరాల యువకునిగానే స్వామీజీ 39 యుగాలేమిటి, సూర్య చంద్రులుండేటంత వరకూ మానవాళికి మేలు చేసే జ్ఞానసంపదనూ, ప్రేరణాశక్తినీ ప్రసాదించి వెళ్ళారు! 30 ఏళ్ళ వయస్సులో 1893 సెప్టెంబరు 11వ తేదీన అమెరికాలోని చికాగో మహానగరంలో 'విశ్వమత మహాసభ'లో ఏడు వేల మంది శ్రేష్ఠ మేధావులు, ఆచార్యులు, మత పెద్దల ముందు 'Sisters and Brothers of America - అమెరికా సోదరీ సోదరులారా!' అనే సంబోధనతోనే విశ్వమానవ హృదయాంతరంగాలను పులకాంకితులను చేసిన ఘనత వివేకానందులది. అలా వివేకానంద విజయ యాత్ర, జ్ఞానదాన జైత్రయాత్ర 1902 జూలై 4న బేలూరు మఠంలో సాధువులు, బ్రహ్మచారులకు ఉపనిషత్తులలోని ఆత్మజ్ఞాన తత్త్వాలను వివరించే వరకూ కొనసాగింది. కేవలం 9 ఏళ్ళ లోనే 1,500 సంవత్సరాలకు కావలసినంత సందేశాన్ని ప్రసాదించి వెళ్ళిన నవ యువ వేదాంత కేసరి, భారత ఆధ్యాత్మ సింహం, హైందవ ఝంఝూమారుతం స్వామి వివేకానంద. మన యువతకు ఆయన ఆదర్శవంతుడు కాదా?

గురుదేవులయిన శ్రీరామకృష్ణుల మహాసమాధి అనంతరం స్వామీజీ 1890లో పరివ్రాజక సన్న్యాసిగా భారతదేశ పాదయాత్ర ప్రారంభించారు. భారతీయ నిరుపేదల కష్టాలనూ, కన్నీళ్ళనూ ప్రత్యక్షంగా దర్శించారు. రాజుల, మహారాజుల, సంపన్నుల భోగాలను, కరడు గట్టిన స్వార్థపరుల జీవితాలనూ వీక్షించారు. అంటరానితనం, అజ్ఞానం, విదేశీ పాలకులకు దాసత్వం, ఆకలి, నిరక్షరాస్యతల విలయ తాండవం ప్రత్యక్షంగా చూసి విలవిలలాడారు. భారతదేశ ఆఖరి దక్షిణాగ్రం కన్యాకుమారికి చేరుకుని అమ్మవారి దర్శనం పొంది సముద్రమధ్యంలోని 'శ్రీపాదశిల'పై మూడు రోజులు 'భారతదేశం'పై ధ్యానించారు. ఇలా ఒక యువ సన్న్యాసి స్వీయమోక్షం, ఇష్టదైవ దర్శనం కోసం కాక తన మాతృదేశ పురోగతి కోసం, ఉజ్జ్వల భవిష్యత్తు కోసం ధ్యానం చేయడం ప్రపంచ చరిత్రలో మరెక్కడా, ఎన్నడూ జరుగలేదు! స్వార్థ ప్రయోజనాల కోసం, తుచ్ఛ సుఖభోగాల కోసం మాతృదేశ ప్రజాధనాన్ని 'స్వాహా' చేస్తున్న ఈ రోజుల్లో భారతీయుల కష్టాలను చూసి కలత చెందిన ఈ యువ సన్న్యాసి భారత యువతకు ఆదర్శవంతుడు కాదా?

'...your country needs Heroes; Be Heroes ' అని ఓ లేఖలో తమ శిష్యులకు అమెరికా నుండి వ్రాశారు స్వామీజీ. శ్రీరామకృష్ణుల ఆదేశం, శ్రీశారదామాత ఆశీస్సులతో అమెరికాలోని చికాగో నగరంలో జరుగబోయే 'విశ్వమత మహాసభ'లకు 1893, మే 31న ప్రయాణమయ్యారు స్వామీజీ. నెలల తరబడి సముద్ర ప్రయాణం. జూలైలో చికాగో చేరుకున్నాక తెలిసింది – మహాసభలు సెప్టెంబరులో ప్రారంభమవుతాయని. చేతిలో ఉన్న ధనం అంతంత మాత్రమే! ఎవరూ పరిచయం లేరు... ఈ కొత్త వింత కాషాయరంగు దుస్తుల మనిషిని విచిత్రంగా చూస్తున్న అమెరికన్లు... తలపాగా లాగారు కొందరు, వెకిలిగా నవ్వారు కొందరు, రాళ్ళు రువ్వారు తుంటరి పిల్లలు. తల దాచుకోవడానికి ఒక ఇల్లు లేదు. ఆకలితో ఎన్నోసార్లు

నిజనాయకుడే!


– స్వామి అర్చనానంద

భిక్షమడగడానికి ప్రయత్నించారు. ముఖం మీదే వాకిళ్ళు దభేలుమని మూసేశారు. నల్లజాతివాడు అని అవమానించి రాత్రులు తలదాచుకోవడానికి లాడ్జీలలో గది ఇవ్వలేదు! ఆకలి, అలసటతో సొమ్మసిల్లి ఫుట్‌పాత్ మీద పడిపోయారు ఓ రోజు! రైలు గూడ్సు పెట్టెలో చలికి వణుకుతూ రాత్రికి తల దాచుకున్నారు మరో రోజు!

ఇలా ఎన్ని కష్టాలు, కడగండ్లు, అవమానాలు, అవహేళనలు ఎదురైనా వివేకానందుని ఆత్మవిశ్వాసం, మనోధైర్యం, ప్రచండ సంకల్పం చెక్కుచెదరలేదు! మొక్కవోని ధైర్యసాహసాలతో, దైవంపై అచంచల విశ్వాసం, శరణాగతితో ఈ యువ సన్న్యాసి అడుగు ముందుకే వేశాడు కానీ వెనుకంజ వేయలేదు, వెనుతిరిగి చూడలేదు!

చిన్న మాటలకే అలిగే యువతీ యువకులు; తల్లితండ్రులు అడిగింది ఇవ్వకపోతే ఆత్మహత్య చేసుకొనే విద్యార్థులు; పరీక్షల్లో తప్పితే మరణమే శరణ్యమనుకునే దుర్బల మనస్కులు; తండ్రి క్రమశిక్షణను బోధిస్తే ఇల్లు విడిచి పారిపోయే విద్యార్థులు – ఈ బలహీన మనస్కులు, దుర్బల హృదయులకు **'బలమే జీవనం. బలహీనతే మరణం... ఆత్మ విశ్వాసంతో ముందుకు సాగు'. ఆత్మవిశ్వాసమున్న కొద్దిమంది ధీరుల చరిత్రే ప్రపంచ చరిత్ర** – ఇలాంటి అగ్ని మంత్రాలు, ధీరవచనాలతో ప్రేరణనూ, స్ఫూర్తినీ ఒసగే వివేకానంద స్వామి యువతరానికి ఆదర్శవంతుడు కాదా?

ఈ రోజు యువతీ యువకులలో, విద్యార్థులలో ఒక దౌర్బల్యం ప్రవేశించింది. అది సినిమా హీరో, హీరోయిన్లనూ, ఫ్యాషన్ స్టార్లనూ 'రోల్ మోడల్'గా చేసుకొని, వారిని గుడ్డిగా అనుకరించడం, అనుసరించడం! నేటి యువతీయువకులు, అలా తయారుకావడానికి బాధ్యతా రహితులైన తల్లితండ్రులూ తమ వంతు పాత్ర పోషిస్తున్నారు. నటనను వృత్తిగా స్వీకరించిన వారు నటులు మాత్రమే! నటులుగా వారి స్థానాన్నీ, గౌరవాన్నీ వారికి ఇవ్వాలి. అంతేకానీ ఆ నటుల్ని అనుకరిస్తూ జీవితాలను పాడు చేసుకోకూడదు.



సమాజంలో డాక్టర్‌కూ, ఇంజనీర్‌కూ, లాయర్‌కూ, ప్రొఫెసర్‌కూ ఎలా ఒక స్థానం ఉందో అదే స్థానం ఒక యాక్టర్‌కూ ఉండాలి! కానీ ఆ నటులను అనుకరించే మోహం నుండి మన యువతరం ఎంత త్వరగా బయట పడితే మన దేశానికి అంత మంచిది!

ఒక మోహన్‌దాస్ కరమ్ చంద్‌లో వెయ్యింతలు దేశభక్తిని పెంచి, 'మహాత్మా గాంధీ'గా మలచిన వివేకానందే మన యువతకు ఆదర్శం.

సుభాష్ చంద్ర బోస్‌లో ధైర్యసాహసాల్నీ, దేశభక్తినీ నూరిపోసి 30 వేల మందితో యువ 'ఆజాద్ హిందు ఫౌజ్'ను స్వాతంత్ర్యసమరం కోసం నడిపింపజేసి 'నేతాజీ'గా చేసిన వివేకానందస్వామే మన యువకులకు 'కమాండర్ ఇన్ చీఫ్'.

జెమ్‌షెడ్‌జీ టాటా గుండెల్లో ఆత్మశక్తి తూటాలను పేల్చి 'నవభారత పారిశ్రామికనేత'గా తీర్చిదిద్దిన వివేకానందుడే మన దేశానికి ఆదర్శనేత.

ఆత్మహత్యకు పూనుకున్న అన్నా హజారేకు ఆదర్శ సమాజ సేవకునిగా మారడానికి ప్రేరణనిచ్చిన మహోన్నత దేశప్రేమి స్వామీజీయే దేశానికి నిజమైన ఆదర్శప్రాయుడు.

కాలు లేని అమ్మాయి 'అరుణిమా సిన్హా' ఎవరెస్ట్ పర్వతం అధిరోహించేందుకు ఆత్మబలం, సాహస స్ఫూర్తీ ప్రసాదించిన వివేకానందుడే మన జాతికి నిజమైన ఆదర్శవంతుడు.

కొండలు, గుహలు, అరణ్యాలు, హిమాలయాలకే పరిమితమైన సన్న్యాసులు, యతులకు 'మానవ సేవే మాధవ సేవ' అన్న మహామంత్రంతో 'నిరుపేదల సేవలోనే నిర్వాణ సుఖం' ఉందని నిరూపించిన వివేకానందుడే నిజమైన ఆదర్శవంతుడు.

కాబట్టి, నేటి యువతరం నిజ జీవితంలో నిజమైన వీరులూ, శూరులూ, ధీరులూ కావాలంటే జ్ఞానతేజం, శక్తిపుంజం, స్ఫూర్తికేంద్రమైన – స్వామి వివేకానందను ఆదర్శంగా తీసుకోవాలి! ❖

మీరందరూ వీరులుకండి! పర్వత స్థైర్యంతో నిలబడండి! మానవుడు మరణించేది ఒక్కసారే! నా శిష్యులు పిరికిపందలుగా ఉండరాదు. పిరికితనం అంటే నాకు చాలా అసహ్యం. - స్వామి వివేకానంద



వివేకానంద శిక్షణ ఎలాంటిదో గ్రహించవచ్చు. పువ్వు పుట్టగానే పరిమళించినట్లు పసివయస్సు నుంచే వివేకానందలో దాగి ఉన్న అపురూపమైన మేధస్సును గుర్తించిన శ్రీరామకృష్ణులు ఆయన్ని మహోన్నతునిగా మలిచారు.

దక్షిణేశ్వరంలో ఆధ్యాత్మిక సాధనల్లో మునిగిపోయిన స్వామీజీ ఓ రోజు ధారాపాతంగా రోదిస్తూ రామకృష్ణ పరమహంసకు కనిపించారు. సమాధిస్థితిని పొందలేక పోతున్నాననే బాధతో స్వామీజీ విలపిస్తున్న విషయం గ్రహించి, "నాయనా! నీవు తప్పక ఆ స్థితి పొందేలా చేస్తాను.

దివి నుండి దిగివచ్చిన దివ్యతేజం

– శ్రీమతి టి. ఆశాలత

ఇతరులకు బోధించాలంటే ముందు తాను పూర్తిగా అర్థం చేసుకొని ఆ తరువాత బోధిస్తే అది ఫలవంతం అవుతుందనే సూత్రీకరణను స్వామి వివేకానంద త్రికరణశుద్ధిగా ఆచరణలో పెట్టారు. సాక్షాత్తూ కైలాసంలో పరమశివుడు ఏ విధంగా ధ్యాన ముద్రలో ఉంటాడో అదే రీతిన స్వామి వివేకానంద కూడా జప, ధ్యాన సాధనల గురించి వివరించేటప్పుడు ప్రగాఢ ధ్యానంలోకి వెళ్ళిపోయేవారు. నరేంద్రుని ప్రతిభను కొనియాడుతూ శ్రీరామకృష్ణులు, "నరేంద్రుడు పాడడంలోనూ, సంగీత వాద్యాలను వాయించడంలోనూ, వాగ్ధాటిలోనూ, సంభాషణల్లోనూ, బోధించడంలోనూ అత్యంత ప్రతిభావంతుడు. అతడు సత్యనిష్ఠాగరిష్ఠుడు, పవిత్రుడు" అని అనేవారు.

స్వామీజీ ఆధ్యాత్మిక సాధనల్లో అత్యున్నత శిఖరాలను అధిరోహించగల సమర్థుడు కాబట్టే గురువు శ్రీరామకృష్ణులు ఆయనకు తన శిష్యగణంలో అగ్రతాంబూలాన్నిచ్చారు. మిగతా శిష్యుల బాధ్యతను అప్పగించారు. గురువు అప్పజెప్పిన బాధ్యతను ప్రియశిష్యుడైన స్వామీజీ అంతే సమర్థంగా నిర్వహించారు.

రామకృష్ణుల మహాసమాధి తరువాత చెల్లాచెదురైన శిష్యులను ఒక్క తాటిపైకి తెచ్చి, వారు ఆధ్యాత్మిక సాధనలలో మునిగితేలేలా చేశారు. ఆ రోజుల్లో ఆ శిష్యగణానికి తినడానికి ఏమీ లేక బింబాకులను ఉడకబెట్టుకొని, ఉప్పు కలుపుకొని తినేవారు. అది కూడా దక్కని రోజున కేవలం గంగాజలం కడుపు నిండా తాగి, తీవ్ర ధ్యానంలో మునిగిపోయేవారంటే

కానీ అంత కన్నా ముందు నువ్వు ఈ గురువు నిర్దేశించిన గొప్ప పని కోసం ఓ కూలీవాడిగా పరిశ్రమించాలి. సమాధి స్థితి అనేది నీవు చేసే ఆ గొప్ప పనిలో ఆవగింజలో ఆరోవంతు పాటి విలువ కూడా చేయదు" అంటూ స్వామీజీని కార్యోన్ముఖులను చేశారు.

ఓ రోజు నరేంద్రుడు ఎవ్వరికీ చెప్పకుండా బోధ గయ వెళ్ళాడు. ఈ విషయాన్ని మిగతా శిష్యులు శ్రీరామకృష్ణులకు చెప్పినప్పుడు, 'అతడు ఎక్కడికి పోగలడు? మీరేమీ చింతించకండి. అతడు త్వరలోనే తిరిగివస్తాడు. ప్రపంచ మంతా తిరిగినా ఏమీ లభించదు. సర్వం ఇక్కడే (తన దేహాన్ని చూపిస్తూ) ఉంది' అని అంటూ అనంతత్త్వాన్ని గురించి సూచనప్రాయంగా ఆయన చెప్పారు. శ్రీరామకృష్ణులు చెప్పినట్లే నరేంద్రుడు రెండు రోజుల్లో మళ్ళీ తన గురువును వెతుక్కుంటూ దక్షిణేశ్వరానికి వచ్చాడు. ఎందుకంటే, శ్రీరామకృష్ణులు నిర్దేశించిన పని కోసం ఈ భువిపైకి వచ్చిన శివ స్వరూపుడు – వివేకానంద.

శ్రీరామకృష్ణులు అనే గురువు, వివేకానంద అనే మేధావంతుడైన శిష్యుడికి ప్రత్యక్షంగా కూర్చోబెట్టి బోధించిందేమీ లేదు. వివిధ సంఘటనల సందర్భంగానే ఆయన తన శిష్యుడికి అన్యాపదేశంగా కర్తవ్యబోధ చేశారు. ఓ రోజు బ్రహ్మసమాజం తరఫున నాటక ప్రదర్శన జరుగుతోంది. ఆ నాటకంలో సన్న్యాసి వేషధారణలో ఉన్న నరేంద్రుణ్ణి చూసి శ్రీరామకృష్ణులు లేచి నిలబడి అతణ్ణి కిందకు

(మిగతా 30వ పేజీలో...)

కలల్లో నుండి లేచి కళ్ళు తెరవండి!

గడచిన వెయ్యి సంవత్సరాల నుండీ మిమ్మల్ని దుర్బలులు, నిష్ప్రయోజకులు అని అనడం మీరు వింటూనే ఉన్నారు. దాంతో అది నిజమని నమ్ముతూ వచ్చారు. ఈ నా దేహం కూడా భారతావనిలో పుట్టి, పోషించ బడింది. కానీ నేను ఎన్నడూ క్షణమైనా అటువంటి విషతుల్యమైన భావనను నా మనస్సులో ప్రవేశించడానికి అనుమతించ లేదు. నా పట్ల నాకు అచంచలమైన విశ్వాసం ఉంది. నాకున్నంత విశ్వాసం మీకు మీ పట్ల ఉంటే, అనంతశక్తి, వివేకం, అప్రతిహతమైన శక్తి మీలోనే నిక్షిప్తమై ఉన్నాయని మీరు విశ్వసిస్తే, మీరూ నా లాగా అవుతారు. మీరు అద్భుతాలు సాధిస్తారు.

"అలా భావించడానికి మాలో అంత బలం ఎక్కడ ఉంది? దౌర్బల్యం గురించి కాక బలం గురించి మాకు నొక్కి వక్కాణించే, మాలో విశ్వాసాన్ని నింపే గురువులు ఎక్కడున్నారు?" అని మీరు అనుకోవచ్చు.

నా జీవిత విధానంతో మీకు నేర్పడానికే, మార్గాంతరం చూపడానికే నేను మీ వద్దకు వచ్చాను. ఆ సత్యాన్ని నా నుంచి మీరు గ్రహించండి. ఆ తరువాత పట్టణం నుంచి పట్టణానికి, గ్రామం నుంచి గ్రామానికి, ఇంటింటికీ వెళ్ళి ఆ భావజాలాన్ని ప్రచారం చేయండి. వెళ్ళి ప్రతి భారతీయుడితోనూ, "లేవండి, మేల్కొనండి, కలలు కనడం ఆపండి. తెప్పరిల్లుకొని మీలోని దివ్యత్వాన్ని అభివ్యక్తం చేయండి" అని చెప్పండి.

మీలోని ఆత్మశక్తితో మీరు తొలగించలేని లేమి గానీ, శోకం గానీ లేదంటే నమ్మండి. ఈ వచనాలను విశ్వసించండి, మీరు సర్వశక్తి మంతులవుతారు.


మనిషికీ మనిషికీ మధ్య ఉన్న భ్రాతృత్వానికి ఈ హైందవుడు, క్రైస్తవుడు మొదలైన పేర్లు పెద్ద ప్రతిబంధకాలని నా గురుదేవులు చెప్పేవారు. మొదట మనం ఈ ప్రతిబంధకాలను తొలగించాలి. వాటిలోని మంచి అంతా హరించుకుపోయి ఇప్పుడు అవి కేవలం హానికరమైన శక్తులుగా నిలిచిపోయాయి. వాటి ప్రభావానికి లోనై మనలో ఉత్తములైన వారు కూడా రాక్షసుల మాదిరి ప్రవర్తిస్తున్నారు. ఏమైనా మనం కష్టపడి పనిచేసి సాఫల్యం పొంది తీరాలి.

మీ అందరిలో అనంతమైన శక్తి ఉందని నాకు పగటి వెలుగులా విస్పష్టంగా ద్యోతకమవుతోంది. ఆ శక్తిని మేల్కొల్పండి. లేవండి! మేల్కొనండి! కార్యధురీణులు కండి! నడుము బిగించండి. అశాశ్వతమైన సంపదలతో, పేరుప్రతిష్ఠలతో ఏం చేస్తారు? నేను ఏం యోచిస్తున్నానో మీకు తెలుసా? నేను ముక్తిని గిక్తిని లెక్క చేయను. మీ అందరిలో ఉన్నత భావనలను ప్రేరేపించడమే నా ఉద్యమం. ఒక్క వ్యక్తిని సుశిక్షితునిగా తీర్చిదిద్దడానికి లక్ష జన్మలు ఎత్తడానికైనా నేను సిద్ధం. ❖



లేవండి! కార్యధురీణులుకండి! మీ అందరిలో ఉన్నత భావనలను ప్రేరేపించడమే నా ఉద్యమం. ఒక్క వ్యక్తిని సుశిక్షితునిగా తీర్చిదిద్దడానికి లక్ష జన్మలు ఎత్తడానికైనా నేను సిద్ధం. - స్వామి వివేకానంద

విభిన్నపార్శ్వాల విశిష్ట వ్యక్తిత్వం



అసమాన ప్రజ్ఞాపారంగతుడు, అనుపమాన ప్రేమాస్పదుడు స్వామి వివేకానంద. వారిది విభిన్న పార్శ్వాల విశిష్ట వ్యక్తిత్వం. ఆ కారణజన్ముడి అభిమానాన్ని, ఆదరణను ప్రత్యక్షంగా అనుభవించిన వారు ధన్యులు. స్వామి వివేకానందతో మమేకమై తమ జీవితానుభవాలను ఎందరో భాగ్యవంతులు మధురస్మృతులుగా మిగుల్చుకున్నారు; అక్షరబద్ధం చేసుకొని తరించారు. స్వామీజీ హృదయ వైశాల్యాన్ని ఆవిష్కరిస్తున్న ఆ మరపురాని అనుభూతుల దొంతరల్లో కొన్ని ఇవి...

సేకరణ: డాక్టర్ కమల జయరావు

సహజీవనం చేయలేం!

స్వామీజీ, గిరీశ్ చంద్రఘోష్‌తో ఇలా అన్నారు: "మాయ నన్ను జయించాలని చూస్తోంది. కానీ నేను మాయను గెలవాలని యత్నిస్తున్నాను. మాయ నాశనం కావాలి లేదా నేను మరణించాలి. ఉభయులం సహజీవనం చేయలేం."



గిరీశ్: "నరేన్‌వి ఎంత ఉన్నత భావాలు! ఏమి దృఢ సంకల్పం! నేను ముందెన్నడూ ఇటువంటి మాటలు వినలేదు సుమా! మాయా ప్రపంచాన్ని అణగద్రొక్కి, తన నిజతత్త్వంతో ఆధిపత్యం చలాయించడం ఒక అపూర్వ భావన! దృఢ సంకల్పం గల నరేంద్రుడికే ఈ మాటలు పలకడం చెల్లు".

సేవ - సాధన

"త్యాగం గొప్పదనాన్ని స్వామీజీ నొక్కి చెప్పారు" అని ఒక వ్యక్తి అన్నారు. అప్పుడు స్వామి తురీయానంద ఇలా అన్నారు: "నిజమే కానీ స్వామీజీ సేవా ధర్మాన్ని కూడా ప్రవేశపెట్టారు. స్వామీజీ భావాలను గ్రహించాలంటే ఆయనను సంపూర్ణంగా అర్థంచేసుకోవాలి, కానీ పాక్షికంగా కాదు.

స్వామీజీ సత్త్వగుణ సంపన్నులు. ఎన్ని ఉన్నత భావాలు! అనుభవ పూర్వకంగా చెబుతున్నాను. ధ్యానంలో శివుడి లాగా అగుపించేవారు. సంపూర్ణంగా శమ దమాలు కలిగి, ప్రశాంత చిత్తుడై ఉండడం సత్త్వగుణ లక్షణం. కొంచెం రజోగుణం జనించనిదే భారతదేశం పురోగమించజాలదని స్వామీజీ ఎరుగును కనుక, నిష్కామకర్మ అవసరాన్ని చెప్పారు. అలా రజోగుణ మిశ్రిత సత్త్వగుణం చూపారు. సాధారణ ప్రజానీకానికి సేవ చేయడం ఆషామాషీ కాదు. వారి స్థాయికి వెళ్ళి, వారిని మెల్లమెల్లగా పైకి లేపాలి".

గురుశిష్యులు

శ్రీరామకృష్ణులు, స్వామీజీతో 'చూడు నరేన్! నేను కఠోర సాధనలు చేశాను. అందులో పదహారో వంతు నువ్వు చేయగలిగితే, పట్టె మంచంపై నిన్ను పడుకోబెడతాను' అన్నారు.

కాలాంతరంలో పాశ్చాత్య భక్తులు, స్వామీజీకి ఒక హంసతూలికా తల్పం సమర్పించుకొన్నారు (ఇది బేలూరు మఠంలో స్వామీజీ గదిలో ఉంది). స్వామీజీ ఆ మంచంపై కూర్చొని, 'గురుదేవుల వాక్కులు ఎంత సత్యమో' అంటూ కన్నీరు కారుస్తూ చెప్పేవారు. **- స్వామి శుద్ధానంద**

శివస్వరూపుడు

బారానగరంలోని పాడుబడ్డ భవనం వట్టి దయ్యాల కొంప అని ప్రతీతి. స్వామి తురీయానంద ఒక దయ్యాన్ని కూడా చూశారు.

ఆ దళం నాయకుడైన నరేంద్ర గురించి చెప్పాలంటే, నున్నగా గీసిన గుండు... ఆజానుబాహుడు. సొగసుకాడు. కాషాయాంబరధారి. కాళిదాస కవికి కూడా ఆ సౌందర్యాన్ని వర్ణించడానికి మాటలు చాలవు. గొప్ప శిల్పి మలచిన అపురూప శిల్పంలా ఉండేవాడు. తామరరేకుల లాంటి విశాలమైన కళ్ళు... వాటికి అవే సాటి. ఆయన నిద్రిస్తున్నప్పుడు కళ్ళు పూర్తిగా మూతబడేవి కాదు. శివుని నేత్రాల లాగా అవి అర్ధనిమీలిత నేత్రాలు.

స్వామీజీ భలే సరదాగా ఉండేవారు. జంతువులు కూడా ఆయన చుట్టూ మూగేవి. అయస్కాంతం లాంటి ఆకర్షణ ఆయనది. ఆయన నవ్వితే జగమంతా నవ్వేది, ఆయన విలపిస్తే అందరూ విలపించేవారన్నది అతిశయోక్తి కాదు. ఆయన నాతో ఇలా చెప్పారు: 'ఎవ్వరి సేవా స్వీకరించకు. నీ పని నీవే చేసుకో. ఏ పనినైనా తక్కువ అని భావించకు.'

- స్వామి నిర్లేపానంద

దయార్ద్ర హృదయం

పేదల కష్టాలను చూసి చలించిపోయేవారు స్వామీజీ. ఒకనాడు స్వామీజీ భోజనానికి కూర్చుంటుండగా, వాకిట్లో కొందరు పేదలు నిలబడడం గమనించారు. వారు ఆకలితో ఉన్నారని గ్రహించిన స్వామీజీ తన ఆహారాన్నీ, తన వద్ద ఉన్న ధనాన్నీ వారికి ఇచ్చేశారు.



స్వామీజీ ఆర్థికంగా ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్న సమయం అది. ఒకనాడు స్వామీజీ పని మీద బయల్దేరి, ట్రామ్ బండి ఎక్కబోతున్నారు. ఇంతలో ఒక దీనుడు యాచనకు వచ్చాడు. తన ప్రయాణం గురించి ఆలోచించకుండా వెంటనే స్వామీజీ తన దగ్గర ఉన్న డబ్బును అతడికి ఇచ్చి, నడచుకొంటూ వెళ్ళిపోయారు.

సత్యసంధత

ఒకసారి శ్రీరామకృష్ణుల నుండి సెలవు తీసుకుంటూ 'నేను వచ్చే బుధవారం వస్తాన'ని చెప్పారు స్వామీజీ. 'ఎన్ని గంటలకు వస్తావు' అని శ్రీరామకృష్ణులు అడిగినప్పుడు 'మధ్యాహ్నం మూడింటికి వస్తాను' అని చెప్పారు స్వామీజీ.

స్వామీజీ బుధవారం మధ్యాహ్నం దక్షిణేశ్వరం వచ్చి, ఆలయ ప్రధాన ద్వారం ఆవలే నిలబడ్డారు. శ్రీరామకృష్ణులకు ఈ సంగతి తెలిసి, స్వయంగా అక్కడకు వెళ్ళి, 'నరేన్! వచ్చావా? ఎప్పుడు వచ్చావు? ఇక్కడ నిలబడ్డావెందుకు?' అని అడిగారు.

'అయ్యా! కొంచెం త్వరగానే ఇంటి నుండి బయల్దేరడం వల్ల రెండు గంటలకే వచ్చేశాను. మీతో మూడు గంటలకు వస్తానన్నాను కదా, అందుకే ఇక్కడ వేచి ఉన్నాను' అని అన్నారు. స్వామీజీ సత్యనిష్ఠకు శ్రీరామకృష్ణులు అమితంగా సంతసించారు. ఉభయులు మూడు గంటల వరకు అక్కడే నిలబడి మాట్లాడుకున్నారు. ఆపైన శ్రీరామకృష్ణుల గదికి వెళ్ళారు. **– స్వామి విమలానంద**

ధ్యానంతో జోల

స్వామీజీ దేశభ్రమణ కాలంలో మహాబలేశ్వరంలో ఒక వకీలు ఇంట్లో అతిథిగా ఉన్నారు. ఆ లాయరు వాళ్ళ ఇంట్లో శిశువు రాత్రంతా ఒకటే ఏడుపు. ఒకరోజున స్వామీజీ, 'ఈ రాత్రికి నా దగ్గర ఉండనీయండి' అన్నారు. 'నేనే సముదాయించ లేకపోతున్నానే. మీ వల్ల అవుతుందా స్వామీజీ?' అంటూ శిశువును అందించింది తల్లి. స్వామీజీ శిశువును తన ఒళ్ళో పడుకోబెట్టుకొని, రాత్రంతా ధ్యానమగ్నులై ఉన్నారు. శిశువు ఒక్కసారయినా ఏడవక, నిద్రపోయాడు! అది స్వామీజీ ధ్యాన మహిమ.



శివుడే గురువు

శరచ్చంద్ర చక్రవర్తికి నాగమహాశయుని పట్ల ఎనలేని భక్తిశ్రద్ధలు ఉండేవి. అందువల్ల అతడు నాగమహాశయుడి నుండి మంత్రోపదేశం పొందాలని ఆశించేవాడు. కానీ అతడి కోరికను నాగమహాశయ తిరస్కరించారు. కానీ ఎలాగైనా నాగమహాశయ నుండే మంత్రోపదేశం పొందాలని పట్టుపట్టిన శరచ్చంద్ర ఒకనాడు నాగమహాశయుడు బజారుకు వెళుతుంటే, ఆయన కాళ్ళు గట్టిగా పట్టుకొని మంత్రదీక్ష ఇమ్మని పట్టుబట్టాడు. అప్పుడు 'పరమశివుడే నీకు గురువు కాగలడు' అని అన్నారాయన. అది ఓ వరంగా భావించాడు చక్రవర్తి.

స్వామీజీ 1897లో ఆలమ్‌బజారు మఠంలో ఉంటున్నారు. శరచ్చంద్ర చక్రవర్తి వెళ్ళేసరికి స్వామీజీ శయనిస్తున్నారు. నేలపై కూర్చొని నిరీక్షిస్తున్నాడు చక్రవర్తి. హఠాత్తుగా స్వామీజీ స్థానంలో శివుడు దర్శనమిచ్చాడు! ఆ దర్శనం తరువాత కొద్ది దినాలకే శరచ్చంద్రకు, స్వామీజీ మంత్రదీక్ష నొసగారు. అప్పుడు శరచ్చంద్రకు, నాగ మహాశయుడిచ్చిన వరం గుర్తుకు వచ్చింది.

– స్వామి వీరేశ్వరానంద


మానవజాతిపై ప్రేమ

స్వామీజీ ఒక ఆసామి వద్ద ఫ్రెంచి భాష నేర్చుకొనేవారు. 'ఫ్రెంచి ఎందుకు?' అని సోదరి క్రిస్టీనా అడిగినప్పుడు 'ఆయన పేదవాడు. నేను ఇచ్చే డబ్బుతో కనీసం పస్తులు తప్పుతాయి' అన్నారు స్వామీజీ.



వేదాంత సొసైటీలో ఒక సభ్యుడు సొసైటీ డబ్బు లెక్కలు తప్పు చూపుతున్నాడనే ఆరోపణలు వచ్చినప్పుడు 'ఫరవాలేదు. నేను ఆ లోటును భర్తీ చేస్తాను. ఒక పేదవాడి బాధ నేను చూడలేను' అన్నారు స్వామీజీ. **– స్వామి అఖిలానంద**

కామ, క్రోధ, లోభ, మోహాలు ఉన్న మానవుడు ఎన్నటికీ పరిపూర్ణతను సాధించలేడు. ఆగ్రహించే బద్ధుడైనవాడు ఎలాంటి పరిస్థితుల్లోనూ మాయగుమ్మాన్ని దాటలేడు. - స్వామి వివేకానంద



– స్వామి శితికంఠానంద

మాననీయుని

మాసాంతం వచ్చేసింది. వినీత్, వికాస్‌లు మళ్ళీ కలుసుకున్నారు. చిన్ననాడు పాఠశాలలో ఉన్నప్పుడు తమకు వివేకానందుడి రచనలను పరిచయం చేసిన ఉపాధ్యాయుడిని కలుసుకున్నారు.

వినీత్: నమస్కారం మాష్టారూ! మీరు స్కూలులో మాకు వివేకానందుడి బోధనల గురించి విశదీకరిస్తుండేవారు. మీరు ఆనాడు ఇచ్చిన ప్రేరణ వల్ల స్వామీజీ గురించి ఇంకా క్షుణ్ణంగా అధ్యయనం చేయాలన్న ఆసక్తి మాలో పెరిగింది.

మాష్టారు: నాయనా! చాలా సంతోషం. చిన్న వయస్సులో నేను మీకు ఆ మహావ్యక్తిని పరిచయం చేస్తే తరువాత మీరు ఇంకా విపులంగా ఆయనను తెలుసుకోవడానికి ప్రయత్నిస్తారని నాకు తెలుసు. ఆ ఆశతోనే నేను వివేకానందుడి గురించి ఎక్కువగా చెబుతుండేవాడిని. కనీసం మీ ఇద్దరూ ఈ జ్ఞానఖని రచనలను చదవడానికి పూనుకోవడం ముదావహం.

వినీత్: బహుపార్శ్వాలున్న స్వామీజీ వ్యక్తిత్వాన్ని పూర్తిగా అర్థం చేసుకోవాలనుకోవడం సాహసమేమో అనిపిస్తుంది మాష్టారు!

మాష్టారు: స్వామీజీ వ్యక్తిత్వాన్ని పూర్తిగా అర్థంచేసుకోవాల్సిన అవసరం లేదు. ఆయన రచనలను చదివి, అర్థమైన వాటిని ఆచరణలో పెట్టడమే మనం చేయవలసింది. కాబట్టి మీరిరువురూ మనస్సును ఆ ఉన్నత భావాలతో పరిపుష్టం చేసుకుంటూ, మీకు చేతనైనంత కార్యరూపంలో పెట్టండి. అదే మీరు ఆ మహామనీషికి అర్పించే మహోన్నతమైన నివాళి.

వికాస్: 'ప్రపంచంలో ఉన్న బాధలను చూసిన తరువాత స్వామీజీ హృదయం అగ్ని పర్వతంలా బద్దలైంది. ఆ హృదయాగ్ని పర్వతం నుండి వెల్లువలా ప్రవహించినదే ఆయన భావ లావా ప్రవాహం' – స్వామీజీని చదివిన తర్వాత మాకు కలిగిన భావన ఇది మాష్టారు!

మాష్టారు: ఆ! చక్కగా అర్థంచేసుకున్నావు వికాస్. సిస్మోగ్రాఫ్ ఏ విధంగా భూకంపాల తీవ్రతను కొలుస్తుందో, అలా మానవాళి దుఃఖప్రకంపన తీవ్రతను కొలిచిన సిస్మోగ్రాఫ్ స్వామీజీ హృదయం. అంత చక్కగా కొలవగలిగింది కాబట్టి సుడిగాలిలా పనిచేసి 39 ఏళ్ళకే శరీరాన్ని అవతల పారేశారు.

వినీత్: అందుకేనేమో మహాపురుషులందరూ అంత తక్కువ కాలం జీవిస్తారు. మహాపురుషుల హృదయ కవాటాలు అతి సున్నితంగా ఉంటాయి. మనిషి దుఃఖ తీవ్రతకు విపరీతంగా స్పందించే ఆ హృదయ కవాటాలకు తేలికగా చిల్లులు పడతాయి. రక్తాన్ని స్రవించి, స్రవించి ఆ హృదయం తొందరగా ఆగిపోతుంది. కానీ వారు భౌతిక శరీరాన్ని త్యజించినా, వారి భావాలు ప్రభాత సూర్యకాంతిలా వ్యాపించి మానవాళి అజ్ఞానాంధకారాన్ని తొలగిస్తాయి. స్వామీజీ ఒకసారి సోదరి నివేదితతో 'నీకు తెలియదా గొప్పవాళ్ళ హృదయాలు ఎంత సున్నితంగా ఉంటాయో?' అని అంటారు.

వికాస్: వివేకానందుడు ఎందుకు అంత పిన్నవయస్సులోనే దేహాన్ని చాలించారన్నది చాలామందికి ఉన్న సందేహం. ఈ మధ్య వివేకానందుడి మరణం గురించి మన పత్రికలలో కొన్ని వ్యాఖ్యానాలు వచ్చాయి. 'బలమే జీవనం. బలహీనతే మరణమ'ని బోధించిన వ్యక్తి యుక్తవయస్సులో అనారోగ్యానికి గురై మరణించాడని వ్రాస్తున్నారు. మరికొందరు అంత గొప్ప వ్యక్తి ఈ ప్రపంచంలో ఇంకా కొద్దికాలం జీవించివుంటే మరింత లోకకల్యాణం జరిగేది అని భావిస్తున్నారు.

వినీత్: చాలామంది ఈ మధ్య వివేకానందను కొంచెం అధ్యయనం చేసి, ఆయన వారికి పూర్తిగా అర్థమయిపోయినట్లు వ్రాస్తున్నారు. మనం ఇలాంటి మహాపురుషులను మన అల్ప మేధతో పరిశీలించి పూర్తిగా అర్థం చేసేసుకున్నాం అనుకుంటే అది పొరపాటు. ఈ విషయంలో మనం కొంచెం వినమ్రంగా ఉండాలి.



ఇక వివేకానంద మరణం గురించి రకరకాల అపోహలు ఇప్పుడు ప్రజల్లో ఉన్నాయి. చివరి రోజులను ఆయన ఎలా గడిపారు? దేహత్యాగం చేసిన ఆ రోజు ఆయన దినచర్య ఎలా ఉన్నది.. అన్ని విషయాలూ రామకృష్ణ మిషన్ ప్రచురించిన వివేకానంద జీవిత చరిత్రలో స్పష్టంగా పేర్కొన్నారు. ఈ అపోహలకు కారణం – సంచలనాలను సృష్టించి తమ ఉనికిని చాటుకోవాలనుకుంటున్న ఆధునిక ప్రసారమాధ్యమాలే అని గ్రహించాలి.

'నరేన్‌కు (వివేకానంద) తానెవరో (పూర్వజన్మలో) తెలిసిన మరుక్షణమే ఈ ప్రపంచం నుంచి నిష్క్రమిస్తాడు' అని శ్రీరామకృష్ణ పరమహంస ముందుగానే చెప్పారు కదా! ఆయనకు గత జీవిత స్మృతికి విస్మృతిని కలిగించమంటూ జగన్మాతను ప్రార్థించారు. ఒకసారి అద్వైతానుభూతిని రుచి చూపించి, జగన్మాత కార్యం

స్వామి వివేకానంద 150వ జయంత్యుత్సవాలు 2013 జనవరి - 2014 జనవరి

అయ్యేవరకు ఆ అనుభూతికి తాళం వేసి, పని ముగిసిన వెంటనే తాళం తెరవబడుతుంది అని ముందే ఆ గురుదేవులు తన శిష్యుడికి చెప్పారు. నరేంద్రుని శ్వాస వేగంగా ఉండడం చూసి 'నరేన్ ఎక్కువ కాలం జీవించడు' అని కూడా చెప్పారు. అంతేకాదు ఆధ్యాత్మిక సత్యాన్ని అనుభవ మొనర్చుకున్న వివేకానంద లాంటి మహాపురుషులకు దేహం ఒక మహాబంధంగా పరిణమిస్తుంది. కాబట్టి మనం ఇలాంటి కారణజన్ముల జీవనరహస్యాన్ని మన బుద్ధితో తెలుసుకోవాలనుకోవడం సాహసమే అవుతుంది.

వికాస్: అవును. ఆయన నిత్యసిద్ధుడని రామకృష్ణులు పేర్కొన్నారు. అలాంటి నిత్య సిద్ధులకు మరణమెక్కడిది! ఎన్ని రోజులు దేహాన్ని ధరించాలన్నది వాళ్ళే నిర్ణయించుకుంటారు. మహాభారతంలో భీష్మ పితామహుడు ఇచ్ఛా మృత్యువును

మహాప్రస్థానం

స్వీకరించాడని చదివావు కదా! కాశ్మీర్‌లో అమర్‌నాథ్ యాత్ర తరువాత స్వామీజీ పూర్తిగా అంతర్ముఖుడై, శివుడు తనకు ఇచ్ఛామృత్యువును ప్రసాదించాడని చెపుతారు. అలానే 'నేను నలభయ్యో పడిలో పడను' అని చాలామంది శిష్యులతో చెప్పారు. 'నేను సామాను సర్దుకుంటున్నాను. ప్రపంచం నుంచి నిష్క్రమించే సమయం ఆసన్నమైంది' అని తీవ్రమైన కార్యం మధ్యలో ఉన్నప్పుడే పలుకుతారు. ఇక ఎక్కువ రోజులు తాను ఉండబోవడం లేదని స్వామీజీకి తెలుసు కాబట్టి విశ్రాంతికి సమయం ఇవ్వలేదు.

ఐనా ఇవన్నీ పారమార్థిక జీవితానికి సంబంధించిన విషయాలు. రాత్రీ పగలు ప్రాపంచిక విషయాలలో మునిగి, మనస్సును ఒక బురద గుంట చేసుకున్న అల్పజ్ఞులకు ఇవన్నీ వట్టి నమ్మకాలుగా కనబడతాయి.

శరీరత్యాగానికి ఒకరోజు ముందు తన శిష్యురాలు సోదరి నివేదిత భోజనం చేసిన తర్వాత ఆమెకు చేయి కడుగు కోవడానికి స్వామీజీ నీళ్ళందించారు. 'గురువు తనకు సేవచేయడ మేమిటి? తాను గురువుకు సేవ చేసుకోవాలి కాని' అని ఆమె అన్నప్పుడు 'జీసస్ తన శిష్యుల పాదాలు కడిగారు' అని బదులిచ్చారు స్వామీజీ. 'అది జీసస్ తుదిరోజు..' అంటూ మనసులో అనుకొంది నివేదిత. కానీ ఆ తదుపరి రోజే స్వామీజీకి కడపటి రోజు కాబోతున్నదని గ్రహించుకోలేకపోయింది. క్యాలెండర్ తెప్పించుకొని దేహత్యాగానికి తేదీని నిర్ణయించుకున్నారు స్వామీజీ. జీవనమరణాల్లోనూ అసమాన్య ధైర్యసాహసాలను ప్రదర్శించిన మేరునగధీరుడు స్వామీజీ.

వినీత్: అవును మరి! అంత యుక్తవయస్సులో దేహాన్ని త్యజించడం ధీరులకూ, కారణజన్ములకూ మాత్రమే సాధ్యపడు తుంది. నిజంగా స్వామీజీది సాహసోపేత మరణం. వివేకానంద జన్మించి 150 సంవత్సరాలు అయింది. కానీ మనం ఇంకొక వివేకానందను తయారు చేయలేకపోయాం. ఆయన రచనలను చదివి స్ఫూర్తి పొందినవారు ఆయన లాగా ఎందుకు లోకాన్ని ప్రభావితం చేయలేకపోతున్నారని కొంతమంది ఆవేదన. మన మధ్యలో వివేకానంద ఉంటే మన మనస్సులకు పట్టిన మకిలిని కడిగివేసేవాడు. ఆయన లేని లోటు కొట్టొచ్చినట్టు కనిపిస్తోందని కొందరి భావన. ఈ ప్రశ్నకు నీ ప్రత్యుత్తరం ఏమిటి మిత్రమా?

వికాస్: వివేకానందను తయారు చేయడమా? అలాంటి దైవాంశ సంభూతులు కాలావసరాలకు అనుగుణంగా భూమిపై అవతరిస్తారు. వారి అవతరణను మనం నిర్దేశించగలమా? ఐనా ఇంకొక వివేకానంద ఎందుకు? ఈ వివేకానందను అర్థం చేసుకుంటే చాలు. ఆయన 1,500 సంవత్సరాలకు సరిపడా సందేశాన్ని ఇచ్చాను అన్నారు. అంటే ఇంకొక 1,400 సంవత్సరాల వరకు మనకు మరొక వివేకానందుడు రాడు.

లోకాన్ని ప్రభావితం చేయడమంటే ఏమిటి? ఉపన్యాసాలిస్తేనే లోకాన్ని ప్రభావితం చేసినట్లా? జీవితంలో ఆదర్శాలను ఆచరించి చూపాలి. శ్రీరామకృష్ణులకు వివేకానందుడితో పాటు ఇంకా పదిహేనుమంది సన్న్యాస శిష్యులు ఉండేవారు. వారెవరూ ప్రపంచానికి అంత పరిచయం కాలేదు. ప్రవచనాలు, ప్రసంగాలు ఇవ్వలేదు. కానీ స్వామి బ్రహ్మానంద లాంటి వారు తన కన్నా ఆధ్యాత్మికంగా ఉన్నత భూమికలను నిర్వహించి ఉన్నారని స్వామీజీ మెచ్చుకొని, తనదంతా ప్లాట్‌ఫార్మ్ వర్క్ అంటారు. "మహామనీషులందరూ మౌనులుగా, ప్రశాంతులుగా, అజ్ఞాతులుగా ఉంటారు. వారు సత్త్వస్వరూపులు. సర్వేశ్వరుడికి అత్యంత సన్నిహితులై ఉండడం వల్ల కార్యనిరతులు కాలేరు, పోరాడలేరు, పాటుపడలేరు, పెనుగులాడలేరు, బోధించలేరు. ఎంత గొప్పవారైనా సదా కార్యశీలురుగా ఉండేవారిలో ఏదో కొద్దిగా అజ్ఞానం ఇంకా నిలిచే ఉంటుంది, మన స్వభావంలో కొంత మాలిన్యం ఉంటేగానీ కర్మ చేయలేం" – జీవితమంతా అవిశ్రాంతంగా పరిశ్రమించి, తన వాగ్ధాటితో, మేధతో, ప్రచండ ప్రసంగ పరంపర విన్యాసంతో ప్రపంచ ప్రజానీకాన్ని సమ్మోహితుల్ని చేసిన వివేకానంద వాక్కులివి!

వినీత్: వేకువజామున పూవుపై పడి, ఆ పూవు వికసించడానికి దోహదపడే హిమబిందువులా, సదా మన కార్యాన్ని ప్రశాంతంగా, నిర్మలంగా, నిస్సంగ బుద్ధితో చేయడమే స్వామీజీకి మనం సమర్పించగలిగే నిజమైన నివాళి. వివేకానందుడే యువతకు ఇప్పుడు నాయకుడు. ఈ ప్రవక్తను, దార్శనికుడిని, కర్మయోగిని, దేశభక్తుడిని, వేదాంత సింహాన్ని ఆదర్శంగా తీసుకొని జీవనపథంలో ముందుకు పయనించడానికి యువతరం సిద్ధమవుతున్నదంటే మనం మన కామ్రేడ్స్‌కు అభినందనలు తెలియజేయాలి.

మాష్టారు: వినీత్, వికాస్! మానవత్వమే మహా మతంగా బోధించి మహిలో మహిత కీర్తిని గడించుకున్న మహనీయమూర్తి స్వామి వివేకానంద జీవిత-సందేశాలను మీ జీవన నావకు దిక్సూచిగా చేసుకున్నారు. మీ ఇద్దరికీ నా అభినందనలు, ఆశీర్వాదాలు.

వినీత్, వికాస్ *(ఏకకంఠంతో)*: కృతజ్ఞతలు మాష్టారూ! స్వామి వివేకానందను మాకు పరిచయం చేసినందుకు జీవితాంతం మీకు ఋణపడి ఉంటాం. ❖

పరోపకారమే మహోన్నత ఆదర్శం. కాబట్టి ఒక మహోన్నత ఆదర్శం కలిగి జీవించడం, ఆ ఆదర్శాన్ని ఆచరించే ప్రయత్నంలో మరణించడం ఎంతో శ్రేయస్కరం కదా! *- స్వామి వివేకానంద*



జయహో వీర నరేంద్ర! జయహో విశ్వ వివేకానంద!!

– స్వామి రఘునాయకానంద

కోల్‌కతాలో సరిగ్గా 150 ఏళ్ళ క్రితం కులీన వంశస్థుల కుటుంబంలో వీరేశ్వర నామధేయంతో జన్మించిన ఒక మహాపురుషుని చిత్తరువు ఈనాటికీ జనుల హృదయాలలో తేజోమయంగా ప్రకాశిస్తూ ఉంది. యువకులకు శక్తి మంత్రాలను ప్రబోధించి వారి హృదయాల్లో చిరస్థానాన్ని ఏర్పరుచుకున్న యువనాయకుడు; 'లేవండి! మేల్కొనండి!...' అంటూ డమరుక శబ్దంతో యువకులలో ఉన్న యువశక్తిని తట్టిలేపిన శివస్వరూపుడు; సన్న్యాస సంప్రదాయానికి వన్నె తెచ్చిన యతిరాజు; తను మన ప్రాణాలను భారతజాతి మేలుకొలుపు యజ్ఞంలో ఆహుతులుగా అర్పించిన త్యాగధనుడు – వివేకానందుడు.

విశ్వపతి వివేకానంద: ప్రతిభావంతులు పలువురిని ఆకర్షించడం సహజమే కదా! దివ్యాంశ సంభూతుడైన నరేంద్రుడి ఆకర్షణ అంతా ఇంతా కాదు. చిన్నతనం నుంచి రాజ సభ ఆటలో తోటి బాలురు సేనాపతులు, సామంతులై ఉండగా వీరపురుషుడిగా నరేంద్ర పదవినే అలంకరించేవాడు నరేంద్రుడు. 'రాజాధిరాజా! ధర్మపరిపాలకా!' అని సంబోధిస్తూ ఒకరి వెనుక ఒకరు అతడికి పాదాక్రాంతులయ్యేవారు. జయహో వీర నరేంద్ర!!

మహాత్ముల చిన్ననాటి సంఘటనలు వారి భవిష్యత్తుకు సూచనలుగా కాన వస్తాయి. స్వామీజీ పరివ్రాజకుడిగా పర్యటిస్తూ, కొచ్చిన్‌లో ఉన్న ప్రొఫెసర్ సుందరరామ అయ్యర్ ఇంటి ముంగిట పరిచయపత్రంతో నిలబడ్డారు. దేదీప్యమానంగా ప్రకాశిస్తున్న స్వామీజీని చూసి సుందరరామ అయ్యర్ కుమారుడు రామస్వామి శాస్త్రి ఆశ్చర్యపోయాడు. స్వామీజీ దగ్గర ఉన్న పరిచయ పత్రాన్ని తీసుకుని తన తండ్రికి ఇస్తూ, 'ఎవరో మహారాజు మీ కోసం వేచి ఉన్నారు' అన్నాడు.

ఒకింత నమ్మని తండ్రి, వచ్చి స్వామీజీని చూసి కాసేపు సంభాషించిన తరువాత తన కుమారుడితో **'అవును, ఈయన మహారాజే! కానీ ఒక ప్రాంతానికో, రాజ్యానికో కాదు. ఆత్మ సామ్రాజ్యానికి చక్రవర్తి'** అన్నాడు. అంతేకాదు రాజులు సైతం స్వామీజీ ముందు మోకరిల్లి, ఆయన ఆసీనులై ఉన్న రథాన్ని స్వయంగా లాగారు. రోమారోలా ఇలా అంటారు: **'స్వామీజీ జన్మతః మహారాజు. భారతదేశంలో గానీ, అమెరికాలో గానీ ఆయన రాచఠీవిని చూసినవారు మోకరిల్లకుండా ఉండలేక పోయేవారు.'** జయహో విశ్వ వివేకానంద!!

నరేంద్రుడికి చిన్ననాటి నుండి రెండు దృశ్యాలు తన కళ్ళ ముందు కనిపిస్తూ ఉండేవి. మొదటిది – లౌకిక జీవిత దృశ్యం. రెండోది – సన్న్యాసి జీవిత దృశ్యం. అయితే నరేంద్రుడి మనస్సులో సన్న్యాస జీవిత దృశ్యం మాత్రం చెరగని ముద్ర వేసింది. సర్వసంగ పరిత్యాగం చేసి మూర్తీభవించిన త్యాగమూర్తిగా ఉండడమే వీర నరేంద్రుడి మనస్సును అమితంగా ఆకర్షించింది. జయహో వీర నరేంద్ర!!

భవిష్యత్తులో సర్వసంగ పరిత్యాగం చేసిన వివేకానందుడిగా మాత్రమే ప్రపంచాన్ని జయించాల్సి ఉంది. భారతీయ సనాతన సంప్రదాయంలో సన్న్యాసికి ఒక విశిష్టస్థానం ఉంది. మూర్తీభవించిన పవిత్రతే సన్న్యాసికి ఆభరణం. ఆ పవిత్రత అనే ఆయుధమే సర్వమత మహాసభలో ఒక హైందవ సన్న్యాసి అయిన వివేకానందుడు యావత్ ప్రపంచాన్ని జయించడానికి కారణమైంది. అంతేకాదు భవిష్యత్తులో తన వారసులని చెప్పడానికి వీలుగా నూతన సన్న్యాస సంప్రదాయంతో రామకృష్ణ సంఘాన్ని స్థాపించడానికి నాంది అయింది. అమెరికా శిష్యురాలు మేడమ్ కాల్వే, స్వామి వివేకానందలో 'విశేషమైన వ్యక్తిత్వం, పవిత్రత పూర్ణరూపంలో సంతరించుకొన్నాయి' అంటారు. జయహో విశ్వ వివేకానంద!!

ధ్యానసిద్ధుడు... ధీర మానవుడు: నరేంద్రుడు ధ్యానసిద్ధుడు. అతని బాల్యక్రీడ ధ్యానం. ఒకరోజు తన తోటి మిత్రులతో ధ్యానముద్రలో కూర్చొని ఉండగా పెద్ద తాచుపాము అటు వచ్చింది. దాన్ని గమనించిన తోటిమిత్రులు భయకంపితులై నరేంద్రుణ్ణి లేవమని అరుస్తూ పారిపోయారు. భగవద్ధ్యానంలో మునిగిపోయిన నరేంద్రుడికి ఆ మాటలు ఏవీ వినిపించలేదు. కాసేపటికి పాము ఎటో వెళ్ళిపోయింది. తర్వాత తన మిత్రులు అడిగితే, 'ధ్యానంలో ఉన్నప్పుడు నాకు బయటి విషయాలు ఏవీ తెలియవు' అని చెప్పాడు నరేంద్రుడు. జయహో వీర నరేంద్ర!!

ఒకసారి వివేకానంద అమెరికాలో భగవదనుభూతి అన్న విషయం మీద ప్రసంగించారు. ఆ అనుభూతి కలిగిన వ్యక్తి ఏ పరిస్థితిలోనూ కలత చెందదు, ఆందోళన చెందదు అని చెప్పారు. ఈ విషయాన్ని పరీక్షించదలచుకున్న కొందరు యువకులు,

స్వామీజీని ప్రసంగించడానికి ఆహ్వానించారు. ఒక్క చెక్కపెట్టెను తలక్రిందులుగా చేసి, 'ఇదే వేదిక! దీని మీద నిలబడి ప్రసంగించాలి' అన్నారు. స్వామీజీ ఎలాంటి అభ్యంతరమూ లేకుండా అంగీకరించారు.

స్వామీజీ ప్రసంగంలో లీనమై, పరిసరాలను మర్చిపోయారు. కాసేపట్లో చెవులు చిల్లులు పడే శబ్దంతో తుపాకులు పేలసాగాయి. కొన్ని తూటాలు స్వామీజీ చెవుల ప్రక్కగా పోసాగాయి. స్వామీజీ ఏ మాత్రం కలత చెందకుండా తన ప్రసంగాన్ని కొనసాగించారు. ఆ యువకులు పశ్చాత్తాపపడి, క్షమించమంటూ స్వామీజీని వేడుకొన్నారు. జయహో విశ్వ వివేకానంద!!

జ్ఞానసూర్యుడు – దైవప్రేమికుడు: నరేంద్రుడు, సప్తర్షి మండలం నుండి అవతరించిన భానుతేజుడని శ్రీరామకృష్ణులు గుర్తించారు. చిన్ననాటి నుండి అతనిలో జ్ఞానం, శక్తి నిరంతరం ప్రవహిస్తూ ఉండేవి. 'ఆ శక్తిని భరించడానికి లోకం సిద్ధంగా లేదు... ప్రపంచానికి బోధించడానికి వచ్చాడు నరేంద్రుడ'ని



శ్రీరామకృష్ణులు తరచూ అనేవారు. జయహో వీర నరేంద్ర!!

వివేకానందుడు సర్వమత మహాసభలో పాల్గొనడానికి పరిచయపత్రం అవసరమని తెలుసుకొన్నారు. అందుకు ప్రొఫెసర్ సహాయాన్ని కోరగా, 'సర్వమత మహాసభలో మాట్లాడడానికి పరిచయపత్రం మిమ్మల్ని అడగడం, సూర్యుడు ప్రకాశించడానికి అనుమతి కోరడం లాంటిదే' అని ప్రొఫెసర్ అన్నాడు. 'మన ఆచార్యులందరినీ ఏకం చేసినా వారంతా వివేకానందుడి జ్ఞానానికి సాటిరారు' అని ప్రొఫెసర్ హెన్రీ రైట్, సర్వమత మహాసభ నిర్వాహకులకు సిఫార్సు చేశారు. ఆయన సాహచర్య భాగ్యం కలిగిన చాలా మంది శిష్యులకు భగవంతుడే వివేకానందుడు రూపంలో వచ్చారన్న అనుభూతి కలిగింది. **'నా వెనుక ఉన్న శక్తి వివేకానందుడు కాదు. భగవంతుడే. ఆయనకు తెలుసు ఏది మంచిదో'** అంటారు స్వామీజీ. జయహో విశ్వ వివేకానంద!!

పరోపకారమే పరమావధి: మహాత్ములు ఇతరులకు ఉపకారం చేయడానికి వెనుకాడరు. నరేంద్రుడికి చిన్నతనం నుంచే సాహసం చేయడమనే నైజం అబ్బింది. ఆరేళ్ళ వయస్సులో ఉన్నప్పుడు బంధువులతో కలసి తీర్థయాత్రకు వెళ్ళారు. తిరిగి వస్తున్నప్పుడు జనసందోహంలో మిత్రుడు కనిపించలేదు. అది గుర్తించిన నరేంద్రుడు వెనక్కు తిరిగి చూసేసరికి, వాయువేగంతో గుర్రపుబండి తన మిత్రుడి వైపుగా రావడం గమనించాడు. ఒక్క క్షణంలో పరుగున వెళ్ళి తన మిత్రుడిని పట్టుకొని మరొకవైపు దొర్లాడు. ఒక్క క్షణం ఆలస్యమైనా మిత్రుడి ప్రాణాలు దక్కేవి కావు. జనసమూహంలోని వారు నరేంద్రుని సాహసాన్ని చూసి దిగ్భ్రాంతులయ్యారు. కొంతమంది ఆశీర్వదించారు. అది విన్న నరేంద్రుడి తల్లి "నరేంద్రా! వీర పురుషునిగా వర్ధిల్లు" అని ఆశీర్వదించింది. జయహో వీర నరేంద్ర!!

స్వామీజీ వీర పురుషునిగా సముద్రాన్ని లంఘించి, భారతదేశపు దక్షిణాగ్రంలోని ఆ మహాశిల మీద కూర్చొని యావద్భారతదేశాన్ని స్మరించి ధ్యానమగ్నులయ్యారు. భారతీయుల దుర్భర దారిద్ర్యం, విద్యావిహీనత ఆయన కళ్ళ ముందు ప్రత్యక్షంగా కనబడ్డాయి. అజ్ఞానమనే కోరలలో నలిగిపోతున్న జాతి కోసం ఆయన పరితపించారు. భారతదేశంలో ఉన్న ఆధ్యాత్మిక సంపదను పాశ్చాత్యదేశాలకు తెలియజేసి, ఆ వచ్చిన విరాళాలను తీసుకొని మాతృదేశానికి వచ్చి, భారతీయ పునరుద్ధరణ యత్నంలో నిమగ్నమవ్వాలని సంకల్పించారు. ఆయన తన తపనను అమెరికా శిష్యురాలితో, **'అమ్మా! నేను మతాన్ని బోధించడం లేదు. నా ప్రజల కోసం నా మేధను అమ్ముతున్నాను'** అన్నారు. జయహో విశ్వ వివేకానంద!!

నరేంద్రుడి చిన్నతనంలో పొడసూపిన లక్షణాలు, భావి స్వామి వివేకానందలో ఎలా ప్రతిధ్వనించాయో చెప్పడానికి ఇవి కొన్ని ఉదాహరణలు మాత్రమే! నరేంద్రుడు చిన్ననాటి నుంచి నియమానుసారం వ్యాయామం చేసి నిర్మించుకున్న శరీరం, ఎత్తైన ఆకారం, దీనత్వం కానరాని ధీరత ఆయన వ్యక్తిత్వానికి రాచఠీవిని తెచ్చిపెట్టాయి. ఎల్లవేళలా జాగృతమయ్యే ఆత్మవిశ్వాసం, సద్గుణాలతో కూడిన అంతరంగం, ధ్యానం వల్ల ధ్యానశక్తి, తపోశక్తి – ఇవే నరేంద్రునిలో సంతరించుకున్న విశిష్ట లక్షణాలు. ఈ లక్షణాలను ఆచరణలో పెట్టే యువతరం కోసం స్వామీజీ పరితపించారు.

సమాజంలో పేరుకుపోయిన దోషాలు భారతీయ ఉన్నతిని నిరోధించేవిగా ఎంచి, వాటి నిర్మూలనకు యువకులను సన్నద్ధం చేశారు. 'సత్ప్రవర్తనను అలవరచుకొని, వ్యక్తిగత సమస్యలనే కాక, దేశ సమస్యలను కూడా పరిష్కరించే సత్తా యువతరానికి మాత్రమే ఉంద'ని స్వామీజీ విశ్వసించారు. దానినే యువకులకు ఉద్బోధించారు.

స్వామి వివేకానంద సందేశంతో పరిచయం ఏర్పడితే యువతరంలో మానసిక వికాసం కలుగుతుంది, వివేకం వృద్ధి చెందుతుంది, శాశ్వత పరిణామం చేకూరుతుంది. ❖



ఎవరికీ తలవంచకు

– బి. సైదులు

కార్యదక్షతలో, కర్తవ్యదీక్షలో నిజాయతీని బలిపశువును చేయకూడదనీ... అడుగడుగునా ఆత్మవంచనతో అనామక జీవితాన్ని గడిపి ప్రయోజనం లేదనీ నమ్మే నిప్పు లాంటి అధికారిణి ఆమె. ఆత్మగౌరవాన్ని అంగడిలో అమ్ముకునే అలవాటు లేని అలాంటి ఆ ధీశాలికి ఉద్యోగనిర్వహణలో ఎన్నో ప్రలోభాలు, పరాభవాలు ఎదురయ్యాయి. తను నమ్ముకున్న విలువలకూ, నిర్వహించే బాధ్యతలకూ మధ్య నిరంతరం సంఘర్షణ తలెత్తుతూనే ఉండేది. అయినా ఆమె ఏనాడూ తలవంచి తన ఓటమిని అంగీకరించ లేదు; వ్యక్తిగత ప్రయోజనాల కోసం తన వృత్తి ధర్మాన్ని పణంగా పెట్టలేదు. ఏడేళ్ళ తన కూతురి ప్రాణాపాయ స్థితిలో కూడా, కన్నపేగు కన్నీటిని కడుపులోనే దాచుకున్నారు; కానీ కర్తవ్యాన్ని మాత్రం విస్మరించలేదు. వృత్తిలో అడుగు పెట్టినప్పటి నుంచి పదవీ విరమణ వరకు అదే నిబద్ధతతో నడిచారు. సత్యానికీ, న్యాయానికీ తప్ప ఎవరికీ తలవంచని వ్యక్తిగా, ఈనాటికీ ఆమె సమాజసేవకు కృషి చేస్తున్నారు. ఆమే – భారతదేశ తొలి మహిళా ఐ.పి.ఎస్. అధికారిణి కిరణ్ బేడి.

ఇటీవల ఓ సందర్భంలో యువతీ యువకులతో ఆమె మాట్లాడుతూ, 'మన జీవనపయనంలో ఆత్మాభిమానాన్ని భంగ పరచే పరిస్థితులు ఎన్నో ఎదురవుతూ ఉంటాయి. లక్ష్యసాధనలో కావచ్చు, కష్టపడి లక్ష్యానికి చేరుకున్నాక కావచ్చు! కానీ ఎట్టి పరిస్థితుల్లోనూ మనం దిగజారకూడదు. మన ఉన్నతి ఒకరి దయాదాక్షిణ్యాలపై ఆధారపడి ఉండకూడదు. మీరు నిజాయతీగా ఉండాలనుకున్నప్పుడు, నైతికపథాన్నే ఎంచుకున్నప్పుడు పరీక్షలూ అదే స్థాయిలో ఎదురవుతాయి. వాటన్నింటికీ సిద్ధపడండి; కాస్త వేచి ఉండండి; తుదకు తప్పకుండా మీ మాటే నెగ్గుతుంది; మీ వైపే ప్రపంచమంతా మొగ్గుతుంది' అంటారు. కానీ మనలో చాలామంది దీనికి విరుద్ధంగా, మనస్సును చంపుకొని, సొంత ఆలోచనలు, ప్రణాళికలు ఏవీ లేకుండా, తమ ప్రత్యేకతను నిరూపించుకుందామన్న తపన లేకుండా, ఎప్పుడూ వేరెవరో ఇచ్చే ఆజ్ఞలను శిరసా వహిస్తూనే కాలాన్ని గడిపేస్తూ ఉంటారు.

ఎన్నాళ్ళీ ఆత్మవంచన? : నేటితరం యువతలో ఉదాసీనతకు ప్రధాన కారణం ఈ ఆత్మవంచనే! వందల సంవత్సరాలు మనం పరాయిపాలనలో గడిపిన ఫలితం వల్లనో, మరే కారణం వల్లనో మనలో చాలామంది నిరంతరం ఆత్మను చంపుకొని బతికేస్తూ ఉన్నారు. నచ్చిన ఉద్యోగాన్ని సంపాదించుకోలేరు; అలాగని వచ్చిన ఉద్యోగాన్ని ఆనందంగా చేయనూ లేరు. ఇలాంటి సమయాల్లో తెలియకుండానే మనలో ఒక బానిస వైఖరికి బీజం పడుతుంది. ఇలా ఎదిగిన మన జీవనవృక్షం కడవరకూ కుక్క మూతి పిందెలనే అందిస్తుంది; అందుకే మనలో చాలామంది కార్యాలయాల్లో ఎప్పుడూ ఏదో అసంతృప్తిగా, కళాహీనమైన ముఖాలతోనే కనిపిస్తూ ఉంటారు. పైగా అల్ప ప్రయోజనాల కోసం కనపడిన ప్రతి ఒక్కరి ముందూ సాగిలపడిపోతూ ఉంటారు. అవకాశం వచ్చినప్పుడైనా మనస్సులోని మాటను ధైర్యంగా, స్పష్టంగా చెప్పలేకపోతే ఏం లాభం? ఇలాంటి మనస్తత్వంతో మనం ఏ స్థాయికి వెళ్ళినా మన మనుగడలో కళాకాంతులు ఉండవు. అందుకే డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ గారు తమ 'లివింగ్ విత్ పర్పస్' అన్న పుస్తకంలో 'నిజమైన గొప్పవారు హోదాలు, సంపదలు, ఆస్తులు, పేరుప్రతిష్ఠలు కలిగినవారు కాదు; తనలోని సత్యం ముందు సాక్షిగా నిలబడి ఎంత మూల్యం చెల్లించాల్సి వచ్చినా రాజీపడని వారే గొప్పవారు. వాళ్ళు సరైనదని నమ్మినదాన్ని ఆచరించడానికి నిబద్ధులై ఉంటారు. మనం వాళ్ళ శరీరాలను బాధపెట్టవచ్చు; వారికి సౌకర్యాలను నిరాకరించవచ్చు. కానీ ఆత్మలను కొనలేం. అలాంటి ఆత్మశక్తి కలిగినవారే మహాత్ములు' అంటారు. అయితే మొండితనం, మంకుపట్టు, మూర్ఖత్వం వేరు; అణకువతో, ఆత్మవిశ్వాసంతో నమ్మినదానికి కట్టుబడి ఉండడం వేరు.

వెనుక మాటలకు స్వస్తి పలుకుదాం: మనస్సులో గౌరవం లేకుండా, తెచ్చిపెట్టుకున్న వినయంతో ఒకరి ముందు తల వంచినప్పుడు ఆ కపటత్వం మరో రూపంలో మరోచోట బయటపడుతుంది. అందుకే చాలామంది తమ ఉన్నతాధికారులపై, తాము చేతులు కట్టుకొని ఎవరి వెంట

తిరుగుతున్నామో వారిపై కడుపులో రగులుతున్నదంతా చాటుమాటున వెళ్ళగక్కుతూ ఉంటారు.

ఇది మన వ్యక్తిత్వానికే మాయనిమచ్చగా మిగిలిపోతుంది. నలుగురిలో మనల్ని పలుచన చేసేస్తుంది. బానిస లక్షణమైన ఈ 'వెనుక మాటలు' మనలో అసంతృప్తి జీవనానికీ, అల్పబుద్ధులకూ కారణమవుతాయి. పైగా మన అతి వినయాలు ఎప్పుడో ఒకప్పుడు ధూర్తలక్షణాలుగా రంగు తేలతాయి. అందుకే ఇలాంటి మనస్సులో లేని మర్యాద గురించి, పైపై గౌరవాల గురించి స్వామి వివేకానంద ప్రస్తావిస్తూ, What queer humility is this? అంటూ దునుమాడతారు. ఇలాంటి mock modestyని – అంటే నక్క వినయాన్ని విడిచిపెట్టమంటారు. చివరకు...I tell you. Off with such a self-debasing spirit... అంటూ ఇలాంటి ఆత్మవంచన పనులను వెంటనే త్యజించమంటారు. ఏ వ్యక్తి ముందైనా, ఏ పరిస్థితి ఎదురైనా బానిసగా మారకుండా ఆత్మశక్తి మనల్ని ఎప్పుడూ ఊర్ధ్వస్థితిలోనే ఉంచేందుకు విశ్వప్రయత్నం చేస్తూ ఉంటుంది. కానీ మనమే దాని నోరునొక్కుతూ బలహీనులమని పదే పదే నిరూపించు కుంటూ ఉంటాం. మనస్సును చంపుకొని ఒకరి ముందు దాసోహమంటే, దానికి వ్యతిరేకంగా అదే స్థాయిలో అహంకారం, ఆధిక్యం మరోచోట ప్రస్ఫుటమవుతుంది. ఈ ఫలితంగానే మనలో చాలా మంది ఇంట్లో భార్య ముందు, పిల్లల ముందు, ఇతరుల ముందు అనవసరంగా విరుచుకుపడుతూ, అసహనానికి గురవుతూ ఉంటారు. ఒకచోట అసహజంగా వంచిన తలే, మరో చోట విపరీతంగా విర్రవీగుతుందని మరచిపోకూడదు.

అంతరాత్మ అనే అద్దంలో చూసుకుందాం: అహంకారంతో మనస్సులో ఉన్నదంతా ఎదుటివారి ముందు కుండబద్దలు కొట్టినట్లుగా చెప్పనవసరం లేదు. కానీ అవసరమైనప్పుడు సమయోచితంగా మన అభిప్రాయాన్ని వ్యక్తం చేయ గలిగి ఉండాలి. పరిస్థితులనూ, వ్యక్తులనూ నిష్పక్షపాతంగా చూడగలిగి ఉండాలి. ఎదుటివారికి విలువనిస్తూనే, మరోవైపు మన అస్తిత్వానికి భంగం వాటిల్లకుండా జాగ్రత్తపడాలి. ...Otherwise we become goody-goody and anybody may handle us. That should not be... అంటారు స్వామి రంగనాథానంద మహరాజ్. ఎవరు పడితే వారికి మన ఆంతరంగిక పరిధిలోకి అడుగుపెట్టే అవకాశం ఇవ్వకూడదు. మన అంతరాత్మకూ, బాహ్య ప్రపంచానికీ మధ్య సామరస్యం కుదరనప్పుడు చివరకు మన అంతరాత్మ నిర్ణయాన్నే తుదితీర్పుగా స్వీకరించాలి. అయితే అది పూర్తిగా అహంకార రాహిత్యంతో, ఎలాంటి పక్షపాతం లేకుండా సంయమనంతో తీసుకున్న నిర్ణయమై ఉండాలి. అందుకే మన సనాతన ధర్మం...

ఆత్మనో గురుః ఆత్మైవ పురుషస్య విశేషతః
యత్ ప్రత్యక్షానుమానాభ్యాం శ్రేయోసా అనువిందతే...

అంటుంది. మనిషికి తన అంతరాత్మే గురువు. మనిషి ప్రత్యక్షానుభవం వల్ల, పరీక్షలు, ప్రమాణాల వల్లా తన శ్రేయస్సును తాను సాధించుకుంటాడని స్పష్టం చేస్తుంది. ఇలా ఒక్కసారి మన అంతరాత్మతో మనం అనుబంధం ఏర్పరచుకుంటే, ఆ అద్దంలో మనల్ని మనం చూసుకోవడం అలవాటు చేసుకుంటే, ఇక మనం వేరెవరి ముందూ చేతులు కట్టుకోవలసిన అగత్యం తలెత్తదు. వేరెవరో మనల్ని వేలెత్తి చూపే దుఃస్థితి దాపురించదు. ఇలా మనం మన మనుగడనే కాకుండా, మన చుట్టుపక్కల వారి నడవడికను కూడా ప్రభావితం చేయగల కేంద్రబిందువుగా మారగలుగుతాం. ఇలాంటి స్థితికి చేరుకుంటే సమాజపరంగా పెద్దపెద్ద హోదాల్లో లేకపోయినా, మీ పరిధిలో మీరు ఒక ప్రత్యేకమైన వ్యక్తిగా రాణించగలుగుతారు. అలా ఎంతోమంది నేడు చిన్న చిన్న ఉద్యోగాలు, పనులు చేసుకుంటూ కూడా, ఏ మాత్రం ఆత్మాభిమానం కోల్పోకుండా, స్వతంత్ర భావాలతో, వేరెవరికీ దాస్యం చేయకుండా, ఆదర్శనీయమైన జీవితాల్ని గడుపుతున్నారు. నిజానికి మనకు మనం కాకుండా పోయినప్పుడు, కలెక్టర్ ఉద్యోగం చేసి మాత్రం ఏం లాభం?

సూర్యచంద్రులమవుదాం! : సూర్యుడు బుద్ధికీ, చంద్రుడు హృదయానికీ ప్రతీక! అలాగే మన జీవనాకాశంలో సూర్యచంద్రులు ఇద్దరూ ప్రకాశిస్తూ ఉండాలి. ఎప్పుడు సూర్యకిరణాలు ప్రసరించాలో, ఎప్పుడు చంద్రరేఖలు పలకరించాలో విజ్ఞతతో గుర్తించగలగాలి. మన కళ్ళ ముందు ఏదైనా అన్యాయం జరుగుతున్నప్పుడు నిర్భీతిగా ప్రశ్నించే వేళలో

> **ఇదే నా విజయసూత్రం...**
>
> **నా జీవితంలో ముఖ్యమైంది పోలీసు అధికారి కావటమే కాదు; మానసికంగానూ, భౌతికంగానూ, చేతనాచేతనస్థితిలో మనోబలంతో ఒంటరిగా పోరాడటానికి సిద్ధపడి ఉండటం. ఈ స్థితే నన్ను ఎవరి చేతా నిందలపాలు కాకుండా, నిబద్ధతతో నిలబడేట్లు చేసింది. ఒకరికి చేయందించటానికే కాని, ఒకరి చేయూత కోసం వేచి ఉండే స్థితిలో మనం ఉండకూడదు. ఒకరి కష్టసుఖాలలో పాలుపంచుకోవటానికే తప్ప, ఒకరి దయాదాక్షిణ్యాలపై ఆధారపడటానికి ఇష్టపడకూడదు. ఈ స్థితే మనిషి అభివృద్ధికి పునాది. - కిరణ్ బేడీ**



మనలో ప్రచండ భానుడు ప్రజ్వలించాలి; నిర్ద్వంద్వంగా మన నిరసనను తెలియజేయాలి. అందుకే 'కాటేయ కపోయినా బుసకొట్టగలిగి ఉండాలి; లేకపోతే మనల్ని పాము కాదు తాడనుకుంటారు'ని హితవు పలుకుతారు శ్రీరామకృష్ణులు.

అయితే ఒకరికి మన ఓదార్పు, చేయూత అవసరమైనప్పుడు మాత్రం మనస్సు నవనీతమవ్వాలి; నెలవంక కావాలి. ఇలా ఎప్పుడు ఎలా స్పందించాలో తెలుసుకొని ఓ వైపు మన ఆత్మగౌరవం మసకేయకుండా, మరోవైపు మనలో అహంకారం చెలరేగకుండా, వినయాన్ని వీడకుండానే తల ఎత్తుకొని జీవించడానికి ఈ నూతన సంవత్సరంలో కంకణ బద్ధులమవుదాం. ❖

నా వత్సలారా! ధైర్యవంతులై జీవించండి. మహోన్నతమైన సత్యాలను ప్రకటించడానికి ఏమాత్రమూ వెనుకాడకండి. ఎలాంటి పరిస్థితుల్లోనూ ధైర్యాన్ని కోల్పోవద్దు. - స్వామి వివేకానంద

నిప్పును చల్లార్చేది నీళ్ళే!

– శ్రీమతి సుధామూర్తి, ఇన్ఫోసిస్ ఫౌండేషన్

అహంకారం చాలామందిని కన్నూమిన్నూ కానకుండా ప్రవర్తించేలా చేస్తుంది. లేనిపోని భేషజాలతో ఎదుటివారి ముందు పంతాలకు పోనిస్తుంది. వ్యక్తిగతంగా నేను ఎప్పుడూ ఎదుటివారి అహాన్ని సంతృప్తి పరచడానికి నన్ను నేను తక్కువ చేసుకోలేదు; కానీ నా వల్ల ఒకరికి మంచి జరుగుతుందంటే మాత్రం నేను 'తగ్గితే తప్పేమీ లేదు' అన్నట్లుగానే నడచుకుంటాను. ఎదుటివారి అహమనే నిప్పును మన సహనమనే నీటి చుక్కే చల్లారుస్తుందని నేను గాఢంగా నమ్ముతాను. నా జీవితంలో జరిగిన అలాంటి అనుభవాన్ని నేను ఎన్నటికీ మరచిపోలేను.



పారిశ్రామికవేత్తగా ఎదిగిన నా మిత్రుడు రాకేష్ కొన్నేళ్ళ క్రితం నాకు ఫోన్ చేసి 'మా ఫ్యాక్టరీలో స్కూల్ బ్యాగులు తయారుచేస్తామని తెలుసు కదా! చిన్న చిన్న లోపాలున్న బ్యాగుల్ని తక్కువ ధరకు అమ్మేస్తూ ఉంటాం. గ్రామీణ పిల్లల కోసం మీరు నడిపే పాఠశాలలకు వాటిని ఉచితంగా ఇద్దామనుకుంటున్నాను' అన్నాడు. రాకేష్ ఉదారతకు సంతోషిస్తూ, 'చాలా కృతజ్ఞతలు రాకేష్! నేను ఆ పాఠశాలల జాబితాను ముందు మీకు పంపుతాను. విద్యార్థులకు పంపిణీ చేశాక, ఆ వివరాలనూ అందజేస్తాను' అన్నాను.

అతను పెద్దగా నవ్వేసి 'అదంతా ఏమీ అవసరం లేదు. నాకు మీపై, మీ సంస్థపై నమ్మకం ఉంది. ప్రతి ఏడాదీ మే నెలలో పాఠశాలలు తెరిచే ముందు బ్యాగులు తీసుకెళ్ళండి!' అన్నాడు రాకేష్.

అప్పటి నుంచి రాకేష్ పుణ్యమా అని చాలా గ్రామాల్లో పిల్లలకు స్కూల్ బ్యాగులు అందుతూ ఉన్నాయి. ఏటా ఆ ఫ్యాక్టరీకి మా మేనేజర్ వెళ్ళి బ్యాగులు తెస్తూ ఉండేవారు. కొన్నేళ్ళ తరువాత రాకేష్ తన వ్యాపార బాధ్యతలను అల్లుడు భరత్‌కు అప్పగించాడు. అతడు ఢిల్లీకి వెళ్ళిపోతూ 'బ్యాగుల సంగతి భరత్‌కు చెప్పాను. యథావిధిగా మీరు వాటిని తీసుకువెళ్ళొచ్చు' అన్నాడు.

మా పద్ధతి ప్రకారం ఏప్రిల్ నెలలో భరత్‌కి స్కూల్ బ్యాగుల కోసం ఇ-మెయిల్ ఇచ్చాను; సమాధానం రాలేదు. మే నెలలో ఎప్పటిలాగే మా మేనేజర్ బ్యాగులు తీసుకురావడానికి వెళ్ళినప్పుడు, భరత్ 'మీ మేడమ్ వచ్చి నన్ను కలిసేదాకా బ్యాగులు తీసుకెళ్ళకండి' అన్నాడు కటువుగా! దాంతో మా మేనేజర్ నాకు ఫోన్ చేశాడు. 'అతనిని కలవాల్సిన బాధ్యత నాదేలే' అని, నా పనులు ముగించుకొని మరునాడు భరత్ దగ్గరకు వెళ్ళాను.

నేను వెళ్ళగానే 'నాకు చెప్పకుండా బ్యాగులు తీసుకు వెళుతున్నారేంటి?' అన్నాడు భరత్. 'మీకు అప్పుడే ఇ-మెయిల్ చేశానండీ! పదేళ్ళ నుంచి ఇలాగే జరుగుతోంది. రాకేష్‌గారే ఈ పద్ధతి మొదలుపెట్టారు' అన్నాను.


'అదంతా వదిలేయండి. ఇప్పుడు నేను కొత్తగా వచ్చాను. మీరు వచ్చి నన్ను కలవాల్సిన అవసరం లేదా? నా అనుమతి లేకుండా ఈ బ్యాగులు ఎలా తీసుకువెళతారు? ఇ-మెయిల్ అందలేదు. మళ్ళీ పంపండి; అప్పుడు ఆలోచిస్తాను' అన్నాడు భరత్.

ఆఫీసుకు వచ్చి ఇ-మెయిల్ పరిశీలించాను. నిజానికి, అది అప్పటికే భరత్‌కు చేరింది. అందకపోవడం కాదు; అసలు సమస్య భరత్ అహమని నాకు అర్థమైంది. భరత్ తన ప్రాధాన్యాన్నీ, ఉనికినీ నాకు తెలియజేయడం కోసమే అలా ప్రవర్తించాడు. దానికి నేనేమీ బాధపడలేదు. ఆ బీదపిల్లలకు మేలు కలుగుతుందంటే, ఆ యువకుడి అహాన్ని సంతృప్తి పరచడానికి నేను వెళ్ళి అతని ముందు చేతులు కట్టుకొని నిలబడటానికి కూడా వెనుకాడను. భరత్‌కు ఇ-మెయిల్ మళ్ళీ పంపాను.

అనుకున్నట్లుగానే మరునాడు ఉదయమే ఫోన్ వచ్చింది. 'మేడమ్! మీ ఇ-మెయిల్ ఇప్పుడే వచ్చింది. బ్యాగులు తీసుకువెళ్ళొచ్చు' అన్నాడు భరత్. 'మీకు సమాచారం సరిగ్గా ఇవ్వలేకపోయినందుకు మన్నించండి భరత్! ఇక నుంచి ప్రతి ఏప్రిల్ నెలలో మీకు ఉత్తరం రాస్తాను. బ్యాగులు అందుకున్నాక కృతజ్ఞతలతో మరో ఉత్తరం రాస్తాను' అన్నాను.

'ఇంకేమీ అక్కరలేదు మేడమ్! ఉత్తరాలూ అవసరం లేదు. మీపై నమ్మకం ఉంది' అన్నాడు భరత్. అప్పుడు 'A fire cannot be extinguished with another fire. It is only water that can make a difference – నిప్పును చల్లార్చేది నీళ్ళే కానీ నిప్పు కాదు' అని నేను ఎప్పుడో కళాశాలలో చదువుకున్న వాక్యాలు గుర్తొచ్చాయి. 'ఎదుటివారిలో అహంభావం జ్వాలగా ఎగిసినప్పుడు, సహనమనే నీటి చుక్కను చిలకరిస్తేనే అది చల్లారుతుంది' అని గ్రహించాను. ❖

సేకరణ: జి. సతీష్



పనికి ముందుందాం!

–స్వామి రంగనాథానంద

(రామకృష్ణ సంఘ 13వ సర్వాధ్యక్షులు)

నేను ఉన్నత పాఠశాలలో ఉన్నప్పుడు మా ఊరి గ్రంథాలయంలో మెకాలే రాసిన ఓ చిన్న పుస్తకాన్ని చదివాను. అందులో ఆ రచయిత, తమ ఉపాధ్యాయుడు జాన్ స్టార్ట్ మిల్ చెప్పిన కొన్ని మంచి మాటల్ని ప్రస్తావించారు. విద్యార్థి దశ నుంచే మనం పెంచి పోషించుకోవలసిన కొన్ని సద్గుణాలకు సంబంధించిన ఎన్నో సూచనలు అందులో ఉన్నాయి. ముఖ్యంగా హక్కులు, బాధ్యతల విషయంలో తమ గురువు జాన్ స్టార్ట్ మిల్ 'It is always advisable to be in the forefront of opportunity in matters of enterprise and in the backyard of opportunity in matters of indulgence' 'ఏదైనా సత్కార్యాన్ని తలపెట్టినప్పుడు పూనికతో ముందు వరుసలో ఉండేందుకు ఉత్సాహాన్ని చూపాలి. సుఖాలు, సౌకర్యాలు అనుభవించాల్సి వచ్చినప్పుడు నీవు చివరి వరుసలో ఉండాలి' అని అనేవారని మెకాలే గుర్తుచేసుకున్నారు.

మనమందరమూ ఆచరణలో పెట్టాల్సిన సూత్రమిది. విద్యార్థుల వసతిగృహాల్లో చూస్తూ ఉంటాం – కొందరు విద్యార్థులు భోజన ఏర్పాట్లనగానే ఉత్సాహంగా ముందుకు వస్తారు. ప్రతి పనిలోనూ సాయపడుతూ ఉంటారు. కానీ చాలామంది విద్యార్థులు భోజనమంతా తయారై, వడ్డనకు సిద్ధం చేసి గంట కొడితే అప్పుడు కదులుతారు. ఇలా బాధ్యతలంటే విముఖత చూపుతూ, హక్కులకు మాత్రం 'మేమున్నా'మంటూ ముందు నిలబడేవారు, ఒళ్ళు దాచుకునేవారు ఎప్పటికీ సమాజంలో గౌరవాన్ని పొందలేరు.

ప్రతి ఇంట్లో పని అనగానే ముందుకు కదిలేటట్లు చిన్నారులను తల్లితండ్రులు ప్రోత్సహించాలి. కానీ చాలా ఇళ్ళలో దీనికి విరుద్ధంగా పిల్లలను తయారు చేస్తూ ఉంటారు. మనకు ఏదైనా లాభం ఉందంటేనే ఆ పని పట్ల ఆసక్తి చూపుతాం. అది నలుగురి సంక్షేమానికి సంబంధించిన స్వచ్ఛంద సేవా కార్యక్రమమంటే మనకెందుకు లెమ్మని ముఖం చాటేస్తాం. ఇది నిజమైన పౌరుడి లక్షణం కాదు. పెద్దవారు తమ ప్రవర్తనతో 'నీకు లాభం ఉంటేనే ఏదైనా చేయి; వేరెవరి కోసమో నీవెందుకు శ్రమ తీసుకోవాలి?' అన్న సంకేతాలను పిల్లలకు ఇస్తూ ఉంటారు. కానీ ఇది భవిష్యత్తులో వారిని అవకాశవాదులుగా, స్వార్థపరులుగా తయారుచేస్తుంది. ఏదైనా ఒక మంచి పని జరుగుతున్నప్పుడు మన వంతు సాయం చేయాలన్న దృక్పథం మనలో పెరగాలి. పిల్లల్ని ఆ వైపు ఉద్యుక్తులను చేయడంలో పెద్దలు తమ వంతు పాత్రను పోషించాలి.

చదువుకున్నా నిరక్షరాస్యులే!: ఒకసారి ఓ విశ్వవిద్యాలయంలో యువ సమ్మేళనానికి ముఖ్య అతిథిగా వెళ్ళాను. దాదాపు మూడు వందల మంది విద్యార్థులు ఆ సమావేశానికి హాజరయ్యారు. అందులో చాలామంది విద్యార్థులను చూస్తూంటే ఆశ్చర్యమేసింది! వారు ఏ మాత్రం బాధ్యత లేకుండా, నిర్లక్ష్యంగా ప్రవర్తిస్తూ కుర్చీలపై తమ పేర్లు రాస్తూ అనుచితంగా ప్రవర్తించారు. వారు చదువుకోనివారేమీ కాదు. వారిలో కొందరు పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేస్తున్నారనీ, మరికొందరు ఆ యా విభాగాల్లో పరిశోధన విద్యార్థులుగా ప్రవేశాన్ని కూడా పొందారనీ ఆచార్యులు చెప్పారు.

కానీ ఏం లాభం? చదువుకున్న నిరక్షరాస్యులుగా ప్రవర్తించారు. ఇలాంటి విద్యార్థులు చాలా చోట్ల కనిపిస్తూ ఉంటారు. కొందరు హక్కులు, ఉద్యమాల పేరుతో ప్రజా ప్రయోజనాలను పట్టించుకోరు. ప్రజల, ప్రభుత్వ ఆస్తులను కూడా ధ్వంసం చేస్తుంటారు. 'నేను ఇలా ప్రవర్తించవచ్చా?' అని విచక్షణతో ఆలోచించుకోలేనప్పుడు ఎన్ని పట్టాలు, చట్టాలు ఉండి ఏం లాభం? హుందాతనం, సభ్యత, నడవడికే మన విద్యకు ప్రామాణికత. ..There is reading of books, hearing lectures, memorizing something and passing examinations. But have you lit the fire of character and knowledge in yourself ?. ఎన్నో పుస్తకాలు చదువుతూ ఉంటారు; ఏవేవో ప్రసంగాలు వింటూ ఉంటారు; ఎన్నో విషయాల్ని మెదడులో దట్టించి పరీక్షల్లో ఉత్తీర్ణులవుతూ ఉంటారు! కానీ ఏం ప్రయోజనం? నీలో ఉత్తమ శీలసంపదతో కూడిన జ్ఞానాగ్ని ప్రజ్వరిల్లిందా? లేదా? అన్నదే ప్రధానం. అప్పుడే మీరు విద్యావంతులు, బాధ్యతాయుతమైన భావిభారత పౌరులు! ❖ **సేకరణ: ఆర్. కృష్ణ**

సోమరితనం పనికిరాదు. ఈర్ష్యాద్వేషాలను పారద్రోలండి. ఇనుము వేడిగా ఉన్నప్పుడే దానిని వంచివేయడం సులభం. ఆ తరుణం మించకముందే కార్యశీలురుకండి. - *స్వామి వివేకానంద*

(...18వ పేజీ తరువాయి)

రమ్మని పిలిచారు. వెంటనే నరేంద్రుడు ఆయన చెంతకు వచ్చాడు. రామకృష్ణులు అతడి చేయి పట్టుకొని, 'నీకు ఇదే సరైంది, నీకు ఇదే సరైంది' అంటూ నరేంద్రుణ్ణి తడుముతూ తన్మయులయ్యారు.

మరోరోజు కేశవ్‌బాబుతో మాట్లాడుతూ, 'నువ్వు గొప్పగా ప్రసంగించగలవు. నీ కన్నా పద్దెనిమిది రెట్లు మిన్నగా ప్రసంగించగల వక్త నరేన్' అని అన్నారు. రామకృష్ణుల మాటలకు కేశవ్‌బాబు ఏమాత్రం అసూయ చెందకుండా 'మీరు చెప్పినది నిజం. నేను కూడా అలాగే అనుకుంటున్నాను' అని తిరిగి సమాధానం ఇచ్చారు. అంటే ఈ ప్రపంచానికి బోధించడానికి నరేంద్రుడు అవతరించాడని శ్రీరామకృష్ణులు చెప్పకనే చెప్పారు.

శ్రీరామకృష్ణులు రుచికరమైన పౌష్టికాహారాన్ని నరేంద్రునికి తినిపిస్తూ, 'నరేంద్రుడు భవిష్యత్తులో ఎంతో కష్టమైన పనిని నిర్వర్తించాల్సి ఉంది' అని అతడి పట్ల ప్రత్యేక శ్రద్ధను కనబరిచేవారు. శ్రమకోర్చు కోవాల్సిన ఎన్నో పరిస్థితులు భవిష్యత్తులో నరేంద్రునికి ఉత్పన్న మవుతాయని తెలిసిన శ్రీరామకృష్ణులు వాటిని తట్టుకొని నిలబడే శక్తినీ, కర్తవ్యదీక్షనూ స్వామీజీలో పాదుగొల్పారు. జపసాధన, ధ్యానం వల్ల లభించే అనంతమైన ఆనందపుటంచులకు శ్రీరామకృష్ణులు, స్వామీజీని తీసుకు వెళ్ళారు. అదే ఆనందాన్ని సోదర సన్న్యాసులకు కూడా స్వామీజీ చవి చూపించారు. సోదర సన్న్యాసులకు పాటలు పాడడం, అలాగే తబలా తదితర సంగీత వాద్యాలను వాయించడం నేర్పించారు.



విదేశాల నుండి భారతదేశానికి స్వామీజీ తిరిగి వచ్చినప్పుడు ఆయనతో పాటు మిస్టర్ సేవియర్, గుడ్విన్ మొదలైన పాశ్చాత్య శిష్యులు కూడా వచ్చారు. విశ్వవిఖ్యాతుడై తిరిగి వచ్చిన స్వామీజీ అహంకారపూరితులవడానికి అవకాశం లేకపోలేదని స్వామి అద్భుతానంద (లాటూ మహరాజ్) మనస్సులో అనుకుంటూ ఉండగానే స్వామీజీ, 'సోదరా! నువ్వు నాకు అత్యంత ప్రియతముడవు. నేను ఎప్పటివలే నీ నరేన్‌నే!' అని అంటూ ఆప్యాయంగా లాటూ మహరాజ్‌ను ఆలింగనం చేసుకొన్నారు. ఆ సందర్భంలో లాటూ మహరాజ్, స్వామీజీలో మహోన్నత వ్యక్తినీ, ఆదర్శమూర్తినీ దర్శించారు.

అలాగే మరో సందర్భంలో లాటూ మహరాజ్, "నువ్వు విదేశాలకు వెళ్ళి కొత్తగా సాధించింది ఏముంది? గతంలో శంకరాచార్య, బుద్ధుడు ప్రబోధించిన సత్యాలనే మరలా నువ్వు వారి భాషలో చెప్పావు. అంతేకదా!" అని స్వామీజీతో అన్నారు. అప్పుడు ఏమాత్రం సంకోచించకుండా 'అవును. నువ్వు చెప్పింది నిజమే లాటూ!' అని వినయాన్ని ప్రదర్శించిన మహోన్నత వ్యక్తి స్వామీజీ.

స్వామీజీ ఎనలేని పేరు ప్రఖ్యాతులు సంపాదించినప్పటికీ ఆయనలో కించిత్తు అహమైనా లేదని సోదర సన్న్యాసులు గుర్తించారు. స్వదేశానికి వచ్చిన వెంటనే విదేశాల్లో ధరించిన దుస్తులనూ, బూట్లనూ వదిలేసి మునుపటి స్వామీజీ వలే కాషాయ వస్త్రాలు, పాదుకలు ధరించారు.

శ్రీరామకృష్ణులు చెప్పినట్లుగానే కామినీ కాంచనాలను గడ్డిపోచ కింద జమకట్టేవారు. గురువు నిర్దేశించిన పని కోసం సేకరించిన డబ్బును అందుకే ఖర్చుపెట్టారు కానీ అందులో నుండి ఒక్క పైసా కూడా తన సొంతానికి ఖర్చు చేయలేదు. సొంత తల్లి కష్టాల్లో ఉంటే ఖేత్రీ మహరాజ్‌ను సాయం అర్థించారే తప్ప, సేకరించిన డబ్బు జోలికి పోలేదు. అలాగే అమెరికాలో ఉండగా స్వామీజీని వివాహం చేసుకోవడానికి ఓ ధనికురాలు వెంటపడగా తాను సన్న్యాసిననీ, తనకు ప్రతి స్త్రీ తల్లితో సమానమనీ నచ్చజెప్పారు. శ్రీరామకృష్ణులు కామకాంచనాలను త్యజించమంటూ చేసిన ఉపదేశాన్ని ఆచరణలో చూపించారు స్వామీజీ. ఇలా చెప్పుకుంటూ పోతే ఈ ప్రియశిష్యుని గుణగణాలను వర్ణించడం మానవ మాత్రులకు సాధ్యం కాదు.

గురువు అందించిన సందేశాన్ని ఈ ఆధునికయుగంలో ఆచరణలో చూపించిన స్వామీజీ లాంటి శిష్యుడు మరొకరు కనిపించరు. ఆధ్యాత్మిక పరిమళాలను ఈ ప్రపంచంలో వ్యాపింపజేయడానికి నరేన్ అవతరించాడని ఓ సందర్భంలో శ్రీరామకృష్ణులు చెప్పారు. గురుదేవులు సూచించినట్లుగానే తన అవతారకార్యాన్ని ముగించుకొని, దివ్యలోకాలకు వెళ్ళిపోయిన ఓ మహోన్నత శక్తిపుంజం స్వామి వివేకానంద. ❖



(1884 – 1967)

ముందుకు సాగిపో!

దివ్యజనని శ్రీశారదాదేవి ప్రత్యక్ష శిష్యులైన స్వామి ప్రేమేశానంద (1884-1967) రామకృష్ణ సంఘంలో అత్యున్నత గౌరవాన్నీ, ప్రేమాభిమానాలనూ చూరగొన్న అగ్రశ్రేణి సన్యాసి. ఆయన జీవితం శ్రీరామకృష్ణ - వివేకానందుల ఆశయాలతోనూ, భగవద్గీత సారాంశంతోనూ నిండింది. చాలామంది యువతీ యువకులకూ, గృహస్థులకూ, బ్రహ్మచారులకూ, సన్న్యాసులకూ ఆయన ఎన్నో లేఖలు వ్రాశారు. జీవితంలో అంకితభావం, ఆధ్యాత్మిక, సేవా భావాలను అలవరచుకొనేందుకు ఆ లేఖా పరంపరలు మార్గదర్శకాలయ్యాయి. పాఠకుల ప్రయోజనార్థం విలువైన ఈ లేఖలను 'శ్రీరామకృష్ణ ప్రభ'లో 2009 జూన్ సంచిక నుంచి ధారావాహికంగా ప్రచురిస్తున్నాం.

సార్‌గాచీ,
27 జనవరి 1948

ప్రియమైన ప్రబోధ్!*

తీవ్రమైన నీ మానసిక అశాంతికి భగవత్కృప కన్నా మించిన మందు లేదు. రాత్రింబవళ్ళు వేలమంది ప్రజలు పడే తీవ్రమైన బాధలు చూడడం నాకు తప్పడం లేదు. ఎవరికీ ఏ కొద్దిపాటి సాయం కూడా చేయలేని నిస్సహాయులం మనం. కానీ వారి పట్ల జాలి చూపకుండా ఉండలేం. ప్రపంచమంతా బాధా భరితం. వార్ధక్యం, వ్యాధి, మరణం - ఇవి మానవుల్ని పీడిస్తున్న అంశాలు.

ఈ అనివార్యమైన బాధ నుండి విముక్తి పొందడానికి మన ఋషులు మార్గం సూచించారు. మనం దాన్ని కొంత వరకు మాత్రమే అవగాహన చేసుకున్నాం. ఈ సందర్భంగా ఒకటి రెండు అంశాలను నీ ముందుంచుతాను.

మనం చావు పుట్టుకల నడుమ నివసిస్తున్నామని భావించినప్పుడు, ఈ పుట్టుకకు ముందు నీవు ఎక్కడో అక్కడ ఉండి ఉండాలి. అయితే అప్పుడు నువ్వు ఈ ప్రబోధ్‌వి కాదు. ఈ శరీరం నీకు లేదు. కులం, దేశం, తల్లితండ్రులు, ఇప్పుడున్న నీ బాంధవ్యాలు అప్పుడు కచ్చితంగా లేవు. నీవు నీ తల్లి గర్భంలో పడగానే 'నేను' అనే దాన్ని మాత్రమే అర్థం చేసుకున్నావు. ఒక్కసారిగా నువ్వు ఈ 'శిథిలగృహం'లో ప్రవేశించగానే 'ఇదే నా ఇల్లు' అనే భావన, దీనికి సంబంధించిన సుఖదుఃఖాలు అన్నీ నీవేననే భావన ఏర్పడింది. నీవు అనవసరంగా ప్రబోధ్ అన్న పేరు గల ఈ శరీరమే నీవు అని ఊహించుకున్నావు. ఈ శరీరం గతంలో లేదు, భవిష్యత్తులో ఉండదు. 'నేను ఈ శరీరాన్ని కాను' అనే భావనను దృఢపర్చుకోగలిగితే, ఈ శరీరానికి కలిగే బాధను నీ బాధగా భావించి అనవసరమైన వ్యథ చెందవు. ఆధ్యాత్మిక సాధనల ముఖ్యోద్దేశం - శరీరం, ఆత్మ రెండూ వేరు వేరని తెలియజేయడమే.

నీవు ఒక అంశంలో నిమగ్నమైపోయి ఉన్నప్పుడు, గాఢ సుషుప్తిలో మునిగి ఉన్నప్పుడు నీకు నీ శరీరం, మనస్సుల గురించి స్పృహే ఉండదు. ఆ సమయంలో నీ శరీరంలో కలిగే బాధలు నీకు అనుభవానికి రావు. మనం ఈ ప్రపంచ నాటకరంగంపై కేవలం నటులం! అంతే! మనం నిజానికి ఎవరిమో మర్చిపోయాం. 'ప్రబోధ్' అనే ముసుగు ధరించావు. అంతేగాని నువ్వు ప్రబోధ్‌వి కాదు.

ఆ పరమాత్మ తన శరీరం నుండి ఒక 'మెరుపు తునక లాంటి భాగాన్ని' విసర్జించాడు. దానికొక మారువేషం వేశాడు- దాన్ని ప్రబోధ్ అని చూసేలా చేశాడు. కానీ నువ్వు ఒకప్పుడు ఆ పరమాత్మలో ఒక భాగమేనని గుర్తుపెట్టుకోవడానికి ప్రయత్నించు. అది నువ్వు గుర్తించకపోతే నీ బాధను ఏదీ పరిహరించలేదు. నీ బాధ తాత్కాలికంగా కనుమరుగైనా మళ్ళీ అది తిరిగి వస్తుంది. అది నిశ్చయం. యోగులందరూ దుఃఖాన్ని దూరంచేసే మార్గం ఇదొక్కటే అని చెబుతూ వచ్చారు. నువ్వు నీ ఇష్టదైవం యొక్క బిడ్డవనీ, ఆయన నుండి విడివడిన ఒక తునకవనీ, ఆయన అంక పీఠంపై కూర్చొని ఉన్నావనీ సదా జ్ఞప్తిలో ఉంచుకో. శాంతిని పొందడానికి ఇంత కన్నా వేరే మార్గం లేదు.

ప్రేమాశీస్సులతో
స్వామి ప్రేమేశానంద

తెలుగుసేత: కె. త్రివిక్రమరావు

(*ప్రబోధ్ భట్టాచార్య, స్వామి ప్రేమేశానంద మహరాజ్ సోదరుని తనయుడు.)

తల్లి హృదయం, శూరుని దీక్ష మలయమారుత మాధుర్యం - ఇలా ఎన్నియో సుగుణాలను నీవు పొందెదవుగాక! భావిభారత పౌరులకు నీవు మిత్రుడవై, సేవకుడవై వర్ధిల్లెదవుగాక! - స్వామి వివేకానంద

(...13వ పేజీ తరువాయి)

హరినామ జపమే ఆభరణంబులు,పరమాత్ముని నుతి పరిమళము
ధరణీధరు పాదసేవే భోగము, పరమం బెరగిన ప్రపన్నులకు

'భక్తుడికి శ్రీహరి నామజపమే ఆభరణం, ఆయనను ప్రస్తుతించడమే జీవితానికి పరిమళం, పరంధాముడి పాదసేవే వైభోగమ'ని ఈ వేంకటేశుడి భక్తాగ్రేసరుడు వర్ణించాడు.

మనలో చాలామందికి భగవంతుడికి సంబంధించిన గుణగానాలపై, పూజాది క్రతువులపై అంత గురి ఉండదు. అన్నింటినీ యథాలాపంగానే ముగించేస్తూ ఉంటాం. వ్యక్తిగత అవసరాలపై, గృహసంబంధ వ్యవహారాలపై ఉన్న శ్రద్ధాసక్తులు పరమాత్ముడి సేవాకార్యక్రమాలపై కనిపించవు. అందుకే శ్రీమద్భాగవతంలో పరీక్షిత్తుతో శుకమహర్షి...



హరి నెరుంగక యింటిలో బహు హాయనంబులు మత్తుడై
పొరలు చుండెడి వెర్రి ముక్తికి బోవ నేర్చునే? వాడు సం
సరణముం బెడ బాయడెన్నడు సత్య మా హరి నామ సం
స్మరణ మొక్క ముహూర్త మాత్రము చాలు ముక్తిదమౌ నృపా!

"రాజా! ఆ శ్రీహరి తత్త్వ విచారణ చేయకుండా 'ఈ మేడలు, మిద్దెలు నావి. వీరందరూ నా వారు. వీరు నా బంధువర్గము' అనుకుంటూ మమకారమనే మత్తులో పడి పొర్లాడేవాడికి ఎన్ని జన్మలు ఎత్తితే మాత్రం ముక్తి కలుగుతుంది? కలుగదు కదా! హరినామం ఒక్క ముహూర్త కాలం స్మరణ చేసినా ముక్తిని పొందుతార"ని పేర్కొంటాడు.

దేవుని ధ్యానమే దివ్యాన్నము

నిజమైన భక్తుడికి భుక్తి కూడా భగవన్నామమే! అలా ఎందరో భక్తశిఖామణులు తమ పాంచభౌతిక శరీరాన్ని కేవలం పరమాత్ముడి సేవకే అంకితం చేశారు. ఆ పరమపావనుల జీవనశైలిని అన్నమయ్య...

దేవుని ధ్యానము దివ్యాన్నంబులు, శ్రీవిభు భక్తే జీవనము
ఆ విష్ణు కైంకర్యమే సంసారము, పావనులగు యీ ప్రపన్నులకు

'పరమపావనులకు దేవుని ధ్యానమే దివ్యాన్నం, ఆ శ్రీపతి భక్తే జీవనం, ఆ శ్రీమహావిష్ణువు కైంకర్యమే సంసారం' అని విశ్లేషించాడు.

ఇంత ఆత్మీయంగా భగవంతుడికి దగ్గరై, ఆర్తితో, ఆర్ద్రతతో ఆయనను పిలిస్తే చెలిమితో చేరువవుతాడు. ఉదాహరణకు మరాఠా భక్తుడు చోఖామేళా సాక్షాత్తూ పాండురంగడే జీవితంగా బతికాడు. ఆ నామగానంలో మునిగి, గోడ కడుతూ అది కూలి సమాధి అయ్యాడు; వేణుగోపాలుడిలో లీనమయ్యాడు. ఆ శిథిలాల మధ్య చోఖామేళా పార్థివ శరీరంలో ఎముకలన్నీ 'విఠల, విఠల' అని నినదిస్తూ ఉండడం స్థానికులను ఆనందాశ్చర్యాలకు గురిచేసింది. అలా శరణాగతులైన భక్తులకు శ్రీహరి నామం సప్తధాతువులలో ఇంకిపోతుంది. అందుకే ఓ భాగవతుడు...

స్మృతే సకల కల్యాణ భాజనం యత్ర జాయతే ।
పురుషస్తమజం నిత్యం ప్రజామి శరణం హరిమ్ ॥

'జీవులు ఎవరిని స్మరించిన మాత్రాన సకల శుభాలు శీఘ్రంగా పొందగలుగుతున్నారో, అలాంటి నిత్య, శుభకర కల్యాణ స్వరూపుడైన పురుషోత్తముని నేను శరణుజొచ్చుచున్నాన'ని వెల్లడిస్తాడు.

శ్రీవేంకటేశుడే సర్వము!

భగవాన్ శ్రీరామకృష్ణులు తమ అవతారకాలంలో తమ భక్తుల పారమార్థిక ఉన్నతికి పరోక్షంగా ఎంతో సహకరించారు. అవతార పరిసమాప్తి వేళలో ఓ శుభదినాన కల్పతరువై కరుణించారు. ఆ శుభఘడియల్లో ఎందరో భక్తులనూ, శిష్యులనూ ఉద్ధరించారు. అలా అన్నమాచార్యులు కూడా ఏడుకొండలవాడే సర్వస్వంగా సంకీర్తనల హారంతో అర్చిస్తూ...

యేపున శ్రీవేంకటేశుడే సర్వము,దాపై యితని వందనమే విధి
కాపుగ శరణాగతులే చుట్టాలు, పైపయి గెలిచిన ప్రపన్నులకు

అని అనుభవంతో అభివర్ణించాడు. వేంకటేశుడి వందనమే విధిగా, ఆ భాగవతప్రియుడి భక్తుల్నే బంధువులుగా భావించుకొని కారణజన్ముడనని నిరూపించుకున్నాడు.

భగవదారాధనలో ఒక స్థాయికి చేరుకున్నాక, ఈ లౌకికమైన బంధాలేవీ రుచించవు. భక్తుడు తల్లినీ, తండ్రినీ, బంధువులనూ ఆయనలోనే చూసుకుంటాడు. సుఖం కలిగితే అది పరమాత్ముడి ప్రసాదమని ప్రకటించుకుంటాడు; కష్టం కలిగితే అదీ ఆయన మహాప్రసాదం లాంటి పరీక్షేనని ఓర్చుకుంటాడు. ఏది ఏమైనా ఆ కరుణామూర్తిని కేంద్రంగా చేసుకునే జీవిస్తాడు. అంతే తాదాత్మ్యంగా శేషప్ప కవి కూడా తన నారసింహ శతకంలో...

నీలమేఘశ్యామ! నీవె తండ్రివి మాకు,
కమలవాసిని మమ్ముగన్న తల్లి
నీ భక్తవరులంత నిజమైన బాంధవుల్,
నీ కటాక్షము మా కనేకధనము,
నీ కీర్తనలు మాకు లోక ప్రపంచంబు,
నీ సహాయము మాకు నిత్యసుఖము
నీ మంత్రమే మాకు నిష్కళంకపు విద్య,
నీ పదధ్యానంబు నిత్యజపము... అంటారు. ❖



కొన్ని పూలు ఎంత పెద్దగా పూసినా, వాడి రాలిపడే వరకు పరిమళాన్నివ్వవు; కానీ మరికొన్ని విరులు, విరిసీవిరియక ముందే సౌరభాన్ని వెదజల్లుతూ వనాలను వసంతమయం చేస్తాయి.

అలాగే కొందరు ఎన్నేళ్ళు బతికినా అసలు ఎందుకు వచ్చామో తెలియకుండానే ఈ ప్రపంచం నుంచి వెళ్ళిపోతారు. కానీ మరికొందరు చిరుప్రాయంలోనే తమ లక్ష్యాన్ని గుర్తెరిగి జీవనగతిని నిర్దేశించుకుంటారు; చిరస్థాయి జీవనకార్యాల కోసం నిరంతరం శ్రమిస్తారు. అలాంటి అరుదైన యువకుడే బాబర్ ఆలీ!

పదహారేళ్ళకే ప్రధానోపాధ్యాయుడు!

పలకాబలపం పట్టడం తెలియని పల్లెలకు ఆ బాబర్ ఆలీ ఓ అక్షరాల దివిటీ... యుక్త వయస్సుకే ఓ కొత్త నిర్వచనాన్నిచ్చిన దిక్సూచి. 'ప్రపంచంలో పదహారేళ్ళ తొలి ప్రధానోపాధ్యాయుడు'గా బీబీసీచే గుర్తింపు పొందిన అతడు స్వామి వివేకానంద ఆశయాలకు ఆకృతినిస్తూ అభినందనలు అందుకొంటున్నాడు.

స్వామీజీ స్ఫూర్తితో: పశ్చిమబెంగాల్, ముర్షీదాబాద్‌లోని భాబ్తా గ్రామానికి చెందిన ఆలీ ఎనిమిదో తరగతి చదువుతున్న వయస్సులోనే అతడి మనస్సు సమాజసేవ వైపు మళ్ళింది. తనలాగే అక్షరాలు దిద్దడం కోసం అవస్థలు పడి మైళ్ళకు మైళ్ళు నడచివెళ్ళాల్సిన చిన్నారుల దుఃస్థితి అతడిని కదిలించింది; తన పరిధిలో తన పల్లెల కోసం ఏదైనా ఒకటి చేయాలన్న ఆలోచన కలిగింది. అందుకు "స్వామి వివేకానందయే నాకు స్ఫూర్తి. **'ప్రపంచంలో ఉన్న ధనాన్నంతా ఒక కుగ్రామంలో కుమ్మరించినా ప్రజలు ఉద్ధరింపబడరు. స్వయంకృషితో ఎవరికి వాళ్ళు నిలదొక్కుకోవాలి. అందుకు ప్రజలు విద్యావంతులు కావాలి'** అన్న స్వామీజీ మాటలు నా మనస్సులో చెరగని ముద్రను వేశాయి" అంటాడు బాబర్. పదమూడేళ్ళ వయస్సులోనే చిన్న పిల్లలకు పాఠాలు చెప్పడం తన ప్రవృత్తిగా చేసుకున్నాడు.

1887లో భగవాన్ శ్రీరామకృష్ణుల ప్రత్యక్షశిష్యులు స్వామి అఖండానంద సమాజసేవకు అంకురార్పణ చేసిన ప్రాంతం కూడా ముర్షీదాబాద్ సమీపగ్రామమైన 'భాబ్తా'యే కావడం దైవసంకల్పం! ఆనాడు అక్కడ సంభవించిన కరవుకాటకాలకు కలతచెందిన స్వామి అఖండానంద పూర్తిగా ఆర్తుల సేవలోనే నిమగ్నమయ్యారు. 'ఆత్మనోమోక్షార్థం జగత్ హితాయ చ' అన్న స్వామి వివేకానంద నినాదానికి సోదాహరణంగా నిలిచారు.

అక్షరాస్యతకు అంకురార్పణ... : బాబర్ ఎనిమిదో తరగతిలో ఉన్నప్పుడే తన ఆలోచనకు ఆకృతినిచ్చాడు. రోజూ తను పాఠశాల నుంచి ఇంటికి రాగానే సాయంత్రం నాలుగు గంటల నుంచి చుట్టుపక్కల పిల్లలకు పాఠాలు చెప్పడం అలవాటు చేసుకున్నాడు. మొదట్లో ఎందరో ఆయనను నిరుత్సాహపరిచారు. "ఇతనే విద్యార్థి. ఇతను వీళ్ళకు ఏం చెబుతాడు? ఎన్నాళ్ళు చెబుతాడు? అంటూ ఎందరో సంశయించారు. కానీ స్వామి వివేకానంద Arise Awake అన్న నినాదం గుర్తొచ్చేది. లక్ష్యం చేరుకునే వరకు విశ్రమించవద్దన్న స్వామీజీ పిలుపు ముందుకు నడిపించింది. తరువాత అనుమానించిన వారే వందలమంది చిన్నారులను చూసి ఆశ్చర్యపోయారు" అంటాడు ఆలీ. ఇద్దరితో ఆరంభమైన ఆలీ బడిలో నేడు వెయ్యిమంది బాలబాలికలు అక్షరాలు దిద్దుకుంటున్నారు. ప్రస్తుతం ఇంటర్మీడియట్ చదువుతున్న ఆలీతో పాటు మరో పదిమంది స్నేహితులు పాఠాలు చెప్పేందుకు ముందుకు వచ్చారు. ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలలు ఒక్కటి కూడా లేని ముర్షీదాబాద్ పరిసర ప్రాంతాల్లో బాబర్ నడిపే ఉచిత విద్యాకేంద్రమే ఆశాదీపం కావడం అభినందనీయం.

నిజజీవిత నాయకుడు....: ఏళ్ళ తరబడి అక్షరాస్యతలో అట్టడుగున ఉన్న ముర్షీదాబాద్ ప్రాంతం, ఇప్పుడు అగ్రస్థానానికి చేరుకోవడం చూసి అధినేతలే ఆశ్చర్యపోతున్నారు. The world sympathises only with the strong and powerful – లోకం బలవంతులకు, శక్తిమంతులకు మాత్రమే నీరాజనాలర్పిస్తుంది' అన్న స్వామీజీ మాటలు బాబర్ జీవితంలో అక్షరసత్యాలయ్యాయి;

నిజమే అజ్ఞాతంగా ఎక్కడో మారుమూల గ్రామాల్లో బాబర్ వెలిగించిన అక్షరదీపాన్ని నేడు ప్రపంచమంతా గుర్తించింది; అందుకే 'సి.ఎన్.ఎన్. – ఐ.బి.ఎన్.' ఆంగ్ల ఛానల్ అంతర్జాతీయ స్థాయిలో అరుదైన 'రియల్ హీరోస్' అన్న పురస్కారానికి బాబర్ ఆలీని ఎంపికచేసింది. విలాసాలు, వినోదాల కోసం వెంపర్లాడే యుక్తవయస్సును సంపూర్ణంగా సమాజానికే సమర్పిస్తున్న బాబర్ ఆలీ దృఢదీక్షను ప్రత్యక్షంగా వీక్షించి ఎందరో ప్రముఖులు పులకించిపోయారు. అలాంటి ముద్దుబిడ్డకు జన్మనిచ్చిన ఆ తల్లితండ్రులు ధన్యులయ్యారు.

'నా ఆశయసిద్ధికి తోడ్పడినవారే నా అనుగ్రహానికి పాత్రులవుతారు' అన్న స్వామీజీ ఆంతర్యాన్ని నిజం చేసిన బాబర్ ఆలీపై ఆయన ఆశీస్సులు తప్పక ఉంటాయనడంలో సందేహం లేదు. ❖

సేకరణ: ఎమ్. రాంబాబు

'లక్షలకొద్దీ జనులు విద్యలేక, తిండిలేక దుఃఖభూయిష్ఠమైన జీవితాన్ని గడుపుతుంటే, వారి మూలంగా విద్యావంతుడై, వారి గురించి ఆలోచించనివాడిని ద్రోహి' అని అంటాను. - స్వామి వివేకానంద

- స్వామి విశారదానంద

బెంగుళూరులోని వివేకానంద యోగ అనుసంధాన మహా విద్యాపీఠానికి చెందిన స్వామి విశారదానంద భగవద్గీత పదమూడో అధ్యాయంలో 7-11 శ్లోకాల్లోని భగవానుడి బోధామృతాన్ని వివరిస్తూ 'భగవద్గీత - మానవీయ విలువలు' అనే శీర్షికతో ప్రసంగాలు ఇచ్చారు. చెన్నైలోని శ్రీరామకృష్ణ మఠ ఆంగ్ల మాసపత్రిక 'వేదాంత కేసరి'లో ప్రచురితమైన ఆ ప్రసంగాల సారాన్ని 'శ్రీరామకృష్ణ ప్రభ' పాఠకులకు 2011 జూన్ సంచిక నుంచి ధారావాహికంగా అందిస్తున్నాం.

నిర్జనవాసంలో నిర్మలత్వం

వివిక్త-దేశ-సేవిత్వం – ఏకాంత ప్రదేశంలో నివసించడం. 'వివిక్త దేశ' అంటే ఏకాంత ప్రదేశం. వివిక్త దేశ సేవిత్వం అంటే మనస్సును సానుకూల పరిస్థితిలో ఉంచడానికి ప్రశాంతమైన ప్రదేశానికి మరలుట. అయితే నిర్జనవాసం మనలోని చింతలు, ఆందోళనలు తొలగించి మనస్సును అంతర్ముఖం చేయడానికి దోహదపడేదిగా ఉండాలి. అంతర్గతంగా గానీ, బాహ్యంగా గానీ ఎటువంటి ఒత్తిడులూ, ఆకర్షణలూ లేనటువంటి ప్రదేశమే సాధనకు అనువైనది.

నిర్జన ప్రదేశానికి మరలడం ఒక్కటే సరిపోదు. మనస్సు కూడా అందుకు సంసిద్ధంగా ఉండాలి. అప్పుడే ఏకాంతవాసం యొక్క ప్రయోజనాన్ని పొందగలుగుతాం. అలా కాకుండా నిర్జన ప్రదేశానికి వెళితే, అక్కడ కూడా ప్రాపంచిక కార్యకలాపాల్లోనే మునిగిపోతాం. మనస్సు సంసిద్ధం కాకుండా నిర్జన ప్రదేశానికి వెళితే... ***వనే అపి దోషః భవంతి రాగిణాం, జితేంద్రియాణాం గృహం తపోవనం*** – 'ప్రాపంచిక విషయాలకు బద్ధుడైన వ్యక్తి అడవిలో ఉన్నా, అతడి మనస్సు చంచలంగానే ఉంటుంది. అదే ఇంద్రియ నిగ్రహమున్న వ్యక్తి, గృహంలో ఉన్నా అది అతడికి ఒక తపోవనంగా విరాజిల్లుతుంది.

అంతర్గత ఏకాంతం: మనం ఎక్కడకు వెళ్ళినా మనతో పాటే మన మనస్సు కూడా ప్రయాణం చేస్తుంది. కాబట్టి చంచలమైన మనస్సు కలవాడు అడవికి వెళ్ళినా కూడా ప్రశాంతంగా ఉండలేడు. జీవితంలో 'భయం' అన్నిటిలోకీ ప్రాథమికమైన సమస్య. భయాన్ని మన మనస్సుతో పాటు తీసుకెళతాం. ఉదాహరణకు దెయ్యాల గురించి మనకు భయముంటే ఆ భయాన్ని మనతోపాటే తీసుకెళతాం.

మనతో పాటు మనం మోసుకెళ్ళే మరొక విషయం – ఇతరుల నుంచి గానీ, ప్రదేశాల నుంచి గానీ మనం ఆశించే వస్తువులు లేక విషయాలు. ఈ ఊహాజనిత ఆశలు ఇతర అవాంఛనీయ విషయాలకు కారణమవుతాయి, దారి తీస్తాయి. భయం, ఆశలు అనే రెండు ద్వారాల గుండా ప్రపంచం మన మనస్సులోకి ప్రవేశిస్తుంది. వాటిని వదిలించుకోకపోతే, నిర్జన ప్రదేశంలో నివసించడం వల్ల కలిగే నిజమైన ప్రయోజనాన్ని పొందలేం. ఈ అంతర్గతమైన సమస్యలను పరిష్కరించు కోగలిగినప్పుడే 'వివిక్త-దేశ-సేవిత్వం' అన్నది సాధ్యమవుతుంది, తగిన ఫలితాలను ఇస్తుంది.

మన మనస్సును అన్ని బాహ్యవస్తువుల నుండి దూరంగా, స్వేచ్ఛగా ఉంచాలి. బాహ్యవస్తువులు బాహ్యంలోనే ఉండాలి. మన మనోద్వారాన్ని వాటి కోసం తెరిస్తే, వాటిని మనలోకి ఆహ్వానించినట్లవుతుంది. వాటితోపాటు వాటికి సంబంధించిన అన్ని సమస్యలూ వస్తాయి. ఒకసారి అవి లోపలికి ప్రవేశించాక, వాటిని ఖాళీ చేయించడం అంత సులువైన విషయం కాదు. అటువంటప్పుడు అసలు 'ఏకాంతం' అనే భావానికి అర్థమెక్కడుంది? అన్ని విధాలా పరధ్యాసలకూ, ఆశలకూ దూరంగా, స్వేచ్ఛగా ఉండగలగాలి. అప్పుడే మనసుకు ప్రశాంతత లభిస్తుంది. లేనట్లయితే ఏకాంత ప్రదేశానికి వెళ్ళడమనేది ఒక పటాటోపమే అవుతుంది.



ఇతరులతో కలసి మెలసి ఉండలేనివారు 'ఏకాంతం' కావాలనుకుంటారు. జనం నుంచి తప్పించుకొని, ఒంటరిగా ఉండాలనుకునే భావం వ్యక్తిగతమైన ఒక వ్యాధి,దోషమే కానీ అది ఆధ్యాత్మిక సాధన కానేరదు.

అంతర్గత సంసిద్ధత కావాలి: ఏకాంతంలో జీవించడానికి మొట్టమొదట సంసిద్ధులవ్వాలి. ఈ 'సంసిద్ధత' అనేది ఏకాంత ప్రదేశానికి వెళ్ళే ముందరే కావాలి. జనం మధ్యనే ఉంటూ, మానసికంగా వారి నుంచి, విషయాల నుంచి వేరుగా ఉండ గలగాలి. మనస్సును వేరు చేయగలగాలి. ఒక విధమైన ఉదాసీన భావాన్నీ, దృక్పథాన్నీ ఏర్పరచుకోవాలి. ఎవరైనా నిజంగా ధ్యానం చేయాలనుకుంటే ఎక్కడో అక్కడ కూర్చోవడానికి కొంత సమయం తప్పక లభిస్తుంది. తనతో తాను కొంత సమయం వెచ్చించడానికి ఆదుర్దాగా ఎదురు చూడడమే ఏకాంతంలో గడపడంలో గల నిజమైన భావం. మనస్సుకు ఇలాంటి భావం ఏర్పడితే, సహజంగానే మనల్ని మనం పరీక్షించుకుంటాం. అదే మన సంసిద్ధతకు ప్రారంభం.

మనం అంతరవలోకనం చేసుకుని జీవితంలో ఇంతవరకు సాధించినదేముంది అని బేరీజు వేసుకోవాలి. జీవితం గడిచిపోతుంది. కాలం దొర్లిపోతుంది. కొద్ది సంవత్సరాల తరువాత వృద్ధాప్యం వస్తుంది. ఇక మనకు మిగిలేది ఏముంది? మరణించినప్పుడు మనతో పాటు మనం ఏం తీసుకెళతాం? ఈ జన్మకు ముందర మనం ఎక్కడున్నాం? ఇలాంటి ప్రశ్నలు మనలో ఉదయించినప్పుడే, మనకు మనం కొంత సమయం కేటాయించుకొని, కొంత దీర్ఘాలోచన చేసే ప్రయత్నం చేస్తాం. అంతరవలోకానికి పూర్తి సమయం కేటాయించ లేకపోయినా, కనీసం కొంత సమయాన్నయినా అప్పుడప్పుడూ కేటాయించాలి. అదీ కుదరకపోతే, కొంత సమయాన్ని సత్సాంగత్యంలో గడపాలి.

మనం అనాలోచితంగా ఎన్నో పనులు చేస్తాం. ఆ తరువాత వాటి వల్ల ఉత్పన్నమయ్యే సమస్యలను పరిష్కరించడంలోనే ఎక్కువ సమయాన్ని గడుపుతాం. కాబట్టి మనం 'ఆత్మవిచారణ' అలవాటు చేసుకోవడం ద్వారా సమస్యల్ని పరిష్కరించుకోవచ్చు. మనం ఏ పని చేసినా, ఎప్పుడూ మనల్ని మనం పరిశీలించుకుంటే తొందరపాటు చర్యలకు పాల్పడం. ఇది మన అంతర్గత నియంత్రణకు సహకరిస్తుంది.

ఆత్మపరిశీలన: మనం చేసే తప్పులను ఆత్మపరిశీలన ద్వారా నివారించుకోవచ్చు. ఆత్మపరిశోధన లేకుండా యాంత్రికంగా జీవిస్తే, ఎక్కడి నుంచో చెడు ఆలోచన మనస్సులోకి ప్రవేశిస్తుంది. ఆ తరువాత అది మన జీవితంలో ఒక అలవాటుగా మారిపోతుంది. ఈ విషయాన్ని గుర్తించి, మన దృక్పథాన్ని మార్చుకుంటే, మన జీవితాల్లో వచ్చే మార్పును చూడగలుగుతాం. మనలో మార్పు మన ఆలోచనల మార్పు వల్ల వస్తుంది. ఆ ఆలోచనల మార్పు ఆత్మపరిశీలన వల్ల కలుగుతుంది. కాబట్టి ఆత్మపరిశీలన మన దైనందిన జీవితంలో ఒక అలవాటుగా మార్చుకోవాలి.

ప్రారంభదశలో ఈ ఆత్మపరిశీలనా విధానాన్ని కనీసం రోజుకొకసారైనా ఉదయం నిద్ర లేవగానే గానీ, లేదా నిద్రించే ముందర గానీ అవలంబించాలి. ఈ అభ్యాసం మనకు మంచి ప్రయోజనం చేకూరుస్తుంది.

నిజమైన ఏకాంతంలో జీవించడం అంటే ఈ ఆత్మపరిశీలన చేయడమే! ప్రశాంతంగా ఉండే ప్రదేశంలో ఆత్మపరిశీలన చేయాలి. ఏకాంత ప్రదేశానికి వెళ్ళే ముందర మన వ్యక్తిత్వాన్ని రూపుమాపుకోవడానికి విలువ నివ్వాలి. అప్పుడిక ఈ ప్రపంచం మనల్ని ఆకర్షించదు. లేనట్లయితే, ప్రాపంచిక బంధాలలో చిక్కుకొని, ఏకాంతంలో జీవించలేం. మన మనస్సును అఘాతాలను ఇముడ్చుకునే విధంగా తయారుచేయగలగాలి. అప్పుడది జీవితంలో ఎదురయ్యే అన్ని చిక్కులనూ తనలో ఇముడ్చుకొని, జీవితవాహిక ప్రశాంతంగా నడిచేలా చేస్తుంది. ❖

తెలుగుసేత: డాక్టర్ పన్నాల శ్యామసుందర మూర్తి

(వచ్చే సంచికలో... 'జనసంసర్గమునందు ప్రీతిలేకుండుట')





వరంగల్, నల్లగొండ జిల్లాల్లో 'వివేకానంద రథం' పర్యటన వివరాలు:


2014 జనవరి 1-పాలకుర్తి, దేవరుప్పుల, లింగాల ఘనపురం; 2-జనగామ; 3-బచ్చన్నపేట, చేర్యాల; 4-మద్దూరు, తరిగొప్పుల, నర్మెట్ట; 5-రఘునాథపల్లి; 6- ఆలేరు, రాయగడ; 7- భువనగిరి, బీబీనగర్.


పండితుడైన మూర్ఖుడు

ఆధారం: దేవీ భాగవతం కథ: భైరవ సుబ్రమణ్యం చిత్రాలు: ఆర్.వెంకట్ అనుసృజన: స్వామి జ్ఞానదానంద




4 గోబిలముని శ్వాస బిగబట్టి 'రతంతరం' అనే సామగానం చేస్తున్నప్పుడు శ్వాస సడలి స్వరభంగం కలిగింది.
మునివర్యా! మూర్ఖునిలా ఎందుకు స్వరం తప్పుతోంది! పుత్రకామేష్టి యాగానికి భంగం వాటిల్లిందే!
దేవదత్తా! వయోభారం కారణంగా అప్రయత్నంగా తప్పిదం జరిగినదానికి నన్ను మూర్ఖుడంటావా? ఇదే నా శాపం.. నీకు జన్మించబోయే కుమారుడు మూర్ఖుడవుతాడు గాక!
శాపం విన్న దేవదత్తుడు హతాశుడయ్యాడు.
5
నేనూ క్షణంలో వివేకం కోల్పోయాను; అంతా మంచికే. నీ కుమారుడు మూర్ఖుడిగా పుట్టినప్పటికీ, కాలాంతరంలో మహావిద్వాంసుడుగా భాసిస్తాడు.
పండితోత్తమా! మన్నించండి. పుత్రభాగ్యం లేదన్న బాధతో ఉద్వేగానికిలోనై విచక్షణను కోల్పోయాను. దయచేసి శాపవిమోచనం చెప్పి పుణ్యం కట్టుకోండి.
దేవదత్తుడికి కుమారుడు జన్మించాడు. ఉతథ్యుడనే అతడికి ఎనిమిదో ఏట ఉపనయనం జరిగింది. కానీ అతడు మందమతిగానే పెరిగాడు.
6
ఇతడికి శరీరం పెరిగిందిగానీ బుద్ధి మాత్రం పెరగలేదు.
వేదాభ్యాసం చేసినా ఈతడిలో జ్ఞానం మాత్రం శూన్యం!
ఊరి జనం దృష్టిలో నగుబాటుకు గురైన ఉతథ్యుణ్ణి తండ్రి కూడా కోప్పడ్డాడు.
7
ఒరేయ్! సంధ్యావందనం కూడా చేయని నువ్వు పాపపు మూటలను కూడగట్టుకుంటున్నావు. నీ ముఖం నాకు చూపించకు. పో!
ఆ అవమానభారంతో ఉతథ్యుడు ఇంటి నుండి పారిపోయి గంగాతీరం చేరుకున్నాడు.


8
ఉతథ్యుడు ఒక కుటీరం నిర్మించుకున్నాడు. ఏ పనీపాటా తెలియని అతడు పళ్ళు, కందమూలాలు తినడమూ, గంగలో స్నానం చేయడమూ నిత్యకృత్యంగా చేసుకున్నాడు.
9
ఉతథ్యుడు సత్యవ్రతం పూని ఎవరితోనూ అనవసరంగా మాట్లాడక, మౌనంగా ఉండసాగాడు.
ఇక నేను సత్యాన్నే పలుకుతాను. దేవీ! నీవే నాకు రక్ష.
వేదం, పూజ, జపం ఏదీ తెలియకపోయినా, ఊరి జనం అతడి సత్యవ్రతాన్ని చూసి, 'సత్యవ్రతుడ'నే అతణ్ణి పేర్కొనసాగారు.
10
గత జన్మలో నేను పుణ్యస్థలాల్లో తపస్సు ఆచరించకుండా, సాధువులనూ, సజ్జనులనూ సేవించ కుండా ఉండి ఉంటాను. అందువల్ల ఇప్పుడు మూర్ఖుడనయ్యాను. ఉత్తమోత్తమమైన మానవజన్మ పొందీ వృథా చేశాను. భగవాన్! నాకు దారి చూపు!
ఈ విధంగా అనేక రకాలుగా భావించుకొంటూ ఉతథ్యుడు పధ్నాలుగేళ్ళు గడిపివేశాడు.
11
ఒక రోజు గాయపడ్డ పంది ఒకటి 'హ్రా...హ్రా...' అని అరుచుకొంటూ ఉతథ్యుని పర్ణశాలలో దాక్కుంది. ఆ భయంతో ఉతథ్యుడూ 'హ్రా...హ్రా...' అనసాగాడు. ఇంతలో పందిని తరుముతూ ఒక వేటగాడు వచ్చాడు.
'హ్రా....హ్రా...'



పిల్లవాడు 'నాన్న' అని ఉచ్చరించలేక 'నా...' అని తండ్రిని పిలిస్తే, ఆ పిల్లవానిపట్ల తండ్రి ప్రేమ తగ్గుతుందా? పసిబాలుడు కాబట్టి తనను సరిగ్గా పిలవలేకపోతున్నాడని తండ్రి గ్రహిస్తాడు.

అలాగే పండితులైనా, పామరులైనా తన కోసం పరితపించే బిడ్డలందరిపట్ల భగవంతుడు సమానమైన ప్రేమను చూపిస్తాడు. *- భగవాన్ శ్రీరామకృష్ణ పరమహంస*










యువజన సదస్సులు

హైదరాబాద్ రామకృష్ణ మఠం స్వామి వివేకానంద 150వ జయంత్యుత్సవాల్లో భాగంగా 'ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సాంస్కృతిక శాఖ' ఆర్థిక సహాయంతో హైదరాబాద్, ఖమ్మం, కాకినాడ, విజయనగరం, శ్రీకాకుళం, ఒంగోలు, భీమవరం పట్టణాలలో కళాశాల విద్యార్థినీ విద్యార్థులకు యువ సమ్మేళనాలను నిర్వహించింది.

2013 అక్టోబర్ 21 నుండి డిసెంబర్ 5 వరకూ జరిగిన ఎనిమిది సదస్సుల్లో సుమారు 8,000 మంది విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సదస్సుల్లో స్వామీజీలు, ప్రముఖ వక్తల ప్రసంగాలు, ప్రశ్నోత్తరాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించబడ్డాయి. విద్యార్థులకు స్వామి వివేకానంద చిత్రపటాన్నీ, సాహిత్యాన్నీ ఉచితంగా పంపిణీ చేసింది. ❖









శ్రీ రామకృష్ణ ప్రభ

ఆధ్యాత్మిక భావవాహినికి ఆహ్వానం

మానవజీవన ఔన్నత్యానికి దోహదపడే మన సనాతన ధర్మంలోని విశిష్ట అంశాలను, ఆధునిక సమాజానికి సమన్వయిస్తూ విశ్లేషించే రచనలకు 'శ్రీరామకృష్ణ ప్రభ' ఆహ్వానం పలుకుతోంది. అందులో భాగంగా శ్రీమద్రామాయణ, భారత, భాగవతాది సనాతన ధర్మ గ్రంథాల నుండి ఓ పాత్ర వైశిష్ట్యం, ఓ సన్నివేశ వర్ణన, ఓ సందేశ విశ్లేషణలతో కూడిన వ్యాసాలను స్వాగతిస్తోంది.

రచనలు సనాతన ధర్మంలోని విలువలను సమకాలీన సమాజానికి, నిత్యజీవితానికి అన్వయిస్తూ మానవతా విలువలను వికసింపజేసేవిగా, ఆధ్యాత్మిక భావాలను ఇనుమడింపజేసేవిగా ఉండాలి.

వ్యాసాలు సరళ భాషలో, సులభ గ్రాహ్యంగా 800 పదాలకు మించకుండా ఉండాలని అభిలషిస్తూ ఉన్నాం. సంపాదక బృందం ఎంపిక చేసిన రచనలు మాత్రమే ప్రచురిత మవుతాయి. ప్రచురించే వ్యాసాలలో అవసరమైనచో తగిన మార్పులు, చేర్పులు చేసే నిర్ణయాత్మక బాధ్యత ఆ బృందానిదే! ఈ విషయంలో ఉత్తర ప్రత్యుత్తరాలకు అవకాశం లేదు. ప్రచురించిన వ్యాసాలకు సముచిత పారితోషికం అందజేస్తాం.

రచనలు పంపించాల్సిన చిరునామా :

సంపాదకులు, శ్రీరామకృష్ణ ప్రభ, రామకృష్ణ మఠం, దోమల్‌గూడ, హైదరాబాదు–500 029

E-mail: sriramakrishnaprabha@gmail.com

Printed and published by **Swami Jnanadananda** owned by Ramakrishna Math Trust
and printed at Kala Jyothi Process, 1-1-60/5, RTC Cross Roads, Musheerabad, Hyderabad - 500 020
and published at Ramakrishna Math, Domalguda, Hyderabad - 500 029. **Editor: Swami Parijneyananda**

5 పిల్లలకు ఉన్నత భావాలను బోధించండి. ఇప్పుడు మనం వారికి చేయాల్సిన సహాయం ఇదే! తరువాత వారి జీవితాలలో దాని ప్రభావం సహజంగానే ప్రతిఫలిస్తుంది. -స్వామి వివేకానంద

7 నేను ఇప్పుడు మీ దోషాలను సవరించాలని ప్రయత్నించడం లేదు. మన పూర్వులు నిర్దిష్టించిన నియమాలనూ, విలువలనూ ఆచరణాత్మకం చేయమని మాత్రమే విజ్ఞప్తి చేస్తున్నాను. -స్వామి వివేకానంద

9 మన మనస్సులో కోర్కెలు ఉన్నంతవరకూ మనం సత్యాన్ని గ్రహించలేం. సత్యాన్ని దర్శించాలనుకునేవారు ఇహ, పర లోకాల్లో పొందే సుఖభోగాలను పూర్తిగా త్యజించాలి. -స్వామి వివేకానంద

11 నిస్వార్థత ఎంతో ప్రయోజనకరం. కానీ దానిని అలవరచుకునే ఓర్పు మనకు లేదు. ప్రేమ, సత్యం, నిస్వార్థత మనకు మహోన్నత ఆదర్శాలేగానీ, నైతిక భాషాలంకారాలు కావు. - స్వామి వివేకానంద

13 పారమార్థికతకూ, సంఘనీతికీ, సాధుత్వానికీ, ప్రియవర్తనకూ భారతదేశమే మాతృభూమి. ఈ విషయంలో ఎప్పటికీ మనదే ప్రథమ స్థానమని సాహసంతో చెబుతున్నాను. - స్వామి వివేకానంద

15 హిందువు భోజనం చేసినా, నడచినా, నిద్రించినా ఇలా ఏ పని చేసినా అందులో భగవద్భక్తి ఇమిడి ఉంటుంది. దీనివల్ల భారతజాతికి ప్రాణం ఆధ్యాత్మికతయే అని తేటతెల్లమవుతుంది. -స్వామి వివేకానంద

17 మీరందరూ వీరులుకండి! పర్వత స్థైర్యంతో నిలబడండి! మానవుడు మరణించేది ఒక్కసారే! నా శిష్యులు పిరికిపందలుగా ఉండరాదు. పిరికితనం అంటే నాకు చాలా అసహ్యం. - స్వామి వివేకానంద

19 లేవండి! కార్యధురీణులుకండి! మీ అందరిలో ఉన్నత భావనలను ప్రేరేపించడమే నా ఉద్యమం. ఒక్క వ్యక్తిని సుశిక్షితునిగా తీర్చిదిద్దడానికి లక్ష జన్మలు ఎత్తడానికైనా నేను సిద్ధం. - స్వామి వివేకానంద

21 కామ, క్రోధ, లోభ, మోహాలు ఉన్న మానవుడు ఎన్నటికీ పరిపూర్ణతను సాధించలేడు. ఆగ్రహంచే బద్ధుడైనవాడు ఎలాంటి పరిస్థితుల్లోనూ మాయగుమ్మాన్ని దాటలేడు. - స్వామి వివేకానంద

23 పరోపకారమే మహోన్నత ఆదర్శం. కాబట్టి ఒక మహోన్నత ఆదర్శం కలిగి జీవించడం, ఆ ఆదర్శాన్ని ఆచరించే ప్రయత్నంలో మరణించడం ఎంతో శ్రేయస్కరం కదా! - స్వామి వివేకానంద

25 ఈ లోకంలో జన్మించినందుకు గుర్తుగా ఏదో ఒక మహత్కార్యం చేసి నిష్క్రమించండి. అలా కాకపోతే మీకూ, ఈ శిలలకూ మధ్య ఉన్న భేదం ఏమిటి? కార్యోన్ముఖులుకండి! - స్వామి వివేకానంద

27 నా వత్సలారా! ధైర్యవంతులై జీవించండి. మహోన్నతమైన సత్యాలను ప్రకటించడానికి ఏమాత్రమూ వెనుకాడకండి. ఎలాంటి పరిస్థితుల్లోనూ ధైర్యాన్ని కోల్పోవద్దు. - స్వామి వివేకానంద

29 సోమరితనం పనికిరాదు. ఈర్ష్యా ద్వేషాలను పారద్రోలండి. ఇనుము వేడిగా ఉన్నప్పుడే దానిని వంచివేయడం సులభం. ఆ తరుణం మించకముందే కార్యశీలురుకండి. - స్వామి వివేకానంద

31 తల్లి హృదయం, శూరుని దీక్ష, మలయమారుత మాధుర్యం - ఇలా ఎన్నియో సుగుణాలను నీవు పొందెదవుగాక! భావిభారత పౌరులకు నీవు మిత్రుడవై, సేవకుడవై వర్ధిల్లెదవుగాక! - స్వామి వివేకానంద

33 'లక్షలకొద్దీ జనులు విద్యలేక, తిండిలేక దుఃఖభూయిష్ఠమైన జీవితాన్ని గడుపుతుంటే, వారి మూలంగా విద్యావంతుడై, వారి గురించి ఆలోచించనివాడిని ద్రోహి' అని అంటాను. - స్వామి వివేకానంద


ఆధ్యాత్మిక అమృతవాహిని
శ్రీ రామకృష్ణ ప్రభ
మార్చి 2014
₹10
సర్వదేవ స్వరూపం శ్రీరామకృష్ణం నమామ్యహమ్



స్వామి వివేకానంద 150వ జయంతి ముగింపు ఉత్సవాలు

















రామకృష్ణ మఠం, రామకృష్ణ మిషన్‌ల ప్రధాన కేంద్రమైన బేలూరు మఠంలో 2014 జనవరి 13వ తేదీ నుండి 31వ తేదీ వరకు స్వామి వివేకానంద 150వ జయంతి ముగింపు ఉత్సవాలు జరిగాయి. 19 రోజుల పాటు జరిగిన ఈ ఉత్సవాలను రామకృష్ణ సంఘ సర్వాధ్యక్షులు పరమపూజ్య శ్రీమత్ స్వామి ఆత్మస్థానందజీ మహరాజ్ ప్రారంభించారు.

ఈ ఉత్సవాల్లో భాగంగా జనవరి 25, 26 తేదీల్లో భక్త సమ్మేళనం; 27,28 తేదీల్లో సర్వధర్మ సమ్మేళనం; 29,30 తేదీల్లో యువజన సమ్మేళనాలు జరిగాయి. ఈ సమ్మేళనాల్లో వివిధ రాష్ట్రాల నుండి వచ్చిన 29,500 మంది భక్తులు, యువతీ యువకులు; 1,500 మంది రామకృష్ణ సంఘ సన్న్యాసులు, శారదామఠం మాతాజీలు పాల్గొన్నారు.

ఈ సమ్మేళనాల్లో పరమ పూజ్య స్వామి ఆత్మస్థానందజీ మహరాజ్, స్వామి స్మరణానందజీ మహరాజ్, స్వామి ప్రభానందజీ మహరాజ్, స్వామి సుహితానందజీ మహరాజ్; పశ్చిమబెంగాల్ గవర్నర్ శ్రీ ఎమ్.కె. నారాయణన్, ఛత్తీస్‌గఢ్ గవర్నర్ శ్రీ శేఖర్‌దత్త, భారత ప్రభుత్వ సాంస్కృతిక శాఖా మంత్రి శ్రీమతి చంద్రేష్ కుమారి, పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి కుమారి మమతా బెనర్జీ, ప్రసారభారతి సి.ఇ.ఓ. శ్రీ జవహర్ సర్కార్, ఇతర ప్రముఖులు ప్రసంగించారు. ❖








శ్రీరామకృష్ణ ప్రభ
రామకృష్ణ మఠం, దోమల్‌గూడ, హైదరాబాదు-500 029
ఫోన్: 040-27667799, సెల్: 8801849494
E-mail : sriramakrishnaprabha@gmail.com

నిర్వాహక సంపాదకులు: **స్వామి జ్ఞానదానంద** సంపాదకులు: **స్వామి పరిజ్ఞేయానంద**

మారుటేరులో మూర్తిత్రయ భావధార





















పశ్చిమ గోదావరి జిల్లాలోని మారుటేరు శ్రీరామకృష్ణ సేవాసమితి 2014 జనవరి 3,4,5 తేదీల్లో రామకృష్ణ – వివేకానంద భావప్రచార పరిషత్ 22వ వార్షిక భక్తసమ్మేళనాన్ని **మారుటేరులో** అత్యంత వైభవంగా నిర్వహించింది. ఈ సమ్మేళనానికి రామకృష్ణ మఠం స్వామీజీలు, శారదామఠం మాతాజీలు విచ్చేశారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన సుమారు 2 వేల మంది భక్తులు ఈ సమ్మేళనంలో పాల్గొన్నారు. మూడు రోజుల పాటు జరిగిన ఈ సమ్మేళనాన్ని స్వామి రఘునాథానందజీ మహరాజ్ జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు.

రోజూ ఉదయం 6 గంటలకు శ్రీరామకృష్ణ సుప్రభాతం, అష్టోత్తర శతనామ పూజ, రామకృష్ణ కథామృత పఠనం, కీర్తనలు, ధ్యానంతో కార్యక్రమం ప్రారంభమయ్యేది.

స్వామీజీలు, మాతాజీలు, ఇతర వక్తల ప్రసంగాలు; వివిధ సమితుల నుండి వచ్చిన భక్త బృందాల భజనలు; సాంస్కృతిక కార్యక్రమాలు భక్తుల్ని ఆద్యంతం అలరించాయి. ఈ మూడు రోజులూ భక్తులు మూర్తిత్రయ భావధారలో మునిగి పునీతులయ్యారు. ❖








ఆధ్యాత్మిక అమృతవాహిని

శ్రీ రామకృష్ణ ప్రభ

సంపుటం: 71 సంచిక: 3 మార్చి 2014



తుల్య లోష్ట కాంచనం చ హేయ నేయ ధీగతం
స్త్రీషు నిత్య మాతృ రూప శక్తి భావ భావుకం ।
జ్ఞాన భక్తి భుక్తి ముక్తి శుద్ధ బుద్ధిదాయకం
తం నమామి దేవ దేవ రామకృష్ణమీశ్వరం ॥

మట్టినీ, బంగారాన్నీ సమానంగా ఎంచువానినీ; కోరికలు లేనివానినీ; స్త్రీలను నిత్యం మాతృమూర్తిగా, కాళీమాతగా చూచునట్టివానినీ; భక్తులకు జ్ఞానం, భక్తి, భుక్తి, ముక్తి, నిర్మలమైన బుద్ధి ప్రసాదించువానినీ; దేవతలకు దేవుడైనవానినీ; ఈశ్వరుడైన శ్రీరామకృష్ణుని నమస్కరిస్తున్నాను.

– స్వామి విరజానంద విరచిత 'శ్రీరామకృష్ణ స్తోత్రం'


సూక్తి సౌరభం

మాటలాడు నొకటి మనసులోన నొకటి
ఒడలి గుణము వేరె యోచ వేరె
ఎట్టుగల్గు ముక్తి యీలాగు తాముండ
విశ్వదాభిరామ వినుర వేమ.


'తాను మాటలాడునదొకటి, మనస్సులోనున్న దింకొకటి. తన గుణ మొకటి. యోచన వేరొకటి. ఇట్టి వానికి మోక్షమెలా కలుగుతుంది?'

గంగపాఱు నెపుడు కదలని గతి తోడ
ముఱికి వాగు పాఱు మ్రోతతోడ
పెద్ద పిన్నతనము పేరిమి యీలాగు
విశ్వదాభిరామ వినుర వేమ.

'గంగానది గొప్పదైనా తొణకదు. చిన్నదైనా ముఱికినీటి కాలువ శబ్దం చేస్తుంది. గొప్పవారికీ, నీచులకూ ఈ రకమైన భేదం ఉంది సుమా!'



శ్రీరామకృష్ణ ప్రభ శాశ్వత నిధి





ఆధ్యాత్మిక జ్ఞానాన్ని పంచి పెట్టేందుకు 'శ్రీరామకృష్ణ ప్రభ' కృషి చేస్తోంది. నిధుల కొరత లేకుండా ఈ జ్ఞానయజ్ఞం నిరంతరాయంగా సాగేందుకు 'శ్రీ రామకృష్ణ ప్రభ శాశ్వతనిధి'కి ధన దానం చేసి ప్రోత్సహించాల్సిందిగా కోరుతున్నాం. దాతల పేర్లు పత్రికలో ప్రచురిస్తాం.

మహారాజ పోషకులు...... రూ. 10,000/-, అంతకన్నా ఎక్కువ విరాళం ఇచ్చేవారు.
రాజ పోషకులు............ రూ. 5,000/-, అంతకన్నా ఎక్కువ విరాళం ఇచ్చేవారు.
పోషకులు................. రూ. 1,000/-, అంతకన్నా ఎక్కువ విరాళం ఇచ్చేవారు.

	దాతపేరు / చిరునామా	రూ.
మహారాజ పోషకులు :	శ్రీమతి మేక లక్ష్మీ అన్నపూర్ణ, సీతారాంపురం, విజయవాడ (కీ॥శే॥ పాతూరి ప్రభావతిగారి జ్ఞాపకార్థం)	10,000
మహారాజ పోషకులు :	శ్రీ గోపిడి అంజిరెడ్డి, వెల్లుల్ల, మెట్‌పల్లి, కరీంనగర్ జిల్లా (కీ॥శే॥ పెద్దరాజన్నగారి జ్ఞాపకార్థం)	10,000
రాజ పోషకులు :	శ్రీ వేముల సోమయ్య, నెల్లికుదురు, వరంగల్ జిల్లా (కీ॥శే॥ వేముల సత్తెమ్మగారి జ్ఞాపకార్థం)	5,116
రాజ పోషకులు :	శ్రీమతి ఉంగరాల లక్ష్మీకాంత, అశోక్‌నగర్, హైదరాబాద్ (కీ॥శే॥ ఎమ్.జాలయ్య, రమణమ్మగార్ల జ్ఞాపకార్థం)	5,000
రాజ పోషకులు :	శ్రీ బి. గోపాలరావు, పద్మారావునగర్, సికింద్రాబాద్	5,000
రాజ పోషకులు :	శ్రీ ఓరుగంటి రంగారావు, లంబాడీపేట, విజయవాడ	5,000
రాజ పోషకులు :	శ్రీ ఎస్. సత్యనారాయణ, కాకర్ల, ప్రకాశం జిల్లా	5,000
పోషకులు :	శ్రీమతి సి.హెచ్ లీలావతి, పోచమ్మ మైదానము, వరంగల్	1,500
పోషకులు :	శ్రీమనుగుల వేంకట రామారావు, రఘుదేవపురం, తూ.గో.జిల్లా (కీ॥శే॥ సత్యనారాయణమూర్తిగారి జ్ఞాపకార్థం)	1,116
పోషకులు :	శ్రీమతి టి. ప్రమీల, కాకతీయ కాలనీ, హనుమకొండ (కీ॥శే॥ తిరుమగరిగారి జ్ఞాపకార్థం)	1,116
పోషకులు :	శ్రీ ప్రగడ నాగరాజు, కేశనపల్లి, తక్కెళ్ళపాడు, గుంటూరు జిల్లా	1,016
పోషకులు :	చి॥ తానియా లక్ష్మణ్, గుర్‌గావ్, హర్యానా	1,000
పోషకులు :	చి॥ తన్మయి లక్ష్మణ్, గుర్‌గావ్, హర్యానా	1,000
పోషకులు :	ఒక భక్తుడు, విశాఖపట్నం	1,000

'శ్రీరామకృష్ణ ప్రభ' కానుక పథకం

యువతరానికి 'శ్రీరామకృష్ణ ప్రభ'ను మరింత చేరువ చేయాలని సంకల్పించాం. రాష్ట్రంలోని వివిధ పాఠశాలలు/ కళాశాలలు/ గ్రంథాలయాలకు పత్రికను పంపించడానికి మీ సహాయాన్ని కోరుతున్నాం. ఈ కానుక పథకం క్రింద చందా చెల్లించిన దాత పేరున (మీరు సూచించిన లేదా మేము ఎంపిక చేసిన) విద్యాసంస్థకు పత్రికను పంపుతాం. కానుక చందా రూ.1,500/- అంతకన్నా ఎక్కువ ఇచ్చిన దాత పేరు, విద్యాసంస్థ పేరు పత్రికలో ప్రచురిస్తాం.

దాత పేరు	విద్యాసంస్థ
శ్రీ జి. అంజిరెడ్డి, వెల్లుల్ల, మెట్‌పల్లి, కరీంనగర్ జిల్లా	జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, వెల్లుల్ల, మెట్‌పల్లి, కరీంనగర్ జిల్లా
శ్రీ కె. రాజేష్, వెల్లుల్ల, మెట్‌పల్లి, కరీంనగర్ జిల్లా	మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, వెల్లుల్ల, మెట్‌పల్లి, కరీంనగర్ జిల్లా
శ్రీ వి. వీరా రెడ్డి, అబిడ్స్, హైదరాబాద్	రాజాబహదూర్ వేంకట రమణారెడ్డి ఎడ్యుకేషనల్ సొసైటీ, అబిడ్స్, హైదరాబాద్
శ్రీ డి.ఎమ్. రాజు, అరోరా పబ్లికేషన్స్, విజయవాడ	జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, భావదేవరపల్లి, నాగాయలంక, కృష్ణా జిల్లా
శ్రీ పి. మల్లికార్జునరావు, ఎదురుమొండి, నాగాయలంక, కృష్ణా జిల్లా	మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల, ఎదురుమొండి, కృష్ణా జిల్లా

ముఖచిత్రం : హైదరాబాద్, రామకృష్ణ మఠం దేవాలయంలోని 'భగవాన్ శ్రీరామకృష్ణ పరమహంస' పంచలోహ విగ్రహం.

చందా వివరాలు		భారతదేశంలో	విదేశాలకు
విడి ప్రతి	:	₹ 10	-
సంవత్సర చందా	:	₹ 100	₹ 1,500
మూడు సంవత్సరాలకు	:	₹ 280	₹ 4,500
ఐదు సంవత్సరాలకు	:	₹ 450	₹ 7,500
ఇరవై సంవత్సరాలకు	:	₹ 1,500	₹ 22,000

గమనిక: డిమాండ్ డ్రాఫ్ట్, మనియార్డర్లలో **Ramakrishna Math, Hyderabad** అని వ్రాయాలి.
పంపవలసిన చిరునామా: **Sri Ramakrishna Prabha, Ramakrishna Math, Domalguda, Hyderabad - 500 029.**

చందాను ఆన్‌లైన్ http://kinige.com/srkp ద్వారా చెల్లించవచ్చు.

లోపలి పేజీల్లో...

ఈ సంచికలోని రచయిత(త్రు)ల అభిప్రాయాలు వ్యక్తిగతమైనవి. సంపాదకులు గానీ, హైదరాబాద్ రామకృష్ణ మఠం గానీ వాటికి బాధ్యత వహించజాలరు. – సంపాదకులు

శ్రీరామకృష్ణ ప్రభ చందాదారులకు విన్నపం

ప్రియ పాఠకులారా!

- 'శ్రీరామకృష్ణ ప్రభ' పత్రిక కవరు మీద చిరునామాకు పైన మీ చందా నంబరు, కుడి వైపున మీ చందా గడువు ముగిసే నెల ఉంటాయి. మీ చందా గడువు పూర్తయ్యే నెలకు ముందుగానే సొమ్మును చెల్లించి చందాను పునరుద్ధరించుకోండి.
- మీ ఉత్తర ప్రత్యుత్తరాలన్నింటిలో తప్పనిసరిగా చందా నంబరు పేర్కొనాల్సిందిగా మనవి.
- మీ చిరునామా మారిన పక్షంలో 7వ తేదీ లోగా మాకు తెలియపరచినట్లయితే, వచ్చే నెల సంచిక నుండి మీ కొత్త చిరునామాకు పంపబడును.
- ప్రతీ నెల 26 లేదా 27వ తేదీల్లో పత్రిక పోస్ట్ అవుతుంది. మీకు పత్రిక 15వ తేదీ లోపుగా చేరనట్లయితే, వెంటనే మాకు తెలియజేయగలరు.

శ్రీరామకృష్ణ ప్రభ ద్వారా అవిచ్ఛిన్నంగా సేవలు అందించాలన్నదే మా ఆకాంక్ష. అందుకు మీ సహకారం కోరుతూ.... – సర్క్యులేషన్ మేనేజర్



ఉగాది శుభాకాంక్షలు

'శ్రీరామకృష్ణ ప్రభ' పాఠకులకు, రచయితలకు, రచయిత్రులకు, ఏజెంట్లకు, ప్రకటనకర్తలకు, దాతలకు, శ్రేయోభిలాషులకు జయ నామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలు. *- సంపాదకులు*



నవ్వుల పూదోటలో పారమార్థిక పారిజాతాలు



ప్రాచీన కాలం నుండీ ప్రాచుర్యం పొందిన కర్మ, భక్తి, జ్ఞాన, రాజ యోగాలలో అందరికీ పరిజ్ఞానం ఉన్నా లేకపోయినా, ఆధునిక కాలంలో హాస్యయోగంతో మాత్రం పరిచయముంది. ఒకప్పుడు 'నవ్వు నాలుగు విధాల చేటు' అని హెచ్చరించేవారు పెద్దలు. కానీ ఇప్పుడు 'నవ్వు ఎన్నో విధాల మేలు' అని ప్రోత్సహిస్తున్నారు వైద్యులు. నవ్వడం వల్ల ఎండార్ఫిన్ అనే హార్మోన్లు విడుదలై మనిషి ఆరోగ్యంగా ఉండడానికి దోహద పడతాయని వైద్యులు చెబుతున్నారు. అంతేకాదు 'నవ్వడం – యోగం'; నవ్వకపోవడం – రోగం' అని నవీన మంత్రాన్ని ఉపదేశిస్తున్నారు. అందుకే పూర్వ ఋషులు పేర్కొన్న నాలుగు యోగాలను అభ్యసించడానికి సంఘాలున్నా లేకపోయినా, ఆధునిక వైద్యులు సూచించిన హాస్యయోగాన్ని అభ్యసించడానికి ఎన్నో హాస్య సంఘాలు వెలిసాయి. అయితే 'సహజమైన నవ్వు మేలు చేస్తుంది. కృత్రిమమైన నవ్వు కీడు కలిగిస్తుంది' అని మరువరాదు. నిజానికి చింతలు లేని చిత్తమే సహజ నవ్వుల పూదోట అవుతుంది.

'హాస్యయోగం' రోగాలను దూరం చేస్తుందని నేటి వైద్యులు చెబితే, సుమారు 130 ఏళ్ళ క్రితమే తమ హాస్య గుళికలతో భక్తుల భవరోగాలను పారద్రోలిన భవరోగ వైద్యుడు – శ్రీరామకృష్ణ పరమహంస. గురుదేవులు దక్షిణేశ్వరంలో తమ గదిలో చేరిన భక్తులకు ఆధ్యాత్మిక బోధనలను హాస్యరసామృతంలో ముంచి పంచేవారు. ఆ అమృతాన్ని ఆస్వాదించిన భక్తులు కడుపుబ్బేలా నవ్వేవారు; మనసారా ఆనందించేవారు. శ్రీరామకృష్ణుల గదే ఓ నవ్వుల పూదోటగా మారిపోయేది. అక్కడ విరబూసిన పారమార్థిక పారిజాతాలను భక్తులు తమ మనస్సుల్లో పదిలపరచిన వెంటనే వారి చింతలన్నీ తొలగిపోయేవి. అలా శ్రీరామకృష్ణులు తమ గదినే 'హాస్యయోగా లయం'గా మార్చి, భక్తుల హృదయాలను 'దేవాలయం'గా తీర్చిదిద్దారు.

అనారోగ్యంగా ఉన్న వ్యక్తికి ఎలాంటి భయం, బాధ కలగ కుండా నవ్వుతూ, నవ్విస్తూ మంచిమాటలు చెబుతూ ఇంజక్షన్ ఇచ్చే మంచి వైద్యునిలా శ్రీరామకృష్ణులు సంసార తాపంతో సతమతమవుతున్న భక్తులకు మంచి కథల ద్వారా, చక్కని దృష్టాంతాలు, ఉపమానాల ద్వారా సరళమైన భాషలో శాస్త్రసారాన్ని హాస్యరసంతో కలిపి బోధించేవారు. ఆ విధంగా తప్త హృదయాలపై ఆధ్యాత్మిక అమృత బిందువులను చిలకరించి, వారికి ప్రశాంతతను ప్రసాదించేవారు. అందుకే శ్రీరామకృష్ణులు ఉత్తమ భవరోగ వైద్యునిగా స్తుతులందుకుంటున్నారు.

ఒకసారి మనం 'శ్రీరామకృష్ణ కథామృతం' అనే నవ్వుల పూదోటలో విహరిస్తూ, పారమార్థిక పారిజాత పరిమళాలను ఆఘ్రాణిస్తే 'భవబంధాలను పారద్రోలే పరమదైవం శ్రీరామకృష్ణులు' అని అర్థమవుతుంది. శ్రీరామకృష్ణులు ఆధ్యాత్మిక సందేశాన్ని దృష్టాంతాల ద్వారా ఎంత హృద్యంగా వివరించేవారో తెలుసుకోవడానికి మచ్చుకు కొన్ని పరిమళాలను ఆఘ్రాణిద్దాం:

సమారాధనలో కోలాహలం... సంసారంలో కర్మలు: మనస్సు ఓ కోరికల పుట్ట. ఆ కోరికలను తీర్చుకోవడానికి ఎన్నో కర్మలు చేస్తూ ఉంటాం. "మనం కర్మలు చేస్తున్నంత వరకూ మనస్సులో చింతలు తగ్గవు. చిత్తాన్ని భగవంతుని వైపు మరలిస్తున్నకొద్దీ చింతలు దూరమవుతాయి" అనే ఈ పారమార్థిక పారిజాతాన్ని శ్రీరామకృష్ణులు తన నవ్వుల పూదోటలో ఎలా పూయించారంటే...:

"సమారాధనలో పాల్గొన్న బ్రాహ్మణులు విస్తళ్ళు వేసేవరకు మాట్లాడుతూ ఉంటారు. ఆ సమయంలో అక్కడ ఎంతో కోలాహలంగా ఉంటుంది. పంక్తిలో కూర్చోగానే మాటల శబ్దం కొంత వరకు తగ్గుతుంది; విస్తళ్ళలో భోజనం వడ్డించగానే శబ్దం ఇంకొంత తగ్గిపోతుంది; ఇక భోజనం చేయడం ప్రారంభించగానే చాలా వరకు శబ్దం తగ్గిపోతుంది; చివరగా పెరుగు వడ్డించగానే కేవలం 'జుర్రు జుర్రు' అనే శబ్దం మాత్రమే వినిపిస్తుంది. ఆ తరువాత అంతటా నిశ్శబ్దం ఆవరిస్తుంది. అంటే అందరూ నిద్రలోకి జారుకుంటారు" – ఈ ఉపమానం విన్న భక్తులంతా నవ్వారు. ఈ హాస్య గుళిక భావార్థాన్ని విశ్లేషిస్తే జీవిత పరమార్థం బోధపడుతుంది.

సమారాధనలో పాల్గొన్నవారి కోలాహలం – సంసారంలో కర్మలు చేస్తున్నవారి కష్టాలు; పంక్తిలో కూర్చోవడం – భక్తుల సాంగత్యం; భోజనం చేయడం – భగవత్ కథా శ్రవణం; పెరుగు తింటున్నప్పుడు కేవలం 'జుర్రు' అనే శబ్దం – భగవన్నామస్మరణను ఆస్వాదించడం; నిద్రపోవడం – భక్తిపారవశ్యంలో ఓలలాడడం.


సంసారంలో కర్మలు నిర్వర్తిస్తున్నంత వరకు మనస్సు అల్లకల్లోలంగా ఉంటుంది. సాంసారిక చింతల నుండి శాంతిని పొందాలంటే మొదట సత్సాంగత్యం చేయాలి. దాని ద్వారా భగవత్ కథాశ్రవణం పట్ల ఆసక్తి ఏర్పడుతుంది. ఆ తరువాత భగవన్నామంపై అభిరుచి కలుగుతుంది. భగవన్నామ స్మరణలో నిమగ్నమైన మనస్సు భక్తిపారవశ్యంలో ఓలలాడుతుంది. అలా సంసారం నుండి మనస్సును భగవంతుని వైపు మరలించిన కొద్దీ చింతలు తగ్గుతూ వస్తాయి. చివరికి సంపూర్ణ చిత్తశాంతి చేకూరుతుంది.

యస్త్వాత్మరతిరేవ స్యాత్ ఆత్మతృప్తశ్చ మానవః ।
ఆత్మన్యేవ చ సంతుష్టః తస్య కార్యం న విద్యతే ॥ *(గీత–3.17)*

'ఎవడైతే ఆత్మయందే ప్రీతి కలిగి, ఆత్మయందే సంతృప్తి చెందుతూ, ఆత్మయందే ఆనందాన్ని పొందుతాడో అలాంటి వానికి చేయాల్సిన కార్యం ఏదీ ఉండదు'.

ఆత్మానందాన్ని అనుభవించే వారికి చేయాల్సిన కర్మలు ఏవీ ఉండవంటూ శ్రీకృష్ణుడు బోధించిన ఈ పారమార్థిక పారిజాతాన్ని, హాస్యరసంతో కూడిన ఉపమానంతో పామరులు సైతం అర్థం చేసుకొనేలా శ్రీరామకృష్ణులు అందించారు.

నల్లమందు... భగవన్నామ మధువు: "ఒక్కసారి భగవన్నామ మధువును గ్రోలినవాడు ఆ మత్తును మరలా మరలా పొందాలని



కోరుకుంటాడు" అనే పారమార్థిక పారిజాతం శ్రీరామకృష్ణుల నవ్వుల పూదోటలో ఇలా వికసించింది:

శ్రీరామకృష్ణ కథామృత రచయిత అయిన మహేంద్రనాథ్ గుప్తా కొత్తగా శ్రీరామకృష్ణుల దగ్గరకు రావడం ప్రారంభించాడు. ఒకరోజు శ్రీరామకృష్ణులు తమ గదిలో నరేంద్రుడు, భవనాథ్ మొదలైన యువ భక్తులతో మాట్లాడుతున్నారు. అదే సమయంలో మహేంద్రనాథ్ గదిలోకి ప్రవేశించాడు. అతణ్ణి చూడగానే శ్రీరామకృష్ణులు బిగ్గరగా నవ్వుతూ, 'అదిగో! మళ్ళీ వచ్చాడు' అన్నారు. అతడి రాకను ఓ దృష్టాంతంతో పోలుస్తూ... "ఒకసారి ఓ వ్యక్తి ఒక నెమలికి సరిగ్గా సాయంత్రం నాలుగు గంటలకు నల్లమందు గుళికను ఇచ్చాడు. ఆ నల్లమందు మత్తుకు అలవాటు పడ్డ ఆ నెమలి మరుసటి రోజు సరిగ్గా అదే సమయానికి అక్కడకు వచ్చింది" అని అనగానే అందరూ ఘొల్లున నవ్వారు.

అలా అందరూ నవ్వుతుండగా 'ఎవరైతే ఒక్కసారి భగవన్నామ రుచిని ఆస్వాదిస్తారో అలాంటివారు ఎలాంటి ప్రలోభాలకూ, ఆకర్షణలకూలోనుకారు'అని హనుమంతుని కథను వినిపించారు.

"ఒకసారి హనుమంతుడు, రావణాసురుని భవనంలో ప్రవేశించి, అక్కడ స్ఫటిక స్తంభంలో దాచిపెట్టిన బ్రహ్మాస్త్రాన్ని తీసుకొని పారిపోతున్నాడు. అప్పుడు మండోదరి హనుమంతునికి పళ్ళను ఇస్తే, బ్రహ్మాస్త్రాన్ని వదిలేస్తాడనుకొని అతడికి రకరకాల పళ్ళను ఇచ్చి ప్రలోభపెడుతుంది. కానీ హనుమంతుడు ఆ ప్రలోభాలకు ప్రభావితుడు కాలేదు".

యం లబ్ధ్వా చాపరం లాభం మన్యతే నాధికం తతః ।
యస్మిన్ స్థితో న దుఃఖేన గురుణాఽపి విచాల్యతే ॥ *(గీత-6.22)*

'పరమాత్మ ప్రాప్తిని పొందిన భక్తుడు ఇతరమైనవేవీ ఉన్నతమైనవిగా భావించడు, ఎలాంటి దుఃఖాలకూ చలించడు.'

శ్రీకృష్ణుడు బోధించిన ఈ పారమార్థిక సందేశాన్ని 'భగవన్నామమనే బ్రహ్మాస్త్రం మన వద్ద (యోగస్థితిలో) ఉంటే, ప్రాపంచిక ఆకర్షణలనే ఫలాలు మనల్ని ప్రలోభపరచలేవు' అని శ్రీరామకృష్ణులు తనదైన శైలిలో సరళంగా బోధించారు.

ఆరంభ శూరత్వం... అప్రమత్తత: మనం అధికోత్సాహంతో సాధన ప్రారంభిస్తాం. కానీ కొంత కాలానికి సాధన పట్ల ఆసక్తిని కోల్పోతాం. జపతపాలను అభ్యసించడం మానివేస్తాం. అందువల్ల సాధకులు ఆరంభశూరులు కాకూడదు అంటూ నవ్విస్తూనే హెచ్చరిస్తున్నారు శ్రీరామకృష్ణులు.

"ఒకసారి శ్రీరామకృష్ణులు, నరేంద్రుడితో 'చూడూ! నువ్వు కొత్త పెళ్ళికొడుకులా కాకుండా తరచూ ఇక్కడకు వస్తూ ఉండు' అని అనగానే నరేంద్రుడు, మహేంద్రుడు పగలబడి నవ్వారు". సాధకులు ఆరంభశూరులు కావద్దనీ, నిష్ఠతో సాధనలు చేయాలనీ శ్రీరామకృష్ణుల హితోపదేశం.

సాధకుడు ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని ఈ సందర్భంలో సూచిస్తూ, "రైతు ఎద్దును కొనడానికి సంతకు వెళతాడు. అయితే ఎద్దు చురుకైనదా! కాదా! అని తెలుసుకోవడానికి దాని తోకను పట్టుకొని పరీక్షిస్తాడు. తోక పట్టుకోగానే ఎలాంటి చలనం లేకుండా చల్లగా నేల మీదకు ఒరిగితే అలాంటి ఎద్దును రైతు కొనడు. కానీ ఏ ఎద్దు అయితే తోక పట్టుకోగానే ఎగిరి గంతు వేస్తుందో అది చాలా చురుకైనదని గుర్తించి దాన్ని మాత్రమే రైతు కొంటాడు".

ఆధ్యాత్మిక జీవితంలో ఆదమరిచి ఉంటే అరిషడ్వర్గాలు మనల్ని అధోగతిపాలు చేస్తాయి. మనం భగవంతుని అనుగ్రహం పొందాలంటే సాధన పథంలో సదా అప్రమత్తంగా వ్యవహరించాలి. అందుకే ఆది శంకరాచార్యులు **'ప్రమాదో బ్రహ్మనిష్ఠాయాం న కర్తవ్యః కదాచన...** *(వివేక చూడామణి - 322)* - బ్రహ్మ విచార విషయం (సాధన విషయం)లో అజాగరూకత పనికిరాదు' అని హెచ్చరించారు. ల

సత్సాంగత్యం, భగవన్నామ కీర్తన, జపధ్యానాలను అభ్యసించడం ద్వారా మనస్సు భగవంతుని వైపు మరలుతుందనీ; అప్పుడు సంసార చింతలన్నీ తగ్గి, చిత్తశాంతి లభిస్తుందనీ; ఆత్మానందాన్ని అనుభవించినప్పుడు ప్రాపంచిక ఆకర్షణలు ప్రలోభ పెట్టలేవనీ; ఇంద్రియాల బారిన పడకుండా అప్రమత్తంగా ఉంటే భగవంతుడు ప్రసన్నమవుతాడనీ -ఇలా ఎన్నో పారమార్థిక పారిజాతాల్ని 'కథామృతం' అనే నవ్వుల పూదోటలో శ్రీరామకృష్ణులు వికసింపజేశారు. ఆ పారమార్థిక పారిజాతాలను ఆఘ్రాణిద్దాం. ఆధ్యాత్మిక పథంలో పురోగమించి ఆత్మానందాన్ని పొందుదాం. ❖

ఓ జగన్మాతా! నన్ను రసహీనం, భావశూన్యమైన శుష్క సాధువుగా చేయవద్దు. నా దగ్గరకు వచ్చే జనులకు హాస్యామృతాన్ని పంచి వారిని ఆనందింపజేసేలా ఆశీర్వదించు. -శ్రీరామకృష్ణ



గోరుముద్ద - స్వామి సుప్రియానంద

నమో నమో ప్రభు వాక్య మనాతీత...

మనం శ్రీరామకృష్ణ భక్తులం. ఆయన మనల్ని ఎలా ఆకర్షించారు? ఆయనలో ఏం చూసి మనం ఆకర్షితులమయ్యాం? ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పడానికి ప్రయత్నించినప్పుడు మాటలురావు. అనేక ఆలోచనలు మదిలో మెదలినా ఏ ఒక్క ఆలోచన గట్టిగా నిలబడదు. ఋషులు బ్రహ్మ తత్త్వాన్ని వర్ణించడానికి ప్రయత్నించి చివరికి ఇలా పలికారు: 'అవాంగ్ మానసగోచరం - వాక్కుకూ, మనస్సుకూ అతీతమైనది'.

శ్రీరామకృష్ణుల తత్త్వాన్నీ, గుణగణాల్నీ వర్ణించడం కూడా మన మాటలకూ, ఆలోచనలకూ అందని విషయం. ఆయనను అర్థం చేసుకోవాలంటే మనలోని అజ్ఞానాంధకారం తొలగాలి. అందుకే స్వామి వివేకానంద శ్రీరామకృష్ణ ఆరాత్రికంలో ఇలా స్తుతించారు : "నమో నమో ప్రభు వాక్య మనాతీత... జ్యోతిర జ్యోతి ఉజ్జ్వల హృది కన్దర... - ఓ ప్రభూ రామకృష్ణా! నీవు వాక్కుకూ, మనస్సుకూ అతీతమైనవాడవు. వెలుగులకు వెలుగు నీవు. మా హృదయ కుహరంలో ప్రకాశించే పరంజ్యోతివైన నీవు మా అజ్ఞానాంధకారాన్ని పారద్రోలుము".

శ్రీరామకృష్ణులు హైందవ ధర్మంలోని వివిధ సాధనలు అనుష్ఠించారు. ఆ తరువాత ఇస్లాం, క్రైస్తవ మత సాధనలు కూడా చేసి ఆయా ధర్మాల్లోని సత్యాన్ని సాక్షాత్కరింప జేసుకున్నారు. సర్వధర్మాల సత్యాన్ని అనుభూతి చెందిన తరువాత 'ఎన్ని మతాలో అన్ని మార్గాలు' అని ప్రబోధించారు.

మతం అంటే 'మాటలు' కాదు 'చేతలు' అని సాధన ఆవశ్యకతను చాటిచెప్పారు. 'పువ్వు తన దగ్గర తేనె ఉన్నట్లు ప్రకటించనవసరం లేదని, తుమ్మెదలే ఆ విషయాన్ని స్వయంగా గ్రహిస్తాయ'ని మిడిమిడి జ్ఞానుల మిడిసిపాటుకు స్వస్తి వాక్యాలు పలికారు శ్రీరామకృష్ణులు.

భగవంతుని చేరడానికి 'కర్మ, భక్తి, జ్ఞాన, రాజ యోగాలలో' ఏ ఒక్క యోగం అవలంబించినా ముఖ్యంగా మనకు ఉండవలసినది భగవంతుని పట్ల 'వ్యాకులత' అంటారు శ్రీరామకృష్ణులు. ఇంకా ఎన్నో విషయాలు మనకు అర్థం అయ్యేలా చక్కటి కథలు, ఉదాహరణలు, ఉపమానాలతో వివరించారు మన గురుదేవులు.

ఇవన్నీ ఒక ఎత్తు. ఆయన్ను అర్థం చేసుకోవడం మరొకఎత్తు. అందువలననే శ్రీగురుదేవులు తన సన్నిహిత భక్తులను "మీరు నా గురించి ఏమనుకుంటున్నారు" అని అడిగేవారు.

గురుదేవులు తన దగ్గరకు వచ్చే భక్తుల గురించి మాస్టర్ మహాశయ్ (మ)తో ఇలా అన్నారు:

"ఇక్కడకు వచ్చే భక్తులను రెండు తరగతులుగా విభజించవచ్చు. ఒక తరగతి వారు - 'ఓ పరమేశ్వరా! మమ్ము ఉద్ధరించు' అంటారు. రెండవ తరగతివారు - ఆంతరంగికులు. వీరు ఇలా మాట్లాడరు. వీరు రెండు విషయాలు గ్రహిస్తేనే చాలు. మొదటిది - నేను (శ్రీరామకృష్ణులు) ఎవర్ని? రెండవది - వారెవరు, వారికీ నాకూ ఏమిటి సంబంధం?"

"నువ్వు (మ) ఈ రెండవ కోవకు చెందిన వాడివి."

ఇక్కడ మనం గమనించాల్సిన విషయం - మనం శ్రీరామకృష్ణులకు ఎలా చేరువకాగలమో చెబుతున్నారు. కాబట్టి గురుదేవులతో సన్నిహిత సంబంధం ఏర్పరచుకోవాలి. ఆయన యందు సంపూర్ణ భక్తి ప్రపత్తులు కలిగి ఉండాలి. అప్పుడే శ్రీరామకృష్ణుల ఆంతరంగిక భక్తులుగా పరిగణింపబడతాం. ఆయన కృపకు పాత్రులం కాగలుగుతాం. ❖



యుగాది మన ఉగాది

- డాక్టర్ అపర్ణా శ్రీనివాస్

'యుగస్య ఆది యుగాది' అంటే యుగం ఆరంభమైన మొదటిరోజు యుగాది. యుగాది అనేది సంస్కృతపదం, కాలక్రమేణా అది ఉగాదిగా నామాంతరం చెందింది. కాలప్రయాణం అనంతమైనది, ఆద్యంత రహితమైనది అయినప్పటికీ మన పూర్వీకులు కాలగణనను ఒక నిర్దిష్టమైన మార్గంలో చేశారు. ధర్మం యొక్క నడవడిక ఆధారంగా కృతయుగం, త్రేతాయుగం, ద్వాపరయుగం, కలియుగం అని కాలాన్ని నాలుగు యుగాలుగా విభజించారు. ఈ చతుర్యుగాలను కలిపితే, దానిని ఒక మహాయుగమని అంటాం. ఇలాంటి మహాయుగాలు డెబ్బై ఒక్కటి (71) గడిస్తే, అది ఒక మనువు పరిపాలనా కాలం కిందకు వస్తుంది. దానినే 'మన్వంతరం' అని అంటాం. ఇట్టి మన్వంతరాలు పధ్నాలుగు గడిస్తే, అంటే పధ్నాలుగురు మనువులు (మొత్తం మనువులు పధ్నాలుగు మంది) తమ పాలనాకాలాన్ని పూర్తి చేస్తే, అది బ్రహ్మదేవునికి ఒక పగలుతో సమానం. అంటే సుమారు వేయి మహాయుగాలు (71x14) కలిగి ఉన్నది బ్రహ్మదేవుని పగటి సమయం. ఈ పగలు ఒక కల్పం కాగా, మరొక కల్పం రాత్రి అవుతుంది. రాత్రిలో సృష్టి ఉండదు. ఈ విధంగా పగటిపూట సృష్టి కార్యక్రమాన్ని నిర్వర్తిస్తూ, ఆయన రాత్రిపూట విశ్రమిస్తూ ఉంటాడు. బ్రహ్మదేవుని జీవితకాలం వంద సంవత్సరాలు కాగా ప్రస్తుతం మనం ద్వితీయ పరార్థంలో ఉన్నాం (అంటే ప్రస్తుత బ్రహ్మ జీవిత కాలంలో ద్వితీయభాగంలో ఉన్నామని అర్థం). అందునా శ్వేతవరాహకల్పంలో, సప్తమ మనువైన వైవస్వతుని కాలంలో, 28వ మహాయుగంలో మనం ఉన్నాం. ఈ 28వ మహా యుగంలో, కలియుగంలో, ప్రథమ పాదంలో ఉన్నాం. ఇంకొక మూడు పాదాల కాలపరిమితిని కలిగి ఉంది ప్రస్తుత కలియుగం. (కలియుగం ప్రమాణం 4,32,000 సంవత్సరాలు)

ఈ కాలం సూర్యసంచారాన్ని అనుసరించి, క్షణాలు, నిమిషాలు, గంటలు, పగలు, రాత్రి, పక్షాలు, నెలలు, ఋతువులు, అయనాలు, సంవత్సరాలుగా విభజింపబడింది. మన ఋషులు యజ్ఞయాగాది క్రతువులను, కాలమానం ప్రకారం నిర్వహించేందుకు వీలుగా పంచాంగ నిర్మాణాన్ని చేశారు. దీనికి ప్రధానాంశాలుగా సూర్యుని అయనాలు, ఋతువుల మార్పులు, చంద్రుని వృద్ధి క్షయాలను వారు పరిగణనలోకి తీసుకున్నారు.

తెలుగు సంవత్సరాలైన ప్రభవ, విభవ మొదలైనవి అరవై ఏళ్ళను ఒక కాలచక్రంగా మనవారు పరిగణించారు. ఇలాంటి చక్రాలు కొన్ని వందలసార్లు పరిభ్రమణం చెందితే ఒక యుగం పూర్తి కాగలదు. (కలియుగం 7,200 చక్రాలను కలిగి ఉన్నది)

ఈ విధమైన కాలగణనను కలిగి ఉండి, మొట్టమొదటి సంవత్సరమైన ప్రభవలో, మొట్టమొదటి ఋతువైన వసంతంలో, మొట్టమొదటి మాసమైన చైత్రంలో, మొదటి పక్షమైన శుక్ల పక్షంలో, మొట్టమొదటి రోజైన పాడ్యమిని (ప్రతిపద్) యుగాదిగా అభివర్ణించారు. ఆ తరువాత నుండి ప్రతీ ఏటా మొదటిరోజును ఉగాదిగా జరుపుకోవడం పరిపాటి అయింది. ఇప్పుడు విజయనామ సంవత్సరం వీడ్కోలు తీసు కుంటూ, జయనామ సంవత్సరానికి ఆహ్వానం పలుకుతోంది.


ఈ ఉగాది పండుగనాడు చేయవలసిన ముఖ్యవిధులలో శ్రేయోదాయకమైనవి దైవారాధన, నింబకుసుమ భక్షణం, పంచాంగ పూజ, శ్రవణం, వసంత నవరాత్ర పూజారంభం, ప్రపాదాన ప్రారంభం.

ఉగాది నాడు ప్రారంభించే ప్రతీ పని నిర్విఘ్నంగా కొనసాగు తుందని మనవారి నమ్మకం. మంచి భావనను కలిగి ఉండడ మనేది ప్రధానమైన అంశం. ఒక మంచి సంకల్పం, ఒక మంచి ఆకాంక్ష - ఇవన్నీ భావనలోని వివిధ అంశాలే! ఇవి సత్ప్రభావాన్ని కలుగజేసి, ప్రకృతిని సైతం స్పందింపజేస్తాయి. ఈ సూక్ష్మరహస్యాన్ని గుర్తించిన మన సనాతనులు, మంచిని కోరుకునే దివ్యభావాలను శుభాకాంక్షలనే అద్భుత ప్రక్రియగా మలిచారు. ఇలాంటి శుభ ఆకాంక్షలతో కాలస్వరూపుడైన ఆ పరమాత్ముని ధ్యానిస్తూ, ఈనాటి కార్యక్రమాలను ఆరంభించడం శ్రేయోదాయకం.

నింబ కుసుమ భక్షణమనగా వేపపూవును స్వీకరించడం. దీన్ని షడ్రుచుల సమ్మేళనమైన ఉగాది పచ్చడిలో ఒక భాగంగా తీసుకోవడం మన సంప్రదాయం. మన పెద్దలు ఆరు రుచులను,

(మిగతా 12వ పేజీలో...)

శాస్త్రాలు అనంతములు. తెలుసుకోవలసినవి సముద్రమంత లోతైనవి. కాలము స్వల్పం. విఘ్నాలు అనేకం. కావున సారభూతమైన వాటినే తెలుసుకోవడానికి ప్రయత్నించాలి. - ఉత్తరగీత



పలికెడిది భాగవతం

నిగమములు వేయి చదివినా...

- స్వామి జ్ఞానదానంద

వేదరాశినంతా విభజించి... విశేషంగా మహాభారత రచనను ముగించి...సరస్వతీ నదీతీరాన బదరికాశ్రమంలో ఏకాంతంగా సేదతీరుతున్నారు వ్యాసమహర్షి. ఇన్ని వేదాలు రాశిగా పోసినా, ఇంత భారతాన్ని ఆసక్తిగా రాసినా, ఇంకా ఏదో అసంతృప్తి ఆ మహాత్ముడి మనస్సును తొలిచేస్తూ ఉంది. మానవజాతికి ముక్తిని ప్రసాదించే మహాకావ్యం ఇంకేదో మిగిలిపోయిందని అనిపించింది. 'విశిష్ట వ్రతాలెన్నో చేశాను, వేదాలు విభజించాను, అగ్నులను అర్చించాను, ఆచార్యులను ఆదరించాను, పంచమ వేదాన్నీ పరిచయం చేశాను; మరి ఇంత చేసినా నా అంతరాత్మ అసంతుష్టికి కారణమేమిటో అర్థం కావడం లేదు' అని ఆ పరాశరాత్మజుడు పరివేదన చెందుతున్నాడు.

వ్యాసుడు ఇలా వ్యాకులపడుతున్న వేళలో శాస్త్రపురాణ విశారదుడూ, హరినామ సంకీర్తనా ధురంధరుడు నారదుడు వేంచేశాడు. సహజ మధుర మందహాస సుందర వదనారవిందంతో, చేతిలోని మహతీ విపంచిని మీటుతూ 'అన్ని శాస్త్రాలూ తెలిసినవాడివి, అరిషడ్వర్గాలను జయించినవాడివి, వినయసంపన్నుడవు; నీకు విచారమెందుకు?' అని వ్యాసుణ్ణి నారదుడు ప్రశ్నించాడు. అప్పుడు ఆ మహర్షి తన మనోవ్యధను నారదుడి ముందుంచాడు.

ముని మాటలు విన్న ఆ త్రిలోకసంచారి, 'వ్యాసా! నీవు అశేషాలైన ధర్మవిశేషాలన్నీ వెల్లడించావు. కానీ వేదాల్లో కానీ, వేరెక్కడా కానీ వాసుదేవుని గుణవిశేషాలను వర్ణించలేదు; వినుతించలేదు. ఎన్ని ధర్మాలు విస్తరించి చెప్పినా భగవంతుడు సంతసించడు; ఆయన సంతోషించేది భక్తి కథలకే!' అన్నాడు. హరినామ సంకీర్తనతో ప్రకాశించే కావ్యం స్వర్ణకమలాలతో, కలహంస పంక్తులతో శోభాయమానమైన మానస సరోవరంలా విరాజిల్లుతుంది. ఆ శ్రీహరినామ సంకీర్తన లేని కావ్యం ఎన్ని శబ్దార్థాలతో కూడినా, దుర్గంధభూయిష్ఠమై, కాకులు మూగిన బురదగుంటలాంటిదని నారదుడు విస్పష్టం చేశాడు.

జ్ఞాన వాచా కర్మ కౌశలంబులు దేనికి?: ఆగామి కాలంలో మనిషి ఆలోచనలన్నీ ఏ వైపునకు పరుగులు తీస్తాయో నారద మహర్షి తన దార్శనికతతో ముందే వీక్షించాడు. కామ్యకర్మల కాసారంలో కొట్టుకుపోయే మానవులకు వాటిని సాధించుకునే సూత్రాలేవీ కొత్తగా చెప్పక్కరలేదనీ, ప్రపంచమే శాశ్వతమనుకొని పరమార్థాన్ని మరచిపోతున్న వారికి యుక్తులు, కుయుక్తులు పనిగట్టుకొని నేర్పాల్సిన అవసరం లేదనీ వివరించాడు. ఆ నారదబ్రహ్మ చెప్పినట్లు కలియుగంలో మనుషులకు బతకడమెలాగో బోధించాల్సిన పని లేదు. తనది కానిదాన్ని దోచుకోవడంలో... దోచుకుంది దాచుకోవడంలో ధృతరాష్ట్ర పుత్రుల కన్నా నేటి సమాజంలో చాలామంది నాలుగు ఆకులు ఎక్కువే చదువుకున్నారు; పన్నాగాలు పన్నడంలో, పక్కవారిని పడగొట్టే ప్రయత్నాల్లో శకునికి కూడా సూచనలిచ్చే స్థాయికి చేరుకున్నారు. చేతిలో పాచికలు లేకపోయినా, ఎదుటివారిని ముగ్గులో దింపి మాయ చేసే మంత్రజాలాన్ని నేర్చుకున్నారు. ఇలా లౌకిక విద్యల్లో అనతికాలంలోనే ఆరితేరుతున్నారు. ఈ ప్రయాసలో పారమార్థిక పయనాన్ని విస్మరిస్తున్నారు. ఇలాంటి స్థితిలో కేవలం శాస్త్రాధ్యయనాలు, తర్కవితర్కాలు, వాదోప వాదాలు ప్రయోజనాన్ని ఇవ్వవు. మనం గర్వపడుతున్న ఈ జ్ఞానం, వాక్చాతుర్యం, కర్మకలాప కౌశలాలు పెద్దగా మనకు లబ్ధినివ్వవు. ఏదో ఈ ప్రపంచంలో కొన్నాళ్ళు వేనోళ్ళ పొగిడించుకోవచ్చు, భోగభాగ్యాల్లో తులతూగిపోవచ్చు, అధికారాలను అనుభవించ వచ్చు! అయితే లౌకిక ప్రజ్ఞాపాటవాలను పక్కన పెట్టి, పరమాత్ముడి వైపు ప్రయాణించే మార్గాన్ని నిర్దేశించేదే నిజమైన పరిజ్ఞానం. అదే భావనతో శ్రీమద్భాగవత పఠన ప్రాధాన్యాన్ని శౌనకాది మునులకు వివరిస్తూ సూత మహర్షి...

నిగమములు వేయు చదివిన
సుగమంబులు కావు ముక్తి సుభగత్వంబుల్
సుగమంబు భాగవతమను
నిగమంబు పఠింప ముక్తినివసనము బుధా!

'వేలకొద్దీ వేదాలు వల్లించినా మోక్షసౌభాగ్యాలు సంప్రాప్తించవు. భాగవతమనే ఆమ్నాయాన్ని అధ్యయనం చేస్తే కైవల్యం కరతలామలకమవుతుంద'ని పునరుద్ఘాటిస్తాడు.

హరినే భావిస్తూ, కీర్తిస్తూ...: ఆ భగవంతుడే ఈ బ్రహ్మమానస పుత్రుడైన నారదుడి రూపంలో వచ్చి తనకు కర్తవ్యాన్ని గుర్తు చేశాడని వ్యాసుడు నిశ్చయించుకున్నాడు. నారదుడి ద్వారా విన్న నవనీతచోరుడి గుణవిశేషాల్ని భాగవత కథాగానంగా వినిపించాడు. భక్తికి కాలమానాలతో సంబంధం లేదని నిరూపించాడు. అందుకే శ్రీమద్భాగవతంలోని ఏ ఘట్టాన్ని చదివినా, విన్నా, స్మరించుకున్నా నవ్యాతినవ్యంగానే తోస్తాయి. భక్తిలో, భగవంతుడిలో ఉండే మాధుర్యమే అది!

అందుకే 'శ్రీరామకృష్ణుల కథామృతా'న్ని మధురకావ్యంగా రచించిన మహాపురుషులు మహేంద్రనాథ్ గుప్తా ఓ సందర్భంలో భగవాన్ శ్రీరామకృష్ణులతో జరిగిన సంభాషణలనూ, పంచుకున్న అనుభూతులనూ స్మరించుకుంటూ '...ఈ సంఘటనలు ఎన్నో ఏళ్ళకు పూర్వం జరిగినట్లు ప్రజలంతా భావిస్తున్నారు. కానీ నిజానికి నేను వాటిని నా కళ్ళ ముందే చూస్తున్నాను. అవన్నీ ఇదిగో ఈ క్షణం, ఇప్పుడే జరుగుతున్నట్లు అనిపిస్తూ ఉంది. ధ్యానంలో కాల అగాధం కరిగిపోతుంది. భక్తిలో, ప్రేమలో ఉండడమంటే 'శాశ్వత వర్తమానకాలం' సాన్నిధ్యంలో ఉండడం; అక్కడ భూతకాలానికి కానీ, భవిష్యత్ కాలానికి కానీ ఎటువంటి సంబంధమూ లేదు' అంటారు. ఇలా ఆ భగవంతుడి భావంలోనే గడపడాన్ని మించిన అమృతత్వం మరోటి లేదు. ఆ పరంపరలో పోతనామాత్యులు కూడా భాగవత ఘట్టాలను తెనిగించే ప్రయత్నంలో ఎన్నో దర్శనాలను గాంచారు; తన జన్మకు సార్థకతనిచ్చేది శ్రీమద్భాగవత రచనేనని రూఢి పరచుకున్నారు. వీరభద్రవిజయం, నారాయణ శతకం, భోగినీదండకం తదితర ఇతర గ్రంథాలు ఎన్ని రచించినా భాగవతాన్ని ఆంధ్రీకరించడమే తన జీవితలక్ష్యం చేసుకున్నారు. అలాంటి పోతన సుమధురశైలికి పరవశులైన అభిమానులు...

అచ్చపు జుంటి తేనియల, నైక్షవఖండ సుధారసాల గో
ర్వెచ్చని పాలమీగడల, విచ్చెడి కన్నెగులాబి మొగ్గలన్
మచ్చరికించు ఈ మధుర మంజుల మోహనముగ్ధశైలి నీ
వెచ్చట నేర్చినావు? సుకవీ, సుకవిత్వ కళానిధీ!...అంటూ

ప్రస్తుతించారు. కవిత్వమనే చిక్కని ఆవుపాలలో భక్తి అనే చక్కని పంచదార కలిపి మధురాతి మధురమైన పాకం చేసి మహాభాగవత రసాయనాన్ని మాకందించావు; సుమధుర సుగంధాలు గుబాళిస్తూ మల్లెలూ, సన్నజాజులూ కలబోసి మాలలు కట్టినట్లున్న ఇలాంటి పద్యాలు రాయటం ఎక్కడ నేర్చావయ్యా? అని ప్రశ్నించి పులకించిపోయారు.

సంశయాల్లో...సంకటాల్లో: భగవాన్ శ్రీరామకృష్ణ పరమహంస భక్తినీ, భగవత్ ప్రేమనూ పెంపొందించలేని జ్ఞానం నిరర్థకమనేవారు. 'నానా శాస్త్రాలను అధ్యయనం చేయడం వల్ల ఏ ప్రయోజనమూ లేదు. షడ్దర్శనాలను ఆసాంతం అధ్యయనం చేసినా కూడా ఏ ఫలితమూ ఉండదు. ఏకాంతంలో గోప్యంగా భగవంతుణ్ణి ప్రార్థించు. నీకు అవసరమైనదంతా ఆయనే ప్రసాదిస్తాడు' అంటారు. ఈ ప్రపంచంలో ఏ జ్ఞానసంపత్తి అయినా మనలోని సంశయాల్ని పూర్తిగా నివృత్తి చేయలేదు. పైగా ఎంతో జ్ఞానాన్ని సముపార్జించామన్న అహంకారాన్ని పెంచుతుంది. అందుకే ప్రాజ్ఞుడైనవాడు ఈ నిరర్థకమైన ప్రాపంచిక పరిజ్ఞానానికి పొంగిపోడు. కేవలం అవివేకి మాత్రమే ఈ మిడిమిడి జ్ఞానానికి మిడిసిపడుతూ ఉంటాడు. ఆ భగవంతుడికి సంబంధించినదే అసలైన జ్ఞానం! అందుకే సంశయాలు తీరాలన్నా, సంకటాలు వీడాలన్నా ఆ శ్రీహరి చరణ సేవాపరాయణుడు కావడమొక్కటే మార్గమని వ్యాసుడికి నారద మహర్షి స్పష్టం చేశాడు. కష్టమైనా సుఖమైనా పరమాత్ముడి పాదాలను మాత్రం విడిచిపెట్టవద్దని హితవు పలికాడు. పుణ్యశ్లోకుడైన పురుషోత్తముణ్ణి స్తుతిస్తే మానవుని జ్ఞానానికీ, అధ్యయనానికీ, ఔదార్యానికీ, అనుష్ఠానానికీ, ధైర్యానికీ, సంపదకూ కొదవే లేదంటాడు. ఇలా భాగవతరూపంలో భగవంతుణ్ణి స్మరించుకుంటే అజ్ఞాని కూడా మహాజ్ఞానిగా మారతాడని నారదుడు అభయమిస్తాడు. అందుకే ధూర్జటి కూడా ఆ మహాదేవుడైన శ్రీకాళహస్తీశ్వరుడిని కీర్తిస్తూ...

పరిశీలించితి మంత్రతంత్రములు చెప్పన్వింటి సాంఖ్యాది యో
గ రహస్యంబులు, వేదశాస్త్రములు వక్కాణించితిన్, శంక వో
దరయం గుమ్మడికాయలోని యవగింజంతైన, నమ్మించి, సు
స్థిర విజ్ఞానము త్రోవ చెప్పగదవే శ్రీకాళహస్తీశ్వరా!...

'శ్రీకాళహస్తీశ్వరా! నేను మంత్రతంత్రాలను పరిశీలించి చూశాను; సాంఖ్యం తదితర యోగాలలో ఉన్న రహస్యాలను గురించి చెప్పగా విన్నాను. వేదాలను, శాస్త్రాలను చక్కగా నేర్చుకున్నాను. అయినా గుమ్మడి కాయంత నా అనుమానంలో ఆవగింజంతైనా తీరలేదు. శంకరా! నాకు నీవే నమ్మకం కలిగించి, నా అనుమానాలను పోగొట్టి విజ్ఞానమార్గాన్ని చూపించు తండ్రీ!' అని వేడుకుంటాడు. ❖

పవిత్రమైన శ్రీహరి చరిత్రతో కూడిన కావ్యాలు సకల పాపాలనూ పటాపంచలు చేస్తాయి. అందుకే సజ్జనులైన తపోధనులు ఆ శ్రీహరి లీలల్ని నిరతమూ గానం చేస్తూ, ఆయన నామాన్ని జపిస్తూ, ఆయన కథల్ని వింటూ జన్మ సార్థకం చేసుకుంటున్నారు.

భక్తి లేని జ్ఞానం, వాక్కు, కర్మ ఎంత గొప్పవైనా నిరర్థకాలే! - నారదుడు

ధర్మ శాస్త్రాలు భగవంతుణ్ణి పొందే మార్గాన్ని మాత్రమే సూచిస్తాయి. మార్గాన్ని తెలుసుకున్నాక శాస్త్రాలతో పనేముంది? కాబట్టి ఏకాంతంలో సాధన చేయడమే మన కర్తవ్యం. - శ్రీరామకృష్ణ

మన సంస్కృతి

- స్వామి హర్షానంద

"ఒక వ్యక్తి తనను తాను అసహ్యించుకొంటున్నట్లయితే అదే పతనానికి హేతువు. పూర్వీకుల చరిత్రను అవమానకరంగా భావిస్తే, ఆ జాతి అంతానికి చేరుకున్నట్లే!" అంటారు స్వామి వివేకానంద. గత వైభవాన్ని మర్చిపోయినంత కాలం మనమూ, మన దేశం స్తబ్ధతలో మునిగిపోతాం. అందుకే, మన ప్రాచీన సంస్కృతి గురించి తెలుసుకోవాలి. గడచిపోయిన సంగతులు తెలుసుకొంటూ, భవిష్యత్ మహత్కార్యాల సాధన వైపు నడవాలి. మన ప్రాచీన భారతీయ సంస్కృతిని గుర్తు చేసేందుకు చేస్తున్న ప్రయత్నమే ఈ వ్యాసాల పరంపర. సుప్రసిద్ధ రచయిత, బెంగుళూరు రామకృష్ణ మఠం అధ్యక్షులు స్వామి హర్షానంద మహరాజ్ మధ్యయుగాల కాలం దాకా విలసిల్లిన మన సంస్కృతిని 'శ్రీరామకృష్ణ ప్రభ' పాఠకులకు 2014 ఫిబ్రవరి సంచిక నుండి వివరిస్తున్నారు.

మతం - తాత్త్వికత

ఆధ్యాత్మిక విద్యే మతం: హిందూ సంస్కృతిలో ఆధ్యాత్మ విద్యే నిజమైన మతం. స్వామి వివేకానందుల ఆసక్తికరమైన మాటలలో:

'హిందువు అన్ని పనులు మతపరంగా నిర్వహిస్తాడు. అతను మతపరంగా ఆహారం తీసుకొంటాడు, నిద్రిస్తాడు. మతపరంగా నిద్ర లేస్తాడు. మతపరంగా మంచి పనులు చేస్తాడు. అంతేకాక మతపరంగానే చెడు పనులు కూడా చేస్తాడు!'

స్వామీజీ సిద్ధాంతం ప్రకారం మతమంటే కొన్ని విశ్వాసాలు లేక ఆచారాల సముదాయం కాదు. ప్రతి ఒక్కరిలోని దివ్యత్వాన్ని అనుభవంలోకి తెచ్చుకోవడమే నిజమైన మతం. ఈ దాగివున్న దివ్యత్వాన్ని ప్రకటించేందుకు దోహదపడే విషయాలన్నీ కూడ మతాలే. దీనినే 'అధ్యాత్మ విద్య' లేక 'ఆత్మవిద్య' అని అంటారు.

మతానికి రెండు కోణాలు: దర్శనాలు - యోగాలు

ఆధ్యాత్మిక విద్యలో రెండు భాగాలున్నాయి - శాస్త్రం, అనుష్ఠానం. శాస్త్ర విచారం ద్వారా అనేక రకాలైన దర్శనాలు ఆవిర్భవించాయి. ఈ దర్శనాల అనుష్ఠానం నుండి అనేక రకాల సాధనలు లేక యోగాలు ఆచరణలోకి వచ్చాయి.

హైందవ తత్వంలో షడ్దర్శనాలు ప్రఖ్యాతి వహించాయి. అవి గౌతముని న్యాయ, కానదుని వైశేషిక, కపిలుని సాంఖ్యం, పతంజలి యోగం, జైమిని మీమాంస, బాదరాయణుని వేదాంతాలు.

న్యాయ వైశేషికాలు పరమాత్మ (దైవం) శాశ్వతమైన అణువుల నుండి ప్రపంచాన్ని సృష్టించాడని ప్రతిపాదిస్తాయి. పూర్వసృష్టిలో అనుభవింపబడని జీవుల అదృష్టం, భావి జీవితాలను నిర్ణయిస్తుంది. అణువుల కలయిక సృష్టికి, విడిపోవడం ప్రళయానికి కారణాలు. జీవుడు తాను శాశ్వతుడననీ, మనస్సు, ఇంద్రియాలు, శరీరం కన్నా వేరనీ తెలియకపోవడం చేత పునర్జన్మతో బంధితుడవుతున్నాడు. అతనికి మోక్షం లేక ముక్తి అన్నది తత్త్వజ్ఞానంతో కలుగుతుంది. తత్త్వజ్ఞానం శాస్త్ర ప్రబోధిత సత్యాలను, శ్రవణ, మనన, నిధిధ్యాసనల ద్వారా తెలుసుకోవడం వల్ల కలుగుతుంది.


కపిలుని సాంఖ్యం, పతంజలి యోగశాస్త్రం ఒకదానినొకటి సమర్థిస్తాయి. ప్రకృతి (జడ పంచభూతాలు), పురుష (జీవాత్మల) సాంగత్యం ప్రపంచంగా పరిణమిస్తుంది. సృష్టి కేవలం జీవాత్మ ఆధ్యాత్మిక పురోభివృద్ధికీ, మోక్షానికీ ఉద్దేశితమైనది. పంచ భూతాలు (నేల, నీరు, నిప్పు, గాలి, ఆకాశాలు) ప్రకృతి జాతాలు. ప్రపంచం వాటి పంచీకరణం వల్ల సృష్టి అవుతోంది. స్వతహాగా పురుషుడు ప్రకృతి కన్నా భిన్నుడైనప్పటికీ ప్రకృతితో బంధానికి లోనవుతున్నాడు. బంధం వల్ల సంసారంలో చిక్కుకొని జన్మ పరంపరలకు లోనవుతున్నాడు. వివేక ఖ్యాతి (వివేక-వైరాగ్యాలు)తో వైరాగ్యాన్ని పొంది అష్టాంగ యోగ సహాయంతో అతను మోక్షాన్ని పొందుతున్నాడు.

జైమినీ మీమాంస సిద్ధాంతం జడమైన ప్రకృతి, స్వయంగా ఈ ప్రపంచంగా, జీవుల ప్రారబ్ధ కర్మతో (జీవులు అనుభవించని పూర్వజన్మ కర్మలు) సృష్టితమవుతున్నాయని ప్రతిపాదిస్తోంది. వారి మోక్షం (దుఃఖం నుండి శాశ్వత విముక్తి) మీమాంస శాస్త్ర కర్మాచరణ (నైతిక ఆచారాలు) ద్వారా కలుగుతుందని వివరించింది.

బాదరాయణుడి (వ్యాసమహర్షి) వేదాంత దర్శనం ప్రకారం పరబ్రహ్మం ఈ ప్రపంచాన్ని తన నుంచి సృష్టించి, పోషించి, లయింప చేస్తుందని, ఇది సాలె పురుగు వల అల్లడం, లేక అగ్ని నుండి నిప్పుకణికలు వెలువడడం లాంటిదని ప్రతిపాదించారు. పర్యవసానంగా ఉన్నదంతా బ్రహ్మమే! బ్రహ్మ కానిది ఏదీ లేదు. జీవుడు స్వరూప జ్ఞానం వల్ల, భక్తి వల్ల మోక్షం పొందగలుగుతాడు.

అనుష్ఠానపరమైన నాలుగు యోగాలు: కర్మ, భక్తి, జ్ఞాన రాజయోగాలు. యోగాలు మనస్సును శుద్ధి చేసి ఆత్మజ్ఞానానికి దోహదపడతాయి. కర్మఫలాన్ని ఆశించకుండా, అహంకార

రహితంగా కర్మలను చేయడం – కర్మయోగం. ఈశ్వర శరణాగతి పొంది ఆయన అనుగ్రహంతో ఆత్మసాక్షాత్కారాన్ని పొందడం – భక్తిమార్గం. ఆత్మవిచారం సాగించి జీవుడు స్వస్వరూప జ్ఞానం పొందడం – జ్ఞానయోగం. అష్టాంగ యోగాన్ని ఆచరించి సమాధి స్థితిలో ఆత్మజ్ఞానాన్ని పొందే మార్గం – రాజయోగం.



పైన చెప్పిన తత్త్వపరమైన షడ్దర్శనాలు – అనుష్ఠానపరమైన నాలుగు యోగాలు కూడా వేదాలు, ఉపనిషత్తులు, భగవద్గీత ఆధారంగా చెప్పబడిన మార్గాలే అన్నది గుర్తుంచుకోవాలి.

సామాన్య ధర్మాలు లేక నైతిక విలువలు: తాత్విక దర్శనాలు, అనుష్ఠాన యోగాలు రెండూ వ్యక్తి జీవితంలో నైతిక విలువల ప్రాముఖ్యాన్ని, వాటి ద్వారా సామాజిక సామరస్యాన్ని బోధించాయి. వీటి ద్వారా త్వరిత ఆధ్యాత్మిక పురోగతి కలుగుతుంది. అవి అహింస, సత్య, అస్తేయ, దాన, శాంతి, దమ (ఇంద్రియ నియంత్రణం), శమ (మనోనిగ్రహం), అకార్పణ్య (ఆత్మ నింద లేకుండడం), శౌచ, తపాలు.

నాలుగు పురుషార్థాలు: ధర్మ, అర్థ, కామ, మోక్షాలనే ఈ నాలుగింటినీ పురుషార్థాలని పేర్కొన్నారు. మోక్షం అంతిమ పురుషార్థమైనా, అధ్యాత్మ విద్యను బోధించే శ్రుతులు మిగిలిన పురుషార్థాలను అలక్ష్యం చేయలేదు. అవి అర్థకామాదులు. అయితే అవి ధర్మబద్ధంగా ఉండి ధర్మాన్ని అతిక్రమించ కూడదు. ధర్మాధర్మాల నిర్ణయం శాస్త్రాలు, మహాత్ములు చేస్తారు. ధర్మాచరణలో మోక్షం అంతిమ లక్ష్యం.

గురువు: భారతీయ మత, తాత్త్విక గ్రంథాలన్నీ మిగతా విద్యల లాగే అధ్యాత్మ విద్య కూడా గురువు లేకుండా సాధ్యపడదనే విషయాన్ని పలుమార్లు చెప్పాయి.

సద్గురుని లక్షణాలు – శ్రోత్రియుడు, బ్రహ్మనిష్ఠుడు, కిల్బిష రహితుడు, ఆశ్రిత ముముక్షువుల పట్ల కరుణ. శిష్యుడి లక్షణాలు – వినయం, ముముక్షత్వం, గురుశుశ్రూష ఎడల ఆసక్తి. శిష్యుడు ఆధ్యాత్మిక పురోగతి చెందిన తరువాత తాను తెలుసుకొన్న విషయాలను ఇతరులకు బోధించి మానవాళి కోసం సంప్రదాయాన్ని కాపాడాలి.

పై వివరాల మూలంగా భారతీయ శ్రుతులు మోక్షాన్ని అంతిమ లక్ష్యంగా బోధించినా సాంఘిక విషయాలను నిర్లక్ష్యం చేయలేదు అన్న విషయం స్పష్టమవుతోంది. ఇది భారతీయ సంస్కృతి విశిష్ట లక్షణం. ❖ **అనువాదం: డాక్టర్ పి.వి.రెడ్డి**

ధర్మమే సమాజాన్ని నడిపిస్తుంది. ధర్మం వల్లనే అర్థకామములు కలుగుతాయి. అలాంటి ధర్మమును ఆచరించమని చేతులెత్తి ఆక్రోశిస్తున్నాను. కానీ నా ఆక్రోశాన్ని ఎవరూ వినడం లేదు. - వ్యాసమహర్షి

(...7వ పేజీ తరువాయి)
'మధురామ్ల లవణ తిక్తకటు కషాయాః' అని అభివర్ణించారు. ఆయుర్వేదశాస్త్రం ప్రకారం ఒక్కొక్క రుచికి ఒక్కొక్క ఆరోగ్యపు విలువ ఉంది. అందువల్ల సంవత్సరారంభంలో, ఈ ఆరు రుచుల సమ్మేళనమైన దాన్ని ఒక లేహ్యంగా తయారుచేసి, భగవదర్పితం చేసి, ప్రసాదంగా స్వీకరించడమనేది సంప్రదాయంగా వస్తూ ఉంది. ఇందులో మధురం (బెల్లం), ఆమ్లం (మామిడికాయ), లవణం (ఉప్పు), తిక్తం (వేపపూవు), కటు (పచ్చి మిర్చి), కషాయం (మిరియం). వివిధ ప్రాంతాలలో ఈ తయారీ విధానంలో తేడాలున్నా, వేపపూవు వినియోగం ప్రధానంగా అంతటా కనిపిస్తుంది. జీవితమంటే అన్ని రకాల అనుభవాలు, అనుభూతులుంటాయనే సత్యాన్ని బోధిస్తూనే, ఆరోగ్యాన్ని చేకూరుస్తుంది ఈ ఉగాది పచ్చడి.

ఇక పంచాంగం విషయాన్ని ప్రస్తావిస్తే, అది అనంతకాలాన్ని సంవత్సరం అనే కొలమానంతో గణించి, అందులో గ్రహ, నక్షత్రాల సంచారాన్నీ, వాటి ఫలితాలను మనకు తెలియజేస్తుంది. పంచాంగం అంటే ఐదు అంగాలు కలది. ఇవి – తిథి, వారం, నక్షత్రం, యోగం, కరణం. ఇందులో తిథి, కాలస్వరూపుడైన ఆ జగన్నాథుని నివాసంగా, ఒక గ్రహంపై ఆ దైవాన్ని సేవిస్తూ ప్రదక్షిణ చేసే దినాన్ని వారంగానూ, క్షతం కాకుండా రక్షించేది నక్షత్రంగానూ, చంద్రుడు నక్షత్రంలో ఉండే కాలాన్ని యోగంగా, సాధనలో కార్యసాఫల్యాన్ని కలిగించేది కరణంగా చెప్పబడింది. అందువల్ల కాలస్వరూపుడైన ఆ పరమాత్ముని పంచాంగం రూపేణా పూజించి, అందులోని వివరాలను శ్రవణం చేయడం సంప్రదాయం.

చైత్ర శుద్ధ పాడ్యమి నుండి నవమి వరకు, వసంత నవ రాత్రులుగా వ్యవహరిస్తాం. ఈ వసంత నవరాత్రులు శ్రీరాముని ఆరాధనకూ, శక్తి ఆరాధనకూ విశిష్టమైన కాలంగా, వీటి ప్రాముఖ్యాన్ని తెలియజేస్తూ వివిధ గ్రంథాలలో ప్రస్తావితమైంది.

ప్రాణికోటిని తృప్తిపరచడమనేది మన సంస్కృతిలోని ప్రధానాంశం. అందువల్ల ఉగాది నాటి నుండి నాలుగు నెలల కాలం పాటు బాటసారులకు, సర్వప్రాణులకు ఉష్ణశాంతినీ, దాహశాంతినీ తీర్చేందుకు చలివేంద్రాలను ఏర్పాటు చేయాలని మన శాస్త్రాలు తెలియజేస్తున్నాయి. దీనినే ప్రపాదానం అని కూడా వ్యవహరిస్తారు. మన సంస్కృతిలో సాటి మనిషికి (ప్రాణికి), సాయం, సేవ అనే ముఖ్యాంశాలకు ప్రాధాన్యాన్నిచ్చారు. కాబట్టి అవకాశమున్న వారు తప్పకుండా దీన్ని ఆచరణలో పెట్టేందుకు ప్రయత్నించాలి.

ఈ 'జయ'నామ సంవత్సరమంతా, శుభప్రదంగా జరగాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తూ, శుభసంకల్పాలతో, సత్కార్యాచరణతో నాందిని పలుకుతూ, హృదయపూర్వకంగా ఆహ్వానిద్దాం. ❖

(మార్చి 31, సోమవారం - జయనామ సంవత్సరాది)

పేద విద్యార్థులకు ఉచిత వసతి గృహం


రామకృష్ణ మిషన్ ఉన్నత పాఠశాల

విజయవాడ, రామకృష్ణ మిషన్ సీతానగరంలో రామకృష్ణ మిషన్ ఉన్నత పాఠశాలను (6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు – తెలుగు మాధ్యమం) నిర్వహిస్తోంది. బాగా చదువుతున్న బీద విద్యార్థుల కోసం ఉచిత బాలుర వసతి గృహాన్ని కూడా నిర్వహిస్తోంది.

ఈ వసతి గృహంలో 5వ తరగతి ఉత్తీర్ణులై 6వ తరగతిలో చేరే బాలురకు మాత్రమే ప్రవేశం లభిస్తుంది. 2014–2015 విద్యాసంవత్సరానికి 6వ తరగతిలో ప్రవేశం పొందగోరేవారు అభ్యర్థన పత్రం (ఫోన్/సెల్ నంబరుతో సహా) మరియు చిరునామాతో 9"×6" సైజు ఉన్న ఖాళీ కవరును (తగినన్ని పోస్టల్ స్టాంపులు అతికించి) **2014 ఏప్రిల్ 16వ తేదీ** లోగా ఈ క్రింది చిరునామాకు పంపి దరఖాస్తులను పొందవచ్చును.

ప్రవేశపరీక్ష 5వ తరగతి పాఠ్యాంశాలపై ఉంటుంది. దరఖాస్తులను పరిశీలించి, ఎంపిక చేసిన విద్యార్థులకు మే నెల రెండవ వారంలో వ్రాత పరీక్ష నిర్వహించబడుతుంది.

ఎంపికైన విద్యార్థులకు పరీక్ష నిర్వహించే తేదీ పోస్ట్ ద్వారా తెలియపరుస్తాం. ప్రవేశ, మౌఖిక పరీక్షల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులకు ఇంటర్వ్యూ నిర్వహించి సీతానగరం రామకృష్ణ మిషన్ ఉన్నత పాఠశాలలోనూ, ఉచిత బాలుర వసతి గృహంలోనూ ప్రవేశం కల్పించబడుతుంది. వసతి గృహంలో ప్రవేశంపై తుది నిర్ణయం రామకృష్ణ మిషన్, సీతానగరం యాజమాన్యం వారిదే.

స్వామి శశికాంతానంద
కార్యదర్శి

వివరాలకు: **రామకృష్ణ మిషన్**
సీతానగరం, తాడేపల్లి (పోస్ట్ & మండలం)
గుంటూరు జిల్లా-522 501.
ఫోన్: 08645 - 272248, 272656



నానాటి బతుకు నాటకము...

– శ్రీమతి బి.కృష్ణకుమారి

అన్నమయ్య పదామృతం

> **నానాటి బతుకు నాటకము**
> **కానక కన్నది కైవల్యము**
>
> **పుట్టుటయు నిజము పోవుటయు నిజము**
> **నట్టనడిమి పని నాటకము**
> **యెట్టనెదుట గలదీ ప్రపంచము**
> **కట్టకడపటిది కైవల్యము**
>
> **కుడిచే దన్నము కోక చుట్టెటిది**
> **నడు మంత్రపు పని నాటకము**
> **వొడి గట్టుకొనిన వుభయ కర్మములు**
> **గడి దాటినపుడే కైవల్యము**
>
> **తెగదు పాపము తీరదు పుణ్యము**
> **నగి నగి కాలము నాటకము**
> **యెగువనె శ్రీవేంకటేశ్వరు డేలిక**
> **గగనము మీదిది కైవల్యము**

ఆయువనే చమురు అందినంత కాలం ప్రకాశంగా వెలిగి ఆనక ఆరిపోయేమట్టిదీపాలు...అనుబంధాల అప్పులు తీరేంత వరకు ఆశల ఆకాశంలో ఎగిరి, చివరకు కట్టెల కొమ్మపై ఒరిగే మూగపావురాలు...మన ప్రాణాలు! పాత్రలు కూడా పసిగట్టలేని రీతిలో కలవనివాటిని కలిపి... కలిసిన వాటిని విడదీసి వింతైన మలుపులతో ముగింపు పలుకుతున్న జీవనచిత్రాలు మనవి. నీడను తడిమి నిజమేనని భ్రమపడి, ఆత్మీయతతో ఆలింగనం చేసుకున్నట్లు, నాటకం లాంటి బతుకును కూడా వాస్తవమని నమ్మి, దానిపై వెర్రి మమకారాన్ని పెంచుకుంటున్నాం; పోషించేది పాత్ర అన్న విషయాన్ని కూడా మరచి, అవసరాన్ని మించి అందులో లీనమైపోతున్నాం. తోటి నటీనటులతో తీరని బంధాలను పెనవేసుకుంటున్నాం. పుట్టడం ఎంత సహజమో, పోవడమూ అంతే సహజమని అర్థం చేసుకోలేకపోతున్నాం. ఆ శాశ్వతసత్యాన్ని సుమధురకీర్తనగా అక్షరీకరించారు; **'నానాటి బతుకు నాటకము...'** అని నిర్వచించారు అన్నమాచార్యులు.

భగవాన్ శ్రీరామకృష్ణ పరమహంస భక్తులను ఉద్దేశిస్తూ తరచూ... 'దేన్ని చూసుకొని మిడిసిపడుతున్నారు? మీరు ఎంతో విలువైందని పొంగిపోతున్న బతుకు ఓ బుడగ లాంటిది; ఈ క్షణంలో ఉన్నట్లే ఉంటుంది; మరుక్షణంలో దాని ఉనికే కనిపించదు' అంటూ ఉండేవారు. ఎంత కఠోరంగా ఉన్నా, వాస్తవమైన ఈ వాక్కులు నిరంతరం మన మనస్సులో మారుమోగుతూనే ఉండాలి.

కానక కన్నది...

కేరళలోని ఒక జాతికి ఓ వింతైన ఆచారం ఉన్నదట. ఇంట్లో బిడ్డ పుడితే ఏడవడం; ఎవరైనా గతిస్తే బాజాభజంత్రీలతో ఉత్సవం చేయడం వారికి ఆనవాయితీగా వస్తోందట! వాస్తవానికి తన స్వభావమైన శాంతిస్థానాన్ని వదిలి, ఈ జన్మ వచ్చిందే అని దుఃఖించాలి గాని, ఉత్సవమేమిటని వారి భావన. స్థిరమైన ఆత్మస్థాయి నుంచి మనల్ని అశాశ్వతమైన శరీరస్థాయికి పరిమితం చేసేది పుట్టుకే! బిడ్డ ఈ లోకంలో పడ్డాక ఏడ్చేది అందుకే! రాబోయే బతుకంతా సహజత్వాన్ని వదలి నాటకం లాగే గడపాల్సి వస్తుందని జీవుడికి తెలుసు! అందుకే దుఃఖం! ఆ విరాగానికి పదాలు కడుతూ... **నానాటి బతుకు నాటకము; కానక కన్నది కైవల్యము...** అంటున్నాడు అన్నమయ్య.

'కానక కన్నది' అంటే పూర్వపుణ్యం చేత అపూర్వంగా దక్కినదని భావం. ఇదంతా ఓ నాటకమని తెలుసుకొని, మోక్షం వైపు ప్రయాణించమంటున్నాడు ఈ పదకవితా పితామహుడు. అయితే మనకు ఈ నాటకంపై విరక్తి కలగాలన్నా, పూర్వజన్మ పుణ్యఫలం ఏదో ఉండాలి. లేకపోతే ఈ ప్రపంచంపై, భార్యాబిడ్డలపై విసుగు పుట్టదు. తింటున్న కొద్దీ నోరంతా రక్తం ఓడుతున్నా, ముళ్ళకంపలపైన ఒంటెకు ప్రీతి చావనట్లు మనకు ఈ ప్రపంచంపై ప్రేమ చావదు. అందుకే స్వామి వివేకానంద 'మనుష్యులకు ఈ ప్రకృతి ఆ చెంపా, ఈ చెంపా వాయించే వరకు వైరాగ్యం పుట్టదు' అనేవారు.

కట్ట కడపటిది...

కురుక్షేత్ర సంగ్రామంలో కళ్ళ ముందు తాతలను, సోదరులను, కొడుకులను, గురువులను చూసేసరికి అర్జునుడికి గుండె జారిపోయింది. ఒక్కసారిగా ఇంతమంది మరణాన్ని నేడు చూడాల్సి వస్తుందా! అని భారంతో బరువెక్కింది. ధీరత్వాన్ని నైరాశ్యంకమ్మేసింది. అప్పుడు శ్రీకృష్ణ పరమాత్ముడు...

జాతస్య హి ధ్రువో మృత్యుః ధ్రువం జన్మ మృతస్య చ।
తస్మా దపరిహార్యేఽర్థే న త్వం శోచితు మర్హసి ॥ (గీత 2.27)

(మిగతా 32వ పేజీలో...)

మానవుడు పసివానిగా, యువకునిగా, ముసలివానిగా, దరిద్రునిగా, ధనికునిగా, పండితునిగా, పామరునిగా వివిధ పాత్రలను ధరించి చివరికి యమపురిని చేరుతున్నాడు. - భర్తృహరి



పరిప్రశ్న

– స్వామి భూతేశానంద

(రామకృష్ణ సంఘ 12వ సర్వాధ్యక్షులు)

రామకృష్ణ సంఘ 12వ సర్వాధ్యక్షులు - స్వామి భూతేశానందజీ మహరాజ్ (1901-1998) భక్తుల ఆధ్యాత్మిక సందేహాలకు సరళమైన రీతిలో ఇచ్చిన సమాధానాలను 'శ్రీరామకృష్ణ ప్రభ' పాఠకుల ప్రయోజనార్థం 2013 జూలై సంచిక నుండి ధారావాహికంగా ప్రచురిస్తున్నాం.

భక్తుడు: మనస్సును నియంత్రించడం ఎలా?

స్వామీజీ: ప్రార్థన, సత్సంగం, సద్గ్రంథ పఠన, భగవన్నామ స్మరణ, జప ధ్యానాలను అభ్యసించడం ద్వారా మనస్సును నియంత్రించవచ్చు. మనస్సు నుండి పూర్వ వాసనలు తొలగిపోవాలంటే సద్విషయాలనే వినాలి. సచ్చింతన చేయాలి.

మహాపరాక్రమవంతుడైన అర్జునుడు కూడా మనస్సును నిగ్రహించడం కష్టంగా ఉందని శ్రీకృష్ణుడితో ఇలా అంటాడు:

చంచలం హి మనః కృష్ణ ప్రమాథి బలవద్దృఢమ్ ।
తస్యాహం నిగ్రహం మన్యే వాయోరివ సుదుష్కరమ్ ॥ *(గీత-6.34)*

'కృష్ణా! మనస్సు అతి చంచలమూ, ప్రబలమూ, ఇంద్రియాలకు క్షోభను కలిగించే విధంగా ఉంది. మనస్సును విషయవాసనల నుండి నివర్తిల్లజేయడం అత్యంత కఠినమైన పని. మనస్సును నిరోధించడం వాయువును బంధించడానికి ప్రయత్నించడంలా అసాధ్యమైనదిగా తోస్తుంది.'



అందుకు భగవానుడు కూడా మనోనియంత్రణ చాలా కష్టమే అని ఒప్పుకుంటాడు. అందుకు పరిష్కార మార్గాన్ని సూచించాడు.

అసంశయం మహాబాహో మనోదుర్నిగ్రహం చలమ్ ।
అభ్యాసేన తు కౌన్తేయ వైరాగ్యేణ చ గృహ్యతే ॥ *(గీత-6.35)*

'ఓ మహాబాహూ! మనస్సు దుర్నిరోధమూ, చంచలమూ అనడంలో సందేహం లేదు. కానీ, కౌంతేయా! ధ్యానాభ్యాసం (అభ్యాసం) చేత, ఐహిక పారలౌకిక విషయవితృష్ణ (వైరాగ్యం) చేత మనస్సును నిరోధింపవచ్చు.'

శ్రీకృష్ణుడు మనోనియంత్రణకు అభ్యాస, వైరాగ్యాలనే రెండు మార్గాలను సూచించాడు.

అథ చిత్తం సమాధాతుం న శక్నోషి మయి స్థిరమ్ ।
అభ్యాసయోగేన తతో మామిచ్ఛాప్తుం ధనఞ్జయ ॥ *(గీత -12.9)*

'ధనంజయా! నీవు నా యందు చిత్తాన్ని స్థిరంగా నిల్పజాలకపోతే, అభ్యాసంతో నన్ను పొందడానికి ప్రయత్నించు.'

అభ్యాసం – నిరంతర సాధన. విషయాలన్నింటి నుండి మనస్సును మరల్చి, ఇష్టదేవతపై మనస్సును నిల్పడానికి నిరంతరం చేసే ప్రయత్నమే 'అభ్యాసం'.

వైరాగ్యం – ప్రాపంచిక వస్తువుల పట్ల విరక్తి భావం. ప్రాపంచిక సుఖాల కోసం తాపత్రయపడినంత కాలమూ మనస్సును నియంత్రించడం అసాధ్యం. అందువల్ల ఈ ప్రాపంచిక విషయాలు అనిత్యం, అశాశ్వతం అని మనస్సుకు బోధిస్తూ ఉండాలి. ఈ విచక్షణతో మనస్సును భగవంతునిపై మరలించడానికి చేసే ప్రయత్నమే 'వైరాగ్యం'.

భగవాన్ శ్రీకృష్ణుడు సూచించిన అభ్యాస, వైరాగ్యాలనే ఈ రెండు మార్గాలను శ్రద్ధతో ఆచరించిననాడు మనస్సును స్వాధీనపరచుకోవడం సులభతరమవుతుంది.

భక్తుడు: ప్రాణాయామం అంటే ఏమిటి? ప్రాణాయామం చేయడం అవసరమా?

స్వామీజీ: ప్రాణాయామం అంటే ప్రాణశక్తిని నియంత్రించడం. సరైన శిక్షణ లేకుండా ప్రాణాయామం చేయడం ఆరోగ్యానికి హానికరం. అందువల్ల సమర్థుడైన గురువు మార్గదర్శనంలో ప్రాణాయామం అభ్యసించాలి. ❖

పండుగలు-పర్వదినాలు

మార్చి - 2014

03	సోమవారం	: భగవాన్ శ్రీరామకృష్ణ జయంతి
12	బుధవారం	: ఏకాదశి
16	ఆదివారం	: శ్రీచైతన్య మహాప్రభువు జయంతి
20	గురువారం	: స్వామి యోగానంద జయంతి
27	గురువారం	: ఏకాదశి
31	సోమవారం	: ఉగాది

ఏప్రిల్ - 2014

08	మంగళవారం	: శ్రీరామనవమి
11	శుక్రవారం	: ఏకాదశి
25	శుక్రవారం	: ఏకాదశి

మనస్సును మలచుకోవాలి

- చక్కిలం హేమంత్ కుమార్

ఒక సుదూర ప్రాంతం. ఒక నిర్జన ప్రదేశం. ఒక ప్రశాంత పరిసరం. ఒక ఏకాంతం... భగవత్ స్పృహతో హృదయం నిండా మాధుర్యం. శబ్ద కాలుష్యంతో, కపట మనస్తత్వాలతో నిండిన జనావాసాలతో రోసిపోయిన మనస్సు, ఈ నీరవ నిశ్శబ్దాన్ని నిండు మనస్సుతో ఆస్వాదిస్తోంది. చుట్టూ ఉసిరి, మేడి, రావి, బిల్వ, జువ్వి వృక్షాలు... కాదు కాదు... పంచవటి వృక్షాల క్రింద పాముల పుట్టలు. పరచుకున్న శీతల ఛాయలు. ఔను... ఇది పంచవటి. ఋషులు శోధించి సాధించే చోటు. సాధనకు పరమ పావనమైన ప్రదేశం. పాములా? ఇక్కడ



పాములకు విషముండదు. అమృతం కురిపిస్తాయి. క్రూరమృగాలుంటాయి. కానీ క్రూరత్వం ఉండదు. లేడిపిల్లల్లా రాసుకు పూసుకు తిరుగుతాయి. పూవులు కట్టిన దారమూ పరిమళాన్ని అలదుకోక తప్పదు.

జీవితం అంటే నీరవ నిశ్శబ్దం, నిస్తేజం, నిర్వికారం, నిర్లిప్తం... ఇదా!? ఔను. ఇదే. ఇది కాక మరేమి? కోరికలా? క్రోధాలా? ఆశలా? నిరాశలా? కాదు. రుచిని నాలుకతో చూసినంత కాలమే అదంతా. మనస్సుకూ రుచి మప్పాలి. మనస్సుతో రుచి చూడడం ప్రారంభిస్తే మాధుర్యం ఏమిటో తెలుస్తుంది. ఒక యోగికి ఆహారం ఎందుకవసరం లేదో అర్థమవుతుంది. ఒక సన్న్యాసికి ఇల్లు ఎందుకు వద్దో అవగతమవుతుంది. ఆనందం విషయాలలో లేదు. మీరాబాయికి కృష్ణుని పేరున విషంలో ఆనందం దొరికింది. 'హరీ' అంటూ విషాన్ని హరాయించుకున్నాడు ప్రహ్లాదుడు. రామదాసు బహుశా గోల్కొండ జైల్లో కృష్ణుని జన్మస్థానాన్ని దర్శించి ఉంటాడు. భగవంతుని పేరు చెబితే వారికి విషం కూడా అమృతమైంది. పాము కూడా పూలబంతి అయింది. ఏనుగులు ఎలుకపిల్లలయ్యాయి. సముద్రాలు గోష్పాద ముద్రలోని తీర్థాలయ్యాయి. మనస్సు మరువంపు పరిమళాల పన్నీటి బుడ్డీ అయింది. ఇదంతా ఎప్పుడు? వారు వారి వారి పేరును మరచిపోయినప్పుడు! తనువులను విస్మరించినప్పుడు! తపస్సే శ్వాసగా తరించిపోయినప్పుడు! అప్పుడే గోపికలు వస్త్రాలు వదలివేసి గోవిందుని ఎదుట రెండు చేతులా ప్రణామముద్రగా నిలిచిపోతారు. జయదేవుడు అష్టపదులే అనంతునిగా, పదంగా, పాటగా మిగిలిపోతాడు. భక్తుడు తానే భగవంతునిగా మారిపోతాడు. అభేదం... అద్వైతం... అంతా అనంతం.

అయితే మనిషి మాధవుడుగా మారాలంటే ఏకాంతం, ప్రశాంతం, నిర్జన ప్రదేశం... ఇవి కావాలని లేదు. ఇవే కావాలని లేదు. ఉంటే ఉపయోగపడుతుంది. అదీ ఎవరికి? కొంతైనా భక్తి ప్రపత్తులు కలిగినవారికి, కాస్తంతయినా వైరాగ్యం జనించినవారికి. అయితే మనిషి మనస్సు మీద పరిసరాలు ప్రభావాన్ని కలిగించవా? కలిగిస్తాయి. ప్రాపంచికులకు. విషయాసక్తులకు. అయితే అది శ్మశాన వైరాగ్యం లాంటిది. తాత్కాలికం. హృదయ క్షేత్రంలో సగం వదలిన కొమ్మ అంటుకోదు. క్షేత్రం తయారు కావాలి. బీజం వేయాలి. జలం పోయాలి. అప్పుడు భక్తి, వైరాగ్యం అనే రెండాకుల అమృతాంకురం కళ్ళు తెరుస్తుంది. మారాకు వేస్తుంది. మొగ్గ తొడుగుతుంది. ఎరువు, కంచె, కాపలా... ఈ క్రమంలో అన్వేషించే, లభించే నిశ్శబ్ద, ఏకాంత, ప్రశాంత పరిసరాలు... అరణ్యాల్లో, నదీతీరాల్లో, పర్వత గుహల్లో లభించే అవకాశం ఉంది. మనస్సుకు మరింత పరిపక్వతను సాధించే శోధనను ఈ పరిసరాలు అందించగలవు. ఉదాహరణకు ఒక సాధారణమైన వ్యక్తి అరణ్యంలో ఒంటరిగా రాత్రివేళ ఉండలేడు. గుండె పగిలి చస్తాడు. అదే పరిణతి చెందుతూన్న భక్తుడు లేదా సాధకుడు అలాంటి అవకాశం కోసం అన్వేషిస్తాడు. పూర్ణ ప్రజ్ఞుడి సంగతి చెప్పనే అక్కర్లేదు.

ముందు మనస్సు బొమ్మకుండే వ్యర్థాలను చెక్కి తొలగించాలి. బొమ్మ మిగులుతుంది. అప్పుడూ దాన్ని మెరుగుపెట్టే సాధన. నునుపు తేల్చే శోధన. ఈ స్థితిలోనే సాధకుడికీ అనువైన ప్రశాంత ప్రాంగణాలు కావాలి. అందుకే సాధకులు అప్పుడప్పుడూ ఏకాంత ప్రదేశాలకు వెళ్ళి సాధన చేయాలని శ్రీరామకృష్ణులు బోధించారు. పక్వదశకు వచ్చినప్పుడే దోరకాయలను మాగేస్తారు. కసుగాయలను మాగబెట్టినా గరుగుపడతాయి తప్ప మాగవు.

ఏది ఏమైనా ముందు మనోమాలిన్యాలను తొలగించుకోవాలి. చిత్తశుద్ధిని సాధించాలి. మనిషి ముందు మనిషిగా మారాలి. ఆ తర్వాతే భగవంతుడయ్యే ప్రయత్నం చేయాలి. ❖

కేవలం శరీరాన్ని శుష్కింపచేయుట మాత్రమే తపస్సు కాదనీ; అహింస, సత్యం, అక్రోధం, దమం, శమం, కరుణ - ఇవి కలిగివుండుటయే తపస్సనీ శాస్త్రాలు చెబుతున్నాయి. - మహాభారతం

సర్వయోగ సమన్వయ స్వరూపులు శ్రీ రామకృష్ణులు

– స్వామి అర్చనానంద



"అనంతములైన 'వేదాలు' అనే సముద్రాలను మంథనం చేయగా వెలువడినది అమృతం. ఆ 'అమృతం'లోకి త్రిమూర్తులైన బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు, ఇతర దేవీ దేవతలు తమ తమ శక్తులను ధారపోశారు. ఈ భువిపై వెలసిన భగవదవతార మూర్తులందరూ తమ జీవనసారాలనూ, సర్వస్వాన్నీ ఆ 'అమృతం'లో కలిపి పరిపుష్టం చేశారు. ఆ అద్భుత దివ్య అమృతాన్ని శ్రీరామకృష్ణులు తమ దివ్య దేహంలో పరిపూర్ణాతిపూర్ణంగా ధరించారు! ఆ 'పరిపూర్ణ దివ్య అమృత కలశమే' శ్రీరామకృష్ణులు" అని స్తుతించారు స్వామి వివేకానంద.

1836 నుంచి 1886 వరకు తమ యాభయ్యేళ్ళ జీవిత కాలంలో ఐదు వేల సంవత్సరాల భారతీయ ఆధ్యాత్మికతను పునరుజ్జీవింపజేశారు – భగవాన్ శ్రీరామకృష్ణులు. అతి శ్రేష్ఠమైన భక్తి (భక్తియోగం); మహోన్నత బ్రహ్మజ్ఞానం (జ్ఞానయోగం); అపూర్వ యోగం (రాజయోగం); నిస్వార్థ సేవ (కర్మయోగం) – ఈ నాలుగు యోగాల సమ్మేళనమే 'శ్రీరామకృష్ణ పరమహంస'.

భక్తి: దక్షిణేశ్వర ఆలయ పూజారిగా శ్రీరామకృష్ణులు, శ్రీభవతారిణీ కాళీమాతను అర్చిస్తూ ప్రార్థన, కీర్తన, జప, ధ్యానాలలో అహర్నిశలూ మునిగిపోయేవారు. సాయం సంధ్యలో అమ్మ వారి ఆరతి సమయసూచకంగా మ్రోగించే ఘంటానాదాన్ని వింటూ, 'ఆహా! అమ్మా జగన్మాతా! అప్పుడే సాయంత్రమైందా! ఈ అల్ప జీవితంలో మరొక్క రోజు గడిచిపోయిందమ్మా! నీ దర్శనం మాత్రం కాలేదు తల్లీ! నీ దర్శనం పొందని ఈ జీవితం వ్యర్థమైపోయింది తల్లీ!' అంటూ అమ్మ దర్శనం కోసం విలపించేవారు.

ఓ శ్రీరామకృష్ణ ప్రభూ! మేమూ సంవత్సరాల తరబడి జప, ధ్యాన, ప్రార్థనాదులు చేస్తూనే ఉన్నాం. కానీ మాలో నిజమైన వ్యాకులత కలగడంలేదు. మా ప్రార్థనలు యాంత్రికం కాకుండా ఆంతరిక మయ్యేలా, భక్తి అశ్రువులతో నీ పాదాలను అర్చించేలా మమ్ము దీవించు తండ్రీ!

జ్ఞానం: శ్రీకాళికాదేవిని సాక్షాత్కరింప జేసుకుని ప్రేమ భక్తితో భావవిహ్వలుడైన శ్రీరామకృష్ణులకు అద్వైత వేదాంతి, మహాతపస్వి అయిన తోతాపురి, సన్న్యాసదీక్షనొసగి 'అహం బ్రహ్మాస్మి' అనే వేదాంత మహావాక్యాన్ని ఉపదేశించగా, మూడు రోజులు, బాహ్యస్పృహ కోల్పోయి అఖండ సచ్చిదానంద పరబ్రహ్మ తత్త్వం

(నిర్వికల్ప సమాధి)లో నిమగ్నమైపోయారు శ్రీరామకృష్ణులు. అప్పుడు తోతాపురి 'నలభై ఏళ్ళు నేను కఠోర తపస్సుతో సాధించినది ఈతడు మూడు రోజులలో సాధించాడే! ఆహా! ఏమిటీ వింత? ఏమిటీ మాయ?' అంటూ విస్మయం చెందారు.

ఆది శంకరాచార్యులు అన్నట్లు 'సంప్రాప్తే సన్నిహితే కాలే నహి నహి రక్షతి డుకృఞ్‌కరణే' చందంగా అమూల్యమైన జీవిత కాలమంతా గీత, భాగవత, ఉపనిషత్, వేద వేదాంగాలను అభ్యసించి కేవలం శుష్కవేదాంతులం కాకుండా మా జ్ఞాన చక్షువులను తెరిపించి ఆ అనంత సచ్చిదానంద సాగరంలో మునిగేలా అనుగ్రహింపుము ఓ జ్ఞానసింధు శ్రీరామకృష్ణా!

యోగం: శ్రీరామకృష్ణులు ధ్యానసాధన చేస్తున్నప్పుడు తమ అనుభూతిని ఇలా చెప్పారు: "ఆసనంలో కూర్చోగానే కాళ్ళు, చేతులు, అన్ని భాగాల కీళ్ళకు తాళం వేసినట్లు, శరీరం జడవస్తువులా మారిపోయేది. ఆ స్థితిలో పక్షులు తలపై కూర్చొని జటలలోని అక్షతలను కుక్కుతూ తినేవి; పాములు ఎగ్రబాకేవి. కుండలినీ శక్తి జాగృతమై, సుషుమ్నా మార్గం ద్వారా పైకి పోతున్నప్పుడు మూలాధారం నుండి సహస్రారం వరకు ఉన్న పద్మాలన్నీ ఊర్ధ్వముఖాలై పూర్తిగా వికసించేవి. అప్పుడు అపూర్వమైన దివ్యానుభూతులు కలిగేవి. మనస్సు భ్రూమధ్య స్థానం చేరుకోగానే పరమాత్ముని ప్రత్యక్ష దర్శనం కలుగుతుంది. జీవుడు సమాధి స్థితుడవుతాడు. సమాధి స్థితి నుండి బాహ్య స్పృహకు రాగానే మనుష్యులు, వస్తువులు ఏదో చిత్రాల్లాగ నీడల్లాగ కనపడేవి. విశ్వమంతా ఒక దివ్యజ్యోతితో దేదీప్యమానంగా గోచరించేది. ఆ ఆనందాన్ని ఎలా వర్ణించేది?"

'యోగం' అంటే కష్ట, క్లిష్ట భంగిమలలో శరీరాన్ని వంచడమే కాదని, మనోనియంత్రణతో నిశ్చల స్థితిని సాధించడమే నిజమైన యోగమని మాకు నేర్పవా ఓ యోగీశ్వరా శ్రీరామకృష్ణా!

నిస్వార్థ సేవ: 'జీవదయ, జీవసేవ' గురించి ఓ కలకత్తా 'పెద్దమనిషి' మాట్లాడుతుండగా శ్రీరామకృష్ణులు ఇలా అన్నారు: "ఆహా! మీ 'జీవదయ' నేనూ చూశాను. లక్షలు, కోట్లు జల్సాగా ఖర్చు చేసి కూతుళ్ళ పెళ్ళిళ్ళు అట్టహాసంగా చేస్తారు! పక్కింటి పేదవాడు, భిక్షగాడు పస్తులతో పడి ఉన్నా పట్టెడన్నం కూడా పెట్టరు! అన్నార్తులు క్షుద్బాధతో కన్నుమూసినా పట్టించుకోరు! వీరంతా 'జీవదయ, జీవసేవ' అంటూ ఉపన్యాసాలు వల్లె వేస్తారు! భేష్ భేష్!".

దక్షిణేశ్వరంలో భిక్షగాళ్ళకు అన్నదానం చేస్తూంటే, తనలో అహంకారం సమూలంగా నిర్మూలించాలని ఆయన వారిని 'అమ్మరూపాలు'గా భావించి ప్రేమతో వడ్డించారు. వారి ఎంగిలి విస్తరాకులను ఎంతో భక్తి, శ్రద్ధలతో తల మీద పెట్టుకొని వెళ్ళి పారవేసేవారు. భోజన స్థలాన్ని శుభ్రం చేసేవారు.

దక్షిణేశ్వర ఆలయ ప్రాంగణాన్ని శుభ్రంచేసే రసిక్ ఇంట్లో మరుగుదొడ్డిని తన జటాజూటాలతో శుభ్రం చేస్తూ – "అమ్మా! 'నేను బ్రాహ్మణుడను! అందరి కన్నా ఉన్నత కులం వాడిని, శ్రేష్ఠుడిని, అందరిలో పవిత్రుణ్ణి' అనే జాత్యహంకారం నా నుండి తొలగించు తల్లీ! నన్ను అందరికీ 'దాసుని'గా చేయి తల్లీ!" అని ప్రార్థించేవారు.

పాకీ పనులు చేసే స్త్రీ తలపై చెత్తకుండీతో వెళుతుంటే ఆమెలో జగన్మాత శ్రీకాళికాదేవిని దర్శిస్తూ చేతులు జోడించి – 'అమ్మా! స్త్రీలందరిలోనూ నీవే ఉన్నావమ్మా! ఈ పనులు, సేవలు నీవు తప్ప ఇంకెవరు చేయగలరు తల్లీ!' అని ప్రణామాలు చేసేవారు. దేవఘర్‌లో అన్నార్తులైన పేదలను చూసి చలించిపోయారు. "ప్రతి జీవుడూ శివుడే! శివుడనే జ్ఞానంతో ప్రతి జీవునికీ సేవచేయి! (శివజ్ఞానే జీవసేవ). ఈ దీనులలో ఉన్న శివునికి అన్నం పెట్టు, బట్టలివ్వు, వారి కష్టాలు తీర్చు! లేకపోతే మన కాశీయాత్ర నిష్ఫలమే! నేను కాశీకి రాను!" అని మథుర్‌బాబుతో చెప్పి, ఆ పేదసాదలను శివునిగా భావించి భక్తి ప్రేమలతో సేవలు చేశారు.

గొంతు క్యాన్సర్‌తో ప్రాణాలుపోతున్నా, మాట్లాడకూడదని డాక్టర్లు వారిస్తున్నా, సంసార బాధలతో వచ్చే భక్తులకు సాంత్వననిచ్చే చల్లని అమృత వాక్కులు పలికేవారు. ప్రేమ పలుకులతో, భక్తి పాటలతో వారికి శాంతినొసగేవారు. శిష్యులు వారిస్తే 'ఒక్క మనిషికి మేలు చేయడానికి నేను వెయ్యిజన్మలైనా ఎత్తుతాను, మరణానికి భయపడను' అనేవారు భక్తవాత్సల్యంతో. హే ప్రభూ! నీ 'సేవాయోగం' మాకు నేర్పించు తండ్రీ!

"హే రామకృష్ణా! శ్రీరాముని సత్య ధర్మమును, శ్రీకృష్ణుని ప్రేమ మర్మమును నేర్పుము మాకు తండ్రీ! ప్రాపంచిక పదములు వలదు మాకు, నీ పావన పాదములే మాకు పరమ పదములు! 'కాళీ' మధువును గ్రోలిన నీ దివ్య దరహాసము, కామినీ కాంచనములకు చేసె పరిహాసము! హే త్యాగీశ్వరా! తొలగించుము మా భవతృష్ణ!

హే అవతారవరిష్ఠా! ప్రేమకు ప్రతిరూపం నీవు– మాకు నీ ప్రేమను ప్రసాదింపుమా! జ్ఞాన, విజ్ఞాన సాగరం నీవు – మా జ్ఞాన చక్షువులను తెరిచి దివ్యదృష్టినీయుమా! దివి నుండి భువికి నీ ప్రేమాశీస్సులు దింపుమా! హే శ్రీరామకృష్ణా!" ❖


మతధర్మాలు కేవలం చదవడానికే కాదు. ఆ ధర్మాలను నిజ జీవితంలో అనుష్ఠించడం, వాటిని సాక్షాత్కరింపజేసుకోవడం. దీనికి ప్రత్యక్ష నిదర్శనం శ్రీరామకృష్ణుల జీవితం. - ఆర్నాల్డ్ జోసెఫ్ టోయన్బీ

సరైన పద్ధతి తెలుసుకో! - స్వామి విశుద్ధానంద

సాధుసాంగత్యంలో మనస్సు తన్మయమవుతుంది. సాధుసాంగత్యం లభ్యం కాకపోతే సద్గ్రంథ పఠనం కావించాలి. సంగీతం కూడా గాఢ తన్మయత్వం కలిగిస్తుంది. 'నారదా! నా నామగుణ సంకీర్తనం ఎక్కడ జరుగుతుందో, నేను అక్కడ ఉంటాను' అన్నాడు భగవంతుడు.

ఒక కథ చెబుతాను – గొప్ప పండితుడు ఒకాయన, షడ్దర్శనాలు విశేషంగా తెలిసినవాడు. కానీ ఆయనకు మనశ్శాంతి కరువు. మనశ్శాంతిని కోరుకొంటూ ఆ పండితుడు ఓ ఆశ్రమానికి వెళ్ళాడు. ఆశ్రమంలోని చెరువులో స్నానం చేసి రమ్మన్నాడు సాధువు. స్నానం చేస్తుండగా ఒక చేప నీటిపైకి వచ్చి, 'నాకు దుర్భరమైన దప్పిక. తీరే మార్గం తెలుపుతారా?' అన్నది. 'ఇదేమి ఆశ్చర్యం, వాసం నీటిలో అయినా చేపకు దప్పికా?' అని తలపోశాడు పండితుడు. అప్పుడతడు చేపతో 'నీవు నోటితో నీరు తీసుకొని మొప్పల ద్వారా విడిచిపెడుతున్నావు. అలా కాకుండా మొప్పలతో తాగు, నీ దప్పిక తీరుతుంది. ఇదే నీకు నా ఉపదేశం' అని చెప్పాడు.

పండితుడు స్నానం ముగించుకొని సాధువు వద్దకు వెళ్ళి జరిగిన సంగతి చెప్పగా, 'అవును, నీకు కూడా నా ఉపదేశం అదే' అన్నాడు.



పండితుడు విస్తారంగా చదివాడు, విన్నాడు, కానీ ధారణశక్తిని పెంపొందించుకొనలేదు. ధార్మిక విషయాలు విన్న తరువాత నెమరువేయాలి. దానితోపాటు భగవంతునికి ఆత్మసమర్పణం చేసుకోవాలి. ఈ భూమిభారం మోస్తున్న వాడికి మన భారం కూడా సమర్పించాలి. ఆయన మన కోసం ఎంతో చేయడానికి సిద్ధంగా ఉంటాడు. కానీ మనం మన మనస్సును చెత్తాచెదారంతో కప్పివేస్తున్నాం. ఎవడో వచ్చి 'చెత్త తొలగించి, లోతుగా తవ్వు, భూమి కింద లంకె బిందె ఉంది' అని చెప్పవలసి వస్తుంది. మనకు తెలియదాయె! వాడి మాటలు విని, ఆ పనికి ఉపక్రమిస్తామా... అబ్బో, ఎంత చెత్త అది తొలగించడం ఎంత కష్టమో! వెంటనే భగవంతుని చరణాలు పట్టుకొని వేడుకోవాలి.

సంసారం అనే తిరగలి తిరుగుతోంది. ప్రతి ఒక్కరూ అందులో నలిగిపోతున్నారు. పోతే, ఎవరు కొర్రు దగ్గరగా ఉంటారో, అనగా ఎవరు భగవంతుని ఆశ్రయిస్తారో వారు మాత్రం ఏ హానీ లేకుండా ఉంటారు. "రండి, రండి, నా వద్దకు వచ్చి నన్ను పట్టుకు నిలబడండి. మీకు ఏ భయమూ ఉండదు. నేను మీ లోపలే ఉన్నాను. అణుపరమాణువులతో సహా అన్నింటా ఉన్నాను. నన్ను శరణు వేడండి" అంటున్నాడు భగవంతుడు. కనుక భగవంతుని పట్ల సంపూర్ణ ఆత్మసమర్పణా భావం కలిగివుండాలి. భగవంతుని యందు ఎవరు పూర్తిగా శరణాగతులు అవుతారో వారు ఆయన కృపాపాత్రులు అవుతారు. అప్పుడు చిరశాంతి, పరమానందం లభిస్తాయి. జన్మజన్మాంతరాల ప్రారబ్ధం అనుభవించాల్సిన దుర్గతి ఇక ఉండదు.

ఇది భగవంతుని వాక్కు: 'మనస్సు నాపై లగ్నం చేయి, నా భక్తుడవై నన్ను ఉపాసించు, నా ఎదుట నత శిరస్కుడవు కమ్ము. ఈ ఉపదేశాలు పాటిస్తే నన్ను పొందగలవు'.

ఎంత అపూర్వమైన ఆశ్వాసమో, చూడండి! చేపలు నీటినే ఆశ్రయిస్తాయి. కనుక ప్రవాహం ఎంత వడిగా ఉన్నా, నిర్భయంగా తేలుతూపోతాయి. కానీ ఏనుగో, ఎంత పెద్ద ఆకారం! ఎంత శక్తిమంతం! కానీ ప్రవాహంలో ఎటో కొట్టుకు పోతుంది, కదా! ❖

అనువాదం: డాక్టర్ కమల జయరావు



ఆదర్శప్రాయులైన గురుదేవులు

శ్రీరామకృష్ణులు నాతో ఇలా చెప్పారు: "వత్సా! ఒక గదిలో బంగారు కాసుల సంచీ ఉంది. పక్క గదిలో ఒక దొంగ ఉన్నాడు. ఆ దొంగ నిద్రపోగలడని నువ్వు అనుకొంటావా? నిద్రపోడు. 'ఆ గదిలోకి ఎలా ప్రవేశించి ఆ బంగారు కాసులను అపహరించగలనా!' అని అతడి మనస్సు పరిపరివిధాల పోతుంది. అలాగే ఈ నామరూపాత్మకమైన లోకానికి ఆవల పరతత్త్వం ఒకటి ఉందనీ, ఈశ్వరుడనేవాడొకడు ఉన్నాడనీ, అతడు అమృతస్వరూపుడనీ, ఆనందస్వరూపుడనీ, ఇంద్రియ భోగాలన్నీ ఆ ఆనందం యొక్క కణమాత్రాలనీ స్థిర విశ్వాసం గల వ్యక్తి దాన్ని పొందే ప్రయత్నం చెయ్యక ఊరకే ఉండగలడా? ఉండలేడు. ఈ కోర్కె అతణ్ణి వెర్రివాణ్ణి చేసేస్తుంది."

ఇలాంటి దివ్యోన్మాదమే నా గురుదేవులకు కలిగింది.

సాయంసంధ్యా సమయంలో దేవాలయంలోని ఘంటారావాలు, ప్రార్థనా స్వరాలు చెవులలో పడగానే ఆయనకు దుఃఖం పొంగిపొరలేది. 'తల్లీ! మళ్ళీ ఇంకో రోజు వ్యర్థంగా గడిచిపోయింది. నీ దర్శనం లభించలేదు. అనిత్య జీవితంలోని రోజొకటి వ్యర్థమైపోయింది' అని రోదించేవారు. ఒక్కొక్కప్పుడు ముఖాన్ని నేలకు రుద్దుతూ విలపించేవారు. 'హే జగదంబా! నా హృదయంలో ఆవిర్భవించు. నేను నిన్ను కాక మరి దేన్నీ కోరకుండేలా అనుగ్రహించు!' అని ఆయన ప్రార్థించేవారు.

సమస్త పరిత్యాగం చెయ్యనిపక్షంలో మాతృదర్శనం లభించదని ఆయన వినివున్నారు. జగన్మాత అందరికీ దర్శనమివ్వడానికి సిద్ధంగానే ఉందనీ, కానీ ఆమెను కోరేవారే ఎవరూ లేరనీ, జనం తుచ్ఛ విషయాలనే కాంక్షిస్తారనీ, విషయలౌల్యమేగాని మాతృచరణాసక్తి వారికి లేదనీ, సర్వాత్మనా అన్యాన్ని అపేక్షించక ఆమె దర్శనాన్ని కోరుకునే పక్షంలో మరుక్షణంలోనే లభిస్తుందనీ కూడా ఆయన వినివున్నారు. ఈ భావైక్యాన్ని పొందాలని ఆయన సమకట్టారు. ఐహిక విషయాలను కూడా త్యజించసాగారు. తనకున్న కొద్ది పాటి సంపదను కూడా త్యజించి, ధనాన్ని తాకనని ప్రతిన బూనారు. ఈ ప్రతిన ఆయనతో తాదాత్మ్యం పొందింది. ఇదొక గొప్ప మహిమగా తోచవచ్చు గానీ, కాలాంతరంలో కూడా నేను నాణేన్ని తగిలిస్తే సుషుప్తిలోని ఆయన చెయ్యి ముడుచుకొనిపోయి శరీరానికి పక్షవాతం వచ్చినట్లయింది.

కామం మరో శత్రువని ఆయన తెలుసుకొన్నారు. మానవుడంటే ఆత్మ. ఆత్మ లింగరహితం. పురుషుడూ కాదు, స్త్రీ కాదు. ఈ కామకాంచనాలే తల్లి నుండి తనను వేరు పరుస్తున్నాయని ఆయన తలచారు. ఈ విశ్వమంతా జగజ్జనని దివ్యప్రకటనే. ఆమె ప్రతి స్త్రీ దేహంలోనూ నెలకొని ఉంది. 'ప్రతి స్త్రీ జగన్మాత ప్రతిరూపమే. అలాంటప్పుడు స్త్రీని కామభావంతో ఎలా చూడగలను?' అని ఆయన భావన. ప్రతి స్త్రీని తల్లిగా భావించి, స్త్రీలందరిలోను జగన్మాతను సాక్షాత్కరింప చేసుకోవడం తన విధిగా ఆయన భావించుకొన్నారు. దీన్ని ఆయన తన జీవితంలో అమలు పరచారు. ❖

ఓ రామకృష్ణా! నీవు ఇంద్రియ సుఖాలను తృణీకరించావు. కామకాంచనాలను సంపూర్ణంగా త్యజించావు. నీవు త్యాగులలో రారాజువు. మనుజులలో సర్వోత్తముడవు. - స్వామి వివేకానంద



దశావతారాలు
శ్రీరామకృష్ణులు

– స్వామి బ్రహ్మేశానంద

దశావతారాలలో కొన్ని పౌరాణికపాత్రలు అయినప్పటికీ, ఆ గాథలకు గంభీర తాత్పర్యం ఉంది. అవి ఆధ్యాత్మిక సందేశాన్నిస్తున్నాయి. శ్రీరామకృష్ణుల జీవితం, బోధనలతో ఈ అవతారాల తాత్పర్యాన్ని పోల్చే ప్రయత్నమే ఈ వ్యాసం.



మత్స్యావతారం: 'అమవస చీకట్లు ఈ పుణ్య భూమిని నేడు కమ్ముకున్నంతగా మున్నెన్నడూ కమ్ముకొనలేదు. నేటి ధర్మపతనంతో పోలిస్తే మునుపటివి గోష్పద సమానాలు' అన్నారు స్వామి వివేకానంద. నాటి ప్రళయకాలంలో భగవంతుడు మత్స్యావతారం ఎత్తగా, నేడు శ్రీరామకృష్ణులుగా అవతరించారు.

ఒకసారి బ్రహ్మదేవుడు వేదాలు చదువుతుండగా హయగ్రీవుడనే దైత్యుడు వాటిని తస్కరించాడు. ఆ తర్వాత ప్రళయం వచ్చింది. అప్పుడు ఒక చిన్న చేప స్వాయంభువ మనువును సమీపించి రక్షణ కోరగా, మనువు దాన్ని తన కమండలంలో ఉంచాడు. అది నానాటికీ పెద్దది అవడం, మనువు దానిని మరింత పెద్ద పాత్రలో వేయడం జరిగింది. చివరగా దాన్ని సాగరంలో చేర్చాడు. అప్పుడు ఆ మత్స్యం తన దివ్య స్వరూపాన్ని తెలిపి, ప్రళయం రాబోతున్నదనీ, మనువు ఒక నావను నిర్మించి, అందులో ఎక్కాలనీ సూచించింది. మత్స్యం వేదాలను దైత్యుని నుండి తిరిగి తెచ్చింది.

సాధారణంగా దేవతల ప్రార్థనను ఆలకించి విష్ణువు అవతరించడం జరుగుతుంది. కానీ, ఇప్పుడు ఎవరూ ప్రార్థించలేదు. భగవంతుడే స్వయంగా మత్స్యమై వచ్చాడు. ఇందులోని విశేషం ఏమిటంటే, భగవంతుడు వినీతుడై రక్షణ కోరుకొన్నాడు. శ్రీరామకృష్ణుల వినయ స్వభావం తెలిసినదే. ఎవరినైనా తొలిసారి చూచినప్పుడు, తానే ముందుగా వంగి నమస్కరించేవారు. మరొక ఆసక్తికర విషయం – కామార్పుకూరులో వరద నీటిలో నడుస్తుండగా ఒక చిన్న చేప శ్రీరామకృష్ణుల పాదాలను ఆశ్రయించింది. దాన్ని ఒక తటాకంలో వదిలి పెట్టారు.

ధర్మం క్షీణించి, కామం, లోభం అనే దుష్టశక్తులు విజృంభించి ధర్మాన్ని కబళించబోయాయి. అప్పుడు శ్రీరామకృష్ణులు అవతరించి సనాతన ధర్మాన్నీ, వేదాలనూ కాపాడారు. ఆయన వేదమూర్తి. 'శ్రీరామకృష్ణులు వేదాలకు సజీవ భాష్యం' అన్నారు స్వామి వివేకానంద.



కూర్మావతారం: ఈ అవతారంలో తొలిసారిగా దేవతలు, అసురులు అనే విభజన కనపడుతుంది. అంటే – మంచీ చెడు, దుష్టులు – ధర్మపరాయణులనే విభజన. దేవతలు అసురుల చేతిలో ఓడిపోయి, అమరత్వం అజేయత్వాల కోసం అమృతం సంపాదించడానికి ఉద్యమించారు. ఓటమి కూడా ఒక మంచి పని చేయడానికి పురిగొల్పుతుంది. దేవాసురులను ఉభయులనూ సముద్రాన్ని మథించమన్నాడు భగవంతుడు. దేవాసురులు అంటే రెండు కోవల ప్రాణులు మాత్రమే కాదు, మనలో ఉండే ద్వంద్వ ప్రవృత్తులు. ఇవి నిరంతరం మానసిక సంఘర్షణలు కలిగిస్తాయి. సాగరంలో లాగా మనలో కూడా ఎన్నో రత్నాలు, విషప్రాణులు, హాలాహలం, అమృతం ఉన్నాయి. రామకృష్ణులు మనస్సును 'రూపసాగరం' అన్నారు. దాని లోతుల్లోకి వెళితే ప్రేమ అనే రత్నం దొరుకుతుంది.

భాగవతంలోని సాగరమథనం తాత్పర్యం ఏమిటి? హృదయంలోకి ప్రవేశిస్తే అమృతం లభిస్తుంది. ఈ మథనం అహంకారమనే కవ్వంతో చేయాలి, మనలో స్థిరంగా ఉండే భావం అది ఒక్కటే కదా! 'అహం'ను భగవంతుడిపై నిలపాలి. ఆ విధంగా 'పచ్చి అహం' 'పక్వ అహం' అవుతుందని శ్రీరామకృష్ణులు ఎన్ని సార్లు చెప్పారో! స్వామి విరజానంద, శ్రీరామకృష్ణులను 'దంభి దర్పదారణం – గర్వాన్ని అణచేవాడు' అని స్తుతించారు. మనకు వెంటనే జ్ఞాపకం వచ్చేవి, శ్రీరామకృష్ణులు, మాస్టరు మహాశయునిలోని అహంకారాన్ని నాశనం చేసే సంఘటనలు.



వరాహావతారం: అహంకారం ఎంత ఉపద్రవాన్ని కలిగిస్తుందో, పురాణగాథల ద్వారా తెలుసుకొంటాం. విష్ణుమూర్తి ద్వారపాలకులైన జయ విజయులు దర్పంతో సనకాది మునులను అవమానించారు. వారిని రాక్షసులుగా జన్మించమని మునులు శపించారు. వారు హిరణ్యాక్ష, హిరణ్యకశిపులుగా జన్మించారు. సాధకుడు ఎంతో ఎదిగి, భగవంతునికి ప్రీతిపాత్రుడైనా పతనం చెందవచ్చు. బ్రహ్మలీన స్థితికి చేరేవరకు కడు జాగరూకతతో మెలగడం అవసరం. మంచీ చెడు పరస్పరం కలవని గుణాలు కావు. జయవిజయులు మంచివారే కానీ రాక్షసులుగా జనించాల్సి వచ్చింది. కాబట్టి శ్రీరామకృష్ణులు మంచీ చెడు, ధర్మాధర్మాలు రెంటినీ దాటమన్నారు. అజ్ఞానం అనే ముల్లును జ్ఞానం అనే ముల్లుతో వెలికితీసి, రెంటినీ పారేయమన్నారు. 'హిరణ్యం' అంటే బంగారం. అది లోభానికీ, మోహానికీ కారణం. శ్రీరామకృష్ణులు కాంచనత్యాగి. అంటే హిరణ్యాక్ష, హిరణ్యకశిపుల వధ.

హిరణ్యాక్షుడు వసుంధరను దొంగిలించాడు. భగవంతుడు వరాహరూపం దాల్చాడు.

వరాహం యజ్ఞానికి ప్రతీక. యజ్ఞాలలోని ముఖ్యాంశం దానం. యజ్ఞఫలితాన్ని తానొక్కడే భుజించేవాడిని దొంగగా వర్ణించాడు గీతాచార్యుడు. హిరణ్యాక్షుడు వసుధను తాను మాత్రమే అనుభవించాలని తలచాడు. యజ్ఞవరాహ రూపం దాల్చి, భూమిని యథాస్థితికి తెచ్చాడు భగవంతుడు.

ప్రస్తుత కాలంలో ప్రతి ఒక్కరూ భోగ్యవస్తువులను సంపాదించి, తాము ఒక్కరే అనుభవించాలనే స్వార్థంతో నిండి ఉన్నారు. కనుక శ్రీరామకృష్ణులు ఒక నూతన యజ్ఞాన్ని ప్రవేశపెట్టారు – శివ జ్ఞానే జీవసేవ. నేటి పరిస్థితులకు అమరే యజ్ఞభావాన్ని స్వామీజీ చాలా చక్కగా చెప్పారు: ఎల్లప్పుడూ దాతగానే ఉండండి. ప్రతిఫలం ఆశించకండి. ప్రేమను, సహాయాన్ని, సేవను ఇవ్వండి. భగవంతుడు మనకు ఇచ్చినట్లే, ఇతరులకు ఔదార్యంతో ఇవ్వండి.



నరసింహావతారం: దేహాత్మ బుద్ధి మాత్రమే కలవాడు అసురుడు. భగవద్గీత పదహారో అధ్యాయంలో వర్ణించిన ఆసురీ గుణాలన్నింటికీ ఇదే మూల కారణం. స్వామి రామకృష్ణానంద ఇలా వ్రాస్తారు: అహంకారం పరాకాష్ఠకు చేరిన స్థితి సూచిస్తాడు హిరణ్యకశిపుడు. 'నేను' అనే భావం అతడిలో బలవత్తరంగా ఉండేది. అతడు ఎంత బలవంతుడు అంటే, జగత్తును సమస్తం స్వాధీనం చేసుకొన్నాడు. తాను శాశ్వతుడను కాదనీ, భగవంతుని అనంతత్వంతో పోలిస్తే తాను అత్యల్పుడననీ అహంకారం మూలంగా తెలుసుకొనలేక పోయాడు.

విష్ణుభక్తుడైన తన కన్నకొడుకునే ద్వేషించాడు హిరణ్యకశిపుడు. బ్రహ్మ ఇచ్చిన వరంతో విర్రవీగుతున్న వాడిని వధించడానికి భగవంతుడు నరకేసరి అవతారం దాల్చాడు. మృగాలన్నింటిలోకి బలమైనది, ధైర్యం కలది సింహం. ధీరులను పురుషసింహం అని వర్ణిస్తారు. శ్రీరామకృష్ణులు ఒక పురుష సింహం. నరసింహుడు ప్రహ్లాదునిపై చూపినంత ప్రేమ, శ్రీరామకృష్ణులు తన భక్తులపై చూపేవారు.

హిరణ్యకశిపుడి వధానంతరం ప్రహ్లాదుడి లానే, 'తల్లీ! నాకు శుద్ధ భక్తి ప్రసాదించు' అని వేడుకొనేవారు శ్రీరామకృష్ణులు.

తండ్రి రాజ్యాన్ని పరిపాలించమని ప్రహ్లాదుడికి ఉపదేశించాడు శ్రీహరి. అలాగే నాగమహాశయుడు, మాస్టరు మహాశయుడు సన్యసింప తలచగా, వారిని ఆదర్శ గృహస్థులుగా జీవించమని ఆదేశించారు శ్రీరామకృష్ణులు.

దేవాసురులు ఉభయులు భోగభాగ్యాలను వాంఛించారు. ఇంద్రుడు అడపాదడపా అక్రమంగా కోరికలు తీర్చుకొన్నా, వెంటనే భగవంతుని శరణు వేడేవాడు. మథురబాబు కూడా ఒకటి రెండు అన్యాయాలు చేశాడు కానీ ఆ పరమభక్తుణ్ణి కాపాడారు రామకృష్ణులు.



వామనావతారం: దేవజనని అదితి తపమాచరించి వామనునికి జన్మనిచ్చింది. సత్యసంధులైన శ్రీరామకృష్ణుల తల్లితండ్రులు ఎంతో సంయమనంతో జీవించారు.

బలిచక్రవర్తిని మూడు అడుగుల భూమి యాచించాడు వామనుడు. వామనుడు విష్ణువేనని గ్రహించి, రాజగురువు శుక్రాచార్యులు బలిని వారించాడు. శుక్రాచార్యుడికి చాలా లౌక్యం తెలుసు. లౌక్యబుద్ధిని నిరసించారు శ్రీరామకృష్ణులు. అలాంటి వ్యక్తులు ఆధ్యాత్మిక జీవనానికి అర్హులు కారన్నారు. గురువాక్యాన్ని కాదని, వామనుడికి ఇచ్చిన మాటను బలి నిలబెట్టుకొన్నాడు. అలాగే సత్యం, దానాలను శ్రీరామకృష్ణ ప్రశంసించేవారు.

ఇవ్వడమే మన పని, కొందరు మనల్ని మోసగించినా వెనుకాడవద్దు అన్నారు స్వామీజీ. వామనుడు మోసం చేస్తున్నాడని గురువు చెప్పినా పట్టించుకొనలేదు బలి. అహంకారానికి చిహ్నమైన తలను కూడా అప్పగించాడు. అహం నశిస్తే అన్ని సమస్యలూ తొలగిపోతాయన్నారు శ్రీరామకృష్ణులు. మరుగుజ్జుగా వచ్చిన త్రివిక్రముణ్ణి చూసి బలి మోసపోయాడు. మూడు అడుగులేనా అని నవ్వాడు. అలాగే చాలా మంది ఒక పేద నిరక్షరాస్యుడైన శ్రీరామకృష్ణుల మహిమను గ్రహించలేకపోయారు. కొంతమంది మాత్రం మెల్లమెల్లగా ఆయన దివ్యత్వాన్ని గ్రహించారు.



పరశురామావతారం: పరశురామావతారంతో మన పురాణాలలో కొంత వాస్తవికత వచ్చింది. దేవాసురుల యుద్ధాలు లేవు. కానీ కులవైషమ్యాలు మొదలయ్యాయి. పరశురాముడు బ్రాహ్మణ వంశంలో జన్మించినా, ఆయనలో క్షత్రియులలో ఉండే శౌర్యపరాక్రమాలు ఉండేవి. ఆయన జీవితం తొలి భాగంలో ఇరవై ఒక్క మార్లు క్షత్రియులను వధించాడు. ఆ పిమ్మట తపోజీవితాన్ని గడపినా తన శౌర్యం గురించి గర్వించేవాడు. దశరథరాముడు ఈ గర్వాన్ని అణచివేశాడు.

శ్రీరామకృష్ణులు తన అరిషడ్వర్గాలను ఒక్క వేటుతో నాశనం కావించారు. శ్రీరామకృష్ణులు ఆదర్శ బ్రాహ్మణత్వాన్ని చూపారు.



రామావతారం: శ్రీరాముడు సన్యసించదలచాడు. 'ఈ విశ్వం భగవంతుని వెలుపల ఉందా? అయితే, సన్యసించు' అన్నాడు వశిష్ఠుడు. జీవజగత్తు సమస్తం బ్రహ్మమే అని గ్రహించి, మౌనం వహించాడు రాముడు అన్నారు శ్రీరామకృష్ణులు. రామచంద్రుని లాగా నిర్లిప్తతతో జీవించాల్సిందిగా గృహస్థులకు ఉపదేశించారు శ్రీరామకృష్ణులు.

(మిగతా 30వ పేజీలో...)

నరరూపం దాల్చిన ఓ గురుదేవా! ఆదిశక్తి అయిన మహాసముద్రంలో ఉద్భవించిన మహోత్తుంగ తరంగం నీవు. దివ్యప్రేమ యొక్క విభిన్న లీలలను ప్రదర్శించి లోకానికి చూపావు. - స్వామి వివేకానంద

వృత్తి కాదు... వ్యక్తి!

-స్వామి శితికంఠానంద



ఈ మధ్య ఒక యువకుడు రామకృష్ణ మఠంలోని వివేకానంద ఆరోగ్యకేంద్రానికి వచ్చి 'గుండె చాలా వేగంగా కొట్టుకుంటుంది స్వామీజీ. ఒకసారి గుండె డాక్టర్‌కు చూపించుకోవాలి' అని అడిగాడు. పట్టుమని 24 సంవత్సరాలు లేని యువకుడికి హృద్రోగవైద్యుడు ఎందుకు? అని ఆరా తీస్తే 'నేను ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ విభాగంలో పట్టభద్రుణ్ణి. ప్రభుత్వ ఉద్యోగాల కోసం ప్రయత్నం చేస్తున్నాను కానీ ఉద్యోగం వస్తుందన్న నమ్మకం కలగడం లేదు. ఆందోళన వలన సరిగ్గా చదవలేక పోతున్నాను. ఒక గంట కూడా చదివే విషయంపై మనస్సును నిలపలేకపోతున్నాను' అన్నాడు.

ఆ యువకుడు రెండు సంవత్సరాల నుంచి ఏ ఉద్యోగం లేకుండా ఖాళీగా ఉన్నాడు. ప్రయత్నాలు చేస్తున్నాడు కానీ సఫలీకృతుడు కాలేకపోయాడు. దానితో విపరీతమైన ఆందోళన, అభద్రతా భావం అతణ్ణి ఆవహించాయి. 'జీవితంలో నేను స్థిర పడగలుగుతానా? అసలు నేను ఏదైనా ఉద్యోగం సంపాదించగలుగుతానా?' అని అనుకుంటూ ఇప్పుడు తన మీద తాను విశ్వాసం కోల్పోయాడు.

ఈ రోజుల్లో చాలామంది ఇలాంటి పరిస్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. చదువులై పోయిన తర్వాత ఉద్యోగ ప్రయత్నం ఒక పోరాటంగా మారింది. ఐతే ఇందులో పరిస్థితుల పాత్ర ఎంత? మన అజ్ఞానం పాలు ఎంత అని పరిశీలించుకుంటే చాలా సమస్యలు అజ్ఞాన జనితాలే. మనమే సమస్యను జటిలం చేసుకుంటున్నాం.

ఆ యువకుడికి, స్వామీజీకి మధ్య సంభాషణ ఇలా సాగింది:

స్వామీజీ: మీ గ్రామానికి సమీపంలో ఉన్న చిన్న పట్టణంలో ఏదైనా పాక్షిక సమయ ఉద్యోగం చేసుకుంటూ, పోటీ పరీక్షలకు తయారవవచ్చు కదా?

యువకుడు: హైదరాబాదులో మంచి పోటీ పరీక్షల శిక్షణ సంస్థలున్నాయి. విజయం సాధించడానికి అవకాశాలెక్కువ. ఇక్కడ ఉంటే పోటీ తీవ్రత మనకు అర్థమవుతుంది.

స్వామీజీ: ఒక గంట కూడా చదివే విషయంపై మనస్సు నిలుపలేక పోతున్నానన్నావు కదా! మరి విజయావకాశం ఎలా ఎక్కువగా ఉందని భావిస్తున్నావు?

యువకుడు: అది నిజమే స్వామీజీ. ఆ సమస్యకు పరిష్కారం చెబుతారనే మీ దగ్గరకు వచ్చాను.

స్వామీజీ: హైదరాబాదులో రెండు సంవత్సరాలు ఉన్నావు. ఇక చాలు. పోటీ పరీక్షలకు తయారవడానికి కావలసిన పుస్తకాలు, పాత ప్రశ్నపత్రాలు నీ దగ్గర ఉన్నాయి. ఎంతమంది ఎన్ని ఉద్యోగాలకు పోటీ పడుతున్నారనే విషయాన్ని ప్రక్కన పెట్టి మునుపటి ప్రశ్నపత్రాలను చూస్తూ నీ స్థాయిని అంచనా వేసుకొని సామర్థ్యాన్ని పెంచుకుంటూ ఉండు. మీ గ్రామానికి సమీపంలో ఉన్న ఒక చిన్నపట్టణంలో మాధ్యమిక లేదా ఉన్నత పాఠశాల స్థాయి పిల్లలకు పాఠాలు బోధిస్తూ నీ కాళ్ళపై నువ్వు నిలబడు. మిగతా సమయంలో పోటీ పరీక్షలకు సన్నద్ధమవు.

యువకుడు: ఇంజనీరింగ్ విద్యను అభ్యసించిన వాడిని స్కూల్‌లో టీచర్‌గా చేయాలా! ఇంట్లో వాళ్ళు ఒప్పుకోరు. గ్రామస్థులు కూడా 'ఇంజనీరింగ్ చదివి బడిలో పాఠాలు చెపుతున్నాడు' అంటారు.

స్వామీజీ: నువ్వు ప్రభుత్వ ఉద్యోగంలో లేదా ఇంజనీరుగానే స్థిరపడుదువు గాని! శాశ్వతంగా టీచర్‌గానే ఉండిపొమ్మని చెప్పటం లేదు. తాత్కాలికంగా నీ కాళ్ళపై నువ్వు నిలబడటానికి ప్రయత్నించు. దానితో నీపై నీకు విశ్వాసం కలుగుతుంది. ఎంత పెద్ద పోటీ పరీక్షైనా రోజంతా చదవవలసిన అవసరం లేదు. చదవలేము కూడా. రోజంతా ఖాళీగా ఉండి ఇప్పుడు ఒక గంట కూడా చదవలేక పోతున్నావు. మరి కొద్దిసేపు పిల్లలకు పాఠాలు బోధిస్తే ఏమవుతుంది? నీలో భావప్రకటన నైపుణ్యం పెరుగుతుంది. నీ కాళ్ళపై నువ్వు నిలబడగలగడం వల్ల వచ్చే ఆనందం వేరు. నీకు అంత నామోషీగా ఉంటే ఇంట్లోవాళ్ళకు చెప్పకు. ఐనా ఉపాధ్యాయ వృత్తి కన్నా పవిత్రమైన వృత్తి, గొప్ప జీవిక ఇంకేమైనా ఉన్నదా? పిల్లలకు పాఠాలు బోధించమంటే 'నేను ఇంజనీరింగ్ చదివాను. ఇంజనీరుగానే స్థిరపడాలి. నాది ఉన్నత చదువు' అని అనుకోవటమే తప్పు. ప్రతి పనీ పవిత్రమైనదే. ఎవరి స్థాయిలో వారు సమాజ అభివృద్ధిలో పాలు పంచుకుంటున్నారు. నీ మనస్సులో నుంచి ఇది ఉన్నత ఉద్యోగం, ఇది అధమమైనదన్న భావనను తీసివేయి. అదే మనం అమెరికా వెళ్ళినప్పుడు పెట్రోల్ బంకుల్లో, హోటళ్లలో, డిపార్టుమెంట్ స్టోర్సులలో పనిచేస్తున్నామా లేదా? అక్కడ ఎందుకు సిగ్గుపడం?

యువకుడు: ఏమో స్వామీజీ! అక్కడ చేయటానికి ఇబ్బంది అనిపించదు. మన దేశంలో చేయలేం. సమాజంలో చులకనై పోతాం.

స్వామీజీ: అదే మనకూ, వాళ్ళకూ తేడా. వారు వ్యక్తికి గౌరవాన్నిస్తారు. వృత్తులన్నీ సమానమే. మనం వృత్తిని బట్టి వ్యక్తికి

గౌరవాన్నిస్తున్నాం. ఈ విషయంలో మనం చాలా పొరపాటు పడుతున్నాం. వృత్తితో సంబంధం లేకుండా చేసే ప్రతి పనీ దైవికమైనదని భావిస్తూ మనిషిని మనిషిగా చూస్తూ, దేశపౌరుడిగా ప్రతి వ్యక్తికీ గౌరవాన్నిచ్చే సంస్కారాన్ని పెంచుకోవాలి.

సమాజంలో చులకనైపోతాం అన్నది కూడా ఒక అల్పమైన భావన. సమాజం అన్ని విషయాల్లో సరిగ్గా ఆలోచించ లేదు. ఎందుకంటే ప్రస్తుతం సమాజమనేది ఒక పరిధిలోనే ఆలోచించే వ్యక్తుల సమూహంగా ఉంది. ఆ పరిధిని విస్తరించు కోవాలి. దానికి కొద్దిపాటి ధీరహృదయులు ముందుకు రావాలి. ఐనా జాగ్రత్తగా పరిశీలిస్తే సమాజమనేది మన మనస్సులోని ఒక భావనే. మన మనస్సే, 'ఎవరూ ఏమనుకోకముందే వాళ్ళు అలా అనుకుంటున్నారు. వీళ్ళు ఇలా అనుకుంటున్నారు' అని మనల్ని భ్రమింపజేస్తుంది. ఇది కూడా మనస్సును అధ్యయనం చేయడానికి సమయం తీసుకోకపోవడం వల్ల జరుగుతున్న విపరీత పరిణామం, విష పరిణామం.

ఆత్మహత్యలకు పాల్పడుతున్నవారు, మానసిక వికలాంగులుగా తయారవుతున్న వారందరూ ఎక్కువగా ఇతరులు మన గురించి ఏమనుకుంటున్నారో అని భయపడి అలాంటి పరిస్థితిని కొనితెచ్చు కుంటున్నవారే. కాబట్టి తాము చేయగలిగింది, సాధించగలిగింది, తమకు అందుబాటులో ఉన్నదాన్ని ఎలాంటి భేషజాలూ లేకుండా చేయడానికి యువత ముందుకు రావాలి. అవమనతతో (false prestige) చేయగలిగింది కూడా చేయకుండా, 'ఇది నేను చేయతగినది కాదు. ఇది నా చదువుకు తగ్గది కాదు' అని భావిస్తూ ఏ పనీ చేయకుండా ఖాళీగా కూర్చొని భయాన్నీ, అపనమ్మకాన్నీ పెంచుకుంటూ, మనస్సును ప్రతికూల భావాల పుట్టగా తయారు చేసుకొని మానసిక రోగిగా మారకూడదు. అప్పుడు తనకు తాను ఉపయోగ పడకపోవడమే కాక, తన భారాన్ని కూడా ఇంకొకరు మోయాల్సి వచ్చే పరిస్థితిని కొనితెచ్చుకున్నట్లవుతుంది.

యువకుడు: వ్యక్తి వ్యసనాల బారినపడడానికి కూడా ఇదే కారణ మేమో స్వామీజీ?

స్వామీజీ: అవును. అందుకని వ్యక్తి ఎప్పుడూ స్వీయశక్తి మీద విశ్వాసాన్ని కోల్పోకూడదు. అదే స్వామి వివేకానంద చెప్పింది కూడా. వ్యక్తి తన స్వశక్తిపై నమ్మకాన్నీ, భగవంతుడిపై నమ్మకాన్నీ ఎప్పుడూ సడల నీయకూడదు. మహోన్నత ఆధ్యాత్మిక జ్ఞానమైన వేదాంతాన్ని నిత్యజీవితంలో అనుష్ఠించడమంటే ఏమిటో తెలుసుకోవడానికి స్వామి వివేకానంద జీవితంలోని ఈ అనుభవం మనకు ఉపయోగపడుతుంది.

ఒకసారి ఆయన ఒక శిష్యురాలితో కలిసి ఒక గుర్రపు బగ్గీలో బయలుదేరి ప్యారిస్ నగర శివారులోని ఒక గ్రామానికి వచ్చారు. ఆ గ్రామంలో బగ్గీ వెళుతున్నప్పుడు ఇద్దరు పిల్లలు ఎదురు వచ్చి గుర్రపు బండిని నడుపుతున్న వ్యక్తిని చూసి చేతులు ఊపారు. ఆయన బండి దిగి, ఆ పిల్లలను ముద్దుపెట్టుకొని మళ్ళీ బగ్గీ నడపటానికి సిద్ధపడ్డాడు. 'పిల్లలు చూస్తే శ్రీమంతుడి బిడ్డల్లా ఉన్నారు. మరి ఈ బండి తోలే ఆయన వారిని ఎందుకు ప్రేమతో దగ్గరికి తీసుకున్నాడు?' స్వామీజీ ఇలా ఆలోచిస్తూ ఉంటే ప్రక్కనున్న శిష్యురాలు తన ఉత్సుకతను ఆపుకోలేక ఆ బండివాడిని అడిగింది – ఆ పిల్లలెవరు? వారికీ ఆయనకు సంబంధం ఏమిటని?

అప్పుడు ఆ బగ్గీని నడుపుతున్న వ్యక్తి వాళ్ళ సందేహాన్ని గ్రహించి నివృత్తి చేశాడు. 'అమ్మా, వాళ్ళు నా పిల్లలే. నేను ఇంతకు ముందు ఒక బ్యాంకుకు చైర్మన్‌గా ఉన్నాను. కాలం కలిసిరాక బ్యాంకు దివాళా తీసింది. కుటుంబాన్ని పోషించడానికి ఈ బగ్గీ తోలుతున్నాను. ప్యారిస్ నగరంలో జీవన వ్యయం ఎక్కువ కాబట్టి కుటుంబాన్ని ఇక్కడకు మార్చాను. కొద్దిగా ధనం సమకూర్చు కొని, మళ్ళీ బ్యాంకింగ్ రంగంలో ప్రవేశించి ఇంకొక బ్యాంకు చైర్మన్‌గా ఎదగడానికి ప్రయత్నిస్తాను. మళ్ళీ నాకు ప్రావీణ్యం, అనుభవం ఉన్న రంగంలోనే స్థిరపడతానన్న నమ్మకం నాకుంది' అన్నాడు. ఆ వ్యక్తి అలా అనగానే స్వామీజీ శిష్యురాలితో, 'అనుష్ఠానవేదాంతం అంటే ఇది. ఇంతకాలం వేదాంతాన్ని ఆచర ణాత్మకం చేయడం ఏమిటో ఎలా చెప్పాలా అని ఆలోచిస్తున్నాను. ఈ వ్యక్తి జీవితం అనుష్ఠాన వేదాంతానికి నిజమైన దర్పణం.


యువకుడు: బ్యాంకు చైర్మన్‌గా చేసి గుర్రపు బండిని నడపడమా! అర్థమైంది స్వామీజీ! అంటే వారు మనలాగా అవమనతకు (false prestige) లోనవరు. ప్రతి పనీ పవిత్రమైనదిగానే భావిస్తారు. ఎప్పుడు ఏ పని చేయడానికైనా సిద్ధంగా ఉంటారు. ఐతే ప్రస్తుతం నన్నేమి చేయమంటారు స్వామీజీ?

స్వామీజీ: అందుకని విదేశాలలో మనలాగా ప్రచ్ఛన్న నిరుద్యోగం లేదు. ప్రతి మనిషీ ఏ పని చేయటానికైనా సిద్ధంగా ఉంటాడు కాబట్టి పనిచేయగలిగి ఖాళీగా ఉండే వారి సంఖ్య స్వల్పం. కార్యనిర్వహణ సామర్థ్యం కలిగి ఖాళీగా ఉండడం వల్ల దేశం నష్టపోతుందన్న భావనలో వారు ఉంటారు. వారు తాత్కాలిక ఓటములకు కుంగిపోరు. సదా ఆశావహ దృక్పథంతో ఉంటారు. ఇదే ఆధ్యాత్మికత. నిజమైన ధర్మం. ఇక నీ ప్రస్తుత జీవితం గురించి... ఇది అంతర్జాల యుగం. ప్రపంచంలో ఏ మూల కూర్చొన్నా, ప్రపంచంలో జరుగు తున్న ప్రతి విషయాన్నీ తెలుసు కోవచ్చు. పోటీ పరీక్షలకు సిద్ధమవడానికి నగరాలలోనే ఉండవలసిన అవసరం లేదు. జ్ఞానాన్ని ఏ మూల నుండైనా గ్రహించవచ్చు. ఇంకా ఇక్కడ ఉండడం వల్ల ఈ రణగొణధ్వనుల మధ్య మనస్సు ఏకాగ్రమవటం కూడా కష్టం. నగరాలలోని విపరీతమైన ధ్వని కాలుష్యం వ్యక్తిని ప్రశాంతంగా ఆలోచించనీయదు. సదా అలజడితో ఉండే మనస్సు జ్ఞానపు లోతుల్లోకి వెళ్ళలేదు. చిన్న చిన్న పట్టణాలే ఇప్పుడు మేధావికాసానికి అనువైన వాతావరణాన్ని కలిగి ఉన్నాయి. అందుకని నీవు వెళ్ళి ఒక తాత్కాలిక ఉద్యోగాన్ని వెతుక్కొని, స్వీయపోషణకు కావలసిన ధనాన్ని సంపాదిస్తూ 'ఉన్నత ఉద్యోగ' అన్వేషణ చేయి.

యువకుడు: సరే స్వామీజీ! ఇప్పుడు కాస్త ధైర్యం వచ్చింది. మీరు చెప్పినట్లు చేస్తాను. ❖

వృత్తితో సంబంధం లేకుండా చేసే ప్రతి పనీ దైవికమైనదని భావిస్తూ, మనిషిని మనిషిగా చూస్తూ, దేశపౌరుడిగా ప్రతి వ్యక్తికీ గౌరవాన్నిచ్చే సంస్కారాన్ని పెంచుకోవాలి.

ధీరులూ, సమర్థులూ అయిన కార్యసాధకులనే అదృష్టం వరిస్తుంది. దిగంతాలను తాకే వీరోచిత మైన ధైర్యోత్సాహాలతో ప్రయత్నిస్తూ కడదాకా వేచి ఉండేవారే అద్భుతాలను సాధిస్తారు. - స్వామి వివేకానంద



సోదరి నివేదిత సేవాతత్పరత

- స్వామి నిఖిలేశ్వరానంద

సోదరి నివేదిత కలకత్తాలో బాలికల విద్యాలయం నిర్వహిస్తున్న రోజులవి... ఆమె సేవలను చూసి ఆనాటి ప్రముఖులెందరో గౌరవాభిమానాలు చూపేవారు. విశ్వకవి రవీంద్రనాథ్ టాగూరు, అరవిందయోగి వంటి ఉద్దండులు నివేదితను 'లోకమాత నివేదిత' అని సంబోధించేవారు.

ఒకరోజు ప్రముఖ శాస్త్రవేత్త జగదీశ్ చంద్రబోస్ సోదరి నివేదితను తమ ఇంటికి భోజనానికి ఆహ్వానించారు. వారి కోరిక మేరకు ఆమె అతిథిగా బోస్ గృహానికి వెళ్ళారు. కొద్దిసేపు మాటామంతీ అయ్యాక, జగదీశ్ చంద్రబోస్ కుటుంబసభ్యులు సోదరి నివేదితను భోజనానికి పిలిచారు.

ఇంతలో ఆమె హఠాత్తుగా ఏదో జ్ఞాపకం వచ్చినట్లు కుర్చీలో నుంచి లేచారు. ఆ క్షణంలో సోదరి నివేదితకు తమ విద్యాలయంలో చదువుకుంటున్న ప్రఫుల్లమాయి అనే యువతి గుర్తొచ్చింది. ప్రఫుల్ల యుక్తవయస్సులోనే భర్తను కోల్పోయింది; నివేదిత ప్రారంభించిన పాఠశాలలో చదువుకుంటోంది. ఆ రోజు ఏకాదశి; ప్రఫుల్ల ఉపవాసం ఉంటుందనీ, రోజంతా ఏమీ భోజనం చేయదనీ, రాత్రి కేవలం పండ్లు తీసుకుంటుందనీ స్ఫురించింది. రాత్రి తను ప్రఫుల్లకు ఫలాలు తీసుకువెళ్ళాల్సి ఉందన్న సంగతి గుర్తొచ్చి, 'క్షమించండి. నేను ఇప్పుడు పండ్లు తీసుకువెళ్ళకపోతే ఆమె ఆకలితో గడపాల్సి ఉంటుంది. దయచేసి నేను వెళతాను' అంటూ నివేదిత హడావిడిగా బయలుదేరారు.

దేశం కాని దేశంలో, తనకు సంబంధించని ప్రజల పట్ల సోదరి నివేదిత చూపుతున్న శ్రద్ధ, ప్రేమ జగదీశ్ చంద్రబోస్ కుటుంబసభ్యులను ఆనందాశ్చర్యాలకు గురిచేసింది. విదేశాల్లో విలాసవంతమైన జీవితాన్ని వదులుకొని, కేవలం భారతావనిపై ప్రేమతో, మన దేశానికి వచ్చి దీనజన సేవలో పునీతురాలైన వ్యక్తి సోదరి నివేదిత. స్వామి వివేకానంద శిష్యురాలిగా ఆమె చేసిన సేవ అనుపమానమైంది.

అతివల అక్షరాస్యతకు అంకురార్పణం: ఇంగ్లండ్‌లో ఒక సాధారణ ఉపాధ్యాయినిగా పనిచేస్తున్న మార్గరెట్ నోబుల్ (1867-1911), స్వామి వివేకానంద ప్రసంగాలతో ప్రభావితురాలై భారతావని సేవలో తరించారు. భారతదేశం అభివృద్ధి చెందాలంటే ముందు స్త్రీ జనోద్ధరణ జరగాలని స్వామి వివేకానంద ఆకాంక్షించారు. అయితే మహిళలు అక్షరాస్యతకు నోచుకున్ననాడే వాళ్ళలో చైతన్యం జాగృతమవుతుందని పునరుద్ఘాటించేవారు. ఆ పరంపరలోనే ఆనాడు కలకత్తాలో ప్రత్యేకంగా స్త్రీల కోసం ఓ విద్యాలయాన్ని ప్రారంభించాలని స్వామీజీ తలచారు. అయితే ఆనాటి సామాజిక పరిస్థితుల ప్రభావంతో భారతీయులు ఎవరూ అలాంటి విద్యాలయాల నిర్వహణకు ముందుకు రాలేదు. మహామహులు కూడా వనితా విద్యాలయాలను ప్రారంభించేందుకు వెనకడుగు వేశారు. ఆ నేపథ్యంలో స్వామి వివేకానంద, విదేశాల్లో ఉన్న మార్గరెట్ నోబుల్‌కు 1896 జూన్ 7వ తేదీన ఓ లేఖ రాస్తూ తన ఆవేదనను వెలిబుచ్చారు. ఎందరో అభాగినుల అజ్ఞాతమైన ఆర్తిని అగ్నికణాలుగా తన అక్షరాల్లో నింపారు.

ఆ పిలుపుతో మార్గరెట్ భారతదేశానికి తరలివచ్చారు. ఆ తరువాత స్వామీజీ ఆమెకు బ్రహ్మచర్య దీక్షతో పాటు, సోదరి నివేదిత అనే పేరు నిచ్చి కర్తవ్యదీక్షను నిర్దేశించారు. ఆ మహనీయుడి మార్గనిర్దేశకత్వంలో నివేదిత కలకత్తాలో బాలికలు, మహిళల కోసం ఓ విద్యాలయానికి శ్రీకారం చుట్టారు. ఆనాటి ఎన్నో విద్యాసంస్థలకు దీటుగా, ఆదర్శవంతంగా దానిని తీర్చిదిద్దారు. నాటి సమాజం నుంచి ఎన్నో ప్రతిఘటనలను ఎదుర్కొంటూ సోదరి నివేదిత ఒంటరి పోరాటం చేశారు. ప్రారంభంలో ఎవరూ తమ ఆడపిల్లలను ఆ పాఠశాలకు పంప డానికి ముందుకు రాలేదు. ఆ సమయంలో సోదరి నివేదిత కలకత్తా వీథుల్లో గడపగడపా తొక్కి 'ఆడపిల్లల్ని ఇంటి నుంచి పాఠశాలకు తీసుకువెళ్ళి, మళ్ళీ తిరిగి ఇంటి దగ్గర భద్రంగా వదిలిపెట్టే బాధ్యత నాద'ని తల్లితండ్రులను ఒప్పించారు. ఉచితంగా అమ్మాయిలకు భోజనసౌకర్యాలు కల్పిస్తూ అక్షరాస్యులను చేశారు. ప్రతి ఒక్క విద్యార్థినిపై వ్యక్తిగత శ్రద్ధ చూపుతూ, సోదరి నివేదిత వాళ్ళ గుండెల్లో గూడు కట్టుకున్నారు. అలా ఆరంభమైన పాఠశాల నేడు 'సోదరి నివేదిత బాలికల పాఠశాల'గా ఎందరో విద్యార్థినుల జీవితాల్లో వెలుగులు నింపుతోంది. అలా నివేదిత స్వదేశంలోని ఎందరో సామాజిక సేవాభిలాషులకూ, స్వాతంత్ర్య సమరయోధులకూ ఆదర్శమయ్యారు. స్వామి వివేకానంద ఆశయాలకు సోదరి నివేదిత సాకారంగా నిలిచారు. ❖ **(మార్చి 8 'అంతర్జాతీయ మహిళా దినోత్సవం')**

యువవాణి

– స్వామి పరిజ్ఞేయానంద

కె.ఏ. రాజు, ఎమ్.బి.ఏ, శ్రీకాకుళం

ప్రశ్న: స్వామి వివేకానంద తలపాగ చుట్టుకున్నప్పుడు ఎడమ చెవిని మాత్రమే మూశారు. అందుకు కారణమేమిటి?

జవాబు: ఒక భక్తుడు మహావిష్ణువు కోసం ఎన్నో ఏళ్ళు తపస్సు చేశాడు. మహావిష్ణువు పాలకడలిని వీడి పుడమిని చేరాడు. భక్తుని ముందు ప్రత్యక్షమై 'భక్తా! నీ తపస్సుకు మెచ్చాను. నీకు ఏం కావాలో కోరుకో' అన్నాడు. ఆ వైకుంఠనాథుని చూసిన భక్తుడు పరమానందంతో 'స్వామీ! ఎన్నో ఏళ్ళ నుండి నన్ను ఒక ప్రశ్న వేధిస్తోంది. భృగు మహర్షి మీ హృదయం మీద తన్నాడు కదా! ఏ కాలుతో తన్నాడు? ఎడమ కాలుతోనా? కుడి కాలుతోనా?' అని అడిగాడు. ఆ వింత ప్రశ్న విన్న విష్ణుమూర్తి నవ్వుతూ 'ఆ సంగతి నాకు గుర్తులేదు. లక్ష్మీదేవిని అడిగి చెబుతాను' అని అంతర్ధానమైపోయాడు.

ధీరపురుషుని దివ్యశక్తి

మహావిష్ణువు ప్రత్యక్షమైతే భక్తీ, ముక్తీ ప్రసాదించమని అడగకుండా అప్రస్తుత ప్రశ్నలతో ఎన్నో ఏళ్ళ తపః ఫలితాన్ని వృథా చేసుకొన్న మూర్ఖ భక్తునిలా మనం కాకూడదు.

సాక్షాత్తూ ఆ కైలాసపతే మానవాళిని ఉద్ధరించడానికి విశ్వాచార్య వివేకానందగా అవనిపై అవతరించాడు. ఆయన తలపాగాతో ఎడమ చెవి ఎందుకు మూసుకున్నారు, చేతులు ఎందుకు కట్టుకున్నారు – ఇలాంటి సందేహాలతో సమయాన్ని వృథా చేయకుండా ఆ అపర పరమేశ్వరుని బోధలతో స్ఫూర్తిమంతులమై ఉన్నత కార్యాలను సాధించాలి. అవనిలో చిరకీర్తిని ఆర్జించాలి.

ప్రాచ్య పాశ్చాత్య దేశాలలో స్వామి వివేకానందను దర్శించిన వారెవరికీ ఇలాంటి సందేహాలు కలగలేదు. స్వామీజీని ప్రప్రథమంగా చూసిన వెంటనే కొంత మంది పొందిన అనుభూతుల్నీ, అభిప్రాయాల్నీ తెలుసుకుందాం:

1. స్వామీజీ పరివ్రాజక సన్న్యాసిగా భారతదేశం పర్యటిస్తూ కొచ్చిన్‌లో ప్రొఫెసర్ సుందరరామ అయ్యర్‌ను కలుసుకోవడానికి ఆయన ఇంటికి వెళ్ళారు. అతడి కుమారుడు పద్నాలుగేళ్ళ రామస్వామి అయ్యర్ స్వామీజీని చూసిన వెంటనే 'నాన్నగారూ! మన ఇంటికి మహారాజు వచ్చారు' అని పరుగెత్తుకుంటూ వెళ్ళి తండ్రికి చెప్పాడు.

2. సభావేదికపై ఉన్న ఎంతో మంది మేధావుల మధ్య స్వామీజీని చూసిన ఒక విదేశీయుడు 'స్వామీజీ అనంతశక్తి స్వరూపుడనీ, ఆయన ముందు మిగతావాళ్ళంతా సూర్యుని ముందు తారల్లా కాంతిహీనులై కనిపించార'నీ తన అనుభూతిని ఇలా తెలియజేశాడు: 'What a giant, what strength, what manliness, what a personality! Everyone near him looks so insignificant in comparison.


3. స్వామీజీ వాగ్ధాటి, మేధాశక్తి, వ్యక్తిత్వాలను వర్ణించడానికి నిఘంటువులో ఉన్న విశేషణాలన్నింటినీ ఉపయోగించినా అవి తక్కువేనని అమెరికా వార్తాపత్రికలు ఇలా ప్రకటించాయి:

"...cull from the dictionary all superlative adjectives, then go and hear Vivekananda. Before he has talked ten minutes, you will toss your collection of adjectives in the waste - basket and acknowledge your inability to describe this wonderful man".

4. స్వామీజీ కైరో నగర వీధుల్లో నడిచి వెళుతుండగా అక్కడున్న కొందరు వేశ్యలు, స్వామీజీ దివ్యతేజస్సుకు ప్రభావితులై ఆయన దగ్గరకు వచ్చి 'ఈ భువిపై నడయాడే దేవుడు మీరు' అని శిరస్సు వంచి స్వామీజీకి నమస్కరించారు.

స్వామీజీ బోధలను చదివితే మనలో ఆత్మశక్తి జాగృతమవుతుంది. ఆ రూపాన్ని దర్శిస్తేనే చాలు మనలో ధైర్య స్థైర్యాలు కలుగుతాయి.

స్వామీజీ కేవలం తమ ప్రసంగాల ద్వారా ప్రబోధించడమే కాకుండా, తమ భంగిమ ద్వారా కూడా మనకు సందేశాన్ని ఇవ్వాలనుకొని ఉండవచ్చు. ఎడమ చెవిని మూసివుంచడానికి కారణం 'చెడు విషయాలను వినవద్దు' అని హెచ్చరిస్తున్నారేమో!



ఏది ఏమైనప్పటికీ, స్వామీజీ తలకు చుట్టిన తలపాగను విశ్లేషించడం కన్నా, ఆయన మేధస్సు నుండి ప్రవహించిన జ్ఞాన గంగను కొంతైనా స్వీకరించి మహోన్నతులుగా ఎదగడానికి ప్రయత్నిద్దాం. భారత మాత ఘనకీర్తికి వారసులమై, స్వామీజీ కలల్ని సాకారం చేద్దాం. ❖

మన్నించడమే



కురుక్షేత్ర సంగ్రామం ముగిసింది. కౌరవుల పరాజయాన్ని తట్టుకోలేని అశ్వత్థామ, పసిపిల్లలని కూడా చూడకుండా నిదురిస్తున్న పాండవుల బిడ్డల్ని హతమార్చాడు. విషయం తెలిసి ఆగ్రహోదగ్రుడయ్యాడు అర్జునుడు. పుత్రశోకంతో పరితపిస్తున్న పాంచాలిని ఓదారుస్తూ, అశ్వత్థామను హతమారుస్తానని ప్రతిజ్ఞ చేశాడు. అన్నమాట ప్రకారం బ్రహ్మాస్త్రాన్ని ప్రయోగించి ఆ గురుపుత్రుడి కాళ్ళూ చేతులూ కట్టేసి ద్రౌపది ముందు పడేశాడు. ఆ ఘాతకుడి కుత్తుక నరికేందుకు భీమార్జునులు సిద్ధమయ్యారు. ఇంతలో ద్రౌపది, అశ్వత్థామను సమీపిస్తూ 'నా బిడ్డలు ఉద్రేకంతో యుద్ధ రంగంలో ఆయుధాలు పట్టి ఎదురు నిలువలేదే! కొంచెం కూడా నీకు అపకారం చేయలేదే! అటువంటి పసివాళ్ళను, సంగ్రామరంగంలో ఇంకా సంపూర్ణ సామర్థ్యం పొందని వాళ్ళను, అర్ధరాత్రి నిద్రలో ఆదమరచి ఉన్నవాళ్ళను వధించడానికి నీకు చేతులెలా వచ్చాయయ్యా?' అని కన్నీరు పెట్టింది.

ఆ మాటలకు ఆ ద్రోణపుత్రుడి నవనాడులూ కుంగిపోయాయి; పశ్చాత్తాపంతో తల వాలిపోయింది. ఇంతలో భీమార్జునులు ఆ అశ్వత్థామను మట్టుపెట్టేందుకు ముందుకు రాబోయారు. కానీ ఆ సాధ్వీమణి వారిని వారిస్తూ 'ఇతణ్ణి చంపితే, పుత్రశోకంతో బరువెక్కి వ్యాకులమైన చిత్తంతో ఇక్కడ నేను ఏడుస్తున్నట్లే అక్కడ ఇతడి తల్లీ రోదిస్తుంది. ఇప్పటికే, కదనరంగంలో కాళ్ళూ చేతులూ కట్టి తన ఏకైక కుమారుడిని ఇక్కడికి ఈడ్చుకొని వచ్చారన్న సంగతి తెలిసి, ఆమె దుర్భరమైన దుఃఖంతో ఎంతగా తల్లడిల్లి పోతున్నదో కదా! నా లాంటి గర్భశోకం ఆ తల్లి కూడా అనుభవించడం నేను భరించలేను. ఇతణ్ణి వదిలేయండి!' అంటూ క్షమాభిక్ష పెట్టింది. ప్రాణాలు తీసేంత పాపం చేసినా మన్నించి, తన మాననీయతను నిరూపించుకుంది.

ఎదుటివారు ఏ కాస్త తప్పు చేసినా కక్షతో కత్తులు నూరే, ప్రతీకారంతో పొగలు గక్కే మనం అలవరచుకోవలసిన అత్యుత్తమ లక్షణం ఈ క్షమాగుణం. అందుకే ఓ మారు కొడుకు పరశురాముడితో జమదగ్ని....

క్షమ కలిగిన సిరి కలుగును
క్షమ కలిగిన వాణి కలుగు సౌఖ్యము లెల్లన్
క్షమగలుగ దోన కలుగును
క్షమ కలిగిన మెచ్చు శౌరి సదయుడు తండ్రీ!...

'క్షమ కలిగితే సంపద, విద్య, సుఖాలు కలుగుతాయి; ఆ భగవంతుడు మెచ్చుతాడు' అని అంటాడు.

మన్నిస్తే మానవీయత: మొదలు నరికి తనను మోడుగా మార్చిన గొడ్డలినే మన్నించి మొక్క మళ్ళీ చిగురించి చిగురాకులనే చిరునవ్వులతో పలకరిస్తుంది. తనను కాలి కింద తొక్కేసిన పాదానికి కూడా పువ్వు సుగంధాన్ని అద్ది మన్నిస్తుంది. అన్నీ తెలిసిన మనుష్యులమే పొరపాట్లను మనస్సు పొరల్లో దాచుకుంటూ, అవకాశం వచ్చినప్పుడల్లా కక్ష సాధించుకుంటూ పైశాచికానందాన్ని పొందుతూ ఉంటాం. తప్పులు మన్నించడానికి బదులు కక్ష సాధించుకోవడానికే తహతహలాడుతూ ఉంటాం. కానీ ప్రతీకారం తీర్చుకుంటే తాత్కాలికంగా మన అహం శాంతిస్తుందేమో! కానీ అది మనస్సులోని మానవీయ కోణాన్ని మరగుపరచి, మనల్ని ఓ సాధారణ మనిషి స్థాయికే పరిమితం చేస్తుంది. అలాకాకుండా మనస్సు నొప్పించే రీతిలో ప్రవర్తించిన వారితో కూడా మన్ననతో మసలుకుంటే, మనకు దక్కే శోభ అనిర్వచనీయమైంది. దెబ్బకు దెబ్బ తీయాలనుకునే గుణం మృగాలది, మూగజీవాలదే కానీ మనుష్యులది కాదని ఎన్నటికీ మరచిపోకూడదు. అందుకే మన సనాతన ధర్మం కూడా

నరస్యాభరణం రూపం, రూపస్యాభరణం గుణం
గుణస్యాభరణం జ్ఞానం, జ్ఞానస్యాభరణం క్షమ!

'మానవుడికి రూపం ఆభరణం లాంటిది; రూపానికి గుణమే నగ లాంటిది; గుణానికి జ్ఞానం ఆభరణం లాంటిది; ఆ జ్ఞానానికి క్షమ, ఓర్పు అలంకారాలు' అని అంటుంది.

కేవలం రూపం ఉపయోగపడదు. దానికి తగిన గుణం ఉండాలి. రూపం, గుణం ఉన్నా బుద్ధిహీనుడైతే ప్రయోజనం ఏమిటి? జ్ఞానం ఉండాలి. జ్ఞానం ఉంది; కానీ ఓర్పు లేకపోతే ఉపయోగం లేదు. కనుక ఓరిమి ముఖ్యమని స్పష్టం చేసింది.

క్షమలోనే కక్షసాధింపు: ఎదుటివారు ఏదో అన్నారని మనమూ ఎదురుపడి అంటే వాళ్ళకూ, మనకూ తేడా ఉండదు. వారి చర్యకు మన ప్రతిచర్య కూడా అదే తీరులో ఉందంటే, వారు అధమస్థాయిలో ఉండి, కిందకు లాగితే మనమూ పై నుంచి కిందకు దిగజారినవాళ్ళమే అయ్యామన్న మాట! ఉన్నతమైన వ్యక్తిత్వం కలిగినవాళ్ళు ఎప్పుడూ అంత అవివేకంగా ప్రవర్తించరు. అందుకే స్వామి వివేకానంద ఓ సందర్భంలో 'అనంత క్షమాగుణం ద్వారా మీకు విజయం చేకూరడం తథ్యమ'ని ఉద్ఘాటిస్తారు. ఎదుటివాళ్ళు సభ్యత లేకుండా అలా ప్రవర్తించారని మనమూ అలాగే ప్రతిస్పందిస్తే అర్థమే లేదు.

మానవీయత

– బి.సైదులు

కానీ నేటి సమాజంలో విద్యావంతులం, నాగరకులం, ప్రముఖులం అని అనుకుంటున్న వ్యక్తులు కూడా సంయమనాన్ని కోల్పోతూ మాటకు మాట, దెబ్బకు దెబ్బ అన్నట్లు కక్ష సాధింపు చర్యలకు కాలుదువ్వుతున్నారు. విచక్షణ లేకుండా ప్రతీకార చర్యలకు పూనుకుంటున్నారు. ***'చంపదగినయట్టి శత్రువు తన చేత చిక్కెనేని పొసగ మేలు చేసి పొమ్మనుటె చాలు!'*** అని, అదే అతనికి చావు లాంటిదని మన పెద్దలు ఎప్పుడో చెప్పారు. మనం తీర్చుకునే ప్రతీకారం పదికాలాల పాటు గుర్తుండాలంటే, దానికి ఒకే ఒక్క మార్గం క్షమించేయడమే! అందుకే అలెగ్జాండర్ పోప్.. To err is human; to forgive, divine అంటారు.

మన్నించడంలోనే మహాశక్తి: మన్నిస్తే మనల్ని సమాజం అసమర్థులుగా భావిస్తుందని చాలా మంది భ్రమపడుతూ ఉంటారు. కానీ అది పొరపాటు! 'క్షమ వీరస్య భూషణమ్..' – వీరత్వం కలిగిన వారికి క్షమాగుణం ఆభరణం లాంటిది. అవకాశం, సామర్థ్యం ఉండి కూడా ప్రతీకారం తీర్చుకోకుండా వదిలేస్తే, ప్రత్యర్థి పశ్చాత్తాపంతో కుమిలిపోతాడు. తప్పక ఏదో ఒక సందర్భంలో తను చేసిన తప్పిదాన్ని తెలుసుకుంటాడు. కానీ ఆధునిక జీవనంలో మనకు అంత ఓర్పు ఉండడం లేదు. మనతో పొసగని వ్యక్తిపై ఎప్పుడు ఎదురుదాడికి దిగుదామా! అని సమయం కోసం ఎదురుచూస్తూ ఉంటాం; చాలాసార్లు అవకాశాన్ని కల్పించుకొని మరీ ఘర్షణకు దిగేందుకు ప్రయత్నిస్తాం. గోటితో పోవాల్సిన స్పర్థలను గొడ్డలి దాకా తెచ్చుకుంటూ ఉంటాం. శ్రీకృష్ణుడు కూడా శిశుపాలుడిని వందసార్లు క్షమించి వదిలేశాడు. నూరు తప్పులు సహించిన తరువాతే, అతడిని శిక్షించాడు.

నిజానికి మన నిత్యజీవితంలో ఆ స్థాయిలో వైరం పెంచుకునే పరిస్థితులు ఎవరికీ తారసపడవు. అయితే ఈ తరంలో కూడా కొందరు యువకులు ఉదాత్తంగా ఎంతో పెద్ద మనస్సుతో వ్యవహరిస్తూ ఉన్నారు. 'నువ్వు చేస్తున్నది తప్పు'ని హితవు పలికినందుకు కోపించి మిత్రుడిపై నిర్దాక్షిణ్యంగా దాడి చేశాడు ఇంజనీరింగ్ చదువుతున్న ఓ యువకుడు. అన్ని దెబ్బలు తిన్నా మిత్రుడే కదా అని రెండో యువకుడు వదిలేశాడు; పైగా తన మిత్రుడు తప్పుడు పని చేయడం వల్ల కొన్నాళ్ళకు వివాదాల్లో చిక్కుకొని ప్రత్యర్థుల చేతిలో దెబ్బలు తింటున్నపుడు ఇతనే వెళ్ళి అతణ్ణి రక్షించాడు. అప్పుడు ఇతర స్నేహితులందరూ 'ఒకప్పుడు నిన్ను నిర్దాక్షిణ్యంగా కొట్టిన వాడిని నువ్వెందుకు కాపాడావు?' అన్నారు. కానీ ఆ యువకుడు 'ఎంతైనా మన మిత్రుడు కదరా! వాడు తప్పు చేశాడని, మనమూ చేస్తామా!' అంటూ నవ్వేశాడు. ఇలా ఆలోచించే వ్యక్తులు నలుగురి మనస్సులో కలకాలం చెరగని ముద్ర వేసుకుంటారు. అందుకే బిల్ గ్రాహమ్ Man has two great spiritual needs. One is for forgiveness. The other is for goodness. అంటారు. ❖

కరుణామయి క్షమాభిక్ష



1999 జనవరి 23వ తేదీ. మానవజాతి సిగ్గుతో తలదించుకున్న రోజు... ముక్కుపచ్చలారని ఇద్దరు కొడుకులతో ప్రయాణిస్తున్న ఓ వ్యక్తిని కిరాతకులు దారుణంగా సజీవ దహనం చేసిన చీకటిరోజు... ఆ రోజు పొరుగూరు వెళ్ళిన భర్త, నిండా పదేళ్ళు కూడా నిండని కొడుకులు...ఇల్లు చేరతారని తెల్లవారుజామున వేయి కళ్ళతో నిరీక్షిస్తున్న స్త్రీమూర్తి గ్లాడిస్ స్టెయిన్స్ గుండె పగిలి పోయింది. మంటల్లో కాలి బుగ్గి అయిన భర్త, బిడ్డల శవాల్ని చూసి ఆ అభాగిని కన్నీరుమున్నీరయింది. మిగిలిన ఒక్కగానొక్క కూతురిని పట్టుకొని గుండెలవిసేలా రోదించింది.

ఒరిస్సాలో సంభవించిన ఈ ఘాతుకానికి యావత్ భారతీయులు కదిలిపోయారు. వ్యక్తిగతంగా వారితో సంబంధం లేని వ్యక్తులు కూడా ఆ కిరాతకులను పట్టుకొని ఉరితీయాలని నినదించారు. చివరకు ఒకానొక రోజున ఆ దుర్ఘటనకు కారణమైన నరరూప రాక్షసులను పోలీసులు పట్టుకున్నారు. న్యాయస్థానం వారికి ఉరిశిక్షను ఖరారు చేసే యోచనలో ఉంది. ఇంతలో శ్రీమతి గ్లాడిస్ స్టెయిన్స్ 'పాపం! వారిని శిక్షించకండి; నేను వారిని క్షమిస్తున్నాను' అని ప్రకటించింది; వారిని ఉరితీయవద్దని న్యాయస్థానాన్ని వేడుకుంది.

Forgiveness brings healing. If I forgive you, the bitterness leaves me. It also allows you to move on. Forgiveness liberates both the forgiver and the forgiven - క్షమ స్వస్థతనిస్తుంది; క్షమించే వ్యక్తికి సాంత్వన నిస్తుంది. క్షమింపబడ్డ వ్యక్తికి స్వేచ్ఛనిస్తుంది; చివరకు ఇద్దరినీ విముక్తులను చేస్తుందన్నారు శ్రీమతి గ్లాడిస్. ❖

'గతంలో నేను చెప్పిన సలహాను పాటించలేదు. అందుకే నీకీగతి పట్టింది' అంటూ జరిగిపోయిన దానిని ఎత్తిపొడిచేవారు ఆప్తులుకారు. ఆపదలో ఉన్నవారిని కాపాడిన వారే నిజమైన మిత్రులు. - హితోపదేశం

దూరపు కొండలు నునుపు!

– శ్రీమతి సుధామూర్తి, ఇన్ఫోసిస్ ఫౌండేషన్

సిద్ధార్థ నా పూర్వవిద్యార్థి. కళాశాలలో చదువుకునేప్పుడు చాలా ఉత్సాహంగా ఉండేవాడు. ఏ కార్యక్రమం నిర్వహించాలన్నా తనే ముందుండేవాడు. మంచి ఉపన్యాసకుడు కూడా! ఎప్పుడు సిద్ధార్థను చూసినా చాలా ముచ్చటేసేది. బెంగుళూరు సమీపంలోని పల్లెటూరు వాళ్ళది. విహారయాత్రలో భాగంగా ఆ ఊరికి వెళ్ళినప్పుడు, వాళ్ళ ఇంట్లోనే ఉన్నాం. ఆ ఆతిథ్యం మరువలేనిది. మమ్మల్ని అందరినీ బాగా చూసుకున్నారు. కొన్నేళ్ళ తరువాత సిద్ధార్థ ఈ మధ్య కనిపించాడు. కానీ ఇప్పుడతణ్ణి చూసి చాలా నిరుత్సాహం కలిగింది. అతనిలో చురుకుదనం మచ్చుకైనా కనిపించడం లేదు. పాలిపోయి, బలహీనంగా ఉన్నాడు.

'సిద్ధార్థా! బాగున్నావా? మీ అమ్మా నాన్న ఎలా ఉన్నారు? ఎక్కడుంటున్నావు?'అని ప్రశ్నల మీద ప్రశ్నలు గుప్పించాను. 'వాళ్ళు బాగానే ఉన్నారు మేడమ్! నా పరిస్థితే బాగా లేదు' అన్నాడు విషాదంగా ముఖం పెడుతూ!

'ఎందుకయ్యా? నీకన్నీ ఉన్నాయి. ప్రేమించే తల్లితండ్రులు, పుష్కలంగా పంటలు పండే భూమి, పల్లెటూళ్ళో సకల సౌకర్యాలతో కూడిన ఇల్లు, అన్నింటినీ మించిన ప్రశాంతత' అన్నాను.

'లేవు మేడమ్! అవన్నీ ఇప్పుడు లేవు; నా తల్లితండ్రులకు నా మీద ఎంతో ప్రేమ. ఆ మారుమూల పల్లెలో ఉండమని పట్టుబడుతున్నారు. అక్కడేమో నాకు ఒక క్షణం ఉండాలన్నా విసుగు పుడుతుంది. ఒక్క సినిమా థియేటర్ కూడా లేదు. మంచి స్నేహితుల్లేరు. జీవితంలో ఓ సరదా ఉండదు. సంతోషం ఉండదు. చేసిన పనులే చేయాలి; చూసిన మనుష్యుల్నే చూడాలి. అక్కడ పొలాలు, పాడిపశువులు తప్ప ఏముంటాయి మేడమ్! జీవితం స్తబ్ధుగా సాగిపోతుంది' అన్నాడు.

అతని జవాబు నన్ను ఆశ్చర్యపరిచింది. అతని బాధేంటో అప్పుడర్థమైంది. 'మరి జీవితంలో ఏం చేయాలనుకుంటున్నావ్ సిద్ధార్థ? అని అడిగాను. 'బెంగుళూరులోనో, ముంబాయిలోనో ఉండాలని ఆశ. అక్కడ కాలం పరుగెడుతున్నట్లనిపిస్తుంది. జీవితంలో ఎంతో వైవిధ్యం, సంతోషం! రోజూ కొత్తదనం కనిపిస్తుంది. కొన్నాళ్ళు కాల్‌సెంటర్లో పనిచేశాను. చాలా కష్టమైంది. గొంతు సమస్య పట్టుకుంది. నా గదికి, నేను పనిచేసే చోటుకు మధ్య ఇరవై కిలోమీటర్ల దూరం. ప్రయాణాలతో, నిద్రలేమితో ఆరోగ్యం చెడింది. ఆ ఉద్యోగానికి రాజీనామా చేశాను. ఇప్పుడు మరో ఉద్యోగం కోసం ప్రయత్నిస్తున్నాను. ఇన్నేళ్ళు నగరాల్లో ఉద్యోగం చేసి, ఇప్పుడు పల్లెలో ఉండాలంటే ఊరి జనం ఏమనుకుంటారోనని అవమానంగా అనిపిస్తోంది' అని అన్నాడు.

'సిద్ధార్థా! వెయ్యిమంది వెయ్యివిధాలుగా అనుకుంటారు. నువ్వు బతికేది వాళ్ళ కోసమా? నీ కోసమా? బెంగుళూరులో నెలకు పది, పదిహేను వేలు సంపాదిస్తే, మీ ఊళ్ళోనే ఉండి నువ్వు అంతకన్నా ఎక్కువ సంపాదించవచ్చు; పైగా మీ అమ్మానాన్నలను చూసుకోవచ్చు. ఇప్పుడు ఇంటర్‌నెట్, టీవీ లాంటి ఆధునిక సౌకర్యాలు అక్కడా ఉంటున్నాయి. ఇంతకు ముందు కన్నా ఇప్పుడు బయటి ప్రపంచంతో ఎక్కువగా సంబంధాలు ఏర్పరచుకోవచ్చు. అయినా నగరాల్లో ఉంటేనే ఆనంద మనుకోవడం నీ అమాయకత్వం; దూరపుకొండలు ఎప్పుడూ నునుపుగానే కనబడతాయి. దగ్గరకు వెళ్ళాక కానీ అసలు గరుకులు తెలియవు' అన్నాను. చాలామంది యువతీ యువకుల లాగే సిద్ధార్థకు నా మాటలు నచ్చలేదు; వెళ్ళిపోయాడు.

మరుసటి రోజు తమ ఊరి గ్రంథాలయానికి మా సంస్థ నుంచి పుస్తకాలు తీసుకుపోయేందుకు ఓ యువకుడు ఓ



మారుమూల గ్రామం నుంచి వచ్చాడు. చాలా ఉత్సాహంగా ఉన్నాడు. అతనితో మాట్లాడాను. బి.ఎ. ఇంగ్లీషు చదివాడట; చెస్‌లో చాంపియన్. జాతీయస్థాయి పోటీల దాకా వెళ్ళాడు. పూర్తిగా పల్లెల్లోనే తిరుగుతూ పనులు చేసుకుంటున్నాడు.

'పల్లెలో కాలక్షేపం ఎలా చేస్తావయ్యా?' అని అడిగాను.

'అబ్బో! చాలా పనులుంటాయి మేడమ్. నేను పుట్టగొడుగుల వ్యాపారం చేస్తాను. మా తోటలో కూరగాయలు కూడా పండిస్తాను. ఖాళీ సమయాల్లో పిల్లలకు చదరంగం నేర్పుతాను. ఊళ్ళో యువజనసంఘం ప్రారంభించా. ఓ గ్రంథాలయం ఏర్పాటు చేశాం. సేవాకార్యక్రమాలు చేస్తూ ఉంటాం. చాలా ఆనందంగా ఉన్నాను. నాకు వాహనం, మొబైల్ అన్నీ ఉన్నాయి. పల్లెలో ఉండడమే నాకిష్టం' అన్నాడు ఆ యువకుడు.

ఒక్కసారి ఈసురోమంటూ, వాలిన ముఖాలతో నగరాల్లో ఉరుకులు పరుగులు తీసే సిద్ధార్థ లాంటి యువకుల ముఖాలు నా మనస్సులో మెదిలాయి. ❖ సేకరణ: జి. సతీష్



దృష్టిని బట్టే సృష్టి

– స్వామి రంగనాథానంద

(రామకృష్ణ సంఘ 13వ సర్వాధ్యక్షులు)

నేను విదేశాల్లో పర్యటిస్తున్న సందర్భంలో, ఓ సమావేశంలో ప్రసంగించిన అనంతరం, స్థానిక విలేకరి నన్ను 'స్వామీజీ నిజమైన ఆధ్యాత్మిక జీవితమంటే ఏమిటి? అని ప్రశ్నించాడు. అప్పుడు నేను మతం, ఆధ్యాత్మిక జీవితానికి సంబంధించి స్వామి వివేకానంద ఇచ్చిన నిర్వచనాలను గుర్తుచేస్తూ, 'మానవుడిలోని సహజమైన దివ్యత్వాన్ని ఆవిష్కరింపచేయడమే మతం, ఆధ్యాత్మికత' అని వివరించాను. అయితే ఆ దివ్యత్వం ఆవిష్కృతమైనట్లు ఎలా తెలుస్తుందన్న సందేహం చాలామందికి కలుగుతుంది. మానవునిలో అంతర్లీనంగా దాగి ఉన్న ఆ దివ్యత్వపు ఛాయలు కొద్దిగా వెలుగుచూసినా, అతని ప్రవర్తనలో ఎంతో మార్పు కనిపిస్తుంది. ఆ శక్తి అవ్యాజమైన ప్రేమ, కరుణ, కర్మలో నైపుణ్యం, నిస్వార్థం, విశాలత్వం తదితర దైవీగుణాలుగా రూపుదిద్దుకుంటుంది. ఆధ్యాత్మిక జీవనాన్ని గడుపుతున్న వ్యక్తిలో తొణికిసలాడే లక్షణాలివి. అయితే ఇవి ఒక్కరోజులో వచ్చేవి కావు. మన మనస్సులకు మనం బాగా శిక్షణనిచ్చుకోవాలి. ఏ వైపు నుంచి ఏ కాస్త మెరుగుపెట్టుకునే అవకాశం వచ్చినా, ఏ మాత్రం వెనుకాడకుండా మనల్ని మనం పదునుపెట్టుకోవాలి. అందుకే భగవాన్ శ్రీరామకృష్ణులు బెంగాలీలో 'జతో దిన్ బాచీ, తతో దిన్ శీఖీ' అంటూ ఉండేవారు; జీవించినన్నాళ్ళూ నేర్చుకుంటూనే ఉంటాననేవారు. ఇలాంటి స్థితే ఆధ్యాత్మిక పరిణతికి చిహ్నం. నిస్సందేహంగా మానవులందరూ ఈ స్థాయికి చేరుకోవచ్చు. ఇదే మన వేదాంత బోధ సారమంతా!

నా వరకు ఇలాంటి ఆధ్యాత్మిక స్పృహ వల్లే నేను సన్యాసిగా రామకృష్ణ సంఘంలో మనగలిగాను. చాలా మంది అనుకున్నట్లు ఆధ్యాత్మిక సాధనల వల్ల బయటి నుంచి ఏదో ఒక శక్తి మనలోకి ప్రవేశించదు. కేవలం అంత వరకు మనలో జాగృతం కాని దివ్యత్వం అప్పుడు జాగృతమవుతుంది. ఉదాహరణకు ఒక చీకటి గదిలో బల్ల, కుర్చీ, ఇతర వస్తువులు ఉన్నాయనుకోండి. ఆ గదిలో దీపం వెలిగించగానే, కొత్తగా వస్తువులు అక్కడ ఏవీ వచ్చి చేరవు. కానీ కేవలం మీ దృష్టి ప్రకాశవంతమవుతుంది; ఎక్కడ ఏ వస్తువు ఉందో యథాతథంగా కంటికి కనిపిస్తుంది. అదే భేదం. ఆధ్యాత్మిక జీవితానికి కూడా ఇదే వర్తిస్తుంది. When one becomes aware of it, one becomes spiritually enriched thereby. It does not disturb anything in life, only enlightens everything. అప్పటి వరకు మీరు చూస్తున్న పరిస్థితులు, ప్రపంచం ఏదీ మారదు; కానీ మీ దృష్టి, మీ దృక్పథం మాత్రం మారతాయి. అదే విధంగా జీవితంలో జరిగే సంఘటనలకు ప్రతిస్పందించే తీరులో తేడా కనిపిస్తుంది. అప్పటి వరకు మనకు అసహజంగా అనిపించినవన్నీ అతి సామాన్యంగా తోస్తాయి. ఏదీ మనల్ని కలవరపరచదు. మనం ఆలోచించే కోణం మారుతుంది. ఇది ఎవరికైనా, ఎక్కడైనా సంభవించవచ్చు. వీధి పక్కన చెప్పులు కుట్టే వ్యక్తి కావచ్చు, వంటగదిలో పనులు చేసుకునే గృహిణి కావచ్చు, కళాశాలలో పాఠాలు చెప్పుకునే ఆచార్యుడు కావచ్చు. ఎవరైనా అలాంటి ఆధ్యాత్మిక జీవితానికి అర్హతను సంపాదించవచ్చు. కారణం అది మానవులుగా పుట్టిన మనందరి జన్మహక్కు. మనందరి హృదయాల్లో ఒకే భగవంతుడు నెలకొని ఉన్నాడని మరచిపోకుండా, మనల్ని ముందుకు నడిపించే శక్తి ఆ సాధనలోనే ఉంది.

అయితే ఆ దివ్యశక్తి ప్రస్ఫుటంగా ప్రకాశించాలంటే మాత్రం మన మనస్సులు స్ఫటికంలా స్వచ్ఛంగా, పవిత్రంగా ఉండాలి. ఇదొక్కటే ఆధ్యాత్మిక జీవితానికి ప్రధాన అర్హత. ఏ మతమైనా ఇదే అంశాన్ని ప్రస్తావిస్తుంది. ❖ **సేకరణ: ఆర్. కృష్ణ**

ఇంద్రియాలను, మనస్సును స్వాధీనం చేసుకోలేని వారికి ఎంత జ్ఞానమున్నా నిష్ప్రయోజనం. అలాంటివారు క్రియాశూన్యులు. కురూపికి ఎన్ని ఆభరణాలు పెట్టినా లాభం లేదు కదా! - హితోపదేశం

(...21వ పేజీ తరువాయి)

గుహుడు, సుగ్రీవుడు, శబరి మొదలైన నిమ్నజాతి వారిని శ్రీరాముడు ఆదరించారు. శ్రీరామకృష్ణులు ధని కమరణి, రసిక్, లాటూ లాంటి వారిని అనుగ్రహించారు. శ్రీరాముడు, శ్రీరామకృష్ణులు కూడా సత్యవాక్య పరిపాలకులు. శ్రీరాముని లాగా శ్రీరామకృష్ణులు కూడా ఆదర్శ పుత్రుడు, ఆదర్శపతి, ఆదర్శ గురువు.

శ్రీరామకృష్ణుల కులదైవం రామచంద్రుడు. సాధన కాలంలో ఆయన రామలాలాను వాత్సల్య, దాస్య భావాలతో ఆరాధించారు.



కృష్ణావతారం: శ్రీకృష్ణుడి జీవితం రెండుగా విభజింపవచ్చు బృందావనంలో తొలి భాగం, మధురలో మలిభాగం. స్వామి రామకృష్ణానంద వీటిని గోపాలుని జీవితం, రాచరిక జీవితం అని అభివర్ణించారు. దైవం, మనుష్యత్వం అనే రామ, కృష్ణుల అంశాలు శ్రీరామకృష్ణులలో అగుపడుతాయి. తనలో ఇద్దరు – భగవంతుడు, భక్తుడు ఉన్నారని శ్రీరామకృష్ణులు అనేవారు. ఆయన ఒక ఆదర్శమానవుడు; ఆయన జీవితాన్ని లోతుగా అధ్యయనం చేసి, అనుకరించాలి. ఆయన పూజార్హుడు, ఆరాధ్యనీయుడు. కనుక, స్వామి వివేకానంద శ్రీరామకృష్ణులను 'నరదేవ' అని ప్రస్తుతించారు.

గీత అని పలుమార్లు ఉచ్చరిస్తే, 'తాగి' అని వినపడుతుంది. గీతాసారం 'త్యాగం' అని శ్రీరామకృష్ణులు చెప్పారు. ఆయన పరిపూర్ణ త్యాగి. శ్రీకృష్ణుడు గీతాచార్యుడు; ఉపనిషత్తుల సారమే గీత. శ్రీరామకృష్ణ కథామృతం కూడా యథార్థంగా ఉపనిషత్తే.



బుద్ధావతారం: గౌతమ బుద్ధుడు వేదాలలోని కర్మకాండను వ్యతిరేకించి, ఒక నూతన మతాన్ని స్థాపించాడు. అయినా, హిందువులు ఆయనను దశావతారాలలో ఒకరిగా చేర్చుకొన్నారు. ఈ అవతారంలో మనుష్యగుణాలు చాలా ప్రస్ఫుటంగా కానవస్తాయి. అవి ఆదర్శప్రాయమైనవి; అనుకరణీయాలు. ఆయనది అత్యంత సున్నితమైన స్వభావం. జరావ్యాధి మరణాలను చూడగానే ఈ జగత్తు అశాశ్వతమనీ, దుఃఖభూయిష్ఠమనీ తెలుసుకొని, బాధా విముక్తికి మార్గాన్వేషణ ప్రారంభించాడు. నిత్యసత్యాన్ని సాక్షాత్కరించుకొనే వరకు విశ్రమించలేదు.

శ్రీరామకృష్ణుల సాధన కాళీమాత సాక్షాత్కారానికై ప్రారంభమైనా, ఆయన వేదన బుద్ధుని వేదన అంతటి తీవ్రమైనదే. తనువు నాశనమైనా సరే, సాక్షాత్కారం కానిదే ఆసనం నుండి కదిలేది లేదని భీష్మించాడు బుద్ధుడు. జగజ్జనని ఎడబాటు సహించలేని శ్రీరామకృష్ణ తన శరీరాన్ని త్యాగం చేయడానికి పూనుకొన్నారు.

బుద్ధుణ్ణి వివేకానంద వేనోళ్ళ పొగిడారు. ఆయన జ్ఞానం, తత్త్వాలను ప్రశంసించారు. ఆయన ఒక గొప్ప కర్మయోగి అన్నారు. ఒక గొర్రె పిల్లను కాపాడడానికి ప్రాణాన్ని పణంగా పెట్టిన ఆయన కరుణార్ద్రతను ఎంతగానో ప్రశంసించారు. శ్రీరామకృష్ణులు కూడా ఈ గుణాలను ప్రదర్శించారు. శాస్త్ర చర్చలలో వాదోపవాదాలను ప్రోత్సహించలేదు. చెప్పవలసినది సూటిగా చెప్పేవారు. వేదాంతం ప్రధానబోధన – 'బ్రహ్మసత్యం జగన్మిథ్య' అనీ, దాన్ని జీవితంలో ఆచరించాలి కానీ పెక్కు గ్రంథాలు పఠించడం అనవసరమని హరి మహరాజ్ (స్వామి తురీయానంద)కు బోధించారు. 'జీవసేవే శివసేవ' అని పరహితం కోసం పాటుపడిన శ్రీరామకృష్ణులు కూడా గొప్ప కర్మయోగి.

ఒక శూద్ర యువతి సమర్పించిన ఆహారం బుద్ధుని మరణ కారకమైంది. అర్థులకు ఉపదేశాలు చేస్తే తనకు మరణం శీఘ్రంగా ఆసన్నమవుతుందని తెలిసినా శ్రీరామకృష్ణులు ఎవరినీ తిరస్కరించలేదు. స్వామీజీ ఆయనను 'కర్మ కళేవరం అద్భుత చేష్టం–క్రియాశీలుడవైన నీ చేతలు అద్భుతం' అని స్తుతించారు.

బుద్ధుడు, శ్రీరామకృష్ణులు ప్రపంచ వ్యాప్తమైన సన్న్యాస సంఘాలకు కారణభూతులైనారు. గృహస్థ భక్తులను కూడా త్యాగమయ జీవితాలు గడపమన్నారు.



కల్కి అవతారం: కల్కి భవిష్యదవతారం. 'కలియుగాంతంలో భగవంతుడు కల్కి రూపంలో వస్తాడు. బ్రాహ్మణ వంశంలో జనిస్తాడు. చేత కరవాలం పట్టి, గుర్రం ఎక్కుతాడు' అన్నారు శ్రీరామకృష్ణులు. దశావతారాలను పరిశీలిస్తే, క్రమక్రమంగా మనుష్య లక్షణాలు వ్యక్తమై, ప్రశాంత చిత్తుడు, అహింసామూర్తి, కరుణామయుడైన గౌతమ బుద్ధునిగా పరిణమిస్తాయి. ఇందులో యోధుడైన కల్కికి చివరి స్థానం కల్పించడం సమంజసంగా తోచదు. శ్రీరామకృష్ణావతరణతో సత్యయుగం ప్రారంభమైనదని స్వామి వివేకానంద వక్కాణించారు. కనుక, శ్రీరామకృష్ణులే కల్కి అనీ, మానవుని దుష్ట దుర్మార్గ లక్షణాల నాశనానికి ప్రతీక కత్తి అనీ కొందరి భావన.

భగవంతుడు సమస్త జీవులలో ఉన్నాడన్న సత్యాన్ని దశావతారాల తత్త్వం తెలియజెబుతుంది. ఈ అవతారాలలో దుష్ట శిక్షణను రాక్షసవధగా చిత్రీకరించారు. కానీ రామకృష్ణులు ఎవరినీ దూషించలేదు. ప్రతి ఒక్కరిలోనూ దివ్యత్వం ఉందని బోధించారు. ఆయన **అవతార వరిష్ఠులు** అనడానికి ఇంతకన్నా నిదర్శనం కావాలా? ❖

అనువాదం: డాక్టర్ కమల జయరావు

(రామకృష్ణ సంఘం – ఆంగ్ల మాసపత్రిక
'ప్రబుద్ధ భారత' 2011 జనవరి సంచిక నుండి)



(1884 – 1967)

ముందుకు సాగిపో!

దివ్యజనని శ్రీశారదాదేవి ప్రత్యక్ష శిష్యులైన స్వామి ప్రేమేశానంద (1884-1967) రామకృష్ణ సంఘంలో అత్యున్నత గౌరవాన్నీ, ప్రేమాభిమానాలనూ చూరగొన్న అగ్రశ్రేణి సన్యాసి. ఆయన జీవితం శ్రీరామకృష్ణ - వివేకానందుల ఆశయాలతోనూ, భగవద్గీత సారాంశంతోనూ నిండింది. చాలామంది యువతీ యువకులకూ, గృహస్థులకూ, బ్రహ్మచారులకూ, సన్యాసులకూ ఆయన ఎన్నో లేఖలు వ్రాశారు. జీవితంలో అంకితభావం, ఆధ్యాత్మిక, సేవా భావాలను అలవరచుకొనేందుకు ఆ లేఖా పరంపరలు మార్గదర్శకాలయ్యాయి. పాఠకుల ప్రయోజనార్థం విలువైన ఈ లేఖలను 'శ్రీరామకృష్ణ ప్రభ'లో 2009 జూన్ సంచిక నుంచి ధారావాహికంగా ప్రచురిస్తున్నాం.

38 స్వర్గాశ్రమం,
30 జూన్ 1932

ప్రియమైన ధీరేశానంద!

చాలామంది కర్మను సాధనగా పరిగణించరు. అడవుల్లో తపస్సు చేసుకోవడమే సాధన అని భావిస్తుంటారు. మనస్సును స్వాధీనపరచుకొని, ఆత్మస్వభావాన్ని ఆకళింపు చేసుకోవడమే జ్ఞానయోగం. దాని వల్ల మనస్సు పవిత్రమై జ్ఞానోదయం దానంతట అదే అవుతోంది. జ్ఞానయోగం కోసం ఊరకే ప్రాకులాడినంత మాత్రాన జ్ఞానసిద్ధి కలగదు. ఇతర యోగాల లాగా జ్ఞానయోగం కూడా ఒక మార్గం. అదే విధంగా మనస్సును ధ్యానం, భక్తి ద్వారా కూడా పవిత్రం చేసుకోవచ్చు.

నిరంతరం నిష్కామ కర్మాచరణ వల్ల కూడా మనస్సు పవిత్రమై ఆత్మజ్ఞానం దానంతట అదే ఆవిష్కృతమవుతుంది. ఉపనిషత్తుల్లో దీనికి అనేక నిదర్శనాలున్నాయి. విశ్లేషించి దీన్ని మనం అవగాహన చేసుకోవచ్చు. నిష్కామ కర్మ అంటే ఏమిటి? కేవలం పూజ, లేక విశ్లేషణ, విచక్షణలా? అదే అయితే వీటి ద్వారా మనస్సు కోరికలు లేని స్థితికి చేరి పవిత్రమై ఆ మనస్సులో జ్ఞానోదయం అవుతోంది కదా! దీనికి ఏమైనా ఆక్షేపణ ఉందా? జ్ఞానం అనే దానికి స్వీయమైన అస్తిత్వం ఉంటే, జ్ఞానం మనిషి మనస్సులో నిక్షిప్తంగా ఉంటుందని చెప్పదలిస్తే, మనస్సును పవిత్రీకరించే ప్రక్రియలు ఏవీ లేకుండానే దానంతట అదే ఎందువల్ల ఆవిష్కృతమవడం లేదు?

ఈ విషయాన్ని నేనింతగా నొక్కి చెప్పడం ఎందుకంటే స్వామీజీ హృదయాన్ని అసలు ఎవరూ అర్థం చేసుకోలేదని నా భావన. అదే నా బాధ. నాకున్న కొద్దిపాటి శాస్త్రజ్ఞానం వల్ల నాకు బోధపడిందేమిటంటే, స్వామీజీ భావాలు సత్యమైనవి. మిగతా అందరి అభిప్రాయాలూ ఏకపక్షమైనవి. ఒక్కమాటలో చెప్పాలంటే అవి అనాదిగా వస్తున్న ఆ బూజు పట్టిన భావాలే! మనమూ ఆ బూజు పట్టిన భావాల వెంటే పరుగెత్తరాదు.

ప్రాపంచిక జీవితాన్ని త్యజించి, ప్రాణశక్తిని అదుపులో ఉంచుకొని, మనస్సును నియంత్రిస్తే ఉన్నత లక్ష్యం సాధించగలుగుతాం. దీన్ని కాదనలేం. కానీ ఒక ఆదర్శం అందరికీ సంబంధించినదైతే అది వారి జీవితాల్లో ఒక భాగమవ్వాలి. జ్ఞానమార్గంలో అరుదుగా ఏ కొద్దిమందో పయనించగలరు. శ్రీకృష్ణ భగవానుడు అలా చెయ్యలేదు. భగవద్గీత చదువు, నీకే అర్థమవుతుంది.

'అహం బ్రహ్మాస్మి' అయితే నేనెందుకు అందరి బాగు కోసం పాటు పడరాదు? ఏం ఈ శరీరాన్నీ, మనస్సునూ, ప్రాణాన్నీ ఇతరుల శ్రేయస్సు కోసం వినియోగిస్తే నష్టమేమిటి?

స్వచ్ఛమైన చైతన్యం చిత్తంలో తప్ప ఎక్కడా అనుభూతం కాదు. చిత్తంలో కోరికలు లేకుండా చేస్తే బ్రహ్మానుభూతి కలుగుతుంది. అప్పుడు భక్తుడు సరాసరి భగవానుణ్ణి తెలుసుకొని తన హృదయప్రియునిగా భావిస్తాడు. జ్ఞాని అద్వైతం అనే దాని తాత్పర్యాన్ని గ్రహిస్తాడు. యోగి అదే ఆత్మ అని తెలుసుకుంటాడు. అప్పటికీ చిత్తం అన్నది ఉంది. స్వచ్ఛమైన చిత్తమే భగవంతుణ్ణి తెలుసుకోవడానికి ఏకైక సాధనం.

బ్రహ్మాన్ని దర్శించగానే ఒక అద్భుతమైన ఆకర్షణ దాని పట్ల జనిస్తుంది. అదే పరాభక్తి లేదా అత్యున్నత భక్తి. భక్తుడు ఆ ఆకర్షణతోనే తన జీవితాన్ని గడుపుతాడు. అతడు నిర్వాణాన్ని కోరడు. యోగి సర్వజ్ఞుడై కల్పాంతం వరకు తన మనస్సును ఇతరుల మంచి కోసం ఉపయోగిస్తాడు. కచ్చితంగా వారిలో అందరూ కాకపోయినా కొందరైనా అలా చేస్తారు. చిత్తం కూడా యథార్థం కాదని జ్ఞాని తెలుసుకుంటాడు. తద్వారా విదేహ ముక్తిని పొందుతాడు.

ప్రేమాశీస్సులతో
స్వామి ప్రేమేశానంద

తెలుగుసేత: కె. త్రివిక్రమరావు

సర్వజీవుల పట్ల అభేద దృష్టి, అద్వైత భావన కలిగి ఉండవలెను. కానీ గురువుల పట్ల పూజ్యభావం, సర్వజీవుల పట్ల సేవాభావం, పెద్దల పట్ల గౌరవభావం ఎన్నడూ విస్మరించరాదు. - తత్త్వోపదేశం

(...13వ పేజీ తరువాయి)



'పుట్టిన వానికి మరణం తప్పదు; మరణించిన వానికి జన్మము తప్పదు. అనివార్యమైన ఈ జననమరణాల గురించి శోకించ వలద'న్నాడు.

పుట్టిన ప్రతి జీవికీ మరణం తప్పదన్న ఒకే ఒక్క సత్యాన్ని నిరంతరం మనం మననం చేసుకుంటూ ఉంటే అరమరికలు, అపార్థాలు, ఆశనిరాశలు, కుట్రలు, కుతంత్రాలు, మోహాలు, ద్వేషాలు! అవసరమా? అన్న ప్రశ్న తలెత్తుతుంది. ఎవరి కోసం, ఎందుకింత ఆరాటం, ఎవరి కోసం ఈ పోరాటం అన్న ఆత్మపరిశీలన ఆరంభమవుతుంది. ఇలాంటి జనన మరణ ప్రపంచపోకడను ప్రస్తావిస్తూ...

పుట్టుటయు నిజము పోవుటయు నిజము
నట్టనడిమి పని నాటకము
యెట్టనెదుట గలదీ ప్రపంచము
కట్టకడపటిది కైవల్యము... అంటున్నాడు అన్నమయ్య. కాలమనే కడలి ప్రవాహంలో ఎంత మంది కట్టెలమోపుల్లా కొట్టుకు రావడం లేదు! ఎంతమంది కొట్టుకుపోవడం లేదు. అయినా, ఈ దేహాన్ని ఎందుకు అంత అపురూపంగా భావించుకుంటున్నాం! శ్రీరామచంద్రుడికి యౌవనంలోనే ఇలాంటి వైరాగ్యం కలిగింది. అందుకే ఓ మారు నిండుసభలో జననమరణ చక్రాన్ని గురించి చర్చిస్తూ, 'పువ్వును జడలో అలంకరించుకొని, కొంతసేపటికి ఆ పూవు వాడిపోగానే, బాలిక తీసి అవతల పారవేస్తోంది; అదే విధంగా 'కాలం' అనే బాలిక కూడా కొంతసేపు ఈ శరీరాన్ని కలిగి ఉండి, ఆ తరువాత 'మృత్యువు' అనే చీకట్లోకి తోసివేస్తుంది' అని ఆత్మావలోకనం చేసుకున్నాడు. అదే నిస్సంగత్వ భావంతో, వైరాగ్య పునాదులపై తన జీవనసౌధాన్ని నిర్మించుకున్నాడు. ఒక సాక్షిలా సాంసారిక జీవితాన్ని గడిపి మనకు ఆదర్శంగా నిలిచాడు. విరక్తితో అడవులు పట్టమని ఆ అయోధ్యరాముడు ప్రబోధించడం లేదు; ఈ అన్నమయ్యా అలా పాడడం లేదు. కానీ నడిచేదంతా నాటకమని తెలుసుకొని వ్యవహరిస్తూ కట్టకడపటిది కైవల్యమేనని గుర్తుంచుకోమంటున్నారు.

గడి దాటినపుడే...

ఎవరు ఎంతగా కష్టపడ్డా పట్టెడు మెతుకుల కోసమే! కట్టుకునే బట్ట కోసమే! వాటి స్థాయిలో తేడా ఉంటుందేమో కానీ సంతృప్తి మాత్రం ఎవరికైనా ఒక్కటే! ఈ మాత్రం దేహపరమైన ఆకలి కోసం, ఆచ్ఛాదన కోసం పడుతున్న పాట్లు అన్నీ ఇన్నీ కావు! ఈ ప్రయాసలో పాపపుణ్యాలనే ఉభయకర్మలను మన ఖాతాలో వేసుకుంటున్నాం. వీటిని తీర్చుకునేందుకు నానా జన్మలు ఎత్తుతున్నాం; నడమంత్రమైన ఈ నాటకంలో మారి మారి కొత్త రూపులు ధరిస్తున్నాం. అందుకే అన్నమాచార్యులు ఈ పాపపుణ్యాలనే గడిని (పరిధిని) దాటమంటూ...

కుడిచే దన్నము కోక చుట్టెటిది,
నడు మంత్రపు పని నాటకము
వొడి గట్టుకొనిన వుభయ కర్మములు
గడి దాటినపుడే కైవల్యము అని స్పష్టం చేస్తున్నారు. అలా అని నిస్తేజంగా, నిరాశగా కాలాన్ని గడపమని కాదు. కానీ మనది కాని కర్మాగారంలో కొన్నాళ్ళు పనిచేయడానికి వచ్చిన కార్మికుడిగా నడచుకోవాలి. ఆ పరిశ్రమలో తాను ఎంత పాటుపడుతున్నా, ఆ ప్రదేశంపై, యంత్రాలపై తనకు అధికారం లేదని అతనికి తెలుసు! సమయం ముగిసే వరకు వెళతాననీ అనడు; అలాగని సాయంత్రమయ్యాక ఉండాలనీ కోరుకోడు. అందుకే మహాభారతం శాంతిపర్వంలో భీష్మాచార్యులు...

నాభినన్దేత మరణం నాభినన్దేత జీవితమ్,
కాలమేవ ప్రతీక్షేత నిదేశం భృతకో యథా..

'నిజమైన వైరాగ్యవంతుడు నాకు మరణం వస్తే బావుండునని అనుకోకూడదు; నేను ఇంకా జీవించాలనీ అనుకోకూడదు. ప్రేష్యుడు ప్రభువు ఆజ్ఞ కోసం ఎదురుచూస్తూ నిలబడ్డట్లు కాలాన్నే నిరీక్షిస్తూ ఉండాల'ంటారు.

గగనము మీదిది...

కట్టినవాడు విప్పే వరకు కట్లు ఎలా విడివడవో, బతుకుపాత్రను ప్రసాదించిన ఆ దర్శకేంద్రుడు భరతవాక్యం పలికేంత వరకు మన నాటకానికీ తెరపడదు. అందుకే ఆయన పాదాలు పట్టుకొని ప్రాధేయపడనంత వరకు ఈ పాపపుణ్యాల పరంపరకు అంతం ఉండదు. "మైదానంలో తవ్విన పుష్కరిణిలోని నీరు సూర్యకిరణాల వేడిమికి ఆవిరైపోతుంది. అదే విధంగా పాపపుణ్యాలనే పుష్కరిణిలోని నీరు భగవన్నామ గుణ సంకీర్తనల ద్వారా ఎండిపోతుంద"ంటారు భగవాన్ శ్రీరామకృష్ణ పరమహంస. అందుకే ఎగువన ఉన్న ఏలిక అంటే ప్రభువైన వేంకటేశ్వరుణ్ణి శరణు వేడమంటున్నాడు ఆ భక్తాగ్రేసరుడు. అప్పుడే గగనం మీది ఆ కైవల్యానికి చేరుకుంటామని, అంత వరకు నగినగి అంటే నవ్వులాటగా ఈ నాటకాన్ని ఆడవలసిందేనని హితవు పలుకుతూ...

తెగదు పాపము తీరదు పుణ్యము
నగి నగి కాలము నాటకము
యెగువనె శ్రీవేంకటేశ్వరు డేలిక
గగనము మీదిది కైవల్యము... అని శ్రీనివాసుడి భక్తశిఖామణి సంకీర్తిస్తున్నాడు. ఈ బతుకును పెద్ద భారంగా, బాధగా ఈడ్చుకుండా, అలా అని అపురూపంగా భావించుకొని అమితమైన ఆసక్తిని పెంచుకోకుండా నాటకంగా భావించి, మన వంతు పాత్రను పోషించి నిష్క్రమించేందుకు ప్రయత్నిద్దాం. ❖



ఆశించకుంటే అధిక ఫలం

– స్వామి భాస్కరానంద

ఆధ్యాత్మిక జీవితంలో ఆశీస్సులను ఆశించడం కూడా ఒకింత స్వార్థం కిందకే వస్తుందని స్వామి అఖండానంద మహరాజ్ ఉదంతం స్పష్టం చేస్తుంది. భగవాన్ శ్రీరామకృష్ణుల ప్రత్యక్ష శిష్యులై మహరాజ్ ఆధ్యాత్మిక శిఖరంగా ఎదిగారు. స్వామి అఖండానందజీ, తమ శిష్యులు కూడా అదే స్థాయిలో ఉన్నతిని సాధించేందుకు తోడ్పడ్డారు. వారికి ప్రత్యక్షంగా సేవ చేసుకునే భాగ్యం కలిగిన స్వామి నిరామయానందజీ (1911–1984), స్వామి అఖండానంద మహరాజ్‌కి సంబంధించిన ఎన్నో ఆసక్తి కరమైన విషయాలను గుర్తుచేసుకుంటూ ఉండేవారు. ఆధ్యాత్మిక సాధనాపథంలో పూర్తిగా గురువుకి శరణాగతిగా మసలుకోవటమే ప్రధాన అర్హత అని స్వామి అఖండానందజీ నిరూపించారంటూ స్వామి నిరామయానంద ఓ సందర్భంలో వివరించారు.

పశ్చిమబెంగాల్ సార్‌గాచి రామకృష్ణ ఆశ్రమంలో స్వామి అఖండానంద మహరాజ్ ఉన్న రోజులవి. వారికి బ్రహ్మచారిగా స్వామి నిరామయానంద సేవ చేస్తూ ఉండేవారు. వారి పూర్వాశ్రమ నామం 'విభూతి'! ఆ సమయంలో స్వామి అఖండానందజీ వద్దకు మాధవరావ్ గోల్వాల్కర్ అనే ప్రొఫెసర్ వస్తూ ఉండేవారు. బెనారస్ హిందూ విశ్వవిద్యాలయంలో కొన్నేళ్ళు ఆచార్య వృత్తిని నిర్వర్తించాక గోల్వాల్కర్, ఆ వృత్తికి రాజీనామా చేసి, ఆధ్యాత్మిక అన్వేషణలో నిమగ్నమయ్యారు. అందులో భాగంగా ఆయన నాగపూర్ నుంచి వచ్చి స్వామి అఖండానంద మహరాజ్‌ను ఆశ్రయించారు. కొన్ని రోజులకు వారి నుంచి మంత్రదీక్ష కూడా తీసుకున్నారు. తదనంతరం శిష్యుడిగా స్వామి అఖండానందజీకి సపర్యలు చేస్తూ, ఆశ్రమంలోనే కొన్నేళ్ళు గడిపారు.

ఆ సమయంలో ప్రొఫెసర్ గోల్వాల్కర్ నిరంతరం స్వామి అఖండానంద మహరాజ్ వెన్నంటే ఉండేవారు. గురువుకు సేవ చేసుకోవడమే మహద్భాగ్యంగా భావించి సేవించుకునేవారు. ఒకరోజు రాత్రి బ్రహ్మచారి విభూతికి, స్వామి అఖండానందజీ గదిలో నుంచి ఏవో మాటలు వినిపిస్తూ ఉన్నాయి. బ్రహ్మచారి ఆశ్చర్యంగా అటువైపు వెళ్ళి, గదిలోకి చూశారు. మహరాజ్ మంచంపై కూర్చొని ఉన్నారు; గోల్వాల్కర్ భక్తితో గురువుకు ప్రణామాలు చేస్తూ ఉన్నారు. మహరాజ్, గోల్వాల్కర్‌ను ఉద్దేశిస్తూ 'నీకు తప్పక బ్రహ్మజ్ఞానం సిద్ధిస్తుంది' అన్న మాటలు బ్రహ్మచారికి వినిపించాయి.

ఈ సంఘటన జరిగిన కొన్ని రోజులకు మహరాజ్ అనుమతితో గోల్వాల్కర్ ఆశ్రమం విడిచి వెళ్ళిపోయారు. ఆ తరువాత మాధవరావ్ గోల్వాల్కర్ భారతదేశంలోనే పేరుగాంచిన ప్రతిష్ఠాత్మకమైన 'రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్' బాధ్యతను నిర్వహించారు. చరిత్ర సృష్టించారు.



గోల్వాల్కర్

ఈ సంఘటనకు ప్రత్యక్ష సాక్షిగా నిలిచిన బ్రహ్మచారి విభూతి కొంత చింతాక్రాంతు డయ్యారు. ప్రొఫెసర్ గోల్వాల్కర్‌ను ఆశీర్వదించి నట్లుగా, మహరాజ్ తనను ఎన్నడూ ఆశీర్వదించ లేదని కొంత బాధపడ్డారు. తాను ఆధ్యాత్మికంగా ఆ స్థాయికి ఎదగలేకపోయినందుకు, ఆ అర్హత సంపాదించలేకపోయినందుకు లోలోనే మథన పడుతూ ఉండేవారు. రోజులు గడిచినా, బ్రహ్మచారి విభూతి మనస్సులో నుంచి ఆ వేదన తొలగి పోలేదు. ఇలా ఉండగా ఒకరోజు స్వామి అఖండానంద మహరాజ్ బ్రహ్మచారి విభూతితో 'నేను స్నానానికి వెళ్ళాలి; ఆ స్నానాలగదిలో నీళ్ళు పెట్టు నాయనా!' అన్నారు. స్నానాల గది తమ వసతి గృహానికి కొంత దూరంలో ఉండడంతో బ్రహ్మచారిని నీళ్ళు పెట్టమన్నారు మహరాజ్. వారు చెప్పినట్లే స్వామి అఖండానందజీ వెంట బ్రహ్మచారి నీళ్ళు పట్టుకొని వెళ్ళి స్నానాల గదిలో పెట్టి వెనుతిరుగుతున్నారు.

అప్పుడు మహరాజ్ వారి వైపు చూస్తూ 'విభూతి! ఏదో ఒకటి కాంక్షించి ప్రార్థిస్తే అది తప్పక తీరుతుంది; కానీ ఏమీ ఆశించకుండా ప్రార్థిస్తే వారికి మరింత ఫలం దక్కుతుంది' అన్నారు. తమ గురుదేవుల నోటి నుంచి ఆ మాటలు ఎందుకు వెలువడ్డాయో, బ్రహ్మచారికి అర్థమయింది. తను నోటితో చెప్పకపోయినా, మహరాజ్ తన మనస్సును చదివారని తెలిసింది. ఏదీ ఆశించక కేవలం గురువు రూపంలో ఉన్న భగవంతుడికి అంకితమవడమే ఆధ్యాత్మిక సాధన అని అవగతమైంది. సమయం వస్తే వాటంతట అవే వస్తాయని స్ఫురించింది. ❖

సాధువులు, ధీరులైన నా ప్రియ భక్తులకు ఏ కోరికలూ ఉండవు. నేను వారికి మోక్షపదాన్ని ప్రసాదించదలచినా దానిని వారు ఎన్నడూ కోరరు. జన్మరాహిత్యాన్ని ఆశించరు. - శ్రీమద్భాగవతం

- స్వామి విశారదానంద

బెంగుళూరులోని వివేకానంద యోగ అనుసంధాన మహా విద్యాపీఠానికి చెందిన స్వామి విశారదానంద భగవద్గీత పదమూడో అధ్యాయంలో 7-11 శ్లోకాల్లోని భగవానుడి బోధామృతాన్ని వివరిస్తూ 'భగవద్గీత - మానవీయ విలువలు' అనే శీర్షికతో ప్రసంగాలు ఇచ్చారు. చెన్నైలోని శ్రీరామకృష్ణ మఠ ఆంగ్ల మాసపత్రిక 'వేదాంత కేసరి'లో ప్రచురితమైన ఆ ప్రసంగాల సారాన్ని 'శ్రీరామకృష్ణ ప్రభ' పాఠకులకు 2011 జూన్ సంచిక నుంచి ధారావాహికంగా అందిస్తున్నాం.

నిజతత్త్వాన్ని తెలుసుకో!

అధ్యాత్మ-జ్ఞాన-నిత్యత్వం: అధ్యాత్మ-జ్ఞాన-నిత్యత్వం అంటే ఆత్మజ్ఞానము యందువసించుట. మరోమాటలో చెప్పాలంటే, 'నేను'ను గురించి తీవ్ర ఆలోచన, పరిశీలన ద్వారా దాని నిజతత్త్వాన్ని గ్రహించడం. ప్రతిఒక్కరూ ప్రతి రోజూ కొద్ది సమయమైనా 'ఆత్మ', 'అనాత్మ'ల గురించి ఆలోచించాలి. 'ఆత్మ' నిజతత్త్వాన్ని గ్రహించే ప్రయత్నం చేయాలి. 'నేను' అంటే ఈ భౌతిక శరీరం మాత్రమే కాదు. ఈ శరీరం లోపల తన లక్షణాలు, ఉపాధులతో పాటు నివసిస్తున్న 'ఆత్మ' ఉంది. ఆ మహత్తరమైన ఆత్మకు ఈ శరీరం ఒక నివాస స్థలం మాత్రమే. ఈ స్థూల శరీరం వెనుక ఒక సూక్ష్మ శరీరం ఉంది. దాని వెనుక మన వ్యక్తిత్వానికి ఆధారభూతమైన ఆత్మ మనలోపల ఉంది. ఈ ఆత్మనూ, ఈ శరీరాన్నీ వివేక వైరాగ్యాల ద్వారా విడదీయడం అభ్యసించాలి.


మనం హాయిగా కూర్చొని ఆనందించే సోఫా లేదా కుర్చీతో శరీరం, మనస్సులను పోల్చవచ్చు. శరీరాన్ని 'భోగ అధిష్ఠానం లేక అనుభూతుల ఆసనం అంటారు.

ఆనందాన్ని పొందే ఈ 'భోక్త' ఎవరో మనం కనుగొనాలి. మన మనస్సు ఇంద్రియ సుఖాలతో, భోగవస్తువులతో రకరకాల విషయాలతో నింపబడి ఉండడం వల్ల ఈ భోక్త ఎవడో తెలుసుకోలేకుండా ఉన్నాం. 'సత్సంగం', శాస్త్రజ్ఞానం మన దృష్టిని ఈ 'భోక్త' వైపు తిప్పి మనస్సును శరీరదృష్టి నుండి మరల్చి, ఉన్నత దిశగా నడిపిస్తాయి. అందువల్ల మనలోని 'అంతరాత్మ'ను దర్శించడానికి తగిన శిక్షణను మనస్సుకు ఇచ్చి మన ఆలోచనా విధానానికి సరైన దిశానిర్దేశం చేయాలి.

జీవన ప్రయాణం: 'సూక్ష్మశరీరాన్ని' తల్లితండ్రులు సృష్టించలేదన్న విషయాన్ని గుర్తుంచుకోవాలి. 'జీవుడు' నివసించడానికి తగిన ప్రదేశాన్ని మాత్రమే తల్లితండ్రులిస్తారు. ఐతే ఈ నివాస స్థలం (శరీరం) సృష్టి కాక ముందు ఈ జీవుడు ఎక్కడున్నాడు? జన్మించే సమయంలో ఉండేది ఈ భౌతిక, స్థూలశరీరం మాత్రమే. అంతరంగంలో నివసించే 'ఆత్మ' ఈ శరీరం సృష్టించక ముందు లేకుండా లేదు. అంతే కాదు ఈ శరీరం మరణించి, జీవుడు మరొక దేహంలో ప్రవేశించేటప్పుడు గూడా 'ఆత్మ' ఉండకుండా లేదు. అది ఒక గృహం నుండి మరొక నూతన గృహానికి మారడం లాంటిది. బద్ధజీవుని విషయం కూడా అంతే! సాధకుడు తనను తాను శరీరంలో ఉండే 'ఆత్మ'గా దర్శించడం అభ్యసించాలి గానీ తానే ఈ శరీరమని భావించ గూడదు. మనం ఈ శరీరమే అన్న విశ్వాసం మీద ఆధారపడే మన ప్రాపంచిక బంధుత్వాలన్నీ ఆధారపడి ఉన్నాయి.

మీ నిజతత్త్వం' ఏమిటి? ఈ శరీరంలోనికి వచ్చి పోయే వారెవరు? హైందవ శాస్త్రాల ప్రకారం, గతజన్మలలో కూడా మనకొక శరీరం ఉన్నదనీ, దానితో ఒక భర్తగానో, భార్యగానో, కొడుకుగానో, కూతురుగానో బంధం కలిగి ఉన్నామనీ తెలుస్తోంది. ఆ జన్మలో ఆస్తిపాస్తులు, ధనం, పదవి వంటివాటిలో బంధం కలిగి ఉన్నాం. అది ఈ జన్మలో కూడా కొనసాగుతోంది. కానీ మనం ఈ శరీరం వదలి వెళ్ళేటప్పుడు, కొత్త పరిస్థితులలో జన్మించి, నూతన బంధుత్వాలను, బంధాలను సృష్టించుకుంటాం. అంతేకాదు మనం క్రితం జన్మలో లాగానే మమత్వాన్నీ, అహంభావాన్నీ కలిగియుండి పాప, పుణ్యకర్మల ఫలితాన్ని సంపాదించుకుంటాం. ఆ విధంగా బద్ధజీవుడు జన్మ, జన్మల పరంపర గుండా పయనిస్తున్నాడు. ఐతే, మన మనస్సు ఈ జీవుడు ఎవరితోపాటు ఈ ప్రయాణం చేస్తున్నాడన్న విషయం తెలుసుకోవడం మీద ఎక్కువ ఆసక్తి కలిగి ఉంది కానీ, ఎవరు ఈ ప్రయాణం చేస్తున్నారన్న విషయం మీద కాదు.

కానీ కొంచెం లోతుగా ఆలోచించి, ఈ దేహం కన్నా మనం భిన్నమన్న భావాన్ని గ్రహించగలిగితే, ఒక విధమైన స్వేచ్ఛాయుత దృక్పథాన్ని పొందగలుగుతాం. ఈ భౌతిక శరీరం మనం ధరించే వస్త్రం లాంటిది. అంతేకాదు సూక్ష్మశరీరం కూడా పై వస్త్రం క్రింద ధరించే మరొక వస్త్రం లాంటిది. సూక్ష్మశరీరం కూడా మార్పు చెందుతూ ఉంటుంది. సూక్ష్మశరీరం ఆలోచనలు, ఆవేశాలు, అభిప్రాయాల లాంటి వాటితో తయారుచేయబడు తుంది. మన భావాలు, విలువలు మార్పు చెందినప్పుడు, సూక్ష్మశరీరం కూడా మార్పు చెందుతుంది. ఇవన్నీ మారి



పోతుంటాయి గానీ ఈ మార్పులను సాక్షీభూతంగా చూస్తూ అనుభూతి చెందుతున్న 'నేను' మాత్రం ఎటువంటి మార్పుకూ లోనుగాదు. ఈ మార్పు చెందని దాని గురించి తెలుసుకోగలిగిన నాడు మనం ఈ స్థూల శరీరంగానీ, సూక్ష్మ శరీరంగానీ కాదని గుర్తించి, ఎంత స్వేచ్ఛాయుతమైన వారమో గ్రహించి, ఆనందించగలుగుతాం. ఎవరు ఏమి చేసినా ఈ భౌతిక శరీరం ఒక పుష్పంలా రాలిపోక తప్పదు. పుష్పం వాడిపోకుండా ఉండాలనుకోవడం ఎంత అర్థరహితమో, ఈ శరీరం పతనం చెందకుండా ఉండాలనుకోవడం కూడా అంతే అసమంజసం. దేహం రాలిపోవడం ఖాయం. అందువల్ల మనస్సును వ్యర్థమైన ఆశలతో పాడు చేసుకోవడం దేనికి? భార్య, సోదరి, తల్లి, తండ్రి, భర్త, స్నేహితుడు – వీరందరూ ఈ శరీరం 'ఉన్నంత వరకు' చాలా ముఖ్యమే. ఈ శరీరంలో జీవుడు ఉన్నంతకాలం అన్ని బంధుత్వాలూ ఉంటాయి. కానీ ఆ బంధుత్వాలేవీ శాశ్వతం కావు. ఔషధాలు కానీ, సంపద కానీ, పేరు ప్రతిష్ఠలు కానీ ఇవేవీ ఈ శరీరాన్ని శాశ్వతంగా ఉండేలా చేయలేవు. ఈ సాధారణ సత్యాన్ని మనం అంగీకరించి తీరాలి.

సూక్ష్మశరీరం కూడా పంచ కర్మేంద్రియాలు, పంచ జ్ఞానేంద్రియాలు, పంచ ప్రాణాలు, మనస్సుల కలయికతో ఏర్పడుతుంది. వీటన్నిటి లోపల ఆత్మ ఉంటుంది. అదే అన్ని అనుభూతులనూ పొందుతుంటుంది.

ఆనందపు అంతర్గత తత్త్వం: సంతోషంగా ఉండడమా? లేదా? అన్నది మనలోనే ఉన్నది. సంతోషంగా ఉండాలని మనం నిశ్చయించుకుంటే, బాహ్యప్రపంచం మనకెలాంటి అంతరాయాన్నీ కలిగించలేదు.

కొన్ని పరిస్థితులు మనం గాఢంగా ప్రేమిస్తున్న వస్తువులను గానీ, వ్యక్తులను గానీ మన నుంచి దూరం చెయ్యవచ్చు కానీ ఆత్మలో స్థిరంగా ఉంటే, అలాంటి పరిస్థితుల్లో కూడా సంతోషంగా ఉండవచ్చు.

ఆనందానికీ, దుఃఖానికీ మూలకారణమైన మనస్సును మన స్వాధీనంలో ఉంచుకోవాలి. మనం లోతుగా ఆలోచిస్తే గోచరమయ్యే విషయం ఇదే. బాహ్యంగా ఉన్నదంతా బాగున్నదని 'వేదాంతం' చెప్పదు కానీ అది మన సుఖ, దుఃఖాల గురించి చక్కటి అవగాహనను కలగజేస్తుంది.

'వేదాంతం' మన మానసిక ఆరోగ్యాన్ని పరిరక్షించుకునే శక్తిని ఇస్తుంది. అంతేగాని బాహ్యప్రపంచాన్ని మాటిమాటికీ మార్చమని అనదు. సరైన అవగాహన కలిగితే, ఈ ప్రపంచం మనల్ని ఇక భయపెట్టలేదు. అప్పుడిక మనకు ఏ పరిస్థితులు ఏర్పడినా అవి ఎలా ఉంటే వాటిని అలాగే అంగీకరించగలిగే శక్తిని పొందుతాం. జీవితం పట్ల మన దృక్పథం ఆ విధంగా ఉన్నప్పుడు జీవితంలో ఎదురయ్యే సంఘటనలన్నీ అప్రధానంగా అనిపించి, మన నిజతత్త్వమైన 'ఆత్మవైభవాన్ని' దర్శించగలుగుతాం. ఈ శరీరం, మనస్సు చాలా చిన్నవే గానీ వాటిలో ఉంటున్నది మాత్రం అనంతమైన ఆత్మ. ఆత్మపై మన ధ్యాసను కేంద్రీకరించినప్పుడు పరిపూర్ణం, పరిశుద్ధం, శాశ్వతమైన మన నిజతత్త్వాన్ని కనుగొనగలుగుతాం. ❖

తెలుగుసేత: డాక్టర్ పన్నాల శ్యామసుందర మూర్తి

(వచ్చే సంచికలో... 'తత్త్వ-జ్ఞానార్థదర్శనం')

Statement about ownership and other particulars about **Sri Ramakrishna Prabha** (according to Form IV Rule 8, circulated by Registrar of Newspapers for India).

1.	Place of Publication	:	Hyderabad - 500 029
2.	Periodicity of Publication	:	Monthly
3.	Printer's Name	:	Swami Jnanadananda
	Nationality	:	Indian
	Address	:	Ramakrishna Math Domalguda Hyderabad-500 029
4.	Publisher's Name	:	Swami Jnanadananda
	Nationality	:	Indian
	Address	:	Ramakrishna Math Domalguda, Hyderabad-500 029
5.	Editor's Name	:	Swami Parijneyananda
	Nationality	:	Indian
	Address	:	Ramakrishna Math Domalguda,Hyderabad -29
6.	Name & Address of the individuals who own the news or shareholder holding more than1% of the capital	:	Ramakrishna Math Domalguda Hyderabad-500029

I , Swami Jnanadananda, hereby declare that the particulars given above are true to the best of my knowledge and belief.

Sd.
Swami Jnanadananda
Signature of the Publisher


Date: 01.03.2014


నేను ఎవడను? ఈ జగత్తు ఎలా ఉద్భవించింది? ఈ జగత్తుకి కర్త ఎవరు? ఈ జగత్తుకి ఉపాదాన కారణం ఏది? - ఈ నాలుగు ప్రశ్నలకు సమాధానాల్ని అన్వేషించడమే 'విచారమార్గం'. -యోగవాసిష్ఠం


మహిళాభ్యుదయానికి పాటుపడిన మహాతపస్విని

కథ: మోహన సూర్యనారాయణన్, భైరవ్ సుబ్రమణ్యం, చిత్రాలు: దాకోజు శివప్రసాద్, అనుసృజన: స్వామి జ్ఞానదానంద




5 తల్లీ గంగాదేవీ! ఇదుగో ఈ పూజాద్రవ్యాల నన్నింటినీ నీకే సమర్పిస్తున్నాను. గౌరీశంకరునికి ఒక ఆలయం నిర్మించి, నిరాటంకంగా జనులకు దర్శనం కలిగేలా నన్ను అనుగ్రహించు.
6 గంగాబాయి ఆప్త ఆంగ్ల మిత్రురాలొకరు రాజస్థాన్ కమీషనర్ థాంప్సన్‌ను వివాహమాడింది. ఆ దంపతుల సాయంతో గౌరీశంకర ఆలయాన్ని నిర్మించింది గంగాబాయి.
ఈ ఆలయంలో ధనిక, పేద తేడా లేకుండా అందరూ భగవంతుణ్ణి దర్శించుకోవచ్చు.
గంగాబాయికి జయమగుగాక!
7 తరువాత గంగాబాయి వింధ్యపర్వత పాద ప్రాంతాన నెలకొని ఉన్న కాళికాలయానికి వెళ్ళింది. ఆ సమయంలో ఆంగ్లేయులు అనేక దౌష్ట్యాలు సృష్టించారు.
అమ్మా కాళికాదేవీ! అన్యులు దేశాన్ని కుట్రలతో ఆక్రమించాలని భావిస్తున్నారు. మా ప్రజలను కష్టాల నుంచి గట్టెక్కించు తల్లీ!
గంగాబాయిని విప్లవకారిణిగా ఎంచి తుపాకులతో పోలీసులు ఆలయాన్ని చుట్టుముట్టారు.
8 ఎవరది? ఏం పని ఇక్కడ?
దేవి దర్శనార్థం వచ్చాం తల్లీ!
గంగాబాయి తేజస్సునూ, గాంభీర్యాన్నీ చూసి పోలీసులు దిగ్భ్రమచెందారు.
9 1854లో ఈస్టిండియా కంపెనీ ఝాన్సీరాణి దత్తపుత్రుని వారసత్వాన్ని అంగీకరించలేదు. ఝాన్సీ సంస్థానాన్ని తమ రాజ్యంలో కలుపుకుని ఏటా రూ. 6,000 భరణం ఇస్తామని ఆజ్ఞ జారీ చేశారు.
ఏమిటి? కంపెనీ వాళ్ళు మనకు భరణం ఇవ్వడమా? కంఠంలో ప్రాణం ఉన్నంత వరకు నా రాజ్యాన్ని ధారాదత్తం చెయ్యను. యుద్ధానికి సిద్ధమవుదాం. మహిళలూ యుద్ధవిద్యలు అభ్యసించెదరు గాక! విప్లవం వర్ధిల్లాలి!


10
ఝాన్సీరాణి తన అనుంగు మిత్రురాలైన గంగాబాయికి కబురు పంపి, తనకు అంగరక్షకురాలిగా ఉండడానికి వెంటనే రమ్మంది.
11
1857లో మొదటి స్వాతంత్ర్య సంగ్రామం ప్రారంభమైంది. అప్పుడు గ్వాలియర్‌లో ఆంగ్లేయులను ఝాన్సీరాణి ముఖాముఖి ఎదుర్కొంది. ఆ యుద్ధంలో రాణి తీవ్రంగా గాయపడింది!
శత్రువులకు చిక్కకుండా రాణిని తీసుకుపోదాం.
12
యుద్ధరంగం వీడగానే రాణి మరణించింది. గంగాబాయి, బల్వంత్ సింగ్ కలసి గోప్యంగా రాణికి దహన సంస్కారాలు చేశారు.
13
ఆ తరువాత 1858 నుండి 1890 దాకా గంగాబాయి తను వెళ్ళిన చోట్లల్లా ఆధ్యాత్మికతనూ, దేశ భక్తినీ జనుల్లో పాదుగొల్పింది. వారణాసిలో తారానాథ్ అనే సాధువును ఆమె కలుసుకుంది.
14
మాతాజీ! మీరు నాకు పంచాగ్ని విద్యను బోధించండి.
మీరు ఆత్మబలం పొందాలి. దానితో పాటు విప్లవోద్యమ వీరులను ప్రోత్సహించాలి.
15
గంగాబాయి రాచపరంపరకు చెందినందు వల్ల ఆమెకు ఒక వంక రాజాదరణ, ఆత్మబల సంపన్నురాలు కావడం వల్ల మరోవంక జనాదరణ లభించాయి.
16
తదనంతరం గంగాబాయి కోల్‌కతా చేరుకుంది.
అమ్మా! నేనేం చేయగలను? క్రైస్తవ మిషనరీ పాఠశాలల్లో సాకారోపాసన మూర్ఖత్వమని పరిహసిస్తున్నారు!
అమాయక మహిళల మనస్సుల్లో అన్యులు విషబీజం నాటుతున్నారు. దేవీ! మహిళలకు మన దేశ ఘనతను గ్రహింపజేసేలా నన్ను అనుగ్రహించు!
గంగాబాయి 1893 ఏప్రిల్ 19న కాశింబజార్ మహారాణి స్వర్ణమయి భవంతిలో 30 మంది మహిళలతో కోల్‌కతా అప్పర్ సర్క్యులర్ వీధిలో 'మహాకాళి విద్యాలయా'న్ని ప్రారంభించింది.
17
స్వామి వివేకానంద పాశ్చాత్యం నుంచి 1897లో స్వదేశానికి తిరిగి వచ్చారు. మహిళలకు మన ధర్మాన్ని బోధించే పాఠశాలలు అత్యవసరమని నొక్కివక్కాణిస్తూ వచ్చారు. స్వామీజీని తన పాఠశాలకు ఆహ్వానించింది గంగాబాయి.
పిల్లల్లారా! స్వామీజీకి మీరు నేర్చిన శాస్త్రపాఠాలు వల్లించి చూపండి.
ఓం సహ నావవతు...
సంతోషభరితులైన స్వామీజీ 'ఈ సంస్థ సరైన దిశలో వెళుతోంది' అని సందర్శకుల పుస్తకంలో రాసి, సంతకం చేశారు.


18 తిరిగి వెళుతున్నప్పుడు తన శిష్యుడితో...
గంగాబాయి సర్వసంగ పరిత్యాగం చేసి మన మహిళలకు జ్ఞాన ప్రకాశాన్నిచ్చి వారిని తీర్చిదిద్దే కార్యంలో నిమగ్నమై ఉండడం నాకెంతో సంతోషంగా ఉంది.
అవును స్వామీజీ! మాతాజీని చూస్తే పూర్వం మన దేశంలో విద్వన్మణులుగా విరాజిల్లిన గార్గి, లీలావతి వంటి వారిని చూసినట్లుంది.
19 కొన్ని నెలల తరువాత...
స్వామీజీ! నిధుల కొరత కారణంగా పాఠశాలను మాతాజీ మూసివెయ్యబోతున్నట్లు తెలిసింది.
అలాగా! నిధులను నేను ఏర్పాటు చేస్తానని ఆమెకు తెలియజేయి.
స్వామీజీ ఆనతి మేరకు ఆయన శిష్యురాలైన హెన్రిట్టా ముల్లర్, గంగాబాయికి భారీగా నిధులను సమకూర్చింది. ఆ తరువాత మహాకాళీ విద్యాలయ నిర్వహణ నిరాటంకంగా సాగిపోవడానికి విరివిగా విరాళాలు వచ్చాయి.
20 మాతాజీ గంగాబాయిలోని మరో వైశిష్ట్యం ఆమె మాతృహృదయం. తార అనే బాలిక తండ్రి నిరుపేద.
మాతాజీ! ఈమె నా కుమార్తె. ఈమె తల్లి మరణించింది. మీరే ఇక ఈమెకు దిక్కు.
తారా! నాతో ఉండిపోమ్మా!
21 విద్యార్థినులు సరస్వతీ పూజను వైభవోపేతంగా జరుపుకోసాగారు.
22 బహుమతి ప్రదానోత్సవం గంగాబాయికి ఎంతో ఆత్మతృప్తిని కలిగించేది. ఒకసారి ఈ వేడుకకు సోదరి నివేదితను ఆహ్వానించారు.
లోకమాతే ఈ మహిళల రూపంలో విచ్చేసింది.
హిందూమతాన్ని పరిరక్షించడమే కాకుండా, మాతృమూర్తులకూ దేశభక్తిని గరపడంలో మన గంగాబాయి అకుంఠిత దీక్షతో పాటుపడుతున్నారు.
23 మహత్తర త్యాగమయ జీవితం గడిపిన గంగాబాయి 1907లో మహాసమాధి పొందారు. ఆమె భౌతికకాయాన్ని కాశీలోని మణికర్ణికా ఘట్టంలో జలసమాధి చేశారు.
‘తపస్విని గంగాబాయి స్వాతంత్ర్య యోధుల నాయకురాలు. ఆమె చలవతో బెంగాల్ స్వాతంత్ర్య ఉద్యమం సత్వరమే ప్రారంభమవుతుంది’ అని ‘స్వరాజ్’ పత్రిక రాసింది. ‘రాచకుటుంబంలో జన్మించిన మేధావి, తపస్విని అయిన గంగాబాయి తన సంపత్తిని యావత్తూ దేశాభ్యుదయానికే అర్పించింది’ అని ‘ప్రవాసీ’ పత్రిక శ్లాఘించింది.







స్వామి వివేకానంద 150వ జయంతి ముగింపు ఉత్సవాలు





హైదరాబాదు, రామకృష్ణ మఠం వివేకానంద ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యూమన్ ఎక్సలెన్స్ ఆధ్వర్యంలో 2014 జనవరి 10,11,12 తేదీల్లో స్వామి వివేకానంద 150వ జయంతి ముగింపు ఉత్సవాలను నిర్వహించింది.

జనవరి 10న విద్యార్థుల సదస్సు, జనవరి 11న విద్యార్థినుల సదస్సు, జనవరి 12న యువజన సదస్సులు జరిగాయి. జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా జనవరి 12వ తేదీన ట్యాంక్‌బండ్‌పై ఉన్న స్వామి వివేకానంద విగ్రహం నుండి రామకృష్ణ మఠం వరకు వివేకానంద వేషధారణలో 1,000 మంది విద్యార్థులతో శోభాయాత్ర జరిగింది.





మూడు రోజులపాటు జరిగిన ఈ ఉత్సవాల్లో దాదాపు 5,000 మంది విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు. ఈ ఉత్సవాల్లో స్వామి జ్ఞానదానందజీ, స్వామి బోధమయానందజీ; డాక్టర్ రాళ్ళబండి కవితా ప్రసాద్; శ్రీ వి.వి.లక్ష్మీనారాయణ; శ్రీ ఎల్.నరసింహా రెడ్డి, ఇతర ప్రముఖ వక్తలు పాల్గొని స్ఫూర్తిదాయక ప్రసంగాలిచ్చారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. ❖

నివేదిక: డి.ఎన్.సంజీవ





Printed and published by **Swami Jnanadananda** owned by Ramakrishna Math Trust
and printed at Kala Jyothi Process, 1-1-60/5, RTC Cross Roads, Musheerabad, Hyderabad - 500 020
and published at Ramakrishna Math, Domalguda, Hyderabad - 500 029. **Editor: Swami Parijneyananda**

Vol.71-3, Sri Ramakrishna Prabha (Telugu Monthly) March 2014, Regd. with the Registrar of Newspaper for India Under No.1120/57. Postal Registration No. HD-1071/2013-15. Licensed to Post Under WPP : AP/CPMG/HC-13/WPP/2013-14. Date of Publication : 18th of every month.

శ్రీరామకృష్ణుల దివ్యస్పర్శ

శ్రీరామకృష్ణులతో తన రెండో సమావేశం గురించి స్వామి వివేకానంద (నరేంద్రుడు) ఇలా వివరించారు:

"నేను గురుదేవులను దర్శించడానికి వెళ్ళినప్పుడు ఆయన నన్ను ఆప్యాయంగా చేరదీసి తమ మంచం మీద పక్కన కూర్చోబెట్టుకున్నారు. మరుక్షణమే తమ కుడి పాదంతో నన్ను తాకారు. వెంటనే నాకు ఓ వింత అనుభవం కలిగింది. గదిలోని వస్తువులన్నీ గోడలతో సహా గిర్రున తిరుగుతూ అదృశ్యమైపోయాయి. చరాచర ప్రపంచంలో సమస్తమూ ఒక మహాశూన్యంలో లయించిపోతున్నట్లు తోచింది.

అప్పడు నేను భయంతో 'నన్ను మీరు ఏం చేస్తున్నారు? నాకు తల్లితండ్రులున్నారు' అంటూ కేకలు పెట్టాను. నా భయాందోళనలు గమనించిన శ్రీరామకృష్ణులు పెద్దగా నవ్వి, తమ చేతులతో నా ఛాతీని స్పృశించి, 'సరే! ఇక చాలు, సకాలంలో అంతా జరుగుతుంది' అన్నారు. అలా గురుదేవులు పలికిన మరుక్షణమే నాకు కలిగిన విచిత్ర అనుభవం అదృశ్యమైపోయింది. ఈ సంఘటన నా చింతనా ధోరణిని పూర్తిగా మార్చివేసింది."



ఆధ్యాత్మిక అమృతవాహిని

శ్రీ రామకృష్ణ ప్రభ

ఏప్రిల్ 2014

₹10





సుబోధ

శ్రీరామకృష్ణులు (భక్తులతో): సచ్చిదానంద స్వరూపుడైన భగవంతుణ్ణి పొందకుంటే జీవితం వ్యర్థమే నాయనా! సంసారాసక్తుల భగవత్ప్రేమ క్షణ భంగురం. ఎర్రగా కాలిన ఇనుప పెనం మీద నీటి చుక్క ఎంతసేపు ఉంటుంది?

వ్యాకులత కావాలి. కుమారుడు తన వాటా ఆస్తికై గగ్గోలు పెడితే తల్లితండ్రులు సమాలోచించుకొని, నిర్ణీత కాలానికి మునుపే అతడికి వాటా పంచి ఇస్తారు. వ్యాకులతతో ప్రార్థిస్తే భగవంతుడు వినే తీరుతాడు. ఆయన మనకు జన్మనిచ్చినప్పుడే ఆయన గృహంలో మనకు వాటా కూడా ఏర్పడింది. ఆయన మన సొంత తండ్రి, సొంత తల్లి. ఆయన వద్ద మనం పట్టుపట్టవచ్చు – 'నాకు దర్శనం ఇవ్వు, లేకుంటే కత్తితో గొంతు కోసుకొంటాను!' అంటూ ఆయనను నిలదీయవచ్చు!

నేను కొన్ని సమయాల్లో 'అమ్మా! ఆనందమయీ! నువ్వు దర్శనం ఇచ్చే తీరాలి' అని బలవంతపెట్టేవాణ్ణి. కొన్ని సందర్భాలలో, 'ఓ! దీననాథా, జగన్నాథా! నేను నీ జగత్తులోని వాడినే! నేను జ్ఞానహీనుడను, సాధనహీనుడను, భక్తిహీనుడను, నాకేమీ తెలియదు. నీ దర్శనం ఇచ్చి తీరవలసిందే' అని ప్రార్థించేవాడను.

భక్తుడు: భగవంతుణ్ణి పొందాలనే వ్యాకులత ఎందుకు కలుగదు?

శ్రీరామకృష్ణులు: భోగవాంఛలు తీరనంత వరకు మనోవ్యాకులత జనించదు. కామినీ కాంచనాల పట్ల తృష్ణ ఉన్నంత వరకూ జగజ్జనని జ్ఞాపకమైనా రాదు. పిల్లవాడు ఆటల్లో పూర్తిగా మునిగి ఉన్నప్పుడు తల్లి కోసం వెతకడు. ఆట పూర్తికాగానే, 'అమ్మ కావాలి' అంటాడు.

భక్తుడు: మహాశయా! మిమ్మల్ని చూస్తే భగవంతుణ్ణి చూసినట్లే!

శ్రీరామకృష్ణులు: మరోసారి అలా అనవద్దు. అలలు గంగకు చెందినవి, గంగ అలలకు చెందదు. 'నేనొక గొప్ప వ్యక్తిని' అనే అహంకారం నశించకుంటే భగవంతుణ్ణి దర్శించలేం. 'నేను' అనే మట్టి గుట్టను భక్తి అనే కన్నీళ్ళతో కరిగించి నేలమట్టం చేసి వేయాలి. ❖

శ్రీరామకృష్ణ ప్రభ
రామకృష్ణ మఠం, దోమల్‌గూడ, హైదరాబాదు–500 029
ఫోన్: 040–27667799, సెల్: 8801849494
E-mail : sriramakrishnaprabha@gmail.com
నిర్వాహక సంపాదకులు: స్వామి జ్ఞానదానంద
సంపాదకులు: స్వామి పరిజ్ఞేయానంద



సురభి

నేను (పారుల్ – ప్రవ్రాజిక భారతీప్రాణ), మరో యాభైమందిమి కలసి 1923లో జయరాంబాటీలో శారదామాత మందిర సంప్రోక్షణ ఉత్సవాల్లో పాల్గొనడానికి బయలుదేరాం. విష్ణుపూర్ వరకు రైల్లో వెళ్ళాం. అక్కడ నుండి కాలినడకన, ఎడ్లబండి పైన దాదాపు ఒక మైలు దూరం ప్రయాణం చేసి బశీశ్వరబాబు ఇల్లు చేరాం. రాత్రి భోజనం వాళ్ళింట్లో ముగించి, ఇరవై రెండు ఎడ్లబండ్లలో కోల్‌పారాకు బయలుదేరాం. బండ్లు చిన్నవి. ఎద్దులు కూడా చిన్నవే! ఒక్కొక్క బండిలో ఇద్దరేసి చొప్పున కూర్చున్నాం.

స్వామి శారదానంద మహరాజ్, యోగీన్ మా, మరో ఇద్దరు ముగ్గురు సాధువులు ఉండిపోయారు. 'వాళ్ళు కారులో వస్తామన్నారు. మేము బండ్లలో వెళుతున్నాం'. మేము రాత్రి పదకొండు గంటలకు కోల్‌పారా చేరాం. కానీ కారు జాడే లేదు. 'మహరాజ్ ఇంకా రాలేదే' అని అందరూ కంగారు పడ్డారు. ఉత్సవ సమయం దగ్గర పడుతోంది. అందరూ పనుల్లో హడావిడిగా ఉన్నారు. ఇంతలో కారు బయలుదేరలేదనీ, మహరాజ్ బృందం ఎడ్లబండిలోనే బయలుదేరిందనీ కబురు వచ్చింది.

వాళ్ళు మర్నాడు తెల్లవారేసరికి వచ్చి చేరారు. 'కారులో వస్తామన్నారు... కారేదీ?' అని అందరూ ఆట పట్టించారు. శారదానంద మహరాజ్ నవ్వుతూ, "అమ్మ ఏనాడూ ఈ దారిలో కారు ఎక్కలేదు. ఇక అమ్మ ద్వారపాలకుడినైన నేను కారులో రావడమా? అందుకే అమ్మ కారును కదలకుండా చేశారు" అన్నారు.

జయరాంబాటీ మందిరంలో ఉన్న పెద్ద తైలవర్ణ చిత్రాన్ని లలితబాబు అనే అమ్మ భక్తుడు విదేశాలలో చేయించి తెప్పించారు. ఎందరో అమ్మ భక్తుల జీవితాలలో ఎన్నో అద్భుత సంఘటనలు జరిగాయి. ఈ లలితబాబు మొదట్లో గొప్ప సంపన్నుడు. కానీ అతని నడత మంచిది కాదు. మద్యపానం చేసేవాడు. ఒకసారి భరించలేని తీవ్రమైన ఉదరశూలతో బాధపడి, అమ్మకృప వల్ల స్వస్థత పొందాడు. అప్పటి నుండి అమ్మకు గొప్ప భక్తుడయ్యాడు. తాగుడు మానేశాడు. ఒక చిన్న అద్దె ఇంట్లో, భార్యతో పాటు అతి సామాన్య జీవితం గడుపుతూ భక్తుల సేవ చేసేవాడు. ఒకనాడు అమ్మ ఆయనతో, "నా జన్మస్థలంలో ఏమైనా చేయించు" అన్నారట. ఆ మాట ఆయన మనస్సులో పెట్టుకున్నాడు. కానీ హఠాత్తుగా అనారోగ్యం పాలై, ఏమీ చేయలేకపోయాడు. అమ్మ కోరిక నెరవేర్చలేదని చాలా దుఃఖించాడు. చివరికి తన యావదాస్తిని చీపురుపుల్లతో సైతం, జయరామ్‌బాటీలో అమ్మసేవ కోసం వినియోగించాలని తన వీలునామాలో వ్రాశాడు. ❖



ప్రవ్రాజిక భారతీప్రాణ

(ప్రవ్రాజిక భారతీప్రాణ – శ్రీశారదామాత శిష్యురాలు, శ్రీశారదామఠ ప్రథమ అధ్యక్షురాలు)

ఆధ్యాత్మిక అమృతవాహిని
శ్రీ రామకృష్ణ ప్రభ
సంపుటం: 71 సంచిక: 4 ఏప్రిల్ 2014



భక్తిర్ముక్తివిధాయినీ భగవతః
శ్రీరామచంద్రస్య హే
లోకాః కామదుఘాంఘ్రిపద్మ
యుగళం సేవధ్వమత్యుత్సుకాః

ఓ జనులారా! శ్రీరామచంద్ర భగవానుని పట్ల కలిగే భక్తియే ముక్తి ప్రదాయిని. అందువలన అత్యుత్సుకులై, శ్రద్ధాభక్తులతో సర్వాభీష్టములనొసంగే స్వామి పాదయుగ్మమును సేవింపుడు.


– అధ్యాత్మ రామాయణం, అరణ్యకాండమ్

సూక్తి సౌరభం


బలిసదనంబు జొచ్చెదవు ప్రాకెద నభ్రపదంబు దాటి, ది
గ్వలయము నాక్రమించెదవు వారక చిత్తమ చాపలంబునం;
దలప నొకప్పుడున్ మఱచి తప్పియు లోన వెలుంగు బ్రహ్మము,
న్దలచెదవేని పొందెదవు నాశ వివర్జిత నిత్యసౌఖ్యమున్.

"ఓ చిత్తమా! నీకున్న చపలత్వం చేత పాతాళానికి చొచ్చుకుపోతున్నావు. ఆకాశాన్ని దాటిపోతున్నావు. దిఙ్మండలాల్ని సైతం ఆక్రమిస్తున్నావు. కానీ పొరపాటునైనా నీలోనే అంతర్గతంగా ప్రకాశించుచున్న బ్రహ్మంను (భగవంతుణ్ణి) ఒక్కసారి కూడా తెలుసుకోవడానికి ప్రయత్నించడం లేదు. ఆ పరమాత్మను తలచినట్లయితే ఆశారహితమైన శాశ్వత ఆనందాన్ని పొందగలవు"

(భర్తృహరి వైరాగ్యశతకం, తెలుగు పద్యరచన – ఏనుగు లక్ష్మణకవి)



శ్రీరామకృష్ణ ప్రభ శాశ్వత నిధి




ఆధ్యాత్మిక జ్ఞానాన్ని పంచి పెట్టేందుకు 'శ్రీరామకృష్ణ ప్రభ' కృషి చేస్తోంది. నిధుల కొరత లేకుండా ఈ జ్ఞానయజ్ఞం నిరంతరాయంగా సాగేందుకు 'శ్రీ రామకృష్ణ ప్రభ శాశ్వతనిధి'కి ధన దానం చేసి ప్రోత్సహించాల్సిందిగా కోరుతున్నాం. దాతల పేర్లు పత్రికలో ప్రచురిస్తాం.

మహారాజ పోషకులు...... రూ. 10,000/-, అంతకన్నా ఎక్కువ విరాళం ఇచ్చేవారు.
రాజ పోషకులు........... రూ. 5,000/-, అంతకన్నా ఎక్కువ విరాళం ఇచ్చేవారు.
పోషకులు................ రూ. 1,000/-, అంతకన్నా ఎక్కువ విరాళం ఇచ్చేవారు.

	దాత పేరు / చిరునామా	రూ.
మహారాజ పోషకులు :	సిద్ధయోగ సమాజము, శివానంద నిలయం, పోలవరం, ప.గో.జిల్లా	10,000
మహారాజ పోషకులు :	శ్రీ సీతారామరాజు, శ్రీరాంపురం, భీమవరం (కీ॥శే॥ అల్లూరి అచ్చుతమ్మగారి జ్ఞాపకార్థం)	10,000
పోషకులు :	శ్రీ కె. ప్రకాశం శర్మ, బడేరాయిపూర్ రోడ్డు, కోల్‌కతా, పశ్చిమ బెంగాల్	1,501
పోషకులు :	శ్రీ సతీష్, రాజేంద్రనగర్, మహబూబ్‌నగర్	1,500
పోషకులు :	శ్రీ కొయ్యలమూడి వీర్రాజు & శ్రీమతి సూర్యకుమారి, రాజమండ్రి (కీ॥శే॥ కె.వేంకట్రావు, సత్యవతిగార్ల జ్ఞాపకార్థం)	1,500
పోషకులు :	శ్రీమతి టి.పట్టి సీమ, విశ్వనాథ కాలనీ, తిరుచానూరు రోడ్డు, తిరుపతి	1,116
పోషకులు :	చి॥ కందాళం హవిష్న, వేదాచలం నగర్, చిన్నచౌక్, కడప	1,116
పోషకులు :	శ్రీమతి గొట్లూరి సుబ్బలక్ష్మమ్మ, భాగ్యనగర్‌కాలనీ, కల్యాణదుర్గం రోడ్డు, అనంతపురం	1,040
పోషకులు :	శ్రీ గుర్రాల వెంకట్రామిరెడ్డి, మీనవోలు, ఎర్రుపాలెం, ఖమ్మం జిల్లా (కీ॥శే॥ సీతారావమ్మగారి జ్ఞాపకార్థం)	1,000
పోషకులు :	డాక్టర్ హెచ్.ఎస్.సాయి, ఫరీదాబాద్, హర్యానా	1,000
పోషకులు :	శ్రీ జి.యస్. రామయ్య & శ్రీమతి నాగరత్నమ్మ, పలమనేరు, చిత్తూరు జిల్లా (కీ॥శే॥ జి.శివయ్యశెట్టి, వేంకటమ్మగార్ల జ్ఞాపకార్థం)	1,000

'శ్రీరామకృష్ణ ప్రభ' కానుక పథకం

యువతరానికి 'శ్రీరామకృష్ణ ప్రభ'ను మరింత చేరువ చేయాలని సంకల్పించాం. రాష్ట్రంలోని వివిధ పాఠశాలలు/ కళాశాలలు/ గ్రంథాలయాలకు పత్రికను పంపించడానికి మీ సహాయాన్ని కోరుతున్నాం. ఈ కానుక పథకం క్రింద చందా చెల్లించిన దాత పేరున (మీరు సూచించిన లేదా మేము ఎంపిక చేసిన) విద్యాసంస్థకు పత్రికను పంపుతాం. కానుక చందా రూ.1,500/- అంతకన్నా ఎక్కువ ఇచ్చిన దాత పేరు, విద్యాసంస్థ పేరు పత్రికలో ప్రచురిస్తాం.

దాత పేరు	విద్యాసంస్థ
శ్రీ సి.డి. రాజు, కె.పి.హెచ్.బి., హైదరాబాద్	చిత్తూరు జిల్లాలోని 5 విద్యాసంస్థలకు జీవిత చందాను స్పాన్సర్ చేశారు.
శ్రీ వెంకటరాజు, (కీ॥శే॥ మంతెన లక్ష్మీనర్సమ్మగారి జ్ఞాపకార్థం)	శ్రీ ఆత్మానందనిలయం, వృద్ధుల ఆశ్రమం, పిట్లవానిపాలెం, గుంటూరు జిల్లా
శ్రీ బి. వెంకటరావు, బంజారాహిల్స్, హైదరాబాద్	ప్రధానాచార్యులు, వట్టెముల, వేములవాడ, కరీంనగర్ జిల్లా
శ్రీ కొంగర దామోదర్, తెర్లుమద్ది, ముస్తాబాద్, కరీంనగర్ జిల్లా	గ్రామ పంచాయతీ కార్యాలయం, తెర్లుమద్ది, ముస్తాబాద్, కరీంనగర్ జిల్లా
శ్రీ తంగిరాల సుబ్రహ్మణ్యశాస్త్రి, కేశవనగర్, సికింద్రాబాద్	మండల ప్రాథమిక పాఠశాల, సోమవరప్పాడు, కృష్ణా జిల్లా
శ్రీ దుగ్గిరాల మధుసూదనరావు, కమలాపురి కాలనీ, హైదరాబాద్	11 పాఠశాలలకు ఒక సంవత్సరానికి స్పాన్సర్ చేశారు.
చి॥ సగ్గుర్తి యామిని, సీతారాంపురం, విజయవాడ, కృష్ణాజిల్లా	ఎన్.ఎస్.టి. మాథ్యూస్ పబ్లిక్ స్కూల్, పటమట, విజయవాడ
శ్రీమతి వై.ఎమ్. సరోజిని, తూర్పులంక, తూర్పుగోదావరి జిల్లా	జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల, కొదురుపాడు, అల్లవరం, తూర్పుగోదావరి జిల్లా

చందా వివరాలు		భారతదేశంలో	విదేశాలకు
విడి ప్రతి	:	₹ 10	-
సంవత్సర చందా	:	₹ 100	₹ 1,500
మూడు సంవత్సరాలకు	:	₹ 280	₹ 4,500
ఐదు సంవత్సరాలకు	:	₹ 450	₹ 7,500
ఇరవై సంవత్సరాలకు	:	₹ 1,500	₹ 22,000

గమనిక: డిమాండ్ డ్రాఫ్ట్, మనియార్డర్లలో Ramakrishna Math, Hyderabad అని వ్రాయాలి.
పంపవలసిన చిరునామా: Sri Ramakrishna Prabha, Ramakrishna Math, Domalguda, Hyderabad - 500 029.

చందాను ఆన్‌లైన్ http://rkmath.org/srkp ద్వారా చెల్లించవచ్చు.

లోపలి పేజీల్లో...

శ్రీరామకృష్ణ ప్రభ చందాదారులకు విన్నపం

ప్రియ పాఠకులారా!

- 'శ్రీరామకృష్ణ ప్రభ' పత్రిక కవరు మీద చిరునామాకు పైన మీ చందా నంబరు, కుడి వైపున మీ చందా గడువు ముగిసే నెల ఉంటాయి. మీ చందా గడువు పూర్తయ్యే నెలకు ముందుగానే సొమ్మును చెల్లించి చందాను పునరుద్ధరించుకోండి.
- మీ ఉత్తర ప్రత్యుత్తరాలన్నింటిలో తప్పనిసరిగా చందా నంబరు పేర్కొనాల్సిందిగా మనవి.
- మీ చిరునామా మారిన పక్షంలో 7వ తేదీ లోగా మాకు తెలియపరచినట్లయితే, వచ్చే నెల సంచిక నుండి మీ కొత్త చిరునామాకు పంపబడును.
- ప్రతీ నెల 26 లేదా 27వ తేదీల్లో పత్రిక పోస్ట్ అవుతుంది. మీకు పత్రిక 15వ తేదీ లోపుగా చేరనట్లయితే, వెంటనే మాకు తెలియజేయగలరు.

శ్రీరామకృష్ణ ప్రభ ద్వారా అవిచ్ఛిన్నంగా సేవలు అందించాలన్నదే మా ఆకాంక్ష. అందుకు మీ సహకారం కోరుతూ.... - సర్క్యులేషన్ మేనేజర్

'శ్రీరామకృష్ణ ప్రభ' పత్రిక చందాను
ఆన్‌లైన్ **http://rkmath.org/srkp** ద్వారా చెల్లించవచ్చును.

సంపాదకీయం



రామాయణంలో భక్తి దర్శనం

భగవత్సాక్షాత్కారానికి 'భక్తిమార్గం' శ్రేష్ఠమైనదనీ, శ్రేయస్కర మైనదనీ మహర్షులు నిర్దేశించారు. **'సర్వోపాయాన్ పరిత్యజ్య భక్తిమాశ్రయ। భక్తి నిష్ఠో భవ। భక్తి నిష్ఠో భవ। భక్త్యాఽసాధ్యం న కించి దస్తి ॥** –సర్వమార్గాలనూ వదిలి భక్తిమార్గాన్నే ఆశ్రయించు. భక్తి నిష్ఠుడవుకమ్ము. భక్తి చేత సాధ్యం కానిదేదీ లేదు' అని త్రిపాద్విభూతి మహానారాయణోపనిషత్ ఉద్ఘోషిస్తోంది.

అలాగే నారద మహర్షి '**త్రిసత్యస్య భక్తిరేవ గరీయసీ భక్తిరేవ గరీయసీ** (నారద భక్తి సూత్రాలు–81) – త్రికాలాల్లో సత్యస్వరూపుడైన భగవంతుని పట్ల భక్తి కలిగి ఉండడమే ఉత్తమం' అని భక్తి విశిష్టతను శ్లాఘించారు.

అలాగని భగవత్సాక్షాత్కారానికి ఇతర మార్గాలు శ్రేష్ఠం కాదన్నది మహర్షుల అభిమతం కాదు. కానీ అధిక సంఖ్యాకులకు ఏది ఆచరణ యోగ్యమైనదో, ఏది శ్రేయస్కరమైనదో అదే శ్రేష్ఠమన్న భావనతో మహర్షులు భక్తిమార్గం ఉత్తమమని ఉద్బోధించారు. అందుకే నారద మహర్షి '**అన్యస్మాత్ సౌలభ్యం భక్తౌ** (నారద భక్తి సూత్రాలు –58) – ఇతర మార్గాలన్నింటి కన్నా భక్తిమార్గం సులభమైనది' అని మార్గనిర్దేశం చేశారు.

భగవాన్ శ్రీరామకృష్ణ పరమహంస కూడా 'కలియుగంలో మానవులు అన్నగత ప్రాణులు. కాబట్టి ఈ యుగానికి నారదీయ భక్తే అనువైనది' అని సులభోపాయాన్ని సూచించారు.

భక్తి అంటే ఏమిటి? భగవత్సాక్షాత్కారానికి భక్తి ఎలా తోడ్పడుతుంది? ఈ ప్రశ్నలకు సమాధానంగా శ్రీరామకృష్ణులు ఇలా చెప్పారు: "మామూలు అద్దం మీద ఛాయాచిత్రం కనబడదు. అందువల్ల అద్దానికి రసాయనం పూయాలి. అప్పుడే ఛాయాచిత్రం కనబడుతుంది. అలాగే 'హృదయం' అనే అద్దానికి 'భక్తి' అనే రసాయనం పూయాలి. అప్పుడే మన హృదయంలో భగవంతుణ్ణి దర్శించగలుగుతాం".

'భక్తి' రసాయనానికి కావాల్సిన ద్రవ్యాలు – భగవంతుని పట్ల విశ్వాసం, భగవన్నామ స్మరణ, వ్యాకులత, శరణాగతి. ఈ లక్షణాలు ఎవరిలో ఉంటే వారి హృదయంలో భగవత్స్వరూపం ప్రతిబింబిస్తుంది.

శ్రీరామకృష్ణులు భగవత్సాక్షాత్కారానికి అవసరమైన లక్షణాలను రామాయణంలోని వివిధ పాత్రలు, సంఘటనల ద్వారా వివరించారు. అందులో కొన్నింటిని పరిశీలిద్దాం:

మన బాధలకు బాధ్యుడు భగవంతుడా?: ప్రపంచంలోని విషయ వస్తువుల పట్ల ఆశ, దారాసుతుల పట్ల మమకారాలే మన కష్టాలకు మూలం. జీవితంలో మనం ఆశించినవి లభించనప్పుడు, మనం సొంతమనుకున్నవి దూరమైనప్పుడు శోకసంద్రంలో మునిగిపోతాం.

మన బాధలకు కారణం మనలోని ఆశామోహాలే కానీ భగవంతుడు కాదని వివరిస్తూ శ్రీరామకృష్ణులు రావణాసురుని గురించిన ఓ సంఘటన ద్వారా మన సందేహ నివృత్తి చేశారు.

"రామ రావణ యుద్ధంలో రావణాసురుడు మరణించినప్పుడు లక్ష్మణుడు రాముడి వద్దకు వెళ్ళి 'అన్నా! నువ్వు ప్రయోగించిన బాణాల వల్ల రావణుడి ఎముకల్లో తూట్లుపడ్డాయి" అని రాముని శౌర్యప్రతాపాలను కొనియాడాడు. అప్పుడు లక్ష్మణుడితో రాముడు, 'లక్ష్మణా! రావణుడి ఎముకల్లో తూట్లు పడింది ఆయనకు కలిగిన పుత్రశోకం వల్లే గానీ, నేను ప్రయోగించిన బాణాల వల్ల మాత్రం కాదు' అన్నాడు. దీన్నిబట్టి అస్త్రశక్తి కన్నా మమకారశక్తి ఎంత ప్రమాదకరమో గ్రహించవచ్చు.

సంసారంలో మన విధులను నిర్వర్తిస్తున్నప్పుడు ఆశామోహాలనే శోకసంద్రంలో మునిగిపోకుండా ఉండడానికి శ్రీరామకృష్ణులు ఇలా సూచించారు: "ఒక చేతితో భగవంతుని పాదపద్మాలను పట్టుకొని, రెండోచేతితో సంసార విధులను నిర్వర్తించు. పిల్లవాడు ఓ స్తంభాన్ని పట్టుకొని దాని చుట్టూ గిర్రున ఎంత జోరుగా తిరిగినా అతడు పడిపోడు".

భగవంతుణ్ణి ఆలంబనగా చేసుకొని మన విధులను నిర్వర్తిస్తే ఎలాంటి ప్రమాదం ఉండదన్న శ్రీరామకృష్ణుల ఉపదేశాన్ని మన జీవితంలో ఆచరిస్తే, శోకసాగరంలో మునిగిపోకుండా రక్షించబడతాం.

భవసాగరాన్ని దాటించే భగవన్నామం: ఆశామోహాలనే రెండు చేతులతో భవసాగరాన్ని దాటడానికి ప్రయత్నిస్తూ అష్టకష్టాల పాలవుతున్నాం. కానీ భగవన్నామమనే నావను ఆశ్రయిస్తే సులభంగా తరించవచ్చన్న వివేకం మనలో ఉదయించకపోవడం వల్ల భవసాగరంలో మునిగిపోతున్నాం.

భగవన్నామంపై విశ్వాసం కోల్పోతే ఎంత ప్రమాదకరమో తెలియజేస్తూ శ్రీరామకృష్ణులు ఓ కథ చెప్పారు:

"ఒకసారి ఓ వ్యక్తి, విభీషణుడి వద్దకు వెళ్ళి 'నేను లంకా నగరం నుండి భారతదేశానికి వెళ్ళాలనుకుంటున్నాను. సముద్రం దాటడానికి ఏదైనా ఉపాయం చూపండి' అని ప్రాధేయపడ్డాడు. అప్పుడు విభీషణుడు అతడి అంగవస్త్రానికి చివర ఒక వస్తువును ముడివేసి, అతడితో 'ఇప్పుడు నువ్వు నిశ్చింతగా సముద్రం మీద నడుచుకుంటూ వెళ్ళిపోవచ్చు. కానీ ఎట్టి పరిస్థితుల్లోనూ

ఆ ముడిని విప్పి చూడవద్దు' అని హెచ్చరించాడు. ఆ వ్యక్తి విభీషణుడి మాటపై విశ్వాసం ఉంచి సముద్రంపై నడక ప్రారంభించాడు. నేల మీద నడిచినంత సులభంగా నడిచి వెళుతున్నాడు. అలా కొంత దూరం వెళ్ళాక అంగవస్త్రం చివర విభీషణుడు ఏం కట్టాడో తెలుసుకోవాలనే కుతూహలంతో ముడి విప్పి చూశాడు. ఆకు మీద 'శ్రీరామ' అని రాసి ఉంది. దాన్ని చూసిన వెంటనే 'ఓహో! ఇంతేనా!' అని అనుకున్నాడు. అలా అనుకున్న మరుక్షణమే అతడు నీటిలో మునిగిపోయాడు".

భగవన్నామంపై విశ్వాసం ఉంటే సాగరంలో నావపై ప్రయాణించినంత సునాయాసంగా భవసాగరాన్ని దాటవచ్చున్నది ఈ కథ సారాంశం.

నారద మహర్షి కూడా సర్వదా భగవన్నామాన్ని భజించమంటూ **'సర్వదా సర్వభావేన నిశ్చింతితైః భగవానేవ భజనీయః** (నారదభక్తి సూత్రాలు –79) – ఓ మానవులారా!



భగవంతుని పట్ల విశ్వాసాన్ని సడలనీయకుండా చింతలన్నీ వీడి సర్వదా ఆయనను భజించండి ' అని హితవు పలికారు.

భక్తి దాహాన్ని తీర్చే భగవన్నామ పానం: భగవంతుని పట్ల సంపూర్ణ విశ్వాసం కలిగినప్పుడు అనన్య ప్రేమ జనిస్తుంది. అప్పుడు భగవంతుణ్ణి స్మరించకుండా ఒక్క క్షణమైనా జీవించలేం. అలాంటి స్థితి ఎలా లభిస్తుందంటే **'అవ్యావృత భజనాత్** (నారదభక్తి సూత్రాలు –36) – అఖండ భజన ద్వారా అనన్య భక్తి సిద్ధిస్తుంది' అని నారదమహర్షి వివరించారు.

భగవన్నామ స్మరణకు భంగం కలిగించే వాటిని వదిలి, నిరంతరం భగవంతుణ్ణి స్మరించడమే అనన్యభక్తి లక్షణం. అలాంటి స్థితిని పొందిన ఒక కాకి కథను శ్రీరామకృష్ణులు ఇలా వివరించారు:

"ఒకసారి శ్రీరామలక్ష్మణులు పంపానదీ తీరాన నడుస్తూ వెళుతున్నారు. అప్పుడు లక్ష్మణుని దృష్టి ఒక కాకి మీద పడింది. ఆ కాకి దాహం తీర్చుకోవడానికి నది దగ్గరకు వెళ్ళి నీటిని తాగకుండా తిరిగివస్తోంది. ఆ కాకి మళ్ళీ మళ్ళీ అలాగే చేస్తోంది. ఆ కాకి వింత చర్యను చూసిన లక్ష్మణుడు 'అన్నయ్యా! అదేమిటి ఆ కాకి దాహం తీర్చుకోవడానికి నది దగ్గరకు వెళుతోంది. కానీ నీటిని తాగకుండా వెనకకు వస్తోంది?' అని రాముణ్ణి అడిగాడు. అప్పుడు శ్రీరాముడు 'లక్ష్మణా! ఆ కాకి రేయింబవళ్ళూ రామనామాన్ని జపిస్తోంది. నీళ్ళు తాగుతున్నప్పుడు రామనామ జపం ఎక్కడ ఆగిపోతుందోనని దాని భయం' అని కాకి అనన్యభక్తి గురించి చెప్పాడు.

అనన్యభక్తిని సాధించిన భక్తుడు భగవన్నామపానం ద్వారా భక్తి దాహాన్ని తీర్చుకొని సంతృప్తి చెందుతాడు. అందుకు ఆటంకం కలిగించే వాటిని నిరాకరిస్తాడు.

భక్తి సామ్రాజ్యమే మేలు: భగవంతుని పట్ల అనన్య భక్తిని పొందిన భక్తుడు నిరంతరం దివ్యనామ స్మరణం, దివ్యలీలా వీక్షణం, దివ్యరూప దర్శనం, పరమాత్ముని పాదాశ్రయం కోసం పరితపిస్తాడు. కానీ మోక్షపదాన్ని కాంక్షించడు.

'భగవత్సాక్షాత్కారం పొందిన భక్తుడు భగవంతునిలో ఐక్యమవ్వాలని కోరుకోకుండా నిరంతరం భగవానుని లీలల్ని చూడాలని తపిస్తాడు' అంటూ శ్రీరామకృష్ణులు, రావణుని తల్లి నికాషా గురించి ఇలా చెప్పారు:

"రావణుణ్ణి రాముడు వధించాడు. ఆ సన్నివేశాన్ని చూసిన రావణుడి తల్లి నికాషా ప్రాణభయంతో పారిపోసాగింది. అది చూసిన లక్ష్మణుడు 'అన్నయ్యా! కొడుకు చనిపోతే ఏ మాతృమూర్తి అయినా కన్నీరుమున్నీరై విలపిస్తుంది. కానీ నికాషా మాత్రం రావణుని వదిలి పారిపోతోందేమిటి?' అని రాముణ్ణి ఆశ్చర్యంగా అడిగాడు. అప్పుడు శ్రీరాముడు 'నేను నిన్ను చంపను. ఒక్కసారి నా దగ్గరకు రా!' అని నికాషాను పిలిచి, 'ఎందుకు పారిపోతున్నావు?' అని అడిగాడు.

అందుకు సమాధానంగా నికాషా 'ఓ శ్రీరామచంద్రప్రభూ! నేను ఇంతవరకూ జీవించి ఉండబట్టే నీ అద్భుత లీలల్ని చూడగలిగాను. ఇక మీదట నీవు చేయబోయే లీలల్ని కూడా నేను చూడాలి. అందువల్ల నాకు ఇంకా బతకాలని ఉంది' అని చెప్పింది. నికాషా పరుగెత్తి పారిపోవడానికి కారణం దేహప్రీతితో కాదు, దైవభక్తి అని విశదమయింది.

పరమాత్ముని మీద అనన్యభక్తి కలిగిన ఆంజనేయుడు, ప్రహ్లాదుడు లాంటి భక్తులందరూ 'మాకు మోక్షపదం వద్దు. జన్మజన్మలకూ నీ పట్ల పరమ భక్తిని ప్రసాదించు' అని కోరుకున్నవారే! ఎందుకంటే **యది భవతి ముకుందే భక్తిరానందసాంద్రా, విలుఠతి చరణాగ్రే మోక్షసామ్రాజ్యలక్ష్మీః** – 'భగవంతుని పట్ల శుద్ధభక్తి కలిగిన భక్తుని పాదాల ముందు మోక్షసామ్రాజ్యలక్ష్మి వచ్చి నిలబడుతుంది' అన్న భరోసా భక్తునికి ఎల్లప్పుడూ ఉంది కనుక!

కాబట్టి మనం కూడా మహర్షులు ప్రతిపాదించిన భక్తిమార్గం ద్వారా పయనించి, భగవన్నామపానం చేద్దాం. భగవల్లీలలను తిలకిద్దాం. అందుకు ఆ పరంధాముని పాదపద్మాల మీద పరాభక్తిని ప్రసాదించాల్సిందిగా ప్రార్థిద్దాం! ❖

నా భక్తుల సాంగత్యం, నా మహిమలను వినడం, నా గుణగణాలను కీర్తించడం, అనన్య భక్తితో నన్ను పూజించడం – ఈ ఆదేశాలను అనునిత్యం పాటించేవారికి శుద్ధభక్తి లభిస్తుంది. – శ్రీరాముడు



ధరిత్రిలో

ధర్మం నిలువెత్తు రూపంలో, మానవాకృతిని దాల్చి శ్రీరామచంద్రునిగా రూపుదిద్దుకుంది. ఆ సుగుణాభి రాముడు, సత్యవాక్పాలకుడు, స్థితప్రజ్ఞుడు, జితక్రోధుడు, వీరుడు, దృఢవ్రతుడు, సర్వభూతహితుడు, ఇంద్రియనిగ్రహుడు, మితభాషి, తేజస్వి, ప్రజ్ఞావంతుడు,దయార్ద్ర హృదయుడు, ఏకపత్నీవ్రతుడు, ప్రజారంజకుడు, క్షమాశీలుడు, వేదవేదాంగ తత్త్వజ్ఞుడు, వినయ సంపన్నుడై, మర్యాదా పురుషోత్తమునిగా కీర్తినందుకున్నవాడు.

చతుర్విధ పురుషార్థాలైన ధర్మార్థకామమోక్షాలలో, ధర్మాన్ని ఎలా ఆచరించాలో, అర్థాన్ని ఎలా అతిక్రమించాలో, కామాన్ని ఎలా జయించాలో, మోక్షప్రాప్తిని ఏ విధంగా పొందాలో మార్గనిర్దేశం చేసిన పూర్ణ పురుషోత్తముడు – శ్రీరామచంద్రుడు.

నిరుపమాన త్యాగశీలి అయిన రాముడు, తండ్రి వాక్కును సత్యం చేసేందుకు రాజ్యాధికారాన్ని తృణప్రాయంగా ఎంచి, అరణ్యాలకు ప్రసన్న వదనంతో వెళ్ళినటువంటి వాడు. మహత్తరమైన సోదర ప్రేమ, పృథ్విలో రాముని చేతే ప్రకటితమైనది. ఆ రాముని ప్రేమ ఎలాంటిదంటే, ఆయన వియోగాన్ని భరించలేని లక్ష్మణుడు వనవాసానికి తోడుగా వెళ్ళేందుకు కూడా వెనుదీయలేనటువంటిది. అంతేకాక, శ్రీరాముని పాదుకలను తలదాల్చి, నిమిత్త మాత్రుడై రాజ్యపాలన సాగిస్తూ, నార బట్టలను ధరించి, సర్వసుఖాలను త్యజించి, ముని జీవనాన్ని కొనసాగించగలిగిన భరతుణ్ణి జ్ఞప్తికి తీసుకువస్తుంది. రాజ్యాభిషేకమనే సంతోషవార్త విన్నప్పుడూ, అడవులకు వెళ్ళమనే విషాదవార్త విన్నప్పుడూ రెండింటిలో ఉపేక్షా భావాన్ని కలిగి ఉండడం శ్రీరాముని స్థితప్రజ్ఞతకు నిదర్శనం.

రామరావణ యుద్ధంలో, రావణుని రథాశ్వం ఒకటి చనిపోయింది. అప్పుడు నిస్సహాయస్థితిలో ఉన్న శత్రువు పట్ల దయ, జాలి చూపిస్తూ, నాటికి విశ్రాంతిని తీసుకోమనీ, మరునాడు యుద్ధాన్ని కొనసాగించవచ్చనీ పలుకగలగడం ఆ శ్రీరామునికే చెల్లింది. అవకాశం వచ్చినా, శత్రువు అధర్మంగా ప్రవర్తిస్తున్నా, తను నిగ్రహం కోల్పోక, క్షత్రియ ధర్మానికి విలువనిచ్చి, సంయమనంతో వ్యవహరించడం శ్రీరాముని ధర్మజ్ఞతను తెలియజేస్తుంది.

రావణ వధానంతరం, విభీషణుడు లంకలో కొద్ది రోజుల పాటు విశ్రాంతి తీసుకుని వెళ్ళమని శ్రీరాముణ్ణి కోరతాడు. అది లక్ష్మణ సుగ్రీవులతో సహా అందరికీ ఆమోదయోగ్యంగా అనిపించింది. అయినా సరే, రాముడు స్థిరత్వంతో ఇలా అన్నాడు:

అపి స్వర్ణమయీ లంకా నమే లక్ష్మణ రోచతే ।
జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసీ ॥

“ఓ లక్ష్మణా! లంక ఎంత సువర్ణమయమైనా, నాకు ఇష్టంగా లేదు. కన్నతల్లీ, జన్మభూమీ స్వర్గం కన్నా శ్రేష్ఠమైనవి సుమా!” అలా సున్నితంగా అవతలివారి మనోభావాలు గాయపడకుండా తన అభిప్రాయాన్ని తెలియజేయడం శ్రీరాముని సంస్కారాన్నీ, ప్రగాఢ దేశభక్తినీ వెల్లడిస్తుంది.

రామాయణం (రామ+అయనం) అంటే రాముని మార్గం; ఆ రాముని మార్గం ఏమి తెలియజేస్తోందో పరిశీలిద్దాం. రామాయణంలోని ఆరు కాండలను వరుసలో ప్రస్తావిస్తే, అవి – బాలకాండ, అయోధ్యకాండ, అరణ్యకాండ, కిష్కింధకాండ, సుందరకాండ, యుద్ధకాండ. ఇవి కాక, ఉత్తర కాండ ఉండనే ఉంది.

ముందుగా **‘బాలకాండ’**ను గురించి యోచిస్తే, భక్తి మార్గంలో మనస్సు బాలుని లాగా స్వచ్ఛంగా, నిష్కపటంగా ఉండాలి. జ్ఞానం, ధనం, గౌరవం ఎంతగా పెరిగినప్పటికీ, మనస్సు మాత్రం బాలకుని లాగా సరళంగా ఉండాలి. హృదయ నిర్మలత్వాన్ని పెంపొందించేలా, మనోవాక్కాయ కర్మలు ఒక్కటై నిలవాలి. ఇదే మనకు బాలకాండ నేర్పే ఆదర్శం.

ధర్మస్వరూపుడు

– డాక్టర్ అపర్ణా శ్రీనివాస్

'అయోధ్యకాండ'ను ప్రస్తావిస్తే, ఎక్కడైతే దుర్బుద్ధి, విరోధం, వాదోపవాదాలు లేవో, అదే అయోధ్యాపురం. అక్కడ శ్రీరాముడు అవతరిస్తాడు. ఎప్పుడైతే మనస్సులో దురాలోచనలు మొదలవుతాయో, అక్కడ రాముడు నిలవజాలడు. కైకేయి మనస్సులో దుర్బుద్ధి మొదలవగానే, అయోధ్యను వదిలి వెళ్ళాడు శ్రీరాముడు. అందువల్ల, దుర్గుణాలకు తావివ్వకూడదని మనకు 'అయోధ్యకాండ' తెలియజేస్తుంది. రామాయణంలో అన్ని కాండలలో, యుద్ధాలు జరిగినా, అయోధ్యకాండలో మాత్రం ఒక్క యుద్ధం కూడా జరగలేదు... అదే దాని విశిష్టత. కాబట్టి, మన మనస్సు అనే అయోధ్యలో శత్రువులు లేకుండా చేసుకుంటే, శ్రీరామచంద్రుడు దర్శనమిస్తాడు.

'అరణ్యకాండ'ను పరిశీలిస్తే, దట్టమైన అజ్ఞానారణ్యంలో చిక్కుకున్న సాధకులకు దారి తెన్నులు చూపగలిగేవి ఇంద్రియ నిగ్రహం, వాసనాక్షయాలు మాత్రమే అని చెబుతోంది. సాధు సజ్జనుల సాంగత్యం ఆ మార్గాన్ని మరింత సుగమం చేస్తుందని కూడా అరణ్యకాండ తెలియజేస్తోంది. ఈ అరణ్యకాండలో శ్రీరామునికి శూర్పణఖ అనే మహామోహం, శబరి అనే శుద్ధ భక్తి ఎదురయ్యాయి. అప్పుడు శ్రీరాముడు మోహాన్ని తృణీకరించి, భక్తిని ఆదరించాడు. మోహాన్ని విడిస్తే వివేకం, వైరాగ్యం జాగృతమై, భక్తిని పెంపొందిస్తాయి. ఇదే అరణ్యకాండ సందేశం.

'కిష్కింధకాండ'లో శ్రీరామునితో సుగ్రీవునికి మైత్రిని చేకూర్చినవాడు హనుమంతుడు. ఆదర్శ బ్రహ్మచారి అయిన హనుమంతుడు వారధిగా నిలిచి, సుగ్రీవుడికీ (జీవాత్మ), శ్రీరామునికీ (పరమాత్మ) మైత్రిని కలిగించాడు. రాముడు ఉన్నచోట కాముడు నిలవడు. అందువల్ల బ్రహ్మచర్యం ఆవశ్యకతను తెలియజేస్తూ, విషయానంద భ్రమలు తొలగితేనే బ్రహ్మానందంపై మనస్సు నిలవగలదనే సత్యాన్ని చాటుతుంది 'కిష్కింధకాండ'.

సుందరమైనటువంటిది **'సుందరకాండ'**. మధురాతి మధురమైన రామనామామృతాన్ని గ్రోలిన వారి మనస్సు, దృశ్య విషయాలలో బంధితం కాదని అది తెలియజేస్తోంది. అంతేకాక, రామనామాన్ని గట్టిగా పట్టుకున్న వారికి, భవసాగరాన్ని దాటడం సునాయాసమని ఋజువు చేస్తోంది సుందరకాండ. నిరంతర రామనామ జపం వల్ల ఆ ఆదిపరాశక్తి (సీతామాత) దర్శన భాగ్యం కలగడమే కాక, అజ్ఞానమనే అసుర లక్షణానికి దహన ప్రక్రియ కూడా సాధ్యమని వివరిస్తోంది.

ఇక, **'యుద్ధకాండ'** గురించి యోచిస్తే, మానవునిలోని దశేంద్రియాలు పది తలల రావణునికి చిహ్నం. ఈ దశేంద్రియాలు, వాటి తాలూకు విషయాలు, సంకల్పమనే అంతస్సూత్రంతో మాలగా గుచ్చబడి ఉన్నాయి; ఆ తంతువు (దారం) తెగితేనే, సంకల్పాలు క్షీణించి, అది బ్రహ్మత్వానికి దారి తీయగలదు. దీని కోసం అచంచల కార్యదీక్ష, సంయమనం, స్థితప్రజ్ఞత అనే లక్షణాలు ఆవశ్యకాలు. ఆ లక్షణాలను పుణికిపుచ్చుకొని, ఒక సాధారణ మానవునిలా ప్రవర్తిస్తూనే రాముడు ఆ అసురవధ చేశాడు. మనకు ఆదర్శప్రాయుడై నిలిచాడు.

ఇక, **'ఉత్తరకాండ'** సంగతి కూడా తీసుకుంటే, శ్రీరాముని ధర్మనిరతిని అది తెలియజేస్తుంది. ఒక ఆదర్శ రాజ్యం ఎలా ఉంటుందో తన పరిపాలన ద్వారా తెలియజేసిన రాముడు, ఏనాడూ ధర్మాన్ని అతిక్రమించలేదు. ధర్మ పరిరక్షణలో అనుబంధాలకు ప్రాముఖ్యం లేదని ఆచరించి మరీ చూపాడు. ఈ విధిలో జగన్మాత అయిన సీతాదేవిని అడవులకు పంపవలసి వచ్చినా, ప్రాణ సమానుడైన లక్ష్మణునికి దేశ బహిష్కరణ విధించవలసి వచ్చినా చలించలేదు. కర్తవ్యానికే ప్రాధాన్యమిచ్చి, మమకార రహితంగా ప్రవర్తించాడు. తాను సార్వభౌముడై ఉండి కూడా, భోగాలను త్యజించి, ఏకపత్నీ వ్రతానికి కట్టుబడి, ముని ప్రవృత్తిలో జీవనాన్ని కొనసాగించినవాడు రఘురాముడు. అంతేకాక నియమపూర్వకమైన ఔషధసేవచే రోగం ఎలా ఉపశమిస్తుందో, అలా అంతః కరణమనే విశుద్ధభావంతో అవిద్య నశించగలదని తెలిపాడు. బాహ్యదృష్టిని నిరోధిస్తే, జ్ఞాననేత్రం తెరుచుకోగలదని 'ఉత్తరకాండ' తెలియజేస్తోంది.

శ్రీరామచంద్రుడు ఒక సాధారణ మానవుని లాగా జీవిస్తూ, ధర్మాచరణమే జీవనంగా భావిస్తూ, రాజ్యభోగాల కన్నా, అధికారం కన్నా ధర్మమే మిన్న అని లోకానికి చాటి చెప్పిన ధర్మజ్ఞుడు. 'రామో విగ్రహవాన్ ధర్మః' అని వినుతించేది అందుకే! ❖

(ఏప్రిల్ 8వ తేదీ, మంగళవారం – 'శ్రీరామనవమి')

ఆ ప్రాచీన ధీరయుగానికి కన్నుల వెలుగైన శ్రీరాముడు మూర్తీభవించిన సత్య, ధర్మస్వరూపుడు, ఆదర్శ తనయుడు, ఆదర్శ పతి, ఆదర్శ జనకుడు, అన్నిటికీమించి ఆదర్శ నృపతి. – స్వామి వివేకానంద

శుభము చేయ... సుజనుల గావ



- స్వామి జ్ఞానదానంద

శ్రీమద్భాగవత కథా ప్రారంభంలో భాగంగా సూతముని శౌనకాదులకు పరీక్షిత్తు జన్మవృత్తాంతాన్నీ, ధర్మకార్యాలనూ, కౌరవుల పరాజయాన్నీ, పాండవుల మహాప్రస్థానాన్నీ వివరిస్తూ ఉన్నాడు. కురుక్షేత్ర సమరంలో రారాజు దుర్యోధనుడితో సహా కౌరవ వీరులు ఒక్కరొక్కరుగా నేలకొరిగారు. అశ్వత్థామ చేతిలో పాండవుల పుత్రులు అసువులు బాశారు. ఆగ్రహోదగ్రుడైన అర్జునుడు, శ్రీకృష్ణ పరమాత్ముడి సారథ్యంలో అశ్వత్థామను సంహరించేందుకు సన్నద్ధమయ్యాడు. అశ్వత్థామ విభ్రాంతుడయ్యాడు; ప్రాణ రక్షణార్థం పార్థుడిపైకి బ్రహ్మాస్త్రాన్ని ప్రయోగించాడు. ప్రయోగించడమే తప్ప ఉపసంహారం తెలియని ఆ అస్త్రం ప్రచండతేజంతో దిగ్దిగంతాలకు వ్యాపించింది. ఆ బ్రహ్మాస్త్ర ప్రకంపనాలను చూసి కిరీటి కలవరపడిపోయాడు. సారథిగా నిలిచిన శ్రీకృష్ణపరమాత్ముడినే శరణంటూ ప్రార్థించాడు. అలా ఆనాడు ఆర్తితో అర్జునుడు చేసిన ప్రార్థన పరోక్షంగా పరమాత్మ అవతార తత్త్వాన్నీ, పరమార్థాన్నీ ప్రస్ఫుటం చేసింది. అంతర్యామి అయిన ఆ భగవంతుడు అసలు లీలామానుషుడై ఈ భువిపై ఎందుకు నడయాడతాడో స్పష్టం చేసింది. సంపూర్ణ శరణాగతితో నాడు...

పద్మలోచన! కృష్ణ! భక్తాభయప్రద
వినుము సంసారాగ్ని వేగుచున్న
జనుల సంసారంబు సంహరింపగ నీవు
దక్క నన్యులు లేరు తలచి చూడ
సాక్షాత్కరించిన సర్వేశ్వరుండవు
ప్రకృతికి నవ్వలి ప్రభుడ వాద్య
పురుషుండవగు నీవు బోధముచే మాయ
నడతువు నిశ్శ్రేయసాత్మ యందు
మాయచేత మునిగి మనువారలకు కృప
చేసి ధర్మముఖ్య చిహ్నమయిన
శుభము సేయు నీవు సుజనుల నవనిలో
గావ పుట్టుదువు జగన్నివాస!

'సంసారజ్వాలల్లో తపించిపోతున్న జనుల కష్టాన్ని పోగొట్టడం నీకు తప్ప మరొకరికి శక్యం కాదు. నీవు సాక్షాత్తూ సర్వేశ్వరుడవు. ఈ ముల్లోకాలకూ ఆవలివాడవు! ఆది పురుషుడవైన ప్రభుడవు! నీవు ముముక్షువులకు జ్ఞానాన్ని ప్రసాదించి మాయను మటుమాయం చేస్తావు. నీవు మాయాజాలంలో మునిగిన వారికి ధర్మసమ్మతమైన తేజస్సును అనుగ్రహిస్తావు. ఓ జగన్నివాసా! శిష్టరక్షణ కోసమే నీవు ఈ జగత్తులో జన్మిస్తావ'ని ప్రస్తుతిస్తూ ఫల్గుణుడు వేడుకున్నాడు.

పచ్చ కర్పూరం లాంటి తెలుగు పలుకుబడులతో పోతనామాత్యులు ఆ పాండుపుత్రుడి ప్రార్థనను పద్యరూపంలో అనుసృజించారు. కిరీటి కోరికను మన్నించి కరుణాంతరంగుడైన శ్రీకృష్ణపరమాత్ముడు బ్రహ్మాస్త్రానికి, బ్రహ్మాస్త్రమే సమర్థమని సూచించాడు. వాసుదేవుని వచనాలు వినగానే అర్జునుడు ఆచమించి, ఆ పరంధాముడికే ప్రదక్షిణం చేసి అశ్వత్థామ ప్రయోగించిన బ్రహ్మాస్త్రం మీద తన బ్రహ్మాస్త్రాన్ని ప్రయోగించి విజయుడయ్యాడు. శ్రీమద్భాగవతాంతర్గతంగా ధనంజయుడు ఆ దేవదేవుడి అవతార లక్ష్యానికి సాక్షిగా నిలిచాడు. ధర్మసంస్థాపనార్థమే ఆ దయామయుడు ఆగమిస్తాడని నిరూపించాడు. అందుకే భగవాన్ శ్రీరామకృష్ణ పరమహంస ఓ సందర్భంలో 'భక్తులను ప్రేమించడానికి, ఉద్ధరించడానికే భగవంతుడు తనను తాను చిన్నవాణ్ణి చేసుకొని లీలలు ప్రదర్శించడానికి వస్తున్నాడు' అని గుర్తుచేస్తారు.

ఆయన దక్క అన్యులు లేరు! : ఏ యుగంలో తీసుకున్నా భగవంతుడు పరమోన్నతమైన లక్ష్యంతోనే ఈ భువిపైకి అడుగుపెట్టాడు. కామ్యకర్మలకు అతీతుడైనా, కేవలం తన లీలలను ప్రదర్శించడానికే దేహధారణ చేస్తున్నాడు. సంసార జ్వాలల్లో వేగిపోతున్న మనల్ని సంరక్షించుకోవడంలో ఆయన తప్ప అన్యులు ఎవరూ సమర్థులు కారు. త్రేతాయుగంలో రావణుడు బ్రహ్మదేవుడిని వరాలు అడుగుతూ 'యక్షగంధర్వుల వల్ల గాని, దేవదానవుల వల్ల గాని తనకు మరణం లేకుండు'నట్లు

కోరుకుంటూ, మానవుల పట్ల చులకనభావంతో, వారు తననేం చేస్తారులే అన్న ధీమాతో మానవుల చేతిలో మృత్యువు కలగకుండునట్లు వరం అడగలేదు. అలా దారుణాలకూ, దుర్మార్గాలకూ ఒడిగట్టిన రావణుడిని తుదముట్టించేందుకు ఆ జగన్నాథుడు మానవరూపంలో శ్రీరామచంద్రమూర్తిగా వచ్చాడు. అధర్మానికి మారురూపుగా నిలిచిన లంకాధీశుడిని మట్టుపెట్టాడు. అందుకే స్కందపురాణాంతర్గత శ్రీమద్రామాయణ మాహాత్మ్యంలో నారద మహర్షి...

యో దైత్యహంతా నరకాంతకశ్చ భుజాగ్రమాత్రేణ దధార గోత్రం।
భూభారవిచ్ఛేద వినోదకామం తమాదిదేవం రఘువంశ దీపమ్॥

'త్రేతాయుగంలో రఘువంశాన అవతరించిన శ్రీరామచంద్రుడు ఆ శ్రీమహావిష్ణువే! అతడు రాక్షసులను సంహరించెను; పాపాలను రూపుమాపెను. తన భుజబలం చేతే ధర్మాన్ని రక్షించెను. భూభారాన్ని తొలగించడం ఆయనకు వినోదం. అలాంటి దేవదేవుడికి నమస్కరిస్తున్నాన'ని కైమోడ్పులు అర్పిస్తాడు. అయితే అలా దిగివచ్చిన దయామూర్తిని అందరూ గుర్తించలేరు. పరమ భక్తులైన వారికి తప్ప, మిగిలినవారందరికీ ఆయన ఓ సాధారణ మానవమాత్రుడిగానే కనిపిస్తాడు. ఆయనను అర్థం చేసుకునే అదృష్టాన్ని కూడా ఆయనే ప్రసాదించాలి. అలా ఆనాడు అర్జునుడు, హనుమంతుడు లాంటి ఆత్మీయభక్తులే ఆ విశ్వమూర్తి వైభవాన్ని వీక్షించగలిగారు.

భవిష్యదోచనతో అవతరించేవాడు భగవంతుడు. ప్రపంచానికి ఆయన పాంచభౌతిక శరీరంగానే కనిపిస్తున్నా, ప్రకృతి పరిధిని, పరిమితులను మించి ప్రవర్తిస్తూ ఉంటాడు. ధర్మాన్ని సుస్థాపితం చేసేందుకు ప్రతి యుగంలోనూ ఆయన దేహాన్ని ధరిస్తూనే ఉంటాడు. ఏదో ఒక రూపంలో తన లీలలను ప్రదర్శిస్తూ, తన ఆగమన లక్ష్యాన్ని పూర్తిచేసుకొని నిశ్శబ్దంగా నిష్క్రమిస్తాడు.

సాక్షాత్కరించిన సర్వేశ్వరుడు...: ప్రత్యర్థులు నూరుగురైనా పంచపాండవులు భయపడలేదు. తమ వైపు శ్రీకృష్ణుడు ఉన్నాడు చాలు! ఆయనే బలం, బలగం అన్న ధైర్యంతో యుద్ధానికి సిద్ధమయ్యారు. ఆ గోవర్ధనోద్ధారి కూడా పక్షపాతంతో కాకుండా కేవలం ధర్మపరిరక్షణార్థమే పాండవులకు అండగా నిలిచాడు. అంగబలం, అర్థబలం అల్పమే అయినా ధర్మాన్ని నమ్ముకున్నారన్న ఒకే ఒక్క కారణంతో వారి బాధ్యతనంతా భగవానుడే భుజానికి ఎత్తుకున్నాడు. తాను ధర్మపక్షపాతినని నిరూపించుకున్నాడు. తుదకు రణరంగంలో ప్రత్యక్షంగా పార్థుడికీ, పరోక్షంగా సమస్త ప్రపంచానికీ తన అభయహస్తాన్ని చూపుతూ...

యదా యదా హి ధర్మస్య గ్లాని ర్భవతి భారత ।
అభ్యుత్థాన మధర్మస్య తదాఽఽత్మానం సృజా మ్యహమ్ ॥
పరిత్రాణాయ సాధూనాం వినాశాయ చ దుష్కృతామ్ ।
ధర్మసంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే ॥

'అర్జునా! ఎప్పుడెప్పుడు ధర్మానికి హాని కలిగి అధర్మం విజృంభిస్తుందో అప్పుడు నేను అవతరిస్తాను. సాధుజనులను రక్షించేందుకూ, దుర్మార్గులను నిర్మూలించేందుకూ, ధర్మాన్ని సుస్థిరంగా ప్రతిష్ఠించేందుకూ ప్రతి యుగంలోనూ నేను అవతరిస్తూ ఉంటా'నని పునరుద్ఘాటించాడు.

ఇలా యుగయుగాల్లో సాక్షాత్కరించే సర్వేశ్వరుడు, ఒక్కో మారు ఒక్కో రీతిలో తన కార్యప్రణాళికను రచించుకొని పూర్తిచేస్తాడు. అయితే మానవమాత్రులమైన మనం వారి రూపురేఖలను చూసి, వారూ సామాన్యులేనని అనుకుంటే పొరపాటే! అలా నాటి శ్రీరాముడు, శ్రీకృష్ణుడు నుంచి నిన్న మొన్నటి శ్రీరామకృష్ణుల వరకు అవతార పురుషులందరినీ చాలామంది సమకాలికులు సాధారణ పురుషులలాగే భావించారు. ఆ మహానుభావులు సలిపే కార్యాలను మన మానవదృష్టితో చూడకూడదు. త్రేతాయుగంలో శ్రీరాముడి జీవితం మనకు ఆదర్శం; ద్వాపరయుగంలో శ్రీకృష్ణుడి బోధనలు అనుసరణీయం. శ్రీకృష్ణ పరమాత్ముడి కార్యాలు నర్మగర్భమైనవి; మానవమాత్రుల మేధకు అవి అర్థం కావు. అందుకే ఆయన చర్యలను అనుకరించే సాహసం చేయకూడదు. అయితే కలియుగంలో అవతరించిన శ్రీరామకృష్ణ పరమహంస జీవితమూ, బోధనలూ రెండూ అనుష్ఠాన యోగ్యమే!

ప్రకృతికి ఆవలి ప్రభువు...

పోతనామాత్యులు అలతి అలతి పదాలతోనే ఆ పరమాత్మ తత్త్వాన్ని పార్థుడి ప్రార్థనరూపంలో ప్రస్ఫుటం చేశారు. ప్రకృతి పరిమితులకూ, మాయామోహాలకూ భగవంతుడు బందీ అయ్యేవాడు కాడని స్పష్టం చేశారు. సమస్త పాత్రల్ని సృజించి పోషింపచేస్తూ, కొన్నిసార్లు తనూ అనివార్య పరిస్థితులలో ఓ ప్రముఖ పాత్రను పోషించే దర్శకుడిలా ఆ దేవదేవుడు నడచుకుంటాడు. సహ పాత్రధారులతో కలసి నటిస్తున్నా, పూర్తి కథాకథనాలన్నీ తన అదుపులో ఉంచుకునే అగ్రదర్శకుడిగా, సాక్షిలా మసలుకుంటాడు. అందుకే స్వామి వివేకానంద ఓ సందర్భంలో భగవాన్ శ్రీరామకృష్ణ పరమహంస మాహాత్మ్యాన్ని ప్రస్తావిస్తూ 'శ్రీరామకృష్ణులు 'దేహస్థోపి న దేహస్థః'– శరీరంలో ఉన్నా శరీరానికి చెందినవారు కాదు. అలాంటి అవతారపురుషులు నిర్వహించే కర్మలను 'లోకవత్ లీలా కైవల్యమ్' – మనుష్యుల్లా కనిపిస్తూ వారు చేసేదంతా కేవలం క్రీడే!' అన్నారు. సర్వధర్మ స్వరూపులుగా, కలియుగంలో ధర్మ ప్రతిష్ఠాపన కోసం దిగివచ్చిన అవతారశ్రేష్ఠులుగా కొనియాడుతూ...

స్థాపకాయ చ ధర్మస్య సర్వధర్మ స్వరూపిణే
అవతార వరిష్ఠాయ రామకృష్ణాయ తే నమః... అని

కీర్తించారు. ఇలా భవిష్యత్ యోచనతో ఆగమించే భగవంతుడు కేవలం మంచిని నిలబెట్టడానికే మనిషిగా మన మధ్యకు వస్తాడు; మన అడుగులో అడుగువేసి నర్తించినట్లు నటించి మన తప్పటడుగుల్ని సరిదిద్దుతాడు. ❖

ఓ లక్ష్మణా! అనర్ఘ సంపద లభించినా ఆనందోద్రేకం పొందబోకు; దాన్ని కోల్పోయినా కుంగిపోకు. సమచిత్తుడవై మసలుకో. నీ మనస్సు నిరంతరం నాయందే లగ్నం చేయి. - శ్రీరాముడు

మన సంస్కృతి

- స్వామి హర్షానంద

"ఒక వ్యక్తి తనను తాను అసహ్యించుకొంటున్నట్లయితే అదే పతనానికి హేతువు. పూర్వీకుల చరిత్రను అవమానకరంగా భావిస్తే, ఆ జాతి అంతానికి చేరుకున్నట్లే!" అంటారు స్వామి వివేకానంద. గత వైభవాన్ని మర్చిపోయినంత కాలం మనమూ, మన దేశం స్తబ్ధతలో మునిగిపోతాం. అందుకే, మన ప్రాచీన సంస్కృతి గురించి తెలుసుకోవాలి. గడచిపోయిన సంగతులు తెలుసుకొంటూ, భవిష్యత్ మహత్కార్యాల సాధన వైపు నడవాలి. మన ప్రాచీన భారతీయ సంస్కృతిని గుర్తు చేసేందుకు చేస్తున్న ప్రయత్నమే ఈ వ్యాసాల పరంపర. సుప్రసిద్ధ రచయిత, బెంగుళూరు రామకృష్ణ మఠం అధ్యక్షులు స్వామి హర్షానంద మహరాజ్ మధ్యయుగాల కాలం దాకా విలసిల్లిన మన సంస్కృతిని 'శ్రీరామకృష్ణ ప్రభ' పాఠకులకు 2014 ఫిబ్రవరి సంచిక నుండి వివరిస్తున్నారు.

హిందూ ఓం సమాజము

ప్రాచీన, మధ్య యుగాల భారత సమాజానికి పురుషార్థాలు, వర్ణ వ్యవస్థ, ఆశ్రమ వ్యవస్థ ముక్కాలిపీట లాంటివి. పురుషార్థాలు వ్యక్తి ఆశయాలను సఫలం చేసి జీవితానికి గమ్యాన్నిస్తే, ఆశ్రమ ధర్మాలు సమాజానికి ఒక రూపాన్ని కల్పించి ఆచరణీయతను ప్రసాదిస్తాయి. వర్ణవ్యవస్థ సమాజానికి ఒక సంస్థాగత నిర్మాణాన్నిచ్చి పై అంశాల ఆచరణకు దోహద పడుతుంది. హిందూ సమాజపు వర్ణ వ్యవస్థ, ఆశ్రమ ధర్మాల వివరణ ఇక్కడ ఆవశ్యకం.


వర్ణ వ్యవస్థ : చాతుర్వర్ణ వ్యవస్థ ఋగ్వేద కాలం నుండి ఉంది. నాగరక సమాజాలన్నిటిలో వ్యక్తి, తనకు నచ్చిన వృత్తిని అవలంబించి జీవితాన్ని గడపడం గమనించవచ్చు. సభ్యులు తమ ప్రవృత్తికి తగిన వృత్తులను ఎంచుకొని జీవించడానికి కావలసిన అవకాశాలను కల్పించడం సమాజం బాధ్యత. వర్ణవ్యవస్థ వెనుక దాగిన తాత్పర్యం ఇదే. మతాలు, పురుషసూక్తం (చాతుర్వర్ణ వ్యవస్థను నిర్వచించిన సూక్తం) ఈ వ్యవస్థను గుర్తించాయే కానీ సృష్టించలేదు. ఒక సమాజం ఎదుగుతున్న కొద్దీ పనుల కేటాయింపు తప్పనిసరి. అందరూ అన్ని పనులు చేయలేరు కాబట్టి వేదకాలం ప్రారంభంలో ఈ పనుల విభజన ఒక కుటుంబ సభ్యులు పనులు పంచుకొనే విధంగా, స్వచ్ఛందంగా జరిగి వుంటుంది. కొందరు జ్ఞాన సముపార్జన, విద్య సంస్కృతుల అభివృద్ధిని ఒక వృత్తిగా ఎంచుకొని తమ సంతానాన్ని కూడా ఈ వృత్తిలో నిపుణులను చేశారు. వీరే బ్రాహ్మణులుగా పిలువబడ్డారు. దేహదారుఢ్యమున్న కొందరు ఆయుధాలు ధరించి సమాజాన్ని పరాయిదాడుల నుండి రక్షించడం, ఆంతరంగికంగా సమాజానికి భద్రత కల్పించడం వృత్తిగా స్వీకరించారు. వీరే క్షత్రియులు. ఎక్కువమంది అనేక రకాల సంపదలు, వ్యవసాయం, పాడిపరిశ్రమ, వర్తక వ్యాపారాలు వృద్ధి చేయడం, నలుగురికి పంచడం వృత్తిగా స్వీకరించారు. వీరే వైశ్యులు.

ఈ మూడు విభాగాలకు చెందనివారు కూలీపనులు చేస్తూ సేవలు చేసేవారు శూద్రులు. కాలాంతరంలో వీరందరూ కూడా తమ వృత్తిని వంశపారంపర్యంగా చేస్తూ ఒకరి కన్నా ఒకరు గొప్పవారుగా భావింపబడ్డారు.

మొదట్లో ఈ పనివిభజన గుణ (ప్రవృత్తి) కర్మల (ఎంచుకొన్న పని) ఆధారంగా ప్రారంభమై ఆ కాలానికి అనుకూలంగా వుండేది. ఒక వర్ణంలో జన్మ ఆ వ్యక్తి కులంగా భావింపబడేది. జాతుల ఆవిర్భావం లేక కుల వ్యవస్థ ఇలా వర్ణ వ్యవస్థ నుండి వచ్చినదే.

భారత ఖండం అనేక జాతుల సముదాయం. ఈ వివిధ జాతుల వారు ఒక సమాజంగా, స్వతంత్ర ప్రతిపత్తి కలిగి ఉంటూనే, కలిసి జీవించగలిగారు. విదేశీ దండయాత్రలు చేసిన శకులు, హూణులు ఈ వర్ణ వ్యవస్థను అంగీకరించి తొలగించే ప్రయత్నం చేయలేదు.





వర్ణవ్యవస్థ హిందూ సమాజాన్ని కాపాడి అన్ని రకాల వృత్తులనూ పోటీ లేకుండా ప్రజాస్వామిక పద్ధతిలో రక్షించింది. భిన్నత్వంలో ఏకత్వం సాధించి దేశ ఐకమత్యాన్ని ఈ వ్యవస్థ కాపాడింది. కులపోరాటాలనేవి బ్రిటీషు పాలన తరువాత కలిగిన సమస్య. స్వార్థపరులు, సంకుచిత స్వభావమున్న రాజకీయ సామాజిక నాయకులు ఈ స్పర్థలను పెంచి, స్వప్రయోజనం పొందడానికి ప్రయత్నించారు.

వర్ణవ్యవస్థలోని కొన్ని ఆసక్తికరమైన లక్షణాలు ప్రాచీన మధ్య యుగాల నాటి సమాజస్థితిని మనకు తెలియజేస్తాయి. వైదిక క్రియల నిర్వహణ బ్రాహ్మణుల వృత్తిధర్మం. సత్-శూద్రులు (తమ ధర్మాన్ని నిర్వహించే శూద్రులు) ఆహ్వానించినప్పుడు వీరు వారిళ్ళల్లో భోజనం చేయడానికి తిరస్కరించేవారు కారు. ముఖ్యంగా శూద్రులు వీరి దగ్గర పనిచేస్తున్నప్పుడో లేక కుటుంబానికి సన్నిహితులుగానో ఉన్నప్పుడూ అలా జరిగేది. విపత్కర పరిస్థితులలో బ్రాహ్మణులు ఇతర వృత్తులు కూడా చేపట్టేవారు. తగిన కారణం లేకుండా తమ వృత్తిని నిర్లక్ష్యం చేసిన బ్రాహ్మణులను చండాలుర కన్నా హీనంగా చూసేవారు.

బ్రాహ్మణులలో చాలామంది ఈజిప్టు, గ్రీసు, రోమ్, మెక్సికో, ఆగ్నేయాసియా దేశాలకు వెళ్ళి హైందవ మతం, తత్త్వం, సంస్కృతిపరమైన బోధనలు చేశారు.

క్షత్రియులు మంచి రాజులుగానే కాక వ్యక్తిగతంగా వేద పండితులై ఋషి తుల్య జీవితం గడిపేవారు. భారతీయ క్షత్రియ సైనికులు మారథాన్, పీఠభూమి యుద్ధాలలో (గ్రీసు–క్రీ.పూ. 490) పాల్గొన్నట్లు చెప్పబడింది. హైందవరాజులు గొప్ప సైన్యబలం, నౌకాబలం కలిగి ఉండేవారు. సైన్యంలో తురగ, గజ దళాలు వుండేవి.

వైశ్యులలో గృహపతులు, శ్రేష్ఠులు అను రెండు విభాగాలు ఉండేవి. గృహపతులు వ్యవసాయం, పాడి పరిశ్రమ చేసే వారు. శ్రేష్ఠులు వర్తకవ్యాపారాలు చేసేవారు. వీరు చక్కని వ్యాపార సంస్థలు స్థాపించి విదేశీ వ్యాపారం చేసేవారు. తూర్పు దిశలోని చైనా, జావా, పశ్చిమాన వున్న ఈజిప్టు, గ్రీసు, రోమ్ దేశాలతో వ్యాపార సంబంధాలు కలిగివుండేవారు.

శూద్రులు సచ్ఛూద్రులుగాను, అసచ్ఛూద్రులుగాను విభజింపబడ్డారు. సచ్ఛూద్రులు మంచి జీవితాలను గడుపుతూ, ధర్మాచరణ చేస్తూ జీవితాలను గడిపేవారు. వీరికి ఉపనయన సంస్కారం, కొన్ని రకాల యజ్ఞాలు, యాగాలు చేయడానికి అర్హత కల్పింపబడింది. వీరు మత సత్యాలను తెలుసుకొని బోధించడానికి వీలుండేది. అయితే వేదపఠనం నిషిద్ధం. వీరు సైనిక, వ్యవసాయ, మేదర, జాలరి, చాకలి, మంగలి లాంటి అనేక వృత్తులను ఆచరించేవారు. వేదకాలంలో అస్పృశ్యులు లేరు. క్రీ.శ. 8వ శతాబ్ద కాలానికి ఈ అనాచారం మొదలైంది. ఆరోగ్యానికి హానికరంగా భావించే అశుచికరమైన కొన్ని వృత్తులు, హీనమైన కొన్ని నేరాలు, అనాచారాలు, ప్రమాదకరమైన భిన్న ప్రవృత్తులున్న పౌరుల కారణంగా అస్పృశ్యత ఆవిర్భవించి, వ్యాప్తి చెందినట్లు భావిస్తున్నారు. అయితే వీరికి కూడ నైతిక ఆధ్యాత్మిక పురోగతి బోధించబడి, ధర్మాచరణ, విష్ణు, శివారాధన చెప్పబడ్డాయి.




భక్తి సంప్రదాయ ఆచార్యులు శతాబ్దాలకొద్దీ వీరి అభ్యున్నతికై శ్రమించినా, శ్రమకుతగ్గ ఫలితం కనిపించడం లేదు.

ఆశ్రమ వ్యవస్థ : మానవుల సహజ స్వభావాలను పవిత్రీకరించడానికి నిర్దేశితమైనది ఆశ్రమవ్యవస్థ. ఈ వ్యవస్థను అనుసరించి మానవ జీవితం నాలుగు దశలు లేక ఆశ్రమాలుగా విభజితమైంది. అవి: బ్రహ్మచర్య (విద్యార్థి), గార్హస్థ్య (వివాహం తరువాత), వానప్రస్థ (వనాలలో నివసించే విరాగులు), సన్న్యాస ఆశ్రమాలు.

బ్రహ్మచర్యాశ్రమం 12 సంవత్సరాలు (7 లేక 8 ఏళ్ళ నుండి 19 లేక 20 ఏళ్ళ వరకు). విద్యలు నేర్చుకోవడం, క్రమశిక్షణ అనేవి ఈ ఆశ్రమ లక్ష్యాలు. విద్యార్థులు గురుకులాలలోని ఆచార్యుని గృహంలో నివసించి పరా–అపరా విద్యలు, కళలు అభ్యసించాలి. ప్రాచీనకాలంలో ఆచార్యులు ఆశ్రమాలలో నివసించేవారు. వారి దగ్గరకు చేరిన శిష్యులు వారితో నివసించి, పేద, ధనిక వివక్ష లేకుండా కఠినమైన నియమాచరణ చేసేవారు. గురుశుశ్రూష దైనందిన పనులలో సేవ, వేదపఠనం, లౌకిక విద్యలతో పాటు వారి దినచర్యగా ఉండేది. భిక్షాటన, వైరాగ్యం (ముఖ్యంగా బ్రహ్మచర్యం) ప్రాపంచిక విషయాలకు దూరంగా ఉండడం వారి శిక్షణలో ముఖ్యమైన విషయాలు.

గురుకులం నుండి తిరిగి స్వగృహం చేరిన తరువాత బ్రహ్మచారి వివాహం చేసుకొని సాంసారిక జీవితం గడపడం ఆచారం. వివాహం ఒక పవిత్రమైన సంస్కారం. భార్య సహధర్మచారిణి కనుక, వివాహాన్ని ఆధ్యాత్మిక పురోగతికి అవరోధంగా ఎంచలేదు. గృహస్థుడు ధర్మబద్ధంగా అర్థాన్ని గడించి, సుఖసంతోషాలతో శ్రేయస్కరమైన జీవితం గడపాలి. అతని ముఖ్య బాధ్యతలలో పంచయజ్ఞాలు లేక సమర్పణలు: దేవయజ్ఞం (ఇంద్రాది దేవతలకు హోమ నివేదనలు), ఋషియజ్ఞం (వేదాధ్యయనం, బోధన ద్వారా ఋషి ఋణం), పితృయజ్ఞం (పితరులకు కర్మక్రియల ద్వారా), నరయజ్ఞం (అతిథి అభ్యాగతుల ఆదరణ), భూతయజ్ఞం (జంతు సేవ).

వయసు మీరిన గృహస్థు పిల్లలకు బాధ్యతలు అప్పగించి భార్యతో సహా కానీ, ఆమెకు ఇష్టం లేనట్లయితే ఏకాకిగా గానీ వానప్రస్థుడవ్వాలి. వానప్రస్థుడు (వన జీవితంలో) ధ్యానపరుడై, ఆధ్యాత్మిక జీవితం గడపాలి. ఇది సన్యాసానికి శిక్షణ పొందడం లాంటిది. వానప్రస్థునికి దృఢమైన వైరాగ్యం కలిగిన వెంటనే భార్యను పిల్లల సంరక్షణలో విడిచి, పరివ్రాజక సన్న్యాస జీవితం మొదలుపెట్టవచ్చు. ఈ సన్న్యాస ఆశ్రమంలో నిత్యం సంచారం చేస్తూ భిక్షక వృత్తిని అవలంబించి, దైవచింతనలో పూర్తిగా నిమగ్నమవ్వాలి. ఆత్మనిగ్రహం పాటిస్తూ, కోరికలను వదలి సర్వసృష్టి పట్ల ప్రేమతో వ్యవహరించాలి.

ఈ నాలుగు ఆశ్రమాలను ఒకదాని తర్వాత ఒకటి విధించినా, ప్రత్యేక సందర్భాలలో ఒక వ్యక్తి, బ్రహ్మచర్యం నుండి గాని, గార్హస్థ్యం నుండి గాని సన్న్యసించవచ్చు.

వైదిక కాలంలో స్త్రీలకు సమాజంలో అత్యున్నత స్థానం ఉండేది. వేదవాఙ్మయంలో ప్రస్తావితమైన వాక్, అంభృణి, రోమశ, గార్గి లాంటి ఋషీమణులు ఇందుకు ఆధారం. స్త్రీలకు ఉపనయనాధికారం ఉండి వేదపఠనం చేయగలిగేవారు. ఈ మార్గాన్ని అనుసరించినవారిని 'బ్రహ్మవాదినులు' అనేవారు. అలాకాక వైవాహిక జీవితంలోకి ప్రవేశించేవారిని 'సద్యో వధువులు' అనేవారు. బాలురితో సహపఠనం ఉండేది. క్షత్రియస్త్రీలు ఆయుధవిద్య, యుద్ధ విద్యలు నేర్చేవారు. బాల్య వివాహాలు, ప్రౌఢ వివాహాలు ఆచారంలో ఉండేవి. కొన్ని సందర్భాలలో స్వయంవర నిర్ణయం జరిగేది.

జీవితం ఒక శాపం కాదు, భగవంతుడిచ్చిన వరం. అందుకే జీవితం సఫలంగా ఉండాలి. మోక్షమే పరమ పురుషార్థమైనా జీవితంలోని మిగిలిన అన్ని విషయాలనూ సమన్వయంతో పరిగణించాలి. భారతీయ మత, సామాజికవేత్తల ఈ అవగాహనే భారత సమాజానికి వేల సంవత్సరాల స్థిరత్వాన్నీ, చైతన్యాన్నీ ఆపాదించాయి. ❖ **అనువాదం: డాక్టర్ పి.వి.రెడ్డి**

ఏ ఆశ్రమంలో ఉన్నా సకల ప్రాణుల యందూ సమభావం కలిగి ధర్మమార్గమున నడచుకోవలెను. ఆశ్రమం, స్థితి, జంతుభేదం - ఇవి ఏవీ ధర్మాచరణ విషయంలో అవరోధం కాకూడదు. - *హితోపదేశం*








దేవదేవం భజే...

– శ్రీమతి బి.కృష్ణకుమారి

అన్నమయ్య పదామృతం

దేవదేవం భజే దివ్యప్రభావం
రావణాసురవైరి రణపుంగవం
రాజవరశేఖరం రవికుల సుధాకరం
ఆజానుబాహు నీలాభ్రకాయం
రాజారి కోదండ రాజ దీక్షాగురుం
రాజీవలోచనం రామచంద్రం
నీలజీమూత సన్నిభశరీరం ఘన వి
శాలవక్షం విమల జలజనాభం
తాలాహినగహరం ధర్మసంస్థాపనం
భూలలనాధిపం భోగిశయనం
పంకజాసన వినుత పరమనారాయణం
శంకరార్జిత జనకచాపదళనం
లంకావిశోషణం లాలిత విభీషణం
వేంకటేశం సాధు విబుధ వినుతం

పరతత్త్వం, పరబ్రహ్మం అయిన పరమాత్ముడు పూర్ణపురుషుడిగా మానవాకారం దాల్చి పట్టాభిరాముడై అవతరించాడు. పదకొండు వేల సంవత్సరాలు ఈ పుడమిని పాలించి, ధర్మాన్ని ప్రతిష్ఠించాడు. 'నా మాయ, నన్ను నేను మరచిపోయేటట్లు చేయుగాక! నన్ను తన వశంలో ఉంచుకొను గాక!' అని సంకల్పించి సంపూర్ణంగా మానవమాత్రుడిగానే మసలుకున్నాడు; తన మాహాత్మ్యాన్ని ప్రదర్శించి, తరతరాలకూ తన ప్రభావాన్ని ప్రసరింపచేశాడు. అలాంటి తేజోమూర్తిని తాళ్ళపాక అన్నమాచార్యులు తన్మయులై ఆరాధించారు. తేనెమొంతల్లాంటి తెలుగుపదాలతోనే కాదు, సురభిధారల్లాంటి సంస్కృత సమాసాలతోనూ కీర్తించారు. ఆ పరంపరలో పల్లవించిన పదపంకజమే ఈ **'దేవదేవం భజే దివ్య ప్రభావం...'** సంకీర్తన.

భక్తిపరిపాకం నుంచి పుట్టిన పాటలో భాష...భావం, పాలు, పంచదారల్లా మమేకమవుతాయి; మధురిమలను కురిపిస్తాయి. అలా పదకవితాపితామహుడు ఇక్కడ దేవభాషలో దశరథ నందనుడిని ప్రస్తుతించాడు; పద్మావతీ ప్రియుడైన శ్రీనివాసుడిలో శ్రీరామచంద్రుడిని దర్శించుకున్నాడు. భగవాన్ శ్రీరామకృష్ణ పరమహంస కూడా తమ శిష్యులతో 'రామనామ స్మరణ చేయడం మంచిది. ఏ రాముడు దశరథ నందనుడో అతడే ఈ జగత్తును సృజించాడు. అతడు సర్వభూతాలలోనూ నెలకొని ఉన్నాడు. అతడు మనకు సమీపంలో ఉన్నాడు. బాహ్యాంతరాలలో వ్యాపించి ఉన్నాడు' అంటూ ఉండేవారు.

దివ్యప్రభావం...

మానవజాతి అంతరించే వరకు ఆ శ్రీరామచంద్రుడి దివ్యప్రభావం ప్రసరిస్తూనే ఉంటుంది. ఆ పవిత్రమూర్తిని స్మరించుకోని జాతి ఉండబోదు. ఈ మాటల్లో అతిశయోక్తి లేదు. అంతటి ప్రభావశీలమైన జీవన ప్రస్థానాన్ని ఆ మంగళమూర్తి మనకు మిగిల్చి వెళ్ళాడు. అదే భావనతో అన్నమయ్య ఆ దాశరథిని భజిస్తూ, ఆయన దివ్యప్రభావాన్ని స్మరిస్తూ, అసురుడైన రావణుడికి శత్రువై రఘువంశాన్నే శోభింపచేశాడంటూ... **దేవదేవం భజే దివ్యప్రభావం, రావణాసుర వైరి రణపుంగవం** అని సంకీర్తనకు శ్రీకారం చుడుతున్నాడు.

దేవతలందరూ రావణాసురుడి రాక్షసకృత్యాలకు భయపడి శ్రీమహావిష్ణువును ఆశ్రయించారు. అప్పుడు ఆ విశ్వంభరుడు, మానవుడిగానే అవతరిస్తాననీ, ఆ రూపంతోనే రావణుడిని మట్టుపెట్టి మానవజాతికే ఓ ఘనతను ప్రసాదిస్తాననీ వారందరికీ అభయమిచ్చాడు.

దశవర్ష సహస్రాణి దశవర్ష శతాని చ
రామోరాజ్య ముపాసిత్వా బ్రహ్మలోకం ప్రయాస్యతి..

'పదకొండు వేల సంవత్సరాలు నేను ఈ భూమండలం మీద ఉండి, ఒక మనిషి మనిషిగా బతకడం ఎలాగో నేర్పడం కోసం ఈ లోకాన్ని పరిపాలిస్తా'నని బాస చేశాడు. అన్నమాట ప్రకారం యావత్ మానవాళికి మార్గదర్శకంగా పదహారు కళలు మూర్తీభవించిన పురుషోత్తముడిగా వెలిగాడు.

రవికుల సుధాకరం...

శ్రీమహావిష్ణువు శ్రీరాముడిగా జన్మించేటప్పుడు ఇక్ష్వాకు వంశాన్నే ఎందుకు ఎంచుకున్నాడని చాలామందికి సందేహం కలుగుతుంది. భగవంతుడి పాదాలను పట్టుకుంటే, ఆయన

(మిగతా 34వ పేజీలో...)

కళ్ళున్నవారు కూడా రాత్రివేళ స్పష్టంగా చూడలేకపోయినప్పటికీ, దీపం తీసుకురాగానే దారి చక్కగా కనబడినట్లుగా నా పట్ల భక్తి ఉన్నవారికి నేనే స్వయంగా దర్శనమిస్తాను. - శ్రీరాముడు

పరిప్రశ్న



– స్వామి భూతేశానంద
(రామకృష్ణ సంఘ 12వ సర్వాధ్యక్షులు)


రామకృష్ణ సంఘ 12వ సర్వాధ్యక్షులు - స్వామి భూతేశానందజీ మహరాజ్ (1901-1998) భక్తుల ఆధ్యాత్మిక సందేహాలకు సరళమైన రీతిలో ఇచ్చిన సమాధానాలను 'శ్రీరామకృష్ణ ప్రభ' పాఠకుల ప్రయోజనార్థం 2013 జూలై సంచిక నుండి ధారావాహికంగా ప్రచురిస్తున్నాం.

భక్తుడు: మంత్రదీక్ష ఎందుకు తీసుకోవాలి? మంత్రం అంటే ఏమిటి? మంత్రదీక్ష ప్రాధాన్యమేమిటి?

స్వామీజీ: అనారోగ్యంగా ఉన్నప్పుడు వైద్యుణ్ణి సంప్రతిస్తాం. వైద్యుడి సూచన మేరకు ఔషధం తీసుకుంటాం. అలాగే భవరోగాలతో బాధపడుతున్నప్పుడు సరైన మార్గనిర్దేశం కోసం గురువుని ఆశ్రయించాలి. మనల్ని తరింపజేయడానికి గురువు ఇచ్చిన భగవన్నామమనే ఔషధాన్ని సేవించాలి.

శారీరక రోగం పోవడానికి ఔషధం ఎంత అవసరమో భవరోగం నుండి బయటపడడానికి మంత్రోపదేశం అంతే అవసరం.

'మననాత్ త్రాయతే ఇతి మంత్రః – స్మరించడం వల్ల తరింపజేసేదే మంత్రం'. భగవంతుని నామాన్ని సూచించేదే మంత్రం. భగవంతునికి సహస్రనామాలు ఉన్నాయి. అందువల్ల భగవంతుని వివిధ నామాలతో కూడిన అనేక మంత్రాలు ఉన్నాయి. భగవన్నామం స్మరించినప్పుడు భగవంతుని రూపాన్ని చూడగలగాలి. అలాగే భగవంతుని రూపాన్ని చూసినప్పుడు భగవన్నామం గుర్తుకురావాలి. భగవంతుడు, భగవంతుని నామం వేరుకాదు.



మంత్రమంటే కొన్ని పదాల సముదాయం మాత్రమే కాదు. భగవంతుణ్ణి గుర్తుంచుకోవడానికి ఓ మార్గం. ప్రతీ మంత్రం హ్రీం, క్లీం లాంటి బీజాక్షరాలతో ఉంటుంది. వీటినే బీజమంత్రాలు అంటారు. మంత్రోపదేశం అనే ప్రక్రియ గురువు నుండి శిష్యునికి పరంపరాగతంగా వస్తూ ఉంది. గురువు మంత్రోపదేశం ద్వారా తన శక్తిని శిష్యునికి ప్రసాదిస్తాడు. గురువు నుండి స్వీకరించిన మంత్రాన్ని నిష్ఠతో జపించినప్పుడు మనస్సు పరిశుద్ధమై భగవంతునిపై ఏకాగ్రమవుతుంది.

భగవంతుని పాదాల వద్దకు చేర్చేశక్తి మంత్రానికి ఉంది. అయినప్పటికీ మంత్రశక్తిని పూర్తిగా అర్థం చేసుకోవాలంటే పవిత్రజీవనం గడపాలి. భగవంతుని పట్ల సంపూర్ణ భక్తిని కలిగివుండాలి. మంత్ర మాహాత్మ్యాన్ని కేవలం మన బుద్ధి ద్వారా అర్థం చేసుకోవడం సాధ్యం కాదు.

నిరంతరం భావపారవశ్యంలో ఉన్న చైతన్య మహాప్రభువు కూడా విలపిస్తూ ఇలా భగవంతుణ్ణి ప్రార్థించేవారు:

నామ్నామకారి బహుధా నిజ సర్వ శక్తిః
తత్రార్పితా నియమితః స్మరణేన కాలః
ఏతాదృశి తవ కృపా భగవన్ మమాపి
దుర్దైవం ఈదృశం ఇహాజాని నానురాగః

"ఓ భగవాన్! అనంతశక్తిగల ఎన్నో నామాలు నీకు ఉన్నాయి. నీ నామాన్ని స్మరించడానికి నిర్దిష్ట సమయమంటూ ఏమీ లేదు. అయినప్పటికీ నాకు నీ నామం పట్ల ప్రీతి జనించకపోవడం నా దురదృష్టంగా భావిస్తున్నాను".

భగవన్నామామృతాన్ని గ్రోలి నిరంతరం తన్మయత్వంలో మునిగివున్న చైతన్య మహాప్రభువు కూడా భగవన్నామ రుచిని పూర్తిగా ఆస్వాదించలేకపోతున్నానని వ్యధ చెందడం ఎంతో ఆశ్చర్యకరంగా తోస్తుంది. కానీ చైతన్య మహాప్రభువు భగవత్ పారవశ్యంలో ఉన్నప్పటికీ ఇంకా అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారంటే ఆయనకున్న వ్యాకులత ఎంత తీవ్రమైనదో మనం ఊహించవచ్చు.

భగవన్నామాన్ని ఆర్తితో, శ్రద్ధతో, భక్తితో, విశ్వాసంతో జపించాలి. కేవలం ఆర్తి లేకుండా భగవన్నామాన్ని ఉచ్చరించడం వల్ల అంతగా ప్రయోజనం ఉండదు. 'భగవన్నామాన్ని విశ్వాసంతో ఒక్కసారి ఉచ్చరిస్తేచాలు మన భవబంధాలన్నీ తెగిపోతాయి' అని అంటారు శ్రీరామకృష్ణులు.

మంత్రోపదేశం స్వీకరించి శ్రద్ధతో, సహనంతో సాధన చేసిన ఎంతోమంది సాధకులు భగవత్సాక్షాత్కారాన్ని పొందారు. కాబట్టి భగవత్సాక్షాత్కారానికి మంత్రదీక్ష ఓ సాధనం. ❖

పండుగలు-పర్వదినాలు

ఏప్రిల్ - 2014

08	మంగళవారం	: శ్రీరామనవమి
11	శుక్రవారం	: ఏకాదశి
25	శుక్రవారం	: ఏకాదశి

మే - 2014

02	శుక్రవారం	: అక్షయ తృతీయ
04	ఆదివారం	: శ్రీరామానుజాచార్య, ఆదిశంకరాచార్య జయంతి
12	సోమవారం	: నృసింహ జయంతి
14	బుధవారం	: బుద్ధ పూర్ణిమ
23	శుక్రవారం	: హనుమజ్జయంతి



మరణంలోనూ జీవిద్దాం

– చక్కిలం హేమంత్‌కుమార్

ఏకాంతం వేరు. ఏకాకిత్వం వేరు. మనం వెదకవలసింది ఏకాంతం. ఏకాకిత్వం కాదు. ఏకాంతం ఆనందాన్నిస్తుంది. ఏకాకిత్వం ఆవేదనను మిగులుస్తుంది. నిజానికి సన్యాసి అయినా, విరాగి అయినా, ఋషి అయినా ఏకాకిగా బ్రతకలేరు. వారు కోరుకునేది ఏకాంతం. ఏకాకిత్వం కాదు. మనిషి సంఘజీవి. ఇతరులతో సంబంధం లేకుండా, ఇతరుల ప్రమేయం లేకుండా ఎవడూ బ్రతకలేడు. అసలు సృష్టి క్రమమే అది కాదు. ఉద్దేశమూ కాదు. అలా ఒంటరి మానవుడు సున్నతో సమానం. కేవలం సున్నకు విలువ లేదు. ఉనికి లేదు. దాని ప్రక్కన ఒకటి చేర్చాల్సిందే. ఈ లెక్కలు మిగిలిన జీవులకు తెలీవు. తెలీకపోయినా ఆ అమాయకత్వం వాటికి సంఘ జీవనాన్ని నేర్పింది. పరస్పర సహకారాన్ని నేర్పింది. మరి మనిషి? ఆలోచన, విచక్షణ, మానవత్వం... జీవితాన్ని మరింత అందంగా, అమృతమయంగా జీవించే అవకాశాన్ని ఇచ్చాయి. మనం వాడుకోవడం లేదు. అంతే.

'నేను' అని కాకుండా, 'మనం' అనే భావనను ఆవాహన చేసుకున్నప్పుడు మనం... అందరం. మనకున్నది అందరిదీ. మనలో ఆ దృక్పథం ఉంటే మన పట్ల ఇతరులకూ ఆ వైఖరి అనాలోచితంగా, అప్రయత్నంగా అలవడుతుంది. మనం ఎప్పుడో ఒకప్పుడు మరణిస్తాము. తప్పదు. అది తెలిసినా సంపాదించుకున్న దాన్ని మరణించే లోపల ఖర్చు పెట్టుకోవాలనుకోము. ఎందుకు? ఆ తుది క్షణం ఎప్పుడో మనకు తెలీదు కాబట్టి. అంతకన్నా ముఖ్యంగా మన తర్వాత మన పిల్లలు ఆ సంపదను అనుభవించాలి కాబట్టి. అంటే 'మన' అనే ఆలోచనే మనల్ని త్యాగం వైపు ప్రేరేపిస్తోంది.

ఆ త్యాగం ఎవరి కోసం? 'నా' కోసం. 'మా' కోసం. నా వాళ్ళంటే మన సొంత పిల్లలేనా? ఎందుకు మన ఆలోచనా విధానాన్ని ఇంత సంకుచితం చేసుకున్నాం! మన దృక్పథాన్ని ఇంత ఇరుకు చట్రంలో బిగించుకున్నాం! ఈ ప్రపంచం గురించి మనం ఆలోచించమా? సమాజ శ్రేయస్సు గురించి పట్టించుకోమా? ఈ సమాజం లేకపోతే? ఈ ప్రపంచం లేకపోతే? ఇంకా.... ఈ విశ్వం లేకపోతే మనం ఎక్కడ ఉండేవాళ్ళం? సూర్యుడు, చంద్రుడు, గ్రహాలు, ఋతువులు, నదులు, తరువులు, ఎండలు, వానలు మొత్తం ప్రకృతి...! ఈ చరాచర ప్రకృతి అనుక్షణం మనకు ఆసరాగా నిలబడింది. అమ్మలా లాలిస్తోంది. గోరుముద్దలు తినిపిస్తోంది. జబ్బు చేస్తే బజ్జోబెట్టి మందు పట్టిస్తోంది. మనం తినే తిండి, కట్టే బట్ట, ఉండే ఇల్లు... ఇవన్నీ ఎక్కడివి? ఎవరివి? అందరివీ. ఎందరో ఇచ్చినవి. మనం వాళ్ళకేమిస్తున్నాం? బంగారు కణికలు మనం దాచుకుని చిల్లర పైసలు విసిరేస్తున్నాం. లేదా కక్కుర్తిగా నోట్ల రూపంలో దాచుకుని ఎలుకలపాలు చేస్తున్నాం. దీనికంతా కారణం 'నాది, నా వాళ్ళు' అనే భావమే. అందరూ నా వాళ్ళయితే? మనవాళ్ళయితే?

మనిషి మహాత్ముడిలా బ్రతకవలసిన నిర్బంధం లేదు. మనిషిగా బ్రతికితే చాలు. అది అతడి త్యాగమో, గొప్పతనమో కాదు. అది అతడి ధర్మం. ఇందు కోసం మనం ఏదో చేయవలసిన అవసరం లేదు. సమాజానికి మేలు సంగతి తర్వాత, ముందు కీడు చేయకుండా ఉంటే చాలు. ఉన్నచోటు నుండి కదలలేని చెట్టులా, పుట్టలా బ్రతికితే చాలు. అవి జీవించినప్పుడే కాదు, మరణంలోనూ మంచినే చేస్తాయి. ప్రకృతి సర్వం అంతే... ఒక్క మనిషి తప్ప. మనం కూడా వాటిని ఆదర్శంగా తీసుకుంటే కనీసం మనుషులుగా మనగలం. మరణంలోనూ జీవించగలం. ❖


పరుల కోసమే చెట్లు పండ్లను ఇస్తున్నాయి; పరుల కోసమే నదులు ప్రవహిస్తున్నాయి; పరుల కోసమే గోవులు పాలను ఇస్తున్నాయి; ఈ శరీరం పరోపకారార్థమే కదా! - భర్తృహరి నీతి శతకం



ఆనందానికి ఆధారం!

– స్వామి తురీయానంద*

ఆహారం విషయంలో శ్రీరామకృష్ణులు చెప్పిన సలహా అత్యుత్తమమైనది. 'మనస్సును భగవంతుని మీద స్థిరంగా నిలపడానికి ఏ ఆహారం ఉపయోగపడుతుందో, అది ఉత్తమోత్తమమైన ఆహారం'. ఆహారం సాత్త్వికమైనదా? కాదా? అనే విషయాన్ని తీర్మానించుకోవడానికి ఇదే మార్గం. ఎందుకంటే సాత్త్వికస్వభావం మనస్సును దేవుని వైపు మళ్ళిస్తుంది. స్వామి వివేకానంద తన 'భక్తియోగం'లో ఆహార విషయాన్ని విస్తారంగా చర్చించారు.



స్వామి తురీయానంద

శరీరాన్నీ, మనస్సునూ ఏ ఆహారం ఆరోగ్యవంతంగా ఉంచుతుందో ఆ ఆహారాన్ని తీసుకోవాలి. మనస్సును భగవంతునిపై ఉంచడమే సాధకుని ప్రధాన లక్ష్యం. శరీరం ఆరోగ్యంగా ఉంటే మనిషి భగవంతుణ్ణి ధ్యానించగలడు. కాబట్టి శరీరాన్ని ఆరోగ్యవంతంగా ఉంచి, పారమార్థిక సాధన తీవ్రంగా కొనసాగించాలి.

పరిస్థితులు ఎల్లప్పుడూ అనుకూలంగా ఉండవు. కాబట్టి భగవంతుడు ఏ పరిస్థితిలో ఉంచినా, సాధనను కొనసాగించాలి. సదా ఆయనను చింతిస్తూ, ఆయనపై పూర్తిగా ఆధారపడడం కన్నా ధన్యత పొందడానికి మరో మార్గం లేదు. భగవంతునికి పూర్తిగా సమర్పించుకున్నప్పుడు, పూర్తి ప్రయోజనం కలుగుతుంది. ఇదే సత్యం. ఈ విషయంలో మహాపురుషులంతా ఏకాభిప్రాయం కలిగి ఉన్నారు. ప్రతికూలమైన పరిస్థితులలో కూడా భగవంతుణ్ణి స్మరిస్తూ, ఆ పరిస్థితుల్ని అధిగమించేవాడే జ్ఞాని.

భగవంతుడు ఏది తలిస్తే అది జరుగుతుంది. నిస్సందేహంగా అది మన మంచికే జరుగుతుంది. కానీ, వచ్చిన చిక్కేమంటే మనం దీన్ని అర్థం చేసుకోం సరి కదా, మనకు ఆ ఓర్పు కూడా ఉండదు. భగవంతుడు ఏమి చేసినా అది మన మంచికేనని మనం విశ్వసించగలిగితే, శాంతి కలగడానికి అంతకన్నా మంచి మార్గం మరొకటి లేదు. మనిషికి ఈ అవగాహన లేకపోతే మనశ్శాంతి ఉండదు. శరీరం ఉన్నంతవరకూ సుఖదుఃఖాలు, వ్యాధులు, విషాదాలు అనివార్యాలు. కానీ, నాకు సుఖమిచ్చేది మంచిదనీ, బాధ కలిగించేది చెడ్డదనీ తలచడం సరైనది కాదు. ఇది కేవలం స్వార్థపరత్వమే. సుఖంలోగాని, దుఃఖంలోగాని, వ్యాధిలోగాని, విషాదంలోగాని భగవంతుడు మనల్ని ఎల్లప్పుడూ కలత చెందకుండా ఉంచుగాక! ఏ పరిస్థితిలోనైనా మనకు సరైన అవగాహన ఉండుగాక!

శరీరం గురించి అంత ఆలోచన ఎందుకు? పెరగడం, క్షీణించడం, మరణించడం శరీర స్వభావాలు. కానీ శరీరంలో పెరగని, చావని వాడొకడున్నాడు. అతణ్ణి దర్శించడానికి ప్రయత్నించు!

దివ్యజనని విధానాలను అర్థం చేసుకోవడం కష్టం. "ఆ దేవి, ఆ భగవతి, ఆ మహామాయే జ్ఞానుల మనస్సులను కూడా ప్రబలంగా ఆకర్షించి మోహగ్రస్తుల్ని చేస్తోంది సుమా!" (దేవీ మాహాత్మ్యం, 1.55). జ్ఞానుల స్థితే ఇలా ఉంటే సామాన్యజనుల విషయం వేరే చెప్పాలా? ఎవరు దివ్యజననిని ఎల్లప్పుడూ ప్రార్థిస్తూ ఉంటారో వారే క్షేమంగా ఉంటారు.

లోకంలో ప్రజలు ఈ విషయాన్ని తెలుసుకోరు: "ఎండిన పిడక కాలుతుంటే, తాను కూడా ఒక రోజు కాలిపోతాననే విషయం తెలుసుకోకుండా పచ్చిపేడ నవ్వుతుంది."

దివ్యభావంలో లీనమైపోగలిగితే బాహ్యవిషయాల గురించి కలత చెందనక్కరలేదు. ఈ విషయంలో భగవంతుని కరుణ ఒక్కటే ప్రధానమైన ఆధారం. ❖

(*భగవాన్ శ్రీరామకృష్ణుల ప్రత్యక్ష సన్న్యాస శిష్యులు)

ఉండేది రాముడొకడు ఊరక చెడిపోకు మనసా!

– స్వామి అర్చనానంద



అది తిరువాయూరు. మహా రామభక్తుడు, వాగ్గేయకారుడు అయిన శ్రీత్యాగరాజస్వామి జన్మస్థలం. పవిత్ర కావేరీ తీరం. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన త్యాగరాజ స్వామి ఆరాధనోత్సవాలు వైభవోపేతంగా జరుగుతున్నాయి. త్యాగరాజస్వామి సమాధి మందిరం ఎదురుగా కూర్చుని వందలాది కళాకారులు శ్రీత్యాగరాజస్వామి వారి 'పంచరత్న కీర్తనలు' ఆలపిస్తూ, వివిధ వాద్యాలు వాయిస్తూ ఉంటే... ఆహా! చూసిన వారి జన్మ ధన్యం! విన్నవారి వీనులు ధన్యం!

ఆ ఆరాధన రోజు ఉదయమే త్యాగరాజస్వామి వారి సమాధి మందిరంలో సుప్రభాతసేవ అయిన తరువాత మందిర ప్రదక్షిణం చేస్తూ ఉండగా 'ఉండేది రాముడొకడు ఊరక చెడిపోకు మనసా!' అని గర్భమందిరం గోడపై రాసి ఉన్న త్యాగరాజస్వామి కీర్తన మొదటి పంక్తి చదవగానే జన్మ జన్మల మాయా మోహాలకు పిడుగు పడినట్లయ్యింది! అజ్ఞాన తిమిరాంధకారంలో ఆత్మజ్యోతి ప్రకాశించినట్లయ్యింది! అదీ ఆ మహానుభావుడు శ్రీత్యాగరాజ స్వామి వారి ఆధ్యాత్మిక శక్తి.

'ఉండేది రాముడొకడు ఊరక చెడిపోకు మనసా!' – ఎంత నిత్య సత్యమిది! మనస్సుకు మనమే ఇలా బోధించాలి, శిక్షణ నివ్వాలి, మనస్సును మచ్చిక చేసుకోవాలి! లేకపోతే శిక్షణ, బోధన, పవిత్రత లేని ఆ మనస్సు మనల్ని అధః పాతాళానికి తోసివేస్తుంది! 'మన ఏవ మనుష్యాణాం కారణం బంధ మోక్షయోః – మనుష్యుల సంసార బంధానికైనా, మోక్షానికైనా మనస్సే కారణం' అని అమృతబిందూపనిషత్తు చెబుతోంది.

“ఈ మనస్సు చాలా విచిత్రమైనది, కోతి లాంటిది. ఆ కోతి 'కోరిక' అనే కల్లు త్రాగింది. దానికి 'అసూయ' అనే తేలు కుట్టింది. ఇది సరిపోదన్నట్లు దానికి 'అహంకారం' అనే దయ్యం పట్టింది. ఇక ఆ మనస్సు అనే కోతి గతి ఏమిటో ఊహించండి! 'ఈ మనస్సనే కోతిని నియంత్రించి, శిక్షణ నిచ్చి, వశం చేసుకోవడమే ఆధ్యాత్మిక సాధన' అన్నారు స్వామి వివేకానంద తమ 'రాజయోగం' ప్రవచనాలలో.

శరీరానికి పౌష్టిక ఆహారం, వ్యాయామం, యోగాసనాలు మొదలైనవి అందించి దానిని ఆరోగ్యంగా ఉంచుకొంటాం. శారీరక బలం, రోగనిరోధక శక్తిని పెంచుకుంటాం. మరి మన అన్ని వ్యవహారాలకూ మూల కేంద్రమైన 'మనస్సు' ఆరోగ్యంగా ఉండడానికి ఏం చేస్తున్నాం? ఆ మనస్సు బలహీనమై, కామక్రోధాది ఆరుగురు శత్రువులకూ లొంగిపోకుండా, మనస్సులో 'భోగనిరోధక శక్తి'ని పెంచుకోవడానికి ఏం చేయాలి?

వాతావరణంలో, మన ఇంటి పరిసరాలలో, మన శ్వాసలో ఎన్నో రోగాలను కలిగించే సూక్ష్మ కీటాణువులు, బ్యాక్టీరియా మొదలైనవి వేలల్లో ఉంటాయి. కానీ మన శరీరం మంచి ఆరోగ్యంతో, పౌష్టికాహారంతో స్నానాది శుచీ శుభ్రతలతో దృఢంగా, బలంగా ఉంటే, మన దృఢ శరీరానికి ఆ వేలాది రోగకారక సూక్ష్మ క్రిములు, బ్యాక్టీరియాలు ఏ హానీ చేయలేవు. దానినే 'రోగ నిరోధక శక్తి' అంటాం. అలాగే మనలో ఉన్న కామం, క్రోధం, లోభం, మోహం, మదం, మత్సరం మొదలైనవి హానికారక దుర్గుణాలు. ఆ చెడు అలవాట్లను ప్రేరేపించే భోగ వస్తువుల ప్రలోభాలనూ, ఆకర్షణలనూ, దాడులనూ తట్టుకొని గట్టిగా నిలబడి, ఆ 'భోగకారక వైరస్'ను తిప్పికొట్టడానికి అత్యవసరమైనది 'భోగ నిరోధక శక్తి' – మానసిక శక్తి, ఇచ్ఛాశక్తి. జపధ్యాన ప్రార్థనాది ఆధ్యాత్మిక సాధనల ద్వారా 'భోగనిరోధక శక్తి'ని వృద్ధి చేసుకోవాలి.

ఈ మానసిక శక్తినీ, భోగనిరోధక శక్తినీ పెంచుకోవడానికి మన విద్యారంగంలో పిల్లలకు, విద్యార్థులకు, యువకులకు

(మిగతా 32వ పేజీలో...)

మనస్సు, మానవుణ్ణి అగ్నికంటే తీక్షణంగా దహిస్తుంది. మాంసాన్ని వెన్నంటే కాకిలా ఇంద్రియ విషయాల వెనుక పరుగులు పెడుతుంది. మనస్సు దేనియందూ స్థిరంగా ఉండదు. - శ్రీరాముడు

కీర్తి కాంక్ష

–స్వామి భాస్కరానంద



ప్రాపంచిక వ్యక్తులు అపురూపంగా భావించుకునే కామినీకాంచనాలను ఆధ్యాత్మిక మార్గాన్వేషకులు సాధనతో సులభంగా జయించవచ్చు. కానీ అంతటి వాళ్ళకు కూడా అత్యంత కష్టసాధ్యమైన విషమ పరీక్ష కీర్తికాంక్షను అధిగమించడం! అందుకే స్వామి వివేకానంద 'craving for name and fame was the last infirmity of noble souls – మహామహులైనవారికి కూడా పేరుప్రతిష్ఠల తాపత్రయం మహా అవరోధ'మంటారు. ఎన్నెన్నో ఆధ్యాత్మిక సాధనలు చేసిన వ్యక్తులు కూడా ఈ పేరుప్రఖ్యాతుల ఊబిలో పడిపోతారు. సాధారణ ప్రజలు లౌకిక భోగాల్లో పడి కీర్తిప్రతిష్ఠల గురించి పెద్దగా పట్టించుకోరు. కానీ సర్వసంగపరిత్యాగులుగా జీవించాలనుకునేవారిని మాత్రం ఈ కీర్తికండూతి తప్పుదోవ పట్టిస్తుంది.

శ్రీరామకృష్ణ సంఘానికి చెందిన ఓ సాధువు ఎంతో నిష్ఠ గల సన్న్యాసి. పేరున్న విశ్వవిద్యాలయాల నుంచి ఎన్నో పట్టాలను పొందిన ఉన్నత విద్యావంతులు. ఆయన రామకృష్ణ సంఘంలో చేరిన తరువాత ధార్మిక సంబంధమైన విషయాలపై పరిజ్ఞానాన్ని పెంచుకోవడమే కాక, వాటిపై ఎన్నో వ్యాసాలు, పుస్తకాలు రచించారు. ఆ సాహిత్యాన్ని సంఘం తరఫున గ్రంథాలుగా ఆవిష్కరించి, విడుదల చేశారు. వరిష్ఠ సాధువుగా, ఆధ్యాత్మికవేత్తగా, సన్న్యాస ధర్మాలకు సంబంధించి వారికి రామకృష్ణ సంఘంలో ఎంతో గౌరవముంది. రచయితగా కూడా వారిని ఎందరో అభిమానించేవారు.

ఆ సాధువుకి అప్పుడు డెబ్భై ఏళ్ళు. అమెరికన్ ప్రచురణ సంస్థ ఒకటి వారి ఆధ్యాత్మిక సాహిత్యాన్ని సంపుటాలుగా ప్రచురించాలని భావించి, వారిని సంప్రతించింది. అయితే ఆ పుస్తకాలపై ప్రచురణ హక్కులన్నీ రామకృష్ణ సంఘానికే ఉన్నాయి. అమెరికన్ ప్రచురణ సంస్థ ఆ పుస్తకాలను ముద్రించుకునే అవకాశం లేదు. అందుకే రచయితగా ఆ సాధువు అనుమతి కోసం రామకృష్ణ సంఘ ప్రధాన కార్యదర్శిని సంప్రతించారు. అయితే సంఘం ప్రచురించిన పుస్తకాలను ఇతర ప్రచురణ సంస్థలు ముద్రించే అవకాశం లేదనీ, నిర్ణీత గడువు తీరిన తరువాత వారు ప్రచురించుకొనవచ్చనీ, అప్పటి వరకు అనుమతినివ్వడం అసాధ్యమనీ స్పష్టం చేశారు.

కానీ ఆ సాధువు చాలా పట్టుబట్టారు. ఎలాగైనా తన పుస్తకాలను ముద్రించే అవకాశం అమెరికన్ ప్రచురణ సంస్థకు ఇవ్వాలని భీష్మించుకు కూర్చున్నారు. అయితే సంఘంలో ఉండగా అది సాధ్యపడదని సంఘ వరిష్ఠ సాధువులు తేల్చిచెప్పారు. కీర్తికాంక్షలో పడిన ఆ సాధువు, సోదర సన్న్యాసులు ఎంత చెప్పినా వినకుండా, రామకృష్ణ సంఘం నుంచి బయటకు వెళ్ళిపోయారు.

ఒంటరి సన్న్యాసిగా వారు తొలి రోజుల్లో బంధువుల ఇంట్లో ఉన్నారు. ఎన్నో ఏళ్ళు సాధుసంఘంలో కలిసి జీవించడం అలవాటైన ఆయనకి గృహస్థుల మధ్య అసౌకర్యంగా అనిపించింది. అందుకే పరివ్రాజకుడిగా వారణాసి వెళ్ళిపోయి, అక్కడే ఓ కుటీరంలో ఉండసాగారు. సరైన సౌకర్యాలు లేని ఓ చిన్నగదిలో సర్దుకుపోయి జీవనాన్ని కొనసాగిస్తూ, భిక్షాటన చేసుకుంటూ పొట్టపోసుకునేవారు. వారణాసిలో రామకృష్ణ మఠానికి సంబంధించి రెండు కేంద్రాలున్నాయి. అందులో ఒకటి పూర్తిగా వైద్యసేవలకు సంబంధించిన ధార్మిక ఆసుపత్రి కేంద్రం. ఆ కేంద్రానికి చెందిన సన్న్యాసులు, ఆ సాధువును తిరిగి తమ సంఘంలోకి రమ్మని ఎంతో ప్రాథేయపడ్డారు. కానీ ఆయన నిరాకరించారు. అయినా రామకృష్ణ సంఘ సాధువులు ఎప్పటికప్పుడు ఆయన ఆరోగ్యం గురించి, బాగోగుల గురించి వాకబు చేస్తూనే ఉండేవారు. కొన్ని నెలల తరువాత ఆయన వారణాసిలో తీవ్ర అస్వస్థతకు గురై, మంచం నుంచి లేవలేని పరిస్థితికి చేరుకున్నారు. రామకృష్ణ సంఘ సాధువులు వారిని ఆసుపత్రికి తరలించి, అక్కడే సపర్యలు చేయసాగారు. రామకృష్ణ సంఘం నుంచి తాను వెళ్ళిపోయినా, సోదరసాధువులు అదేమీ మనస్సులో పెట్టుకోకుండా తనకు సేవ చేయడాన్ని చూసి ఆయన విచలితులై, 'నేను సంఘాన్ని కాదనుకొని వెళ్ళిపోయాను కదా! అయినా మీరు ఎందుకు నన్ను ఇక్కడికి తీసుకువచ్చి, సేవలు చేస్తున్నారు?' అని ప్రశ్నించారు. అప్పుడు రామకృష్ణ మఠం సాధువులు 'మీరు సంఘాన్ని కాదనుకొని వెళ్ళిపోయి ఉండవచ్చు; కానీ సంఘం మిమ్మల్ని కాదనుకోలేదు' అన్నారు. తరువాత వారికి కావలసిన వైద్యసేవలు అందించారు. అయినా రెండు మూడు నెలలకు ఆయన తుదిశ్వాస విడిచారు. 'మహాత్ములైనవారికి కూడా కీర్తికాంక్ష మహా అవరోధం' అన్న స్వామీజీ మాటల్లో ఎంతో సత్యం దాగి ఉంది. ❖

ఆకలి బాధను తీర్చాకే ఆధ్యాత్మిక బోధలు!



ప్రపంచమంతా తిరిగి చూసిన తర్వాత ఇతర దేశ ప్రజలతో పోలిస్తే ఈ దేశ ప్రజలు గాఢ తమస్సులో మునిగి ఉన్నట్లు నాకనిపించింది. బాహ్యంలో సత్వగుణం కనిపిస్తుంది. కానీ అంతరంగంలో కేవలం రాయిరప్పల్లా జడత్వ స్థితిలో ఉన్నారు. అలాంటి వారి వల్ల లోకంలో ఏం పని జరుగుతుంది? ఎంతకాలం ఇలాంటి జడులు, సోమరులు, ఇంద్రియలోలులు ఈ లోకంలో బ్రతికి బట్టకడతారు?

పాశ్చాత్య ప్రజల జీవితాల్లో ఏమి సాహసం! ఏమి కర్మ పరత్వం, ఏమి ఉత్సాహం! ఇక మనవాళ్ళు పక్షవాతంతో చచ్చుపడిపోయినట్లున్నారు. ప్రజల్ని ఉత్తేజపరచి వారిని కార్యోన్ముఖుల్ని చేయాలి. ఆ విధంగా జీవితంలో కష్టనష్టాలను ఎదుర్కొనే సామర్థ్యమున్నవారిగా చేయాలని నా ఉద్దేశం. శరీరంలో బలం, గుండెల్లో ఉత్సాహం, బుద్ధిలో స్వతంత్ర ఆలోచన లేకుండా – ఈ మట్టి గడ్డలు – ఏం చేయగలవు? ప్రోత్సాహాన్ని కలిగించి, వాళ్ళను సజీవ చైతన్య మూర్తులుగా తయారుచేయాలనేదే నా జీవితాశయం! ఈ పనికే నా జీవితాన్ని అంకితం చేశాను. వేదమంత్రాలలో ఉండే అమోఘశక్తి వల్ల వాళ్ళను మేల్కొల్పుతాను. "లేవండి! మేల్కోండి" అనే అభయ సందేశాన్ని చాటడానికే నేను జన్మించాను.

ఈ దేశ ప్రజలలో ఉన్న అంతశ్శక్తిని మేల్కొల్పి, వారిని స్వయంశక్తిపై ఆధారపడి జీవించేలా చేయాలి. మొదట మంచి ఆహారం, చక్కని దుస్తులు, కావలసినంత సౌఖ్యానందం కలిగే మార్గాలు నేర్పి, ఆ తర్వాత ఈ భోగబంధం నుండి విముక్తి చెందే మార్గం బోధించండి.

సోమరితనం, నీచత్వం, మోసం – ఇవే ఈ దేశాన్ని అన్నివైపులా కప్పివేశాయి. బుద్ధిమంతుడైనవాడు దీన్నంతా చూసి శాంతంగా కూర్చోగలడా?

మీరు గొప్ప విద్యావంతులనుకుంటున్నారు కాబోలు! ఎలాంటి నిష్ప్రయోజనమైన విద్యను మీరు నేర్చుకున్నారో తెలుసా? ఇతరుల భావాలను పరభాషలో కంఠస్థం చేసి, ఆ భావాలను మీ బుద్ధిలో నింపి, దాని ద్వారా కొన్ని విశ్వవిద్యాలయాల డిగ్రీలు సంపాదించి మేం విద్యావంతులం అనుకుంటున్నారు. ఛీ! ఇదీ ఒక విద్యేనా? మీ విద్యకు లక్ష్యమేమిటి? గుమస్తాగిరీనా? లేక మోసం చేసే లాయరు పదవా? మహా అయితే ఒక డిప్యూటీ మేజిస్ట్రేట్ పదవి పొందగలరేమో? అది కూడా మరోవిధంగా పెద్ద గుమస్తా పదవి లాంటిదే! అంతేకదా! అది నీకుగాని, లేక దేశానికిగాని ఏం ప్రయోజనం కలిగిస్తుంది? కళ్ళు తెరిచి చూడండి. రత్నగర్భగా ప్రసిద్ధిపొందిన ఈ భారతభూమిపై 'అన్నమో! రామచంద్రా!' అని విలపిస్తున్నవారెందరో! ఆ కొరతను మీ విద్య తీర్చగలదా? తీర్చలేదు.

పాశ్చాత్య విజ్ఞానశాస్త్ర సహాయం ద్వారా స్వయంకృషితో ఎక్కువగా పంటలు పండించే విధానాలను నేర్పి దేశప్రజల్ని కార్యతత్పరులను చేయండి. దాని వల్ల వారు తమకు కావలసిన అన్నవస్త్రాలను తామే సంపాదించుకోగలుగుతారు. అన్నవస్త్రాలు లేకపోవడం వల్ల, వాటికై వెంపర్లాడడం వల్ల దేశానికి వినాశస్థితి వచ్చింది. దీన్ని తొలగించడానికి మీరేం చేస్తున్నారు? మీ శాస్త్రాలన్నీ కట్టగట్టి గంగలో పారవేసి మొదట ప్రజలకు అన్నవస్త్రాలను సంపాదించుకునే విధానాలను బోధించండి. ఐహిక అవసరాలు తీరకపోతే, పారమార్థిక విషయాలు ఎవరూ వినరు. అందువల్ల మొదట ఆహారం సంపాదించుకొనే విధానాన్ని వారికి నేర్పి, తర్వాత ధర్మాన్ని బోధించండి. సోమరులుగా కూర్చోడానికి సమయం లేదు.

సకాలంలో ఈ కార్యతత్పరత, ఆత్మవిశ్వాసం ఈ దేశ ప్రజలకు కలిగితీరుతుంది. దీన్ని నేను స్పష్టంగా చూస్తున్నాను. ❖

అన్నవస్త్రాలను సంపాదించుకొనే విధానాలను ప్రజలకు బోధించండి. ఐహిక అవసరాలు తీరకపోతే, పారమార్థిక విషయాలు ఎవరూ వినరు. వారిలో కార్యతత్పరతను మేల్కొల్పండి. - స్వామి వివేకానంద



జీవన్ముక్తికి రామచరణ భక్తి

– స్వామి శుద్ధసత్త్వానంద

వాల్మీకి రామాయణం మూల రామాయణం. ఆ పైన వివిధ భాషల్లో అనేక రామాయణాలు వచ్చాయి. ఒక్కొక్క రామాయణానికి ఒక్కో వైశిష్ట్యం. తులసీదాసు రామాయణంలో ఆది నుండి అంతం వరకు శ్రీరామచంద్రుని పట్ల అనన్య భక్తి ప్రకాశిస్తుంది. అది దానిలోని విశిష్టగుణం. హనుమంతుణ్ణి 'రామగత ప్రాణ' అంటారు. అలాగే తులసీదాసు కూడా రామమయ ప్రాణి. భవసాగరాన్ని దాటడానికి రామనామమే నావ అన్నది ఆయనకున్న సంపూర్ణ విశ్వాసం.

దండక వన కీన్హా సోహావన్
జనమన అమిత నామ కియా పావన్!
నిసిచర నికర దలే రఘునందన్
నామూ సకల కలి కలుష నికందన్ –

'రామచంద్రుడు దండకారణ్యాన్ని పవిత్రం చేశాడు. రామనామం అసంఖ్యాక జనులను పునీతుల్ని చేసింది. రాముడు నిశాచరులను సంహరించాడు. రామనామం కలియుగంలో సకల దోషాలను నాశనం చేస్తుంది' అంటాడు తులసీదాసు.

తులసీదాసు 1497వ సంవత్సరంలో ఉత్తర ప్రదేశ్‌లో రాజ్‌పూర్ గ్రామంలో జన్మించాడు. ఈయన తల్లితండ్రులు ఆత్మారామ్, హులసి. పుట్టిన వెంటనే శిశువు ఏడవడానికి మారుగా 'రాం రాం' అన్నాడట! పుట్టిన వెంటనే రామ శబ్దం ఉచ్చరించాడని శిశువును 'రామ్‌బోలా' అని పిలవనారంభించారు. పుట్టిననాటికే నోట్లో 32 దంతాలు ఉన్నాయట! పెద్దలు, జ్యోతిష్కులు ఇవి శుభలక్షణాలు కావని సిద్ధాంతీకరించారు. పుత్రుడు జన్మించిన నాలుగోనాడు తల్లి తీవ్రమైన అనారోగ్యం పాలయింది; తల్లి హులసి తాను మరణిస్తే 'తల్లిని పొట్టన పెట్టుకున్నాడని లోకం నిందిస్తుంద'ని భావించి, దాసికి అనేక ఆభరణాలిచ్చి పిల్లవాడిని పెంచమని ఆమెను వేడుకొంది. దాసి ఆ పిల్లవాడిని తన స్వగ్రామానికి తీసుకుపోయింది. అప్పుడు తల్లి హృదయం శాంతించింది. ఆ మర్నాడే ఆమె కన్నుమూసింది.

దాసి ఆ బాలుణ్ణి తన అత్తకు అప్పచెప్పింది. బాలుడికి ఐదేళ్ళు వచ్చిన తరువాత ఆమె అత్త పాము కాటుతో మరణించింది. తండ్రి ఆత్మారామ్‌కు కబురు పంపారు. కానీ, ఆయన ఆ పసి బాలుణ్ణి తీసికొనిపోవడానికి నిరాకరించాడు. అందువల్ల ఆ బాలుడు ఆకాశమే కప్పుగా జీవిస్తూ భిక్షాటనతో కడుపు నింపుకొనేవాడు. బాల్యంలో తులసీదాసు పడ్డ కష్టాలు వర్ణిస్తే గుండె చెరువు అవుతుంది.

తులసీదాసు తన బాల్యం గురించి ఇలా చెప్పుకున్నాడు: "పుట్టిన వెంటనే తల్లితండ్రులకు దూరమైన నేను ఎన్నో అవమానాలు, దండనలు భరిస్తూ శాపగ్రస్థునిలా జీవించాను. నాకున్న ఆస్తి ఒక్క అతుకులబొంత, ఒక మట్టికుండ మాత్రమే. ఇళ్ళ ముందు కుక్కలా నిలబడి భిక్ష అడిగేవాడిని. వారి అవహేళన, కఠినమైన మాటలు నాకు దుఃఖం కలిగించేవి".

ఈ విధంగా కష్టాలు అనుభవిస్తుండగా నరహరిదాసు అనే సాధువు దృష్టిలో పడ్డాడు. ఆయన సుప్రసిద్ధ వైష్ణవ సాధువు. రామానందుల శిష్యులు. రామానందులు రామభక్తులు. ఆ సంప్రదాయంలో చేరిన రామ్‌బోలా, శ్రీరామచంద్రుల పట్ల ఆకర్షితుడవడంలో ఆశ్చర్యమేముంది? గురుభక్తి పరాయణుడు అయ్యాడు.

ఒకనాడు 'నీ శిష్యునికి రామచరితం నేర్పించు' అని నరహరి దాసుకు స్వప్నాదేశం లభించిందట. ఆయన శిష్యుణ్ణి అయోధ్యకు తీసుకుపోయి, ఉపనయనం జరిపించి రామమంత్రం ఉపదేశించాడు. ఆ పైన గురు శిష్యులు సరయూ నదీతీరంలో ఐదేళ్ళు ఆధ్యాత్మిక శిక్షణలో గడిపారు. కొంత కాలం తరువాత శేషసనాతన అనే సాధువు నరహరిదాసు ఆశ్రమానికి వచ్చాడు. ఆయన రామ్‌బోలాను తన వెంట తీసికొనిపోయి, పదిహేనేళ్ళ పాటు వేదవేదాంతాలు, వివిధ శాస్త్రాలు బోధించాడు. శిక్షణ పూర్తి అయిన తరువాత తన 28వ ఏట రామ్‌బోలా తన స్వగ్రామం రాజ్‌పూర్‌కు తిరిగి వచ్చాడు. అప్పటికే తండ్రి మరణించాడు, ఇల్లు కూలిపోయింది. ఆయన భక్తి, పాండిత్యాలను గమనించిన గ్రామవాసులు ఒక కుటీరం నిర్మించి ఇచ్చారు. తులసీదాసు ప్రతి దినం వారికి రామాయణం వివరించి చెప్పేవాడు.

మరుసటేడు ప్రక్కగ్రామంలో నివసించే బ్రాహ్మణుడు ఒకాయన వచ్చి, తులసీదాసు వ్యాఖ్యానం విని, సంతసించి తన కూతురు రత్నావళితో వివాహం జరిపించాడు. తులసీదాసుకు

భార్య పట్ల ఎంత అనురాగం అంటే ఆమెను ఒక్క క్షణమైనా విడిచి ఉండేవాడు కాదు. ఒకనాడు తులసీదాసు పని మీద బయటకి వెళ్ళినప్పుడు రత్నావళి పుట్టింటికి వెళ్ళింది. ఇంటికి తిరిగొచ్చిన అతడు భార్య పుట్టింటికి వెళ్ళిందని తెలిసి ఆమె ఎడబాటును భరించలేక అత్తగారింటికి వెళ్ళాడు. అతణ్ణి చూసిన రత్నావళి చాలా సిగ్గుతో కుంచించుకుపోయి, ఛీత్కరిస్తూ "ఛీ ఛీ ఏం బ్రతుకు! నా వెంబడే ఇలా పరుగెత్తి వచ్చావు, సిగ్గు లేదూ? ఈ ఎముకల గూడు పట్ల ఇంత ప్రీతా? ఇది శ్రీరామచంద్రుని పట్ల నీకు కలిగితే భవ బంధన విముక్తుడవు కాగలవు" అని అంది. ఆమె మాటలు తులసీదాసులో నిద్రిస్తున్న ఆధ్యాత్మికతను లేపి, ఆయన జీవనగమ్యాన్నే మార్చివేశాయి.

తులసీదాసు వెంటనే అక్కడ నుండి వెళ్ళిపోయి త్రివేణీ సంగమం చేరాడు. ఆ పైన వివిధ తీర్థక్షేత్రాలు దర్శిస్తూ, చివరకు వారణాసి వచ్చి స్థిరపడ్డాడు. అక్కడ హనుమాన్ మందిరంలో ద్వాదశ మూర్తులను ప్రతిష్ఠించాడు. ఆ మందిరమే నేడు 'సంకట మోచన ఆలయం'గా సుప్రసిద్ధం.



తులసీదాసు ప్రతి రోజూ గంగాస్నానం తర్వాత ఒక రావిచెట్టుకు నీరు పోసేవాడు. దాని ఫలితంగా ఆ వృక్షంపై ఉన్న పిశాచం విడుదల పొంది, ఏదైనా వరం కోరమంది. "నాకు శ్రీరాముని దర్శనం తప్ప మరేమీ కోరదగినది లేదు"న్నాడు తులసీదాసు. అప్పుడు "ఆ శక్తే ఉన్నట్లయితే నాకీ దురవస్థ ఎందుకు? కానీ ఒక ఉపాయం చెబుతాను. మీరు రామాయణ ప్రవచనం చేస్తున్నప్పుడు హనుమంతుడు మారువేషంలో వచ్చి వింటాడు. ఆయన చినిగిన దుస్తులతో, పేద కుష్ఠురోగి రూపంలో అందరి కన్నా ముందుగా వచ్చి, ఒక మూల కూర్చొంటాడు. అందరూ వెళ్ళిపోయిన తరువాత వెళతాడు" అని చెప్పిందా పిశాచం.

ఇది వినగానే తులసీదాసు ఆనందంతో ఉప్పొంగి, ఎప్పుడెప్పుడు ఆ శుభఘడియలు వస్తాయా! అని తహతహలాడాడు. ఒకనాడు హనుమంతుణ్ణి గుర్తుపట్టి ఆయన పాదద్వయాన్ని గట్టిగా పట్టుకొని రామదర్శనం చేయించమని ఆవేదనతో పదేపదే వేడుకున్నాడు. 'చిత్రకూటంలో శ్రీరాముని దర్శనం లభిస్తుంద'ని ఆంజనేయస్వామి చెప్పారు.

ఆ విధంగా, తులసీదాసు చిత్రకూటం చేరి నియమానుసారం రామాయణ పఠనం చేసేవాడు. ఒకనాడు గిరిప్రదక్షిణం చేస్తుండగా, సుందర శ్యామలాంగులు, ధనుర్బాణదారులైన ఇద్దరు బాలకులు ఒక లేడి వెనుక పరుగెత్తడం కంటపడింది. ఆ లావణ్య సౌందర్యం చూచి ముగ్ధుడయ్యాడు కానీ వారు రామలక్ష్మణులని కనిపెట్టలేకపోయాడు. ఏదో రామలీల నాటకంలో దృశ్యమని భావించాడు. కానీ ఆ మాయ తొలగిన పిదప ఆవేదనతో ఆక్రోశించాడు. ఆ రాత్రి ఆంజనేయస్వామి కలలో కనపడి 'నీవు కళ్ళతో ప్రత్యక్షంగా చూసిన దృశ్యం ఈ కలియుగంలో చాలా అరుదు సుమా! దుఃఖించకు. భగవత్సేవలో మునిగిపో' అన్నారు.

తులసీదాసు ఒకనాడు గంగా స్నానానంతరం గట్టుపై కూర్చొని చందనం అరగదీస్తున్నాడు. అక్కడికి సాధువులు వచ్చి చందనం తీసుకొని ముఖంపై నామాలు పెట్టుకొంటున్నారు. ఇంతలో శ్రీరాముడు ఒక బాలుని రూపంలో వచ్చి 'అయ్యా! నాకు కూడా కొంచెం ఇవ్వరా?' అన్నాడు. రామచింతనామగ్నుడై ఉన్న తులసీదాసు యథాలాపంగా బాలుని చేతిలో చందనం ముద్ద పెట్టాడు. 'అయ్యో! మరొక సదవకాశం చేజారుతున్నద'ని హనుమంతుడు రామచిలుక రూపంలో వచ్చి హెచ్చరించాడు. తులసీదాసు అటు చూసిన తోడనే బాలుడు అదృశ్యమయ్యాడు. తులసీదాసు గాఢ సమాధిమగ్నుడయ్యాడు. మరొకనాడు హనుమదనుగ్రహం వల్ల సీతారామలక్ష్మణుల దర్శనమైంది. తులసీదాసు అభీష్టం నెరవేరింది. ఆ పైన వారణాసికి తిరిగి వచ్చాడు.

భక్త మీరాబాయి అత్తవారింట్లో అగచాట్లు పడి దిక్కుతోచని స్థితిలో తులసీదాసుకు ఒక లేఖ వ్రాసింది. "దుఃఖవినాశకా! మీకు నా ప్రణామాలు, నా యాతనలు తొలగే ఉపాయం తెలపండి. నేను కృష్ణుణ్ణి ఆరాధిస్తున్నందుకు, సాధుసాంగత్యం చేస్తున్నందుకు నన్ను అనేక అగచాట్లకు గురిచేస్తున్నారు. పితృతుల్యులైన మీరు నాకు ఏది శ్రేయస్కరమో, ఉపదేశించండి" అని ఆ లేఖలో పేర్కొంది.

"సీతారాములను ఆరాధించని వారు నీకు ఎంత ఆత్మీయులైనా సరే, శత్రువులతో సమానం. కావున వారిని త్యజించు. ప్రహ్లాదుడు తన తండ్రినీ, విభీషణుడు తన సోదరుడినీ, భరతుడు తన తల్లినీ, బలిచక్రవర్తి తన గురువునూ, గోపికలు తమ భర్తలనూ పరిత్యజించారు. అయినా వారు జీవితాంతం ఆనందంగా ఉన్నారు. ఎవరు శ్రీరామచంద్రులను పూజిస్తున్నారో వారినే ప్రేమించి, వారికే పరిచర్యలు చేయి. దృష్టి పోగొట్టే అంజనంతో పనేమిటి? భగవద్భక్తులే గౌరవార్హులు. వారే ప్రాణాధికులు. ఇది తులసీ అభిమతం. ఇది నా ఉపదేశం" అని ప్రత్యుత్తరం ఇచ్చాడు.

ఆదర్శవంతమైన రామరాజ్యంలో ఎవరికీ దుఃఖశోకాలు ఉండవు. పేదలుండరు, ఎవరూ అకాల మరణానికి లోనుకారు. పరుల సంపదను ఆశించరు. అలాంటి రామరాజ్యం రావాలంటే 'శ్రద్ధ అనే అనుపానంతో సంజీవనీ సమమైన రామభక్తి ఔషధాన్ని సేవించాలి!' అని తులసీదాసు బోధించాడు. ❖

అనువాదం: డాక్టర్ కమల జయరావు

భక్తి మోక్షప్రదాయిని. నన్ను సాక్షాత్కరించుకొన్నవాడు ఈ జన్మలోనే ముక్తి పొందుతాడు. కాబట్టి భక్తునికి ముక్తి కరతలామలకం. నా దర్శనంతో నీకు సర్వం సిద్ధిస్తుంది. భీతి చెందకు. - శ్రీరాముడు

ఇదీ

ఆ స్త్రీమూర్తి సర్వసద్గుణ శోభిత, రూపవతి. రాజవంశ లలన. ఐనా ఆమెను వివాహమాడటానికి ఏ రాకుమారుడూ ముందుకు రాలేదు. కారణం ఆమె తేజస్సును చూసి, 'ఆమె మానవమాత్రురాలు కాదు. మానవ రూపంలో భువిపైకి వచ్చిన దేవత' అని భావించారు. ఆమెను వివాహం చేసుకోవడం పాపమవుతుంది అని భీతిల్లారు. కుమార్తెకు వివాహం ఎలా చేయాలో తెలియక ఆ తండ్రి తలపట్టుకు కూర్చున్నాడు. ఇక ఏమి చేయాలో దిక్కుతోచక 'అమ్మా నీకు తగిన భర్తను నీవే ఎంచుకో' అన్నాడు. 'సరే' అంది. తనకు కాబోయే భర్త గుణగణాలను విని అతనినే వివాహం చేసుకోవాలనుకుంది. తండ్రికి ఆ పేరు చెప్పింది. పితృదేవుడు సంతోషించాడు. ఇంతలో అక్కడికి దేవర్షి నారద మహర్షి వేంచేశారు. తన కూతురు ఎంచుకున్న వ్యక్తి ఆమెకు తగిన భర్త అవుతాడా? అని ఆ మునీంద్రుని ప్రశ్నించాడు. 'అన్ని విధాలా సరియైన వాడే కానీ..' అని ఆగారు దేవర్షి.. ఆ రాజు 'చెప్పండి మునీంద్ర... సంశయించకండి, మీరు ఏది చెప్పినా మా మేలు కోరే చెపుతారు' అన్నాడు, మునీంద్రుల మాటలపై పూర్తి విశ్వాసమున్న ఆ నరేంద్రుడు. 'ఆ రాకుమారుడికి సరిగ్గా ఒక్క సంవత్సరం మాత్రమే ఆయుర్దాయం ఉంది అన్నాడు.' రాజు విచలితుడయ్యాడు. కూతురికి అలా అకాలవైధవ్యం సంప్రాప్తించడం ఏ తండ్రికి శుభవార్త అవుతుంది కనుక ! కుమార్తెతో ఆ వ్యక్తిని తప్ప ఇంకెవరినైనా కోరుకోమన్నాడు. అప్పుడు ఆ పుణ్యశీల **'దీర్ఘాయురథవాల్పాయుః సగుణో నిర్గుణోఽపివా। సకృద్వృతో మయా భర్తా నద్వితీయం వృణోమ్యహమ్।।** – ఒకసారి మనసులో నిర్ణయించుకున్న తర్వాత అల్పాయుష్కుడైనా, దీర్ఘాయువైనా, సగుణుడైనా, దుర్గుణుడైనా అతడే నా భర్త, రెండవ వ్యక్తికి తన మనసులో తావులేదు' అని అంది. గత్యంతరం లేక ఆ తండ్రి ఆ వివాహానికి ఒప్పుకొని కార్యాన్ని జరిపించాడు. ఆమెయే చరిత్రలో సుస్థిర కీర్తినార్జించిన మహాసాధ్వి సావిత్రి. ఆ తండ్రి మద్రదేశాధిపతియైన అశ్వపతి. 18 సంవత్సరాలు సావిత్రిదేవిని ఉపాసించి ఆమెను పుత్రికగా పొందాడు. ఆ దేవి ఉపాసన ఫలితంగా జన్మించిన ఆ లలనామణికి సావిత్రి అని నామకరణం చేసి అల్లారుముద్దుగా పెంచాడు.

ఇక ఆమె వివాహం చేసుకొన్న ఆ రాకుమారుడు సత్యవంతుడు. సత్యమే ప్రాణంగా జీవిస్తున్న మహామనిషి. శత్రురాజుల కుట్ర కారణంగా తండ్రి రాజ్యాన్ని కోల్పోవడంతో వనంలో చిన్న కుటీరాన్ని నిర్మించుకొని తలిదండ్రుల సేవలో నిమగ్నమయ్యాడు. వారినే సజీవ దైవాలుగా ఉపాసిస్తున్న పుత్రరత్నం అతడు. అలా అల్పాయుష్కుడు, భాగ్యహీనుడు ఐన భర్తను సేవించడానికి సిద్ధపడిన ఆ మహాపతివ్రత, వివాహం ఐన వెంటనే అంతఃపురం నుండి అడవికి ప్రయాణం కట్టింది. తన పట్టు వస్త్రాలు వదలి నార చీరలు ధరించింది. భర్త సేవ, అత్త మామల సేవయే మహాపూజగా చేయసాగింది. అంతటి ఉత్తమురాలిని కోడలిగా పొందినందుకు ఆ వృద్ధదంపతులు మహానందపడిపోయారు. కోడలిని హృదయపూర్వకంగా ఆశీర్వదించారు. తమ అనుగ్రహవృష్టిని ఆమెపై కురిపించారు. జీవన చరమాంకంలో ఉన్న వారికి జీవిత నిజస్వరూపం అర్థమైంది. అనేకానేకంగా కలిగిన చేదు అనుభవాలు వారి అజ్ఞానాన్ని తొలగించాయి. అలా అహంకారం ఉడిగి భగవంతుడు నెలకొన్న ఆ హృదయాలు ఆ లలనా తిలకాన్ని అభినందించని రోజు లేదు. మరి ఆమె వారికి చేస్తున్న సపర్యలు అలాంటివి! 'సరిగ్గా ఒక్క సంవత్సరమే సత్యవంతుడు జీవిస్తాడు' అని నారద మహర్షి తన తండ్రితో అన్న పలుకులు సావిత్రి మనసులో అలానే నిలిచి పోయాయి. రోజులు లెక్క పెట్టసాగింది. ఆ తేదీ ఇంకా నాల్గురోజులుందనగా ఉపవాస దీక్షకు ఉపక్రమించింది. దైవప్రార్థనలో లీనమైంది. ఆ రోజు సావిత్రి తాను కూడా భర్తతో అడవికి వెళ్ళడానికి సిద్ధమై అనుమతిని



కోరుతుంది. సత్యవంతుడిని, అత్తమామలను ఒప్పిస్తుంది. సత్యవంతుడు కొద్దిసేపు సమిధలు, పూలు, దుంపలు సమీకరించిన తర్వాత, శక్తి సన్నగిల్లి సావిత్రి ఒడిలో వాలిపోతాడు. ఆ పుణ్యవతి భర్త ప్రాణాలను తీసుకువెళ్ళడానికి వచ్చిన యమధర్మరాజును చూస్తుంది. ఆ ధర్మమూర్తితో సంభాషిస్తుంది. ఎందుకు ఆయన ధర్మదైవతమయ్యాడో, సమవర్తి అనే నామం ఆయనకు ఎందుకు సార్థకమైందో, శమనుడని ఆయనను ఎందుకు అంటారో, ఆయన ఎలా యముడయ్యాడో తెలిపింది. ఆమె సంభాషణాచాతుర్యానికి, సంతసించి యముడు వరాలను ప్రసాదిస్తాడు. మూడు వరాలను ప్రసాదించినా ఇంకా తనను అనుసరిస్తున్న సావిత్రిని చూసి అంత శ్రమ తీసుకోవద్దనీ, తనది దుర్గమమైన మార్గమనీ భయపెడతాడు మృత్యుదేవుడు. భార్య భర్తలు వేరుకాదనీ, భర్త ఎక్కడుంటే తన స్థానమూ అక్కడేననీ, అదే సనాతన ధర్మమనీ పలికి భర్త లేకుండా తాను జీవించలేనని తెలుపుతుంది. ఆ పవిత్ర ప్రేమకు ముగ్ధుడై యమధర్మరాజు సావిత్రికి భర్త ప్రాణాన్ని తిరిగి ప్రసాదిస్తాడు. ఇది ప్రాచీన

భారతదేశంలో జరిగిన ఒక యథార్థ గాథ. కాదు ఇది కేవలం కవి కల్పితమనుకునే వారి అజ్ఞానానికి జాలిపడవలసిందే. మన ఆదర్శాలు ఎలా ఉండేవో, ఆదర్శ గృహస్థ జీవన విధాన మెటువంటిదో తెలపడానికి మనకున్న అనేకానేక కథనాలలో సావిత్రి–సత్యవంతుల వృత్తాంతం ఒకటి.

మొన్ననే కొత్తగా వివాహం చేసుకున్న దంపతులు సునిర్దేశానికై (counselling) మఠాధ్యక్ష స్వామీజీ దగ్గరకు వచ్చారు. వారిది ప్రేమ వివాహం. కులాంతర వివాహం కూడా. కోడలికి, అత్తకు విభేదాలు పొడసూపాయి. వాళ్ళిద్దరి మధ్య పచ్చగడ్డివేస్తే భగ్గుమంటుంది. స్వామీజీ సలహా మేరకు కొన్ని రోజులు కొత్త దంపతులు వేరుగా ఉన్నారు. తండ్రి అనారోగ్యానికి గురవడంతో తన తలిదండ్రులతో కలిసి ఉండాలని ఆ యువకుడి ఆకాంక్ష. కానీ తన భార్యకు, తల్లికి మధ్య సఖ్యతను సాధించలేక పోతున్నాడు. ఒకరికొకరు ఎందుకు నచ్చట్లేదో తెలుపమన్నారు స్వామీజీ. ఇద్దరూ చాలా పెద్ద చిట్టాను ఏకరువు పెట్టారు. ఆ అత్తగారికి ఆ కోడలిలో ఒక్క సుగుణం కనపడలేదు. ఆ కోడలికి ఆ అత్తగారిలో ఒక్క మంచి లక్షణం కనపడలేదు. భార్యాభర్తలు మళ్ళీ మార్గదర్శానికై వచ్చారు. స్వామీజీ ఆ అమ్మాయితో 'మీ అత్తగారిలో మీకు కనపడిన

ఆదర్శం!

– స్వామి శితికంఠానంద

ఒక్క మంచి లక్షణం తెలపండి' అన్నారు. ఆమె వెంటనే 'ఆమెలో నాకు ఒక్క మంచి లక్షణం కూడా కనపడలేదు. ఆమెను చూడగానే నాకు జ్వరమొచ్చినట్లవుతుంది' అన్నది. 'ఎప్పుడైనా మంచి లక్షణా లను చూడడానికి ప్రయత్నించారా?' అని ఆయన రెండవ ప్రశ్న వేశారు. కొంచెం సేపు నిశ్శబ్దం; తరువాత 'ప్రయత్నించలేదు' అంది. 'ఇదే అసలు సమస్య. మీరు ఇలాంటి ప్రయత్నం చేయక పోయేసరికి చిన్న చిన్న లోపాలే మీకు మహాదోషాలుగా పరిణ మించాయి. చివరికి ఆవలి వ్యక్తి పూర్తిగా దుర్గుణురాలు అనిపించే టట్లు చేశాయి,' అని తెలిపి స్వామీజీ ఈ చిన్న కథను చెప్పారు.

'ఒక అత్తా కోడలుకు కూడా మీ లాంటి పరిస్థితే ఉత్పన్నమైంది. ఇద్దరూ ఒకరి పొడను ఇంకొకరు భరించ లేకపోయేవారు. చివరికి కుటుంబంలో శాంతి కరువై ఆ కోడలు అత్తను చంపేయాలని నిర్ణయించింది. ఒక ఆయుర్వేద వైద్యుడు దగ్గరకు వెళ్ళి కొంచెం విషం ఇవ్వమని అడిగింది. తన కుటుంబ పరిస్థితిని చెప్పి తాను ఎందుకు విషం అడుగుతుందో కూడా చెప్పింది. ఆ వైద్యుడు తెలివిగా మీరిద్దరూ గొడవ పడుతున్నారని మీ కుటుంబ సభ్యులకు, చుట్టుప్రక్కలవారికి తెలుసు కాబట్టి మీ అత్తగారు హఠాత్తుగా చనిపోతే అందరికీ మీ మీద అనుమానం వస్తుంది. అప్పుడు మీరు కృష్ణజన్మస్థానానికి వెళ్ళవలసి వస్తుంది. కాబట్టి నేను ఇచ్చే మందును రోజూ కొద్దికొద్దిగా అన్నంలో కలిపి ఇస్తే కొద్ది కాలానికి మీ అత్తగారు అనారోగ్యానికి గురై చనిపోతారు. అప్పుడు ఎవరికీ మీ మీద అనుమానం రాదు అంటాడు. ఆ కోడలికి ఆ సలహా నచ్చి అలానే చేస్తానని ఆ రోజునుంచి అత్తగారి భోజనంలో మందు కలప సాగింది. అత్తగారు షరా మామూలే. కోడలిని చీటికి మాటికి కసురుకోసాగింది. ఐనా ఎలాగూ కొద్దిరోజులకు చనిపోబోతుంది కదా. కసురుకోనీలే అని అంతర్క్రితంలాగా ప్రతిస్పందించకుండా మౌనంగా భరించింది కోడలు. కోడలిలో వచ్చిన ఈ మార్పు అత్త గారికి ఆశ్చర్యం కలిగించింది. ఎప్పుడూ వెంటనే త్రాచుపాములా తన మీదకు వచ్చే కోడలు అలా నెమ్మదస్తురాలైనందుకు చాలా సంతోషించింది. 'అయ్యో! ఇంత మంచి కోడలిని సూటిపోటి మాటలతో దెప్పిపొడుస్తున్నానే' అని పశ్చాత్తాపపడసాగింది. తన ప్రవర్తనను మార్చుకుంది. కోడలిని ప్రేమతో చూసుకోసాగింది. అత్తగారిలో వచ్చిన మార్పు కోడలిని ఆశ్చర్యానికి గురి చేసింది. దేవత లాంటి అత్తగారిపై విషప్రయోగాన్ని చేస్తున్నందుకు సిగ్గు పడింది. ఆయుర్వేద వైద్యుడి దగ్గరకు పరిగెత్తి విషయాన్ని చెప్పి మందుకు విరుగుడు ఇవ్వమంది. ఆ వైద్యుడు 'ఇలా జరుగుతుందని నాకు ముందే తెలుసు. అందుకని నేను విషమివ్వలేదు. శక్తికారకాన్నిచ్చాను. కంగారు పడవలసిన అవసరం లేదు,' అని చెప్పాడు. ఈ కథ విన్నాక సునిర్దేశం (counselling) కొరకు వచ్చిన ఆ కొత్తకోడలికి కొంత ఊరట కలిగింది. అత్తగారంటే భయం కొద్దిగా తగ్గింది. అంటే ఇతరులలో ఉన్న మంచి లక్షణాలు చూసే స్వభావాన్ని మనం కోల్పోతున్నామేమో ఒకసారి ఆలోచించాలి. దోషాలను ఎంచే ప్రవృత్తినే పెంచి పోషించు కుంటున్నాం కానీ వ్యక్తిలోని సుగుణాలను ఎంచే స్వభావాన్ని పెంపొందించుకోవడం లేదు.

ప్రాచీన భారతంలోని సీత, సావిత్రి, దమయంతి, సుకన్య లాంటి పవిత్రమూర్తులుగా, త్యాగశీలురుగా, సేవావ్రతులుగా రూపుదిద్దుకోలేక పోయినా కనీసం ప్రతిమనిషిలో కొంత మంచి ఉంటుందని గ్రహించి, ఆ మంచిని చూడడానికి ఒక చిరుప్రయత్నం చేస్తే కుటుంబాలలో కొంచెం శాంతి వెల్లివిరుస్తుంది. స్వామి వివేకానంద 'ఇతరులలోని చెడు మేరుపర్వతం లాంటిదైనా దానిని ఆవగింజంత చేసి చూడమంటారు. వారిలోని మంచి ఆవగింజంత ఉన్నా దానిని మేరు పర్వతంలా పెంచి దర్శించమ'ంటారు. ఒక వ్యక్తి నిజానికి బలవంతుడయ్యేది అప్పుడే. చెడునే చూస్తున్నామంటే అది మనలోని బలహీనత అని అర్థం చేసుకోవాలి.

రాజసౌధం వదలి అల్పాయుష్కుడైన భర్తను ఎన్నుకొని, ఘోరాటవిలోఉన్న అత్త మామలను దైవస్వరూపాలుగా సేవించటానికి పూనుకున్న సాధ్వీమణి సావిత్రి పవిత్రత, త్యాగభావం, సేవాభావం నేటి కోడళ్ళకు ఆదర్శమవ్వాలి. అలాగే, **'సర్వైః పుత్రైః ప్రియతరా ద్రౌపదీ మే జనార్దన** – ఓ జనార్దనా! నా కొడుకులందరి కన్నా ద్రౌపదియే నాకు ప్రీతిపాత్రురాలు' అన్న కుంతీమాత వాక్కులు నేటి అత్తలకు శిరోధార్యాలవ్వాలి; శిలాశాసనాలు కావాలి. కోడలు వేరే ఇంటినుండి వస్తున్నందున, పూర్తిగా తమ కుటుంబీకులతో మమేక మయ్యేవరకూ కూతురికన్నా (కూతురు లేకపోతే కొడుకు కన్నా) ప్రేమతో ఆమెను ఆదరించాలి అని వారు గ్రహించాలి. అలా అత్తా కోడళ్ళిద్దరూ పరస్పర ప్రేమ భావాన్ని, త్యాగనిరతిని పెంపొందించుకుంటే ఇల్లు నందనవన మవుతుంది; లేకపోతే ఇల్లే ప్రత్యక్ష నరకం అవుతుంది. అంతా మన చేతిలోనే ఉంది! భగవంతుడు కేవలం సాక్షి! ❖

ఇతరులలోని చెడు మేరుపర్వతంలా ఉన్నా, దానిని ఆవగింజంత చిన్నదిగా చేసి చూడు. ఇతరుల లోని మంచి ఆవగింజంత ఉన్నా దానిని మేరుపర్వతంలా పెద్దదిగా దర్శించు. – స్వామి వివేకానంద

స్వామీజీ సారస్వతమే స్ఫూర్తి!

– ఎమ్.రాంబాబు



పంతొమ్మిదేళ్ళ ఆనందమోహన్ అప్పుడే ఉన్నతవిద్యాభ్యాసాన్ని పూర్తి చేసుకున్నాడు. విశాఖపట్నంలో జరిగిన విశ్వవిద్యాలయ స్నాతకోత్సవ సభలో పట్టాపుచ్చుకున్నాడు. విద్యార్థిగానే కాకుండా వినయసంపన్నుడైన యువకుడిగా, సాంస్కృతిక, ఆధ్యాత్మిక రంగాలపై చక్కని అభిరుచి కలిగిన యువకుడిగా అప్పటికే అతను మంచి పేరు సంపాదించాడు. అదే సమయంలో రాజమహేంద్రవరంలోని ధార్మిక సమాజం వారు భగవద్గీత, శివానందలహరి తదితర గ్రంథాలపై రాష్ట్రస్థాయి పోటీలను నిర్వహించారు. వివిధ విద్యాసంస్థల నుంచి చాలామంది విద్యార్థులు ఆ పోటీలలో పాల్గొన్నారు. అందులో ఆనందమోహన్ రాష్ట్రస్థాయిలో ద్వితీయ బహుమతిని సాధించాడు. ఆ పోటీ ఫలితాల్లో పారితోషికం కింద కొంత నగదును ఆనందుడికి నిర్వాహకులు బహూకరించారు.

ఆ నగదుతో ఏదైనా విలువైన వస్తువును జీవితకాల జ్ఞాపకంగా కొనుక్కోవాలని ఆనందమోహన్ భావించాడు. అప్పుడే అతనికి తమ తండ్రి చెప్పిన స్వామి వివేకానంద సంపూర్ణ సారస్వతం గుర్తొచ్చింది. అప్పటికే విపణి(మార్కెట్)లోకి విడుదలై బహుళ ప్రాచుర్యాన్ని పొందిన పదిసంపుటాల స్వామి వివేకానంద సారస్వతం గురించి ఆనందమోహన్‌కి తెలిసింది. వెంటనే మిత్రుల సహాయంతో ఆ సమగ్రసాహిత్యాన్ని తెప్పించుకొన్నాడు. అన్ని సంపుటాలను ఆనందమోహన్ అమితశ్రద్ధగా ఆమూలాగ్రం చదివాడు. యావత్ ప్రపంచాన్ని ఉర్రూతలూగించిన స్వామి వివేకానంద ధీరవచనాలు ఆనందమోహన్‌ని కూడా సూదంటురాయిలా ఆకర్షించాయి. ఆయన ఆలోచనల్ని చైతన్యమయం చేశాయి. ముఖ్యంగా స్వామీజీ పునరుద్ఘాటించిన **'నిర్భయం...నిర్భయం'** అన్న వచనాలు ఆనందమోహన్ హృదయంపై ప్రగాఢమైన ముద్రనువేశాయి. ఆ పరంపరలో

స్వామీజీ దివ్యప్రబోధాల స్ఫూర్తితో ఆనందమోహన్ 'భగవద్గీత, బైబిల్– తులనాత్మక అధ్యయనం' అన్న అంశంపై జరిగిన పోటీల్లో ప్రథమ బహుమతిని కైవసం చేసుకున్నాడు. ఆ తరువాత స్వామి వివేకానంద సాహిత్యాన్ని కంఠోపాఠం చేసి, ఆధ్యాత్మిక పథంలో పయనించారు. స్వామి వివేకానంద ధైర్యసాహసాలు, క్రమశిక్షణతో కూడిన సాధనలు, ప్రజ్ఞాపాటవాలు ఆనందమోహన్ మనస్సుపై ప్రగాఢమైన ముద్రను వేశాయి. ఆ ఆనందమోహనే కాలక్రమంలో వేదాంతభేరిని మోగించిన శ్రీ స్వామి విద్యాప్రకాశానందగిరి. ప్రతిష్ఠాత్మకమైన శ్రీశుకబ్రహ్మాశ్రమ వ్యవస్థాపకులుగా ప్రసిద్ధులు.

వేదాంతభేరి...వివేకానందవాణి: చిత్తూరు జిల్లాలో శ్రీకాళహస్తి సమీపంలో ఆశ్రమస్థాపన అనంతరం సామాజిక సేవాకార్యక్రమాల రూపకల్పనలో కూడా శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వామి, యుగపురుషుడైన స్వామి వివేకానంద అడుగుజాడలనే ఆదర్శంగా తీసుకున్నారు. విద్య, వైద్య సేవల్లో ముందుకుసాగారు. ఆ నేపథ్యంలో స్వామి వివేకానంద శతజయంతి సంవత్సరమైన 1963లో శ్రీశుకబ్రహ్మాశ్రమం ఆధ్వర్యంలో శ్రీవిద్యాప్రకాశానందగిరి స్వామి 'వేదాంతభేరి' పత్రికను ప్రారంభించారు. తమకు ఆధ్యాత్మిక ప్రేరణనిచ్చిన స్వామి వివేకానందపై ఆరాధనాపూర్వకంగా వారు 'వేదాంతభేరి' రెండవ సంచికను 'వివేకానంద శతజయంతి సంచిక'గా విడుదల చేసి స్వామీజీకి అంకితమిచ్చారు.

శ్రీవిద్యాప్రకాశానందగిరి స్వామియే స్వయంగా స్వామీజీపై వ్యాసం రాస్తూ 'స్వామి వివేకానంద విశ్వమానవుడు. ఆధ్యాత్మిక భావ గాంభీర్యంతో ప్రపంచాన్నే మంత్రముగ్ధం చేసిన ప్రజ్ఞాధురీణుడు. భారతీయ వేదాంత దుందుభిని ఖండఖండాంతరాలలో మారుమోగించిన ఋషిసత్తముడు. ప్రాచ్యపాశ్చాత్య తత్త్వాల సారాన్ని ఏకీభవింపచేసుకొని విలసిల్లిన మహనీయుడు. స్వామీజీ భవ్యజీవితం రాబోయే కాలంలో సంసారక్షేత్రంలో ముముక్షువులకు ధ్రువతారగా నిలిచిపోతుంది. నిరాశానిస్పృహలతో నిండిన జీవితాలను 'ఉత్తిష్ఠత! జాగ్రత! ప్రాప్యవరాన్నిబోధత!' అని మేల్కొలుపుతూనే ఉంటుంది' అంటూ కొనియాడారు. 1914 ఏప్రిల్ 13న జన్మించిన శ్రీవిద్యాప్రకాశానందగిరి స్వామి, వివేకానంద ఆధ్యాత్మిక భావజ్వాలలతో చైతన్యమూర్తిగా ఎదిగి 1998 ఏప్రిల్ 10న భౌతికంగా ఈ లోకం నుంచి నిష్క్రమించారు. ❖

యువవాణి

– స్వామి పరిజ్ఞేయానంద

మురళీకృష్ణ, కళాశాల విద్యార్థి, హైదరాబాద్

ప్రశ్న: 'స్వామి వివేకానంద యువతకు ఆదర్శం' అంటారు. యువత స్వామీజీనే ఎందుకు ఆదర్శంగా తీసుకోవాలి?

జవాబు: ఓ చిన్న మొక్క చెట్టుగా ఎదగడానికి గాలి, నీరు, వెలుతురు ఎంత అవసరమో మొక్కలాంటి లేతప్రాయులైన యువత ఉన్నతంగా ఎదగడానికి ఆత్మవిశ్వాసం, ఆత్మశక్తి, ఆత్మస్థైర్యం అంతే అవసరం. ఇవన్నీ పుష్కలంగా సరఫరా చేసే ప్రకృతిమాత లాంటివారు స్వామి వివేకానంద. యువత స్వామీజీని ఆదర్శంగా తీసుకుంటే అంతర్గతశక్తిని జాగృతపరచుకుంటూ ఉన్నత వ్యక్తులుగా ఎదగవచ్చు.

ఆత్మవిశ్వాసం, ఆత్మశక్తి, ఆత్మస్థైర్యం – ఈ మూడు లక్షణాలు పరిపూర్ణంగా ఉన్న మహోన్నతవ్యక్తి స్వామీజీ.

నేటి యువత పరీక్షల్లో ఉత్తీర్ణులవడం, ఉద్యోగం సంపాదించడం లాంటి చిన్న చిన్న లక్ష్యాలనే సాధించలేక ఆత్మన్యూనతకు గురవుతుంది. అలాంటిది స్వామీజీ జేబులో సరిపడ డబ్బులుకానీ, పరిచయస్తులుగానీ లేకుండా దేశంగాని దేశం వెళ్ళి ఎన్నో ఇబ్బందులపాలయ్యారు. విశ్వమత మహాసభలు జరిగే ముందురోజు వరకు చికాగో నగర వీధుల్లో తిండి లేకుండా, కాలిబాటలపైన గడిపారు. ఎన్నో అవమానాలు ఎదుర్కొన్నారు.



నేను పుట్టింది మీ కోసమే!

మహామేధావులతో కూడిన విశ్వమత మహాసభలో స్వామీజీ ఒకే ఒక్క ప్రసంగంతో విశ్వవిఖ్యాతులయ్యారు. అప్పుడు స్వామీజీ వయస్సు కేవలం ముప్పై ఏళ్ళే! స్వామీజీ అవరోధాలన్నింటినీ అధిగమించి, ఒక్కరోజులోనే ప్రపంచదేశాల దృష్టిని ఆకర్షించగలిగారంటే ఆయనలోగల **'ఆత్మవిశ్వాసం'** ఎంత మహోన్నతమైనదో గ్రహించవచ్చు. మరి చిన్న చిన్న లక్ష్యాలను సాధించడంలోనే ఆత్మవిశ్వాసం కోల్పోయి, ఆత్మన్యూనతతో బాధపడుతున్న నేటి యువతకు స్వామీజీ ఆదర్శం కాదా?

నేటి యువతీ యువకులకు ఏ కొంచెం ఆర్థిక ఇబ్బందులు కలిగినా కుంగిపోతున్నారు. బాహ్యాకర్షణలకు లొంగిపోతున్నారు. పరీక్షల్లో ఉత్తీర్ణులు కాకపోయినా, మంచి ర్యాంకులు సాధించలేక పోయినా, ఆశించిన విధంగా ఉద్యోగాలు రాకపోయినా నిరాశకుగురవుతున్నారు. జీవితంలో ఎదురైన ఏ చిన్న కష్టాన్ని కూడా భరించే 'ఆత్మశక్తి' లేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు.

మరి నేటి యువత ఎదుర్కొంటున్న సమస్యలనే విద్యార్థి దశలో స్వామీజీ కూడా ఎదుర్కొన్నారు. స్వామీజీ విద్యార్థిగా ఉన్నప్పుడే తండ్రిని కోల్పోయారు. అందువల్ల కుటుంబం ఎన్నో ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కోవలసి వచ్చింది. అలాగని స్వామీజీ నిరాశ చెందలేదు; స్నేహితులు తప్పుదారి పట్టించడానికి ఎన్నో విధాలుగా ప్రలోభపరిచారు. విదేశాల్లో ఎంతోమంది సుందరీమణులు ఆయన్ని ఆకర్షించడానికి ప్రయత్నించారు. ఆ ప్రలోభాలకు స్వామీజీ లొంగిపోలేదు. – జీవితంలో ఇలా ఎన్నో కష్టాలనూ, ప్రలోభాలనూ, ఆకర్షణలనూ ఎదుర్కొన్న మహోన్నత **'ఆత్మశక్తి'** సంపన్నుడు స్వామీజీ. అలాంటి స్వామీజీ నేటి యువతకు ఆదర్శం కాదా?

ఇకపోతే, నేటి యువతరం ఇంట్లో తల్లితండ్రులు ఏ కొద్దిగా మందలించినా, కార్యాలయంలో అధికారులు కొంచెం నిందించినా, ఇతరులు ఏ కొద్దిగానైనా విమర్శించినా ఎదురొడ్డి నిలబడి, తమ నిజాయతీని నిరూపించుకునే 'ఆత్మస్థైర్యం'లేక మానసిక ఆందోళనకు గురవుతున్నారు.


స్వామీజీ పాశ్చాత్య దేశాల్లో ప్రఖ్యాతి పొందుతున్నారన్న అసూయతో అక్కడి ప్రముఖులు స్వామీజీపై అపవాదాలు సృష్టించారు. ఆయన వ్యక్తిత్వాన్ని విమర్శిస్తూ పత్రికల ద్వారా దుష్ప్రచారం చేశారు. చివరికి స్వామీజీని అంతం చేయాలన్న దురుద్దేశంతో ఆయనపై విషప్రయోగం చేయడానికి కూడా వెనుకాడలేదు. 'వీధి కుక్కల అరుపులకు ఏనుగు భయపడుతుందా?' అంటూ అపవాదాలకూ, అవమానాలకూ, విమర్శలకూ వెరవకుండా తమ లక్ష్యాన్ని సాధించిన స్వామీజీ అనంత **'ఆత్మస్థైర్యం'** నేటి యువతరానికి ఆదర్శం కాదా?

ప్రపంచానికి పరిచయమయినప్పుడు స్వామీజీ వయస్సు 30 ఏళ్ళే! ఆయన జీవించింది 39 ఏళ్ళు మాత్రమే! కేవలం 9 ఏళ్ళలోనే ప్రపంచమంతా ఆయన్ని అనుసరించేలా చేసుకోగలిగారు. 'నేను రాబోయే 1,500 సంవత్సరాలకు సరిపడే సందేశాన్నిచ్చాను' అన్న ఆ యువ సన్యాసి మహత్త్వాన్ని ఏమని వర్ణించగలం? స్వామీజీ సాధించిన మహత్కార్యాలను అర్థం చేసుకోవడం మానవమాత్రులకు సాధ్యం కాదు. **'ఈ వివేకానంద ఏం చేశాడో అర్థం చేసుకోవాలంటే ఇంకొక వివేకానంద ఆవిర్భవించాలి'** అని స్వామీజీయే స్వయంగా అన్నారు.

నేటి విద్యార్థులు కేవలం పాఠ్యాంశాలను ఆపోశన పట్టడానికే సంవత్సరం పొడుగునా సతమతమవుతున్నారు. అలాంటిది స్వామీజీ విద్యార్థిగా ఉన్నప్పుడు చదువుతోపాటు కత్తిసాము,

(మిగతా 37వ పేజీలో...)

అవధుల్లేని త్యాగం, నిర్విరామకృషి, అంతులేని వాత్సల్యం, పరిపూర్ణమైన వివేకం, పోరాటపటిమ, కోమల హృదయం – ఈ సద్గుణరాశితో విరాజిల్లిన స్వామీజీ విశ్వంలోనే అద్వితీయుడు. – *నేతాజీ*



పుత్రోత్సాహం

– బి. సైదులు

దశరథ మహారాజు కుమారుడు శ్రీరామచంద్రుడికి యువరాజుగా పట్టాభిషేకం చేయాలని భావించాడు... ముందు ప్రముఖుల, పురజనుల అభిప్రాయాల్ని కూడా తెలుసుకుందా మనుకున్నాడు. వెంటనే ఆ మహారాజు వివిధ నగరప్రజలను, ప్రాజ్ఞులను, సామంతరాజులను అయోధ్యానగరానికి ఆహ్వానించాడు. సభను కొలువుతీర్చి తన మనస్సులోని మాటను వారి ముందుంచాడు. 'నాకు వయస్సు మీరిపోతోంది; నా పెద్ద కుమారుడైన రామచంద్రుడే ఇకపై ఈ రాజ్యభారాన్ని మోస్తాడు; మీ అభిప్రాయాల్ని కూడా వెల్లడించండి' అన్నాడు. అంతకన్నా మాకు కావలసింది ఏమిటని సభికులందరూ హర్షాతిరేకాలతో అభినందనల వర్షం కురిపించారు. ముక్త కంఠంతో రామచంద్రమూర్తిని తమ రాజుగా అంగీకరించారు. దశరథుడు లోలోన ఆనంద పడుతున్నా, పైకి మాత్రం గంభీరంగా 'ఓ ప్రజలారా! నేను రాజ్యభారాన్ని వదులుకుంటున్నాను; శ్రీరాముడిని యువరాజుగా చేయాలను కుంటున్నాను; అనగానే మీరు ఏ మాత్రం సంకోచించకుండా, నేను తప్పు కుంటున్నానని బాధపడకుండా, వెంటనే అంగీకరించారు. నా పాలనలో ఏమైనా లోటు అనిపిస్తోందా?' అని ప్రశ్నించాడు. అప్పుడు సభికులందరూ 'రాజా! అలాంటిదేమీ లేదు. కానీ నీ కుమారుడు ధీశాలి, బుద్ధిమంతుడు, స్థిరచిత్తుడు, పెద్దలంటే గౌరవాభిమానాలు కలిగినవాడు, తండ్రిలా బాధ్యత తెలిసినవాడు, తల్లిలా ప్రేమను పంచేవాడు. ఇంతకన్నా గుణవంతుడు ఎక్కడ కనిపిస్తాడు' అన్నారు. ఆ కన్నతండ్రి పొంగిపోయాడు; పుత్రుడిపై కీర్తిగానానికి పులకితగాత్రుడయ్యాడు. తన జీవితానికి ఇది చాలనుకున్నాడు.

నేటిసమాజంలో కొడుకులు తల్లితండ్రులను ఆనందింపజేసేలా ప్రవర్తించాలి. అందుకు ఆ సుగుణాభిరాముడి జీవితాన్ని చూసి తమను తాము దిద్దుకోవాలి; జన్మనిచ్చినందుకు ఆ తల్లితండ్రుల జన్మలు తరించిపోయేలా మనల్ని మనం మలచుకోవాలి.

ప్రయోజకుడే పుత్రుడు... : వంశానికి వారసులుగా భారతీయ సమాజంలో కుమారులకు విశేషమైన ప్రాధాన్యముంది. ఇంటికి, ఇంటిపేరుకి సారథులుగా, కుటుంబగౌరవాన్నీ, తల్లితండ్రుల పేరుప్రతిష్ఠల్నీ ఇనుమడింపచేయడంలో, పుత్రులది విశిష్టమైన పాత్ర. కానీ దురదృష్టవశాత్తూ నేడు ఎంతో మంది యువకులు అస్తవ్యస్త జీవనంతో అయిన వారిని అప్రతిష్ఠల పాలుచేస్తున్నారు. వ్యక్తిగా మన ఉనికి మన కుటుంబంతో అనుసంధానమై ఉందన్న సత్యాన్ని మరచిపోకుండా, నేనిలా ప్రవర్తిస్తే మా ఇంట్లో ఏమను కుంటారని! ఎప్పటి కప్పుడు ఆత్మపరిశీలనతో విశ్లేషించుకుంటూ ఉండాలి. రామాయణంలో ప్రతి మలుపులోనూ ఆ మహానుభావుడు తన నడవడికకు నేపథ్యంగా, చరితార్థ మైన తన వంశాన్నే స్మరించుకుంటూ ఉండేవాడు. తన ప్రతీ చర్య తన పూర్వీకుల ఘనతపై ఎలాంటి ప్రభావాన్ని చూపుతుందోనని ఆలోచిస్తూ ఉండేవాడు. నిజానికి అప్పుడే మనం ఆ ఇంట పుట్టినందుకు పెద్దలు మనల్ని చూసి సంతోషిస్తారు. అందుకే సుమతి శతకకర్త...

పుత్రోత్సాహము తండ్రికి
పుత్రుడు జన్మించినపుడె పుట్టదు, జనులా
పుత్రుని కనుగొని పొగడగ
పుత్రోత్సాహంబు నాడు పొందుర సుమతీ!

'కుమారుడు పుట్టగానే తండ్రికి సంతోషం కలగదు; ప్రజలు ఆ పుత్రుని చూసి, ప్రశంసించినప్పుడే ఆ తండ్రికి నిజమైన ఆనందం కలుగుతుంద'ని ఉద్ఘాటిస్తాడు. కానీ నేడు యుక్తవయస్సులో కుమారుల చేష్టలకు చింతిస్తున్న తల్లితండ్రుల కష్టాలు చెప్పనలవి కాకుండా ఉన్నాయి. అందుకే 'కుమారులు వ్యసనపరులు, దుర్జనులు, దుర్వర్తనులు, నిష్ప్రయోజకులై అవిధేయులుగా ఉంటే ఆ ఇంట్లో కష్టాలకు అంతే ఉండదు' అంటారు భగవాన్ శ్రీరామకృష్ణ పరమహంస.

సు'కుమారుడి' సుగుణాలు....: శివధనుర్భంగం చేసిన తరువాత జనకమహారాజు 'నా కూతురు సీత నీది' అని శ్రీరాముడితో పరిణయం విషయాన్ని ప్రస్తావిస్తాడు. అప్పుడు ఆ దశరథనందనుడు 'అది నిర్ణయించవలసింది మా నాన్నగారు' అని స్పష్టం చేస్తాడు. వెంటనే దశరథ మహారాజుకి కబురు వెళుతుంది. అప్పుడు ఆ మహారాజు వచ్చి చూసి మీ పిల్లను చేసుకుంటామన్న తరువాతే, రాముడు సీత మెడలో తాళికట్టాడు. అందుకే సీతాదేవి అనసూయతో ఓ సందర్భంలో 'మా మామగారి అనుమతి పొందిన పిదప నా మెడలో తాళికట్టిన రాముని భార్యను నేను' అని పరిచయం చేసుకుంది. ఇప్పటిలా తలుపు తీసుకొని లోపలికి వచ్చే వరకు కొడుకు తాళి కట్టిన తరుణి ఎవరో తెలియనంత అగౌరవమైన స్థానాన్ని శ్రీరాముడు తల్లితండ్రులకు కల్పించలేదు. కొడుకుగా కుటుంబసభ్యులకు విలువనివ్వడం అలవరచుకోవాలి; అప్పుడే ఆ పరంపరను మన తరువాత తరం వారు అనుసరిస్తారు.

కానీ నేడు చాలామంది యువకులు ఒక కొడుకుగా, ఒక సోదరుడిగా, చివరకు సరైన భర్తగా, సంపూర్ణమైన సమాజపౌరుడిగా సమర్థంగా నడచుకోలేకపోతున్నారు. అందుకే భద్రాచల రామదాసు దాశరథీ శతకంలో...

నోచిన తల్లిదండ్రికి, తనూభవుడొక్కడె చాలు మేటి, చే చాచనివాడు, వేరొకడు చాచిన లేదనకిచ్చువాడు, నో రాచి నిజంబు కాని పలుకాడనివాడు, రణంబులోన మేన్ దాచనివాడు భద్రగిరి దాశరథీ కరుణాపయోనిధీ!...

'ఒకరిని యాచించనివాడు, ఒకరు తనను యాచించగా లేదనక ఇచ్చువాడు, నోరు తెరచి అసత్యం పలుకనివాడు, యుద్ధమందు వెనుదీయనివాడు – ఇలాంటి కుమారుడు తల్లిదండ్రులకు ఒక్కడు కలిగినా చాలు; అనేకమంది అక్కర లేదు ఓ దశరథరామా!' అని తేల్చిచెప్పేశారు.

యుద్ధమంటే ఇక్కడ జీవనసమరమని అర్థం చేసుకోవాలి. ఇలా మన తల్లితండ్రులు వీడు నా కొడుకు అని నలుగురిలో గర్వంగా చెప్పుకునేట్లు మనదంటూ ముద్రను వేసుకోవాలి; అంతేకానీ 'వీడా నా కొడుక'ని జన్మనిచ్చినందుకు జీవితాంతం వారు కుమిలిపోయేలా ప్రవర్తించకూడదు.

కరదీపికల్లాంటి కొడుకులు... : కూతురంటే చిన్నచూపుతో కొడుకులనే అపురూపంగా చూసుకునే తల్లితండ్రులూ ఉన్నారు. పుత్రులు పుడితేనే పుణ్యం అనుకునేవారు, వారిపై అతిప్రేమను కురిపిస్తూ అసమర్థులుగా తయారు చేస్తున్నారు; చిన్నప్పుడు పక్కింటి పెరట్లో తోటకూర దొంగిలించిన నాడే కొడుకును దండించక, పెద్దయ్యాక రాజుగారి ధనాగారాన్ని కొల్లగొట్టే దాకా తీసుకువచ్చిన ఓ కథలోని తల్లితండ్రుల్లా వ్యవహరిస్తున్నారు. భవిష్యత్తులో కొడుకులు కొరకరాని కొయ్యల్లా పరిణమించాక వారిని చూసుకొని బాధపడుతున్నారు. అతిప్రేమతో అంధులుగా, అపరాధులుగా మిగిలిపోతున్న ఇలాంటి కన్నవారిని చూసే ధూర్జటి...

కొడుకులు పుట్టరటంచు నేడ్తు, రవివేకుల్ జీవనభ్రాంతులై కొడుకుల్ పుట్టరె కౌరవేంద్రున కనేకుల్, వారిచే నేగతుల్ పడసెం? పుత్రులు లేని యా శుకునకున్ వాటిల్లెనే దుర్గతుల్ చెడునే మోక్షపదం బపుత్రునకున్ శ్రీకాళహస్తీశ్వరా!

'శ్రీకాళహస్తీశ్వరా! జీవితంపై భ్రాంతి గల కొందరు తెలివిహీనులు కుమారులు జన్మించలేదని ఏడుస్తూ ఉంటారు. కౌరవరాజైన ధృతరాష్ట్రునికి వందమంది కుమారులు జన్మించారు. కానీ ధృతరాష్ట్రునికి వారి వలన ఏ ఉత్తమలోకాలు లభించాయి? శుకమహర్షికి కుమారులు లేరు. అయినా అతనికి నరకం ప్రాప్తించిందా? లేదు కదా! పుత్రులు లేనివారికి మోక్షం లభించ కుండా ఉంటుందా?' అని ప్రశ్నిస్తారు.

అయితే మరోవైపు నేడు సంఘంలో నిరుపేదలుగా పుట్టి, ఓ వైపు తల్లితండ్రులతో పాటు వ్యవసాయం, కూలీ పనులు చేసుకుంటూ, మరోవైపు వీధిబడుల్లో చదువుకుంటూ అత్యున్నతమైన ర్యాంకులతో ఉత్తీర్ణులై ఆ కన్నవాళ్ళు కూడా ఊహించని ఉన్నతస్థానాలకు చేరుకొని, వాళ్ళను కంటికి రెప్పలా చూసుకుంటున్న ఆదర్శనీయులైన యువకులూ ఉన్నారు.

వివేకానంద యువజన సంఘాన్ని నిర్వహిస్తున్న ఓ యువకుడు తల్లితండ్రులకు ఒక్కగానొక్క కొడుకు. చిన్నప్పుడే తండ్రి చనిపోయాడు. కష్టపడి ఉన్నత చదువులు చదువుకున్నాడు. ఓ వైపు ఉద్యోగం చేసుకుంటూనే, సామాజిక సేవాకార్యక్రమాల్లో పాల్గొంటూ ఉంటాడు. తల్లి చివరి రోజుల్లో దీర్ఘరోగంతో మంచాన పడి బాధపడుతున్న సమయంలో ఆయన తల్లికి చేసిన సేవలు చూసి స్థానికులే కదిలిపోయారు. ఆ తల్లి కొడుకు సపర్యలకు చలించిపోయి చివరకు ఆయన చేతిలోనే చివరి శ్వాస విడిచింది. కరదీపికల్లాంటి ఇలాంటి కొడుకుల్ని కన్నవారు ధన్యులు.

విభిన్నపాత్రల విశేషపోషణ... : ఆనాడు తండ్రి అడవులకు వెళ్ళమనగానే ఆ అయోధ్యరాముడు అర్ధాంగి అభిప్రాయం తెలుసుకుంటానని, అనుమతి తీసుకొని వస్తానని అంతఃపురానికి పరుగెత్తలేదు. తండ్రి మాటే వేదవాక్కుగా పితృవాక్య పరిపాలనకే కట్టుబడి ఉన్నాడు. కానీ ఈ రోజుల్లో చాలామంది యువకులు అమ్మానాన్నలు, అక్కాచెల్లెళ్ళు, అన్నదమ్ములకు సాయం చేయడానికి కూడా భార్య గీసిన గీతను జవదాటలేనంత భార్యావిధేయులుగా మారిపోతున్నారు. అలా అని ఆమెకు విలువ ఇవ్వకూడదని కాదు; తన నిర్ణయాధికారంలో ఎవరి పాత్ర ఎంత వరకు ఉండాలో తెలిసుండాలి! ఎవరికి ఎంత ప్రాధాన్యం ఇవ్వాలో, ఎవరిని ఎక్కడ పెట్టాలో స్పష్టంగా తెలిసిన వాడు శ్రీరాముడు అని వర్ణిస్తాడు వాల్మీకి ఓ చోట. ఇలా కుటుంబజీవితంలో కొడుకుగా, సోదరుడిగా, భర్తగా భిన్నపాత్రలను ఏకకాలంలో ఎంత సమర్థతతో పోషించాలో గుర్తించాలి. లేనినాడు ఎక్కడో ఒక దగ్గర మనం అపవాదులను ఎదుర్కోవలసి వస్తుంది. ఆది నుంచి తల్లితండ్రులు కూడా కొడుకు ఉదాత్తంగా ఎదిగేలా శిక్షణనివ్వాలి. తమ ప్రతినిధిగా, తమ వంశవృక్ష ఫలంగా కొడుకును చెట్టుకే పేరుతెచ్చేలా తీర్చిదిద్దాలి; కానీ చెట్టుపేరు చెప్పుకొని కాయలమ్ముకునే అవకాశవాదిగా మార్చకూడదు. అందుకే శ్రీమద్భాగవతం **'కుపుత్రుని కని పరితాపంబు పొందుట కంటెను, ధరలోన అనపత్యుండగు నొప్పును...'** అంటూ అసమర్థుడైన కుమారుడిని కని దుఃఖించడం కంటే సంతానం లేకుండా ఉండడమే ఎంతో మేలని హితవు పలికింది. ❖

త్యాగం విలువ...

భద్రాచలంలో సీతారాముల కల్యాణోత్సవాన్ని కళ్ళకు కట్టినట్లుగా ఓ వ్యాఖ్యాత వర్ణిస్తూ భక్తుల మనస్సును హత్తుకునేలా రామచంద్రుని ఘనతను ఇలా శ్లాఘించాడు : "చూశారా! శ్రీరాముడు తండ్రి మాట విని తమ్ముడి కోసం రాజ్యాన్ని త్యాగం చేస్తే, ఆయన విలువ ఎంత పెరిగిందో! తారకరాముడు ఒక్కసారి పట్టాభిషేకాన్ని వదులుకున్నందుకు ప్రతిఫలంగా వేల సంవత్సరాలుగా పట్టాభిషేకం చేస్తూనే ఉన్నాం. అదీ త్యాగానికున్న విలువ".

కుపుత్రుని వల్ల తల్లితండ్రులే కాదు, యావత్ వంశమూ నాశనం అవుతుంది. అందువల్ల గుణహీనులైన వందమంది పుత్రుల కంటే గుణవంతుడైన కుమారుడు ఒక్కడు చాలు. *- పంచతంత్రం*

అమృత హృదయం

– శ్రీమతి సుధామూర్తి, ఇన్ఫోసిస్ ఫౌండేషన్

నేను అమెరికాయాత్రలో ఉన్నప్పుడు అక్కడి రేడియోలో ఓ ఆసక్తికరమైన సంఘటన గురించి విన్నాను. జేబులో రూపాయి తీయకపోగా, 'మనం దానం చేస్తే మాత్రం అది సద్వినియోగమవుతుందా? ప్రపంచంలో మనుష్యుల కష్టాలు తీరిపోతాయా?' అని దాటవేసే చాలామందికి కనువిప్పు కలిగించే ఉదంతమిది. అమెరికాలోని ఓ దయామయుడి విశాలహృదయాన్ని ఆవిష్కరించిన ఆ యథార్థఘటన దాతృత్వంలో కొత్త కోణాన్ని చూపిస్తుంది. మనకు తోచింది ఇవ్వడమే తప్ప, దాని సద్వినియోగ, దుర్వినియోగాల గురించి ఎక్కువగా



ఆలోచించకూడదనీ, ప్రతిఫలం, కృతజ్ఞత లాంటివి ఆశించకూడదనీ తెలియజెప్పే సంఘటన సారాంశమిది.

అది చలికాలం... ఓ తల్లి చిన్నపిల్లను పట్టుకొని రోడ్డు పక్కన వణుకుతూ కూర్చుంది. విషాదం మూర్తీభవించినట్లు ఆ యువతి పక్కన మురికిపట్టిన దుస్తులతో ఆ చిన్నపిల్ల దీనంగా కూర్చొని, అనారోగ్యంతో బాధపడుతున్నట్లు కనిపిస్తోంది. 'క్యాన్సర్‌తో బాధపడుతున్నాను; దయతో ధర్మం చేయండి బాబూ' అని రాసి ఉన్న అట్టముక్క చేతిలో పట్టుకొని ఆ పాప కూర్చుంది. తల్లి భిక్షాపాత్ర పట్టుకుంది. ట్రాఫిక్ లైట్లు ఎర్రగా మారినప్పుడల్లా ఇద్దరూ రోడ్డు మీద ఆగి ఉన్న వాహనాల దగ్గరకు పోతున్నారు; సాయం చెయ్యండంటూ దీనంగా అర్థిస్తూ ఉన్నారు.

ఒకరోజు ఓ పోలీసు అధికారి ఆ దారిన పోతూ ఆ తల్లీకూతుళ్ళను చూశాడు. దగ్గరకు పోయి ఏవో ప్రశ్నలడిగాడు. ఉబ్బినకళ్ళు, కన్నీటి చారికలు, నీరసంగా, దీనంగా ఉన్న ఆ అమ్మాయి నిజంగా జబ్బుతోనే బాధపడుతోందని అనుకున్నాడు. సహాయం చెయ్యాలనిపించి, జేబులో ఉన్న పర్సు తీసి చూశాడు. అప్పుడే బ్యాంకు నుంచి తీసుకొని వచ్చిన బోనస్ డబ్బు కనిపించింది. 'నాకు మంచి ఇల్లుంది; నన్ను పట్టించుకునే భార్య ఉంది; ప్రేమించే కొడుకున్నాడు. దేవుడు నా పట్ల చాలా దయ చూపించాడు. ఈ దురదృష్టవంతులకు నిలువ నీడ లేదు. పైగా భయంకరమైన వ్యాధి. నా లాంటి వాళ్ళు కాకపోతే ఇంకెవరు ఇలాంటి వాళ్ళను ఆదుకుంటారు!' అని అనుకున్నాడు.

కానీ ఇంతలో భార్య, కొడుకు గుర్తొచ్చారు. వాళ్ళకు బోనస్ వస్తే ఏవేవో కొనిపెడతానని మాటిచ్చాడు. కొద్దిసేపు ఆ పోలీసు అధికారి సందిగ్ధంలో పడ్డాడు. చివరకు మనస్సు ఈ అభాగ్యుల వైపే మొగ్గింది. డబ్బంతా తల్లి చేతిలో పెట్టాడు. 'అమ్మాయిని జాగ్రత్తగా చూసుకో; మంచి వైద్యం చేయించు' అని చెప్పాడు.

సాయంత్రం ఆ పోలీసు అధికారి ఇంటికి చేరుకున్నాడు. భార్య, కొడుకు ఎదురొచ్చారు. జరిగిన విషయమంతా చెప్పాడు. భార్య విని, కొద్దిసేపు మౌనంగా ఉంది. కానీ, ఆ తర్వాత ఆమె ముఖంలో చిరునవ్వు మెరిసింది. కొడుకుకు కోపం వచ్చింది. 'నాన్నా! వాళ్ళు మోసం చేయలేదని నీకెలా తెలుసు? అయినా అంతా ఎందుకిచ్చావు? కొంత సాయం చేస్తే సరిపోయేది కదా!' అనుకుంటూ అసహనంగా తన గదిలోకి వెళ్ళిపోయాడు.

రోజులు గడిచాయి. జరిగిన దానిని గురించి అందరూ మరచిపోయారు. ఒకరోజు కుటుంబంతో కలసి ఆ పోలీసు అధికారి టీవీ చూస్తూ ఉండగా, ఓ వార్త ప్రసారమవుతూ ఉంది. 'జనాన్ని మోసగిస్తూ దొరికిపోయిన తల్లీకూతుళ్ళు...' అంటూ ఇద్దరి చిత్రాలతో ఓ కథనం టీవీలో వస్తోంది. 'స్వార్థపరురాలైన ఓ తల్లి, కూతుర్ని క్యాన్సర్ రోగిగా నటింపజేస్తోంది. బిడ్డను క్యాన్సర్ రోగే అన్నట్లు తయారు చేసి ఎందరినో మోసం చేసి డబ్బులు దండుకుంటోంది. అసలు విషయం తెలిసి పోలీసులు ఆమెను అరెస్టు చేశారు...' అంటూ టీవీలో వ్యాఖ్యాత వివరిస్తూ ఉన్నాడు.

ఆ తల్లీకూతుళ్ళు ఎవరో ఆ అధికారి కుమారుడికి అర్థమైంది. వెంటనే అక్కడే ఉన్న తండ్రి వైపు తిరిగి, 'చూశావా నాన్నా! ఆ తల్లీకూతుళ్ళు నిన్ను మోసం చేశారు. ఆ పిల్లకు ఏ రోగమూ లేదు. మీరేమో బోనస్ అంతా వాళ్ళ చేతిలో పెట్టారు' అన్నాడు.

'పోనీలేరా! ఇప్పుడు నాకు మరింత సంతోషంగా ఉంది. ఆ అమ్మాయికి క్యాన్సర్ లేదు. ఆరోగ్యంగా ఉంది. అదే చాలు' అనుకుంటూ కొడుకును దగ్గరకు తీసుకున్నాడు.

కొడుకుకు ఆశ్చర్యమేసింది. తండ్రి కోపంతో ఊగిపోతాడనుకున్నాడు; మోసపోయినందుకు మథనపడతాడని అనుకున్నాడు. కానీ అలాంటి ఛాయలేవీ ఆయన ముఖంలో కనిపించలేదు. ఇంతలో భార్య కాఫీతో అక్కడికి వస్తూ, 'బాబూ! నువ్వు చాలా అదృష్టవంతుడివిరా! నీకు మంచి తండ్రి ఉన్నాడు. మోసపోయినందుకు ఆయన బాధపడడం లేదు. ఎవరి బిడ్డో ఆరోగ్యంగా ఉన్నందుకు ఆనందిస్తూ ఉన్నారు. అమృత హృదయంరా వారిది' అంది. కొడుకు ప్రేమతో 'యు ఆర్ గ్రేట్ డాడీ!' అంటూ తండ్రిని ఆలింగనం చేసుకున్నాడు. ❖ సేకరణ: జి. సతీష్

మీకు మీరే బలం!

– స్వామి రంగనాథానంద
(రామకృష్ణ సంఘ 13వ సర్వాధ్యక్షులు)


మనిషి తనకు తానే బలం. సంపాదించుకున్న ఆస్తిపాస్తుల కన్నా, ఆత్మశక్తే ప్రధాన రక్షణ. జీవితంలో సంఘర్షణలు, సవాళ్ళు ఎదురైనప్పుడు బయట నుంచి సహకారం కొంత వరకే పరిమితమనీ, మనకు అండగా నిలిచేది ఆంతరిక శక్తేననీ అందరికీ అనుభవైకవేద్యమే! 1939 నుంచి 1942 వరకు నేను రంగూన్‌లో ఉన్నప్పుడు జరిగిన కొన్ని సంఘటనలు ఈ సత్యానికి సాకారంగా నిలిచాయి.

ఆ రోజుల్లో యుద్ధ ప్రభావం, అననుకూల పరిస్థితులు స్థానిక ప్రజలను దిగ్భ్రాంతికి గురి చేశాయి. తత్ఫలితంగా వేలమంది బర్మా నుంచి భారతదేశానికి వలసబాట పట్టారు. ఆ సమయంలో మద్రాసు, ఉత్తరప్రదేశ్, బీహార్, బెంగాల్ తదితర రాష్ట్రాలకు చెందిన ఎందరో శరణార్థులు అక్కడి నుంచి తమ స్వస్థలాలకు తిరుగుముఖం పట్టారు. అన్ని రోజులుగా అక్కడ వ్యాపారాలు, ఉద్యోగాలు చేసి సంపాదించుకున్న ఆస్తిపాస్తులు, వస్తుసముదాయాలను వదులుకొని రావడానికి ముందు వారు చాలా బాధపడ్డారు. గత్యంతరం లేని పరిస్థితిలో చివరకు తాము మోయగలిగిన కొన్ని వస్తువులను చేత పట్టుకొని, స్వదేశానికి వెనుదిరిగారు. రేడియోలు, దుప్పట్లు, కొన్ని విలువైన వస్తువులు మూటకట్టుకొని నడక సాగించారు. ప్రారంభంలో కొంత ఉత్సాహంగా మోసుకు రాగలిగారే కానీ, రానురాను అవి పెనుభారంగా మారిపోయాయి. నడవడమే కష్టమవుతూ ఉండడంతో చేతనున్న వస్తువులు మరింత భారంగా పరిణమించాయి. అలా కొన్ని కిలోమీటర్లు నడిచాక, ఆ వస్తువులను మోయలేక వస్తువులన్నింటినీ ఒక్కటొక్కటిగా మధ్యలోనే వదిలేశారు. అక్కడి నుంచి బయలుదేరేటప్పుడు వెంట తెచ్చుకున్న ఒక్క వస్తువు కూడా గమ్యస్థానానికి చేరలేదు. ముందు తాము భద్రంగా తమ ప్రాంతాలకు చేరుకుంటే చాలు, ఇతర వస్తువులన్నీ తరువాత సంపాదించుకోవచ్చన్న నమ్మకంతో వారు తమ స్వస్థలాలకు చేరుకున్నారు. అప్పటి వరకు తాము సంపాదించుకున్నవన్నీ కోల్పోయినా, ఏ మాత్రం బాధపడకుండా భవిష్యత్తుపై నమ్మకంతో, తమపై విశ్వాసంతో నిబ్బరంగా నిలబడ్డారు. ‘జీవితంలో ఏం కోల్పోయినా పరవాలేదు. మనకు మనం ధైర్యంగా ఉంటే చాలు. అన్నీ ఉన్నట్లే!’

వ్యక్తికి క్లిష్టపరిస్థితులు పరోక్షంగా తన విలువేంటో తనకు తెలియజేస్తాయి. ముందు తను భద్రంగా, బలంగా ఉంటే ఆస్తిపాస్తులు ఎన్నైనా సంపాదించుకోవచ్చన్న నమ్మకాన్ని కలిగిస్తాయి. అయితే అంతటి ఆత్మవిశ్వాసం మనలో వేళ్ళూను కోవాలంటే మనలో ఆంతరికశక్తిని జాగృతం చేసుకోవాలి. దీనికి సంబంధించి బైబిల్‌లో ఓ చోట ఏసుక్రీస్తు ‘A foolish man built his house on sand and the rains descend and the floods came and the winds blew and beat upon that house and it fell and great was its fall. But a wise man built his house on a rock and the rains descended and the floods came and the winds blew and beat upon that house and it fell not, because it was founded on a rock – మూర్ఖుడైన వ్యక్తి ఇసుక నేలపై ఇల్లు కట్టుకున్నాడు; అందుకే ఏ చిన్న గాలివాన వచ్చినా, వాన కురిసినా నిలువనీడ కోల్పోయాడు; కానీ తెలివైన వ్యక్తి రాతినేలపై ఇల్లు కట్టుకున్నాడు; పెను తుపానులు వచ్చినా ఆ ఇల్లు చెక్కుచెదరదు. కారణం గట్టి నేలపై స్థిరంగా కట్టుకున్న ఇల్లది’. ఈ చిన్న నీతికథతో ఏసుక్రీస్తు అద్భుతమైన జీవనసూత్రాన్ని పొందుపరిచారు.

జీవితాన్నంతా ఇలా ఆత్మశక్తితో అనుసంధానం చేసుకున్నవారిని ఏ అలజడీ కదిలించలేదు. అయితే మనలో చాలామందిలో ఈ స్పృహ కనిపించదు. వారు తమ కన్నా, తమలోని శక్తి కన్నా బాహ్య సహాయ సహకారాలపైనే ఎక్కువ నమ్మకం కలిగి ఉంటారు. ఫలితంగా ఎప్పుడూ నిరాశా నిస్పృహలకే గురవుతూ ఉంటారు. నిజానికి కీలకమైన జీవన పోరాట సమయాల్లో స్వశక్తే మనల్ని కాపాడుతుందన్న విషయాన్ని విస్మరిస్తారు. కానీ, 'My life is rooted in my awareness of the Atman. nothing can shake. – నేను ఆత్మచైతన్యంపై ఆధారపడ్డాను. అందువల్ల నన్ను ఏ శక్తీ విచలితున్ని చేయలేదు’అని అనుకున్నవారిలో ఎలాంటి అలజడులకు ఆస్కారం ఉండదు. ❖

సేకరణ: ఆర్. కృష్ణ



(...19వ పేజీ తరువాయి)

ఎలాంటి శిక్షణా ఇవ్వడం లేదు. కనీసం తల్లితండ్రులూ ఇవ్వడం లేదు! కానీ 'పిల్లలు చెడిపోతున్నారు, యువత పెడదారి పడుతోంది. దేశం నాశనమవుతోంది!' అంటూ గగ్గోలు పెడుతూనే ఉన్నాం.

మన కళ్ళను మనమే తెరవడానికి మన 'మనస్సు' సిద్ధంగా ఉండాలి, స్థిరంగా ఉండాలి కానీ బాహ్య పరిస్థితులు కానేకాదు. ఈ ఆత్మ పరిశీలన, మానసిక అంతర్మథనం, మానసిక శిక్షణ, పవిత్రతా ప్రశిక్షణ లేకపోతే మన బాహ్య ధన సంపదలు, భోగాడంబరాలు, తళుకులీనే వేషభూషణాలు – అన్నీ 'శవంపై కప్పిన గులాబీ రేకులే! పైన పటారం, లోన లొటారమే!

అందుకే ప్రసిద్ధ బెంగాలీ భక్త కవి రామప్రసాద్ ఇలా పాడారు: 'మన్‌రే కృషికాజ్ జానోనా, తుమి కృషి కొర్‌లే ఫల్‌తో సోనా' (ఓ మనసా! నీకు సేద్యం చేయడం తెలీదు, అది తెలిసి నీవు కష్టపడి ఉంటే బంగారం లాంటి పంటలు పండించే దానివి).



'భగవత్ సాక్షాత్కారం పొందిన మనస్సు శుద్ధ మనస్సు. శుద్ధ మనస్సు, శుద్ధ ఆత్మ ఒక్కటే. మనస్సు ఆవాల పొట్లం లాంటిది. ఆ పొట్లం చిరిగిపోతే (నియంత్రించక పోతే) అవి చెల్లాచెదురైపోతాయి'అన్నారు శ్రీరామకృష్ణులు.

మంత్రదీక్ష నిచ్చి గురువు శిష్యునితో ఇలా అంటాడు: 'ఏ దిలామ్ మన్ – తొర్. ఎఖొన్ మన్ తోర్ – ఇప్పుడు నీకు మంత్రం ఇచ్చాను. ఇకపై అంతా నీ మనస్సుపై ఆధారపడి ఉంది'. మన్ తొర్– మంత్రము, మన్ తోర్ – మనస్సు నీది. నీవు ఏకాగ్రతతో చేసే మంత్ర జపంపై నీ ఆధ్యాత్మిక ప్రగతి ఆధారపడి ఉంది.

'మయ్యావేశ్య మనో యే మాం నిత్యయుక్తా ఉపాసతే' – ఎవరి మనస్సు నా చేత, నాలోనే ఆవేశింపబడి ఉన్నదో, ఎల్లప్పుడూ నా ధ్యానంతోనే ఉపాసన చేస్తూన్నదో అట్టి భక్తుడే నాకు ప్రియుడు' *(గీత–12.2)* అనీ; 'మయ్యేవ మన ఆధత్స్వ మయి బుద్ధిం నివేశయ – నాపైనే నీ మనస్సు నిలుపు, నాలో నీ బుద్ధిని లగ్నం చేయి' (గీత–12.8) అనీ; 'మన్మనా భవ మద్భక్తో మద్యాజీ మాం నమస్కురు' – నీ మనస్సు నాకు అర్పించు, నా భక్తుడవు కమ్ము, నన్నే పూజించు, నాకు నమస్కరించు' (గీత–9.34) అనీ శ్రీకృష్ణ పరమాత్మ తల్లి తన శిశువుకు చెప్పినట్లు ఎంతో ప్రేమ, కరుణలతో మనకు గీతా బోధ చేశాడు.

కానీ మన మనస్సును శాశ్వత శాంతి, ప్రేమ, ఆనందాలనిచ్చే భగవంతునిపై కాకుండా అశాశ్వతమైన ప్రపంచంపై, కామినీ కాంచనాలపై లగ్నం చేస్తున్నాం. మనస్సును భగవంతునికి అర్పించకుండా ప్రాపంచిక విషయాలకు అర్పిస్తున్నాం. 'తనను తాను (మనస్సు, బుద్ధి, అహంకారం, స్వార్థాలను) జయించిన వాడు విశ్వాన్నే జయిస్తాడు' అన్నారు స్వామి వివేకానంద.

మన మనస్సు కోరుకునే అనంతమైన, శాశ్వతమైన, స్థిరమైన ప్రేమ ఒక వ్యక్తిలోనో, వస్తువులోనో దొరుకుతుందని ఆశిస్తాం. జీవితాంతం వారి వెంటా, వీరి వెంటా పరుగులు పెడతాం! చివరకు దొరికేది తీవ్ర అశాంతి, అసంతృప్తి, అంతులేని ఆవేదనే! ఆ అనంత ప్రేమ, శాంతి, ఆనంద సాగరుడు కేవలం భగవంతుడు మాత్రమే! 'భగవంతుడు అనంత ప్రేమ స్వరూపుడు, అనిర్వచనీయ ప్రేమమూర్తి' అన్నారు నారద మహర్షి.

పవిత్రమైన, అనంతమైన, నిస్వార్థమైన ప్రేమ స్వరూపుడైన శ్రీరాముని ప్రేమించేవాడు, 'ఆ రాముని'లోనే 'ఆరామ్' (శాంతి, విశ్రాంతి) పొందేవాడు – శాశ్వత శాంతి, పరమానందం పొంది ధన్యుడవుతాడు!

మరి భార్యను, భర్తను, బంధుమిత్రులనూ ప్రేమించ కూడదా? తప్పక ప్రేమించాలి. కానీ వారందరిలో 'శ్రీరాముడు' వారి ఆత్మలలో 'ఆత్మారాముడు'గా ఉన్నాడు. వారిలో ఆ ఆత్మారాముడిని చూస్తూ, భగవంతుని అంశలుగా, వివిధ రూపాలుగా భావించి ప్రేమించాలి. కేవలం శరీరాలుగా కాదు, బాహ్య సౌందర్యాన్ని కాదు! మట్టి బొమ్మలను కాదు!

సాధనలు చేస్తూ సాధకుడు కొద్దిపాటి శాంతి, ఆనందం పొందగానే 'నేను అంతా సాధించాను' అని భ్రమించరాదు. ఈ విచిత్రమైన మనస్సు ఎన్నోసార్లు అలా మనల్ని మోసం చేస్తుంది. ప్రలోభాల, ఆకర్షణల వలయాలను భ్రమలు సృష్టిస్తాయి! కనుకనే ఎంతో ఉన్నతులు, గొప్పవాళ్ళు అయినా ఈ 'మహామాయ' మోహజాలంలో చిక్కుకుని అధః పతితులవుతున్నారు, అపఖ్యాతి పాలవుతున్నారు!

అలాంటి ఆకర్షణలు, ప్రలోభాలకు దూరంగా ఉందాం. 'సీతమ్మ మా యమ్మ, శ్రీరాముడు మాకు తండ్రి' అని శ్రీసీతారాములను ఆశ్రయిద్దాం. 'నను బ్రోవమని చెప్పవే సీతమ్మ తల్లీ!' అనీ మన తల్లి సీతమ్మనూ, 'అన్యాయము సేయకురా రామా! నను అన్యునిగా చూడకురా!' అని మన తండ్రి శ్రీరామచంద్ర ప్రభువునూ ఆశ్రయిద్దాం. 'ఉండేది రాముడొకడు... ఊరక చెడిపోకు మనసా!' అని మనస్సుకు బోధిస్తూ మచ్చిక చేసుకుని నిజమైన రామదాసులా, త్యాగరాజులా జీవిద్దాం! ❖



(1884 – 1967)

ముందుకు సాగిపో !

దివ్యజనని శ్రీశారదాదేవి ప్రత్యక్ష శిష్యులైన స్వామి ప్రేమేశానంద (1884-1967) రామకృష్ణ సంఘంలో అత్యున్నత గౌరవాన్నీ, ప్రేమాభిమానాలనూ చూరగొన్న అగ్రశ్రేణి సన్యాసి. ఆయన జీవితం శ్రీరామకృష్ణ - వివేకానందుల ఆశయాలతోనూ, భగవద్గీత సారాంశంతోనూ నిండింది. చాలామంది యువతీ యువకులకూ, గృహస్థులకూ, బ్రహ్మచారులకూ, సన్యాసులకూ ఆయన ఎన్నో లేఖలు వ్రాశారు. జీవితంలో అంకితభావం, ఆధ్యాత్మిక, సేవా భావాలను అలవరచుకొనేందుకు ఆ లేఖా పరంపరలు మార్గదర్శకాలయ్యాయి. పాఠకుల ప్రయోజనార్థం విలువైన ఈ లేఖలను 'శ్రీరామకృష్ణ ప్రభ'లో 2009 జూన్ సంచిక నుంచి ధారావాహికంగా ప్రచురిస్తున్నాం.

సార్‌గాచీ,
22 మే 1940

*ప్రియమైన విపత్ భంజన్!**

"ఒక్కసారి నువ్వు పటిక బెల్లం రుచి చూశావంటే సాధారణమైన తాటిబెల్లం లాంటివి నీకు రుచించవు" అని శ్రీరామకృష్ణులు అనేవారు. మనం మన పంచేంద్రియాల ద్వారా ఈ ప్రాపంచికమైన దృశ్యాలు, శబ్దాలు, రుచులు మొదలైన వాటితోనే ఆనందిస్తుంటాం. కానీ మనం మన ఆత్మలోనే అనుభవించ గలిగిన ఆ శాశ్వత ఆనందపు 'రుచి'ని మర్చిపోయాం. ఆ ఆత్మానందాన్ని కొద్దిగానైనా అనుభవానికి తెచ్చుకోనంత కాలం ఈ చౌకబారు ఆనందం నుండి విడుదల కాలేము. గురుమహరాజ్ దివ్యలీలా విలాసం గురించి ఆలోచించడం గానీ, అవధులులేని అమ్మ శారద ప్రేమాదరణలను ధ్యానించడం గానీ, అసాధారణమైన స్వామీజీ జీవితాన్ని గురించి అవగాహన చేసుకోవడం గానీ నువ్వు చేయగలిగితే చీకట్లు పటాపంచలై, అనంతమైన శాంతి సాగరపు అద్భుత దర్శనం కలుగుతుంది. అప్పుడు మాత్రమే భగవత్సాక్షాత్కారానికి సంబంధించి బలమైన ఆతురత నీలో జనిస్తుంది.

పరమాత్మను పొందాలంటే ప్రపంచంలోని మంచి, చెడు అనే రెంటినీ వర్జించవలసిందే సుమా! ఎన్నో జన్మల సంస్కారాల ప్రభావం వల్ల మనం ఈ ప్రపంచాన్ని విస్మరించలేము. అందుచేత మనం ఒక్కొక్క అంశాన్నీ వదలడానికి ప్రయత్నిస్తుంటాం. ఈ పద్ధతి ద్వారా ఆయనను చేరడానికి చాలాకాలం పడుతోంది. ప్రపంచాన్ని త్యజించడం అంటే దాని పట్ల నిర్లిప్తంగా ఉంటూ, భగవన్నామ స్మరణలో నిరంతరం మునిగి ఉండడం. అంతేగానీ ఇల్లు వదిలి, గంగ ఒడ్డున కూర్చున్నంత మాత్రాన ఏం ఒరుగుతుంది చెప్పు? మనం మన గృహకృత్యాల్లో ఉంటూనే చేతనైనంత మేరకు ఆయన ఆలోచనల్లోనే నిమగ్నమై ఉండడం మేలు. విధుల నిర్వహణ అనే నెపంతో ప్రపంచాన్నే పట్టుకు వేళాడతాం. ఆ కారణం వల్లనే మనస్సులో సిద్ధాంతాలు, రాజకీయాలు పుడుతూ ఉంటాయి.

భగవంతుణ్ణి మాత్రమే వాంఛించే వ్యక్తికి 'సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ *(గీత –18.66)* – సమస్త ధర్మాలనూ, అధర్మాలనూ విడచి నన్ను శరణు పొందుము'. 'మయ్యేవ మన ఆధత్స్వ మయి బుద్ధిం నివేశయ *(గీత–12.8)* – మనస్సునూ, బుద్ధినీ నామీదే నిలుపుము' అనే శ్రీకృష్ణ పరమాత్ముని బోధల కన్నా వేరే మార్గం లేదనేది బోధపడుతుంది.

ముందుకు సాగిపోవడమే మన పని. ఆధ్యాత్మిక మార్గంలో వచ్చే అడ్డంకులనూ, బంధాల వలనూ ఛేదించుకుని ముందుకు సాగడమూ, అలా సాగిపోయే వారి సాహచర్యం పొందడమూ, సంశయాత్ములను మన వెనుకనే వదిలి ముందుకు సాగిపోవడమే మన విధి. గతంలోని బాధలన్నిటినీ మరచి ముందుకు సాగు. విచారం మిగలదు. 'ముందుకు సాగిపో' ఇదే మన మంత్రం.

ప్రేమాశీస్సులతో
స్వామి ప్రేమేశానంద

తెలుగు సేత: *కె. త్రివిక్రమరావు*

(*విపత్‌భంజన్, కాలాంతరంలో రామకృష్ణ సంఘంలో సన్న్యాసం స్వీకరించి స్వామి స్వాహానందగా ప్రసిద్ధులయ్యారు.)

ఔషధాన్ని సేవిస్తే వ్యాధులు పూర్తిగా నయమైనట్లే, భగవంతుని గురించి నిరంతరం చింతన చేస్తూ ఉంటే పూర్వజన్మల సంస్కారాలతో సహా నీ అజ్ఞానం సంపూర్ణంగా తొలగిపోతుంది. - శ్రీరాముడు

(...15వ పేజీ తరువాయి)
చెప్పిన ధర్మమార్గంలో పయనిస్తే ఆ ఇంట సాక్షాత్తూ ఆ జగన్నాథుడే జన్మిస్తాడని నిరూపించేందుకే ఆ వంశాన్ని ఎంచుకున్నాడు. ఆ వంశానికి ఆద్యుడైన ఇక్ష్వాకుడు శ్రీమహావిష్ణువును విశేషంగా ఆరాధించి, శ్రీరంగనాథుడిని కులధనంగా పొందాడు. అంతగా ఆరాధన చేసిన వంశం కనుక భగవంతుడు ఇక్ష్వాకువంశంలో జన్మించాడు. సూర్యమండలాంతర్వర్తిగా శ్రీమన్నారాయణోపాసన చేస్తారు. అందుకే దానిని సూర్యవంశమని కూడా పిలుస్తారు. భాగవతులైన ఇళ్ళలో భగవదంశతో కూడిన బిడ్డలు పుడతారనడంలో ఎలాంటి సందేహం లేదు. అలాంటి సూర్యవంశంలో జనించిన రఘురాముడిని రాజవరశేఖరుడనీ, సూర్యవంశసుధాకరుడనీ, ఆజానుబాహుడనీ, కోదండాన్ని ధరించిన దీక్షాగురుడనీ కొనియాడుతూ...


రాజవరశేఖరం రవికుల సుధాకరం
ఆజానుబాహు నీలాభ్రకాయం
రాజారి కోదండ రాజ దీక్షాగురుం
రాజీవలోచనం రామచంద్రం...అని అన్నమయ్య నీరాజనాలర్పిస్తున్నాడు. ఇలాంటి శ్రీరాముడు సభలో ప్రవేశించగానే వెయ్యి సూర్యులు ఒకేసారి ప్రకాశించినట్లు పురాణాలు ప్రస్తావించాయి. ఆ తేజస్సు జడతేజస్సు కాదు. సూర్యోదయం కాగానే కమలాలు వికసించే రీతిలో, సభాసదుల హృదయ కమలాలు ఒక్కసారిగా వికసించాయని వర్ణించాయి. అలాంటి సుగుణాభిరాముడు భోగులకు దూరంగా ఉంటాడనీ, యోగులనే దరికి చేర్చుకుంటాడనీ ఓ పరమభక్తుడు పరవశంతో..

సదా భోగభాజాం సుదూరే వసన్తమ్
సదా యోగభాజా మదూరే విభాన్తమ్
చిదానన్ద కన్దం సదా రాఘవేశమ్
విదేహాత్మజా నందకన్దం ప్రపద్యే

'భోగలాలసులకు సదా అతి దూరాన ఉండేవాడూ, యోగలాలసులకు అతి సన్నిహితంగా వర్తించేవాడూ, చిదానంద స్వరూపుడూ, సీతాదేవికి సంతోషమొనర్చే వాడూ అయిన శ్రీరామచంద్రుని నిరంతరం శరణు పొందుతా'నంటాడు.

ధర్మసంస్థాపనం

సత్యాన్నీ, ధర్మాన్నీ రెండు పాదాలుగా చేసుకొని శ్రీరాముడు సాగించిన ప్రయాణమే రామాయణం; వేదం ఓ మహాపురుషుడి జీవనగాథగా ఒదిగితే, దాని పేరే రామాయణం. అందుకే మన సనాతన ధర్మం వేదవేద్యుడైన పరమాత్మ దశరథ తనయుడిగా జన్మించగా, వేదమే రామాయణమైందనీ, వాల్మీకి దీనికి సంధాయకుడనీ నిర్వచిస్తూ...


వేంకటేశం సాధు విబుధ వినుతం

వేద వేద్యే పురే పుంసి జాతే దశరథాత్మజే
వేదః ప్రాచేత సాదాసీత్ సాక్షాత్ రామాయణాత్మనా
అంది. అలాంటి వేదస్వరూపుడిని ఈ వేంకటేశ్వర భక్తాగ్రేసరుడు నీలమేఘ శ్యాముడనీ, విశాలమైన వక్షంతో విరాజిల్లేవాడనీ, కమలనాభుడైన విష్ణుమూర్తేననీ, సర్పసంహారకుడైన గరుడుడినే వాహనంగా చేసుకున్నవాడనీ, ధర్మసంస్థాపకుడనీ, ఆదిశేషుడిపై పవళించే పరమపురుషుడు భూమిజ అయిన సీతాదేవి పతిదేవుడనీ కొనియాడుతూ...

నీలజీమూత సన్నిభశరీరం ఘన వి
శాలవక్షం విమల జలజనాభం
తాలాహి నగహరం ధర్మసంస్థాపనం
భూలలనాధిపం భోగిశయనం.... అంటున్నాడు.

'నీలజీమూత' అంటే నీలమేఘమనీ, 'భూలలన' అంటే సీతాదేవి అనీ అర్థం. ఆదికావ్యానికి కథానాయకుడైన కోదండరాముడి చరితంలో దేశ, కాల, జాత్యాది భేదాలేవీ లేకుండా సకల మానవాళికి ఉపకరించే ఎన్నో మార్గదర్శక సూత్రాలున్నాయి. నానాటికీ పెచ్చుమీరుతున్న సామాజిక రుగ్మతలకూ, నైతిక పతనానికీ రామాయణాన్ని మించిన పరమౌషధం మరొకటి లేదు.

వేంకటేశం...

శ్రీరామకృష్ణులు భక్తిపారవశ్యంలో దశరథ నందనుడైన శ్రీరాముడే ప్రతి దేహంలో జీవుడిగా వ్యక్తమవుతూ ఉన్నాడు; అతడే జగత్తు లోపలా, బయటా అద్వితీయుడై ఉన్నాడన్న భావనతో కూడిన...

జే రామ్ దశరథకీ బేటా వహీరాం ఘటీఘటమే తేటా!
వసీరామ్ జగత్పసేరా, వహీరామ్ సబ్‌సే నేయారా! అన్న భజనను తరచూ ఆలపిస్తూ ఉండేవారు. రామకృష్ణ మఠాల్లో ఇప్పటికీ ప్రతి ఏకాదశి పర్వదినాన విధిగా రామనామ సంకీర్తనను ఆలపించే సంప్రదాయాన్ని కొనసాగిస్తూ ఉన్నారు. అదే పరవశంతో అన్నమాచార్యులు కూడా...

పంకజాసన వినుత పరమ నారాయణం
శంకరార్జిత జనక చాప దళనం
లంకా విశోషణం లాలిత విభీషణం
వేంకటేశం సాధు విబుధ వినుతం...

అంటూ ముగింపు పలుకుతున్నాడు. పంకజాసనుడైన బ్రహ్మదేవుడు వినుతించే పరమ నారాయణుడు, జనకుడి శివధనుస్సును అవలీలగా విరిచినవాడు, లంకపై గెలిచి విభీషణుడికి పట్టం కట్టినవాడు కలియుగంలో వేంకటాద్రిపై వెలసి పూజలందుకుంటున్నాడని పులకించిపోతున్నాడు. ❖



కార్యసాధనకు కావలసింది...

మానవుల్లో యోగులు, జ్ఞానులు ఉన్నట్లే దేవతల్లోనూ యోగులుంటారు. నారదుడు మహాయోగి, దైవజ్ఞాని. ఆయన త్రిలోక సంచారం చేస్తూ ఉంటాడు. ఒక రోజున నారద మహర్షి అరణ్య మార్గం గుండా పోతూ ఒక వ్యక్తిని చూశాడు. అతని శరీరం చుట్టూ చెదలు పుట్టలు పెట్టాయి. చాలా కాలంగా అతడు అదే స్థితిలో కూర్చొని ధ్యానం చేస్తూ ఉన్నాడు.



నారదుణ్ణి చూసి ఆ వ్యక్తి "ఎక్కడకు వెళుతున్నారు స్వామీ" అని అడిగాడు.

నారదుడు "వైకుంఠానికి వెళుతున్నాను" అని సమాధాన మిచ్చాడు. "అయితే ఆ శ్రీమన్నారాయణునికి నాపై ఎప్పుడు అనుగ్రహం కలుగుతుందో, నాకు ఎప్పుడు ముక్తి లభిస్తుందో అడగండి స్వామీ!" అని విన్నవించాడు ఆ వ్యక్తి.



నారదుడు ముందుకు సాగిపోతున్నాడు. ఆయనకు మరొక వ్యక్తి కనిపించాడు. అతడు ఆనందంతో గంతులు వేస్తూ, పాడుతూ నృత్యం చేస్తున్నాడు.

"నారద మహామునీ! తమరు ఎక్కడకు వెళుతున్నారు?" అని అడిగాడు ఆ రెండో వ్యక్తి. అతని కంఠస్వరం, శారీరక భంగిమలు ఆటవికంగా ఉన్నాయి.

"స్వర్గానికి వెళుతున్నాను" అని సమాధానం చెప్పాడు నారదుడు. "అయితే నాకు ముక్తి ఎప్పుడు లభిస్తుందో అడిగి చెబుతారా?" అన్నాడావ్యక్తి. అందుకు నారదుడు 'సరే' అని ముందుకు సాగిపోయాడు.

నారద మహర్షి కొంతకాలం తర్వాత అదే దారి వెంటవస్తూ పుట్టల మధ్య ధ్యానం చేసుకుంటున్న మొదటి వ్యక్తిని సమీపించాడు.

సంభాషణ ఇలా సాగింది:

"నారద మహామునీ! నా విషయం దైవాన్ని అడిగారా?"

"అడిగాను"

"ఆయన ఏమన్నారు?"

"నీకు మరొక నాలుగు జన్మల తర్వాత ముక్తి లభిస్తుందట" అని చెప్పాడు నారదుడు.

అందుకు ఆ వ్యక్తి విలపిస్తూ "నేను నా శరీరం చుట్టూ పుట్టలు కట్టేదాకా ధ్యానం చేశాను. నాకు ఇంకా మరో నాలుగు జన్మలా?" అని గోల పెట్టాడు.

నారదుడు రెండో వ్యక్తిని సమీపించాడు.

"నా ముక్తిని గురించి అడిగారా స్వామీ?" అని నారదుణ్ణి ఆ రెండో వ్యక్తి ప్రశ్నించాడు.

అందుకు నారదుడు "అవును అడిగాను. ఈ చింత చెట్టును చూస్తున్నావా? దీనికి ఎన్ని ఆకులు ఉన్నాయో అన్ని జన్మలు ఎత్తాలి నువ్వు. ఆ పిదప నీకు ముక్తి లభిస్తుందన్నాడు నారాయణుడు" అని తెలిపాడు.

నారదుని సమాధానం వినగానే ఆ రెండో వ్యక్తి "ఆహాహా! అంత తక్కువ కాలంలోనే నాకు మోక్షం లభిస్తుందా!" అంటూ ఆనందంతో కేరింతలు కొడుతూ నృత్యం చేయసాగాడు. ఇంతలో ఆకాశవాణి "ఓ కుమారా! ఈ క్షణమే నువ్వు ముక్తుడవయ్యావు" అని పలికింది.

కార్యసాధనలో అతని పట్టుదలకు ఫలితమది. తన కార్యసాధనకై అతడు ఎన్ని జన్మలెత్తడానికైనా సిద్ధపడ్డాడు. నిరాశ చెందలేదు.

కాబట్టి కార్యసాధకుడు ఆ రెండో వ్యక్తిలా ఎంత కాలమైనా సహనంతో, పట్టుదలతో లక్ష్యసిద్ధికై ప్రయత్నిస్తే ఉత్తమ ఫలితం లభిస్తుంది. ❖

తెలుగు సేత: కె. త్రివిక్రమరావు

కష్టాలు పర్వతమంతగా కనిపించినా, పరిస్థితులన్నీ భయంకరంగా ఉన్నా భయపడవద్దు. పట్టుదలతో చేసే ప్రయత్నం విజయాన్ని చేకూరుస్తుంది. ఒక్కరోజులో దేన్నీ సాధించలేం. - స్వామి వివేకానంద

– స్వామి విశారదానంద

బెంగుళూరులోని వివేకానంద యోగ అనుసంధాన మహా విద్యాపీఠానికి చెందిన స్వామి విశారదానంద భగవద్గీత పదమూడో అధ్యాయంలో 7-11 శ్లోకాల్లోని భగవానుడి బోధామృతాన్ని వివరిస్తూ 'భగవద్గీత - మానవీయ విలువలు' అనే శీర్షికతో ప్రసంగాలు ఇచ్చారు. చెన్నైలోని శ్రీరామకృష్ణ మఠ ఆంగ్ల మాసపత్రిక 'వేదాంత కేసరి'లో ప్రచురితమైన ఆ ప్రసంగాల సారాన్ని 'శ్రీరామకృష్ణ ప్రభ' పాఠకులకు 2011 జూన్ సంచిక నుంచి ధారావాహికంగా అందిస్తున్నాం.

భ్రాంతిని తొలగించే జ్ఞానం

తత్త్వ-జ్ఞానార్థదర్శనము: 'తత్' అంటే 'అది'; 'తత్త్వ' అంటే 'నిజ జ్ఞానము' అని అర్థం. ఎండమావిని చూసి అక్కడ నీరు ఉందనుకోవడమే 'భ్రాంతి'. అది నీటికొలను కాదు 'ఎండమావి' అని గ్రహించడమే 'తత్త్వజ్ఞానము'.

వేదాంత శాస్త్రాలు ఆత్మయే పరమ సత్యమని తెలుపుతున్నాయి. ఆత్మకు జననం లేదు, మరణం లేదు, మార్పు లేదు. కానీ 'ఆత్మ'ను గురించి ఏమనుకుంటున్నాం? 'నేను' అని అనేటపుడంతా మనం దేనిని ఉద్దేశించి అంటున్నాం?

'తత్త్వజ్ఞానము' అంటే ఆత్మయొక్క నిజతత్త్వమును తెలుసుకొనుట అని అర్థము. దానిని తెలుసుకుంటే మనకు కలిగే ప్రయోజనం ఏమిటి? ఉదాహరణకి ఒక పర్వతం ఎంత ఎత్తుందో, ఒక చెట్టుకి ఎన్ని ఆకులున్నాయో తెలుసుకోవటం వలన మనకేమి ఒరుగుతుంది? అదేవిధంగా, ఆత్మను గురించి తెలుసుకుంటే మనకేమి ప్రయోజనం చేకూరుతుంది?. ఆ జ్ఞానం కలిగితే జనన, మరణ సమస్య పరిష్కరింపబడుతుంది. మనం నిస్సహాయ,ఆత్మన్యూనతా భావము, అసహనము వంటి అనేక సమస్యలతో పీడింపబడుతుంటాము. లోతుగా ఆలోచిస్తే, నిజంగా ఈ సమస్యలన్నీ మనం తీసుకున్న నిర్ణయాలవలన ఉత్పన్నమవుతాయి. ఈ నిర్ణయాలు మనల్ని కష్టాలలో పడేస్తాయి. దానివలన దుఃఖం కలుగుతుంది. ఒకసారి ఒక వ్యక్తి తాను అల్పుడననీ, ఏమీ చేయలేని వాడిననీ అనుకున్నప్పుడు అభద్రతా భావానికి గురవుతాడు. ఈ పరిమితభావం ద్వారానే తప్పుడు నిర్ణయాలన్నీ తీసుకోబడతాయి. కానీ 'ఆత్మ' గురించిన సరియైన భావం కుదిరినపుడు ఆనందం దానంతటదే వస్తుంది. భయం, ఆందోళన, ఆవేదనలతోకూడిన మనస్సుంటే ఆనందం కలగనే కలగదు.

ఈ విషవలయము నుంచి బయట పడలేమనుకుంటాం కాబట్టి ఇంతకుముందు అవలంభిస్తున్న పాత పద్ధతులనే కొనసాగిస్తుంటాం. ఒక వేళ దీని నుంచి బయటపడే మార్గం ఉందని తెలిస్తే దానిని తెలుసుకోవాలని ఆసక్తి చూపిస్తాం. మన శాస్త్రాలు అటువంటి మార్గం ఒకటుందని తెలియజేస్తున్నాయి. అదే 'ఆత్మజ్ఞాన' మార్గము. ఆత్మజ్ఞానము మనల్ని దుఃఖాల నుంచి విముక్తి కలిగిస్తుంది.

ఆత్మను చూడడం ఎలా? : మన ఆత్మను తెలుసుకోవడం ఎలా అన్నదే ప్రస్తుత అంశం. మనం చాలా గొప్పవారిమన్న నిర్ణయానికి వచ్చినా, మనల్ని మనం అల్పులుగానే భావిస్తాం. మనం చాలా అందమైనవారమైనా, అసహ్యంగా ఉన్నామనీ, మనం తెలివైనవారమని తెలిసినా అజ్ఞానులమనీ అనుకుంటుంటాము. ఈ విధమైన మన దృక్పథాన్ని మార్చుకోవాలి.

ఇది ఏ విధంగా చేయాలి? 'వివేకము' ద్వారా మనస్సును పరిశుద్ధపరచి, మన విచక్షణాజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి. దీనితోపాటు పేరుప్రతిష్ఠలు, నిందాస్తుతులు వంటివాటియందు వైరాగ్యం పెంపొందించుకోవాలి. 'ఆత్మ'కు మాత్రమే విలువనిచ్చి, నామరూపాలను వదలివేయాలి.

వివేకము పెంచుకోవడమంటే మన భౌతిక శరీరము, నిత్యము, శాశ్వతము అయిన మన నిజతత్త్వముకన్న భిన్నమైనదని గుర్తించుటే! అంటే మనమే సచ్చిదానంద పరబ్రహ్మమని తెలుసుకొనడమే! కానీ దీనిలో కష్టమయిన విషయమేమంటే, మనం అదే అయితే ఆ విషయం ఎందుకు చూడలేకపోతున్నాము? దీనికి సమాధానం ఈ సత్యాన్ని గమనించలేని మన మానసిక, భావావేశపరిమితులదేనని తెలుసుకోవాలి. ఈ సత్యాన్ని తెలుసుకుందామని భావించినా, సుదీర్ఘకాలము నుండి మనలో పాతుకుపోయిన ఛాందస, ఇష్టభావాలను, పరిమితులను వదులుకోలేకపోతున్నాము. మన బంధాలే మన సంతోషానికి కారణాలు అనుకుంటున్నాం కాబట్టి బంధాలను వదిలితే సంతోషాలను కూడా వదులుకోవలసి వస్తుంది. ఐనా ఎవరైనా సంతోషాన్నీ, ఆనందాన్నీ వదులుకుందామనుకుంటారా?

'బంధము నాశనాన్నే కొనితెస్తుంది' అనే విషయాన్ని భగవాన్ దత్తాత్రేయులు ఒక పక్షుల కుటుంబము ద్వారా నేర్చుకున్నారు. కార్చిచ్చులో పడి ఒక పిల్లపక్షి దగ్ధమయిపోయింది. తమ బిడ్డ లేకపోయేటప్పటికి, తల్లిపక్షి, తండ్రి పక్షి కూడా తమ శరీరాలు వదలడానికి సిద్ధమయినాయి. అపుడు దత్తాత్రేయ స్వామి బంధమువలన ఏ విధంగా నాశనం కలుగుతుందో చూచి ఆశ్చర్యచకితుడయినాడు. నిస్సహాయ స్థితివలన పతనం



సంభవిస్తే, దానిని అర్థం చేసుకోవచ్చు. కానీ ఇక్కడ నిస్సహాయస్థితి బంధమువలన కలిగింది. దానినేవిధంగానూ సమర్థించలేము, వివరించలేము. అదేవిధంగా, మనం కూడా బంధాలవలననే బాధపడుతుంటాము. 'ఆత్మ' యొక్క నిత్యత్వము, శాశ్వతత్వములను మరచి 'నా పేరు ప్రతిష్ఠలు, నా దేహం, నా కుటుంబం, నా ఉద్యోగం వంటి వాటితో తీరిక లేకుండా సతమతమవుతుంటాము. ఆ విధంగా బాధలు మన బంధాల వలననే కలుగుతాయి గాని బయట ఎక్కడినుంచో రావు.

కానీ మన దృక్పథాన్ని మార్చుకోవటం అంత సులువైనదేమీ కాదు. అందుచేతనే ఆధ్యాత్మిక విలువలన్నింటినీ అలవరచుకోవాలి. వినయము, అహింస, పవిత్రత, ఇంద్రియనిగ్రహము వంటి మానవతావిలువలు మన మనస్సును మార్చడానికి దోహదం చేస్తాయి. విషయాన్ని ఉన్నదున్నట్లుగా గ్రహించడానికీ, ఉన్నత ఆత్మజ్ఞానం పొందడానికీ సంసిద్ధం చేస్తాయి. జీవితం పట్ల విశాల దృక్పథం ఏర్పడి మానవులు, భావములు, విషయములు వంటి వాటి యెడల మనకు గల బంధములు క్రమక్రమంగా తొలగిపోతాయి.

అప్పుడు ఆత్మయే బ్రహ్మమనీ అదే అసలు కావలసిన సారభూతమైన విషయమనే అనుభూతి కలుగుతుంది. 'నేను' అనే మాటను దాని ఉపాధులతోపాటుగా ఉపయోగించినంతకాలం, 'నిజతత్త్వము'ను గ్రహించలేము. ఆ నిజతత్త్వమును గ్రహించాలంటే వివేక, వైరాగ్యములు కావాలి. ఆ నిజతత్త్వ అనుభూతి పొందితే మన జీవితంలోని కష్టాలు, బాధలు మటుమాయమైపోతాయి. 'ఆత్మజ్ఞానము' అటువంటి నిత్యశాంతిని మనకు కలగజేస్తుంది. దీనినే ఛాందోగ్యోపనిషత్ "శోకం తరతి ఆత్మవిత్ – ఆత్మజ్ఞాని శోకసముద్రమును దాటుతాడు" అని బోధిస్తోంది. ❖

తెలుగుసేత: డాక్టర్ పన్నాల శ్యామసుందర మూర్తి

(శ్రీరామకృష్ణ ప్రభ 2011 జూన్ సంచిక నుంచి ధారావాహికంగా ప్రచురితమవుతున్న భగవద్గీత 13వ అధ్యాయంలోని 7-11 శ్లోకాలపై విశ్లేషణాత్మక వ్యాఖ్యానం ఈ సంచికతో సమాప్తం).

(...27వ పేజీ తరువాయి)

నేను పుట్టింది మీ కోసమే!

కర్రసాము, గుర్రపుస్వారీ, ఈత, కుస్తీ లాంటి విద్యలు; సంగీతం, తబలా, వీణ లాంటి కళల్లో కూడా ప్రావీణ్యతను సంపాదించారు. దీన్నిబట్టి విద్యార్థి దశలోనే ఆయనకున్న **'ప్రతిభ'** అనన్య సామాన్యమని తెలుస్తుంది.

నేటి విద్యార్థులు జ్ఞాపకశక్తి లేదంటూ తరచూ ఫిర్యాదులు చేస్తూవుంటారు. స్వామీజీ పెద్దపెద్ద సంపుటాలను సైతం ఒక్కసారి చదివి, వాటిని యథాతథంగా పునరుత్పాదన చేయగలిగారంటే ఆయన **'మేధాశక్తి'** అద్భుతమని అంగీకరించక తప్పదు.

నేటి యువతరంలో ఎంతోమంది సొంత తల్లితండ్రులనే పట్టించుకోవడం లేదు. అలాంటిది పాశ్చాత్య దేశాలలో స్వామీజీకి కోటీశ్వరులు ఆతిథ్యం ఇచ్చినప్పుడు ఆయన ఆ భోగభాగ్యాలను అనుభవించకుండా భారతీయుల కష్టాలను తలచుకొంటూ విలపించారు. భారత ప్రజలను ఉద్ధరించడం కోసమే తమ జీవితాన్ని అర్పించారంటే ఆయన **'సేవాభావం'** ఎంత ఉదాత్తమైనదో ఊహించవచ్చు.

నేటి యువతరం స్వామీజీకున్న ప్రతిభ, మేధాశక్తి, సేవాభావం లాంటి మహోన్నతమైన సుగుణాల్ని ఏ కొంచెమైనా అలవరచుకోగలిగితే ఆదర్శవంతులుగా తీర్చిదిద్దబడతారు. స్వామీజీయే ఓ సందర్భంలో **'నేను యువతకు మార్గనిర్దేశం చేయడానికే జన్మించాను. వందలాది మంది నన్ను అనుసరించడానికి సిద్ధంగా ఉన్నారు'** అని స్వయంగా పలికారు.

యువతకు ఆదర్శం స్వామీజీయే అని వివిధ రంగాలలో ప్రఖ్యాతి గాంచిన ఎంతో మంది మహాత్ములు ఘంటాపథంగా ప్రకటించారు. అలాంటి వారిలో నేతాజీ, నెహ్రూజీల అభిప్రాయాలివి:

"స్వామి వివేకానంద బహుముఖ ప్రజ్ఞాపాటవాల్ని వివరించడానికి నేను అశక్తుడను. స్వామీజీ తన ప్రసంగాల ద్వారా మాకాలపు విద్యార్థులను ప్రభావితం చేసినట్లు ఎవ్వరూ చేయలేదు. స్వామీజీ విద్యార్థుల ఆశయాల్ని పరిపూర్ణంగా అవగాహన చేసుకొన్న మహావ్యక్తి" – నేతాజీ సుభాష్ చంద్రబోస్


"నేటి యువతకు స్వామీజీ బోధలు అత్యంత ప్రయోజనకరమైనవి. ఆయన బోధలు యువ మనస్సులను ప్రజ్వలింపజేసే అగ్నిజ్వాలలు. నేటి యువత స్వామీజీ అందించిన విజ్ఞాన, వివేక సంపదల నుండి ప్రయోజనం పొందగలదని నా విశ్వాసం".

– జవహర్‌లాల్ నెహ్రూ

స్వామీజీయే యువతకు ఆదర్శమని గుర్తించిన భారత ప్రభుత్వం 1984లో స్వామీజీ జన్మదినమైన జనవరి 12వ తేదీని 'జాతీయ యువజన దినోత్సవం'గా ప్రకటించింది.

యువత స్వామి వివేకానందను ఎందుకు ఆదర్శంగా తీసుకోవాలో పూర్తిగా తెలుసుకోవాలంటే "స్వామి వివేకానంద జీవితం; సందేశ తరంగిణి; స్వామీజీ లేఖావళి" పుస్తకాలను చదవండి. అప్పుడు 'యువతకు స్వామీజీయే ఎందుకు ఆదర్శమో' మీరే ఇతరులకు చెప్పగలుగుతారు. ❖

గోరుముద్ద - స్వామి సుప్రియానంద



ఏ నక్క గెలుస్తుంది ?

సాయంసంధ్యలో సముద్రతీరాన డెబ్భై ఏళ్ళ తాతగారు తన పదేళ్ళ మనవడితో అలా వాహ్యాళిగా నడుచుకుంటూ వెళుతున్నారు. చక్కని కథలు చెప్పే అలవాటున్న ఆ పెద్దాయన ఆ రోజూ మనవడితో 'చిన్నా! మన మనస్సులో నిరంతరం రెండు నక్కలు పోట్లాడుకుంటూ ఉంటాయి తెలుసా! అందులో ఒక నక్క కోపం, ద్వేషం, అసూయ, అసహనం తదితర దుర్గుణాలకు ప్రతీక. మరో నక్క ప్రేమ, సహనం, బాధ్యత, వినయం, వివేకం తదితర సుగుణాలకు ప్రతీక' అని చెప్పారు.

వెంటనే ఆ పదేళ్ళ మనవడు ఆశ్చర్యంగా ముఖం పెట్టి 'మరి తాతయ్యా! ఆ పోరాటంలో ఏ నక్క గెలుస్తుంది?' అని ప్రశ్నించాడు. అప్పుడు ఆ పెద్దాయన నవ్వుతూ 'ఏముంది! నువ్వు దేనికి బాగా తిండిపెడతావో అదే గెలుస్తుంది!' అన్నారు. 'నేను బాగా తిండి పెట్టడమేంటి తాతయ్యా?' అని ఆ మనవడు అర్థం కానట్లు ముఖం పెట్టాడు. అప్పుడు ఆ తాతగారు 'అవునురా! నీ మనస్సులో మంచిగుణాలకు, చెడ్డగుణాలకు ఎప్పుడూ సంఘర్షణ జరుగుతూనే ఉంటుంది. నీవు మంచి గుణాల వైపు మొగ్గుచూపుతున్నావంటే వాటిని పెంచి పోషించుకుంటున్నావన్న మాట! లేదు చెడ్డ గుణాలకే ఎక్కువగా లొంగిపోతున్నావంటే వాటిని నీవు బలవంతులను చేస్తున్నావన్న మాట!' అన్నారు. మనస్సులో ఏ నక్క గెలవడానికైనా కారణం తనేనని ఆ పదేళ్ళ బాబుకి స్పష్టమైంది.

సాధారణంగా ప్రతి వ్యక్తి అంతరంగంలోనూ ఈ జంబూకాలు జగడమాడుతూనే ఉంటాయి. అయితే మనలో చాలామందికి మొదటి నక్కపైనే ఎక్కువ మక్కువ! దానినే ప్రేమిస్తూ పెంచి పోషిస్తారు. అందుకే ఎప్పుడూ అసూయతోనో, అసహనంతోనో రగిలిపోతూ ఉంటారు.

అయితే శ్రీరామచంద్రుడు బాలరాముడిగా ఉన్నప్పటి నుంచి కూడా ఆయన మనోక్షేత్రంలో మొదటి నక్కను అసలు పట్టించుకోలేదు. ఒక్కమాటలో చెప్పాలంటే ఆ జంబూకాన్ని ఆకలితో చంపేశాడు. ఆ రామచంద్రుడి మనస్సులో ఎప్పుడూ సద్గుణాలకు, దుర్గుణాలకు మధ్య పోటీయే తలెత్తలేదు; ద్వంద్వ మనస్తత్వాల ఊసే లేదు. ఒకే బాణం, ఒకే భార్యలాగ రామునిది ఒకే మాట, ఒకే మార్గం! అందుకే ఆయన మనస్సులో ప్రేమ, త్యాగం, సహనం, వినయం తప్ప ద్వేషానికీ, స్వార్థానికీ, అహంభావానికీ చోటే లేదు. ఇన్ని సుగుణాలు పోతపోసుకున్న మూర్తి గనుకే స్వామి వివేకానంద తన బాల్యంలో శ్రీరామచంద్రుడినే తన ఆరాధ్యనాయకుడిగా కొలిచాడు.

అలాగే మనలో చాలామందికి ఉన్నట్లు ఆ రఘురాముడికి రెండు నాల్కలు లేవు; మాట మార్చే మాయలు ఆయనకు తెలియవు. అందుకే ఆయన రెండు రకాలుగా మాట్లాడడని వర్ణిస్తూ 'రామో ద్విర్నాభి భాషతే!' అని కొనియాడతారు. ఇలా చెప్పుకుంటూ పోతే మర్యాదపురుషోత్తముడు అనడానికి మనకు అయోధ్య రాముడిని మించిన వ్యక్తి కనిపించరు. మనం ఏటా వాడవాడలా సీతారాములకు కల్యాణం చేసి రామభక్తులమని చాటుకుంటే సరిపోదు! మన మనస్సులో ఆయన గుణగణాలను మననం చేసుకుంటూ, అసలు ఆ జంబూకాల జంజాటమే లేకుండా జాగ్రత్తపడదాం. నిజమైన శ్రీరామ సేవకులం అనిపించుకుందాం! ❖

రఘువంశం

కథ: ఎం.భైరవ సుబ్రహ్మణ్యం, చిత్రాలు : బొమ్మల కొలువు ప్రదర్శన దృశ్యాలు అనుసృజన: స్వామి జ్ఞానదానంద

1



దిలీపుడు తన కుమారుడు రఘువుకు రాజ్యపట్టాభిషేకం చేసి, తపోమయ జీవితం గడపడానికి అరణ్యాలకు వెళ్ళిపోయాడు. రఘువు అనేక రాజ్యాలను జయించిన తరువాత 'విశ్వజిత్ యాగం' చేశాడు. యాగాంతంలో తన సమస్త సంపదలనూ జనులకు దానరూపంలో ఇచ్చివేశాడు. అప్పుడు కౌత్సుడనే బ్రహ్మచారి దానం కోరి యాగశాలకు వచ్చాడు.

2



కౌత్సుడు: రాజా! వరతంతు ముని శిష్యుణ్ణి నేను. నా సేవే గురుదక్షిణకు సమానమని మా గురువు చెప్పారు. కానీ నేను బలవంత పెట్టగా పధ్నాలుగు కోట్ల సువర్ణకాసులు ఇమ్మన్నాడు. సహాయార్థం మీవద్దకు వచ్చాను. కానీ మీరు మీ సమస్త సంపదల్నీ ఇంతకు ముందే అందరికీ దానం చేసివేశారే...? ఇప్పుడెలా!

రఘు మహారాజు: ఓ బ్రహ్మచారీ! మీరు రిక్తహస్తాలతో వెళ్ళకండి. కొన్ని రోజులు వేచి ఉండండి. మీ కోర్కె తీరుస్తాను.

3 రఘు మహారాజు తన వద్దకు సహాయార్థం వచ్చిన వారెవరినీ నిరాశ పరచకూడదనే దృఢ నిర్ణయం తీసుకున్నాడు. చివరికి...



రఘు మహారాజు: మంత్రివర్యా! రేపు కుబేరుని అలకాపురిని ముట్టడించి, అవసరమైన సంపదను తీసుకువద్దాం. అందుకు ఏర్పాట్లు చేయండి.

కానీ, మర్నాడు యుద్ధానికి బయలుదేరడానికి ముందు మంత్రి, రాజు వద్దకు వచ్చి 'మహారాజా! నేడు ఖజానాలో కనకవర్షం కురిసింది' అని తెలియజేశాడు.

4 **రఘు మహారాజు:** కౌత్సా! భగవంతుడు ప్రసాదించిన ఈ యావత్తు నిధినీ మీ గురువుకి దక్షిణగా సమర్పించండి.

కౌత్సుడు: రాజా! ఏమి మీ ఔదార్యం! కానీ గురుదక్షిణ కోసం నాకు అవసరమైనవి 14 కోట్ల బంగారు కాసులు మాత్రమే! అవి ఇవ్వండి చాలు.



ఇంతటి మహోన్నతుడైన రఘు మహారాజు పేరిట వారి వంశం 'రఘు వంశం'గా ప్రసిద్ధి గాంచింది.

5



రఘు మహారాజు కుమారుడైన అజుడు కూడా తండ్రి అంతటి కీర్తిమంతుడే! ఒకసారి అతడు సరయూనదిలో ఉదయ కాల సంధ్యావందనం చేస్తున్నాడు. అతడితో యుద్ధం చెయ్యాలనుకుని రావణుడు ఒక బ్రాహ్మణుని వేషంలో వచ్చాడు. అజుడు హఠాత్తుగా మంత్రాన్ని ఉచ్చరించి తూర్పుదిశవైపు నీటిని విసిరాడు.

రావణుడు: రాజా! పగటి సంధ్యలో నీటిని తూర్పు వైపు విసరడం యుక్తమేనా?

అజుడు: స్వామీ! ఇక్కడకు తూర్పున ఏడు మైళ్ళ దూరంలో ఒక పులి, గోవుపై దాడి చేసింది. దాని దీనారావం విని నేను మంత్రప్రయోగంతో నీటిని విసిరి ఆ గోవును కాపాడాను.

6 రావణుడు తిరిగి వెళ్ళిపోతున్నప్పుడు దారిలో బాణఘాతాలతో నేలకొరిగి ఉన్న పులినీ, పచ్చికను మేస్తున్న గోవునూ చూశాడు.



అజ మహారాజు గొప్ప ధీరుడు. తన రాజ్యం పట్ల సదా అప్రమత్తంగా ఉంటున్నాడు. నీటినే బాణాలుగా మార్చి ప్రయోగించే శక్తి సంపన్నుడైన ఈతడితో శత్రుత్వం వహించడం మూర్ఖత్వం.

7 అజ మహారాజు కుమారుడు దశరథుడు. అయోధ్యలో ఒకసారి వర్షాలు లేక పైర్లు వాడిపోయాయి. దశరథుడు కలత చెంది వసిష్ఠుని వద్దకు వెళ్ళాడు.



వసిష్ఠుడు : రాజా! శనిదేవుని చూపు నీ రాజ్యంపై పడడంతో ఈ అనావృష్టి ఏర్పడింది.

దశరథుడు: అలాగా! శనిదేవునితో యుద్ధం చేసి ఈ దుఃస్థితిని నివారిస్తాను. నన్ను ఆశీర్వదించండి గురుదేవా!

8 వసిష్ఠుడు అలాగేనంటూ దశరథుని ఆశీర్వదించాడు. దేశ సంక్షేమార్థం దశరథుడు అనేక హోమాలు నిర్వర్తించాడు. పిదప దశరథుడు శస్త్రాస్త్రాలతో శనిదేవునిపైకి యుద్ధానికి వెళ్ళాడు.



9



దశరథుడు: శనిదేవా! మా రాజ్యంలో మీ కారణంగా వాటిల్లిన బాధలను నివారించండి. మీరు అనుగ్రహించకపోతే మిమ్మల్ని ఛిన్నాభిన్నం చేయాల్సి వస్తుందని మనవి చేస్తున్నాను.

శనిదేవుడు : దశరథా! భగవంతుని నియమాలను మార్చలేం. అయినప్పటికీ నీ పరాక్రమం గురించి నాకు బాగా తెలుసు. సరే, మీ మనుమల పాలన కాలం దాకా నా మూలంగా మీ రాజ్యానికి ఏ బాధలూ ఉండవు. మీ వంశంలో సాక్షాత్తూ శ్రీమన్నారాయణుడే అవతరించనున్నాడు.

10 దశరథుడు, శనిదేవునికి ప్రణమిల్లి భూలోకానికి తిరిగి వచ్చేశాడు. శని సారించిన దృష్టి ప్రభావంతో రథాశ్వాలు, పతాకాదులు దగ్ధమయ్యాయి. వసిష్ఠుని ఆశీర్వాదం వల్ల దశరథుడు మాత్రం బతికిపోయాడు. స్పృహ కోల్పోయి పై లోకం నుండి క్రింద పడిపోతున్న దశరథుణ్ణి, అక్కడకు వచ్చిన జటాయువు అనే పక్షి తన వీపు మీద మోసుకొని కాపాడింది.

దశరథుడు : విహంగ మిత్రమా! ధన్యవాదాలు.

జటాయువు: మహారాజా! మీరు నన్ను మిత్రునిగా పరిగణించడం నా అదృష్టం.



11 జటాయువు, దశరథుణ్ణి ప్రయాగకు తీసుకువచ్చి చేర్చింది. అక్కడ నుండి అయోధ్యకు వెళ్ళాడు దశరథుడు.



12 తన రాజ్య ప్రజల కోసం ప్రాణాన్నే పణంగా పెట్టి, శనిదేవుని నుండే వరం పొందిన దశరథునిపై దేవతలు పుష్పవర్షం కురిపించి అభినందించారు.

దిలీపుడు, రఘువు, అజుడు, దశరథుడు లాంటి మహాగుణసంపన్నులు ఉద్భవించిన రఘువంశంలో సాక్షాత్తూ శ్రీమన్నారాయణుడే శ్రీరామచంద్రుడిగా ఆవిర్భవించాడు.


శ్రీరామచంద్రుడు ఈ భువిపై అవతరించినప్పుడు సప్తర్షులు మాత్రమే ఆయనను భగవదవతారమని గ్రహించగలిగారు. భగవంతుడు ఈ లోకంలో అవతరించినప్పుడు ఏ కొద్ది మందికో మాత్రమే ఆయన దివ్యత్వాన్ని గ్రహించడం సాధ్యమవుతుంది.

- భగవాన్ శ్రీరామకృష్ణ పరమహంస



(మిగతా 34వ పేజీలో...)

శ్రీ రామాయణామృతము




ప్రధానపాత్రలు

రచయితలు: ఆచార్య ఎం. కులశేఖర రావు
ఆచార్య నందుల గోపాలకృష్ణమూర్తి
వెల: రూ.250/-, పుటలు : 307
ప్రతులకు: ఆచార్య నందుల గోపాలకృష్ణమూర్తి,
ఇం.నెం: 11-5-405, రోడ్.నెం:10
శ్రీవేంకటేశ్వరకాలనీ, సరూర్ నగర్
హైదరాబాదు-35, సెల్: 89850 42679

రామాయణం భారతీయుల ఆత్మ. కోరిన కోరికలను తీర్చే కల్పవృక్షం. భక్తి, ముక్తి ప్రదాయిని. కొందరు ప్రతినిత్యం భక్తిగా పారాయణం చేస్తూ; మరికొందరు వాల్మీకి మహాముని ఘంటం నుండి జాలువారిన అద్భుతమైన వర్ణనలను, అలంకారాలను ఆస్వాదిస్తూ; మరికొందరు మహర్షి స్థాపించిన కుటుంబ సంబంధాలను, మానవీయ విలువలకు పట్టాభిషేకం చేస్తూ; ఇంకొందరు రామాయణంలో నిక్షిప్తమై ఉన్న ధర్మాలకు మనస్సును అంకితం చేస్తూ; రామాయణ కామధేనువు నుండి వారికి తగిన అమృతాన్ని స్వీకరిస్తూ ఉన్నారు.

ప్రస్తుత గ్రంథకర్తలు కూడా అలాంటి ప్రయత్నమే చేశారు. ఆ రచయితలు ఉద్దండ పండితులు, విమర్శకాగ్రేసరులు, విశ్వ విద్యాలయాచార్యులు కావడం వల్ల రామాయణంలోని పాత్రల విశిష్టతలను సమగ్రంగా విశ్లేషించి సారాన్ని పాఠకులకు అందించారు. ఆ ప్రయత్నంలో మహాకవి వాల్మీకి హృదయాన్ని ఆవిష్కరించడం కోసం మూల శ్లోకాలతో సమన్వయం చేయడం ముదావహం. రామాయణామృతాన్ని ఆస్వాదించాలనుకొనే ప్రతివారూ తప్పక చదవాల్సిన గ్రంథమిది. ❖

షట్పదీ స్తోత్రం



మూలం: కంచి పరమాచార్య
శ్రీశ్రీశ్రీ చంద్రశేఖరేంద్ర స్వామి వారు
అనువక్త: దేవరకొండ శేషగిరిరావు
వెల: రూ. 125/-, పుటలు: 205
ప్రతులకు: మహావిద్యాపీఠం, ఎయిర్‌ఫోర్స్ అకాడమీరోడ్, దుండిగల్,హైదరాబాదు-43
సెల్: 98854 44428


ఆదిశంకరులు సర్వజగద్రక్షకుడైన శ్రీమహావిష్ణువును స్తుతిస్తూ రాసినది ఈ షట్పదీ స్తోత్రం. ఈ స్తోత్రం ఆర్యావృత్తంలో వ్రాయబడింది. శంకరులు ఈ స్తోత్రాన్ని షట్పదీ స్తోత్రం అనడంలో విశేషముంది. ఆరు శ్లోకాలు ఉండడం భౌతిక లక్షణమైతే, పూవుల నుండి మకరందాన్ని ఆస్వాదించే షట్పదిలాగా భక్తుడు కూడా భక్తి, జ్ఞాన, వైరాగ్యాలనే మకరందాన్ని భగవంతుని శ్రీదివ్యచరణా రవిందాల నుండి పొందాలన్నది అంతరార్థం.

'శంకరులు భుజంగప్రయాతవృత్తంలో శ్రీసుబ్రహ్మణ్య స్వామిని స్తుతించి రోగవిముక్తికీ, కనకధారాస్తవంలో శ్రీమహాలక్ష్మిని కీర్తించి దారిద్ర్యవిముక్తికీ, షట్పదీ స్తోత్రంలో జిజ్ఞాసతో ముక్తిని పొందేవిధాన్ని వివరించా'రంటారు పూజ్యస్వామివారు.

ఈ స్తోత్రానికి విశేషమైన వివరణను కూర్చినవారు పరమపూజ్య శ్రీశ్రీశ్రీ పరమాచార్యులు. వారి రచనలను పరిచయం చేయడమంటే సూర్యుని దివిటీతో పోల్చడమే. శ్రీస్వామివారి తమిళ ఉపన్యాసాలను 'దైవత్తిన్ కురల్' అనే పేర సంకలనం చేస్తే, వాటిని 'వాయిస్ ఆఫ్ గాడ్' పేరుతో ఆంగ్లం చేశారు. ఆ వ్యాసాలను శేషగిరిరావు గారు అనువదించి తెలుగు ప్రజలకు అందించి మహోపకారం చేశారు. సాధకులందరూ తప్పక చదవాల్సిన అద్భుత గ్రంథమిది. ❖


– ఎం.వి. నాగప్రసాద్

హిందూ సంప్రదాయ పండుగలు – ఉత్సవాలు



రచన : కప్పగంతు వెంకట రమణమూర్తి
వెల: రూ. 125/-, పుటలు: 147
ప్రతులకు: గ్లోబల్ న్యూస్, బి2, ఎఫ్12, రామరాజానగర్, సుచిత్రా జంక్షన్‌పోస్ట్, సికింద్రాబాద్ – 500 067
సెల్: 9246165059


ఆదరించు పూవల్లి ఆండాళ్ తల్లి



రచన : డాక్టర్ శ్రీ వంగల రామకృష్ణ
వెల: రూ. 100/-, పుటలు: 155
ప్రతులకు: టాగూర్ పబ్లిషింగ్ హౌస్
షాప్.నెం.20, వైశ్యా హాస్టల్ బిల్డింగ్
కాచిగూడ చౌరస్తా, హైదరాబాద్ - 27
ఫోన్: 040 -6636 8330

స్వామి వివేకానంద

ఏం చేశారు?! ఏం చెప్పారు?!



రచన : హెబ్బార్ నాగేశ్వరరావు
వెల: రూ. 30/-, పుటలు: 96
ప్రతులకు: ప్లాట్ నెం. 1-19-46, హెచ్.ఐ.జి. ఎ-40, ఉషోదయ సూపర్ మార్కెట్ వెనుక, డా॥ ఎ.ఎస్.రావు నగర్, హైదరాబాద్-62
ఫోన్: 040-27134557

స్వామి వివేకానంద

జీవితము – సందేశము


ప్రవచనము : శ్రీసామవేదం షణ్ముఖశర్మ
వెల: తెలుపలేదు.
సి.డీలకు : ప్లాట్ నెం. 1-19-46, హెచ్.ఐ.జి. ఎ-40, ఉషోదయ సూపర్ మార్కెట్ వెనుక, డా॥ ఎ.ఎస్.రావు నగర్, హైదరాబాద్-62 ఫోన్:040-27134557



Printed and published by **Swami Jnanadananda** owned by Ramakrishna Math Trust
and printed at Kala Jyothi Process, 1-1-60/5, RTC Cross Roads, Musheerabad, Hyderabad - 500 020
and published at Ramakrishna Math, Domalguda, Hyderabad - 500 029. **Editor: Swami Parijneyananda**

Vol.71-4, Sri Ramakrishna Prabha (Telugu Monthly) April 2014, Regd. with the Registrar of Newspaper for India Under No.1120/57. Postal Registration No. HD-1071/2013-15. Licensed to Post Under WPP : AP/CPMG/HC-13/WPP/2013-14. Date of Publication : 18th of every month.

వాత్సల్యభావం



శ్రీరామకృష్ణులు వాత్సల్యభావ సాధన చేస్తున్నప్పుడు జటధారి నుండి రామమంత్రోపదేశం పొందారు. లోహ ప్రతిమయైన రామ్‌లాలా (బాలరాముడు) మానవరూపంలో గురుదేవులతో కలసి తినడం, నిద్రించడం, స్నానం చేయడం, ఆటలాడడం లాంటివి చేశాడు. తల్లి కౌసల్య రాముణ్ణి ఎలా అల్లారుముద్దుగా చూసుకుందో అలాగే శ్రీరామకృష్ణులు కూడా బాలరాముడికి సేవలందించారు.


జటధారి వెళ్ళిపోతూ శ్రీరామకృష్ణులతో 'ఈ బాలరాముడు నాతో రావడానికి ఇష్టపడడం లేదు. ఇతడు నీతోనే ఉండడానికి ఇష్టపడుతున్నాడు. కాబట్టి ఇతణ్ణి నీకు అప్పగించి వెళ్ళిపోతున్నాను' అని చెప్పి రామ్‌లాలా విగ్రహాన్ని శ్రీరామకృష్ణుని వద్దే వదిలి జటధారి వెళ్ళిపోయాడు.

నిస్తారిణి అనే భక్తురాలికి శ్రీరాముడు ఇష్ట దైవం. ఒకరోజు ఆమె జపం చేస్తున్నప్పుడు శ్రీరామచంద్రుని దర్శనం కలిగింది. ఆనందపారవశ్యంలో ఆమె శ్రీరాముడికి తలవంచి నమస్కరిస్తున్నప్పుడు శ్రీరాముని స్థానంలో ఆమెకు శ్రీరామకృష్ణులు దర్శనమిచ్చారు. అప్పుడు ఆ శ్రీరాముడే ఈ శ్రీరామకృష్ణులుగా అవతరించారని ఆమె గ్రహించింది.

ఆధ్యాత్మిక అమృతవాహిని

శ్రీ రామకృష్ణ ప్రభ

మే 2014 ₹10



సుబోధ

భక్తుడు: ఒక అబ్బాయి ఆత్మహత్య చేసుకున్నాడని విని భయం వేస్తోంది.

శ్రీరామకృష్ణులు: ఆత్మహత్య మహాపాపం. ఆత్మహత్య చేసుకున్న వ్యక్తి మళ్ళీ మళ్ళీ జన్మలెత్తి ఈ లోకంలో బాధలు అనుభవించాలి. కానీ జ్ఞానోపలబ్ధి అనంతరం కొందరు శరీరాన్ని చాలించుకుంటారు. మట్టి మూసలో బంగారు ప్రతిమ రూపొందాక ఆ మూసను పదిలపరచుకోవచ్చు లేదా విరగగొట్టి పారవెయ్యనూవచ్చు.



సంసారులు ఎంతగానో శోకతాపాలను అనుభవిస్తారు. అయితే వాటినంతా కొద్ది రోజుల్లోనే విస్మరించి మళ్ళీ పాత జీవితాన్నే ప్రారంభిస్తారు. ఒంటెకు ముళ్ళకంపలంటే బహు ప్రీతి. అయితే అది ఎంత ఎక్కువగా ముళ్ళను తింటుందో, అంతగా దాని నోటి నుండి 'గడ గడ' రక్తం కారుతుంది. ఐనప్పటికీ అది ముళ్ళకంపలను తినడం మానుకోదు!

బద్ధజీవుడి లక్షణం మరొకటి ఉంది. అతణ్ణి లౌకిక పరిసరాల నుండి తొలగించి, ఆధ్యాత్మిక వాతావరణంలోకి ప్రవేశపెడితే అతడు క్రమేణా కృశించిపోతాడు. మురుగులో పెరిగే పురుగు అక్కడ నివసించడంలో ఆనందిస్తుంది, పుష్టి నొందుతుంది. ఆ పురుగును అన్నపుకుండలో ఉంచితే అది మరణిస్తుంది.

కామం (కోరిక) కారణంగానే కాంచనం (ధనం) ఆవశ్యకత కలుగుతుంది. అందుచేతనే మరొకరికి బానిస అవడం జరుగుతుంది. తత్ఫలితంగా అతడు తన స్వతంత్రాన్ని కోల్పోతాడు. ఆ తరువాత తన ఇచ్ఛానుసారం ప్రవర్తించలేడు.

జైపూర్‌లోని గోవిందజీ ఆలయ పూజారులు మొదట్లో అవివాహితులుగా ఉండేవారు. ఆ సమయంలో వారు మంచి తేజస్సులై భాసిల్లారు. ఇలా ఉండగా ఒక సందర్భంలో జైపూర్ రాజు వారిని తన వద్దకు రమ్మని కబురు పంపాడు. వారు ఆ కబురు తెచ్చిన వ్యక్తితో 'ఆ రాజునే వచ్చి మమ్మల్ని కలుసుకోమను' అని బదులిచ్చారు. రాజు, మంత్రులతో సంప్రతించి ఆ పూజారులకు వివాహాలు చేయించాడు. ఆనాటి నుండి రాజు ఆ పూజారుల కోసం కబురు పంపవలసిన అగత్యం ఏర్పడలేదు. అప్పటి నుండి గృహ నిర్మాణం, పిల్లల అన్నప్రాసన, అక్షరాభ్యాసం - ఇలా ఏదో ఒక కార్యార్థం కోసం ధనం అవసరమై ఆ పూజారులు రాజభవనానికి సదా రాసాగారు. తమకు తామై రాజు వద్దకు వచ్చి, 'మహారాజా! తమరిని ఆశీర్వదించే నిమిత్తం వచ్చాం. ఆలయంలో పూజించిన పుష్పాలు ఇవిగో, దయతో స్వీకరించండి' అనేవారు.

కాబట్టి, కామ కాంచనాలే జీవుణ్ణి బద్ధుని చేసి, అతడి స్వేచ్ఛను హరించివేస్తాయి. ❖

శ్రీరామకృష్ణ ప్రభ
రామకృష్ణ మఠం, దోమల్‌గూడ, హైదరాబాదు-500 029
ఫోన్: 040-27667799, సెల్: 8801849494
E-mail : sriramakrishnaprabha@gmail.com
నిర్వాహక సంపాదకులు: స్వామి జ్ఞానదానంద
సంపాదకులు: స్వామి పరిజ్ఞేయానంద

నాకు (సుధీర్‌చంద్ర) అతి చిన్నతనంలోనే మాతృదేవి సాన్నిధ్య భాగ్యం లభించింది. నా తండ్రి, నాయనమ్మ మొదలైన వారంతా మాతృదేవికి పరిచయస్థులే. జయరామ్‌బాటిలో మాతృదేవి కోసం కట్టిన కొత్త ఇంట్లో మా నాయనమ్మ పనిమనిషిగా ఉండేది. రోజూ ఇల్లు ఊడ్చడం, బట్టలు ఉతకడం వంటి పనులు ఆమె చేసేది. అందువల్ల రోజూ నాయనమ్మతో మాతృదేవి ఇంటికి వెళ్ళే అదృష్టం నాకు కలిగింది. నా పట్ల మాతృదేవి ఎంతో ఆప్యాయంగా ఉండేవారు. రాత్రి గురుదేవులకు నైవేద్యం చేసిన ప్రసాదంలో కొంత స్వయంగా మాతృదేవే విడిగా తీసి, మర్నాడు నాకు ఇచ్చేవారు. ఆ ప్రసాదం కోసమే నేను రోజూ నాయనమ్మతో వెళ్ళేవాణ్ణి.

మా నాన్నకు చదువు లేనందువల్ల వస్తువుల లెక్కకట్టడం సరిగా తెలియదు. దాంతో అనేక సందర్భాలలో ఆయన మోసపోయేవాడు. అందువల్ల మాతృదేవి మా నాయనమ్మతో, “ఇదుగో చూడు! మీ మనవణ్ణి చదివించు. అతడు చదవాలి!” అని చెప్పేవారు. నా తల మీద చేయి వుంచి దీవించారు. చదువు లేని తండ్రికి జన్మించి, జయరామ్‌బాటి కుగ్రామం నుండి కలకత్తా విశ్వవిద్యాలయంలో స్నాతకోత్తర విద్యను అభ్యసించే భాగ్యం నాకు మాతృదేవి దీవెన చలువ వల్ల మాత్రమే కలిగిందని నా దృఢవిశ్వాసం.

మాతృదేవి పాదపద్మాలను పద్మాలతో శ్రీశారదానంద స్వామి అర్చించడము నేను చాలాసార్లు చూశాను. చిన్నవాణ్ణి కదా! అందువల్ల, ‘ఈమె ఎవరు? సాధుసన్యాసులు కూడా ఈమెను ఎందుకు పూజిస్తున్నారు?’ అనుకొనేవాడిని. అప్పట్లో ఈ విషయాలు గ్రహించేశక్తి నాకు లేదు.

ఆ రోజుల్లో గ్రామంలో పాఠశాలలు లేవు. అందుకని చిన్నపిల్లలకు ఒక ప్రాథమిక పాఠశాలను ప్రారంభించడానికి మాతృదేవి ఏర్పాట్లు చేశారు. ఉపాధ్యాయుల జీతాలకు కూడా ఆమే ఏర్పాట్లు చేశారు.

బందిపోటు దొంగ అయిన అమ్జద్ అప్పుడప్పుడు మాతృదేవిని చూడడానికి వచ్చేవాడు. అతణ్ణి చూస్తేనే మా కెంతో భయం వేసేది. కానీ మాతృదేవి అతణ్ణి ఆప్యాయంగా పలుకరించి, ఇంట్లోకి పిలిచి, తినడానికి ఏదైనా పెట్టేవారు. చాలాసార్లు ఇలా జరగడం నేను చూశాను.

ప్రతి ఏటా జగద్ధాత్రి పూజా సమయంలో మాతృదేవి గ్రామస్థులనందరినీ పిలిచి వారందరికీ కడుపారా భోజనం పెట్టించేవారు. ఆ ఏర్పాట్లను స్వయంగా ఆమే చూసుకొనేవారు. ప్రతి గ్రామస్థుని పట్లా మాతృదేవి కనబరచే ఆప్యాయత వర్ణనాతీతం.

ఏమైనా, ఒక ప్రగాఢ విశ్వాసం మాత్రం నా మనస్సులో చోటుచేసుకొని ఉంది – నేను మాతృదేవిని దర్శించాను. ఆమె పాదపద్మాలను స్పృశించాను. అందువల్ల నాకు ముక్తి తప్పక లభిస్తుంది. దీన్ని ఎవరూ అడ్డుకోలేరు. ❖



ఆధ్యాత్మిక అమృతవాహిని
శ్రీ రామకృష్ణ ప్రభ
సంపుటం: 71 సంచిక: 5 మే 2014



సంకట హటై మిటై సబ పీరా ।
జో సుమిరై హనుమత బలవీరా ॥
జై జై జై హనుమాన గోసాయీ ।
కృపాకరో గురుదేవ కీ నాయీ ॥

బలవంతుడైన హనుమంతుని స్మరించినచో సంకటములన్నియూ తొలగిపోవును. పీడలన్నియూ పారిపోవును. హనుమత్ ప్రభువుకు జేజేలు. గురుదేవునిలాగ నాపై కృపను చూపుము.

– హనుమాన్ చాలీసా

సూక్తి సౌరభం


తనకు గల్గు పెక్కు తప్పులు నుండగా
ఓగు నేర మెంచు నొరుల గాంచి
చక్కిలంబు గాంచి జంతిక నగినట్లు
విశ్వదాభిరామ వినుర వేమ.

“ఓ వేమా! చక్కిలాన్ని చూసి జంతిక నవ్వినట్లుగా దుష్టుడు తనలో ఉన్న అనేక దోషాలను మరచి, ఇతరులలో ఉన్న చిన్న చిన్న దోషాలను ఎత్తిచూపడం ద్వారా ఆనందాన్ని పొందుతాడు.”


ఉపమింప మొదలు తియ్యన
కపటంబెడ నెడను జెఱకు కైవడినే పో
నెపములు వెదకును గడపట
గపటపు దుర్జాతి పొందు గదరా సుమతీ.

“ఓ సుమతీ! చెరుకుగడ మొదట తీయగా ఉంటుంది. కానీ కణుపుల వద్ద చప్పగా ఉంటుంది. అదే విధంగా దుర్మార్గునితో స్నేహం మొదట ఇంపుగా ఉన్నట్లు తోచినా, చివరకు మాత్రం విషాదాన్నిస్తుంది. కాబట్టి దుర్మార్గులతో జాగ్రత్తగా ఉండాలి.”





శ్రీరామకృష్ణ ప్రభ శాశ్వత నిధి





ఆధ్యాత్మిక జ్ఞానాన్ని పంచి పెట్టేందుకు 'శ్రీరామకృష్ణ ప్రభ' కృషి చేస్తోంది. నిధుల కొరత లేకుండా ఈ జ్ఞానయజ్ఞం నిరంతరాయంగా సాగేందుకు 'శ్రీ రామకృష్ణ ప్రభ శాశ్వతనిధి'కి ధన దానం చేసి ప్రోత్సహించాల్సిందిగా కోరుతున్నాం. దాతల పేర్లు పత్రికలో ప్రచురిస్తాం.

మహారాజ పోషకులు......	రూ.	10,000/-, అంతకన్నా ఎక్కువ విరాళం ఇచ్చేవారు.
రాజ పోషకులు...........	రూ.	5,000/-, అంతకన్నా ఎక్కువ విరాళం ఇచ్చేవారు.
పోషకులు................	రూ.	1,000/-, అంతకన్నా ఎక్కువ విరాళం ఇచ్చేవారు.

దాతపేరు చిరునామా	రూ.
పోషకులు : శ్రీ చింతల గణేష్ కుమార్ గౌడ్, సిద్ధిపేట్, మెదక్ జిల్లా	1,550
పోషకులు : శ్రీ రత్నం శరవణ, సోమప్ప కాలనీ, 'బి' క్యాంపు, కర్నూలు (కీ॥శే॥ ఎమ్. రత్నంగారి జ్ఞాపకార్థం)	1,116
పోషకులు : శ్రీ బి. భాస్కర్, ఎస్.బి.ఐ. కాలనీ, మరియపురం, కడప	1,000

'శ్రీరామకృష్ణ ప్రభ' కానుక పథకం

యువతరానికి 'శ్రీరామకృష్ణ ప్రభ'ను మరింత చేరువ చేయాలని సంకల్పించాం. రాష్ట్రంలోని వివిధ పాఠశాలలు/ కళాశాలలు/ గ్రంథాలయాలకు పత్రికను పంపించడానికి మీ సహాయాన్ని కోరుతున్నాం. ఈ కానుక పథకం క్రింద చందా చెల్లించిన దాత పేరున (మీరు సూచించిన లేదా మేము ఎంపిక చేసిన) విద్యాసంస్థకు పత్రికను పంపుతాం. కానుక చందా రూ.1,500/- అంతకన్నా ఎక్కువ ఇచ్చిన దాత పేరు, విద్యాసంస్థ పేరు పత్రికలో ప్రచురిస్తాం.

దాత పేరు	విద్యాసంస్థ
డాక్టర్ కె. రామకృష్ణా రెడ్డి, హబ్సిగూడ, హైదరాబాద్	జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, అనంతవరం, భువనగిరి, నల్లగొండ జిల్లా
శ్రీ వి.సత్యనారాయణమూర్తి, నాచారం,హైదరాబాద్ (కీ॥శే॥ వి.నాగమణిగారి జ్ఞాపకార్థం)	మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, నాయికన్‌గూడెం,కూసుమంచి, ఖమ్మం జిల్లా
శ్రీ జి. దేముడు & శ్రీమతి జి. వరలక్ష్మి, బి.హెచ్.ఇ.ఎల్, విశాఖపట్నం	బి.హెచ్.పి.వి.ఎయిడెడ్ ఉన్నత పాఠశాల, బి.హెచ్.పి.వి.టౌన్‌షిప్, విశాఖపట్నం
శ్రీమతి టి.వి.ఆర్.సుశీల, మానేపల్లి వీధి, విజయవాడ	18 పాఠశాలలకు 3 సంవత్సరాలకు పత్రికను స్పాన్సర్ చేశారు.
శ్రీ పి. భానుప్రసాద్, పిలాని, రాజస్థాన్	ఉషోదయ ఉన్నత పాఠశాల, బంగారుపాల్యం, చిత్తూరు జిల్లా
శ్రీ కె. జగన్‌మోహన్‌రావు, మైత్రీనగర్, కానూరు, విజయవాడ	3 పాఠశాలలకు 5 సంవత్సరాలకు పత్రికను స్పాన్సర్ చేశారు.
శ్రీమతి ఎ.భారతీ సంజీవరావు, వెస్ట్ మారేడుపల్లి, సికింద్రాబాద్	100 పాఠశాలలకు ఒక సంవత్సరానికి పత్రికను స్పాన్సర్ చేశారు.

'శ్రీరామకృష్ణ ప్రభ' పత్రిక చందాను ఆన్‌లైన్ http://rkmath.org/srkp ద్వారా చెల్లించవచ్చును.

చందా వివరాలు		భారతదేశంలో	విదేశాలకు
విడి ప్రతి	:	₹ 10	-
సంవత్సర చందా	:	₹ 100	₹ 1,500
మూడు సంవత్సరాలకు	:	₹ 280	₹ 4,500
ఐదు సంవత్సరాలకు	:	₹ 450	₹ 7,500
ఇరవై సంవత్సరాలకు	:	₹ 1,500	₹ 22,000

గమనిక: డిమాండ్ డ్రాఫ్ట్, మనియార్డర్లలో Ramakrishna Math, Hyderabad అని వ్రాయాలి.
పంపవలసిన చిరునామా: Sri Ramakrishna Prabha, Ramakrishna Math, Domalguda, Hyderabad - 500 029.

చందాను ఆన్‌లైన్ http://rkmath.org/srkp ద్వారా చెల్లించవచ్చు.

లోపలి పేజీల్లో...

ఈ సంచికలోని రచయిత(త్రు)ల అభిప్రాయాలు వ్యక్తిగతమైనవి. సంపాదకులు గానీ, హైదరాబాద్ రామకృష్ణ మఠం గానీ వాటికి బాధ్యత వహించజాలరు. - సంపాదకులు

శ్రీరామకృష్ణ ప్రభ చందాదారులకు విన్నపం

ప్రియ పాఠకులారా!

- 'శ్రీరామకృష్ణ ప్రభ' పత్రిక కవరు మీద చిరునామాకు పైన మీ చందా నంబరు, కుడి వైపున మీ చందా గడువు ముగిసే నెల ఉంటాయి. మీ చందా గడువు పూర్తయ్యే నెలకు ముందుగానే సొమ్మును చెల్లించి చందాను పునరుద్ధరించుకోండి.
- మీ ఉత్తర ప్రత్యుత్తరాలన్నింటిలో తప్పనిసరిగా చందా నంబరు పేర్కొనాల్సిందిగా మనవి.
- మీ చిరునామా మారిన పక్షంలో 7వ తేదీ లోగా మాకు తెలియపరచినట్లయితే, వచ్చే నెల సంచిక నుండి మీ కొత్త చిరునామాకు పంపబడును.
- ప్రతీ నెల 26 లేదా 27వ తేదీల్లో పత్రిక పోస్ట్ అవుతుంది. మీకు పత్రిక 15వ తేదీ లోపుగా చేరనట్లయితే, వెంటనే మాకు తెలియజేయగలరు.

శ్రీరామకృష్ణ ప్రభ ద్వారా అవిచ్ఛిన్నంగా సేవలు అందించాలన్నదే మా ఆకాంక్ష. అందుకు మీ సహకారం కోరుతూ.... - సర్క్యులేషన్ మేనేజర్

SRI RAMAKRISHNA PRABHA, RAMAKRISHNA MATH
DOMALGUDA, HYDERABAD - 500 029. Andhra Pradesh
Phone No: 040- 27667799, 8801849494 E-mail : sriramakrishnaprabha@gmail.com

సీతాన్వేషణ.. భగవదన్వేషణ...

రామాయణంలో సుందర మారుతి సాహసకృత్యాలైన సముద్ర లంఘనం, లంకా ప్రవేశం, సీతాదర్శనం అత్యంత కీలక ఘట్టాలు. అలాగే ఆధ్యాత్మిక జీవనయానంలో అహంకార నిర్మూలనం, కామ కాంచన త్యాగం, భగవద్దర్శనం సాధకుని సర్వోన్నత లక్ష్యాలు.

సాధనపథంలో ముఖ్య అవరోధాలైన కామ కాంచనాలను త్యజించినవారిని కూడా అహంకారం మేరుపర్వతంలా అడ్డగిస్తుంది. అందుకే శ్రీరామకృష్ణులు 'కామ కాంచన త్యాగం



కన్నా అహంకారాన్ని అధిగమించడం అతి దుర్లభం' అని సాధకులను హెచ్చరించారు.

సాధకుడు అహంకారాన్ని జయించడం ఎలాగో శ్రీరామకృష్ణులు ఇలా సూచించారు: "ఓ భగవాన్! 'నేను నీ చేతిలో ఉపకరణాన్ని మాత్రమే! నీవు నాతో ఏమి చేయిస్తే, అది చేస్తాను' అని ప్రార్థించాలి. అయితే, భక్తునిలో 'నేను భగవంతుని సేవకుణ్ణి' అనే అహంకారం ఉండవచ్చు. అలాంటి అహంకారం వల్ల ఎలాంటి ప్రమాదమూ ఉండదు. దీనినే పక్వాహంకారం అంటారు."

ఆంజనేయునిలో ఈ పక్వాహంకారాన్ని సంపూర్ణంగా దర్శించవచ్చు. శ్రీరాముని సేవకునిగా, శ్రీరామకార్య సాధకునిగా, శ్రీరామనామమే సకల కార్యసఫలతకు సాధనమని సంపూర్ణంగా విశ్వసించిన ఆంజనేయుడు సీతాన్వేషణ కార్యంలో సఫలీకృతుడయ్యాడు. మనం కూడా హనుమంతునిలా భగవంతుని చేతిలో పరికరంగా భావించి సాధన చేస్తే భగవదన్వేషణలో సఫలీకృతులం కాగలం.

మన మనస్సు లంకా రాజ్యానికి ప్రతీక. లంక అసురులమయమైతే, మన మనస్సు అసురగుణాలమయం. హనుమంతుడు లంకలోని అసుర శక్తులను అణచి, సీతమ్మను దర్శించినట్లు, మనం కూడా మన మనస్సులోని అసురగుణాలను నాశనం చేస్తే భగవల్లాభాన్ని పొందవచ్చు.

మరి మన మనస్సులోని అసురగుణాలను ఎలా అంతం చేయాలి? దేని సహాయం తీసుకోవాలి? మనస్సును మనస్సుతోనే జయించాలి. లంకలో అసురుల మధ్య విభీషణుడు, మండోదరి లాంటి సుగుణవంతులు ఉన్నారు. వీరి సద్బోధలను వినని రావణాసురుడు నాశనమయ్యాడు. మన మనస్సులో దుర్గుణాలతో పాటు కొన్ని సద్గుణాలూ ఉన్నాయి. మనలో దుర్గుణాలశక్తి ప్రబలితే పతనమవుతాం. సద్గుణాలశక్తిని పెంచుకుంటూ మనస్సును సన్మార్గంలో నడిపించగలిగితే అమృతమయ స్థితిని పొందుతాం. ఎలాంటి వారు అమృతమయ స్థితిని పొందడానికి అర్హులో కఠోపనిషత్తు (1.3-8) ఇలా వివరిస్తోంది:

యస్తు విజ్ఞానవాన్ భవతి సమనస్కః సదా శుచిః
స తు తత్ పదమాప్నోతి యస్మాద్ భూయో న జాయతే ॥

'ఎవడు సదా అప్రమత్తంగా ఉంటాడో; ఎవడు మనోనియంత్రణ కలిగి ఉంటాడో; ఎవడు సదా పవిత్రంగా ఉంటాడో అలాంటి వాడు అమృతమయ స్థితిని పొందుతాడు.'

లంకే మనస్సు; అసురులే దుర్గుణాలు; హనుమంతుడే సాధకుడు; సీతాదర్శనమే భగవత్సాక్షాత్కారం. లంకలో ప్రవేశించిన హనుమంతుడు సీతమ్మ దర్శనం కోసం ఎన్ని అవరోధాలను ఎదుర్కొన్నాడో తెలుసుకుంటే, సాధనపథంలో ఎదురయ్యే ప్రలోభాలకు గురి కాకుండా సాధకుడు ఎంత అప్రమత్తంగా ఉండాలో గ్రహించవచ్చు.

'నన్ను' జయిస్తే సర్వం సఫలమే!: హనుమంతుడు లంకలో ప్రవేశిస్తున్నప్పుడు లంక ప్రధాన ద్వారం వద్ద లంకిణి, హనుమను అడ్డగించి "ఓ వనవాసీ! 'నేను' ఎవరో తెలుసా? ఈ లంకా నగరానికి రక్షణాధిపతిని. ఈ లంకలో ప్రవేశించాలంటే ముందు నన్ను జయించాలి" అని గద్దించింది. అందుకు హనుమంతుడు "హే శుభదాయినీ! ఈ సుందర లంకా నగరాన్ని ఒక్కసారి

తిలకించి వెళ్ళిపోతాను" అన్నాడు. లంకిణి భయంకరంగా గర్జిస్తూ హనుమంతుణ్ణి బలంగా కొట్టింది. వెంటనే హనుమంతుడు ఉగ్రరూపం దాల్చి, పిడికిలి బిగించి ఒకే ఒక్క గుద్దుతో లంకిణిని క్రిందపడేలా చేశాడు.

హనుమంతుడు రామనామశక్తితో సీతాన్వేషణకు అవరోధంగా నిలిచిన లంకిణిని జయించినట్లు సాధకుడు కూడా భగవన్నామశక్తితో భగవదన్వేషణకు అవరోధమైన అహంకారాన్ని అణగదొక్కాలి. అప్పుడే 'నేను' అనే భావన పోయి 'నీవే' (భగవంతుడే) అన్న భావన దృఢతరమవుతుంది. 'నేను' అనే అహంకారాన్ని జయిస్తేనే భగవదన్వేషణలో సర్వమూ సఫలమవుతుందన్న విషయాన్ని సాధకుడు గ్రహించాలి.

అనుభూతులు... అపోహలు: హనుమంతుడు లంకిణి రూపంలో ఎదురైన అహంకారమనే అవరోధాన్ని అధిగమించి స్వర్ణమయ భవనాలతో నిండిన లంకను దర్శించాడు. తరువాత రత్నఖచిత స్తంభాలు, మణిమాణిక్యాలు పొదిగిన కిటికీలు, వజ్రవైదూర్యాలు అమర్చిన ద్వారాలతో కూడిన రావణుని అంతఃపురంలోకి ప్రవేశించాడు. అక్కడ నిద్రిస్తున్న ఎంతోమంది దివ్యకాంతలను చూశాడు. కానీ సీతాదర్శనమే ధ్యేయంగా సాగుతున్న ఆంజనేయుని మనస్సుపై ఈ సువర్ణమయ భవంతులు, సుందరీమణుల సౌందర్యం ఎలాంటి ప్రభావమూ చూపలేదు. అలాగే భగవద్దర్శనం కోసం తపించే సాధకుణ్ణి ఈ ప్రాపంచిక భోగాలు ప్రలోభపరచలేవు, సిరి సంపదలు ఆకర్షింపజేయలేవు.



కానీ హనుమంతుడు, రావణుని అంతఃపురంలో నిద్రిస్తున్న మహాసాధ్వి మండోదరిని చూసి సీతమ్మగా భావించాడు. సీతమ్మ దర్శనమైందని ఆనందంతో గంతులు వేశాడు. ఒక్కక్షణంలో మళ్ళీ ఆలోచనలో పడ్డాడు. రావణుని అంతఃపురంలో సౌశీల్యవంతురాలైన సీతమ్మ ఉండడం అసంభవమని అంతరాలోచన చేసుకొని చింతాక్రాంతుడయ్యాడు.

పవిత్ర జీవనం గడుపుతూ భగవదన్వేషణలో పరిశ్రమిస్తున్న సాధకుడికి కొన్ని ఆధ్యాత్మిక అనుభూతులు, దర్శనాలు కలగడం సహజం. కానీ ఆ దివ్యదర్శనాలతోనే సంతృప్తి చెంది, పరమోన్నత స్థితిని పొందామనే భ్రమలో పడకూడదు. ఊహాలోకాల్లో తేలియాడకూడదు. హనుమంతుడు 'సుగుణవతి సీతమ్మ ఈ రాక్షసరాజగృహంలో ఉండడం అసంభవం' అని అంతరాలోచన చేసుకొన్నట్లు సాధకుడు కూడా తనకు కలిగిన దర్శనాలు నిజమైనవా? కావా? అని ఆత్మపరిశీలన చేసుకోవాలి. దివ్యదర్శనాలు అయిన తరువాత కూడా తనలో ఇంకా రాగద్వేషాలు ప్రకోపించినా, సుఖదుఃఖాలు ఉద్వేగపరచినా, భేదబుద్ధి పొడ చూపినా తాను ఇంకా సాధన పథంలో చివరి మజిలీ చేరుకోలేదని తెలుసుకోవాలి. పరమగమ్యాన్ని చేరుకొన్న సాధకుడు శోకమోహాలకు అతీతుడై స్థిర చిత్తంతో చరిస్తాడు. చిరశాంతితో జీవిస్తాడు. ఈ సత్యాన్ని సాధకుడు సదా జ్ఞాపకం ఉంచుకుంటే అపోహలకు గురి కాకుండా అప్రమత్తంగా ఉండవచ్చు.

అశోకవనం... ఆనందమయం: మండోదరిని చూసి సీతమ్మగా భ్రమించానని తెలుసుకొని హనుమంతుడు నిరాశామగ్నుడై కూర్చున్నాడు. సీతమ్మను దర్శించని ఈ జన్మ వ్యర్థమని తలచాడు. లంకా నగరంలో నలుమూలలా వెదికి సీతమ్మను కనుగొనాలని సంకల్పించుకున్నాడు. ఇలా దృఢ నిశ్చయుడైన హనుమంతునికి దూరాన దివ్యకాంతులతో శోభిల్లుతున్న అశోకవనం కనిపించింది. వెంటనే హనుమంతుడు ఆ వనంలోకి ప్రవేశించి అక్కడ స్వర్ణకాంతులీనుతున్న శింశుపా వృక్షం పైకెక్కి కూర్చున్నాడు.

అలా హనుమంతుడు సీతాన్వేషణలో ఎన్నో ఆటంకాలు, ఆకర్షణలు, భ్రమలు, నిరాశలను అధిగమించి చివరకు అశోకవనంలో సీతమ్మ సన్నిధికి చేరుకోగలిగాడు. కానీ కొమ్మలమాటున ఉన్న హనుమ, ముంగురుల మరుగున ఉన్న సీతమ్మ ముఖారవిందాన్ని దర్శించలేకపోయాడు. అప్పుడు హనుమంతుడు శ్రీరామకథా గానం చేశాడు. ఆ రామనామామృతాన్ని ఆస్వాదించిన సీతమ్మతల్లి ఒక్కసారి ముఖం పైకెత్తి హనుమ వైపు చూసింది. ఆ దివ్యమాత కరుణామృతదృక్కులలో తడిసిన హనుమంతుని అలసటంతా పటాపంచలైంది. సీతమ్మ దివ్యమంగళ ముఖారవిందాన్ని తిలకించిన మారుతి అనిర్వచనీయ ఆనందాన్ని పొందాడు.

రామకథాగానం చేస్తున్న హనుమకు సీతమ్మే దర్శనమిచ్చింది. కానీ హనుమ సీతమ్మను దర్శించలేదు. అలాగే సహనంతో సాధన చేస్తున్న సాధకునికి, భగవంతుడే కరుణించి దర్శనమిస్తాడన్న విషయం దీన్నిబట్టి అర్థమవుతుంది.

అందుకే శ్రీశారదాదేవి భగవత్ కృప ప్రాధాన్యం గురించి చెబుతూ, "సాధకుడు యావజ్జీవితమూ కఠోర సాధనలు చేసినప్పటికీ, భగవంతుని దర్శనం ఆయన అనుగ్రహం వల్ల మాత్రమే సాధ్యమవుతుంది" అని అన్నారు.

మన మనోరాజ్యంలో ఉన్న అసురశక్తులను నాశనం చేసి, అశోకమయ స్థితికి చేర్చమని ఆ సుందర మారుతిని ప్రార్థిద్దాం, అమ్మ(ఆత్మ)దర్శనం పొందేందుకు 'మము బ్రోవమని చెప్పు సీతమ్మ తల్లికి' అని అంజనీ సుతుణ్ణి వేడుకుందాం. ❖

భక్తి అనే ఎరతో మనోనిశ్చయమనే గాలపుకోలతో భగవంతుణ్ణి పట్టుకోవడానికి అఖండమైన ఓర్పుతో కాలపరిపాకానికై వేచివుండాలి. అలా చేస్తే ఆ దివ్యమీనం లభిస్తుంది. - శ్రీరామకృష్ణులు

గోరుముద్ద - స్వామి సుప్రియానంద

నేడు సంఘ సేవలు అందించే సంస్థల సంఖ్య పెరుగుతోంది. ఇది సంతోషించాల్సిన విషయం అయినప్పటికీ సేవాసంస్థలకు సహాయ సహకారాలను అందించడానికి జనం జంకుతున్నారు. కారణం సంఘసేవకుల మీద ఉన్న అపనమ్మకం. వారు నిజంగా నిస్వార్థ సేవలు అందిస్తున్నారా? అన్న సందేహం!

ఈనాడు కొన్ని స్వచ్ఛంద సంస్థలు మాత్రమే కాకుండా అనేక సంప్రదాయాలకు చెందిన సన్యాసినీ సన్యాసులు కూడా సంఘసేవలు అందిస్తున్నారు. ఈ మధ్య ఒక పెద్ద మనిషి ఆయన ఆందోళనను ఇలా వ్యక్తం చేసాడు. "స్వామీజీ! సిద్ధార్థుడు ఒక రాజకుమారుడు. ఆయన వైరాగ్యంతో రాజభవంతి విడిచి పెట్టి, సత్యాన్వేషణకు అడవులకు వెళ్ళాడు. మరి ఇప్పుడు సంఘ సేవకులమంటూ బరిలోకి దిగిన సాధారణ సగటు మనుషులు కూడా కొద్ది రోజులలోనే రాజభవంతులను మైమరపించే కట్టడాలకు యజమానులవుతున్నారు. ఇదేం చోద్యం!"



ఇది ఇలా ఉండగా సేవాసంస్థల మధ్య పోటీ పెరుగుతోంది. 'మేము గొప్ప' అంటే 'మేము గొప్ప' అని పెద్ద మొత్తాలు ఖర్చుపెట్టి పెద్దయెత్తున పనులు చేయడానికి ఆశ పడుతున్నారు. దీనికి చాలా ధనం కావలసి ఉంటుంది. ఆ 'డబ్బు-మబ్బు'లో పడి విచక్షణను కోల్పోతున్నారు. ఎన్ని సేవాసంస్థలు ఉన్నప్పటికీ 'ఎక్కడ వేసిన గొంగళి అక్కడే' అన్నట్లుగా ఉంది నేటి సమాజంలోని పరిస్థితి.

దీనికి పరిష్కారం, స్వామి వివేకానంద మాటల్లో : "సంఘంలో ఎంతమంది మనుషులున్నారు? అనేది ముఖ్యం కాదు. తమ ఆలోచనల్నీ, మాటల్నీ, చేతల్నీ ఒకటిగా చేసుకున్న నలుగురు కలిస్తే చాలు ఈ ప్రపంచాన్ని తలక్రిందులు చేయవచ్చు. సేవా కార్యక్రమాలను హృదయపూర్వకంగా ఆత్మార్పణ బుద్ధితో చేయండి. అదే నిజమైన సేవ. అప్పుడే ప్రజలకు మీ మీద నమ్మకం బలపడుతుంది."

సంఘ సేవకులు సంఘ మిత్రులవ్వాలి. సంఘానికి అవసరమైన సేవలను అందించాలి. సంఘం అంటే 'వసుధైక కుటుంబకం' అని మరచిపోకూడదు. ❖

రామకృష్ణ సంఘ ఉపాధ్యక్షులు

మహాసమాధి



17.4.1924 – 14.3.2014

రామకృష్ణ మఠం, రామకృష్ణ మిషన్‌ల ఉపాధ్యక్షులు శ్రీమత్ స్వామి గీతానందజీ మహరాజ్ (90 ఏళ్ళు) కోల్‌కతా రామకృష్ణ మిషన్ సేవాప్రతిష్ఠాన్ ఆసుపత్రిలో 2014 మార్చి 14వ తేదీ ఉదయం 9 గంటల 10 నిముషాలకు మహాసమాధి చెందారు.

స్వామి గీతానందజీ మహరాజ్ (పూర్వాశ్రమ నామం – వాసుదేవ్) ఢాకా జిల్లా (ప్రస్తుత బంగ్లాదేశ్)లో అరియల్ గ్రామంలో 1924 ఏప్రిల్ 17వ తేదీన జన్మించారు. 1946లో చెన్నై, రామకృష్ణ మఠంలో చేరిన స్వామి గీతానందజీ, రామకృష్ణ సంఘ 6వ సర్వాధ్యక్షులైన స్వామి విరజానందజీ మహరాజ్ నుండి మంత్రదీక్షను; 1956లో 7వ సర్వాధ్యక్షులైన స్వామి శంకరానందజీ మహరాజ్ నుండి సన్యాస దీక్షను స్వీకరించారు.

పూజ్య స్వామీజీ రామకృష్ణ సంఘ ప్రధాన కేంద్రమైన బేలూరు మఠం; కాన్పూర్, రాంచీ, వారణాసి, కాంకుర్‌గాచి (కోల్‌కతా) మఠ కేంద్రాలలో సేవలందించారు. స్వామి విరజానందజీ మహరాజ్‌కు సేవకునిగా; స్వామి శంకరానందజీ మహరాజ్‌కు కార్యదర్శిగా కూడా సేవలందించారు.

1973 ఏప్రిల్‌లో స్వామి గీతానందజీ మహరాజ్ రామకృష్ణ మఠం ట్రస్టీగానూ, రామకృష్ణ మిషన్ పాలకవర్గ సభ్యునిగానూ; 1974 జూన్‌లో సహాయక కార్యదర్శిగానూ; 1975 ఏప్రిల్‌లో కోశాధికారిగానూ ఎన్నికయ్యారు. 2003 ఏప్రిల్‌లో రామకృష్ణ సంఘ ఉపాధ్యక్షులుగా నియమితులయ్యారు.

స్వామి గీతానందజీ మహరాజ్ దేశ విదేశాల్లో వందలాది మంది ఆధ్యాత్మిక సాధకులకు మంత్రదీక్షను ప్రసాదించారు. వేలాది మంది భక్తులకు ఆధ్యాత్మిక మార్గదర్శకత్వం వహించారు. ❖



శిష్యునిగా మారిన గురువు

- ఎమ్. రాంబాబు

విశిష్టాద్వైత సంప్రదాయమునకు మూలపురుషులైన శ్రీరామానుజాచార్యులు, యాదవ ప్రకాశాచార్యుల వద్ద విద్యాభ్యాసం చేసే రోజుల్లో ఒక సంఘటన జరిగింది.

గురువైన యాదవ ప్రకాశాచార్యులు శిష్యుడైన రామానుజాచార్యుల తేజస్సును, బుద్ధి కుశలతను చూచి తనలో తాను అసూయ చెందేవారు.

ఆ రోజుల్లో కాంచీపురాధీశ్వరుని కుమార్తెకు పిశాచం ఆవహించింది. సదాచార సంపన్నులూ, జ్ఞానమూర్తులూ, మంత్రసిద్ధులూ అయిన యాదవ ప్రకాశాచార్యులు తపశ్శక్తి గలవారు కాబట్టి రాజుగారు వారిని పిలిపించారు. యాదవ ప్రకాశాచార్యులు తన శిష్యులతో రాజాస్థానం చేరి రాజకుమార్తెను చూచి మంత్రపఠనం ప్రారంభించారు.



అప్పటివరకు ఒక మూల శూన్యంలోకి చూస్తూ కూర్చున్న రాజకుమారి భయంకర రూపంతో లేచి గంభీర స్వరంతో “మాంత్రికుడా! నీ జీవితాంతం మంత్రాలు వల్లిస్తూ కూర్చున్నప్పటికీ నన్నేమీ చేయలేవు. నేను తలుచుకుంటే ఇక్కడ నుండి నిన్ను తరిమివేయగలను. నేను బ్రహ్మరాక్షసిని” అని గద్దించింది.

యాదవ ప్రకాశాచార్యులు భయపడి అక్కడ నుంచి తొలగి దూరంగా వెళ్ళి కూర్చున్నారు. అప్పుడు రామానుజాచార్యులు రాజ కుమార్తె ముందుకు వెళ్ళి “అయ్యా! దయనీయమైన ఈ దుర్దశ మీకు ఏ విధంగా వచ్చింది? చెప్పగలరా?” అని ప్రశ్నించారు. వెంటనే రాజకుమార్తెను ఆవహించిన బ్రహ్మరాక్షసి దుఃఖంతో, “నాయనా! నేను వేదవేదాంగాలలో ఆరి తేరిన పండితుణ్ణి. నా విద్యను పరులకుపయోగ పడకుండా దాచుకున్నాను. ఎవరికీ విద్యా దానం చేయలేదు. దాని ఫలితమే ఈ దుర్దశ. నీవు బాలుడవైనా బుద్ధిశాలివి. నన్ను కనిపెట్ట గలిగావు. నీవు పుణ్యమూర్తివి. పవిత్రమైన నీ హస్తమును నా శిరముపై ఉంచితే ఈ దుర్దశ నుండి నాకు ముక్తి లభిస్తుంది” అని ప్రార్థించాడు.

రామానుజాచార్యులు రాజ కుమార్తె తలపై తన హస్తమును ఉంచి ధ్యానించడం ప్రారంభించిన తక్షణమే బ్రహ్మరాక్షసి రాజకుమార్తెను వదలిపోయింది.

రామానుజాచార్యుల మహిమ దేశమంతటా వ్యాపించింది. దేశం నలుమూలల నుండి ప్రజలు ఆయన్ను దర్శించుకోవడానికి తండోపతండాలుగా రావడం ప్రారంభించారు.

యాదవప్రకాశుని తల్లి రామానుజుడు భగవదాంశ సంభూతుడనీ, ఆయన్ని సందర్శించి పునీతుడవుకమ్మని కుమారుడికి చెప్పింది. యాదవప్రకాశుడు తన తప్పును గ్రహించి తన శిష్యుడైన రామానుజుణ్ణి ఆశ్రయించాలని తలచాడు. కానీ ఆయన మనస్సు ఇంకా సందేహంతో తటపటాయిస్తుంది. కంచి వరదరాజస్వామి పూజారి అయిన తిరుక్కచ్చినంబి వద్దకు వెళ్ళి ‘నా మనస్సులో ఓ సందేహముంది. దాని గురించి వరదరాజస్వామిని అడిగి తెలుసుకోండి’ అని చెప్పాడు. తిరుక్కచ్చినంబి ఆలయానికి వెళ్ళి వరదరాజస్వామితో ‘స్వామీ! యాదవప్రకాశుని మనస్సులో ఒక సందేహ ముందట, మీ అభిప్రాయం తెలుసుకోమన్నాడు’ అని విన్నవించాడు. అప్పుడు ‘యాదవప్రకాశుడు రామానుజుణ్ణి దర్శించడానికి సందేహిస్తున్నాడు. ఇక ఏమాత్రం సందేహించ కుండా అతణ్ణి ఆశ్రయించమని చెప్పు’ అని వరదరాజస్వామి బదులిచ్చాడు. ఈ విషయాన్ని నంబి యాదవప్రకాశునికి చెప్పగానే అతడు రామానుజుణ్ణి దర్శించడానికి వెళ్ళి, రామానుజుని పాదపద్మాలకు ప్రణామాలు అర్పించబోతుండగా రామానుజుడు యాదవప్రకాశుణ్ణి ఆలింగనం చేసుకున్నాడు. అప్పుడు యాదవప్రకాశునికి రామానుజుని మహోన్నత హృదయం అర్థమైంది. అప్పటి నుండి యాదవప్రకాశుడు రామానుజుని శిష్యునిగా మారిపోయాడు. ఆ విధంగా గురువు శిష్యుడయ్యాడు, శిష్యుడు గురువయ్యాడు. రామానుజుని ప్రతిభ అలాంటిది మరి! ❖ (మే 5వ తేదీ, సోమవారం ‘శ్రీరామానుజాచార్య జయంతి’)

అవతారమూర్తులు దైవశక్తులతో ఆవిర్భవిస్తారు. బ్రహ్మానుభవం నుండి అతిసామాన్య అనుభవం వరకూ ఏ స్థితినైనా వారు పొందగలరు. దానిలో నెలకొని ఉండగలరు. - భగవాన్ శ్రీరామకృష్ణులు



పలికెడిది భాగవతం

... మోహ విచ్ఛేదము సేయుమయ్యా!

- స్వామి జ్ఞానదానంద

శ్రీకృష్ణపరమాత్మ, పాండుపుత్రులను పట్టాభిషిక్తులనుచేసి ద్వారకకు బయలుదేరుతూ, ఆత్మీయులందరికీ అభివందనాలు చెప్పి రథాన్ని అధిరోహించబోతున్నాడు.


ఇంతలో అభిమన్యుడి భార్య ఉత్తర ఆందోళనతో ఆ ఆపద్బాంధవుడి పాదాలపై వచ్చి వాలింది. అప్పటికే పద్మవ్యూహంలో భర్తను కోల్పోయి, భర్త జ్ఞాపకంగా కడుపులో పెరుగుతున్న బిడ్డపై ఆశతో బతుకుతున్న ఆమె ఆక్రందనతో 'ఓ విశ్వంభరా! ఎవరో సంధించిన బాణాగ్నికి నా కడుపులో ఉన్న పసికందు కసుగంది పోతుంది. దయతో నన్ను రక్షించు తండ్రీ!' అని ప్రాధేయపడింది. పాండవుల వారసుడు ఒక్కడు కూడా మిగలకూడదని అశ్వత్థామ బ్రహ్మాస్త్రాన్ని ప్రయోగించాడనీ, అది ఉత్తర గర్భంలోని శిశువుపై ప్రభావం చూపుతోందనీ భగవానుడు దివ్యదృష్టితో గుర్తించాడు. పాండవుల వంశాంకురాన్ని ఎలాగైనా రక్షించాలని సంకల్పించిన వాసుదేవుడు సుదర్శన చక్రాన్ని ప్రయోగించి ఉత్తర గర్భాన్ని యోగమాయతో కప్పివేశాడు. తన అమోఘమైన వైష్ణవ తేజస్సుతో అశ్వత్థామ ప్రయోగించిన బ్రహ్మాస్త్రాన్ని అణచివేశాడు. నిఖిల జగత్తును నిర్మించి, భరించి, హరించే పరమాత్ముడు అనితర సాధ్యమైన శక్తితో కాపాడిన ఆ శిశువే పాండవుల వంశోద్ధారకుడైన పరీక్షిత్తు.

ఆ సమయంలో ఆనందబాష్పాలు రాలుస్తూ, కొడుకులు, కోడలితో కలసి కుంతీదేవి శ్రీకృష్ణ పరమాత్ముడి దగ్గరకు వచ్చింది. తమ వంశాన్ని నిలబెట్టిన దేవకీనందనుడిని కృతజ్ఞతాభి వందనాలతో కీర్తించింది. 'మమ్మల్ని కంటికి రెప్పలా కాపాడు కున్నావు; నీ ఋణం ఎలా తీర్చుకునేది? నిన్నే నమ్ముకొని బతుకు తున్న మమ్మల్ని విడిచి ఎక్కడికి వెళతావు?' అని బాధపడుతూ...

**యాదవులందు పాండుసుతులందు నధీశ్వర! నాకు మోహ వి
చ్ఛేదము సేయుమయ్య ఘన సింధువు చేరెడి గంగ భంగి నీ
పాద సరోజ చింతనముపై ననిశంబు మదీయబుద్ధి న
త్యాదర వృత్తితో గదియు నట్లుగ చేయగదయ్య యీశ్వరా!**

"స్వామీ! ఆత్మీయులైన యాదవుల మీదా, పాండవుల మీదా నాకున్న అనురాగ బంధాన్ని తెంపివెయ్యి. కడలిరాజులో కలిసే గంగాతరంగిణిలాగా నా బుద్ధి సర్వదా నీ చరణ సరోజ సంస్మరణంలోనే సంలగ్న మయ్యేటట్లు చెయ్యి! ఇది చాలు" అని వేడుకుంది. అలా ఆనాడు ఆ మహాసాధ్వి చేసిన విన్నపం నేటికీ మనమందరం ఆ పరమాత్ముడి ముందు ఆలపించాల్సిన ప్రార్థనాగీతం. 'ఆ దీనబాంధవుడి నుంచి కాంక్షించాల్సినవి ధన కనక వస్తువాహనాలు, అధికారవైభవాలు, అసంఖ్యాకమైన సుఖభోగాలు కాదు. ఆడింది చాలు! ఇక ఆటలు ఆపివేయించ మనీ, అనుభవించింది చాలు, బంధనాల శృంఖలాలనూ, మాయామోహ పాశాలనూ తుంచేయమనీ, ఆ భగవంతుణ్ణి వేడుకోవాల'ని ఆ కుంతీదేవి పరోక్షంగా మనకు పాఠం నేర్పింది.

సఖులందు...సుతులందు.... : మనం చాలా వరకు కుంతీదేవికి విరుద్ధమైన రీతిలో భగవంతుడిని ప్రార్థిస్తూ ఉంటాం.



ఆయన ఎంత ప్రసాదించినా సంతృప్తిపడక, లేని కొరతను సృష్టించుకొని, కడదాకా కొసరుతూ ఉంటాం. ఆయుష్యం ఉన్నన్నాళ్ళూ 'నా వారు, నా వారు' అనుకుంటూ మనవళ్ళ, మనవరాళ్ళ, మునిమనవళ్ళ, మునిమనవరాళ్ళ పెండ్లిపేరంటాలు, బాగోగుల గురించే తాపత్రయపడుతూ ఉంటాం. 'అయ్యో! మేం కాకపోతే వాళ్ళను ఎవరు చూసుకుంటారు' అనుకుంటూ లేని ప్రాధాన్యాన్ని కల్పించుకుంటూ ఉంటాం. అవన్నీ చేయకూడదని కాదు. కుంతీదేవి కూడా కురుక్షేత్ర యుద్ధ సమాప్తి వరకు పాండవుల గురించి పరితపించింది, ప్రయాసలు పడింది. కానీ తన అవసరం ఇక లేదని తెలిశాక హుందాగా తప్పుకోవడమే విజ్ఞత అని తెలుసుకుంది. అయితే నేడు మనలో చాలామంది తెగుతున్న దారాలకు ముళ్ళు వేసి, ముళ్ళు వేసి బంధాలను, బాధ్యతలను పెంచుకుంటూ పోతున్నారు. ఇక పైవాడు మాత్రం ఏం పట్టించుకుంటాడు! ఆ పరమసత్యాన్ని గుర్తెరగడం వల్లనే పాండవుల మాతృమూర్తి పరంధాముడిని పరమోత్కృష్టమైంది

కోరుకుంది. 'ముందు నాకు ఈ అయిన వారిపై వ్యామోహాన్ని వదిలించ'మంటుంది; 'నీ పాదపంకజాలపై మనస్సు కుదిరేట్లు చేయ'మని ప్రార్థిస్తుంది. శ్రీకృష్ణ చైతన్యులు తన 'శిక్షాష్టకం'లో కూడా ఇదే భావనతో...

న ధనం న జనం న సున్దరీం కవితాం వా జగదీశ కామయే
మమ జన్మని జన్మనీశ్వరో భవతాద్భక్తి రహైతుకీ త్వయి

'జగదీశ్వరా! నాకు ధనం వద్దు, జనం వద్దు, సుందరీమణులు వద్దు, కవిత్వమూ వద్దు, జన్మజన్మాంతరాల్లో నీ యందు అహేతుక భక్తే నాకు కావలసింది'ని ప్రార్థిస్తాడు.

ఘన సింధువులో చేరే గంగలా.... : ఎక్కడ పుట్టినా తన సంగమస్థానం సాగరమేనని నదికి తెలుసు. అందుకే మలుపులమయమైన మహాకఠిన మార్గాల్లో ప్రవహించినా, మనోహరమైన ప్రకృతి అందాల సరసన పరవళ్ళు తొక్కుతూ పయనించినా తన కడపటి కలయిక కడలితోనేనని మరచిపోకుండా ముందుకు సాగిపోతుంది. అలా సాగరంలో చేరే సురచరిలా, మనస్సు నీ చరణకమలాలపై సంలగ్నమయ్యేట్లు చేయమని కుంతీదేవి వేడుకుంటోంది. ఈ సంసార వ్యవహారాల్లో మనం ఎంత తలమునకలై ఉన్నా, మన అంతరంగంలో మాత్రం అనవరతం ఆ మాధవుడే మెదులుతూ ఉండాలి. బాహ్యంగా ఈ లోకంలో ఎందరితో సంబంధబాంధవ్యాలు కొనసాగించినా, మన శాశ్వత సహచరుడు మాత్రం శ్రీమన్నారాయణుడేనని గుర్తుంచుకోవాలి. కానీ అంతులేని సంసార లంపటాలు మన కళ్ళకు మాయల తెరలు కమ్మించేస్తున్నాయి. అదే భావనతో శ్రీభరద్వాజ మహర్షి 'శ్రీశివకర్ణామృత స్తోత్రమ్'లో...

> **'ఓ ప్రభూ! నీ పాదాల వద్ద నాకు స్థానం కల్పించు. సర్వదా నన్ను నీ సాన్నిధ్యంలో ఉంచుకో. నీ పాదపద్మాల పట్ల శుద్ధభక్తి కలిగేట్లు అనుగ్రహించు' అని భగవంతుణ్ణి ప్రార్థించాలి.**
>
> - భగవాన్ శ్రీరామకృష్ణులు

అపార సంసార సముద్ర మగ్నః, కఠోర తాపత్రయ పీడితోహమ్
చలేన్ద్రియాకృష్టమనా మహేశ, శమ్భో! భవన్తం హృది విస్మరామి

'మేర లేని సంసారమనే సముద్రాన మునిగి కఠోరాలైన తాపత్రయాలతో పీడితులమవుతూ, నా మనస్సును బాహ్యేంద్రియాలు ఆకర్షిస్తూండడంతో నా హృదయానికి సన్నిహితంగా ఉన్నా నిన్ను విస్మరిస్తున్నా'నని ఆవేదన పడతారు.

అవతార వరిష్ఠుల వాత్సల్యం : శ్రీమద్భాగవతానికి సమంగా ఆధునికయుగంలోనూ తన లీలావిన్యాసాన్ని ప్రదర్శించిన అవతార వరిష్ఠులు భగవాన్ శ్రీరామకృష్ణ పరమహంస. వారి పరమభక్తులలో గోలాప్ సుందరీదేవి ఒకరు. భర్త, కుమారుడు, కుమార్తె - ముగ్గురూ కాలధర్మం చెందడంతో ఆమె జీవితం కన్నీటిసంద్రమైంది. ఆ పరిస్థితుల్లో శ్రీరామకృష్ణులు ఓ మారు ఆమె ఇంటికి వెళతారు. సాక్షాత్తూ కృష్ణుడిగా ఆమెకు పలుమార్లు దర్శనమిచ్చిన శ్రీరామకృష్ణులు, స్వయంగా తమ ఇంటిని పావనం చేస్తారని ఆమె ఊహించలేదు. అందుకే ఆయన రాకతో ఆనందాతిశయానికిలోనై ఆమె గద్గదస్వరంతో 'అయ్యో! నాకిది చాలు. మీరు మా ఇంటిని పావనం చేశారు. ఈ ఆనందంతో నేను కన్నుమూస్తానేమో అనిపిస్తోంది. భర్త, బిడ్డలు దూరమయ్యారన్న బాధ కూడా నా నుంచి తొలగిపోయింది. నా సంతోషాన్ని ఎవరితో పంచుకోను! ఈ ఆనందంతో నేను మరణించినా బాధ లేదు' అని ఆ భక్తురాలు శ్రీరామకృష్ణులను చూసుకొని ఆనందపరవశురాలై వారి పాదాలపై పడింది. భగవాన్ శ్రీరామకృష్ణుల కృపకు పాత్రులైన ప్రత్యక్ష భక్తులలో గోలాప్‌మా ఒకరు. తదనంతర కాలంలో గోలాప్‌మా, శ్రీరామకృష్ణుల సాన్నిధ్యంలో తాను పొందిన సాంత్వనను స్మరించుకుంటూ 'నేను మొదటిసారి ఆయనను దర్శించుకున్న సందర్భంలో నా తలను స్పృశించి నా హృదయంలోని దుఃఖాన్నంతా తొలగించి వేశారు. అది అత్యద్భుతం; క్షణంలో నా మనస్సు ప్రశాంతమైంది. నాటకంలో ఓ పాత్రను పోషించడానికి ఈ లోకంలోకి వచ్చానని గ్రహించాను. ఎవరు ఎవరికి తల్లి? ఎవరు ఎవరికి బిడ్డ? చిన్నతనంలో నేను గుడ్డముక్కలతో ఆడుకున్నాను. ఆ తరువాత రక్తమాంసాలున్న బొమ్మలతో ఆడుకున్నాను. ఈ లోకం బొమ్మలాటే తప్ప మరేమీ కాదు. నా పిల్లల కోసం విలపించడం ఎందుకు? ఆ భగవంతుడి కోసం విలపించడం మహత్తర విషయం కదా! అనిపించింది' అనేవారు.

త్రుంపవే భవ లతల్! : కుంతీదేవి తుదకు *'శ్రీకృష్ణా! యదుభూషణా! నీకున్ మ్రొక్కెద త్రుంపవే భవ లతల్ నిత్యానుకంపానిధీ!'* అంటూ ఈ భవబంధాలను తెంపివేయమని ఆ రాధికావల్లభుడిని కోరుకోగా, ఆమెను ఆయన కటాక్షించి రథమెక్కి ముందుకు సాగిపోతాడు.

మనోహరంగా కనిపించే ఈ మమకారాలనూ, మానవ సంబంధాలనూ ఎప్పటికప్పుడు విశ్లేషించుకుంటూ, ఇలా శాశ్వతమైన సాంత్వనను పొందేందుకు ప్రయత్నించాలి. అప్పుడప్పుడూ ఏకాంతంలో ఆ అంతర్యామి చెంతన సేద తీరుతూ అంతర్ముఖులం కావాలి. అలాంటి అంతర్మథనంతోనే 'గీతాంజలి'లో రవీంద్రనాథ్ టాగూరు...

జన్మలో మృత్యువులో ఈ లోకంలో ఇతర లోకాల్లో, ఎక్కడెక్కడ నువ్వు నన్ను తిప్పినా, అపరిచితమైన దానికి నా హృదయాన్ని ఆనందబంధాలతో ఎప్పుడూ జతపరిచే నా అనంత జీవిత పథచారివి నీవే!....

ఈ ప్రపంచంలో నన్ను ప్రేమించేవారు అన్ని విధాలా నన్ను బంగారు సంకెళ్ళలో బందీని చేస్తారు, కానీ వాళ్ళ ప్రేమ కన్నా గొప్పది నీ ప్రేమ..నన్ను స్వేచ్ఛగా వొదులుతావు నువ్వు...

నా ప్రార్థనల్లో నిన్ను పిలవకపోయినా, నిన్ను నా హృదయంలో నిలుపుకోకపోయినా నీ ప్రేమ నా ప్రేమ కోసం ఎదురుచూస్తూనే ఉంటుంది.... అంటూ అంతర్యామి అన్వేషణలో సాగిపోయారు. ❖

ఈ పృథ్వియందు ధనధాన్యాలు, భోగభాగ్యాలు ఇవి ఏవీ తృష్ణను తీర్చలేవు. ఈ లోకంలో వస్తువులను పొందుటవల్ల కాక ఆశను వీడుట వల్ల మాత్రమే మానవులు తృప్తి చెందగలరు. - శ్రీమద్భాగవతం

"ఒక వ్యక్తి తనను తాను అసహ్యించుకొంటున్నట్లయితే అదే పతనానికి హేతువు. పూర్వీకుల చరిత్రను అవమానకరంగా భావిస్తే, ఆ జాతి అంతానికి చేరుకున్నట్లే!" అంటారు స్వామి వివేకానంద. గత వైభవాన్ని మర్చిపోయినంత కాలం మనమూ, మన దేశం స్తబ్ధతలో మునిగిపోతాం. అందుకే, మన ప్రాచీన సంస్కృతి గురించి తెలుసుకోవాలి. గడచిపోయిన సంగతులు తెలుసుకొంటూ, భవిష్యత్ మహత్కార్యాల సాధన వైపు నడవాలి. మన ప్రాచీన భారతీయ సంస్కృతిని గుర్తు చేసేందుకు చేస్తున్న ప్రయత్నమే ఈ వ్యాసాల పరంపర. సుప్రసిద్ధ రచయిత, బెంగుళూరు రామకృష్ణ మఠం అధ్యక్షులు స్వామి హర్షానంద మహరాజ్ మధ్యయుగాల కాలం దాకా విలసిల్లిన మన సంస్కృతిని 'శ్రీరామకృష్ణ ప్రభ' పాఠకులకు 2014 ఫిబ్రవరి సంచిక నుండి వివరిస్తున్నారు.

హిందూ విద్యావ్యవస్థ



'విద్య లేని వాడు వింత పశువు' అంటాడు సంస్కృత కవి భర్తృహరి. ఆధునిక కాలానికి చెందిన ఆల్బర్ట్ ఐన్‌స్టీన్ (క్రీ.శ. 1879–1955) కూడా భర్తృహరితో ఏకీభవిస్తూ, విశేషమైన జ్ఞానం వుండి కూడా మానవీయ విలువలు లేని వ్యక్తి, తర్ఫీదు పొందిన కుక్కతో సమానమని అంటారు.

స్వామి వివేకానంద విద్య గురించి ఇలా అన్నారు:

- విద్యయే మన రుగ్మతలన్నీ తొలగించగల దివ్యౌషధం.
- విద్య అంటే మానవుడు తనలోని పరిపూర్ణత్వాన్ని వ్యక్తం చేయడమే.
- విద్య వల్ల ఇచ్ఛాశక్తి ప్రవాహం, ప్రకటన నియంత్రితమై ఫలవంతమవుతాయి.
- శీలవంతమైన భావాలను ఆకళింపు చేసుకోవడం, అనుష్ఠించడమే విద్య.

స్వామి వివేకానంద భావాలను సమర్థించిన పలువురు పాశ్చాత్య మేధావులు విద్య గురించి ఇలా అన్నారు:

- విద్య మన పిల్లలకు ఉద్రేకాలను నిగ్రహించే శక్తినివ్వాలి.
- సత్యాదర్శాలను ప్రసాదించాలి. చక్కని శీలనిర్మాణం కలిగించే మత ఆదర్శాలను అధ్యయనం చేయనివ్వాలి.
- భగవంతుని సృష్టి నిర్మాణ సూత్రాల్ని తెలియజేస్తూ, సిద్ధాంతాలకు అనుగుణమైన జీవితం ప్రసాదించాలి.
- విద్య మేధాశక్తిని పెంపొందించాలి. కేవలం కొన్ని పాఠాలు వల్లె వేయడంగా ఉండరాదు.

ప్రాచీన, మధ్యయుగాల భారత విద్యా వ్యవస్థ పై అంశాలన్నిటినీ గుర్తించి తగిన విద్యా విధానాలను రూపొందించింది. విద్య రెండు శాఖలుగా విభాజితమై పరావిద్య (అధ్యాత్మ విద్య), అపరావిద్య (లౌకిక విద్య)గా పేరొందింది. అపరా విద్య సుఖమైన ప్రాపంచిక జీవితానికి అవసరం. అధ్యాత్మ విద్య మరణానంతర జీవితానికి అవసరం. రెండింటి సమన్వయంతో నాగరకత–సంస్కృతి రెండూ లభిస్తాయి.

ప్రాచీనమైన (క్రీ.పూ. 4,000–2,500) ఛాందోగ్యోపనిషత్ కూడా వేదాలే కాకుండా 15 రకాల విద్యలను తెలియచేయడం ఆశ్చర్యకరం. వీటిలో కొన్ని: వ్యాకరణ, పిత్ర్యం (ఉత్తర కర్మల విద్య), గణితం, దైవ (శకున విద్య), తర్క, ఏకాయన (నీతి శాస్త్రం), భూతవిద్య, ధనుర్వేదం (యుద్ధవిద్యలు), జ్యోతిష (ఖగోళ శాస్త్రం), దేవజన విద్యలు (సంగీతం, నాట్యం, శిల్పం లాంటి కళలు).

విద్యా వ్యవస్థలోని భాగాలు : విద్యా వ్యవస్థలోని మూడు కీలకమైన అంశాలు – గురువు, విద్యార్థి, విషయం. గురువు

శ్రోత్రియుడు (వేదవేదాంగాలు తెలిసినవాడు), బ్రహ్మనిష్ఠుడు (నిశ్చల బ్రహ్మజ్ఞాని) అయివుండాలి. మిగతా విద్యావిధానాలలో లాగే గురువు జ్ఞానం–అనుష్ఠానం రెండూ కలిగి వుండాలి. ఉన్నతమైన శీలం, బోధించాలనే ఆకాంక్ష, విద్యార్థుల పట్ల ప్రేమ అనేవి గురువుల నుంచి ఆశించే లక్షణాలు.

తెలుసుకోవాలనే తపన, గురువుల పట్ల విధేయత, ఆత్మనిగ్రహం, సోమరితనం లేకపోవడం, గురు శుశ్రూష చేయడానికి ఆసక్తి – ఇవన్నీ విద్యార్థికి ఉండవలసిన లక్షణాలు.

గురుకులాలు : పూర్వం గురువులు, విద్యార్థులను తమ ఇళ్ళలోనే ఉంచుకొని విద్య నేర్పేవారు. వీటినే 'గురుకులాలు' అని పిలిచేవారు. గురుకులాలు సమాజ సహకారంతో స్థాపితమై, ప్రభుత్వం నుండి, ధనికుల నుండి తగిన సంపద సౌకర్యాలు పొంది, విద్యార్థులకు ఉచితంగా విద్యను నేర్పేవి.

క్రమేపీ ఈ 'గురుకులాలు' సంఖ్యలోనూ, నాణ్యతలోనూ ఎంతో వృద్ధి చెంది, పేరుకు తగ్గట్టు 'గురు' – పెద్ద, 'కుల' – సంస్థలుగా విస్తరించాయి. ఈ విద్యాసంస్థలలో పదివేల మంది విద్యార్థులున్నవి కూడా ఉండేవి. ఆవశ్యకత వల్లనే కాక, ఒక ఉత్తమ సంప్రదాయంగా కూడా కొత్తగా చేరిన విద్యార్థులకు, పై తరగతుల విద్యార్థులు బోధకులుగా వ్యవహరించేవారు. క్రమశిక్షణలో లోపాలు జరిగినప్పుడు శిక్షలు విధించినా అవి కఠినంగా ఉండేవి కావు. ప్రవర్తనను మార్చుకోలేని విద్యార్థులను గురుకులాల నుండి బహిష్కరించి వ్యవస్థ క్రమశిక్షణనూ, పేరుప్రఖ్యాతులనూ కాపాడేవారు.



ప్రాచీన నలంద విశ్వవిద్యాలయం

పరావిద్య లేక ఆధ్యాత్మిక విద్యను అభ్యసించడానికి తెలుసుకోవాలనే జిజ్ఞాస, పవిత్రమైన తపమాచరించడానికి సుముఖత అనేవి ముఖ్యమైన అర్హతలు. వర్ణ, ఆశ్రమ, వయః పరిమితులు ఉండేవి కావు.

అయితే వేద–వేదాంగాలను అభ్యసించడానికి కొన్ని నియమాలను పాటించేవారు. వేద విద్య ద్విజులకు (బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్యులకు) మాత్రమే పరిమితం. వారికి కూడా ఉపనయనం తరువాతనే అర్హత లభించేది.

శతాబ్దాల నాటి ఈ విద్యావ్యవస్థకు సంబంధించి కొన్ని వివరాలు: వేదకాలంలో మేధావులతో శాస్త్ర వాదనలు, తాత్విక చర్చలు జరిగేవి.

క్రీ.పూ. 8వ శతాబ్దం నాటికే వారణాసి (కాశీ నగరం), తక్షశిల విద్యా కేంద్రాలుగా ప్రసిద్ధిచెందాయి. పాటలీపుత్ర, విదిషా, కాంచీపురం లాంటి పట్టణాలను 'ఘటిక స్థానాలు', పండితుల పాండిత్యాన్ని కొలవగలిగిన స్థానాలుగా పిలిచేవారు. ఈ కేంద్రాలలో 14 నుండి 18 విద్యాశాఖలలో శిక్షణ పొందడానికి వీలుండేది. విద్యార్థులు ఇతర మతాల వారి అంతరాయం లేకుండా తమ మతం గురించి నిశితమైన జ్ఞానాన్ని పొందడానికి అవకాశం ఉండేది.

తక్షశిల (క్రీ.పూ. 400), నలంద (క్రీ.శ. 600), విక్రమశిల (క్రీ.శ. 800) విశ్వవిద్యాలయాలు ప్రపంచ ప్రఖ్యాతి గాంచాయి. ఈ విశ్వవిద్యాలయాలలో మహా పాఠశాలలు (కళాశాలలు) ఉండేవి. ప్రతి కళాశాలలో అనేక ఉపన్యాస వేదికలు ఉండేవి. పెద్ద పెద్ద భవనాలలో అమూల్యమైన గ్రంథాలు కలిగిన గ్రంథాలయాలను నెలకొల్పేవారు. ప్రవేశ పరీక్షలు కఠినంగా ఉండి, 20 శాతం విద్యార్థులకే ప్రవేశార్హత లభించేది.

ఒక్క నలంద విశ్వవిద్యాలయంలోనే 8,500 మంది విద్యార్థులకు 1,500 మంది గురువులు రోజుకు 100కు పైగా ఉపన్యాసాల ద్వారా బోధించేవారు. ఆచార్యులు నాగార్జున, వాసుబంధ, దిజ్ఞాగ మొదలైనవారు అంతర్జాతీయ ఖ్యాతి గడించి చైనా, జపాన్, కొరియా, టర్కిస్థాన్, బర్మా, గాంధార (ఆఫ్ఘనిస్తాన్), సుమత్రా, పర్షియా దేశపు విద్యార్థులను కలిగివుండేవారు. విశ్వవిద్యాలయాలలో విద్య, వసతి ఉచితంగా ఉన్నా సంపన్నులైన విద్యార్థులు రుసుము చెల్లించేవారు.

విశ్వవిద్యాలయంలో నివసించే విద్యార్థులలో బౌద్ధ సన్యాసులూ ఉండేవారు. క్రమశిక్షణలోపం మచ్చుకు కూడా ఉండేది కాదనీ, విశ్వవిద్యాలయ ఆచార్యులు, పరిపాలకులు నీతి నియమాలను కలిగి ఉండేవారనీ ప్రసిద్ధ పర్యాటకులు హ్యూయాన్‌సాంగ్ (క్రీ.శ. 600–664), ఐసింగ్ (క్రీ.శ. 655–713) కొనియాడారు.

పైన చెప్పిన బౌద్ధ విశ్వవిద్యాలయాలే కాకుండా పారిశ్రామిక, వృత్తిపరమైన శిక్షణ సంస్థలు కూడా ఉన్నట్లు కౌటిల్యుడు (క్రీ.పూ. 300) తదితరుల గ్రంథాల వల్ల తెలుస్తోంది.

ప్రాచీన, మధ్య యుగాల నాటి భారతదేశంలో గొప్ప విద్యావిధానం ఉండడమే కాక ఇప్పటి విద్యా విధానానికి కూడా స్ఫూర్తిదాయకంగా ఉన్నదనిపిస్తోంది. ❖

అనువాదం: డాక్టర్ పి.వి. రెడ్డి

సమర్థులైన వారికి ఏదీ కష్టం కాదు; కృషిచేసే వారికి అన్నీ సాధ్యమే; విద్యగల వారు సర్వత్రా పూజ్యనీయులే; ప్రియంగా మాట్లాడే వారికి పరాయివారంటూ ఎవరూ ఉండరు. - చాణక్యనీతి



ప్రకృతి గుండెకు పల్లేరు గాయం

– చక్కిలం హేమంత్ కుమార్

ఈ సకల చరాచర విశ్వాన్ని సృజించిన భగవంతుడు ఎంత ఉదారుడంటే తాను సృష్టించిన జీవ జాలాన్ని (నిర్జీవ జాలాన్ని కూడా) పరాన్న భుక్కులుగా జీవించే దైన్య స్థితిలో నిస్తేజంగా ఉంచేయకుండా వాటికి ఓ స్వతంత్ర ప్రతిపత్తిని కల్పించాడు. చైతన్య పూరితంగా, లోకహిత కారకంగా జీవించే అవకాశాన్ని కల్పించాడు. స్వవిశ్వాసాన్నీ, స్వగౌరవాన్నీ పెంచాడు. ప్రతి ఒక్క జీవి, కేవలం తాను తిని, నిద్రించి, మైథునంతో తన జాతిని వృద్ధి చేస్తూ మాత్రమే జీవించడం లేదు. పర్వతాల లాంటి నిర్జీవజాలం (స్థూల దృష్టికి) కూడా ఉన్నచోటునే స్థాణువుల్లా ఉంటూ కూడా ఎన్నో విధాల ప్రకృతి సౌందర్యానికీ, ప్రాకృతిక చాలన సౌలభ్యానికీ తమ వంతు సేవలందిస్తున్నాయి.

నదులు కేవలం జల ధారలు కాదు. జీవ ధారలు. అమృత రస ప్రవాహాలు. సముద్రాలు పరుగులు పెడుతూ వచ్చిన అంతులేని నదీ జలాలను చెలియలి కట్ట దాటిపోకుండా తమ ఆత్మీయ పరిష్వంగంలోకి తీసుకొని సూర్య తాపానికి ఆరబెట్టి, ఆవిరులు చేసి, మొయిళ్ళుగా మార్చి వర్ష ధారలుగా వసుధకు అందిస్తున్నాయి.

వృక్షాల సేవలకు అంతే లేదు. పల్లవించిన నాటి నుండి పయనం ముగిశాక కూడా చైతన్య రాహిత్యంలోనూ చైతన్యవంతంగా లోకానికి సేవలందిస్తూనే ఉన్నాయి. జంతు జాలమో?! శ్రమార్పణతో పాటు రక్తమాంసాల సమర్పణ నుండి చర్మం ఒలిచి చెప్పులు చేసి తొడిగేవరకూ లోకానికి దాసోహం అంటాయి. లోకోపకారంలోనే వాటి స్వజీవన వ్యాపారం జరుగుతుంది. మనిషి జీవితానికీ, జీవనానికీ కావలసిన ప్రతి వస్తువు, వసతి ప్రకృతి నుండే, దాని త్యాగ నిరతి నుండే లభిస్తుంది. ప్రకృతిలోని ఏ వస్తుజాలమూ, జీవజాలమూ కేవలం నిరర్థకం కాదు. సృష్టి వ్యాపారమైనా, ప్రగతి సూత్రమైనా స్థాయీ భేదం లేకుండా పరస్పర సహకారమే.

ఈ సహజ జీవ స్వభావం నుండి ఏ జీవీ జారి పోయే ప్రయత్నం చేయదు. ఈ దృక్పథమే వాటి నాడీ స్పందన. రక్త ప్రసరణ. గుండె చప్పుడు. అవి మాననీయంగా జీవిస్తుంటాయి... సహజంగా.

ఈ అనివార్య అంతఃసూత్రం నుండి మనిషి విముఖుడయ్యాడు. ఈ సువిశాల భావ వర్తులం నుండి, పరిధి నుండి మనిషి చిందిపోయాడు. అందుకే ఏకాకియై ఏకచ్ఛత్రాధిపతిననే అంధ అహంకారంలో మగ్గిపోతున్నాడు. ఎందుకంటే భగవంతుడు నిర్ణయించిన వాటి జీవన గమనం, గమ్యం మాత్రమే అవి ఔదలదాల్చి నడిచిపోతున్నాయి.

అల్పజీవులైన తమకు అనల్పమైన జీవన వైఖరిని ప్రసాదించిన భగవంతుని కృపకు నిదర్శనంగా అవన్నీ నమస్కార పుష్పాలుగా లోకంలో పరిమళాల్ని ప్రసరింపజేస్తూ ఆయన వైపు సాగిపోతున్నాయి. మించిన అంచనాలతో ఆత్మ పుష్పాన్ని పొదిగి పంపించిన మనిషి మాత్రం ముళ్ళ పల్లేరుగా మారి ప్రకృతి గుండెకు గాయం చేస్తున్నాడు. పరమాత్మను నివ్వెరపరుస్తున్నాడు. ❖



జయ జయ నృసింహ సర్వేశ
భయహర వీర ప్రహ్లాద వరద
మిహిర శశినయన మృగనరవేష
బహిరంతస్థల పరిపూర్ణ
అహినాయక సింహాసన రాజిత
బహుళ గుణగణ ప్రహ్లాదవరద
చటుల పరాక్రమ సమరఘన విరహిత
నిటలనేత్ర మౌని ప్రణుత
కుటిలదైత్యతతి కుక్షి విచారణ
పటు వజ్రనఖ ప్రహ్లాదవరద
శ్రీవనితాసంశ్రిత వామాంక
భావజకోటి ప్రతిమాన
శ్రీవేంకటగిరి శిఖరనివాస
పావనచరిత ప్రహ్లాదవరద

జయ జయ నృసింహ సర్వేశ...

– శ్రీమతి బి.కృష్ణకుమారి

నిర్మల హృదయుడై... నిశ్చలభక్తుడై ప్రాణాలకు తెగించి పరమాత్ముడిని ప్రేమించిన పరమ భాగవతోత్తముడు ప్రహ్లాదుడు. ఆ విశుద్ధ భక్తికి విశ్వంభరుడు వివశుడయ్యాడు; ఆగ్రహమూర్తిగా ఆవిర్భవించి, అసురాంతకుడై ఆరాధనలు అందుకున్నాడు. ఆ అపురూప ఘట్టాన్ని అన్నమాచార్యులు తన పదాల దర్పణంలో ప్రతిబింబింప చేస్తూ, **'జయ జయ నృసింహ సర్వేశ....'** అని ప్రస్తుతిస్తున్నాడు. రాక్షసాధినాథుడి రాజమందిరంలో ప్రళయకాళ అగ్నిజ్వాలగా ప్రకటితమైన ఆ ఉగ్రమూర్తిని భయహరుడిగా, ప్రహ్లాద వరదుడిగా ఈ పదకవితా పితామహుడు అభివర్ణిస్తున్నాడు.

నృసింహస్వామిలో కూడా శ్రీవేంకటేశ్వరుడినే దర్శించుకోగలిగాడు అన్నమయ్య. అందుకే ఆయన స్తుతించిన దశావతార దేవతామూర్తుల్లో నరసింహునిదే అగ్రతాంబూలం. అయితే నరసింహమూర్తి అనగానే ముందు మనందరి మనస్సుల్లో మెదిలే ముద్దుల బాలుడు ప్రహ్లాదుడు. భక్తుడేమో అతి సుకుమారుడు... అవతరించిన భగవంతుడేమో అతి భయంకరుడు! అదే ప్రహ్లాదోపాఖ్యానం ప్రత్యేకత! అందుకే భగవాన్ శ్రీరామకృష్ణ పరమహంస ఆ బాలభక్తుడిని ప్రస్తావిస్తూ 'జపం, ఉపవాసాలు, తీర్థయాత్రలు, భగవదారాధన తదితరమైన వన్నీ వైధీభక్తి కిందకు వస్తాయి; ఇలా చేయగా చేయగా క్రమంగా అది రాగభక్తిగా, నిష్కామభక్తిగా పరిణమిస్తుంది. ఇదే భగవత్సాక్షాత్కారానికి మార్గం. ఇలాంటి రాగభక్తికీ, నిష్కామభక్తికీ ప్రహ్లాదుడే ఉదాహరణ' అనేవారు.

ప్రహ్లాద వరద...

భగవంతుడి అనుగ్రహానికి అనువైన అర్హతలన్నీ పుణికిపుచ్చుకున్న భక్తాగ్రేసరుడు ప్రహ్లాదుడు. అందుకే భక్తపరాధీనుడైన భగవంతుడు పిలిచినంతనే స్తంభంలోనూ ప్రత్యక్షమయ్యాడు. ఆ బాలభక్తుడి సద్గుణాలను స్తుతిస్తూ పోతనామాత్యులు శ్రీమదాంధ్ర భాగవతంలో...

తన యందు నఖిలభూతములందు నొక భంగి
సమహితత్వంబున చరగువాడు
పెద్దల పొడగన్న భృత్యుని కైవడి
చేరి నమస్కృతుల్ చేయువాడు
కన్నుదోయికి నన్యకాంత లడ్డంబైన
మాతృభావము చేసి మరలువాడు
తల్లిదండ్రుల భంగి ధర్మవత్సలతను
దీనుల గావ చింతించువాడు

సఖుల యెడ సోదరస్థితి జరుపువాడు
దైవతములందు గురువుల తలచువాడు
లీలలందును బొంకులు లేనివాడు
లలిత మర్యాదుడైన ప్రహ్లాదుడధిప...

"సమస్త ప్రాణులను తన లాగే భావించే సమదర్శి. పెద్దలు ఎదురైనపుడు గౌరవంతో నమస్కరించే వినయశీలి. ఇతర స్త్రీలు కనిపిస్తే తల్లి లాగే భావించి పక్కకు తొలగిపోయే గుణవంతుడు. దీనులకు తల్లీ తండ్రీ అయి ఆదరించే ఆర్ద్ర హృదయుడు. స్నేహితులను సోదరులుగా చూసుకునే సహృదయుడు. గురువులను దైవంగా కొలిచే ఆదర్శ విద్యార్థి. హాస్యానికైనా అబద్ధమాడని సత్యవంతుడు. ఈ విధమైన మంచీ మర్యాద తెలిసిన మహోత్తముడు ప్రహ్లాదుడు" అని కొనియాడతాడు.

(మిగతా 34వ పేజీలో...)

ఎవ్వరూ ప్రార్థించకుండానే సూర్యుడు పద్మాలను, చంద్రుడు కలువలను వికసింపజేస్తున్నారు; మేఘుడు వర్షధారలు కురిపిస్తున్నాడు. అలాగే సత్పురుషులు తమంతటతామే పరహితం చేస్తారు. - భర్తృహరి



పరిప్రశ్న

– స్వామి భూతేశానంద
(రామకృష్ణ సంఘ 12వ సర్వాధ్యక్షులు)

రామకృష్ణ సంఘ 12వ సర్వాధ్యక్షులు - స్వామి భూతేశానందజీ మహరాజ్ (1901-1998) భక్తుల ఆధ్యాత్మిక సందేహాలకు సరళమైన రీతిలో ఇచ్చిన సమాధానాలను 'శ్రీరామకృష్ణ ప్రభ' పాఠకుల ప్రయోజనార్థం 2013 జూలై సంచిక నుండి ధారావాహికంగా ప్రచురిస్తున్నాం.

భక్తుడు: అహంకారాన్ని నిర్మూలించడమెలా సాధ్యమవుతుంది?

స్వామీజీ: ఈ ప్రపంచంలో ప్రతీదీ మార్పుకు గురయ్యేదే! కాలగర్భంలో కలిసిపోయేదే! అలాంటప్పుడు మనం గర్వపడడానికి ఏముందని? మనకున్న సంపదను చూసి గర్వపడదామంటే మనకన్నా అధిక సంపన్నులు ఎంతోమంది ఉన్నారు. మనం గొప్ప విద్యావంతులమని గర్విస్తే మనకన్నా ఉన్నత విద్యావంతులు ఎంతోమంది ఉన్నారు. మనం ప్రతిభావంతులమని భావిస్తే మన కన్నా ఎంతో ప్రతిభ గలవారున్నారు. మన సౌందర్యాన్ని చూసి గర్వపడితే మనకన్నా సౌందర్యవంతులు ఎంతోమంది ఉన్నారు. ఇలా ఈ సృష్టిలో ఏ విషయంతో పోల్చుకున్నా, అన్ని విధాలా మనకన్నా ఉత్తములు తారసపడుతూ ఉంటారు.



మనం ఇతరుల కన్నా ఉన్నతులమనీ, అన్నీ శాశ్వతమనీ భావించడమే మన అహంకారానికి మూలం.

ఒక గ్రామంలో ఓ పేద రైతు ఉండేవాడు. అతడి భార్య చాలా కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఉంది. అతడు ఆర్థిక సమస్యలను భరించలేక బావిలో దూకి ఆత్మహత్య చేసుకోవడానికి వెళుతుండగా దారిలో ఒక సాధువు కనిపించాడు. ఆ పేద రైతు ఆ సాధువుతో తన కష్టాలన్నీ విన్నవించుకొని పరిష్కారాన్ని కోరాడు. అందుకు ఆ సాధువు 'ఈ సృష్టిలో మార్పు సహజం. నీ కష్టాలన్నీ ఇలాగే ఉండిపోవు. కాలమే వాటిని పరిష్కరిస్తుంది. ఓర్పుతో జీవించు' అని బోధించాడు.

ఆ సాధువు చెప్పిన ప్రకారమే కాలం గడిచిన కొద్దీ ఆ రైతు ఆర్థికంగా పుంజుకున్నాడు. అతడి భార్య ఆరోగ్యం కుదుటపడింది. అలా అతడి జీవితం సుఖంగా సాగిపోతోంది. కొంతకాలానికి 'మా ఊరిలో అందరి కన్నా నేనే గొప్పవాణ్ణి' అన్న అహంకారంతో ప్రవర్తించసాగాడు. ఇదివరలో రైతుకు హితబోధ చేసిన సాధువు మరలా ఆ ఊరు వచ్చాడు. రైతు ప్రవర్తన గురించి విన్న సాధువు అతడి దగ్గరకు వెళ్ళి 'ఈ సృష్టిలో మార్పు సహజం' అన్న బోధను గుర్తుచేశాడు. వెంటనే రైతుకి 'ఈ సంపద, సౌకర్యాలు, జీవితం శాశ్వతం కాదు. మార్పు చెందాల్సినవే' అన్న జ్ఞానోదయం అయింది. అప్పటి నుండి అతడు పరోపకారం చేస్తూ అణకువతో జీవించసాగాడు.

ఆయుర్నశ్యతి పశ్యతాం ప్రతిదినం యాతి క్షయం యౌవనం
ప్రత్యాయాన్తి గతాః పునర్న దివసాః కాలో జగద్భక్షకః ।
లక్ష్మీస్తోయ తరంగ భంగ చపలా విద్యుచ్చలం జీవితం
తస్మాన్మాం శరణాగతం కరుణయాత్వం రక్ష రక్షాధునా ॥

"చూస్తుండగానే దినదినమూ ఆయువు నశిస్తోంది. యౌవనం నశిస్తోంది. గడచిన రోజులు తిరిగిరావు. కాలం జగత్తును భక్షిస్తుంది. సంపద నీటి తరంగాల లాగా చంచలమైనది. జీవితం మెరుపు తీగలా నశ్వరమైనది. కాబట్టి, ఓ దేవా! నిన్ను శరణు పొందిన నన్ను దయతో కాపాడు."

ఈ సృష్టిలోని అశాశ్వతత్వాన్ని గుర్తుచేసుకుంటూ ఉంటే ప్రాపంచిక వైభవం పట్ల ఆసక్తి తగ్గుతుంది. భగవంతుడే శాశ్వతుడన్న భావన మదిలో స్థిరపడుతుంది. ఈ విధంగా భగవంతుణ్ణి ఆశ్రయించినప్పుడు మనలో అహంకారం పొడసూప దానికి ఆస్కారమే ఉండదు. ఏదేమైనప్పటికీ నిరంతర నిత్యానిత్య వివేక అభ్యాసం వల్ల మాత్రమే ఇది సాధ్యమవుతుంది. ❖

పండుగలు - పర్వదినాలు

మే - 2014

02	శుక్రవారం	: అక్షయ తృతీయ
04	ఆదివారం	: ఆదిశంకరాచార్య జయంతి
05	సోమవారం	: శ్రీరామానుజాచార్య జయంతి
10,24	శనివారం	: ఏకాదశి
12	సోమవారం	: నృసింహ జయంతి
14	బుధవారం	: బుద్ధ పూర్ణిమ
23	శుక్రవారం	: హనుమజ్జయంతి
28	బుధవారం	: ఫలహారిణి కాళీపూజ

జూన్ - 2014

09	సోమవారం	: ఏకాదశి
23	సోమవారం	: ఏకాదశి
29	ఆదివారం	: పూరీ జగన్నాథ రథయాత్ర

కృష్ణభక్తి సుగంధం

– శ్రీమతి జి.ఎస్.లక్ష్మి



జయపూర్ (రాజస్థాన్)నుషెఖావత్ రాజుగారు పరిపాలిస్తున్న కాలమది. రాజపురోహితుడి పేరు పరశురామ్ పండిత్. అతని కూతురు కరమైతికి చిన్నతనం నుంచి భగవంతుని పట్ల అపారమైన భక్తి. ఎల్లప్పుడూ ఆమె శ్రీకృష్ణుని పూజలో జపతపాలతో కాలం గడిపేది. ఒక్కొక్కసారి భక్తి పాటలు పాడేది. ఒక్కొక్కప్పుడు భక్తి పారవశ్యంతో ఉన్మాదిలా నవ్వుతూ ఉండేది. ఒక్కొక్కసారి కన్నీళ్ళు కారుస్తూ భగవద్దర్శనం కోసం విలపించేది.

కరమైతికి వివాహం అంటే ఆసక్తి లేదు కానీ స్త్రీ సహజమైన సంకోచంతో ఎవరికీ ఏమీ చెప్పలేకపోయింది. తండ్రి ఒక వరుణ్ణి చూసి ఆమె వివాహం జరిపించాడు. అత్తవారింటికి వెళ్ళే సమయం వచ్చేసరికి ఆమె మనస్సు వ్యాకులమైపోయింది. 'శ్యామసుందరుని భక్తిసాగరంలో మునిగి ఉన్న నేను ఇంకొకరితో ఎలా జీవితం పంచుకోగలను?' అని ఆమె భగవంతుణ్ణి ప్రార్థించింది. అర్ధరాత్రి అందరూ గాఢ నిద్రలో ఉండగా ఆమె ఇల్లు వదలి, బృందావనం వైపు దారి తీసింది. ఉదయం ఇంట్లో ఆమె కనబడక అందరూ అంతటా వెతికారు. చుట్టుపక్కల వాళ్ళందరూ చెవులు కొరుక్కోవడం ప్రారంభించారు. పరశురామ్ పండితుల వారికి తెలుసు తన పుత్రిక అతి పవిత్రమైనదని. కానీ లోకులు ఏమను కుంటారోనని రాజు దగ్గరకు వెళ్ళి విషయం చెప్పాడు. రాజు తన పురోహితుని కుమార్తెను వెదకడానికి నలువైపులా సైనికులను పంపించాడు.

రాత్రంతా కరమైతి పరుగెత్తి, తెల్లవారే సరికి చాలా దూరం వెళ్ళిపోయింది. పగలు కూడా ఎక్కడా ఆగకుండా పరుగెడుతూనే ఉంది. ఇంతలో వెనక నుంచి గుర్రపుడెక్కల శబ్దం వినిపించింది. తనను వెతుకుతూ ఎవరో వస్తున్నారని గ్రహించి ఎక్కడైనా దాక్కుందామని ప్రయత్నించింది. కానీ అక్కడ దాక్కోవడానికి ఏమీ కనిపించలేదు. ఎదురుగా ఒక ఒంటె కళేబరం మాత్రం కనిపించింది. వెంటనే ఆమె ఆ ఒంటె మృత శరీరంలోకి దూరి, సైనికుల బారి నుండి తనను తాను కాపాడుకున్నది. కృష్ణభక్తి సుగంధంతో నిండిన ఆమెకు ఆ ఒంటె మృత శరీరం నుంచి వస్తున్న దుర్గంధం బాధించలేదు. దుర్గంధపూరితమైన ఒంటె శరీరం దగ్గరకు కూడా సైనికులు వెళ్ళలేదు. వాళ్ళు తిరిగి రాజధానికి వెళ్ళిపోయారు.

ఆ ఒంటె మృత శరీరంలో ఆమె మూడు రోజులుండిపోయింది. భగవంతుడి దయ ఉంటే విషం కూడా అమృతమవుతుంది. కుళ్ళిపోయిన ఒంటె శరీరం నుంచి వస్తున్న దుర్గంధం సుగంధంగా మారిపోయింది. నాలుగో రోజు ఆమె బయటకు వచ్చింది. దారి తెలియని వారికి భగవంతుడే దారి చూపిస్తాడు. ఆమెకు ఆ కృష్ణుడే మార్గదర్శకుడయ్యాడు. ఆమె బృందావనానికి చేరింది. ఆమె ఆనందానికి అంతులేదు. అక్కడే కృష్ణుని సన్నిధిలో ఆమె కాలం గడిపేది. పరశురామ్ పండితునికి కూతురి జాడ తెలియలేదు. కొంతకాలానికి అతను బృందావనానికి వచ్చాడు. బృందావనంలో కరమైతి గురించి తెలిసిన వారు లేరు. ఎవరిని అడిగినా ఆమె జాడ పండితునికి చెప్పలేకపోయారు.

ఒకరోజు పరుశురామ్‌కి బ్రహ్మకుండం దగ్గర ఒక సన్యాసిని కనిపించింది. ఆమె దగ్గరకు వెళ్ళాడు. ఆమె ధ్యానంలో ఉన్నది. ఆమె తన పుత్రిక కరమైతి అని గుర్తించాడు. ఆ స్థితిలో ఆమెను చూసి చాలా బాధ పడ్డాడు. భగవంతుని పట్ల ఆమె భక్తి ప్రేమలు చూసి సంతోషం కూడా కలిగింది. ఎన్ని గంటలు గడిచినా ఆమెకు ధ్యాన భంగం కాలేదు. చివరికి ఆమెని కుదిపి కుదిపి ధ్యాన భంగం చేసి, ఆమెను తనతో ఇంటికి తిరిగి రమ్మని కోరాడు. "తండ్రీ! ఇక్కడకు వచ్చిన వారెవరైనా తిరిగి ఇంటికి వెళతారా? నేను శ్రీకృష్ణుని ప్రేమలో మునిగి పోయి ఉన్నాను. ఇక్కడి నుంచి వెళ్ళేది నా మృత శరీరమే!" అని జవాబిచ్చింది.

కుమార్తె కృష్ణభక్తిని చూసి కరిగిపోయిన పరశురామ్ పండిత్ తిరిగి వెళ్ళిపోయాడు. రాజు ఈ విషయం తెలుసుకుని కరమైతిని దర్శించుకునేందుకు బృందావనం వెళ్ళాడు. రాజు బృందావనంలో బ్రహ్మకుండం దగ్గర ఆమెకు ఒక కుటీరం నిర్మించాడు. శ్రీకృష్ణుని పట్ల కరమైతికి ఉన్న భక్తి చూసి ప్రభావితుడైన రాజు కూడా శ్రీకృష్ణుని భక్తుడైపోయాడు. ❖

ఈ మానవదేహం లభించడం ఎంతో అదృష్టం. శక్తిమేరకు భగవత్ ప్రార్థనలు చేయాలి. శ్రమించ కుండా దేనినీ సాధించలేం. ప్రేమభక్తి ఉదయిస్తేనే భగవత్సాక్షాత్కారం లభిస్తుంది. - శ్రీశారదాదేవి

హృదయం

"ఈనాడు ఆధునిక మానవునికి బుద్ధ భగవానుని హృదయం, శంకరాచార్యుల మేధాశక్తి – ఈ రెండూ అవసరం" అన్నది స్వామి వివేకానంద ఉవాచ. బుద్ధుడు ప్రేమ, శాంతి, కరుణ, అహింస, దయ, సచ్ఛీలాలకు ప్రతిరూపం. ఒక మహారాజు చిన్న మేకపిల్లను యజ్ఞయాగాదులలో బలి ఇవ్వబోతుండగా బుద్ధుడు 'ఎందుకీ అమాయక మూగ ప్రాణిని యజ్ఞం పేరున చంపుతున్నారు? అని ప్రశ్నించాడు. 'యజ్ఞంలో ఈ మేకపిల్లను దేవతలకు బలి ఇవ్వడం వల్ల మాకు ఊర్ధ్వలోక ప్రాప్తి కలుగుతుంది' అన్నాడు మహారాజు.

బలిపీఠానికి లాగుకొని పోబడుతూ ఉన్న ఆ మేకపిల్ల అసహాయపు అరుపులు, దాని ఆవేదన చూసి బుద్ధుని హృదయం ద్రవించింది. ఆ మేకపిల్ల పట్ల ప్రేమ, కరుణ, దయ, జాలితో పరిపూర్ణమై 'ఆత్మౌ పమ్యేన సర్వత్ర సమం పశ్యతి...' అని గీత(6.32)లో బోధించినట్లు ఆ మేక పిల్ల బాధను తనదిగా భావించి ఇలా అన్నాడు: "ఓ రాజా! ఈ మేకపిల్ల ఒక మూగ జంతువు. ఈ మూగ జంతువును బలి ఇస్తేనే నీకు ఉన్నత లోకాలు ప్రాప్తించేటట్లయితే, నా వంటి ఒక ఉన్నత జీవిని (ఒక మానవుణ్ణి) బలి ఇవ్వడం వల్ల నీకు ఇంకా ఉన్నతోన్నతమైన స్వర్గసుఖాలు ప్రాప్తించగలవు. కావున దయచేసి ఈ మూగ జీవిని విడిచిపెట్టి, దానికి బదులుగా నన్ను బలి ఇవ్వండి". అపారమైన ప్రేమ, కరుణలతో నిండిన ఈ పలుకులు ఆ మహారాజు హృదయాన్ని తట్టి లేపాయి. ఆయన పరివర్తన చెంది, బుద్ధ భగవానుని శరణు పొంది, తనను క్షమించమని ప్రార్థించాడు.

ఓ కిరాతకుడు అడవిలో దారిన పోయే వారిని దోచుకుని, చంపివేసి వారి బొటనవేళ్ళను కత్తిరించి ఆ వేళ్ళతో మాల తయారుచేసి మెడలో ధరించేవాడు. అందుకే అతడికి 'అంగుళీమాల' అని పేరు వచ్చింది. అలాంటి భయంకర ఘోర కిరాతకుడు బుద్ధుని దర్శనం, ప్రవచనంతో పరిపూర్ణ పరివర్తన చెంది మంచివాడిగా మారాడు. బుద్ధుని అపార ప్రేమ, దయ, క్షమ, త్యాగం, తేజోమయ శాంత స్వరూపం ఆ ఘోర దుర్మార్గుణ్ణి సన్మార్గంలో ప్రవేశపెట్టాయి. వేలాదిమంది బుద్ధుని దయాపూరిత తేజోమయ రూపాన్ని చూడగానే పరివర్తన చెంది, పవిత్ర జీవనాన్ని గడపసాగారు.

బుద్ధుని వృద్ధ దశలో ఒక నిరుపేద నిమ్నజాతి భక్తుడు ఆయనను తన ఇంటికి భిక్షకై ఆహ్వానించాడు. అతడు అతి పేదవాడు కాబట్టి గత్యంతరం లేక తన పెరట్లో ఉన్న పుట్టగొడుగులనే వండి బుద్ధ భగవానునికి నివేదించాడు. అందులో కొన్ని విషపూరితమైనవి. ఆ విషయం ఆ నిరుపేదకు తెలియదు. సాక్షాత్తూ భగవాన్ బుద్ధుడే తన ఇంటికి భిక్షకై అరుదెంచినందుకు అతను మహదానంద పడిపోయాడు. అవి విష పదార్థాలని తెలిసినా బుద్ధుడు ఆ నిరుపేద ప్రేమను చూసి, ఆనందంగా ఆరగించాడు. ఎందుకంటే ఒకవేళ తాను అవి విషపూరితాలని తినకుండా ఉంటే, ఆ నిరుపేద ఎంతో బాధ పడతాడు; కాబట్టి అతడి



ఆనందం కోసం బుద్ధ భగవానుడు నిజంగా పరమశివునిలా ఆ విషపు పుట్టగొడుగుల్ని అమృతంగా భావించి తిన్నాడు. ఆ విష ప్రభావంతో క్రమేణా శరీరం క్షీణించగా 'మహా నిర్యాణం' పొంది 'మహా నిర్వాణం'లోకి ప్రవేశించాడు.

ఇక శంకరాచార్యుల వారు అతి చిన్న వయస్సులో 8 ఏళ్ళ ప్రాయంలోనే సమస్త వేద శాస్త్రాలూ ఆపోశన పట్టారు. 16 ఏళ్ళ వయస్సులోనే ప్రస్థానత్రయాలైన బ్రహ్మసూత్రాలు, ఉపనిషత్తులు, భగవద్గీతలను క్షుణ్ణంగా అధ్యయనం చేసి వాటిపై అద్భుతమైన బుద్ధి తీక్షణత, సూక్ష్మ, వివేక విచక్షణాయుతమైన భాష్యం, వ్యాఖ్యానాలను రచించి జగత్ ప్రసిద్ధులయ్యారు. 'శంకర భాష్యం' అంటే వేద వాక్కుగా గౌరవిస్తాం. 20-25 సంవత్సరాల యవ్వన ప్రాయంలోనే దేశమంతటా పాదయాత్రలు చేసి వేద ధర్మాన్నీ, అద్వైత సిద్ధాంతాన్నీ, సనాతన ధర్మ విలువలనూ పునరుద్ధరించారు. మూఢ నమ్మకాలనూ, అజ్ఞాన మూర్ఖాచరణలనూ ఖండించి



మేధస్సు

– స్వామి అర్చనానంద

జ్ఞాన మిశ్రిత భక్తి పూరిత దేవీ దేవతా స్తోత్రాలను రచించి ఉత్తమ జ్ఞానం, ఉత్తమ భక్తి – వేరు వేరు కాదనీ నిజమైన జ్ఞాని నిజమైన భక్తుడని నిరూపించారు. 'సంప్రాప్తే సన్నిహితే కాలే నహి నహి రక్షతి దుకృఞ్ కరణే' అని 'భజగోవింద' స్తోత్రం ద్వారా శుష్క వేదాంతుల, పండితుల చెంప ఛెళ్ళుమనిపించారు! 'గురు చరణాంబుజ నిర్భర భక్తః సంసారాత్ అచిరాద్భవ ముక్తః! సేంద్రియ మానస నియమాదేవం ద్రక్ష్యసి నిజ హృదయస్థం దేవం' – గురువు శ్రీచరణాలపై అచంచలమైన భక్తి, శ్రద్ధలు కలిగినవాడు శీఘ్రంగానే సంసార భవ సాగరం నుండి ముక్తుడవుతాడు. సకల ఇంద్రియాలనూ, మనస్సునూ చక్కగా నియంత్రించి, అంతర్ముఖమొనరించి సాధన చేస్తే నీ హృదయంలోనే ప్రతిష్ఠితుడైవున్న దేవ దేవుడిని ప్రత్యక్షంగా దర్శించగలవు".

'భజగోవిందం'లోని ఈ ఆఖరి శ్లోకం ద్వారా సర్వసాధనా శ్రేష్ఠ సారాంశాన్ని సాధకుల కోసం స్పష్టంగా అందించారు. 'వివేక చూడామణి' అనే అద్భుతగ్రంథం రచించి ముముక్షువులకు ఎనలేని సహాయం చేశారు.

అవిశ్రాంతంగా శ్రమించి భారతదేశంలోని నాలుగు స్థానాలలో నాలుగు వేదాలకు నాలుగు మఠాలను స్థాపించి తన నలుగురు శ్రేష్ఠ సన్న్యాస శిష్యులను మఠాధీశులుగా నియమించారు. ఈనాటికీ ఈ శ్రేష్ఠ గురు పరంపర అవిచ్ఛిన్నంగా, అద్భుతంగా కొనసాగుతూ వస్తూ ఉన్నది. ఇవన్నీ, మరెన్నో, అద్భుత, అపూర్వ ప్రజ్ఞా పాటవాలతో మేధాశక్తితో తీక్షణ, బుద్ధి, తార్కిక వివేచనతో, వివేక, వైరాగ్యాలతో విశ్వాన్ని విస్మయమొనరించే ఆధ్యాత్మిక విజయములు సాధించింది. అంతా కేవలం 32 సంవత్సరాల చిన్న వయస్సులోనే! శంకరుల మేధాశక్తి, ఓజస్సు, జ్ఞాన తేజస్సు, బ్రహ్మ వర్చస్సును ఏమని వర్ణించగలం!?

మనుష్యులలో హృదయమూ, మేధ – రెండూ ఉంటాయి. కొంతమందిలో హృదయం (భావనలు, ఉద్వేగాలు, ప్రేమ, ఆత్మీయతలు) బాగా వికసించి ఉంటుంది. కానీ మేధ, జ్ఞానం లేకపోతే ఆ భావోద్వేగాలు అదుపు తప్పి మనిషిని పశు దిశగా అధోగతి పట్టిస్తాయి! వివేకం, విచక్షణ, జ్ఞానచింతన లేకుంటే 'ప్రేమ' ఓ పరిహాసంగా మారవచ్చు!

అలాగే కొందరిలో మేధ – తీక్షణ, ఆలోచనా పటిమ, వివేక విచక్షణా జ్ఞానం, బుద్ధి కుశలత, పాండిత్య చతురత; సూక్ష్మ గ్రాహ్య శక్తి బాగా వికసించి ఉంటుంది. కానీ తగినంత హృదయ వికాసం – ప్రేమ, కరుణ, దయ, భావశుద్ధి, సానుభూతి, శాంతి, ప్రీతి లేకపోతే ఆ జ్ఞానం శుష్కజ్ఞానంగా, శుష్క పాండిత్యంగా కేవలం 'పొట్టకూటి విద్య'గా పరిణమించే ప్రమాదం ఉంది! ప్రేమ, దయ, ఆర్ద్రత, భావశుద్ధి, పవిత్రత లేని మేధ, కేవల పాండిత్యం మానవజాతి మనుగడకే 'శాపంగా' మారవచ్చు! రావణ దుర్యోధనులూ, నెపోలియన్, ఒసామా బిన్ లాడెన్‌లూ – వీరంతా తక్కువ 'మేధావులేం' కాదు!

అందుకే వివేకానందులన్నారు – "భక్తి మంచిదే, కానీ అది అర్థం పర్థం లేని, బలహీనపరచే మూర్ఖాభినివేశం కాకూడదు! జ్ఞానం మంచిదే, కానీ అది భావశుద్ధి, పవిత్రత లేని శుష్కబుద్ధివాదం, తర్కవితర్క పాండిత్యం కాకూడదు! జ్ఞాన మిశ్రత భక్తి, భక్తి పూరిత జ్ఞానమే మనిషిని 'మనీషి'గా మార్చగలదు".

నేటి ఆధునిక వైజ్ఞానిక సాంకేతిక యుగంలో తీవ్రమైన భౌతిక విజ్ఞాన అన్వేషణలో మనిషి అంతరిక్షంలోకి ఎగశాడు! కానీ హృదయంలో ప్రేమ, శాంతి, దయ, తృప్తి, ఆత్మీయత కరవై కన్న తల్లితండ్రులనూ, కన్న బిడ్డలనే ప్రేమించలేకపోతున్నాడు! కోట్లు గుమ్మరించి 'విద్య'ను కొనవచ్చుననే అజ్ఞానంతో అవినీతిపరుల్ని దేశానికి భారంగా పెంచుతున్నాడు!

ఓ మానవా! నీ నీచ బుద్ధులు, పాపకర్మలు మానవా? బుద్ధం శరణం గచ్ఛామి! శంకరం శరణం గచ్ఛామి! వివేకానందం శరణం గచ్ఛామి!! ❖

మహాత్ములు మహత్యాగాలు చేస్తూవుండడం, జనులు వాటి సత్ఫలాల్ని అనుభవిస్తూ ఉండడం లోక విదితమే! లోకకల్యాణార్థం మోక్షాన్ని సైతం త్యజించినవాడు సాక్షాత్తూ భగవంతుడే! - స్వామి వివేకానంద

నారద భక్తి సూత్రాలు, శాండిల్య భక్తి సూత్రాలు భక్తియోగానికి సంబంధించిన ప్రామాణిక గ్రంథాలు. అయితే ఆధునికతరంలో భగవదన్వేషకులకు అనువైన రీతిలో భక్తితత్త్వాన్ని బోధించారు శ్రీరామకృష్ణులు.

ఈ నేపథ్యంలో 'శ్రీరామకృష్ణ కథామృతం' నుండి కొన్ని ఉపదేశాలను 'రామకృష్ణ భక్తి సూత్రాలు'గా సులభరీతిలో వివరించే ప్రయత్నం చేస్తున్నాం.

బౌద్ధగ్రంథాలు పాలీలో, బైబిల్ హీబ్రూలో, ఖురాన్ అరబ్బీలో రచించబడ్డాయి. అలాగే శ్రీరామకృష్ణుల ఉపదేశాలు వారి మాతృ భాష బెంగాలీలో ఆవిష్కృతమయ్యాయి. అవతారపురుషుని ముఖతా వెలువడిన ఆ అమృతోపదేశాలను యథాతథంగా ఉటంకిస్తూ, వ్యాఖ్యానిస్తున్నాం. మహాశక్తి మంతమైన ఆ బోధనలను మననం చేసుకుంటూ కృతార్థులు కాగలరని ఆశిస్తున్నాం.



ఈశ్వర్ దర్శన్-ఇ జీవనేర్ ఉద్దేశ్య

- భగవత్సాక్షాత్కారమే జీవనోద్దేశం

శ్రీరామకృష్ణ ఉవాచ : "మానవ జీవిత పరమార్థం – భగవత్సాక్షాత్కారం. కర్మ మొదటి మెట్టు మాత్రమే. అది జీవనోద్దేశం కాదు. సాధన చేయగా చేయగా భగవంతుడే సత్యమనీ, మిగిలినది అంతా అసత్యమనీ బోధపడుతుంది. భగవత్సాక్షాత్కారమే జీవనోద్దేశం అని తెలుస్తుంది".

వ్యాఖ్య: అనాది కాలంలోనే కొందరి మనుష్యుల మనస్సులో ఒక గంభీరమైన ప్రశ్న ఉదయించింది.

మాతృగర్భపు చీకట్లో కొన్ని నెలలుండి మనిషి ఈ వెలుగుల ప్రపంచంలో ప్రవేశించి కొన్నాళ్ళు నివసిస్తాడు, సుఖదుఃఖాలు అనుభవిస్తూ, నవ్వుతూ, ఏడుస్తూ కోరికలు తీర్చుకొనడానికి యథాశక్తి ప్రయత్నిస్తూ, మళ్ళీ అంధకారంలోకి ప్రవేశిస్తాడు. అంటే మరణిస్తాడు. నిజానికి, ఈ రాకపోకల అర్థం ఏమిటి? అంటే, జీవనోద్దేశం ఏమిటి?

ఉద్దేశం తెలిస్తే, దాన్ని ఎలా పొందాలో తెలుస్తుంది. మనుష్యులు ఎవరికి తోచినట్లు వారు అభిప్రాయాలు తెలుపుతారు. 'ఇది ప్రకృతి నియమం' అని కొందరు చెబితే, 'సుఖదుఃఖాలు అనుభవించి, చివరకు మృత్యురూపంలో చిరశాంతి లబ్ధి' అని మరి కొందరు అంటారు. కొందరు స్వర్గానికి వెళ్ళడమే ఉద్దేశం అంటారు. వేదాంతం అనుసారం, అమరత్వసిద్ధే ఉద్దేశం. పోతే, అమరత్వం అంటే ఏమిటన్నది వారికే స్పష్టంగా తెలియదు. భగవత్సాక్షాత్కారం మూలంగా చిరశాంతి, ముక్తి లభిస్తాయన్నది కొన్ని శాస్త్రాల కథనం.

ఈ కాలంలో భగవంతుడు మానవావతారం ఎత్తి, "ఈశ్వర దర్శనమే మనుష్య జీవన ఉద్దేశం" అని సరళమైన భాషలో చెప్పారు. ఈశ్వర దర్శనం అన్నా, భగవత్సాక్షాత్కారం అన్నా ఒకటే. భగవంతుణ్ణి పొందడం అంటే, చేతిలో ఉసిరికాయ ఎంత వాస్తవమో ఆయనా అంతే. 'చూడడం మాత్రమేనా! నీతో మాట్లాడుతున్న దాని కన్నా సన్నిహితంగా అమ్మతో మాట్లాడాను' అని శ్రీరామకృష్ణులు, నరేంద్రునికి చెప్పారు. 'సాక్షాత్కారం అయినంతనే సర్వం సమకూరిందని తలవకండి. ఆయనను ఆహ్వానించాలి, సంభాషించాలి' అన్నారు. దీనికి ఉదాహరణగా, 'కొందరు పాల గురించి విన్నారు, కొందరు పాలను చూశారు, కొందరు తాగారు' అన్నారు. అంటే, భగవంతుణ్ణి సొంతం చేసుకోవాలి. భగవత్సాక్షాత్కారం అయితే అనేక జన్మల అజ్ఞానం, మాయారూప అంధకారం పటాపంచలవుతాయి. అమృత కడలి చేరి, అమృతపానం చేసి నిత్యానందంలో ఓలలాడతారు. కాబట్టి దుర్లభమైన ఈ మానవజన్మ లక్ష్యం భగవత్సాక్షాత్కారమే అని గ్రహించి, అందుకోసం ప్రయత్నించడం మేలు. మానవుడికి మాత్రమే ఇది సాధ్యమని వేదాది శాస్త్రాలు వక్కాణించాయి.

ఒక పదార్థం పరివర్తనం చెందుతూ, మూలపదార్థంగా పరిణమించడానికి సర్వదా ప్రయత్నిస్తుందని విజ్ఞానశాస్త్రం తెలుపుతోంది. ఆధ్యాత్మిక జీవితంలోనూ అంతే. మానవుని సొంత ఇల్లు పరబ్రహ్మం అన్నారు శ్రీరామకృష్ణ. మనం దేని నుంచి సృష్టి అయ్యామో ఆ వస్తువునే చేరడానికి ప్రయత్నించడం సముచితం కదా! ఈ గొప్ప సత్యం మనలో సూక్ష్మరూపంలో దాగి ఉంది కానీ స్పష్టంగా కనపడడం లేదు. ఈ సత్యాన్ని సాక్షాత్కరింపజేసుకోవడమే జీవిత పరమార్థం. ❖

అనువాదం: డాక్టర్ కమల జయరావు

అభ్యాసాల ఫలితమే 'శీలం'



మనం చేసే ప్రతి కార్యం సరస్సు పైభాగంలో చలించే అల లాంటిది. శబ్దాది విషయాల అనుభవాలు అదృశ్యం కాగానే, వాటి వల్ల ఏర్పడే సంస్కారాలు నిలచిపోతాయి. అనేక సంస్కారాలు కలసి 'అభ్యాసం' అనేది ఏర్పడుతుంది. అభ్యాసాన్ని అపర స్వభావం అంటారు. మనం సజ్జనులుగా ఉన్నా, దుర్జనులుగా ఉన్నా అంతా అభ్యాస ఫలితమే. కాబట్టి ఒక అభ్యాసాన్ని అలవరచుకోవడానికి, లేదా వదలి పెట్టడానికి మనం సమర్థులమై ఉన్నాం. అందువల్ల మన ప్రస్తుత స్వభావం గురించి నిరాశ చెందనవసరం లేదు.

సుఖ దుఃఖాది అనుభవాలు మనసులో సంస్కారాలను ఏర్పరుస్తాయి. ఈ సంస్కారాల ఫలమే - మన శీలం. ఎలాంటి సంస్కారాలు మనలో బలవంతమై ఉంటే, మనకు అలాంటి శీలం ఏర్పడుతుంది. సత్సంస్కారాలు విశేషంగా ఉంటే, సద్వర్తనం అలవడుతుంది. దుష్టసంస్కారాలు ప్రబలంగా ఉంటే, దుష్టవర్తనం అలవడుతుంది. దురభ్యాసాలను మానాలంటే, వాటికి వ్యతిరేకమైన మనోవృత్తులను అవలంబించడమే ఉపాయం. అందుకని, మీరు ఎప్పుడూ మంచే చేస్తూ ఉండండి; ఎప్పుడూ మంచి భావాలనే ఆలోచిస్తూ ఉండండి. దుష్టసంస్కారాలను నిరోధించడానికి ఇదే మార్గం.

ఒక వ్యక్తి ఎంత దుర్జనుడైనా సరే, 'అతను ఇక మంచివాడు కాజాలడు' అని చెప్పవద్దు. ఎందుకంటే, అతని ప్రస్తుత వర్తనం అతని అభ్యాస ఫలితమే కదా! నూతన సదభ్యాసాలతో, తన పూర్వాభ్యాసాలను అతడు నిగ్రహించవచ్చు. అభ్యాస ఫలితమే శీలం. కాబట్టి మంచి అలవాట్లను అలవరచుకోవడమే శీలాన్ని చక్కగా చేసుకోవడానికి మార్గం.

సాధన అంటే ఏమిటి? చిత్తాన్ని వృత్తిరూపం పొందకుండా చేయడం - చిత్తవృత్తి నిరోధం. దీన్నే సాధన అంటారు. ఒక్కరోజు అభ్యాసం చేసినంత మాత్రాన లభించేది కాదు - మనో నిగ్రహం. చిరకాలం నిరంతర సాధన చేయాలి. అప్పుడే అది సిద్ధిస్తుంది.

మనం రెండు రకాల ప్రేరణలతో పనులు చేస్తుంటాం. ఒకటి - స్వానుభవం; రెండోది - ఇతరుల అనుభవం. వీటి ప్రాబల్యంతో చిత్తంలో రకరకాల వృత్తితరంగాలు కలుగుతాయి. ఈ శక్తులతో పోరాడి, మనసును నిగ్రహించే సామర్థ్యమే వైరాగ్యం. చిత్తవృత్తుల్ని త్యాగం చేయాలి. నేనొక వీధిలో వెళుతున్నాననుకోండి. అంతలో ఒక వ్యక్తి వచ్చి, నా గడియారాన్ని దొంగిలించి పారిపోతున్నాడనుకోండి. ఇది నా ప్రత్యక్షానుభవం. దానితో వెంటనే నా మనసులో 'క్రోధం' అనే వృత్తి పుడుతుంది. ఇలాంటి వృత్తుల్ని అసలు పుట్టనివ్వవద్దు. విషయభోగాలు మనల్ని భ్రమింప చేస్తుంటాయి. కాబట్టి భోగాలను త్యాగం చేసి, చిత్తవృత్తుల్ని నిగ్రహించాలి. ఇదే త్యాగం. స్వానుభవం వల్లా, పరుల అనుభవం వల్లా గుణపాఠాలు నేర్చుకొని, విషయాసక్తిని వదిలి, మనస్సును ఆ విషయాల బారిన పడకుండా చేయడమే వైరాగ్యం. కోరికలు నీకు వశమై ఉండాలి కానీ, నువ్వు వాటికి వశమై ఉండకూడదు. ఇలాంటి మనోబలమే వైరాగ్యం. ❖

మనస్సు, ఇంద్రియాలను స్వాధీనపరచుకోవడమే నిజమైన తపస్సు. మనోనిగ్రహం సాధించ లేనివాడు పతనమైపోతాడు. కాబట్టి అభ్యాసంతో నడవడిని చక్కబరచుకోవాలి. - నీతిసారః


మానవ ప్రయాణంలో మజిలీలు

అయిదు వందల మంది ఆహూతులు కూర్చున్న ఆ సభా ప్రాంగణం అంతా నిశ్శబ్దంగా ఉంది. ఉపన్యాసం ప్రారంభమైంది. "ప్రియమైన సోదరీమణులారా! ముందుగా బుద్ధదేవునికి నా వినయపూర్వక ప్రణామాలు. జనన, మరణాలు రెండూ మన చేతులలో లేనివి. నడుమ అశాశ్వతమైన బంధాలను సృష్టించుకుని, మనకు మనమే సంకెళ్ళను తగిలించుకుంటున్నాం. ఈ బంధాలు మన వెంట వచ్చేవి కావు. మనం ఈ లోకానికి వచ్చేటప్పుడు ఒకరికి చెప్పి రాము. అలాగే వెడుతున్నామని మరొకరికి చెప్పి వెళ్ళే అవకాశమూ ఉండదు. మరి అలాంటప్పుడు ఎందుకని మమకారాలనూ, బంధాలనూ పెంచుకోవడం! వాటి విషయమై మన విలువైన సమయాన్ని వృథా చేయడం!! ఒక్కసారి ఆలోచించండి. వీటి గురించి మనం బాధపడవలసిన అవసరం ఉందా?" ఈ మాట అంటుంటే, వింటున్నవారికి ఆ ఉపన్యాసకురాలి కంఠం వణికినట్టుగా అనిపించింది. ఆమె మాట్లాడుతున్న ప్రతీ మాట హృదయపు లోతుల్లో నుంచి వస్తోందని అక్కడ ఉన్నవారందరికీ తెలుసు. గంభీరంగా, అమృతమయవాక్కులతో ఆమె ఇస్తున్న ఆ ఉపన్యాసాన్ని శ్రద్ధగా వింటూ వారు కాలాన్ని మర్చిపోసాగారు.

కాలాన్ని కొంత వెనక్కి నెడితే, అది ఒక దట్టమైన అడవి. అక్కడ ఒక వ్యక్తి తన భార్యా పిల్లలతో ఇలా అంటున్నాడు – 'మీరు ముగ్గురూ ఇక్కడే కూర్చొని విశ్రాంతి తీసుకోండి. నేను వంటకు పనికివచ్చే కట్టెలను తీసుకువస్తాను'. ఇలా అని అతను ఆ అడవిలో మరి కొంత లోపలికి వెళ్ళాడు. ఈ లోపున పసివాడైన అతని రెండో కొడుకు నిద్రపోయాడు. పెద్దవాడు పక్షుల కిలకిలారావాలను ఆసక్తిగా వింటూ అటూ, ఇటూ ఉత్సాహంగా పరుగులు పెడుతూ, వాటిని అనుకరించసాగాడు. ఆ ఇల్లాలి మనస్సు ఇలా గతం మీదకు మళ్ళింది: 'నేను ఇల్లు వదిలేసి చాలా కాలమైంది. ఇప్పుడు నా తల్లితండ్రులు నన్ను చూస్తే ఎలా స్పందిస్తారు? నన్ను ఆదరిస్తారా? అమ్మ అయితే తప్పక అక్కున చేర్చుకుంటుంది. నాన్న కూడా మనుమలను చూస్తే సంతోషపడవచ్చు. నా తల్లితండ్రులు ధనవంతులు కనుక, ధనవంతుడైన వానికే నన్ను ఇచ్చి వివాహం చేయాలని సంకల్పించారు. వారి దృష్టిలో ధనమే ప్రధానమైనది, గుణం కాదు. ఆ పరిస్థితులలో ఉన్నత భావాలు కలిగిన ఇతణ్ణి నేను ఎన్నుకుని, ఎటువంటి కష్టాలు ఎదురైనా ఎదుర్కోగలనని తలచి, ఇల్లు వదిలేశాను. నేను తీసుకున్న నిర్ణయం సరైనదే. ఇన్నేళ్ళలో ఏనాడూ ఇతను నేను బాధపడే పని చేయలేదు'. ఇలా ఆమె ఆలోచనా సరళి సాగుతూ ఉండగా, 'అబ్బా!' అనే ఒక కేక వినిపించింది. అది తన భర్త కంఠధ్వనిగా గుర్తించిన ఆమె పరుగున ఆ దిశగా వెళ్ళింది. అక్కడ నోట నురగలు కక్కుతూ ఆమె భర్త కనిపించాడు. 'నల్లత్రాచు కాటు వేసింది. ఇక నేను బ్రతకను. నిన్ను ఇలా అన్యాయం చేసి వెళుతున్నందుకు నన్ను మన్నించు! పిల్లలు జాగ్రత్త' అంటూనే ప్రాణం వదిలేశాడు.

ఆ సమయంలో ఏం చేయాలో ఆమెకు తోచలేదు. తిరిగి పిల్లల దగ్గరకు వచ్చింది. వస్తూనే, 'మీ నాన్నను పాము కాటేసింది. ఆయన ఇకలేరు' అని బిగ్గరగా ఏడవసాగింది. ఆ పెద్దవాడికి సుమారు నాలుగేళ్ళు ఉంటాయి. వాడికి విషయం అర్థం కాలేదు. కానీ పాము అన్న మాట విని భయపడి, ఏడవసాగాడు. పిల్లలను తీసుకుని, ఆమె తిరిగి భర్త శవం వద్దకు వచ్చింది. శ్రావస్తిలో ఉన్న తల్లితండ్రుల అవసరం ఇప్పుడు ఆమెకు తప్పనిసరి అయింది. తన భర్త శవానికి దహనక్రియలు జరిపించడానికి పుట్టింటివారి సాయం కోసం బయలుదేరింది. భర్త శవానికి నమస్కరించి, పిల్లలతో నడక సాగించింది.


కొంత దూరం నడిచాక, మధ్యలో ప్రవహిస్తున్న ఒక వాగు కనిపించింది, అందులో నీరు నడుము దాకా ఉంది. సహాయం కోసం ఆమె చుట్టూ చూసింది. కానీ ఎవరూ కనబడలేదు. చేసేది ఏమీ లేక, పసివాడిని కాస్త మెత్తగా ఉన్న గడ్డిపై పడుకోబెట్టి, పెద్దవాడిని ఎత్తుకుని త్వరత్వరగా ఆ నీటిలో నడవసాగింది. చూడడానికి అవతలి ఒడ్డు దగ్గరగా కనిపిస్తున్నా, దాటడానికి సమయం చాలానే పట్టింది. పెద్దవాడిని అక్కడ దింపి, 'బాబూ! నేను తమ్ముడిని



తీసుకుని వచ్చే వరకూ ఇక్కడ నుండి నువ్వు కదలకు' అని జాగ్రత్తలు చెప్పి వెనుతిరిగింది. ఆమెను దిగ్భ్రాంతికి గురి చేస్తూ ఒక రాబందు గడ్డిపై పడుకోబెట్టిన పసివాడిని నోట కరిచేందుకు కిందకు రాసాగింది. ఆమె బిగ్గరగా అరుస్తూ, చేతులను విసురుతూ, పరుగులు పెడుతూ, దాన్ని ఆపాలని విశ్వప్రయత్నం చేసినా, అది నిష్ప్రయోజనమే అయింది. నిస్సహాయ స్థితిలో, తడిబట్టలతో నేలపై పరుగిడే ఆమెకూ, బలమైన రెక్కలతో, ఆనందంగా గాలిలో ఎగిరే ఆ రాబందుకు సామ్యమేది?

ఈ లోపు ఆవల ఒడ్డున ఉన్న పెద్ద కొడుకు రాబందును తరిమేందుకు చేతులు ఊపుతున్న తల్లిని చూసి, తనను రమ్మంటోందని అమాయకంగా భావించి నీళ్ళలోకి దిగసాగాడు. దాన్ని చూసి మరింత భయపడి, 'రావద్దు రావద్దు' అని ఆమె అరిచినా, అప్పటికే నీటిలో కాలుపెట్టిన ఆ పిల్లవాడు ప్రవాహవేగాన్ని తట్టుకోలేక, అందులో పడి కొట్టుకుపోయాడు.

అంతా ఒక్క రోజులో, ఒక్క ఘడియ కాలంలోనే జరిగిపోయింది. విషాదం మీద విషాదం. ఆమె ప్రాణాధికంగా ప్రేమించిన ఆ ముగ్గురూ ఆమె చూస్తుండగానే నిర్జీవులైపోయారు. ఆమె ఒక ఉన్మాద స్థితికి చేరి, ముళ్ళు గుచ్చుకుంటున్నా, శరీరం బాధిస్తున్నా లెక్క చేయక, శ్రావస్తికి పరుగిడసాగింది. ఇప్పుడు ఆమె ధ్యేయమల్లా ఒక్కటే... తన భర్త శవానికి దహనక్రియలు జరిపించి, పిల్లల శవాలను వెతికించాలని! ఆ పరుగులో చివరకు తనకు బాగా పరిచితమైన ఆ వీధికి చేరుకుంది. అక్కడ, తన పుట్టింటి ముందు పెద్ద గుంపు కనిపించింది. అక్కడ ఉన్నవారందరూ ఆమెకు బాగా తెలిసినవారే. ఎర్రబారిన కళ్ళతో రేగిన జుట్టుతో, తడిసిన బట్టలతో, వణుకుతూ ఉన్న ఆమెను ఆశ్చర్యంగా చూస్తూ వారు దారి ఇచ్చారు. 'ఏమైంది' అని తడబడుతూ ఆమె ప్రశ్నించింది. 'నిన్న రాత్రి మీ ఇంటికి నిప్పు అంటుకుంది, నీ తల్లితండ్రులను కాపాడాలని మేము చేసిన ప్రయత్నం ఫలించలేదు' అని వాళ్ళు చెప్పారు. ఆమె వారి వంక విచిత్రంగా చూస్తూ, 'వారు చనిపోయారా?' అని అడిగింది. వారు అవునని చెప్పారు. 'నిజంగానే చనిపోయారా?' అని ఆమె నవ్వడం మొదలుపెట్టింది. ఆగి మళ్ళీ మళ్ళీ నవ్వసాగింది. 'అయ్యో! ఈమెకు మతి చలించింది' అని ఇరుగు పొరుగు వారు బాధపడసాగారు.



ఆమెను పలువిధాలుగా ఓదార్చగా, చివరకు జరిగింది ఏమిటో వారికి ఆమె చెప్పింది. వెంటనే అక్కడ ఉన్న వారిలో కొంతమంది ఆమె భర్త శవాన్ని దహనం చేసేందుకు అడవికి వెళ్ళారు. ఆమెకు ఆహారం ఇచ్చినా స్వీకరించలేదు. అలా వీధులలో నడుస్తూ, 'పాము ఒకరిని తీసుకుంది, పక్షి ఒకరిని తీసుకుంది, నీరు ఒకరిని మింగింది, అగ్ని ఇద్దరిని దహించింది' అని అరుస్తూ, ఏడుస్తూ నవ్వసాగింది. ఆమెను ఓదార్చడం ఎవరికీ సాధ్యం కాలేదు. ఇలాంటి ఉన్మాద స్థితిలోనే కొంత కాలం గడిచిపోయింది.

ఒకనాడు ఆమె అలా తిరుగుతూనే, ఒక తోటలోకి వెళ్ళి, ఒక చోట కూర్చుని గట్టిగా ఏడవసాగింది. అక్కడకు కొద్ది దూరంలోనే ఒక వేదిక, దాని మీద ఉపన్యసిస్తున్న ఒక వక్త ఉన్నారు. ఆ వక్త ఆమెను గమనించి, వేదిక మెల్లగా దిగి, ఆమెను సమీపించసాగాడు. వెనుక నుండి ఎవరో, 'ఆమె పిచ్చిది, ఆమె జోలికి వెళ్ళకండి' అని గట్టిగా అరిచారు. అది ఏమీ పట్టించుకోకుండా, అతను ఆమెను సమీపించి, 'పటాచారా! ఓ పటాచారా! అని పిలిచారు. మృదువైన ఆ పిలుపు విని, తల పైకెత్తిన ఆమెకు, అనంతమైన కరుణను కురిపిస్తున్న అతని కళ్ళు కనిపించాయి. ఆ ప్రశాంతమైన వదనాన్నీ, కరుణామయ దృక్కులనూ చూసిన ఆమె మనస్సు ఒక్కసారిగా శాంతిని పొందింది. కన్నులు వర్షిస్తుండగా, ఆమె అతని పాదాలపై వాలిపోయింది. అతను వాత్సల్యంగా, 'పటాచారా! నాకు అంతా తెలుసు, ఇక నీవు శాంతించు' అని అనగానే, ఒక్కసారిగా ఆ ఉన్మాదం నుండి విడివడింది. అప్పుడే మెలకువలోకి వచ్చినట్లు, చెదిరిన తన వస్త్రాలను చూసి సిగ్గుపడి, పక్కవారిని ఒక వస్త్రం ఇవ్వమని అర్థించింది. తనను తాను పూర్తిగా ఆ వస్త్రంతో కప్పుకుంది. ఆ మహనీయుడు, 'నువ్వు ఇంతవరకు అనుభవించింది చాలు. నీ బాధలు ఇంతటితో పరిసమాప్తమయ్యాయి. ఇక నుండి నువ్వు త్యాగమయజీవితాన్ని ఆరంభించు. ధర్మానికీ, సంఘానికీ, బుద్ధునికీ నీ జీవితం సమర్పణ చేయి' అని హితబోధ చేశాడు. ఇంతకీ ఆ మహానుభావుడు మరెవరో కాదు, సాక్షాత్తూ బుద్ధ భగవానుడు. ఇదీ ఆ ఉపన్యాసకురాలి గత చరిత్ర.

ఆ ఉపన్యాసకురాలు అలా ఆ వేదిక మీద తన ప్రసంగం ఎంతసేపు కొనసాగించిందో! ఆమెకే కాదు, అక్కడ కూర్చుని వింటున్న వారెవరికీ సమయం తెలియలేదు. అంతా శ్రద్ధగా, భక్తిగా, మంత్రముగ్ధులై వినసాగారు. ఆమె మెల్లిగా తలవంచి, అభివాదం చేసి, 'నేను ఈనాడు బాధకు అతీతంగా ఉన్నాను. నాకు చాలా ప్రశాంతంగా ఉంది. నేను ఎవరినీ గుర్తు చేసుకుని బాధపడడం లేదు. నా ప్రమేయం లేకుండా నా జీవితంలోకి వారు వచ్చారు, అలాగే వెళ్ళారు. ఇవి జీవన ప్రయాణంలోని మజిలీలు. వీటిని గురించి చింతించే పని లేదు' అని ఉపన్యాసాన్ని ముగించింది. ఆ ఉపన్యాసకురాలు మరెవరో కాదు, బుద్ధుని శిష్యులలోని ప్రతిభావంతులూ, ముఖ్యులైన వారిలో ఒకరైన తేరీ పటాచారా! ❖ తెలుగు సేత : డాక్టర్ అపర్ణా శ్రీనివాస్

(రామకృష్ణ సంఘం – ఆంగ్ల మాసపత్రిక 'ప్రబుద్ధ భారత' నుంచి)

భయంకరమైన అగ్నిజ్వాలలకు ఆహుతి అవుతున్న చెట్టుపై పక్షులు నివసింపజాలవు. అలాగే కామాగ్నితో దహించబడుతున్న వాడిలో శాంతిసౌఖ్యాలు, సత్యధర్మాలు నెలకొనలేవు. - బుద్ధుడు

భారమవుతున్న బాల్యం

– స్వామి శితికంఠానంద

అది ఉపనిషత్తుల కాలం. యజ్ఞయాగాదుల యుగం. ద్రవ్య యజ్ఞాల ద్వారా దేవతలను ఉపాసిస్తే మరణానంతరం ఉన్నత లోకాలను పొందుతామని ప్రగాఢంగా విశ్వసించే సమాజం. ఈ లక్ష్యంతో ఒక క్రతువును నిర్వహిస్తున్నాడు ఒకానొక గృహస్థుడు. అతనికి ఒక 8 సంవత్సరాల సుపుత్రుడు ఉన్నాడు. తండ్రి చేసే మఖాన్ని శ్రద్ధగా పరిశీలిస్తున్నాడు ఆ బాలుడు. యాగం గురించి పూర్తిగా తెలియక పోయినా పుణ్య సముపార్జనకు తన తండ్రి ఆ యజ్ఞాన్ని సంకల్పించాడని మాత్రం గ్రహించాడు. యాగం చివరి దశకు వచ్చింది. అందులో భాగంగా పుణ్యాత్ములకు శక్తి కొలది దక్షిణలు ఇవ్వాలి. ఆ కుటుంబి ఒట్టి పోయిన ఆవులను, తనకు ఉపయోగ పడని వస్తువులను అందరికి పంచుతున్నాడు. బాలుడికి బాధ కలిగింది. 'మనకు ఉపయోగపడని వస్తువులు ఇతరులకు కూడా ఉపయోగపడవు కదా! మరి అలాంటి వస్తువులను దానమిస్తే పుణ్యమెలా వస్తుంది? పుణ్యానికి బదులు తన తండ్రి పాపం మూట గట్టుకోవడం లేదు కదా!' అనుకున్నాడు మనసులో.

తండ్రి యాగాన్ని శ్రద్ధతో చేయడం లేదని గ్రహించాడు. బాలుడు కలత చెందాడు. తండ్రి శ్రద్ధారాహిత్యం వలన కలగబోతున్న లోటును తాను ఏ విధంగా భర్తీ చేయగలడో ఆలోచించాడు. తాను కూడా తండ్రి సంపదలో భాగమే. కాబట్టి తండ్రికి తనను దానం చేసే అర్హత ఉంటుంది. అలా తాను ఇతరులకు దానమియ్యబడితే, తద్వారా కొంచెమైనా పుణ్యం తన తండ్రికి దక్కుతుందని భావించాడు. వెంటనే తండ్రి దగ్గరకు వెళ్ళి 'నాన్నా! నన్ను ఎవరికి దాన మీయనున్నావు?' అని అడిగాడు. కొడుకును ఏ తండ్రి ఐనా దానమిస్తాడా? గృహస్థుడు చేసే సర్వకార్యాలు పిల్లలకోసమే ఐనప్పుడు పుత్రులను ఎవరైనా కలలోనైనా దాన మివ్వగలరా? ఇవేవీ ఆ పిన్నడు ఆలోచించలేదు. తండ్రి చేస్తున్న యాగం లోపభూయిష్టం. తాను కొంతవరకు ఆ లోపాన్ని భర్తీ చేయగలడు. ఇంతవరకే ఆలోచించాడు. బుడుతడు మొదట అడిగి నప్పుడు ఆ తండ్రి జవాబు ఇవ్వలేదు. బాలకుడు మళ్ళీ తండ్రిని ప్రశ్నించాడు. అప్పుడూ తండ్రి మాట్లాడలేదు. ఆ శ్రద్ధాళువు మూడోసారి అదే ప్రశ్నవేశాడు. ఆ తండ్రి సహనాన్ని పరీక్షకు పెట్టాడు. తండ్రి వెంటనే విసుగుతో, 'నిన్ను యముడికి దానమిస్తు న్నాను' అన్నాడు. ఆ బాలుడు వెంటనే తండ్రి నోటినుండి వచ్చిన వాక్కు నిజమై తీరాలి అని సంకల్పించాడు. 'తండ్రి! సస్యమివ మర్త్యః పచ్యతే సస్యమివాజాయతే పునః! మనుషులు పంటమొక్కల్లాగా ఇవాళ గిడతారు. రేపు పుడతారు! (చావు పుట్టుకలు అల్ప విషయాలు. సత్యమే జీవితం అని అంతరార్థం)' అని తండ్రి నోటి నుండి వెలువడిన వాక్యాలను నిజం చేయడానికి యమలోకం వెళ్ళి 'నేను మీకు దానమివ్వబడ్డాను. మీరు ఎలాగైనా నన్ను ఉపయోగించుకోవచ్చు' అని ధర్మదైవతానికి నివేదించుకోవడానికి వేచి ఉన్నాడు.



ప్రపంచంలో అత్యంత తీరుబడిలేని వారిలో ఒకరైన సమవర్తి తన కార్యనిర్వహణలో భాగంగా లోకపర్యటనలో ఉన్నారు. యజమాని లేకపోతే సేవకులు ఎవరూ అంత అప్రమత్తంగా ఉండరు కదా! అక్కడ కూడా అదే పరిస్థితి. ఆ బాలుడిని ఎవరూ పట్టించుకోలేదు. 'మా నాయకుల వారు లేరు. మూడురోజుల తర్వాత రావల్సింది' అని ముక్తసరిగా సమాధానం చెప్పారు. ఇక గత్యంతరం లేక పిల్లవాడు మూడు రోజులు శమనుడికై నిరీక్షించాడు.

ధర్మస్వరూపుడు కార్యాన్ని ముగించుకొని తన లోకానికి వచ్చాడు. అర్భకుడిని చూశాడు. అతిథి దైవంతో సమానమని, తన నివాసంలో దైవం నిరాదరింపబడిందని వ్యాకులత చెంది, ప్రాయశ్చిత్తంగా మూడు వరాలు కోరుకోమంటాడు. అందులో మూడవ వరంగా ఆ బాలుడు మరణరహస్యం తెలియజేయ మంటాడు. "దేవతలకు కూడా ఈ విషయంపై సందేహాలు ఉన్నాయి. నీవు చాలా చిన్న పిల్లవాడివి. అంతటి పెద్ద ప్రశ్నలు వేయకూడదు. ఇంకేదైనా అడుగు. కానీ ఈ ప్రశ్నకు సమాధానం కావాలని మాత్రం పట్టుబట్టవద్దు" అంటాడు.

పిల్లవాడు శ్రద్ధకు ప్రతిరూపం. తనకు మృత్యురహస్యం తప్ప ఇంకేమీ అవసరం లేదని పట్టుబట్టి సూక్ష్మాతి సూక్ష్మమైన ఆ రహస్యాన్ని గ్రహించి భూలోకం తిరిగి వస్తాడు. ఇది మనకున్న అతి గొప్ప ఉపనిషత్తులలో ఒకటైన కఠోపనిషత్తులోని కథాంశం. యమధర్మ రాజుకు, ఆ బాలమేధావికి మధ్య జరిగిన సంవాదం మహాసంవాదమనదగ్గది. ఆ చిచ్చరపిడుగే నచికేతుడు.

వివేకానంద స్వామి మరల మరల ఉటంకించడానికి సందేహించక, ఎప్పుడూ శ్లాఘిస్తూ మనకు పరిచయం చేయడానికి తపించిన ఒక వ్యక్తిత్వం ఏదైనా ఉన్నదంటే అది ఈ బాలుడిదే. ఈ పాత్ర ద్వారా మనం గ్రహించాల్సిన విషయాలు చాలా ఉన్నాయి.

కొద్దిరోజుల క్రితం మఠానికి వైద్యవృత్తిలో ఉన్న ఇద్దరు దంపతులు వచ్చారు. వారికి ఒక అబ్బాయి, ఒక అమ్మాయి. ఎవరైనా స్వామీజీ పిల్లలకు కాస్త సునిర్దేశం చేస్తారేమోనని అటూ,

ఇటూ చూస్తున్నారు. వెంటనే ఒక స్వామీజీ తారసపడ్డారు. ఆ డాక్టరమ్మ 'మా పిల్లవాడు ఈ మధ్య అదోలా ప్రవర్తిస్తున్నాడు. చెప్పిన మాట వినడంలేదు. మీరు కాస్త మార్గదర్శనం చేస్తారా స్వామీజీ? అని అడిగింది. పిల్లల ముఖాలు వాడిపోయిన తోటకూర కాడల్లాగా ఉన్నాయి. మోములో ఆనందం లేదు. ఏదో చెప్పాలని ఉంది కానీ తటపటాయిస్తున్నారు. మెల్లమెల్లగా కొన్ని ప్రశ్నలు వేసి వారి బిడియం పోయేటట్లు చేశాక, తమ మనసు విప్పడం మొదలు పెట్టారు. 'మాకు ఇష్టంలేని కార్యం పాఠశాల నుంచి వచ్చిన తర్వాత ట్యూషన్‌కు వెళ్ళడం' అని ఇద్దరూ ఏకకంఠంతో చెప్పేశారు. మరి మీ ఆలోచన మీ అమ్మకు చెప్పారా? అని అడిగితే వాళ్ళు ముక్తకంఠంతో 'నేను చెపితే మీరు హోమ్ వర్కు చేయరు. మారాం చేస్తారు. అందుకని మీకు ట్యూషన్ తప్పనిసరి అని మా అమ్మ అంది' అన్నారు.

ఇద్దరూ బాగా చదివే పిల్లలే. వాళ్ళకు ఆడుకోవాలని ఉంది. కానీ ఆటపాటల్ని త్యాగం చేస్తేకానీ భావిజీవితం లేదు అన్నది తల్లిదండ్రుల ఆలోచన. కేవలం వాళ్ళను రోజంతా పుస్తకాలపై కూర్చోబెట్టడంవలన ఎలాంటి ప్రయోజనం ఉండదన్న గ్రహింపు వాళ్ళకు లేకపోవడం ఆ పిల్లల పాలిటి శాపం అయింది. తల్లికి ఎదురు చెప్పే ధైర్యంలేక, ట్యూషన్‌కు ఇష్టంతో వెళ్ళలేక వాళ్ళు మార్కులు తెచ్చుకుంటున్నారే కానీ, ఆనందంగా లేరు. జీవితాల్లో వికాసం కనిపించడం లేదు. ఇలా ఎంతమంది పిల్లలకు బాల్యం ఈరోజుల్లో శాపమవుతున్నదో కదా! తల్లిదండ్రులు తమ కోరికల సాఫల్యానికై, ఆశల సాకారానికి, పిల్లల హక్కులను, బాల్యాన్ని హరిస్తున్నారేమో ఒకసారి ప్రశ్నించుకోవాలి. తమ అనవసర తాపత్రయంతో, అర్థరహిత భవిష్యత్తు జీవితపు ఆందోళనతో బాలల బాల్యాన్ని భారం చేస్తున్నారేమో పరిశీలించుకోవాలి.

మనసులో ఉత్సాహం, ఉల్లాసం లేకుండా కేవలం యంత్రాల లాగా పుస్తకాలలోని సమాచారాన్ని వాళ్ళ బుర్రలలో కుక్కడం ద్వారా వాళ్ళు ఏదో సాధించేస్తారని మనం అనుకోవడానికి లేదు. వాళ్ళను సహజంగా ఆడుతూ, పాడుతూ ఎదగనీయాలి. వాళ్ళ భావోద్వేగాల్ని, ఆలోచనలను గౌరవించాలి. వాళ్ళ ఆసక్తులను, అభిరుచులను ప్రోత్సహించాలి. కథలో చదువుకున్న నచికేతుడిని ఆ బాలుడి తండ్రి ఏమీ తెలియని పిల్లాడు అనుకున్నాడు. కానీ ఆ బాలుడు తన ప్రతిచర్యను నిశితంగా పరిశీలిస్తున్నాడని గ్రహించలేకపోయాడు. తనను ఎవరికి దాన మిస్తావని అడిగినప్పుడైనా పరిహాసానికి అడుగుతున్నాడా? నిజంగానే అడుగుతున్నాడా? అని వివేచించడానికి ప్రయత్నించలేదు. వత్సుడికేమి తెలుస్తుందిలే అనుకున్నాడు. తండ్రి తన యజ్ఞనిర్వహణ విధానం, ప్రమత్తత... సున్నితమనస్కుడు, స్ఫురద్రూపి, వివేకశీలుడు ఐన పుత్రుడికి బాధను కలిగించినదని గ్రహించలేకపోయాడు. బాలకుడు అనుభవించిన మానసిక క్షోభ ఆ తండ్రికి అర్థం కాలేదు. ఇలాంటి సునిశితాత్ములు ఇప్పుడూ ఎంతోమంది ఉన్నారు. కుటుంబాలలో మనం గడుపుతున్న ధర్మరాహిత్య జీవితం పిల్లలను బాధకు గురిచేస్తున్నదేమో మనమొకసారి ఆలోచించాలి. మనకున్న వ్యసనాలు, బలహీనతలు, మనం చెప్పే అబద్ధాలు వాళ్ళకు మనపై గల గౌరవాన్ని తగ్గిస్తాయి. పిల్లలు తమను గమనిస్తున్నారన్న విషయం తలిదండ్రులు మర్చిపోకూడదు. భార్యాభర్తలు పిల్లల ముందు పోట్లాడుకోవడం, తిట్టుకోవడం, కఠినవాక్కులు పలుకడం మానుకోవాలి. వారి అమర్యాద పూర్వక ప్రవర్తన బాలబాలికల లేతమనస్సులపై తీవ్రప్రభావాన్ని చూపే ప్రమాదం ఉందని గ్రహించాలి. పసివాళ్ళ నిష్కల్మష హృదయాలు భగవంతుడి ఆలయాలు. జననీజనకులు తమలో సౌశీల్యం లేకుండా సంతానం మహామహులు అవ్వాలని కోరుకోవడం పేరాశయే. నూటికి తొంభైశాతం మంది తలిదండ్రులు పిల్లలను తమ భౌతిక ఆస్తుల్లో ఒక ఆస్తిగా భావిస్తున్నారు. ఇది మహా అజ్ఞానం.



పిల్లలు మాత్రం నచికేతుడిలాగా వాళ్ళు తల్లిదండ్రులకు సంపదగా పరిగణించుకుంటే ఫరవాలేదు. కానీ జన్మనిచ్చినవారు మాత్రం పిల్లలను తమ ఆస్తిగా పరిగణించడానికి లేదు. పిల్లల ఆలనా పాలనా చూసే బాధ్యతను భగవంతుడు తల్లిదండ్రులకు ఇచ్చాడు. పవిత్రమైన ఈ బాధ్యతను తల్లితండ్రులు ఎంత చక్కగా నిర్వర్తిస్తున్నారో చూసుకోవడమే వారి విధి. అంతేగాని వారిపై పూర్తి హక్కులు ఉన్నట్లు భావించకూడదు.

పిల్లలు వారి వారి సంస్కారాలతో పుడతారు. వాటి ప్రకారం ఎదుగుతారు. మంచి సంస్కృతిని ఇచ్చి, స్వీయ నైతిక ప్రవర్తన ద్వారా, ఉదాత్తమైన, లోకోత్తరమైన జీవితాలను ఉదాహరణగా చూపడం ద్వారా చిన్నారులను ఆలోచింపచేస్తూ, మాతా పితరులు వారిని సౌశీల్యఘనులుగా, మానధనులుగా, సద్గుణగరిష్ఠులుగా తీర్చిదిద్దాలి. వారిపై మమకారాన్ని పెంచుకోకుండా, వారినుంచి ఏమీ ఆశించకుండా నిర్మలమైన ప్రేమను వారికి పంచాలి. అప్పుడే వారు ఆదర్శ జననీజనకులవుతారు. దీనికి భిన్నంగా వారు సంతానంపై విపరీతమైన ఆశలను పెట్టుకొని, ఆ ఆశలు, ఈడేరని కోరికలు సాధించుకోవడానికి బిడ్డలను ఉపకరణాలుగా స్వీకరిస్తే తుదకు దుఃఖమే మిగులుతుంది. అందుకని పిల్లలను కనగానే సరిపోదు. వారిని పెంచడం ఒక కళ. మహాకళ. నేటి సమాజంలో అతికొద్దిమంది మాత్రమే ఈ కళలో నిష్ణాతులైన వారు ఉన్నారన్నది నిర్వివాదాంశం. ఈ కళలో ప్రావీణ్యం సంపాదించడానికి చేసే ప్రయత్నం ద్వారా మనకు జీవనసాఫల్యం కలుగుతుంది. పరిశీలిస్తే ఆ ప్రయత్నమే మన జీవితానికి నిజమైన సొబగును సమకూరుస్తుంది. అర్థాన్ని ప్రసాదిస్తుంది. ❖

పిల్లల్ని ఐదేళ్ళు వచ్చే వరకూ రాజభోగాలతో పెంచాలి. పదేళ్ళ వరకూ పనిపాటలు నేర్పించాలి. పదహారేళ్ళు వచ్చాక స్నేహితుల్లాగ భావించి, సలహాలిస్తూ సన్మార్గంలో నడిపించాలి. - చాణక్యనీతి


ఛత్రపతిని కదిలించిన చల్లని తల్లి

– శ్రీమతి సుధామూర్తి, ఇన్ఫోసిస్ ఫౌండేషన్

మాతృప్రేమ అనగానే ఎప్పుడో నేను చిన్నప్పుడు చదువుకున్న కథ గుర్తొస్తుంది. నిజానికి అది ఛత్రపతి శివాజీ కాలం నాటిది. బిడ్డ కోసం తల్లి ప్రాణాలు పణంగా పెట్టటానికైనా సిద్ధపడుతుందనడానికి ఆ ఉదంతమే నిదర్శనం. దేశరక్షణలో, దేశభక్తిలో శివాజీకి శివాజీయే సాటి! అలాంటి వీరాధివీరుడిని కూడా కదిలించిన ఓ సాధారణ యువతి మాతృవాత్సల్యం మన గుండెల్ని కూడా జలదరింపచేస్తుంది. ఛత్రపతి శివాజీ పరిపాలనలో పకడ్బందీ రక్షణ వ్యవస్థ ఉండేది. అందుకే ఆయన కోటను కూడా శత్రుదుర్భేద్యంగా నిర్మింపచేశారు. ఆ కోటలో రాకపోకలకు నియమిత వేళలను నిర్దేశించేవారు.

శివాజీ కోటలోకి సమీపంలోని ఓ కుగ్రామం నుంచి హిరాకాని అనే వివాహిత రోజూ పాలు, పాలపదార్థాలు తెస్తూ ఉండేది. రక్షణాధికారుల సూచనల మేరకు కోట సింహద్వారం సూర్యోదయం నుంచి సూర్యాస్తమయం వరకే తెరచి ఉండేది. హిరాకాని ఇంట్లో పసికందును వదిలిపెట్టి, కోటలో పాలు పోసి సాయంత్రం కల్లా తన స్వగ్రామానికి వెళ్ళిపోయేది. ఒక రోజు కోట లోపల సిపాయి భార్య ప్రసవవేదనతో బాధపడుతూ ఉంటే, హిరాకాని సాయానికి వెళ్ళింది; బిడ్డ పుట్టేటప్పటికి రాత్రి అయిపోయింది. సింహద్వారం మూసేశారు. హిరాకాని ఎంత బతిమాలినా కాపలావాళ్ళు ఆ ద్వారాన్ని తీయలేదు. బిడ్డ తల్లిపాల కోసం తపించే పసికూన అని ప్రాధేయపడ్డా, భటులు రాజశాసనాన్ని ధిక్కరించే సాహసం చేయలేదు. దాంతో హిరాకాని భోరున ఏడ్చింది; అయినా లాభం లేకపోయింది.

అయినా ఆ తల్లి బిడ్డను చేరుకోవడానికి ఎన్నో ప్రయత్నాలు చేసింది. ఇక కోట పక్కన ఉన్న కొండపైకి ఎక్కి అవతలి వైపునకు దూకడం ఒక్కటే మార్గం. కానీ అది మానవమాత్రులకు సాధ్యంకాని పని! అప్పటి వరకు ఎంతటి వీరుడు కూడా అలాంటి ప్రయత్నం చేయలేదు. ఎట్టకేలకు హిరాకాని ఆ కొండ ఎక్కి కిందకు చూసింది. ఓ వైపు తన నిండు ప్రాణాలు, మరోవైపు నెలలు కూడా నిండని బిడ్డ ఆకలి కేకలు ఆ తల్లిని సందిగ్ధంలో పడేశాయి. కొండపై నుంచి దూకటం దుస్సాహసం, దుస్సాధ్యమని తెలుసు! అయినా ఆ అమ్మమనస్సు ఊరుకోవడం లేదు. ఉదయమే వెళ్ళవచ్చని ఎవరు ఎంత చెప్పినా, హిరాకాని మనస్సు మాత్రం బిడ్డకోసమే తహతహలాడుతోంది. చివరకు ఒక నిర్ణయానికి వచ్చింది; తన ప్రాణం కన్నా పసిబిడ్డకు పాలివ్వడమే ప్రధాన మనుకుంది. మళ్ళీ కొండపైకి వెళ్ళింది. ఒక్కసారి కిందకు చూసింది. ఓ పక్క కొలను, మరోవైపు మైదానం కనిపించాయి. కళ్ళు మూసుకొని ప్రాణాలకు తెగించి, ధైర్యం చేసి ఆ భగవంతుడిని ప్రార్థించి హిరాకాని ఒక్కసారిగా కిందకు దూకింది.



ఆశ్చర్యం! అదృష్టవశాత్తూ ఆమె ఓ చెట్టుకొమ్మపై పడింది. చిన్నచిన్న గాయాలతో బతుకుజీవుడా అనుకుంటూ నెమ్మదిగా చెట్టుదిగి ఇంటికి పరుగెత్తింది. అప్పటికే బిడ్డ పాలకోసం గుక్కపెట్టి ఏడుస్తోంది. కన్నబిడ్డను చూడగానే ఆ తల్లికి గాయాల బాధంతా మాయమైపోయింది. వెంటనే పసిపాపను పొదివి పట్టుకొని పాలిచ్చింది.

మరునాడు హిరాకాని యథావిధిగా పాలు, పెరుగు తీసుకొని కోటకి వెళ్ళింది. కాపలావాళ్ళు ఆమెను చూసి ఆశ్చర్యపోతూ, 'ఎలా ఇంటికి చేరుకోగలిగావు?' అని అడిగారు. మొత్తం కథంతా చెప్పింది. 'నా ప్రాణం కన్నా నా బిడ్డే ముఖ్యం. ఎంతైనా తల్లిని కదా! అమ్మకు తన శరీరంలో బిడ్డ ఒక భాగమే! తన బిడ్డ ప్రమాదంలో ఉందని తెలిస్తే ఏ తల్లీ ప్రశాంతంగా ఉండలేదు' అని చెప్పి ఏమీ జరగనట్లే మామూలుగా వెళ్ళిపోయింది.

హిరాకాని ఉదంతం శివాజీ మహారాజు వరకు వెళ్ళింది. ఏ యోధుడికీ సాధ్యం కాని సాహసానికి ఓ సాధారణ యువతి ఒడిగట్టిందని తెలిసి, ఆ తల్లిప్రేమకు శివాజీ కదిలిపోయాడు; అమ్మ ప్రేమకున్న శక్తి ముందు ఈ లోకంలో ఏ శక్తి అయినా దిగదుడుపేనని మరోమారు చాటిన హిరాకానిని నిండుసభలో సన్మానించాడు. 'నీది గొప్ప మాతృహృదయం అమ్మా!' అంటూ కోటలోని ఓ బురుజుకు హిరాకాని పేరును పెట్టుకున్నారు శివాజీ మహారాజు. ❖ సేకరణ: జి. సతీష్

(మే 10, మాతృదినోత్సవం)

యువవాణి

– స్వామి పరిజ్ఞేయానంద

ఏకాగ్రత అపాయమా?



కళాశాల విద్యార్థి, నెల్లూరు

ప్రశ్న: స్వామి వివేకానంద బాల్యంలో మిత్రులతో కలసి ధ్యానం చేస్తున్నప్పుడు త్రాచుపాము వచ్చింది. ఆ పామును చూసి మిత్రులంతా పారిపోయారు. కానీ నరేంద్రుడు ధ్యానంలో మునిగిపోయాడు. ఆ పాము కాటువేసివుంటే ఆయన ప్రాణాలకే ముప్పువాటిల్లేది. మరి అలాంటి ఏకాగ్రత వల్ల అపాయమే కదా?

జవాబు: ఏకాగ్రత వల్ల కలిగే లాభ నష్టాల సంగతి ఏమైనప్పటికీ, మీరు మాత్రం నరేంద్రుని ధ్యాన సంఘటనను చాలా ఏకాగ్రతతో చదివారని అర్థమవుతుంది.

అరణ్యంలో ఒక యోగి ఓ చెట్టు కింద కూర్చొని ధ్యానం చేసుకుంటున్నాడు. ఆ సమయంలో అక్కడకు ఒక పులి వచ్చింది. ధ్యానమగ్నుడై ఉన్న ఆ యోగిని చూసి, పులి వెళ్ళిపోయింది. దూరం నుండి ఇదంతా గమనిస్తున్న ఓ వ్యక్తి ఆ యోగి దగ్గరకు వచ్చి 'స్వామీ! మీరు చాలా మహోన్నతులు, మహిమాన్వితులు' అంటూ స్తుతించడం మొదలుపెట్టాడు. ఇంతలో ఆ యోగి ముఖంపై ఓ ఈగ వచ్చి వాలింది. వెంటనే అతడు 'ఛీ పాడు ఈగ నన్ను చంపుకుతింటుంది' అని విసుక్కున్నాడు. యోగి అసహనాన్ని చూసిన ఆ వ్యక్తి 'స్వామీ! ఇంతకముందు అంత పెద్ద పులి వస్తే భయపడని మీరు, ఇప్పుడింత చిన్న ఈగ వచ్చి వాలితే ఎందుకంత చీకాకుపడుతున్నారు' అని అడిగాడు. అప్పుడా యోగి 'నాయనా! పులి వచ్చినప్పుడు నా పక్కన దేవుడున్నాడు. ఇప్పుడు నువ్వున్నావు. అందుకే ఈ కంగారంతా!' అని సమాధానమిచ్చాడు.

ఈ కథ మనకు రెండు విషయాలను తెలియజేస్తుంది. మొదటిది – భగవత్ ధ్యానంలో నిమగ్నమైన వాడికి ఎలాంటి ప్రమాదం సంభవించకుండా ఆ దేవుడే కాపాడతాడు. 'ఎవరైతే నన్ను ధ్యానిస్తూ ఉంటారో అలాంటివారి క్షేమాన్ని నేనే చూసుకుంటాను' అని శ్రీకృష్ణుడిచ్చిన అభయాన్ని గుర్తుచేస్తుంది.

రెండవది – మనుష్యులు, క్రూరజంతువుల కన్నా ప్రమాదకరంగా పరిణమించారన్న విషయాన్ని తెలుపుతుంది.

నిజానికి, జంతువులు సఖ్యతతో జీవిస్తున్నాయి; పక్షులు ఐకమత్యంతో ఎగురుతున్నాయి; చీమలు ఉమ్మడిగా కలసి పనిచేస్తున్నాయి. కానీ అన్నీవున్న మనం మాత్రం, ఏమీ లేని మూగజీవులకన్నా అధ్వాన్నంగా బతుకుతున్నాం.

ఒక చెట్టుపైకి కొత్తపక్షులు వచ్చిచేరితే మిగతా పక్షులు కలుపుగోలుతనాన్ని చూపుతాయి. కానీ కళాశాలల్లో పాత విద్యార్థులు కొత్తగా వచ్చిన విద్యార్థుల బిడియాన్ని పోగొట్టడానికి బదులు ర్యాగింగ్ పేరుతో ఎన్నో విధాలుగా వారిని బాధించడం నేడు మనం చూస్తూవున్నాం. అంటే మనిషిని చూసి మనిషి భయపడే విషమపరిస్థితులు నేటి సమాజంలో చోటుచేసుకోవడం బాధాకరం.

ఒక విధంగా నరేంద్రుడు (స్వామి వివేకానంద) ధ్యానమగ్నుడవడానికి పాము పరోక్షంగా ప్రయోజనకారి అయిందేమోనని అనిపిస్తుంది. ఎలాగంటే బహుశా పాము రాకపోయి ఉంటే నరేంద్రుని మిత్రులంతా అక్కడే ఉండేవారు. నలుగురు పిల్లలు ఒక దగ్గర చేరితే ఏమయివుండేది? 'ఇల్లు పీకి పందిరేస్తార'న్న సామెత నిజమైవుండేది. దానివల్ల నరేంద్రుని ఏకాగ్రతకు భంగంవాటిల్లి ఉండేది.

'అహింసా ప్రతిష్ఠాయాం తత్సన్నిధౌ వైరత్యాగః – హింసాభావం లేనివారి సన్నిధి, క్రూరమృగాల్లో కూడా హింసాభావాన్ని తొలగిస్తుంది' అని పతంజలి మహర్షి చెప్పినట్లు ప్రశాంతచిత్తుడైన నరేంద్రుని సన్నిధిలో త్రాచుపాము కూడా శాంతభావాన్ని వహించింది. అలాగే నరేంద్రుడు ధ్యానమగ్నుడై ఉండడం వల్ల ఆ దేవుడే అతణ్ణి కాపాడాడు.

చిన్నప్పుడే నరేంద్రుడు దైవ ప్రార్థనలు, ధ్యానం చేయడం వల్ల ఆయనలో అపార ఏకాగ్రశక్తి అలవడింది. అందువల్లనే ఏకసంథాగ్రాహియై చదువుల్లోనూ, క్రీడల్లోనూ, కళల్లోనూ అపార ప్రతిభను ప్రదర్శించి పాశ్చాత్యులను సైతం ఆశ్చర్యపరిచారు. నరేంద్రుని మేధాశక్తిని కొనియాడుతూ కళాశాల అధిపతి విలియం హేస్టీ "నరేంద్రుడు మహామేధావి. నేను అనేక దేశాలను సందర్శించాను. కానీ అతడిలాంటి మేధావిని నేను ఇంతవరకూ చూడలేదు" అని అన్నారు.

మీరనుకున్నట్లు 'ఏకాగ్రత' వల్ల కూడా నష్టాలు కలుగుతాయి. కానీ ఎప్పుడు? తరగతి గదిలో కూర్చొని రేపు చూడబోయే సినిమా కోసం ఆలోచిస్తున్నప్పుడు; పరీక్షగదిలో కూర్చొని రాబోయే ర్యాంకుల కోసం చింతిస్తున్నప్పుడు; వాహనం నడుపుతూ జరిగిపోయిన తప్పులను తలచుకొని మథనపడుతున్నప్పుడు. ఇలా.... చేస్తున్న పనిమీద కాకుండా చేసిన పనిమీదనో, చేయబోయే పనిమీదనో మనస్సు ఏకాగ్రమైనప్పుడు నష్టం వాటిల్లుతుంది. అపాయం సంభవిస్తుంది.

కాబట్టి Read while you read, Play while you play, Eat while you eat, Sleep while you sleep అనే సిద్ధాంతాన్ని గుర్తుపెట్టుకొని వర్తమానంలో జీవించడం నేర్చుకొంటే చేస్తున్న పనిమీదనే మనస్సును ఏకాగ్రపరచడం సాధ్యమవుతుంది. అలాంటి ఏకాగ్రత వల్ల మేలే గాని కీడు జరగదు. జీవితం సుఖప్రదం, శుభప్రదమే అవుతుంది. ❖

మనం మన మనస్సును ఒక్క విషయంపై ఒక్క క్షణమైనా ఏకాగ్రం చేయలేకుండా ఉన్నాం. అయినప్పటికీ మనల్ని మనం స్వతంత్రులమని భావిస్తున్నాం. దీన్ని గురించి ఆలోచించండి. – స్వామి వివేకానంద

కలల లోకంలో...

– బి. సైదులు



ఆ మధ్య హాలివుడ్‌లో 'ఇన్‌సెప్షన్' పేరుతో ఓ చలనచిత్రం విడుదలై, ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకులను అలరించింది. పూర్తిగా కలలను ఆధారం చేసుకొని 'క్రిస్టోఫర్ నోలన్' రచించి, దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో నాయకుడు ఎదుటివారి కలల్లోకి ప్రవేశించి, భావచౌర్యంతో తాను అనుకున్నది సాధించుకుంటూ ఉంటాడు. కలలు, అంతశ్చేతన (సబ్‌కాన్షస్ మైండ్) తదితర అంశాలకు సంబంధించిన ఎన్నో విజ్ఞానదాయక విషయాలకు దర్శకుడు అద్భుతంగా దృశ్యరూపమిచ్చాడు. ఆ కథాకథనాల్ని చూస్తూ ఉంటే 'కలలు కూడా దోచుకునే దొరలు ఎందరో!' అన్న మన ఓ తెలుగు కవిహృదయం గుర్తుకొస్తుంది. మరోవైపు నేటి తరంలో ఎందరో యువతీయువకులు తమకున్న సామర్థ్యాన్నీ, తగిన ప్రయత్నాన్నీ మరచిపోయి సాగిస్తున్న స్వప్నవిహారమూ స్ఫురిస్తుంది. ముఖ్యంగా ఇరవై నుంచి పాతికేళ్ళ వయస్సులో యువతీయువకులు తమ భవిష్యత్తుపై సుందరస్వప్నాలతో ఏదో సాధించాలని తహతహలాడుతూ ఉంటారు. ఆ దశలో తమను తాము ప్రత్యేకమైన వ్యక్తులుగా ఊహించుకుంటూ, తమకు ఇష్టమైన రంగంపై, ఆ రంగంలో ఘనవిజయాలు సాధించినవారిపై ఓ వెర్రి వ్యామోహాన్ని పెంచుకుంటారు. తామూ వారిలాగే ఎక్కడికో ఎదిగిపోవాలనీ, నలుగురి చేత చప్పట్లు కొట్టించుకోవాలనీ కలలు కంటూ ఉంటారు. కానీ కళ్ళముందున్న జీవితాన్ని యథార్థంగా అర్థం చేసుకోలేకపోతున్నారు. ఇలాంటి యువతరాన్ని ఉద్దేశించి 'కృషి లేని ఆశయం కలగా మిగిలిపోతుంది. ఆశయం లేని కృషి కాలక్షేపంలా వ్యర్థమైపోతుంది' అంటారు ఓ మేధావి. ఇలా ఈనాడు చాలామందిలో ఆశయం ఉన్నా దానికి తగ్గ కృషి కొరవడుతోంది; మరికొందరిలో కృషిచేసే సామర్థ్యం ఉన్నా, అనువైన ఆశయాన్ని నిర్దేశించుకునే ప్రణాళిక ఉండడం లేదు. అందుకే యువతరం శక్తిసామర్థ్యాలు దారితప్పుతున్నాయి, దుర్వినియోగమవుతున్నాయి.

నేల విడవని సాము... : యవ్వనదశలో ఉన్న వ్యక్తి తనంతటి వాడు లేనట్లు, తాను అనుకున్నదే, తన అనుభవమే అమూల్యమైనట్లు, లోకరంగంలో తానే నాయకుడైనట్లు భావించుకుంటూ ఉంటాడు. సాక్షిగా, తటస్థుడిగా ఈ లోకాన్ని చూడలేడు. ఆవేశం వైపు మొగ్గు చూపినంత ఆలోచన వైపు మొగ్గడు. ఒక్కమాటలో చెప్పాలంటే యుక్తవయస్సులో ఉన్నప్పుడు గాలిలోకి ఎగిరి సాము చేయాలన్న ఆవేశం, ఆత్రుతే తప్పా నేల ఒకటుందని, ఎంత ఎగిరినా చివరకు దానిపై నిలబడక తప్పదన్న విషయాన్ని మరచిపోతాడు. అలా అని కూపస్థ మండూకాల్లా ఉన్నచోటే ఉండాలని కాదుకానీ, ప్రతి దశలో మనల్ని మనం ఇటు తక్కువగానూ, అటు ఎక్కువగానూ అంచనా వేసుకోకుండా నిష్పాక్షికంగా, పారదర్శకంగా మనల్ని మనం చూసుకోవాలి. అయితే మనలో చాలామంది అసలు ఈ దశలోనే తప్పటడుగులు వేస్తున్నారు. పులిని చూసి నక్క వాతలు పెట్టుకున్నట్లు వేరెవరో అందుకున్న అందలాలను చూసి, అర్హతలు లేకపోయినా, దానికి తగ్గ శక్తిసామర్థ్యాలు పెంచుకోకుండా పరాజితులుగా మిగిలిపోతున్నారు. ఓ ఆంగ్ల రచయిత చెప్పినట్లు A weak mind is one that easily gets dragged in all directions, influenced by everyone around, without thinking for itself! నిజమే! బలహీనమైన మనస్సు అన్ని దిశలకూ, పరిసర పరిస్థితులకు, వ్యక్తులకు ప్రభావితమవుతూనే ఉంటుంది.

గాలిలో మేడలు...: నేడు యువతీయువకులు అనేక ప్రభావాల ఫలితంగా ఊహల ప్రపంచంలో తేలియాడుతూ, చాలా వరకు తమ జీవనకలలకు స్పష్టమైన రూపురేఖల్ని దిద్దుకోలేకపోతున్నారు. నిరంతరం ఆ స్వాప్నికప్రపంచంలోనే నివసిస్తూ, అలా ఎన్నో రోజులు ఉండలేమని, ఎప్పుడో ఒకప్పుడు నిజలోకంలోకి దిగిరాక తప్పదని ఆలస్యంగా తెలుసుకుంటున్నారు. తత్ఫలితంగా సాధారణమైన వాస్తవ జీవితాన్నీ, పరిస్థితులనూ జీర్ణించుకోలేక అసహనానికి గురవుతున్నారు. ఆది నుంచి అత్తెసరు మార్కులతో గట్టెక్కుతూ, సరిగ్గా గంటసేపు

పుస్తకాలు పట్టుకొని ఏకాగ్రతతో చదవడం అలవాటు లేకుండా, 'సివిల్స్' గురించి కలలు కంటే ఏం ఫలిస్తాయి! ఏదో కళాశాల వార్షికోత్సవంలో వేదికపై నాటకంలో ఓ చిన్న పాత్ర వేస్తే, మిత్రులు చప్పట్లు కొట్టినంత మాత్రాన చలనచిత్రాల్లో నాయకుడైపోయి, నంది పురస్కారం గెలుచుకోవాలని కలలు కంటే ఎలా? స్ఫూర్తిపొంది శ్రమతో ఆ స్థాయికి ఎదిగితే అభినందనీయమే! కానీ పట్టుదల, పరిశ్రమ ఏమీ లేకుండా లోపమంతా మనలో పెట్టుకొని, చివరకు వ్యవస్థపైనో, వ్యక్తులపైనో విరుచుకుపడితే ప్రయోజనం లేదు. ఆ యా రంగాలపై కనీస అవగాహన కూడా లేకుండా, పరిమితమైన పరిజ్ఞానంతో అడుగుపెట్టి, ఆనక అపజయాలు మూటకట్టుకొని అసహనంతో ఊగిపోతే ఎవరికి నష్టం? అందుకే స్వామి వివేకానంద "Can anything be done unless exerts himself to his utmost? It is the man of action, the lion-heart, that the goddess of wealth resorts to – వ్యక్తి తన శక్తికొద్దీ పాటుపడనిదే, ఏ కార్యమైనా సాధ్యమవుతుందా? కార్యశూరుణ్ణి, పురుష సింహుణ్ణి విజయలక్ష్మి వరిస్తుంద"ని స్పష్టం చేస్తారు.

ఆరంభశూరత్వం...: మనం కన్న కలను జీవనలక్ష్యంగా చేసుకొని విజేతగా నిలిచేందుకు తగిన కృషి చేయాలి. సడలని పట్టుదల ఉండాలి. కానీ మనలో చాలా మందికి తొలిదశలో ఉన్నంత నిబద్ధత తరువాత కనిపించదు. ఇలా కలల సాకారంలో స్థిరత్వం, క్రమబద్ధత, ధృతి (consistency) లోపించడం వలన ఏదో ఒక దశలో లక్ష్యసాధన నుంచి జారిపోతూ కేవలం స్వాప్నికులుగా మిగిలిపోతున్నారు.

మనలో ఉన్న మరో లోపం ఆరంభశూరత్వం! ప్రయత్నాన్ని ప్రారంభించిన తొలినాళ్ళలో ఉన్న శ్రద్ధ, ఉత్సాహం, ఏకనిష్ఠ తదనంతరం కనిపించవు. ఏదో ఒక సాకుతో మధ్యలోనే ముఖం చాటేస్తూ ఉంటాం. సానుకూలంగా ఉన్నన్నాళ్ళూ ఏదో విధంగా ముందుకు వెళతాం; కానీ మన సాధనలో ఏ కాస్త ప్రతికూలత ఎదురైనా వెంటనే నీరుగారిపోతాం. సాంకేతికాభివృద్ధి అంతగా లేని రోజుల్లో, మధ్యతరగతివారికి కూడా అందుబాటులో ఉండే కార్ల తయారీ గురించి హెన్రీఫోర్డ్ ఆలోచించినప్పుడు అవన్నీ పగటికలలేనని అందరూ కొట్టిపారేశారు. ఆయన తన ప్రయత్నాన్ని ప్రారంభించినప్పుడు అది ఆరంభశూరత్వమే అవుతుందని అందరూ అపహాస్యమాడారు. కానీ హెన్రీ తన ఆలోచనలు సాకారమయ్యేవరకూ పట్టు వదలలేదు; ఫోర్డ్ కార్లను విపణిలో విడుదల చేసే వరకు తన ఉత్సాహాన్ని, దృఢనిష్ఠను కోల్పోలేదు.

ఉత్సాహ సంపన్న మదీర్ఘ సూత్రం క్రియా విధిజ్ఞం విషయే ష్వసక్తమ్
శూరం కృతజ్ఞం దృఢ నిశ్చయంచ లక్ష్మీః స్వయం వాంఛతి వాసహేతోః

'ఎల్లప్పుడూ ఉత్సాహం, చురుకుదనం, కార్య నిర్వహణలో సామర్థ్యం, లక్ష్యంపైనే ఆసక్తి, ధైర్యం, దృఢసంకల్పంలాంటి సుగుణాలు ఎవరిలో ఉంటాయో వారినే విజయం వరిస్తుంద'ని మన సనాతన ధర్మం వివరిస్తోంది.

అదే విధంగా నిద్ర, అలసట, భయం, కోపం సోమరితనం, తమస్సు అనే ఆరుదోషాలను వీడినప్పుడే మనస్సు చైతన్యవంతమవుతుందని హితవు పలుకుతోంది.

ప్రచారం...పరాభవం : తమ కలలు, లక్ష్యాలు కార్యరూపం దాల్చకముందే మనలో చాలామంది వాటికి సంబంధించిన ప్రచారాన్ని ప్రారంభిస్తూ ఉంటారు. వాటి గురించి నలుగురి ముందు ప్రగల్భాలు పలుకుతూ ఉంటారు. దాంతో తెలియకుండానే బయటి నుంచి మనపై అంచనాలు పెరిగి, ఒత్తిళ్ళకు గురిచేస్తాయి. లక్ష్యసాధనలో ఏ కాస్త తేడా వచ్చినా, నలుగురికి ఏం సమాధానం చెప్పుకోవాలా! అన్న మానసిక సంఘర్షణ మొదలవుతుంది. అందుకే మనం ఎంత గుప్తంగా కలలు కంటామో, గమ్యాన్ని నిర్ణయించుకుంటామో, అంత గుట్టుగా ప్రచార, పటాటోపాలేవీ లేకుండా ప్రణాళికలు రచించుకుంటూ మన ప్రయత్నాల్ని కొనసాగిస్తూ ఉండాలి; అప్పుడు బాహ్యాపరమైన ఒత్తిళ్ళు తగ్గుతాయి. మన బాధ్యతల్ని మోస్తున్న అయినవారితో, మనం జవాబుదారీగా మసలు కోవలసిన వారితో, సంబంధిత రంగాల్లో అనుభవం ఉన్నవారితో తప్పా ఇతరులతో మన లక్ష్యాల గురించి చర్చించాల్సిన అవసరం లేదు. చెట్టుపై పక్షి ఎంత నిశ్శబ్దంగా, నిబ్బరంగా ఒక్కొక్క పుల్లను ఏర్చికూర్చి పేర్చుకొని ఎలా పదిలంగా గూడు కట్టుకుంటుంది! అలా మనం కూడా అంత పొందికగా కర్తవ్యనిష్ఠతో ముందుకుసాగి మనవి పగటి కలలు కాదని, పసిడికలలని నిరూపించుకోవాలి. ❖

మనస్సు పెడితే మంచి ముహూర్తమే !

ఓ వ్యక్తి ఏదేదో సాధించాలనీ, గొప్పవాడిని కావాలనీ ఎప్పుడూ కలలు కంటూ ఉండేవాడు; కానీ ప్రయత్నానికి వచ్చే సరికి మాత్రం 'ముహూర్తం బాగాలేదు, నా జాతకం బాగోలేదు, నాకు గ్రహాలు అను కూలించడం లేద'ని ఏదో ఒక సాకుతో తప్పించుకుంటూ ఉండేవాడు.

అతను ఒకరోజు షేక్స్పియర్ రచించిన జూలియస్ సీజర్ నాటకం చూడడానికి వెళ్ళాడు. అందులో 'మన కలల్ని, మన ఆశయాల్ని మనం నిజం చేసుకోకుండా మన సమయం సరిగ్గా లేదని, మన గ్రహాలు గతి తప్పాయని సాకులు చెప్పడం మన అవివేకం, అసమర్థత' అన్న రచయిత మాటలు అతన్ని ఆలోచింప చేశాయి. నిజమే కదా! అనుకొని సందేహ నివృత్తి కోసం వెంటనే తాను దుర్ముహూర్తం అని ఇన్నాళ్ళూ భావించుకుంటున్న ఓ రోజునే ప్రయాణాన్ని ప్రారంభించాడు; ధైర్యంతో ఇల్లు కదిలాడు; దిగ్విజయంగా కార్యసాధకుడై తిరిగివచ్చాడు. ఇన్నాళ్ళూ అంతః ప్రేరణ లేకుండా పగటికలలతో పొద్దు పుచ్చుకుంటూ ఎంత కాలాన్ని వృథాచేసుకున్నాడో అర్థం చేసుకున్నాడు.

ప్రతివారూ తమ శక్తికొలది పాటుపడనిచో, ఏ కార్యమైనా సాధించగలరా? కార్యశూరుణ్ణి విజయలక్ష్మి వరిస్తుంది. వెనుకకు చూడనవసరం లేదు. ధైర్యం, సహనం ఇవే మనకు ఆవశ్యకాలు. - స్వామి వివేకానంద

కలతలు మరచి కలసిన మనసులు



జస్టిస్ ముఖర్జీ తన కార్యాలయంలో విడాకుల కోసం వచ్చిన ఆ యువదంపతుల వాదనలన్నీ ఓపిగ్గా వింటూ, మధ్యమధ్యలో, బల్లపై ఉన్న శ్రీశారదామాత ఛాయాచిత్రాన్ని చూస్తూ ఉన్నారు. సుశీల, రాఘవలకు వివాహమై సంవత్సరం కూడా గడవలేదు. అప్పుడే విడాకులకు సిద్ధపడటం ముఖర్జీకి ఆశ్చర్యంగా ఉంది. పైగా వారిది ప్రేమవివాహం; ఇద్దరూ ఎం.బి.ఎ. చదువుకొని, మంచి ఉద్యోగాలు కూడా చేసుకుంటున్నారు. ఇద్దరి మధ్య సయోధ్య కుదర్చాలని ప్రయత్నిస్తూ జస్టిస్ ముఖర్జీ 'మీకు విడాకులు మంజూరు చేయడం సులువే కానీ...' అంటూండగానే, 'వద్దు సార్! దయచేసి ఇంకా మీరేమీ ఒప్పించే ప్రయత్నాలు చేయవద్దు! భర్త అన్న గౌరవం కూడా లేకుండా, మాటలతో, చేతలతో నిత్యమూ అవమానాల పాల్జేస్తున్న, ఈ అహంకారిని భరించే ఓపిక నాకు లేదు' అన్నాడు రాఘవ. 'సార్! ఇతనికి భార్యగా ఉండడమే పెద్ద అవమానం. నేనూ ఇక కలసి ఉండే ప్రసక్తే లేదు!' అన్నది సుశీల.

ఆధునిక తరానికి ప్రతినిధులుగా సుశీల, రాఘవలను చూస్తుంటే ముఖర్జీకి ఓ వైపు ఆశ్చర్యం, మరోవైపు ఆందోళన కలుగుతున్నాయి. 'నేనూ అతనిలాగే చదువుకొని ఉద్యోగం చేస్తున్నాను; మరి తనకు దాసిలా వండిపెట్టాల్సిన, సేవలు చేయాల్సిన అవసరం నాకేంటి?' అన్నది సుశీల వాదన. 'ఎంత చదువుకొని ఉద్యోగం చేసినా, భార్య భార్యే! భర్తకు ఆ మాత్రం సేవ చేస్తే తప్పేముంది? తనేమైనా తక్కువైపోతుందా? ఎందుకంత అహంకారం?' అని రాఘవ పంతం. వీరి మధ్య ఏకాభిప్రాయాన్ని కుదర్చటం మానవమాత్రులకు సాధ్యం కాదని న్యాయమూర్తికి అర్థమైంది. అందుకే ఆఖరి ప్రయత్నంగా ఆయన యువజంట ముందు ఓ ప్రతిపాదన పెడుతూ 'ఇంతగా పట్టుపడుతున్నారు; కనుక మీకు త్వరలో విడాకులు మంజూరు చేస్తాను. కానీ ఓ చిన్న షరతు...' అన్నారు. 'విడాకులు మంజూరు చేస్తామంటే ఏం చేయమన్నా చేస్తాం!' అన్నారు సుశీల, రాఘవలు. అప్పుడు జస్టిస్ ముఖర్జీ 'నేను చెప్పిన చోటుకి మీరు జంటగా వెళ్ళి మూడు రోజులు గడిపి వస్తే, వెంటనే విడాకులు మంజూరు చేస్తాను' అన్నారు. వెంటనే ఇద్దరూ అంగీకరించారు.

జంటగా జయరాంబాటీకి....: శ్రీశారదామాత భక్తుడైన ముఖర్జీ సుశీల,రాఘవలను మూడు రోజులు జయరాంబాటీకి పంపాలనుకున్నారు. శారదామాత జన్మించిన ఆ పుణ్యస్థలిని సందర్శిస్తే వాళ్ళ మనస్సు మారుతుందన్న విశ్వాసంతో న్యాయమూర్తి వారిని అక్కడికి పంపాలనుకున్నారు. జయరాంబాటీలో వారికి వేర్వేరు వసతి ఏర్పాట్లు చేశారు. అయిష్టంగానైనా సుశీల, రాఘవలు జయరాంబాటీకి బయలుదేరారు. కోల్‌కతా నుంచి దాదాపు అరవై కి.మీ. ప్రయాణించి ఎట్టకేలకు అక్కడికి చేరుకున్నారు. అన్నేళ్ళు కోల్‌కతా నగరజీవనంలో ఉరుకులు పరుగుల మధ్య గడిపిన సుశీల, రాఘవలకు జయరాంబాటీ ఓ వనవాసంలా తోచింది. ఇప్పటికీ కుగ్రామపు ఛాయలు మిగిలివున్న అక్కడ ఓ సాధారణ గ్రామీణ మహిళలా కనిపిస్తున్న ఆమెకు మందిరం, పూజలు, ఎందరో దేశవిదేశీ భక్తుల ఆరాధనలను చూసి ఇద్దరికీ ఆశ్చర్యమనిపించింది. ఆశ్రమవాతావరణాన్ని తలపిస్తున్న ఇక్కడికి ముఖర్జీగారు ఎందుకు తమను పంపారో వారికి ఇప్పటికీ అర్థం కావడం లేదు. ఆ నిశ్శబ్ద, నీరవ వాతావరణం, పచ్చగా కళకళలాడుతున్న పంటచేలు, స్వచ్ఛమైన గాలి, ఎదిగిన బంగాళదుంపల తోటలు ఆహ్లాదంగా ఉన్నా, చప్పుడు చేయని చరవాణి(సెల్‌ఫోన్), పరిచయం లేని వ్యక్తులు, పేరుకు ఇద్దరు వచ్చినా ఒకరితో ఒకరు మాట్లాడుకోలేని పంతాలు సుశీల, రాఘవలకు మొదట్లో కాస్త ఇబ్బందిగా అనిపించింది. అలా, అలా మధ్యాహ్నం వరకు పరిసరాలన్నీ తిరిగివచ్చి భోజనం చేసి విశ్రమించారు.

సేదతీర్చిన శక్తితరంగాలు... : సాయంత్రం ఆలయగంటలు మోగాయి. రాఘవ మెల్లగా మందిరంలోకి అడుగుపెట్టాడు. అప్పటికే అక్కడికి సుశీల వచ్చి కూర్చుంది. ఇద్దరి మధ్య ఇంకా పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే పరిస్థితే! ఎడముఖం, పెడముఖంగానే హారతి తీసుకున్నారు. కొంత సేపటికి ఓ యువసన్న్యాసి రెండు నిమిషాలు ధ్యానం చేసుకొని, ఆ తరువాత తమ అభిభాషణంను ఆరంభించారు. 'ఆ భగవంతుడిని మరచిపోవడమే మన కష్టాలన్నింటికీ మూలకారణం. అయితే మనలోని అహంకారమే



జయరాంబాటీలోని శ్రీశారదాదేవి మందిరం

ఆయనను మరచిపోయేలా చేస్తుంది. చివరకు ఈ అహంభావం దేవుడినే కాదు చివరకు మన దగ్గరి వారిని కూడా మన నుంచి దూరం చేస్తుంది..' అంటూ వారి ప్రసంగం సాగిపోయింది. ఆ మాటలు సుశీల గుండెకు సూటిగా తగిలినట్లనిపించాయి. శ్రీశారదామాత జీవితాన్ని పరిచయం చేస్తూ, సహనం, సర్దుబాటు, నిరాడంబరత తదితర అంశాలపై ఆసక్తికరంగా ఆ స్వామీజీ మాట్లాడారు. మొదట్లో రాఘవకు కాస్త విసుగ్గా అనిపించి, ఆవలించినా, 'అహంకారం' అన్న పదం ఎక్కడో ఆయన మనస్సును తట్టినట్లనిపించసాగింది. ఇద్దరిలో ఎక్కడో చిన్న చిన్న ఆలోచనలతో కూడిన అలజడి మొదలైంది. అదే మానసికస్థితితో రాత్రి ఎవరి గదిలోకి వాళ్ళు వెళ్ళిపోయారు.

మర్నాడు ఉదయం తెల్లవారుఝామునే సుశీల శారదామాత మందిరంలో కూర్చుని కళ్ళుమూసుకుంది. మొట్టమొదటి సారిగా ధ్యానం చేసే ప్రయత్నం చేసింది. మనస్సులో అసంఖ్యాకమైన ఆలోచనలు, సంఘటనలు ముప్పిరిగొన్నాయి. రాఘవతో పరిచయం, వివాహం, కలహాలు, తల్లితండ్రుల కలత, మిత్రులు, న్యాయవాదుల మాటలు, నలుగురి దెప్పిపొడుపులు ఒక్కసారిగా చలనచిత్రంలో దృశ్యాలుగా కళ్ళముందు కదిలాయి. ఎక్కడో చిన్న బాధ, భయం! వెంటనే, అప్పటి వరకు ఆలయంలో చూస్తూ ఉన్న శ్రీశారదామాత విగ్రహం తలపులోకి వచ్చింది. అనుకోకుండా 'అమ్మా! మనశ్శాంతి నివ్వు! సరైన దారి చూపు' అన్న మాటలు సుశీల నోటి నుంచి వచ్చాయి. అక్కడ ఏవో శక్తితరంగాలు ప్రసరిస్తున్నట్లు అనిపించాయి.

రాఘవ ఏమీ తోచక ఆలయం ప్రాంగణంలో అలా అటూఇటూ తిరుగుతూ ఉన్నాడు. ఆ రోజు శనివారం! భక్తుల రద్దీ ఎక్కువగా ఉంది. ఎదురుగా కనిపిస్తున్న రాఘవతో ఓ స్వామీజీ 'నేడు భక్తులు ఎక్కువగా వస్తారు. దయచేసి మాకు వడ్డనలో సాయం చేయగలరా?' అని అడిగారు. ఏ పనీ తోచక పిచ్చెక్కినట్లున్న రాఘవ, వెంటనే అంగీకరించాడు. ఎంతో ఇష్టంగా, ఓపిగ్గా వడ్డన చేస్తూ ఉన్నాడు. పంక్తిలో కూర్చున్న సుశీలకు కూడా వడ్డించాడు. ఇద్దరికీ ఆ సందర్భం కొత్తగా అనిపిస్తూ ఉంది.

మనసులు మారిన తీరిదీ... : సాయంత్రం జయరాంబాటీలో అలా వాహ్యాళిగా నడుస్తూ సుశీల, రాఘవలు ఒకరికొకరు ఎదురుపడ్డారు. సుశీల వైపు సూటిగా చూడకుండా 'అంతా సౌకర్యంగా ఉందా?' అని అడిగాడు రాఘవ. 'ఊ..' అంటూ నేలచూపులు చూస్తూ సుశీల సమాధానం చెప్పింది. ఇద్దరి మనస్సుల్లో ఎక్కడో చిన్న మార్పు! ఆ రాత్రి ఆ ప్రాంగణంలో శ్రీశారదామాత చిత్రపటం ఒకటి సుశీల కంటపడింది. ఆ చిత్రపటం కింద 'ప్రభూ! చంద్రునిలో కూడా కళంకం ఉంది! కానీ నా మనస్సులో ఆ కళంకం కూడా లేకుండా చేయి!' అని రాసి ఉంది. ఆ మాటల్ని చిన్న కాగితంపై రాసుకొని ఒకటికి నాలుగుసార్లు చదువుకుంది సుశీల. అక్కడ రాఘవ వడ్డనలో పాల్గొనేందుకు మరోసారి స్వామీజీ అనుమతి తీసుకున్నాడు. చరవాణి, అంతర్జాలం తదితరమైనవేవీ లేకుండా మనస్సు తేటగా ఉంది. అందులో భార్య ముఖం తళుక్కుమంది. 'సుశీల పిచ్చిది! ఒంటరిగా ఏం చేస్తుందో ఏమో!' అనుకుంటూ రాఘవ సాయంత్రం అలా నడుస్తూ ఆమె కోసం ఎదురుచూశాడు.

అదే వారి పరీక్షకు చివరి రోజు. ఉదయం సుశీల, రాఘవ ఒకరికొకరు తారసపడ్డారు. 'అలా ఊళ్ళోకి వెళదామా?' అని రాఘవను చొరవగా అడిగింది. 'పదా!' అనుకుంటూ రాఘవ, సుశీల జయరాంబాటీ ఊళ్ళోకి బయలు దేరారు. 'ఈ ప్రాంతంలో ఏదో శక్తి ఉంది. లేకపోతే ఇంతమంది ఎందుకు వచ్చి, సేదదీరుతారు! నా వరకు నాకు ఏదో కొత్త లోకంలోకి వచ్చినట్లనిపిస్తోంది' అన్నాడు రాఘవ. ఇంతలో సుశీల నెమ్మదిగా 'నిన్న రాత్రి శారదామాత సందేశాన్ని చదివాను. అందులో మనిద్దరికీ సరిపోయే సందేశం ఉంది. మొదటిరోజు స్వామీజీ ప్రసంగంలో కూడా 'అహంకారం' గురించి ప్రస్తావించారు. ఎందుకో సరిగ్గా మనమూ అదే పరిస్థితిలో ఉన్నామనిపిస్తోంది. మనం జీవితాన్ని సరిగ్గా అర్థం చేసుకోలేకపోతున్నామనిపిస్తోంది రాఘవ. నన్ను క్షమించు! నేను ఎంతో దురుసుగా ప్రవర్తించాను. మన విషయంలో తప్పంతా నాదేననిపిస్తోంది' అంది. 'లేదు సుశీలా! నాలాంటి అహంభావితో ఎవరికైనా అలాగే ప్రవర్తించాల నిపిస్తుంది. తప్పంతా నాదే! నన్ను మన్నించు' అన్నాడు రాఘవ. ఇద్దరి ముఖాల్లో పశ్చాత్తాపం; సుశీల కళ్ళల్లో నీళ్ళు తిరుగుతున్నాయి.

కొన్ని క్షణాలు మౌనం...'నేను ఓ నిర్ణయానికి వచ్చాను' అంటూ తన అభిప్రాయాన్ని తెలియజేశాడు రాఘవ. అయితే 'ముఖర్జీ గారికి ఫోన్ చేసి చెప్పనా?' అంటూ 'అబ్బా నా ఫోన్ సిగ్నల్ లేదు' అంది సుశీల. 'నా ఫోన్ పనిచేస్తుందేమో చూడు!' అంటూ సుశీలకు తన ఫోన్ ఇచ్చాడు. వెంటనే ఆమె జస్టిస్ ముఖర్జీకి రింగ్ చేసి 'నమస్కారం సార్!' అంది. 'ఏమిటి! సుశీలా! ఇది రాఘవ నంబరు కదా?' అన్నారు. 'కాదు సార్! ఇప్పుడిది మా ఇద్దరి నంబరు' అంది సుశీల. ముఖర్జీగారి మనసు కుదుటపడింది. ఆనందంతో శ్రీశారదామాత పాదాల ముందు అంజలి ఘటించారు. ❖ **సేకరణ: డాక్టర్ కమల జయరావు**

భగవంతుడే సమస్తానికీ కర్త అన్న విషయం మరచిపోయి అహంకారంచేత ఉన్మత్తులవుతున్నారు. భగవంతుణ్ణి ఆధారం చేసుకున్న వారిని ఆయన అన్ని అపాయాల నుండి రక్షిస్తాడు. - *శ్రీశారదాదేవి*



(1884 – 1967)

ముందుకు సాగిపో!

దివ్యజనని శ్రీశారదాదేవి ప్రత్యక్ష శిష్యులైన స్వామి ప్రేమేశానంద (1884-1967) రామకృష్ణ సంఘంలో అత్యున్నత గౌరవాన్నీ, ప్రేమాభిమానాలనూ చూరగొన్న అగ్రశ్రేణి సన్యాసి. ఆయన జీవితం శ్రీరామకృష్ణ - వివేకానందుల ఆశయాలతోనూ, భగవద్గీత సారాంశంతోనూ నిండింది. చాలామంది యువతీ యువకులకూ, గృహస్థులకూ, బ్రహ్మచారులకూ, సన్న్యాసులకూ ఆయన ఎన్నో లేఖలు వ్రాశారు. జీవితంలో అంకితభావం, ఆధ్యాత్మిక, సేవా భావాలను అలవరచుకొనేందుకు ఆ లేఖా పరంపరలు మార్గదర్శకాలయ్యాయి. పాఠకుల ప్రయోజనార్థం విలువైన ఈ లేఖలను 'శ్రీరామకృష్ణ ప్రభ'లో 2009 జూన్ సంచిక నుంచి ధారావాహికంగా ప్రచురిస్తున్నాం.

సార్‌గాఛీ,
7-12-1951

ప్రియమైన వివేక్!*

నువ్వు సంపూర్ణంగా బాగానే ఉన్నానంటావ్! బహుశః నీకు నచ్చనిది ఏదైనా జరిగితే నీ మనస్సు కోపంతో దహించుకుపోతుందనుకుంటాను. అలాంటప్పుడు నీ బాధ వర్ణనాతీతం కదూ! 'వివేక్' అనే పదానికి అర్థం ఏమిటో తెలుసా! చెడు నుండి మంచిని వేరు చేయగలిగిన విచక్షణ జ్ఞానం. అది సాధించి ఆనందంగా ఉండు.

ఈ ప్రపంచంలో రెండు జట్లు ఉన్నాయి. చైతన్యవంతమైన జట్టు, జడత్వం గల జట్టు. ఆ రెండు జట్లు ప్రపంచ మైదానంలో ఫుట్‌బాల్ ఆట ఆడుతున్నాయి. జడత్వం గల జట్టు గెలిచినప్పుడు అన్యాయం, అవినీతి లాంటివి చోటుచేసుకుంటాయి. చైతన్యవంతమైన జట్టు గెలిచినప్పుడు మంచితనం, ఉన్నత భావాలు ఆవిష్కృతమవుతాయి. మతనియమాలు, ప్రభుత్వచట్టాలు మొదలైనవి జడత్వమున్న వారిని అదుపులో ఉంచి, చైతన్యవంతమైన వారికి స్వేచ్ఛ స్వాతంత్ర్యాలనివ్వడానికే. కొందరు జనులు దుష్టకార్యాల ద్వారానే యోగ్యత పొందవచ్చని భావిస్తారు. ఈ సందర్భాల్లో చైతన్యవంతమైన జట్టు జడత్వమున్న జట్టు చేతిలో ఓటమి పాలవుతుంది. దైవత్వాన్ని రాక్షసత్వం జయించినట్లన్నమాట! అదొక ఆట... అంతే. ఒక వ్యక్తి జీవితంలో ఇవి ఎలా అభివ్యక్తమవుతాయో ఒక జాతి లేక దేశం విషయంలో కూడా అవే ప్రతిబింబిస్తాయి. జడత్వం పాశ్చాత్యదేశాల్లో రజోగుణ ప్రధానంగా అధికారం సాధిస్తుంది. ఇక్కడ మనదేశంలో అది తమోగుణ ప్రధానంగా జాతిని పీడిస్తుంది.

బ్రహ్మమే ఈ ప్రపంచ రూపంలో వేషధారణ చేసింది. యోగులు, ఋషులు, శ్రీరామకృష్ణులు, స్వామీజీ వంటివారు, మరికొందరు ఈ ప్రపంచం చైతన్యమయమని అనుభవానికి తెచ్చుకున్నారు. శరీర దృష్టితో చూసినప్పుడు అది ప్రస్తుత రూపంలోనే కనిపిస్తుంది. శరీరభావం నుండి వేరై జ్ఞాన చక్షువులతో చూసినప్పుడు ప్రపంచం బ్రహ్మమయమని తెలుస్తుంది. శివుడు, కాళి నుదుటన ఉన్న మూడవ కన్ను 'జ్ఞాననేత్రమే'. స్వామీజీ తాను జ్ఞాననేత్రంతోనే ప్రపంచాన్ని చూడాలని భావించారు. కానీ గురుదేవులు ఆ దృష్టిని బంధించి, మానవ మాత్రమైన చర్మచక్షువులతోనే ప్రపంచాన్ని చూడమని ఒత్తిడి చేశారు. మహాత్ములు ఈ ప్రపంచంలోని దారుణాల్ని తమ చర్మచక్షువులతో చూసినప్పుడు వారిలో దయ పెల్లుబికి మానవజాతికి ఉపకారం చేస్తారు, మంచిని బోధిస్తారు.

స్వామీజీ 'రాజయోగం' పుస్తకంలోని ముందుమాట చదువు.

ఈ ప్రపంచం నచ్చనివాళ్ళు దాని పట్ల ఉదాసీనంగా ఉండాలి. ఈ ప్రపంచాన్ని ప్రేమించేవారు దాని హీనస్థితిని కూడా భరించాలి. నా మాటలు అర్థమయ్యాయని భావిస్తాను.

నాయనా వివేక్! ఈ ప్రపంచగతి ఒక దీర్ఘయానం. ఎంత కాలం సాగుతుందో తెలియదు. ఇప్పటి వరకు నువ్వు చూసింది ఏపాటి? ఒక జీవిత కాలంలో ఇంకా ఎంత చూడాలో గదా! హే భగవాన్! దీనికి ఏమైనా అంతు ఉందా?

ప్రేమాశీస్సులతో
స్వామి ప్రేమేశానంద

తెలుగు సేత: కె. త్రివిక్రమరావు


(*వివేకానంద చౌదరి – ప్రస్తుత రామకృష్ణ సంఘ ఉపాధ్యక్షుల్లో ఒకరైన స్వామి ప్రభానంద మహరాజ్)



స్తబ్ధతే సంసారం

– స్వామి రంగనాథానంద (రామకృష్ణ సంఘ 13వ సర్వాధ్యక్షులు)

సంసారం అన్న పదం వినగానే మనలో చాలామంది మనస్సులో భారమైన భావన తొంగిచూస్తుంది. ఏళ్ళకు ఏళ్ళుగా కొత్తదనం లేకుండా, యాంత్రికమైన, రసహీనమైన జీవితాన్ని గడపడమే 'సంసారం' అన్న భ్రమల్లో ఉన్నాం మనం. కాని భారతీయ సనాతన ధర్మం దీనికి అద్భుతమైన నిర్వచనాన్నిచ్చింది. మనస్సును సాధారణమైన విషయసుఖాలకే పరిమితం చేస్తూ, ఒక దశలో ఇక పరిణామమన్నదే లేకుండా స్తబ్ధంగా మారిపోవడమే సంసారమని అభిప్రాయపడింది. నిజమే! The word *samsara* indicates 'stagnation' at the sensory level. Do not be a *samsari,* means we should not get stagnated. ప్రఖ్యాత పాశ్చాత్య మానసిక వైద్య నిపుణులు కార్ల్ జంగ్ ఈ వ్యాఖ్యానాన్ని మన ధార్మిక సారస్వతంలో చదివి అబ్బురపడి, దానిని తన 'మోడర్న్ మ్యాన్ ఇన్ సర్చ్ ఆఫ్ ఎ సోల్' అనే పుస్తకంలో ప్రస్తావించారు.



బ్రతుకును సాధారణ సుఖాలకు, ఇంద్రియవాంఛలకు పరిమతం చేయటం వలననే ఒక స్థాయికి వచ్చాక ఏదో వెలితి, స్తబ్ధత తొంగిచూస్తున్నాయని, వాటిని కప్పిపుచ్చుకునేందుకు, ఇష్టం లేకపోయినా పరుగులు పెడుతున్నారని కార్ల్ జంగ్ అభిప్రాయపడ్డారు. అయితే మనస్సులో మాత్రం స్మశాన నిశ్శబ్దం లాంటి స్తబ్ధత పేరుకుపోయిందన్నారు. మనలో అశాంతికి, అలజడికి ప్రధాన కారణం ఈ స్తబ్ధతేనని తేల్చిచెప్పారు. అయితే బాహ్యంగా చూస్తే ఆధునిక మానవుడు క్షణం తీరిక లేకుండా, నిరంతరం ఏదో ఒక వ్యాపకంలో నిమగ్నమవుతున్నట్లే కనిపిస్తోంది. కానీ ఆ ప్రయాస పూర్తిగా అల్పమైన విషయాలకే పరిమితమైపోతోంది. అందుకే ఎవరి ముఖంలో చూసినా ఏదో అసహనం, అసంతృప్తి! అందుకే ఆ పుస్తకంలో కార్ల్ జంగ్ ఆంతరంగిక వికాసం వైపు దృష్టి సారించినప్పుడే జీవనసాఫల్యం సాధ్యపడుతుందని స్పష్టం చేశారు.

సమప్రాధాన్యంతో సార్థకత : జీవితాన్ని రెండు విభాగాలుగా విభజించుకోవాలని కార్ల్ జంగ్ సూచించారు. ప్రతి వ్యక్తీ తన జీవితాన్ని పూర్వభాగం (forenoon), ఉత్తరభాగం(afternoon)గా విభజించుకొని రెండింటికీ న్యాయం చేయగలిగినప్పుడే సంపూర్ణతను సంతరించు కుంటాడని అభిప్రాయపడ్డారు. చదువు, ఉద్యోగం, సంపాదన, సౌకర్యాల కల్పన, సమాజంలో పేరుప్రతిష్ఠలు తదితరమైనవన్నీ పూర్వభాగం కిందకు వస్తాయి. వీటన్నింటినీ తాత్కాలిక విజయాలుగా చెప్పుకోవచ్చు. అయితే ఇక్కడితోనే జీవితం సంపూర్ణమనుకుంటే, ఇక్కడి వరకే మన ప్రణాళికలు పరిమితమైతే పొరపాటే! ఉత్తరభాగంలో మనిషి తన మార్గాన్ని మార్చుకోవాలి. పూర్వభాగంలోని ఛాయలు అక్కడ పడకుండా జాగ్రత్తపడుతూ, పరిణతితో ప్రవర్తించాలి. ఒక్కో దశలో ఎదురైన అనుభవాలతో, నేర్చుకున్న పాఠాలతో ముందున్న కాలాన్ని ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలి. అయితే అలాంటి ప్రయత్నాలు ఏవీ చేసుకోకపోవటం వలననే ఆధునిక మానవుడి జీవనం ఓ దశ నుంచి దుర్భరమవుతూ వస్తోంది. ఎన్నాళ్ళయినా ఒత్తిళ్ళకు, అలజడులకు అంతే లేదనిపిస్తోంది.

ఇదే భావనను కార్ల్ జంగ్ ఇలా వ్యక్తం చేశారు: ...Frustration comes when we do not continue our progress in life and get stagnant at a particular level.

పూర్వభాగంలోని జీవనశైలి, ప్రాధాన్యాలే ఉత్తరభాగానికీ కొనసాగిస్తూ ఉండటం వలన చాలామంది తమ హుందాతనాన్ని కూడా కోల్పోతున్నారు. ప్రశాంతంగా జీవనసంధ్యను సమాప్తం చేసుకోలేకపోతున్నారు. ఇదేనా జీవితం? అని ఎవరికి వారే ప్రశ్నించుకోవాలి. జగద్గురువులు ఆదిశంకరాచార్యుల మాటల్లో చెప్పాలంటే 'తతః కిమ్.... తతః కిమ్!... తరువాత ఏంటి? తరువాత ఏంటి? అని ఆత్మావలోకనంతో ముందుకుసాగిపోవాలి. అదే అసలైన విజయవంతమైన జీవితం. ❖ సేకరణ: ఆర్. కృష్ణ

ఏ తాపత్రయం లేకుండా ఉండడం మనిషికి సాధ్యం కాదు. సంరక్షించడానికి కుటుంబం లేని వ్యక్తి ఏ పిల్లినో, కుక్కనో, పక్షినో సాకుతూ వాటితో బంధం పెంచుకుంటాడు. - *భగవాన్ శ్రీరామకృష్ణులు*

(...15వ పేజీ తరువాయి)

అలాంటి గుణనిధికి వరాలు గుప్పించిన నారసింహుడికి జయజయధ్వానాలు పలుకుతూ... **జయ జయ నృసింహ సర్వేశ భయహర వీర ప్రహ్లాద వరద** అని అన్నమయ్య తన సంకీర్తనకు శ్రీకారం చుడుతున్నాడు.

మృగనరవేష...

తేటతెలుగు నుడికారానికి పట్టం కట్టి, పల్లకీలు పట్టి పదాల పారిజాతాలు పూయించడమే కాదు, సారస్వత సవ్యసాచిలా సంస్కృతానికీ సమప్రాధాన్యాన్నిచ్చి ఈ పదకవితా పితామహుడు తన ప్రతిభను చాటుకున్నాడు. నారసింహుడి ఆవిర్భావానికి సంబంధించిన కీర్తనల్లో చాలా వరకు గంభీరమైన గీర్వాణ భాషనే ప్రయోగించాడు. అదే పరంపరలో ఇక్కడ....

మిహిర శశినయన మృగనరవేష, బహిరంతస్థల పరిపూర్ణ
అహినాయక సింహాసనరాజిత,బహుళ గుణగణ ప్రహ్లాదవరద

'సూర్యచంద్రులే నేత్రాలుగా, మృగనరవేషంతో బహిరంతస్థల పరిపూర్ణుడిగా ఆదిశేషుడినే సింహాసనంగా చేసుకొని అధిష్ఠితుడైన ఆ ప్రహ్లాద వరదుడికి జయమగుగాక!' అని నృసింహమూర్తిని మనోహరంగా కళ్ళ ముందు ఆవిష్కరింపచేస్తున్నాడు అన్నమయ్య. 'అహినాయక సింహాసన' అంటే ఏడు పడగల ఆదిశేషుని సింహాసనంగా కలవాడని అర్థం. ఇదే రీతిలో

కవి శేషప్ప కూడా తన 'నృసింహ శతకం'లో నరసింహావ తారాన్ని బహుధా ప్రశంసిస్తూ...

స్తంభమందుదయించి దానవేంద్రుని త్రుంచి
కరుణతో ప్రహ్లాదు గాచినావు!
మకరిచే చిక్కి సామజము దుఃఖింపగ
కృపయుంచి వేగ రక్షించినావు
శరణంచు నవ్విభీషణుడు నీ చాటున
వచ్చినప్పుడె లంకనిచ్చినావు
ఆ కుచేలుడు చేరి అటుకులర్పించిన
బహుసంపదలిచ్చి పంపినావు

వారి వలె నన్ను పోషింప వశము గాదె
యింత వలపక్ష మేల? శ్రీకాంత! నీకు
భూషణ వికాస! శ్రీధర్మపుర నివాస!
దుష్టసంహార! నరసింహ! దురితదూర!.. 'నరసింహా! స్తంభమందు వెలసి రాక్షసరాజైన హిరణ్యకశిపుడిని సంహరించి, చిన్నారి ప్రహ్లాదుడిని రక్షించావు. అంత పెద్ద ఏనుగు మొసలి నోట చిక్కి వేదనతో రోదిస్తున్నప్పుడు వేగమే పోయి దాని బాధను పోగొట్టి ఆదుకున్నావు. ఆ కుచేలుడు గుప్పెడు అటుకులు తీసుకువస్తే ఆ అల్పమైన వాటిని తీసుకొని అతనికి వెలలేని ఐశ్వర్య సంపదలిచ్చి సాగనంపావు. అలాంటివాడను నేను కాదా! నన్ను కాపాడుకోలేవా?' అని చనువుతో ప్రశ్నిస్తాడు.



వనితా సంశ్రిత వామాంక...

మౌని ప్రణుత...

అన్నమయ్య మొదట అద్వైతి. ఆ తరువాత విశిష్టాద్వైతిగా మారాడు. ఎంత మారినా ఆయన పదాల్లో అద్వైత భావనలు ప్రస్ఫుటమవుతూ ఉండేవి. ఆయన పదాల్లో శివకేశవులు దర్శనమిస్తూ ఉండేవారు. అద్వైతులు నరసింహమూర్తిని కూడా **'ఆకంఠం విష్ణురూపాయ అత ఊర్ధ్వం శివరూపిణే'** అని భావిస్తారు. అందుకే అన్నమాచార్యులు ఈ కీర్తనలో నృసింహస్వామిని అనంత తన్మయత్వంతో కీర్తిస్తూ....

చటుల పరాక్రమ సమరఘన విరహిత నిటలనేత్ర మౌనిప్రణుత
కుటిల దైత్యతతి కుక్షి విచారణ పటు వజ్రనఖ ప్రహ్లాద వరద

అంటున్నారు. 'చటుల' అంటే తీవ్రమైన, 'నిటలనేత్ర' అంటే నిటలాక్షుడైన పరమేశ్వరుడు; కుక్షి అంటే ఉదరం. విశేషమైన పరాక్రమంతో వజ్రాయుధాల్లాంటి గోళ్ళతో కుటిలుడైన హిరణ్యకశిపుడి ఉదరాన్ని చీల్చి మునులతో ప్రణతులందుకున్న వాడిగా కీర్తిస్తూ ఆ నరసింహుడిలో ఆ త్రినేత్రుడైన పరమశివుడిని కూడా అన్నమయ్య దర్శించుకున్నాడు.

శ్రీవేంకటగిరి నివాస...

జగద్గురువులు ఆది శంకరాచార్యులు వివిధ దేవతా స్తుతులలో భాగంగా నరసింహమూర్తిని కరావలంబ స్తోత్రంలో వేనోళ్ళ కీర్తిస్తూ...

ఏకేన చక్ర మపరేణ కరేణ శంఖ
మన్యేన సింధుతనయా మవలంబ్యతిష్ఠన్
వామేతరేణ వరదాభయ పద్మచిహ్నం
లక్ష్మీనృసింహ! మమదేహి! కరావలంబమ్!

'ఒక చేతిలో చక్రాన్నీ, మరొక చేతిలో శంఖాన్నీ ధరించి, వామభాగంలో క్షీరసాగర పుత్రిక అయిన మహాలక్ష్మిని చేపట్టి వరదాభయ పద్మచిహ్నాలను ధరించి లోకానుగ్రహం చేస్తున్న ఓ లక్ష్మీనరసింహా! నీవు చేయూతనిచ్చి నన్ను రక్షించు'అని వేడుకుంటాడు.

అదే ఆర్తితో ఈ వేంకటేశ్వరుడి ప్రియభక్తుడు కూడా స్వామివారిని అభివర్ణిస్తూ...

వనితా సంశ్రిత వామాంక భావజకోటి ప్రతిమాన
శ్రీవేంకటగిరి శిఖర నివాస పావనచరిత ప్రహ్లాద వరద...

'శ్రీలక్ష్మిని వామాంకంపై ఆసీనురాలిని చేసుకొని, కోటిమన్మథు(భావజు)ల సమానుడై శ్రీవేంకట శిఖరాలపై కొలువు తీరాడ'ని ముక్తాయింపు పలుకుతున్నాడు. ❖

(మే 12వ తేదీ, సోమవారం - నృసింహ జయంతి)



బంధముక్తికి యుక్తి!

ఒకప్పుడు ఒక మహారాజు వద్ద తెలివైన మంత్రి ఉండేవాడు. ఎందుచేతనో అతడు రాజు ఆగ్రహానికి గురయ్యాడు. అతనికి శిక్షగా రాజు అతడిని చాలా ఎత్తైన ఒంటి స్తంభపు బురుజుపై బంధింపజేశాడు. ఆ మంత్రి అక్కడే ఆకలితో అలమటించి చనిపోవాలని రాజు ఉద్దేశం.

ఆ మంత్రి భార్య చాలా విశ్వాసపాత్రురాలు. రాత్రి అయ్యాక ఆమె ఆ ఒంటి స్తంభపు బురుజు వద్దకు వచ్చి భర్తను కేకవేసి తాను ఆయనకు ఎలా సహాయపడాలో అడిగింది. దానికి సమాధానంగా ఆ మంత్రి ఆమెను ఒక లావుపాటి త్రాడు, మరొక సన్నని త్రాడు, మందపాటి దారం, మరొక పట్టు దారం, ఒక పేడపురుగు, కొద్దిగా తేనెను తీసుకుని మరుసటి రాత్రి రమ్మని చెప్పాడు. అవన్నీ ఎందుకో అర్థం కాక ఆశ్చర్యపోయింది ఆమె. అయినా భర్త ఆజ్ఞను పాటించి మరుసటి రాత్రి అవన్నీ తీసుకొని ఆ స్తంభం వద్దకు వచ్చింది.

అప్పుడు భర్త ఆమెకు సూచనలిచ్చాడు. పట్టు దారాన్ని పేడపురుగుకు కట్టమన్నాడు. కొంచెం తేనెను ఆ పేడపురుగు స్పర్శాంగాలకు రాయమన్నాడు. తర్వాత దాని తల భాగంపైకి ఉండేలా దాన్ని ఒంటి స్తంభపు బురుజువద్ద వదలమన్నాడు. ఆమె భర్త చెప్పినట్లే చేసింది. ఆ పేడపురుగు తన ప్రయాణం సాగించింది, తేనె వాసన వల్ల ఆ తేనె కోసం అది బురుజుపై భాగం వైపుగా ప్రాకసాగింది. పేడపురుగు పైకిచేరగానే ఆ పట్టు దారాన్ని మంత్రి చేజిక్కించుకున్నాడు. మరల భార్యకు సూచన లిచ్చాడు. మందపాటి దారాన్ని ఆ పట్టు దారం రెండో కొసకు కట్టమని చెప్పి, ఆ రెండవదారాన్ని కూడా పైకి లాక్కున్నాడు. తర్వాత వరుసగా మందపాటి దారానికి సన్నని త్రాడును, దాని రెండవ కొసకు లావుపాటి త్రాడును కట్టమని భార్యకు చెప్పి ఒక దాని వెంట ఒకటిగా చివరకు లావుపాటి త్రాడును చేతిలోకి తీసుకున్నాడు. ఆ తర్వాత ఆ లావుపాటి త్రాడు సహాయంతో ఆ ఒంటి స్తంభపు బురుజుపై నుండి క్రిందకు దిగి వచ్చి చెర నుండి విడుదల అయ్యాడు.

అదే విధంగా ఈ కథలోని అంశాన్ని మన శరీరానికి అన్వయించుకుంటే, మనం నిత్యం సలిపే శ్వాసక్రియ 'పట్టు దారం'. దాన్ని మనం స్వాధీనంలోకి తెచ్చుకుంటే మందపాటి దారం లాంటి నాడీచలనాలనూ, సన్నని త్రాడులాంటి మన ఆలోచనలనూ, చివరకు లావుపాటి త్రాడులాంటి మన ప్రాణ శక్తినీ అదుపులోకి తెచ్చుకోగలుగుతాం. అప్పుడు స్వేచ్ఛను (ముక్తిని) పొందుతాం. ❖

ఒక వ్యక్తి నన్ను కలిశాడు. అతడు మందమతి, సోమరి. అతడు 'భగవంతుణ్ణి తెలుసుకోవడానికి ఏం చెయ్యాలి?' అని నన్ను అడిగాడు.

వెంటనే 'నువ్వు ఒక అబద్ధం చెప్పగలవా?' అని తమాషాగా అడిగాను. 'చెప్పలేను' అన్నాడు. 'అయితే ముందు నువ్వు అది నేర్చుకో. మృగప్రాయంగానో, ఒక కొయ్యదుంగ లాగానో పడివుండడం కన్నా ఒక అబద్ధం చెప్పగలగడం మంచిది' అని అన్నాను.


నా ఉద్దేశం ఏమిటంటే ఒక వ్యక్తి సంపూర్ణమైన మౌనిగా తయారవ్వాలంటే ఏవో పనులు చేస్తూ కార్యశీలత కలిగివుండడం అవసరం. అప్పుడే ఆ స్థితిని పొందడం సాధ్యమవుతుంది. ❖ *తెలుగు సేత: కె. త్రివిక్రమరావు*



ఆత్మనిగ్రహాన్ని పాటించు, ప్రాణాన్ని నియంత్రించు. నిత్యానిత్య విచారం చేయి. భగవన్నామాన్ని స్మరించు. ఈ నియమాలను ప్రాణాలొడ్డైనా పాటించిన వారికి ముక్తి కరతలామలకం. - *ఆదిశంకరాచార్యులు*

- స్వామి పరిజ్ఞేయానంద

జీవన సౌధానికి పునాది



మనమంతా కోరుకునేది విషాదం (దుఃఖం)లేని జీవితాన్ని. కష్టాలను అనుభవించినవాని జీవితం మొదట విషమయంగా ఉంటుంది. కానీ ఆ తరువాత ఆనందమయంగా పరిణమిస్తుంది. నిజానికి విషాదసరోవరాన్ని దాటినవారే ఆనందోద్యానాన్ని చేరుకోగలరని మనకు తెలిసినప్పటికీ అలాంటి విషాదమయ జీవితాన్ని ఎవ్వరమూ అంగీకరించం.

మట్టిలో నుండి వచ్చిన మాణిక్యం ప్రకాశమానంగా కనిపిస్తుంది; బురదలో నుండి పుట్టిన పద్మం నిర్మలంగా కనువిందు చేస్తుంది; పుటం పెట్టిన బంగారం తళుకులీను తుంది; ఉలిదెబ్బలు తిన్న శిల్పం పూజలందుకుంటుంది.

హాలాహలాన్ని ఆరగించిన మహాదేవుడు అమరేశ్వరు డయ్యాడు. రాజ్యాన్ని త్యజించి అరణ్యాలకేగిన అయోధ్యరాముడు పురుషోత్తముడయ్యాడు. మహేశ్వరుడు, మహావిష్ణువు విషాదమనే విషాన్ని ఆరగించినవారే. అందుకే నేటికీ వారి వైభవాన్ని కొనియాడుతున్నాం, వారిని ఆరాధిస్తున్నాం.

ప్రపంచంలో ఏ వ్యక్తి అయినా మహోన్నతుడిగా మన్ననలను అందుకుంటున్నాడంటే ఆ వ్యక్తి విషాదయంత్రంలో బాగా సానబెట్టిన తరువాతే రత్నంలా మారాడన్నది సత్యం. మహనీయుల జీవిత చరిత్రలే అందుకు నిదర్శనం.

మహోన్నతులైనవారిని ఘనంగా కీర్తిస్తాం. అలాంటి స్థితికి చేరుకోవాలని ఆశిస్తాం. కానీ వారు ఆ స్థితికి చేరుకోవడానికి ముందు ఎన్ని బాధలను భరించారు, ఎన్ని దుఃఖాలను దిగమింగారు, ఎన్ని కష్టాలను అనుభవించారనే విషయం గురించి ఆలోచించం. మహాత్ముల వైభవాన్ని చూసి కీర్తించడమే కాదు, ఆ స్థితికి చేరుకోవడానికి వారు అనుభవించిన కష్టాలను కూడా గుర్తుంచుకోవాలి.

Endure cheerfully the trials of life and thus you will convert them into a ladder leading to God. ఉన్నత స్థితికి చేరుకోవాలని ఆశించేవారెవరైనా విషాదాన్ని అమృతంలా సేవించేందుకు సిద్ధమవ్వాలి. కష్టాల కన్నీళ్ళను చిరునవ్వుతో సహించాలి.

ఈ జీవిత సత్యాన్ని విశదపరిచే కథ ఇది: ఓ నదీతీరాన ఒక యువకుడు నిలబడి, నీళ్ళ కోసం కడవ నెత్తిపై పెట్టుకొని వెళుతున్న స్త్రీని చూశాడు. 'ఆహా! ఆ కడవ ఎంత హుందాగా ఆ స్త్రీ నెత్తి మీద కూర్చుంది' అని అనుకొన్నాడు. దగ్గరకు వెళ్ళి ఆ కుండతో 'ఓ కడవోత్తమా! నీవు ఇలా ఈ స్త్రీ తల మీద కూర్చొని దర్జాగా వెళుతున్నావు. నీ పనే బాగుంది' అని అన్నాడు.

అందుకు ఆ కడవ "ఓ యువ మిత్రమా! నేను ఈనాడు ఇలా హాయిగా ఉండడానికి ముందు ఎన్ని కష్టాలు అనుభవించానో తెలుసా? మీ మానవులు మొదట నన్ను గునపాలతో పొడిచి నా తల్లి భూమాత నుండి వేరుచేసినప్పుడు మాతృ వియోగభారంతో ఎంతగానో కుంగి పోయాను. ఆ తరువాత నన్ను పాదాలతో తొక్కుతూ హింసించినప్పుడు ఎంతో సహనం వహించాను. అది సరిపోదన్నట్లు బట్టీలో పెట్టి కాల్చినప్పుడు ఎంత బాధను అనుభవించానో నీకేం తెలుసు? ఆ తరువాత అంగడిలో నన్ను అమ్మకానికి పెట్టినప్పుడు కొనుగోలుదారులతో తిన్న మొట్టికాయలు అన్నీ ఇన్నీ కావు. ఇలా ఎన్నో కష్టాలను అనుభవించబట్టే ఈనాడు ఈ స్థాయికి చేరుకోగలిగాను" అని తన విషాదగాథను వినిపించింది.

'Troubles come to make us but not to break us. - కష్టాలు మన జీవనసౌధ నిర్మాణానికే గాని, వినాశనానికి కాదు' అన్న హితోక్తిని అర్థం చేసుకున్న మహాత్ములు విషాదమనే చీకటి నుంచే ఆనందమనే కాంతి కిరణాలు ఆవిర్భవిస్తాయని నిరూపించారు.

'జీవనసౌధ పటిష్ఠతకు విషాదమే పునాది' అన్న సత్యాన్ని నిరూపించడానికే గీతాసౌధానికి విషాదయోగాన్ని పునాదిగా మలిచాడు శ్రీకృష్ణ భగవానుడు.

ఇంతకీ అర్జునుని విషాదం ఎందు కోసం? ఎవరి కోసం?. మన విషాదం ఎవరి కోసం? దేని కోసం? అర్జునుని విషాదానికీ, మన విషాదానికీ మధ్య వ్యత్యాసమేమిటి? అదేమిటో తెలుసుకోవడానికి వచ్చే సంచిక వరకూ మన బుద్ధికి పదును పెడదాం! ❖



వికాస మంత్రాలు

– స్వామి పార్థసఖానంద



ప్రాచీన భారత దేశంలో విద్యాభ్యాసం అంతా గురుగృహవాసంలోనే జరిగేది. మహాత్ముడైన గురువు సన్నిధిలో శిష్యులు చదువు సంస్కారాలనూ, విద్యాబుద్ధులనూ, సంస్కృతీ సంప్రదాయాలనూ చక్కగా ఒంటబట్టించుకునేవారు. అలాంటి ఓ విద్యార్థే ఈ వివేక్.

విద్యకు పరమార్థం ఉద్యోగం కాదనీ, విద్యకు మూలార్థం వివేకమే అనీ చదువుల్లోని సారాన్ని గ్రహించాడు. అందుకే ఎంతోమంది మహాత్ముల, చరిత్ర ప్రసిద్ధులైన వారి జీవితాలనూ, అనుభవాలనూ ఆపోశన పట్టాడు. వాటిలో మానవ వికాసానికి ఉపకరించే విషయాలను జల్లెడ పట్టి, వాటికి హాస్యాన్నీ, వ్యంగ్యాన్నీ జోడించి, మనతో పంచుకోవడానికి వస్తున్నాడు వివేక్ అనే ఈ బాల బ్రహ్మచారి. అతడి మాటలు మంత్రాల్లా పనిచేసి, మన మనస్సుల్ని వికసింపజేస్తాయి అనడంలో సందేహమే లేదు!

ప్రార్థన ఫలితం

భగవంతుడిని నేను బలాన్ని ప్రసాదించమని ప్రార్థించాను,
కానీ ఆయనేమో నేను అధిగమించేందుకు కష్టాలను ఇచ్చాడు.

భగవంతుడిని నేను వివేకాన్ని ప్రసాదించమని ప్రార్థించాను,
కానీ ఆయనేమో నేను సాధించేందుకు సమస్యల్ని ఇచ్చాడు.


భగవంతుడిని నేను ధైర్యాన్ని ప్రసాదించమని ప్రార్థించాను,
కానీ ఆయనేమో నేను ఎదుర్కొనేందుకు ప్రమాదాల్ని ఇచ్చాడు.

భగవంతుడిని నేను ప్రేమను ప్రసాదించమని ప్రార్థించాను,
కానీ ఆయనేమో సాయం చేయమని నాకు సోదర మానవులను చూపాడు.

భగవంతుడిని నేను దయ చూపమని ప్రార్థించాను,
కానీ ఆయనేమో నేను ఎదిగేందుకు అవకాశాలను ఇచ్చాడు.

భగవంతుడిని నేను సిరి సంపదల కోసం ప్రార్థించాను,
కానీ ఆయనేమో నేను శ్రమించేందుకు శక్తిని ఇచ్చాడు.


నేను కోరినవి ఏవీ నాకు దక్కలేదు,
కానీ నాకు అవసరమైనవన్నీ లభించాయి.




"...మన ప్రార్థనలకు భగవంతుడు మూడు విధాలుగా స్పందించవచ్చు
1) తథాస్తు...
2) వేచివుండు...
3) ఇంత కంటే గొప్పదాన్ని ఇవ్వాలని ఆలోచిస్తున్నాను..."

నందీశ్వరునికి పరమేశ్వరుని వరం


కథ: ఎమ్.భైరవ సుబ్రహ్మణ్యం   **చిత్రాలు: శంకర్**   **అనుసృజన: స్వామి జ్ఞానదానంద**




5 శిలాదుని తపస్సుకు మెచ్చి పరమశివుడు ప్రత్యక్షమయ్యాడు.




6 శిలాదుడు యాగభూమిని నాగలితో దున్నుతున్నప్పుడు ఒక బంగారు పెట్టె బయటపడింది. అప్పుడు పుష్పవృష్టి కురిసింది, వేదఘోష వినిపించింది, దేవదుందుభులు మ్రోగాయి. పెట్టెలో ఆభరణాలు ధరించిన మగశిశువు ఉన్నాడు.




7 జపేశ్వరుని ఏడవ జన్మదినోత్సవం వైభవంగా జరిగింది. శిలాదుని ఆహ్వానం మేరకు మిత్రుడు, వరుణుడు మొదలైన దేవతలు విచ్చేశారు. దేవతలు సంశయంతో అక్కడ నిలబడి ఉండడం శిలాదుడు చూశాడు.




8 అల్పాయువు విషయం పిల్లవాడికి తెలియని రీతిలో తల్లితండ్రులు జపేశ్వరుణ్ణి అల్లారు ముద్దుగా పెంచసాగారు. కానీ ఒక రోజు...




9
శివాలయానికి వెళ్ళి, ఆలయం కోనేరులో మునిగి, జపేశ్వరుడు దీక్షతో పంచాక్షరీ మంత్రాన్ని జపించసాగాడు. జలచరాలు అతణ్ణి చుట్టుముట్టి గాయపరచి రక్తం పీల్చసాగాయి. అయినా మనస్సును శివుని మీదనే ఏకాగ్రం చేసి తపస్సు చేయసాగాడు.
10
ఇలా కొంతకాలం గడిచాక అతడి కఠోర తపస్సుకు సంతసించి శివుడు, ఉమాదేవి సమేతంగా అతడి ఎదుట ప్రత్యక్షమయ్యాడు. అతణ్ణి ఆప్యాయంగా అక్కున చేర్చుకున్నాడు. అంతే! అతడి దేహం బంగారంలా ప్రకాశించసాగింది.
జపేశ్వరా! నా పంచాక్షరీ నామాన్ని చిత్తశుద్ధితో జపించడం వల్ల నువ్వు నా వాడివే అయ్యావు. ఏదైనా వరం కోరుకో!
పరమేశ్వరా! శివతత్త్వపు అంతరార్థాన్ని స్వయంగా మీరే నాకు బోధించండి.
11
మహాశివుడు పంచనదులను రప్పించి, జపేశ్వరుడికి అభిషేకం చేశాడు.
సకల శాస్త్రాల జ్ఞానాన్ని సంతరించుకున్న నువ్వు నేటి నుంచి నందిదేవుడని పేరొందుతావు. మరో వరం కోరుకో నాయనా!
మహేశ్వరా! శివభక్తులు అభిలషించే 16 నామాలను నాకు అనుగ్రహించండి.
అభీష్ట సిద్ధిరస్తు!
12
పరమేశ్వరా! నేను వృషభ రూపంలో మీ వాహనంగా లోకాన్ని చుట్టి రావాలి.
నందీ! నీకు సాటిగా తపస్సు ఒనరించిన వారు ఎవరూ లేరు. నువ్వు నాలాగే నిత్యం ప్రతి ఒక్కరి ఆరాధనలు అందు కుంటావు. ఈ క్షణమే నీకు వృషభ రూపం ప్రాప్తించు గాక!

13 దేవతలారా! ఈ నందీశ్వరుణ్ణి సమస్త గణాలకూ అధిపతిగా నియమించాను. వినాయకుడు, సుబ్రహ్మణ్యుడు లాగా ఇతడూ నాకు కుమారుడే! శివతత్త్వాన్ని బోధించే ఆచార్యుడు ఇతడే!



14 పార్వతీ పరమేశ్వరులు వ్యాఘ్రపాదుని కుమార్తె స్వయంప్రభ అనే కన్యను నందిదేవుని కిచ్చి వివాహం చేశారు. అప్పుడు అప్సరసలు నృత్యం చేశారు, నారదాదులు గానం చేశారు, దేవదుందుభులు మ్రోగాయి.



15 వివాహానంతరం పార్వతీపరమేశ్వరులు నందీశ్వరుణ్ణీ, స్వయంప్రభనూ తోడ్కొని కైలాసానికి తిరిగి వెళ్ళిపోయారు.



ఈ విధంగా కైలాసంలో నందీశ్వరుడు శాశ్వతంగా వసించసాగాడు.



మానవుడు తన భావాలకూ, ఆశయాలకూ అనుగుణంగా ఫలాన్ని పొందుతుంటాడు. భగవంతుడు కల్పతరువు లాంటివాడు. ప్రతి వ్యక్తీ తాను కోరేది భగవంతుడి వల్ల పొందగలడు.

మొదట ఆత్మలాభాన్ని పొందు, తదుపరి ధనం సంపాదించు. ఈ వరుసను తలకిందులు చెయ్యాలని ప్రయత్నించకు. పరమార్థాన్ని పొందాక సంసారంలో మెలగినా నీ మనశ్శాంతికి భంగం వాటిల్లదు.

- భగవాన్ శ్రీరామకృష్ణ పరమహంస



నూతన శ్రీరామకృష్ణ దేవాలయ సంప్రోక్షణం





జైపూర్ (రాజస్థాన్) రామకృష్ణ మిషన్ నూతనంగా నిర్మించిన భగవాన్ శ్రీరామకృష్ణ విశ్వజనీన దేవాలయ ప్రారంభోత్సవాలు 2014 మార్చి 18 నుండి 20 వరకు జరిగాయి.

మార్చి 20వ తేదీ ఉదయం 6.00 గంటలకు ప్రార్థనా మందిరం నుండి నూతన దేవాలయం వరకు స్వామీజీల వేదపఠనం, భజనలు, నృత్యంతో శోభాయాత్ర కొనసాగింది. ఉదయం 7 గంటలకు రామకృష్ణ సంఘ ఉపాధ్యక్షులు శ్రీమత్ స్వామి స్మరణానందజీ మహరాజ్ నూతన దేవాలయ సంప్రోక్షణ గావించారు.




నూతన దేవాలయ ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో స్వామీజీల భజనలు, ప్రసంగాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆద్యంతం అందరినీ అలరించాయి. పూజ్య స్వామి స్మరణానందజీ మహరాజ్, స్వామి వాగీశానందజీ మహరాజ్, స్వామి గౌతమానందజీ మహరాజ్, ఇతర రామకృష్ణ మఠ కేంద్రాల నుండి విచ్చేసిన 240 మంది స్వామీజీలు; వివిధ ప్రాంతాల నుండి 3,000 మంది భక్తులు పాల్గొన్నారు.




మూడు రోజులపాటు జరిగిన ఈ ఉత్సవాల్లో పాల్గొన్న భక్తులు ఆధ్యాత్మిక భావధారలో మునిగి పునీతులయ్యారు. ❖











వార్తావాహిని

విద్యార్థుల వికాసానికి 'వివేకవాహిని'

మచిలీపట్నం, కనిగిరి, మాచర్ల, ఒంగోలు, ఉంగుటూరు, తిరువూరు శ్రీరామకృష్ణ సేవాసమితుల మరియు శ్రేయోభిలాషుల ఆధ్వర్యవంలో విజయవాడ రామకృష్ణ మిషన్ 2013 జూలై నుండి 2014 ఫిబ్రవరి వరకు 'వివేకవాహిని' కార్యక్రమాలను నిర్వహించింది. తూర్పుగోదావరి, కృష్ణా, ప్రకాశం, గుంటూరు, ఖమ్మం జిల్లాల్లోని 156 విద్యాసంస్థల్లో నిర్వహించిన వ్యక్తిత్వవికాస సదస్సుల్లో స్వామి స్వసంవేద్యానంద, స్వామి సేవ్యానంద, స్వామి సన్నివాసానంద పాల్గొని విద్యార్థులకు స్ఫూర్తిదాయక సందేశాలను ఇచ్చారు.

ఈ సదస్సుల్లో సుమారు 41,000 మంది విద్యార్థులు, 1,100 మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు. విద్యార్థులు 60 వేల రూపాయల విలువ చేసే శ్రీరామకృష్ణ - వివేకానంద సాహిత్య గ్రంథాలను కొనుగోలు చేశారు. 1,75,000 రూపాయల



విలువ చేసే స్వామి వివేకానంద సాహిత్యాన్ని విద్యార్థులకు; 26,000 రూపాయల విలువ చేసే స్వామి వివేకానంద చిత్రపటాలను విద్యాసంస్థలకు ఉచితంగా ఇవ్వడం జరిగినది.


ఈ కార్యక్రమాల్లో భాగంగా స్వామి వివేకానంద జీవితంపై క్విజ్ పోటీలు నిర్వహించడం; స్వామి వివేకానంద భావాలను, ఆదర్శాలను బోధించే 'చలనచిత్రం' ప్రదర్శించడం జరిగినది. ❖

నివేదిక: స్వామి సేవ్యానంద

Printed and published by **Swami Jnanadananda** owned by Ramakrishna Math Trust
and printed at Kala Jyothi Process, 1-1-60/5, RTC Cross Roads, Musheerabad, Hyderabad - 500 020
and published at Ramakrishna Math, Domalguda, Hyderabad - 500 029. **Editor: Swami Parijneyananda**

Vol.71-5, Sri Ramakrishna Prabha (Telugu Monthly) May 2014, Regd. with the Registrar of Newspaper for India Under No.1120/57. Postal Registration No. HD-1071/2013-15. Licensed to Post Under WPP : AP/CPMG/HC-13/WPP/2013-14. Date of Publication : 18 April 2014

మహత్తర శక్తి



'భగవంతునిపై విశ్వాసం ఉంటే అద్భుతాలు జరుగుతాయి' అంటూ శ్రీరామకృష్ణులు, హనుమాన్ సింగ్ కథను ఇలా చెప్పారు:

ఒకసారి ఒక ఊరిలో కుస్తీపోటీలు నిర్వహించారు. అందులో హనుమాన్ సింగ్, పంజాబ్ నుండి వచ్చిన మరో వ్యక్తి పాల్గొన్నారు. అతడు హనుమాన్ సింగ్ కన్నా చాలా దృఢంగా ఉన్నాడు. అతడు పోటీకి పదిహేను రోజుల ముందు నుండి పౌష్టికాహారాన్ని తింటూ గంటల కొద్దీ వ్యాయామం చేసేవాడు. హనుమాన్ సింగ్ మాత్రం ఉపవాసం చేస్తూ రాత్రింబవళ్ళూ హనుమంతుణ్ణి ప్రార్థిస్తూ ఉండేవాడు. హనుమాన్ సింగ్ మల్లయుద్ధంలో ఓడిపోతాడని అందరూ అనుకున్నారు. కానీ పదిహేను రోజుల పాటు పౌష్టికాహారాన్ని ఆరగించిన పంజాబీ యువకుడు ఓడిపోయాడు. ఉపవాసం చేస్తూ హనుమంతుణ్ణి జపించిన హనుమాన్ సింగ్ గెలిచాడు. హనుమంతుని పట్ల హనుమాన్ సింగ్‌కు ఉన్న విశ్వాసమే అతణ్ణి గెలిపించింది. విశ్వాసానికి ఉన్న మహత్తర శక్తి అలాంటిది.

ఆధ్యాత్మిక అమృతవాహిని

శ్రీ రామకృష్ణ ప్రభ

జూన్ 2014 ₹10



ప్రకృతి విలాసం...హృదయ వికాసం



సుబోధ

భక్తుడు: సంసారాన్ని త్యజించడం మంచిదేనంటారా?

శ్రీరామకృష్ణులు: సంసార త్యాగం అందరికీ వర్తించదు. భోగతృష్ణ తీరని వారు సంసారాన్ని త్యజించరాదు.

భక్తుడు: 'భోగతృష్ణ' అంటే అర్థం ఏమిటి?

శ్రీరామకృష్ణులు: భోగతృష్ణ అంటే – కామ, కాంచన భోగాలు. ఊరగాయ జాడీలు, నీటి బుంగలు ఉంచిన గదిలో సన్నిపాత (టైఫాయిడ్) రోగిని ఉంచడం ప్రమాదం కదా! సిరిసంపదలు, పేరుప్రతిష్ఠలు, దేహసుఖాలు ఇత్యాది భోగాలను అనుభవించకుండానే, భగవంతుని కోసం వ్యాకులత జనించడం అందరికీ సాధ్యం కాదు.

భక్తుడు: అలాంటప్పుడు సంసార జీవితమే గడపాలా?

శ్రీరామకృష్ణులు: అవును. అనురక్తి రహితంగా విధ్యుక్త కర్తవ్యాలను నిర్వర్తించాలి – నూనె రాసుకొని పనస తొనలను ఒలిస్తే చేతికి జిగట అంటుకోని రీతిలో. ధనవంతుడి ఇంట్లో దాసి తన పనులన్నీ నిర్వర్తిస్తుంది; కానీ ఆమె మనస్సు గ్రామంలోని తన కుటుంబం మీదే ఉంటుంది. అనురక్తి రహితంగా కర్తవ్యాలను నిర్వర్తించడానికి ఇదొక ఉదాహరణ. ఇదే మానసిక పరిత్యాగం. గృహస్థులు సంసారాన్ని మానసికంగా పరిత్యజించాలి. కానీ సన్న్యాసి బాహ్యంగానూ, ఆంతరంగికంగానూ త్యజించాలి.

భక్తుడు: అయితే స్త్రీలు చెడ్డవారా?

శ్రీరామకృష్ణులు : విద్యారూపిణులైన స్త్రీలూ ఉన్నారు, అవిద్యారూపిణులైన స్త్రీలూ ఉన్నారు. విద్యారూపిణులైన స్త్రీలు, పురుషుణ్ణి భగవంతుని వైపుగా తీసుకొనిపోతారు. కానీ అవిద్యారూపిణులు భగవంతుణ్ణి మరపింపజేస్తారు.

"భగవంతుని మహామాయ ద్వారా ఈ జగత్తు సృష్టి అయింది. మహామాయలో విద్యామాయ, అవిద్యామాయ – రెండూ ఉన్నాయి. విద్యామాయను ఆశ్రయిస్తే సాధుసంగం, జ్ఞానం, భక్తి, ప్రేమ, వైరాగ్యం మొదలైన సద్గుణాలు అలవడతాయి. అవిద్యామాయను ఆశ్రయిస్తే కామ క్రోధాది దుర్గుణాలు అలవడతాయి – ఇవి భగవంతుణ్ణి మరపింప చేస్తాయి."

భక్తుడు: అవిద్యాశక్తి అజ్ఞానానికి హేతువు అయినప్పుడు, భగవంతుడు దాన్ని ఎందుకు సృష్టించాడు?

శ్రీరామకృష్ణులు: అదే ఆయన లీల. చీకటి లేకుంటే వెలుగు మహిమను ప్రశంసించలేము. దుఃఖం లేకుంటే సుఖం విలువను గ్రహించలేము. 'చెడు' అన్న ఎరుక ఉన్నప్పుడే 'మంచి'ని కూడా ఎరుగగలుగుతాం. ❖

శ్రీరామకృష్ణ ప్రభ
రామకృష్ణ మఠం, దోమల్‌గూడ, హైదరాబాదు–500 029
ఫోన్: 040-27667799, సెల్: 8801849494
E-mail : sriramakrishnaprabha@gmail.com
నిర్వాహక సంపాదకులు: స్వామి జ్ఞానదానంద
సంపాదకులు: స్వామి పరిజ్ఞేయానంద

సురభి

నేను (రసన్ అలీ ఖాన్) ప్రప్రథమంగా మాతృదేవిని దర్శించినప్పుడు నా వయస్సు సుమారు 13 ఏళ్ళు. మపేతీ షేక్, హమేతీ షేక్‌లు నా మామలు. వీరే నన్ను జయరామ్‌బాటికి తీసుకువెళ్ళారు. సిహోర్‌కు సమీపంలోని శిరోమణిపూర్ మా స్వగ్రామం. దానికి దగ్గరలోని పరమానందపూర్‌లో నా మామలు ఉండేవారు.

నా మామ లిద్దరికీ ఎడ్లబళ్ళు ఉండేవి. ఆ బళ్ళ మీద ప్రయాణికులను వాళ్ళు తీసుకువెళ్ళేవారు. మాతృదేవినీ, ఆమె కుటుంబ సభ్యులనూ నా మామలు అనేకసార్లు తమ బళ్ళలో తీసుకువెళ్ళడం స్వయంగా నేను చూశాను.

జయరామ్‌బాటిలో మాతృదేవి కోసం కట్టిన కొత్త ఇంటి నిర్మాణంలో పనిచేసిన వారిలో ఎక్కువమంది ఈ రెండు గ్రామాలకు చెందిన మహమ్మదీయులే! మహమ్మదీయులను హిందువుల ఇళ్ళకే అనుమతించని ఆ రోజుల్లో, మహమ్మదీయులు మాతృదేవి ఇంటి నిర్మాణంలో పాల్గొనడం అక్కడి హిందువులకు గిట్టలేదు. మాతృదేవిని 'మ్లేచ్ఛురాలు' అని పేర్కొనడానికి కూడా వారు సంకోచించలేదు. కానీ మాతృదేవి మేమే పని చేయాలని పట్టుబట్టారు. చివరకు గ్రామస్థులే వెనక్కుతగ్గారు. మాతృదేవి ఎంతో మృదువుగా మాట్లాడేవారు. కానీ అన్యాయాన్ని ఎదుర్కొనడానికి ఆమె ఎన్నడూ తటపటాయించేవారు కాదు.

మా గ్రామంలో ఈత చెట్లు ఎక్కువ. వాటి నుండి ఈతనీరు సేకరించి, ఆ నీటి నుండి బెల్లం తయారుచేయడాన్ని పలువురు వృత్తిగా చేసుకొన్నారు. ఈతనీరు, ఈతబెల్లం అంటే మాతృదేవికి ఎంతో ఇష్టం. నేను వాటిని తీసుకువెళ్ళేవాణ్ణి. మాతృదేవి వాటికి తగిన వెల కట్టి ఇచ్చేవారు. వద్దంటే, "నాయనా! నువ్వు కష్టపడి తయారుచేసింది కనుక తప్పకుండా డబ్బు తీసుకోవాల్సిందే" అనేవారు. ప్రసాదం, మరమరాలు కూడా ఇచ్చేవారు.

శిరోమణిపూర్ మసీదులో మట్టిగుర్రం, పిండి ఉండలు మొదలైనవి సమర్పిస్తానని మాతృదేవి మొక్కుకోవడమూ కద్దు. హమేతీ, మపేతీ మామయ్యలు ఇలా అనేవారు: "మాతృదేవికి ఎంత భక్తి. మా పండుగలలో కూడా మొక్కుకొని, నివేదనానికి తీపి పదార్థాలు సైతం పంపేవారు."

ఒకసారి మపేతీ మామయ్య మాతృదేవితో, "అమ్మా! మీరు హిందువులు. మహమ్మదీయ పండుగలలో ఎందుకు మొక్కుకొంటారు? నివేదనానికి ఎందుకు తీపిపదార్థాలు పంపుతారు?" అని అడిగాడు. అందుకు మాతృదేవి "హిందువులకూ, మహమ్మదీయులకూ దేవుళ్ళు విడివిడిగా ఉన్నారా ఏమిటి? అందరికీ దేవుడు ఒక్కడే నాయనా! పేరులోనే తేడా! శ్రీరామకృష్ణులు, ఇస్లామ్ మత సాధనలు అనుష్ఠించారు. నమాజ్ చేశారు."

మేము శ్రీరామకృష్ణులను, మాతృదేవిని భగవంతుని అవతారాలుగానే పరిగణించాం. వీరిని పోలిన వ్యక్తులు మళ్ళీ వస్తారా ఏమిటి? ❖



ఆధ్యాత్మిక అమృతవాహిని
శ్రీ రామకృష్ణ ప్రభ

సంపుటం: 71 సంచిక: 6 జూన్ 2014



భుజే సవ్యే వేణుం శిరసి శిఖిపింఛం కటితటే
దుకూలం నేత్రాంతే సహచరకటాక్షం విలసయన్।
సదా శ్రీమద్బృందావన వసతి లీలా పరిచయో
జగన్నాథః స్వామీ నయనపథగామీ భవతు మే॥

ఎడమచేతిలో వేణువును, శిరమున నెమలిపింఛమును, కటిప్రదేశమున దుకూలమును దాల్చి క్రీగంటిచూపులను బరపుచు ఎల్లప్పుడు బృందావన లీలలను చూపుచు శ్రీజగన్నాథస్వామి నాకు ప్రత్యక్షమగుగాక.

– శ్రీజగన్నాథాష్టకమ్


సూక్తి సౌరభం

ఇనుము విరిగెనేని యినుమారు ముమ్మారు
కాచి యతుకవచ్చు గ్రమముగాను
మనసు విరిగెనేని మరి చేర్చరాదయా
విశ్వదాభిరామ వినుర వేమ.


"ఓ వేమా! ఇనుము విరిగినచో రెండు, మూడుసార్లయినను కాచి క్రమముగా అతకవచ్చును. కానీ మనస్సు విరిగినచో మరి కుదురుపరచుట కష్టము."

అంతరంగమందు నపరాధములు చేసి
మంచివానివలెను మనుజు డుండు
ఇతరు లెరుగకున్న నీశ్వరుడెరుంగడా
విశ్వదాభిరామ వినుర వేమ.

"ఓ వేమా! చాటుమాటున ఎన్నో తప్పులు చేసియు, మంచివానివలె మనుజుడు నటించు గాక! ఇతరులు ఎరుగనంత మాత్రమున ఈశ్వరుడెరుగకపోడు గదా!"



శ్రీరామకృష్ణ ప్రభ శాశ్వత నిధి





ఆధ్యాత్మిక జ్ఞానాన్ని పంచి పెట్టేందుకు 'శ్రీరామకృష్ణ ప్రభ' కృషి చేస్తోంది. నిధుల కొరత లేకుండా ఈ జ్ఞానయజ్ఞం నిరంతరాయంగా సాగేందుకు 'శ్రీ రామకృష్ణ ప్రభ శాశ్వతనిధి'కి ధన దానం చేసి ప్రోత్సహించాల్సిందిగా కోరుతున్నాం. దాతల పేర్లు పత్రికలో ప్రచురిస్తాం.

మహారాజ పోషకులు...... రూ. 10,000/-, అంతకన్నా ఎక్కువ విరాళం ఇచ్చేవారు.
రాజ పోషకులు............ రూ. 5,000/-, అంతకన్నా ఎక్కువ విరాళం ఇచ్చేవారు.
పోషకులు................. రూ. 1,000/-, అంతకన్నా ఎక్కువ విరాళం ఇచ్చేవారు.

	దాత పేరు / చిరునామా	రూ.
మహారాజ పోషకులు :	శ్రీ ఎ. దామోదరం, పట్టాభిరామన్ వీధి, తెన్నూరు, తిరుచ్చి, తమిళనాడు	10,000
మహారాజ పోషకులు :	శ్రీమతి లోకే రుక్మిణి రాజేశ్వర్, న్యూ నల్లకుంట, శివంరోడ్, హైదరాబాద్ (కీ॥శే॥ లోకే రాజేశ్వర్‌గారి జ్ఞాపకార్థం)	10,000
రాజ పోషకులు :	శ్రీమతి కాదా పద్మావతమ్మ, రాజేంద్రనగర్, మహబూబ్‌నగర్ (కీ॥శే॥ కాదా బాబూరావుగారి జ్ఞాపకార్థం)	5,000
రాజ పోషకులు :	శ్రీమతి కె. స్వర్ణకుమారి, డి. కె. రోడ్, అమీర్‌పేట, హైదరాబాద్	5,000
రాజ పోషకులు :	శ్రీ డి. వేణుమాధవ్, శివనగర్, అత్తాపూర్, హైదరాబాద్	5,000
పోషకులు :	శ్రీ పత్తి శ్రీనివాసులు, బెస్తపాలెం, బాపట్ల, గుంటూరు జిల్లా (కీ॥శే॥ పోతురాజు వేంకటరత్నమ్మగారి జ్ఞాపకార్థం)	2,000
పోషకులు :	శ్రీ గురుస్వామి, నారాయణపేట్, మహబూబ్‌నగర్ జిల్లా	1,100
పోషకులు :	శ్రీ మీనవల్లి దయానంద్, నారాయణపేట్, మహబూబ్‌నగర్ జిల్లా	1,100
పోషకులు :	శ్రీ జి.యస్. రామయ్య & శ్రీమతి నాగరత్నమ్మ, ఎమ్.సి.పాల్యం, చిత్తూరు జిల్లా (కీ॥శే॥ చి॥ గోపాల, లోకేశ్వరిగార్ల జ్ఞాపకార్థం)	1,000
పోషకులు :	శ్రీ బి. ధర్మరాజు, కరణంగారి తోట, గొల్లప్రోలు, తూర్పు గోదావరి జిల్లా	1,000
పోషకులు :	శ్రీ సి.హెచ్. నరసింహారావు, సి.ఆర్. కె. ఫౌండేషన్, ఆర్.కె.పురం, సికింద్రాబాద్	1,000
పోషకులు :	శ్రీమతి రామంచ సుచరిత & శ్రీ లక్ష్మారెడ్డి, చాగల్లు, వరంగల్ జిల్లా (కీ॥శే॥ బుచ్చమ్మ, బాగిరెడ్డిగార్ల జ్ఞాపకార్థం)	1,000
పోషకులు :	శ్రీ మంచాల రామచంద్రారెడ్డి, నంద్యాల, కర్నూలు జిల్లా	1,000

'శ్రీరామకృష్ణ ప్రభ' కానుక పథకం

యువతరానికి 'శ్రీరామకృష్ణ ప్రభ'ను మరింత చేరువ చేయాలని సంకల్పించాం. రాష్ట్రంలోని వివిధ పాఠశాలలు/ కళాశాలలు/ గ్రంథాలయాలకు పత్రికను పంపించడానికి మీ సహాయాన్ని కోరుతున్నాం. ఈ కానుక పథకం క్రింద చందా చెల్లించిన దాత పేరున (మీరు సూచించిన లేదా మేము ఎంపిక చేసిన) విద్యాసంస్థకు పత్రికను పంపుతాం. కానుక చందా రూ.1,500/- అంతకన్నా ఎక్కువ ఇచ్చిన దాత పేరు, విద్యాసంస్థ పేరు పత్రికలో ప్రచురిస్తాం.

దాత పేరు	విద్యాసంస్థ
శ్రీ కె. జగన్‌మోహన్‌రావు, మైత్రీనగర్, కానూరు, విజయవాడ	3 పాఠశాలలకు 5 సంవత్సరాలకు పత్రికను స్పాన్సర్ చేశారు.
శ్రీమతి ఎ. భారతీ సంజీవరావు, సర్వసుఖి కాలనీ, వెస్ట్ మారేడుపల్లి, సికింద్రాబాద్	100 పాఠశాలలకు ఒక సంవత్సరానికి పత్రికను స్పాన్సర్ చేశారు.
శ్రీ టి. శ్రీనివాస్, మల్లారం, నిజామాబాద్	ప్రభుత్వ డైట్ కళాశాల, మల్లారం, నిజామాబాద్
శ్రీ ఎ. దామోదరం, పట్టాభిరామన్ వీధి, తెన్నూరు, తిరుచ్చి, తమిళనాడు	గౌతమ్ మోడల్ స్కూల్, గాంధీనగర్, హైదరాబాద్
శ్రీ కె. వేంకట లక్ష్మణ, రహ్మత్ నగర్, అనంతపురం	జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, నల్లచెరువు, అనంతపురం జిల్లా
" " "	జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, అగలి, అనంతపురం జిల్లా

చందా వివరాలు		భారతదేశంలో	విదేశాలకు
విడి ప్రతి	:	₹ 10	-
సంవత్సర చందా	:	₹ 100	₹ 1,500
మూడు సంవత్సరాలకు	:	₹ 280	₹ 4,500
ఐదు సంవత్సరాలకు	:	₹ 450	₹ 7,500
ఇరవై సంవత్సరాలకు	:	₹ 1,500	₹ 22,000

గమనిక: డిమాండ్ డ్రాఫ్ట్, మనియార్డర్లలో Ramakrishna Math, Hyderabad అని వ్రాయాలి.
పంపవలసిన చిరునామా: Sri Ramakrishna Prabha, Ramakrishna Math, Domalguda, Hyderabad - 500 029.

చందాను ఆన్‌లైన్ http://rkmath.org/srkp ద్వారా చెల్లించవచ్చు.

లోపలి పేజీల్లో...

శ్రీరామకృష్ణ ప్రభ చందాదారులకు విన్నపం

ప్రియ పాఠకులారా!

- 'శ్రీరామకృష్ణ ప్రభ' పత్రిక కవరు మీద చిరునామాకు పైన మీ చందా నంబరు, కుడి వైపున మీ చందా గడువు ముగిసే నెల ఉంటాయి. మీ చందా గడువు పూర్తయ్యే నెలకు ముందుగానే సొమ్మును చెల్లించి చందాను పునరుద్ధరించుకోండి.
- మీ ఉత్తర ప్రత్యుత్తరాలన్నింటిలో తప్పనిసరిగా చందా నంబరు పేర్కొనాల్సిందిగా మనవి.
- మీ చిరునామా మారిన పక్షంలో 7వ తేదీ లోగా మాకు తెలియపరచినట్లయితే, వచ్చే నెల సంచిక నుండి మీ కొత్త చిరునామాకు పంపబడును.
- ప్రతీ నెల 26 లేదా 27వ తేదీల్లో పత్రిక పోస్ట్ అవుతుంది. మీకు పత్రిక 15వ తేదీ లోపుగా చేరనట్లయితే, వెంటనే మాకు తెలియజేయగలరు.

శ్రీరామకృష్ణ ప్రభ ద్వారా అవిచ్ఛిన్నంగా సేవలు అందించాలన్నదే మా ఆకాంక్ష అందుకు మీ సహకారం కోరుతూ.... – సర్క్యులేషన్ మేనేజర్

'శ్రీరామకృష్ణ ప్రభ' పత్రిక చందాను
ఆన్‌లైన్ **http://rkmath.org/srkp** ద్వారా చెల్లించవచ్చును.

పాఠశాలలకు వేసవి సెలవులు ఇవ్వగానే పిల్లలకు వేసవి శిబిరాలంటూ ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు మొదలవుతున్నాయి. ఈ మధ్యకాలంలో వేసవి శిబిరాలకు గిరాకీ బాగానే పెరిగింది. కొన్ని సంస్థలు నిర్వహిస్తున్న వేసవి శిబిరాలలో ప్రవేశం దొరకడమే గగనమైపోతోంది. ఇంతకీ వేసవి శిబిరాలకు ఎందుకు ఇంత గిరాకీ? పిల్లలు నీతివాక్యాలు, విలువల పాఠాలు, వికాస సూత్రాలు నేర్చుకుంటారనా? అది నిజమే! కానీ అధికశాతం మంది తల్లితండ్రుల నుండి వచ్చిన సమాధానం మాత్రం 'అబ్బా! పిల్లలతో వేగలేకపోతున్నాం. శిబిరాల్లో పడేస్తే మాకు కాస్త మనశ్శాంతి దొరుకుతుంది' అని.

తల్లితండ్రుల అభిప్రాయంలో కొంత నిజం లేకపోలేదు. చిచ్చరపిడుగుల్లాంటి పిల్లల్ని కట్టడిచేయడం కత్తి మీద సామే! కానీ Institutions build professionals. Parents develop the persons. Parents are the primary architects in the development of character in children. సంస్థలు, పిల్లల్లో మేధోవికాసాన్నీ, వృత్తి నైపుణ్యాన్నీ పెంచడానికి తోడ్పడతాయి. కానీ మనోవికాసానికీ, వ్యక్తిత్వవికాసానికీ మాత్రం తల్లితండ్రులే ప్రథమ రూపకర్తలు.

అందుకే స్వామి వివేకానంద ఇలా అంటారు: Parents are constantly taxing their children to read and write, telling them they will never learn anything... అందువల్ల తల్లితండ్రులు పిల్లల్ని స్కూల్, ట్యూషన్, ఫౌండేషన్ కోర్సులంటూ చదువుల చట్రంలో బిగించి, వారిని ఉక్కిరిబిక్కిరి చేయకూడదు. పిల్లలు వట్టి మరమనుషులుగా మారకుండా, మనసున్న మనుషులుగా ఎదగడానికి తోడ్పడాలి.

భావిపౌరులను తీర్చిదిద్దే బాధ్యత: ఒక విత్తనంలో ఓ మహావృక్షం దాగివున్నట్లు, పిల్లవాడిలో మహోన్నత వ్యక్తి దాగివున్నాడు. కర్షకుడు సేద్యం చేసి పంటలు పండించడానికి ఎంత కృషి చేస్తాడో; ఎన్ని జాగ్రత్తలు తీసుకుంటాడో; ఎంత సహనంతో వ్యవహరిస్తాడో; తల్లితండ్రులు కూడా పిల్లల వ్యక్తిత్వ నిర్మాణ విషయంలో అంత శ్రద్ధ, అన్ని జాగ్రత్తలూ తీసుకోవాలి. పిల్లల్ని నిర్లక్ష్యం చేసే తల్లితండ్రులు శత్రువులతో సమానమని హెచ్చరిస్తూ...

మాతా శత్రుః పితావైరీ యేన బాలో న పాఠితః ।
న శోభతే సభా మధ్యే హంస మధ్యే బకో యథా ॥

'పిల్లల చదువు సంధ్యలను పట్టించుకోని తల్లితండ్రులు వారి పాలిట శత్రువులు. అలాంటి తల్లితండ్రుల వల్ల పిల్లలు హంసల మధ్య కొంగల్లాగ నలుగురిలో అపహాస్యం పాలవుతారు' అని మన శాస్త్రాలు తల్లితండ్రుల బాధ్యతను గుర్తుచేస్తున్నాయి.

అందువల్ల తమ పిల్లలు ఉన్నతంగా రాణించేలా తల్లితండ్రులు బాధ్యత వహించాలి. అప్పుడే భావి పౌరులను తీర్చిదిద్దే భాగ్యదాతలు తల్లితండ్రులే అని నిరూపించినవారవుతారు.

లేత మనస్సుల్లో కలుపుమొక్కలు: ప్రతి తల్లీ తండ్రీ తమ పిల్లలు ఎలాంటి చెడు అలవాట్లకూ బానిసలు కాకూడదని ఆశిస్తారు. అందువల్ల పిల్లల పెంపకంలో మెలకువలు తెలుసుకోవడానికి సదస్సులకు హాజరవుతున్న వారి సంఖ్య పెరుగుతూనే ఉంది.

ఒక నగరంలో ఓ మేనేజ్‌మెంట్ గురువు తల్లితండ్రుల కోసం 'పిల్లల పెంపకంపై మెలకువలు' అనే సదస్సును నిర్వహించాడు. ఆ సదస్సుకు చాలా మంది తల్లితండ్రులు హాజరయ్యారు. సదస్సు అయిన తరువాత ఓ దంపతులు, గురువు వద్దకు వెళ్ళి "గురువుగారూ! మీరు చెప్పిన చిట్కాలు బాగానే ఉన్నాయి. కానీ మేము ఎంత ప్రయత్నించినా మా అబ్బాయి చెడు అలవాట్లను మాన్పలేకపోతున్నాం. రేపు మీ దగ్గరకు మా పిల్లవాడిని తీసుకువస్తాం. అతడు చెడు అలవాట్లను మానేలా మీరే కాస్త హితబోధ చేయండి" అని విన్నవించుకున్నారు.



భావిపౌరుల

మరుసటి రోజున ఆ దంపతులు తమ అబ్బాయిని తీసుకొని గురువు దగ్గరకు వచ్చారు. గురువు వారితో అలా తోటలోకి వెళుతూ, ఆ అబ్బాయికి అక్కడున్న చిన్న మొక్కను చూపించి దాన్ని పీకివేయమన్నాడు. వెంటనే అబ్బాయి ఆ మొక్కను ఒక్కచేత్తో సునాయాసంగా పీకేశాడు. అలా మరికొంతదూరం వెళ్ళిన తరువాత గురువు ఆ అబ్బాయికి ఓ పెద్ద మొక్కను చూపించి దాన్ని పీకమన్నాడు. ఆ అబ్బాయి రెండు చేతులతో మొక్కను గట్టిగా పట్టుకొని లాగేశాడు. మరికొంత దూరం వెళ్ళాక గురువు ఆ అబ్బాయిని అక్కడున్న చెట్టును పెకలించమన్నాడు. అప్పుడు ఆ అబ్బాయి రెండు చేతులతో చెట్టు మొదలును గట్టిగా పట్టుకొని పెకలించడానికి విశ్వప్రయత్నం చేశాడు. కానీ ఆ చెట్టును కనీసం కదిలించలేకపోయాడు. అప్పుడు గురువు, తల్లితండ్రుల వైపు చూస్తూ, "లేతమనస్సులో చెడు అలవాట్లనే కలుపుమొక్కలను వెంటనే తొలగించాలి. మనస్సులో అవి దృఢంగా పాతుకుపోయిన తరువాత వాటిని పెకలించడం సాధ్యం కాదు" అని వివరించాడు. గురువు ప్రయోగాత్మకమైన బోధలోని అంతరార్థాన్ని గ్రహించారు ఆ తల్లితండ్రులు.

కాబట్టి తల్లితండ్రులు పిల్లల్లోని లోపాలను ప్రాథమిక దశలోనే గుర్తించి, సరిదిద్దడానికి ప్రయత్నించాలి. అందు కోసం వారితో వీలైనంత ఎక్కువ సమయం గడపడానికి ప్రాధాన్యమివ్వాలి.

ప్రశంసలు ప్రగతికి బాటలు: పిల్లలు తమ శక్తి సామర్థ్యాలకు అనుగుణంగా ఏమి చేసినా తల్లితండ్రులు, వారిని ప్రశంసిస్తూ,



భాగ్యదాతలు

'బాగా చేశావు, ఇంకా బాగా చేయగలవు' అని ప్రోత్సహించాలి. ఆ ప్రశంసల జల్లులే వారిలో ఆత్మవిశ్వాసాన్ని అంకురింప జేస్తాయి. తల్లితండ్రుల ప్రశంసలకు నోచుకోని పిల్లల్లో ఆత్మన్యూనతాభావం పెరుగుతుంది. దానివల్ల వారు ఇతరులతో కలసిమెలసి ఉండలేరు. ఇతరులను మెప్పించలేరు. అందుకే స్వామి వివేకానంద *"పిల్లల్ని - 'మీరు మూర్ఖులు. ఎందుకూ పనికిరారు' అని అంటూ ఉంటే వారు నిజంగానే ఎందుకూ పనికిరానివారవుతారు. పిల్లల తప్పులను ఎత్తిచూపడం కాకుండా, ఆ తప్పుల నుండి బయటపడే మార్గాన్ని వారికి సూచించాలి. అలా మంచిమాటలతో వారిని ప్రోత్సహిస్తే వారు తప్పకుండా పురోగతిని సాధిస్తారు"* అని తల్లితండ్రులకు మార్గనిర్దేశం చేశారు.

'కఠోపనిషత్తు'లోని నచికేతుని ఆత్మవిశ్వాసానికి యమధర్మరాజు సైతం అబ్బురపడ్డాడు. నచికేతుని తండ్రి 'నిన్ను యమునికి ఇస్తున్నాను' అని అన్నప్పుడు నచికేతుడు **'బహూనామేమి ప్రథమో బహూనామేమి మధ్యమః... -** నేను అనేక విషయాల్లో ఉత్తముణ్ణి, ఇంకా అనేక విషయాల్లో మధ్యముణ్ణి. అంతేగానీ అధముణ్ణి మాత్రం కాను' అని తన ఆత్మవిశ్వాసాన్ని వ్యక్తపరిచాడు.

ప్రతీ తల్లీ తండ్రీ తమ పిల్లల్లో నచికేతుడి లాంటి ఆత్మవిశ్వాసాన్నీ, ఆత్మగౌరవాన్నీ పెంపొందించేలా ప్రయత్నించాలి. అప్పుడే జీవితంలో ఎదురయ్యే అవరోధాలను పిల్లలు ధైర్యంగా ఎదుర్కొని, ఉన్నతంగా ఎదగడం సాధ్యమవుతుంది.

శీలసౌధానికి శిల్పులు: ఏ మహోన్నత వ్యక్తి జీవితాన్ని తెరచి చూసినా వారి వ్యక్తిత్వనిర్మాణానికి రూపకర్తలు ముఖ్యంగా తల్లితండ్రులే అని తెలుస్తుంది.

శత్రుదుర్భేద్యమైన కోట లాంటి ఛత్రపతి శివాజీ వ్యక్తిత్వాన్ని పటిష్ఠపరిచిందెవరు? ఆయన తల్లి - జిజియాబాయి; ప్రాణాలు పోయినా సత్యపథాన్ని విడనాడవద్దని ప్రబోధించి, స్వామి వివేకానందుని సత్యనిష్ఠకు పటిష్ఠమైన పునాది వేసింది ఎవరు? ఆయన తల్లి - భువనేశ్వరీదేవి; మనిషిని బానిసగా చేసే మద్యం, మగువల వ్యామోహాలలో పడవద్దని హితబోధ చేసి, గాంధీజీ శీలసౌధానికి రూపకల్పన చేసిందెవరు? ఆయన తల్లి - పుతిలీబాయి; ఆంగ్లేయుల అకృత్యాలను అరికట్టాలని ధీరవచనాలను నూరిపోసి, అల్లూరి సీతారామరాజును విప్లవ సింహంగా మలచిందెవరు? ఆయన తండ్రి - వేంకట రామరాజు; పరుల నుండి ప్రతిఫలాన్ని ఆశించకుండా నిజాయతీగా జీవించు అని మానవతా విలువలను బోధించి, అబ్దుల్ కలామ్‌ను భారతరత్నంగా మెరుగులు దిద్దిందెవరు? ఆయన తండ్రి - జైనులాబ్దీన్.

పిల్లల శీలసౌధానికి శిల్పులు తల్లితండ్రులే అని పైన ఉదహరించిన మహాత్ముల జీవితాలే తార్కాణం. విద్యాసంస్థలు, వికాసకేంద్రాలు ఎన్ని ఉన్నా ఇంటిని మించిన విద్యాసంస్థ, తల్లితండ్రులను మించిన వ్యక్తిత్వ వికాస నిపుణులు వేరే లేరు. తల్లితండ్రుల జీవితమే - పిల్లలకు తెరచిన వ్యక్తిత్వ వికాస పుస్తకం. పిల్లల్ని శీఘ్రంగా ప్రభావితం చేసేవి మాటల కన్నా చేతలే. కాబట్టి తల్లితండ్రులు మాటలతో చెప్పడం కాకుండా, చేతలతో చేసి చూపించి వారికి ఆదర్శంగా నిలవాలి. తల్లితండ్రుల ఆదర్శజీవనమనే మూస ఆధారంతో పిల్లలు శీలవంతులైన వ్యక్తులుగా తయారవుతారు. ఆ విధంగా తల్లితండ్రులు భావిపౌరులను తీర్చిదిద్దే భాగ్యదాతలుగా శాశ్వత కీర్తిని ఆర్జిస్తారు. ❖


పిల్లల తప్పులను ఎత్తిచూపడం కాకుండా, ఆ తప్పుల్ని సరిదిద్దుకొనే మార్గాన్ని సూచించాలి. అలా మంచిమాటలతో వారిని ప్రోత్సహిస్తే వారు తప్పకుండా పురోగతిని సాధిస్తారు. - స్వామి వివేకానంద

గోరుముద్ద - స్వామి సుప్రియానంద

విద్యావ్యవస్థ ముఖ్యంగా నాలుగు స్తంభాల మీద ఆధారపడి ఉంటుంది. ఆ స్తంభాలు - విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, యాజమాన్యం/ప్రభుత్వం. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి చాలా సంవత్సరాలైనప్పటికీ మన విద్యావిధానంలోని లోపాలకు బ్రిటిషు వారే కారణం అని చెప్పుకోవడం సమంజసమా?

మన విద్యావ్యవస్థ ఎన్నో సంస్కరణలకు లోనైంది. ఇంకా ఆ సంస్కరణల పరంపర కొనసాగుతూనే ఉంది. కానీ ఈ నాలుగు స్తంభాల ఆటలో సమన్వయం లోపిస్తోంది. సంస్కరణల పేరుతో పదేపదే మార్పులు చేయడం ప్రభుత్వం వంతు అయితే, విద్యార్థులలో నైతిక విలువలు క్షీణిస్తున్నాయని వాపోతుండడం

నాలుగు స్తంభాలాట!



తల్లితండ్రుల వంతైంది. ఇక, విద్యార్థులేమో "మా చదువు కోసం ఎంత డబ్బునైనా ఖర్చు పెట్టడానికి వెనకాడని మా తల్లితండ్రులు కనీసం రోజుకు కొంతసేపైనా మాతో గడపటం లేదు. మా ఇష్టానిష్టాలను తెలుసుకోవడానికి ప్రయత్నించడం లేదు" అని బాధపడుతున్నారు.

ఇక ఉపాధ్యాయుల విషయానికొస్తే "గ్రేడింగ్ పద్ధతి వచ్చిన తరువాత విద్యార్థులు తమ అజమాయిషీలో లేకుండా పోతున్నారనీ, వారి సమయమంతా అధికారులకు విద్యార్థుల గణాంక వివరాలు (స్టాటిస్టిక్స్) అందించడంతోనే సరిపోతున్నదనీ, పని ఒత్తిడి రోజు రోజుకూ ఎక్కువ అవుతున్నదనీ, విద్యావ్యవస్థే అగమ్యగోచరంగా ఉన్నదనీ" అంటున్నారు.

ఇవన్నీ ఇలా ఉండగా, తల్లితండ్రులేమో పిల్లలను చిన్నప్పటి నుండే ఓరియంటేషన్ క్లాసులనీ, ఫౌండేషన్ కోర్సులనీ, వ్యక్తిత్వ వికాస శిబిరాలనీ కనీసం వేసవి సెలవులను కూడా విడిచిపెట్టకుండా అదే పనిగా ఏదో ఒకటి చదివిస్తూ రుబ్బించడం శోచనీయం. వేసవి సెలవుల పరమోద్దేశం - రొటీన్‌గా పుస్తకాల నుండి నేర్చుకొనే చదువుకు కొంత విరామం ఇవ్వడమే కాక విద్యార్థులు తమ చుట్టుప్రక్కల పరిసరాలను పరిశీలించడానికీ, వాటి గురించి ఆలోచించడానికీ తగిన సమయం ఇవ్వడం.

విద్యా సంస్కరణలు మన దేశంలోనే కాదు ఇతర దేశాలలో కూడా చేస్తున్నారన్నది మనం గమనించాలి. ఉదాహరణకు జపాన్ దేశంలో ఆదివారాలు మినహాయిస్తే వరుసగా ఆరు వారాలు పాఠశాల పనిచేస్తుంది. తరువాత రెండు వారాలు సెలవులు, మళ్ళీ ఆరు వారాలు పాఠశాల. ఇలా వారి విద్యావ్యవస్థను మార్చిన తరువాత విద్యార్థుల, ఉపాధ్యాయుల పనితీరులో ఎంతో మార్పును గమనించారు.

ఈ పరిస్థితుల్లో మన విద్యావేత్తలు సమస్యలను అర్థం చేసుకోకుండా సంస్కరణలను రూపొందిస్తున్నారా? అనిపిస్తుంది. మొదట కావలసింది - నాలుగు స్తంభాల (విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లితండ్రులు, యాజమాన్యం/ప్రభుత్వం) మధ్య సమన్వయం. ప్రతి ఒక్కరూ మిగతా వారిని సంస్కరించడానికి ప్రయత్నిస్తున్నారు. ఒకవైపు విద్యార్థులపై ఒత్తిడి తగ్గించాలంటూ వారిని అనేక ఒత్తిళ్ళకు గురిచేస్తున్నారు.

మారుతున్నది సమాజమే తప్ప, శాశ్వత విలువలు మారవు. ఈ మార్పులు విలువల పతనానికి దారితీసినప్పుడు కలిగేదే గందరగోళం. దీనిని మనం గమనించి మారుతున్న సమాజంలో శాశ్వత విలువలను కాపాడుకుంటూ ముందుకు సాగాలి. అప్పుడే సంస్కరణలు ఫలవంతమవుతాయి! ❖

భగవత్ ప్రసాదం

- శ్రీమతి జి.ఎస్.లక్ష్మి

శ్రీజగన్నాథపురిలో సాత్విక్ అనే రాజు ఉండేవాడు. ఆయన పరమ భక్తుడు. అతనికి శ్రీజగన్నాథుడంటే ఎంతో భక్తి. ప్రతి రోజూ ఆలయం నుంచి అర్చకుడు తీసుకుని వచ్చిన ప్రసాదం భక్తిపూర్వకంగా స్వీకరించేవాడు. ఒకనాడు రాజు పాచికలాట ఆడుతూండగా శ్రీజగన్నాథుని ఆలయం నుంచి అర్చకుడు ప్రసాదం తీసుకుని వచ్చాడు. రాజు కుడిచేతిలో పాచికలున్నాయి. పాచికలాటలో నిమగ్నమైవున్న రాజు అన్యమనస్కుడై పొరపాటున నైవేద్య పాత్రను ఎడమ చేతితో తాకాడు. భగవత్ప్రసాదాన్ని ఎడమ చేతితో తాకడం అపరాధంగా భావించిన అర్చకుడు ఆ పాత్రను తీసుకుని కోపంగా వెళ్ళిపోయాడు. పాచికలాట పూర్తి అయ్యాక రాజు తన పొరపాటును గ్రహించాడు. అన్న పానీయాలు త్యజించాడు. జూదానికి బానిసై తన కుడి చెయ్యి భగవంతుడి ప్రసాదాన్ని నిర్లక్ష్యం చేసినందుకు దాన్ని శిక్షించాలని తలచాడు.

రాజు ఈ విషయంలో పండితుల అభిప్రాయం తెలుసుకోదలచి పండితుల సభను ఏర్పాటు చేశాడు. 'భగవంతుడి ప్రసాదాన్ని అవమానించిన వారికి ఏ విధమైన శిక్ష విధించాలి?' అని అడిగాడు. 'అపరాధిని సర్వదా త్యజించడమే తగిన దండన' అని చెప్పారు. రాజు తన కుడి చేతిని ఖండించడమే తగిన శిక్ష అని నిశ్చయించుకున్నాడు. అయితే ఆ అపరాధిని తానే అని తెలిస్తే ఎవరూ ఈ శిక్ష అమలుపరచడానికి ముందుకురారు. అందువల్ల తనను తాను ఎలా శిక్షించుకోవాలో ఆలోచిస్తూ చింతామగ్నుడై ఉన్నాడు. విషణ్ణవదనుడైన రాజును చూసిన మంత్రి కారణం అడిగాడు. "ప్రతి రాత్రి ఒక దయ్యం వచ్చి నా గది గవాక్షం దగ్గర చేతులు ఊపుతూ భయపెడుతోంది. ఆ కారణంగా నాకు నిద్ర పట్టడం లేదు" అన్నాడు రాజు. అందుకు మంత్రి "ఈ రాత్రి నేను మీ గదిలో పడుకుంటాను. మీరు వేరే గదిలో పడుకోండి. ఆ దయ్యం వచ్చి చేతులూపుతూ ఉంటే నేను దాని చెయ్యి నరికివేస్తాను. అలా దాని పీడ విరగడ అవుతుంది" అన్నాడు. "అవును. మీరు చెప్పిన ఉపాయం బాగానే ఉంది" అని మంత్రితో అన్నాడు రాజు.

అర్ధరాత్రి అయ్యాక రాజు తన గది కిటికీ దగ్గరకు వెళ్ళి కుడిచేయిని ఊపుతూ కేకలు వేశాడు. మంత్రి అది ఆ దయ్యం చేస్తున్న అల్లరే అనుకుని చేతిని నరికేసాడు. అప్పుడు రాజు వెలుగులోకి వచ్చాడు. ఎదురుగా రాజునూ, తెగి కింద పడిన రాజు చేతినీ చూసి మంత్రి దుఃఖించాడు. అనాలోచితంగా ఇలాంటి పని చేసానేమిటని చాలా బాధ పడ్డాడు. అందుకు రాజు, "మంత్రీ! మీరు నిర్దోషులు. తప్పు చేసినవాణ్ణి నేను. అందుకు శిక్ష అనుభవించాల్సిందే" అని అన్నాడు.

రాజుకు గల దైవ భక్తి, తన ప్రసాదం పట్ల నిష్ఠ చూసి జగన్నాథస్వామి ఆ అర్చకుడికి స్వప్నంలో కనిపించి, "వెంటనే ప్రసాదం తీసుకుని వెళ్ళి రాజుకివ్వండి.



తెగిపోయిన రాజు చేతిని తెచ్చి మన తోటలో పాతి పెట్టండి" అని ఆజ్ఞాపించాడు.

భగవంతుడి ఆజ్ఞ ప్రకారం అర్చకుడు ప్రసాదం తీసుకొచ్చి రాజుకిచ్చాడు. రాజు ప్రసాదం తీసుకునేందుకు చేతిని చాపినప్పుడు కుడి చెయ్యి తిరిగి వచ్చింది. జగన్నాథస్వామి తనపై చూపిన కరుణకు రాజు కన్నీటిపర్యంతమై ప్రసాదాన్ని భక్తిశ్రద్ధలతో కళ్ళకద్దుకొని స్వీకరించాడు. ఖండించిన రాజు కుడి చేతిని పాతిపెట్టిన స్థానంలో దవనం మొక్కలు మొలిచాయి. ఆ దవనం పత్రి, పువ్వులు జగన్నాథునికి అత్యంత ప్రీతికరమైనవి. అందుకే, ఇప్పటికీ పూరీలో జగన్నాథస్వామి అర్చనకు ప్రతి నిత్యం దవనం తప్పకుండా వాడడం సంప్రదాయంగా వస్తోంది. ❖

(జూన్ 29వ తేదీ ఆదివారం 'పూరీ జగన్నాథ రథయాత్ర')

భగవద్దర్శనం పొందడం కోసం ఎలాంటి భక్తి కావాలో తెలుసా? తల గీరుకొనిపోయిన కుక్క ఎలా అశాంతితో అటూ ఇటూ పరుగెత్తుతుందో అలా భగవంతుడి కోసం ఆవేదన చెందాలి. - శ్రీరామకృష్ణులు





పలికెడిది భాగవతం

"ఆకాశంలోని మేఘాలు గాలికి ఎగిరి పరస్పరం కలుసుకుంటూ పడిపోతూ ఉన్నట్లు ఈ ప్రపంచంలోని ప్రాణికోటి సమస్తమూ కాలచక్రం వల్ల కూడుతూ, వీడుతూ ఉంటుంది. స్వేచ్ఛ అనేది లేదు. కాలమే అన్నిటికీ మూలం. కాలం విచిత్రమైనది. ఎంతవారైనా సరే ఈ కాలప్రవాహాన్ని దాటలేర"ని ఓదార్చాడు.

సర్వము కాలతంత్రము...: మహాత్ముడైన భీష్మాచార్యులు పలికిన ఈ ఓదార్పు మాటలు పాండవులకే కాదు, యావత్ మానవకోటికీ వర్తిస్తాయి. పోతనామాత్యులు భీష్మాచార్యుల

కాలము విచిత్రము...దుస్తరము!

– స్వామి జ్ఞానదానంద

కురుక్షేత్రంలో దాయాదులనూ, దగ్గరివారినీ దునుమాడి రాజ్యాన్ని కైవసం చేసుకోవడం ధర్మరాజును చింతాక్రాంతుణ్ణి చేసింది. రథాలతో, ఏనుగులతో, గుర్రాలతో, పదాతిసేనతో కూడిన అనేక అక్షౌహిణుల సైన్యాలను చంపించాననీ, ఎందరో బంధువులను హతమార్చి వారి ఆత్మీయులకు తీరని ద్రోహం చేశాననీ ఆ ధర్మజుడు దిగులుతో భయవిహ్వలుడయ్యాడు. యుద్ధభూమిలో అంపశయ్యపై శయనించి ఆఖరిక్షణాల కోసం నిరీక్షిస్తున్న భీష్మాచార్యుల వద్దకు నిరాహారుడై వెళ్ళాడు. కృష్ణార్జునులు, భీమ నకుల సహదేవులూ ఆయనతో పాటు వెళ్ళారు. సంగ్రామరంగంలో శరతల్పగతుడైన గాంగేయునికి నమస్కరించి, సమీపాన విషాదవదనంతో నిలబడ్డారు. అనంతరం భీష్మాచార్యులు వినయ వినమ్రులు, ప్రేమపాత్రులు అయిన పాండుపుత్రులను తన దగ్గర కూర్చోపెట్టుకున్నాడు. అపారమైన అనురాగంతో, చెక్కిళ్ళపై బాష్పధారలు జారుతుండగా, 'నాయనలారా! సాక్షాత్తూ భగవానుడైన శ్రీకృష్ణపరమాత్ముడు మీ జీవితాలకు సారథ్యం వహిస్తున్నా, మీరు ఇన్ని కష్టాల పాలవుతున్నారే! ఇంతకన్నా విచిత్రం మరేముంది? పాపం! మీ అమ్మ కుంతీదేవి సంతోషమన్న మాటే ఎరుగదు. పాండురాజు దూరమయ్యాక పసికందులైన మిమ్మల్ని అరచేతుల్లో పెట్టుకొని పెంచి పెద్దచేసింది. ఆమె బతుకంతా కష్టాలతోనే గడచిపోయింది' అని బాధపడ్డాడు. కాలరూపంలో భగవంతుడు ప్రదర్శించే విన్యాసాన్ని వివరిస్తూ...

వాయువశంబులై యెగసి వారిధరంబులు మింట కూడుచుం
బాయుచు నుండు కైవడి ప్రపంచము సర్వము కాల తంత్రమై
పాయుచు కూడుచుండు నొకభంగి చరింపదు కాల మన్నియుం
చేయుచు నుండు కాలము విచిత్రము దుస్తర మెట్టివారికిన్

మనస్సునూ, మాటలనూ మాధ్యమంగా చేసుకొని రచించిన ఇలాంటి పద్యాలు మానవాళికి సన్మార్గం చూపే దీపాలు. చిన్న చిన్న కష్టాలకే కుంగిపోయి, చింతిస్తూ కూర్చునే మనమందరమూ నిరంతరం మననం చేసుకుంటూ మానసిక స్థైర్యాన్ని ప్రోది చేసుకోవాల్సిన ధీరవాక్కులివి.

లోతుగా ఆలోచిస్తే మంచి చెడులేవైనా మనకు కాలంతోనే వస్తున్నాయి; కాలంతోనే పోతున్నాయి. మన మనస్సును మురిపించి మరపించే మనుషులు, మమతలు, పదవులు, హోదాలు, ఆస్తులు, అంతస్తులు మనం వచ్చేటప్పుడు తెచ్చుకున్నవి కావు. సమయానుకూలంగా కాలం వాటిని మనకు తాత్కాలిక ప్రాతిపదికన సమకూర్చి గడువు తీరగానే తనలో లయం చేసుకుంటుంది. అదే విధంగా కేవలం ఆనందాల్ని అనుభవించడానికే ఈ లోకంలోకి రాలేదన్న జీవన మౌలికసూత్రాన్నీ విస్మరించకూడదు. సుఖం ఎంత సహజమో, దుఃఖమూ అంతే సహజమని గుర్తించాలి. అందుకే అయోధ్యకాండలో శ్రీరామచంద్రుడు కూడా లక్ష్మణుడితో...

సుఖేదుఃఖే భయక్రోధౌ లాభాలాభౌ భవాభవౌ ।

యచ్చ కించిత్ తథా భూతం నను దైవస్య కర్మ తత్ ।

'సమస్త ప్రాణులకూ కలిగే సుఖదుఃఖాలనూ, శాంతి క్షోభాలనూ, లాభనష్టాలనూ, జననమరణాలనూ ఊహించలేం. ఇవన్నీ విధి నిర్ణయాలే' అని స్పష్టం చేస్తాడు.

ఒక భంగి చరింపదు...: కాలం ఎప్పుడూ ఒకేలా ఉండదు. అలా ఉండాలని మనం అనుకోవడం కూడా అవివేకమే! అందుకే ఇక్కడ గాంగేయుడు '...నొకభంగి చరింపదు కాలమన్నియుం

చేయుచు నుండు' అంటున్నాడు. మలుపులు తిరగడం కాలధర్మం! దాన్ని శిరసా వహించడమే మన ధర్మం! అయితే మనలో చాలామంది తమకు రాకూడని కష్టాలు వచ్చాయనీ, భగవంతుడు తమపై పక్షపాతం చూపుతున్నాడనీ నిందలు మోపుతూ ఉంటారు. కానీ నిజానికి కాలమైనా, విధి అయినా, భగవంతుడైనా అకారణంగా మనల్ని అశాంతికి గురిచేయరు. ఎప్పుడో, ఏ జన్మలోనో మన వల్ల జరిగిన అపరాధానికి ఫలితమే మనకు ప్రాప్తించిన కష్టనష్టాలు, వియోగవిలాపాలు! అందుకే మన సనాతన ధర్మం...

దారిద్ర్య రోగ దుఃఖాని బన్ధన వ్యసనాని చ ।
ఆత్మాపరాధ వృక్షస్య ఫలాన్యేతాని దేహినామ్ ॥

"దారిద్ర్యం, రోగం, దుఃఖం, బంధనం, వ్యసనం – ఇవన్నీ పూర్వం చేసిన దోషకర్మలనే వృక్షం నుంచి లభించిన ఫలాలే"ని ఉద్ఘాటించింది. కానీ మనం అమాయకంగా అన్యులెవరో మన ఆపదలకు కారకులన్నట్లుగా ఆవేదన పడుతూ ఉంటాం. అయితే ఈ కాలభుజంగపు కాటుకు అందరూ బలి కావలసిందే! అందుకే భీష్మాచార్యులు ఎంతటి వారైనా ఈ కాలప్రవాహపు తాకిడి నుంచి తప్పించుకోలేరని తేల్చి చెబుతున్నాడు.

అంతటి వారికీ ఆపదలు: కాలం పోకడను కళ్ళకు కట్టినట్లు వివరించాక, ఆ కురువృద్ధుడు పాండవులను పేరు పేరునా ప్రస్తావించాడు. వారిలో ఏ ఒక్కరూ మరొకరికి తీసిపోరనీ, పైగా వీరందరికీ మధుసూదనుడే మార్గదర్శకుడిగా ముందున్నాడనీ గుర్తుచేశాడు. అయినా కాలగతిని అనుసరించి వారి జీవనాకాశంలో కష్టాల కారు మేఘాలు కమ్ముకోక మానలేదని వివరిస్తూ...

కాలం కావడి లాంటిది. కష్టాలను, సుఖాలను సరిసమానంగా మోసుకొస్తుంది. సుఖం ఓ సారి ముందుంటే, దుఃఖం మరోసారి ముందుంటుంది. కష్టాల్లో, కన్నీళ్ళలో ఆంతరంగిక ప్రక్షాళనకు తోడ్పడే ఆధ్యాత్మిక ప్రబోధమేదో దాగి ఉందని అర్థం చేసుకోవాలి. అందుకే ఎప్పుడు ఏది అందినా, యథాతథంగా స్వీకరించాలి. నిజానికి కొన్ని శక్తులు, మన మనస్సు బాధల్లో దగ్ధమైనప్పుడే వెలికివస్తాయి. ❖

రాజట ధర్మజుండు, సురరాజ సుతుండట ధన్వి, శాత్రవో
ద్వేజకమైన గాండీవము విల్లట, సారథి సర్వభద్ర సం
యోజకుడైన చక్రియట, ఉగ్రగదాధరుడైన భీము డ
య్యాజికి తోడు వచ్చునట, యాపద కల్గుటిదేమి చోద్యమో!

"ధర్మానికి మారుపేరైన ధర్మరాజు రాజు, మహావీరుడైన అర్జునుడు యోద్ధ, శత్రుభయంకరమైన గాండీవం అతని ధనుస్సు, సర్వ సౌభాగ్యాలను ప్రసాదించే శ్రీకృష్ణుడు సారథి, ప్రచండ గదాదండధారి అయిన భీమసేనుడు కొండంత అండ. ఇంతటి సహాయసంపత్తి కలిగినా పాండవులకు అరణ్యవాసాలు, అజ్ఞాతవాసాలు తప్పలేదు. ఎంత ఆశ్చర్యం!" అని పలికాడు.

ఏ ఒక్కరూ కాలనియమానికి అతీతులు కారని మనకు ఎందరి జీవితాలో రుజువు చేస్తున్నాయి.

భగవాన్ శ్రీరామకృష్ణ పరమహంస అవతార లక్ష్యానికి సారథిగా ఈ లోకానికి వచ్చిన కారణజన్ముడు స్వామి వివేకానంద. ఆయన యుక్తవయస్సులో పడ్డ కష్టాలను చూస్తే గుండె తరుక్కుపోతుంది. తండ్రి మరణానంతరం ఆయన పరమ దారిద్ర్యాన్ని అనుభవించారు. మిత్రులు, బంధువులు ఆయన పట్ల విశ్వాసఘాతుక వైఖరి పూనారు. దయామయుడైన భగవంతుడి ప్రపంచంలో దుఃఖమెందుకుందో స్వామీజీ ఆలోచనలకు అంతుచిక్కలేదు. ఈ నేపథ్యంలో ఓ రోజు ఆయన ఉద్యోగం కోసం వెతికి వేసారిపోయి, ఓ ఇంటి అరుగు మీద కూర్చున్నారు. అప్పుడు అతనికి తాను ఎదుర్కొంటున్న పరస్పర విరుద్ధ సమస్యలకు పరిష్కారం ఆవిష్కృతమైంది. భవిష్యత్ కార్యాచరణ దిశలో భాగంగా భగవాన్ శ్రీరామకృష్ణుల చెంతకు ఆయనను చేర్చింది. ఇలా కష్టం మనల్ని ఆ భగవంతుని వైపునకు మరలుస్తుంది.

పరమాత్మ నుంచే పరిష్కారం: భగవంతుణ్ణి నమ్ముకుంటే సమస్యలు ఉండవని భ్రమపడవద్దు. అయితే ఆయన అండ ఉంటే కష్టాలు చిన్నవిగా తోస్తాయి. వాటిని అధిగమించే శక్తీ సంక్రమిస్తుంది. కాలరూపంలో పరమాత్ముడు మనకు అనేక పరీక్షలు పెడుతున్నాడని అర్థమవుతుంది. అయితే అలాంటి సమయాల్లో కాస్త ఓర్పు వహించాలి. అప్పుడు పరీక్ష పెట్టిన పరమాత్ముడే అదే కాలప్రవాహంలో మనకు పరిష్కారాన్నీ చూపగలడు. అందుకే మహాభారతం '**బహు విఘ్నః సురాః కాలః కాలః కాలం నయిష్యతిః** – కాలంలో ఎన్ని విఘ్నాలైనా రావచ్చు; కానీ కాలానికి కాలమే ఏదో ప్రతిక్రియ చూపుతుంద'ని భరోసా ఇస్తుంది. అందుకే నాడు శ్రీకృష్ణుడైనా, నేడు శ్రీరామకృష్ణులైనా వారు పరోక్షంగా ఉండి, తమ శిష్యులు, భక్తులు కష్టాల్ని నిబ్బరంగా భరించేలా శిక్షణనిచ్చారు. తమకు తామే పరిష్కారాల్ని అన్వేషించుకునే శక్తిసామర్థ్యాల్ని వారిలో రాజేశారు; రాజేస్తూ ఉన్నారు.

ఇలా పరమాత్మపై పూనిక మనల్ని కాలానికి ఎదురీదేలా చేస్తుంది. ఎంతటి ఆపదలకైనా వెరవని ఆత్మస్థైర్యాన్ని ప్రసాదిస్తుంది. అందుకే భగవాన్ శ్రీరామకృష్ణులు 'భగవంతుణ్ణి నమ్ముకున్నవారికి ఎన్ని ఎదురుదెబ్బలు తగిలినా, వారు తిరిగి నిలకడ స్థితిని పొందుతారు. కానీ భగవంతుణ్ణి నమ్మనివారు మాత్రం చిన్న కష్టాలకే తెప్పల్లా అదుపుతప్పి తలకిందులై పూర్తిగా మునిగిపోతారు' అంటారు. ❖

ఆకాశంలోని మేఘాలు గాలికి కలుసుకుంటూ, విడిపోతూ ఉన్నట్లు ఈ ప్రపంచంలోని ప్రాణికోటి సమస్తమూ కాలచక్రం వల్ల కూడుతూ, వీడుతూ ఉంటుంది. స్వేచ్ఛ అనేది లేదు. - మహాభారతం

ప్రాచీన, మధ్యయుగాలనాటి

మన సంస్కృతి

- స్వామి హర్షానంద

"ఒక వ్యక్తి తనను తాను అసహ్యించుకొంటున్నట్లయితే అదే పతనానికి హేతువు. పూర్వీకుల చరిత్రను అవమానకరంగా భావిస్తే, ఆ జాతి అంతానికి చేరుకున్నట్లే!" అంటారు స్వామి వివేకానంద. గత వైభవాన్ని మర్చిపోయినంత కాలం మనమూ, మన దేశం స్తబ్ధతలో మునిగిపోతాం. అందుకే, మన ప్రాచీన సంస్కృతి గురించి తెలుసుకోవాలి. గడచిపోయిన సంగతులు తెలుసుకొంటూ, భవిష్యత్ మహత్కార్యాల సాధన వైపు నడవాలి. మన ప్రాచీన భారతీయ సంస్కృతిని గుర్తు చేసేందుకు చేస్తున్న ప్రయత్నమే ఈ వ్యాసాల పరంపర. సుప్రసిద్ధ రచయిత, బెంగుళూరు రామకృష్ణ మఠం అధ్యక్షులు స్వామి హర్షానంద మహరాజ్ మధ్యయుగాల కాలం దాకా విలసిల్లిన మన సంస్కృతిని 'శ్రీరామకృష్ణ ప్రభ' పాఠకులకు 2014 ఫిబ్రవరి సంచిక నుండి వివరిస్తున్నారు.

హైందవ రాజ్యాంగ వ్యవస్థ

ఆధునిక కాలంలో రాజకీయాలు కేవలం పబ్బం గడుపుకోవడానికే అన్నట్లు తయారవుతున్నాయి. నాయకులు సాక్షాత్తూ దేవుళ్ళయిపోయారు. సప్త ఋషులలో ఒకరైన అత్రి మహర్షి పాలకుల విధుల గురించి ఇలా చెప్పారు.

రాజు బాధ్యతలు: దుష్టశిక్షణ, శిష్ట రక్షణ, ధర్మ మార్గంలో కోశాగారాన్ని నింపడం, పక్షపాతం లేకుండా న్యాయపాలన, అన్నివిధాలుగా రాజ్యాన్ని కాపాడడం - ఈ అయిదూ రాజు బాధ్యతలు.

హిందూ సంప్రదాయంలో శాస్త్రాలు - ప్రామాణిక మత, సాంస్కృతిక గ్రంథాలు - నాలుగు రకాలుగా విభజితమయ్యాయి. అవి త్రయి (వేదాలు), అన్వీక్షకి (తర్కం), వార్త (ఆర్థిక, రాజకీయ), దండనీతి (రాజ్యాంగం). అయితే కౌటిల్యుని అర్థశాస్త్రం చివరి రెండు అంశాలనూ కలిపి వివరించింది. అర్థశాస్త్రం ఈ విషయాల మీద ప్రామాణిక గ్రంథం. ఈ గ్రంథాన్ని ఆధారంగా చేసుకొని చేసే రాజ్యాంగ పరిశీలన సముచితం.

సాధారణ లక్షణాలు: ప్రాచీన, మధ్య యుగాల నాటి గ్రంథకర్తలు ధర్మశాస్త్రాలను అనుసరించి వ్యక్తిగత స్వాతంత్ర్యం, సామాజిక వ్యవస్థ అనే జటిల సమస్యను పరిష్కరించారు. ఒక వ్యవస్థలో వ్యక్తులు కానీ, లేక వ్యక్తుల సముదాయం కానీ రాజకీయ శక్తులుగా ఎదిగి ఇతరులపై పెత్తనం చలాయించడాన్నీ, కష్టాలు కలిగించడాన్నీ అనుమతించలేదు.

ప్రాచీన, మధ్యయుగాల భారతదేశానికి ప్రజాస్వామ్యం తెలియదనుకోవడానికి వీలు లేదు. గ్రామ పంచాయతీలు, సభలు, సమితులు, మహానాడుల లాంటి ప్రజాసంస్థలు ప్రజాస్వామ్యాన్ని పాటించాయి. ఈ సంస్థలలో నాయకులను ఎన్నుకొనే పద్ధతులను కొన్ని గ్రంథాలు, శిలాశాసనాలు వివరించాయి.

వైదిక కాలంలో రాజులు ప్రజలు ఎన్నుకొన్న సామాజిక నాయకులు. యువరాజుకు పట్టాభిషేకం చేసే ముందు కూడా ప్రజల అనుమతి తీసుకొనేవారు.

రాజ్యమనేది రాజు యొక్క వ్యక్తిగత ఆస్తి కాదు. కానీ ఆయన తన ఆదాయం నుండి భూములు, భవనాలు, ఇతర ఆస్తులు సంపాదించుకోవచ్చు. ఐతరేయ బ్రాహ్మణ కాలం (క్రీ.పూ. 3,000) నాటికే ప్రజాతంత్ర రాజ్యాలుండేవి. పరిపాలకులు, సత్య ధర్మాలను పాటించాలని ఆశించేవారు. వారు 'మంత్రి పరిషత్' నిర్ణయాలను పాటించాల్సిన ధర్మం ఉండేది. దుర్మార్గులైన రాజులను తొలగించడం, చంపివేసిన సందర్భాలూ ఉన్నాయి.

రాజ్యాంగాలు లేక ప్రభుత్వ విభాగాలు : రాజ్యాంగాలు లేక పాలనా విభాగాలు క్లుప్తంగా: స్వామి (రాజు), మంత్రిపరిషత్ (మంత్రిమండలి), జనపథ (ప్రజలు), దుర్గము - బలము (కోట - సైనికులు), కోశ (ధనాగారం), మిత్ర (మిత్రులు).

రాజు: ప్రాచీన, మధ్యయుగాల రాజనీతి శాస్త్రాల ప్రకారం ప్రభుత్వాధిపతి లేక రాజుకు అస్త్ర, శస్త్ర ప్రయోగంలో ప్రావీణ్యం ఉండాలి. ధర్మసూక్ష్మాలు ఎరిగి ఆచరించడానికి అతనికి తగిన విద్య, సంస్కృతి, సౌకుమార్యం ఉండాలి. ఆత్మనిగ్రహం తప్పనిసరి అని చెప్పాల్సిన పనిలేదు. సమాజ పటుత్వం పౌరుల ధర్మాచరణ మీద ఆధారపడి ఉంటుంది. ధర్మాతిక్రమణం చేసిన వారిని రాజు కఠినంగా శిక్షించాలి.

పాశ్చాత్య రాచరికాల లాగా కాకుండా, హైందవ ధర్మశాస్త్రాల ప్రకారం రాజు రాజ్యానికి ఒక రక్షకుడు మాత్రమే కానీ సొంతదారు కాదు. అతను తన సొంత సంపద నుండే దానధర్మాలు చేయాలి. ప్రభుత్వ ఆదాయ, వ్యయాల పరిశీలన, నియంత్రణ, పన్నుల వసూళ్ళు, ప్రజా సంక్షేమ కార్యక్రమాల ప్రణాళిక, మంత్రి మండలితో చర్చలు, గూఢచారులతో రహస్య సమావేశాలు, సైన్యాధికారులతో సంప్రతించి సైన్యం పర్యవేక్షణ, కుటుంబంతో కొంత సమయం గడపడం, వ్యక్తిగత ప్రార్థనలకు సమయం రాజు దినచర్య. చక్రవర్తులు కావాలని ఆశించే రాజులు రాజసూయ, అశ్వమేధ యాగాలు చేసేవారు.

మంత్రిమండలి : మంత్రిమండలి రెండు స్థాయిలలో - ఆంతరంగిక కేంద్రమండలి, విస్తారమైన మంత్రిమండలిగా ఉండేది. కేంద్ర మంత్రిమండలిలో రాజు, ప్రధానమంత్రి, రాజగురువు, సైన్యాధిపతి సభ్యులు. చట్టాలు, సూత్ర నిర్ణయాలు ఈ మండలి బాధ్యత. విస్తారమైన మంత్రిమండలిలో 8 నుండి

23 మంది మంత్రులుండేవారు. వీరు వివిధ విభాగాల అధిపతులు లేక ప్రముఖులైన రాజ్యాధికారులు. ఈ విస్తృత మంత్రిమండలి ప్రధాన బాధ్యత – కేంద్రమండలి నిర్ణయాలను అమలుచేయడమే.

జనపథం : ప్రభుత్వం లక్ష్యం – ప్రజా సంక్షేమమే కనుక ప్రజలను ఎప్పుడూ సుఖసంతోషాలతో ఉంచాలి. ఇందుకు గాను వారికి భద్రత, అభివృద్ధికి అవకాశాలు అవసరం. ప్రజలకు తిండి, దుస్తులు, నివాసం, వైద్యం, విద్య ఏర్పాటుచేసేవారు. వ్యాపార సంస్థలు, కార్మిక సంఘాలు, విద్యాసంస్థలు, పంచాయతీల లాంటి స్థానిక పరిపాలనా సంస్థలు మొదలైనవాటిని ప్రభుత్వ పాలనా వ్యవస్థ సమర్థించి ప్రోత్సహించేది. వీలైనంతవరకు సంక్షేమ కార్యక్రమాలను వీరి సహకారంతో నిర్వహించేవారు.

దుర్గము : ఆ రోజులలో రక్షణకు కోటలు చాలా ముఖ్యం. అత్యవసర పరిస్థితులను తట్టుకోవడానికి వీలుగా దుర్గమమైన స్థలాల్లో వాటిని నిర్మించేవారు. అందుకోసం కీలకమైన స్థలాలను ఎంచుకొనేవారు. అంతర్ – బహిర్ ప్రాకారాలు, రహస్య మార్గాలు, సైన్యానికి తగిన స్థలాలు, ఆయుధాగారం, కోశాగారం, ఆహార, అత్యవసర సామగ్రి, గిడ్డంగులు ఉండేవి. ఆహార – అత్యవసర సామగ్రి నిల్వలు ఎప్పుడూ ఉండేవి. గూఢచారి వ్యవస్థ వుండేది.

చతురంగ బలాలైన గజ, రథ, తురగ, పదాతి దళాల ఎంపిక, శిక్షణకు తగిన ఏర్పాట్లు, పద్ధతులు ఉండేవి. దండయాత్రల సమయంలో గట్టి చట్టాలు అమలులో ఉండేవి. వీటిలో కొన్ని: నిరాయుధులైన వారితో సైనికులు యుద్ధం చేయరాదు. బలహీనులకూ, స్త్రీలకూ, పిల్లలకూ, రోగులకూ, కాందిశీకులకూ హాని కలిగించరాదు. పంటపొలాలకు ఎలాంటి నష్టమూ చేయకూడదు. ప్రాంతీయ ఆచారాలనూ, మతాన్నీ గౌరవించాలి. ఓటమికి గురైన రాజు దగ్గరి బంధువును నూతన ప్రభువుగా ఏర్పాటుచేయవచ్చు. అతను సామంత రాజుగా ఉంటూ, కప్పం చెల్లిస్తూ, రాజుగారికి అవసరమైనప్పుడు సైన్యాన్ని పంపుతూ, అన్నిరకాల స్వయంపాలనా స్వాతంత్ర్యం కలిగి వుండేవాడు. జయించబడిన రాజ్యంలోని ప్రజలతో స్నేహ సౌహార్దాలను పెంపొందించుకొనేవారు.

కోశాగారం : తగిన ఆర్థిక వనరులు లేకుండా ప్రభుత్వం ఏ పనులూ చేపట్టలేదు. కనుక పన్నుల వసూలు ప్రభుత్వం యొక్క ప్రధాన కర్తవ్యం. అయితే, పన్నులు ఎక్కువగా ఉండి, ప్రజలకు భారం కాకూడదు. భూమి శిస్తు ముఖ్యమైన పన్ను. నీటిపారుదల పన్నును కూడా వసూలు చేసేవారు. పంట దిగుబడిలో 1/6 లేక 1/5వ భాగాన్ని పన్నుగా వసూలు చేసేవారు. కళలు, చేతిపనులు, వర్తకాలకు కూడా పన్ను ఉండేది. విద్యాసంస్థలు, వికలాంగులు, నిరుద్యోగులు, సాధువులు, బ్రాహ్మణులకు పన్ను మినహాయింపు ఉండేది. కరవు, వరదలు, అత్యవసర పరిస్థితులలో పన్నులు రద్దు చేయడం కానీ, తరువాత వసూలుచేయడం కానీ జరిగేది. అత్యవసర పరిస్థితుల కోసం సేకరించిన నిధులను ప్రత్యేక కోశాగారాలలో ఉంచి, కష్టకాలాలలోనే వాడేవారు. జమాఖర్చులను నిరంతరం సరిచూసేవారు. పన్నులు వసూలుచేసే అధికారులు మానవత్వంతో ప్రవర్తించాలి. అతిక్రమించి క్రౌర్యం చూపిస్తే దండన ఉండేది. పన్నుల ద్వారా వచ్చిన ఆదాయాన్ని వివిధ శాఖలకు పంచేవారు.

మిత్రులు : సామ్రాజ్యాన్ని పటిష్ఠపరచడానికీ, అత్యవసర పరిస్థితులలో సహాయం చేయడానికీ మిత్ర రాజ్యాల ఆవశ్యకతను గుర్తించారు. సామ, దాన ఉపాయాలను ఈ విషయంలో



పాటించేవారు. సామ, దానాలకు లొంగనట్లయితే, తటస్థ రాజ్యాలుగా గుర్తించేవారు. మిత్ర రాజ్యాలకు అవసరమైనప్పుడు సహాయం అందించేవారు. చేసుకొన్న ఒడంబడికలు తు.చ. తప్పకుండా ఆచరణకు నోచుకొనేవి. ధర్మాత్ములు, మంచివారైన రాజుల మీద దండయాత్రలుండేవి కావు.

ముఖ్యలక్షణాలు : హిందూ రాజ్యాంగ వ్యవస్థలోని మరికొన్ని ముఖ్యలక్షణాలు ఈ విధంగా ఉండేవి.

ప్రభుత్వంలో కీలకమైన పదవుల నియామకాలు రాజుగారు చేసినా, పల్లెలు, పట్టణాల ప్రాంతీయ అధికారులు ప్రజలచే ఎన్నుకోబడేవారు. ప్రాంతీయ పాలనలో కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకొనేది కాదు. ప్రాంతీయ ఆచారాలు, ఆనవాయితీలు గౌరవింపబడేవి. జనాభా గణన, పశుగణన ఉండేవి.

సామాజిక చట్టాలను అతిక్రమించినవారికి అనేక రకాల శిక్షలుండేవి. సంస్కృతి అభివృద్ధికి అవసరమైన సామాజిక శాంతి పరిరక్షణకు అన్ని చర్యలనూ తీసుకొనేవారు. మందిరాలను, దేవాలయాలను రక్షించేవారు. ❖

అనువాదం: డాక్టర్ పి.వి. రెడ్డి

ఓ రాజా! భూమి అనే ధేనువు నుండి పాలు పితుకదలిస్తే గోవత్సములను పోషించినట్లు, జనులను పోషింపుము. పుష్టినొందిన ప్రజల వల్ల దేశము కల్పవృక్షంలాగ సమస్త ఫలములనిచ్చును. - భర్తృహరి



దివ్యజీవనంలో దినచర్య ప్రాధాన్యం

– స్వామి యతీశ్వరానంద*

ఆధ్యాత్మిక జీవనం సాగించాలంటే, మనం చేసే కార్యక్రమాలను సుస్పష్టమైన, ఖచ్చితమైన అవగాహనతో చేయాలి. ఒక ఖచ్చితమైన దినచర్యను తయారుచేసుకుని, దాన్ని అనుసరిస్తూ పోవాలి. అటువంటి దినచర్య వలన జీవితం యాంత్రికంగా తయారవుతుందని కొందరు భయపడవచ్చు. కానీ అది నిజం కాదు. ప్రారంభదశలో సాధకుడు క్రమబద్ధమైన దినచర్యకు అలవాటు పడకపోతే, పరిపరి విధాలపోయే మనస్సును నియంత్రించలేడు. మనం ఎంతసేపు నిద్రించాలి; రోజువారీ పనులకు ఎంత సమయం కేటాయించాలి; మిగిలిన ఖాళీ సమయంలో ఏ పనులు చేయవచ్చు; ఎటువంటి ఆలోచనలు మనం చేస్తూ ఉండాలి – ఈ విధమైన విషయాలను చక్కగా ఆలోచించి, ఒక ప్రణాళికలాగా వేసుకోవాలి. తన విధివిధానాల పట్ల పూర్తి అవగాహనతో, జాగరూకతతో ఆధ్యాత్మిక సాధకుడు జీవించాలి. తాను చేస్తున్న పనులను ప్రయత్నపూర్వకంగా చేయాలి.


మంచి అలవాట్లను పెంపొందించుకుని, వాటిని మరింత బలవత్తరం చేసుకోవాలి. అప్పుడు ఆధ్యాత్మిక జీవనపు 'బాలారిష్టాలు' అంటే తొలి రోజులలో పడే కష్టాలు తక్కువగా ఉంటాయి. మీ ప్రణాళికకు బద్ధులై ప్రవర్తించండి. మనస్సు అశాంతిగా ఉన్నా ధ్యానం చేయడం మానరాదు. నియమబద్ధంగా సాధన చేయడం వలన మనస్సు సాధనకు అలవాటు పడుతుంది. ప్రారంభదశలో జపధ్యానాలకు తక్కువ సమయం కేటాయించవచ్చు. కానీ రోజులు గడుస్తున్న కొద్దీ జపధ్యానాల సమయాన్ని మరింతగా పెంచాలి. ఆధ్యాత్మికంగా పురోగతి సాధించిన వారిలో భక్తిప్రవాహం ఎల్లప్పుడూ ప్రవహిస్తూనే ఉంటుంది. అందువలన వారు, బయటికి పనులు చేస్తున్నట్లు కనిపిస్తున్నా, మనసులో సాధనను చేస్తూనే ఉంటారు. ఆ స్థితికి చేరుకునే దాకా, క్రమబద్ధమైన ప్రణాళికను అనుసరించడం మంచిది. లేకపోతే పారమార్థిక పురోగతి కుంటుపడుతుంది.

మన మనస్సులో ఉండే సూక్ష్మ విషయాలను అర్థం చేసుకునేంత గ్రహణశక్తి మనకు ఉండదు. మనం చేసే అన్ని పనులనూ, ఆలోచనలనూ సమర్థించుకుంటూ, సంజాయిషీలను చెప్పుకుంటూ ఉంటాము. ప్రత్యేకించి సాధన చేయడాన్ని తప్పించుకోవడానికి మన మనస్సు రకరకాల కారణాలను వెతుకుతుంది. అలాంటి మనస్సు మాట వింటే మోసపోతాము సుమా!

ఆధ్యాత్మిక సాధనల్ని అభ్యసించడానికి మనస్సు అంత శీఘ్రంగా సమ్మతించదు. ఇందులో సందేహం లేదు. మనస్సు ఎన్నోవిధాలుగా మభ్యపెడుతుంది. "చూడు! ఈ రోజు నీకు నిద్ర సరిపోలేదు. ఇలా చేస్తే నీ నరాలకు మంచిది కాదు. ఆరోగ్యానికి కూడా హానికరం. నరాల బలహీనత, అనారోగ్యం వంటివి రాకుండా చూచుకో! ఒకటి రెండు రోజులు సాధన ఆపినా నష్టం లేదులే!" అంటూ, ఉచిత సలహాలను ఇస్తూ ఉంటుంది! అటువంటి సమయాలలో మీ మనస్సు మాట వినకుండా సాధన చేయడానికి ప్రాధాన్యమివ్వండి. రథం కదలకపోతే సారథి గుర్రాలను కొట్టి, బలవంతంగా నడిపించినట్లు, మీ మనస్సును మీరు బలవంతంగా సాధనవైపు నడిపించాలి.

సాధనకు కేటాయించిన సమయం ఎంత తక్కువైతే, పారమార్థిక పురోగతి కూడా అంత తక్కువగా ఉంటుందని మనం మరచిపోకూడదు. అర్థంపర్థం లేని ఆలోచనలను, పోచికోలు మాటలను, గమ్యంలేని కార్యకలాపాలను, పనికిమాలిన తిరుగుళ్ళను తగ్గించాలి. వీటి వలన వృథా అయ్యే సమయాన్ని పొదుపు చేస్తే, సాధనకు ఖచ్చితంగా సమయం లభిస్తుంది. అడపాదడపా చేసే ధ్యానసాధన వలన ప్రయోజనం శూన్యం. పనికిమాలిన వ్యవహారాలను తగ్గించి, వాటికై ఖర్చయ్యే శక్తిని, సమయాన్ని పొదుపు చేయాలి. ఈ రోజులలో సమయాన్ని, శక్తిని మనం ఎలా వృథా చేస్తున్నామో మాటలలో చెప్పలేము. అశాంతి, అలజడి అనే సుడిగుండాల్లో చిక్కుకొనివున్నాం. నిజంగా పారమార్థిక సాధన చేయాలనుకుంటే, అరకొర ప్రయత్నాలను మాని, ఈ సుడిగుండాలను దృఢమైన సంకల్పశక్తితో అధిగమించాలి. ❖

(*స్వామి యతీశ్వరానంద – శ్రీరామకృష్ణుల ప్రత్యక్ష సన్న్యాస శిష్యులైన స్వామి బ్రహ్మానంద మహరాజ్ శిష్యులు)



బ్రహ్మ పూజించె రఘుపతి విభీషణు కిచ్చె
బ్రహ్మణ్యుడీ రంగపతి గొలువరో
కావేరి మధ్య రంగక్షేత్ర మల్లదిగో
శ్రీవిమాన మదిగో శేషపర్యంక మిదె
దేవుఁడల్లదె వాడె దేవి శ్రీలక్ష్మి యదె
సేవించరో నాభిఁ చిగురించె నతఁడూ
యేడు గోడలు నవిగో యెసగు పూతోపు లవె
కూడి దామోదర పురగోపుర మదె
తోడ వేయికంబాల దొడ్డమంటప మదిగో
చూడరో పసిడిమించుల కంబ మదిగో
ఆళువారులు వారే యంగరంగ విభవమిదె
వాలు శ్రీవైష్ణవపు వాడలవిగో
ఆ లీల శ్రీవేంకటేశుడై వర మిచ్చీని
తాలిముల శ్రీరంగ దైవము గొలువరో

రంగక్షేత్ర మల్లదిగో...

– శ్రీమతి బి. కృష్ణకుమారి

కావేరీ తీరాన కొలువు తీరి, కోరిన కోర్కెలు తీర్చే కొంగు బంగారం – శ్రీరంగనాథుడు. సప్తప్రాకారాల నడుమ భగవానుడు భుజంగ శయనుడై దర్శనమిచ్చే ఈ క్షేత్రం భూలోక వైకుంఠంగా ప్రసిద్ధం. ఈ స్వామి ఆవిర్భావం వెనుక ఓ కథ ఉంది. సాక్షాత్తూ బ్రహ్మదేవుడి తపఃఫలంగా శ్రీమహావిష్ణువు శ్రీరంగనాథుడిగా ఆవిర్భవించాడు. అనంతరం మనువు వంశస్థుడైన ఇక్ష్వాకుడు బ్రహ్మను ప్రార్థించి శ్రీరంగనాథుడిని అయోధ్యలో ప్రతిష్ఠించాడు. ఆ పరంపరలో ఇక్ష్వాకు వంశస్థుడైన శ్రీరామచంద్రుడు తన పట్టాభిషేక శుభవేళ శ్రీరంగ విమానాన్ని విభీషణుడికి కానుకగా ఇచ్చాడు. అంతటి మహిమాన్వితమైన మూర్తిని విభీషణుడు లంకకు కొనిపోతూ, మార్గమధ్యంలో కావేరీ నదీతీరంలో చంద్రపుష్కరిణి వద్ద విడిది చేశాడు. అయితే శ్రీరంగనాథుడు తాను కావేరీ తీరమందే కొలువై ఉంటానని విభీషణుడికి స్వప్నంలో స్పష్టం చేశాడు. విభీషణుడు పరిపాలించే లంక వైపు చూస్తూ శయనించి ఉంటానని వరమిచ్చాడు. ఇలా తమిళనేలపై ఉభయకావేరులైన కావేరి, కొల్లడం నదులు పుష్పహారంగా వెలయగా, నడుమ పగడాల దీవి లాంటి శ్రీరంగంలో శేషతల్పంపై పవళించి స్వామి పూజలందుకుంటున్నాడు. అంతటి ఆ క్షేత్ర మాహాత్మ్యాన్ని **'బ్రహ్మ పూజించె రఘుపతి విభీషణు కిచ్చె...'** అంటూ అన్నమాచార్యులు తన మధుర మంజుల పదావళితో ప్రస్తుతిస్తున్నాడు.

రంగపతి కొలువరో...

శ్రీరంగనాథ క్షేత్ర ప్రస్తావన బ్రహ్మాండ పురాణంలోనే కాక, వాల్మీకి రామాయణంలో కూడా కనిపిస్తుంది. బ్రహ్మ చేసిన తపస్సుకు మెచ్చి శ్రీరంగనాథుడి విగ్రహం స్వయంవ్యక్తమై పాలసంద్రం నుంచి శ్రీరంగవిమానం సహా కొన్ని యుగాలకు పూర్వం ఉద్భవించిందని పురాణకథనం. అలాంటి రంగనాథుడి వైభవాన్ని భక్త కవులు....

కావేరీ విరజాసేయం వైకుంఠం రంగమందిరమ్
సవాసుదేవో రంగేశః ప్రత్యక్షం పరమం పదమ్
విమానం ప్రణవాకారం వేదశృంగం మహాద్భుతం
శ్రీరంగశాయీ భగవాన్ ప్రణవార్థ ప్రకాశకః

'కావేరి నదిని వైకుంఠంలోని విరజానదితో, ఆ కోవెలను సాక్షాత్తూ వైకుంఠంతో, శ్రీరంగనాథుడిని సాక్షాత్తూ వాసుదేవుడితో, ఆ దేవదేవుడి విమానాన్ని ఓంకారంతో పోలుస్తూ' కీర్తించారు.

పరమతస్థుల దాడులనూ, దాష్టీకాలనూ తట్టుకొని మన సనాతన ధర్మానికి సాక్ష్యంగా నిలిచిన ఈ శ్రీరంగనాథ దేవాలయంలో భగవద్రామానుజులు చాలా కాలం బస చేశారు. వారు ఈ కోవెలలో జరపాల్సిన పూజావిధానాలు, ఉత్సవాలు జరపాల్సిన రీతులు, అధికారులు, ఉపచార గణాలు నిర్వహించాల్సిన విధులను వివరంగా, శాస్త్రోక్తంగా ఉల్లేఖించారు. ఆనాటి నుంచి కోవెలలో కార్యక్రమాలన్నీ రామానుజుల ఆనతి ప్రకారం జరుగుతున్నాయి. అంతటి ఈ పుణ్యతీర్థాన్ని వేంకటేశుడి భక్తాగ్రేసరుడు **'బ్రహ్మ పూజించె రఘుపతి విభీషణు కిచ్చె బ్రహ్మణ్యుడీ రంగపతి కొలువరో...'** అని పిలుపునిస్తున్నాడు. శ్రీరంగనాథుడిలోనూ శ్రీనివాసుణ్ణే చూసుకొని పొంగిపోతున్నాడు.

దేవుఁడల్లదె...

ఐక్యరాజ్యసమితి విద్యా, శాస్త్రీయ, సాంస్కృతిక సంస్థ (యునెస్కో) గుర్తింపు పొందిన భారతదేశపు ఆలయాల్లో ఈ

(మిగతా 34వ పేజీలో...)

దేవ ఋషులు భగవంతుడికి ఆప్తకోటిలోనివారు. వారే భగవంతుడికి మిత్రులు, సన్నిహితులు. సామాన్యులైన ఇతరులందరూ భగవంతుడికి దూరపు బంధువుల్లాంటివారు. - భగవాన్ శ్రీరామకృష్ణులు



పరిప్రశ్న

– స్వామి భూతేశానంద
(రామకృష్ణ సంఘ 12వ సర్వాధ్యక్షులు)

రామకృష్ణ సంఘ 12వ సర్వాధ్యక్షులు - స్వామి భూతేశానందజీ మహరాజ్ (1901-1998) భక్తుల ఆధ్యాత్మిక సందేహాలకు సరళమైన రీతిలో ఇచ్చిన సమాధానాలను 'శ్రీరామకృష్ణ ప్రభ' పాఠకుల ప్రయోజనార్థం 2013 జూలై సంచిక నుండి ధారావాహికంగా ప్రచురిస్తున్నాం.

భక్తుడు: ఉపాసన అంటే ఏమిటి?

స్వామీజీ: ఉపాసన అంటే 'ఉపగమ్య ఆసనం చింతనమ్ – ఇష్టదేవతతో ఉండడం, నిరంతరం ఇష్టదేవత గురించి చింతన చేయడం'. ఇష్టదేవతతో ఉండడం అంటే, దైవాన్ని వెతుక్కుంటూ ఎక్కడికో దూరంగా వెళ్ళిపోవడం కాదు. ఇష్టదైవాన్ని నిరంతరం స్మరిస్తూ, మన హృదయంలో దర్శించగలిగితే దైవానికి సన్నిహితంగా ఉన్నట్లే! భగవంతునితో అత్యంత సన్నిహిత సంబంధం ఏర్పరచుకోవడానికి ఆయన్ని మన తల్లి లేదా తండ్రిగా భావించడం ఉత్తమ మార్గం. పూజ, జపం, ధ్యానాలు అభ్యసించడం వల్ల భగవంతుని చింతనలో జీవించడం సాధ్యమవుతుంది. భగవంతుణ్ణి మన మదిలో నిలపగలగడానికి సహకరించేదే ఉపాసన.



భక్తుడు: ధ్యానంలో మనస్సు లగ్నం చేయడం ఎలా సాధ్యం?

స్వామీజీ: జీవితంలో ఏది సాధించాలన్నా నిరంతర అభ్యాసం అవసరం. ప్రతిరోజూ క్రమం తప్పకుండా సాధన చేసినప్పుడే ధ్యానం సిద్ధిస్తుంది. ధ్యానసిద్ధి ఒక్కరోజులో సాధ్యమయ్యేది కాదు. అలాగని సాధన చేయడం మానకూడదు.

మనస్సును నియంత్రించడానికి అభ్యాసం, వైరాగ్యాలను అలవరచుకోవాలంటూ పతంజలి మహర్షి ఇలా చెప్పారు:

'అభ్యాస వైరాగ్యాభ్యాం తన్నిరోధః – అభ్యాస వైరాగ్యముల చేత మనోవృత్తులు నిరోధించబడతాయి'.

అయితే మనోవృత్తులను నిరోధించడానికి ఎంతకాలం సాధన చేయాలి? అందుకు పతంజలి మహర్షి 'స తు దీర్ఘకాల నైరన్తర్యసత్కారసేవితో దృఢభూమిః – నిరంతరం, ఆదరంతో, శ్రద్ధతో చాలాకాలం అభ్యాసం చేసిన తరువాతే స్థిరమైన ధ్యానస్థితి కలుగుతుంది. చపలత్వమే సహజ స్వభావంగాగల మనస్సును నియంత్రించడానికి సహనంతో సాధన చేయడమే ఉపాయం.

భక్తుడు: ధ్యానం చేసినప్పుడు మాత్రమే భగవంతుణ్ణి దర్శించగలుగుతామా? మిగతా వేళల్లో అది సాధ్యం కాదా?

స్వామీజీ: మనం ధ్యానంలో అనుభూతి చెందిన దైవమే సకల చరాచర సృష్టి అంతా నిండివున్నాడు. నిజానికి దైవం సర్వాంతర్యామి. కానీ దైవాన్ని సర్వత్రా దర్శించడం సాధకుడికి ప్రారంభంలో సాధ్యం కాదు. అంతమాత్రాన దైవం బయటలేడని అనలేం. మన అంతరంగంలో దర్శించిన దైవాన్ని అంతటా దర్శించగలిగినప్పుడే సాధనలో పరిపూర్ణత సాధించినట్లు. అందుకే శ్రీరామకృష్ణులు భగవంతుని సర్వవ్యాపకత్వాన్ని గురించి చెబుతూ 'కళ్ళు మూసుకున్నప్పుడు కనిపించే దేవుడు కళ్ళు తెరిచినప్పుడు కనిపించడా?' అని ప్రశ్నించారు. అంటే భగవంతుడు అంతటా ఉన్నాడని అనుభూతి చెందినవారు కళ్ళు మూసినా, కళ్ళు తెరిచినా ఆయన్నే దర్శిస్తారు. అదే సాధనలో పరాకాష్ఠ. ❖

పండుగలు - పర్వదినాలు

జూన్ - 2014

9	సోమవారం	: ఏకాదశి
23	సోమవారం	: ఏకాదశి
29	ఆదివారం	: పూరీ జగన్నాథ రథయాత్ర

జూలై - 2014

8	మంగళవారం	: ఏకాదశి
12	శనివారం	: గురుపూర్ణిమ
22	మంగళవారం	: ఏకాదశి
24	గురువారం	: స్వామి రామకృష్ణానంద జయంతి

నారద భక్తి సూత్రాలు, శాండిల్య భక్తి సూత్రాలు భక్తియోగానికి సంబంధించిన ప్రామాణిక గ్రంథాలు. అయితే ఆధునిక తరంలో భగవదన్వేషకులకు అనువైన రీతిలో భక్తితత్త్వాన్ని బోధించారు శ్రీరామకృష్ణులు. ఈ నేపథ్యంలో 'శ్రీరామకృష్ణ కథామృతం' నుండి కొన్ని ఉపదేశాలను 'రామకృష్ణ భక్తి సూత్రాలు'గా సులభరీతిలో వివరించే ప్రయత్నం చేస్తున్నాం.

బౌద్ధగ్రంథాలు పాళీ భాషలో, బైబిల్ హీబ్రూలో, ఖురాన్ అరబ్బీ భాషలో రచించబడ్డాయి. అలాగే శ్రీరామకృష్ణుల ఉపదేశాలు వారి మాతృభాష బెంగాలీలో ఆవిష్కృతమయ్యాయి. అవతార పురుషుని ముఖతః వెలువడిన ఆ అమృతోప దేశాలను యథాతథంగా ఉట్టంకిస్తూ వ్యాఖ్యానిస్తున్నాం. మహాశక్తిమంతమైన ఆ బోధనలను మననం చేసుకుంటూ కృతార్థులమవుదాం.



ఈశ్వర్-ఇ సత్య ఆర్ సబ్ అనిత్య

భగవంతుడే సత్యం, మిగిలినది అనిత్యం.

శ్రీరామకృష్ణ ఉవాచ: "భగవంతుడే సత్యం, మిగిలినది అనిత్యం. జీవజగత్తు; ఇల్లు, ఆస్తి, పిల్లాజెల్లా – ఇవన్నీ గారడీవాడి గారడీ. గారడీ వాడు చిన్న సీసాను చూపించి, 'ఇదిగో చూడండి, చూడండి' అంటూ మూత తీస్తాడు. రెండు పక్షులు పైకి ఎగిరిపోతాయి! కానీ అది భ్రాంతి. గారడీవాడే సత్యం.

నీరు సత్యం, నీటి బుడగ ఈ క్షణం ఉంటుంది. మరుక్షణం ఉండదు. బుడగ ఏ నీటిలో పుట్టిందో, అందులోనే కలిసిపోతుంది. అలాగే భగవంతుడు మహాసాగరం, జీవులు బుడగలు. ఆయన నుండే సృష్టి, ఆయనలోనే లయం.

తోట యజమాని – భగవంతుడు; తోట – ఆయన ఐశ్వర్యం. జనం తోటను చూసి ఆనందిస్తారు. యజమానిని చూడాలని తలచేవారెందరు? ఐశ్వర్యం మూన్నాళ్ళ ముచ్చట. భగవంతుడే సత్యం."

వ్యాఖ్య: సత్యం అంటే చిరకాలం (భూత, వర్తమాన, భవిష్యత్తులలో) మారకుండా ఒకేలా ఉండేది. దానికి నాశనం ఉండదు. ప్రాపంచిక వస్తువులు, స్వర్గసుఖాలు భోగ్యవస్తువులు, స్థావర జంగమాదులన్నీ కొంత కాలం తరువాత నశించడం చూస్తూనే ఉంటాం. సృష్టిలోని ఏ పదార్థమైనా, చివరకు మన ఆలోచనలే అయినా శాశ్వతంగా ఉండవు. మూడు కాలాల్లోనూ మార్పు చెందనిది భగవంతుడు మాత్రమే.

విజ్ఞాన శాస్త్రం ఏం చెబుతోంది? క్వార్క్ లేదా గ్లూ ఆన్ (gluon) అనబడే సూక్ష్మాతి సూక్ష్మ పదార్థం ఒకదాన్ని కనుగొన్నారు. ఈ జగత్తులోని ప్రతి పదార్థం ఈ సూక్ష్మాతిసూక్ష్మ పదార్థం యొక్క సమాహారమే. ఒక పదార్థం పరివర్తనం చెందినా, రూపాంతరం చెందినా మారకుండా నిలిచి ఉండేది – క్వార్క్ లేదా గ్లూ ఆన్ మాత్రమే. అంటే విషయవస్తువు ఏ పదార్థం నుండి తయారైందో, నాశనం అనంతరం మిగిలే ఆ మూల పదార్థం ఎన్నడూ నాశనం కాదు. శాస్త్రాలలో దీన్ని వివిధ విధాల ఋజువు చేశారు. ఈ విషయాన్నే శ్రీరామకృష్ణులు 'భగవంతుడే సత్యం, మిగిలినది అనిత్యం' అని సరళమైన రీతిలో చెప్పారు.

జీవితకాలమంతా సుఖంగా ఉండాలనేది జీవుల కోరిక. సౌఖ్యాన్ని శాశ్వతంగా నిలుపుకొనడం కోసం అనేక ప్రయత్నాలు చేస్తారు, కృతార్థులు కాలేరు. శాశ్వత ఆనందం భగవంతుడే అన్నారు శ్రీరామకృష్ణులు. కనుక భగవత్సాక్షాత్కారం కోసం సాధన చేయడమే మార్గం.

❖❖❖

ఈశ్వర్ రసస్వరూప్ - భక్త రసిక్

భగవంతుడు రసస్వరూపుడు, భక్తుడు రసికుడు.

శ్రీరామకృష్ణ ఉవాచ: "భక్తియోగం ద్వారా కలిగే సమాధిని 'చేతన సమాధి' అంటారు. ఈ స్థితిలో నేను సేవకుడను, నేను రసాస్వాదకుడను అనే 'నేను' మాత్రమే ఉంటుంది. సేవింపబడేది భగవంతుడు (సేవ్యము), భక్తుడు సేవకుడు; భగవంతుడు రసస్వరూపుడు, భక్తుడు రసికుడు; ఆస్వాదించవలసినది భగవంతుణ్ణి, భక్తుడు ఆస్వాదకుడు. నేను పంచదారగా మారను, దాన్ని తినడానికి ఇష్టపడతాను".

వ్యాఖ్య: 'రసోవైసః' అంటుంది ఉపనిషత్తు. అంటే – భగవంతుడు రసస్వరూపుడు. రసం అంటే 'ఆనందం' అని అర్థం. ఆనందం నుండే చతుర్వింశతి తత్త్వాలు జనించాయని ఉపనిషత్తుల కథనం. భగవంతుణ్ణి సచ్చిదానంద సాగరం అని సకల శాస్త్రాలూ పేర్కొన్నాయి. శ్రీరామకృష్ణులు 'భగవంతుడు రసస్వరూపుడు, భక్తుడు రసికుడు' అన్నారు. ఆయన కూడా రసం అంటే ఆనందం అనే తెలిపారు. సామాధ్యాయి ఉపన్యాసంలో 'భగవంతుడు రసహీనుడు, మనం మన ప్రేమభక్తి నింపి ఆయనను రసవంతుణ్ణి చేయాలి' అన్నాడట. అది విని శ్రీరామకృష్ణులు 'చూడండి, చూడండి, ఎవడు రసస్వరూపుడో, వానిని రసహీనుడు అంటున్నాడు' అన్నారు. దీన్నిబట్టి ఆ వ్యక్తి భగవదనుభూతిని పొందలేదని అర్థం. ❖

అనువాదం: డాక్టర్ కమల జయరావు

ఎవడికి భగవంతుని ప్రేమస్వరూపం అవగతమగునో వాడు భక్తిరసపానమత్తుడై చరించును. ఆత్మారామస్వరూపుడైన భక్తుడు నిజమైన జీవన్ముక్తుడు. అతడున్నచోటే ముక్తిధామం. - నారదభక్తిసూత్రాలు

ఉదాత్త గుణం

– రాచమడుగు శ్రీనివాసులు

భీష్ముడు కర్ణుడిని అర్ధరథునిగా పేర్కొని ఎంతో అవమానించాడు. భీష్ముడున్నంతవరకు యుద్ధం చేయనని కర్ణుడు నిర్మొహమాటంగా తన నిర్ణయాన్ని రారాజుకు తెలియజేశాడు. యుద్ధం పది రోజులు జరిగి పాండవసైన్యం ఎంతో క్షీణించింది. చివరకు పాండవులు, శ్రీకృష్ణుని సలహాను అనుసరించి భీష్ముని కలిసి ఆయన్ను వధించే ఉపాయమేమిటో ఆయన్నుంచే తెలుసుకొన్నారు. శిఖండిని ముందుపెట్టుకొని అర్జునుడు భీష్ముడిని ఎదిరించి ఓడించాడు.

భీష్ముడు అంపశయ్యపైనున్న విషయం తెలిసి కర్ణుడెంతో బాధపడి ఆయన్ను చూడడానికి వెళ్ళాడు. భీష్ముని చూసి కన్నీరు కారుస్తూ చేతులు జోడించి ఆయనతో "ఓ



మహానుభావా! నేను రాధేయుడను. నీ కోపమునకు గురైనవాడను. నిన్ను దర్శింపవచ్చితిని" అన్నాడు. అప్పుడు భీష్ముడు, "ఓ రాధేయా! నీవు నాకు శత్రువు కావు. ఓ సువ్రతా! నీవు కారణము లేకయే పాండవులను నిందించుటను చూసి, నీ గర్వపరిహారమునకై నిన్నటుల తూలనాడితిని... సమరాంగణమున నీవు చూపు పరాక్రమమెట్టిదో నేనెరుగనివాడను కాను... పౌరుషమెన్నడునూ దైవము నతిక్రమింపజాలదు. వీరులగు పాండవులు నీకు సోదరులు. కావున నీవు నాకు ప్రియమొనర్చువాడవేని పాండవులతో సంధి యొనర్చుకొనుము. పాండవులతోడి నీవైరము నాతో శాంతించుగాక! ఇక పుడమిగల క్షత్రియులెల్లరును సుఖింతురుగాక!" అని అన్నాడు *(భీష్మపర్వము – మదాంధ్ర వచన మహాభారతము)*.

కర్ణుడు భీష్మునితో "ఓ మహానుభావా! సుయోధనుని ఐశ్వర్యమును అనుభవించిన వాడను. వానిని వైఫల్య మొనర్పనుత్సహింపను. నేను నా సర్వస్వాన్ని దుర్యోధనునికై వినియోగించువాడను. క్షత్రియునకు రోగమువల్ల మరణము రాకూడదు కదా! క్షత్రియ ధర్మమున ఉత్సాహముగలనేను అర్జునునితో పోరాడక మానను. ఓ పితామహా! యుద్ధమునకు కృత నిశ్చయుడనైయున్న నా మనవి నంగీకరింపుము. నీయనుజ్ఞ బడసి యుద్ధము చేయవలెనని నా నిశ్చయము. నా ఈ వచనము దురుక్తిగాని, విరుద్ధముగాని, తొందర పాటుగాని, చాపల్యముగాని కావచ్చును. ఇందు నా తప్పు గలదేని క్షమింప నర్హుడవు" – అని అన్నాడు *(భీష్మపర్వము– మదాంధ్ర వచన మహాభారతము)*.

భీష్ముడు కర్ణునితో "ఓ కర్ణా! స్వర్గమును కోరి యుద్ధమొనరింపుము. క్షత్రియునకు ధర్మయుద్ధముకంటే శ్రేయోదాయకమగు మార్గం వేరొకటిలేదు" అని చెప్పి ఆశీర్వదించి పంపాడు.

మహాభారతములోని ఈ సన్నివేశం నుంచి 21వ శతాబ్దంలో జీవిస్తున్న మనం కూడా ఎంతో నేర్చుకోవలసి ఉంది. ఇద్దరి మధ్య ఎంత శత్రుత్వమున్నా వారిలో ఏ ఒకరు కొన ఊపిరితోనున్నా ఇంకొకరు పరామర్శించాలి. శత్రుత్వాన్ని ప్రక్కనబెట్టి సానుభూతిని చూపాలి. విరుద్ధమైన భావాలు, ఆశయాలు ఉండవచ్చుగానీ విరోధముండరాదు. ఒకరి పరిస్థితిని ఇంకొకరు అర్థం చేసుకోవాలి. ఒకరి గుణ గణాలను మరియొకరు పేర్కొనాలి, వక్రీకరించరాదు. ఒకరినొకరు గౌరవించాలి, శ్రేయస్సును కాంక్షించాలి. ఎవరి ధర్మాన్ని వారు చక్కగా నిర్వర్తించాలి.

మహాభారతములోని ఈ సన్నివేశము ఎంత ఉన్నతమైన సంస్కారాన్ని నేర్పుతుంది! అందుకే ఇన్ని వందల ఏళ్ళుగా కాలపరీక్షకు నిలబడి ఒక తరం నుండి ఇంకొక తరానికి ప్రవహించింది మహాభారతము. జీవనదులలోకెల్ల ఉత్తమమైనజీవనది అది – మన జాతి జ్ఞాన తృష్ణను ఇంకెంతకాలమైనా తీర్చగల దివ్య గంగ మహాభారతం. తనివి తీరా ఆ గంగలో మునిగితే మన అంతరంగమంతా శక్తితరంగాలతో నిండిపోతుంది, సంస్కార భరితమవుతుంది. సంతోషపూరితమవుతుంది. మనలను సదాచార సంపన్నులుగా చేసి సన్మార్గంలో నడుపుతుంది. ❖



ప్రేమమయి శారద

- శ్రీమతి టి. ఆశాలత

ప్రేమ... ప్రేమ... ప్రేమ అనే ఈ పదానికి నిలువెత్తు నిదర్శనం శారదామాత. ఆమె ప్రేమ ఎలాంటిదంటే ఒక్కసారిగా ఉవ్వెత్తున అల లాగా లేచిపడిపోదు. నిరంతర ప్రవాహం లాగా కొనసాగుతుంది. ఆ ప్రవాహంలో దొంగ దగ్గర నుండి దొర వరకూ ఈదులాడిన వారే. ఆ ప్రేమమూర్తి ప్రేమకు కులమతాల పట్టింపు లేదు. జాతిమత భేదం లేదు. అందరూ నాకు సొంతమైన వారే అంటూ అక్కున చేర్చుకుంటుంది. సోదరి నివేదిత ఒకానొక సందర్భంలో ఇలా వ్రాశారు. "అమ్మా! మీరు ప్రేమమయ మూర్తులు. మీది కట్టలు తెంచుకునే నది వెల్లువ లాంటి లౌకిక ప్రేమ కాదు. మృదుమాధుర్యంతో కూడిన కాంతిపుంజం లాంటిది. అది గంభీర ప్రశాంతతతో వ్యాపించి అందరికీ శ్రేయస్సును ఒసగుతుంది."

అమ్మ ఛాయాచిత్రం చూస్తే నివేదిత వ్రాసిన వర్ణనకు నిదర్శనంగా కనిపిస్తారు. కాంతి పుంజాల్లా వెలుగొందే ఆ నేత్రాలు ప్రేమతో అందరినీ ఆహ్వానిస్తున్నట్లుగా అనిపిస్తాయి. అందుకే ఆ ప్రేమమూర్తి సమక్షంలో శ్రీరామకృష్ణుల వారు మొదలుకొని సామాన్యుల వరకూ పసిపిల్లల్లా ప్రశాంతంగా ఉండేవారు. భక్తులు అమ్మతో సన్నిహితంగా మెలగాలని ఎంతో శ్రమకోర్చి జయరాంబాటికి వెళ్ళేవారు. అర్ధరాత్రి వేళ వెళ్ళినా వారికి స్వయంగా వంటచేసి, భోజనం పెట్టి వారి బాధలను ఆలకించి, పరిష్కారమార్గాలను చూపేవారు.


"వందల మంది వచ్చినా ప్రేమతో వండి పెడతాను. నాకు ఎలాంటి కష్టం అనిపించదు" అనేవారు. ప్రేమ ఉన్నచోట కష్టానికి తావు ఉండదు అనడానికి ఇంత కన్నా నిదర్శనం మరొకటి లేదు. అలాగే భక్తులకు ఏదైనా బాధ కలిగినా ఆ తల్లి హృదయం తల్లడిల్లిపోయేది. అమ్మ ఒకసారి ఓ భక్తుడితో ఇలా అన్నారు: "నాయనా! మీ కాలిలో ముల్లు గుచ్చుకుంటే నా హృదయంలోనే గునపం గుచ్చుకున్నంత బాధ కలుగుతోంది."

చిన్ననాడే తల్లిని పోగొట్టుకున్న గిరీశ్ చంద్రఘోష్‌కు ఇలాంటి ప్రేమనే అందించారు. అతడికి శారదామాత అంటే ఎవరో తెలియదు. అతడు 19వ ఏట జబ్బు చేసి మంచాన పడ్డాడు. అప్పుడు ఓ దివ్య కాంతిని దర్శించాడు. ఆ కాంతి క్రమేణా ఓ మూర్తి ఆకారం దాల్చి అతనికి ప్రసాదం తినిపించి, సేవ చేసినట్లు దర్శనం కలిగింది. ఆ మూర్తి ఎవరై ఉంటారో అతనికి తెలియలేదు. 'బహుశా నా తల్లే అలా వచ్చి ఉంటుందనుకుంటా' అనుకున్నాడు గిరీశ్.

తదనంతరం కొంతకాలానికి గిరీశ్ తన కొడుకు చనిపోయిన దుఃఖంలో శారదాదేవి దర్శనం కోసం వచ్చాడు. అప్పటి వరకు గిరీశ్‌కు రామకృష్ణుల వారే తెలుసు. ఆయన మహాసమాధి తర్వాత భక్తులు అమ్మ శరణు జొచ్చేవారు. అలాగే గిరీశ్ కూడా అమ్మ దర్శనం కోసం గదిలోకి వచ్చి ప్రణమిల్లాడు. అప్పుడు గిరీశ్ తలెత్తి అమ్మను చూసి ఆశ్చర్యానికి గురయ్యాడు. తాను జబ్బు పడ్డప్పుడు సేవ చేసిన దివ్యమూర్తి, శారదామాత ఒకేలాగా ఉండడమే అతని ఆశ్చర్యానికి కారణం. చివరకు ఉండబట్టలేక అడిగేశాడు. "అవును నాయనా! నేను నీ తల్లినే!" అని శ్రీమాత బదులిచ్చారు.

ఆ చంద్రుడిలోనైనా మచ్చను చూడవచ్చేమోగానీ ఈ అమ్మ అందించిన ప్రేమలో ఎలాంటి మాలిన్యం లేదు. మాధుర్యమే ఉంది. సృష్టికి మూలాధారమైన ప్రేమను శరీరంలోని అణువణువునా నింపుకొని తన చూపులోనూ, తన చేతల్లోనూ ప్రదర్శించిన ఆ అవ్యాజ ప్రేమను మనం అణుమాత్రం ప్రదర్శించినా ఈ ధరణి శాంతిధామంగా విలసిల్లుతుంది. శ్రీరామకృష్ణుల మహాసమాధి అనంతరం రామకృష్ణ సంఘానికి ఓ చుక్కాని లాగా భాసిల్లిన శారదామాత ఒక సందర్భంలో "ఈ సంఘం ఇలా దినదినాభివృద్ధి చెందడం వెనుక దాగి ఉన్న అద్భుతశక్తి ప్రేమ" అన్నారు. ఆ పావనమూర్తి అందించిన అమృత ప్రేమతో ఈ మఠం సేవా నిలయాలుగా విస్తరించి, ఈనాటికీ కోట్లాది మందిని అక్కున చేర్చుకుంటోంది. ❖

> నాయనా! కలత చెందకు. నా బిడ్డ బురదలో దొర్లి శరీరాన్ని మలినం చేసుకుంటే అతణ్ణి పరిశుభ్రం చేసి నా ఒడిలోకి చేర్చుకోవడం తల్లిగా నా కర్తవ్యం కాదా? - మాతృమూర్తి శ్రీశారదాదేవి



పవిత్ర జీవనంతో ప్రశాంత వార్ధక్యం

– స్వామి భాస్కరానంద

నేను (స్వామి భాస్కరానంద) రామకృష్ణ సంఘంలో చేరిన కొత్తలో ఓ వరిష్ఠసాధువు నాకు ఓ విలువైన సూచన ఇచ్చారు. 'నీకు సన్న్యాస ఆశ్రమంలో నిజమైన ఆనందం లభించాలంటే ముందు వయోవృద్ధులైన మన సోదర సాధువులకు వ్యక్తిగత సేవలందించు. వారితో మాట్లాడేందుకు ప్రయత్నించు' అని చెప్పారు. ఆ సలహా మేరకు నేను వీలైనంత వరకు వృద్ధులైన సోదర సాధువులతో గడిపేందుకే ప్రయత్నించేవాణ్ణి. యుక్తవయస్సులో రామకృష్ణ సంఘంలో చేరి, వివిధ ప్రాంతాల్లో, వివిధ విభాగాల్లో విశేషమైన సేవలందించి జీవిత మలిసంధ్యలో బేలూరుమఠం వృద్ధాశ్రమంలో సేదతీరుతున్న సోదర సాధువులు ఎందరో కనిపిస్తూ ఉంటారు.

ఊపిరి సలపనంత పనుల మధ్య, అశేషమైన భక్తపరివారంతో ఒకప్పుడు ఒక వెలుగు వెలిగిన సాధువులు చివరి రోజుల్లో ఎవరితో సంబంధం లేకుండా, ఏకాంతంగా, వ్యక్తిగత సాధనలో తమ కాలాన్ని గడుపుతూ ఉంటారు. బేలూరు మఠంలో గంగాతీరాన అలా బెంచీలపై కూర్చొని, ఎవరికీ పట్టనట్టుగా ఉంటున్న వారికి మానసిక ఆలంబన ఏమిటో నాకు కొత్తలో అర్థమయ్యేది కాదు. కానీ మా సోదర సాధువు సూచనతో ఆ వరిష్ఠ సన్న్యాసులకు దగ్గరవుతున్న కొద్దీ చాలా విలువైన విషయాలు నాకు అర్థమయ్యాయి.

నేను వారికి వ్యక్తిగత సేవలందిస్తుంటే మొదట్లో చాలా మొహమాటపడుతూ, పనులు చేయనిచ్చేవారు కాదు. కానీ నేను వారికి తెలియకుండా వారి దుస్తుల్ని ఉతికి, ఆరిన తరువాత గదిలో అమర్చడం; గదిని శుభ్రం చేయడం చూసి నాతో చనువుగా ఉండేవారు. ప్రేమగా వాళ్ళ మనస్సులోని మాటల్ని నాతో పంచుకుంటూ ఉండేవారు. ముఖ్యంగా వారు రామకృష్ణ సంఘంలో చేరడానికి స్ఫూర్తినిచ్చిన అంశాలను ఆసక్తికరంగా వివరిస్తూ ఉంటే నాకు చాలా ఆనందం కలిగేది. అదే విధంగా అప్పుడప్పుడు వాళ్ళు తమ అంతరంగంలో దాగి ఉన్న అనుభవాలను ఆవిష్కరిస్తూ ఉంటే అవన్నీ ఆణిముత్యాల్లా వెలుగులీనేవి! వారి గురువుల నుంచి విన్న ఉపదేశాలు, పరంపరగా అలవరచుకున్న కొన్ని ఆదర్శాలు అద్భుతంగా తోచేవి. కొన్నిసార్లు వాళ్ళు మనస్సు విప్పి ఆధ్యాత్మిక పరమైన తమ అనుభూతులను కళ్ళకు కట్టినట్లు వివరిస్తూ ఉంటే, పుస్తకాల్లో కనిపించని ఎంతో జ్ఞానరాశిని తడుముతున్నట్లుండేది!

బాహ్యంగా వారు వార్ధక్యంలో ఉన్నా, జ్ఞానదీపికల్లాంటి వారి జ్ఞాపకాలను తరచి చూస్తున్నప్పుడు మాత్రం ముఖంలో తేజస్సు తళుక్కుమనేది. ఈ వయస్సులో కూడా ఆ వరిష్ఠసాధువులను ముందుకు నడిపిస్తున్నది వారి పవిత్ర జీవనం, ఆధ్యాత్మిక ఆదర్శమేనని నాకు స్పష్టమైంది. వృద్ధాప్యంలో ఆనందంగా గడపడానికి శారీరక ఆరోగ్యం కన్నా ముఖ్యమైంది, అవసరమైంది 'ఎంచుకున్న జీవనమార్గంపై స్పష్టమైన దృక్పథం, ఉదాత్తమైన ప్రవర్తన, పవిత్ర జీవనం' అని తెలిసింది. తాము నమ్ముకున్న అత్యున్నతమైన ఆదర్శానికి నూటికి నూరుపాళ్ళు కట్టుబడి ఉన్నవారి ముఖాల్లోనే అంతటి తేజస్సు ఉట్టిపడుతుందని అవగతమైంది. భగవాన్ శ్రీరామకృష్ణులపై గురితో తాము నమ్ముకున్న ఆశయం నుంచి పక్కకు జరగకుండా ఉండడమే వారి జీవనసూత్రమని తెలుసుకున్నాను. అందుకే ఎన్నడూ నేను వారి సాహచర్యాన్ని వదులుకోకూడదని ఆ రోజే నిర్ణయించుకున్నాను. నిజానికి ఈ భూలోకంలో స్వర్గమెక్కడైనా ఉందంటే, అది కేవలం విలువైన అనుభవాలతో, జీవనపాఠాలతో నిండుకుండలా కనిపించే ఇలాంటి వారి మధ్యేనన్నది నా విశ్వాసం. ❖

ధీరవాణి

– స్వామి వివేకానంద

హృదయాన్నే అనుసరించండి!



సాధనలన్నీ హృదయ పరిపాకానికే! భగవత్సాక్షాత్కారాన్ని పొందడానికి పాండిత్యం అక్కరలేదు. ఒక మహాత్ముడు నాతో, "ఇతరులను చంపడానికి కత్తులు అవసరం. ఆత్మహత్య చేసుకోవడానికి ఒక సూది చాలు. అలాగే, పరులకు బోధించడానికి అధిక ధీశక్తి, పాండిత్యం అవసరం. కానీ నీకు నీవే ఆత్మావబోధం పొందడానికి అవి అనవసరం" అన్నాడు.

నీవు పరిశుద్ధుడవేనా? – అయితే నీవు భగవంతుణ్ణి పొందగలవు. నిర్మల హృదయులు ధన్యులు. వారు ఈశ్వరుణ్ణి దర్శిస్తారు. నీవు పరిశుద్ధుడవు కాకపోతే, లోకంలోని విజ్ఞానశాస్త్రాలన్నీ అధ్యయనం చేసినా, అవి నీకు ఎంత మాత్రం ఉపకరించవు. నీవు చదివిన పుస్తకాలన్నిటిలో నీవు పూడుకొని పోవచ్చు. కానీ అవి నీకెక్కువ ఉపకరించవు. లక్ష్యాన్ని చేరుకొనేది హృదయం.

ధీశక్తిని దాటి ఈశ్వర జ్ఞానావేశ స్థాయికి హృదయం తీసికొని పోగలదు. ఆ దివ్యస్ఫూర్తి మేధాశక్తికి ఎన్నడూ కలుగజాలదు. హృదయం వెలుగొందినప్పుడు ఈశ్వరస్ఫూర్తి కలుగుతుంది. హృదయశూన్యుడైన మేధావికి ఏనాడూ దైవావేశం కలగదు. మేధాశక్తి ఇవ్వగల ఉపకరణం కన్నా గొప్ప ఉపకరణాన్ని హృదయం తెలుసుకుంటుంది. దివ్యావేశమే ఆ ఉపకరణం. విజ్ఞానానికి ధీశక్తి ఉపకరణమైనట్లే, దివ్యావేశానికి ఉపకరణం హృదయం. క్రింది దశలో హృదయం ధీశక్తి కన్నా చాలా దుర్బలమైన ఉపకరణం. అజ్ఞుడైన వానికేమీ తెలియదు. కానీ అతని స్వభావంలో కొంచెం ఆవేశముంటుంది. అతణ్ణి, ఒక గొప్ప ప్రొఫెసర్‌తో పోల్చి చూడండి – ప్రొఫెసర్ శక్తి ఎంత అద్భుతమైంది? కానీ ప్రొఫెసర్ ధీశక్తికి బద్ధుడు. కనుక అతడు ఒకే కాలంలో అటు మేధావిగా ఉండగలడు. ఇటు రాక్షసుడూ కాగలడు. హృదయశీలి అయిన వాడెప్పుడూ రాక్షసుడు కాలేడు. తగిన శిక్షణ సహాయంతో, హృదయం పరిణతినొంది, ధీశక్తిని దాటిపోగలదు. అది, ఈశ్వర జ్ఞానావేశంగా రూపొందగలదు.

కాబట్టి హృదయాన్నే అనుసరించండి. నిర్మల హృదయానికీ, బుద్ధికీ వైరుధ్యం కలిగినప్పుడంతా, నిర్మల హృదయ పక్షాన్నే అనుసరించండి. హృదయ ప్రేరణ సహేతుకంగా లేదని తోచినాసరే హృదయాన్నే అనుసరించండి. ఇతరులకు మేలు చేయడం మంచిదని తోచినప్పుడు అలాంటి పని అలౌకికమని మెదడు చెప్పవచ్చు. అయినా హృదయప్రేరణనే మన్నించండి. మెదడును అనుసరించేటప్పటి కన్నా హృదయాన్ని అనుసరించేటప్పుడు పొరపాట్లు తక్కువగా జరగడం గుర్తిస్తారు. సత్యాన్ని ప్రతిఫలించడానికి శ్రేష్ఠమైన అద్దం – విశుద్ధ హృదయం. ఈ సాధనలన్నీ హృదయ విశుద్ధికై ఉద్దేశించినవి. హృదయం స్వచ్ఛం కావడంతోనే సత్యాలన్నీ క్షణంలో అందులో ప్రతిఫలిస్తాయి. ❖

మీకు ఇష్టమైతే అత్యంత నిష్కపటంతో, నిస్స్వార్థంతో, అన్నింటి కంటే ముఖ్యంగా పరిపూర్ణమైన పావనత్వంతో నన్ను అనుసరించండి. నా ఆశీస్సులు మీ వెన్నంటి ఉంటాయి. - స్వామి వివేకానంద



'నారి' కాదు -

'స్త్రీలను గౌరవించడం మన సంప్రదాయం. వారి సీట్లలో వారినే కూర్చోనివ్వండి'. రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ బస్సులన్నింటిలోనూ వ్రాసి ఉండే ఈ మాటలు చదివిన ప్రతిసారీ విభిన్నమైన అర్థాన్నీ, భావాలనూ ప్రేరేపిస్తూ ఉంటాయి. ప్రస్తుత సమాజంలో మహిళామతల్లులపై జరుగుతున్న అమానుష సంఘటనలను తలచుకుంటే ఈ బస్సులోని బోధలు హాస్యాస్పదంగా అగుపిస్తాయి. 'స్త్రీలను గౌరవించడం మన సంప్రదాయం'-ఎందుకంటే? వేదకాలం నుండి పూజలందుకుంటున్న వేద మాత- గాయత్రీదేవి; జ్ఞాన సర్వస్వాలకు అధిష్ఠాత్రి దేవి-సరస్వతీదేవి; ధైర్యసాహసాలకు ప్రతిరూపం ఆదిపరాశక్తి-శ్రీదుర్గాదేవి; అష్టైశ్వర్యాలను ప్రసాదించే సౌభాగ్యదాత్రి-శ్రీమహాలక్ష్మీదేవి... ఇలా ఆరాధనలందుకుంటున్న వీరందరూ స్త్రీమూర్తులే కాబట్టి.

'సంప్రదాయం' అంటే? 'సమ్యక్ ప్రదానం ఇతి సంప్రదాయః - సమగ్రంగా, సంపూర్ణంగా ఇచ్చుట'. 'సమ్యక్ స రహస్యం ప్రదీయత ఇతి సంప్రదాయః - అతి విలువైన విషయం గురువు చేత శిష్యులకు ఉపదేశింపబడునది'. పురాతన కాలం నుండీ పూజ్యులైన గురువుల చేత ఆచరింపబడుతూ మానవజాతి శ్రేయస్సుకై, శిష్యపరంపరగా ఉపదేశింపబడుతూ వస్తూ ఉన్నదే 'సంప్రదాయం'.

యద్యదాచరతి శ్రేష్ఠః తత్త దేవేతరో జనః ।
స యత్ ప్రమాణం కురుతే లోకస్తదనువర్తతే ॥

"ఉత్తములు ఏ విధంగా ఆచరిస్తారో ఇతరులూ దాన్నే ఆచరిస్తారు, శ్రేష్ఠులు దేన్ని ప్రమాణంగా ప్రతిష్ఠింపజేస్తారో లోకమంతా దాన్నే అనుసరిస్తుంది *(భగవద్గీత-3.21)*.

మన భారతదేశం విశ్వ పూజ్యం అవడానికి మూలకారణాలు వేదాలు, పరబ్రహ్మ సాక్షాత్కారం పొందిన మహాఋషుల ఆత్మానుభూతులే! కనుక ఆ మహర్షులే మనకు ఉత్తములు, శ్రేష్ఠులు, ప్రామాణిక వ్యక్తులు. సర్వలోక శ్రేయస్సును ఆకాంక్షించి, వారు ఆచరించి బోధించిన 'మాతృదేవోభవ - తల్లి దైవంతో సమానం!' 'యత్ర నార్యస్తు పూజ్యంతే రమంతే తత్ర దేవతాః - ఎక్కడ స్త్రీలు పూజింపబడతారో, అక్కడ దేవతలు నివసిస్తారు' లాంటి హితోపదేశాలను పెడచెవిన పెట్టడమే నేడీ దుఃస్థితికి కారణం.

ఇంద్రాది దేవతలు ఆదిపరాశక్తి దుర్గాదేవిని ఇలా స్తుతించారు:

విద్యాస్సమస్తాః తవ దేవి భేదాః స్త్రియః సమస్తాః సకలా జగత్సు।
త్వయైకయా పూరితం అంబ ఏతత్ కా తే స్తుతిః స్తవ్య పరాపరోక్తిః ॥ 'ఓ విశ్వజననీ! సకల విద్యలూ, శాస్త్రాలూ నీ యొక్క విభిన్న అభివ్యక్తులు. విశ్వంలోని స్త్రీ మూర్తులు అందరూ నీ వివిధ రూపాలు. ఈ సృష్టి జాతి అంతా నీతోనే నిండి ఉంది. నిన్ను ఎవరు ఏ విధంగా స్తుతించగలరు? వర్ణించగలరు?'.

శ్రీరామకృష్ణ పరమహంస ప్రతి స్త్రీలోనూ తమ ఆరాధ్యదేవత అయిన శ్రీభవతారిణీ కాళికాదేవినే దర్శించేవారు. ఆఖరికి తమ ధర్మపత్ని అయిన శ్రీశారదాదేవిలో కూడా జగన్మాతనే దర్శించారు. కనుకనే 'శ్రీఫలహారిణీ కాళీ పూజ' రోజున షోడశీపూజలో శ్రీకాళికామాత విగ్రహం కాకుండా ఆ పూజాపీఠంపై శ్రీశారదాదేవిని ఆసీనురాలిని చేశారు. ఆమెను సాక్షాత్తూ శ్రీజగజ్జననిగా భావిస్తూ, సకల షోడశోపచారాలతో పూజ చేశారు. సకల సాధన ఫలాన్ని అమ్మ పాదాలకు సమర్పితం చేసి 'సర్వమంగళ మాంగల్యే...' స్తోత్రంతో శరణాగతులయ్యారు! ఆ విధంగా మనం మరచిపోయిన మన సంప్రదాయాన్ని పునరుజ్జీవింప జేశారు శ్రీరామకృష్ణులు.

శ్రీరామకృష్ణులు అవతార వరిష్ఠులు, వారు ఏ సాధన చేసినా, ఏ కర్మ అనుష్ఠించినా అది లోక కల్యాణం, మానవజాతి మార్గదర్శనం కోసమే! జన్మనిచ్చిన తల్లీ; తోడబుట్టిన చెల్లీ, అక్కా; అత్తా; అవ్వా; వదినా - ఇలా ప్రతీ స్త్రీ ఆ విశ్వమాత ప్రతిరూపాలు కాబట్టి వారందరినీ పవిత్ర భావంతో చూడాలని ఆచరించి మరీ బోధించారు. భార్యాభర్తల 'ప్రేమ' కేవలం శారీరక సుఖానికే పరిమితం కాదనీ, ఆత్మల ఆత్మీయత, అన్యోన్యత అనీ నిరూపించారు. అజ్ఞానులు మాత్రమే ప్రేమను కామంగా భావిస్తారు, భ్రమిస్తారు. 'ప్రేమ' మనిషిని దేవునిగా మారుస్తుంది; 'కామం' మనిషిని మృగంగా దిగజారుస్తుంది. భార్యాభర్తలు ఎంతో ప్రేమానురాగాలతో అన్యోన్యంగా ఆనందంగా కలిసి జీవించవచ్చు. శ్రీశారదా రామకృష్ణులు అన్యోన్య దంపతులుగా నిరూపించారు. "శ్రీరామకృష్ణులతో నివసించిన ఆ రోజులలో సదా నా

- నారాయణి!

– స్వామి అర్చనానంద

హృదయంలో ఒక పూర్ణ అమృతకలశం స్థాపితమైనట్లు ఆనంద పారవశ్యం అనుభవించేదాన్ని. ఆహా! శ్రీరామకృష్ణుల ప్రేమ, ఆప్యాయత, అనురాగాలను వర్ణించడం మానవ భాషకు అతీతం!.. నన్ను ప్రేమతోనే కాదు, గౌరవ భావంతోనూ చూసేవారు!... ఒక్క పువ్వుతోనైనా వారు నన్ను హింసించలేదు! వారి ప్రేమ, సేవల కోసం ఏ కష్టమూ కష్టమనిపించేది కాదు. పరమానందంతో అన్ని పనులూ చేసేదాన్ని" అన్నారు శ్రీశారదాదేవి స్వయంగా!



కామం, క్రోధం, లోభం, అసూయ, అహంకారం – ఇవన్నీ జంతు లక్షణాలు. అందుకే గీతాచార్యుడు శ్రీకృష్ణుడు ఎన్నోసార్లు గీతలో మనుషులకు – 'జంతుః, జంతవః' అన్న పదాలు వాడారు. ఈ జంతు ప్రవృత్తి నుండి బయటపడి మన ప్రేమ ఆత్మ సంబంధంగా మారినప్పుడు ఆ ప్రేమ నుండి సృజనాత్మక శక్తి వెలువడుతుంది. సంగీతం, సాహిత్యం, చిత్ర లేఖనం, కవిత్వం, నిస్వార్థసేవ, ఉన్నత విలువలు, ఉదాత్త ఆలోచనలు అన్నీ మనం జంతు ప్రవృత్తి నుండి దివ్య ప్రేమ దిశగా ఎదిగినప్పుడే ప్రారంభమవుతాయి.

మహావేగంతో ఉరుకులు, పరుగులతో ఎగిసిపడే నదీ జలాలను ఆపి, ఆనకట్టలు కట్టి, ఆ జలాలను వ్యవసాయానికీ, విద్యుత్ ఉత్పాదనకూ, త్రాగునీటికీ సద్వినియోగ పరుచుకుంటున్నాడు మనిషి. అలాగే తీవ్ర వేగంతో తనలో ఎగిసిపడుతున్న కామం, క్రోధం, లోభాలను నియంత్రించి భక్తి, జ్ఞానం, వివేకం, వైరాగ్యం, పవిత్రతలతో ఆత్మీయ సంబంధంగా, దివ్యానుబంధంగా మలచుకోవచ్చు. ప్రకృతిని ఎదిరించి ఆకాశ సౌధాలు, చంద్ర మండల యాత్రలు, సముద్ర తలంలో పరిశోధనలు, వైద్యరంగంలో అద్భుత విజయాలు సాధించిన మనిషి తన లోపలే ఉన్న పశు ప్రవృత్తిని మాత్రం జయించలేకపోతున్నాడు. ఆ పశువుకు దాసోహం అంటున్న పాశ్చాత్య దేశాలు కూడా దివ్యప్రేమమూర్తులైన శ్రీశారదా రామకృష్ణులకు ప్రణమిల్లుతున్నాయి.

పురుషులు తమ సొంత తల్లినీ, చెల్లినీ గౌరవించినట్లు సమాజంలోని ప్రతీ స్త్రీని పూజ్యభావంతో, మాతృభావంతో, సోదరీభావంతో చూడడం నేర్చుకోవాలి. దేవాలయంలో ఆ జగన్మాతను దుర్గాదేవిగా, సరస్వతిగా, మహాలక్ష్మిగా పూజిస్తూ, సమాజంలో అమ్మవారి సజీవ మూర్తులైన మహిళలను భోగదృష్టితో చూడడం ఆ విశ్వమాతను అవమానించడమే అవుతుంది. అలాగే స్త్రీలు కూడా తమను తాము అమ్మ వారి అంశలుగా మనస్ఫూర్తిగా నమ్మి వేష భూషణాలలో, సంభాషణలలో మాతృభావం, పూజ్యభావం కలిగేలా నడుచుకోవాలి. పవిత్రభావంతో మెలగాలి.

'పవిత్రత' అనే మహా వజ్రాయుధం ముందు ఎంతమంది రావణులు, దుర్యోధనులు, దుశ్శాసనులు, కీచకులు అయినా తలవంచి నమస్కరించవలసిందే! రావణుణ్ణి గడ్డిపోచతో సమానంగా భావించిన సీతాదేవి పవిత్ర పాతివ్రత్య శక్తి ముందు ఆ రావణుడు ఏమయ్యాడు? అందుకే స్వామి వివేకానంద "వేల మంది శ్రీరాములు ఉండవచ్చుగాక! కానీ సీత మాత్రం ఒక్కరే!" అని అన్నారు. ల

మనమందరం సీతామాత బిడ్డలం, ఆ సీతామాత రక్తం మనలో ప్రవహిస్తూ ఉంది. ఆ పతివ్రత సీతాదేవి ఆదర్శమే నేడు శ్రీశారదాదేవి పవిత్రాదర్శమైంది. ఆ పవిత్ర ఆదర్శాన్ని ఆచరించినప్పుడే నారిలో 'నారాయణి'ని దర్శించగలుగుతాం. ప్రతి స్త్రీని మాతృమూర్తిగా భావించగలుగుతాం. ❖

సర్వభూతములందూ మాతృస్వరూపంగా, బుద్ధిస్వరూపంగా, శక్తిస్వరూపంగా, లక్ష్మీస్వరూపంగా, రౌద్రస్వరూపంగా, శాంతిస్వరూపంగా ప్రతిష్ఠితమై ఉన్న దేవికి పదేపదే నమస్కారములు. - దేవీమాహాత్మ్యం

పరిశుద్ధమైన నదులు, నిర్మల సరోవరాలు, పచ్చటి మైదానాలు, చీమలు దూరని చిట్టడవులు, కాకులు దూరని కారడవులు, వివిధ పుష్ప పరిమళ భరిత మలయ మారుతం... ఇవన్నీ ఒకప్పటి మాటలు. నేడు గాలిదూరని గాజుమేడలు, అర్కప్రభ సోకని ఆకాశ హర్మ్యాలు.. వివిధ వాహన, పరిశ్రమ, మురుగునీటి జలాశయ నిర్గత దుర్గంధ మందమారుతం... అంతా కాలుష్యమే. భావ కాలుష్యం, భౌతిక కాలుష్యం - రెండూ విపరీతంగా పెరిగిన దేశం మనది నేడు. పాశ్చాత్య దేశాలలో కూడా పర్యావరణ కాలుష్యం తీవ్రంగానే ఉన్నా, నదులు, సరస్సులు, అడవులు, గాలి... ఇతర ప్రకృతి వనరులను పరిరక్షించుకోవాలన్న తపన వారిలో స్పష్టంగా కనపడుతుంది. అలానే పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్న భావన వారికి ఉంది. పరిసరాలు అశుభ్రంగా ఉంటే వారు అసౌకర్యానికి గురవుతారు. అందుకని చెత్త ఎక్కడ పడితే అక్కడ పడవేయరు. వ్యర్థాలను చెత్తకుండీలలో, నిర్దేశించిన ప్రదేశాలలోనే వేస్తారు. జనావాసాలకు దూరంగా పడేస్తారు. సాధ్యమైనంతవరకు పునర్వినియోగానికి వీలుగా మార్చేందుకు ప్రయత్నిస్తారు.

ఆమె విస్తుపోయింది. ఈ దేశంలో చదువుకున్నవారు ఇలా ఆలోచిస్తుంటే, ప్రవర్తిస్తుంటే ఇక చదువురానివారు ఏవిధంగా నడుచుకుంటున్నారో కదా! అని ముక్కున వేలేసుకుంది. తాను తీసిన ఆ చెత్తను పట్టణంలోకి వెళ్ళాక ఒక చెత్తకుండీలో పడేశారు. తన తోటి డాక్టర్లందరికీ పౌరసత్వ బాధ్యత విషయంలో ఒక పాఠం నేర్పించారు. ఇది మనకీ ఒక గుణపాఠం కాగలదు.

మనకు ఒంటి శుభ్రం ఉంటుంది. ఇంటి శుభ్రం ఉంటుంది. వీధి శుభ్రం, పరిసరాల శుభ్రం మాత్రం గాలికి వదిలేస్తాం. పట్టణీకరణ పుణ్యమా అని మనం అన్ని వస్తువులనూ, చివరకు రోజూ త్రాగే నీటినీ, తినే ఆహారాన్నీ... అన్నింటినీ ప్లాస్టిక్ ప్యాకెట్లలో వేసి ఉపయోగించాల్సిందే. ఇది ఎంతవరకూ వెళ్ళిందంటే - చివరకు వేడి వేడి టీని కూడా ప్లాస్టిక్ గ్లాసులలో త్రాగుతున్నాం. వేడి వేడి కూరలు, సాంబారు, రసం లాంటి పదార్థాలను ప్లాస్టిక్ కవర్లలో పోసి తెచ్చుకొని తింటున్నాం. ఒక చిన్న టిఫిన్ బాక్సును, చేతిసంచీని, బుట్టను వెంట తీసుకు వెళ్ళాలంటే నామోషీ. మరి కాలేయ సంబంధ వ్యాధులు, మూత్రపిండ వ్యాధులు, క్యాన్సర్లు ఇబ్బడిముబ్బడిగా పెరుగుతున్నాయంటే ఇక ఆశ్చర్య మేముంది? మన జ్ఞానం అంతగా పరిఢవిల్లుతోంది!



పారిశుద్ధ్యం...

ఇక మన పరిస్థితి... మనకు ప్రతిదానికీ చట్టాలే కావాలి. పౌరుడిగా మన బాధ్యతను గుర్తెరగడం మనకు ఇంకా రాలేదు. మనం స్వేచ్ఛా భారతంలో ఉన్నాం. 'ఇది నా దేశం, ఇవి నా పరిసరాలు. ఈ ప్రకృతిని కాపాడుకోవడం నా ధర్మం, నా కర్తవ్యం' అని అందరూ అనుకోవాలి. ఈ మధ్య రామకృష్ణ మఠంలోని వివేకానంద ఆరోగ్యకేంద్రం ద్వారా హైదరాబాదుకు సమీపంలోని ఒక పట్టణంలో, అక్కడి ప్రభుత్వ ఆసుపత్రిలో ఒక వైద్య శిబిరం నిర్వహించాం. ఆరోగ్యకేంద్రంలో సేవలందిస్తున్న వైద్యులతో పాటు భారతదేశాన్ని సందర్శించటానికి వచ్చిన ఒక అమెరికా వైద్యురాలు కూడా ఆ శిబిరానికి బయలుదేరారు. తమతో పాటు తీసుకు వెళుతున్న అల్పాహారం తీసుకోవటానికి డాక్టర్లు అందరూ దారి ప్రక్కన ఆగారు. అక్కడ కొద్దిపాటి చెట్లు ఉన్నాయి. అందరూ అల్పాహారం తిన్న తర్వాత ఆ ప్లేట్లు, గ్లాసులు, ప్లాస్టిక్ సంచులు అక్కడే పడవేసి వాహనాలలో కూర్చున్నారు. ఆ విదేశీయురాలు మాత్రం అన్ని ప్లేట్లను ఏరి, పారేసిన ప్లాస్టిక్ బ్యాగులో పెట్టి తీసుకువచ్చి కారు డిక్కీలో పెట్టారు. మిగతా డాక్టర్లు 'ఇది నిర్జన ప్రదేశం; ఇక్కడ మనం ఈ అవకరాన్ని వేసినా ఎవరికీ ఇబ్బంది ఉండదు, ఎవరూ ఏమనరు' అని చెప్పారు. ఆ సమాధానానికి

వినియోగిస్తున్నాం సరే. మరి ఈ ప్లాస్టిక్‌ను ఎక్కడ పారేయాలి? మనకిది ప్రస్తుతం ఒక పెను సమస్య. మన లాంటి దేశాలలో జనావాసం కాని ప్రదేశాలు ఏమన్నా ఉన్నాయా? దేశంలోని ప్రతి అంగుళం జనబాహుళ్యంతో నిండి ఉంది. మరి ఈ చెత్తను పారేయడానికి పనికిరాని గుంటలు, వ్యర్థ భూములు కరవవుతున్నాయి. పట్టణాలు, నగరాలలో అయితే ఇప్పుడు ప్రతి చోటా ల్యాండ్ ఫిల్స్ కోసం, డంపింగ్ యార్డ్స్ కోసం చూస్తున్నారు. ఇంత చెత్తను మనం ఏ విధంగా వదిలించుకోగలం? పట్టణాలలో, నగరాలలో రోజురోజుకూ పెరుగుతున్న ఈ వ్యర్థాలను పారవేయడం ఒక పెద్ద సవాలుగా మారింది. ఏదో కొద్ది శాతం రీసైక్లింగ్ జరుగుతున్నా మనం తలసరిన ఉత్పత్తి చేసే వ్యర్థాలతో పోలిస్తే అది కంటి తుడుపు మాత్రమే.

ఇక పల్లెలలో (కొన్ని పట్టణాలలో కూడా) ఈ రోజు చెత్త పారవేత ఒక సమస్యగానే పరిణమిస్తోంది. కొన్నిచోట్లైతే ఎవరి ఇంటి ముందు వాళ్ళు, లేకపోతే ఎవరి ఇంటి వెనుక వాళ్ళు, జీవవ్యర్థాలు, ప్లాస్టిక్ వ్యర్థాలు వేస్తూ పోతున్నారు. ఈ చెదారమంతా ఇంటి ముందున్న మురుగు కాల్వలలో పడి కాల్వలు ప్రవహించని స్థితి నెలకొని ఉంటుంది. అవన్నీ కూడా దోమలు తమ సంతానాన్ని ఇతోధికంగా పెంచుకోవడానికి చక్కగా తోడ్పడతాయి. మనిషి

జనాభాతో పాటు వాటి జనాభా కూడా పెరుగుతుంది. అది వాటి హక్కు అంటే ఇక సమస్య లేదు! కాస్త శ్రమపడి ఆ చెత్తను, ప్లాస్టిక్ బ్యాగులను కాల్వలలో పడవేయకుండా చూస్తూ, అవి ఎప్పుడూ ప్రవహించేలా చూసుకుంటే దోమలను అరికట్టవచ్చు. కానీ దీనికి ఎవరూ ముందుకు రారు. అంతేకాక, చివరకు ఆ దోమల బారి నుంచి తమ నిద్రను కాపాడుకోవడానికి బజారులో దొరుకుతున్న రసాయనిక దోమనివారణ పద్ధతులను అనుసరిస్తారు. అవి ఉత్పత్తి చేసే ఆ ప్రాణాంతకమైన పొగ, లేదా వాసన దోమలను పారద్రోలడమేమో గానీ మనిషికి మాత్రం క్రమేణా విషంగా పరిణమిస్తున్నది. కనీసం దోమతెర వాడడం, కిటికీలకు, గదులకు జాలికలను పెట్టించుకోవడం లాంటి భౌతిక పద్ధతులను అనుసరించడం కాస్త మెరుగైన పద్ధతి. కానీ మన వివేక బుద్ధి ఎవరో చెబితే కానీ కాస్త మేలుకోదు. కాబట్టి తెలిసి తెలిసీ ప్రాణాంతక పద్ధతులనే పట్టుకొని కూర్చుంటాం.

ఇక సూకరరాజాలు ఈ మురుగు కాల్వలలో జలకాలాడి, స్నానమాచరించి మహానందంతో మైమరిచి, గ్రామంలో వీధి వీధిలో తిరుగుతూ ఉంటాయి. ప్రపంచంలో ఉన్న అన్ని రకాల సూక్ష్మక్రిములకూ ఈ వరాహాలు చక్కటి ఆశ్రయాన్ని కల్పిస్తాయి. వాటిది ఎంత కరుణా హృదయమో కదా! సర్వరోగాలకు మహావాహకాలుగా, క్రిములకు బ్రాండ్ అంబాసిడర్లుగా పనిచేస్తూ,

పారమార్థికత

– స్వామి శితికంఠానంద

వాటిని తమ రాచఠీవితో మోస్తూ, జనులకు అంటిస్తూ, బ్యాక్టీరియా, వైరస్‌ల లాంటి అల్ప 'జీవులకు' బ్రతికే హక్కును కల్పిస్తూ, వాటి ఋణం తీర్చుకుంటూ ఇతోధిక సేవ చేస్తూ ఉంటాయి! వీటిని అలా రోజూ చూస్తూ వాటితో సహవాసం చేస్తూ, చీమ కుట్టినట్లైనా ఉండని మనం ఎంత అద్వైతులం? ఎక్కడి భేదదృష్టి విదీర్ణత! ఎంతటి సమభావం! అవును. మనం అంతా అవధూతల వారసులం కదా! మనకు ద్వంద్వ దృష్టి ఎక్కడిది? ఏకమేవ అద్వితీయమ్! దోమలలో కూడా మనం దేవుడినిచూడగలం!

ఈ వరాహ శునక మూషిక మర్కట కాక కటుకీటకాల వల్ల రోగాలు వస్తే వెంటనే దవాఖానాకు వెళ్ళి, యాంటీ బయోటిక్స్ మ్రింగుతుంటాం. అవేవో వెన్న ఉండలైనట్లు! అవి 'యాంటీ బయో' అంటే జీవ విరుద్ధం అనీ, అవి అతి తరచుగా వాడే అవసరం కలగకుండా చూసుకోవాలనీ, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలనీ మాత్రం మనకు అనిపించదు.

స్వామి వివేకానంద తన భారత పర్యటనలో భాగంగా ఒకసారి బెల్గామ్ వెళ్ళారు. ఒక నీటికొలను ప్రక్కన అక్కడే బట్టలు ఉతికి, పాత్రలు తోమి, అదే నీటిని స్నానానికి, త్రాగడానికి ఉపయోగిస్తున్న జనులను చూసి, 'ఇటువంటి జనులకు తెలివితేటలున్నాయని ఎలా అనుకోవటం' అని ఆవేదన చెందారు. పాశ్చాత్యుల 'వినియోగించు, విసిరి పారెయ్ (Use and throw)' సంస్కృతి మనకు సరిపోదు. విదేశీయుల విచ్చలవిడి వినియోగ జీవన విధాన అనుకరణ మోజులో పడి ప్రపంచంలో వచ్చే ప్రతి మార్పునూ, ప్రతి కొత్త పద్ధతినీ, ఆవిష్కరణనూ మనం వేలం వెర్రిగా స్వీకరిస్తున్నాం. కానీ అవి మనకు సరిపోతాయా? సరిపోవా? అని మాత్రం పరిశీలించుకోవడం లేదు.

మార్పు అవసరం. మార్పు అనివార్యం. ఏ దిశగా మార్పు చెందుతున్నాం. చివరకు ఈ మార్పు దేనికి దారితీస్తుంది? అని ఆలోచించాలి. తామరతంపరగా పెరుగుతున్న జనాభా, పట్టణీకరణ పర్యావరణ పరిరక్షణకూ, కాలుష్య నివారణకూ పెద్ద అవరోధంగా మారుతున్నాయన్నది వాస్తవం. వీటిని ఎంతవరకు మనం నియంత్రించగలమో భగవంతుడికే ఎరుక. మన చేతిలో లేనిదాని గురించి మాట్లాడుకోవడం అనవసరం. అది అక్కరకు రాని శ్రమ. 'పర్యావరణాన్ని పరిరక్షించాలి. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి' అన్న విషయాన్ని పాఠశాల నుంచే వల్లె వేస్తున్నాం. కానీ ఆచరణలో మనం ఏమి చేయగలుగుతున్నాం? ఎంతవరకు పర్యావరణాన్ని కాపాడుకోగలుగుతున్నాం. ఈ బాధ్యత పురపాలక సంస్థలు, కాలుష్య నివారణ మండలులదే అనుకుంటున్నాం. ఎవరో వచ్చి మనల్ని చైతన్యవంతుల్ని చేయాలంటే ఎలా? 'ఎవరికి వారే యమునా తీరే' అన్న చందాన మనం అందరం ప్రవర్తిస్తున్నాం. దేశభక్తి లేమిని సూచించే ఈ స్తబ్ధత నుంచి మనం మేలుకోవాలి. మన పూర్వీకులు వృక్షాలను ఆరాధించారు. చెట్లతో సఖ్యతను కలిగి ఉన్నారు. వాటిని దేవతా నివాసస్థలాలుగా పరిగణించారు. మనకు ప్రస్తుతం ఆ భావన ఉందా? పట్టణాలలో, పల్లెలలో ఎక్కడ అవకాశం ఉంటే అక్కడ చెట్లను నాటాలి. యువతను, పిల్లలను ఈ కార్యక్రమంలో భాగస్వాముల్ని చేయాలి. వారానికి ఐదురోజులే బడులు, కళాశాలలు పెట్టి ఒకరోజు చెట్లు నాటడానికీ, వాటి సంరక్షణను పరిశీలించడానికీ, గ్రామాలలో, పట్టణాలలో వీధులు శుభ్రం చేయటానికీ నియోగించాలి. కాల్వలు ప్రవహించేలా చూసుకోవాలి. 'మన గ్రామాన్ని, మన పట్టణాన్ని మనం పరిశుభ్రంగా ఉంచుకోవాలి' అన్న భావన అప్పుడు అందరికీ చేరుతుంది. ఇది మనందరి సమస్య. సమష్టి సమస్య. ప్రస్తుత సమస్య. మనమే పరిష్కరించుకోవాలి. ఇలా మన సమస్యలను పరిష్కరించుకోవడానికి ఉపయోగపడే చదువు లేకపోతే అది అనవసర కాలయాపన. తరగతి గదిలో కూర్చుని $(a + b)^2 = a^2 + b^2 + 2ab$, రెండు హైడ్రోజన్ పరమాణువులు – ఒక ఆక్సిజన్ పరమాణువు కలిస్తే ఒక నీటి అణువు తయారవుతుంది...ఇలాంటి జ్ఞానం మనకు నిజ జీవితంలో ఎప్పుడు, ఎంతమందికి ఉపయోగపడుతుంది? ప్రస్తుతం అనుభవిస్తున్న ఇబ్బందిని తొలగించుకోవడానికి మనల్ని స్పందింపజేయని విద్య కూడా విద్య అవుతుందా? ఇకనైనా మేలుకుందాం!


పరిసరాల చక్కదనానికీ, ఆధ్యాత్మికతకూ సంబంధం ఏమిటని కొందరు అనుకోవచ్చు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోకుండా, ప్రకృతి పవిత్రతను కాపాడకుండా పరమ పవిత్రుడైన భగవంతుణ్ణి చేరుకోవడం అసాధ్యం. అందుకే ఆంగ్లంలో అంటారు – Cleanliness is next to Godliness .. పారిశుద్ధ్యమే పారమార్థికతకు మొదటి మెట్టు అని! ❖

(జూన్ 5వ తేదీ, ప్రపంచ పర్యావరణ దినోత్సవం)

నివాస స్థలానికి దూరంగా జీవవ్యర్థాలను, అశుద్ధవస్తువులను పారవేయవలెను. త్రాగడానికి ఉపయోగించే నీటి కొలనులో వ్యర్థాలను పారవేయడం, స్నానాలు చేయడం కూడదు. - మనుస్మృతి

ప్రేమ ఋణం

– శ్రీమతి సుధామూర్తి, ఇన్ఫోసిస్ ఫౌండేషన్



కళాశాల స్థాయి నుంచి రామ్, శ్యామ్‌లు నాకు తెలుసు! కవలలుగా వారిద్దరినీ చూస్తూ ఉంటే ముచ్చటగా ఉండేది. ఒకరినొకరు విడిచి ఉండేవారు కాదు. వారిద్దరి జీవితాలు ఒకే పాఠశాల, ఒకే కళాశాల, చివరకు ఒకే సాఫ్ట్‌వేర్ సంస్థలో ఉద్యోగం అన్నట్లుగా సాగిపోయాయి. అదృష్టం కొద్దీ కవలలైన అక్కాచెల్లెళ్ళే వారికి జీవిత భాగస్వాములయ్యారు. వారి జీవితాలు ఆనందమయంగా సాగిపోవాలని ఆశీర్వదిస్తూ, వారి వివాహానికి వెళ్ళి అక్షతలు కూడా వేసివచ్చాను.

ఒక రోజు హఠాత్తుగా రామ్, శ్యామ్ వాళ్ళ అమ్మ నుంచి ఫోన్ వచ్చింది. 'మేడమ్! మీరు ఓ సారి మా ఇంటికి రావాలి' అంది ఆమె ఆందోళనగా! ఆమె పరిస్థితి గమనించి, ఓ ఆదివారం వెళ్ళాను. అక్కడకు వెళ్ళగానే ఇంటి పరిసరాలు చూసి ఆశ్చర్యమేసింది. ఎంతో అందంగా, పొందికగా ఉన్న ఇంటికి రెండు ముఖద్వారాలు వచ్చాయి. ఇంతలో రామ్, శ్యామ్ వాళ్ళ అమ్మ వచ్చి నన్ను ఇంట్లోకి తీసుకువెళ్ళింది. అక్కడ అన్నీ పంపకాలు జరిగినట్లు వేర్వేరుగా కనిపించాయి; చివరకు మనుషులు, మనస్సులతో సహా! వాతావరణమంతా బరువుగా అనిపించింది.

ఆవిడ కన్నీళ్ళు ఆపుకోలేక "మేడమ్! నా కొడుకులు పోట్లాడుకొని విడిపోయారు. ఆస్తి పంపకాల దగ్గర ఇద్దరికీ గొడవొచ్చింది. ఫామ్ హౌస్ 'మాకు కావాలంటే మాకు కావాలని' ఇద్దరూ పట్టుబడుతున్నారు. మీరు చెబితే వింటారని పిలిచాను" అంది. మూడుముళ్ళు వేశాక మనుష్యులు ఎలా మారిపోతారో రామ్, శ్యామ్‌లను చూశాక అర్థమైంది. వాళ్ళ కలహాలు కళ్ళారా చూశాక, కలిసి పుట్టిన కవలలు వీళ్ళేనా? అనిపించింది. భార్యల చేతిలో కీలుబొమ్మలై, చివరకు వాళ్ళు నా మాటలు కూడా లెక్కచేయలేదు. భారమంతా భగవంతుడిపై వదిలేసి, ఆ తల్లితండ్రులను ఓదార్చి, బాధతో ఇంటికి వచ్చేశాను.

నా చిరకాల మిత్రుడి దంపతులు అప్పటికే వచ్చి నా కోసం ఎదురుచూస్తూ ఉన్నారు. వాళ్ళింటికి భోజనానికి వస్తానన్న విషయమే మరచిపోయాను. నన్ను తీసుకువెళ్ళేందుకు భార్యభర్తలిద్దరూ వచ్చారు. ముగ్గురం కారులో బయలుదేరాం. కారు వాళ్ళింటి వైపు కాకుండా, బెంగుళూరు దాటి వెళుతోంది. 'ఇంతకూ భోజనం ఎక్కడ?' అన్నాను. 'మీకు నచ్చుతుందని, ప్రశాంతమైన పచ్చని వాతావరణంలో మా తమ్ముడి ఇంట్లో ఏర్పాట్లు చేశాం' అన్నారు. నాకు ఆశ్చర్యమేసింది. నాకు తెలిసి అతనికి అన్నలు గానీ, తమ్ముళ్ళు కానీ ఎవరూ లేరు. అదే సందేహాన్ని ఆయన ముందు వెలిబుచ్చాను. అప్పుడు నా మిత్రుడు మాట్లాడుతూ...

'ఇప్పుడు మనం వెళుతున్న ఊళ్ళోనే యాభై ఏళ్ళ క్రితం నేను పుట్టాను. నేను కళ్ళు తెరిచి పదిరోజులైనా కాక ముందే మా అమ్మ కన్నుమూసింది. ఆ బాధతో మా నాన్న మరో పెళ్ళి కూడా చేసుకోలేదు. ఇంట్లో ఆత్మీయులు కూడా ఎవరూ లేరు. మా పనివాడు, అతని భార్య సీతక్క తప్ప! ఆమెకు నా అంత వయస్సే ఉన్న కొడుకున్నాడు. సీతక్కకు పిల్లలంటే ప్రాణం. నేను పాలు లేక ఏడ్చేవాణ్ణి; ఆవుపాలు పడేవి కాదు. మా నాన్నది నిస్సహాయ స్థితి! ఆ పరిస్థితిలో సీతక్క మా బాధలు చూసి 'అయ్యా! మీరేమీ అనుకోకపోతే నా బిడ్డతో పాటు, మీ బిడ్డకు కూడా పాలిచ్చి పెంచుతాను. నా కిద్దరూ సమానమే' అంది.

మా నాన్న కొద్దిగా ఆలోచించి, సరేనన్నాడు. మా బంధువుల్లో చాలామందికిది నచ్చలేదు. అయినా సీతక్క తన చనుబాలతో కన్నతల్లిలా నన్ను రెండేళ్ళు సాకింది. అయిదేళ్ళ వరకు వాళ్ళింట్లోనే పెరిగాను. ప్రేమలో అమ్మను మరపించింది సీతక్క. ఎంత అల్లరి చేసినా నన్ను ఒక్క మాట కూడా అనకుండా, ఎంతో ప్రేమగా చూసుకునేది. కొన్నాళ్ళకు ఆమె చనిపోయింది. అయినా అమ్మ అన్న పదం వినగానే సీతక్కే మనస్సులో మెదులుతుంది. ఆమె కొడుకే – హనుమ. అన్నయినా, తమ్ముడైనా నాకు అతనే! ఇద్దరమూ ఒకే తల్లి పాలు తాగాం. ఆమె ఇచ్చిన పాల ఋణం, చూపించిన ప్రేమ ఋణం ఎన్నటికీ తీర్చుకోలేను. సీతక్క నా నుంచి ఏమీ ఆశించలేదు; అయినా నన్ను గుండెల్లో పెట్టుకొని చూసుకుంది. అందుకే హనుమకు నా ఆస్తిలో వాటా ఇచ్చాను. ఇందుకు మా బంధువులు వ్యతిరేకించారు. ఎవరు ఎన్ని చెప్పినా వినకుండా అతనికి ఆస్తి రాసిచ్చాను. బెంగుళూరులో ఎంత తీరిక లేకుండా ఉన్నా, సంవత్సరానికి ఓసారి కుటుంబంతో సహా వెళ్ళి హనుమ ఇంట్లో గడుపుతాం.

నా గుండె బరువెక్కింది, నా మిత్రుడి కృతజ్ఞతాభావానికి కళ్ళు చెమర్చాయి. మరోవైపు సోదరబంధానికే మచ్చగా మిగిలిపోయిన రామ్,శ్యామ్‌లు గుర్తొచ్చి బాధేసింది. ❖

సేకరణ: జి. సతీష్



– స్వామి పరిజ్ఞేయానంద

జీవితం సుధాభరితం

సుధీర్ రెడ్డి, అనంతపురం

ప్రశ్న: నేను ఇంటర్మీడియట్ ఫెయిల్ అయ్యాను. అది నాకు చాలా అవమానకరంగా ఉంది. అందువల్ల నేను నలుగురిలో తలెత్తుకు తిరగలేకపోతున్నాను. ఈ జీవితం మీద విరక్తి కలుగుతుంది. నాలో జరుగుతున్న ఈ సంఘర్షణ నుండి బయటపడే మార్గాన్ని సూచించండి.

జవాబు: నిజానికి, మనల్ని అధికంగా బాధించేది మన వైఫల్యం కన్నా ఇతరులు ఏమనుకుంటారోనన్న ఆలోచనే! అలాంటి ఆలోచనే మనల్ని క్రుంగదీస్తుంది. ఇతరుల అభిప్రాయాలపై ఆధారపడి జీవిస్తున్నంత వరకు మనమీ పరిస్థితి నుండి బయటపడలేం. కాబట్టి మన గురించి ఇతరులు ఏమనుకుంటున్నారోనని ఆలోచించడం కన్నా, మన గురించి మనం ఏమనుకుంటున్నామన్నదానికి ప్రాధాన్య మివ్వాలి. మన మీద మనకు అభిమానం ఉండాలి; మన శక్తి సామర్థ్యాలను మనమే తెలుసుకోగలగాలి.

జీవితం వివిధ సంఘటనల సమాహారం. ఇంటర్ పరీక్షలో ఉత్తీర్ణులుకాలేకపోవడం జీవితంలో జరిగిన ఒక సంఘటన మాత్రమే. ఒక సంఘటనలో విఫలమైతే, జీవితంలోనే విఫలమయ్యామనుకోవడం మన బలహీనత. అందుకే స్వామి వివేకానంద "జీవన పాఠాలు నేర్పేవి వైఫల్యాలే. జరిగి పోయిన దాని గురించి చింతించకు. జరగ బోయే దాని కోసం ఆలోచించు. ప్రతిఘటనలు, విమర్శలు విజయ సూచకాలుగా భావించు" అని అంటారు. కాబట్టి జరిగిపోయినదాని గురించి చింతించకుండా, ఇతరులు ఏమనుకుంటారో నని అధికంగా ఆలోచించకుండా జీవన సాఫల్యం కోసం ప్రయత్నించాలి.


ధీరవంతులు ప్రాణాపాయస్థితిలో కూడా జీవన సాఫల్యం కోసం ప్రయత్నిస్తారు; బలహీనులు ఒక్క చిన్న వైఫల్యంతోనే జీవితాన్ని కడతేర్చుకోవాలనుకుంటారు.

ఛత్రపతి శివాజీ, అతడి కొడుకు సంభాజీలను ఔరంగజేబు బంధించాడు. ఇక మరణం తప్పదని గ్రహించిన సంభాజీ ఆపద నుండి బయటపడే ప్రయత్నం చేయలేదు. శివాజీ మాత్రం ప్రాణాంతక పరిస్థితుల నుండి బయట పడడానికి మార్గాన్ని ఆలోచించాడు. జీవితం ముగిసిందని భావించిన సంభాజీతో 'కష్టాలను ఎదుర్కోవడానికి సిద్ధమైనవాడికి జీవితంలో అపజయమంటూ ఉండదు' అని ధీరవచనాలను పలికాడు శివాజీ. ప్రతీరోజు భటులు పూజ కోసం బుట్టలతో పువ్వులు, పళ్ళు దేవీ ఆలయానికి తీసుకువెళుతూ ఉండేవారు. ఒకరోజు శివాజీ, సంభాజీ ఆ బుట్టల్లో దాక్కొని తప్పించుకొన్నారు.

అపాయకర పరిస్థితులు ఎదురయ్యేటప్పటికి జీవితం అంతమైందని తలచాడు సంభాజీ. కానీ ఆ విషమ పరిస్థితుల్లోనే పరిష్కార మార్గాన్ని కనుగొన్నాడు శివాజీ.

ప్రపంచాన్నంతటినీ నవ్వుల వెల్లువలో ముంచెత్తిన చార్లీ చాప్లిన్ "Don't be afraid. Pull yourself out of difficulties by yourself. In the midst of all miseries and all weakness, let the spirit come out. మన కష్టాల నుండి మనమే బయటపడడానికి ప్రయత్నించాలి. అందుకు ఆత్మశక్తిని జాగృతపరచాలి" అన్న స్వామి వివేకానంద సందేశాన్ని అక్షరాలా ఆచరించి చూపాడు.

త్రాగుడుకు బానిసైన తండ్రి, మతిస్థిమితం కోల్పోయిన తల్లి, కటిక దారిద్ర్యం వల్ల ఎనలేని కష్టాలు – ఇలా చార్లీ చాప్లిన్ బాల్యం విషాదమయంగా సాగింది. మీరు ఈ కష్టాలన్నింటినీ ఎలా అధిగమించారని అడిగినప్పుడు "మనలో అనంతశక్తి ఉంది. ఆ శక్తిని జాగృతం చేయడం ద్వారా కష్టాలను అధిగమించ వచ్చు. అదే జీవన రహస్యం" అన్న అతడి మాటలు స్వామీజీ స్ఫూర్తివచనాలను స్ఫురణకు తెస్తాయి.



"You will never find rainbows, if you are looking down always. Life is a tragedy when seen in close-up, but a comedy in long-shot - అపజయాలను తలచుకుంటూ కూర్చుంటే ఎన్నడూ విజయానందాన్ని చవిచూడలేం. దగ్గర నుండి చూస్తే జీవితం విషాదమయం. దూరం నుండి చూస్తే సంతోషమయం" అంటూ తనదైన శైలిలో జీవితాన్ని నిర్వచించగలిగిన హాస్యచతురుడు చాప్లిన్.

ప్రాణాపాయస్థితిలో కూడా భయపడకుండా బయటపడేమార్గాన్ని కనుగొన్నాడు శివాజీ. అనంత కష్టాలు చుట్టుముట్టినా అధైర్యపడ కుండా ఆత్మశక్తితో అభివృద్ధి పథంలో నడిచాడు చార్లీ చాప్లిన్. ఇలా ఎంతోమంది మహాత్ములు ఎదుర్కొన్న కష్టాలతో పోల్చిచూసు కుంటే పరీక్షల్లో విఫలమవడమన్నది అతి సామాన్యమైన సమస్య.

కాబట్టి "అపజయాలను లక్ష్య పెట్టకు. అవి అతి సహజం. అందువల్ల లక్ష్యసిద్ధికై వేయిసార్లు పోరాడండి. వేయిసార్లూ అపజయంపాలైనా, మళ్ళీ ప్రయత్నించండి" అన్న స్వామీజీ ధీరవచనాలను స్మరిస్తే అవమానాలు, అపజయాల వల్ల కలిగే భయభ్రాంతులు తొలగిపోతాయి. అప్పుడు మనలో ఆత్మశక్తి జాగృతమై మనం చేసే ప్రయత్నాలన్నీ సఫలమవుతాయి. జీవితం సుధాభరితమవుతుంది. ❖

'ఓ కుంతీపుత్రా! దౌర్బల్యానికి దాసోహమనవద్దు. అది నీకు తగదు' అన్న శ్రీకృష్ణుని సందేశాన్ని ప్రపంచానికి చాటితే రోగం, దుఃఖం, పాపంలాంటి బాధలన్నీ అంతరించిపోతాయి. -స్వామి వివేకానంద

అద్దంలో

ఒకసారి హైదరాబాదు నగరంలో అన్నమాచార్య సంకీర్తనల మహోత్సవం ఏర్పాటయింది. దేశవిదేశాల నుంచి వచ్చిన ఎందరో సంగీతకళాకారులు ఆ కార్యక్రమంలో పాల్గొన్నారు. అంగరంగ వైభవంగా అలంకరించిన వేదికపైకి అతిథులను ఆహ్వానించారు. సముచితంగా సత్కరించారు. తరువాత కొన్ని క్షణాల్లో అశేష అభిమానుల మధ్య అన్నమయ్య పదాలాపన ప్రారంభం కాబోతోంది. ఇంతలో వేదికపైన చిన్న అలజడి ఆరంభమైంది. సంగీత రంగంలో ఎన్నో ఏళ్ళ అనుభవం ఉన్న ఓ కళాకారిణి, తనకు కార్యక్రమంలో సముచిత ప్రాధాన్యం లభించలేదని కినుక వహించారు. తనకు వేదికపై ప్రముఖ స్థానం కల్పించలేదనీ, తనకు సరైన గౌరవం లభించలేదనీ నిరసించి అలకబూనారు. నిర్వాహకులు ఎంత ప్రాధేయపడ్డా వినకుండా ఆగ్రహంతో వేదిక దిగి వెళ్ళిపోయారు. ఎంతో వైభవంగా ఏర్పాటయిన అంత పెద్ద సంగీతకార్యక్రమంలో ఆ చిన్నపొరపాటును ఆ కళాకారిణి అర్థం చేసుకోలేకపోయారు. సాక్షాత్తూ అన్నమాచార్యే నా ఘనత ఏముంది? 'నీవే! కానిమ్మని నాకీ పుణ్యము కట్టితి వింతేనయ్యా!' అని ఆ వేంకటేశుడి ముందు వినమ్రంగా పలికాడు. కానీ ఆ సంకీర్తనలు పాడుకొని కాస్త కీర్తి సంపాదించగానే, మనదే ఆ గొప్పతనమని భ్రమపడడం అవివేకమని అక్కడి సంగీత అభిమానులు అనుకున్నారు. ఇలా మనలో చాలామంది నిరంతం తామింత వారమనీ, తామంత వారమనీ ప్రగల్భాలు పలుకుతూ, ఎదుటివారి కన్నా తామెంత ప్రత్యేకమైనవారమో చాటుకునేందుకు తాపత్రయపడుతూ ఉంటారు. తమ అధికారాన్ని, హోదాను ప్రదర్శించుకునేందుకు తంటాలు పడుతూ ఉంటారు. ప్రతిచోటా తమకు ప్రత్యేక గౌరవం లభించాలనీ, ప్రాధాన్యాలు (privileges), ప్రత్యేకతల కోసం పరితపిస్తూ ఉంటారు. అవి లభించకుంటే అసహనానికీ, అశాంతికీ గురవుతూ ఉంటారు. అందుకే 'అపరిపక్వమైన మనస్సు కలవాళ్ళే 'నేను అంతటి వాణ్ణి, నేను ఇంతటి వాణ్ణి. వారు నాతో ఇలా మాట్లాడతారా? నాతో ఇలా ప్రవర్తిస్తారా? నాకు సరిగ్గా మర్యాదలు చేయరా?' అని ఆభిజాత్యాలకు పోతూ ఉంటారు' అనేవారు భగవాన్ శ్రీరామకృష్ణ పరమహంస. ఎంత అధికులమైనా అద్దంలో కొండలా అణకువగా ఉండగలిగితేనే మన గౌరవం మరింత పెరుగుతుందన్న విషయాన్ని మనం చాలాసార్లు మరచిపోతాం.

ప్రాధాన్యాలు...పాకులాటలు : ప్రతిచోటా మనకు ప్రాధాన్యం లభించాలనీ, ప్రతి ఒక్కరూ మనల్ని ప్రత్యేకంగా చూడాలనీ తాపత్రయపడుతూ ఉన్నామంటే మనం ఎదుటివారి కన్నా అధికులమన్న ఆభిజాత్యం, అహంకారం పెంచుకుంటున్నామన్నమాటే! భగవంతుడు ఏదో ఒక రంగంలో మనకు కాస్త ప్రతిభను ప్రసాదించినంత మాత్రాన మనం వ్యక్తిగా ఓ ప్రత్యేకతను సంతరించుకున్నామని అహంకరిస్తే మాత్రం మనకు ఎక్కడో గర్వభంగం కాకతప్పదు. అందుకే స్వామి వివేకానంద ఓ చోట 'Break down all privileges. The idea of privilege is the bane of human life. The same power is in every man. Where is the claim to privilege? – ఒకరిని ఎక్కువగా, మరొకరిని తక్కువగా చూసే మనస్తత్వాల నుంచి బయటపడండి. 'నేను'ప్రత్యేకం' అనుకోవడమే మన పతనానికి, మన దుఃఖానికి కారణం. అందరిలో ఉన్నది ఒకే భగవంతుడి శక్తి! ఇక ప్రత్యేకమన్న మాటెక్కడుందని?' ప్రశ్నిస్తారు. కానీ మనమూ సామాన్యులమే, సాధారణ మనుష్యులమే అనుకోవడానికి మనస్సు ఇబ్బందిపడుతుంది. అందుకే ఎక్కడ ఏ మాత్రం మన



ప్రాధాన్యం తగ్గినా మనస్సు తీవ్రమైన ఒత్తిడికీ, అలజడికీ గురవుతుంది. ఉదాహరణకు మన పురాణాల్లో దక్షప్రజాపతి ఓ వేడుకకు హాజరవుతాడు. అక్కడ అందరూ లేచి అతనికి నమస్కారం పెడతారు. కానీ పరమశివుడు లేచి నిలబడడు. దాంతో దక్షుని మనస్సు రగిలిపోతుంది. కారణం ఏంటో కూడా ఆలోచించకుండా 'నేను వస్తే, లేచి నిలబడి నమస్కారం చేయడా?' అని అహంభావంతో కక్ష పెంచుకుంటాడు. ఆ పరమశివుడిని అవమానించాలని తనూ ఓ యజ్ఞాన్ని తలపెడతాడు. మహాదేవుడైన మహేశ్వరుడిని ఆహ్వానించకపోగా, ఆయన తరపున వచ్చిన సతీదేవిని కూడా చిన్నచూపు చూస్తాడు. చివరకు ఆ క్రతువులో తన తలనే తరిగి ఆ యజ్ఞగుండంలో పడేసేదాక తెచ్చుకుంటాడు. ఒక్క 'నమస్కారం' గొడవ ఎక్కడిదాకా వచ్చిందో చూడండి!

కొండలా...

– బి. సైదులు

పసిడికి పరిమళాలు అద్దినట్లు, ప్రతిభకు తగ్గట్లు ప్రసన్నంగా ఉంటేనే ఎవరైనా మనల్ని గౌరవిస్తారు. చందనవృక్షం ఎంత సుగంధభరితమైనా, దానికి త్రాచుపాము అల్లుకుని ఉంటే ఎవరు మాత్రం ఆదరంగా దగ్గరకు వస్తారు?

సాధారణంగా ఉంటేనే శోభ.... : ప్రతిభ వల్లనో, పదవి వల్లనో ప్రపంచం దృష్టిలో మనం విశేషమైన వ్యక్తి అయినా, వీలయినంత వరకు సాధారణంగా ఉండడానికి ప్రయత్నించినప్పుడే మన గౌరవం,శోభ మరింత ఇనుమడిస్తాయి. అవకాశం, అధికారం ఉండి కూడా, ఏ ప్రత్యేకతల్నీ ఆశించనప్పుడు మనిషిగా మనం ఎదుటివారి మనస్సులో సుస్థిరస్థానాన్ని ఏర్పరచుకోగలం. అలా కాకుండా, నిరంతరం మనకున్న విద్వత్తు, విశేషాలనే భుజకీర్తులుగా భావించుకుంటూ, ఎదుటివారితో భుజాలు భుజాలు కలపలేనప్పుడు మానవసంబంధాల్లో ఘోరంగా విఫలమవుతాం. అందుకే దక్షప్రజాపతి ప్రవర్తన గురించి శంకరుడు తన భార్య సతీదేవితో ప్రస్తావిస్తూ...

...విద్యాతపోవిత్త వయోరూపకులములు సుజనులకునుగుణంబు లివియు కుజనుల యెడ దోషహేతుకంబులై వివేకంబు చెరచు...

'విద్య, తపస్సు, ధనం, వయస్సు,రూపం,కులం– ఇవి మంచివారికి సుగుణములే కానీ అహంకారపూరితుల విషయంలో ఇవే దోష కారణాలై బుద్ధిని పాడు చేస్తాయ'ని హెచ్చరిస్తాడు. కానీ ఈ రోజుల్లో చాలామంది పక్కవారి కన్నా తాము ఏ కాస్త పై స్థాయిలో ఉన్నా, ఏదో ఒక రూపంలో తమ ఆధిపత్యాన్ని ప్రదర్శించేందుకు తహతహలాడుతూ ఉంటారు. తాము అందరిలోకీ ప్రత్యేకమన్న అభిజాత్యంతో వారిని మాటలతోనో, చేతలతోనో కించపరుస్తూ పైశాచిక ఆనందాన్ని పొందుతూ ఉంటారు. అయితే ఇలాంటి వారి మిడిసిపాటు మూడునాళ్ళ ముచ్చటగానే ముగిసిపోతుందని గుర్తుంచుకోవాలి.

ఇష్టపడి ఇచ్చేదే గౌరవం... : నిజానికి గౌరవం, ఆదరణ అనేవి మనస్సులోంచి రావాలి. మనను చూడగానే ఎదుటివారి మదిలో పూజ్యనీయమైన భావన పొటమరించాలి. అదే నిజమైన గౌరవం. ఒక్కమాటలో చెప్పాలంటే, respect cannot be demanded. It should be given voluntarily. గౌరవమనేది సాధించుకునేది కాదు; స్వచ్ఛందంగా ఇచ్చేది! ఓ ప్రముఖ వైద్యుడు ఆ రంగంలో విశేషకృషి చేయడమే కాకుండా ఎందరో నిరుపేదలకు ఉచితంగా వైద్యం చేసేవారు. వందలాది మంది వైద్యవిద్యార్థులు ఆయనను మార్గదర్శిగా భావిస్తూ ఉంటారు. ఆయన గురించి వారి శిష్యసమానుడైన యువవైద్యుడు ఓ సారి ముఖాముఖిలో మాట్లాడుతూ '...వారంటే మాకు ఎంత ఆరాధన అంటే, వారి దగ్గర నుంచి ఫోన్ వచ్చినా, వెంటనే లేచి నిలబడి మాట్లాడడం మాకందరికీ అలవాటైపోయింది. చుట్టుపక్కల వారంతా 'ఆయన మీ ముందు లేరు, మిమ్మల్ని చూడడమూ లేదు, అయినా ఎందుకు ఆయన నుంచి ఫోన్ రాగానే ఠక్కున లేచి నిలబడతారు!' అని ఆశ్చర్యపోతారు. కానీ ఎందుకో! సార్ పట్ల మా మనస్సులో ఆ పూజ్యభావం పాదుకొనిపోయింది' అన్నాడు. అదీ నిజమైన గౌరవమంటే! కానీ మనలో చాలామంది మర్యాదను, మన్ననను ఎదుటివారు తమకు విధిగా ఇవ్వాల్సిన హక్కుగా భావిస్తారు. తమకు ఆ అర్హత ఉందా? లేదా? అన్న ఆత్మపరిశీలన కూడా చేసుకోకుండా, వెళ్ళిన ప్రతిచోటా కొత్తఅల్లుళ్ళలా మర్యాదను ఆశిస్తారు. ఏ కాస్త తేడా వచ్చినా అసహనంతో ఊగిపోతూ ఉంటారు. ఇది చౌకబారు మనస్తత్వం! భయం వల్లనో, బలవంతంగానో ఇచ్చేది కాదు, భక్తితో ఇచ్చేది గౌరవం.

లేనిదే ఆశిస్తాం... : ఎదుటివారి నుంచి మర్యాదను ఆశిస్తూ ఉన్నామంటే మనపై మనకే ఎక్కడో గౌరవం లేదన్నమాటే! మనలో ఆత్మవిశ్వాసం, ఆత్మగౌరవం లేనప్పుడే ఇతరులు ఇచ్చే ప్రాముఖ్యత కోసం మనస్సు దేబరిస్తుంది. ప్రాధాన్యాలు, ప్రత్యేకతల కోసం పరితపిస్తున్నామంటే పరోక్షంగా మనలో ఎక్కడో ఆత్మన్యూనత(ఇన్‌ఫీరియారిటీ కాంప్లెక్స్) తొలుస్తుందని అర్థం చేసుకోవాలి. పరిణతిని సాధించిన వ్యక్తి ఎదుటివారు ఇచ్చే మర్యాదలకు, మన్ననలకు ప్రభావితం కాడు. అగౌరవపరచినా అంతగా మనస్సులోకి తీసుకోడు. అందుకే ఓమారు విదురుడు ధృతరాష్ట్రుడితో మాటామంతీలో....

న హృష్యత్యాత్మ సంమానే నావమానేన తప్యతే ।
గాఙ్గో హ్రద ఇవాక్షోభ్యో యః స పణ్డిత ఉచ్యతే ॥

'విజ్ఞుడు తననెవరైనా గౌరవిస్తే పొంగిపోడు; అవమానిస్తే కుంగిపోడు. గంగానది మధ్యలోని అగాధప్రదేశంలా గంభీరంగా ఉంటాడే తప్ప, క్షోభ పడడ'ని స్పష్టం చేస్తాడు.

ముఖ్యంగా మనం ఎదుటివారి నుంచి ఒకటి ఆశిస్తున్నప్పుడు, ముందు మనం ఎదుటివారికి అది ఇస్తున్నామా? లేదా? అని కూడా ఆలోచించుకోవాలి. నేను మాత్రం ఎవ్వరినీ లెక్కచేయను, నాకు మాత్రం అందరూ మక్కువతో కాళ్ళు మొక్కాలంటే ఎలా సాధ్యపడుతుంది? ఆకాశంలోకి రాళ్ళు విసిరి, తన తలపై పూలవాన కురవాలని ఆశించడం ఎంత అవివేకమో...మనం విశాలహృదయంతో ఇతరుల గొప్పతనాన్ని గుర్తించి గౌరవించకుండా, తలపై కళ్ళు పెట్టుకొని నడుస్తూ, ఎదుటివారు మాత్రం మనల్ని తమ తలపై పెట్టుకొని పూజించాలంటే ఎలా కుదురుతుంది? ❖

గొప్పవారమని ఎన్నడూ విర్రవీగకూడదు. వినమ్రత కలిగివుండడం వల్ల కలిగే నష్టమేమీ లేదు. కొండ ఎంత పెద్దదైనప్పటికీ అద్దము నందు చిన్నదిగా కనపడుతుంది కదా! - యోగి వేమన



పసిహృదయంలో పరివర్తన

– **జ్యోతికాసేన్,** మనస్తత్వ విశ్లేషకులు

పసిపిల్లల మనస్సులు సున్నితమైనవే కాదు, అద్దం లాంటివి. సరళత్వంతో కూడిన వారి స్వభావాన్ని అర్థం చేసుకొని కొద్దిగా సానబెడితే పసిపిల్లలు వజ్రాల్లా వెలిగిపోతారనడంలో సందేహం లేదు. నా అనుభవంలో ఎన్నో ఉదంతాలు ఈ మాటను నిజం చేశాయి. పదేళ్ళ నిఖిల్ ఇందుకు ప్రత్యక్ష సాక్ష్యం. మొదట్లో అతని అల్లరి, దూకుడు విషయంలో వాళ్ళ తల్లితండ్రులు పడిన ఆందోళన అంతా ఇంతా కాదు. ఆ కుర్రాడి కొంటె చేష్టలకి కుటుంబసభ్యులే కాదు, పక్కింటివాళ్ళు కూడా బేజారెత్తిపోయేవారు. ఎప్పుడూ ఏదో ఒక గొడవతో స్థానికంగా నిఖిల్‌కి ఒక ఆకతాయిగా ముద్రపడిపోయింది. పట్టుమని పదినిమిషాలు కుదురుగా కూర్చొని చదివే అలవాటు లేకపోవడం వల్ల చదువులోనూ వెనకబడిపోయాడు. నిఖిల్ అన్నయ్య పదిహేనేళ్ళ అఖిల్ ఇతనికి పూర్తిగా విరుద్ధం. 'రాముడు మంచి బాలుడు' అన్న రీతిలో అఖిల్ ఎంతో నెమ్మదే కాకుండా, చదువులోనూ ఎప్పుడూ ముందంజలోనే ఉండేవాడు.

ఆ సంవత్సరం ప్రోగ్రెస్ రిపోర్ట్ వచ్చిన తరువాత నిఖిల్ తల్లితండ్రులు ఒక కఠిన నిర్ణయానికి వచ్చేశారు. ఇంట్లో ఉంటే ఇక అతడు బాగుపడే అవకాశమే లేదని నిర్ధరించుకున్నారు. ఆఖరి ప్రయత్నంగా నిఖిల్‌ని బోర్డింగ్ స్కూల్‌లో వేయడమే పరిష్కారమని నిర్ణయించుకున్నారు. ఎట్టకేలకు వాళ్ళు తమ పట్టణానికి సమీపంలో కలకత్తా నగరంలో రామకృష్ణ మిషన్ నిర్వహిస్తున్న ఓ బోర్డింగ్ స్కూల్‌లో చేర్పించేందుకు నిఖిల్‌ని తీసుకువెళ్ళారు. ఆ మార్పుతో ముందు ఆ పరిసర ప్రాంతాల వాళ్ళు ఊపిరితీసుకున్నారు. కానీ బోర్డింగ్ స్కూల్‌లోనూ నిఖిల్ తల్లితండ్రుల ఆశలు అడియాసలే అయ్యాయి. అక్కడా అతని ప్రవర్తనలో ఎలాంటి మార్పు రాకపోగా, పైగా ఆ పాఠశాల పిల్లల చదువుల్ని కూడా నిఖిల్ పాడు చేస్తున్నాడన్న ఆరోపణలు ప్రారంభమయ్యాయి. ఇంట్లో ఎలా అల్లరి చేస్తున్నాడో, అక్కడా అలాగే చేస్తున్నాడని పాఠశాల యాజమాన్యం అతని తల్లితండ్రులతో తమ నిస్సహాయతను వ్యక్తం చేశారు.

కానీ నిఖిల్ 'నేను ఇక్కడ చదువుకోను. మిమ్మల్ని విడిచి నేను ఉండలేను. ఇంటికి తీసుకువెళ్ళిపోండి. నేను అక్కడే బాగా చదువుకుంటాను. అల్లరి చేయకుండా ఉంటాను. అన్నయ్య కన్నా బాగా చదువుతాను. నన్ను నమ్మండి' అన్నాడు. ఏమీ చేయలేక ఇక ఎలాగైతే అలా అవుతుందని నిఖిల్ తల్లితండ్రులు అతన్ని తిరిగి ఇంటికి తీసుకువచ్చి, కొత్త పాఠశాలలో చేర్చారు.

అప్పటి నుంచే నిఖిల్ జీవితంలో కొత్త పార్శ్వం ప్రారంభమైంది. అతనిలో వచ్చిన మార్పు చూసి తల్లితండ్రులే కాదు, చుట్టుపక్కల వాళ్ళు కూడా ఆశ్చర్యపోయారు. అతని నిదానం, సౌమ్యత్వం చూసి అసలు ఇతను ఆ నిఖిలేనా! అని అందరూ ముక్కున వేలేసుకుంటూ ఉన్నారు. ఒక్క గొడవా లేదు! ఎవరితోనూ ఒక్కమాట అనిపించుకోవడం లేదు. అతని ప్రవర్తనతో పాటు మార్కుల్లోనూ వచ్చిన మార్పుకు కారణమేంటో ఎవరికీ అర్థం కావడం లేదు. ఇక ఆ కన్నవారి ఆనందానికి అవధులే లేవు. అయితే నిఖిల్ ప్రవర్తనలో పరివర్తనకు కారణమేంటో ఎవరికీ అంతు చిక్కడం లేదు!

ఒకరోజు తెల్లవారు ఝామునే నిఖిల్ వాళ్ళ అమ్మ లేచి నిఖిల్ గదివైపు చూసింది. ఆ కిటికీలోంచి విద్యుద్దీపం కాంతులు కనిపిస్తూ ఉన్నాయి. ఆసక్తిగా ఆమె కొద్దిగా కిటికీ తెరచి చూసి ఆశ్చర్యపోయింది. నిఖిల్ గదిలో కూర్చొని ధ్యానం చేస్తున్నాడు. ఎదురుగా సమాధిస్థితిలో కూర్చున్న స్వామి వివేకానంద చిత్రపటం. దీపపుకాంతిలో ఆ గదంతా ఒక తేజస్సు వ్యాపించినట్లు ఆమెకు తోచింది. కొంతసేపటికి నిఖిల్ లేచి బయటకు రాబోతున్నాడు. అప్పుడు ఆమె 'నిఖిల్ నువ్వేనా!' అంది చెమ్మగిల్లిన కళ్ళతో. అప్పుడు నిఖిల్ "అవును అమ్మా! స్వామీజీకి నేనిచ్చిన మాటను నిలబెట్టుకుంటున్నాను. మీరు నన్ను ఆ బోర్డింగ్ స్కూల్లో చేర్పించాక, ఒకరోజు తరగతిలో స్వామి వివేకానంద గురించి చెప్పారు. ఏకాగ్రతతో ఏదైనా సాధించవచ్చని అక్కడే తెలుసుకున్నాను. స్వామీజీ ఇలా ధ్యానం చేసి, ఎంతో సాధించారని మా ఉపాధ్యాయులు చెప్పారు. అయితే మిమ్మల్ని అందరినీ వదలి అక్కడ ఉండడం నాకు ఇష్టం లేదు. అలా చెబితే మీరు ఇంటికి తీసుకురారని తెలుసు. అందుకే స్వామీజీని ప్రార్థిస్తూ 'స్వామీజీ నన్ను ఇక్కడి నుంచి మా ఇంటికి పంపించు. మీలా నేనూ ధ్యానం చేస్తాను. బాగా చదువుకుంటాను. ఒక్కసారి నాకు అవకాశం ఇచ్చి చూడు! నేనెలా మారిపోతానో!' అన్నాను. స్వామీజీ నా ప్రార్థన ఆలకించాడు. ఆయనే నా రక్షకుడైన స్వామీజీయే నన్ను మీ దగ్గరికి పంపించాడు. అందుకే ఆయనకిచ్చిన మాటను నిలబెట్టుకుంటున్నాను. నేను పూర్తిగా మారిపోయాను" అన్నాడు. ఆ తల్లి ఆనందబాష్పాలతో కొడుకును దగ్గరకు తీసుకొని, స్వామి వివేకానంద చిత్రపటాన్ని చూసి మనస్సులోనే కృతజ్ఞతలు చెప్పుకుంది. ❖

స్వేచ్ఛా జీవనమంటే...

– స్వామి రంగనాథానంద (రామకృష్ణ సంఘం 13వ సర్వాధ్యక్షులు)

అమెరికాలో పర్యటిస్తున్న సందర్భంలో ఒకసారి నన్ను (స్వామి రంగనాథానంద) అక్కడి రేడియో ప్రసంగానికి ఆహ్వానించారు. మానవశక్తిని సవ్యమైన దిశలో వినియోగించక పోవడం వల్ల కలుగుతున్న కష్టనష్టాలపై చర్చించే ఉద్దేశంతో ఆ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. అమెరికాలో హిప్పీ సంస్కృతి, మాదకద్రవ్యాల వాడకం విశృంఖలమైన రోజులవి! ఆ వ్యామోహంలో పడి యువతరం పోకడలు వెర్రితలలు వేస్తున్న నేపథ్యంలో అక్కడి ప్రభుత్వం రేడియో కార్యక్రమాల ద్వారా యువతీ యువకులను చైతన్యపరిచేందుకు పూనుకుంది. అందులో భాగంగానే అక్కడి రేడియో కేంద్రంలో ఆనాటి



సామాజిక పరిస్థితులపై చర్చించేందుకు నాతో ముఖాముఖి ఏర్పాటు చేశారు. మనిషి తనలోని ఆంతరంగికశక్తికి క్రమశిక్షణతో సరైన దిశానిర్దేశం చేసుకోనట్లయితే విపరీతమైన పరిణామాలను ఎదుర్కోవాల్సి వస్తుందని స్పష్టం చేశాను. ఎక్కడి నుంచో ఓ యువకుడు ప్రతిస్పందిస్తూ, తాము కట్టుబాట్లు, నియంత్రణకు వ్యతిరేకమన్నట్లుగా నినదిస్తూ, 'we dont want discipline; we want a spontaneous natural life - మాకు ఏ క్రమశిక్షణా అవసరం లేదు; ఏది చేయాలనిపిస్తే అది చేస్తాం, యథేచ్ఛగా, సహజంగా జీవించేస్తా'మంటూ అరిచాడు.

ఆ తరువాత నేను ప్రసంగాన్ని కొనసాగిస్తూ 'స్వేచ్ఛా జీవనమంటే యథేచ్ఛగా నడచుకోవడం కాదు. మీరు అత్యంత ఎక్కువగా ఆరాధించే సంగీత కళాకారుడినో, క్రీడాకారుడినో తీసుకోండి. వారు ప్రారంభంలో తమలోని శక్తిని క్రమబద్ధీక రించుకొని, క్రమశిక్షణతో సాధన చేయడం వల్లనే కదా అవకాశం వచ్చినప్పుడు సహజంగా, స్వేచ్ఛగా తమ ప్రతిభను ప్రదర్శిస్తారు. ఎంతో కొంత క్రమశిక్షణను అలవరచుకోకపోతే నిత్యజీవితంలో మనకూ, మూగజీవాలకూ తేడాయే లేదు. youth energy should be channelised. సహజ సుందరమైన జీవితం క్రమశిక్షణ ఫలితంగానే లభిస్తుందనగానే ఒక్కసారిగా ఆ రేడియో కేంద్రం యువతీ యువకుల చప్పట్లతో మారుమోగిపోయింది. ఒక్కసారిగా అక్కడి యువతరానికి ఈ అంశంపై ఆసక్తి పెరిగింది. ఇరవై నిమిషాలని నిర్ణయించుకున్న నా చర్చ దాదాపు రెండు గంటల పాటు సాగింది.

మన వేదాంతం కూడా ఎలాంటి నిర్బంధానికీ లోనుకాని స్వేచ్ఛా జీవితాన్నే ప్రోత్సహిస్తుంది. కానీ విచక్షణ, క్రమశిక్షణతో కూడుకున్నదే నిజమైన స్వతంత్ర జీవనమని నిర్వచించింది. అలా కాకుండా వివేక రాహిత్యంతో, ఇష్టారాజ్యంగా ప్రవర్తించడం పశుజీవనమే తప్ప స్వేచ్ఛా జీవనమనిపించుకోదని స్పష్టం చేసింది. దీనికి సంబంధించి 'శ్రీమద్భాగవతం'లో ఓ చోట...


యశ్చ మూఢతమో లోకే యశ్చ బుద్ధేః పరం గతః ।
తావుభౌ సుఖమేధేతే క్లిశ్యత్యన్తరితో జనః ॥

ఈ లోకంలో రెండు రకాల మనుషులే పూర్తిగా ఆనందంగా ఉండగలరు. ఒకరు – ఈ ప్రపంచంతో సంబంధమే లేకుండా తన లోకంలో తాను విహరించే పిచ్చివాడు. రెండో వ్యక్తి – ఆత్మను సాక్షాత్కరించుకున్న బ్రహ్మజ్ఞాని. మధ్యరకం మనుష్యులు నిరంతరం సంఘర్షణలతో, ఒత్తిళ్ళతో జీవిస్తూ ఉంటారు. కనిపిస్తూ ఉంటారు.

ఈ సంశయాలనూ, సంఘర్షణలనూ, ఒత్తిళ్ళనూ అధిగమించి ముందు ఇంద్రియస్థాయిలో ఒక క్రమశిక్షణను అలవరచుకోవాలి. ఆ తరువాతే మనస్సుకు ఎలాంటి ఆచ్ఛాదనలూ లేని సహజస్థితికి మనిషి చేరుకుంటాడు. మనిషికీ, ఇతర జీవజాలానికీ ప్రధానమైన తేడా – మానసిక నియంత్రణే! శారీరక, మానసిక ప్రచోదనల్లో మనిషికీ, పశువుకూ తేడా ఉండదు. కానీ ఉచితానుచిత వివేకంతో, విచక్షణతో నియంత్రించుకునే శక్తి మనిషి ఒక్కడికే ఉంటుంది. మనస్సుకు ఏది తోస్తే అది చేయడం సభ్యసమాజంలో మసలుకునే మనిషి లక్షణం కాదు. 'Such a philosophy will eventually convert human society into an animal farm. – అలాంటి సిద్ధాంతం మానవ సమాజాన్ని పశువుల చావడిగా మారుస్తుంది'. అలా కాకుండా మనిషి ఆధ్యాత్మికంగా ఎదిగినప్పుడు మనస్సులో కలిగే సంకల్పాలు, ప్రచోదనలన్నీ ఇంద్రియస్థాయి, విషయ వాసనలకు అతీతమైన స్థాయిలో పవిత్రంగానే ఉంటాయి. ఇదే నిజమైన స్వేచ్ఛా జీవనానికి అర్థం. ❖ సేకరణ: ఆర్. కృష్ణ

ఆత్మ గురించి విచారణ చేయండి. అప్పుడు ఆత్మ దేదీప్యమానంగా ప్రకాశిస్తుంది. రక్త మాంసాలతో కూడిన ఈ అస్థిపంజరంపై దృష్టిని పెట్టి 'నేను నేను' అనడమే బంధానికి కారణం. - స్వామి వివేకానంద



రామకృష్ణ మఠం

'సౌత్ నాడ, అశోక పెట్రోల్ పంప్ ఎదురుగా, హరిపాడ్-690 514. అలెప్పి జిల్లా, కేరళ. ఫోన్: 09745325834;
E mail: srkmathharipad@gmail.com; viveka.vira@gmail.com; www.rkmathharipad.org

శ్రీరామకృష్ణ మఠ కేంద్ర పునర్నిర్మాణానికై విజ్ఞప్తి

కేరళ రాష్ట్రంలో శ్రీరామకృష్ణుల ఉద్యమాన్ని వ్యాప్తి చేసిన స్వామి నిర్మలానందజీ మహరాజ్, ప్రప్రథమంగా 1913లో దక్షిణ కేరళలోని హరిపాడ్‌లో రామకృష్ణ మఠ శాఖను ప్రారంభించారు. భగవాన్ శ్రీరామకృష్ణుల ప్రత్యక్ష సన్న్యాస శిష్యులైన స్వామి బ్రహ్మానందజీ మహరాజ్, రామకృష్ణ సంఘ వరిష్ఠ సన్న్యాసుల సందర్శనంతో ఈ ఆశ్రమం పునీతమైనది.



పూర్తిగా శిథిలమైన ఆశ్రమ భవనం

ఈ ఆశ్రమం స్థాపించి వందేళ్ళు గడిచాయి. కాలగతిలో ఆశ్రమంలోని భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. అందువల్ల నూతన భవనాల నిర్మాణం అత్యంత ఆవశ్యకమైనది. ఈ నేపథ్యంలో విశ్వజనీన శ్రీరామకృష్ణ దేవాలయం, కార్యాలయం, సేవా కార్యక్రమాల నిర్వహణ భవనం, గ్రంథాలయం, సాధునివాస భవనాలను నిర్మించాలని సంకల్పించాం. ఈ పథకానికి ఐదు కోట్ల రూపాయల వ్యయం అవుతుందని అంచనా వేయడం జరిగింది.



ఈ పవిత్ర సేవాయజ్ఞంలో ప్రతి ఒక్కరూ పాలుపంచుకోవాలన్న ఉద్దేశంతో ఐదు కోట్ల రూపాయలను ఉదార హృదయులైన భక్తులు, మిత్రులు, హితులైన 50,000 మంది నుండి రూ. 1,000/- చొప్పున విరాళాలను స్వీకరించదలచాం. రూ. 1,000/- కన్నా ఎక్కువ విరాళాలను కూడా ఇవ్వవచ్చును.

మీ విరాళాన్ని Ramakrishna Math, Haripad పేరున చెక్కు/ డి.డి తీసి Ramakrishna Math, South Nada, Opp.Asoka Petrol Pump, Haripad - 690514, Dist.Alleppey, Kerala చిరునామాకు పంపాల్సిందిగా మనవి. విరాళాలకు 80జి సెక్షన్ కింద ఆదాయపు పన్ను మినహాయింపు లభిస్తుంది.



రెండు గదులున్న పురాతన గోదాము - ప్రస్తుత సాధునివాసం

ఈ బృహత్ సేవా యజ్ఞానికి మీవంతు ఆర్థిక సహాయాన్ని అందించి భగవాన్ శ్రీరామకృష్ణుల కృపకు పాత్రులు కాగలరని ఆశిస్తున్నాం.

భగవత్సేవలో
స్వామి వీరభద్రానంద
అధ్యక్షులు

విరాళాలను ఆన్‌లైన్ ద్వారా కూడా పంపవచ్చు :

NEFT Transfer: Account Number - 30642551603, State Bank of India, Haripad. RTGS/NEFT/IFSC code: SBIN0010596.

విరాళాలను ఆన్‌లైన్ ద్వారా పంపించిన దాతలు తమ పూర్తి పేరు, చిరునామా, పాన్ నెంబర్, ఫోన్ నెంబర్‌తో సహా పూర్తి విరాళ వివరాలను ఈమెయిల్ srkmathharipad@gmail.com కు తెలియజేయగలరు.

Foreign Donation: Kindly draw a Cheque / Draft in favour of "Ramakrishna Math" and send it to the General Secretary, Ramakrishna Math, Belur, Dt. Howrah (West Bengal), Pin - 711 202, India.

In the covering letter please mention that it is a donation for 'Haripad Centre Building Fund' and inform all the details of the donation to e-mail:srkmathharipad@gmail.com, viveka.vira@gmail.com

Advt.,



(1884 – 1967)

ముందుకు సాగిపో!

దివ్యజనని శ్రీశారదాదేవి ప్రత్యక్ష శిష్యులైన స్వామి ప్రేమేశానంద (1884-1967) రామకృష్ణ సంఘంలో అత్యున్నత గౌరవాన్నీ ప్రేమాభిమానాలనూ చూరగొన్న అగ్రశ్రేణి సన్న్యాసి. ఆయన జీవితం శ్రీరామకృష్ణ - వివేకానందుల ఆశయాలతోనూ, భగవద్గీత సారాంశంతోనూ నిండింది. చాలామంది యువతీ యువకులకూ, గృహస్థులకూ, బ్రహ్మచారులకూ, సన్న్యాసులకూ ఆయన ఎన్నో లేఖలు వ్రాశారు. జీవితంలో అంకితభావం, ఆధ్యాత్మిక, సేవా భావాలను అలవరచుకొనేందుకు ఆ లేఖా పరంపరలు మార్గదర్శకాలయ్యాయి. పాఠకుల ప్రయోజనార్థం విలువైన ఈ లేఖలను 'శ్రీరామకృష్ణ ప్రభ'లో 2009 జూన్ సంచిక నుంచి ధారావాహికంగా ప్రచురిస్తున్నాం.

శ్రీహట్ట
2-9- ...?

ప్రియమైన శశాంక!

భగవద్గీత ఏడో అధ్యాయ పఠనం పూర్తిచేశావని తెలిసి ఆనందించాను. నేను పదే పదే చెప్పేది ఏమిటంటే - ఆత్మ అన్ని జీవుల్లోనూ వసిస్తూ ఉంటుంది. దీన్ని నేను గ్రహించగలిగాను. దీన్ని అందరూ అర్థం చేసుకోవాలన్నదే నా ఏకైక కాంక్ష. ఏకైక జీవిత లక్ష్యం. దీన్ని అవగాహన చేసుకోవడానికి అర్హులైనవారంతా నాకు ఆప్తులే. అలాంటి అవగాహన కోసం కృషి చేసేవారిని ప్రాణప్రదంగా ప్రేమిస్తాను. వారితో మమేకమవుతాను.

'అంతటా ఒకే ఆత్మ వసిస్తోంది' అని కొద్ది మాటల్లో చెప్పడం తేలికే. కానీ దాన్ని అర్థం చేసుకొని, జీర్ణించుకొని, అనుభవానికి తెచ్చుకోవడానికి చేయవలసిన ప్రయత్నం ఎంతో బ్రహ్మాండమైనది. సంపూర్ణంగా భగవంతునితో ఐక్యతను సాధించడం ఎంత బృహత్తర ప్రయత్నమో తెలుసా! అందుకోసం గట్టి పోరాటాలనూ, ఘోరమైన కష్టాలనూ ఎదుర్కోవలసి ఉంటుంది. భగవంతుని కోసం పిచ్చివాడివైపోతే తప్ప ఆయన్ని పొందడం అసాధ్యం. ఇదేమీ అల్లాటప్పా భక్తునికి సాధ్యమయ్యే వ్యవహారం కాదు. వీరుని లాంటి వాడు సాధించవలసిన అంశం. ప్రాచీన కాలంలో రాజులు మాత్రమే ఈ బ్రహ్మవిద్యను పొందడానికి పాటుపడేవారు. క్షాత్ర లక్షణం గలవారికి మాత్రమే ఈ బ్రహ్మవిద్య లభ్యమవుతుంది. కఠినమైన, తీక్షణమైన ఆధ్యాత్మిక సాధనలు అనుష్ఠించేందుకు తగిన శ్రమ చేయలేనివారికి, గొప్ప వ్యక్తులుగా తయారుకావాలనే తీవ్రమైన తపన లేనివారికి, కాస్త గాలి తాకిడికే తల్లడిల్లి కొట్టుకుపోయే ఎండుటాకు లాంటి మనస్తత్త్వం గలవారికి ఇది దుస్సాధ్యమైనది. అశక్తులమని భావిస్తూ, తమను తాము వంచించుకుంటూ కాలం వెళ్ళబుచ్చేవారికి గానీ, స్వయంకృతాపరాధాల నుండి బయటపడేందుకు భగవంతుణ్ణి ఆశ్రయించి అన్నిటికీ ఆయనే బాధ్యుడని అపార్థాలు కల్పించుకొనే వారికి గానీ లభించే విద్య కాదిది. "నేను భగవత్ స్వరూపుణ్ణి. భగవంతుణ్ణి పొంది తీరాలి. బంధరహితుణ్ణి కావాలి. ఈ బానిసత్వం నుండి బయటపడి స్వర్గ రాజ్యాన్ని చేరుకోవాలి" అని భావించే కృతనిశ్చయుల మార్గమిది. ఆ విధమైన ఆకాంక్ష, దృఢత్వమున్న వీరుల బాట ఇది. సింహాలు చరించే రాజమార్గమే తప్ప, గాడిదల కాలిబాట కాదిది.

ప్రతివాడూ కాశీకి పోవాలనుకునేవాడే. కానీ శ్రమ కోర్చి నడవడు. ఎవరి భుజాల మీదైనా ఎక్కుదామనుకుంటాడు. నడిచేందుకు సాహసించేవాడికి నేను ఏ విధమైన సహాయమూ చేయలేకపోయినా, ప్రోత్సాహాన్నివ్వగలను. నువ్వు మాత్రం ఒక్క విషయం గుర్తుపెట్టుకో. నీ హృదయంలో ఆకర్షణ అన్న దానికి ఏనాడు తావిస్తావో ఆనాడు నీ ఆశలు, కోరికలు అన్నీ ఒక్కరోజులోనే సర్వనాశనమవుతాయి.

ఆలోచనా రచనల సారమంతా అద్వైతమే. అంతకు మించిన ఆనందం మరొకటి లేదు. దాన్ని అనుభవానికి తెచ్చుకోవడమే జీవితం యొక్క ఉన్నత లక్ష్యం. మిగిలినదంతా ఆడంబరమే! కేవలం పనికిమాలిన ప్రయత్నం మాత్రమే! ప్రేమ అన్నది రూపాలకూ, ఆరోపణలకూ అతీతం కానప్పుడు అది భ్రాంతి అవుతుంది. ఆ విధమైన భ్రాంతిలో పడక అమృతత్వాన్ని నువ్వు సాధించాలని ఆశిస్తున్నాను.


ప్రేమాశీస్సులతో
స్వామి ప్రేమేశానంద

తెలుగు సేత: కె. త్రివిక్రమరావు

మూఢవిశ్వాసాలు విపత్తును కలుగజేస్తాయి. అవి మనస్సును వ్యాధిగ్రస్తం చేస్తాయి. ప్రపంచాన్ని శక్తివంతం చేయగల శక్తి ఉపనిషత్తుల్లో ఉంది. అది ఆచరణలోకి తీసుకురావాలి. - స్వామి వివేకానంద

(...15వ పేజీ తరువాయి)

శ్రీరంగనాథ క్షేత్రం మొదటిది. అన్నమాచార్యులు తన పారమార్థిక ప్రయాణంలో భాగంగా ఈ దేవాలయాన్ని దర్శించుకున్న దివ్యానందంలో...



కావేరి మధ్య రంగక్షేత్ర మల్లదిగో
శ్రీవిమాన మదిగో శేషపర్యంక మిదె
దేవుఁడల్లదె వాడే దేవి శ్రీలక్ష్మి యదె
సేవించరో నాభిఁచిగురించె నతడూ...

'కావేరీ జలాల పరవళ్ళ నడుమ వెలసిన కోవెల అదిగో! గుడిపైని గోపురం అదిగో! రంగనాథుడు పవళించిన శేషతల్పం అదిగో! లక్ష్మీసమేతుడైన దేవదేవుడు అతడే! సేవించి తరించుకొమ్మ'ని తాళ్ళపాక వంశభూషణుడు తన్మయుడై పాడుకొని పొంగిపోయాడు.

శ్రీరంగం ఆలయంలో ప్రణవాకారంలో దర్శనమిచ్చే విమానం పైభాగం వేదశృంగంగా ప్రసిద్ధికెక్కింది. ఆనందదాయకుడైన ఈ శ్రీరంగనాయకుణ్ణి ఆరాధించి తరించిన యోగులు, భక్తాగ్రేసరులు ఎందరో! భూదేవి అంశతో జనించిన గోదాదేవి అందులో ఒకరు; అదేవిధంగా అప్పటి ఢిల్లీ సుల్తాన్ కుమార్తె తళుక్కునాచ్చియార్ కూడా స్వామికి పరమభక్తురాలు కావడం విశేషం. అన్నమయ్య ఈ క్షేత్రంలో అడుగిడి అబ్బురపడ్డట్లే, శ్రీరామచంద్రుడి భక్తశిఖామణి భద్రాచల రామదాసు కూడా భద్రాచలాన్ని కనులారా కాంచిన క్షణాల్లో....

అదిగో భద్రాద్రి గౌతమి ఇదిగో చూడండి....
అనుపమానమై అతి సుందరమై
దనరు చక్రము ధగ ధగ మెరిసెడి...అదిగో భద్రాద్రి॥
పొన్నల పొగడల పూపొదరిండ్లను
చెన్ను మీగడను సింగారం బదు... అని అభివర్ణించాడు.

ఇలా నిజమైన భక్తుడికి దేవుడు, దేవాలయం వేరు కాదు.

దామోదర పురగోపురమదె...

ఈ శ్రీరంగనాథ దేవళం మరో ప్రత్యేకత ఇక్కడి ఏడు ప్రాకారాలు. ఆధ్యాత్మికవేత్తలు సప్తలోకాలైన భూలోకం, భువర్లోకం, సువర్లోకం, మహర్లోకం, జనలోకం, తపోలోకం, సత్యలోకాలకు ప్రతిరూపాలుగా ఈ సప్తప్రాకారాలను భావిస్తూ ఉంటారు. అదే విధంగా ఈ క్షేత్రంలో ఇరవై ఒక్క గోపురాలు ఉన్నాయి. అన్ని గోపురాలూ అపురూపమైన శిల్పసంపదతో విరాజిల్లుతున్నాయి. ఆసియాలోకెల్లా ఎత్తైన పదమూడు అంతస్తులున్న గోపురం ఈ శ్రీరంగం క్షేత్రంలో నిర్మితమై ఉంది. ఈ వైభవాన్ని వీక్షించే వేంకటేశ్వరుడి భక్తచింతామణి...

యేడు గోడలు నవిగో యెసగు పూతోపు లవె
కూడి దామోదర పురగోపుర మదె
తోడ వేయికంబాల దొడ్డమంటప మదిగో
చూడరో పసిడిమించుల కంబ మదిగో...అంటూ అక్కడి ప్రాకారాలనూ, గోపురాలనూ, వేయిస్తంభాలనూ, పూతోటలనూ, గోపురంపైనున్న పసిడి కలశాన్నీ కళ్ళకు కట్టినట్లు తన పదాలతో దర్శింప జేస్తున్నాడు. కర్ణాటక సంగీతస్రష్ట, శ్రీరామ ఉపాసకులు త్యాగరాజస్వామి కూడా ఓ మారు ఈ శ్రీరంగ క్షేత్రాన్ని దర్శించి, ఇక్కడి ఉత్సవ విశేషాలను తన కీర్తనలో పేర్కొంటూ...

రాజు వెడలె చూతము-రారె కస్తూరిరంగ...
తేజినెక్కి సామంతరాజు లూడిగము సేయ
తేజరిల్లు నవరత్నపు దివ్యభూషణములిడి రంగ...
కావేరి తీరమునను పావనమగు రంగపురిని
శ్రీవెలయు చిత్రవీధిలో వేడ్కగ రాగ
సేవను గని సురలు విరులచే ప్రేమను పూజింపగ
భావించి త్యాగరాజు పాడగ వైభోగ రంగ..... అని వేనోళ్ళ వినుతించారు.

శ్రీవేంకటేశుడై వరమిచ్చీని...

విష్ణుభక్తిలో పారవశ్యం చెందిన ఆళ్వారులు, శ్రీవైష్ణవులు ఆది నుంచి శ్రీరంగనాథుడిని సేవించి, తరించారు. విశిష్టాద్వైతాన్ని వ్యాప్తిలోకి తెచ్చిన ఆచార్యత్రయం శ్రీనాథాచార్యులు, యమునాచార్యులు, రామానుజాచార్యులు కూడా ఆళ్వారుల ద్వారా ప్రభావితులైన వారే! అదే విధంగా పలుకైంకర్యాలతో శ్రీరంగనాయకుడిని కొలిచేందుకు స్థానికంగానే నివాస ముంటూ శ్రీవైష్ణవులు తమ జీవితాల్ని సార్థకం చేసుకున్నారు; చేసుకుంటూ ఉన్నారు. అన్నమాచార్యులు కూడా వారి ప్రాధాన్యాన్ని ప్రస్తావిస్తూ...

ఆళువారులు వారే యంగరంగ విభవమిదె
వాలు శ్రీవైష్ణవపు వాడలవిగో
ఆ లీల శ్రీవేంకటేశుడై వర మిచ్చీని
తాలిముల శ్రీరంగ దైవము గొలువరో....

అని కొనియాడుతున్నాడు. ఆ శ్రీనివాసుడే, శ్రీరంగవాసుడని, ఓర్పుతో కొలిస్తే వరాలిస్తాడని పరమభక్తుడిగా ఈ పదకవితా పితామహుడు హామీ ఇస్తున్నాడు. ప్రముఖ వాగ్గేయకారులు ముత్తుస్వామి దీక్షితులు కూడా తాను నిత్యమూ స్మరించుకునే శ్రీరామచంద్రుడే, ఇక్కడ శ్రీరంగనాథుడై ఆదిశేషుడిపై సేద తీరుతున్నాడని తలచుకుంటూ...

రంగపుర విహార, జయకోదండ రామావతార! రఘువీర ॥
అంగజ జనక, దేవ బృందావన సారంగేంద్ర, వరద, రమాంత
రంగ శ్యామలాంగ, విహంగ, తురంగ, సదయాపాంగ సత్సంగ...
పంకజముఖ పట్టాభిరామ। వామాంకగత సీతావరవేష
శేషాంకశయన, భక్తసంతోష.... అని ఆలపించి ఆనందపడిపోయాడు. ❖

(శ్రీరంగనాథస్వామి వసంతోత్సవం జూన్ 5 నుండి 13 వరకు)



జీవన వేదం
స్వామీజీ కథల సారం

మాయను ఛేదించు!

ఒకానొక హైందవ పూర్వ గాథ ఉంది. శ్రీమహావిష్ణువు ఈ భూమిపై వరాహ రూపంలో అవతరించాడు. ఆ వరాహానికి జంటగా ఆడ వరాహం కూడా ఉంది. కాలక్రమంలో ఆ జంటకు అనేక పిల్ల వరాహాలు పుట్టాయి. మగ వరాహం తన కుటుంబాన్ని చూసి మురిసిపోతోంది. తన దైవత్వాన్ని సైతం మర్చిపోయి బురదలో, అశుద్ధంలో పొర్లుతూ ఆనందంతో ఘుర్ఘురిస్తూ కాలక్షేపం చేస్తోంది. దేవతలందరికీ ఇది చాలా బాధాకరమనిపించింది. వారంతా భూలోకానికి వచ్చి వరాహ రూపం త్యజించి మళ్ళీ వైకుంఠానికి రావలసిందిగా విష్ణువును ప్రార్థించారు. కానీ ఆ వరాహం ఆ అభ్యర్థనను మన్నించకపోగా, 'నేను చాలా ఆనందంగా ఉన్నాను నన్ను విసిగించకండి' అని వారందరినీ తరిమి కొట్టసాగింది. గత్యంతరం లేక దేవతలు ఆ వరాహాన్ని సంహరించారు. తక్షణమే శ్రీమహావిష్ణువు తన దివ్యత్వపు గాంభీర్యాన్ని స్ఫురణకు తెచ్చుకున్నాడు. 'వరాహ రూపంలో ఆనందంగా ఎలా గడపగలిగానా?' అని ఆశ్చర్యచకితుడయ్యాడు.

జనులంతా ఈ రీతిలోనే ప్రవర్తిస్తూ ఉంటారు. కాబట్టి ఆ వరాహం కథను జ్ఞప్తికి తెచ్చుకోండి. అప్పుడు ప్రతి ఒక్కరూ తమలోనే అనంతమైన ఆనందపు ఖని ఉందని తెలుసుకుంటారు. మీ ప్రస్తుత స్థితి మీకే మాత్రం సుఖదాయకమో ఆలోచించండి. కానీ మీరు నిజానికి ఎవరో మీరు గ్రహించిననాడు ఇంద్రియ ప్రలోభ జీవితాన్ని వదిలిపెట్టలేకుండా ఉన్నామని వాపోయి ఆశ్చర్యపోతారు. అప్పుడు మీ వ్యక్తిత్వం ఏమిటి? ఆ పంది జన్మ కన్నా ఘనమైనదా? దీనినా మీరు వదలలేమంటున్నది? భగవంతుడు మనల్ని అనుగ్రహించునుగాక! ❖

ఎడారిలో పయనం!

ఒకప్పుడు నేను పశ్చిమ భారతదేశంలో సముద్రపు అంచున కోస్తా ప్రాంతపు ఎడారిలో ప్రయాణం చేస్తున్నాను. రోజుల తరబడి నేను ఆ ఎడారి గుండా కాలినడకన సాగిపోతున్నాను. ప్రతిరోజూ చుట్టూ చెట్లతో నిండి ఉన్న అందమైన సరస్సులను చూచి ఆశ్చర్యపోయేవాడిని. ఆ చెట్ల నీడలు తల క్రిందులుగా, అందంగా చలిస్తూ ఉండేవి. "ఇంత అద్భుతంగా ఉన్న ఈ ప్రాంతాన్ని ఎడారి ప్రదేశం అంటా రేమిటి?" అని నాలో నేను అనుకొనేవాడిని. ఆ అద్భుతమైన సరస్సులనూ, వృక్షాలనూ చూస్తూ కొంతకాలం ప్రయాణించాను.

ఒకనాడు నాకు దాహం వేసింది. నీళ్ళు త్రాగాలనిపించింది. వెంటనే స్పష్టంగా కనిపిస్తున్న అందమైన సరస్సు వైపు నడిచాను. తీరా సరస్సును సమీపించేసరికి అది అదృశ్యమై పోయింది. ఇంతకు ముందు ఎన్నోసార్లు చదివిన ఎండ మావులంటే ఇవేనని అర్థమైంది. దాంతో పాటే ఇంతకాలం వీటిని చూస్తూనే ఉన్నా కానీ, ఎండమావులని తెలుసుకోలేక పోయానే అనే ఆలోచన కూడా నా మదిలో మెదిలింది.



మరుసటి రోజు ఉదయం నా ప్రయాణం కొనసాగించాను. మళ్ళీ సరస్సులు కనిపిస్తున్నాయి. కానీ వెంటనే నాకు అర్థమైంది అవి ఎండమావులని. ఈ ప్రపంచంలో మన ప్రయాణం కూడా ఈ రీతిగానే ఉంటుంది. రోజుల తరబడి, నెలల తరబడి, సంవత్సరాల తరబడి మన పరుగు సాగుతోంది. ఏదో ఒకనాడు అసలు విషయం బట్టబయలవుతుంది. కానీ మళ్ళీ మనం మోహంలో పడిపోతాం. ఎందుచేతనంటే ఈ శరీరం పూర్వజన్మ కర్మానుసారిణి. కాబట్టి మన ప్రయాణం ఎండమావుల వెంటే సాగుతుంది.

మనం కర్మకు బద్ధులమై ఉన్నంత కాలం ఈ సంసార చక్రంలో పరిభ్రమించక తప్పదు. పురుషులు, స్త్రీలు, జంతువులు, మొక్కలు, బాంధవ్యాలు, బాధ్యతలు అన్నీ పునరావృతం అవుతాయి. కాకపోతే వెనుకటంత శక్తిమంతంగా కాకపోవచ్చు. క్రొత్తగా సంతరించుకున్న జ్ఞానం వల్ల కర్మ యొక్క బలం తగ్గుతుంది. దాని విష ఫలితాలు నశిస్తాయి. మార్పు సంభవిస్తుంది. ఆ పరిణామం వల్ల మనకు ఇప్పుడు తెలుసుననే ఆలోచన కలుగుతుంది. యథార్థానికీ, ఎండమావికీ మధ్యనుండే సున్నితమైన తేడా అవగతమవుతుంది. ❖

తెలుగు సేత: కె. త్రివిక్రమరావు

శరీరం మాంసం, మజ్జ, ఎముకలు, నెత్తురు మొదలైన పదార్థాల ప్రోవుగాని మరొకటి కాదు. శరీరాన్ని గురించి ఈ విధమైన వివేచన చేస్తూవుంటే శరీరాభిమానం తొలగిపోతుంది. - శ్రీరామకృష్ణులు

- స్వామి పరిజ్ఞేయానంద

'విషాదం' యోగమా?

జీవితంలో ప్రతీ ఒక్కరం ఎంతో కొంత, ఎప్పుడో ఒకప్పుడు దుఃఖాన్ని అనుభవించినవాళ్ళమే! అయితే మనం విలపిస్తే 'అయ్యో! నీకేమి రోగం' అని లోకం నిందిస్తుంది. అర్జునుడు విలపిస్తే 'ఆహా! అర్జునుడిదేమి యోగం' అని కీర్తిస్తుంది. మనం విలపిస్తే రోగమనీ, ఆయన విలపిస్తే యోగమనీ అంటున్నారు. ఇంతకీ, అర్జునుని విషాదానికీ, మన విషాదానికీ తేడా ఏమిటి?

మన విషాదం భవబంధాలను పెంచేది, అర్జునుడి విషాదం భవబంధాల్ని త్రుంచేది; మన విషాదం ఇహార్థాలను కోరేది, ఆయన విషాదం పరమార్థాన్ని కాంక్షించేది. భౌతిక సుఖాల కోసం విలపిస్తే అది రోగహేతువు. భగవంతుని కోసం విలపిస్తే అది యోగహేతువు. కాబట్టి ఎవరు భౌతికానందం కోసం విలపిస్తారో వారి జీవితం రోగమయం; ఎవరు పారమార్థికానందం కోసం విలపిస్తారో వారి జీవితం యోగమయం.



దుర్యోధనుడు ప్రాపంచిక భోగ భాగ్యాల కోసం, భౌతిక సుఖాల కోసం వెంపర్లాడాడు. చివరకు పాండవులకు సూది మొన మోపినంత నేల అయినా ఇవ్వనని ఆగ్రహించాడు. అందుకే అసూయ, అహంకార రోగాలతో కూడిన అతడి జీవితం విషాదమయమైంది. అర్జునుడు 'న కాంక్షే విజయం, కృష్ణ న చ రాజ్యం సుఖాని చ - కృష్ణా! నాకు విజయం వద్దు; రాజ్యం వద్దు; సుఖాలేవీ వద్దు' అంటూ విలపించాడు. అందుకే అర్జునుడి విషాదం యోగమయమైంది, ఆత్మజ్ఞానానికి సోపానమైంది.

ఇంత తెలిసినప్పటికీ భౌతిక విషయాల కోసం కాకుండా భగవంతుని కోసం విలపించి జీవితాన్ని యోగమయంగా మలచుకోవడం ఎంతమందికి సాధ్యం? అందుకే శ్రీరామకృష్ణులు "ఈ ప్రపంచంలో భార్యాబిడ్డల కోసం, భోగభాగ్యాల కోసం, పేరుప్రతిష్ఠల కోసం కడవల కొద్దీ కన్నీళ్ళు కార్చేవారే కానీ భగవంతుని కోసం విలపించేవారెవరు?" అని ప్రశ్నించేవారు.

పసిపిల్లవాడు ఏడిస్తే తల్లి ఎక్కడున్నా పరుగున వచ్చినట్లు, భక్తుడు విలపిస్తే భగవంతుడు వెంటనే ప్రత్యక్షమవుతాడు. తల్లి దృష్టిని తన వైపు తిప్పుకోవడానికి పసిపిల్లవాడు ప్రయోగించిన శక్తి, భగవంతుని ఆదరణ పొందడానికి భక్తుడు ప్రదర్శించిన యుక్తి 'రోదన' మాత్రమే! అందుకే 'బాలానామ్ రోదనమ్ బలమ్, భక్తానామ్ రోదనమ్ బలమ్' అన్నారు పెద్దలు.

భగవంతుని కోసం విలపించి, విషాదాన్ని ఓ యోగంగా మలచిన అగ్రగణ్యులు శ్రీరామకృష్ణులు. ఆయన కాళీమాత దర్శనం కోసం ప్రార్థిస్తూ 'అమ్మా! ఇంకొకరోజు గడిచిపోయింది. అయినా నీ దర్శన భాగ్యం నాకు కలగలేదు' అంటూ నేలపై పొర్లిపొర్లి విలపించేవారు. సాధనలు చేసిన తరువాత భగవత్సాక్షాత్కారం పొందడం సర్వసాధారణం. కానీ ముందు జగన్మాత దర్శనం పొంది, ఆ తరువాత ఆధ్యాత్మిక సాధనలు చేయడం ఒక్క శ్రీరామకృష్ణుల జీవితంలోనే మనం చూస్తాం. ఇది ఎలా సాధ్యమైందంటే, పసిపిల్లవాడు తల్లి కోసం విలపించినట్లు, శ్రీరామకృష్ణులు జగన్మాత దర్శనం కోసం విలపించారు. కేవలం కన్నీళ్ళతోనే కాళీమాతను కదిలించగలిగారు. అదే ఆయన చేసిన సాధన. ప్రాపంచిక విషయాల కోసం తాపత్రయపడకుండా భగవంతుని కోసం తపిస్తే సులభంగా భగవద్దర్శనభాగ్యం లభిస్తుందనీ, అలాంటి విషాదమే యోగమనీ నిరూపించారు, సులభో పాయాన్ని సూచించారు శ్రీరామకృష్ణులు.

మనుష్యులను బాహ్యాడంబరాలు, ఆర్భాటాలు, హోదాలతో మెప్పించవచ్చు. కానీ భగవంతుణ్ణి మాత్రం ప్రసన్నుణ్ణి చేసుకోలేం. ఎందుకంటే Man sees the face but God sees into the heart. Man considers the actions, but God instead examines the intentions - మనుష్యులు బయట తళుకు బెళుకులకు, బాహ్య వ్యవహారాలకు మాత్రమే ప్రాధాన్యమిస్తారు. కానీ దేవుడు హృదయాంతరాళంలోకి తొంగిచూస్తాడు. మనో భావాలను పరిశీలిస్తాడు.

అందుకే ఒక పరమ భక్తుడు "ఓ భగవాన్! నా సంపద, సౌందర్యం, సామర్థ్యం, మేధస్సు, వాక్పటిమలతో నిన్ను మెప్పించలేను. నిన్ను కదిలించగలిగే సామర్థ్యం నా కన్నీళ్ళకే ఉంది" అని భగవంతుణ్ణి ఆర్తితో ప్రార్థిస్తాడు. దీన్నిబట్టి భగవంతుడు ప్రసన్నుడయ్యేది పన్నీరుతో కాదు, కన్నీరుతోనే అని అర్థమవుతుంది.

మనం భగవంతుని కోసం కడవలకొద్దీ కన్నీళ్ళు కార్చలేకపోయినా, కనీసం ఒక్క కన్నీటిబొట్టునైనా రాల్చగలిగితే ఆ కరుణాసముద్రుడు తప్పక కరుణిస్తాడు. అప్పుడు అర్జునుడు, శ్రీకృష్ణుణ్ణి తన కళ్ళ ముందుంచుకుని కర్తవ్యాన్ని నిర్వహించినట్లు మనం కూడా భగవంతుణ్ణి మదిలో నిలిపి కర్తవ్యాలను నిర్వహిస్తూ బంధరహిత జీవితాన్ని గడపవచ్చు. అలాంటి జీవితం యోగమయమే! ఇహపరాలలో ఆనందమయమే!! ❖




- స్వామి పార్థసఖానంద




దైవం

1. దేవుడు ఎంత గొప్పవాడంటే, తన ప్రేమలో ఈ ప్రపంచం అంతటినీ ముంచగలడు. ఎంతటి సూక్ష్మ స్వరూపుడంటే, మన హృదయంలోపలే ఒదిగిపోగలడు. ఎంతటి జ్ఞానశీలి అంటే, మన కోరికలన్నీ తెలుసుకోగలడు.
కానీ మనకు మేలు చేసే వాటిని మాత్రమే తీర్చేటి వివేకవంతుడు ఆ దేవుడు.
2. గతంలోకి చూస్తూ దేవునికి ధన్యవాదాలు అర్పించండి. భవిష్యత్తులోకి చూస్తూ దేవునిపై విశ్వాసం ఉంచండి. చుట్టూ చూస్తూ దేవుని సేవించండి. లోపలికి చూస్తూ దేవుని కనుగొనండి.
3. భగవంతుని మీరు చూస్తున్నట్లుగానే ఆరాధించండి. ఎందుకంటే మీరు ఆయన్ని చూడలేకున్నా, ఆయన మిమ్ములను చూడగలడు.
4. మనం దెయ్యం కంటే దేవుణ్ణే ఎక్కువగా తలచుకుంటాం. కానీ తక్కువగా అనుసరిస్తాం!



మతం

1. 'నేను మంచిని చేసినప్పుడు ఆనందపడతాను. తప్పు చేసినప్పుడు చింతిస్తాను. అదే నా మతం' అని లింకన్ అంటారు.
2. 'ఆధ్యాత్మికత లోపించిన శాస్త్ర విజ్ఞానం కుంటిది. శాస్త్రీయత లేని మత విశ్వాసం గుడ్డిది' అని ఐన్ స్టీన్ చెబుతారు.
3. 'దయే అన్ని మతాలకు ఆధారం. అన్ని పాపాలకు అహంకారమే మూలం' అని తులసీదాసు ఉపదేశిస్తారు.
4. 'ఒకరిని ఒకరం ద్వేషించుకోవడానికి కావలసినంత మతం మనకు ఉంది. కానీ ఒకరిని ఒకరం ప్రేమించుకోవడానికి కావలసినంత మతం మన వద్ద లేదు!' అని స్వామి వివేకానంద అన్నారు.
5. డబ్బు విషయానికి వస్తే మాత్రం, అందరిదీ ఒకే మతం!



ప్రార్థన

ఓ దేవా! నేను సానుభూతిని కోరుకోకుండా
సానుభూతిని చూపేట్లుగా అనుగ్రహించు!

నన్ను అందరూ అర్థం చేసుకోవాలని కోరకుండా
నేను అందరినీ అర్థం చేసుకునేలా అనుగ్రహించు!

నన్ను అందరూ ప్రేమించాలని కోరుకోకుండా
నేను అందరినీ ప్రేమించేటట్లు అనుగ్రహించు!

ఓ దేవా!
మమ్మల్ని నిరాశ నుండి ఆశవైపు నడిపించు!
భయం నుండి ధైర్యం వైపు నడిపించు!
ద్వేషం నుండి ప్రేమవైపు నడిపించు!
అశాంతి నుండి శాంతి వైపు నడిపించు!
అసత్యం నుండి సత్యం వైపు నడిపించు!
మాయ నుండి ఆత్మజ్ఞానం వైపు నడిపించు!
మృత్యువు నుండి అమరత్వం వైపు నడిపించు!



దేవుడు తీసుకున్న దిండు

కథ: మేఘలా సూర్యనారాయణన్ చిత్రాలు: శంకర్ అనుసృజన: స్వామి జ్ఞానదానంద

ఆధారం: 'భక్త శబ్దరత్నం' అనే హిందీ గ్రంథం

1 ఢిల్లీలో దాదాపు 400 ఏళ్ళ క్రితం పరమేష్ఠి అనే ఒక దర్జీ నివసిస్తూ ఉండేవాడు. అతడు జగన్నాథస్వామి భక్తుడు. నిరంతరం స్వామి నామసంకీర్తన చేస్తూ అపరిమిత ఆనందాన్ని అనుభవించేవాడు.

ఢిల్లీ పాదుషా సింహాసనం మీద ఆసీనుడయ్యేటప్పుడు కాళ్ళు ఉంచుకోవడానికి శ్రేష్ఠమైన రెండు స్తూపాకారపు దిండ్లు కుట్టడానికి పరమేష్ఠికి కబురు వెళ్ళింది.

2




3 రెండు మూడు రోజుల్లో పరమేష్ఠి ఎంతో ముచ్చటైన రెండు దిండ్లను కుట్టాడు. కానీ అతడిలో ఒక ఆలోచన మెదిలింది...




పరమేష్ఠి రథయాత్ర గురించి ఆలోచిస్తూ తన్మయుడైపోయాడు. ఆ సమయంలో...

4 పూరీ రథయాత్ర దృశ్యం పరమేష్ఠి కళ్ళ ముందు ద్యోతకమైంది.




5
పరమేష్ఠి భక్తికి మెచ్చి జగన్నాథుడే ఓ దిండును స్వీకరించాడు.
జగన్నాథా! నీవు కరుణాసాగరుడవు! ఈ పేదవాడు సమర్పించినది చిరునవ్వుతో స్వీకరించావే!
6
ఇంతలో ఆ అద్భుత దృశ్యం మాయమైంది. పరమేష్ఠి కళ్ళు తెరిచాడు.
ఏమిటి? జరిగిందంతా కలా? వాస్తవం లాగే ఉంది కదా! జగన్నాథుని దర్శనం, ఆయన నా నుండి దిండును స్వీకరించినది అంతా ఎలా కల అయి ఉంటుంది? ఇదేమిటి? రెండు దిండ్లలో ఒక్కటే ఉందే! అలా అయితే జరిగినదంతా వాస్తవమే!
ఆ సమయంలో పాదుషా రక్షక భటులు వచ్చి పరమేష్ఠిని పిలిచారు. అతడు ఒక దిండును మాత్రమే తీసుకుని అంతఃపురానికి వెళ్ళాడు.
7
దిండు చాలా బాగా కుట్టావు! కానీ నాకు రెండు దిండ్లు కదా కావాలి.
మన్నించండి పాదుషా! దిండ్లు అమిత ఆకర్షణీయంగా తయారవడంతో, మరో దిండును సాక్షాత్తూ పూరీ జగన్నాథుడే స్వయంగా స్వీకరించాడు!
ఏం వాగుతున్నావు?
పాదుషా పదే పదే అడిగినప్పటికీ పరమేష్ఠి అదే జవాబు ఇవ్వసాగాడు.


8
నేను ఢిల్లీ పాదుషాను. నా వస్తువును మరొకరు ఎలా తీసుకుపోగలరు?
అవును పాదుషా! మరొక దిండును జగన్నాథుడే తీసుకున్నాడు.
పదే పదే అబద్ధమాడుతున్నావ్! భటులారా! ఇతణ్ణి చెరసాలలో వెయ్యండి.
9
అర్ధరాత్రి పూరీ జగన్నాథుడు, కావలివారిని మైకంలో ముంచెత్తి చెరసాలలోకి వచ్చాడు.
పరమేష్ఠీ... పరమేష్ఠీ..!
ఇంతటి మధుర స్వరంలో నన్ను పిలుస్తున్నది ఎవరబ్బా! ఆ, సాక్షాత్తూ జగన్నాథుడా!
10
పరమేష్ఠీ! భయపడకు. నేను ఉండగా నీకు ఎలాంటి ఆపద సంభవించదు.
11
నాటి రాత్రి పాదుషా నిద్రలో ఉండగా తన చెంపలను ఎవరో ఛెళ్ళుమనిపించినట్లు అతడికి అనిపించింది.
12
హఠాత్తుగా లేచి కూర్చున్నాడు పాదుషా.
ఆ, కట్టుదిట్టమైన కాపలాను అధిగమించి నా అంతఃపురంలోకి వచ్చి నన్ను కొట్టే సాహసం ఎవరు చేశారు? అయినప్పటికీ ఆ చెంపదెబ్బ వల్ల నాలో ఏదో ఒక తెలియని అనుభూతి కలిగింది.



14 అప్పుడు చెరసాల తలుపులు తెరిచి ఉన్నాయి. పరమేష్ఠి చేతులకున్న సంకెళ్ళు తెంచివేయబడి ఉన్నాయి. అతడు కళ్ళు మూసుకుని, నామసంకీర్తనలో మైమరచి ఉన్నాడు.

15 పరమేష్ఠి అచంచల భక్తిని చూసిన పాదుషా, అతడు చెప్పింది ముమ్మాటికీ సత్యమే అని అర్థం చేసుకున్నాడు. దైవాపరాధం జరిగిందని అవగతం చేసుకొన్న పాదుషా...




16 పరమేష్ఠికి విలువైన అనేక కానుకలు సమర్పించి, అతణ్ణి ఏనుగు అంబారీపై ఊరేగించి గౌరవించాడు పాదుషా!





తడిసిన కట్టెలైనా నిప్పుసెగను పెడితే త్వరలోనే ఎండి బాగా మండుతాయి. అలాగే సాధుసంగం లౌకికుల హృదయంలోని లోభ మోహాలనే తేమను హరిస్తుంది. అప్పుడు వివేకాగ్ని వారిలో ప్రకాశిస్తుంది.

- శ్రీరామకృష్ణ పరమహంస




శ్రీమదాంధ్ర మహాభక్త విజయము

(76 గురు భక్తుల జీవిత చిత్రణ)

మూలరచన:కీ॥శే॥ పంగులూరి వీరరాఘవుడు
వెల: రూ.150/-, పుటలు : 321
ప్రతులకు: శ్రీ కౌండిన్య పబ్లికేషన్స్
ఇ.నెం:16-11-511/జి/7, శాలివాహన నగర్, దిల్‌సుఖ్ నగర్, హైదరాబాద్-36, ఫోన్: 040 -2414 1560

ఈ గ్రంథంలో 76 మంది మహాభక్తుల జీవిత, ఆధ్యాత్మిక సాధనలకు సంబంధించిన విశేషాలు సంకలనం చేయబడ్డాయి. ఐతే రచయిత ఆ భక్తులను స్వయంగా చూసి, వారి భక్తి పారవశ్యామృతాన్ని మనసారా గ్రోలి ఉండడం వల్ల, కథనంలో సమగ్రమైన యథార్థచరిత్ర ద్యోతకమౌతోంది. ముఖ్యంగా వీరంతా ఈనాటి ప్రకాశం, నెల్లూరు, గుంటూరు జిల్లాలకు చెందినవారైనా, వీరి గురించి తెలిసినవారు లేరు. కాకపోతే అనుసృజన రచయితలు మూలాన్ని సంక్షిప్తం చేయడం వల్ల మూలవిషయానికి భంగం కలిగిందేమోనని సందేహం. ఏది ఏమైనప్పటికి మన ఆధ్యాత్మిక వారసత్వం చరిత్ర మడతలలో నలిగిపోకుండా భద్రంగా అందించిన మూలరచయితకు ప్రణామాలు. తప్పక చదవవలసిన మంచి పుస్తకమిది. ❖



ఆత్మబోధ

(వేదాంత గ్రంథము)

రచయిత: వంగవేటి లక్ష్మీనారాయణ
వెల: రూ.100/-, పుటలు : 218
ప్రతులకు: ఎం. బలరామమూర్తి
ఇం.నెం: 5-4-8/2, కమలానగర్
వనస్థలిపురం, హైదరాబాద్ - 70
ఫోన్: 040 - 2402 4236

ఆదిశంకరులు రచించిన అనేక ఆధ్యాత్మిక గ్రంథాలలో ఈ ఆత్మబోధ ఒకటి. నేతి, నేతి మార్గంలో సాధకుడు నేను పంచభౌతికమైన శరీరమును కాను, జ్ఞానేంద్రియములను కాను, మనస్సును కాను, బుద్ధిని కాను అంటూ తన ఉనికిని ప్రశ్నించుకుంటూ తన యథార్థస్థితికై అన్వేషిస్తూ ఉంటాడు. నిశ్శబ్దంగా జరిగే ఈ సాధనకు ఉపకరించే గ్రంథమే ఆత్మబోధ. శంకరుల గ్రంథాన్ని యథాతథానువాదం కాకుండా మూలంలోని విషయాన్ని సరళంగా, సులభ గ్రాహ్యంగా అందించిన శ్రీలక్ష్మీనారాయణ గారి వ్యుత్పన్నత గొప్పది. దేహ, ప్రపంచ విచారణ, విద్య అనగానేమి? వంటి కొన్ని భాగాలను గురు శిష్య సంవాదంగా వ్రాయడం బాగుంది. సాధకులందరూ చదవవలసిన గ్రంథమిది. ❖

– ఎం.వి. నాగప్రసాద్

Printed and published by **Swami Jnanadananda** owned by Ramakrishna Math Trust
and printed at Kala Jyothi Process, 1-1-60/5, RTC Cross Roads, Musheerabad, Hyderabad - 500 020
and published at Ramakrishna Math, Domalguda, Hyderabad - 500 029. **Editor: Swami Parijneyananda**

Vol.71-6, Sri Ramakrishna Prabha (Telugu Monthly) June 2014, Regd. with the Registrar of Newspaper for India Under No.1120/57. Postal Registration No. HD-1071/2013-15. Licensed to Post Under WPP : AP/CPMG/HC-13/WPP/2013-14. Date of Publication : 15 May 2014

జగన్నాథుడు, రామకృష్ణుడు అభిన్నులు



శ్రీరామకృష్ణుల చిన్నన్నగారి కుమార్తె లక్ష్మి జగన్నాథుణ్ణి దర్శించేందుకు పూరీ వెళ్ళింది. ఆలయంలో ప్రవేశించిన ఆమెకు గర్భగుడిలో ఒక బల్లమీద కూర్చొని శ్రీరామకృష్ణులు దర్శనమిచ్చారు. కొంతసేపటికి శ్రీరామకృష్ణులు అక్కడ అదృశ్యమయ్యారు. గురుదేవులు కనిపించక పోవడంతో ఆమె కలత చెందింది. అప్పడు సాక్షాత్తూ జగన్నాథస్వామి ఆమె ఎదుట ప్రత్యక్షమై 'దిగులు చెందకు. నేనూ, రామకృష్ణులూ అభిన్నులం' అని చెప్పడంతో లక్ష్మి సాంత్వన పొందింది.


శ్రీరామకృష్ణుల గృహస్థ భక్తుడైన మనోమోహన్ మిత్రా 1900వ సంవత్సరంలో పూరీ వెళ్ళాడు. ఆయన ఆలయంలో ప్రవేశించగానే దైవపీఠం మీద జగన్నాథునికి మారుగా శ్రీరామకృష్ణులు కొలువుతీరి ఉన్నట్లు దర్శించాడు. అప్పడు అతడు 'శ్రీరామకృష్ణుల రూపంలో ఉన్న జగన్నాథస్వామికి జై' అంటూ భావపరవశుడయ్యాడు. ❖

శ్రీ రామకృష్ణ ప్రభ


ఆధ్యాత్మిక అమృతవాహిని

జూలై 2014

వెల: ₹10



ఈశ్వరో గురురూపేణ గూఢశ్చరతి భూతలే।



సుబోధ

శ్రీరామకృష్ణులు: 'సోఽహం' – నేనే ఆ పరబ్రహ్మం; 'నేను శుద్ధ ఆత్మను' – ఇది జ్ఞానుల మతం. భక్తులు ఇవన్నీ భగవంతుని ఐశ్వర్యాలంటారు. సాధకుడి భక్తిని చూసి భగవంతుడే ఆ సాధకునితో, 'నేను ఏదో, అదే నువ్వు' అని చెబితే, అప్పుడు సంగతే వేరు. రాజు సింహాసనంపై ఆసీనుడై ఉన్నప్పుడు, వంటవాడు అక్కడకు వచ్చి సముచిత ఆసనంలో కూర్చొని, 'రాజా! నువ్వు ఏదో, నేను కూడా అదే' అని చెబితే, లోకం అతణ్ణి పిచ్చివాడు అంటుంది. కానీ వంటవాడి సేవలతో సంతుష్టుడై రాజు స్వయంగా ఒక రోజు అతడితో, 'ఒరేయ్! నువ్వు నా ప్రక్కన వచ్చి కూర్చో! అందులో తప్పేమీ లేదు. నువ్వు ఏదో, నేను కూడా అదే' అని అన్నాడనుకోండి. అప్పుడు వంటవాడు రాజు ప్రక్కన వచ్చి కూర్చోవడంలో తప్పు లేదు. సామాన్యజీవి, 'సోఽహం' అనడం మంచిది కాదు. తరంగం, నీటికి చెందినది కానీ నీరు, తరంగానికి చెందుతుందా ఏమిటి?

ఏ మార్గాన్ని అవలంబించినా సరే, మనస్సు స్థిరపడకుంటే యోగం కుదరదు. మనస్సు యోగి వశంలో ఉంటుంది. కానీ, మనస్సు వశంలో యోగి ఉండడు.

నిత్యసిద్ధులని, సాధనసిద్ధులని రెండు రకాల వారు ఉన్నారు. కొందరు పలు సాధనలు చేసి, భగవంతుణ్ణి పొందుతారు. ప్రహ్లాదుని వంటి కొందరు జన్మతః సిద్ధులై ఉన్నారు. హోమపక్షి ఆకాశంలో వసిస్తుంది. అది పెట్టే గుడ్డు కిందపడుతూ ఉన్నప్పుడే పొదగబడి పక్షిపిల్ల బయటకు వస్తుంది. అదీ క్రింద పడిపోవనారంభిస్తుంది. ఇవన్నీ ఆకాశంలో అత్యంత ఎత్తులో జరుగుతాయి. 'భూమ్మీద పడితే ఛిన్నాభిన్నమైపోతాను' అని గ్రహించి అది వెంటనే తల్లిపక్షి ఉన్న చోటుకి తిరిగి, 'అమ్మా! ఎక్కడ? అమ్మా! ఎక్కడ?' అంటూ వెదకుతూ వేగంగా పైకి ఎగిరిపోతుంది.

ప్రహ్లాదుడు మొదలైనవారు నిత్యసిద్ధులు. గుమ్మడి పాదు, సొర పాదు లాంటివి ముందు పిందెలు వేసి, ఆ తరువాత పుష్పించినట్లు వీరు మొదట భగవల్లాభం పొంది, ఆ తరువాత సాధనలు చేస్తారు. ❖

శ్రీరామకృష్ణ ప్రభ
రామకృష్ణ మఠం, దోమల్‌గూడ, హైదరాబాదు–500 029
ఫోన్: 040–27667799, సెల్: 8801849494
E-mail : sriramakrishnaprabha@gmail.com
నిర్వాహక సంపాదకులు: స్వామి జ్ఞానదానంద
సంపాదకులు: స్వామి పరిజ్ఞేయానంద

సురభి

నేను (శారదాదాసు) నా తల్లితండ్రులతో కలసి మద్రాసులోని మైలాపూర్‌లో శ్రీశారదాదేవి బస చేసినప్పుడు ఆమెను చూడడానికి వెళ్ళాను. అక్కడికి కుతూహలంతో వెళ్ళానేగానీ, భక్తిప్రపత్తులతో కాదు. అయితే, మాతృదేవిని చూసినప్పుడు మా మనస్సులు ఆమె అమృత కటాక్షవీక్షణకు ఆకర్షితమయ్యాయి. అందువల్ల అప్పుడప్పుడు మాతృదేవిని దర్శించుకోవాలనే ఆకాంక్ష మా మనస్సుల్లో పెల్లుబికింది.

మాతృదేవి చిరునవ్వుతో కనిపించేవారు. కానీ నేను సగటు మనిషిలో ఉన్న అనేక లోటుపాట్లతో, కించిత్తు అయినా పారమార్థిక అభిలాష లేని బాలుణ్ణి. అయినప్పటికీ ఏదో ఒక విశేషమైన సంబంధం ఉండివుండాలి.


కొన్నేళ్ళ తరువాత మేము మాతృదేవి స్వగ్రామమైన జయరామ్‌బాటి వెళ్ళాం. అక్కడ నుండి ఒకరోజు కామార్పుకూరుకు వెళ్ళివచ్చాం. అది భగవాన్ శ్రీరామకృష్ణులు అవతరించిన పుణ్యభూమి. గురుదేవుల అన్న కుమారుడు మాకు భగవాన్ శ్రీరామకృష్ణులు పూజించిన రఘువీరుని సాలగ్రామం చూపించారు. 'ఈ రఘువీరున్ని పూజించే భాగ్యం కలిగితే ఎంత బాగుంటుంది!' అనే ఆలోచన నాలో కలిగింది.

మర్నాటి ఉదయం మాతృదేవి సోదరునితో మాట్లాడుతూ అరుగు మీద కూర్చొని ఉన్నాను. అప్పుడు బ్రహ్మచారి విరూపాక్ష వచ్చి, "మాతృదేవి మిమ్మల్ని పిలుస్తున్నారు" అని చెప్పారు.

నేను లోపలకు వెళ్ళాను. మాతృదేవి నన్ను ఒక ఆసనం మీద కూర్చోమని, శ్రీరామ పట్టాభిషేకం చిత్రపటం ఒకటి చూపుతూ, "ఇలా సీతారాములను ధ్యానించు" అని సైగ ద్వారా చెప్పారు. అప్పుడు ఆమె ముఖారవిందం కారుణ్యంతో పొంగిపోతూ ఉంది. నేను కూర్చొని ఉన్నాను. మాతృదేవి నా చెవిలో రెండు అద్భుత మంత్రాలను ఉపదేశించారు. కామార్పుకూర్‌లో నేను తలచుకొన్న విషయాన్ని మాతృదేవి ఎలా గ్రహించగలిగారో నాకు అంతుబట్టలేదు. ఉపదేశం క్షణంలో పూర్తయింది.

మాతృదేవి నుండి మంత్రోపదేశం లభించడం ఎంతో అరుదని భావించి, అందుకోసం యాచించడానికి సైతం ధైర్యం చాలక, అరుగు మీద కూర్చొనివున్న నన్ను పిలిచి, అమిత వాత్సల్యంతో తమ పక్కన కూర్చోబెట్టుకొని నాకు దివ్యమంత్రాలను అనుగ్రహించి, ఆశీర్వదించిన ఆ కారుణ్య స్వరూపిణి దివ్య ముఖారవిందం నా మనోనేత్రాన నిలిచిపోయి, నన్ను పరమానంద సాగరంలో ముంచివేస్తున్నది! ఈ లోకంలో కావలసింది ఇంతకన్నా ఏముంటుంది? ❖





ఆధ్యాత్మిక అమృతవాహిని

శ్రీ రామకృష్ణ ప్రభ

సంపుటం: 71 సంచిక: 7 జూలై 2014

సదాశివ సమారంభాం వ్యాస శంకరమధ్యమామ్।
అస్మదాచార్య పర్యన్తాం వందే గురు పరంపరామ్॥

జగద్గురువైన పరమాత్మకు, ఆదిగురువైన శ్రీవేదవ్యాసునికి, శంకరాచార్యునికి, సమస్త గురుపరంపరకు వందనములు.

– *గురుస్తుతిః*


సూక్తి సౌరభం

గురువు సేవ చేసి గురితోడ భజియింప
వలెనటంచు నరులు వాంఛ తీర
వచియింత్రు గాని భావంబు కానరు
విశ్వదాభిరామ వినుర వేమ.


"ఓ వేమా! గురువులను సేవించి, వారి ఉపదేశాలను శ్రద్ధగా వినడం ఉత్తమమంటూ చెబుతుంటారేగానీ, ఎవరిలోనూ అలాంటి నిజమైన శ్రద్ధ కానరావడం లేదు."

గురుని శిక్షలేక గురుతెట్లు కలుగునో?
అజున కైన, వాని అబ్బకైన,
తాళపుచెవి లేక తలుపెట్లు ఊడునో?
విశ్వదాభిరామ వినుర వేమ.

"ఓ వేమా! గురువు లేకుండా విద్యార్జన చేయడం బ్రహ్మకి గానీ, అతడిని పుట్టించిన వానికి గానీ అసాధ్యమే! తాళం చెవి లేకుండా తలుపులు తీయడం సాధ్యం కాని విధంగా గురువు లేనిదే విద్యను సముపార్జించడం ఎంతటి వారికైనా సాధ్యపడదు."



శ్రీరామకృష్ణ ప్రభ శాశ్వత నిధి





ఆధ్యాత్మిక జ్ఞానాన్ని పంచి పెట్టేందుకు 'శ్రీరామకృష్ణ ప్రభ' కృషి చేస్తోంది. నిధుల కొరత లేకుండా ఈ జ్ఞానయజ్ఞం నిరంతరాయంగా సాగేందుకు 'శ్రీ రామకృష్ణ ప్రభ శాశ్వతనిధి'కి ధన దానం చేసి ప్రోత్సహించాల్సిందిగా కోరుతున్నాం. దాతల పేర్లు పత్రికలో ప్రచురిస్తాం.

మహారాజ పోషకులు......	రూ.	10,000/-, అంతకన్నా ఎక్కువ విరాళం ఇచ్చేవారు.
రాజ పోషకులు...........	రూ.	5,000/-, అంతకన్నా ఎక్కువ విరాళం ఇచ్చేవారు.
పోషకులు................	రూ.	1,000/-, అంతకన్నా ఎక్కువ విరాళం ఇచ్చేవారు.

దాతపేరు	చిరునామా	రూ.
మహారాజ పోషకులు : శ్రీ ఎ. లక్ష్మయ్య శెట్టి	కాళికమ్మ గుడి దగ్గర, కర్నూలు	10,000
మహారాజ పోషకులు : శ్రీమతి ఎమ్.పి.ఎస్. మాధవి	మదీనాగూడ, హైదరాబాద్	10,000
రాజ పోషకులు : శ్రీమతి కాదా పద్మావతమ్మ	రాజేంద్రనగర్, మహబూబ్‌నగర్ (కీ॥శే॥ కుంకుమపూడి మస్తానయ్యగారి జ్ఞాపకార్థం)	5,000
పోషకులు : శ్రీ కౌతా శ్రీనివాస్	గ్రాండ్ ట్రంక్ రోడ్, గుంటూరు	1,116
పోషకులు : శ్రీ దుర్గి రామమూర్తి శెట్టి	లక్ష్మీనగర్, పుత్తూరు, చిత్తూరు జిల్లా (కీ॥శే॥ దుర్గి సరస్వతమ్మగారి జ్ఞాపకార్థం)	1,116
పోషకులు : శ్రీమతి ఆడెపు బాలామణి	జమిస్తాన్‌పూర్, హైదరాబాదు	1,016

'శ్రీరామకృష్ణ ప్రభ' కానుక పథకం

యువతరానికి 'శ్రీరామకృష్ణ ప్రభ'ను మరింత చేరువ చేయాలని సంకల్పించాం. రాష్ట్రంలోని వివిధ పాఠశాలలు/ కళాశాలలు/ గ్రంథాలయాలకు పత్రికను పంపించడానికి మీ సహాయాన్ని కోరుతున్నాం. ఈ కానుక పథకం క్రింద చందా చెల్లించిన దాత పేరున (మీరు సూచించిన లేదా మేము ఎంపిక చేసిన) విద్యాసంస్థకు పత్రికను పంపుతాం. కానుక చందా రూ.1,500/- అంతకన్నా ఎక్కువ ఇచ్చిన దాత పేరు, విద్యాసంస్థ పేరు పత్రికలో ప్రచురిస్తాం.

దాత పేరు	విద్యాసంస్థ
శ్రీ ఎన్. రామకృష్ణారావు, అశోక్‌నగర్, హైదరాబాదు (కీ॥శే॥ వేంకటరమణగారి జ్ఞాపకార్థం)	49 పాఠశాలలకు ఒక సంవత్సరానికి పత్రికను స్పాన్సర్ చేశారు.
శ్రీ భాసూరు అప్పల నరసింహులు, సీతాఫల్‌మండి, సికింద్రాబాదు (కీ॥శే॥ గుణవతమ్మగారి జ్ఞాపకార్థం)	18 పాఠశాలలకు మూడు సంవత్సరాలకు పత్రికను స్పాన్సర్ చేశారు.
ఒక భక్తురాలు, చిక్కడపల్లి, హైదరాబాదు	20 పాఠశాలలకు ఒక సంవత్సరానికి పత్రికను స్పాన్సర్ చేశారు.
శ్రీ అమర విజయానంద కుమార్, సి.బి.ఎమ్. కాంపౌండ్, విశాఖపట్నం	జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మోతకోడూరు, నల్లగొండ జిల్లా
శ్రీ పెండేకంటి బాలాజీ, బి.కె.ఎమ్. వీధి, కడప (కీ॥శే॥ గోపాలకృష్ణ, నాగమణి గార్ల జ్ఞాపకార్థం)	వాసవి వైద్య విద్యార్థి వసతి గృహం, శివాలయం దగ్గర, కడప
శ్రీ పులవర్తి రమణ శాస్త్రి & శ్రీమతి శ్రీదేవి, మోతీనగర్, హైదరాబాదు	20 పాఠశాలలకు ఒక సంవత్సరానికి పత్రికను స్పాన్సర్ చేశారు.

ముఖచిత్రం : 'ఈశ్వరో గురురూపేణ గూఢశ్చరతి భూతలే - భువిలో నిగూఢంగా సంచరిస్తున్న ఈశ్వరుడే గురువు'. భారతీయ సనాతన గురుశిష్య సంప్రదాయానికి దృశ్యరూపమిచ్చిన చిత్రకారుడు - మణియన్ సెల్వమ్, చెన్నై.

చందా వివరాలు		భారతదేశంలో	విదేశాలకు
విడి ప్రతి	:	₹ 10	-
సంవత్సర చందా	:	₹ 100	₹ 1,500
మూడు సంవత్సరాలకు	:	₹ 280	₹ 4,500
ఐదు సంవత్సరాలకు	:	₹ 450	₹ 7,500
ఇరవై సంవత్సరాలకు	:	₹ 1,500	₹ 22,000

గమనిక: డిమాండ్ డ్రాఫ్ట్, మనియార్డర్లలో Ramakrishna Math, Hyderabad అని వ్రాయాలి.

పంపవలసిన చిరునామా: Sri Ramakrishna Prabha, Ramakrishna Math, Domalguda, Hyderabad - 500 029.

చందాను ఆన్‌లైన్ http://rkmath.org/srkp ద్వారా చెల్లించవచ్చు.

లోపలి పేజీల్లో...


శ్రీరామకృష్ణ ప్రభ చందాదారులకు విన్నపం

ప్రియ పాఠకులారా!

- 'శ్రీరామకృష్ణ ప్రభ' పత్రిక కవరు మీద చిరునామాకు పైన మీ చందా నంబరు, కుడి వైపున మీ చందా గడువు ముగిసే నెల ఉంటాయి. మీ చందా గడువు పూర్తయ్యే నెలకు ముందుగానే సొమ్మును చెల్లించి చందాను పునరుద్ధరించుకోండి.
- మీ ఉత్తర ప్రత్యుత్తరాలన్నింటిలో తప్పనిసరిగా చందా నంబరు పేర్కొనాల్సిందిగా మనవి.
- మీ చిరునామా మారిన పక్షంలో 7వ తేదీ లోగా మాకు తెలియపరచినట్లయితే, వచ్చే నెల సంచిక నుండి మీ కొత్త చిరునామాకు పంపబడును.
- ప్రతీ నెల 26 లేదా 27వ తేదీల్లో పత్రిక పోస్ట్ అవుతుంది. మీకు పత్రిక 15వ తేదీ లోపుగా చేరనట్లయితే, వెంటనే మాకు తెలియజేయగలరు.

శ్రీరామకృష్ణ ప్రభ ద్వారా అవిచ్ఛిన్నంగా సేవలు అందించాలన్నదే మా ఆకాంక్ష. అందుకు మీ సహకారం కోరుతూ.... - సర్క్యులేషన్ మేనేజర్

'శ్రీరామకృష్ణ ప్రభ' పత్రిక చందాను ఆన్‌లైన్ **http://rkmath.org/srkp** ద్వారా చెల్లించవచ్చును.



ముక్తియాత్రలో ముముక్షువులు

ముక్తిమార్గాన్ని అన్వేషించే ముముక్షువులు శాస్త్రబోధలు, గురుబోధల సారాన్ని సక్రమంగా అర్థం చేసుకొని ఆచరించాలి. అదే ముక్తియాత్రలో పురోగమనానికి ప్రథమ నియమం. అలా కాకుండా శాస్త్రవచనాలు, గురువాక్యాలను అపార్థం చేసుకొని, విపరీతార్థాలను తీసుకొని, అనుకూలంగా మలచుకొని వ్యవహరించేవారికి ముక్తియాత్రలో తిరోగమనమే గానీ, పురోగమనానికి తావు లేదు.

అమర్‌నాథ్‌యాత్ర, కైలాస్‌యాత్రలకు వెళ్ళదలచిన యాత్రికులు శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉండాలన్న నియమాలు విధించినట్లే, ముక్తియాత్రకు వెళ్ళాల్సిన ముముక్షువులకు కూడా కొన్ని అర్హతలను మన శాస్త్రాలు నిర్ణయించాయి. అవి:

ఆదౌ నిత్యానిత్య వస్తువివేకః పరిగణ్యతే
ఇహాముత్ర ఫలభోగ విరాగ స్తదనంతరమ్
శమాది షట్క సంపత్తి ర్ముముక్షుత్వమితి స్ఫుటమ్

(వివేకచూడామణి–19)

మొదటిది – నిత్యానిత్య వస్తువివేకం; రెండోది – ఇహపర లోకాలకు సంబంధించిన భోగాల పట్ల వైరాగ్యం; మూడోది – మనోనియంత్రణ, ఇంద్రియ నిగ్రహం, శ్రద్ధ, సహనం లాంటి సాధనసంపద; నాలుగోది– మోక్షాసక్తి.

సాధకుడు ఈ నాలుగు అర్హతలు లేకుండా చేసే ముక్తియాత్ర నిరుపయోగమవుతుంది. దుఃఖహేతువుగా పరిణమిస్తుంది. కాబట్టి ముందుగా సాధన చతుష్టయాన్ని అభ్యసించాలి. అందుకు గురుబోధల సారాన్ని సమగ్రంగా గ్రహించాలి. అలా కాకపోతే మన ఆధ్యాత్మికయాత్రలో ఎన్ని అవస్థలు పడాలో ఈ కథ మనకు బోధిస్తుంది:

ఒక గురువు గారు తన శిష్యులతో కలసి తీర్థయాత్ర చేయాలని నిర్ణయించుకున్నారు. యాత్రకు కావాల్సిన సామాన్లు, భోజన సామగ్రి, వంట సామగ్రిని బండిలో వేసుకొని శిష్యులతో యాత్రకు బయలుదేరారు. కొంత దూరం ప్రయాణించాక గురువుగారు శిష్యులతో 'నాకు కాస్త బడలికగా ఉంది. కొంచెం విశ్రమిస్తాను. బండిలోని సామగ్రిని జాగ్రత్తగా చూస్తూ ఉండండి' అని చెప్పారు. 'అలాగే, గురువుగారూ! మేము సామాన్లను జాగ్రత్తగా చూస్తూ ఉంటాం. మీరు నిశ్చింతగా నిద్రపోండి' అని శిష్యులు బదులిచ్చారు.

ఎడ్లబండి పరుగులు పెడుతూ వెళుతోంది. కొంతసేపటికి గురువుగారికి దాహం వేసింది. నీళ్ళు తాగుదామని ఆయన లేచి కమండలం కోసం వెతికారు. అది కనబడకపోయేసరికి గురువుగారు 'నా కమండలం కనిపించడం లేదు ఏమైంది?' అని శిష్యులను అడిగారు. వెంటనే శిష్యులు 'బండి కుదుపులకు కమండలం జారి కిందపడిపోయింది గురువు గారూ!' అని చెప్పారు. 'మరి కింద పడినదాన్ని ఎందుకు తీయలేదు?' అని గురువు గారు తిరిగి ప్రశ్నించారు. అందుకు శిష్యులు ఏకకంఠంతో 'సామాన్లు జాగ్రత్తగా చూస్తూ ఉండమన్నారు గానీ, కిందపడితే తీయమని చెప్పలేదు కదా!' అని అతి తెలివిని ప్రదర్శించారు.

గురువు గారు నిజమైన పరమానందయ్య. అందువల్ల ఆయన చాలా సహనంతో 'సరే! ఇకమీదట ఏది కిందపడినా వెంటనే తీసి బండిలో వేయండి' అని ఆదేశించారు. అలా బండి ముందుకు సాగుతుండగా ఎద్దులు పేడ వేశాయి. వెంటనే వినయశీలురైన శిష్యులు బండిని ఆపి పేడను బండిలో వేశారు.

"తండ్రి నుండి వారసత్వంగా సంక్రమించిన సంపద విలువ ఏమిటో తనయుడికి అర్థం కాదు. అతడే స్వయంకృషితో సంపాదిస్తే దాని విలువ ఏమిటో తెలుస్తుంది. అలాగే సాధకుడు స్వప్రయత్నంతో సాధించిన సాధన సంపద వల్లే పరిపూర్ణతను పొందుతాడు".

– *భగవాన్ శ్రీరామకృష్ణ*

ఆ దుర్వాసన గురువుగారి ముక్కుపుటాలను తాకింది. శిష్యులు తన ఆదేశాన్ని అక్షరాలా ఆచరించారని గురువు గారికి అర్థమైంది. అలా జరగడానికి కారణం తన బోధన లోపమే గానీ శిష్యుల అవగాహనారాహిత్యం కాదని గ్రహించిన ఉత్తమోత్తములు గురువు గారు.

అప్పుడు గురువుగారు శిష్యులకు ఎలాంటి సందేహాలూ కలగకుండా బండిలోని సామాన్ల జాబితాను తయారుచేసి శిష్యులతో 'చూడండి! ఈ జాబితాలో ఉన్న వస్తువుల్లో ఏదైనా కిందపడితే తీసి బండిలో పెట్టండి' అని క్షుణ్ణంగా వివరించారు. ఇక మీదట శిష్యులు ఎలాంటి పొరపాటూ చేయడానికి ఆస్కారం లేదని గురువుగారు నిశ్చింతగా విశ్రమిస్తున్నారు. ఇంతలో 'ధబ్' అని శబ్దం వినబడింది. వెంటనే శిష్యులు సామాన్ల జాబితాను తీసిచూశారు. ఆ జాబితాలోని వస్తువేదీ కిందపడలేదని తెలుసుకొని బండిని ముందుకు పోనిచ్చారు. ఇంతలో అమ్మో... అయ్యో... అంటూ మూలుగు వినిపించింది. ఇంతకీ బండిలో నుంచి కిందపడింది మరెవరో కాదు 'సాక్షాత్తూ గురువుగారే!'.

ఈ తీర్థయాత్ర కథను మన ముక్తియాత్రతో అన్వయించుకుంటే గురుబోధలోని అంతరార్థాన్ని అర్థం చేసుకోవచ్చు. సాధకునికి కావాల్సిన ముఖ్యమైన నాలుగు అర్హతలు ఏమిటో, అవి ఎంత అవసరమో తెలుసుకోవచ్చు.

నిత్యానిత్య వస్తువివేకం: గురువుగారు శిష్యులతో 'బండిలోని సామాన్లను జాగ్రత్తగా చూసుకోమ'ని చెప్పారు. అంటే అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. సాధకుడు ఎల్లప్పుడూ జాగరూకతతో మెలగాలన్నది సాధనమార్గంలో ప్రథమ నియమం. ఎందుకంటే ఆధ్యాత్మికయాత్రలో ఎన్నో ఆకర్షణలు ఎదురవుతాయి. ప్రాపంచికమైన తళుకు బెళుకులు ప్రలోభాలకు గురిచేస్తాయి. అందువల్ల సాధకుడు ఏది నిత్యమో, ఏది అనిత్యమో; ఏది శాశ్వతానందాన్నిచ్చేదో, ఏది తాత్కాలిక ఆనందాన్నిచ్చేదో గ్రహించే నిశ్చయబుద్ధి కలిగి ఉండాలి. అలాంటి నిశ్చయబుద్ధి కలిగివుండడమే 'వివేకం' అంటూ 'వివేక చూడామణి'లో ఆదిశంకరాచార్యులు *'బ్రహ్మ సత్యం జగన్మిథ్యే త్యేవం రూపో వినిశ్చయః...* – బ్రహ్మ సత్యం, జగత్తు మిథ్య అనే నిశ్చయాత్మక బుద్ధి కలగడమే వివేకం' అని వివరించారు.

ఇహపర సుఖాలపై విరాగం: గురువు, శిష్యులకు ఇచ్చిన రెండో ఉపదేశం – 'కిందపడిన దాన్ని పైన వేయండి'. అంటే "సాధకుని మనస్సు ఎప్పుడైనా ప్రాపంచిక ఆకర్షణలకు లోనై, ఉన్నత స్థితి నుండి పతనావస్థకు చేరితే వెంటనే ఆ భోగవిషయాల వల్ల కలిగే సుఖం అత్యల్పమనీ, తాత్కాలికమనీ తలచి నిత్యమూ, శాశ్వతమూ అయిన ఆ పరమాత్మ వైపు మనస్సును ఊర్ధ్వ గతికి మరల్చాలి" అన్నది గురూపదేశంలోని అంతరార్థం.

'తద్వైరాగ్యం జుగుప్సా యా దర్శనశ్రవణాదిభిః... – భోగవస్తువులను చూసినా, వాటి గురించి విన్నా ఏవగింపు కలగడమే వైరాగ్యం' అని 'వివేక చూడామణి' నిర్వచిస్తోంది. కాబట్టి సాధకుడు విషయ వస్తువుల పట్ల ఏవగింపు కలిగి, ఆ పరబ్రహ్మం వైపు మనస్సును మళ్ళించగలగడమే రెండవ అర్హత.

సాధనసంపద: గురువు, శిష్యులతో 'సందేహం వస్తే వస్తువుల జాబితాను చూడండి' అని సూచించారు. అంటే సాధకుడు ఆధ్యాత్మిక జీవితంలో ఎదురయ్యే ఒడుదుడుకులను ఎదుర్కోవ డానికి – మనోనియంత్రణ, ఇంద్రియ నిగ్రహం, శ్రద్ధ, సహనం మొదలైన సద్గుణసంపద అవసరమని తెలియజేశారు.

శిష్యులు సామాన్ల జాబితాను పరిశీలించడంలో మునిగిపోయి గమ్యాన్ని చూపే గురువుగారిని విస్మరించారు. అలాగే సాధకునిలో గమ్యాన్ని చేర్చే మోక్షకాంక్ష మందగిస్తే, సాధనసంపద వల్ల ఎలాంటి ప్రయోజనం చేకూరదు. అందుకే మోక్షకాంక్ష లేని సాధనసంపద నిష్ప్రయోజనమని **'ఏతయో ర్మందతా యత్ర విరక్తత్వ ముముక్షయోః....** – మోక్షకాంక్ష మందగించినప్పుడు సాధనసంపద మరుభూమిలో నీటిలా నిరుపయోగం' అని ఆదిశంకరాచార్యులు హెచ్చరించారు.

మోక్షకాంక్ష: సాధనసంపద సాధకునిలో మోక్షకాంక్షను తీవ్రతరం చేసి ముక్తిని పొందేందుకు ఉపకరించాలి. అంతేకానీ శిష్యులు వస్తువుల జాబితాకు ప్రాధాన్యమిచ్చి, తమ మార్గదర్శిని మరచిపోయినట్లు సాధకుడు శాస్త్రచర్చలు, తర్కవితర్కాల్లో మునిగి, శబ్దజాల మహారణ్యంలో చిక్కుకొని పరబ్రహ్మను మరచి పోకూడదు. అందుకే **'మోక్షకారణ సామాగ్ర్యాం భక్తిరేవ గరీయసీ....** – మోక్షసాధనాల్లో భక్తే సర్వశ్రేష్ఠమ'ని ఆదిశంకరాచార్యులు ఉద్బోధించారు. కాబట్టి మార్గదర్శి అయిన గురువు యందు, పరమాత్మ యందు దృఢభక్తి అలవరచుకోవాలి. పరబ్రహ్మ యందు నిరంతర చింతన చేయడమే భక్తికి నిర్వచనం.

'సాధన చతుష్టయాన్ని సమకూర్చుకొన్న సాధకుడు గురువును ఆశ్రయించినట్లయితే భవబంధ ముక్తుడు కాగలడ'ని మన శాస్త్రాలు ఘోషిస్తున్నాయి. అయితే 'ముక్తికి కావాల్సిన అర్హతలు సాధించిన తరువాత బంధవిముక్తి కోసం గురువును ఆశ్రయించాల్సిన అవసరం ఏముంది?' అనే సందేహం సాధకునిలో కలగవచ్చు.

ఒక సంస్థ అధిపతి ఎంత సన్నిహితుడైనప్పటికీ, అభ్యర్థికి తగిన అర్హతలు లేకపోతే ఉద్యోగం కోసం సిఫారసు చేయడు. ఒకవేళ చేసినా, ఆ అభ్యర్థి ఆ ఉద్యోగాన్ని నిలుపుకోలేడు. అలాగే గురువు ఎంత ఉన్నతుడైనప్పటికీ శిష్యునిలో తగిన అర్హతలు లేకపోతే ముక్తిపదాన్ని అందుకోలేడు. అందుకే శ్రీరామకృష్ణులు సాధనావశ్యకతను వివరిస్తూ "తండ్రి నుండి వారసత్వంగా సంక్రమించిన సంపద విలువ ఏమిటో తనయుడికి అర్థం కాదు. అతడే స్వయంకృషితో సంపాదిస్తే దాని విలువ ఏమిటో తెలుస్తుంది. అలాగే సాధకుడు స్వప్రయత్నంతో సాధించిన సాధన సంపద వల్లే పరిపూర్ణతను పొందుతాడు" అని తెలిపారు.

కాబట్టి మన ముక్తియాత్ర నిర్విఘ్నంగా కొనసాగడానికి ముందుగా శాస్త్రాలు పేర్కొన్న నాలుగు అర్హతలను సాధిద్దాం, భవబంధాల నుండి విముక్తులను చేసే గురుకృపకు పాత్రులమవుదాం. ❖

ముముక్షువులు విషయసుఖాలను విషంలాగ పరిత్యజించాలి. సంతోషం, దయ, క్షమ, ఆర్జవం, శాంతి, దాంతి అనే ఉత్తమ గుణాల్ని అమృతం లాగ భావించి అభ్యసించాలి. - వివేకచూడామణి

గోరుముద్ద - స్వామి సుప్రియానంద

గురుభావం

గురు గోవింద్ దోనో ఖడే, కిస్కో లాగూ పాయ్
బలిహారీ గురుదేవ్‌కి జిస్‌నే, గోవింద్ దియో బతాయ్

“గురువు, గోవిందుడు ఇద్దరూ ఎదురుగా నిలబడితే ముందుగా ఎవరి కాళ్ళకు మ్రొక్కాలి? ముందుగా గురువు కాళ్ళకే మ్రొక్కాలి” అంటారు మహాకవి కబీర్. ఎందుకంటే గోవిందుడి గురించి చెప్పింది గురువే కదా!

ఈ సకల చరాచర సృష్టిలో ప్రతి జీవికీ చావు పుట్టుకలు తప్పవు. ఇతర జీవులకు, మానవులకు ఉన్న తేడా ఒక్కటే, అదే ‘బుద్ధి’. ఈ ఒక్క తేడా వల్లనే మనిషి ఇతర జీవుల కన్నా ఎంతో ఉన్నతిని సాధించాడు. మరి అటువంటి బుద్ధిని సరియైన మార్గంలో పెట్టి మనల్ని ఉద్ధరించగల వ్యక్తి ఒక్క ‘గురువే’.



తల్లితండ్రులు మనకు జన్మ - కర్మలను మాత్రమే వారసత్వంగా అందిస్తారు. మన శరీర మలినాలు పోవడానికి మనకు సబ్బు, నీరు అవసరం. కానీ మనస్సు మాలిన్యాన్ని ఏ సబ్బుతో కడగ గలం? దీనిని పోగొట్టడానికి గురువు అవసరం. ‘గు’ అంటే అజ్ఞానం. ‘రు’ అంటే నిర్మూలించడం. అనగా - అజ్ఞాన మనే చీకటిని పారద్రోలి, జ్ఞానమనే వెలుగును ప్రసాదించేవాడే గురువు.

ఈ రోజుల్లో గురువుకు ఉండే స్థానాన్ని ఒక పదవిగా పరిగణిస్తున్నారు. గురువును తయారు చేయలేము. అలాగే కొన్ని అర్హతలు ఉన్నంత మాత్రాన అందరూ గురువులు కాలేరు. నిజమైన గురువులు వారు గురువులమని దర్పంగా చెప్పుకోరు. పువ్వులు వికసించగానే తుమ్మెదలు ఆ విషయం గ్రహించి, తేనెను పొందాలనే కోరికతో, ఆతురతతో ఆహ్వానం లేకపోయినా వాటి చుట్టూ చేరతాయి.

అలాగే నిజమైన గురుభావం అభివ్యక్తమైనప్పుడు ఎటువంటి ప్రకటనలు, ఆహ్వానాలు లేకపోయినప్పటికీ సంసార వ్యథలు అనుభవిస్తున్న వారు ఆ వ్యక్తి వద్దకు పరుగు పరుగున వస్తారు. నిజమైన గురుభావం అంచెలంచెలుగా ఎదిగి అభివ్యక్త మవుతుంది. అంతేగాని ఆధునిక గురువుల ఘనతలా ఈ రోజు ఆకాశానికి అంటి, మరునాడు పాతాళానికి పడిపోదు.

ఇప్పుడు ఈ నిజమైన గురుభావం శ్రీరామకృష్ణులలో ఎలా అభివ్యక్తమయిందో చూద్దాం. శ్రీరామకృష్ణులు యౌవనదశలో ఉన్నప్పుడు కాళికాలయ వ్యవస్థాపకురాలైన రాణీ రాస్మణీ, ఆమె అల్లుడైన మథురనాథ్‌లతో వ్యవహరిస్తున్నప్పుడు ప్రథమంగా ఆయనలో గురుభావం అభివ్యక్తం కావడం చూడవచ్చు. శ్రీరామకృష్ణులను చూసీ చూడగానే ఆయన పట్ల భక్తి, విశ్వాసాలు వారి హృదయాలలో ఉదయించి, క్రమేణా అవి అసాధారణ ప్రగాఢతను సంతరించుకొన్నాయి. ఒక సాధారణ పూజారి మీద ఇలాంటి ప్రగాఢ భక్తి, విశ్వాసాలు ఎలా కలిగాయి?

“సాధకుణ్ణి ఇష్టదేవతతో ఏకం చేసే వరకు గురువు పని పూర్తికాదు” అని శ్రీరామకృష్ణులు చెప్పేవారు. అదే విధంగా ఆయన తన భక్తుల విశ్వాసాలకు అనుగుణంగా వారికి సహాయకారి అయ్యేవారు. శిష్యుని చేయి పుచ్చుకొని నడిపించేవారు. అందువల్లనే ఆయనపై శిష్యులకు ప్రగాఢ భక్తి విశ్వాసాలు.

గురువుపై భక్తి విశ్వాసాలు కలిగినప్పుడు సాధకుడి మనస్సు అజ్ఞాన, మోహాల నుండి బయటపడి పవిత్రమవుతుంది. ‘ఈ స్థితిలో సాధకుడి శుద్ధ మనస్సు గురువుగా వ్యవహరిస్తుందని’ శ్రీరామకృష్ణులు చెప్పేవారు. ఆ శుద్ధ మనస్సును మనకు ప్రసాదించాల్సిందిగా గురుదేవులైన శ్రీరామకృష్ణులను ప్రార్థిద్దాం. ❖



ఆచార్యదేవోభవ

– డాక్టర్ అపర్ణా శ్రీనివాస్

'గురుః బ్రహ్మ...' అనే శ్లోకం అందరికీ తెలిసినదే. ఈ శ్లోకంలో గురువును బ్రహ్మ విష్ణు మహేశ్వర స్వరూపంగానూ, సాక్షాత్ పరబ్రహ్మ స్వరూపంగానూ భావిస్తూ, నమస్సుమాంజలులు అర్పిస్తాం. గురువు బ్రహ్మదేవుని లాగా శిష్యుని హృదయంలో జ్ఞానమనే బీజాన్ని నాటుతాడు; ఆపై విష్ణువు లాగా ఆ బీజాన్ని పరిరక్షిస్తూ, అభివృద్ధి చెందే దిశగా సహాయపడతాడు; మహేశ్వరుని లాగా యుగాంతాల చీకటి నుండి దిగంతాల వెలుగులోకి మనల్ని నడిపిస్తూ, మనలోని అజ్ఞానాన్ని నశింపజేస్తాడు. అందుకే 'గురువేదాంత వాక్యేషు విశ్వాసః శ్రద్ధా' అని అన్నారు. సాక్షాత్ పరబ్రహ్మ స్వరూపుడే అయిన గురువాక్యాల యందు సంపూర్ణ విశ్వాసం, శ్రద్ధ ఉండాలి. శ్రద్ధ వల్ల మాత్రమే నిశ్చయజ్ఞానం కలుగుతుంది.

సర్వాంతర్యామి, సర్వవ్యాపకుడు, సర్వజ్ఞుడైన ఆ భగవంతుడే సద్గురువు రూపంలో శిష్యునికి సాక్షాత్కరిస్తాడు. ఆ గురుకృప వల్లనే సర్వమూ సాధ్యపడుతుంది. అందుకే భగవంతునికి ఆగ్రహం కలిగితే గురువు రక్షించగలడనీ, కానీ గురువుకు కోపం వస్తే ముల్లోకాలలో కాపాడగలవారు ఎవరూ ఉండరనీ అంటారు. గురువు పట్ల అచంచల విశ్వాసాన్ని కలిగి, ఆ గురుకృపతో భగవద్దర్శనాన్ని పొందినవారూ, అసాధ్యాలను సుసాధ్యాలు చేసిన ఎందరో ధన్యజీవులు మన సంస్కృతిలో దర్శనమిస్తారు.

గురుపూజా మహోత్సవాన్ని ఆషాఢ శుద్ధ పౌర్ణమి నాడు జరుపుకొంటాము. 'ఆచార్యదేవోభవ' అనే వేద శాసనానికి ఇదే ఆచరణరూపం. వేదాలను విభజించి, గురుశిష్య సంప్రదాయాన్ని ఏర్పరచి, దాన్ని వ్యవస్థీకరించి, పారాశర్యుడు, కృష్ణద్వైపాయనుడు, బాదరాయణుడు అనే నామాలు కలిగిన వేదవ్యాసుడు జన్మించింది ఈ రోజునే. శ్రీవేదవ్యాసులు మానవాళికి హితం చేకూర్చే నిమిత్తమై అపౌరుషేయాలైన వేదాలను విభజించారు. నైతిక, రాజకీయ, ఆధ్యాత్మిక, మోక్ష సంబంధమైన అనేక విషయాలను కలిగివుండి, పంచమ వేదంగా ప్రస్తుతినందుకొనే మహాభారతాన్ని రచించారు. శాంతి ప్రతిపాదితంగా, మహాభాగవతాన్ని మనకు ప్రసాదించిందీ, అష్టాదశ మహాపురాణాలను, ఉపపురాణాలను ఏర్పరచిందీ ఈ ఆదిగురువే. అంతేకాక, పరమోత్కృష్టమైన బ్రహ్మసూత్రాల రచనను ఆషాఢ పౌర్ణమి నాడే ఆరంభించి, మనకు అమూల్య సంపదగా అందించారు. ప్రపంచ వాఙ్మయంలో చెప్పుకోదగిన విషయం అంటూ ఏదైనా ఉంటే, అది వ్యాసునిచే చెప్పబడినదే తప్ప అన్యం కాదు, అందుకే 'వ్యాసోచ్ఛిష్టం జగత్ సర్వం' అని అంటాము. ఇలా అన్ని విధాలుగా కర్మ, భక్తి, జ్ఞానమార్గాలను పటిష్ఠం చేసి, మన జాతికి అక్షయ సంపదను ప్రసాదించారు శ్రీవేదవ్యాసులు. అందుకే గురుపౌర్ణమిని 'వ్యాస పౌర్ణమి' అని సంబోధిస్తూ, ఆ మహనీయునికి నివాళులర్పిస్తూ, ఆషాఢపౌర్ణమిని ఒక పర్వంలా జరుపుకుంటున్నాము.

ఈ గురుపౌర్ణమి ఆధ్యాత్మిక సాధనలను ప్రారంభించేందుకు చాలా శుభకరమైన రోజు. ఆధ్యాత్మికంగా పురోగతి సాధించిన గురువు యొక్క మార్గ దర్శనంలో, శిష్యుడు సరైన త్రోవలో నడుస్తూ, క్రమక్రమంగా సాధనతో, నిస్వార్థసేవతో, ఆచార్యుని కృపాకటాక్షంతో, తనలోని ఆధ్యాత్మిక శక్తిని జాగృతం చేసుకోగలుగుతాడు. అలా పవిత్రతను పొందిన మనస్సే గురువుగా మారి లక్ష్యసాధనలో తోడ్పడుతుంది. వాస్తవానికి, సర్వాంతర్యామి అయిన ఆ భగవంతుడే నిజమైన గురువు. అనేక జన్మల ఫలితంగా సంక్రమించిన కర్మబంధాలను, ఆత్మజ్ఞానాగ్నితో దహింపజేసే అలాంటి ఆచార్యునికి అనేకానేక ప్రణామాలు. ఈ సందర్భంలో కబీర్ పద్యసంపుటిలోని ఒకదాన్ని గుర్తుకు తెచ్చుకుందాం.


సబ్ ధరతీ కాగజ్ కరూం, లిఖనీ సబ్ బన్ రాయ్ ।
సాత్ సముద్రకీ మసి కరూం, గురు గుణ్ లిఖ్ న జాయ్ ॥

'భూమినంతటినీ కాగితంలా చేసి, అడవులన్నింటినీ కలంలా చేసి, సప్తసముద్రాలను సిరాగా చేసి వ్రాసినప్పటికీ, గురువు యొక్క గుణాలను వర్ణించడం సాధ్యం కాదు.'

ఈ గురుపౌర్ణమి సందర్భంలో ప్రతీ శిష్యుడు తాను సాధించిన ఆధ్యాత్మిక ప్రగతిని సమీక్షించుకోవాలి. అటువంటి నిజమైన ఆత్మవిమర్శే, గురుపరంపరకు మనం సమర్పించగల నిజమైన నివాళి. ❖ **(జూలై 12వ తేదీ, శనివారం 'గురుపూర్ణిమ')**

పార్వతీదేవి ఒకసారి మహేశ్వరుణ్ణి ఇలా అడిగింది 'స్వామీ! బ్రహ్మానందాన్ని పొందడానికి కీలకమైన దేమిటి?'. 'శ్రద్ధే కీలకం' అన్నాడు శివుడు. కాబట్టి శ్రద్ధాభక్తులతో సాధన చేయడం ముఖ్యం. **- శ్రీరామకృష్ణులు**

పలికెడిది భాగవతం





... ఏ వేళ ఎవరికి ఏమి చేయునో!

- స్వామి జ్ఞానదానంద

శరతల్పగతుడైన భీష్మాచార్యుడు శేషక్షణాలలో ధర్మరాజాదులకు సమస్త ధర్మాలను బోధిస్తూ ఉన్నాడు. మానవ జాతికి అత్యవసరమైన సామాన్యధర్మాలు, వర్ణాశ్రమధర్మాలు, అనురాగ, విరాగాలకు సంబంధించిన ప్రవృత్తి, నివృత్తి ధర్మాలు, దానధర్మాలు, రాజధర్మాలు, భాగవతధర్మాలు వివరిస్తూ ఉన్నాడు. చతుర్విధ పురుషార్థాలైన ధర్మార్థ కామమోక్షాల సాధనలో అనుసరించాల్సిన ధర్మాలను, శమదమాదుల ప్రాముఖ్యాన్ని తెలియజేస్తూ చివరకు భగవంతుడి ఇచ్ఛ మేరకే ఈ సమస్త ప్రపంచమూ నడుస్తోందని గుర్తుచేశాడు. సంపూర్ణంగా ఎవరూ సర్వస్వతంత్రులు కారనీ, పరమాత్ముడి ముందు ఎంతటివారి ప్రజ్ఞాపాటవాలైనా తుత్తునియలేననీ ఆయన తన మనుమలకు మరోమారు చెప్పాడు.

నాయనలారా! లోకేశ్వరుడైన శ్రీమన్నారాయణుడు ఎప్పుడు ఎవరికి ఏమి చేస్తాడో ఎవరు చెప్పగలరు? ఆ మహానుభావుని మాయలకు గొప్ప గొప్ప విద్వాంసులు కూడా దిక్కు తెలియని వారై లోబడి, అణగి మణగి ఉంటారన్న భావంతో...

ఈశ్వరుఁడు విష్ణుఁడెవ్వేళ నెవ్వని
కేమి సేయు పురుషుడేమి ఎరుగు
నతని మాయలకు మహాత్ములు, విద్వాంసు
లడఁగి మెలఁగుచుండు రంధ్రులగుచు! అని ఉద్ఘాటించారు.

ఆ భగవంతుని లీలలు ఎవరికీ అర్థం కావనీ, ఆయన రచించిన నాటకాన్ని ఆయనే ఆసక్తికరంగా మలుపు తిప్పగల సమర్థుడనీ ఆయన అభివర్ణించారు.

ఎప్పుడేమౌనో!: భీష్మాచార్యుడు చెప్పినట్లు భగవంతుడి లీలల్ని ఎవరూ అర్థం చేసుకోలేరు. అయితే అన్నీ సజావుగా సాగిపోతున్న సమయాల్లో అంతా మన అధీనంలో ఉందనిపిస్తూ ఉంటుంది. సర్వానికీ మనమే కర్తలమనిపిస్తుంది. కానీ మన స్వతంత్రేచ్ఛ చాలా పరిమితమైంది. అదే భావనతో భీష్మ పితామహుడు మానవమాత్రులమైన మనం మాధవుడి మాయల్ని పసిగట్టలేమంటున్నాడు. ఓ ప్రముఖ నాయకుడు దేశంలోనే అత్యున్నతమైన పదవికి ఎంపికయ్యాడు. ఆయన ఓసారి పత్రికా విలేఖరుల సమావేశం ఏర్పాటు చేసినప్పుడు ఓ విలేఖరి 'అయ్యా! మీ తదనంతరం మీ రాజకీయ వారసునిగా ఎవరిని ప్రతిపాదించాలని అనుకుంటున్నారు?' అని ప్రశ్నించారు. వెంటనే ఆ నేత కాస్త అసహనం, అసంతృప్తితో 'ఇది అసందర్భమైన ప్రశ్న. ఆ ఆలోచన ఇప్పుడెందుకు? ఇంకా నేను చేయాల్సిన పనులు ఎన్నో ఉన్నాయి. ఇప్పుడు నేను ఆరోగ్యంగానే ఉన్నాను కదా! అప్పుడే వారసుని గురించి ఆలోచించాల్సిన అవసరం ఏమొచ్చింది?' అని దాటవేశాడు. ఆశ్చర్యకరంగా ఆ సమావేశం జరిగిన సరిగ్గా వారం రోజులకే ఆ నేత గుండెనొప్పితో హఠాన్మరణం పాలయ్యాడు. ఇలా మనం తీసుకునే ఊపిరిపైనే మనకు స్వతంత్రత లేని పరిస్థితుల్లో మనం మాత్రం ప్రతిదీ మన ఆధ్వర్యంలో జరుగుతున్నట్లు అహంకరిస్తూ ఉంటాం. మనకు మనం ఓ స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన జీవిలా కన్నూమిన్నూ కానకుండా ప్రవర్తిస్తూ ఉంటాం. అందుకే శ్రీకృష్ణభగవానుడు 'భగవద్గీత-3.27'లోని కర్మయోగంలో...

ప్రకృతేః క్రియమాణాని గుణైః కర్మాణి సర్వశః।
అహంకార విమూఢాత్మా కర్తాహమితి మన్యతే ॥

'సర్వకర్మలూ ప్రకృతి గుణాల పర్యవేక్షణలో నిర్వహించ బడుతున్నాయి. అయితే అహంకారంతో మూఢుడైన వ్యక్తి మాత్రం తనను తాను కర్తగా భావించుకుంటున్నాడ'ని పేర్కొంటాడు.

ఏ ప్రజ్ఞకూ అందదు! : కౌరవపక్షంలో ద్రోణాచార్యులు, శకుని,దుర్యోధనుడు తదితరులు అనేక విద్యల్లో నిష్ణాతులే! కానీ తమ పరిధి చాలా పరిమితమన్న పరమసత్యాన్ని పసిగట్టలేక పోయారు. అందుకే పరమాత్ముడి మాయ ముందు వారంతా పుట్టుగుడ్డివాళ్ళలా మారిపోయారు. ప్రపంచంలో మహామహుల మనుకుంటున్న ఏ మానవమాత్రుల ప్రభావమైనా అంతంత మాత్రమే! అజ్ఞానం, అహంభావంతో కూడిన వారు కనుకనే నూరుగురు ఓ వైపు, అయిదుగురు ఓ వైపు అన్న లెక్కతో కౌరవులు

కురుక్షేత్ర సంగ్రామానికి కాలుదువ్వారు. పావనచరితుడు గాంగేయుడు మాత్రం పాండవపక్షంలో ఉన్నది సాధారణమైన సారథి కాదనీ, సాక్షాత్తూ శ్రీమహావిష్ణువనీ గుర్తించగలిగాడు. పోరుకు దిగక ముందే పాండవులదే విజయమని నిర్ధరించుకున్నాడు. శాసనాన్ని రాయాలన్నా, దాన్ని అమలు పరచాలన్నా, చివరకు దాన్ని రద్దు చేయాలన్నా ఆ అధికారం మొత్తం రాజ్యాధినేతదే అయినట్లుగా, ఈ సమస్త లోకాన్ని ఏలేవాడు ఎప్పుడైనా ఏదైనా చేయగలడనడంలో సంశయం లేదు.

ఓ మారు నందబోస్ అనే భక్తుడు శ్రీరామకృష్ణుల వారిని 'భగవంతుడు శాసనాన్ని ఉల్లంఘించగలడా? తలరాతను మార్చగలడా?' అని ప్రశ్నిస్తాడు. అప్పుడు వారు 'నువ్వు అలా అడుగుతావేమిటి? ఆయన సర్వానికీ అధినేత! ఆయనకు అంతా సాధ్యమే! శాసనాన్ని ఏర్పరచిన వాడు, కావాలంటే దాన్ని మార్చనూగలడు' అంటారు. అది తెలియని వారు గ్రంథాలనూ, శాస్త్రాలనూ ప్రమాణంగా చేసుకొని సృష్టికర్తను అంచనా వేసే ప్రయత్నం చేస్తారు. తాము తప్పుదారి పట్టడమే కాక తమ తోటివారిని కూడా దారి తప్పిస్తారు. అందుకే కఠోపనిషత్తు....

అవిద్యాయా మంతరే వర్తమానాః స్వయంధీరాః పండితం మన్యమానాః దంద్రమ్య మాణాః పరియన్తి మూఢాఃఅంధేనైవ నీయమానా యథాంధాః

'గాఢమైన అజ్ఞానంలో కూరుకుపోయి ఉన్న మూర్ఖులు తామే ప్రజ్ఞావంతులం, గొప్ప విద్వాంసులం అనుకుంటూ గుడ్డివాళ్ళ చేత నడిపించబడే గుడ్డివాళ్ళలాగా తూలుతూ, తడబడుతూ సుడులు తిరుగుతూ ఉంటార'ని హెచ్చరించింది.

ఆ శక్తి సంకల్పమే: భగవంతుడు అవతార పురుషుడిగా ఆగమిస్తాడనీ, మానవమాత్రుడిగా మసలుతూ తన మాహాత్మ్యాన్ని ప్రదర్శిస్తాడనీ అంగీకరించలేకపోయినా, అజ్ఞాతమైన శక్తి నియంత్రణలో మనం కదులుతున్నామన్న నిజాన్నైనా అందరమూ ఆమోదించాలి. మన హేతువాదానికి, తర్కవితర్కాలకు భగవంతుడి లీలలు అందవు. అనుభవమైతే కానీ అసలు రహస్యం తెలియదన్నట్లుగా, ఆయన ఉనికి మనకు జీవితంలో ఎన్నో విఘాతాలు ఎదురైన తరువాత స్పష్టమవుతుంది. అందుకే దుర్యోధనుడు కూడా ఓ సారి 'త్వయా హృషీకేశ హృది స్థితేన, యథా నియుక్తోఽస్మి తథా కరోమి'– 'ఓ కృష్ణా! నా హృదయంలో నెలకొని ఉన్న నువ్వు నా చేత ఎలా చేయిస్తే అలా చేస్తాను' అంటాడు.

ఎంతో అహంభావంతో విర్రవీగిన వారు కూడా ఎప్పుడో ఒకప్పుడు తమ ఉనికి ఎంత అల్పమైందో తెలుసుకొని ఉలిక్కిపడతారు; ఈ సృష్టికర్త పాదాల మ్రోల వాలిపోతారు. స్వామి వివేకానంద ఓ మారు తమ అనుభవాన్ని నెమరు వేసుకుంటూ "అహంకారం ఎంతటి వారినైనా క్షణకాలంలో వివశులను చేస్తుంది. మా గురుదేవులు భగవాన్ శ్రీరామకృష్ణులు భౌతికంగా తనువు చాలించి అప్పటికి కొన్ని రోజులయింది. వారి వద్దకు నాలాగే ఎన్నో ఏళ్ళ నుంచి వస్తూ, వారి అభిమానాన్ని చూరగొన్న ఓ శిష్యుడిని నేను ఓసారి తృణీకార భావంతో చీవాట్లు పెట్టాను. వెంటనే నాకు ఆ రోజు శ్రీరామకృష్ణులు దర్శనమిచ్చి, 'నువ్వు ఏమనుకుంటున్నావు! నేను తలచుకుంటే మీలోని అత్యల్పుణ్ణి మహోన్నతునిగా చేయగలను; మహోన్నతుడైన వ్యక్తిని అత్యల్పుడిగా దిగజార్చగలనని తెలుసుకో!' అన్నారు. ఆ దృశ్యం కనిపించినప్పటి నుంచి నేనెంతో అప్రమత్తంగా ఉంటున్నాను. అప్పటి నుంచి తరచూ నాకు 'అత్యల్పుడు, మహోన్నతుడు; మహోన్నతుడు, అత్యల్పుడు' అన్న మాటలే మనస్సులో మారుమోగుతూ ఉన్నాయి" అని అన్నారు.

దుఃఖమూ దైవసంకల్పమే: ఆ శంతన నందనుడు పాండు పుత్రులను సాంత్వన పరుస్తూ దైవసంకల్పం వల్ల జరిగిన దానికి విచారించడం వివేకం కాదనీ, రాగద్వేషాలు లేనివాడూ, ద్వంద్వాలకు అతీతుడైనవాడూ, సమదర్శనుడూ, సర్వాత్మకుడూ అయిన భగవంతుడు ఏమి చేసినా, చేయించినా దాని వెనక పరమార్థమేదో దాగి ఉంటుందని తెలుసుకోవాలని హితవు పలికాడు. కార్యకారణ సంబంధం లేకుండా ఏ సంఘటనా జరగదని చెప్పకనే చెప్పాడు.

భగవంతుడు బలీయమైన సంకల్పంతో ఈ లోకాన్ని నడిపిస్తూ ఉన్నాడు. బండ్లను ఓడలు చేయడం... ఓడల్ని బండ్లు చేయడం ఆయన లీల! ఏదో ప్రసాదించాడని పరవశించేలోపే, మరేదో పట్టి లాగేసుకుంటాడు. బ్రతుకు ఎడారిలో వైరాగ్య జ్వాలలు రగులుతున్న వేళ ఎక్కడో సుదూరంగా సుఖాల ఎండమావుల్ని చూపిస్తాడు.

మనం ఆశించేది ఒకటైతే, ఆయన శాసించేది మరోటి. అయితే అంతిమంగా భగవంతుడి ప్రతి చర్య వెనుకా పరమార్థం దాగి ఉందనీ, ఆయన శిక్షలు వేసేవాడు కాదనీ, శస్త్రచికిత్సకుడేనని అర్థమవుతుంది. ఆయన చేసే గాయాలు తాత్కాలికంగా బాధించినా, శాశ్వతంగా మనల్ని స్వస్థతపరుస్తాయని విదితమవుతుంది. ❖

నిజమే! ఉదాహరణకు హరిశ్చంద్రుడిని, అతని భార్యా బిడ్డలను భగవంతుడు అన్ని కష్టాలు పెట్టడం వెనుక కారణం లోకానికి సత్య ప్రమాణాన్ని చాటడానికే! 'సత్యహరిశ్చంద్ర' నాటకంలో బలిజేపల్లి లక్ష్మీకాంత కవిగారు చెప్పినట్లు...

తిరమై సంపదలెల్ల వెంట నౌకరీతిన్ సాగి రావేరికిన్ ఎ వరికి ఏ పాటు విధించునో విధి అవశ్య ప్రాప్యమద్దాని నె వ్వరు తప్పించెదరు, ఉన్నవాడినని గర్వం బేరికిన్ కాదు కిం కరుడె రాజగును రాజే కింకరుడగు కాలానుకూలంబుగన్...

అని నిరూపించడానికే! ఇలా భగవంతుడి సంకల్పాన్ని విశాలదృష్టితో అర్థం చేసుకోవడానికి ప్రయత్నించాలనీ, భృత్యులుగా శిరసావహించాలనీ భీష్మాచార్యుడు పరోక్షంగా మనకు ప్రవచిస్తున్నాడు. ❖

పగలు, రాత్రి లాగ సుఖం, దుఃఖం ఒకదాని తరువాత ఒకటి వస్తూనే ఉంటాయి. జీవులకు ఈ రెండూ తప్పనిసరైనవే! కాబట్టి వాటిని అనుభవించక తప్పదు. వివేకి కలతచెందడు. - అధ్యాత్మరామాయణం

"ఒక వ్యక్తి తనను తాను అసహ్యించుకొంటున్నట్లయితే అదే పతనానికి హేతువు. పూర్వీకుల చరిత్రను అవమానకరంగా భావిస్తే, ఆ జాతి అంతానికి చేరుకున్నట్లే!" అంటారు స్వామి వివేకానంద. గత వైభవాన్ని మర్చిపోయినంత కాలం మనమూ, మన దేశం స్తబ్ధతలో మునిగిపోతాం. అందుకే, మన ప్రాచీన సంస్కృతి గురించి తెలుసుకోవాలి. గడచిపోయిన సంగతులు తెలుసుకొంటూ, భవిష్యత్ మహత్కార్యాల సాధన వైపు నడవాలి. మన ప్రాచీన భారతీయ సంస్కృతిని గుర్తు చేసేందుకు చేస్తున్న ప్రయత్నమే ఈ వ్యాసాల పరంపర. సుప్రసిద్ధ రచయిత, బెంగుళూరు రామకృష్ణ మఠం అధ్యక్షులు స్వామి హర్షానంద మహరాజ్ మధ్యయుగాల కాలం దాకా విలసిల్లిన మన సంస్కృతిని 'శ్రీరామకృష్ణ ప్రభ' పాఠకులకు 2014 ఫిబ్రవరి సంచిక నుండి వివరిస్తున్నారు.

హైందవ ఆర్థిక శాస్త్రం

సంపద ప్రాముఖ్యం: 'ఆరోగ్యవంతమైన శరీరంలోనే ఆరోగ్యవంతమైన మనస్సు ఉంటుందన్నది' గొప్ప సత్యం. ఈ సూత్రాన్నే మనం దేశ సంక్షేమానికి కూడా ఆపాదించవచ్చు. 'మంచి సంపదతోనే మంచి దేశం' మనగలదు. ఆర్థిక శాస్త్రమంటే ఏమిటి? ఆదాయం కంటే ఖర్చు తగ్గించడమే కదా!

మానవ జీవితంలో సాధించవలసిన నాలుగు పురుషార్థాలలో అర్థానికి (సంపదకు) సముచిత స్థానం ఇవ్వబడింది. అయితే ఈ అర్థసముపార్జన ధర్మబద్ధంగా ఉండాలి.

సంపద భౌతికమైనది. దీన్ని ఆర్జించి ఖర్చు చేయవచ్చు. ఖర్చు చేసినపుడు అది మృగ్యం కావచ్చు కనుక అది గాలి, నీరు లాగ కాక ప్రియమవుతున్నది. సంపదకు అధిష్ఠాన దేవత - లక్ష్మీదేవి. భౌతిక సంపద, ఆ సంపదను ఆర్జించడానికి చేసే వృత్తులు, ఆచరించే వ్యక్తుల మీద ధనలక్ష్మి ఆధారపడి ఉంటుంది. హిందూ ఆర్థిక శాస్త్రం ఈ మూడు అంశాలనూ కలిగివుంటుంది.



హిందూ ఆర్థికశాస్త్ర లక్షణాలు : వ్యక్తి కన్నా సమాజం లేక దేశం ముఖ్యమైనది. కాబట్టి, దేశ శ్రేయస్సు కోసం వ్యక్తిగత లాభాలను కొన్నిసార్లు త్యాగం చేయవలసి ఉంటుంది. ఆర్థిక విధానాలు ధర్మాన్ని పూర్తిగా పాటించకపోయినా ధర్మ విరుద్ధంగా ఉండకూడదు.

కౌటిల్యుని (క్రీ.పూ. 300) అర్థశాస్త్రం ప్రకారం కొన్ని ప్రత్యేక అర్థశాస్త్ర లక్షణాలు:

పౌరుల కన్నా దేశానికి ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చినప్పటికీ, పౌరులను తమ సొంత బిడ్డలుగా భావించి సంక్షేమ కార్యక్రమాలను రూపొందించాలి.

కరువు, వరదలు, భూకంపాల లాంటి ప్రకృతి వైపరీత్యాలు సంభవించినపుడూ, యుద్ధ సమయంలోనూ వారికి సహాయం అందించాలి.

నిత్యావసరాల ధరలను అదుపులో ఉంచాలి. సామాన్య పౌరుడు పీడనకు గురి కాకుండా చూసుకోవాలి.

సరుకుల నాణ్యతను కాపాడాలి. రవాణా, వార్తా సౌకర్యాలు; రక్షణ, విదేశీ వ్యాపారానికి పన్ను మినహాయింపు లాంటివి కల్పించి వర్తక వ్యాపారాలను అభివృద్ధి చేయాలి.

వ్యవసాయాన్ని అన్నివిధాలా కాపాడాలి.

పౌరులకు ఉద్యోగావకాశాలు కల్పించాలి. ఆధునిక ఆర్థికశాస్త్ర విధానాలన్నీ కూడా పై ప్రణాళికలో ఉన్నాయి.

ప్రణాళిక - కేటాయింపులు: అన్నివిధాల సమతుల్యం పాటించి, ప్రణాళిక కేటాయింపులు జరపడం పరిపాలనలో ముఖ్యమైన అంశం. వివిధ వృత్తుల నుండి ఆదాయాన్ని అంచనా వేసి, రాజోద్యోగులు చేయవలసిన వ్యయాన్ని స్వయంగా రాజు గారే పర్యవేక్షించేవారు. రోజువారీ జమాఖర్చులు తగిన అధికారులు సరిచూసేవారు. ఆ కాలంలో భూమి శిస్తు ముఖ్యమైన ఆదాయం. సాధారణంగా పంట దిగుబడిలో ఆరోవంతును శిస్తుగా స్వీకరించేవారు. చంద్రగుప్త మౌర్యుని కాలం నాటికే (క్రీ.పూ. 325) మంచినీటి పారుదల సౌకర్యం ఉండేది. నీటిపారుదల ఉన్న ప్రాంతాలలో ప్రత్యేక పన్ను విధించేవారు.

వర్తక వ్యాపారాలు, పరిశ్రమలు, గనులు ఇతర ఆదాయ వనరులుగా ఉండేవి. ఆదాయంలో పదోవంతును పన్నుగా విధించేవారు. కొన్ని సందర్భాలలో ప్రభుత్వమే ఆదాయం కోసం పరిశ్రమలు, గనుల త్రవ్వకం నిర్వహించేది. దేశరక్షణకు సంబంధించిన పరిశ్రమలను ప్రభుత్వమే నిర్వహించేది. అడవులలోని సంపద కూడా ప్రభుత్వానిదే.

చట్టాలను అతిక్రమించినప్పుడు విధించే పన్నులు కాక, యుద్ధం లాంటి విపత్కర సమయాలలో, లేక విజయ యాత్రలను పురస్కరించుకొని ప్రత్యేక పన్నులను విధించేవారు.

అయితే, పన్నులు విధించే ముందు రాజు దేశ, కాల పరిస్థితులను దృష్టిలో ఉంచుకొనేవాడు. పన్నులు పౌరులను ఇబ్బందులకు గురి చేయకుండా, వారు భరించేలా ఉండాలి.

ప్రభుత్వానికి తగిన ఆదాయం అవసరమైనప్పటికీ, పన్నులు విధించే విధానం న్యాయంగా, ధర్మబద్ధంగా ఉండాలి.

హైందవ ఆర్థిక శాస్త్ర గ్రంథాలలో ఉన్న వివరాలు వ్యయాని కన్నా ఆదాయాన్ని గురించి ఎక్కువగా తెలియజేస్తున్నాయి. ఆదాయంలో దాదాపు 50 శాతాన్ని రక్షణ వ్యవస్థకూ, సాధారణ భద్రతకూ కేటాయించేవారు. విదేశీ దండయాత్రల వల్ల కలిగిన కల్లోల పరిస్థితులు, ఇతర రాజ్యాలను జయించాలనే రాజుల కోర్కె – ఇందుకు కారణం కావచ్చు. రక్షణ వ్యవస్థకు సంబంధించిన శిక్షణ, గిడ్డంగులు, గూఢచర్య వ్యవస్థ, రక్షణ సామగ్రి లాంటి వాటి మీద చాలా వ్యయం జరిగేది.

అత్యవసర పరిస్థితుల కోసం 20 నుంచి 25 శాతం ఆదాయాన్ని పొదుపు చేసేవారు. ఆదాయంలో కొంత భాగాన్ని రాజభరణంగా రాజుల వ్యక్తిగత ఖర్చుల నిమిత్తం ఇచ్చేవారు. ప్రస్తుత ప్రభుత్వ ఖర్చుల లాగా ఆనాడు కూడా సాధారణ పరిపాలన, న్యాయవ్యవస్థ, రహదారులు, నౌకాయానం, ప్రాంతీయ పరిపాలనకు కేటాయింపులు, సాంఘిక మతపరమైన సంస్థలకు సహాయం, వైద్యశాలలు, అనాథ శరణాలయాలు మొదలైన విభాగాలకు ఖర్చు చేసేవారు. కోశాగారాలు ఉండేవి. తీసుకున్న అప్పులకు 15 శాతం కన్నా తక్కువ కాకుండా వడ్డీ వసూలు చేసేవారు.



వర్తక వ్యాపారాలు : స్వదేశంలోనూ, విదేశాలలోనూ భారత వర్తక, వ్యాపారాలు క్రీస్తు పూర్వ కాలంలోనే వృద్ధి చెంది ఉండేవి. చైనా, మంగోలియా, జపాన్, కొరియా, ఈజిప్టు, ట్రాయ్, బాబిలోనియా, అసిరియా, గ్రీసు, క్రీట్, రోమ్, మెక్సికో, ఇతర దేశాలతో వ్యాపార సంబంధాలు ఉండేవి. సముద్ర మార్గాలలో వ్యాపారం జరిగేది. బౌద్ధ జాతక కథలలో, అనేక యాత్రికుల సందర్శన వివరాలలో ఓడరేవుల గురించి ఉంది. ఒక్క విజయనగర సామ్రాజ్యంలోనే 300 ఓడరేవులు ఉండేవి. విదేశీ వ్యాపారానికి పన్ను మినహాయింపులు కలుగజేసి ప్రోత్సాహ మిచ్చేవారు. పాస్‌పోర్ట్–వీసాలు అమలులో ఉండేవి. వ్యాపారానికి విచ్చేసిన విదేశీయులకు తగిన రక్షణ కల్పించేవారు. వ్యాపారానికి తగిన విధంగా రవాణా మాధ్యమాలు ఉండేవి.

వ్యాపార సంస్థలు : శ్రేణి, మహానాడు, మణిమంగళ, సంఘ, పూగ, ఘన అనే పేర్లతో వర్తక సంఘాలు, వ్యాపార సంస్థలు ఉండేవి. ఈ సంస్థలలో తమ వృత్తిని నిర్వర్తించడానికి ప్రత్యేక రాజ్యాంగం ఉండేది. సంస్థాపరమైన రక్షణకు గాను కొందరు సైనికులను ఏర్పాటుచేసుకోవడానికి వారికి అనుమతి ఉండేది. జాతీయ జీవనంలో వారి పాత్ర బలంగా ఉండేది. పాలకులు వారి వృత్తి, వ్యాపారాలలో జోక్యం చేసుకొనేవారు కారు.

కళలు, చేతిపనులు : ఉన్నతమైన పారిశ్రామిక అభివృద్ధిని సూచిస్తూ ప్రాచీన, మధ్య యుగాల గ్రంథాలలో అనేక కళలు, చేతివృత్తులు పేర్కొనబడ్డాయి. వాటిలో కొన్ని: చేనేత, చాకలి వృత్తి, బట్టలు కుట్టడం, వడ్రంగం, నూనెలు తీయడం, కమ్మరి–కంసాలి వృత్తి (బంగారు నగలు చేయడం), పూలమాలలు కట్టడం, చాపలు అల్లడం, కోళ్ళ పరిశ్రమ, కుమ్మరి వృత్తి మొదలైనవి. ఈ వృత్తులను ఆ యా కులాలవారు నిర్వహించేవారు. పెద్ద నగరాలలో ఈ చేతిపనులు చేసేవారు, వృత్తిననుసరించి ఒకే వీధిలో ఉండేవారు. ఉత్పత్తి, వ్యాపారాలకు ఇది అనుకూలించేది. తయారైన సరుకుల నాణ్యతను పరిశీలించి నిపుణులైనవారు వాటిపై ముద్రలు వేసేవారు. అవసరమైనప్పుడు ధరలు కూడా నియంత్రించే వారు.

వ్యాపారంలో భాగస్వామ్యాలు ఉండేవి. పెట్టుబడిదారులకూ, పనిచేసే వారికీ కూడా వాటాలు ఉండేవి. ఈ భాగస్వామ్యాన్ని రక్షించేందుకు తగిన చట్టాలు ఉండేవి.

ధనం (నాణాలు) కొలతలు, తూనికలు :

బంగారం, వెండి, రాగి నాణాలు క్రీ.పూ. 600 నాటికే ముద్రితమై ఆర్థిక లావాదేవీలలో వాడబడేవి. వస్తుమార్పిడి కూడా ఉండేది. నాణాలను హిరణ్యపిండ, నిష్క, సువర్ణ, శతమాన, పాద, పులా, కర్షపన, పన అనే పేర్లతో పిలిచేవారు. నాణాలు చతురస్ర, దీర్ఘ చతురస్ర, వర్తులాకారాలలో ఉండేవి. నాణాల మీద కొన్నిరకాల ముద్రలు, చిహ్నాలు, హరప్పా ముద్రికల లాగా ఉండేవి. వీటి విలువ భాస్కరుని (క్రీ.శ. 12వ శతాబ్దం) 'లీలావతి' లాంటి గ్రంథాలలో పట్టికల రూపంలో ఇచ్చారు.

పొడవును అంగుళాలు, హస్త, యోజనాలలోనూ; తూనికలను గుంజ, ఫల, ద్రోణలలోనూ; కాలాన్ని నిమిష, క్షణ, ఘటికలలోనూ కొలిచేవారు. ఇవాళ్టి కర్ణాటకలోని శ్రావణ బెళగొళలో గోమతేశ్వర విగ్రహం చెక్కిన శిల్పి వాడిన కొలత ఫ్రెంచి మీటరుకు దాదాపు సమానంగా ఉండేదన్న విషయం ఆశ్చర్యకరం.

సుస్థిరమైన ఆర్థిక వ్యవస్థ; చక్కని వర్తక వ్యాపారాలు, వ్యాపార సంస్థలు; చక్కని నాణాల ముద్రణ; సున్నితమైన పన్నుల చట్టాలు; అత్యవసర పరిస్థితులకు నిల్వలు; మన రాజకీయ, సామాజిక పరిపాలనలో ఉండేవన్నది ప్రతి భారతీయుడికీ స్ఫూర్తిదాయకం, గర్వకారణం. ❖ **అనువాదం: డాక్టర్ పి.వి. రెడ్డి**

సంసారం సాగడానికి ధనం ముఖ్యావసరం. మనిషి ఉపాయంతో, సాహసంతో ధన సంపాదన కోసం ప్రయత్నించాలి. ఆపత్కాలాన్ని అధిగమించడానికి ధనాన్ని భద్రపరచుకోవాలి. - మనుస్మృతి



సమయం సరిపోదు

– చక్కిలం హేమంత్ కుమార్

సమయం సరిపోదా? ఔను, సమయం సరిపోదు. దేనికి? ప్రాపంచిక విషయాలకా? సరిపోతుంది. సరిపుచ్చుకోవచ్చు. కొన్నిసార్లు మిగులుతుంది కూడా. మరి? పారమార్థిక విషయాలకా? బ్రహ్మను తెలుసుకునేందుకా? బ్రహ్మం అంటే చాలా పెద్దది. అంతకంటే పెద్దది మరోటి లేదు. ఎందుకంటే అంతా అదే కాబట్టి. అన్నీ అదే కాబట్టి. బ్రహ్మను తెలుసుకునేంత సమయం మానవుడికి ఎక్కడుంది? నిజమే. అల్పాయుష్కుడైన మానవుడు అనంతమైన బ్రహ్మను తెలుసుకోవాలంటే ప్రయత్నం సంగతి పక్కనుంచితే సమయమేదీ? బాల్యం... అజ్ఞానం! యౌవనం... సుఖలాలస!! వృద్ధాప్యం.... జరాభయం!! ముఖ్యంగా ఆహారాది అవసరాన్వేషణ. నిద్ర, ఆ తర్వాత దీర్ఘనిద్ర. ఎక్కడుంది సమయం? ఎవరికుంది సమయం?

నిజమే. చూస్తే... లేదు. ఎవరికీ లేదు. కానీ.... ఉంది. పరబ్రహ్మ కోసం అన్వేషించే సమయం ఉండి ఉంది కాబట్టే అనేక మంది ఋషులు, యోగులు, భక్తులు, సాధకులు ఆయనను శోధించారు. సాధించారు. ఆ అతి పెద్దదైన పరబ్రహ్మను పొందారు. వాళ్ళూ పరబ్రహ్మమే అయిపోయారు.

వాళ్ళు ఎవరు? ఎక్కడిది వాళ్ళకాసమయం!? వాళ్ళ ప్రత్యేకత ఏమిటి? ఏమీ లేదు. వాళ్ళూ మన లాంటి మనుషులే. వాళ్ళదీ మనకున్నంత సమయమే. అయితే వాళ్ళు సమయాన్ని అత్యంత అపురూపంగా, అమృత తుల్యంగా ఉపయోగించుకున్నారు. పాదరసంలా జారిపోతున్న సమయాన్ని, ప్రతి క్షణాన్ని కోటి కళ్ళతో కనిపెడుతూ, జారిపోకుండా కాపాడుకున్నారు. అనివార్యమైన ఆహార నిద్రాదులకు కూడా సమయాన్ని వెచ్చించకుండా, వెచ్చించవలసి వస్తే అది కూడా ఓ సాధనాంశంగా మలచుకుని స్వీకరించారు.

మనకున్న వాహనం చిన్నది. బలహీనమైనది. గమ్యం చేరవలసిన దారేమో అతి దీర్ఘం. అనంతం. కానీ అనివార్యం. కిం కర్తవ్యం? సమయాన్ని పెంచుకోవడమే. ఉన్న సమయాన్ని సానుకూలంగా మలుచుకోవడమే. సద్వినియోగపరచుకోవడమే. అదే...ఎలా? అసలు సమయాన్ని పెంచుకోవడమెలా? ఆయుష్షును పెంచుకోవడం మార్కండేయుని లాంటి వాళ్ళకు తప్ప మన లాంటి అర్భకులకు సాధ్యం కాదే! నిజమే, అయినా తప్పదు. అనివార్యం మరి.

ఆయుష్షును సంవత్సరాలతో లెక్కించరు. శ్వాసలతో లెక్కిస్తారు. ఒక్క వ్యక్తికి ఇన్ని వేల శ్వాసలని ఇచ్చినప్పుడు శ్వాసను దీర్ఘంగా తీస్తే అన్నే శ్వాసలుంటాయి. కానీ సమయం మాత్రం పెరుగుతుంది. అంటే మన ఆయుష్షును మనం పెంచుకున్నట్లే. సమయాన్ని అధికాధికం చేసుకున్నట్లే. మనం శ్వాసల సంఖ్యను పెంచుకోలేదు. పెంచుకోలేము కూడా. శ్వాసించే సమయాన్ని పెంచుకుంటున్నాము. దీనికి కారణం, ఉపాయం దీర్ఘశ్వాస నిదానంగా, క్రమబద్ధంగా, ప్రశాంతంగా శ్వాసించడం. ప్రాణాయామ ప్రక్రియ ద్వారా శ్వాసలు తగ్గుతాయి. నియమబద్ధ దీర్ఘ శ్వాస అలవడుతుంది. దీర్ఘశ్వాస జీవితాన్ని పొడిగిస్తుంది. నిత్యజీవితంలో కూడా కోపం, ఆవేశం, అసహనం తొందరపాటు, కొన్ని రకాల ఆటలు లాంటివి శ్వాసల సంఖ్యను ఎక్కువ చేస్తాయి. ప్రశాంతత, సహనం, సానుకూల దృక్పథం, శ్వాసను నెమ్మది, దీర్ఘం చేస్తాయి. శ్వాసను పొదుపుగా వాడుకోవడం గొప్ప సాధన... ఆయుష్షు రీత్యానే కాదు. ఆధ్యాత్మికత రీత్యా కూడా.

శ్వాసలను అదుపు చేస్తే సమయాన్ని పొదుపు చేసినట్లే. సహజంగా ఉన్న సమయాన్ని, అదనంగా పెంచుకున్న సమయాన్ని కూడా మరింత పొదుపుగా, అత్యంత అవసరమనుకున్న పనులకు మాత్రమే ఉపయోగించుకుంటూ సద్వినియోగం చేసుకోవచ్చు. మౌనం సమయం సద్వినియోగానికి ఎంతో ఉపయోగకారి అవుతుంది. భోజనాల సంఖ్య, వంట చేసుకునే కార్యక్రమం లాంటివి తగ్గించుకుంటే సమయం మరెంతో పొదుపవుతుంది. అపక్వాహారం ఇందుకు బాగా దోహదం చేస్తుంది. ముఖ్యంగా ఆహార పరిమితుల వల్ల నిద్ర బాగా తగ్గి, ఆ సమయాన్ని సాధన కార్యక్రమాలకు ఉపయోగించుకునే వీలు కలుగుతుంది. ఆహారం, నిద్ర, శ్వాసల అదుపు వల్ల ఆరోగ్యం బాగుంటుంది. మంచి ఆరోగ్యం సాధనలను ఆటంకరహితం చేస్తుంది.

ఏది ఏమైనా భగవంతుణ్ణి పొందేందుకు నిజంగానే తగినంత 'సమయం' మానవమాత్రులకు లేదు. కానీ సాధనమున పనులు సమకూరు ధరలోన! ఆయన మీద మనకున్న ఆశ, ఆర్తి సమయాన్ని సమకూరుస్తాయి. ఈ క్షణం నుంచి ఆ ప్రయత్నం మీదే ఉందాం. ❖



తెలిసినవారికి తెరువిదే మరిలేదు
నళినాక్షు పొగడెడి నామములోనున్నది
ఆకసాన లేదు మోక్షమటు పాతాళమున లేదు
ఈకడ భూలోకమందు ఎందులేదు
పైకొని ఆసలెల్ల పారద్రోలి వెదకితే
శ్రీకాంతు పొగడేటి చిత్తములోనున్నది
సురల వద్ద లేదు సోదించ నమృతము
సరిదిక్కులందు లేదు జలధిలో లేదు
శరణాగతుల పాదజలముల జేర్చికొనే
హరిదాసుల పూజించే అరచేతనున్నది
రాజసాన సుఖమేది రాసి కర్మమందునేది
వోజతోడ నియతుడై వుండినానేది
సాజాన శ్రీవేంకటేశు సరి ముద్రలు ధరించే
తేజముతో విజ్ఞానదేహములో వున్నది

తెలిసినవారికి తెరువిదే...

- శ్రీమతి బి.కృష్ణకుమారి

జననమరణ జలధిలో చిక్కుకొని తీరానికి చేరే దారి తెలియక తల్లడిల్లిపోతున్న మనిషి దుఃస్థితి అగమ్యగోచరం. ప్రీతితో తాను అల్లుకొని అలంకరించుకున్న పూలమాలలే కాలనాగులై తననే కాటేయజూస్తున్న వైనం పరమ దయనీయం. గడియకో గండంగా సాగిపోతున్న ఇలాంటి సంసార సాగరం నుంచి గట్టెక్కించే నావ ఆ నళినాక్షుడి నామమేనని అన్నమయ్య అభయమిస్తూ, **'తెలిసినవారికి తెరువిదే మరిలేదు'** అని తేల్చి చెబుతున్నాడు. కలియుగం కేవలం భగవంతుడి నామాధార మేనన్న సత్యానికి, సంకీర్తన సొబగులద్ది తరించే తెరువు చూపుతున్నాడు. నిజానికి ఆ దేవదేవుడి దివ్యనామంలో ఎంతో శక్తి నిబిడీకృతమై ఉంటుంది. విశ్వాసంతో, వ్యాకులతతో దానిని పలికినప్పుడు మనలో పవిత్రభావనలు పొటమరిస్తాయి.

అదే భావంతో "భగవన్నామ బీజాక్షరాలలో గొప్పశక్తి ఉంది. ఆ శక్తి అవిద్యను నశింపచేస్తుంది. బీజం మృదువైంది; అంకురం లేతగా ఉంటుంది. అయినా అది కఠినమైన నేలను చీలుస్తుంది. నేల బీటలు వారి అంకురానికి దారి ఇస్తుంది. అదే విధంగా భగవంతుడి నామ బీజాక్షరాలు కూడా!" అంటారు భగవాన్ శ్రీరామకృష్ణ పరమహంస. అందుకే వారు తమ భక్తబృందాన్ని తరచూ తన గానామృతంలో ఓలలాడించేవారు. భక్తి పారవశ్యంలో నర్తింపచేసేవారు. భక్తియోగంలో భాగంగా భగవంతుడి వైభవాన్ని స్తుతిస్తూ చేసే నామసంకీర్తన త్వరితగతిన మన మనస్సును స్థిమితపరుస్తుందనడంలో సందేహం లేదు.

నళినాక్షు నామములో...

పూర్వయుగాల్లా కలికాలంలో మనం యజ్ఞాలు, తపస్సులు చేసి భగవంతుని మెప్పించలేం. ఆ పరిస్థితి ముందే తెలిసిన ఆ విధాత మనకు ఈ యుగంలో ఓ వెసులుబాటు కల్పించాడు. అదే తన నామజపం. కేవలం ప్రేమతో తనను పిలిస్తే చాలు పరమాత్మ పొంగిపోతాడు. అందుకే పరీక్షిత్తు మహారాజుకు భాగవత తత్త్వాన్ని ప్రవచించిన శుక మహర్షి, అజామిళుడి వృత్తాంతాన్ని వివరించే సందర్భంలో హరినామ సంకీర్తన ప్రాముఖ్యాన్ని ప్రస్తావిస్తూ...

ఏది జపియింప నమృతమై యెసగుచుండు
నేది సద్ధర్మ పథమని యెరుగ దగిన
దదియె సద్భక్తి యోగంబు నలవరించు
మూర్తిమంతంబు దా హరికీర్తనంబు...

'ఏ నామం జపించిన కొద్దీ అమృతమై, అతిశయమై అలరారుతూ ఉంటుందో, ఏది ఉత్తమమైన ధర్మమార్గమో అదియే హరినామ సంకీర్తనం. మూర్తీభవించిన భక్తియోగమే ఆ హరినామ జపమంటా'డు. అదే అనుభూతితో అన్నమాచార్యులు ఆ కమల లోచనుడిని కీర్తించడం మినహా, మనకు మరో మార్గం లేదంటూ, ఆ నామమే మనల్ని రక్షిస్తుందన్న పూనికతో...

తెలిసినవారికి తెరువిదే మరిలేదు
నళినాక్షు పొగడెడి నామములోనున్నది... అంటూ సంకీర్తనకు శ్రీకారం చుడుతున్నాడు. 'తెరువు' అంటే మార్గం, తోవ అని అర్థం. అయితే ఆ నామం ఆర్తిగా హృదయంలోంచి వచ్చినప్పుడే అది ఆ భగవంతుడికి చేరుతుంది. భావం, భక్తి లేకుండా బాహ్యంగా పటాటోపం కోసం చేసే భజనలు, భక్తిపాటల వల్ల పెద్దగా ఫలితం సంప్రాప్తించదు.

శ్రీకాంతు స్తుతించే చిత్తములో...

పారమార్థిక జీవనంలోని పరమోత్కృష్ట లక్ష్యాలైన మోక్షం, జన్మరాహిత్యం అంత సులభంగా లభించేవి కావు. మనస్సులో మమకార వికారాలు అడుగంటినప్పుడే మరో జన్మంటూ

(మిగతా 34వ పేజీలో...)

వివేకం, వైరాగ్యం, భూతదయ, సేవాభావం, సత్యసంధత, పవిత్రత లాంటి సద్గుణ సంపద ఎవరిలో ఉంటుందో అలాంటి వారిలో భగవంతుడు నెలకొని ఉంటాడు. - భగవాన్ శ్రీరామకృష్ణ పరమహంస




పరిప్రశ్న

– స్వామి భూతేశానంద
(రామకృష్ణ సంఘ 12వ సర్వాధ్యక్షులు)

రామకృష్ణ సంఘ 12వ సర్వాధ్యక్షులు - స్వామి భూతేశానందజీ మహరాజ్ (1901-1998) భక్తుల ఆధ్యాత్మిక సందేహాలకు సరళమైన రీతిలో ఇచ్చిన సమాధానాలను 'శ్రీరామకృష్ణ ప్రభ' పాఠకుల ప్రయోజనార్థం 2013 జూలై సంచిక నుండి ధారావాహికంగా ప్రచురిస్తున్నాం.

భక్తుడు: గురువు ఆవశ్యకతను గురించి వివరించండి?

స్వామీజీ: గురువు ఓ మార్గదర్శి. సాధకులు తమ లక్ష్యాన్ని చేరుకోవడానికి సరైన మార్గాన్ని చూపించే దిక్సూచి లాంటివాడు గురువు. శ్రీరామకృష్ణులు గురువు ఆవశ్యకతను చెబుతూ, "నూలు నాణ్యత తెలుసుకోవాలంటే నేతలో ప్రావీణ్యం పొందినవాని వద్ద కొంతకాలం శిక్షణ పొందాలి. అలాగే సాధనలో పురోగతిని సాధించాలంటే గురువు సన్నిధిలో గడపాలి" అని వివరించారు. గురువు సన్నిధిలో ఉంటే పవిత్ర జీవనమంటే ఏమిటో అర్థమవుతుంది. పవిత్రత, కారుణ్యం, ప్రేమ లాంటి లక్షణాలు అలవడతాయి. అందువల్ల భగవదన్వేషణలో గురువు పాత్ర చాలా విశిష్టమైనది.



భక్తుడు: భగవత్సాక్షాత్కారానికి గురుకృప ఉంటే సరిపోతుందా? గురుకృపకు పాత్రులమవడమెలా?

స్వామీజీ: గురువు సాక్షాత్తూ మానవ రూపంలో ఉన్న భగవంతుడే! గురుకృప సాధకుని భక్తిశ్రద్ధలపై ఆధారపడి ఉంటుంది. సాధన చేయకుండా గురుకృపను పొందడం సాధ్యం కాదు. మన ప్రయత్నం మనం చేసినప్పుడే గురువు సహాయం మనకు లభిస్తుంది. గురు బోధనలను అనుసరించి సాధన చేసినప్పుడే గురుకృప ప్రభావం మనకు అర్థమవుతుంది. అలా కాకుండా కేవలం గురువు మీద ఆధారపడి సాధన చేయకపోతే గురుకృపను పొందలేం.

బ్రహ్మజ్ఞానాన్ని పొందడానికి గురువు అనుగ్రహం అవసరం. ఆ బ్రహ్మజ్ఞానాన్ని పొందే మార్గాన్ని భగవాన్ శ్రీకృష్ణుడు *(భగవద్గీత - 4.34)* ఇలా సూచించారు:

తద్విద్ధి ప్రణిపాతేన పరిప్రశ్నేన సేవయా ।
ఉపదేక్ష్యన్తి తే జ్ఞానం జ్ఞానిన స్తత్త్వదర్శినః॥

'గురువులకు సాష్టాంగ ప్రణామం చేసి, వారిని ప్రశ్నించి, వారికి పరిచర్యలు చేసి బ్రహ్మజ్ఞానాన్ని అర్థించు. అప్పుడు తత్త్వద్రష్టలైన ఆ జ్ఞానులు నీకు బ్రహ్మజ్ఞానాన్ని ఉపదేశిస్తారు'.

గురువు అనుగ్రహం పొందిన శిష్యుడు దుఃఖసాగరం నుండి ఉద్ధరింపబడతాడు. కరుణార్ద్ర హృదయుడైన గురువు భగవత్సాక్షాత్కారం కోసం తపించే శిష్యునికి అన్నివిధాలా సహాయాన్ని అందించి, లక్ష్యాన్ని చేరుకోవడంలో తోడ్పడతాడు.

భక్తుడు: వేదాంత బోధనలను అనుష్ఠించవద్దని శ్రీరామకృష్ణులు, గృహస్థులతో అన్నారు. ఎందుకని?

స్వామీజీ: వేదాంత బోధలు అనుష్ఠించడం గృహస్థులకు కష్టమని శ్రీరామకృష్ణులు అన్నారు గానీ అనుష్ఠించవద్దనలేదు. 'అహం బ్రహ్మాస్మి – నేను బ్రహ్మను'; 'తత్త్వమసి – ఆ పరబ్రహ్మమే నీవు'. ఇలాంటి వేదాంత వాక్యాలను కేవలం నోటితో వల్లించడం వల్ల ఎలాంటి ప్రయోజనమూ ఉండదు. ముఖ్యంగా 'సర్వం బ్రహ్మమయం', 'నేనే ఆత్మను' అన్న భావన కలగాలంటే దేహాభిమానం పూర్తిగా నశించాలి.

సాధారణంగా గృహస్థులకు దేహాభిమానం, దారాపుత్రులతో సంబంధం అధికంగా ఉంటుంది. మానవులు అన్నగత ప్రాణులు. అందువల్ల ఈ కలియుగంలో అద్వైత వేదాంతాన్ని అనుష్ఠించడం దుష్కరమైనదనే ఉద్దేశంతో శ్రీరామకృష్ణులు "దేహాభిమానం గలవారికి 'నేనే ఆత్మను' అన్న భావన కలగడం కష్టం. కాబట్టి గృహస్థులు 'భగవంతుడు ప్రభువు, నేను ఆయన సేవకుడన'నే భావంతో సాధన చేయడం ద్వారా గమ్యాన్ని సులభంగా చేరుకోగలరు" అని మార్గనిర్దేశం చేశారు. ❖

పండుగలు - పర్వదినాలు

జూలై - 2014

8	మంగళవారం	: ఏకాదశి
12	శనివారం	: గురుపూర్ణిమ
22	మంగళవారం	: ఏకాదశి
24	గురువారం	: స్వామి రామకృష్ణానంద జయంతి

ఆగష్టు - 2014

7	గురువారం	: ఏకాదశి
10	ఆదివారం	: స్వామి నిరంజనానంద జయంతి
17	ఆదివారం	: శ్రీకృష్ణ జన్మాష్టమి
21	గురువారం	: ఏకాదశి
24	ఆదివారం	: స్వామి అద్వైతానంద జయంతి
29	శుక్రవారం	: వినాయక చవితి

సాధన ఫలం

ఆయనొక మహారాజు. మంచి అంగ సౌష్ఠవం ఉన్నవాడు. రూపసి. పరిచర్యలకు పరిచారక బృందం. అప్రమత్తులైన అంగరక్షకులు. అన్నీ బంధనాలే!

ఒకనాడు రాచరికపు బాధ్యతలు మంత్రికి అప్పగించి, అగమ్యంగా వెళ్ళిపోయాడు. ఎక్కడా ముక్తి మార్గం కాన రాలేదు. వృథా వెదుకులాట. 'రాజు ఎంత మూర్ఖుడు, ఇంత ఐశ్వర్యం వదలిపోయాడే!' – కొందరి వ్యాఖ్య. 'ఆఁ కొంత కాలం కాగానే తిరిగి రాడూ' – మరికొందరి తీర్పు. 'ఏమో! పిలుపు విన్నవాడు తిరిగి వస్తాడా' – చింతనాశీలురి సందేహం.


ఆ రాజు కారడవిలో నడుస్తున్నాడు. అడవిలో దొరికే పళ్ళు, సెలయేటి నీటితో కడుపు నింపుకొంటున్నాడు. చివరకు ఒక ఆశ్రమం కనపడింది. అక్కడ నియమాలు చాలా కఠినమైనవి. శిష్యులకు గురుదర్శనం సులభ సాధ్యం కాదు. 'ఏ ఏ సాధనలు చేయాలి? గురువు దర్శనం ఎప్పుడు?' – దుమ్ము కొట్టుకుపోయిన శరీరంతో రాజు అడిగాడు. ఒక బ్రహ్మచారి వెలుపలకు వచ్చి, 'అదిగో, ఆ పాకలో ఉండాలి. కాయకష్టం చేయాలి, సమ్మతమేనా?' అన్నాడు. అంగీకరించాడు బాటసారి (రాజు). 'ప్రతి దినం తెల్లవారగానే అడవికిపోయి, ఒక మణుగు బరువు కట్టెలు సాయంత్రానికి తేవాలి' అని చెప్పాడు బ్రహ్మచారి. రాజు సరేనన్నాడు. పాకలో ఒక కొయ్యమంచం. మూలన ఒక నీళ్ళ కూజా. రెండు రొట్టెలు, కూర ఉన్నాయి. అలసి సొలసి, ఆకలిగొన్న రాజు అవి తిని, నిద్రపోయాడు.

శ్రమ ఎరుగని కోమల హస్తాలు కాలక్రమంలో మెల్లమెల్లగా గట్టి పడ్డాయి. దినమంతా కాయకష్టం... అయినా హాయిగా ఉంది. ఆనాటి షడ్రసోపేత భోజనం కానీ, దాసదాసీల పరిచర్యలు కానీ గుర్తుకు రావడం లేదు. ఇది నిజం... ఇచ్చగిస్తే కోరికలు తగ్గిపోతాయి. కట్టెలు కొడుతూ కొడుతూ, తనకు తెలియకుండానే మనస్సులోని కోరికల ముడులను కూడా రాజు కొట్టివేస్తున్నాడు.

తాను చేస్తున్నది లాభనష్టాల వ్యాపారం కాదు. ఇందులో ఆశప్రత్యాశలు లేవు. కట్టెలు కొట్టి, వాటిని శ్రద్ధతో తాళ్ళు వేసి కట్టి, నెత్తిపై పెట్టుకొని ఆశ్రమానికి వెళ్ళేవాడు. అంతరంగం ప్రసన్నంగా ఉంది. నిర్జన అరణ్యమార్గం ఎంత బాగుందో! ప్రతి ప్రాణి పట్ల ప్రేమ, కల్యాణ చింతనే! ఇలా ఎంత కాలం గడచిందో! రాజు శిరోజాలు జడలు కట్టాయి. కట్టుకొన్న వస్త్రాలు చినుగు పట్టాయి. వచ్చి పలకరించేవారు లేరు. మౌనమే బాగుంది. మనోరాజ్యంలో ఆనందం అధికమైన కొద్దీ, మాయా ప్రపంచం దూరమవుతోంది. జగద్రూపమైన తొడుగు లోపల చైతన్య సత్తా తన ఉనికి చాటుతోంది.

రానురాను శరీరంలో బలం తగ్గుతోంది. ఒకనాడు పెద్ద జలాశయం ప్రక్క నుండి నడుస్తున్నాడు. అంతా బురద, బురద. కానీ నీటిలోని తామరల సౌరభం హాయి గొలుపుతున్నది. హఠాత్తుగా తల తిరిగి, బురదలో జారి పడ్డాడు. కట్టెల మోపు క్రింద పడింది. కష్టంతో లేచాడు కానీ మోపు ఎత్తుదామంటే, చేతులు అదుపులోకి రావడం లేదు.

హఠాత్తుగా కాషాయాంబరాలు ధరించిన ఒక ఆజానుబాహుడు తలపై జటాజూటంతో వడివడిగా రాజు వైపు నడచి వచ్చాడు. కరుణాపూరిత నయనాలు. ఆ కట్టెల మోపును ఎత్తి అతని తలపై పెట్టాడు. మీరెవరు అని అడిగేలోపే కనుమరుగయ్యాడు.



ఆశ్రమానికి తిరిగి వచ్చి, పర్ణశాలలో అడుగు పెట్టాడు. ఆయన కొరకు వయస్సు పైబడ్డ ఒక సన్న్యాసి నిరీక్షిస్తున్నాడు. స్నానానికి నీరు, వేడి వేడి ఆహారం, మెత్తని పరుపు, నూతన వస్త్రాలు – అన్నీ అమర్చి ఉన్నాయి. 'రేపటి నుండి మీరు అడవికి పోనక్కర లేదు. ఇక్కడే ఉండి సాధనలు చేయండి' అని చెప్పాడు సన్న్యాసి.

'ఇన్ని ఏళ్ళ తర్వాత ఈ మార్పు ఎందుకు?'

'కారణం ఏమిటనగా, మీకు పరమాత్ముని దర్శనమైంది'.

'ఎప్పుడు?'


'ఆయనేగా మీ తలపై కట్టెల మోపు తిరిగి పెట్టింది.'

ఒక్క క్షణంలో అంతా తేటతెల్లమైంది. దుర్లభదర్శనుడు! ఆయన కోసమే వీరందరూ ఇక్కడ నిరీక్షిస్తున్నారు. గురువు గారైన వృద్ధ సన్న్యాసి తిరిగి ఇలా అన్నారు: 'మీరు ఇక కట్టెలు కొట్టి తేనక్కరలేదు. మీరు ముక్తులయ్యారు. మీ సకల బంధనాలూ తెగిపోయాయి. మోక్షద్వారం ఎదుట నిలబడ్డారు. పరమాత్ముని కృపతో అచిరకాలంలోనే ద్వారం తెరచుకొంటుంది.'

రాజు స్తంభించిపోయాడు. నోట మాట లేదు. తాను మోక్షం కోరలేదే! అంత మాత్రం కోరికా లేదు తన మనస్సులో. నిర్మలంగా నవ్వాడు. వృద్ధ సన్న్యాసి ఆశ్చర్యపోయాడు: 'ఈ వ్యక్తిలో ఉద్విగ్నతే లేదు. ముఖం ఎంత ప్రశాంతంగా ఉంది. ఇటువంటి ప్రశాంతతను పొందడానికే కదా, అందరూ సాధనలు చేసేది' అని తలపోశాడు. ❖ **అనువాదం:డాక్టర్ కమల జయరావు**

(శారదా మఠం – బెంగాలీ మాసపత్రిక 'నిబోధత' నుండి)

ఆత్మజ్ఞాని అయినవాడు నిర్ధనుడైనా సంతృప్తుడై ఉంటాడు. ఎవరి అండ లేకపోయినా మహాబలుడే! ఆత్మరసానందాన్ని పానం చేస్తూ నిత్యతృప్తుడై చరిస్తాడు. సమదృష్టితో వ్యవహరిస్తాడు. - వివేకచూడామణి



(తిథి ప్రకారం - జూలై 24, గురువారం - 'స్వామి రామకృష్ణానంద జయంతి')

స్వామి రామకృష్ణానంద జీవితంలో మధుర ఘట్టాలు

చిత్రాలు: వెంకట్ అనుసృజన: స్వామి జ్ఞానదానంద

1 పశ్చిమ బెంగాల్‌లో 1863లో జన్మించిన శశిభూషణ్ చిన్నతనం నుండే భక్తితో నిష్ఠగా పూజ చేసేవాడు.



2




1883లో కళాశాలలో చదువుతున్నప్పుడు శరత్ అనే మరో యువకుడు, శశి వెళ్ళి శ్రీరామకృష్ణులను దక్షిణేశ్వరంలో ప్రప్రథమంగా కలుసుకున్నారు.

3



శ్రీరామకృష్ణుల పట్ల శశికి కుదిరిన భక్తి సాటిలేనిది. ఒకసారి వేసవిలో గురుదేవుల కోసం మండుటెండలో శశి ఆరు మైళ్ళు కాలినడకన వెళ్ళి ఐస్ తీసుకువచ్చాడు. అప్పుడు ఎండ తీక్షణతకు శశి ఒంటి మీద ఏర్పడ్డ బొబ్బలను చూసి గురుదేవులు తల్లడిల్లిపోయారు. కానీ ఎండకు ఆ ఐస్ కరగకపోవడం ఆశ్చర్యం!


4 ఒకమారు గురుదేవులు తానుగా లేవలేనంత రోగగ్రస్థులై ఉన్నారు. నాడు అమిత చలిలో శశి బయట పని చేయడం చూసి, ఆయనే స్వయంగా లేచి శశికి శాలువా తీసి ఇచ్చారు. గురుశిష్యుల మధ్య అంతటి ప్రగాఢ ప్రేమబంధం వెల్లివిరిసింది.




5



కాశీపూర్‌లో గురుదేవులు తమ శిష్యులకు కాషాయ వస్త్రాలు ఇచ్చి సన్న్యాసాశ్రమానికి వారిని ఆయత్తం చేశారు.



గురుదేవుల నిష్క్రమణానంతరం కూడా
ఆయనకు సంబంధించిన ప్రతి దానిలోనూ
శశి ఆయననే దర్శించసాగాడు. గురుదేవుల
పావన అస్థికలను కలశంలో సేకరించాడు.




ఆ అస్థికల కలశాన్ని, గురుదేవుల చిత్తరువును వరాహనగర
మఠంలో అమిత భక్తిప్రపత్తులతో శశి మహరాజ్ పూజిస్తూ వచ్చారు.




1886 డిసెంబర్‌లో శిష్యులు ఆంట్‌పూర్‌లో ధుని
రగిలించి, సన్న్యాస దీక్ష స్వీకరించారు. శశిభూషణ్,
స్వామి రామకృష్ణానంద నామధేయం పొందారు.



వరాహనగర మఠంలో ఉదయం మొదలు సాయంత్రం దాకా
ధ్యానంలో లయించిపోయి ఉన్న సోదర శిష్యుల కోసం శశి
మహరాజ్ తాను భిక్షమెత్తి, వండి, గురుదేవులకు నివేదించిన
ప్రసాదాన్ని తినిపించేవారు. అందుకే 'శశి మఠానికి
మూలస్తంభం' అని స్వామి వివేకానంద అభివర్ణించారు.



కొన్నేళ్ళు గడిచాయి....
1897లో మద్రాసు (ఇప్పటి
చెన్నై)లోని ఐస్ హౌస్‌లో
స్వామీజీ తమ శిష్యులతో
మాట్లాడుతూ, చెన్నైలో
రామకృష్ణ మఠ నిర్వహణకు
శశి మహరాజ్‌ను పంపిస్తానని
మాట ఇచ్చారు. 1897
మార్చిలో చెన్నై వెళ్ళి
గురుదేవుల సందేశాన్ని
ప్రచారం చెయ్యమని శశి
మహరాజ్‌తో స్వామీజీ చెప్పారు.



(మిగతా 38వ పేజీలో...)



రామకృష్ణ భక్తి సూత్రాలు

– స్వామి యతీశానంద

నారద భక్తి సూత్రాలు, శాండిల్య భక్తి సూత్రాలు భక్తియోగానికి సంబంధించిన ప్రామాణిక గ్రంథాలు. అయితే ఆధునిక తరంలో భగవదన్వేషకులకు అనువైన రీతిలో భక్తితత్త్వాన్ని బోధించారు శ్రీరామకృష్ణులు. ఈ నేపథ్యంలో 'శ్రీరామకృష్ణ కథామృతం' నుండి కొన్ని ఉపదేశాలను 'రామకృష్ణ భక్తి సూత్రాలు'గా సులభరీతిలో వివరించే ప్రయత్నం చేస్తున్నాం.

బౌద్ధగ్రంథాలు పాళీ భాషలో, బైబిల్ హీబ్రూలో, ఖురాన్ అరబ్బీ భాషలో రచించబడ్డాయి. అలాగే శ్రీరామకృష్ణుల ఉపదేశాలు వారి మాతృభాష బెంగాలీలో ఆవిష్కృతమయ్యాయి. అవతార పురుషుని ముఖతః వెలువడిన ఆ అమృతోప దేశాలను యథాతథంగా ఉట్టంకిస్తూ వ్యాఖ్యా నిస్తున్నాం. మహాశక్తిమంతమైన ఆ బోధనలను మననం చేసుకుంటూ కృతార్థులమవుదాం.

ఈశ్వర్ కల్పతరు. జే జా చాయిబే తాఇ పాబే.

భగవంతుడు కల్పతరువు. ఎవరు ఏది ప్రార్థిస్తే అది లభిస్తుంది.

శ్రీరామకృష్ణ ఉవాచ: "కల్పతరువు వద్దకు వెళ్ళి ప్రార్థన చేస్తేనే ఫలం లభిస్తుంది. చెట్టు నుంచి పండు క్రింద పడుతుంది, మనం ఏరుకోవాలి. చతుర్విధ ఫలాలంటే – ధర్మ, అర్థ, కామ, మోక్షాలు. భగవంతుడు అంతర్యామి. నిష్కపటమైన శుద్ధ మనస్సుతో ప్రార్థన చేయి. ఆయన సర్వం తెలుపుతాడు. అహంకారాన్ని విడనాడి శరణు పొందు. సర్వం సిద్ధిస్తుంది".

వ్యాఖ్య: బ్రహ్మాండ సృష్టికర్త అయిన ఆయన గుప్పిట్లో ఐశ్వర్యం, విద్య, జ్ఞానం, సౌందర్యం, శక్తి అన్నీ ఉంటాయి. అపార సాగరం నుండి పెద్ద పాత్రలో నీరు నింపుకొన్నా, సాగరానికి వచ్చే నష్టమేమీ లేదు. ఎందరైనా తమ పాత్రలు నింపుకోవచ్చు. ఆ విధంగానే, మనం భగవంతుణ్ణి ఏది, ఎంత కోరినా ఆయన ఐశ్వర్యమేమీ తరగదు.

శాస్త్రాలు ఒక చెట్టును పేర్కొన్నాయి. అక్కడకు వెళ్ళి, ఎవరు ఏమి కోరినా (మంచివి, చెడువి కూడా) ఆ చెట్టు కోరిన పదార్థాన్ని ఇస్తుందట. దీన్నే 'కల్పవృక్షం' అంటారు. జీవులు భగవంతుని సృష్టి కనుక, అందరం ఆయన సంతానమే. పిల్లలు తమకు కావలసినవి తమ తల్లితండ్రులను అడుగుతారు. వారు ఆ కోరికలు తీరుస్తారు. ఆ విధంగానే మనుష్యులే కాక, పశుపక్ష్యాదులు, అన్ని ప్రాణులూ భగవంతుణ్ణి ఏకాగ్రచిత్తంతో ప్రార్థన చేస్తే, కోరికలు తీరతాయి. ఆయన కేవలం కల్పవృక్షమే కాదు మన తల్లి, తండ్రి కూడా.

శ్రీరామకృష్ణులు మోహగ్రస్థమైన మన మనస్సును భగవంతునివైపు మరల్చి, మనలో ప్రగాఢ విశ్వాసం, భక్తి ప్రపత్తులు కలిగేలా చేయడానికే అవతరించారు.

❖❖❖

తిని చైతన్య స్వరూపే చరాచర విశ్వే వ్యాప్త హోయె రయెఛేన్, తిని చైతన్యస్వరూప్.

ఆయన (భగవంతుడు) ఈ చరాచర విశ్వంలో చైతన్యస్వరూపుడై వ్యాపించి ఉన్నాడు. ఆయన చైతన్యస్వరూపుడే.

వ్యాఖ్య: 'భగవంతుడు సచ్చిదానంద స్వరూపమ'ని శాస్త్రాలు పేర్కొన్నాయి. చిత్ అనగా చైతన్యం. భగవంతుడు లేదా బ్రహ్మం చైతన్య స్వరూపమని అన్ని దర్శనాలూ నుడివాయి. ఈశావాస్యోపనిషత్తు 'ఈశావాస్యం ఇదం సర్వం యత్కించ జగత్యాం జగత్ – ఈ ప్రపంచంలో సర్వం ఈశ్వరుని ద్వారా వ్యాప్తమైంది. 'భూతానాం అస్మి చేతనా – సకల ప్రాణుల్లోనూ, సృష్టిలోని ప్రతి పదార్థంలోనూ ఉన్న చైతన్యం నేనే' అన్నాడు శ్రీకృష్ణపరమాత్మ గీతలో. ఈ బ్రహ్మాండం భగవంతుని సృష్టి. ఆయన చైతన్యమయం కనుక సృష్టిపదార్థాలన్నిటా ఆ చైతన్యం భాసిల్లుతోంది. బ్రహ్మం ఒక్కటే.

విజ్ఞానశాస్త్రం చివరకు తేల్చింది ఏమిటంటే, అణుపరమాణువులలో సైతం చైతన్యశక్తి ఉంది. బ్రహ్మం రెండు విధాల ఉంటుంది. ఒకటి – నిర్గుణ, నిరుపాధికం. అది క్రియారహితమై, సదా స్థిరంగా ఉంటుంది. రెండోది – అన్ని ఉపాధులూ కలిగి ఉన్న క్రియాశీలమైన స్థితి. ఈ రెండోదాన్నే భగవంతుడు లేదా ఈశ్వరుడు అని పేర్కొంటారు. సమస్త ఉపాధులూ కలిగి ఉన్న చైతన్యసత్తా – భగవంతుడు. పరిమిత ఉపాధులు గల చైతన్యసత్తా – జీవుడు. నిజానికి ఈ లోకంలో జడపదార్థం అంటూ ఏదీ లేదు. దేనిలో చైతన్యం చాలా తక్కువగా భాసిల్లుతున్నదో, దాన్ని మనం 'జడం' అంటాం. ❖

అనువాదం: డాక్టర్ కమల జయరావు

మోక్షానికి మార్గం

విమానం నుండి చూస్తే క్రిందవున్న వస్తువులలో భేదం కనిపించదు. అలాగే సాధకుడు పైభూమికలకు పోయేకొద్దీ, అతనికి సన్మార్గులు, దుర్మార్గులు భిన్నంగా కనిపించరు. కుండ ఆవములో కాలిన తర్వాత, మళ్ళీ దాన్ని కుమ్మరి పొయ్యిపై పెట్టి ఏమి చేయగలడు? అట్లే మనస్సు ఈశ్వర పాదములపై లగ్నమైన తర్వాత దానికి మళ్ళీ లోక స్పర్శ ఉండదు. సంసార వికారాలుండవు.

తత్త్వదృష్టి అంటే, సంస్కృతంలో 'సమ్యగ్దృష్టి' అని అర్థం. మరి మతం – తత్త్వ శాస్త్రానికి ఆచరణరూపం. ద్వైతం – "మోక్షానికి ఈశ్వర కృప ఒక్కటే మార్గం. ఒక పర్యాయం సంసారంలో పడిన తర్వాత, ఈ బంధంలో నుండి బైటపడడానికి దైవకృప ఒక్కటే సహాయం చేయగలదు. ఈశ్వరునికి ఈ బంధం లేదు. ఆయన దయవల్ల మనం ఈ బంధం తెంచుకోగలం."

అద్వైతం – "ఈ ప్రపంచానికి అధిష్ఠానంగా, పరమేశ్వరుడున్నాడు. ఆయన బంధరహితుడు. స్వతంత్రుడు. బంధాలకు అతీతుడైన ఆ పరమాత్మ దర్శనం వల్ల మోక్షం కలుగుతుంది. మోక్షమంటే బంధరాహిత్యం."

ముక్తికి దగ్గర త్రోవ చిత్తశుద్ధి. భగవంతుడనే వాడొకడుంటే, అందరూ ఆయన్ని చూడవచ్చు. ఆ పరమాత్మ ఇలా ఉంటాడు, అలా ఉంటాడు అని ఎవరూ చెప్పవలసిన పని లేదు.

వేడినీళ్ళు వెచ్చగా ఉంటాయని చెప్పడమెందుకు? కావలసిన వాడు తాకి తెలుసుకుంటాడు. పరమాత్మ ప్రతివాని బుద్ధికి సత్యంగా భాసించి తీరాలి! పాపమనే మాటకు పాశ్చాత్యుల అర్థం వేరు. హిందువుల అర్థం వేరు.

పాశ్చాత్యుల దృష్టిలో పాపమంటే, భగవంతునికి కోపం తెప్పించే పనులు, చెడ్డ పనులు. ఈ అర్థంలో అవి పాపాలు కావు. చెడు చేయడం వల్ల మనం భగవంతుని యెడ అపచారం చేసికొంటున్నాం. అందువల్ల దాని ఫలితం అనుభవించి తీరాలి. నిప్పులో చేయి పెట్టడం పాపంకాదు. కానీ పెట్టినవాని చేయి కాలితీరుతుంది. ప్రతి కర్మకు ఫలితం ఉంటుంది. కర్తకు దాని ఫలితం సంక్రమించక తప్పదు.

కొందరు 'భగవంతుడు వేరు, జీవుడు వేరు' అని అంటారు. ఇది ద్వైతం. కొందరు 'ఈశ్వరుడు – ఆచార్య పురుషుడు – సాధకుడు ఒక్కటే' అని అంటారు. ఇది అద్వైతం.

మొదటిదానికంటే రెండవది యుక్తియుక్తం. ద్వైతం పరమాత్మ వైపు ఒక అడుగు. ఈ సాధనలో మనకు భగవంతుని బిడ్డలమను అనుభూతి కలుగుతుంది. అద్వైత సాధన ద్వారా 'మనమూ, పరమాత్మా అభిన్నులమనీ; మనం పరమాత్మ స్వరూపులమనీ' అనుభూతిలోనికి తెచ్చుకోవచ్చు. ❖



ఓ అమృత పుత్రులారా! దివ్యప్రభాసమానుడైన పరమాత్మను నేను దర్శించితిని. ఆ పరమాత్మను తెలుసుకుంటేగాని అమరత్వం సిద్ధించదు. పరమపద ప్రాప్తికి వేరే మార్గం లేదు. - శ్వేతాశ్వతరోపనిషత్తు



భగవంతుడు

హాస్యకథలతో, దృష్టాంతాలతో మహోన్నత ఆధ్యాత్మిక సత్యాలను పసిపిల్లలకు కూడా అర్థమయ్యే సులభరీతిన ఉపదేశించడం శ్రీరామకృష్ణ పరమహంస ప్రత్యేకత. వారి దివ్యతేజోమయ ముఖమండలంపై సదా ఓ దివ్య భవ్యమధుర మందహాసం తొణికిసలాడేది. “వారి రూపం ఆనందమయమై ఉండేది; చింత, దుఃఖం, బాధ వారి ముఖంపై ఎప్పుడూ చూడలేదు” అని అనేవారు శ్రీశారదామాత. “శ్రీగురుదేవుల దివ్య సన్నిధిలో కేవలం ఐదు నిమిషాలు గడిపి వెళ్ళినా నెలల తరబడి ఆ దివ్య ఆనందం, నిర్మలప్రేమ మా మనస్సుల్ని దివ్యోన్మత్తతతో నింపివేసేవి. ఆ ప్రేమ, ఆనందాలను మాటలలో వర్ణించడం వల్ల కాని పని!” అన్నారు పరమహంస పరమ ప్రియశిష్యుడు స్వామి వివేకానంద.

శ్రీరామకృష్ణులు ఒకరోజు తమ గదిలో శిష్యులతో ‘ఆధ్యాత్మిక సాధనలో అహంకారం పెద్ద అవరోధం’ అనే విషయాన్ని వివరిస్తూ ఇలా ఉపదేశించారు: “భగవంతుడు రెండు సందర్భాలలో నవ్వుతాడు – ఇద్దరు అన్నదమ్ములు తండ్రి నుండి సంక్రమించిన ఆస్తిని పంచుకొంటూ పొలంలో నిలబడి ఇద్దరూ రెండు ప్రక్కలా కొలత తాడు పట్టుకొని ‘ఈవైపు భాగం **నాది**, ఆ వైపు భాగం **నీది**’ అంటున్నప్పుడు భగవంతుడు నవ్వుతాడు.

ఇక తీవ్ర వ్యాధిగ్రస్థుడైన బాలుని తల్లి తన బిడ్డ కోలుకుంటాడో లేదో అని ఆందోళన, దుఃఖంతో తల్లడిల్లి పోతూండడం చూసి, ఆ బాలునికి చికిత్స చేస్తున్న డాక్టరు ‘అమ్మా! నీవేమీ చింతించవద్దు, నీ బిడ్డకు వైద్యం చేసి, బ్రతికించే బాధ్యత **నాది**’ అన్నప్పుడు భగవంతుడు నవ్వుతాడు.

శ్రీరామకృష్ణులు ‘భగవంతుడు రెండు సందర్భాలలో నవ్వుతాడు’ అని అన్నారు. కానీ ఈ 21వ శతాబ్దంలో మనిషి విచిత్ర ప్రవర్తన చూసి భగవంతుడు చాలా సందర్భాల్లో నవ్వుతున్నాడు!

1. ఎంతో మంది భక్తులు అనేక దేవాలయాలకు దానధర్మాలు చేస్తూ ఉంటారు. దేవాలయపు గోడలపైనా, క్రిందా ఆఖరికి ముఖద్వారంపై కూడా వారి పేర్లు పెద్ద అక్షరాలతో ‘ముఖద్వార నిర్మాణ దాతలు, ఈ గుడిలో టైల్స్ వేయించిన దాతలు, గ్రిల్ చేయించిన దాతలు, స్వర్ణగోపుర నిర్మాణదాతలు, నిత్యాన్నదాతలు, స్వామి వారికి పుష్పాలంకార దాతలు, నిత్యపూజా దాతలు, ప్రసాద దాతలు – ఇలా ఎన్నెన్నో రకాలుగా తమ పేర్లను ఆ దేవాలయంలో కొలువై ఉన్న స్వామి పేరు కన్నా పెద్ద సైజులో ఆకర్షణీయంగా వ్రాయించుకుంటారు. అవి చూసి మురిసిపోతూంటారు! ఈ నిష్కామ భక్తుల సేవలను చూసి భగవంతుడు “ఇదేమిటి! ఈ విశ్వంలో సకల సంపదలూ ప్రసాదించే దాతను, లోకాధ్యక్షుడను నేను. వీరంతా తమపేర్లు వ్రాయించుకుని దాతలుగా మురిసిపోతున్నారు! మరలా వీరే ‘దాత ఏక్ రామ్, భిఖారీ సారీ దునియా – భగవంతుడొక్కడే నిజమైన దాత, సర్వజీవులూ ఆయన ముందు యాచకులే!’ అని గట్టిగా భజనపాటలు పాడుతారు! ఆ...హా...హా...హా... భలే బాగుంది!” అంటూ కడుపుబ్బా నవ్వుతూ ఉన్నాడు.

2. నాయకులు కోట్లాది దేశప్రజల ముందు ప్రమాణ స్వీకారం చేసేటప్పుడు “నేను సదా సర్వదా సత్యనిష్ఠతో, ధర్మపరాయణుడనై, శ్రద్ధ విశ్వాసాలతో నా బాధ్యతలను పూర్ణ సమర్పణా భావంతో నిర్వహిస్తానని ఆత్మసాక్షిగా ప్రమాణం చేస్తున్నాను. అవినీతికీ, అక్రమాలకూ, అబద్ధాలకూ ఎన్నడూ చోటివ్వక నిస్వార్థమైన, స్వచ్ఛమైన, ప్రజాసేవ చేస్తూ నా మాతృభూమిని సేవిస్తాను” అన్న మాటల్ని విని, ఆ పరమాత్ముడు పకపకా నవ్వుతున్నాడు.

3. పెద్ద పెద్ద నగరాలు, పట్టణాలలో, తీర్థక్షేత్రాలలో ఆధునిక గురువులు కుండలినీ జాగృతం; మూడో నేత్రం

తెరుచుకోవడం; జంపింగ్ యోగా; డ్యాన్సింగ్ యోగా - ఇలా ఎన్నెన్నో చిత్రవిచిత్రమైన పేర్లతో, కళ్ళు మిరుమిట్లు గొలిపే ప్రచార సాధనాలతో ప్రజల్ని మభ్యపెడుతున్నారు. ఈ తమాషా చూస్తున్న పరమాత్ముడు 'నిజమైన యోగులు, భక్తులు, బ్రహ్మజ్ఞానులు, సిద్ధపురుషులు కరవైపోయిన తరుణంలో ఈ ఆధునిక గురువులు ప్రజల్ని ఆకర్షిస్తున్న పద్ధతుల్ని చూసి నవ్వుతున్నాడు.

4. అందరు భక్తుల ఇళ్ళల్లో ప్రత్యేకంగా పూజగది ఉంటుంది. రోజూ పూజలు, నైవేద్యాలు సమర్పిస్తూ ఉంటారు. ఇళ్ళలో

నవ్వుతున్నాడు !

- స్వామి అర్చనానంద

గోడలకూ దేవీదేవతల పటాలను వైభవంగా అలంకరిస్తారు. కానీ కొందరు భక్తులు ఆ దేవతల పటాలను శుభ్రంగా ఉంచరు. 'పూజగది' కూడా అస్తవ్యస్తంగా, అపరిశుభ్రంగానే ఉంటుంది. ఏదో 'తంతు' లాగా నిత్యపూజలు చేస్తూంటారు. కానీ ఇంటికి ఎవరైనా బంధుమిత్రులు, పెద్ద మనుషులు మొదలైనవారు వస్తే, వారి రాకకు ముందు అన్నీ తళతళా మెరిసేలా శుభ్రం చేస్తారు! దేవుని గది పుష్పముల దివ్యసుగంధం, ధూప దీప నైవేద్యాలతో వెలిగిపోతూ ఉంటుంది. ఎటు చూసినా నిత్య కల్యాణం, పచ్చతోరణమే!

ఈ ఆర్భాటం, అట్టహాసం చూసి భగవంతుడు "ఔరా! నేను నిత్యమూ వెలసిన ఈ గదినీ, నా చిత్ర పటాలనూ పరిశుభ్రం చేయరు. సాక్షాత్తూ జగత్సాక్షిని, సర్వాంతర్యామిని అయిన నన్ను పట్టించుకోరు, ఏదో యథాలాపంగా పూజ చేస్తారు! మరి బంధుమిత్రులు, పెద్దమనుషులు ఇంటికొస్తే, అంతా తళతళలాడుతూ కళకళలాడేలా శుభ్రం చేస్తారు, అలంకరిస్తారు! ఈ పూజలు నాకోసమా! పరుల మెప్పుకోసమా!" అని అనుకొంటూ నవ్వుతున్నాడు.

5. 'నాగుల చవితి'కి భక్తులంతా పాముల పుట్టలు వెతికి వెతికి వెళ్ళి అక్కడ పుట్టలో పాములకు పాలు పోస్తారు. దేవాలయాలలో నాగదేవతల విగ్రహాలకు పాలు పోస్తారు, ఎంతో భక్తి శ్రద్ధలతో పుట్టలకు, విగ్రహాలకూ పూజలు చేస్తారు. కానీ ఇంటిలో, పెరట్లో ఆ 'నాగదేవత' ప్రత్యక్షమైతే కర్రలతో కొట్టి చంపివేస్తారు! పాములు పట్టేవారిని పిలిపించి వాటిని బంధించి, కోరలు తీయిస్తారు. ఇదంతా చూసి నాగేశ్వరుడైన పరమశివుడు పరవశంగా నవ్వుతున్నాడు!

6. యుద్ధరంగంలో శ్రీకృష్ణపరమాత్ముడు నిరుత్సాహంతో దిగాలుపడిపోయిన క్షత్రియ వీరుడు అర్జునునికి కర్తవ్యబోధ చేసి ధర్మయుద్ధం చేయమని 'మామనుస్మర యుధ్యచ' అని బోధించాడు. ఆ 'నిత్యజీవన మార్గదర్శిని' అయిన భగవద్గీతను చాలా మంది తమ బంధుమిత్రులెవరైనా మరణిస్తే, ఆ సమయంలో 'గీతా పారాయణం' చేసి తృప్తి పొందుతారు. నిత్య జీవితంలో, కర్తవ్య నిర్వహణలో గీతా బోధనలను అస్సలు పట్టించుకోరు, ఆచరించరు. 'గీత' అంటే 60, 70 ఏళ్ళ వృద్ధులే చదవాలనీ, పిల్లలు, విద్యార్థులు, యువకులు గీతాధ్యయనం చేయరాదనీ, చేస్తే సన్యాసులు' అయిపోతారనీ వాదిస్తారు, వారిస్తారు. వీరి వివేక విచక్షణా కుశలతను చూసి శ్రీకృష్ణపరమాత్మ తనలో తానే 'మమ మాయా దురత్యయా - నా మాయ దుర్భేద్యమైనది' అనుకొంటూ చిద్విలాసంగా నవ్వుతున్నాడు!! ....నవ్వుతూనే ఉంటాడు!! ❖

భగవంతుడు ఆనందించాలంటే...

మనుషులు నాలుగు రకాలు - బొంగరం లాంటివారు; సర్కస్ గుర్రం లాంటివారు; భూమి లాంటివారు; సూర్యుని లాంటివారు.

మొదటిరకం - బొంగరం తన చుట్టూ తాను తిరుగునట్లు, స్వార్థపరుడు నిరంతరం తన బాగోగుల గురించే ఆలోచిస్తాడు.

రెండవరకం - సర్కస్‌లో గుర్రం మైదానం చుట్టూ పరుగెత్తినట్లు, ఈ కోవకు చెందినవారి ఆలోచనలు కేవలం తన కుటుంబం వరకే పరిమితమై ఉంటాయి.

మూడవరకం - భూమి తన చుట్టూ తాను తిరుగుతూ, సూర్యుని చుట్టూ కూడా తిరుగుతూ అనేక మందికి మేలుచేస్తున్నట్లు, ఈ కోవకు చెందినవారు తన గురించి, తన కుటుంబం గురించి ఆలోచించడమే కాకుండా తోటివారికి కూడా మేలు చేస్తారు.

నాలుగవరకం - సూర్యుడు తన కోసం ఏమాత్రం ఆలోచించకుండా సర్వజీవులకు హితాన్నే చేకూర్చినట్లు, ఈ కోవకు చెందినవారు తమ సర్వస్వాన్నీ ఇతరుల హితానికే సమర్పిస్తారు.

భగవంతుడు మొదటి రెండు కోవలకు చెందిన వారిని చూసి నవ్వుకుంటాడు. మిగతా రెండు కోవలకు చెందినవారిని చూసి ఆనందిస్తాడు.

ఎవడి మనస్సు భగవత్ప్రేమామృతంతో వెల్లివిరుస్తూ ఉంటుందో, ఎవడు భగవత్ప్రేమోన్మత్తుడై ఒప్పుతూ ఉంటాడో, ఎవడు సదా భగవంతునిలోనే రమిస్తూ ఉంటాడో అతడే భగవత్స్వరూపుడు - శ్రీరామకృష్ణులు


మన

శిష్యులకు శిక్షణ పూర్తయింది. అంతేవాసులు తాను నేర్పిన విద్యను ఏ స్థాయిలో నేర్చారో తెలుసుకోవడానికి ఒక పరీక్ష అవసరమైంది. గురువు గారు విద్యార్థులనందరినీ రావించారు. తమ అస్త్రశస్త్ర కౌశలాన్ని ప్రదర్శించి చూపించమన్నారు. విలువిద్యా కౌశలాన్ని ఒకరి తర్వాత ఒకరు ప్రదర్శిస్తున్నారు. ఇంతలో ఎక్కడి నుంచో ఒక అపరిచిత వ్యక్తి వచ్చాడు. ఆ రాకుమారులందరూ చూస్తుండగా తన కార్ముకవిద్యా నైపుణ్యాన్ని వారికి ఎరిగించాడు. రాజపుత్రులు ఆశ్చర్యపోయారు. గురువుగారు ఎవరైతే అందరి కన్నా మిన్నగా రాణించాలనుకున్నారో ఆ వ్యక్తిని కూడా మించిపోయాడు. గురువుగారు అందరి కన్నా మేటిగా నిలపాలనుకున్న ఆ వ్యక్తి కొత్త వ్యక్తితో, ఈ పోటీ కేవలం రాకుమారులకు మాత్రమే ఉద్దేశింపబడినదనీ, అతడికి ఈ పోటీలో పాల్గొనడానికి అర్హత లేదనీ చెబుతాడు. శూరత్వమే క్షత్రియత్వానికి నిజమైన కొలబద్ద అని ఆ కొత్తవ్యక్తి వాదిస్తాడు. ఇద్దరి మధ్య యుద్ధం మొదలవుతుంది. ఇంతలో అక్కడున్న ఓ పెద్దాయన ఆ అపరిచిత శూరుడితో తాను ఏ రాజకులైక భూషణుడో తెలియజేయమంటాడు. ఇంకో రాకుమారుడు అతడు క్షత్రియుడైతేనే తన సోదరుడు అతడితో యుద్ధం చేస్తాడనీ, రాకుమారుడు కాని యెడల తన సోదరుడితో చంపబడడానికి అతడు అనర్హుడనీ పలుకుతాడు. చంపబడటానికి కూడా అర్హత ఉండాలంటాడు! ఆ అపరిచిత వ్యక్తి ఎవరో కాదు; తన దానగుణంతో జగద్విఖ్యాతి నొందిన సూర్య పుత్రుడు – కర్ణుడు. తాను ఏ రాజవంశ సంజాతుడో తెలియజేయమని కోరినవాడు కృపాచార్యుడు. తాను క్షత్రియుడు కానియెడల తన సోదరుడు అతడిని చంపజాలడని పలికినవాడు భీముడు.

ఈ శస్త్రాస్త్ర ప్రదర్శన ద్వారా పాండవ మధ్యముడు అర్జునుడిని అందరిలో మేటిగా ప్రపంచానికి పరిచయం చేయాలని గురువు ద్రోణాచార్యుల వారి ఉద్దేశం. నిజానికి ఆనాడు అక్కడ సమావేశమైన రాకుమారులలో సవ్యసాచిని మించిన విలుకాడు లేడు. కానీ కర్ణుడి రాకతో పాండవుల ఆశ నిరాశ అయింది. వెంటనే భీముడు, కృపాచార్యుడు కుల ప్రస్తావన తీసుకు వచ్చారు.

ఓటమిని హుందాగా అంగీకరించే శక్తి లేనప్పుడు మనిషి ఇలాంటి బలహీనతలకు లోనవుతాడు. అర్జునుడి ధనుర్విద్యా నిపుణతను ఇదివరకే చూసి లోలోపల అసూయతో రగిలిపోతూ ఉన్న దుర్యోధనుడికి కర్ణుడి రాకతో వెతుకుతున్న తీగ కాలికి తగిలినట్లైంది. కుల ప్రస్తావన తీసుకువచ్చి కర్ణుడి కౌశలాన్ని గుర్తించ నిరాకరించిన భీమ కృపాచార్యులతో దుర్యోధనుడు 'క్షత్రియాణాం బలం జ్యేష్ఠం..' – బలవంతుడే క్షత్రియుడు అంటాడు. అవమాన భారానికి గురైన కర్ణుడిని వెంటనే అంగరాజ్య పట్టాభిషిక్తుడిని చేసి 'నీవు ఇప్పుడు రాజువి. రాజవంశీయుడివి' అంటాడు. కర్ణుడి కళ్ళు చెమ్మగిల్లుతాయి. దుర్యోధనుడు కర్ణుడిని కౌగిలించుకుంటాడు. ఈ సహాయం, ఓదార్పు, గాయపడిన తన గుండెకు లభించిన సాంత్వన కర్ణుడిని దుర్యోధనుడికి మిత్రుడిగా చేస్తాయి. బలశౌర్యాలే ఒక వ్యక్తి క్షత్రియుడా? కాదా? నిర్ణయిస్తాయి, కులం కాదని చెప్పి కులతత్త్వాన్ని నిరసించిన శూరుడు – దుర్యోధనుడు. అలా చెప్పడంలో తన స్వార్థం ఉండవచ్చు గాక! ధర్మవిషయకంగా ఇక్కడ మాత్రం దుర్యోధనుడు నిక్కచ్చిగా వ్యవహరిస్తాడు.

అంటే వేద కాలం నాటి వర్ణాశ్రమ వ్యవస్థ స్థానే కులతత్త్వం అనేది ద్వాపరయుగం నుండే మొదలైందన్నమాట. బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్ర.. ఇవి మనకు వేదకాలం నాటి నుండి వస్తున్న వర్ణాలు. మనస్సు అనేది త్రిగుణాత్మకం. సత్త్వ రజ తమోగుణాల నిర్మితం. ఈ మూడింటిలోని వ్యత్యాసం వల్ల మనిషి అభిరుచులలో, ఆసక్తులలో తేడాలు ఉంటాయి. అందరికీ ఒకే విషయంపై ఆసక్తి ఉండదు. కొందరికి జ్ఞానంపై మక్కువ, మరికొందరికి అధికారం, పాలన అంటే ఆసక్తి. ఇంకొద్దిమందికి వ్యవసాయం, వ్యాపారం. ఇతరులు సేవాధర్మంలో ఉన్నతులు. అందరూ సత్త్వగుణంతో పుడితే అందరికీ ఆధ్యాత్మిక జ్ఞానంపైనే మక్కువ కలుగుతుంది. అప్పుడు పాలన చూసేవారు, వ్యవసాయం చేసి ఆహారాన్ని అందించేవారు ఉండరు. అందుకని సృష్టిలో గుణాత్మిక వైవిధ్యాన్ని పరమేష్ఠి కల్పించాడు. కాబట్టి అందరూ పరస్పరం ఒకరికొకరు సహకరించుకొని సమాజ నావను ముందుకు తీసుకువెళుతూ, సంసార సాగరాన్ని తరించాలి అన్నది పూర్వీకుల ఆశయం.



కాలక్రమేణా ఈ వ్యవస్థ గతి తప్పింది. ఎక్కువ తక్కువ భావనలను తీసుకువచ్చారు కొందరు. భేదదృష్టి తీవ్రమైంది. సహాయం, ఆదరణ బదులు తృణీకారం, నిరాదరణ మొదలైంది. గుణాన్ని అనుసరించి ఋషులు విభజించిన చాతుర్వర్ణ వ్యవస్థ క్రమేణా కులరూపం దాల్చింది. చిలువలు పలువలుగా చీలి నేడు మనం చూస్తున్న కుల వ్యవస్థగా రూపుదిద్దుకుంది. నేడు మనిషిని మనిషి నుంచి మానసికంగా వేరు చేస్తున్న అతి పెద్ద రాక్షసి – ఈ కులరక్కసి. రోజురోజుకూ పెరుగుతున్న

కులసంఘాలు, కులం ఆధారంగా సంఘటితమవుతున్న ప్రజానీకం ఈ కులాగ్నికి ఆజ్యం పోస్తున్నారు. భారతదేశ మూలతత్త్వమనదగ్గ వసుధైక కుటుంబ భావనకు తూట్లు పొడుస్తున్నారు. చలిచీమ నుంచి బ్రహ్మ పర్యంతం ఒకే పరబ్రహ్మ తత్త్వం అభివ్యక్తీకృత మవుతున్నదన్న అద్వైత భావాన్ని అపహాస్యం చేస్తున్నారు. ప్రతి అణువునా ఆ పరమాత్ముడు నెలకొన్నాడన్న భావనను రోజూ వింటూ ఆచరణలో మాత్రం పరిహసిస్తున్నారు. కుల మత జాతి లింగ ప్రాంత విద్య వయో రూప గుణ వేష భాషలు... వేటిద్వారా మనిషికీ మనిషికీ మధ్య తారతమ్యాన్ని ఎంచినా అది అజ్ఞానమే. భగవద్గీతలో భగవానుడు 'శునకం, శునక మాంస భక్షకుడు, ఆవు, ఏనుగు, విద్యావినయ సంపన్నుడైన బ్రాహ్మణుడు... అన్నింటినీ సమభావంతో చూడగలిగిన వాడు పండితుడు, జ్ఞాని' అంటాడు. ఇలాంటి అద్వైతానికి మనం సుదూరమన్న విషయం మనందరికీ తెలిసిందే. అంటే జంతువుకూ, మనిషికీ కూడా భేద మెంచని స్థితికి చేరుకున్నప్పుడు మాత్రమే మనం నిజంగా జ్ఞానాన్ని పొందినట్లు. అప్పటివరకూ మనమంతా అజ్ఞానులమే.

ఇక్కడి దాకా ఎదిగితే కానీ మన అజ్ఞానం నశించదు. అప్పటి వరకూ మనకు దుఃఖపరంపరలు కలుగుతూనే ఉంటాయి. ఈ

వాడేనా?

– స్వామి శితికంఠానంద

సుదూర లక్ష్యాన్ని మనం ఎప్పటికి చేరుకుంటాం? మనం ప్రస్తుతం ఎంత దూరంలో ఉన్నాం? ఒకసారి పరిశీలిస్తే మనం అసలు ఆ దిశగా ప్రయాణిస్తున్నామా? తద్విరుద్ధమైన దిక్కున పయని స్తున్నామా? అన్న సందేహం కలగక మానదు. నేటి మనిషి విపరీతమైన అభద్రతా భావనకు లోనై బ్రతుకుతున్నాడు. ఉపాధి, ఆర్థిక పరమైన అనిశ్చితి వల్ల జనిస్తున్న భీతి తమ కులస్థుల పాలనను కోరుకునేటట్లు చేస్తోంది. బహుళ జాతి సంస్థలు, పూర్తి స్థాయి ప్రొఫెషనలిజం అవసరమైన కొన్ని భారతీయ వ్యాపార సంస్థలను మినహాయిస్తే కొన్ని ప్రైవేట్ కంపెనీలలో, విద్యా సంస్థలలో, వ్యాపార సంస్థలలో ఉద్యోగ నియామకాలలో మొదటి ప్రాధాన్యత తమ కులం వారికే. మౌఖిక పరీక్ష చేసే వారి మనస్సులలో వచ్చే మొదటి ప్రశ్న 'మనవాడేనా' అని. అతడి కన్నా ఇంకా ఉద్యోగావసరం, అనుభవం ఉన్న వ్యక్తి వచ్చినప్పటికీ, అధిక విద్యార్హత కలిగి ఉన్నప్పటికీ ఆ వ్యక్తిని ఉద్యోగానికి పరిగణించరు. ఇక దేశ రాజకీయాల్లో ఈ కుల ప్రభావం ఎంతవరకూ వెళ్ళిందో జగమెరిగిన సత్యం. పోటీ చేస్తున్న అభ్యర్థి 'మనవాడైతే' చాలు. వాడు ఎటువంటివాడైనా ఫరవాలేదు. మనం ఓటేసేస్తున్నాం. అంటే కులాన్ని ప్రక్కన పెట్టి వ్యక్తి శీలాన్ని గుర్తించి, మంచి వ్యక్తిని ఆదరించే కనీస సంస్కారం మనలో కరవవుతున్నదేమో ఒకసారి ఆత్మపరిశీలన చేసుకోవాలి.

ఇదంతా కూడా మనిషికి అభద్రతా భావం వల్ల జనించిన బలహీనత. తమ కులం వాడు అధికారంలో ఉంటే ఏదో బీరకాయ పీచు చుట్టరికాన్ని కలుపుకొని, సొంత ప్రయోజనాలను పరిరక్షించు కోవచ్చని ఆశ. పైరవీలు చేసుకొని పైకి రావచ్చని మన పిచ్చి పుల్లయ్యల పగటికలు. నాయకుడెప్పుడూ అధికారం వచ్చాక సామాన్యుడిని దగ్గరకు రానీయడు (తన కులం వాడైనా). నాయకుడికి అంత సమయం ఉండదు.

భారతదేశంలో చట్టాలు అధికారంలో ఉన్నవారిపై పనిచేయవు. అందుకని మన నేతలు ఎప్పుడూ అధికారమనే రక్షణ కవచం తమకు ఉండాలని తపిస్తూ ఉంటారు. ఇలా ఏదో విధమైన భయం లేని మనుజుడంటూ ఇవాళ ఎవడూ లేడు. ఒక్క ధర్మం మీద ఆసక్తి ఉన్న వ్యక్తి మాత్రమే నిర్భయంగా జీవించగలుగుతాడు. మిగతావన్నీ భీతిపూరిత జీవితాలే. ధర్మం భగవంతుడి స్వరూపం. ధర్మాన్ని ఆచరించకుండా గుడుల చుట్టూ ప్రదక్షిణలు, మూలవిరాట్టులకు మణిమయ కాంచన మకుటాలు, నానారకాల కైంకర్యాలు, ప్రార్థనా స్థలాల్లో మోకరిల్లటాలు....ఇవేవీ మనిషిని రక్షించలేవు. ధర్మాన్ని భగవంతుడిని వేరు చేసి నీతిబాహ్య జీవితాలను గడుపుతూ లోపలంతా బిక్కుబిక్కుమంటూ జీవిస్తూ పైకి మాత్రం గంభీరంగా ఉండటానికి ప్రయత్నిస్తున్నారు కొందరు.

ధర్మం దైవం... రెండూ ఒక్కటే. అందుకే కృష్ణ భగవానుడు మహాభారతంలో దుర్యోధనుడితో 'పాండవులు ధర్మపరులు కాబట్టి నాకు ప్రియులు' అంటారు. 'ఎవరైతే వారిని ద్వేషిస్తున్నారో వారు నన్ను ద్వేషిస్తున్నట్లే. ఎవరైతే వారిని అనుసరిస్తారో వారు నన్ను అనుసరిస్తున్నట్లే, **యస్తాన్ ద్వేష్టి సమాం ద్వేష్టి యస్తానను సమాం అను**' అంటాడు. దైవాన్ని ద్వేషించి ఎలా బ్రతుకగలం? ప్రతి కులంలో పాండవులు, కౌరవులు.. ఇద్దరూ ఉన్నారు. పాండవులు రక్షింపబడతారు. కౌరవులు శిక్షింపబడతారు. భగవంతుడు కుల పక్షపాతి కాదు. ఆయన ధర్మ పక్షపాతి. అందుకని ఈ కులజాడ్యాన్ని తొలగించుకొని ప్రతి వ్యక్తీ గుణసంపదను పెంచుకోవడానికి ప్రయత్నించేలా సహాయపడదాం. శీలసంపద గల వ్యక్తులను అభిమానిద్దాం, అభినందిద్దాం. సభ్య సమాజంలో గౌరవాన్ని కోల్పోతున్నామని అందరూ అప్పుడు సత్యపథాన్ని అనుసరిస్తారు. ఇలాంటి ప్రేరణ ద్వారా మనం సమాజంలో ఉన్న చెడును ప్రక్షాళన చేసినవాళ్ళమవుతాం. ధార్మికత పునాదులను పటిష్ఠపరిచిన వాళ్ళమవుతాం. సమాజానికి సరియైన సహాయం చేసినవాళ్ళ మవుతాం.. తత్ప్రయత్నం ద్వారా మాయకు మహాలంబనగా తయారై, మహామహులనే మోహంలో ముంచుతున్న కులం అనే ఈ అడ్డుగోడను కూలగొట్టి, సర్వసముడు, సర్వసృష్టి సాక్షీభూతుడు, సర్వ ప్రాణికోటి హృదయేశ్వరుడు ఐన సర్వేశ్వరుడిని చేరుకోవడానికి ప్రయత్నిద్దాం. ❖

శీలవంతులు లేని రాజ్యంలో నీతి, ధర్మం నశిస్తాయి. అప్పుడు దేశానికే ముప్పు వాటిల్లుతుంది. అందుచేత ప్రభువులు సద్గుణవంతులైన పండితులను గౌరవించి, ఆదరించవలెను. - హితోపదేశం

మరపురాని మనుషులు

– శ్రీమతి సుధామూర్తి, ఇన్ఫోసిస్ ఫౌండేషన్

కంప్యూటర్ సైన్స్‌లో విశేషకృషి చేసినవారికి ప్రపంచ స్థాయిలో అలన్ టురింగ్ పురస్కారాన్ని ప్రదానం చేయడం ఆనవాయితీ. ఈ అవార్డు నోబెల్ బహుమతితో సమానమైంది. దీనిని అందుకున్న ఆసియా వాసుల్లో ప్రథమవ్యక్తి – ప్రొఫెసర్ రాజిరెడ్డి గారు.

ఒక భారతీయుడికి ఇంత పెద్ద అవార్డు రావడం నాకు చాలా ఆనందాన్ని కలిగించింది. ప్రొఫెసర్ రాజిరెడ్డి గారికి ఆ పురస్కారాన్ని ప్రకటించిన సంవత్సరం ఆయన బెంగుళూరులోనే ఉన్నారు. ఆ విషయం తెలిసి అభినందించేందుకు ఓ రోజు వారింటికి వెళ్ళాను. ముందు గదిలో మల్లెపూల లాంటి తెల్లటి లాల్చీ, పంచె ధరించి రాజిరెడ్డి గారు ప్రశాంతంగా కూర్చొని ఉన్నారు. సాదాసీదాగా వాలుకుర్చీలో కూర్చున్న వారిని చూసి, వీరేనా ఇంతటి ఘనతను సాధించింది అన్న ఆశ్చర్యం కలిగింది.

వెళ్ళగానే నేను 'నమస్కారం సార్! ప్రపంచాన్ని జయించినంత ఆనందంగా ఉండి ఉంటుంది మీకు! ఈ పురస్కారం మీ జీవితంలో మైలురాయి లాంటిది కదా! ఇది సాధించినందుకు గర్వంగా ఉందా!' అని అడిగాను. దానికి ఆయన జవాబు చెప్పకుండా, స్థిమితంగా, ప్రశాంతంగా ఓ చిరునవ్వు నవ్వారు. వారి భార్య తీసుకువచ్చిన కాఫీ నాకు అందిస్తూ 'అమ్మా! సుధా! మిమ్మల్ని కొన్ని ప్రశ్నలు అడగాలను కుంటున్నాను' అన్నారు.

ఎంతో ఆనందంగా, ఆసక్తిగా నేను సరేనన్నాను. అప్పుడు రాజిరెడ్డిగారు 'చివరి సారిగా రసాయన శాస్త్రంలో నోబెల్ బహుమతి ఎవరికి వచ్చింది?' అని అడిగారు. నేను రోజూ పత్రికలు చదువుతూనే ఉంటాను. కానీ ఆ వ్యక్తి ఎవరో నాకు గుర్తుకు రాలేదు.

ఆ తరువాత వరుసగా లండన్ రాయల్ సొసైటీ ఫెలోగా ఎవరిని ఎన్నుకున్నారు? పులిట్జర్ బహుమతి ఎవరికి వచ్చింది? బుకర్ బహుమతి ఎవరికి వచ్చింది? – ఇలా ప్రొఫెసర్ రాజిరెడ్డి గారు కొన్ని ప్రశ్నలు వేశారు. కానీ చాలా వాటికి నేను జవాబులు చెప్పలేకపోయాను.

అప్పుడు వెంటనే ఆయన, "అమ్మా! సుధా! మీ జ్ఞాపకశక్తిని పరీక్షించడం నా ఉద్దేశం కాదు. పెద్దపెద్ద పురస్కారాలు, బహుమతులు తెచ్చుకున్నవాళ్ళను అందరూ ఎప్పటికీ గుర్తుంచుకోలేరని చెప్పడానికే ఇవన్నీ అడిగాను. ఆ యా రంగాల్లోని వాళ్ళో, దగ్గర చుట్టాలో, స్నేహితులో అయితే తప్ప గుర్తుంచుకోలేరు. మిగతా వాళ్ళంతా ఆ రోజు పత్రికల్లో పేరు చూసి, తరువాత మరచిపోతారు. అది ప్రపంచ నైజం, సహజం కూడా! నాకు ఏదైనా పురస్కారం లభించినప్పుడల్లా ఈ విషయాన్నే గుర్తు చేసుకుంటాను. అందుకే ఏది సాధించినా విపరీతంగా పొంగిపోకూడదంటాను. నా పనే నాకు ఆనందాన్ని ఇస్తుంది. అదే నాకు నిజమైన బహుమతి. నేను ఏదైనా సాధించినప్పుడు అత్యంత ఆత్మీయులు తమ సంతోషాన్ని నాతో పంచుకుంటారు. అదే నాకు పెద్ద గౌరవం" అన్నారు. ఆయన అభిప్రాయం నా మనస్సుకు హత్తుకుంది.

పురస్కారాలు వచ్చినప్పుడు వారు అమితంగా ఆనందించనూ లేదు; రానప్పుడు విచారించనూ లేదు. అందుకే రాజిరెడ్డి గారంటే నాకు పూజ్యభావం. ఆ తరువాత ఆయన సరదాగా "సుధా! మీరు జీవితంలో మరచిపోలేని వాళ్ళు ఎవరో చెప్పగలరా?" అని తిరిగి ప్రశ్నించారు. మరుక్షణమే నేను "ఓ చెప్పగలను! మా చిన్నప్పటి ఉపాధ్యాయిని. మొదటిరోజు మా అమ్మ నన్ను పాఠశాలలో దింపి వెళ్ళిపోయినప్పుడు, నేను ఏడవసాగాను. అప్పుడు ఆ ఉపాధ్యాయిని వచ్చి నన్ను తన ఒడిలోకి తీసుకొని 'ఏడవకు బంగారు తల్లీ! భయం లేదమ్మా నేనున్నానుగా!' అని ఊరడించింది. ఒక కొత్త చోట ఎవరో అంత ఆత్మీయంగా దగ్గరకు తీసుకోవడం ఎంత బావుందో! అలాగే నా క్లాస్‌మేట్‌ని కూడా నేను మరచిపోలేను. చిన్నప్పుడు ఆడుకుంటూ ఉండగా నా వల్ల పక్కింటి వాళ్ళ కిటికీ అద్దం పగిలిపోయింది. మా ఇంట్లో చెప్పడానికి నేను భయపడుతూ ఉంటే, 'ఫరవాలేదులే! మనిద్దరి వల్లా అలా జరిగిందని నేను వచ్చి మీ వాళ్ళతో చెబుతాలే! కంగారుపడకు' అని ఓదార్చింది. అలాగే మా కజిన్‌ని కూడా మరచిపోలేను. ఒకసారి మా ఊరికి బస్సు ఆలస్యమైనందువల్ల, అర్ధరాత్రి దాటాక వాళ్ళ ఇంటికి వెళ్ళాను. అయినా ఆమె ఏ మాత్రం విసుక్కోకుండా, వెంటనే లేచి నాకు చక్కగా వండి, వడ్డించింది. బాగా చూసుకుంది" అన్నాను.



అప్పుడు రాజిరెడ్డిగారు "చూశారా! ఇలాంటి వారే మన జీవితంలో మరపురాని మనుషులు. ప్రపంచం దృష్టిలో వాళ్ళు పెద్ద పేరున్నవాళ్ళు కాకపోవచ్చు. కానీ వాళ్ళు మీకు కష్టసమయంలో ఓ భద్రతా భావాన్నీ, ఆత్మీయహస్తాన్నీ అందించినవారయ్యారు; ఆత్మవిశ్వాసాన్ని నింపినవారయ్యారు. తమ ప్రేమతో మిమ్మల్ని కట్టిపడేశారు. వాళ్ళు మీలో బలాన్నీ, ధైర్యాన్నీ, విలువలనూ నింపారు. వాళ్ళేనమ్మా నిజమైన విజేతలు. వాళ్ళనే మనం ఎప్పటికీ గుర్తుంచుకోవలసింది. గొప్ప గొప్ప విజయాలు ఏమీ సాధించలేకపోయినా, పెద్ద మనస్సుతో ప్రతి ఒక్కరమూ ఆ విజేతల జాబితాలో చేరవచ్చు" అన్నారు. ఆ మాటలు నా మనస్సుపై గాఢంగా ముద్ర వేశాయి. ❖

సేకరణ: జి. సతీష్


యువవాణి

– స్వామి పరిజ్ఞేయానంద

కార్తీక్, కళాశాల విద్యార్థి, కాకినాడ

ప్రశ్న: **మా నాన్నగారు గుండెపోటుతో హఠాన్మరణం చెందారు. నన్ను ఎంతో ప్రేమగా చూసుకుంటున్న నా తండ్రి శాశ్వతంగా దూరమవడాన్ని భరించలేకపోతున్నాను. కలలోనైనా ఎవ్వరికీ అపకారం చేయని నాకు భగవంతుడు ఎందుకు ఇలాంటి విషమ పరిస్థితిని కల్పించాడు? ఈ తీరని బాధ వల్ల చదువు మీద మనస్సు పెట్టలేకపోతున్నాను. నా ఈ మనోవ్యథ తీరే మార్గం తెలుపండి.**

జవాబు: ప్రేమగా చూసుకుంటున్న తండ్రి హఠాత్తుగా మరణించడం వల్ల మీరు అనుభవిస్తున్న బాధ ఎంత తీవ్రంగా ఉందో మీ ఉత్తరంలోని ప్రతీ అక్షరమూ చెప్పకనే చెబుతోంది. జీవితంలో మనల్ని ప్రేమించినవాళ్ళూ, మనకు అన్నివేళలా అండదండగా ఉన్నవాళ్ళూ, ముఖ్యంగా తల్లితండ్రులు కనుమరుగైతే కలిగే బాధ మాటలకు అందనిది. అందుకే శ్రీరామకృష్ణ పరమహంస "పసితనంలో తల్లినీ, బాల్యంలో తండ్రినీ, యౌవనంలో భార్యనూ కోల్పోయిన వారికి కలిగే దుఃఖం అంతులేనిది" అని అంటారు.



ఇలాంటి అంతులేని దుఃఖం నుండి ఉపశమనం పొందాలంటే ఇతరుల ఓదార్పు, సానుభూతి కన్నా ముఖ్యంగా మన మనోభావంలో మార్పురావాలి. మనలో దుఃఖం తీవ్రమవడానికి కారణం – మనకొచ్చిన కష్టాలు ఇంకెవరికీ రాలేదనుకోవడం; మనలాగ కష్టాలు పడినవాళ్ళూ, మనకన్నా ఇంకా ఎక్కువ బాధలు అనుభవిస్తున్నవాళ్ళూ ఎంతోమంది ఉన్నారన్న నిజాన్ని మరచిపోవడం.

ఒకసారి ఓ స్త్రీ, చనిపోయిన తన కుమారుణ్ణి భగవాన్ బుద్ధుని వద్దకు తీసుకువచ్చి 'నా బిడ్డడిని విడిచి నేను బ్రతకలేను. దయచేసి నా బిడ్డడిని ఎలాగైనా బ్రతికించండి స్వామీ!' అని శోకతప్త హృదయంతో మొరపెట్టుకుంది. అప్పుడు బుద్ధుడు ఆమెతో 'తల్లీ! నీ బిడ్డడిని తప్పక బ్రతికిస్తాను. కానీ నువ్వు ఊరిలోకి వెళ్ళి, ఇంతవరకూ ఎవరూ మరణించనివారి ఇంటి నుండి ఒక పిడికెడు ఆవాలు తీసుకొని రా!' అని అన్నాడు. అప్పుడు ఆమె ఊరిలో ఇంటింటికీ వెళ్ళి 'అమ్మా! మీ ఇంట్లో ఎవరూ మరణించనట్లయితే నాకు ఒక పిడికెడు ఆవాలు దానమివ్వండి' అని అడిగింది. అలా ఎన్ని ఇల్లకు వెళ్ళి అడిగినా ప్రతి ఇంటిలోనూ ఎవరో ఒకరు చనిపోయారనే చెబుతున్నారు. చివరికి చావులేని కుటుంబం లేదనీ, కష్టాలు అందరికీ ఉన్నాయన్న జీవిత సత్యాన్ని గ్రహించిన ఆమె దుఃఖం నుండి ఉపశమనం పొంది బుద్ధుని శిష్యురాలిగా ప్రశాంత జీవితాన్ని గడపసాగింది.

శ్రీరామకృష్ణ పరమహంస బాల్యంలోనే తండ్రిని కోల్పోయారు. తండ్రి మరణం ఆయన్ని ఎంతగానో క్రుంగదీసింది; స్వామి వివేకానంద కళాశాల విద్యార్థిగా ఉన్నప్పుడే ఆయన తండ్రి గుండెపోటుతో హఠాన్మరణం చెందాడు. అప్పుడాయన అంతులేని దుఃఖాన్ని అనుభవించారు; అలాగే అబ్రహాం లింకన్ తొమ్మిదేళ్ళ వయస్సులోనే తల్లిని కోల్పోయాడు. ఆ తరువాత అతడు పడిన కష్టాలెన్నో! ఈ మహాత్ములంతా చిన్నప్పుడే ఆత్మీయులను పోగొట్టుకున్నారు. కానీ బాధలన్నింటినీ భరించి జీవితంలో ఎంత ఉన్నత స్థితికి ఎదిగారో వారి చరిత్రే అందుకు సాక్ష్యం.

Beneath the unpleasant hides the beneficial. Pain is the whip that providence uses to drive us against our will - to our best destination. - మనకు కలిగిన అపకారాల మరుగున ఏదో ఉపకారం దాగివుంది. మన బ్రతుకు బండిని ముందుకు నడిపించడానికి ఎదురయ్యే కష్టాలు కొరడా దెబ్బల్లాంటివి" అని ఓ చైనా తత్త్వవేత్త మనకు కలిగే కష్టాల వెనకున్న రహస్యాన్ని వెల్లడించారు.


నిజానికి మనకు కలిగిన కష్టాలు ఆ సమయంలో ఎంతో బాధను కలిగిస్తాయి. కానీ కొన్నేళ్ళ తరువాత ఆ కష్టాలే మన పురోగమనానికి తోడ్పడ్డాయని తెలుసుకుంటాం. ఒకప్పుడు కలిగిన కష్టాలను శాపాలుగా తలచిన మనమే అవి వరాలుగా మారాయన్న పరిపక్వత మనలో కలుగుతుంది.

అందుకే స్వామి వివేకానంద "మహనీయులందరూ దుఃఖాల నుండే జీవిత పాఠాలు నేర్చుకున్నారు. దుఃఖాలే వారిలో నిద్రాణావస్థలో ఉన్న శక్తుల్నీ, ప్రతిభల్నీ అభివ్యక్తం చేశాయి" అని కష్టాలను చూసి కలత చెందకూడదని హితవు పలికారు.

ఆ భగవంతుడు నాకే ఇన్ని కష్టాలను ఎందుకు ఇస్తున్నాడని బాధపడకుండా "When bad things happen to good people, they become better people - భగవంతుడు మంచి వాళ్ళకు కష్టాలనిచ్చేది, వారిని ఉత్తములుగా మలచడానికి" అని గుర్తుంచుకొని జీవితంలో ముందుకు సాగడానికి ప్రయత్నించాలి.

కాబట్టి మన ఆత్మీయుల మధుర స్మృతులను మనస్సులో పదిలపరుచుకొని, వారు మనపై చూపిన ప్రేమ అనే తీగ సహాయంతో జీవితంలో పైకి ఎదగడానికి ప్రయత్నించాలి. అదే వారి ప్రేమకు ప్రతిఫలంగా మనమిచ్చే నిజమైన కానుక. అప్పుడే వారు మనల్ని చూసి ఆనందిస్తారు, ఆశీర్వదిస్తారు. ఆవిధంగా మనకు జన్మనిచ్చిన వారి రుణాన్ని తీర్చుకున్నవారమవుతాం. ❖

నాయనా! కలత చెందకు. భగవంతునితో బాంధవ్యాన్ని పెంచుకో! భగవంతుని ముందు విలపిస్తూ 'ప్రభూ! నాకు మనశ్శాంతిని ప్రసాదించు' అని ప్రార్థించు. క్రమంగా నీకు మనశ్శాంతి చేకూరుతుంది. - శ్రీశారదాదేవి



మార్పు మన నుంచే...

– బి. సైదులు

ఓ రాజ్యంలో మహారాజుకు కంటిజబ్బు సోకింది. హుటాహుటిన రాజవైద్యులందరూ ఆయనకు పరీక్షలు చేసి నేత్రచికిత్స అవసరమని తేల్చారు. మరుసటి రోజే శస్త్రవైద్య నిపుణులు మహారాజుకు చికిత్స చేసి, ఆ తరువాత కళ్ళ ఆరోగ్యం కోసం కొన్ని జాగ్రత్తలు చెప్పారు. అందులో భాగంగా కొన్నాళ్ళ పాటు మహారాజుగారు ఆకుపచ్చ రంగున్న వస్తువులనే చూడడం మంచిదని సూచించారు. వెంటనే ఈ విషయం రాజ్యమంతా పాకిపోయింది. రాజాజ్ఞ మేరకు ఆ రోజు నుంచి రాజప్రాసాదం, అంతఃపురం మొదలుకొని వీధులన్నింటినీ ఆకుపచ్చ రంగులో ముంచెత్తటం ఆరంభించారు. రాజుగారి ధనాగారంలోని సొమ్మంతా ఆకుపచ్చ రంగుకు, అద్దకాలకే సరిపోసాగింది. అయినా ఎవరూ ప్రశ్నించలేకపోయారు. ఇంతలో ఓ రోజు పక్క రాజ్యం నుంచి ఓ సాధువు పరివ్రాజకుడిగా ఆ రాజ్యానికి వచ్చారు. ఎక్కడ చూసినా పచ్చదనమే కనిపిస్తూ ఉండటంతో ఆ సాధువుకు ఆశ్చర్యమేసి అసలు విషయంపై ఆరాతీశారు. ఆ తరువాత తనే చొరవ తీసుకొని ఆ మహారాజు దగ్గరకు వెళ్ళి 'అయ్యో! మీరు ఎంత పొరపాటు చేస్తున్నారు! లక్షలకు లక్షల ప్రజాధనాన్ని ఈ ఆకుపచ్చ రంగు పులమడానికి యథేచ్ఛగా ఖర్చుపెడుతున్నారు. ఇంత శ్రమ ఎందుకు? మీ కళ్ళకు ఓ ఆకుపచ్చ రంగు కళ్ళజోడు పెట్టుకుంటే సరిపోతుంది కదా!' అన్నారు. అప్పుడు ఆ మహారాజుకి బుర్రలో దీపం వెలిగింది. మనస్సు మారి, కంటికి ఆకుపచ్చ అద్దాలజోడు వచ్చింది. ఇలా మనం కూడా చాలాసార్లు ఆ వెర్రి మహారాజులా మన దృష్టిని, ధోరణిని మార్చుకోకుండా, లోకాన్ని మార్చే ప్రయత్నం చేస్తూ ఉంటాం. ముందు మనం మారాలన్న విషయాన్ని మరచిపోయి, మార్పు మరెక్కడో రావాలని ఆశిస్తూ ఉంటాం; అసహనానికి లోనవుతూ ఉంటాం. అందుకే 'Purify yourself first. The world is bound to be purified then... మొదట మీరు పవిత్రులు కండి; అప్పుడు అంతా పవిత్రంగానే కనిపిస్తుందం'టారు స్వామి వివేకానంద.

అంతరంగం నుంచి బహిరంగానికి... : వ్యక్తిగత వ్యవహారాలలో కూడా మనం చాలాసార్లు మార్పును మన నుంచి కాకుండా ఎదుటివారి నుంచి అభిలషిస్తూ ఉండడం వల్లనే మానవసంబంధాలు కూడా పేకమేడల్లా కూలిపోతున్నాయి. సాధారణమైన వ్యక్తి పనితీరు బహిరంగం నుంచి అంతరంగానికైతే, అసాధారణమైన వ్యక్తి పనితీరు అంతరంగం నుంచి బహిరంగానికి! సామాన్యమైన వ్యక్తి పరిస్థితులన్నీ మారితే తాను మారిపోతాననుకుంటాడు; సమర్థత కలిగిన వ్యక్తి, ముందు తాను మారి, తర్వాత పరిస్థితుల మార్పు గురించి ఆలోచిస్తాడు; నిరాశావాది తన అశాంతికి ఈ లోకమే కారణమనుకుంటాడు; ఆశావాది తన సంతోషానికి తానే కారణమనుకుంటాడు. నిజానికి మనం అసహనానికి, అశాంతికి గురికావలసినంత అస్తవ్యస్తంగా పరిసరాలు కానీ, ప్రపంచం కానీ లేవు. పరిశ్రమలోని యంత్రంలో అడ్డదిడ్డంగా కనిపిస్తున్న సాంకేతిక పరికరాలను, తీగలను చూసి సాధారణమైన వ్యక్తి అయోమయం పడతాడు; కానీ యంత్రభాగాల పరిజ్ఞానం కలిగిన సాంకేతిక నిపుణుడు ఏమాత్రం ఆందోళన పడకుండా యంత్రం ఎలా ఉండాలో అలాగే ఉందన్న విజ్ఞతతో నిశ్చలంగా గమనిస్తూ ఉంటాడు. ప్రపంచ పరిస్థితులు కూడా అంతే! అయితే మనలో చాలామంది ప్రపంచపోకడలను తమ పరిమితమైన పరిజ్ఞానంతో విశ్లేషించుకుంటూ విమర్శించుకుంటూ ఉంటారు. సమాజం కుళ్ళిపోయింది; మనుష్యులు మలినమైపోయారని ఉక్రోశంతో ఊగిపోతూ ఉంటారు. తమను తాము సరిదిద్దుకునే సాహసం చేయలేక, ఆ నెపాన్ని సమాజం పైనో, సాటి మనుషుల పైనో వేస్తూ ఉంటారు. అలాంటి వ్యక్తులు ఎప్పుడూ ఆశావాదులుగా ముందుకు సాగలేరు. అందుకే ఆధ్యాత్మికవేత్త స్వామి చిదానంద 'The whole world is not going to change for you; change yourself – నీవు మారాలిగానీ, నీకోసం ప్రపంచం మారదం'టారు. అల్పమైన మన అనుభవాలను ఆధారం చేసుకొని లోకంలో జరగకూడనివి ఏవో జరిగిపోతున్నాయని అర్థం లేని ఆందోళనకు గురికాకూడదు. పైగా బాహ్యప్రపంచం, బయటి వ్యక్తుల మనస్తత్వాలు, ప్రవర్తనలు మన అధీనంలో ఉండవు;

అందుకే బయటి ప్రపంచానికి, మనకు సంఘర్షణ తలెత్తినప్పుడు ఒక్కసారి మనస్సును అంతర్ముఖం చేసుకోవాలి. ఆత్మపరిశీలనతో వీలైనంత వరకు పరిష్కార మార్గాలను మన వైపు నుంచే అన్వేషించుకోవాలి. మనమే మారేందుకు ముందడుగు వేయాలి.

మార్పు మచ్చ కాదు... : చాలామంది తమ అభిప్రాయాల్ని మార్చుకుంటే తాము రాజీపడిపోయినట్లనీ, ఎదుటివారి ముందు తమ ప్రతిష్ఠకు భంగం వాటిల్లినట్లనీ భావిస్తారు. కానీ అది పొరపాటు! తనది తప్పని తెలిసినా, తాను పట్టిన కుందేటికి మూడే కాళ్ళని వాదిస్తూ, 'మారనంటే మారనని' వాదించేవారు మూర్ఖులతో సమానం. అందుకే స్వామి వివేకానంద 'It is the nature of the brute to remain where he is...' అంటూ మార్పును కోరని జడత్వం మూర్ఖుడి స్వభావమని నిర్వచిస్తారు.

ఒక మహారాజు ఉండేవాడు. శరీరాన్ని బలిష్ఠంగా ఉంచుకునే ప్రయత్నాల్లో భాగంగా రోజూ ఉదయమే పుష్కలంగా నువ్వుల నూనె తాగి, వ్యాయామం చేస్తూ ఉండేవాడు. అలా నూనె తాగడం గుండెకు హాని చేస్తుందని ఆస్థాన వైద్యులు పలుమార్లు హెచ్చరించారు. అయినా ఆ మహారాజు మారడానికి ససేమిరా ఒప్పుకోలేదు. చివరకు గుండెనాళాల్లో కొవ్వు పెరిగి హృద్రోగంతో మరణించాడు. ఇలా మనలో చాలామంది తమ అభిప్రాయాలకూ, మనస్తత్వాలకూ కాలానుగుణంగా మెరుగుపెట్టుకోవడానికి ఇష్టపడరు. ఎప్పటికప్పుడు మనల్ని మనం 'అప్‌డేట్' చేసుకోవడమన్నది మానసిక పరిణామ దశల్లో భాగమే! అలా కాకుండా నిలవనీటి చెరువులా కదలికకు మొరాయిస్తూ ఉంటే, పాచిపట్టటం తప్ప, పరవళ్ళు తొక్కలేం! అందుకే గెలెట్ బర్గెస్ అనే ఆంగ్ల రచయిత 'ఎన్నో ఏళ్ళుగా ఏదేని మార్చుకోవలసిన ముఖ్యమైన అభిప్రాయాన్ని, ప్రవర్తనను మార్చుకోవడం కానీ, ఒక కొత్త అభిప్రాయాన్ని స్వీకరించడం కానీ మీరు చేయలేకపోతున్నారంటే మీ అభ్యున్నతికి మీరే సమాధి కట్టుకుంటున్నారన్న మాటే!' అంటాడు.

స్వీయ సంస్కరణ.... : సాధారణంగా మనం శాస్త్రాలను, గ్రంథాలను ఔపోసన పట్టి ఆ జ్ఞానాన్ని ఆధారంగా చేసుకొని సమాజాన్ని పరిశీలించడం, సంస్కరణ మార్గాలను సూచించడం ప్రారంభిస్తూ ఉంటాం. కానీ ఆ జ్ఞానప్రకాశపు వెలుగుల్లో మనల్ని మనం చూసుకోలేం. ఆ విశ్లేషణ క్రమంలో అసలు మనం ఎక్కడ ఉన్నామో కూడా అంచనావేసుకోం. ఎన్ని విన్నా, ఎన్ని చదివినా స్వీయసంస్కరణ విషయానికి వచ్చేసరికి మాత్రం ఏదో ఒక కారణాన్ని చూపి దాటవేస్తూ ఉంటాం. ఉదాహరణకు మహాభారతంలో ధృతరాష్ట్రుడు విదురుడు చెప్పిన హితవచనాలన్నీ విన్నాడు. కానీ పుత్రవ్యామోహంతో తన మనస్సును మాత్రం మార్చుకోలేకపోయాడు. అదే మానసిక నిస్సహాయతతో ధృతరాష్ట్రుడు ఓ మారు విదురుడితో 'బుద్ధి మార్చుకోమనీ, పాండవులతో ప్రేమగా ఉండమనీ అంతరాత్మ చెబుతున్నా, ఎందుకో దుర్యోధనుడు ఎదురుపడగానే, అతని గురించి ఆలోచించగానే నా మనస్సు మోహంలో పడిపోతుంది. నేను మారలేకపోతున్నాను; నేనేం చేయను?' అంటాడు. ఇలా మోహమో, అహంకారమో, అజ్ఞానమో మనల్ని మార్పు వైపునకు మొగ్గుచూపకుండా కట్టి పడేస్తుంది. అందుకే In the process of success, we must discipline ourselves to continue expanding, broading, learning, keeping our minds active and open అంటారు పాశ్చాత్య మేధావి క్లైంట్ ఈస్ట్‌వుడ్. ఇలాంటి పెద్దమనస్సుతో తమ జీవితంలో సానుకూలమైన మార్పును స్వాగతించడానికి నిరంతరం సిద్ధంగా ఉండేవాళ్ళు విజయ సోపానాలను అధిరోహించగలరు. అలా కాకుండా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లు గిరిగీసుకొని కూర్చునేవాళ్ళు, గొంగట్లో అన్నం తింటూ వెంట్రుకలు లెక్కపెట్టుకొని చికాకుపడే వాళ్ళుగా మిగిలిపోతారు.

మనకే మేలు... : ప్రపంచం ఎలాగూ మారదని నైరాశ్యంతో చేతులు ముడుచుకొని కూర్చోమని కాదు. కానీ మనవంతు కృషి వల్ల ఏవో పెనుమార్పులు సంభవిస్తాయని మాత్రం అత్యాశకు పోకూడదు. రాముడు కట్టే వారధిలో నా పాత్ర కొంతైనా చాలని ఉడుత ముందుకు వచ్చిందే కానీ, మొత్తం వంతెనంతా తానే కట్టాలని అత్యుత్సాహ పడలేదు. అలా మనం కూడా సమాజం మరింత మంచిగా మారడానికి నేనేమైనా చేయగలనా? అని ఆలోచించాలే గానీ, ఆదర్శవంతమైన సమాజం కోసం అతిగా ఆశించకూడదు. 'మన చుట్టూ ఉండే విషయాలు ఎన్నటికీ మెరుగుపడవు. అవి ఎప్పుడూ ఒకేలా ఉంటాయి. అయితే వాటిలో మనం తెచ్చిన మార్పు ద్వారా మనమే పరిణతిని సాధిస్తాం' అంటాడు కౌటిల్యుడు. వ్యవస్థలోని లోపాలను సరిదిద్దడం వేరు; అసలు వ్యవస్థనే తప్పుపట్టడం వేరు. మనల్ని మనం స్పష్టంగా చూసుకోవడానికి, సవరించుకోవడానికి అద్దంలాంటిది లోకం. దానిపై పడిన దుమ్మును తుడిచి తేటగా మారిస్తే అద్దాని కన్నా అది మనకే ఎక్కువ మేలు చేస్తుందని మరచిపోకూడదు. ❖

అంతా బాగుంది అనుకుందాం!

మనిషి జీవితం నాలుగు దశల గుండా సాగిపోతుంది. మొదటిదశలో 'నేను బాగాలేను, ప్రపంచమూ బాగాలేదు' అనుకుంటాడు. నిరంతరం ఏడ్చే పసిపిల్లల్లాంటి స్థితి అది; ఆ తరువాత దశ 'నేను బాగాలేను, ప్రపంచమంతా బాగుంది' అనుకునే దశ. ఇది దీనంగా పాఠశాలకు వెళుతూ, ఇంటి దగ్గర ఉన్నవాళ్ళంతా ఆనందంగా ఉన్నారనుకునే బాలల స్వభావం; మూడవది 'నేను బాగున్నాను, ప్రపంచమే బాగోలేదు' అనుకునే దశ. యుక్తవయస్సులో ఉన్నవారి మనస్సు లాంటిది. తాను తప్ప ప్రతి ఒక్కరూ తేడాయే అనుకునే అసంతృప్తితో కూడిన స్థితి; ఇక ఆఖరిది 'నేను ఓకే; అంతా ఓకే' అనుకునే దశ. నేనైనా, ప్రపంచమైనా ఎలావుండాలో అలాగే ఉందనుకోవడం. ఈ దశకు ఎంత త్వరగా చేరుకుంటే జీవితం అంత ప్రశాంతంగా ఉంటుంది. - థామస్ హారిస్, మనస్తత్వవేత్త

మనస్సే సర్వం. చిత్తశుద్ధి లేకుండా దేన్నీ సాధించలేం. మన మనస్సులోనే పరిశుద్ధత, అపరిశుద్ధతలు ఉన్నాయి. మన మనస్సు దోషపూరితం అవడం వల్లనే ఇతరుల్లోని దోషాలు కనిపిస్తాయి. - శ్రీశారదాదేవి

సమష్టిశక్తికి సమన్వయ సూత్రాలు

– దిలీప్‌కుమార్ దత్తా

సమున్నత లక్ష్యాలతో కూడిన సంఘం (ORGANIZATION) పటిష్ఠంగా ముందుకు నడవాలంటే అందులోని సభ్యుల సమష్టి కృషే ప్రధానం. నలుగురు కలసి పనిచేసే చోట ఎలాంటి ఒడుదుడుకులు ఎదురవుతాయో, పొసగని మనస్తత్వాలతో పరిస్థితులు ఎక్కడికి దారి తీస్తాయో అన్ని సంఘాలకూ అనుభవైక వేద్యమే! చివరకు ఆధ్యాత్మిక సంస్థలు కూడా దానికి అతీతం కాదని తమ దార్శనికతతో స్వామి వివేకానంద నూటా ఇరవై అయిదేళ్ళ క్రితమే ఊహించారు. అందుకే స్వామీజీ ఎన్నో ప్రసంగాల్లో, సోదర సన్న్యాసులకు, ఇతర ప్రముఖులకు రాసిన ఉత్తరాల్లో సంఘం, సంఘటితంగా పనిచేయడం తదితర అంశాలపై విలువైన సూచనలిచ్చారు. నాయకత్వ దృష్టితో ఆ దార్శనికుడు ఆనాడు వెలిబుచ్చిన భావనలు నిత్యనూతనమే అనడంలో సందేహం లేదు. సంఘం, సంఘటితంగా పనిచేయడం లాంటి అంశాలపై స్వామి వివేకానంద ఇచ్చిన సూచనలను పన్నెండు సూత్రాలుగా క్రోడీకరించుకోవచ్చు.

ORGANIZATION...

Obedience - విధేయత

Reinforcement - సామర్థ్యాన్ని దృఢతరం చేయడం

Goal - లక్ష్యం

Accumulation and coordination of wills - సంకల్పశక్తుల సమీకరణ, సమన్వయం

Network - సంశక్తిజాలం

Ideal of harmony - ఆదర్శంలో సామరస్యం

Zeal - అభినివేశం, ఉత్సాహం

Attention - సావధానం

Thoughts - భావనలు

Impartial - నిష్పాక్షికత

Oblation - ఆహుతి, సమర్పణ

Nation-building - దేశ నిర్మాణం

విధేయత: సంఘంలోని సభ్యులకు ఉండాల్సిన ప్రధాన లక్షణం – సంఘం పట్ల విధేయత అని స్వామి వివేకానంద తరచూ తన సోదర సన్న్యాసులకు చెబుతూ ఉండేవారు. తనకు నీడనిచ్చిన సంఘాన్ని, అందులోని సభ్యులను ప్రేమించలేని వ్యక్తి ఎట్టి పరిస్థితుల్లోనూ అక్కడ సమర్థంగా పనిచేయలేడనీ, సత్ఫలితాలను సాధించలేడనీ వారు స్పష్టం చేస్తారు. ఓ మారు స్వామీజీ తమ మిత్రునికి లేఖ రాస్తూ 'నీకు నీ సంఘంపై పూర్తిగా కృతజ్ఞతాభావం ఉండాలి. అవిధేయతకు ఎట్టి పరిస్థితుల్లోనూ అవకాశం ఇవ్వకూడదు. విధేయతను చూపించని వ్యక్తి నీ సమూహంలో ఉండకుండా జాగ్రత్త పడు! అంటూ You must be as free as the air, and as obedient as this plant and the dog... సంఘంలో గాలిలా స్వేచ్ఛగా ఉంటూనే, మరోవైపు ఓ మొక్కలా, విశ్వాసంతో ఇంట పెరిగే పెంపుడు కుక్కలా విధేయతతో మసలుకోవాలని హితవు పలికారు.

సామర్థ్యాన్ని దృఢతరం చేయడం: సంఘం దృఢంగా ఉండాలంటే అందులో పనిచేసే వ్యక్తులు మానసికంగా, శారీరకంగా శక్తిమంతులై ఉండాలి. ఒత్తిళ్ళను తట్టుకునే అదనపు సామర్థ్యాన్ని పెంచుకునేందుకు ప్రయత్నించాలి. కలసి పనిచేసే చోట ఒళ్ళు దాచుకునే మనస్తత్వాన్నీ, బాధ్యతల నుండి



తప్పించుకునే మనస్తత్వాన్నీ విడనాడమనీ, ఇలాంటివి తాత్కాలికంగా సంఘానికి నష్టం చేయడంతో పాటు శాశ్వతంగా వ్యక్తిని పతనమొందిస్తాయని స్వామి వివేకానంద హెచ్చరించేవారు. ముఖ్యంగా సంఘ సభ్యులపై, సహచరులపై నిందారోపణలు చేయడం, చాటుగా చెడుగా మాట్లాడుకోవడం తగదనేవారు.

"నలుగురితో కలసి పనిచేస్తున్నప్పుడు, ఎదుటివారిలోని దోషాలను గోరంతలు కొండంతలు చేసి చూడడం మానుకోవాలి. ప్రతిదాన్నీ మనస్సులోకి తీసుకోకుండా మన్నించడం, మరచిపోవడం అలవాటు చేసుకుంటే మనకూ, సహచరులకూ మధ్య దీర్ఘకాల విభేదాలు పొడసూపవు" అనేవారు స్వామీజీ.

లక్ష్యం: సంఘంలో మనం పనిచేస్తున్నప్పుడు సామూహిక ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలి. మన లక్ష్యం పరోక్షంగా సంఘంపై, సంఘ సభ్యులపై సానుకూల ప్రభావాన్ని చూపాలి. సంకుచిత స్వభావంతో స్వలాభానికే పరిమితమైన లక్ష్యం సంఘస్ఫూర్తికి విఘాతం కలిగిస్తుంది అంటారు స్వామీజీ.

సంకల్పశక్తుల సమీకరణ, సమన్వయం: సంఘ నిర్మాణంలో, నిర్వహణలో సంకల్పశక్తులను సమీకరించుకోవడం, సమన్వయ పరచుకోవడం అత్యంత ప్రధానం. సభ్యులకు ఎన్ని సంకల్పశక్తులున్నా వారి మధ్య సమన్వయం లేకపోతే అవన్నీ వృథా అవుతాయి. అదే ఉద్దేశంతో స్వామి వివేకానంద తమ సోదర సన్న్యాసి శిష్యులైన శశి మహరాజ్ (స్వామి రామకృష్ణానంద)కి ఓ మారు లేఖ రాస్తూ "The success of your undertakings depends wholly upon your mutual love" అంటారు. పరస్పర ప్రేమతో, సమన్వయ ధోరణితో కలసి పనిచేయనప్పుడు సంఘం ముందుకు సాగడం గగనమైపోతుంది. అయితే నేడు చాలా చోట్ల వ్యక్తిగతంగా సంఘసభ్యులు సంకల్పశక్తి సమృద్ధిగా కలిగినవారే! కానీ సమూహంలోకి వచ్చేసరికి మాత్రం సమన్వయం కొరవడుతోంది.

సంశక్తిజాలం: సంఘ నిర్మాణం, దాని పనితీరు అందులోని బలగంపై ఆధారపడి ఉంటుందని స్వామీజీ విశ్వసించేవారు. అందుకే నలుగురు కలసి పనిచేసే చోట నాయకుడైన వ్యక్తి బలగంలోని సభ్యులు సంఘస్ఫూర్తిని కోల్పోకుండా నిరంతరం అప్రమత్తంగా ఉండాలి. 'సంస్థకు సభ్యులు, సభ్యులకు సంస్థ' అన్నట్లుగా అవినాభావ సంబంధం కొనసాగేలా మసలుకోవాలి.

ఆదర్శంలో సామరస్యం: ఏ సంస్థలోనైనా పని విభజన అన్నది చాలా ముఖ్యమైన విషయం. ఈ 'పని విభజన' ఎలా ఉండాలనే అంశంపై స్వామీజీ స్పష్టమైన సూచనలిచ్చారు. 'ఎవరికి తోచింది వారు చేయడం కాకుండా, సామరస్యపూర్వకమైన ధోరణిలో ఒకరికొకరు చేయూతగా ఉండాలి. అలా వారు చేస్తున్న పని తుదకు సంస్థకు సత్ఫలితాలను ఇవ్వాలి' అనేవారు.

అభినివేశం, ఉత్సాహం: సంస్థ సభ్యులకు ఉండాల్సిన మరో ముఖ్య లక్షణం - చేసే పనిలో అభినివేశం, ఉత్సాహం. ఉదాసీనంగా పనిచేసే వ్యక్తులు సంస్థకు నష్టం చేసినవాళ్ళవుతారు. ఉత్సాహవంతులే సంస్థకు బలం. 'ఉత్సాహం ఉరకలేస్తూ విజ్ఞానవంతులు, ధీరులు అయిన చురకత్తుల్లాంటి యువతీ యువకులు కొద్దిమంది చాలు - సంస్థ దూసుకుపోవడానికి!' అని స్వామి వివేకానంద అంటారు.

సావధానం: స్వామి వివేకానంద ఓ చోట ఇలా అంటారు: 'One of the greatest lessons I have learnt in my life is to pay as much attention to the means of work as to its end'. లక్ష్యంపై ఉన్న శ్రద్ధ లక్ష్యసాధనపై లేనప్పుడు అది దీర్ఘకాల ఫలితాలనివ్వదు. సంస్థ నాలుగు కాలాల పాటు పటిష్ఠంగా నడవాలంటే ఇలా గమ్యం, గమనంపై సరిసమానమైన శ్రద్ధ కలిగి ఉండాలి. ఏదో రకంగా లక్ష్యాన్ని చేరుకోవాలనే తాపత్రయంతో అడ్డదారులు తొక్కే ప్రయత్నం చేయడం ప్రమాదకరం. అలాంటి చర్యలతో తాత్కాలికంగా ప్రయోజనాన్ని పొందినా, కాలక్రమంలో అటు సంస్థకూ, ఇటు వ్యక్తులకూ నష్టం వాటిల్లుతుంది. ఫలితంపై ఉన్న ఆసక్తి పనిపై లేకపోతే ఎక్కడో లోపం జరుగుతున్నట్లే! ఈ రోజుల్లో చాలా సంస్థలు పతనమైపోవడానికి ప్రధాన కారణం శ్రద్ధారాహిత్యమే!

భావనలు: సంస్థను ముందుకు నడిపించేది సృజనాత్మక భావనలే! స్తబ్ధతను వీడి నిరంతరం కొత్త కొత్త ఆలోచనలతో సంఘసభ్యులు పనిలో పాలు పంచుకుంటున్నప్పుడు సంస్థ దినదిన ప్రవర్ధమానమవుతుంది. అయితే, నిర్మలమైన మనస్సు లోనే సదాలోచనలు అంకురిస్తాయనేవారు స్వామీజీ.

నిష్పాక్షికత: సంస్థ నిర్వాహకులు, నాయకులు విధిగా నిష్పాక్షికంగా నడచుకోవాలి. పక్షపాత బుద్ధి సంఘస్ఫూర్తిని దెబ్బతీస్తుంది. సంస్థను ముందుకు నడిపేవారిలో పారదర్శకత లేకపోతే వెనక నడిచేవారు సంఘాన్ని తమదిగా భావించలేరని స్వామీజీ తమ శిష్యులకు రాసిన ఓ లేఖలో ఉద్ఘాటిస్తారు.

సమర్పణ: స్వామి వివేకానంద 'the attitude of all members of the organization should be to treat the organization as a temple and the job they perform should be like oblation' అంటారు. అంటే చేసే పని పట్ల పూజ్యభావం, సమర్పణాభావం లేకపోతే దానికి సంపూర్ణంగా న్యాయం చేయలేం. తృణీకారభావంతో, మొక్కుబడిగా బాధ్యతలను నిర్వహించడం వల్ల ఫలితం కూడా అదే స్థాయిలో ఉంటుంది. అందుకే సంస్థపై గౌరవం, పనిపై ఆరాధనా భావం ఉన్నవాళ్ళే ఘనమైన ఫలితాలకు కారకులు కాగలరు.

దేశ నిర్మాణం: పై పదకొండు సూత్రాలను పాటించే ఏ సంస్థ అయినా, సభ్యుడైనా పరోక్షంగా దేశ నిర్మాణానికీ, జాతి ప్రయోజనాలకూ తోడ్పాటునందించినవారే అవుతారు. మన పరిధిలో మనం నిర్వర్తించే ఏ పని అయినా, పరోక్షంగా మన సమాజ సంక్షేమానికి దోహదపడేదిగా ఉండాలి. అప్పుడే మనం సమాజపౌరుడిగా సంపూర్ణ పౌరసత్వ విధిని నిర్వర్తించిన వాళ్ళం అవుతామనేవారు స్వామి వివేకానంద. చివరగా నాయకుడనే వ్యక్తికి అద్భుతమైన నిర్వచనమిస్తూ స్వామీజీ 'సేవకులకు సేవకుడిగా తనను భావించుకునేవాడే నిజమైన నాయకుడు. నాయకుడైనవాడు వేల రకాల మనస్తత్వాలను కూడా జీర్ణించుకోగలిగినవాడై ఉండాలి' అంటారు. ❖

కపటం, దుర్మార్గం ఎంతమాత్రం ఉండకూడదు. మరొకరిని చాటున దూషిస్తున్నవారి మాటలను ఎన్నడూ వినవద్దు. ఒకరినొకరు తప్పబట్టుకోవడమే సంస్థల వినాశనానికి కారణం. - స్వామి వివేకానంద



(1884 – 1967)

ముందుకు సాగిపో !

దివ్యజనని శ్రీశారదాదేవి ప్రత్యక్ష శిష్యులైన స్వామి ప్రేమేశానంద (1884-1967) రామకృష్ణ సంఘంలో అత్యున్నత గౌరవాన్నీ ప్రేమాభిమానాలనూ చూరగొన్న అగ్రశ్రేణి సన్న్యాసి. ఆయన జీవితం శ్రీరామకృష్ణ - వివేకానందుల ఆశయాలతోనూ, భగవద్గీత సారాంశంతోనూ నిండింది. చాలామంది యువతీ యువకులకూ, గృహస్థులకూ, బ్రహ్మచారులకూ, సన్న్యాసులకూ ఆయన ఎన్నో లేఖలు వ్రాశారు. జీవితంలో అంకితభావం, ఆధ్యాత్మిక, సేవా భావాలను అలవరచుకొనేందుకు ఆ లేఖా పరంపరలు మార్గదర్శకాలయ్యాయి. పాఠకుల ప్రయోజనార్థం విలువైన ఈ లేఖలను 'శ్రీరామకృష్ణ ప్రభ'లో 2009 జూన్ సంచిక నుంచి ధారావాహికంగా ప్రచురిస్తున్నాం.

సార్‌గాచీ
1951

ప్రియమైన తల్లీ రేణూ!*

మీ సమస్యల తీవ్రతను నేను అర్థం చేసుకోగలను. ఇవి కేవలం మీ వ్యక్తిగత సమస్యలే కావు, జాతీయ సమస్యలు కూడా. ఒక నవీన భారతం ఆవిర్భవించబోతోంది. అందుచేతనే అనేక రకాల కొత్త కొత్త సందిగ్ధ పరిస్థితులు తలెత్తుతున్నాయి. ఈ సమస్యలన్నిటినీ చక్కబరిచి మీరంతా ఒక నవ్యభారతాన్ని నిర్మించాలి. శ్రీరామకృష్ణులు ఒక గొప్ప బాధ్యతనూ, కర్తవ్యాన్నీ మీ ముందుంచారు. ఆయనే మీకు కావలసినంత శక్తిని ప్రసాదిస్తారు.

స్త్రీ జాతి తాము ఎదుర్కొంటున్న కష్టతరమైన సమస్యల పరిష్కారం కోసం తరతరాలుగా ఎదురుచూస్తోంది. స్త్రీజాతి ఉద్ధరణకై అమ్మ శారద దేహధారియై ఈ భువికి వచ్చారు. ఇప్పుడిక ఆ సమస్యలు తీరకపోవడమనేదే ఉండదు. తరతరాలుగా ఇక్కడా, ఇతర దేశాలలోనూ చరిత్రగతిలో స్త్రీల పరిస్థితుల గురించి మీరు అర్థం చేసుకొని, నేటి స్త్రీల అసహాయతను మీ మనోనేత్రంతో వీక్షించాలి. మీ హృదయాలు దయతో నిండిపోవాలి. అప్పుడు ఆ జగజ్జనని, జగదీశ్వరి మీ మేధస్సులో ఆవిర్భవించి, మీకు దారి చూపిస్తుంది.

'జీవనోపాధి' అనేది ప్రస్తుతం మీ అందరినీ ఒత్తిడికి గురిచేస్తున్న సమస్య. అన్నిటికన్నా ముందుగా 'పురుషులపై ఆధారపడరాదు' అనే దృఢ నిశ్చయానికి మీరు రావాలి. తరతరాలుగా 'స్త్రీలు అబలలు' అనే మంత్రాన్ని వల్లిస్తూ వచ్చారు. సింహ సదృశురాలైన సిస్టర్ నివేదిత స్థాపించిన సంస్థను పరిశీలించి విషయాన్ని అర్థం చేసుకోండి.

నా అభిప్రాయం ఏమిటంటే స్త్రీలు సమాజంలో పరాన్నభుక్కులుగా ఉండే కన్నా విద్యాబోధన, వైద్యసేవ, శిశు సంరక్షణ, రోగుల సేవ మొదలైన వాటిలో ఏదో ఒక వృత్తిని చేపట్టి తమ స్వశక్తిపై తాము జీవించడం ఉత్తమం.

ఇక రెండో సమస్య – ఆదర్శవంతమైన జీవితం గడపడం, పరిపూర్ణత్వం వైపుగా పయనించడం. అత్యంత క్లిష్టమైన ఈ సమస్యకు శ్రీరామకృష్ణులు పరిపూర్ణమైన, సరళమైన ఒక నూతన పరిష్కారాన్ని సూచించారు.

1) జ్ఞాన మార్గం ద్వారా ఈ విశ్వ ఆవిర్భావానికి కారణాన్ని అర్థం చేసుకోవడానికే శ్రీరామకృష్ణులు అవతరించారు.

2) ప్రేమ ద్వారా ఆయన భగవత్ సాక్షాత్కారం పొందారు.

3) ప్రకృతిని జయించి, భగవంతునితో ఐక్యతను సాధించారు.

4) జీవితంలోని ప్రతి చర్యనూ, ప్రతి కదలికనూ ఇతరుల కోసమే వెచ్చించగల్గిన పరిపూర్ణస్వేచ్ఛను ఆయన సాధించారు.

శ్రీరామకృష్ణులు, అమ్మ శారద, స్వామీజీల రాకకు పూర్వం జ్ఞాన, భక్తి, రాజ, కర్మ యోగాలు వేర్వేరు మార్గాలని ప్రజలు భావించేవారు. శ్రీరామకృష్ణుల జీవితంలో ఈ నాలుగు యోగాల సమ్మేళనంలోని బహుచక్కని సామరస్యాన్ని మనం చూస్తాం.

స్వామీజీ లేఖలన్నీ జాగ్రత్తగా పఠించండి. మీకు కావలసింది విశ్వాసం, సాహసం. ఇవి ఉంటే అన్యమేమీ అక్కరలేదు. ఈ విషయాలన్నీ మీరు చక్కగా అవగాహన చేసుకుంటే మీ సమస్యలన్నీ తప్పక పరిష్కారమవుతాయి తల్లీ! స్వామీజీ ఆశయాల బాటలో పయనిస్తున్న మిమ్మల్ని చూస్తే నాకెంతో ఆనందం కలుగుతోంది.

ప్రేమాశీస్సులతో

స్వామి ప్రేమేశానంద

తెలుగు సేత: కె. త్రివిక్రమరావు

(*రేణు కాలాంతరంలో ప్రవ్రాజిక మోక్షప్రాణా మాతాజీగా ప్రసిద్ధులు. శారదా మఠం, మిషన్ అధ్యక్షురాలిగా సేవలందించారు.)

ఎవరు సద్గురువు?

– స్వామి రంగనాథానంద
(రామకృష్ణ సంఘం 13వ సర్వాధ్యక్షులు)



ఒకసారి మనదేశంలో వివిధ ధార్మిక సంస్థలను, ఆధ్యాత్మిక వేత్తలను సందర్శించేందుకు ఓ విదేశీభక్తుల బృందం విచ్చేసింది. అందులో భాగంగా వారు రామకృష్ణమఠానికి కూడా వచ్చి, సందేహాల నివృత్తి కోసం నా దగ్గరకు వచ్చారు. ఆ భక్తబృందంలోంచి ఓ భక్తుడు 'స్వామీజీ! ఎంతో మంది గురువులు, స్వామీజీలు, ఆధ్యాత్మిక బోధకులుగా చెప్పుకుంటూ మా దేశాలకు వస్తున్నారు. వారికి తోచిన రీతిలో ఉపదేశాలిస్తున్నారు. అసలు నిజమైన గురువులుగా ఎవరిని మేము విశ్వసించాలి' అని ప్రశ్నించారు. ఈ సందేహం విదేశీయులకే కాదు మనకు కూడా చాలాసార్లు ఎదురవుతుంది. అయితే ఈ గురుసంప్రదాయానికి సంబంధించి మన సనాతన ధర్మంలో స్పష్టమైన సూచనలిచ్చారు. నిజమైన గురువు లక్షణాలను కూడా వివరంగా చెప్పారు. గురువు అనే వ్యక్తి పవిత్రుడై, నిష్కపటుడై ఉండాలి. తాను ఆధ్యాత్మిక సాధకుడై, జ్ఞానపిపాసతో తన దగ్గరకు వచ్చే శిష్యులకు, ఆ దాహాన్ని తీర్చగలిగినవాడై ఉండాలి. ముఖ్యంగా మతాన్ని, బోధనలను విపణిలో వస్తువులుగా అమ్ముకునే వ్యక్తులు గురుస్థానానికి అర్హులు కారని మన ధర్మం ఘంటాపథంగా చెప్పింది.

హైందవ సనాతన ధర్మంలో అనాదిగా ఆచార్యస్థానాన్ని అలంకరించిన వారు పూర్తిగా ఇలా నిస్వార్థపరులై, జ్ఞానమూర్తులై జీవించేవారు. శిష్యులపై ప్రేమ, వాత్సల్యాలను కురిపిస్తూ వారికి ఉచితరీతిలో శిక్షణనిచ్చేవారు. లాభాపేక్ష లేకుండా, కేవలం జ్ఞానాన్ని తమ శిష్యులకు అందించడమే వారి లక్ష్యమై ఉండేది. ఆ సంప్రదాయానికీ, వారసత్వానికీ విరుద్ధంగా నేడు ఎంతో మంది కుహనా ఆధ్యాత్మికవేత్తలు, గురువుల పేరుతో పుట్టుకొస్తున్నారు.

If somebody sells it, religion is destroyed thereby. So, I can only tell the people here-beware of people who sell religion and who make big promises that quickly you will achieve spiritual experience. మతం, మతబోధనలతో వ్యాపారం చేస్తూ తమ స్థాయిని దిగజార్చుకుంటున్నారు. ఇలా గురువులుగా చలామణి అయ్యే వారి విషయంలో భక్తులు ఎవరికి వారే అప్రమత్తంగా ఉండాలనీ, ప్రజలే కొంత విజ్ఞతతో మసలుకోవాలనీ నేను ఆ విదేశీ భక్తులకు స్పష్టం చేశాను. సాధనలతో పనిలేకుండా సత్వరమే మీకు ఆధ్యాత్మిక అనుభూతులను ప్రసాదిస్తామని ప్రచారం చేసే వ్యక్తుల మాటలు విశ్వసించకూడదు.

పారమార్థిక సత్యాలు, అనుభూతులు అంత త్వరగా సొంతం కావు. ఎంతో కొంత సాధన లేనిదే ఆధ్యాత్మికత వంటబట్టదు. అది నోట్లో వేసుకోగానే ప్రభావాన్ని చూపే మందుబిళ్ళలాంటిది కాదు. సాధకులైనవారు ఈ పరమసత్యాన్ని గుర్తించాలి. ఎవరైనా క్షణాల్లో మీకు ముక్తిని ప్రసాదిస్తామంటున్నారంటే సంశయించాల్సిందే! ఆధ్యాత్మిక పరిణతి అనేది నిరంతర సాధన. ఈ సాధనకు తోడ్పాటునందించేవారే అసలైన గురువులు. It is a serious struggle. You have the Divine hidden within you; you have to struggle to become spiritual and realize it. ఈ జ్ఞానంతో ఆధ్యాత్మిక పథంలో ముందుకు సాగుతూ, జాగరూకతతో ఉండేవారిని ఎవరూ మతం పేరుతో, ఆధ్యాత్మికత పేరుతో పక్కతోవ పట్టించలేరని భావిస్తాను.

People themselves must assume some responsibility; they should know that religion is not so cheap, it is a serious matter; So let them think before they accept a guru. గురువు ఎంపికలో శ్రీరామకృష్ణులు 'అంత త్వరగా గురువుని ఎంపిక చేసుకోకూడదు. ఎన్నో రోజులు పరీక్షించాక, పరిశీలించాక గురువుగా స్వీకరించండి' అని హెచ్చరించేవారు.

మనలో సాధన చేసే ఓపిక లేనప్పుడు, భౌతిక ప్రపంచంలో మాదిరే క్షణాల్లో ఆధ్యాత్మికత కూడా సిద్ధించాలని తాపత్రయ పడుతూ ఉన్నప్పుడు తప్పకుండా తప్పుడు గురువులు పుట్టుకొస్తూనే ఉంటారు. అందుకు మన బలహీనతలే కారణమని తెలుసుకోవాలి. పారమార్థికత అంత సులువైనదికాదనీ, అది ఎంతో నిగూఢమైనదనీ గుర్తించి, ఒకటికి పదిసార్లు పరిశీలించి గురువును ఎన్నుకోవాలి. ❖ సేకరణ : ఆర్.కృష్ణ

అగ్ని మండేటప్పుడు మిడుతలు వచ్చి పడతాయి. మిడుతలను పిలువడానికి అగ్ని పరుగెత్తదు కదా! అలాగే ఇతరులను ఆకర్షించడానికి సద్గురువులు తాపత్రయపడరు. *-భగవాన్ శ్రీరామకృష్ణ పరమహంస*

(...15వ పేజీ తరువాయి)
అవసరం లేని విరక్తి స్థితికి చేరుకొని ముక్తికి దగ్గరవుతాం. ఆ మోక్షపథం కూడా లక్ష్మీనాథుడైన శ్రీమన్నారాయణుడి మూర్తిని మనస్సులో ముద్రించుకున్నప్పుడే సాధ్యపడుతుందనీ, భక్తితోనే ముక్తి అనీ శ్రీనివాసుడి భక్తాగ్రేసరుడు సుస్పష్టం చేస్తూ....

ఆకసాన లేదు మోక్షమటు పాతాళమున లేదు
ఈకడ భూలోకమందు ఎందులేదు
పైకొని ఆసలెల్ల పారద్రోలి వెదకితే
శ్రీకాంతు పొగడేటి చిత్తములో నున్నది...

'ముక్తి ఎక్కడో ఆకాశంలోనో, పాతాళంలోనో, భూమిపైనో లేదనీ, ఆశల వలయంలో చిక్కుకోకుండా ఆ శ్రీకాంతుడిని స్మరించుకునే మనస్సులోనే ఉంద'నీ ఉద్ఘాటిస్తున్నాడు.

కర్తృత్వ భావన లేకుండా కర్మలను చేసి, సర్వప్రాణుల విషయంలో దయగా వ్యవహరిస్తూ నిస్సంగత్వంగా మసలుకునే వారు ఏ బంధాలలోనూ చిక్కుకోరు. అలా నిర్మల హృదయంతో ఈ లోకం నుంచి నిష్క్రమించేవారికి మరుజన్మంటూ ఉండదు. ఒకానొక సందర్భంలో శ్రీరామచంద్రుడికి తన గురువరేణ్యులైన వసిష్ఠ మహర్షి మోక్షానికి సంబంధించిన జ్ఞానాన్ని అందజేస్తూ...

న మోక్షో న భసః పృష్ఠే పాతాలే న చ భూతలే
మోక్షో హి చేతో విమలం సమ్యగ్జ్ఞాన విబోధితమ్...

'మోక్షం ఆకాశాన లేదు; పాతాళంలో లేదు; భూమిపై లేదు. ఉత్తమజ్ఞానంతో ఏర్పడిన నిర్మలచిత్తమే మోక్షమంటారు. ఇలా ప్రాజ్ఞులైన వారు మనోనైర్మల్యమే ముక్తి' అని నిర్వచించారు.

శరణాగతుల పాదజలంలో...

ప్రతి ప్రాణికీ తన ప్రాణంపై విపరీతమైన ప్రీతి. దానికి దేవదానవులు కూడా అతీతం కాదని క్షీరసాగర మథనం నిరూపించింది. మరణమన్న మాటే లేకుండా, శాశ్వతత్వాన్ని ప్రసాదించే అమృతం పేరు వినగానే ఆఖరి ఊపిరి తీసే జీవికి కూడా ఆశ తన్నుకుంటూ వస్తుంది. అయితే అలాంటి సుధ దేవతల వద్ద కానీ, సముద్రంలో కానీ, నలుదిక్కులా మరెక్కడైనా కానీ లేదనీ, భగవంతుడికి శరణాగతులై జీవించే శ్రీహరి దాసుల పాదజలంలోనే ఉన్నదంటూ...

సురల వద్ద లేదు సోదించ నమృతము
సరిదిక్కులందు లేదు జలధిలో లేదు
శరణాగతుల పాదజలముల జేర్చికొనే
హరిదాసుల పూజించే అరచేత నున్నది...అని కీర్తిస్తున్నాడీ సంకీర్తనాచార్యుడు. కలియుగంలో పరమ భాగవతోత్తములను ప్రస్తుతిస్తూ, వారి పాదజలం అమృతంతో సమానమంటున్నాడు. భగవంతుడికి తన కన్నా తన భక్తులపైనే అత్యంత ప్రేమ. అందుకే తనకు చేసిన సేవల కన్నా, భాగవతులకు చేసిన సేవలకే ఆయన ఎక్కువ సంతృప్తి చెందుతాడు. భక్తులను ఆదరిస్తే భగవంతుడిని ఆదరించినట్లేనన్న సత్యాన్ని లోకానికి చాటేందుకు ఆయన ఎన్నో నిదర్శనాలు చూపుతూనే ఉంటాడు. పరోక్షంగా తాను ఉంటూ ప్రత్యక్షంగా సత్పురుషుల ద్వారా లోకాన్ని ఉద్ధరిస్తూ ఉంటాడు.



..శ్రీవేంకటేశు సరి ముద్రలు ధరించే

అందుకే ఆత్మోన్నతిని సాధించాలనుకునేవారు సాధుపుంగవుల కోసం వెతకాలి. వారిని గుర్తించి వారితో జ్ఞానవిచారణ చేయాలి. అప్పుడు సత్యమేంటో, అసత్యమేంటో స్పష్టంగా తెలుసుకోగలరు. నిరంతరం సాధు సంగాన్ని ఆశ్రయించేవారికి అప్రయత్నంగానే వివేకం ఉదయించి, వికసిస్తుంది. అలాంటి వివేకవృక్షపు మధురఫలంలోని రసం అమృతమై వర్షిస్తుందని మన సనాతన ధర్మం ఘోషిస్తోంది. అందుకే సుదాముడు శ్రీకృష్ణ పరమాత్ముడిని...

నీ పాద కమల సేవయు
నీ పాదార్చకుల తోడి నెయ్యము, నితాం
తాపార భూత దయయును
తాపస మందార నాకు దయసేయగదే!

'నీ పాదాలను సేవించుకునే భాగ్యాన్నీ, నీ పాదార్చకులతో స్నేహాన్నీ, అందరితో దయగా మసలుకునే సహృదయాన్నీ ప్రసాదించ'మని వేడుకుంటాడు. నిజమైన భక్తుడి కోరికలు ఇలా ఉండాలి.

విజ్ఞాన దేహంలో...

ఫలం మధురంగా ఉంటుందని తెలుసుకోవడం జ్ఞానం; ఆ ఫలాన్ని సంపాదించుకొని ఆ తీయదనాన్ని ఆస్వాదించడం విజ్ఞానం. అలాగే భగవంతుడు ఆనంద నిలయుడని గుర్తించడం జ్ఞానం, ఆయనను ప్రత్యక్షం చేసుకొని ఆ ఆనందాన్ని అనుభవించడం విజ్ఞానం. అలాంటి విజ్ఞానదేహమే అసలైన సుఖాన్ని అనుభవించగలదంటూ...

రాజసాన సుఖమేది రాసి కర్మమందునేది
వోజతోడ నియతుడై వుండినానేది
సాజాన శ్రీవేంకటేశు సరి ముద్రలు ధరించే
తేజముతో విజ్ఞానదేహములో వున్నది! అని సుస్పష్టం చేస్తాడు అన్నమయ్య. ఏ రాజభోగాలు అనుభవించినా, ఎన్ని కర్మకలాపాల్లో మునిగితేలినా సుఖసంతోషాలు ఉండవని హితవు పలుకుతున్నాడు. శ్రీవేంకటేశుడిపై నమ్మకంతో ఆయన సరిముద్రలైన శంఖుచక్రాలను ధరించిన విజ్ఞానదేహంలోనే సుఖశాంతులు నెలకొని ఉంటాయని పరమ విశ్వాసంతో ఈ పదకవితా పితామహుడు పలుకుతున్నాడు. శంఖుచక్రాలను తమ భుజాలపై ముద్రించుకోవడం శ్రీవైష్ణవుల సంప్రదాయం. వివేక వైరాగ్యాలకు సూచితార్థాలే ఆ సరిముద్రలు. అలాంటి విజ్ఞానదేహంలోనే భగవంతుడిపై అనురాగ సంపత్తి అంకురిస్తుంది.

అందుకే "ఎవరిలోనైతే అనురాగ సంపత్తి విశేషంగా వ్యక్తమవుతుందో అతడు భగవంతుడికి చేరువలో ఉన్నాడని అర్థం. అనురాగ సంపత్తి అంటే వివేకం, వైరాగ్యం, భూతదయ, సాధుసేవ, సాధుసాంగత్యం, భగవంతుడి నామగుణ కీర్తనం, సత్యసంధత తదితరమైనవి. ఈ లక్షణాలు కనిపించిన వ్యక్తిలో భగవంతుడు నెలకొని ఉంటాడు" అంటారు భగవాన్ శ్రీరామకృష్ణ పరమహంస. ❖



జీవన వేదం

స్వామీజీ కథల సారం

నాయకుడవు కావాలంటే...

జనరల్ స్ట్రాంగ్ అని నాకొక ఆంగ్లేయ మిత్రుడు ఉండేవాడు. సిపాయిల తిరుగుబాటు సమయంలో అతడు భారతదేశంలో ఉన్నాడు. ఆ ఉద్యమం గురించి అనేక గాథలను నాకు చెబుతూ ఉండేవాడు. ఒక రోజున ప్రసంగవశాన నేను అతణ్ణి ఓ మాట అడిగాను. "తగినన్ని తుపాకులు, మందుగుండు సామాను, ఆహార సమృద్ధి ఉండి, యుద్ధ శిక్షణతో ఆరితేరినవారై ఉండి కూడా ఎందుచేత సిపాయిలు అంత ఘోరమైన ఓటమిని ఎదుర్కొన్నారు?" అని ప్రశ్నించాను.

అందుకు సమాధానంగా "అతడు నాయకులు ముందు వరుసలో ఉండి సైన్యాన్ని నడిపించ వలసింది పోయి, వెనుక ఎక్కడో భద్రమైన స్థలంలో ఉండి, 'పోరాడండి యోధులారా! ముందుకు సాగండి' అంటూ కేకలు పెట్టే వార"ని చెప్పాడు.

సైన్యాధిపతి ముందుండి చావును సైతం ఎదుర్కొనేందుకు సిద్ధపడి సైన్యాన్ని నడిపించకపోతే, సైనికులు హృదయ పూర్వకంగా యుద్ధం చేయలేరని అతడు తేల్చి చెప్పాడు.

ఏ రంగమైనా ఇదే సూత్రం వర్తిస్తుంది. నాయకుడైన వాడు ముందుగా ప్రాణత్యాగానికైనా సిద్ధపడాలి. జీవితాన్ని ఒక కార్యసాధనలో పణంగా పెట్టగలిగినప్పుడే, నీవు నాయకుడవు కాగలవు. కానీ మనమందరం ఏ విధమైన త్యాగాలు చేయకుండానే నాయకులమవ్వాలని వాంఛిస్తాం. అందుకే ఫలితం శూన్యం. మనం చెప్పేది వినేందుకు ఎవరూ ఉండరు. ❖

అసంగత్వం



దేన్నీ కావాలని కోరుకోకు. దేన్నీ వద్దని నిరసించకు. ఏది వస్తే దాన్ని రానివ్వు. స్వేచ్ఛ అన్నది దేని వల్లా భంగపడదు. ఊరకే భరించడమే సరిపోదు. అసంగుడవై ఉండు. అందుకు ఉదాహరణగా ఈ ఎద్దు కథను గుర్తు చేసుకోండి.

ఒక ఎద్దు కొమ్ము పైన దోమ ఒకటి చాలాసేపటి నుండీ కూర్చొని ఉంది. దాని మనస్సాక్షి కాసేపటికి దాన్ని బాధపెట్టింది. అప్పుడా దోమ, ఎద్దుతో ఇలా అంది:

"నందీశ్వరా! నేను చాలా సేపటి నుండీ ఇక్కడ కూర్చొన్నాను. నీకు నేను బాధ కలిగించాననుకుంటున్నాను. నన్ను క్షమించు. నేను వెళ్ళిపోతాను."

అందుకు ఆ ఎద్దు "అబ్బే! అదేమీ లేదు. నువ్వు, నీ కుటుంబ పరివారంతో సహా వచ్చి నా కొమ్ముపై కూర్చోండి. దాని వల్ల నాకేమీ హాని లేదు" అని సమాధానమిచ్చింది. ❖

గాడిద మోత

చాలా సంవత్సరాల క్రితం మా దేశంలో ఒక జ్ఞానిని దర్శించాను. ఆయన చాలా పవిత్రుడు. మేము ఇద్దరం వేదాలు, బైబిలు, ఖురాన్, ఇతర పవిత్ర గ్రంథాల గురించి మాట్లాడుకున్నాం.

మా సంభాషణ ముగిసే ముందు ఆ మహానుభావుడు అక్కడే మేజా బల్ల మీద ఉన్న ఒక పుస్తకాన్ని తీసుకురమ్మన్నాడు. అందులో అనేక ఇతర అంశాలతో పాటు ఆ సంవత్సరం కురవబోయే వర్షపాతం గురించి కూడా వ్రాసి ఉంది. ఆ జ్ఞాని ఆ పుస్తకంలో వ్రాసి ఉన్న దాన్ని చదవమన్నాడు. నేను ఆ సంవత్సరం ఎంత వర్షం కురవనుందో ఆ పుస్తకంలో వ్రాసి ఉన్న సమాచారాన్ని చదివాను.

అప్పుడా జ్ఞాని ఇలా సూచించాడు... "ఆ పుస్తకాన్ని బాగా మెలిపెట్టి పిండు."

నేను ఆయన చెప్పినట్లే చేశాను.

"ఏం నాయనా! అందులో నుంచి ఒక్క నీటి బొట్టు కూడా పడలేదు! ఆ పుస్తకంలో వర్షపాతం గురించి వ్రాసి ఉన్నా ప్రయోజనం ఏమిటి? అదే విధంగా మతం భగవంతుణ్ణి దర్శింప చేయలేనంత వరకు అది వృథాయే. కేవలం మత గ్రంథాలను చదివి తృప్తి పడేవాడు... తన వీపు మీద బరువైన పంచదార బస్తాలను మోస్తున్నా, అందులోని పంచదార తియ్యదనాన్ని ఎరుగని గాడిద లాంటి వాడే సుమా!" అని ముగించాడు ఆ జ్ఞాని. ❖

తెలుగు సేత: కె. త్రివిక్రమరావు

నీవు అనంతశక్తి సమన్వితుడవు. నీలోని శక్తి ద్వారానే నీ కష్టాలను అధిగమించాలి. నిన్ను నీవే రక్షించుకోవాలి. నీకు ఎవరో సహాయం చేస్తారనుకోవడం ఒక మధుర భ్రాంతి మాత్రమే! -స్వామి వివేకానంద

- స్వామి పరిజ్ఞేయానంద

జీవన కురుక్షేత్రం

మానవ జీవితమే ఓ కురుక్షేత్ర రణరంగం. ఈ జీవన రణరంగంలో విజయం సాధించాలంటే దుర్యోధనుడి మార్గాన్ని అనుసరించాలా? అర్జునుడి మార్గాన్ని అనుసరించాలా?. ఈ ప్రశ్నకు సమాధానం 'అర్జునుడి మార్గాన్ని అనుసరించడం ఉత్తమం' అని మనందరికీ తెలిసిందే! కానీ మన సమస్యంతా మనస్సులో అర్జునుడిలా భావించుకుంటూ, చేతల్లో దుర్యోధనుణ్ణి తలపించేలా ప్రవర్తిస్తూ ఉండడమే! ఇంతకీ అర్జునుడు అనుసరించిన మార్గమేమిటి?

కురుపాండవుల సంగ్రామ సన్నాహాలు జరుగుతున్నప్పుడు అర్జునుడు, దుర్యోధనుడు ఇద్దరూ యుద్ధంలో తమకు సహకారం అందించమంటూ అర్థించడానికి శ్రీకృష్ణుని వద్దకు వెళ్ళారు. అప్పుడు భగవానుడు 'నేను ఒక్కడిని ఒకవైపు ఉంటాను. పదివేల మందితో కూడిన సైన్యం మరోవైపు ఉంటుంది. మీలో ఎవరికి ఏది కావాలో తేల్చుకోండి' అని వారితో చెప్పాడు. అప్పుడు వెంటనే దుర్యోధనుడు పదివేల మంది బలగాన్ని కోరుకున్నాడు; అర్జునుడు మాత్రం కృష్ణుడొక్కడుంటే చాలనుకున్నాడు. అర్జునుడు తన కళ్ళకు కనబడని దైవబలంపై విశ్వాసం ఉంచితే, దుర్యోధనుడు కళ్ళకు కనబడే అంగబలాన్ని ఆశ్రయించాడు. అంటే 10,000 సంఖ్యలో ఆ ఒక్కటి లాంటి శ్రీకృష్ణుడు లేకపోతే అంగబలమెంతున్నా విలువలేని సున్నలతో సమానమని గ్రహించలేని అజ్ఞాని దుర్యోధనుడు. ఒక్క కృష్ణుడు తన పక్షాన ఉంటే చాలు... ప్రపంచంలోని సమస్త శక్తులూ ఏకమైనా ఎదుర్కోవచ్చని తలచిన సుజ్ఞాని అర్జునుడు. ఆ విధంగా అర్జునుడు అచ్యుతుణ్ణి అండగా చేసుకొని విజయుడయ్యాడు; దుర్యోధనుడు అర్థాంగబలాల్ని నమ్ముకొని నాశనమయ్యాడు.



అందుకే శ్రీరామకృష్ణులు "ముందు ఒకటి లేకుండా ఎన్ని సున్నలు పెంచుకుంటూ పోయినా వాటికి ఎలాంటి విలువ ఉండదు. అలాగే భగవంతుడనే 'ఒక్కటి' లేకపోతే ప్రాపంచిక వైభవాలన్నీ విలువ లేని సున్నల్లాంటివి. అందువల్ల ముందు భగవంతుని అనుగ్రహం సంపాదించు" అని బోధించారు.

ఎంతోమంది మహాత్ములు ప్రాపంచిక వైభోగాల కన్నా భగవంతుని అండే మిన్న అనీ; భగవంతుడు లేనిదే ప్రాపంచిక సంపదల విలువ సున్న అనీ; దైవశక్తితోనే జీవన సంగ్రామంలో విజయాన్ని సాధించగలమనీ తేటపరిచారు.

'నిధి చాలా సుఖమా? రాముని సన్నిధి సేవ సుఖమా?' అంటూ ప్రశ్నించి, 'రాముని సన్నిధియే పరమపెన్నిధి' అని శ్రీరాముని చింతనలో తన జీవితాన్ని ధన్యమొనర్చుకొన్నారు త్యాగరాజస్వామి.

"పూట గడవడమే కష్టంగా ఉన్న నీకు నీ రాముడు తిండి పెడతాడా? నీ వెర్రిగానీ!" అంటూ ఎగతాళి చేసి, "రాజాశ్రయం పొందితే నీ కష్టాలు కడతేరుతాయ"ని హితవు పలికిన శ్రీనాథ పండితవర్యునికి, రాజులకు రాజైన ఆ దశరథరాముని అండ ఉంటే ఒక్కడికేమిటి వందల మందికి తిండిపెట్టవచ్చని చెప్పిన వాడు పోతన. ఇంట్లో గంజి కూడా కరవైన స్థితిలో అతిథులకు పంచభక్ష్య పరమాన్నాలతో విందారగింపజేసి శ్రీరాముని వైభవాన్ని చాటిన భక్తశిఖామణి ఆ పోతనామాత్యుడు.

రాజాస్థానంలో కీర్తనలు పాడుకుంటూ సకల భోగాలతో జీవితాన్ని హాయిగా గడపమని కోరిన రాజుతో 'అఖిల జగాలకు ఆదిదేవుడైన ఆ వేంకటేశ్వరుని కన్నా పెద్ద దిక్కు వేరే లేరు' అని రాజాశ్రయాన్ని తిరస్కరించి తిరుమలేశుని సన్నిధిలో తరించిన పదకవితాచార్యుడు అన్నమాచార్యుడు.

ఇలా ఎంత మంది మహాత్ముల జీవిత గాథలను చదివినప్పటికీ, దివ్యపురుషుల ప్రబోధాలను విన్నప్పటికీ మన మీద అర్జునుడి ప్రభావం కన్నా దుర్యోధనుడి ప్రభావమే అధికం. ఎందుకంటే, 'ఒక్కటి' లాంటి భగవంతుణ్ణి విస్మరించి, 'సున్న'ల్లాంటి ప్రాపంచిక వైభోగాల కోసం పరుగులు పెడుతున్నాం. కళ్ళకు కనిపించే ధన కనక వస్తు వాహనాలు; పాండిత్య పరిజ్ఞానం; మందీ మార్బలం; గౌరవ హోదాలు మొదలైనవాటికి సులభంగా ఆకర్షితులమవుతున్నాం. అందువల్లనే జీవన కురుక్షేత్రంలో ఎనలేని వెతలను అనుభవిస్తున్నాం. అలా కాకుండా శ్రీరామకృష్ణులు బోధించినట్లు ముందు భగవంతుణ్ణి ఆశ్రయించగలిగితే, ఆ తరువాత కలిగే ప్రాపంచిక వైభవాల వల్ల ఎలాంటి అహంకారమూ జనించదు. ఎందుకంటే అంతా ఆ భగవంతుని అనుగ్రహమే అన్న శరణాగతి భావం కలుగుతుంది. దుర్యోధనుడు ప్రాపంచిక వైభవాలకై ప్రాకులాడడం వల్ల అంతా తన ప్రతిభే అన్న అహంకారంతో నాశనమయ్యాడు.

కాబట్టి మహాత్ములు చూపిన బాటలో పయనించి, ముందు భగవంతుణ్ణి మన హృదయ క్షేత్రంలో ప్రతిష్ఠిద్దాం. అప్పుడు మన జీవన క్షేత్రం ఓ ధర్మక్షేత్రంగా మారి శాంతి పంటల్ని పండిస్తుంది. మనల్ని విజయపథంలో నడిపిస్తుంది. ❖




వికాస మంత్రాలు

– స్వామి పార్థసఖానంద

దుఃఖం

1. దుఃఖం మనిషిని ఆలోచించేట్లు చేస్తుంది; ఆలోచన మనిషిలో వివేకాన్ని కలిగిస్తుంది; వివేకం మనిషిని ఉన్నత స్థితికి తీసుకెళ్తుంది.
2. దుఃఖం సోమరితనానికి తోబుట్టువు. దుఃఖానికి కారణం ఏమిటంటే, మనం ఆనందంగా ఉన్నామా? లేదా? అని ఆలోచించే తీరిక ఉండడమే. చీకూ చింతల్ని అలుపు లేని శ్రమలో ముంచేయడం కన్నా ఆనందం మరొకటి ఉండదు.



3. కొన్ని మందుల సీసాలపై.. 'వాడే ముందు బాగా గిలకరించండి' అని రాసి ఉంటుంది. భగవంతుడు కూడా మనల్ని బాగా కుదిపేసిన తరువాతే పనికి వచ్చే విధంగా తయారుచేస్తాడు.

విమర్శలు

1. దుర్విమర్శ అయితే పక్కన పెట్టండి.
   అది అబద్ధం అయితే అసహనానికి లోనుకాకండి.
   అది అజ్ఞానజనితం అయితే హాయిగా నవ్వుకోండి,
   వీటిలో ఏదీ కాకపోతే, ఆ విమర్శ నిజం.
   దాని నుండి నేర్చుకోండి.
2. ప్రశంసించే హృదయం ఉన్నవాడికే విమర్శించే హక్కు ఉంటుంది.
3. ఎవరైనా విమర్శించగలరు, నిందించగలరు, ఫిర్యాదులు చేయగలరు; కానీ అర్థం చేసుకునేందుకు, క్షమించేందుకు సహృదయం, స్వయం నియంత్రణలు కావాలి.

"మనం విమర్శల నుండి
తప్పించుకోవాలంటే
ఏమీ చేయకూడదు,
ఏమీ మాట్లాడకూడదు.
ఒక్క మాటలో చెప్పాలంటే..
బతికున్నా చచ్చినట్లే ఉండాలి."



4. ఏదేమైనా ప్రశంసల విషయంలో ఉదారంగా వ్యవహరించండి. కానీ విమర్శల విషయంలో మాత్రం ఆచి తూచి అడుగేయండి.

"ఆనందం అనేది
సులభమైన పనులు
చేయడం ద్వారా రాదు.
మన సర్వశక్తిని
వినియోగించి, కష్టమైన
పనుల్ని సాధించిన
తరువాత పొందే తృప్తి
నుండి వచ్చేదే నిజమైన
ఆనందం."



ఆనందం

ఓ గంట పాటు ఆనందం కావాలంటే ఓ కునుకు తీయండి.

ఓ రోజు పాటు ఆనందం కావాలంటే కొత్త వస్తువుల్ని కొనండి.


ఓ నెల పాటు ఆనందం కావాలంటే సెలవుపై వెళ్ళండి.

ఓ సంవత్సరం పాటు ఆనందం కావాలంటే తాతల ఆస్తిని పంచుకోండి.


జీవితాంతం ఆనందం కావాలంటే ఎవరికైనా సాయం చేయండి.


కానీ శాశ్వతమైన ఆనందం కావాలంటే ఆత్మజ్ఞానాన్ని పొందండి.

(...19వ పేజీ తరువాయి)




ఐస్ హౌస్‌లో శశి మహరాజ్ గురుదేవుల చిత్రాన్ని ప్రతిష్ఠించి పూజించసాగాడు. 1898లో గురుదేవుల జయంత్యుత్సవాన్ని చెన్నైలో మొట్టమొదటిసారిగా జరిపారు.





1902 జూలై 4వ తేదీ రాత్రి ధ్యానంలో ఉన్న శశి మహరాజ్‌కు స్వామీజీ కనిపించి, 'శశీ! నా దేహాన్ని ఊసివేశాను' అన్నారు. మర్నాడు బేలూరు మఠం నుండి స్వామీజీ మహాసమాధి పొందిన వార్త వచ్చింది.

14 శశి మహరాజ్ కాయగూరలు తరుగుతున్నప్పుడు కూడా బ్రహ్మచారులకు వేదాధ్యయన తరగతులు నిర్వహించేవారు.





1906 ఏప్రిల్‌లో ఉష్ణోగ్రత అత్యధికంగా ఉండడంతో రాత్రి 11 గంటల సమయంలో శశి మహరాజ్ పూజామందిరంలోకి వెళ్ళి గురుదేవుల చిత్రానికి విసనకర్రతో విసరసాగారు.

16 ఐస్ హౌస్‌లో శశి మహరాజ్ నుండి మార్గదర్శకత్వం పొందిన తరువాతనే స్వాతంత్ర్యోద్యమంలో వి.ఓ. చిదంబరం పిళ్ళై ముమ్మరంగా పాల్గొన్నారు.



17



రంగూన్‌లోని స్వర్ణ పగోడాలోని బౌద్ధాలయంలో శశి మహరాజ్ చాలాసేపు ధ్యానంలో లీనమైపోయినప్పుడు బౌద్ధ భిక్షువులు ఆయనను పువ్వులతో ఆరాధించారు.

18 శశి మహరాజ్ కార్యకలాపాల్లో కొండంత అండగా నిలచిన రామస్వామి అయ్యంగార్ 1905 ఫిబ్రవరి 17వ తేదీన పేదవిద్యార్థులకై చెన్నైలో 'రామకృష్ణ స్టూడెంట్స్ హోమ్'ను నెలకొల్పారు.



19



1907లో శ్రీరామకృష్ణ మఠాన్ని చెన్నైలోనే ఐస్ హౌస్ నుండి మైలాపూర్ ప్రాంతానికి తరలించారు.

20



1908లో స్వామి బ్రహ్మానందజీ చెన్నైకి వచ్చారు. తరువాత మదురైకి వెళ్ళి మీనాక్షి అమ్మవారిని దర్శించినప్పుడు ఆయన పారవశ్య స్థితిని పొందారు. అప్పుడు శశి మహరాజ్ ఆయనను పొదివి పట్టుకున్నారు.

21



శ్రీరామానుజుల జీవిత చరిత్రను శశి మహరాజ్ వంగభాషలో రచించారు.


22
ఒకసారి గురుదేవుల జయంతి ఉత్సవ సందర్భాన్ని పురస్కరించుకుని అన్నదానం చేశారు.
పంక్తి మధ్యలో శశి మహరాజ్ పారవశ్య స్థితిలో అలాగే నిలబడిపోయారు. అప్పుడు ఆయన జీవుల్లో శివుణ్ణి దర్శించారు!
23
ఉపన్యాసానికి తిరుచ్చి వెళ్ళినప్పుడు యువకులు శశి మహరాజ్‌ను బండిలో ఆసీనులను చేసి, తామే బండిని లాగుతూ తీసుకువెళ్ళారు.
24
చెన్నై మఠం కట్టడంలో బీటలు ఏర్పడి వాన నీరు కారుతున్నప్పుడు శశి మహరాజ్ గురుదేవుల చిత్తరువుకు గొడుగు పట్టుకుని రాత్రంతా అలాగే కూర్చొన్నారు.
25
మాతృమూర్తి శ్రీశారదాదేవి 1911లో చెన్నైకి విచ్చేశారు.
26
బెంగుళూరులోని బసవన్‌గుడిలో ఉన్న రామకృష్ణ మఠంలో మాతృదేవి శ్రీశారదాదేవి ఒక చిన్న గుట్ట మీద ధ్యాన మగ్నులయ్యారు. అప్పుడు శశి మహరాజ్ మాతృదేవిని 'సర్వమంగళ మాంగళ్యే...' అని స్తుతిస్తూ ప్రణమిల్లారు.


27 శశి మహరాజ్ ఏర్పాటుతో 108 బంగారు బిల్వదళాలతో మాతృదేవి రామేశ్వరంలో రామనాథస్వామిని అర్చించారు.



28 దాదాపు 15 ఏళ్ళు దక్షిణాది అంతా పలు చోట్ల రామకృష్ణ మఠాలు నెలకొల్పడానికి స్వామి రామకృష్ణానంద బీజం వేశారు. కఠోర శ్రమలకోర్చి ప్రచార కార్యక్రమాలలో తలమునకలవడంతో ఆయన ఆరోగ్యం దెబ్బతింది. అంతిమ కాలంలో కలకత్తాలోని ఉద్బోధన్‌కు శశి మహరాజ్‌ను తరలించారు.



29 శశి మహరాజ్ తుదిశ్వాస విడవడానికి మూడు రోజుల ముందు గురుదేవులు, మాతృదేవి, స్వామీజీలు ఆయనకు దర్శనమిచ్చి, ఆశీస్సులందించారు.



30 శశి మహరాజ్ అంతిమ రాత్రి మాతృదేవి మీద గిరీశ్ చంద్ర ఘోష్ రచించిన ఒక అద్భుత కవితను పులిన్ మిత్రా అనే గాయకుడు గానం చేశాడు. నాడే మాతృదేవి శశి మహరాజ్‌కు దర్శనమిచ్చారు.



"ఎంతటి క్లిష్ట పరిస్థితులలోనైనా మనల్ని సురక్షిత మార్గంలో నడిపించేవాడు ఆ భగవంతుడు ఒక్కడే! భగవంతుడే మనకు తల్లీ తండ్రీ. కాబట్టి, ఆయన మనకు హితం తప్ప మరేదీ చెయ్యడు. దీన్ని విశ్వసించు! అప్పడు మానసిక ప్రశాంతత చేకూరుతుంది. శ్రీరామకృష్ణులు మిమ్మల్ని ఉన్నత స్థితిలో ఉంచుదురు గాక!"

(స్వామి రామకృష్ణానంద 1897లో శ్రీనారాయణ అయ్యంగార్‌కి రాసిన ఉత్తరంలోని వాక్యాలివి.)



వార్తావాహిని





విద్యార్థులకు 'సంస్కార్' శిబిరం



హైదరాబాదు, రామకృష్ణ మఠంలోని 'వివేకానంద ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యూమన్ ఎక్సలెన్స్' విభాగం బాల బాలికలకు నెల రోజుల పాటు వేసవి శిక్షణ శిబిరాన్ని నిర్వహించింది. 'సంస్కార్' పేరిట నిర్వహించిన ఈ శిబిరంలో 1,500 మంది విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు. స్తోత్రాలు, భగవద్గీతా శ్లోకాల పారాయణం, భక్తి గీతాలు, నైతిక విలువల బోధన, యోగాసనాల్లో శిక్షణ పొందారు. రాష్ట్ర సాంస్కృతిక శాఖ సంచాలకులు డాక్టర్ రాళ్ళబండి కవితా ప్రసాద్ 2014 ఏప్రిల్ 27న ఈ శిబిరాన్ని ప్రారంభించారు. మే 25న జరిగిన ముగింపు కార్యక్రమానికి పురపాలక సంచాలకులు డాక్టర్ బి. జనార్ధన్ రెడ్డి, ఐ.ఏ.ఎస్. ముఖ్య అతిథిగా విచ్చేశారు. ముగింపు సభలో ఆయన మాట్లాడుతూ 'భారతీయ మేధస్సు విదేశాలకు వలసపోతుంది. భారతీయ సంస్కృతీ, సంప్రదాయాలను పరిరక్షించాల్సిన బాధ్యత నేటి యువతపై ఉంద'న్నారు. హైదరాబాద్ రామకృష్ణ మఠాధ్యక్షులు స్వామి జ్ఞానదానందజీ మాట్లాడుతూ 'ఆధునిక ప్రసార మాధ్యమాల వ్యామోహం నుండి బయటపడాలనీ, పిల్లలు ఈ శిబిరంలో నేర్చుకున్న విలువలు వారిలో మరింతగా పెంపొందేలా తల్లితండ్రులు కృషి చేయాల'నీ అన్నారు.

'సంస్కార్' శిబిరంలో బోధించిన విషయాలను హ్యూమన్ ఎక్సలెన్స్ సంచాలకులు స్వామి బోధమయానందజీ వివరించారు. ఈ 'సంస్కార్' శిబిరం ముగింపు రోజున బాలబాలికలు 'మాతృదేవోభవ పితృదేవోభవ' అంటూ తమ తల్లితండ్రులకు చేసిన పాదపూజ అందరి హృదయాల్ని కదిలించింది. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. ❖ నివేదిక: డి.ఎన్. సంజీవ


బాటసారులకు మజ్జిగ పంపిణీ

హైదరాబాదు, రామకృష్ణ మఠం ఆధ్వర్యంలో వేసవి తాపాన్ని తీర్చేందుకు బాటసారులకు ఉచిత మజ్జిగ పంపిణీ కేంద్రాన్ని మఠాధ్యక్షులు స్వామి జ్ఞానదానందజీ 2014 ఏప్రిల్ 20న ప్రారంభించారు. ఈ సేవా కార్యక్రమం జూన్ 10వ తేదీ వరకు కొనసాగింది. సుమారు 50 రోజులపాటు నిర్వహించిన ఈ కేంద్రం ద్వారా దాదాపు 1,50,000 మందికి మజ్జిగ పంపిణీ జరిగింది.

నివేదిక: స్వామి సంశుద్ధానంద



గ్రంథ పరిచయం



శ్రీ దేవాదిదేవుని దివ్యాలయములు

(108 శ్రీవైష్ణవ దివ్యదేశములు)


ప్రచురణ : శ్రీ ఉడయవరు సేవాసమితి

వెల: రూ.300/-, పుటలు : 628

ప్రతులకు: రంగస్వామి

గాంధీనగర్, విజయవాడ

సెల్: 9392107246



పర్యావరణ ప్రాణప్రదం

(వ్యాస కదంబం)

సంపాదకులు : డా॥ గంటా జలంధర్ రెడ్డి

వెల: రూ.100/-, పుటలు : 312

ప్రచురణ : కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్

బంజారాహిల్స్, హైదరాబాదు

ప్రతులకు: ప్రముఖ పుస్తక దుకాణాల్లో లభించును.

సెల్: 96769 57000/666

Printed and published by **Swami Jnanadananda** owned by Ramakrishna Math Trust
and printed at Kala Jyothi Process, 1-1-60/5, RTC Cross Roads, Musheerabad, Hyderabad - 500 020
and published at Ramakrishna Math, Domalguda, Hyderabad - 500 029. **Editor: Swami Parijneyananda**

Vol.71-7, Sri Ramakrishna Prabha (Telugu Monthly) July 2014, Regd. with the Registrar of Newspaper for India Under No.1120/57. Postal Registration No. HD-1071/2013-15. Licensed to Post Under WPP : AP/CPMG/HC-13/WPP/2013-14. Date of Publication : 18 June 2014



భగవన్నామపానం

మద్యానికి బానిసైన కాళీపదఘోష్ ఒకసారి శ్రీరామకృష్ణుల వద్దకు వెళ్ళాడు. అతణ్ణి చూడగానే గురుదేవులు 'ఇతడు పన్నెండు సంవత్సరాలు భార్యను నానా యాతనలు పెట్టాడు' అని అన్నారు.

గురుదేవుల మాటలువిన్న కాళీపదఘోష్ ఉలిక్కిపడ్డాడు. ఆ తరువాత గురుదేవులు 'నీకు ఏం కావాలి?' అని అతణ్ణి అడిగారు. వెంటనే అతడు ఏమాత్రం సంకోచించకుండా 'నాకు కాస్త మద్యం ఇవ్వండి' అని అడిగాడు. అందుకు గురుదేవులు 'సరే ఇస్తాను. కానీ నేనిచ్చే మద్యం మత్తును నువ్వు తట్టుకోలేవు' అని అన్నారు. ఆ మాటలు విన్న ఘోష్ బ్రిటన్‌లో తయారైన మద్యం అనుకొని 'ఫరవాలేదు, వెంటనే ఇవ్వండి' అని అడిగాడు.

'నువ్వు ఈ మద్యాన్ని రుచిచూస్తే ఎన్నటికీ మరచిపోలేవు' అంటూ గురుదేవులు అతణ్ణి స్పృశించారు. శ్రీరామకృష్ణుల దివ్యస్పర్శతో కాళీపదుడు ఆనందపారవశ్యంతో విలపించసాగాడు. అప్పటి నుండి గురుదేవుల భక్తుడై తన జన్మను సార్థకం చేసుకున్నాడు.❖

ఆధ్యాత్మిక అమృతవాహిని

శ్రీ రామకృష్ణ ప్రభ

ఆగస్టు 2014

వెల: ₹10



సుబోధ

భక్తుడు: నాటకంలో వేశ్యలు నటిస్తున్నారు. చైతన్య, నిత్యానందుల వంటి పాత్రల నన్నింటినీ వారే పోషిస్తున్నారు!

శ్రీరామకృష్ణులు: నేను వారిని జగజ్జనని స్వరూపిణులుగానే గాంచుతాను. వాళ్ళు చైతన్య మహాప్రభుగా నటిస్తే తప్పేమిటి? కొయ్యతో చేసిన సీతాఫలాన్ని చూసినప్పుడు నిజమైన సీతాఫలం జ్ఞాపకం వస్తుంది కదా!



ఒకసారి ఓ భక్తుడు దారిన పోతున్నప్పుడు ఒకచోట కొన్ని తుమ్మచెట్లను చూశాడు. వాటిని చూడగానే శ్యామ సుందర ఆలయపు తోటలో వాడే పార చేతిపిడిని ఈ చెట్టు కలపతోనే చేశారన్న విషయం అతడికి జ్ఞాపకం వచ్చింది. దానితో పాటు కృష్ణుడూ జ్ఞాపకం వచ్చాడు.

బెలూన్ ఎగురవేయడం చూపడం కోసం నన్ను కలకత్తా మైదానానికి పిలుచుకొని వెళ్ళారు. అక్కడ ఒక ఆంగ్లేయ బాలుడు త్రిభంగిగా చెట్టుకు ఆనుకొని నిలబడి ఉన్నాడు. అతణ్ణి ఆ స్థితిలో చూడగానే నాకు శ్రీకృష్ణుని ఉద్దీపన కలిగింది, అట్లే సమాధిమగ్నుడనయ్యాను.

కారుమేఘాన్నో, నెమలి కంఠాన్నో చూడగానే రాధకు, శ్రీకృష్ణుని ఉద్దీపన కలిగి బాహ్యస్మృతిని కోల్పోయేది.

భగవంతుణ్ణి పొందాలంటే మంచి సంస్కారం ఉండాలి. తపస్సు చేసి ఉండాలి. అది ఈ జన్మలోనే కావచ్చు, లేక పూర్వజన్మలోనైనా కావచ్చు.

వస్త్రాపహరణ సమయంలో ద్రౌపది ఆర్తితో ఎలుగెత్తి ప్రార్థించడం విని శ్రీకృష్ణుడు ఆమెకు దర్శనమిచ్చాడు; ఆమెతో, 'నువ్వు ఎవరికైనా ఎన్నడైనా వస్త్రం ఇచ్చి ఉన్నావా? జ్ఞాపకం చేసుకో. ఇచ్చి ఉంటే నీ మానం సంరక్షింపబడుతుంది' అన్నాడు. అందుకు ద్రౌపది, 'అవును, జ్ఞాపకం ఉంది. ఒక ముని నదిలో స్నానం చేస్తూ ఉండగా ఆయన కౌపీనం ప్రవాహంలో కొట్టుకు పోయింది. నేను నా వస్త్రాన్ని చింపి ఆయనకు ఇచ్చాను' అన్నది. అది విని శ్రీకృష్ణుడు, 'అలా అయితే నీకేమీ భయం లేదు' అన్నాడు.

నిజమైన భక్తుడు ఏ కోర్కెనూ కోరడు; అతడు పరిశుద్ధమైన భక్తినిమ్మనే ప్రార్థిస్తాడు. ఎటువంటి శక్తులనూ, సిద్ధులనూ అతడు కోరడు. ❖

శ్రీరామకృష్ణ ప్రభ
రామకృష్ణ మఠం, దోమల్‌గూడ, హైదరాబాదు-500 029
ఫోన్: 040-27667799, సెల్: 8801849494
E-mail : sriramakrishnaprabha@gmail.com
నిర్వాహక సంపాదకులు: స్వామి జ్ఞానదానంద
సంపాదకులు: స్వామి పరిజ్ఞేయానంద

సురభి

నాకు (స్వామి అంబానంద) 1914 సెప్టెంబర్ 19న మొట్టమొదటిసారి మాతృమూర్తి శారదాదేవిని దర్శించుకునే భాగ్యం కలిగింది. మాతృమూర్తి వద్ద మంత్రదీక్ష తీసుకోవాలన్న కోరిక కలిగింది. మాతృదేవి నాకు శ్రీరామకృష్ణుల పవిత్ర నామాన్ని ప్రసాదించారు. వేళ్ళతో జపం ఎలా చేయాలో చేసి చూపించారు. గురుదేవుల మంత్రం ఇచ్చిన తరువాత 'నీ కులదైవం ఎవరు?' అని మాతృదేవి అడిగారు. తెలియదని చెప్పినప్పుడు మాతృదేవి కాసేపు కళ్ళు మూసుకొని ధ్యానం చేశారు. తర్వాత కళ్ళు తెరచి, 'నీ కులదైవం కాళికాదేవియే. కనుక ఆమె పవిత్రనామం కూడా జపం చేయి' అంటూ కాళీ మంత్రం కూడా ప్రసాదించారు. నేను మా సొంత ఊరు వెళ్ళి కుటుంబ పెద్దలను కులదైవం గురించి అడిగినప్పుడు కాళికాదేవియే కులదైవం అనీ, ఆమె చిహ్నంగా ఒక కత్తిని పూజిస్తూ వస్తున్నట్లు తెలిసింది.

మంత్రదీక్ష అయిన తరువాత మాతృదేవికి సాష్టాంగ ప్రణామాలను అర్పిస్తూ 'నా శిరస్సుతో అమ్మ పాద పద్మాలను స్పృశిస్తే నా జన్మ ధన్యమవుతుంది' అని మనస్సులో అనుకున్నాను. అలా నేను తలచగానే మాతృదేవి తమ పాదపద్మాలను ముందుకు చాపారు. అప్పుడు నా శిరస్సుతో అమ్మ పాదపద్మాలను స్పృశించాను.

నాకు పరిశుద్ధమైన భక్తిని ప్రసాదించమని అమ్మను అర్థించడానికి వెళ్ళాను. మాతృదేవికి సాష్టాంగ ప్రణామాలు అర్పిస్తుండగా ఒక పువ్వు తీసి నా తల మీద ఉంచి, 'నువ్వు కోరింది గురుమహరాజ్ తప్పక ప్రసాదిస్తారు' అని ఆశీర్వదించారు. మాతృదేవి అనురాగపూరిత వాక్కులు నా మనస్సుపై చెరగని ముద్ర వేశాయి.

కొన్ని సంవత్సరాలు గడచిపోయాయి. అమ్మకు కొంత డబ్బు పంపించి, కలకండ కొని గురుదేవులకు నివేదన చేసి కొద్దిగా ప్రసాదాన్ని నాకు పంపించమని అడగాలనే ఆలోచన నాలో కలిగింది. కానీ ఈ విషయాన్ని నేను పూర్తిగా మరచిపోయాను. అనుకోకుండా ఒకరోజు మాతృదేవి నుండి ఒక తపాలా కవర్ వచ్చింది. దాన్ని విప్పి చూస్తే అందులో కలకండ ప్రసాదం ఉంది. నా ఆనందాశ్చర్యాలకు ఎల్లల్లేవు. భక్తుల కోరికలను మాతృదేవి నెరవేరుస్తారనడానికి ఇంతకన్నా నిదర్శనం ఇంకేముంటుంది! ❖



ఆధ్యాత్మిక అమృతవాహిని
శ్రీ రామకృష్ణ ప్రభ
సంపుటం: 71 సంచిక: 8 ఆగష్టు 2014



శ్రీ గణేశ ప్రార్థన

తుండము నేకదంతమును దోరపు బొజ్జయు వామహస్తమున్
మెండుగ మ్రోయు గజ్జెలును మెల్లని చూపులు మందహాసమున్
కొండొక గుజ్జురూపమున కోరిన విద్యలకెల్ల నొజ్జయై
యుండెడి పార్వతీ తనయ ఓయి గణాధిప నీకు మ్రొక్కెదన్।


సూక్తి సౌరభం

తనకు లేనినాడు దైవంబు దూరును
తనకు గల్గెనేని దైవమేల?
తనకు దైవమునకు దగులాట మెట్టిదో
విశ్వదాభిరామ వినుర వేమ.


“ఓ వేమా! మనిషి తనకు ఏమీ లేనప్పుడు దేవుణ్ణి నిందిస్తాడు. తనకు అన్నీ ఉన్నప్పుడు దేవుణ్ణి మరచిపోతాడు. ఇలాంటి స్వభావమున్న మనిషికీ, దేవునికీ మధ్య సంబంధం ఎలాంటిదో కదా!”

తడ వోర్వక యొడలోర్వక
కడువేగం బడచిపడిన గార్యంబగునే
తడవోర్చిన నొడలోర్చిన
జెడిపోయిన కార్యమెల్ల జేకురు సుమతీ!

“ఓ సుమతీ! ఆలస్యమూ, శారీరక శ్రమ కలిగినప్పుడు తొందరపడినట్లయితే ఏ కార్యమూ సఫలం కానేరదు. అందువల్ల అలాంటి పరిస్థితుల్లో తొందరపడకుండా ఓర్పుతో వ్యవహరిస్తే చెడిపోయిన కార్యమైనా సఫలమవుతుంది.”



శ్రీరామకృష్ణ ప్రభ శాశ్వత నిధి





ఆధ్యాత్మిక జ్ఞానాన్ని పంచి పెట్టేందుకు 'శ్రీరామకృష్ణ ప్రభ' కృషి చేస్తోంది. నిధుల కొరత లేకుండా ఈ జ్ఞానయజ్ఞం నిరంతరాయంగా సాగేందుకు 'శ్రీ రామకృష్ణ ప్రభ శాశ్వతనిధి'కి ధన దానం చేసి ప్రోత్సహించాల్సిందిగా కోరుతున్నాం. దాతల పేర్లు పత్రికలో ప్రచురిస్తాం.

మహారాజ పోషకులు......	రూ.	10,000/-, అంతకన్నా ఎక్కువ విరాళం ఇచ్చేవారు.
రాజ పోషకులు............	రూ.	5,000/-, అంతకన్నా ఎక్కువ విరాళం ఇచ్చేవారు.
పోషకులు.................	రూ.	1,000/-, అంతకన్నా ఎక్కువ విరాళం ఇచ్చేవారు.

	దాత పేరు / చిరునామా	రూ.
మహారాజ పోషకులు :	శ్రీ బెజ్జాల చిన్న నరసింహులు, ములాన్‌పేట, నంద్యాల, కర్నూలు జిల్లా (కీ॥శే॥ శింగరి సుబ్బయ్య, నరసమ్మగార్ల జ్ఞాపకార్థం)	40,001
మహారాజ పోషకులు :	శ్రీ బెజ్జాల చిన్న నరసింహులు, ములాన్‌పేట, నంద్యాల, కర్నూలు జిల్లా (కీ॥శే॥ బెజ్జాల బాలన్న, పార్వతమ్మగార్ల జ్ఞాపకార్థం)	35,000
మహారాజ పోషకులు :	శ్రీ బెజ్జాల చిన్న నరసింహులు & శ్రీమతి లీలావతి, ములాన్‌పేట, నంద్యాల, కర్నూలు జిల్లా	25,000
మహారాజ పోషకులు :	శ్రీ ఎస్. సత్యనారాయణ, కాకర్ల, అర్ధవీడు, ప్రకాశం జిల్లా	10,000
రాజ పోషకులు :	డాక్టర్ పన్నాల శ్యామసుందరమూర్తి, గుంటూరువారి తోట, గుంటూరు	5,500
రాజ పోషకులు :	శ్రీమతి కాదా పద్మావతమ్మ, రాజేంద్రనగర్, మహబూబ్‌నగర్ (కీ॥శే॥ కుంకుమపూడి కృష్ణవేణమ్మగారి జ్ఞాపకార్థం)	5,000
రాజ పోషకులు :	శ్రీ సి.హెచ్. చిదంబరరావు, రోడ్‌నెం.1, రామకృష్ణాపురం, హైదరాబాదు-500 035	5,000
రాజ పోషకులు :	ఒక భక్తుడు, మల్కాజ్‌గిరి, సికింద్రాబాదు	5,000
పోషకులు :	శ్రీ భాగి వేంకట రమణ, భాగివీధి, దొండపర్తి, విశాఖపట్నం	3,000
పోషకులు :	శ్రీమతి రమా మహేందర్ రెడ్డి, మల్లికార్జునకాలనీ, సికింద్రాబాదు (కీ॥శే॥ మహేందర్‌రెడ్డిగారి జ్ఞాపకార్థం)	2,000
పోషకులు :	శ్రీ కె. విజయ భాస్కర రెడ్డి, శ్రీనివాసనగర్, అనంతపురం	1,116
పోషకులు :	శ్రీమతి వి. జనాబాయి, నారాయణగూడ, హైదరాబాదు (కీ॥శే॥ వి. పాండురంగంగారి జ్ఞాపకార్థం)	1,116
పోషకులు :	శ్రీ ఎస్. సుభాష్, మెయిన్‌రోడ్, మెళియాపుట్టి, శ్రీకాకుళం జిల్లా	1,011

'శ్రీరామకృష్ణ ప్రభ' కానుక పథకం

యువతరానికి 'శ్రీరామకృష్ణ ప్రభ'ను మరింత చేరువ చేయాలని సంకల్పించాం. రాష్ట్రంలోని వివిధ పాఠశాలలు/ కళాశాలలు/ గ్రంథాలయాలకు పత్రికను పంపించడానికి మీ సహాయాన్ని కోరుతున్నాం. ఈ కానుక పథకం క్రింద చందా చెల్లించిన దాత పేరున (మీరు సూచించిన లేదా మేము ఎంపిక చేసిన) విద్యాసంస్థకు పత్రికను పంపుతాం. కానుక చందా రూ.1,500/- అంతకన్నా ఎక్కువ ఇచ్చిన దాత పేరు, విద్యాసంస్థ పేరు పత్రికలో ప్రచురిస్తాం.

దాత పేరు	విద్యాసంస్థ
శ్రీమతి డి. రాధామణి (కీ॥శే॥ కొల్లి సీతామహాలక్ష్మి, సుబ్రహ్మణ్యం గార్ల జ్ఞాపకార్థం)	వై.వి.ఆర్.ఎమ్.జడ్.పి. ఉన్నత పాఠశాల, మేదూరు, కృష్ణా జిల్లా
శ్రీ కంటిపూడి సోమరాజు, ఆల్ బ్యాంక్ కాలనీ, రాజమండ్రి	3 పాఠశాలలకు శ్రీరామకృష్ణ ప్రభ జీవిత చందాను స్పాన్సర్ చేశారు.

చందా వివరాలు		భారతదేశంలో	విదేశాలకు
విడి ప్రతి	:	₹ 10	-
సంవత్సర చందా	:	₹ 100	₹ 1,500
మూడు సంవత్సరాలకు	:	₹ 280	₹ 4,500
ఐదు సంవత్సరాలకు	:	₹ 450	₹ 7,500
ఇరవై సంవత్సరాలకు	:	₹ 1,500	₹ 22,000

గమనిక: డిమాండ్ డ్రాఫ్ట్, మనియార్డర్లలో **Ramakrishna Math, Hyderabad** అని వ్రాయాలి.

పంపవలసిన చిరునామా: **Sri Ramakrishna Prabha, Ramakrishna Math, Domalguda, Hyderabad - 500 029.**

చందాను ఆన్‌లైన్ **http://rkmath.org/srkp** ద్వారా చెల్లించవచ్చు.

లోపలి పేజీల్లో...

ఈ సంచికలోని రచయిత(త్రు)ల అభిప్రాయాలు వ్యక్తిగతమైనవి. సంపాదకులు గానీ, హైదరాబాద్ రామకృష్ణ మఠం గానీ వాటికి బాధ్యత వహించజాలరు. - సంపాదకులు

శ్రీరామకృష్ణ ప్రభ చందాదారులకు విన్నపం

ప్రియ పాఠకులారా!

- 'శ్రీరామకృష్ణ ప్రభ' పత్రిక కవరు మీద చిరునామాకు పైన మీ చందా నంబరు, కుడి వైపున మీ చందా గడువు ముగిసే నెల ఉంటాయి. మీ చందా గడువు పూర్తయ్యే నెలకు ముందుగానే సొమ్మును చెల్లించి చందాను పునరుద్ధరించుకోండి.
- మీ ఉత్తర ప్రత్యుత్తరాలన్నింటిలో తప్పనిసరిగా చందా నంబరు పేర్కొనాల్సిందిగా మనవి.
- మీ చిరునామా మారిన పక్షంలో 7వ తేదీ లోగా మాకు తెలియపరచినట్లయితే, వచ్చే నెల సంచిక నుండి మీ కొత్త చిరునామాకు పంపబడును.
- ప్రతీ నెల 26 లేదా 27వ తేదీల్లో పత్రిక పోస్ట్ అవుతుంది. మీకు పత్రిక 15వ తేదీ లోపుగా చేరనట్లయితే, వెంటనే మాకు తెలియజేయగలరు.

శ్రీరామకృష్ణ ప్రభ ద్వారా అవిచ్ఛిన్నంగా సేవలు అందించాలన్నదే మా ఆకాంక్ష. అందుకు మీ సహకారం కోరుతూ.... - సర్క్యులేషన్ మేనేజర్

'శ్రీరామకృష్ణ ప్రభ' పత్రిక చందాను ఆన్‌లైన్ http://rkmath.org/srkp ద్వారా చెల్లించవచ్చును.


పురాణగాథల

భారతీయ వాఙ్మయంలో పురాణగాథలు ఓ విశిష్ట స్థానాన్ని ఆక్రమించుకున్నాయి. ఏ గాథైనా మన జీవన గమనం సవ్యదిశలో సాగేలా మార్గనిర్దేశం చేసేందుకే! మన జీవిత పరమార్థాన్ని సాధించడానికి దివ్యసందేశాన్ని ప్రబోధించడానికే! ప్రతీ పురాణగాథలోనూ అంతర్గతంగా ఓ దివ్యసందేశం దాగివుంది. ఆ అంతర్గత సందేశాన్ని మన నిత్యజీవితంతో అన్వయించుకుంటే జీవనగమనం సమర్థంగా సాగుతుంది.

శ్రీకృష్ణాష్టమి, వినాయకచవితి సందర్భంగా శ్రీకృష్ణుని, వినాయకుని జీవన వృత్తాంతాల నుండి రెండు సంఘటనలను సోదాహరణంగా విశ్లేషించి, వాటి నుండి మన జీవనగమనానికి ఉపయుక్తమయ్యే సందేశాన్ని స్వీకరిద్దాం.

పుడమి జనులకెల్ల బుద్ధులిట్లుండు...: పరమేశ్వరుడు భాద్రపద శుద్ధ చవితి నాడు విఘ్నేశ్వరుణ్ణి గణాధిపతిగా నియమించాడు. ఆ శుభ సందర్భంలో ప్రజలు విఘ్నేశ్వరునికి కుడుములు, ఉండ్రాళ్ళు, అనేక పిండివంటలు సమర్పించారు. వినాయకుడు వాటినన్నింటినీ ఆరగించి, భుక్తాయాసంతో మెల్లగా నడుచుకుంటూ పార్వతీ పరమేశ్వరుల వద్దకు వెళ్ళి సాష్టాంగ ప్రణామాలు చేశాడు. అలా తల్లితండ్రులకు ప్రణామాలు అర్పిస్తున్నప్పుడు ఆయన ఉదరం భూమికి ఆనడం వల్ల చేతులు, కాళ్ళు గాలిలో తేలాయి. శివుని శిరస్సుపై నెలకొని ఉన్న శశాంకుడు ఈ దృశ్యాన్ని చూసి ఫక్కున నవ్వాడు. 'రాజదృష్టి పడిన రాళ్ళు కూడా నుగ్గవును' అన్న సామెత నిజమైనట్లు చంద్రుని దృష్టి పడి విఘ్నేశ్వరుని ఉదరం పగిలి మృతుడయ్యాడు.

పుత్రవియోగంతో శోకతప్తురాలైన పార్వతీదేవి చంద్రుణ్ణి చూసి 'పాపాత్ముడా! నీ మూలంగా నా పుత్రుడు మరణించాడు. ఇక నుండి నిన్ను చూసినవారు నీలాపనిందలకు గురవుదురు గాక!' అని శపించింది. పార్వతీదేవి శాపం వల్ల చంద్రుని చూసినవారందరూ నిందల పాలవుతున్నారు. అప్పుడు బ్రహ్మదేవుడు విఘ్నేశ్వరుణ్ణి బ్రతికించి పార్వతీదేవితో 'తల్లీ! చంద్రునికి నీవిచ్చిన శాపం వల్ల లోకంలో ప్రజలకు కీడు వాటిల్లుతోంది. దయచేసి ఆ శాపాన్ని ఉపసంహరించు' అని కోరాడు. అప్పుడు పార్వతీదేవి 'ఏ రోజున చంద్రుడు, వినాయకుణ్ణి చూసి పరిహసించాడో, ఆ రోజున చంద్రుణ్ణి చూసినవారు అపనిందలకు గురవుతారు' అని శాప ప్రభావం ఒక్కరోజుకే పరిమితమయ్యేటట్లు అనుగ్రహించింది.



మనం నిత్యజీవితంలో తరచూ చూస్తున్న సన్నివేశమే ఇది! ఎవరికైతే ఉన్నత పదవుల్లో ఉన్నవారి అండదండలుంటాయో; ఎవరైతే పలుకుబడి కలవారి నీడలో బ్రతుకుతారో; ధనాధికుల కనుసన్నలలో మెదులుతారో అలాంటివారు తమ స్థితిగతులను మరచిపోయి, అహంకారానికి లోనై ఇతరుల పట్ల అమర్యాదగా ప్రవర్తించడం, దంబాన్ని ప్రదర్శించడం, ఇతరులను పరిహసించడం లాంటివి చేస్తూ ఉంటారు. సునాయాసంగా లభించే వాటిని అనుభవిస్తూ జీవించేవారు ఇలాంటి దురహంకారంతో ప్రవర్తించి ఆపదలను కొనితెచ్చుకుంటారు.

చంద్రుడు కూడా ఈ కోవకు చెందినవాడే! దక్షుని శాపం నుండి తప్పించుకోవడానికి శశాంకుడు శివుణ్ణి శరణు వేడాడు. అప్పుడు పరమేశ్వరుడు కరుణించి దక్షుడి నుండి ఎలాంటి ఆపద కలగకుండా అతడికి తన శిరస్సుపై ఆశ్రయాన్నిచ్చాడు. కొన్నాళ్ళకు చంద్రుడు తన స్థితిగతులను మరచిపోయి, శివుని శిరస్సుపై కూర్చున్న అతడి కళ్ళు నెత్తికెక్కాయి. అందువల్ల సాక్షాత్తూ శివుని కుమారుడైన వినాయకుణ్ణే పరిహసించి, కష్టాలను కొనితెచ్చుకున్నాడు.

మహాత్ముల ఆశ్రయంలో ఉండడం వల్ల మనల్ని అందరూ అభిమానిస్తారు, గౌరవిస్తారు. అంతమాత్రాన మనమేదో మహాత్ములుగా ఎదిగిపోయామని అహంకరిస్తే ఆపదల పాలవక తప్పదు.

శ్రీరామకృష్ణుల మేనల్లుడు హృదయ్‌రామ్ జీవితం నుండి కూడా ఓ మంచి గుణపాఠాన్ని నేర్చుకోవచ్చు. హృదయ్‌రామ్ జీవనోపాధి కోసం కలకత్తా వచ్చినప్పుడు కాళికాలయంలో సహాయకుడిగా నియమితుడయ్యాడు. కొంతకాలానికి మధుర్‌బాబు అతణ్ణి శ్రీరామకృష్ణులకు పరిచర్యకునిగా నియమించాడు. కాలక్రమేణా అతడిలో అహంకారం చోటు చేసుకుంది. శ్రీరామకృష్ణులను దర్శించడానికి వచ్చినవారితో పరుషంగా మాట్లాడుతూ 'నా అనుమతి లేనిదే రామకృష్ణులను దర్శించడం సాధ్యం కాద'ని దురుసుగా ప్రవర్తించేవాడు. ఆఖరికి శ్రీరామకృష్ణుల పట్ల కూడా దురుసుగా ప్రవర్తించేవాడు. ఒకరోజు జయరామ్‌బాటి నుండి శారదాదేవి దక్షిణేశ్వరం వచ్చినప్పుడు ఆమెతో పరుషంగా మాట్లాడి, అవమానపరిచాడు. శారదాదేవి చెమ్మగిల్లిన కళ్ళతో అదే రోజు జయరామ్‌బాటికి తిరిగివెళ్ళిపోయారు. ఇదంతా గమనించిన శ్రీరామకృష్ణులు "చూడు! నువ్వు నన్ను అవమానించినా ఫరవాలేదు. దీనిలో (తన దేహాన్ని చూపిస్తూ) ఉన్న శక్తి ఆగ్రహిస్తే నువ్వు ఏదో విధంగా తప్పించుకోవచ్చు. కానీ ఆమెలో (శారదాదేవి) ఉన్న శక్తి ఆగ్రహిస్తే త్రిమూర్తులు కూడా నిన్ను రక్షించలేరు" అని హృదయ్‌ని హెచ్చరించారు. అయినప్పటికీ హృదయ్‌రామ్ ప్రవర్తనలో మార్పురాలేదు. మహాత్ములను ఇబ్బందులకు గురిచేస్తే అవి శాపంగా పరిణమించి కష్టాలపాలు చేస్తాయన్న సత్యం నిజమైంది. ఒకసారి హృదయ్ శాస్త్రవిరుద్ధమైన పూజ చేసి, ఆలయాధిపతి ఆగ్రహానికి గురయ్యాడు. అందువల్ల ఉద్యోగాన్ని కోల్పోయి తినడానికి తిండి లేక అష్టకష్టాల పాలయ్యాడు.

అందుకే మహాత్ములను పరిహసించేవారు కష్టాల పాలవుతారని యోగివేమన ఇలా హెచ్చరించారు:

చంద్రు నంత వాడె శాపంబు చేతను
కళల హైన్య మంద గలిసె గదర!
పుడమి జనుల కెల్ల బుద్ధులిట్లుండురా!
విశ్వదాభిరామ వినుర వేమ!

"సత్పురుషుల్ని పరిహసిస్తే అది శాపంగా పరిణమిస్తుంది. సాక్షాత్తూ గణాధిపతిని హేళన చేసిన చంద్రుని కళలు క్షీణించి కష్టాల పాలయ్యాడు. ఇక భువిలో మానవమాత్రుల సంగతి వేరే చెప్పనవసరం లేదు".



పరమేశ్వరుణ్ణి ఆశ్రయించిన చంద్రుడు, శ్రీరామకృష్ణుల సన్నిధిని పొందిన హృదయుడు తమ గతాన్ని మరచి, ఇతరులను అవమానపరచి చివరకు కష్టాలపాలయ్యారు. భగవంతుని సన్నిధిలో ఉన్నప్పటికీ అహంకారంతో ప్రవర్తించేవారిని ఆ భగవంతుడు కూడా రక్షించలేడని దీన్నిబట్టి అర్థమవుతుంది.

ప్రబోధం

అందువల్ల మహాత్ముల ఆశ్రయంలో ఉన్నామని అహంకరించకుండా వినమ్రతతో జీవించడం అలవరచుకోవాలి.

అపనిందలకు వెరవని అసమానధనులు: వినాయక చవితి నాటి రాత్రి చంద్రుణ్ణి చూసేవారు నీలాపనిందలకు గురవుతారన్న పార్వతీదేవి శాపం గురించి శ్రీకృష్ణునికి తెలుసు. అందువల్ల కృష్ణుడు ఆకాశం వైపు చూడకుండా ఆ రాత్రి ఆవుపాలు పితుకుతున్నాడు. అప్పుడు పాలకుండలో చంద్రుని ప్రతిబింబాన్ని చూశాడు. వెంటనే 'ఆహా! ఇప్పుడు నేను ఎలాంటి అపనిందలు ఎదుర్కోవలసి వస్తుందో' అని మనస్సులో అనుకున్నాడు. కొన్నాళ్ళ తరువాత సత్రాజిత్తు మహారాజు సూర్యుని అనుగ్రహంతో శమంతకమణిని సంపాదించాడు. ఒకసారి అతడు శ్రీకృష్ణుని దర్శనార్థమై ద్వారకా నగరానికి వెళ్ళాడు. అప్పుడు శ్రీకృష్ణుడు అతడి వద్ద ఉన్న శమంతకమణిని తనకిమ్మని అడిగాడు. అందుకు సత్రాజిత్తు ఎంతో మహిమగల శమంతకమణిని ఇవ్వడానికి అంగీకరించలేదు. మరికొంతకాలానికి సత్రాజిత్తు తమ్ముడు ప్రసేనుడు ఆ మణిని కంఠంలో ధరించి వేటకు వెళ్ళాడు. అక్కడ సింహం అతణ్ణి వధించి, మణిని తీసుకు పోయింది. అదే సమయంలో జాంబవంతుడు, సింహంతో పోరాడి ఆ మణిని పొంది, ఆడుకోవడానికి తన కుమార్తెకు ఇచ్చాడు.

ప్రసేనుడి మరణవార్త విన్న సత్రాజిత్తు, శ్రీకృష్ణుడు అడిగినప్పుడు తనకు శమంతకమణిని ఇవ్వలేదన్న కక్షతో అతడే నా సోదరుణ్ణి చంపి మణిని అపహరించాడంటూ అపనిందను దేశమంతా ప్రచారం చేశాడు. సత్రాజిత్తు ప్రచారం చేసిన అపనిందను విని శ్రీకృష్ణుడు భీతి చెందలేదు, నిరాశకు గురికాలేదు. అపనిందలు నిజం కాదని సమర్థించుకోవడానికి ప్రయాసపడలేదు. పోయిన మణిని తిరిగి సంపాదించి, తనకు కలిగిన అపనిందను తొలగించుకోవాలని తీర్మానించుకున్నాడు. అప్పుడు శ్రీకృష్ణుడు అరణ్యానికి వెళ్ళి ప్రసేనుడి మృతకళేబరాన్ని చూసి అక్కడ ఉన్న సింహపు పాద ముద్రల ఆధారంగా ముందుకు సాగుతూ అక్కడ నుండి ఎలుగుబంటి పాద ముద్రలను అనుసరించి ఓ గుహను చేరుకున్నాడు. అక్కడ జాంబవంతునితో ద్వంద్వయుద్ధం చేసి శమంతకమణిని తిరిగి సంపాదించాడు. అప్పుడు జాంబవంతుడు త్రేతాయుగంలో శ్రీరాముడితో ద్వంద్వ యుద్ధం చేయాలన్న తన కోరికను ఇప్పుడు శ్రీకృష్ణుడిగా వచ్చి అనుగ్రహించాడని గ్రహించాడు. శమంతకమణితో పాటు తన కుమార్తె జాంబవతిని శ్రీకృష్ణునికి అర్పించాడు. తదనంతరం శ్రీకృష్ణుడు, సత్రాజిత్తు దగ్గరకు వెళ్ళి జరిగినదంతా వివరించాడు. ఆ విధంగా శ్రీకృష్ణుడు తన మీద వచ్చిన అపనిందను నివృత్తి చేసుకున్నాడు.

స్వామి వివేకానంద పాశ్చాత్య దేశాలలో పర్యటించినప్పుడు ఆయనపై ఎన్నో అపవాదాలు, ఆరోపణలు, విమర్శలు ప్రచారమయ్యాయి. స్వామీజీ స్నేహితులు కూడా ఆయన్ని మోసగాడనీ, వంచకుడనీ, పాపిష్టి జీవనం గడుపుతున్నాడనీ ఆరోపణలు చేశారు. స్వామీజీ గురించి ప్రచారమైన ఆరోపణలు విన్న ఆయన సన్నిహితులు స్వామీజీతో సంబంధాలను తెంచుకున్నారు. ఇలా ఎన్ని ప్రతికూల పరిస్థితులు ఎదురైనప్పటికీ స్వామీజీ కలత చెందలేదు. మనోనిబ్బరాన్ని కోల్పోలేదు. ఎవరినీ ప్రతిఘటించలేదు. పైగా తనపై దుష్ప్రచారం చేసిన వారిని ఆ భగవంతుడు క్షమించాలంటూ తన మహోన్నత హృదయాన్ని ఆవిష్కరించారు. స్వామీజీని సన్నిహితంగా పరిశీలించినవారూ, ఆయన ప్రసంగాలు విన్నవారూ స్వామీజీ మహోన్నత వ్యక్తిత్వాన్ని గుర్తించారు. ఆయన ఓ దివ్యపురుషుడని అంగీకరించారు.

అలాంటి స్థితిలో మనమే ఉంటే ఎలా ప్రవర్తించేవాళ్ళం! మనపై వచ్చిన అపనిందలు వినగానే క్రుంగిపోతాం, ప్రతిఘటించడానికి ప్రయత్నిస్తాం. బలహీన మనస్కులమైతే ఆత్మహత్యలకు పాల్పడడానికి కూడా వెనుకాడం. అందుకే అబ్రహాం లింకన్ "The depth of your character is revealed in the way you respond to situations you dislike - ప్రతికూల పరిస్థితులు ఎదురైనప్పుడు ప్రతిస్పందించే తీరు మన నిజమైన వ్యక్తిత్వాన్ని బయటపెడుతుంది" అని అంటారు. కాబట్టి అపనిందలు, ఆపదలకు వెరవకుండా శ్రీకృష్ణుడిలా, స్వామీజీలా మానసిక స్థైర్యాన్ని పెంపొందించుకోవాలి. నిజాన్ని నిరూపించి అపనిందలను తొలగించుకోవాలి.

పైన వివరించిన రెండు సంఘటనలు ప్రబోధించిన దివ్యసందేశామృతాన్ని గ్రోలి మన జీవనగమనాన్ని సమర్థంగా సాగిద్దాం. జీవిత పరమార్థాన్ని సాధిద్దాం. ❖


నదిలో నీరు కొన్ని చోట్ల సుడిగుండాల్లో తిరుగుతూ, వాటిని దాటి ప్రవహిస్తుంది. అలాగే భక్తుడు నిరాశ, దుఃఖం అనే సుడుల్లో చిక్కుకున్నప్పుడు వాటిని అధిగమించి ముందుకు సాగాలి! -శ్రీరామకృష్ణులు

గోరుముద్ద - స్వామి సుప్రియానంద

భారతీయత

ప్రతి దేశానికీ ఒక సంస్కృతి, చరిత్ర, ఆచార-వ్యవహారాలు, రీతి-రివాజు ఉంటాయి. సంస్కృతి అనేది ఒక జీవధార. అది ఒక జాతి పురోగమనానికి దిక్సూచి. ఈ దిక్సూచిని విస్మరిస్తే అది జాతి పతనానికి దారితీస్తుంది.

మనదేశానికి ఉన్న ఘనమైన చరిత్ర - శివాజీ, రాణాప్రతాప్ లాంటి పరాక్రమశీలురు; అశోకుని వంటి అహింసావ్రతుడు; బుద్ధుడు, ఆదిశంకరాచార్యులు, శ్రీరామకృష్ణుల వంటి మహాత్ముల ఆధ్యాత్మిక ఘన వారసత్వం; రామాయణం, మహాభారతం, వేదాలు, వేదాంగాలు, ఉపనిషత్తుల వంటి ఉత్తమ గ్రంథాలు; భాస్కరుడు, వరాహమిహిరుడు లాంటి గొప్ప శాస్త్రవేత్తల ఆవిష్కరణలు... ఇవన్నీ మరచిపోయాం.



ఇది 112 ఏళ్ళ క్రితం 1902 అక్టోబరు 7న నాగపూర్‌లోని మోరిస్ కళాశాలలో జరిగిన సంఘటన. ఆ కళాశాలలోని విద్యార్థులు క్రికెట్ ఆటలో బాగా రాణించినందుకు గాను కళాశాల యాజమాన్యం వారు ఆ విద్యార్థులకు బహుమతులివ్వాలని నిర్ణయించారు. బహుమతి ప్రదానం చేయవలసినదిగా స్వామి వివేకానంద శిష్యురాలైన సోదరి నివేదిత (మార్గరెట్ నోబుల్)ను ఆహ్వానించారు.

ఆ కళాశాలకు వెళ్ళిన సోదరి నివేదిత తన ఆవేదనను ఇలా వ్యక్తం చేశారు: "మీకు భారతదేశంలో ఎన్నో ఆటలున్నాయి. పరాక్రమాన్నీ, పౌరుషాన్నీ చాటే కత్తిసాము, కుస్తీపట్టు వంటి ఎన్నో ఆటలున్నాయి. స్వదేశీ ఆటలను నిర్లక్ష్యం చేసి విదేశీ ఆటలపై మీరు ఎందుకు మోజు చూపుతున్నారు?"

మార్గరెట్ నోబుల్ ఒక విదేశీయురాలు - ఐర్లాండ్ మహిళ అయినప్పటికీ భారతీయతను మనకు నూరిపోసింది. మనలో మన భారతీయత ఎప్పుడు సంతరించుకుంటుంది? మనం అలవరచుకోలేని ఈ గొప్ప వారసత్వాన్ని రానున్న తరాల వారికి ఎలా అందించగలం?

ప్రస్తుత పరిస్థితులకు అద్దం పట్టేలా ఎన్నడో స్వామి వివేకానంద చెప్పిన మాటలను ఒకసారి జ్ఞప్తికి తెచ్చుకుందాం...

"The child is taken to school, and the first thing he learns is that his father is a fool, the second thing that his grandfather is a lunatic, the third thing that all his teachers are hypocrites, the fourth that all the sacred books are lies! By the time he is sixteen he is a mass of negation, lifeless and boneless. And the result is that fifty years of such education has not produced one original man in the three Presidencies - బిడ్డ పాఠశాలలో మొదటి అంశంగా తన తండ్రి బుద్ధి హీనుడనీ; రెండవది తన తాత మతిలేనివాడనీ; మూడవది ఉపాధ్యాయులందరూ వంచకులనీ; నాలుగవది మన పవిత్ర గ్రంథాలన్నీ అసత్యాలనీ నేర్చుకుంటాడు. పిల్లవానికి 16 సంవత్సరాల వయస్సు వచ్చే సరికి నిరాశావాదిగా, నిశ్చేతనుడుగా, పిరికిపందగా రూపొందుతాడు. ఫలితంగా, ఈ యాభై సంవత్సరాల విద్యా విధానంలో మొత్తం దేశంలో సృజనాత్మకుడైన ఒక్క వ్యక్తి కూడా తయారు కాలేకపోయాడు."

కాబట్టి కేవలం సమాచారాన్ని మెదడులో దట్టించే విద్యకాదు మన పిల్లలకు అందించాల్సింది. మన భారతీయ సంస్కృతీ, సంప్రదాయాలను; నైతిక, ఆధ్యాత్మిక విలువలతో కూడిన విద్య అనే మన ఘనవారసత్వాన్ని అందించి వారిలో భారతీయతను నూరిపోయాలి. అందుకు పెద్దలందరూ సమాయత్తం కావాలి. ❖



రామకృష్ణ భక్తి సూత్రాలు

– స్వామి యతీశానంద

నారద భక్తి సూత్రాలు, శాండిల్య భక్తి సూత్రాలు భక్తియోగానికి సంబంధించిన ప్రామాణిక గ్రంథాలు. అయితే ఆధునిక తరంలో భగవదన్వేషకులకు అనువైన రీతిలో భక్తితత్త్వాన్ని బోధించారు శ్రీరామకృష్ణులు. ఈ నేపథ్యంలో 'శ్రీరామకృష్ణ కథామృతం' నుండి కొన్ని ఉపదేశాలను 'రామకృష్ణ భక్తి సూత్రాలు'గా సులభరీతిలో వివరించే ప్రయత్నం చేస్తున్నాం.

బౌద్ధగ్రంథాలు పాళీ భాషలో, బైబిల్ హీబ్రూలో, ఖురాన్ అరబ్బీ భాషలో రచించబడ్డాయి. అలాగే శ్రీరామకృష్ణుల ఉపదేశాలు వారి మాతృభాష బెంగాలీలో ఆవిష్కృతమయ్యాయి. అవతార పురుషుని ముఖతః వెలువడిన ఆ అమృతోప దేశాలను యథాతథంగా ఉట్టంకిస్తూ వ్యాఖ్యా నిస్తున్నాం. మహాశక్తిమంతమైన ఆ బోధనలను మననం చేసుకుంటూ కృతార్థులమవుదాం.

తాఁకే కే ఊ బోల్చే 'అల్లా';
కే ఊ 'గాడ్'; కే ఊ బోల్చే 'బ్రహ్మ';
కే ఊ 'కాలీ', కే ఊ బోల్చే
'రామ, హరి, జీశు, దుర్గా'.

ఆయనను కొందరు 'అల్లా' అంటారు. కొందరు 'గాడ్', కొందరు 'బ్రహ్మం' అంటారు. కొందరు 'కాళీ', కొందరు 'రామ, హరి, ఏసు, దుర్గ' అంటారు.

శ్రీరామకృష్ణ ఉవాచ: బ్రహ్మం ఒక్కటే, రెండు కాదు. బ్రహ్మాన్ని కొందరు అల్లా, కొందరు గాడ్, కొందరు కృష్ణుడు, కొందరు శివుడు అంటారు.

తటాకం ఒక గట్టు నుండి తీసుకున్న జలాన్ని హిందువులు 'నీరు' అనీ; మరొక గట్టు నుండి తీసుకున్న ముస్లింలు 'పానీ' అనీ; ఇంకొక గట్టు నుండి తీసుకున్న ఇంగ్లీషువారు 'వాటర్' అనీ అంటారు. పదార్థం ఒక్కటే! పేర్లు మాత్రం వేరు వేరు.

ఎన్ని మతాలో అన్ని మార్గాలు. అన్ని మతాలూ సత్యమైనవే. కాళీమందిరానికి రావటానికి పెక్కు మార్గాలు లేవూ? ఏ మతాన్ని ఆశ్రయించినా, భగవంతుణ్ణి చేరవచ్చు. మీలో కొందరు గుర్రబ్బండి, మరికొందరు పడవ ఎక్కి ఇక్కడకు వచ్చినట్లే కొందరు నడచి వస్తారు. ఎవరి వీలును బట్టి వారు వస్తారు. గమ్యం ఒక్కటే. కొందరు త్వరగా వస్తారు, కొందరు రావడం ఆలస్యమవుతుంది. భిన్న భిన్న మతాలను ఆశ్రయించి భగవంతుణ్ణి చేరవచ్చు.

డాబా ఎక్కడానికి ఎన్నో ఉపాయాలు. సిమెంటు మెట్లు, వెదురు నిచ్చెన మెట్లు, కాదంటే తాడు పట్టుకు పైకి ఎగబాకవచ్చు. ఏదో ఒకటి ఎంచుకోవాలి. సిమెంటు మెట్టుపై ఒక కాలు, నిచ్చెనపై మరొక కాలు పెడితే కుదరదు.

హిందువులు, ముస్లింలు, క్రైస్తవులు, శైవులు, వైష్ణవులు, దేవీ ఉపాసకులు, అలనాటి ఋషులు, బ్రహ్మసమాజం వారు – వీరందరూ ఒకే వస్తువును కోరుకొంటున్నారు. ఎవరికి ఏది సరిపడుతుందో తల్లి ఆ పదార్థమే వండుతుంది. తల్లి అందరినీ సమానంగా ప్రేమిస్తుంది.

నానా మత ధర్మాలూ ఆయన సంకల్పమే. అందరూ ఆయననే పిలుస్తున్నారు కదా! ద్వేషం, పగ ఎందుకు? భగవంతుడు సాకారమని కొందరు, కాదు నిరాకారమని మరికొందరు అంటారు. నేను ఏమంటానంటే, సాకారంలో నమ్మకం ఉంటే ఆ విధంగా చింతించండి. నిరాకారంలో నమ్మకం ఉంటే ఆ విధంగా చింతించండి. ఏ మతస్థులైనా ఆయననే ప్రార్థిస్తున్నారు. కనుక ఏ మతాన్నీ కించపరచవద్దు, అసహ్యించుకొనవద్దు.

ఉన్నది ఒక్కటే, రెండు లేవు. ఆర్తితో పిలిస్తే నిశ్చయంగా భగవంతుణ్ణి పొందుతారు. భగవంతుడు ఒక్కడే. పేర్లు వేర్వేరు. అదే జ్ఞానులకు బ్రహ్మం, యోగులకు ఆత్మ, భక్తులకు భగవంతుడు.

ఆదిశక్తి లీలామయి, సృష్టిస్థితి ప్రళయకారిణి. ఆమె పేరే కాళి. కాళియే బ్రహ్మం, బ్రహ్మమే కాళి. ఏ కార్యం చేయక, నిష్క్రియంగా ఉన్నట్లు భావిస్తే, అది బ్రహ్మం. సకల కార్యాలూ చేస్తున్నప్పుడు ఆమెను కాళీ లేదా శక్తి అంటారు. నామరూపాలలో భేదం అంతే.

అందరూ ఒకే సర్వేశ్వరుని ప్రార్థిస్తారు. అందరూ ఆయన వద్దకు చేరుతారు. ఒక్కొక్క మతానిది ఒక్కొక్క తోవ – అన్నీ భగవంతుని వైపే వెళ్ళుతున్నాయి. నదులు వివిధ దిక్కుల నుండి వచ్చి సముద్రంలో కలసినట్లు.

నీవు ఊసరవెల్లి కథ విన్నావా? ఒకడు బయటకు వెళ్తూ ఒక చెట్టుకొమ్మపై ఊసరవెల్లిని చూచాడు. 'నేనొక ఎర్రతొండను చూచాను' అని మిత్రులకు చెప్పాడు. మరొకడు వచ్చి 'ఆకుపచ్చని తొండను చూచాను' అన్నాడు. ఇద్దరూ తాము

(మిగతా 32వ పేజీలో...)

కుండలు, కూజాలు, మూకుళ్ళు వేర్వేరు ఆకృతుల్లో ఉంటాయి. కానీ అవన్నీ ఒకే మట్టితో తయారైనవి. అలాగే భగవంతుడు ఒక్కడే అయినా వివిధ నామరూపాలతో పూజింపబడుతున్నాడు. -శ్రీరామకృష్ణులు



ఆ దేవదేవుండు దిక్కు నాకు

-స్వామి జ్ఞానదానంద

అంపశయ్యపై భీష్మపితామహుడు అంతిమశ్వాస విడిచిపెడుతున్న క్షణాలవి... ఆ ఆఖరి ఘడియల్లో గాంగేయుడు నిష్కామ భావంతో, నిర్మలధ్యానంతో పీతాంబరధారి, పురాణ పురుషుడు, పుండరీకాక్షుడు అయిన శ్రీకృష్ణ పరమాత్మునిపై ఏకాగ్రబుద్ధిని సంధానించాడు. పరమానంద భరితుడై, సహజసిద్ధాలైన సంసారబంధాలను పరిహరించాలన్న ప్రీతితో ప్రత్యక్షసాక్షిగా నిలిచిన పరంధాముడిని ప్రస్తుతిస్తున్నాడు. ముల్లోకాలనూ మోహింపచేసే నీలవర్ణకాంతులతో, బాలభానుప్రభలతో ప్రకాశించే బంగారుచేలంతో, నల్లని ముంగురులతో, ముద్దులు మూటగట్టే ముఖారవిందంతో, అనురాగాలు చిందిస్తున్న ఆ అందాల కృష్ణుడు తన అంతరంగంలో నిరంతరం నిలిచిపోవాలని ఆకాంక్షిస్తున్నాడు. కురుక్షేత్ర సంగ్రామంలో గుర్రాల గిట్టలు లేపిన దుమ్ము కొట్టుకొని, రంగుమారి చెదరిన ముంగురులతోనూ, గమనవేగం వల్ల చిందిన చెమట బిందువులతో కూడా ముచ్చటగొలిపే ముఖం కలవాడై కిరీటిని గెలిపించాలనే కుతూహలంతో తన బాణాల దెబ్బలకు బాధపడుతూ కూడా విజయుడిని ప్రోత్సహించి పోరించిన ఆ మహానుభావుడిని మనస్సులో అవిశ్రాంతంగా ధ్యానిస్తున్నాడు. చివరకు...

కుప్పించి ఎగసిన కుండలంబుల కాంతి గగనభాగమెల్ల గప్పికొనగ
నురికిననోర్వక యుదరంబులోనున్న జగముల వ్రేగున జగతి కదల
చక్రంబుచేపట్టి చనుదెంచురయమున పైనున్న పచ్చనిపటము జార
నమ్మితినాలావు నగుబాటుసేయక మన్నింపుమని క్రీడి మరల దిగువ
కరికి లంఘించు సింహంబు కరణి మెరసి
నేడు భీష్ముని చంపుదు నిన్ను గాతు
విడువు మర్జున యనుచు మద్విశిఖ వృష్టి
దెరలి చనుదెంచు దేవుండు దిక్కు నాకు... అంటూ

ఆనాడు రణభూమిలో తన బాణపరంపరను భరించలేక నా మీదికి దూకే స్వామి వీరగంభీర స్వరూపం ఇప్పటికీ తనకు కన్నులకు కట్టినట్లు కనిపిస్తున్నదనీ, కృష్ణుడు కుప్పించి పైకెగిరినప్పుడు చెవి కుండలాల కాంతులు గగనమండలమంతా వ్యాపించాయనీ, ముందుకు దూకినప్పుడు బొజ్జలోని ముజ్జగాల బరువు భరించలేక భూమి కంపించిపోయిందనీ, చేతిలో చక్రాన్ని ధరించి అరుదెంచే వేగానికి పైనున్న బంగారు చేలం జారిపోయిందనీ, నమ్ముకున్న నన్ను నలుగురిలో నవ్వుల పాలు చేయవద్దనీ మాటిమాటికీ విజయుడు వెనక్కు లాగుతున్నా లెక్కచేయకుండా 'అర్జునా! నన్ను వదులు. ఈ రోజు భీష్ముని చంపి, నిన్ను కాపాడతాను' అంటూ ఏనుగుపైకి లంఘించే సింహంలా నాపైకి దూకిన గోపాలదేవుడే నాకు రక్ష' అని స్థిరచిత్తుడై మనస్సు ద్వారా, మాటల ద్వారా, చూపుల ద్వారా ఆ హృషీకేశుడినే హృదయంలో పదిలపరచుకొని నిశ్వాసాన్ని నిరోధించి ఆ గాంగేయుడు గోవిందుడిలో ఏకమయ్యాడు.

మహానుభావుని మదిలో చింతించుచూ... : మనమందరం కూడా ఆశల అంపశయ్యపైనే పవళిస్తూ ఉంటాం. కానీ మనం అయినవారిపై మమకారం చంపుకోలేక, వ్యామోహం తెంచుకోలేక వదలలేక, వదలలేక ప్రాణాల్ని విడిచేస్తూ ఉంటాం. కానీ ఆ మహానుభావుడు మాధవుడిని కళ్ళల్లో నిలుపుకుంటూ కన్నుమూయాలనుకుంటున్నాడు. అందుకే 'మది నావేశించు నెల్లప్పుడున్' అంటున్నాడు. మరణం ఇక అనివార్యమని తెలిశాక మామూలుగా ఉండడం...ఆ ఆఖరిక్షణాల్లో ఆత్మీయులు కాకుండా, అసలు ఉన్నాడో లేడోనని అరకొర విశ్వాసంతో పూజలు చేసిన భగవంతుడు స్మరణకు రావడం కష్టమే! కానీ జీవితానికి ఎలాంటి మరకలు అంటించక, మల్లెపువ్వులా మలచుకున్నవారు మలిసంధ్యను మాధవుడి పాదాలకు అర్పించిన పూమాలలా సమర్పించుకోగలరు; ఆయనలోనే లీనమవ్వగలరు. అందుకే శ్రీకృష్ణభగవానుడు...

అంతకాలే చ మా మేవ స్మరన్ ముక్త్వా కళేబరమ్ ।
యః ప్రయాతి స మద్భావం యాతి నా స్త్యత్ర సంశయః॥ *(గీత -8.5)*

'అవసాన కాలంలో ఎవరైతే నన్నే స్మరిస్తూ దేహాన్ని విడిచిపెడతారో, వారు నా స్థితిని పొందుతారు; నన్నే చేరుకుంటారు. ఇందులో సందేహం లేద'ని అభయమిస్తాడు.

ఇలా కన్నుమూసే వేళ ఆ కారుణ్యమూర్తే కళ్ళ ముందు కదలాలంటే, మన నిత్యజీవితంలో ఆ నీరజనాభుడు ఓ భాగమై

పోవాలి. సుఖాన్ని ఆయన ప్రసాదంగా, దుఃఖాన్ని ఆయన మహాప్రసాదంగా భావించుకొని ఆయననే ఆలంబనగా చేసుకొని జీవించాలి. ఆయన నిర్దేశించిన ధర్మమార్గంలో పయనించాలి. భీష్మాచార్యులు అలా తన బతుకును దిద్దుకున్నారు కనుకనే, సాక్షాత్తూ భగవానుడు కూడా ఆయన అనుమతి లేకుండా ఆయన ప్రాణాలను గ్రసించలేకపోయారు. ఇలాంటి పరిశుద్ధ భక్తులను పరికించినప్పుడు పరమాత్ముడు కూడా పులకించిపోతాడు.

శుద్ధుండై ప్రార్థించే...: లౌకికంగా ఎంత సంసార లంపటంలో కూరుకుపోయినా అంతరంగంలో మాత్రం ఆ దేవదేవుడే కొలువుండాలి. బాహ్యప్రపంచం దృష్టిలో భౌతికంగా భీష్ముడు కౌరవపక్షం వహించినా, ఒక భక్తుడిగా పూర్తిగా మనస్సును మాత్రం శ్రీకృష్ణ భగవానుడి పాదపద్మాల వద్దే అర్పించాడు. అందుకే...

ఒక సూర్యుండు సమస్తజీవులకు, తానొక్కక్కడై తోచు పో
లిక నే దేవుడు సర్వకాలము మహాలీలన్ నిజోత్పన్న జ
న్య కదంబంబుల హృత్సరోరుహములన్ నానా విధానూన రూ
పకుడై యొప్పుచునుండు నట్టి హరి నే ప్రార్థింతు శుద్ధుండనై...

'ఒకే ఒక సూర్యుడు సకల జీవరాసులలో ఒక్కొక్కరికి ఒక్కొక్కడుగా కనిపించే విధంగా తాను సృష్టించిన నానావిధ ప్రాణి సమూహాల హృదయ కమలాలలో నానా విధాలైన రూపాలతో సర్వకాల సర్వావస్థలలో తన లీలావిలాసంతో అలరారే భగవంతుడిని ప్రార్థిస్తున్నాను' అని అంటాడు.

ఈనాటికీ ఇలాంటి మనఃస్థితితో తామరాకుపై నీటిబొట్టులా ఈ లోకంలో జీవిస్తూ, తమను తాము పరమాత్ముడికి నివేదించుకుంటున్న పరమభక్తులు ఎందరో ఉన్నారు. ఉదాహరణకు న్యూఢిల్లీలో శ్రీరామకృష్ణులను ప్రాణప్రదంగా ఆరాధించే ఒక భక్తురాలు ఉండేవారు; ఆమె ఢిల్లీలోని రామకృష్ణ మఠానికి విధిగా వెళుతూ ఉండేవారు. ఆమె భర్త రక్షణ శాఖలో కార్యదర్శిగా పనిచేసేవారు. ఆవిడ ఓసారి వైద్యపరీక్షల నిమిత్తం ఆసుపత్రికి వెళ్ళినప్పుడు కేన్సర్ ఉన్నట్లు వైద్యులు నిర్ధరించారు. దేశవిదేశాల్లో ఎన్నో శస్త్రచికిత్సలు చేసినా, ఫలితం కనిపించలేదు. వైద్యులు కూడా ఆశలు వదిలేసుకున్నారు. తను అంత విషమపరిస్థితిలో ఉన్నా ఆమె ఎన్నడూ శ్రీరామకృష్ణులపై విశ్వాసాన్ని వీడలేదు. ఒకరోజు భర్త, పిల్లలు, సమీప బంధువులందరూ మంచం పక్కన కూర్చొని ఆమెకు సపర్యలు చేస్తూ ఉన్నారు. అప్పుడు ఆమె వారిని గదిలో ఉన్న శ్రీరామకృష్ణుల ఛాయాచిత్రాన్ని ఇమ్మని అడిగారు. ఆమె కోరిక మేరకు ఆ ఛాయాచిత్రాన్ని తెచ్చి ఇచ్చారు. ఆమె ఆ చిత్రాన్ని తన గుండెలపై పెట్టుకొని కళ్ళు మూసుకుంటూ, 'కొంతసేపు నేను గదిలో ఒంటరిగా ఉందామనుకుంటున్నాను. దయచేసి మీరంతా పక్క గదిలోకి వెళ్ళండి' అన్నారు. కొంత సమయం గడిచాక, బంధువులందరూ ఆమె గదిలోకి వెళ్ళి చూసే సరికి, చేతిలో శ్రీరామకృష్ణుల ఛాయాచిత్రాన్ని పట్టుకొని అలాగే ప్రాణాలు వదిలేసిన ఆమె పార్థివ దేహం కనిపించింది. పరమాత్ముడే పరమావధి అనుకుంటే ఇలాంటి అనాయాస మరణం సంభవిస్తుంది.

మలిసంధ్యలోనే మరపు...: దురదృష్టవశాత్తూ మనలో చాలామంది బయటకు ఎన్ని పూజలు చేసినా, తీర్థయాత్రలు జరిపినా అంతిమ ఘడియలు దరిచేరే సమయంలో మాత్రం ఇల్లూ, పిల్లల మీదకే మనస్సు లాగుతూ ఉంటుంది. 'చిలుక అంతా బాగున్నప్పుడు మాత్రం 'రామా, కృష్ణా' అంటూ వల్లె వేస్తుంది. కానీ, పిల్లి వచ్చి పట్టుకోగానే 'కీచు,కీచు'మంటుంది. అలాగే మనుషులు కూడా తీరిక వేళల్లో భగవంతుడు, వైరాగ్యం తదితరమైనవన్నీ పలుకుతూ ఉంటారు. మరణమాసన్నమయ్యే వేళ మాత్రం అన్నీ మరచిపోతారు' అంటారు శ్రీరామకృష్ణులు.

మహాభారతంలోనే చూస్తే సాక్షాత్తూ భగవానుడు వాళ్ళ మధ్య నడయాడినా భీష్ముడు, విదురుడు, కుంతి లాంటి కొద్దిమంది మినహా ధృతరాష్ట్రుడితో సహా ఇతరులెవ్వరికీ ఆఖరి సమయంలో ఆయన తలపుల్లోకి రాలేదు. జీవితమంతా ఎంతో సాధన చేస్తే తప్పా, భీష్ముడంతటి భాగ్యం మనకు లభించదు. అందుకే తనువు, మనస్సు మనకు సహకరించే వయస్సు నుంచే భగవంతుడిపై విశ్వాసాన్ని పెంచుకోవాలి; సంబంధిత సాధనలు చేయాలి; శరణాగతితో జీవించాలి. అలా భక్తిపరులై, ధర్మవర్తనులైన వారిని భగవంతుడు తన అధీనంలోకి తీసుకుంటాడు. అన్ని వేళలా కంటికి రెప్పలా కాపాడుకుంటాడు. ఊపిరితో ఉన్నప్పుడే కాదు, ఊపిరి వదిలేటప్పుడు కూడా మనల్ని తన చేతుల్లో నుంచి జారనివ్వడు. అందుకే 'తనను అర్పించుకున్న వానిని రక్షించడం భగవంతుని విధి. శరణుజొచ్చినవారిని భగవంతుడు దగ్గరే ఉండి రక్షిస్తూ ఉంటాడు' అంటారు భగవాన్ శ్రీరమణ మహర్షి. అలా అంపశయ్యపై ఆ సురనదీ తనయుడు శ్వాస విడిచిన వేళ దేవలోకంలోనూ, మానవలోకంలోనూ దుందుభులు ధ్వనించాయి; సాధుసంకీర్తనలు వినిపించాయి. సంధ్యా సమయంలో పక్షుల్లా ప్రియతములందరూ దుఃఖంతో మౌనం దాల్చారు. మనం కన్నుమూస్తే నలుగురికి అలా కాలం క్షణం సేపు ఆగిపోయినట్లనిపించాలి; గుండె బాధతో బరువెక్కాలి. పొలిమేరలో పెద్దదిక్కుగా నిలిచిన ఓ మర్రిమాను కూలి, ఊరు చిన్నబోయినట్లనిపించాలి. ❖

మనిషి విలువ మరణంలో వెలుగులోకి వస్తుంది; మనం ఎలా నడుచుకున్నామో అన్నది, నడక ఆపేసే సమయంలో తెలుస్తుంది. ధర్మబద్ధమైన జీవితానికి ఆ ధర్మాత్ముడైన భగవంతుడు ప్రసాదించే బహుమానమే అనాయాస మరణం! మలుపులెన్ని ఉన్నా మాధవుడి మరపు లేని నాడు పరాకన్న మాటే ఉండదు. ఇలా వెన్నెల్లో పూసిన సన్నజాజులు వేకువలో రాలిపోయినంత సహజంగా ఈ జీవన యవనిక నుంచి నిశ్శబ్దంగా నిష్క్రమించగలిగితే అంతకు మించిన భాగ్యం మరోటి లేదు. ఇలాంటి భాగ్యవంతులకు మరుజన్మ అన్న మాటే రాదు. ❖

ఓ కృష్ణా! నా మనస్సనెడి రాజహంస ఇప్పుడే నీ పాదపద్మములనెడి పంజరమున ప్రవేశించుగాక! ఎప్పుడో మరణ సమయమున నీ నామస్మరణ చేద్దామనుకోవడం వట్టి భ్రమ కదా! -ముకుందమాల

"ఒక వ్యక్తి తనను తాను అసహ్యించుకొంటున్నట్లయితే అదే పతనానికి హేతువు. పూర్వీకుల చరిత్రను అవమాన కరంగా భావిస్తే, ఆ జాతి అంతానికి చేరుకున్నట్లే!" అంటారు స్వామి వివేకానంద. గత వైభవాన్ని మర్చిపోయినంత కాలం మనమూ, మన దేశం స్తబ్ధతలో మునిగిపోతాం. అందుకే, మన ప్రాచీన సంస్కృతి గురించి తెలుసుకోవాలి. గడచిపోయిన సంగతులు తెలుసుకొంటూ, భవిష్యత్ మహత్కార్యాల సాధన వైపు నడవాలి. మన ప్రాచీన భారతీయ సంస్కృతిని గుర్తు చేసేందుకు చేస్తున్న ప్రయత్నమే ఈ వ్యాసాల పరంపర. సుప్రసిద్ధ రచయిత, బెంగుళూరు రామకృష్ణ మఠం అధ్యక్షులు స్వామి హర్షానంద మహరాజ్ మధ్యయుగాల కాలం దాకా విలసిల్లిన మన సంస్కృతిని 'శ్రీరామకృష్ణ ప్రభ' పాఠకులకు 2014 ఫిబ్రవరి సంచిక నుండి వివరిస్తున్నారు.

హైందవ న్యాయశాస్త్రం

ఆర్థిక సంపద, సైనిక బలం ఉన్నా కూడా, ఏ సమాజమైనా మంచి న్యాయ పరిపాలనా వ్యవస్థ లేకపోతే, ఎక్కువ కాలం మనుగడ సాగించలేదు. నిష్పక్షపాతమే న్యాయపరిపాలనకు ప్రాణం. అలాగే న్యాయ పరిపాలనే మంచి ప్రభుత్వానికి ప్రాణం. వివేకం లేకుండా వ్యక్తిగత స్వేచ్ఛనూ, సామాజిక ప్రయోజనాన్నీ సమన్వయం చేస్తూ న్యాయం ఆచరించబడదు. ఈ సమన్వయాన్ని హైందవ న్యాయ వ్యవస్థ వేదాలు, స్మృతులు, ధర్మశాస్త్రాలు, నిబంధనల ఆధారంగా సాధించింది.

కౌటిల్యుని అర్థశాస్త్రం (క్రీ.పూ. 300) న్యాయ పరిపాలన గురించి అనేక విషయాలను వివరిస్తుంది. ఈ గ్రంథం ముందు తరాలకు చెందిన పన్నెండు మంది న్యాయ గ్రంథకర్తల గురించి ప్రస్తావించింది.

హైందవ న్యాయవ్యవస్థ ప్రారంభం: వేదకాలం నుండి 'సభలు' జరిగినట్టు తెలుస్తున్నది. ఈ సభలు సత్య ధర్మాలను ఆచరించే వృద్ధులు, లేక జ్ఞానులు నిర్వహించే న్యాయస్థానాలు.

నాలుగురకాల న్యాయస్థానాలను ప్రాచీన గ్రంథాలు తెలియ జేస్తున్నాయి. అవి ప్రతిష్ఠిత (ఒకే స్థానంలో ఉండేవి), అప్రతిష్ఠిత (సంచార), ముద్రిత (రాజముద్రిక గల న్యాయాధికారి ఉన్న న్యాయస్థానం), శాసిత లేక శాస్త్రిత (రాజు అధ్యక్షత వహించే న్యాయస్థానం).

న్యాయ పరిపాలనా స్వాతంత్ర్యం: ఏ నాగరక సమాజంలోనైనా న్యాయవ్యవస్థ సాధారణ పరిపాలనా వ్యవస్థ అధీనంలో లేకుండా స్వతంత్రంగా ఉండాలి. హిందూ రాజకీయ శాస్త్రాలన్నీ కూడా ఈ విషయాన్ని కాపాడుతూ వచ్చాయి. ఈ శాస్త్రాల ప్రకారం ఒక యువరాజు కూడా న్యాయం ముందు సాధారణ పౌరునితో సమానం. అన్నిటి కన్నా గొప్పది ధర్మమే. కనుక దాన్ని అతిక్రమించడానికి వీలు లేదు.

ఇప్పటి లాగే న్యాయాధికారులను న్యాయవాదుల నుండి ఎంపిక చేసేవారు. సాధారణంగా మేధావులు, శీలవంతులైన బ్రాహ్మణులు ఎంపిక అయ్యేవారు. తగిన అర్హతలుంటే ఇతర జాతుల వారూ ఎన్నుకోబడేవారు. ఆత్మనిగ్రహం, సత్యధర్మాలు ఆచరించడం, నిష్పక్షపాతం, అనుద్వేగకరంగా, సూటిగా, దృఢంగా కార్యాచరణ చేయడం లాంటివి అర్హతలు.

న్యాయస్థానం: న్యాయస్థానానికి ఒక న్యాయాధీశుడు, బేసి సంఖ్యలో సభ్యులు ఉండేవారు. న్యాయం గురించి బాగా ఎరిగిన పౌరులను కూడా ఆహ్వానించి, అవసరమైతే వారి అభిప్రాయాల్ని తెలుసుకొనేవారు. న్యాయస్థానంలో మహారాజు ఉన్నా ఆయన స్వయంగా న్యాయపరిష్కారం చేయరు. ముఖ్య న్యాయాధికారి కూడా ఆయన సలహా మండలిలో ఉండేవారు. ఒకసారి న్యాయ నిర్ణయం జరిగిన తరువాత దాని పూర్తి అమలుకు రాజుగారు బాధ్యత వహించేవారు. న్యాయస్థానంలో జరిగిన చర్చలు లిఖించబడేవి. న్యాయ నిర్ణయం బహిరంగంగా జరిగేది.

న్యాయాధికారులు - న్యాయ పరిపాలనా వ్యవస్థ: ముఖ్య న్యాయాధికారి (ప్రాడ్వివాక), న్యాయ పరిపాలనాశాఖ మంత్రి - వీరు న్యాయ పరిపాలనా వ్యవస్థ ముఖ్య అధికారులు. ముఖ్య న్యాయాధికారి రాజధానిలోని అత్యున్నత న్యాయస్థానానికి అధ్యక్షత వహించేవాడు. న్యాయశాఖామంత్రి న్యాయసభ సభ్యులను సంప్రదించి చట్టాలనూ, పద్ధతినీ నిర్ణయించేవారు. ఒక వ్యాజ్యాన్ని పరిష్కరించే ముందు వ్యాజ్యానికి సంబంధించిన సాక్ష్యాలు సేకరించి తర్కించబడేవి. న్యాయ నిర్ణయాలు అనేక స్థాయులలో ఉంటూ, పైస్థాయి న్యాయాధికారికి అభ్యర్థించుకొనే సౌకర్యం ఉండేది. న్యాయ సభలు ఈ క్రింది విధంగా ఉండేవి.

- **కులసభలు:** ఇందులో కక్షిదారుల బంధువులు సభ్యులు. వ్యక్తిగత, కుటుంబ చట్టాలు, ఆచారాలు ఆధారం.
- **శ్రేణి సభలు:** ఇందులో వర్తకం, చేతిపనులు చేసే వివిధ జాతుల వారు, ఒకే రకమైన వృత్తి చేసేవారు సభ్యులు.
- **పూగ సభలు:** ఒకే స్థలం, పట్టణానికి చెందిన వివిధ వృత్తులు చేసే పౌరులు సభ్యులు.

కులసభల నిర్ణయాన్ని శ్రేణి సభలు, శ్రేణి సభల నిర్ణయాన్ని పూగసభలు మార్పు చేయవచ్చు. వీటి పైన ప్రాడ్వివాక సభ, అంతిమంగా రాజుగారి న్యాయసభ ఉండేది.

వీటితోపాటు 'గణసభలు' హిందూరాజ్యాల చట్టాలను అమలుపరుస్తూ ఉండేవి. వీటిని గ్రీకు గ్రంథాలలో స్తుతించి ఉన్నారు. వీరు చేసే చట్టాలకు 'సమయా' అనే పేరు ఉండేది.

న్యాయపాలనా పద్ధతి: బాధితుని ఫిర్యాదు ఆధారంగా న్యాయవ్యవస్థ విచారణ మొదలయ్యేది. న్యాయసభకు ఫిర్యాదులు అందజేయాలి. చట్టాలు బాగా తెలిసిన 'లేఖకుడు' దీనిని లిఖితపూర్వకంగా నమోదు చేసేవాడు. అవసరమైతే బాధితుడి వ్యాజ్యం గురించి ప్రశ్నించి వివరాలు సేకరించేవాడు. తరువాత అపరాధిని సభకు రావాల్సిందిగా ఆదేశం వెళ్ళేది. ఆదేశాల అమలుకు 'ఆశేధి' అనే నియమాలు, న్యాయచర్యలు విధించబడేవి.

ఈ నిబంధనలు నాలుగు రకాలు: స్థానికం, ప్రయాణానికి సంబంధించినవి, కాలబద్ధమైనవి, కొన్ని చర్యలకు సంబంధించినవి. వ్యాజ్య పరిష్కారం అయ్యేవరకు బాధితుడు



లేక అపరాధి తన ఇంటి నుండి కానీ, పట్టణం నుండి కానీ బయటకు ప్రయాణం చేయరాదు. న్యాయసభ ఆదేశాల మేరకు వారు నిర్ణయించిన రోజు, సమయం ప్రకారం హాజరు కావాలి.

బాధితుడు, అపరాధి సమక్షంలో తన ఫిర్యాదును వివరించాలి. లేఖకుడు దీన్ని లిఖిత పూర్వకంగా నమోదు చేస్తాడు. ముందు చేసిన ఫిర్యాదుకూ, అపరాధి ఎదుట చెప్పిన వివరాలకూ తేడా ఉంటే వ్యాజ్యం తిరస్కరించబడవచ్చు. ఫిర్యాదు క్లుప్తంగా, సంపూర్ణంగా, నిర్ద్వంద్వంగా, సాక్ష్యాధారంగా, మార్పు లేకుండా ఉండాలి.

ప్రతివాది బాధితుడు చేసిన ఫిర్యాదు మేరకు వివరంగా, మార్పు లేకుండా, సందేహం లేకుండా జవాబు చెప్పాలి.

ప్రతివాది వ్యాజ్యానికి సంబంధించి 1) తప్పు ఒప్పుకోవడం 2) లేదా తిరస్కరించడం 3) మినహాయింపు కోరడం 4) ముందు జరిగిన న్యాయ తీర్పును ఉదహరించడం చేయవచ్చు. న్యాయ తీర్మానం 'వ్యాజ్యాల ఫిర్యాదు, సమాధానం, విచారణ, న్యాయ నిర్ణయం' అనే నాలుగు దశలుగా అమలు చేయబడేది.

న్యాయ విచారణ చట్టబద్ధంగా సాగేది. ఇరువర్గాల వారు ఒక హామీ వ్యక్తిని నమోదు చేయించాలి. బాధితుడు తన వ్యాజ్యాన్ని తగిన సాక్ష్యాలతో మొదలుపెట్టవచ్చు. వ్యాజ్యం తీర్పు చెప్పేదాకా ప్రతివాది చేసే వాదనలు వినిపించుకోబడవు. ఒక మారు వ్యాజ్యాన్ని న్యాయసభకు నివేదించిన తరువాత బాధితుడు, అపరాధి సభ అనుమతి లేకుండా రాజీ పడడానికి వీలు లేదు.

సాక్ష్యాలు చట్టబద్ధంగా ఉండాలి. మూడు రకాల సాక్ష్యాలు గుర్తించబడేవి: పత్రాలు, సాక్షిదారులు, అనుభవం.

గౌరవనీయ కుటుంబాల నుండి వచ్చిన వ్యక్తులు, సత్యధర్మాలకు కట్టుబడి ఉంటారు కనుక అలాంటి వారి సాక్ష్యానికి విలువ ఇవ్వబడేది. తప్పుడు సాక్ష్యాలు చెప్పేవారి లక్షణాల గురించి శాస్త్రాలు ఇలా వివరించాయి: ప్రతిసారీ కొత్త వాదనలు చేయడం, పెదవులు తడి చేసుకుంటూ ఉండడం, నుదుట చెమటలు పట్టడం, ముఖ కవళికలలో మార్పు, తడబడుతూ మాట్లాడడం, పరస్పర విరుద్ధమైన మాటలు చెప్పడం.

తీర్పు – న్యాయ నిర్ణయం: న్యాయ నిర్ణయం లేక తీర్పు – 'దీనినే విధాన హితజయపత్ర' అనేవారు. విచారణ పూర్తి అయిన తరువాత ఇది ఇచ్చేవారు. వ్యాజ్యాన్ని క్షుణ్ణంగా పరిశీలించడానికి తగిన సమయం తీసుకోబడుతుంది. అనవసర కాలయాపన ఉండదు. ఒక సాధారణ న్యాయ నిర్ణయం ఈ క్రింది విషయాల మీద ఆధారపడి ఉంటుంది.

- క్లుప్తంగా జరిగిన విచారణ
- ఇరు పక్షాల సాక్ష్యాధారాలు
- న్యాయ సభలో వాదోపవాదాలు
- వ్యాజ్యానికి సంబంధించిన చట్టాలు
- రాజముద్రికతో న్యాయాధికారి సంతకం

శిక్ష: న్యాయం, చట్టం ముందు అందరూ ఒకటే అనే మాటను నొక్కి చెప్పడమే కాకుండా ఆచరణలో పెట్టేవారు. ఆ దేశపు మహారాజుకు కూడా అందులో మినహాయింపు లేదు. నిజానికి ఒకే తప్పుకు సమాజంలో ఉన్నతులయినవారికి సాధారణ ప్రజల కన్నా ఎక్కువ శిక్ష ఉండేది. ఉన్నత స్థితిలో ఉన్నవారు బాధ్యతాయుతంగా, ఆదర్శప్రాయంగా ఉండాలనే సూత్రం ఆధారంగా శిక్ష ఉండేది.

శిక్ష అనేక విధాలు – బహిరంగంగా అధిక్షేపణ, మందలింపు, జరిమానా వేయడం, ఆస్తి జప్తు, దేశ బహిష్కరణ, వాతలు పెట్టడం, చేతులు కాళ్ళు కోసివేయడం, ఉరిశిక్ష లాంటి శారీరక శిక్షలు. శిక్ష ఉద్దేశ్యం న్యాయాన్ని గౌరవించే సాధారణ పౌరుల రక్షణ. శిక్షకు భయపడి తప్పు చేయకుండా ఉండడం వల్ల సామాజిక రక్షణ, నడవడిక మెరుగుగా ఉండేవి.

హిందూ న్యాయవ్యవస్థ ఇప్పటి న్యాయ వ్యవస్థలో కూడా భాగమై, పరిశోధించాల్సిన అంశంగా మిగిలివుంది. ఈ పరిశోధనల వల్ల మన ప్రస్తుత ధర్మశాస్త్రం అభివృద్ధి చెంది, ఆదర్శప్రాయమైన న్యాయం సామాజిక సంస్థల ద్వారా వీలవుతుంది. ❖ **అనువాదం: డాక్టర్ పి.వి. రెడ్డి**

రాజ్యానికి రాజు లేనిచో బలవంతులచే బలహీనులు బాధలు పొందెదరు. కావున వారి సంరక్షణకై భగవంతుడు రాజును సృజించెను. దండభీతి వలన రాజ్యంలో ప్రజలు సుఖంగా ఉంటారు. - మనుస్మృతి



జో అచ్యుతానంద జోజో ముకుంద

– శ్రీమతి బి. కృష్ణకుమారి

జో అచ్యుతానంద జోజో ముకుంద
రావె పరమానంద రామ గోవింద
నందు నింటను జేరి నయము మీరంగ
చంద్రవదనలు నీకు సేవ చేయంగ
నందముగ వారిండ్ల నాడుచుండంగ
మందలకు దొంగ మా ముద్దురంగ
పాలవారాశిలో పవళించినావు
బాలుగా మునుల కభయమిచ్చినావు
మేలుగా వసుదేవు కుదయించినావు
బాలుడై యుండి గోపాలుడైనావు
అంగుగా తాళ్లపాకన్నయ్య చాల
శృంగార రచనగా చెప్పె నీజోల
సంగతిగ సకల సంపదల నీవేళ
మంగళము తిరుపట్ల మదనగోపాల

యమునా నది... యశోదాదేవి, గోవులు... గోపికలు, వేణువు... వెన్నముద్దలు... అనగానే తలపుల్లో ఆ తాండవకృష్ణుడే తారంగమాడతాడు. ఆయన నీలవర్ణుడు... నందుని ఇంట నడయాడి నందవ్రజాన్నే ఆనందమయం చేసిన నవనీతచోరుడు! బాలుడిగా చీరలు దోచినా, భగవద్గీతాచార్యుడిగా చింతలు తీర్చినా ఆయనకే చెల్లింది. అంతటి అవతారమూర్తి పాదస్పర్శతో బృందావనం ఎంత తన్మయమైందో! ఆ ప్రేమస్పర్శతో గోపగోపీ జనం ఎంత తరించిపోయిందో! అయితే అందరి కొడుకుల్లా తన కొడుకూ మానవమాత్రుడేనని అమాయకురాలు యశోద భ్రమపడింది. అందుకే అందరి తల్లుల్లాగే తన బిడ్డకు లాలి పోసింది, జోలపాడింది. కనుసైగతో సమస్త లోకాలనూ శాసించగల సర్వేశ్వరుడిని, కనులు మూయించి నిద్దరపుచ్చే ప్రయత్నం చేసింది. అందుకే భగవాన్ శ్రీరామకృష్ణ పరమహంస "ఒక సంప్రదాయానుసారం యశోదాది గోపికలు పూర్వజన్మలో నిరాకారవాదులుగా ఉండేవారు. దానిలో వారికి తృప్తి కలగలేదు. అందుచేతనే బృందావనంలో శ్రీకృష్ణుని సాంగత్యంలో ఆటపాటలతో పరమానందం పొందారు. ఒకరోజు శ్రీకృష్ణుడు వారితో 'మీకు నిత్యధామాన్ని చూపిస్తాను. రండి, యమునలో స్నానం చేద్దాం' అన్నాడు. యమునలో మునక వేయగానే వారికి గోలోక దర్శనం కలిగింది; తరువాత అఖండజ్యోతిని దర్శించారు. అప్పుడు యశోద 'ఓ కృష్ణా! ఇక మీదట ఇవి ఏవీ నేను చూడగోరను. ఇప్పుడు నీ మానవరూపాన్నే చూడగోరతాను. నిన్ను ఒడిలోకి తీసుకోవాలి, గోరుముద్దలు తినిపించాలి, నిన్ను నిద్దరపుచ్చాలి' అంది" అంటారు. అలాంటి యశోద అంతరంగాన్ని అన్నమాచార్యులు తన అక్షరాలతో ఆవిష్కరింపచేస్తున్నారు; తన పదాల ఊయలలో పరమాత్ముడిని పవళింపచేసి 'జో అచ్యుతానంద...జోజో ముకుంద' అంటూ జోల పాడుతున్నారు.

రామ గోవింద...

కడుపారా పాలు తాగి మసక నిద్దరతో మెసులుతున్న కన్నబిడ్డను జోకొట్టే తెలుగింటి తల్లుల పెదాలు, అప్రయత్నంగా పలికే పదాలు 'జో అచ్యుతానంద జోజో ముకుంద'. అన్నం తిననని మారాం చేస్తుంటే 'చందమామ రావే...జాబిల్లి రావే' అంటూ గోరుముద్దలు తినిపించాక, నిద్దరపోకుండా జాగు చేస్తుంటే **'జో అచ్యుతానంద... జోజో ముకుంద'** అంటూ జోల పాడడం అమ్మలకు అలవాటు. అలా అన్నమయ్య తెలిసో, తెలియకో తెలుగు తల్లులకు స్వరపరిచితుడే! ఈనాటికీ తిరుమలలో ఈ పదాల పల్లవులతోనే శ్రీనివాసుడిని శయనింపచేస్తూ, **'రావె పరమానంద...రామ గోవింద'** అని పాడుకొని అర్చకులు ఆనందపరవశులవుతూ ఉంటారు. శ్రీమద్భాగవతంలో పోతనామాత్యులు కూడా బాలకృష్ణుడిని తల్లి యశోద, గోపికాబృందం జోకొట్టిన సన్నివేశాన్ని అభివర్ణిస్తూ... **జో జో కమలదళేక్షణ! జో జో మృగరాజమధ్య! జో జో కృష్ణా! జో జో పల్లవకరపద!జో జో పూర్ణేందువదన!జో జోయనుచున్** అంటూ పులకించిపోయారు. అచ్యుతుడు, ఆనందస్వరూపుడు అయిన ఆ ముకుందుడిని తలచుకుంటూ కన్నతల్లులు పాడే ఇలాంటి జోలపాటలు పసిపిల్లల మనస్సులో దైవీగుణాలను మేల్కొలుపుతాయి. మహత్తరమైన మంత్రాలుగా వాళ్ళలో దైవశక్తిని పాదుకొల్పుతాయి. అయితే, నేడు చలనచిత్ర గీతాలో, అంతర్జాల క్రీడావిశేష ధ్వనులో వినిపించకపోతే చిన్నారులు నిద్దరపోలేని దయనీయ స్థితికి చేరుకోవడం బాధాకరం.

మా ముద్దురంగ...

పసిపాప ఆకలి, అవసరాలు కన్నతల్లికి తెలిసినంతగా

(మిగతా 34వ పేజీలో...)

పసిబిడ్డ లోకంలోని సిరి సంపదలను లెక్కచేయడు. కానీ ఒక్క ఆటబొమ్మే కావాలనుకుంటాడు. అలాగే నిజమైన భక్తుడు ప్రాపంచిక విషయాలను వదలి, భగవంతుడే కావాలని కోరుకుంటాడు. -శ్రీరామకృష్ణులు



పరిప్రశ్న

– స్వామి భూతేశానంద
(రామకృష్ణ సంఘ 12వ సర్వాధ్యక్షులు)

రామకృష్ణ సంఘ 12వ సర్వాధ్యక్షులు - స్వామి భూతేశానందజీ మహరాజ్ (1901-1998) భక్తుల ఆధ్యాత్మిక సందేహాలకు సరళమైన రీతిలో ఇచ్చిన సమాధానాలను 'శ్రీరామకృష్ణ ప్రభ' పాఠకుల ప్రయోజనార్థం 2013 జూలై సంచిక నుండి ధారావాహికంగా ప్రచురిస్తున్నాం.

భక్తుడు: ఆధ్యాత్మిక జీవితంలో పురోగతి సాధిస్తున్నామా? లేదా? అనేది ఎలా తెలుస్తుంది?

స్వామీజీ: ప్రార్థన, జపధ్యానాలు చేసే సాధకునిలో ఇలాంటి సందేహం కలగడం సహజమే! ఆకలితో ఉన్న వ్యక్తి భోజనం చేయగానే తన ఆకలి బాధ తీరి తృప్తిని పొందినట్లు, భగవన్నామ స్మరణతో సాధకునిలో మానసిక అలజడి తగ్గి, ప్రశాంతత చేకూరాలి. అప్పుడు సాధకుడు ఆధ్యాత్మిక మార్గంలో పురోగతిని సాధించినట్లే అని శ్రీమద్భాగవతం ఇలా వివరించింది:

> **భక్తిః పరేశానుభవో విరక్తిః**
> **అన్యత్ర చైషత్రిక ఏకకాలః ।**
> **ప్రపద్యమానస్య యథాశ్నతః స్యుస్**
> **తుష్టిః పుష్టిః క్షుదపాయోఽనుఘాసమ్ ॥**

'భోజనం చేసే వ్యక్తికి ప్రతి కబళం తృప్తినీ, పుష్టినీ ఇచ్చి క్షుద్బాధను తీర్చినట్లు; సాధకుడు భగవన్నామ స్మరణ చేసినప్పుడు భగవంతుని పట్ల భక్తిభావం; భగవత్ స్వరూపానుభవం; ప్రాపంచిక విషయాల పట్ల వైరాగ్యభావం కలుగుతాయి'.



భగవంతుని పట్ల అనురాగం పెంపొంది, ప్రాపంచిక విషయాల పట్ల విరాగం అధికమైతే సాధనలో పురోగతి సాధిస్తున్నట్లు లెక్క. అలా కాకుండా ప్రాపంచిక విషయాల పట్ల ఆకర్షణ అధికమైనట్లయితే, మన సాధనలో ఎక్కడో లోపముందని అర్థం.

భక్తులు చాలా మంది మేము జపధ్యానాలు చేస్తున్నామంటారు. కానీ వాళ్ళ ప్రవర్తనలో ఎలాంటి మార్పూ కనపడదు. కేవలం ఇతరుల మెప్పు కోసం చేసే సాధనల వల్ల ఎలాంటి ప్రయోజనమూ ఉండదు. ఇలాంటి కోవకు చెందిన భక్తులు నిజమైన సాధకులు కారు. భక్తులు కొంతమంది తమకు దివ్యదర్శనాలు కలుగుతున్నాయని చెప్పుకుంటారు. ఒకవేళ ఆ దర్శనాలు నిజమైనవైతే వారిలో లేశమైనా భోగాసక్తి ఉండదు. మనస్సు ఎల్లప్పుడూ భగవంతుని కోసం ఆరాటపడుతూ ఉంటుంది.

మరికొంతమంది భక్తులు ధ్యానం చేస్తున్నప్పుడు 'శ్రీకృష్ణుని వేణునాదం విన్నామనీ; కాళీమాత నా ముందు ప్రత్యక్షమైందనీ; పరమశివుణ్ణి దర్శించామనీ చెబుతూ ఉంటారు. ఇవన్నీ భ్రమలా? నిజాలా? అనేది ఎలా తెలుసుకోగలం? అందుకు శ్రీరామకృష్ణులు సమాధానమిస్తూ "నువ్వు తూర్పు వైపు వెళుతుంటే, పడమర దిక్కు దూరమవుతుంది. అలాగే భక్తుడు భగవంతుని చింతనలో ఎంతగా నిమగ్నమై ఉంటే, మనస్సు ప్రాపంచిక విషయాలకు అంత దూరమవుతున్నట్లు" అని కొలమానాన్ని సూచించారు.

జీవితంలో భగవద్దర్శనం ఒక్కసారైనా చాలు. జీవిత పరమార్థం సాధించినట్లే. శ్రీరాముని కోసం శబరి ఎన్నో ఏళ్ళు నిరీక్షించింది. చివరికి వృద్ధాప్యంలో శ్రీరాముని దర్శనం ఆమెకు లభించింది. అలాగే నారదుడు ఐదేళ్ళ వయస్సులో అరణ్యాలకు వెళ్ళి ఎన్నో ఏళ్ళు ధ్యానాన్ని అభ్యసించాడు. నారాయణుడు అతడికి ఒకే ఒక్కసారి దర్శనమిచ్చి 'నారదా! ఈ జన్మలో నా దర్శనం నీకు మళ్ళీ కలగదు. నా ఈ ఒక్క దర్శనంతోనే పరిపూర్ణతను సాధించావు' అని నారదునితో అన్నాడు.

భగవంతుని దర్శనభాగ్యం లభించాలంటే శ్రద్ధాభక్తులతో సాధన చేస్తూ ఉండాలి. అయితే భగవద్దర్శనం కోసం ఎన్ని ఏళ్ళైనా సహనంతో నిరీక్షించడానికి సిద్ధమవ్వాలి. అలా సాధన చేస్తూ పవిత్ర జీవనాన్ని గడుపుతుంటే భగవంతుడు తప్పక కరుణిస్తాడు. అనంతమైన ఆనందాన్ని ప్రసాదిస్తాడు. అలాంటి విశ్వాసం మనలో వృద్ధి చెందుతున్నట్లయితే మనం ఆధ్యాత్మికంగా పురోగతి సాధిస్తున్నట్లే! ❖

పండుగలు - పర్వదినాలు

ఆగష్టు - 2014

7	గురువారం	: ఏకాదశి
10	ఆదివారం	: స్వామి నిరంజనానంద జయంతి
17	ఆదివారం	: శ్రీకృష్ణ జన్మాష్టమి
21	గురువారం	: ఏకాదశి
24	ఆదివారం	: స్వామి అద్వైతానంద జయంతి
29	శుక్రవారం	: వినాయక చవితి

సెప్టెంబర్ - 2014

5, 19	శుక్రవారం	: ఏకాదశి
17	బుధవారం	: స్వామి అభేదానంద జయంతి
24	బుధవారం	: స్వామి అఖండానంద జయంతి
30	మంగళవారం	: దుర్గాపూజ - మహాషష్ఠి



విఘ్ననాశక వినాయక

– స్వామి హర్షానంద

ఒకే పరబ్రహ్మను అనేక రకాలుగా, వివిధ రూపాలుగా ఉపాసించే విధానాలు అనేకం మన వేదమార్గంలో చెప్పబడ్డాయి. ఆ విధంగా పరబ్రహ్మను గణపతిగా వివిధ నామాలతో, ఉపాసనామార్గాలతో వేద, పురాణ, తంత్రాదులలో వివరించారు. సగుణమైన ఆ పరబ్రహ్మమే గజాననాకృతిలో గణపతిగా పూజలందుకుంటున్నాడు. ఏ ఆరాధనా పద్ధతులలోనైనా, ఏ వర్గానికి చెందిన వారైనా, విఘ్నాలకు అధిపతి అయిన విఘ్నేశ్వరుణ్ణి తొలుతగా పూజించడం మన సంప్రదాయం. నిరాకారుడైన పరబ్రహ్మను పసుపు గణపతిగా పూజించడం దగ్గర నుండి అనేకానేక దివ్యాకృతులతో, వివిధ విధానాలతో ఆరాధించడం భారతీయ ఉపాసనామార్గ విశిష్టతను తెలియజేస్తుంది. వరదునిగా, అభయహస్తునిగా, సిద్ధిబుద్ధి ప్రదాతగా జనావళిలో బహుళ ప్రాచుర్యం కలిగినవాడు ఆ విఘ్నరాజు. ఆయన అనుగ్రహం చేత సర్వకార్యాలు సానుకూలమవుతాయి.

మహాగణపతి పార్వతీ తనయునిగా ఆవిర్భవించిన రోజునే మనం వినాయకచవితిగా జరుపుకుంటాం. భాద్రపద శుద్ధ చతుర్థి నాడు, మధ్యాహ్న సమయాన ఏ రోజైతే చవితి ఉంటుందో ఆనాడు వినాయక ప్రతిమను తెచ్చి శాస్త్రోక్తంగా అర్చించాలి. ఈ ప్రతిమ మట్టితో గానీ లేదా వెండి లాంటి లోహాలతో చేసినది అయినా కావచ్చు. ఆ గణపతి ప్రతిమకు ప్రాణప్రతిష్ఠ గావించి, యథావిధిగా షోడశోపచారాలతో భక్తిశ్రద్ధలతో పూజ చేయాలి. గణపతి ఏకవింశతి (21) సంఖ్యాప్రియుడు. అంతేకాక దూర్వాలు (గరికలు) ఆయనకు ప్రీతికరం కనుక, 21 దూర్వాలతో గణపతిని పూజించడం సర్వసిద్ధికరం, బుద్ధిసిద్ధిప్రదం, యోగక్షేమకరం.

ఇవేకాక శాస్త్రంలో చెప్పిన 21 ఔషధీయ పత్రాలతో పూజించాలి. ఈ 21 అనే సంఖ్యకు అంతరార్థంగా పంచ కర్మేంద్రియాలు, పంచ జ్ఞానేంద్రియాలు, పంచ భూతాలు, పంచ ప్రాణాలు, మనస్సు అని భావన చేసి శరణాగతితో సమర్పణ చేసిన, జన్మసాఫల్యానికి మార్గం సుగమం అవుతుంది. ఇలా పూజ చేయబడిన గణపతి ప్రతిమను వారి వారి ఆచారాలు, ప్రాంత రీతులను బట్టి 2 రోజులనీ, 7 రోజులనీ, 9 రోజులనీ, లేదా భాద్రపద అనంత చతుర్దశి వరకు గానీ ఉంచి, నిత్య ధూప దీప నైవేద్యాదులతో పూజించి, పిదప దగ్గరలోని జలాశయాలలో నిమజ్జనం గావిస్తారు.

ఈ చవితినాడు చంద్రుణ్ణి చూస్తే మిథ్యాపవాదదోషం కలుగుతుందనీ, వినాయకవ్రతాన్ని ఆచరించి, ప్రసాదాక్షతలు స్వీకరించిన వారికి దోషం అంటదనీ శాస్త్రవచనం. శమంతకోపాఖ్యానంలో చెప్పబడిన శ్రీకృష్ణుని చరితను తెలుపుతూ ఉన్న ఈ క్రింది శ్లోకాన్ని పఠించిన, మిథ్యాపవాద దోషం తొలగుతుందని వాయు, మత్స్య, విష్ణు పురాణాలలో తెలిపారు.



సింహః ప్రసేనమవధీత్ః సింహో జాంబవతా హతః।
సుకుమారక మా రోదీః తవ హ్యేష స్యమంతకః ॥

'సత్రాజిత్తు తమ్ముడైన ప్రసేనుని సింహం చంపగా, దాన్ని జాంబవంతుడు హతమార్చి, ఈ శమంతకమణిని నీకిచ్చాడు. ఏడవవద్దు తల్లీ!' అని జాంబవత్పుత్రిని ఊయలలో ఉంచి దాసి పాడింది. దీని వల్ల శ్రీకృష్ణుడు మణిని అపహరించాడనే మిథ్యాపవాద దోషం తొలగిపోయింది.


సమస్త విఘ్నసంహారకుడైన ఆ మహాగణపతి అనుగ్రహం సర్వులకు కలగాలని ఆశిద్దాం. ❖

అనువాదం: డాక్టర్ అపర్ణా శ్రీనివాస్

సత్పురుషులు ఆచరించిన మార్గాన్నే అనుసరించుము. శిష్టుల అడుగుజాడల్లో నడువుము. లోకానికి హాని కలిగే కార్యాలను విడిచిపెట్టి, సజ్జనులు సూచించిన వృత్తినే స్వీకరించుము. -మహాభారతం

కర్తవ్యం నీది... కాపాడేది దైవం

- రాచమడుగు శ్రీనివాసులు



యుద్ధానికి సిద్ధమై కురు పాండవ సేనలు ధర్మ క్షేత్రమైన కురుక్షేత్రంలో సమావేశమయ్యాయి. ధృతరాష్ట్రుని హృదయం ఆందోళనతో తల్లడిల్లిపోయింది. సకల వేదవేత్త, సత్యవతీ తనయుడు, భూత భవిష్యద్వర్తమానాలు తెలిసిన వ్యాస భగవానుడు ప్రత్యక్షమై ధృతరాష్ట్రునితో "ఓ రాజా! కాలవశులై నీ కుమారులు, ఇతర రాజులు చావడానికి సిద్ధమై యుద్ధ భూమిని చేరారు. కాలచక్ర విధం తెలిసిన నీవు వారి కొరకు చింతించుట తగదు. శోకాన్ని విడిచిపెట్టు. తప్పక జరుగబోయే సంగ్రామాన్ని నీవు చూడదలిస్తే నీకు దృష్టినిస్తాను. ఆ యుద్ధ విధానాన్ని గమనించు" అన్నాడు. తనవారి మరణాన్ని తాను చూడలేనన్నాడు ధృతరాష్ట్రుడు. కేవలం యుద్ధ విషయాలను మాత్రమే వినగోరుతానన్నాడు. వరదాత అయిన వ్యాసుడు యుద్ధరంగంలో ఏమేమి జరుగుతుందో దాన్నంతా చూడగల శక్తిని సంజయునికిచ్చి తాను చూసిన దాన్నంతా ధృతరాష్ట్రునికి పూసగుచ్చినట్టు వివరించమని చెప్పాడు.

వ్యాసుడు, ధృతరాష్ట్రుడికి సలహాయిస్తూ "ఓ రాజా! దైవవశాన వచ్చిన ఈ యుద్ధాన్ని ఆపడానికి శక్యం కాదు. ఇందులో ధర్మం ఎక్కడ ఉంటే, అక్కడ జయం కలుగుతుంది" అని చెప్పి "ఈ భరత వంశం ఎలా నశింపకుండా ఉంటుందో, అలాంటి విధానం ఆలోచించు" అని అంటాడు. "నీ కులాన్నీ, తక్కిన రాజ లోకాన్నీ నశింప జేయడానికే నీకీ రాజ్యమనే అనర్థం కలిగింది. నీవు ధర్మాన్ని చెఱచకు. నీ పుత్రులకు ధర్మాన్ని తెలుపు. ఏ రాజ్యం నుంచి కీర్తి, ధర్మం, స్వర్గం పొందవలసి ఉందో ఆ రాజ్యం మూలంగా నీకు ఇప్పుడు పాపం రాబోతున్నట్టుంది. ఈ రాజ్యాన్నంతా కోరక పాండవులకు వారి భాగాన్ని ఇప్పించు" అని హితవుచెప్పి, యుద్ధాన్ని నివారించమన్నాడు.

ఇదంతా మహాభారతంలోని భీష్మపర్వంలో స్పష్టంగా మనకు కనపడుతుంది. దీన్ని చదివిన తర్వాత మనకు ఎన్నెన్నో సందేహాలు కలుగుతాయి. వ్యాసభగవానుడు భూత భవిష్యద్వర్తమానాలు తెలిసినవాడు కదా! ఆయనకు ఈ యుద్ధం కచ్చితంగా జరుగుతుందనీ, ధృతరాష్ట్రుడుగానీ, మరొకరు గానీ ఈ యుద్ధాన్ని నివారించలేరనీ తెలుసు. దుర్యోధనాదులు, భీష్మ ద్రోణాదులు నశిస్తారనీ తెలుసు. మరి అలాంటప్పుడు ధృతరాష్ట్రునకు ఇలాంటి సలహా ఇవ్వడమెందుకు? అదీ కురుక్షేత్రంలో యుద్ధానికి సర్వ సన్నద్ధులై కురు పాండవులు ఉన్నప్పుడు. అది వృథాప్రయాస కాదా? అని అనిపిస్తుంది. కానీ మనం జాగ్రత్తగా గమనిస్తే అందులో మనకొక ముఖ్య సందేశం లభిస్తుంది.

జరుగనున్నది జరుగక మానదనీ, అంతా దైవసంకల్పం ప్రకారం జరుగుతుందనీ మనం ఏమీ చేయకుండా చేతులు ముడుచుకొని కూర్చోరాదు. మనం చేయవలసిన ప్రయత్నమంతా చేయాలి. మన కర్తవ్యాన్ని సక్రమంగా, శ్రద్ధగా చేయాలి. యుద్ధం తప్పదని తెలిసిన శ్రీకృష్ణ పరమాత్ముడూ సంధి ప్రయత్నాలు చేశాడు. ఎవరెవరికి ఏమేమి ఏ ఏ విధంగా చెప్పాలో అలా చెప్పాడు. ఇప్పుడు వ్యాసుడు కూడా అలాగే ధృతరాష్ట్రునికి చివరి క్షణంలో కూడా కర్తవ్యాన్నీ, ధర్మాన్నీ బోధించాడు. తన కర్తవ్యాన్ని తాను నిర్వర్తించాడు. ఎవరి కర్తవ్యాన్ని వారు సక్రమంగా నిర్వర్తించి ఫలితాన్ని దైవానికి వదలివేయాలన్నది మహాభారతం మనకు ఇచ్చే దివ్య సందేశం. ❖

కృష్ణతత్త్వంలో మాతృమూర్తి

– శ్రీమతి చెవుటూరి కుసుమకుమారి

చేత వెన్నముద్ద చెంగల్వ పూదండ
బంగరు మొలత్రాడు పట్టుదట్టి
సందిట తావీదు సరిమువ్వ గజ్జెలు
చిన్ని కృష్ణా! నిన్ను చేరి కొలతు ॥

ఆ మూర్తిని తలచుకుంటేనే చాలు మనస్సు వెన్నలా కరిగి పోతుంది. చెంగల్వ పూవులా స్వచ్ఛంగా గుబాళిస్తుంది. ఆ తాయతులు తలిస్తేనే చాలు హృదయాలు ధైర్య స్థైర్యాలకు ఆలవాలాలు అవుతాయి. ఆ పట్టుదట్టి జీవదేహాలకు ప్రతీక. ఆ సరిమువ్వ గజ్జెలు జగన్నాటక విన్యాసానికి లయతాళాలు. కాకపోతే ఈ చరాచర జగత్తంతా ఈ చిన్ని శిశువును ఇంతగా ఎందుకు కొలుస్తుంది!

పరమాత్మ సూక్ష్మ తత్త్వానికి అమ్మ స్థూలతత్త్వం లేకపోతే ఈ జగత్తు కదలేదెలా? అందుకే ఆ పరమాత్మ ముందుగా అమ్మ ఒడిలో చేరాడు. కన్నతల్లి ఒకరైనా అనేక మంది తల్లులకు బిడ్డగా భాసించాడు.

క్షీరసాగరాన్ని విడిచి మధురా నగరంలో కారాగారపు నాలుగు గోడల మధ్య ఆ పరమాత్మ పుట్టాడు – ఈ జీవుడు కర్మానుభవం కోసం పుట్టి తనను తాను మాయామోహంలో బంధించుకుంటున్నాడనీ, సర్వాంతరాత్మ తత్త్వాన్ని చాటడానికేమో అన్నట్లు. ఆ చిన్ని శిశువు యమునానదీ జలాలను దాటుకొని "గో" కులానికి చేరాడు.

పొట్ట మీద పాలచారికలతో, వెన్న తిన్న జిడ్డుమూతితో జగత్తును సమ్మోహనపరిచే చిరుగజ్జెల పాదాల సవ్వడితో మెడ మీద దోబూచులాడే ఉంగరాల కురులతో యశోదమ్మ వెంట తిరిగే ఆ శిశువును తలచిన ఏ స్త్రీ మాతృత్వాన్ని వాంఛించదు? అందుకే అన్నమయ్య "ఎన్నడూ చూడమమ్మ ఇటువంటి శిశువు" అన్నాడు. నిజమే మరి! ఇటువంటి శిశువును ఏ యుగంలోనూ చూడ సాధ్యం కాదు. గోవులు కురిపించే క్షీరాన్నీ, నవనీతాన్నీ నలుగురితో పంచుకోకుండా ఉట్ల మీద బానల్లో దాచే స్వభావం తగదనీ, ఆ మనసుల గురుతులెరిగిన దొంగ గోపాలుడైనాడు. ఆ గోకులంలో క్షీరామృతాన్ని వరదలుగా ప్రవహింప చేశాడు. అందుకే ఆ చిన్ని శిశువుతో పాటే గోకులంలో అమృతతత్త్వం వెల్లి విరిసింది.

గోవిందుడు వెన్నదొంగ అయ్యాడని యశోదమ్మ వద్ద గోపెమ్మలు వాపోయారు. కొన్నాళ్ళ తరువాత వెన్నే కాదు, కన్నయ్య మన్ను కూడా తింటున్నాడని తెలిసింది అమ్మ యశోదకు. "అమ్మో! అందరి ఇళ్ళలో వెన్న తినొద్దని దండిస్తున్నానని బిడ్డ మన్ను తింటున్నాడా? అయినా కన్నా! మనింట్లో వెన్నకేం కొదువరా తండ్రీ!" అని మందలించాలనుకొని కన్నయ్య దగ్గరకు వెళ్ళింది అమ్మ.

"కన్నయ్యా! మన్నెందుకు తిన్నావయ్యా!" అన్నది అమ్మ. సమ్మోహనంగా నవ్వాడు కన్నయ్య. "అమ్మా నేను మన్నెందుకు తింటానమ్మా! కావాలంటే నా నోరు చూడు మన్నుందేమో!,




అని నోరు తెరిచాడు. ఈ సృష్టి స్థితి లయలన్నీ ఆ చిన్ని నోటిలోనే కనిపించాయి. యశోదమ్మ మనశ్శరీరాలు వశం తప్పాయి. ఆ పసిబాలుడిలో పరమాత్మను దర్శించింది. అది గ్రహించిన కన్నయ్య "అమ్మా! ఆకలమ్మా" అంటూ మళ్ళీ మాయలో ముంచేశాడు. 'అయ్యో కన్న తండ్రీ! నీ ఆకలెరుగకుండా ఏమేమో అన్నాను. నేనేం తల్లిని?' అని తనను తానే నిందించుకుంది. మాతృవాత్సల్యాన్ని తన కుక్షిలోని జగత్తులో నింపడానికే దిగి వచ్చానన్నట్లు తల్లి కొంగు తన వేలికి చుట్టుకుంటూ నడిచాడా దొంగ కన్నయ్య. యశోదమ్మ కోపం వెన్నలా కరిగిపోయింది.

సృష్టిలోని శిశువులంతా తన కన్నయ్యలా, తల్లులంతా తనలాగా భావించింది యశోద. మాతా శిశు వాత్సల్యానికి ప్రతీకలుగా భాసించారు ఆ తల్లీ బిడ్డలు.

(మిగతా 32వ పేజీలో...)

తపస్సులో ఉన్న యోగులకు, మునులకు, ఋషులకు కూడా దుర్లభమైన నీ సచ్చిదానంద స్వరూప దర్శనం నాకు లభించినది. ధన్యుడనైతిని స్వామీ! ఇక నిన్ను నేను ఏ వరమూ కోరను. - శ్రీమద్భాగవతం



భగవంతుణ్ణి మెప్పించిన భక్తి

– శ్రీమతి జి.ఎస్. లక్ష్మి

శ్రీ పురుషోత్తంపురిలో కర్మాబాయి అనే భక్తురాలు ఉండేది. బాలకృష్ణుడిని ఎప్పుడూ పూజిస్తూ ఉండేది. ఆమె వాత్సల్య భక్తికి భగవంతుడు ప్రసన్నుడై, చిన్నికృష్ణుని రూపంలో వచ్చి ఆమె పెట్టిన పులగం(కిచిడీ) ఆరగించేవాడు. ప్రతిదినం ఆమె తన బాలకృష్ణుడు ఎక్కడ ఆకలితో బాధపడతాడో అని భావించి స్నానాదికార్యాలు చేయకుండా ముందు ఉదయమే పులగం వండి బాలకృష్ణుడికి నివేదించేది. ఆమె భక్తికి వశుడైన కృష్ణుడు నిత్యం చక్కని బాలుని రూపంలో వచ్చి ఆమె ఒడిలో కూర్చొని, పెట్టిన పులగం తినేవాడు. భగవంతుడి నైవేద్యం ఆలస్యం అవకూడదన్న భావంతో ఆమె ఇంటి పనులు, పద్ధతులు ఏవీ పట్టించుకోకుండా ఉదయమే భక్తితో పులగం వండి ఉంచేది.

ఒక రోజు కర్మాబాయి ఇంటికి ఒక సాధువు వచ్చాడు. కర్మాబాయి స్నానం చేయకుండానే పులగం వండి బాలగోపాలునికి పెట్టడం ఆయన చూశాడు. వెంటనే ఆమెను పిలిచి 'ఇల్లు శుభ్రం చేసి, స్నానం చేసి, శుచిగా వంటచేసి భగవంతుడికి నైవేద్యం పెట్టాలి. లేదంటే భగవంతుడికి కోపం వస్తుంది' అని చెప్పాడు. మర్నాడు కర్మాబాయి ఆ విధంగానే చేసింది. అందువలన వంట చెయ్యడం ఆలస్యం అయింది. చిన్ని కృష్ణుడు ఆకలితో బాధపడుతున్నాడని ఆమె హృదయం తల్లడిల్లింది. బాధ పడుతూనే కృష్ణుడికి పులగం తినిపించింది.

అదే సమయంలో ఆలయంలోని పూజారి మంచి రుచికరమైన పిండి వంటలు తీసుకొచ్చి నివేదన చేసి, ప్రభువును ఆహ్వానించాడు. అప్పుడు ప్రభువు నోటి నిండా పులగంతో పూజారికి దర్శన మిచ్చాడు. భగవంతుని ముఖం మీద అంటుకుని ఉన్న పులగం చూసి పూజారి ఆశ్చర్యపోయాడు. పూజారి కూడా పరమ భక్తుడు. అసలు విషయం చెప్పమని పూజారి అత్యంత భక్తి పూర్వకంగా భగవంతుణ్ణి ప్రార్థించాడు. అప్పుడు భగవంతుడు "నేను ప్రతినిత్యం ఉదయమే వెళ్ళి కర్మాబాయి వండి పెట్టిన పులగం తింటాను. ఆ పులగం నాకు చాలా ఇష్టం. నిన్న ఒక సాధువు ఆమె ఇంటికి వెళ్ళి 'ఇల్లు వాకిలి శుభ్రం చేసుకుని స్నానం చేసి శుచిగా వంట చేసి భగవంతుడికి నివేదించాలి' అని చెప్పాడు. అందుకని ఇవాళ ఆమె తన పనులు పూర్తి చేసుకుని పులగం వండి నాకు పెట్టేసరికి ఆలస్యం అయింది. ఆకలి భరించలేక నేను బాధపడ్డాను. ఇక్కడ మీరు పిలిచేసరికి తొందరలో ముఖం శుభ్రం చేసుకోకుండా వచ్చేశాను" అని చెప్పాడు.

భగవంతుడు చెప్పినదంతా పూజారి, ఆ సాధువుకి చెప్పాడు. సాధువు గాబరా పడుతూ కర్మాబాయి ఇంటికి వెళ్ళి "అమ్మా! మీరు ఎప్పటిలానే ఉదయమే పులగం వండి కృష్ణుడికి నివేదన చెయ్యండి. మీరు ఏ విధమైన నియమాలూ పాటించనక్కర లేదు" అన్నాడు. కర్మాబాయి పూర్వం లాగానే ఉదయమే పులగం వండి, బాలకృష్ణుడికి పెట్టేది.

ఆమె జీవితాంతం బాలకృష్ణుడిని సేవించి, చివరిలో భగవత్సాయుజ్యం పొందింది. ఇప్పటికీ భక్తులు ఆమె కృష్ణభక్తిని కీర్తిస్తూ పాటలుగా పాడుకుంటారు. ఇప్పటికీ జగన్నాథస్వామి ఆలయంలో ప్రతి నిత్యం ఉదయమే పులగం వండి భగవంతునికి నివేదన చేసే సంప్రదాయం కొనసాగుతోంది. ❖

ఐకమత్యమే మహా బలం!

సంఘాలు బలవంతం కావడానికి సాధనం ఏమిటి? సంఘీకరణం! కేవలం నాలుగు కోట్ల ఆంగ్లేయులు, ఈ దేశంలోని ముప్పై కోట్ల జనాన్ని పరిపాలించగలగడం సాధ్యమైంది కదా! ఎందువల్ల? ఈ నాలుగు కోట్లమంది తమ ఇచ్ఛలను ఏకం చేయడం వల్ల. ముప్పై కోట్ల మందిగా ఉన్న మీలో ప్రతి ఒక్కరికీ ఉన్న ఒక్కొక్క ఇచ్ఛా వేర్వేరై ఉంటుంది. కాబట్టి భవిష్యత్కాలంలో మహత్తర భారతదేశాన్ని నిర్మించడంలో ఉన్న రహస్యమంతా సంఘీభావంలో ఉంది; ఇచ్ఛ అంటే మన సంకల్పాల పరస్పర సహకారం.

ఇదిగో... అథర్వవేద సంహితలోని శ్లోకాలలో ఒకటి నాకు స్ఫురణకు వస్తోంది. దాని భావమిది: "మీరంతా ఒక్క మనస్సు కలిగివుండండి; మీరంతా ఒకే సంకల్పం కలిగి ఉండండి. ఎందుకంటే, ప్రాచీన కాలంలో దేవతలు ఏకమనస్కులై హవిస్సులను పొందగలిగారు. దేవతలు ఏకమనస్కులు కావడం వల్లనే మానవులతో పూజింప బడుతున్నారు."

ఐకమత్యమే సంఘానికి కీలకం. ద్రావిడులనీ, ఆర్యులనీ అల్పభేదాలను పాటించి, వివాదాలు, పోరాటాలు సాగించిన కొద్దీ; బ్రాహ్మణులనీ, బ్రాహ్మణేతరులనీ, ఇలాంటి భేదాలతో కీచులాడేకొద్దీ; భావిభారత భాగ్యాన్ని నిర్మించగల శక్తిసామర్థ్యాల సమీకరణం మీకు దూరమైపోతుంది. నా మాట గుర్తుపెట్టుకోండి. భావిభారత భాగ్యోదయం పూర్తిగా ఐకమత్యంపై ఆధారపడి ఉంది.



ప్రతి చైనా వ్యక్తి, తన త్రోవను తాను సంకల్పిస్తాడు. కొద్ది మందైనా జపానువారంతా, ఒకే మార్గంలో సంకల్పిస్తారు. ఫలితార్థం మీకు తెలిసిందే! ప్రపంచ చరిత్రలో అంతటా జరుగుతున్నదిదే! సంఘీభవించి జీవించే స్వల్పజాతులు ప్రతి విషయంలో, అధిక సంఖ్యాకులై, విడిగావున్న జాతులను, సదా జయించి పాలిస్తూ ఉండడం మనం చూస్తున్నాం. అది స్వభావసిద్ధమైన విషయమే! ఎందుకంటే సంఘీభావంతో మెలగే అల్పజాతులవారు, తమ భావాలను ఒకటిగా సమీకరించుకోగలగడమే! అందువల్ల వారు త్వరగా వికాసాన్ని పొందుతున్నారు. ఒక జాతి పెద్దదైన కొద్దీ, ఈ సమీకరణం దుస్సాధ్యమవుతూ ఉంటుంది. చెల్లాచెదురైన గుంపులాగా, వీళ్ళు సులభంగా సంఘీభవించజాలరు. ఇలాంటి వైషమ్యాలన్నీ తుదముట్టించాలి.

మనలో ఒకడు ఏదో విధంగా ప్రముఖుడు కావడానికి ప్రయత్నిస్తే మనమందరం కలిసి అతణ్ణి అణగదొక్కాలని చూస్తాం. కానీ, ఒక్క విదేశీయుడు వచ్చి మనల్ని తన్నుజూస్తే అంతా చక్కబడుతుంది. మనం అలాంటి దానికి అలవాటుపడి ఉన్నాం. మనకు అలాంటిది అలవాటయిందా? లేదా? మరి బానిసలు గొప్ప నాయకులు కాగలరా? కాబట్టి బానిసలు కావడం మానుకోండి. రానున్న యాభై సంవత్సరాల వరకు, ఈ మన దివ్య భారతమాతే, మన అధిష్ఠానదేవతగా ఉండుగాక! ❖

సంఘటితంగా పనిచేయండి. కపటం, స్వార్థం ఎంతమాత్రం ఉండకూడదు. - స్వామి వివేకానంద

దేశభక్తి దైవభక్తి

– స్వామి అర్చనానంద



భక్తి అంటే 'అనన్యమైన ప్రేమ, శ్రద్ధ, పూజ్యభావం' అని చెప్పవచ్చు. మనం జన్మించిన దేశం, ఆ దేశ ప్రజలు, ప్రదేశాలు, తీర్థక్షేత్రాలు, విభిన్న సంస్కృతులు – ఇలా దేశానికి చెందిన ప్రతి ఒక్క విషయం పట్ల అనన్యమైన ప్రేమ, శ్రద్ధ, పూజ్యభావం కలిగి ఉండడమే 'దేశభక్తి'. 'దేశభక్తి' అంటే ఆగష్టు 15 – స్వాతంత్ర్య దినోత్సవం రోజున, ముచ్చటైన మువ్వన్నెల జాతీయ జెండాను ఎగురవేసి, వందన సమర్పణ చేయడం మాత్రమే కాదు. 'I love India – నేను భారతదేశాన్ని ప్రేమిస్తున్నాను' అని తలపైన, చొక్కాలపైన, వాహనాలపైన స్టిక్కర్లు అతికించుకొని తిరగడం మాత్రమే కాదు.

'దేశమంటే మట్టి కాదోయ్... దేశమంటే మనుషులోయ్' అన్న మహాకవి గురజాడ మాటలను మరచిపోయి, కోట్లాది నిరుపేదలు, నిరక్షరాస్యులు, కష్టజీవులు, అన్నార్తులను పట్టించుకోకుండా, షడ్రసోపేతమయిన భోజనాలు ఆరగిస్తూ, విలాసవంతమైన జీవితాలు గడుపుతూ ఉన్నవాళ్ళను దేశద్రోహులన్నారు స్వామి వివేకానంద.

"So long as the millions live in hunger and ignorance, I hold every man a traitor who, having been educated at their expense, pays not the least heed to them – కోట్లాది నిరుపేదలు ఆకలితో, అజ్ఞానంతో అలమటిస్తూ ఉన్నంత కాలం ఆ నిరుపేదల కష్టార్జితంతో విద్యనేర్చి, వారి గోడు కొంచమయినా పట్టించుకోని ప్రతి ఒక్కరినీ 'దేశద్రోహి' అంటాను" అని మనందరి గుండెలలో 'దేశభక్తి' బాంబుల్ని పేల్చిన మహోన్నత దేశభక్తుడు స్వామీజీ.

దేశసేవ ఎలా చేయాలి? దేశభక్తిని ఎలా అలవరచుకోవాలి?

1. కోట్లాది నిరుపేదలు, కూలీలు, కార్మికులు మన భారతమాత బిడ్డలు, మన సోదరీ సోదరులు రోజుకు మూడు పూటలా కడుపు నిండా పోషక ఆహారం లేకుండా చద్దన్నమో, గంజో, ఎన్నోసార్లు ఏమీ లేక కొళాయి నీళ్ళే త్రాగి చావలేక బ్రతుకులీడుస్తున్నారు. మనం మాత్రం షడ్రసోపేతమయిన భోజనాలు చేస్తున్నాం! ఈ విందులూ, విలాసాలూ కాస్తయినా తగ్గించి, అలా మిగిలిన ధనంతో నిరుపేదల, వికలాంగుల, అనాథల, వృద్ధుల అవసరాలను తీర్చి వారిని సంతృప్తి పరచగలిగితే ఆ క్షణంలో వారి కళ్ళల్లో తళుక్కుమనే ఆనందాన్ని తనివి తీరా ఆస్వాదించవచ్చు. అప్పుడు దివ్యమైన వారి చిరునవ్వులో, తృప్తినిండిన ఆ కన్నుల్లో మనకు 'నారాయణుడే' కనిపిస్తాడు! 'నరనారాయణసేవ' అంటే ఇదే మరి!

2. నిరుపేదల పిల్లలు పాఠశాలలు, కళాశాలల విద్యలకు నోచుకోవడం లేదు. తల్లితండ్రులు ఇద్దరూ రెక్కలు ముక్కలు చేసుకుని కష్టపడినా వారికి కడుపు నిండా అన్నమే పెట్టలేనప్పుడు వారి చదువులకు ఎక్కడ నుండి డబ్బు తేగలరు! అందుచేత పిల్లల్ని కొందరు బడికే పంపించడం లేదు. మరికొందరు ప్రాథమిక తరగతుల్లోనే చదువుకు స్వస్తి పలికి, తల్లితండ్రులతో పాటు కూలీకి వెళ్ళిపోతున్నారు. ప్రతిభ, సామర్థ్యం కలిగిన ఎందరో విద్యార్థులు ఆర్థిక సమస్యల కారణంగా చదువు మానేస్తున్నారు. ఆర్థిక స్థోమత గలవారు వారి పిల్లల్ని ఖరీదైన విద్యాసంస్థల్లో చదివిస్తున్నారు. తప్పేమీ లేదు, చాలా మంచిది! కానీ మన వీథిలోనే ఉంటున్న ఓ పేద విద్యార్థికి విద్యాభ్యాసానికి వీలైనంతలో ఆర్థిక సహాయం అందించడం కూడా 'నా బాధ్యత, నా ధర్మం' అని భావించాలి. అలా ఆ నిరుపేద విద్యార్థి ఓ గొప్ప పారిశ్రామిక వేత్త, వ్యాపార వేత్త కావచ్చు! ఆ విద్యార్థి గొప్పవాడై మీ ఇంటికి వచ్చి, 'సార్! మీరు చేసిన సహాయంతో నేనింత వాడినయ్యాను!


మీకు చాలా ధన్యవాదాలు!' అంటూ మీకు పాదాభివందనం చేసినప్పుడు మీ కళ్ళలో తిరిగే ఆనంద భాష్పాలను ఎన్ని కోట్లతోనయినా కొనగలరా? దేశానికి గొప్ప విద్యావంతులను అందజేయడం కూడా దేశభక్తే!

3. 'ఆరోగ్యమే మహాభాగ్యం'. 'సర్వేసంతు నిరామయాః' అంటుంది వేదం. మన ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి పౌష్టికాహారం, వ్యాయామం, వ్యాధిగ్రస్థులమయితే తగిన మందులు, పరీక్షలు, చికిత్సలు చేయించుకుంటాం. ఎంతోమంది ఆరోగ్యాన్ని కూడా పట్టించుకోకుండా పగలూ రాత్రీ కష్టపడి లక్షలు, కోట్లు సంపాదిస్తారు. తీవ్ర శ్రమ, ఒత్తిడి, ఆందోళన, నిద్రలేమి కారణంగా రోగాలను కొనితెచ్చుకుంటారు. చికిత్స కోసం సంపాదనను ఖర్చుపెడుతూ ఉంటారు. ఇక రెక్కాడితేగాని డొక్కాడని పేదవారికి రోగాలు వస్తే వారిని ఆదుకునే నాథుడు లేడు. అలాంటి నిర్భాగ్యుల వైద్యం కోసం సంపాదనలో కొంతైనా వెచ్చించగలిగితే, ఒకనాడు బడిలో 'నేను నా దేశమును ప్రేమించు చున్నాను... ప్రతి భారతీయుడూ నా సహోదరుడే...' అని చేసిన ప్రతిజ్ఞను నెరవేర్చినట్లే!

నిరుపేదలు, నిరక్షరాస్యులు, రోగులకు అన్నదానం, విద్యాదానం, ఆరోగ్య దానం ఈశ్వరార్పణ బుద్ధితో చేస్తే, ఆ నిరుపేదలో ఉన్న పరమాత్మ సంతోషిస్తాడు! మనసారా దీవిస్తాడు! 'మానవ సేవే మాధవ సేవ' అనే స్వామీజీ ప్రబోధాన్ని ఆచరణాత్మకం చేసినట్లే!

4. మన ఇంటినీ, పరిసరాలనూ, వీధులనూ పరిశుభ్రంగా ఉంచుకోవాలి. ఇంటిలోని చెత్తనంతా తెచ్చి వీధిలో వేసి, వేయి దేవుళ్ళకు పూజలు చేసే వారెంతమందో! మనం రోడ్ల వెంబడీ, దారుల వెంబడీ చెత్తాచెదారం నిర్లక్ష్యంగా పారవేస్తాం. ఎక్కడ పడితే అక్కడ ఉమ్మి వేస్తాం, కాలకృత్యాలు తీర్చుకుంటాం, వ్యర్థపదార్థాలు పారవేస్తాం... నిజంగా మనం అవధూతల, పరమహంసల పరంపరలో అవతరించిన వారమే!... సందేహమే లేదు!

కానీ అమెరికా, జర్మనీ, జపాన్, బ్రిటన్ – ఈ దేశాలన్నింటిలోనూ నిరుపేదలుండే పల్లెలు కూడా చాలా శుభ్రంగా ఉంటాయి. ప్రతి పౌరుడూ తమ ఇంటినే కాదు, వీధులనూ, రోడ్లనూ, పార్కులనూ – తద్వారా తమ దేశాన్ని శుభ్రంగా, శుచిగా ఉంచుకోవాలని తపన పడతారు. చేతికర్ర సాయంతో వీధిలో నడిచే అతి వృద్ధులు కూడా ఎక్కడయినా చిన్న చెత్త కాగితమో, వ్యర్థమో కనిపిస్తే తమతో పాటు తెచ్చుకొన్న ప్లాస్టిక్ కవర్‌లో వేసుకొని దగ్గరలోని చెత్తకుండీలో పారవేస్తారు. పెద్ద ఆఫీసర్ల నుండీ అతి చిన్న క్లీనర్, స్వీపర్ వరకూ 'నేను నా దేశం కోసం పనిచేస్తున్నాను, నా దేశం సమృద్ధిగా ఉండాలి' అనే భావంతో పనిచేస్తారు. మనం అనవసరంగా విదేశీయుల్ని విమర్శించడానికి బదులుగా వారిలో ఉండే ఈ దేశభక్తి, సేవాతత్పరత, అంకితభావం, సమయపాలన, క్రమశిక్షణ మొదలయిన మంచి లక్షణాలను ఎందుకు నేర్చుకోకూడదు?



నిజానికి దేశభక్తి కలిగిన వాడే దైవభక్తి కలిగినవాడు. దేశభక్తి లేని దైవభక్తి విలువలు లేని విద్య వంటిది; సుగంధం లేని పూల వంటివి. అందుకే స్వామీజీ అన్నారు – "తన సొంత తల్లిని ప్రేమించి, సేవించలేనివాడు ఇతరుల తల్లుల్ని ఎలా సేవిస్తాడు?" 'ఇతరుల కోసం జీవించే వారే నిజంగా జీవిస్తారు' అని నిజమైన దేశభక్తి మనకు నేర్పించి దేశభక్తిని దైవభక్తి స్థాయికి చేర్చిన ఏకైక దేశభక్తుడు, దైవభక్తుడు మన వివేకానందుడు. స్వామీజీ బాటలో నడిచిన మహాత్మాగాంధీ రామభక్తితో; సుభాష్ చంద్రబోస్, రవీంద్రనాథ్ టాగూర్, జగదీశ్ చంద్రబోస్ మొదలైన వారంతా కాళీ భక్తితో నిండిన దేశభక్తులు.

శ్రీరామకృష్ణులు, శారదామాత స్వయంగా తమ జన్మ భూమిని పూజించారు; శ్రీశారదాదేవి జయరాంబాటి నుండి బయటకు వెళ్ళేటప్పుడూ తిరిగి వచ్చేటప్పుడూ ఆ మట్టిని స్పృశించి, భక్తితో 'జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసీ – జననీ, జన్మభూమి స్వర్గం కన్నా గొప్పవి' అని ప్రణమిల్లే వారు. ఆ అవతార మూర్తులు ఆచరించి బోధించిన 'దేశభక్తి –దైవభక్తి' బాటలో మనం కూడా నడవడం ప్రారంభిద్దాం. ❖

దేశభక్తులారా! ఆకలితో అలమటిస్తున్న వారిని చూసి మీ హృదయం కలచివేస్తోందా? వారి కోసం మీరు ఆరాటపడుతున్నారా? దేశభక్తులు కావడానికి ఇదే మొదటి మెట్టు. - స్వామి వివేకానంద

మనసు... మాత్సర్యం

– స్వామి శితికంఠానంద

తండ్రి కళ్ళులేని వాడిని తనకు భర్తగా ఎంపిక చేశారని విన్నది ఆ రాజనందిని. వెంటనే పర పురుషుడిని ఇక చూడనని నిశ్చయించుకుంది. భర్తకు చూపులేనప్పుడు తనూ ప్రపంచాన్ని చూడాలనుకోలేదు. వెంటనే తన కళ్ళకు గంతలు కట్టుకుంది. జీవితాంతం వాటిని తీయలేదు. ఆ మహాసాధ్వే గాంధార రాజు సుబలుడి గారాలపట్టి గాంధారి.

పతివ్రతా శిరోమణి, మహాశీలవతి, శివభక్తురాలు ఐన ఆ రాజతనూజకు ఆమె కోరిక మేరకు నూరుగురు పుత్రులు కలిగేటట్లుగా మహాశివుడు క్రితం జన్మలో వరాన్ని ప్రసాదించాడు. ఆమె గృహానికి ఒకసారి వ్యాసమహర్షి వేంచేశాడు. భక్తి శ్రద్ధలతో మహర్షిని సేవించింది. ముని సంతుష్టుడై శివుడు ప్రసాదించిన వరాన్నే మళ్ళీ అనుగ్రహించాడు. గాంధారి సంతృప్తురాలైంది. కాలక్రమంలో గర్భం దాల్చింది. రెండు సంవత్సరాలైంది. ఇంకా సంతానం కలగలేదు. ఈ లోపు తన కన్నా వయస్సులో చిన్నది ఐన సోదరి కుంతికి బాలార్కుడి వంటి కొడుకు (ధర్మరాజు) పుట్టాడని విన్నది. అంతే ఓర్వలేకపోయింది. ఆమె కొడుకే రాజ్యపాలనకు అర్హుడవుతాడేమో అనుకుంది. పట్టమహిషి ఐన తనకు ముందు పిల్లలు కలగకుండా తన కన్నా వయస్సులో పిన్న ఐన పృథకు సంతానం కలగడం భరించలేకపోయింది. రెండు సంవత్సరాల గర్భాన్ని తన చేతులతోనే విచ్ఛేదం చేసింది.

వ్యాసమహర్షి తన దివ్యదృష్టితో ఇదంతా గ్రహించాడు. వెంటనే అక్కడ ప్రత్యక్షమయ్యాడు. 'అయ్యో ఎంత పనిచేశావు? అన్నాడు. 'రెండు సంవత్సరాలైనా నాకు సంతానం కలగలేదు. మీరు నూరుగురు పుత్రులకు తల్లి నవుతానన్నారు' అంది. ఆమె జన్మనిచ్చిన మాంస ఖండాన్ని నూరుకుండలలో పెట్టించి నూరుగురు పుత్రులకు తల్లి అయ్యేటట్లు చేశాడు వ్యాసమహర్షి. కానీ మహాతేజోవంతులు అవ్వాల్సిన కొడుకులు అసూయాపరులయ్యారు. మహర్షి మాటపై విశ్వాసం ఉంచి, కుంతిని చూసి అసూయ పడకపోతే, మహా పతివ్రత, త్యాగశీలి ఐన గాంధారి సుతులు గుణసౌందర్యంలో పాండవులను మించి పోయేవారు. కానీ విధినిర్ణయం ఇంకో రకంగా ఉంది.

గాంధారిలో ఈర్ష్య, అసూయలు లేవు. కేవలం ఆ కొద్దిపాటి కాలం కుంతిని చూసి ఆమె పొందిన మానసిక వికారం ఆమె సంతానం స్వభావాన్ని అసూయ స్వభావంగా మార్చివేసింది. తద్వారా కులనాశనం జరిగింది. అంటే మహాభారత యుద్ధానికి కారణం గాంధారే అనుకోవచ్చు. దుర్యోధనుడు కాదు. శకుని అసలే కాదు. కర్ణుడు అంతకన్నా కాదు. ఇక కృష్ణ భగవానుడు కర్మాధ్యక్షుడిగా ఎవరి కర్మఫలాలను వారికి అందించడం తప్ప యుద్ధం జరగడానికి ఆయన కారణ భూతుడు కానే కాదు. శిశువు తన ఉదరంలో ఉన్నప్పుడు తల్లి తన ఆలోచనలను ఎంత జాగ్రత్తగా ఉంచుకోవాలో మనకు తెలియజేసే ప్రాచీన గాథలలో గాంధారి ఇతివృత్తం ఒకటి. పోల్చుకోవడం వల్ల జనించిన అసూయ, మాత్సర్య భావన చివరకు ఎక్కడ వరకు తీసుకువెళ్ళగలదో తెలిపే ఒక అద్భుత సుదీర్ఘ కథాకథనం మహాభారతం.

ఇక ఈ విషయాన్ని ప్రక్కకు పెడితే ఈ పోల్చుకోవడమనే రోగం మనకిప్పుడు ఒక పెనుజాడ్యమై పోయింది. సమాజాన్ని పట్టి పీడిస్తున్న ప్రబల రుగ్మతలలో ఇది మొదటిది అని చెప్పుకోవచ్చు. ఈ మాత్సర్య (వారికున్నది నాకు లేదన్న భావన) రోగాన్ని మనం పారద్రోల గలిగితే చాలా ఆనందంగా జీవించవచ్చు. ప్రతివిషయంలో మనల్ని మనం ఇతరులతో పోల్చుకుంటున్నాం. మనల్ని మనం కించపరుచుకుంటున్నాం. భగవంతుడినీ అవమానిస్తున్నాం. ప్రతి విషయానికీ ఇతరులతో పోల్చుకోవడమంటే భగవంతుడి సృష్టిలోని వైవిధ్యాన్ని ఆస్వాదించకుండా ఆయనను అవమానించడమే మరి. మనకు ఆయన ఇచ్చిన సులక్షణాలకు కృతజ్ఞతలు తెలియజేసుకుంటూ, మన ప్రత్యేక ఉనికిని అభినందించుకోవాలి. మన అందాన్ని మనమే గుర్తించాలి. ప్రక్కవాళ్ళతో ప్రతిదానికీ పోల్చుకోవడం వల్ల మనకు కొత్త ఉత్సాహం, ప్రేరణ వస్తే మంచిది. కానీ తద్భిన్నంగా అసూయ, ఆత్మన్యూనత, ఆత్మస్థైర్య విలోమం కలిగితే ప్రమాదం. ఇతరుల ఆస్తిపాస్తులను చూస్తూ, వారికున్న వస్తుసంపదను చూస్తూ, అదే విధమైన వస్తువులను మనం కూడా పొంది, వారితో సమానంగా ఉండాలని కోరుకుంటున్నాం. ఈ తుల్యత కూడదు. తెలివైన మనిషి ఎప్పుడూ ఇక్కడ పోటీ పడకూడదు. వారు ఈ వస్తువులను ఏర్పరచుకోవడానికి చెల్లించిన మూల్యం ఏమిటో భగవంతుడికే తెలుసు. అధర్మ మార్గాన వాటిని సముపార్జించుకున్నట్లయితే వాటిని శాంతియుతంగా అనుభవించడం కల్ల.

ఇక మనం చేస్తున్న రెండో తప్పు ఏమిటంటే ఉపకరణాల ద్వారా మన అస్తిత్వాన్ని నిర్వచించుకోవడానికీ, నిరూపించడానికీ ప్రయత్నించడం. మనకున్న మేడలు, మిద్దెలు, ఇతర స్థిర చరాస్తులు మన స్థాయికి కొలబద్దలు కావు. మన మనసులో ఉన్న ఆధ్యాత్మిక భావాలు, మన మేధోవికాసం, భగవంతుడిపై మనకున్న భక్తి – ఇవే మన ఔన్నత్యానికి నిజమైన ప్రమాణాలు.

చిన్న పిల్లలలో కూడా ఈ రోజు మాత్సర్యం ఒక పెద్ద జబ్బులా ప్రబలుతోంది. తమ కక్షాధ్యాయిల దగ్గర ఉన్న వస్తువులను చూసి అవి తమకు కొనిపెట్టమని తల్లితండ్రులను మారాం చేయడం సాధారణంగా చూస్తున్నాం. యువత కూడా తమను తాము మిత్రులతో, సహాధ్యాయులతో పోల్చుకుంటూ, తల్లితండ్రులకు ఆ సామర్థ్యం ఉన్నదా? లేదా? అని పరిశీలించకుండా, వారి దగ్గర ఉన్న వస్తువులను తమకు కొనిపెట్టమని వేధించడం, వారు అడిగినవి ఇవ్వకపోతే అలగడం, కినుక వహించడం చేస్తున్నారు. బాహ్య వస్తువులు, ఆడంబరాలేవీ తమ ఔన్నత్యానికి ప్రతీకలు కావనీ, గుణసంపద, జ్ఞానం మాత్రమే వ్యక్తి స్థాయిని నిర్ధరిస్తాయనీ పిల్లలు, యువత గ్రహించి వీటిని పెంచుకోవడంపై దృష్టిపెట్టాలి.

పుస్తక పఠనంపై ఆసక్తిని పెంచుకొని మంచి పుస్తకాలను స్నేహితులుగా చేసుకోవాలి. జీవితం అల్పం, జ్ఞానం అనంతం. ఈ విషయాన్ని సదా గుర్తుపెట్టుకొని సమయం విలువను గుర్తించి, వస్తు వ్యామోహాన్ని వీడి వాస్తవ ప్రపంచంలో జీవిస్తూ చక్కటి భావసంపదతో మనస్సును పరిపుష్టం చేసుకోవాలి. పవిత్రంగా తీర్చిదిద్దుకోవాలి. తమకు పుట్టుకతో వచ్చిన మంచి లక్షణాలను, ఇతరులకు మనలో నచ్చిన గుణాలను మరింతగా పెంపొందించుకుంటూ, మన వ్యక్తిత్వంలోని బలహీన లక్షణాలను అధిగమించడానికి ప్రయత్నించాలి.

ఇక చదువులు పూర్తి చేసుకొని, ఉద్యోగాలు చేస్తూ, కుటుంబ జీవితంలో ప్రవేశించి తాము స్థిరపడిపోయామని అనుకునే వారు కూడా కొంచెం పదార్థ దృష్టిని తగ్గించుకుని పారమార్థిక దృష్టిని పెంచుకోవాలి. విలాసాలపై దృష్టిపెట్టామంటే 'నేను అంటే దేహమే' అన్న అసత్య భావననూ, అల్పమైన ఆలోచననూ సత్యం చేయడానికి ప్రయత్నిస్తున్నామన్నమాట. అది వ్యర్థ ప్రయత్నం. అలాంటి ప్రయత్నం ద్వారా మనిషికి మిగిలేది ఖేదమోహాలే. మన ధర్మ గ్రంథాలన్నీ అది మహా అజ్ఞానం అని మనకు బోధిస్తున్నాయి. ఈ విషయాన్ని సదా జ్ఞప్తిలో ఉంచుకోవాలి. నిరంతరం 'ఈ రక్తమాంసపు లంపటం నా కెందుకు?' అని విచారణ చేస్తూ, దేహధ్యాసను తగ్గించుకొని దైవధ్యాసను పెంచుకొని, శాంతి తెరువును కాంచమనీ, పరమసౌఖ్య అంచులకు చేరుకోమనీ ఋషుల బోధ.. తద్విరుద్ధంగా మనం కాయమే పరమ ఉనికిగా బ్రతకడానికి సిద్ధపడుతున్నాం. అది ప్రమాదం అని తెలుసుకోలేక పోతున్నాం. ఈ పాంచభౌతిక శరీరంతో తాదాత్మ్యతే సర్వదుఃఖాలకు కారణమని గ్రహించలేకున్నాం. రోజురోజుకీ వ్యక్తి మానసిక ఆరోగ్యం పతనమవుతున్నదనిపిస్తుంది, ఇదే శారీరక రోగంగా వ్యక్తమవుతోంది. మనసులో ఉన్న వ్యథను తొలగించుకోకుండా శరీరానికి ఏ మందు తీసుకున్నా స్వస్థత చేకూరదు. ఈ వ్యథను తొలగించుకోవడానికి ఆధ్యాత్మికతే మార్గం. సమస్యలన్నీ సాపేక్షాలే. ఒకే సమస్యకు అందరూ ఒకే రకంగా స్పందించరు. అంటే సమస్య తీవ్రత అనేది సమస్యపై లేదు. మనం స్పందించే తీరులోనే ఉంది. అంతా భగవంతుని ఇచ్ఛ మేరకు జరుగుతుంది. అంతా మన మంచికి జరుగుతుంది అన్న భావనను మనం దృఢపరచుకోవాలి. ఇది కేవలం తాత్కాలిక ఉపశమనం కోసం చెప్పింది కాదు. ఇది శాశ్వత సత్యం. ఈ పరమ సత్యాన్ని మనం మరచిపోవడం వల్ల మనం చిన్న సమస్యలకు తీవ్రంగా స్పందిస్తున్నాం. ప్రతి వ్యక్తీ దైవం తనకొక్కడికే మహా కష్టాలను ఇచ్చాడని భావిస్తున్నాడు. భ్రమపడుతున్నాడు. భయపడుతున్నాడు. అజ్ఞానం వల్ల అల్ప కష్టాలకు అధికంగా చలించే వ్యక్తులను తల్లితండ్రులు లేదా భార్యా పిల్లలు లేదా బంధు మిత్రులు చేరదీసి అనునయన వాక్యాలతో సాంత్వనను అందించాలి. అంతేకానీ తోటి సమాజాన్ని దృష్టిలో పెట్టుకొని, బాధలో ఉన్న వ్యక్తి ఇంకా తీవ్రంగా స్పందించేలా చేయకూడదు. అతడిపై ఒత్తిడిని పెంచరాదు. కానీ చాలామంది ఈ రోజుల్లో బాధ్యతారాహిత్యంతో ప్రవర్తిస్తున్నారు. ఒత్తిడిలో ఉన్న వ్యక్తిని పెను ఒత్తిడికి గురిచేస్తున్నారు. వ్యక్తుల ప్రవర్తనలో మానవీయత లోపిస్తుంది. మానసిక ఆరోగ్యం చెడితే శరీరం తప్పక రోగగ్రస్థమవుతుంది. అది నియమం.

మనసును ఆరోగ్యకరమైన ఆలోచనలతో నింపకుండా, మనసుకు స్వస్థత చేకూర్చకుండా కేవలం శరీరానికి చికిత్స చేయడం వల్ల ప్రయోజనం ఉండదు. మన వైద్యవ్యవస్థ ప్రస్తుతం ఈ సమస్యను ఎదుర్కోవడానికి సంసిద్ధమై లేదు.

చిన్నప్పటి నుంచి ప్రతి వ్యక్తీ తనను తాను మిగతా వారితో అనుసంధానం చేసుకోవడానికి ప్రయత్నించాలి. తాను సమాజంలో భాగం కాబట్టి సమాజం బాగుంటేనే తాను బాగుంటానని తెలుసుకోవాలి. విద్యార్థి దశ నుండే పరోపకార భావాలను వారిలో ప్రవేశపెట్టాలి. తోటిమనిషి సేవలో ఉన్న ఆనందాన్ని రుచి చూసినప్పుడు హృదయంలో ఆనందం పెల్లుబుకుతుంది. సింహ సదృశమైన శక్తి జాగృతమవుతుంది. మనసు ఆనంద తాండవం చేస్తుంది. సమగ్ర వికాసానికి అది దారి చూపుతుంది. దీనికి విరుద్ధంగా ప్రతి మనిషినీ కరడుగట్టిన స్వార్థపరుడిగా చేస్తున్నాయి ప్రస్తుత చదువులు. దానితో మనిషి నిరంతరం తన గురించి ఆలోచించి ఆలోచించి సగం పిచ్చివాడవుతాడు. ఆరోగ్య రీత్యా కూడా పరోపకారం వ్యక్తికి మహా ప్రయోజనకారి.




ఈ భావనలతో మనసును పరిపుష్టం చేసుకోకపోతే అభద్రతా భావం, ఒత్తిడి మనిషిని క్రుంగదీస్తుంది. తద్వారా మానసిక వికలాంగుల సంఖ్య పెరిగే ప్రమాదముంది.

ఈ రోజుల్లో మనం జాగ్రత్తగా పరిశీలిస్తే, మనం అనాగరకులూ, వెనుకబడినవారు అని అనుకొని ఆదివాసీలు ఎవరినైతే జనజీవన స్రవంతిలోకి తీసుకు రావాలనుకుంటున్నామో, వారి మానసిక శారీరక ఆరోగ్యం మన కన్నా ఎన్నో రెట్లు మెరుగ్గా ఉంది అని గమనిస్తాం. కారణం, వారికి పోల్చుకోవడానికి ఉన్న సమాజం చాలా చిన్నది. వారిలో మాత్సర్యం లేదు. వారికి మానసిక సంక్లిష్టాలు ఏర్పడవు. సరళంగా, సహజంగా జీవిస్తారు. పిచ్చిపట్టిన వాళ్ళు, డిప్రెషన్‌లోకి వెళ్ళినవారు మనకు కనబడరు. ఇక ఆత్మహత్య అనే పదానికే వారికి అర్థం తెలియదు. కావున మనం పోటీ భావనను తగ్గిస్తూ పోవాలి. సరిపోల్చడాన్ని నిరాదరించాలి. మాత్సర్య భావనను విడనాడాలి. ప్రతి వ్యక్తీ తన శక్తి కొలదీ, తనదైనరీతిలో ఎదగడానికి సహాయపడాలి. అప్పుడే ఇహపరాలలో శాంతిసౌఖ్యాలను పొందగలుగుతాం. ❖

ప్రియమిత్రమా! ధీరుడవ్వనిదే ఎవరికైనా భగవంతుని యందు శ్రద్ధ, సమర్పణాభావం కలుగుతుందా? ధీరుడవైతేగానీ నీ నుండి అసూయా ద్వేషాలు తొలగిపోవు. - స్వామి వివేకానంద

భరతభూమి నమోస్తుతే!

– శ్రీమతి సుధామూర్తి, ఇన్ఫోసిస్ ఫౌండేషన్



ఓ కార్యక్రమంలో భాగంగా ఒకసారి నేను టిబెట్టులో పర్యటించాల్సి వచ్చింది. అక్కడి సంస్కృతి కొంతవరకు భారత–చైనా సంస్కృతులను పోలి ఉంటుంది. వారు అనుసరించే మతం మాత్రం భారతజన్యమే! వాళ్ళ లిపి మీద బెంగాలీ ప్రభావం ఉంది. బౌద్ధమతంలోని హీనయానం, మహాయానాలను జపాన్, కొరియా, శ్రీలంక, బర్మా, థాయిలాండ్, చైనా తదితర దేశాల్లో అనుసరిస్తూ ఉంటే, మూడవదైన వజ్రయానాన్ని మాత్రం టిబెట్టులోనే అనుసరిస్తున్నారు. ఏడో శతాబ్దం తరువాత గొప్ప బౌద్ధ గురువులందరూ భారతదేశం నుంచి ఆ దేశానికి వలసపోయినవారే! వారు టిబెట్టులో గొప్ప గొప్ప మఠాలు, విద్యాలయాలు స్థాపించారు. అక్కడి సాహిత్యంలో ఓ ప్రసిద్ధమైన కథ ఉంది. ఒకప్పుడు టిబెట్టు ప్రభువును అతని శత్రువులు రహస్యంగా అపహరించుకుపోయారట! అతణ్ణి విడిచి పెట్టాలంటే పరిహారంగా ఆ రాజు బరువుకు సరితూగే బంగారం కావాలని శత్రువులు అతని కుమారునికి వర్తమానం పంపారట! అప్పుడు ఆ రాజు కూడా రహస్యంగా తన కుమారుడికి మరో వర్తమానం పంపుతూ, 'నాయనా! జీవితం శాశ్వతం కాదని బుద్ధుడు చెప్పాడు. మనకు కనిపించేదంతా నశించేదేనట! నా ప్రాణం కోసం ఏ మాత్రం బంగారాన్ని వృథా చేయవద్దు. ఆ బంగారాన్ని భారత దేశం నుంచి ఓ పండితుణ్ణి తెచ్చుకునేందుకు ఉపయోగించు. అతను మన దేశంలో అనేక విద్యాలయాలను స్థాపించి మన ప్రజల జీవితాలను ప్రభావితం చేయగలడు' అని సూచించాడట!

టిబెట్టు రాజులకు గౌతమ బుద్ధుడన్నా, భారతదేశమన్నా అంత ఆరాధన! కాలప్రవాహంలో ఆ దేశంలో రాజకీయ అనిశ్చితి నెలకొన్నా, వారికి మనదేశంపై ఉన్న పూజ్యభావం మాత్రం చెక్కుచెదరలేదు. అదే విధంగా టిబెట్టులో తమ మతాధిపతి అయిన దలైలామాపై కూడా ఎనలేని ఆరాధన. 'దలైలామా' అంటే వారి భాషలో 'జ్ఞానసముద్రం' అని అర్థం. 1959లో ఇరవై అయిదు సంవత్సరాల వయసప్పుడు దలైలామా తన సహచరులతో పధ్నాలుగు రోజులు ప్రయాణం చేసి భారతదేశం చేరుకున్నారు. భారతప్రభుత్వం వారికి హిమాచల్‌ప్రదేశ్‌లోని 'ధర్మశాల'లో ఆశ్రయం కల్పించింది. టిబెట్టు ప్రజలు ఇప్పటికీ దలైలామాను పూజిస్తూ ఉంటారు. ఇప్పుడు టిబెట్టు చైనాలో భాగమైంది. ఆ దేశ రాజధాని 'లాసా'లో పర్యటించడం నాకు ఓ కొత్త అనుభూతిని కలిగించింది.

లాసా నగరం మధ్యలో జోఖాంగ్ దేవాలయం ఉంది. ఆ పరిసరాల్లో నేను నడుస్తున్నప్పుడు అందరూ నన్ను గౌరవభావంతో చూడడం కనిపించింది. ఆ సాయంత్రం టిబెట్ నాగరకతకు నిలయమైన 'యెర్లాంగ్ లోయ'కు వెళ్ళి, అక్కడొక చిన్న మఠాన్ని సందర్శించాను. అక్కడ ఒక ఎనభై ఏళ్ళ వృద్ధురాలు, పక్కన పాతికేళ్ళ యువకుడు ఉన్నారు. నేను వెళ్ళే సరికి ఆలయం ముందు ఆమె ప్రణామాలు చేస్తూ ఉంది. నన్ను తేరిపార చూస్తూ, మనవడికి వాళ్ళ భాషలో ఏదో చెబుతోంది. ఆ మాటలే మళ్ళీ, మళ్ళీ పునరావృతం చేస్తూ ఆ వృద్ధురాలు నన్ను సమీపించి నా చేయి పట్టుకొని ముద్దుపెట్టుకొని కళ్ళకద్దుకుంది. ఆ మాటలే అనుకుంటూ వెనక్కు వెళ్ళిపోయింది.

ఇంతలో ఆమె మనుమడు నా దగ్గరకు వచ్చాడు. 'మేడమ్! మా అమ్మమ్మ అలా చేసినందుకు ఏమీ అనుకోకండి. పాతకాలం పల్లెటూరి మనిషి. ఎదుటివారితో ఎలా ప్రవర్తించాలో తెలీదు. ఆమె తన మనస్సులోని ప్రేమను అణచుకోలేక అలా చేసింది' అన్నాడు. అతను చక్కని భారతదేశపు ఆంగ్లయాసలో మాట్లాడాడు. నా ఆశ్చర్యాన్ని గమనించి 'నా పేరు కె–త్సాంగ్. నేను చెన్నైలోని లయోలా కళాశాలలో చదివాను. ఇప్పుడు ఇక్కడ ఓ హోటల్ నడుపుతున్నాను. మా అమ్మమ్మ మీకు కృతజ్ఞతలు చెబుతున్నది' అన్నాడు. 'నాకు కృతజ్ఞతలు ఎందుకు?' అన్నాను.

'లేదు మేడమ్! మా ఆరాధ్యదైవం బుద్ధుడు మీ దేశంలోనే అవతరించాడు. మా దలైలామాకు మీరు గౌరవంగా ఆశ్రయమిచ్చారు. ఆయన మాకు సజీవదైవం. మా అవ్వకు ఆయనంటే ప్రాణం. అందుకే మీరు అక్కడ నుంచి వచ్చారని గుర్తుపట్టి అమ్మమ్మ పులకించిపోయింది. 'మీ భారతదేశం పవిత్రభూమి. అక్కడ పుట్టిన మీరు ధన్యులు' అని మా అమ్మమ్మ పదే పదే అంటోంది. నా వేళ్ళ మీది తడికి అర్థం అప్పుడు తెలిసింది. ❖

సేకరణ: జి. సతీష్

యువవాణి

– స్వామి పరిజ్ఞేయానంద

ఆ బాధ్యత మనందరిదీ!

ఎస్. నందిని, కళాశాల విద్యార్థిని, హైదరాబాదు

ప్రశ్న: రామకృష్ణ మఠం ముందు కాలిబాట (foot path) **పైన చాలా మంది పేదవాళ్ళు కూర్చొని ఉండడం రోజూ చూస్తున్నాను. వారి గురించి ఆలోచించేవాళ్ళే లేరు. 'మానవసేవే –మాధవసేవ' అన్న స్వామి వివేకానంద సందేశాన్ని ఆచరించాల్సిన రామకృష్ణ మఠం వారు ఆ పేదవాళ్ళను ఎందుకు పట్టించుకోవడం లేదు?**

జవాబు: "మనం మహాత్ముల సందేశాలను ఎన్నో చదువుతాం. అవన్నీ ఇతరుల కోసమే గానీ, మన కోసం కాదని భావిస్తాం. అంతేకానీ మనల్ని మనం పరీక్షించుకోవడానికి ఇష్టపడం" అని సోక్రటీస్ మానవ స్వభావాన్ని విశ్లేషించారు.

స్వామి వివేకానంద 'మానవసేవే – మాధవసేవ' అన్న సందేశాన్ని కేవలం రామకృష్ణ మఠం వారి కోసమే కాదు, సర్వ మానవాళినీ ఉద్దేశించి చెప్పిన సందేశమది. అంటే ఆ సర్వమానవాళిలో మనమూ ఉన్నామనీ, ఆ సందేశం మనకూ వర్తిస్తుందనీ మరచిపోకూడదు.

సాధారణంగా సమాజంలో చాలామంది ఇతరుల బాధ్యతల్ని గుర్తుచేయడానికి ముందుంటారు. కానీ బాధ్యతవహించడానికి మాత్రం వెనకుంటారు. ప్రతి పౌరుడి సామాజిక బాధ్యతను గుర్తుచేసే ఓ లఘునాటిక ఈ మధ్య చాలా ప్రాచుర్యం పొందింది.

అదేమిటంటే... రోడ్డు మధ్యలో ఓ పెద్ద రాయి అడ్డుగా పడివుంది. ఒకతను కారులో వెళుతూ ఆ రాయి మీదుగా వెళ్ళిపోయాడు; ఇంకొక వ్యక్తి స్కూటర్ మీద వెళుతూ ఆ రాయిని చూసి పక్కకు తప్పుకొని వెళ్ళిపోయాడు; నడుచుకుంటూ వెళుతున్న మరోవ్యక్తి ఆ రాయిని దాటి వెళ్ళిపోయాడు; అదే దారిలో ఒక అంధుడు చేతికర్ర సహాయంతో రోడ్డును దాటుతున్నప్పుడు అక్కడ ఒక రాయి ఉందని గ్రహించాడు. అతడు మిగతావాళ్ళలాగ పట్టించుకోకుండా వెళ్ళిపోలేదు. ఇది నగర పాలక సిబ్బంది బాధ్యత కదా! అని అనుకోలేదు. ఆ రాయిని తానే తీసి పక్కకు పడేశాడు. సమాజంలో ప్రతీ పౌరుడు బాధ్యతతో ఎలా వ్యవహరించాలో తెలియజేయడమే ఈ కథ ఉద్దేశం!

పేదవారిని చూసి 'అయ్యో! పాపం వారిని ఎవ్వరూ పట్టించుకోవడం లేదే' అని కేవలం మాటలతో సానుభూతి చూపించడం కాదు. మానవత్వం ఉన్న మనిషిగా, బాధ్యతగల పౌరుడిగా మనవంతు సహాయాన్ని అందించడమే మన కర్తవ్యం. మానవునిలోని మాధవుణ్ణి ఆరాధించడమంటే అదే!

ఇంతకీ ఆ పేదవారు కాలిబాటపైన ఎందుకు ఉంటున్నారో మీకు తెలుసా! ప్రతీరోజు రామకృష్ణ మఠంలో అనాథలకు, వికలాంగులకు, వృద్ధులకు అన్నదానం జరుగుతుంది. అన్నదానం ప్రారంభమయ్యే ముందు వారంతా అక్కడ నిరీక్షిస్తున్నవాళ్ళే అన్న సంగతి మీరు గ్రహించగలరు.

దేశంలో ప్రతి ఒక్కరూ సుఖ సంతోషాలతో ఉండాలంటే ప్రతీ పౌరుని మనస్సూ ఒక సేవా కేంద్రం కావాలి. ప్రతి వ్యక్తి హృదయమూ ఒక స్వచ్ఛంద సంస్థ కావాలి. సమాజంలో తోటివారికి చేతనైనంత సహాయం చేయాలన్న భావన ప్రతి ఒక్కరిలోనూ అంకురించాలి.

ఒకసారి అమెరికా అధ్యక్షుడు అబ్రహాం లింకన్ కారులో వెళుతూ రోడ్డు ప్రక్కన బురద గుంటలో కూరుకుపోయిన పంది అరుపులను విన్నాడు. వెంటనే డ్రైవర్‌ను కారు ఆపమని చెప్పి, ఆయనే స్వయంగా బురద గుంటలో దిగి ఆ మూగజీవిని బయటకు తీశాడు. అందువల్ల



ఆయన బట్టలు బురదయ్యాయి. అప్పుడు ఆయన డ్రైవర్ 'సర్! ఈ బురద బట్టలతో మీరు సెనేట్‌కు ఎలా వెళతారు?' అని ఆశ్చర్యంగా అడిగాడు. అందుకు లింకన్ 'ఆ పందిని రక్షించడం వల్ల నా మనోవ్యథ తొలగింది. ఇప్పుడు నా బట్టలు మురికిగా ఉన్నా నా మనస్సు పవిత్రమైంది' అని నవ్వుతూ బదులిచ్చాడు.

నిజానికి అబ్రహాం లింకన్ ఆదేశిస్తే వందల మంది సైనికులు వచ్చి ఆ పందిని రక్షించివుండేవారు. కానీ ఆ మూగజీవి బాధను చూసిన ఆయన హృదయం, ఇంకొకరి కోసం నిరీక్షించకుండా తక్షణమే సహాయం చేసేలా స్పందించింది.


ఒకవ్యక్తిగానీ, సమాజంగానీ, దేశంగానీ సర్వతోముఖాభివృద్ధి చెందాలంటే ప్రతి ఒక్కరూ మానవతా దృక్పథంతో వ్యవహరించాలి. అందుకు...

"Yesterday I was clever, so I wanted to change the world. Today I am wise, so I want to change myself - నిన్నటి వరకూ నేను వివేకవంతుణ్ణి, అందువల్ల ఈ ప్రపంచాన్ని మార్చాలనుకున్నాను. కానీ నేటి నుండి నేను విజ్ఞానవంతుణ్ణి, కాబట్టి ముందు నేను మారాలనుకుంటున్నాను" అని జలాలుద్దీన్ మహమ్మద్ రుమి సూచించిన విధంగా మనలో పరివర్తన రావాలి. అప్పుడు మనం ఉత్తమ పౌరులుగా ఎదుగుతాం. దేశం సర్వదా సుభిక్షంగా వర్ధిల్లుతుంది, శాంతిసౌఖ్యాలతో విరాజిల్లుతుంది. ❖

ఏ ఒక్క హృదయంలోనైనా కాస్త శాంతి సౌఖ్యాలను కలిగించగలగడమే 'సత్కర్మ'. జీవితమంతా ఎన్నో యాతనలు పడ్డాక నేనీ రహస్యాన్ని తెలుసుకున్నాను. తక్కినదంతా బూటకం. - స్వామి వివేకానంద

వాపును చూసి

గత సంవత్సరం ‘టర్బో’ పేరుతో హాలీవుడ్‌లో ఓ యానిమేషన్ చలనచిత్రం విడుదలై ప్రేక్షకులను అలరించింది. రేసుగుర్రాల్లాంటి కార్లతో పరుగుపందెంలో పాల్గొని విజేతగా నిలవాలనుకునే ‘టర్బో’ అనే నత్త కథే ఈ చిత్రం. ఒకసారి అనుకోని పరిస్థితుల్లో ఆ టర్బో, ఓ కారు ఇంజన్‌లో పడిపోయి, అందులోని ఇంధనమంతా దాని శరీరంలోకి ప్రవేశిస్తుంది. అప్పటి నుంచి ఆ నత్త నడకకు వడి పెరుగుతుంది. ఎక్కడికయినా ఇట్టే పరుగెత్తగలిగే శక్తి వస్తుంది. దాంతో ఇక ఆ నత్త ఆనందం, అహంభావం పట్టవశం కాని స్థితికి చేరుకుంటాయి. సాధారణంగా తను దరిదాపులకు కూడా



పోలేని జంతువులతో, వాహనాలతో కూడా పోటీ పడేందుకు ఆ టర్బో ఉవ్విళ్ళూరుతూ ఉంటుంది. తన శరీరంలోని ఆ ఇంధనబలాన్ని తన సహజ బలంగానే భ్రమపడి అనవసరమైన సాహసాలకు దిగుతుంది. ఎందరినో హేళన చేస్తూ, కల్పించుకొని మరీ పోటీకి దిగుతుంది. ఓడిపోయిన వాటిని వెక్కిరిస్తూ, తన విజయానికి పొంగిపోతూ విర్రవీగుతూ ఉంటుంది. కాలక్రమేణా గాలితీవ్రతకు ఆ టర్బో శరీరంలోని ఇంధనమంతా ఆవిరవడం ఆరంభమవుతుంది. ఆ ప్రభావంతో హఠాత్తుగా దాని వేగం సన్నగిల్లుతూ ఉంటుంది. చివరకు తన అసలు బలమేంటో తెలుస్తుంది; ఇన్నాళ్ళూ తను ఏ శక్తిని చూసుకొని అహంకరించిందో, అసలు ఆ శక్తి తనది కాదని అర్థమవుతుంది. తన పంథాను మార్చుకుంటుంది. తల ఎగరేయడం మానుకొని స్వశక్తితో ముందుకుపోతుంది. ఒక నత్తను ఓ ప్రధాన పాత్రగా చేసుకొని ఈ ‘టర్బో’ చలనచిత్రంతో దర్శకుడు మనకు ఓ చక్కని పాఠాన్ని చెప్పాడు. ఎన్నో సందర్భాల్లో మనం కూడా ఆ నత్తలా అరువు తెచ్చుకున్న బలాన్నే అసలు బలంగా భ్రమిస్తూ కన్నూమిన్నూ కానకుండా ప్రవర్తిస్తూ ఉంటాం. అందుకే...

నీళ్లలోన మొసలి నిగిడి యేనుగు పట్టు
బయట కుక్క చేత భంగపడును
స్థానబలిమి కాని తన బలిమి కాదయా
విశ్వదాభిరామ వినురవేమ!

‘నీళ్ళలో ఉన్నప్పుడు స్థానబలిమి వల్ల మొసలి, ఏనుగును కూడా లోపలికి లాగివేస్తుంది. అదే మొసలి ఒడ్డుకు వచ్చినప్పుడు కుక్కతో కూడా భంగపడుతుంది. అంటే స్థానబలం కాని తన బలం కాదు సుమా!’ అని యోగి వేమన అంటారు.

స్థానబలం...సహజబలం : ఎంతటివారినైనా స్థానబలం కళ్ళను తలకెక్కిస్తూ ఉంటుంది. నా అంతటివారు లేరనిపించేంత అహంభావాన్ని పెంచుతుంది. మనలో చాలామంది మధ్యలో వచ్చిన తాత్కాలికమైన అధికారాలను, పదవులను, హోదాలను చూసుకొని సంబంధిత స్థానాలతో తాదాత్మ్యం చెందుతూ, నేల మీద నిలబడడం మానేస్తారు. భవిష్యత్తంతా కూడా ఇదే వైభవం, రాజసం కొనసాగుతాయని భావిస్తూ ఉంటారు. దానికి తగినట్లుగానే తలలు ఎగరేసుకుంటూ నడుస్తూ ఉంటారు.

సహజమైన సమర్థతతో ఉన్నత స్థాయికి చేరుకున్న వారికీ, అనుకోని పరిస్థితుల్లో, అడ్డదారుల్లో ఆ స్థానానికి చేరుకున్న వారికీ చాలా వ్యత్యాసం ఉంటుంది. రెండవరకం వారు ఆ స్థానంలో ఎక్కువ కాలం నిలవలేరు; నిలిచినా దానికి న్యాయం చేయలేరు. అందుకే స్వామి వివేకానంద ఓ చోట ‘ఎంత అసమర్థుడైనా ఎప్పుడో ఒకప్పుడు ఏదో కారణం చేత ఉన్నతస్థాయికి చేరుకోవచ్చు; లోకుల దృష్టిలో గొప్పవాడు అనిపించుకోవచ్చు. కానీ తన అవివేకం, అసమర్థతలు అతన్ని ఏదో ఒక రూపంలో పతనమొందిస్తాయి’ అంటారు. స్వామీజీ మాటలకు నిదర్శనంగా, నేడు సమాజంలో అనేక రంగాల్లో ఇలా తారాజువ్వల్లా మెరిసి మాయమయ్యే వ్యక్తులను ఎందరినో చూస్తుంటాం.

ప్ర‘బల ప్రదర్శన’....: ఎవరు ఎంత ఏమార్చి ప్రేరేపించినా, ప్రలోభపెట్టినా మన స్థాయినీ, శక్తినీ మించి అతిగా ప్రవర్తించకూడదు. పక్కవారిని, పరిస్థితులను చూసుకొని మన ప్రవృత్తిని మార్చుకోకూడదు. మనల్ని, మన సామర్థ్యాన్నీ అంచనా వేసుకోవడంలో మనం ఎప్పుడూ తడబడకూడదు. అయితే

బలమనుకుంటే...

– బి. సైదులు

అధికారాలు, అందలాలు సంప్రాప్తించిన సమయాల్లో మనలో చాలామంది తమపై తాము నియంత్రణను, సంయమనాన్ని కోల్పోతారు. తాము ఆ స్థానానికి సరైన వాళ్ళము కామేమో అన్న సంశయం, తమ సమర్థతపై తమకే అనుమానం వారి మనసును తొలిచేస్తూ ఉంటాయి. ఆ ఆత్మన్యూనతతోనే అలాంటి వారు తరచూ అసహనానికి గురవుతూ ఉంటారు; తరచూ తమ అధికారాన్ని ప్రదర్శించుకునేందుకు ప్రయత్నిస్తూ ఉంటారు. అందుకే ఓ ఆంగ్లమేధావి 'You shall be judged ultimately not by your position, but by the spirit with which you maintain it అంటారు. స్వశక్తిని నమ్ముకున్నవారు ఏ స్థానాన్నైనా సమర్థతతో నిర్వహిస్తారు; సంయమనంతో మసలుకుంటారు. అలా కాని వాళ్ళు తమ బలాన్ని ప్రదర్శించడంపై చూపే శ్రద్ధ, బలాన్ని ఉపయోగించి నిర్వర్తించాల్సిన ఉన్నత కార్యాలపై చూపరు. మనది వాపో, బలమో అన్నది బండరాళ్ళను ఎత్తినప్పుడు తెలుస్తుంది, కాని కేవలం చొక్కా విప్పి కండలు చూపినప్పుడు కాదు కదా! ఇలాంటి బల ప్రదర్శన ప్రయత్నాలు ఎక్కువ కాలం మన అస్తిత్వాన్ని నిలబెట్టలేవు.

మందీమార్బలం మనబలమా? : కొన్నిసార్లు మనం మన చుట్టూ ఉన్న మందీమార్బలాన్ని చూసి వారంతా మన బలగమనుకొని కాలుదువ్వుతూ ఉంటాం. వెనకనున్న వారి అండ చూసుకొని విర్రవీగుతూ, యథేచ్ఛగా ప్రవర్తిస్తూ ఉంటాం. కానీ అవసరార్థం మన వెనక చేరిన, మందీమార్బలం అసలు రూపం బయటపడ్డాక, వారిని నమ్ముకున్న పాపానికి మనమే భంగపడిపోతాం. ఉదాహరణకు మహాభారతంలో శిశుపాలుడు దుర్యోధన, దుశ్శాసనాదుల అండ చూసుకొని పాండవులను, భీష్మాచార్యులనే కాదు, సాక్షాత్తూ శ్రీకృష్ణపరమాత్ముడిని కూడా తూలనాడాడు; యుద్ధానికి సిద్ధమన్నాడు. చివరకు ఏమయ్యాడు! ఆ చక్రధారి ఆగ్రహానికి లోనై అంతమయ్యాడు. అందుకే భీష్ముడు ఓ చోట **'...నీచాశ్రయాన్మత్సరేణ ద్వేషిణీ గుణినామపి...** – సుగుణవంతుల బుద్ధి కూడా నీచులను ఆశ్రయించడం వలన మాత్సర్యం చేత ద్వేషభావంతో నిండి ఉంటుంది; వైరంతో రగిలిపోతుంద'ని హెచ్చరిస్తాడు.

మనం ఆశ్రయించినవారు లేదా మనల్ని ఆశ్రయించిన వారు మన బలమని ఎప్పటికీ అపోహపడకూడదు. వారి శక్తి ఎన్నటికీ మన శక్తి కాదని గుర్తుంచుకోవాలి. ఆధునిక సమాజంలో కూడా చాలామంది తమ మందలాంటి పదిమంది ఇచ్చే మాటసాయాన్ని నమ్ముకొని వివాదాలకు, ఘర్షణలకు దిగుతూ ఉంటారు. ఒకానొక సమయంలో ఎవరి సాయమూ లేక, వారు ఏకాకిగా మారిపోయి పరాభవాల పాలవుతూ ఉంటారు.

వాపు వ్యాధే కాని వృద్ధి కాదు...: అపసవ్య మార్గాల్లో ఒనగూరే అభ్యున్నతి శాశ్వతం కాదు. తెలియని అనారోగ్యంతో బాహ్యంగా శరీరం నిగనిగలాడినంత మాత్రాన అది ఎలాగైతే సహజమైన దేహపుష్టి కాదో, అలాగే స్థానబలంతో మనకిచ్చే గౌరవం, నిజానికి మనకిచ్చే గౌరవం కాదు. ఆ ప్రభావంతో మనలో అహంకారం పెరిగితే అది ప్రమాదకరం. అందుకే అప్పుడప్పుడు మన హోదాల పరదాలను దాటుకొని బయటకు వచ్చి, మనల్ని మనం చూసుకోవాలి. అందుకే ఓ ప్రాకృతి కవి....

వరం దారిద్ర మన్యాయ ప్రభవా ద్విభవా దపి!
కృశతాభిమతా దేహే పీనతా న తు శోఫతః.... అంటారు.

అవును, అన్యాయంగా అడ్డదారుల్లో సంపాదించిన వైభవం కన్నా దారిద్ర్యమే మేలు; వాపు వల్ల వచ్చే బలుపు కన్నా సన్నగా ఉండడమే మంచిది. అన్యాయ మార్గంలో కలిగే సంపద ఎప్పుడూ మనస్సును గిల్లుతూనే ఉంటుంది. వాపు వల్ల దేహం బయటకు బలంగా కనిపిస్తున్నా, లోపల దోషాలు బాధపెడు తూనే ఉంటాయి. కాలప్రభావం వల్ల నడమంత్రపు సిరి అబ్బిన వారిని ఎందరినో సమాజంలో చూస్తూ ఉంటాం. సహజంగా శ్రీమంతులైన వారితో పోలిస్తే, వీరి పోకడలు చాలా కృతకంగా కనిపిస్తూ ఉంటాయి. ప్రతి చోటా అవకాశాన్ని కల్పించుకొని మరీ తమ ప్రాభవాన్నీ, పటాటోపాన్నీ ప్రదర్శించేందుకు తాపత్రయపడుతూ ఉంటారు.

ఆముదం మొక్కకూ మహావృక్ష వైభవం... : ఏ మొక్కా లేని దగ్గర ఆముదం మొక్కకే మహావృక్ష వైభవం దక్కినట్లు, విద్వాంసులు కొరవడిన చోట అల్పజ్ఞానులే జ్ఞానసంపన్నులుగా చలామణి అవుతూ ఉంటారు. అందుకే విద్వత్తు విషయంలో కూడా ఎప్పుడూ, పరిమితమైన మన పరిధిలో కాకుండా విశాలదృష్టితో ఆలోచించుకుంటూ ఉండాలి. మన పరిసర ప్రపంచాన్నే ప్రమాణంగా తీసుకోకుండా పూర్వాపరాలతో బేరీజు వేసుకుంటూ ఉండాలి. మన చుట్టూ జనం అభిమానంతోనో, మరో కారణం చేతనో మన జ్ఞానసంపత్తిని అపురూపమైందని కొనియాడవచ్చు. కానీ మనం మాత్రం అంతరంగంలో మన విద్వత్తులో ఎంత విషయముందో ఎప్పటికప్పుడు విశ్లేషించు కుంటూ ఉండాలి. అందుకే 'భారతరత్న' అబ్దుల్ కలామ్ యువబృందానికి సందేశమిస్తూ 'మనలో చాలా మంది తమకున్న అల్పజ్ఞానాన్నే అధికజ్ఞానంగా ఊహించుకుంటూ ఉంటారు. అనంతమైన జ్ఞానసాధనతో పోల్చినప్పుడు మనకున్న జ్ఞానం ఎంత స్వల్పమో, ఎంత అసంపూర్ణమో ఆ తరువాత కాలంలో బోధపడుతుంది' అంటారు. ఇలా ఏ విషయంలోనైనా మనం వాపును బలమనుకొని పొంగిపోకుండా, ఏది వాపో, ఏది బలమో నిర్ధరించుకుంటూ నిలకడగా ముందుకు సాగిపోయినప్పుడే నిత్యజీవితంలో అపహాస్యం పాలు కాకుండా మనుగడ సాగించగలం. ❖

మలయ పర్వతం మీద ఉన్నంత మాత్రాన వెదురుకర్రకు చందనపు సువాసన అబ్బుతుందా? మనలో సహజసిద్ధమైన శక్తిసామర్థ్యాలు లేనప్పుడు బయట నుండి ఎలా వస్తాయి? - హితోపదేశం



అద్భుత సం'దేశం'

.... మేడ్ ఇన్ జపాన్

– ఎమ్. రాంబాబు

స్వామి వివేకానంద ఓమారు జపాన్‌లో పర్యటిస్తూ అక్కడి పరిస్థితులకూ, వారి జీవనవిధానానికీ, అభ్యున్నతికీ ముచ్చటపడి భారతదేశంలోని తన శిష్యబృందానికి ఉత్తరం రాస్తూ...

"ఈ దేశం, ఇక్కడి పరిశుభ్రమయిన పరిసరాలు, మనుషుల దేశభక్తి, క్రమశిక్షణ నన్ను మంత్రముగ్ధుణ్ణి చేశాయి. మన దేశ యువతీ యువకులు తప్పనిసరిగా జపాన్‌ను సందర్శించాలి; పౌరుడిగా ఎలా మసలుకోవాలో జపనీయులను చూసి నేర్చుకోవాలి. దేశాభివృద్ధి, అభ్యున్నతి వంటి పదాలను ఆదర్శాలకు, మాటలకే పరిమితం చేస్తూ బాధ్యతా రహితంగా ప్రవర్తించే ఎందరో మన దేశ పౌరులు ఈ చిన్న దేశాన్నీ, ఈ దేశస్థుల జీవనశైలినీ చూసి తమ తప్పును తెలుసుకొని సిగ్గుతో తలదించుకోవాలి" అని తన మనస్సులో మాటను బయటపెట్టారు.

స్వామి వివేకానంద 1893లో చెప్పిన ఈ మాటలు నేటికీ జపాన్‌కు వర్తిస్తాయి. ఇప్పటికీ ఆ దేశం ప్రపంచ దేశాలకు ఆదర్శమే అనడంలో అతిశయోక్తి లేదు. దేశభక్తి, పౌరసత్వ స్పృహ మచ్చుకైనా కనిపించని మన దేశంలోని ఎందరో యువతీయువకులు జపనీయులను చూసి ఎన్నో పాఠాలు నేర్చుకోవాలి. మానవపరంగా హిరోషిమా, నాగసాకి దాడుల్లాంటి ఘాతుకాలనూ; భూకంపాలు, సునామీల్లాంటి ప్రాకృతిక గాయాలనూ తట్టుకొని ఎప్పటికప్పుడు పడి లేచే కెరటంలా జపాన్ తన అస్తిత్వాన్ని చాటుకుంటూనే ఉంది. ఆ దేశపౌరుల నుంచి మనం అలవరచుకోవలసిన మూడు ముఖ్య లక్షణాలు **1. వ్యక్తిగౌరవం 2. క్రమశిక్షణ 3. ఆరోగ్యకరమైన జీవనశైలి.**

వ్యక్తిగౌరవం(respect for fellow human beings) **:** జపనీయులు సాటి మనిషికి ఇచ్చే గౌరవాన్ని చూస్తే ఆశ్చర్యమేస్తుంది. వాళ్ళు వ్యక్తిని వ్యక్తిగానే చూస్తారు. కార్యాలయంలో ఉన్నతాధికారిని ఎంత మర్యాదగా పలకరిస్తారో, చెత్తను ఊడ్చే వ్యక్తితో కూడా అదే మర్యాదతో ప్రవర్తిస్తారు. అక్కడ అన్ని ఉద్యోగాలకూ సమాన గౌరవం దక్కుతుంది. అందుకే అక్కడ యువతీ యువకుల్లో, ఉద్యోగస్థుల్లో అహంభావం, ఆత్మన్యూనతలు కనిపించవు. అధికార స్థాయి వ్యక్తి నుంచి అతి సాధారణ ఉద్యోగి వరకు అందరూ అదే అంకితభావంతో తమ పనిని నిర్వర్తిస్తూ ఉంటారు. అక్కడ రోజూ ప్రతి వ్యక్తి నోటి నుంచి కొన్ని వందల సార్లు 'థాంక్యూ' అన్న పదం వినిపిస్తూ ఉంటుంది. సాటి మనిషి విషయంలో వారు వహించే బాధ్యత, గౌరవం చూస్తుంటే ముచ్చటేస్తుంది. ఒక్కమాటలో చెప్పాలంటే Japan people are so courteous and have great respect for fellow human beings.

క్రమశిక్షణ (discipline)**:** జపాన్ అనగానే ప్రపంచదేశాల్లో అందరికీ గుర్తొచ్చే పదం 'క్రమశిక్షణ'. కార్యాలయానికైనా, సమావేశానికైనా, ఎక్కడికైనా క్షణం కూడా ఆలస్యం కాకుండా హాజరుకావడంలో జపనీయులను మించినవాళ్ళు లేరు. తమ సమయానికీ, ఎదుటివాళ్ళ సమయానికీ వారిచ్చే విలువను చూస్తూంటే అబ్బురమనిపిస్తుంది. ఉదాహరణకు జపాన్‌లో పదిహేడు నిమిషాలకు మించి రైలు ఆలస్యమైతే ప్రయాణికుల అసౌకర్యానికి పరిహారంగా, టిక్కెట్టు డబ్బులను రైల్వే సంస్థ వారికి తిరిగి ఇచ్చేస్తుందట. ఈ స్వయం శిక్షణ నుంచే వారిలో పట్టుదల, కష్టపడే తత్త్వం పుట్టుకొచ్చాయి. అందుకే ఎన్నో రంగాల్లో జపనీయులే ముందున్నారు. ఉదాహరణకు 'మేడ్ ఇన్ జపాన్' అన్న వాక్యానికి సాంకేతిక వస్తు ప్రపంచంలో ఉన్న విలువను బట్టే, ఆ దేశం ఖ్యాతి ఎంతటిదో అర్థమవుతుంది.

ఆరోగ్యకరమైన జీవనశైలి (healthy lifestyle) **:** జపనీయుల్లో ఊబకాయం ఉన్నవారు చూద్దామన్నా కనిపించరంటే వారి ఆహార, ఆరోగ్యపుటలవాట్లు ఎలాంటివో అర్థమైపోతుంది. ఇరవై ఏళ్ళ యువతీ యువకుల నుంచి అరవై ఏళ్ళ వృద్ధుల వరకు ఎవరిని చూసినా చురుగ్గా, నాజూకుగానే కనిపిస్తూ ఉంటారు. సరళజీవనం, రోజువారీ నడక, ఒళ్ళు వంచి పనిచేసే తత్త్వమే వారి ఆరోగ్యానికీ, ఆనందానికీ కారణమని తెలుస్తుంది. ఎన్ని సాంకేతిక సౌలభ్యాలు, సౌకర్యాలు ఉన్నా జపనీయులు వాటిని వినియోగించేందుకు అంతగా ఇష్టపడరు. ఉదాహరణకు కార్యాలయాల్లో, ప్రయాణ ప్రాంతాల్లో ఎన్ని కదిలే మెట్లు (ఎలివేటర్లు), లిఫ్ట్‌లు ఉన్నా, వాళ్ళు నడిచేందుకే మొగ్గు చూపుతారు. వీలయినంత వరకు కార్లను వాడకుండా, రైళ్ళు, సామూహిక రవాణావ్యవస్థ పైనే ఆధారపడతారు. 'ఆరోగ్యమే మహాభాగ్యం' అన్నది నినాదానికే పరిమితం చేయకుండా ఆచరణలో చూపెడుతూ, రోజులో కొంత భాగాన్ని వ్యాయామానికి విధిగా కేటాయిస్తారు. మితాహారం తీసుకుంటూ శారీరక శ్రమకు ఎక్కువ ప్రాధాన్యమిస్తారు.

ఇలా జపాన్ సాంకేతిక వస్తువులను వినియోగించడమే నవ నాగరికత కాదనీ, వారి జీవనశైలిని అనుసరిస్తూ నిజమైన ఆధునిక భారతీయులమనీ నిరూపించుకునేందుకు ప్రయత్నిద్దాం. ❖



(1884 – 1967)

ముందుకు సాగిపో!

దివ్యజనని శ్రీశారదాదేవి ప్రత్యక్ష శిష్యులైన స్వామి ప్రేమేశానంద (1884-1967) రామకృష్ణ సంఘంలో అత్యున్నత గౌరవాన్నీ ప్రేమాభిమానాలనూ చూరగొన్న అగ్రశ్రేణి సన్న్యాసి. ఆయన జీవితం శ్రీరామకృష్ణ - వివేకానందుల ఆశయాలతోనూ, భగవద్గీత సారాంశంతోనూ నిండింది. చాలామంది యువతీ యువకులకూ, గృహస్థులకూ, బ్రహ్మచారులకూ, సన్న్యాసులకూ ఆయన ఎన్నో లేఖలు వ్రాశారు. జీవితంలో అంకితభావం, ఆధ్యాత్మిక, సేవా భావాలను అలవరచుకొనేందుకు ఆ లేఖా పరంపరలు మార్గదర్శకాలయ్యాయి. పాఠకుల ప్రయోజనార్థం విలువైన ఈ లేఖలను 'శ్రీరామకృష్ణ ప్రభ'లో 2009 జూన్ సంచిక నుంచి ధారావాహికంగా ప్రచురిస్తున్నాం.

17-4-62

ప్రియమైన రామానంద!

నీ ఉత్తరం అందినది. చాలా సంతోషం. జీవితంలో కష్టాలకు అంతంలేదు. ప్రతి వ్యక్తికీ జీవితంలో ఎన్నెన్ని కష్టాలు ఉన్నాయో తెలుసుకొంటే మనం దిగ్భ్రాంతులమవుతాము. కానీ ఈ యుగంలో శ్రీరామకృష్ణులు అవతరించి మన సమస్యలన్నిటికీ పరిష్కారాలను సూచించారు. నీవు కథామృతం చదువుతున్నావని భావిస్తాను. ప్రతి సమస్యకూ కథామృతంలో పరిష్కారం ఉంది.

"సంసార సుఖాన్ని త్యాగం చేసిన వ్యక్తి ప్రపంచ సుఖాలన్నిటినీ త్యజించినట్లే" అని శ్రీరామకృష్ణులు అంటారు. ప్రపంచ సుఖాలన్నిటినీ త్యజించేసిన వానికి దివ్యానందాన్ని పొందడం ఎంతమాత్రమూ కష్టం కాదు. మన ముందు వైపు ప్రపంచపు అస్తిత్వం ఉంటే, మన వెనుక వైపు పూర్ణజ్ఞానం జ్యోతిలా ప్రకాశిస్తోంది. మనం కాస్త వెనుకకు తిరిగి వ్యతిరేకదిశలో దృష్టిని మళ్ళించగలిగితే అనంతమైన పూర్ణ బ్రహ్మాన్ని కాంచగలుగుతాం. కానీ ఆ వైపు చూడడంలో మనం తగిన జాగ్రత్తలను పాటించకపోతే ఫలితం మన జీవితానికే ప్రతికూలంగా మారే అవకాశం ఉంది. ఈ విషయంలో తగిన పద్ధతుల్ని ఋషులు నిర్దేశించారు.

మొట్టమొదటిగా ఒక ప్రత్యేకమైన వస్తువు ద్వారా సుఖం పొందాలనే కోరిక నీకు ఉన్నదా? లేదా? అని విచారణ చెయ్యి. ఆ విధమైన సుఖం యెడల నీకు కోరిక లేకపోతే నీవు ఇప్పటి వరకు ఎలా ఉంటున్నావో దాన్నే కొనసాగించు. అయితే అదే సమయంలో భగవంతుని గురించి ఆలోచిస్తూ ఉండు – ఇది రెండో దశ. ఇక మూడో దశలో భగవంతుని గురించి ఆలోచించడంలోనే అపరిమితమైన ఆనందాన్ని పొందడం సంభవిస్తే ఇక ఆ వ్యక్తికి బాహ్యప్రపంచంతో సంబంధం కలిగివుండడం ఎంతో బాధాకరంగా పరిణమిస్తుంది. ఈ స్థితిలో నీవు స్థిరంగా నెలకొని ఉంటే నాలుగో దశ వస్తుంది. ఆ దశలో అన్ని పనులూ కట్టిపెట్టి కేవలం భగవదనుభూతిలోనే ఉండిపోవడం జరుగుతుంది.

నీవు ప్రశాంతంగా, స్థిరంగా ఉండి కొనసాగితే ఈ నాలుగోదశను తప్పక చేరగలవు. ప్రస్తుతానికి నువ్వు నీ బాధ్యతలను నెరవేర్చాక ఏ కొద్ది సమయం చిక్కినా భగవదాలోచనలతో కాలం గడుపు. ఈ ప్రకారం నువ్వు కొనసాగిస్తే మనశ్శాంతిని పొందగలవు. ఈ సలహాలన్నీ నా మెదడుకు తోచిన వినోదాలు మాత్రం కానే కావు. మహాపురుషులు ఈ భావాలన్నింటినీ శాస్త్రగ్రంథాల ద్వారా బోధించారు. గురుమహరాజ్, స్వామీజీలకు సంబంధించిన పుస్తకాలను నిరంతరం చదవడం అనే పిచ్చిలో పడిపో!

ప్రేమాశీస్సులతో

స్వామి ప్రేమేశానంద

తెలుగు సేత: కె. త్రివిక్రమరావు

సుఖం, దుఃఖమనే కిరీటాన్ని ధరించి మానవుని వద్దకు వస్తుంది. సుఖాన్ని స్వాగతించేవాడు దుఃఖాన్ని కూడా స్వాగతించాల్సిందే! కోరికలున్నంత వరకూ నిజమైన సుఖం కలుగదు. - స్వామి వివేకానంద

రామకృష్ణభక్తిసూత్రాలు

(...9వ పేజీ తరువాయి)

చూచినదే వాస్తవం అని తలచారు. ఆ చెట్టుకిందనే ఆవాసం ఉన్న వ్యక్తి, 'మీరు ఉభయులు చెప్పినదీ వాస్తవమే. అది ఒక్కొక్కసారి ఎరుపు లేదా ఆకుపచ్చ, లేదా పసుపు రంగులో ఉంటుంది. ఒక్కొక్కసారి అసలు ఏ రంగూ ఉండదు! అది ఊసరవెల్లి' అన్నాడు.

నా మతధర్మమే సరైనది, దేవుడు అంటే ఏమిటో నాకు తెలుసు, వారికి తెలియదు అని ప్రతి ఒక్కరూ తలుస్తారు. నా ప్రార్థనే సరైనది. వారిది కాదు, కనుక దేవుడు నన్నే కరుణిస్తాడు. వారిని అనుగ్రహించడు అంటారు. దేవుడు అందరివాడు అని వీరెవరికీ తెలియదు. శ్రద్ధ కలిగిన వారిని అనుగ్రహిస్తాడు.

వ్యాఖ్య: మహమ్మదు ప్రవక్త అరేబియా దేశస్థుడు, ఆయనది అరబ్బీ భాష. ఆ భాషలో సర్వశ్రేష్ఠం, సర్వశక్తిమంతం, సర్వవ్యాపకం అయిన చైతన్యసత్తాను 'అల్లా' అని వ్యవహరిస్తారు. క్రైస్తవులు అదే సత్తాను 'గాడ్' అంటారు. భారతీయ ఋషులు దానినే 'బ్రహ్మం' అన్నారు. మాతృరూప ఉపాసన చేసే వారు 'కాళీ' అంటారు. చాలా కాలం నుండి భారతీయులు పలుకుతున్నది 'రామ'నామం. 'రా' అనగా జగత్తు. 'మ' అనగా ఈశ్వరుడు. 'రామ' అనగా జగదీశ్వరుడు. పాపాలను హరించేవాడు హరి.

క్రైస్తవులు ఉపాసించేది క్రీస్తును. భగవంతుని చేరడానికి ఏకైక మార్గం ఆయన కుమారుడైన ఏసుక్రీస్తును ప్రార్థించాలి. దుర్గతిని, ఆపదలను, దుఃఖదారిద్ర్యాలను పోగొట్టే శక్తి 'దుర్గ'.

భగవంతుడికి అనేకమైన పేర్లు, అనేక రూపాలు. ఎవరికి ఏ పేరు పట్ల, ఏ రూపం పట్ల అభిరుచి కలుగుతుందో వారు దైవాన్ని ఆ రూపంలో చూచి ఆ పేరుతో పిలుస్తారు. శ్రద్ధతో ప్రార్థిస్తే దైవం తప్పక దర్శనమిస్తాడు..

'యే యథా మాం ప్రపద్యంతే తాంస్తథైవ భజామ్యహం... – ఎవరు ఏ విధంగా నన్ను కొలిస్తే, వారికి నేను ఆ విధమైన ఫలాన్ని ఇస్తాను' అన్నాడు గీతాచార్యుడు.

ఈ సందర్భంలో శ్రీరామకృష్ణుల ఈ మాటలను *గుర్తుచేసుకుందాం :* "అందరూ 'మతం... మతం' అంటూ పరస్పరం కలహిస్తారు. హిందువులు, ముస్లింలు, క్రైస్తవులు – ఇలా అందరూ జగడం చేస్తారు. ఎవరిని కృష్ణుడు అంటున్నారో, ఆయనే శివుడు. ఆయనే ఆదిశక్తి. ఆయనే ఏసు. ఆయనే అల్లా. మతం పేరిట కొట్లాట, మారణం, హత్యలు మంచివి కావు. అందరూ ఆయన మార్గాన్నే చేపట్టారు. శ్రద్ధ, ఆర్తి ఉంటే దర్శనలాభం కలుగుతుంది. ❖

అనువాదం: డాక్టర్ కమల జయరావు

కృష్ణతత్త్వంలో మాతృమూర్తి

(...19వ పేజీ తరువాయి)

అల్లరి పిల్లలను 'నీకు అమ్మ పెట్టేవి రెండూ పెడితేగానీ తెలిసిరాదు, అమ్మ అక్షింతలు వేస్తేగానీ కుదురు రాదు' అంటారు పెద్దవాళ్ళు. ఏం పెట్టింది అమ్మ! తన తనువును తృప్తిగా నీకు పంచి పెట్టింది. ఇంకా ఏం పెట్టింది? పరమాత్మకు ప్రతిరూపంగా నీలో ఊపిరి ఊదింది. ఏం అక్షింతలు వేస్తుంది అమ్మ నీకు. నిన్ను మరొక అమ్మ చేతిలో పెట్టి అమ్మలను అక్షయం చేస్తూ ఉంటుంది. అందుకే అమ్మ దండిస్తే బాధపడకుండా తప్పుదిద్దుకో! ఆ హక్కు కేవలం అమ్మదే అని చెప్పడమే ఆ బాల పరమాత్మ ఉద్దేశ్యం కాబోలు!

నీ కొడుకు నవనీత చోరుడు అని అందరూ అంటుంటే ఆ తల్లి మనస్సు ఎంతో క్షోభపడింది. ఇంట్లో వెన్నంతా వాడికే పెట్టి పొరుగింటి తిరుగుళ్ళు మాన్పించి ఇంట్లోనే గట్టిగా కట్టి పడేస్తాను అని కన్నయ్యను తాటితో పెద్ద రోటికి కట్టింది. రోలు కదలకుండా రెండు పెద్ద మాకుల మధ్య బంధించింది.

మాతృత్వపు మమతకు లీలామానుష విగ్రహుడు కట్టుబడ్డాడు. అమ్మ లోపలికి వెళ్ళిపోయింది. కన్నయ్య అమ్మను చూసి నవ్వుకున్నాడు, మురిసిపోయాడు కూడా. ఎందుకంటే! అందరికీ ఎన్నో జన్మలు. ఎందరో తల్లులు. కానీ సాక్షాత్తూ పరమాత్మనే బిడ్డగా బంధించిన తల్లివి నీవేనమ్మా! అని.

లోకనాథుడైన తన పతి అలా అమ్మ చేత కట్టుబడి ఉండడం భూదేవి సహించలేక పోయింది. 'ప్రభూ! ఎంత మాతృవాత్సల్యం అయినా ఒకే చోట నీవిలా కట్టుబడితే ఈ ప్రాణి కోటి అంతా ఏం కావాలి? ఈ లీలానాటకం ఇంక చాలు. గంధర్వులు శాపవిముక్తులు అయ్యే సమయమైంది' అన్నది. కన్నయ్య ఒళ్ళు విరుచుకున్నాడు. మద్దిమాకులు పెళపెళ కూకటి వేళ్ళతో సహా కూలాయి. గంధర్వులు కన్నయ్యకు నమస్కరించి వెళ్ళిపోయారు.

యశోదమ్మ వచ్చి లాగబడిన రోలును, మొదళ్ళు కూలిన మద్ది చెట్లను చూసింది. తన బిడ్డ అందరి లాంటివాడు కాదనీ, చరాచర జీవరాశినీ చిన్న నోట చూపిన పరమాత్మ అనీ గ్రహించింది. కానీ కన్నయ్య మళ్ళీ "అమ్మా" అని పిలిచాడు. అంతే! మళ్ళీ మామూలు అమ్మ అయిపోయింది. కన్నయ్యను ఎత్తుకుని మనసారా హృదయానికి హత్తుకుంది. ఇటువంటి బిడ్డ నాకు మాత్రమే ఉన్నాడనుకుంది గర్వంగా.

ఆ పసివాడు, ఘటనాఘటన సమర్థుడు, ఆదిమధ్యాంత రహితుడు అయిన కన్నయ్య – అమ్మ వీపు మీద వాలి వెనుక నుండి అలవోకగా నవ్వుకున్నాడు. గోకులం అంతా విస్తుపోయింది. ముల్లోకాలూ 'సాధు...సాధు' అంటూ ఆ "కృష్ణ తత్త్వంలోని" "మాతృతత్త్వానికి" ముగ్ధమయ్యాయి. ❖

పౌరసత్వమూ యోగమే!


- స్వామి రంగనాథానంద
(రామకృష్ణ సంఘం 13వ సర్వాధ్యక్షులు)

ఒక విశ్వవిద్యాలయంలో విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించేందుకు నన్ను (స్వామి రంగనాథానంద) ఆహ్వానించారు. సమావేశమందిరంలో జరగాల్సిన ప్రసంగ కార్యక్రమాన్ని అనివార్య కారణాల వలన పక్కనే ఉన్న మరో సభాంగణంలోకి మార్చారు. చివరి క్షణంలో కార్యక్రమంలో మార్పులు జరగడం వలన, విశ్వవిద్యాలయంలోని వరిష్ఠ ఆచార్యులు ఒకరు హడావిడిగా వేదికపై నున్న కుర్చీలను పక్క గదిలోకి మార్చుతున్నారు. అక్కడే కూర్చొని ఉన్న విద్యార్థుల్లో ఒక్కరు కూడా ఆ ఆచార్యుడికి చేయూతనిచ్చేందుకు లేచిరాలేదు. అంత పెద్దవ్యక్తి కుర్చీలన్నీ సభామందిరంలోకి మారుస్తుంటే యువకులందరూ ప్రేక్షకుల్లా కూర్చొని చూస్తున్నారు. వయస్సు రీత్యా, పదవిరీత్యా తమ కన్నా పెద్దవారైన వ్యక్తికి సహకరించాలన్న మానవీయ దృక్పథం కూడా విద్యార్థుల్లో కనిపించలేదు. తరువాత నా ప్రసంగంలో ఆ ఉదంతాన్ని ఉటంకిస్తూ 'ఈ దేశపౌరులుగా మీరు ఎంత బాధ్యతారహితమైన దుఃస్థితిలో ఉన్నారో ఊహించుకోండి; ఇన్నేళ్ళ స్వతంత్ర భారతదేశంలో ఇదా మనం నేర్చుకున్నది?' అని ప్రశ్నించాను. యువతీ యువకులను నిజమైన దేశపౌరులుగా తయారు చేయడంలో సమాజం ఎక్కడో విఫలమవుతుందని ఆ సభలో ఆవేదన వ్యక్తం చేశాను.

అదే విధంగా ఒకసారి నేను ఢిల్లీలో కారులో ప్రయాణం చేస్తున్నప్పుడు, నా కన్నా ముందు కొందరు యువతీయువకులున్న ఓ కారు వెళుతోంది. వేగంగా వెళుతున్న ఆ కారులోంచి కొందరు అరటిపళ్ళ తొక్కలు, బిస్కెట్ పొట్లాల కవర్లు విసిరేస్తూ ఉన్నారు. చూడడానికి ఆధునికంగా కనిపిస్తూ వాళ్ళు అంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ ఉంటే నాకు ఆశ్చర్యమేసింది. వెంటనే వాళ్ళ కారును వెంబడించమని డ్రైవర్‌కి చెప్పాను. మేము వాళ్ళను అందుకునేలోపే, వాళ్ళ కారు దూసుకు వెళ్ళి పోయింది. సమాజానికి దిశానిర్దేశం చేయాల్సిన అక్షరాస్యులే ఇలా ప్రవర్తిస్తే, ఇక నిరక్షరాస్యుల గురించి అనుకొని ఏం లాభం! ముఖ్యంగా దేశభక్తి అంటే ఏదో పెద్దపెద్ద దేశ సమస్యలపై అవగాహన పెంచుకోవడం, వాటి పరిష్కారానికి పరిశ్రమించడం కాదు. దేశ పౌరుడిగా మన వంతు కర్తవ్యాన్ని మనం నిర్వర్తిస్తున్నామా? లేదా? అని ఎప్పటికప్పుడు ఆత్మవిమర్శ చేసుకోవాలి.

పౌరసత్వంలో యోగత్వం... : నిజానికి సమాజంలో జీవిస్తూ, పౌరుడిగా మనవంతు పాత్రను పోషించడమూ యోగమే! ఆదర్శవంతమైన పౌరసత్వ జీవనం సమాజ సమగ్ర అభివృద్ధికి పునాదిలాంటిది.

Citizenship itself is a type of yoga. A good citizen can feel the suffering of fellow countrymen. We have to create more such yogis in our society; We need millions of citizen-yogis. సాటి వ్యక్తిపై సమత్వదృష్టితో మసలుకుంటూ, ఏ మాత్రం అవకాశం ఉన్నా ఎదుటివ్యక్తి అభ్యున్నతికి సహకరిస్తూ జీవించగలిగితే మంచుకొండల్లో ముక్కు మూసుకొని తపస్సు చేసే యోగుల్లా మానసికానందాన్ని పొందవచ్చు. నిజానికి నేడు మనకు కావలసింది సమాజంలో ఉంటూ యోగుల్లా జీవించే వాళ్ళే!



ఈ పౌరసత్వ స్పృహతో ఏ రంగంలో ఉండి మనం బాధ్యతలు నిర్వర్తించినా, పరోక్షంగా అది దేశభక్తిని ప్రకటించినట్లే అవుతుంది. అందుకే విద్యార్థి దశ నుంచే తల్లితండ్రులు, ఉపాధ్యాయులు, ఆచార్యులు చిన్నారులకు దేశభక్తికి నిజమైన అర్థం పౌరసత్వ స్పృహేనని వివరించాలి. ప్రాథమికంగా ఈ సమాజపౌరుడిగానే మన ఉనికి ఆరంభమవుతుందన్న విషయాన్ని మరచిపోకూడదు.

ఇలా మనం ప్రజల ఆలోచనాధోరణిని మార్చకుండా, దేశం ఎక్కడికో వెళ్ళిపోవాలని, ఏదేదో సాధించాలని తాపత్రయపడుతున్నాం. కానీ వ్యక్తుల్లో పౌరసత్వస్పృహను రగిలించనిదే దేశాభ్యున్నతిని సాధించలేమని మరచిపోకూడదు. ❖

సేకరణ : ఆర్. కృష్ణ

(...15వ పేజీ తరువాయి)
మరెవరికీ తెలియదు. అందుకే కొసరి వడ్డించినా, కసిరి తినిపించినా అమ్మ అమ్మే! అదే భావనతో చిన్నికృష్ణుడిపై యశోద అవ్యాజ ప్రేమకు కవితాకృతినిస్తూ ఓ భక్తకవి....

"కృష్ణా! వాళ్ళందరూ నీతో ఆటలు, సరసాలూ, పాటలే కాని,
నీ మాటలు, నీ చూపులు చూసి మురిసేందుకే కాని,
నిన్ను ఆదరించేందుకు,సమస్తసౌఖ్యాలు నీ కోసం అర్పించేందుకు,
ప్రాణం కన్నా ఎక్కువగా నిన్ను ప్రేమించేందుకు,
రెప్పవాల్చక చూస్తూ, రాత్రంతా మేలుకునేందుకు,
నీ అలసటని, నీ దోబూచుల్ని, నీ మరపుని, నీ నిరాకరణని
భరించేందుకు నేను కాక ఇంకెవ్వరు....." అంటూ ఆ తల్లి మనస్సును మన ముందు ఆవిష్కరిస్తాడు.

ఈ పదకవితాపితామహుడు కూడా ఆ ప్రేమమూర్తి జోలపాటను కొనసాగిస్తూ, నందుడి ఇంట అందాలు కురిపిస్తూ, చంద్రవదనులైన ఆ గోపికల సేవల నడుమ, గోకులంలోని ఇళ్ళన్నీ ఆటలతో సందడి చేస్తూ ఆ ముద్దుల రంగడిని మందలదొంగగా మనసారా పిలుచుకుంటూ...

నందు నింటను జేరి నయము మీరంగ
చంద్రవదనలు నీకు సేవ చేయంగ
నందముగ వారిండ్ల నాడుచుండంగ
మందలకు దొంగ మా ముద్దురంగ...అంటున్నాడు.

'నయము' అంటే అందమని అర్థం. నందుడి ఇంట పెరుగుతూ ఆ నవనీతచోరుడు చేసిన లీలలు అన్నీ ఇన్నీ కావు. తన సాహచర్యంతో గోపకులాన్నే కాదు... గోవులనూ ఉద్ధరించిన ప్రభువు శ్రీకృష్ణపరమాత్ముడు. ఇలా భగవాన్ శ్రీరామకృష్ణ పరమహంస అవతరించినపుడు కూడా వారి స్వగ్రామమైన కామార్పుకూర్ అపర బృందావనమై భాసిల్లింది. వారి బంధువులే కాదు, పరిసర ప్రజలంతా శ్రీరామకృష్ణుల్ని తమ సొంతబిడ్డగా భావించి పండగ జరుపుకున్నారు. అలా మహానుభావుల రాక అయినవారికే కాదు ఆబాలగోపాలానికీ ఆనందప్రదమవుతుంది.

గోపాలుడైన బాలుడు...

గోపాలకృష్ణుడితో గోకులంలో ప్రతి ఒక్కరిదీ అవినాభావ సంబంధం. ఇక గోపికలదైతే వర్ణించనక్కర లేదు. అది దేహసంబంధమైన ఆకర్షణ కాదు; ఆత్మబంధమై పెనవేసుకున్న ప్రణయబంధనం! ఆయనను విడిచి క్షణం కూడా ఉండలేని విరహవేదన వారిది. భగవంతుడిపై భక్తుడికి ఉండాల్సిన ఆకర్షణ అది! అందుకే లీలాశుకుడనే భక్తకవి తానూ బృందావనంలో ఓ గోపికలా మారి 'శ్రీకృష్ణ కర్ణామృతం'లో...

హస్తమాక్షిప్య యాతోఽసి, బలాత్కృష్ణ కిమద్భుతమ్ ।
హృదయాద్యది నిర్యాసి, పౌరుషం గణయామి తే ॥

'కృష్ణా! నీవు నా చేయి విదుల్చుకొని పోవడం గొప్పేమీ కాదు; అందులో ఆశ్చర్యమూ లేదు. కానీ నా మనస్సు నుంచి వెళ్ళిపోగలిగితే అప్పుడే నీకు పౌరుషముందని నేను నమ్ముతా'నంటాడు గడుసుగా! భగవంతుడిని అంతగా హృదయంలో బందీ చేసుకోగలగడం ధన్యత్వం. గోపికలది మకుటాయమానమైన భక్తి! ఆ యదుకుల నందనుడి సహచరులు, సఖులే అంతగా ఆయనపై మమకారం పెంచుకుంటే, ఇక పెంచిన, ప్రేమ పంచిన ఆ యశోదమ్మకు ఎంత మమకారం పొంగి పొరలుతుంది! ఆ ప్రేమపరవళ్ళనే ఈ పరమభక్తుడు పదామృత వర్షిణిగా కురిపిస్తూ....

పాలవారాశిలో పవళించినావు
బాలుగా మునుల కభయమిచ్చినావు
మేలుగా వసుదేవు కుదయించినావు
బాలుడై యుండి గోపాలుడైనావు...

'పాలసంద్రంలో పవళించే నీవు దేవకీ వసుదేవులకు కొడుకుగా ఉదయించి తరింపచేశావు, ఎదిగి రాక్షసులను సంహరించి ఎందరో మునులకు అభయమిచ్చావు, బాలుడిగా కనిపించినా గోపాలుడవై అలరించావు' అని కొనియాడు తున్నాడు. ఎంతటి భావుకుడికైనా భక్తితో బాలకృష్ణుడిని తలచుకోగానే కళ్ళలో ఆయన లీలలన్నీ కదలాడుతూ ఉంటాయి. అందుకే భక్త మీరాబాయి కూడా ఓ భజనలో నిరంతరం తన కళ్ళలోనే కొలువుండమని వేడుకుంటూ, ***బసోమేరే నైననమే నందలాలా!*** అని పాడుకుంటుంది.

మంగళము మదనగోపాల...

యశోద ఓ వైపు, గోపికలు మరోవైపు ఎంతగా ఊయల ఊపుతున్నా, చిన్నికృష్ణుడికి నిద్దర రావడం లేదు. వాళ్ళు అలా జోకొడుతూ ఉంటే మరోవైపు తనకు వీపు మండిపోతుంది. అప్పుడు కృష్ణయ్య...

లోకములు నిదుర వోవగ
జో కొట్టుచు నిదురవోని సుభగుడు రమణుల్
జో కొట్టి పాడ నిదురం గై కొ
నుక్రియ నూరకుండె కను తెరవకయున్!...

'ఓహో! ఈ లోకులకు నిద్రపోయే అలవాటుంది; ఇలా నిద్రపోయే వాళ్ళను కూడా రక్షించడానికి కళ్ళు తెరుచుకొని ఉండడం నా కలవాటు; అది వీళ్ళకు అర్థం కావడం లేదు. అయినా కళ్ళు మూసుకుంటే నేను నిద్దరపోయాననుకుంటారు. ఈ వీపు మంట తగ్గాలంటే నిద్రపోయినట్లు కనురెప్పలు మూసేసు కుంటాన'నుకున్నాడని పోతనగారు సుందరంగా వర్ణించారు.

అలా మన కోసం మానవరూపమెత్తి పరమాత్ముడు ఎన్నెన్నో అవస్థలు పడ్డాడు. అయినా మన మనస్సులో ఆయన లీలల్ని మధుర జ్ఞాపకాలుగా మిగిల్చిపోయాడు. చిత్రకారుల చిత్రాల్లో, భక్తకవుల పదాల్లో, మధుర గాయకుల గాత్రాల్లో శాశ్వతంగా నిలిచిపోయాడు. అలాంటి ఆత్మీయగానంతోనే అన్నమయ్య తన గుండెల్లో గోపాలకృష్ణుడిని జోకొడుతూ...

అంగుగా తాళ్ళపాకన్నయ్య చాల
శృంగార రచనగా చెప్పె నీజోల
సంగతిగ సకల సంపదల నీవేళ
మంగళము తిరుపట్ల మదన గోపాల... అని మంగళం పాడుకుంటూ, తిరుమల వేంకటేశుడిలోనే ఆ మధుసూదనుడిని చూసుకుంటూ మురిసిపోతున్నాడు. ❖



వికాస మంత్రాలు

– స్వామి పార్థసఖానంద



"సమయాన్ని గురించిన రహస్యం ఒకటుంది.. రేపు అనేది ఎన్నటికీ రాదు. ఎందుకంటే, నిన్న మనం 'రేపు' అనుకున్నదే 'ఈ రోజు' కాబట్టి"

వర్తమానం

1. నిన్న అనేది గతం, రేపు అనేది ఓ రహస్యం, నేడు అనేది ఓ వరం, అందుకే ఓ బహుమానం లాంటిది ఈ వర్తమానం. దాన్ని సంపూర్ణంగా ఆస్వాదిద్దాం!
2. మనం దిగులుగా ఉంటే, గతంలో మునిగిపోయినట్లు; ఆత్రంగా ఉంటే, భవిష్యత్తులో విహరిస్తున్నట్లు; శాంతంగా ఉంటే, వర్తమానంలో జీవిస్తున్నట్లు!
3. దిగులు పడడం వల్ల రేపటి దుఃఖం దూరం కాదు. కానీ నేటి సుఖం మాత్రం నాశనమవుతుంది!



"లావుగా ఉన్నందుకు నేను బాధ పడుతుంటాను. ఆ బాధను మరచిపోవడానికి ఎక్కువగా తింటుంటాను."

తిండి పుష్టి

1. ఆకలి కాస్త మిగిలి ఉండేట్లుగా ఎవరైతే భోజనం చేస్తారో, వారికి ఆకలి లేకపోవడం అనే సమస్య ఎన్నడూ ఉండదు.
2. మధ్యాహ్నం భోజనం తరువాత కాస్త కునుకు తీయండి, రాత్రి భోజనం తరువాత కాసేపు నడవండి.
3. ఊబకాయానికి మూడు కారణాలు:
   మొదటిది : వ్యాయామం చేసేందుకు బద్ధకం,
   రెండవది : అందుకు ఫలితం ఊబకాయం,
   మూడవది: అందువల్ల వ్యాయామం చేయాలంటే ఆయాసం!

ఆశ – నిరాశ


1. ఆశావాది అన్నీ మన మంచికే అనుకుంటాడు, నిరాశావాది అన్నీ మన చెడుకే అనుకుంటాడు.
   ఆశావాది ప్రతి కష్టంలోనూ ఓ అవకాశాన్ని చూస్తాడు, నిరాశావాది ప్రతి అవకాశంలోనూ కష్టాన్ని చూస్తాడు.
   ఆశావాది బాధను మరచిపోవడానికి నవ్వుతాడు, నిరాశావాది నవ్వడమే మరచిపోతాడు.
   ఆశావాది అవకాశాల్ని అందిపుచ్చుకుంటాడు, నిరాశావాది అదృష్టంపైనే ఆధారపడతాడు.
2. ఆశావాది సగం నీటితో నిండిన గ్లాసుని చూసి ఆనందపడతాడు. నిరాశావాది గ్లాసులో నీరు సగమే ఉన్నందుకు బాధపడతాడు. సగం నీటిని చూసి ఆనందపడడు, సగం ఖాళీని చూసి బాధ పడడు. అతడే – యథార్థవాది.

"ప్రియమైన ఆశావాది, నిరాశావాది, యథార్థవాదులారా! మీరు సగం నిండిన గ్లాసు గురించి గొడవ పడుతున్నప్పుడు, ఆ నీటిని నేను తాగేశాను."

ఇట్లు
మీ
అవకాశవాది







భగవంతుడు ఎటువైపు?

- స్వామి పరిజ్ఞేయానంద

నేటి సమాజ పరిస్థితుల్ని చూసి 'ధర్మానికివి రోజులు కావు' అని అనుకుంటూ ఉంటాం. కానీ 'ఎప్పటికైనా ధర్మానిదే పైచేయి' అని చరిత్ర నిరూపించిన పరమ సత్యాన్ని మరచిపోతుంటాం.

నేడే కాదు, ఏనాడైనా అధర్మమార్గాన్ని అనుసరించిన వాళ్ళే అధికంగా ఉంటారు. అధర్మపక్షమే బలంగా ఉంటుంది. కురుపాండవ యుద్ధంలో కౌరవసేన పదకొండు అక్షౌహిణులు; పాండవసేన కేవలం ఏడు అక్షౌహిణులే! శ్రీకృష్ణుని కాలంలో కూడా అధర్మపక్షమే అధికబలం కలిగివుందని అర్థమవుతోంది. అంటే దుర్యోధనుడి లాంటి ఆసురీ భావాలు కలవారే అధికమని తెలుస్తోంది. ఆసురీ ప్రవృత్తి కలవారు తమకున్న మందీమార్బలాన్ని చూసుకొని తామే బలవంతులమని విర్రవీగుతుంటారు. దుర్యోధనుడు కూడా తమ సైన్యం, పాండవ సైన్యం కన్నా అధికమని ద్రోణాచార్యునితో చెబుతూ...

అపర్యాప్తం తదస్మాకం బలం భీష్మాభిరక్షితమ్ ।
పర్యాప్తం త్విదమేతేషాం బలం భీమాభిరక్షితమ్ ॥ *(గీత -1.10)*

భీష్ముడిచే రక్షించబడుతున్న మన సైన్యం అపరిమితమైనది, భీముడిచే రక్షించబడుతున్న పాండవ సైన్యం పరిమితమైనది' అని ధీమా వ్యక్తం చేస్తాడు.

కానీ చివరికి కురుక్షేత్ర యుద్ధంలో అధిక సేనాబలం కలిగిన కౌరవులు అపజయం పొందారు. తక్కువ సేనాబలం కలిగిన పాండవులు విజయం సాధించారు. అది ఎలా సాధ్యమైందని ఎవరైనా మనల్ని అడిగితే 'శ్రీకృష్ణుడు పాండవులకు అండగా ఉండబట్టి సాధ్యమైంది' అని ఠక్కున సమాధానం చెబుతాం. అలాగైతే కృష్ణుడు కౌరవపక్షంలో ఉండి ఉంటే కౌరవులు విజయం సాధించేవారే కదా! కానీ కృష్ణుడు కౌరవుల వైపు ఎందుకు వెళ్ళలేదు? ఎందుకంటే 'కృష్ణుడు పాండవ పక్షపాతి; అర్జునుడి ప్రియసఖుడు కాబట్టి' అని అనుకుంటే పొరపాటే!

పాండవులు తనకు ప్రియతములని శ్రీకృష్ణుడు వారి పక్షాన నిలబడలేదు. పాండవులు ధర్మం వైపు నిలబడ్డారు. కాబట్టి శ్రీకృష్ణుడు ధర్మం వైపున్న పాండవులకు అండగా నిలిచాడు. అందువల్ల శ్రీకృష్ణుడు తాను పాండవ పక్షపాతిని కాదు ధర్మ పక్షపాతిననీ, ధర్మం ఎక్కడ ఉంటే తాను అక్కడ ఉంటాననీ నిరూపించాడు.

సాధారణంగా ధర్మపరాయణులు కష్టాలను అనుభవిస్తుండడాన్నీ, అధర్మవర్తనులు సుఖంగా జీవిస్తుండడాన్నీ మనం చూస్తూ ఉంటాం. కానీ ధర్మపరాయణుల కష్టాలు కలకాలం ఉండవనీ, అధర్మపరుల సుఖాలు శాశ్వతం కావనీ చెప్పడానికి ఎందరో మహాత్ముల జీవితాలు ప్రత్యక్ష సాక్ష్యం.

శ్రీరామకృష్ణుల తండ్రి క్షుదీరామ్ దేరే గ్రామంలో నివసిస్తున్నప్పుడు ఆ గ్రామ జమీందార్ రామానందరాయ్ అనే వ్యక్తి ఒక గ్రామస్థుని ఆస్తిని కాజేయాలని తలచి అందుకు క్షుదీరామ్‌ను తప్పుడు సాక్ష్యం చెప్పమని కోరాడు. ధర్మపరాయణుడైన క్షుదీరామ్ అందుకు అంగీకరించలేదు. ఆ కక్షతో రామానందరాయ్, క్షుదీరామ్‌ను గ్రామం వదలి వెళ్ళిపోయేలా చేశాడు. చేతిలో చిల్లిగవ్వ కూడా లేని క్షుదీరామ్ భార్యాపిల్లలతో కాలిబాట పట్టాడు. రామానందరాయ్ పాల్పడిన అక్రమానికి క్షుదీరామ్ తోడ్పడివుంటే అతడు కష్టాలపాలై ఉండేవాడు కాదు. ధర్మానికి కట్టుబడ్డ క్షుదీరామ్ కష్టాలను ఎదుర్కొన్నాడు. కానీ అవి తాత్కాలికమే! ఎలాగంటే కష్టాల్లో ఉన్న క్షుదీరామ్ కుటుంబాన్ని కామార్పుకూర్ గ్రామస్థుడైన సుఖ్‌లాల్ గోస్వామి ఆదుకున్నాడు. 'ధర్మోరక్షతి రక్షితః - ధర్మాన్ని రక్షించిన (ఆశ్రయించిన) వ్యక్తికి ధర్మస్వరూపుడైన ఆ భగవంతుడే రక్షణ బాధ్యతల్ని వహిస్తాడ'న్న సత్యం ఋజువైంది.

ధర్మపరాయణుడు (అర్జునుడు) ఎక్కడ ఉంటే భగవంతుడు (శ్రీకృష్ణుడు) అక్కడ ఉంటాడనీ, వారిద్దరూ ఉన్న చోట సిరి సంపదలు, విజయ వైభోగాలు స్థిరంగా ఉంటాయనీ గీతాసారాన్ని సంజయుడు ఆఖరి శ్లోకంలో వివరిస్తూ...

యత్ర యోగేశ్వరః కృష్ణో యత్ర పార్థో ధనుర్ధరః ।
తత్ర శ్రీర్విజయో భూతి ర్ధ్రువా నీతి ర్మతిర్మమ ॥ *(గీత -18.78)*



నిజమైన భగవత్సేవకులు

ఒక ధనవంతునికి పెద్ద తోట ఉంది. దానిలో ఇద్దరు తోటమాలులు ఉన్నారు. అందులో ఒకడు చాలా సోమరి. ఏ మాత్రం పని చేయడు. యజమాని తోటలోకి వచ్చినప్పుడు లేచి నిలబడి చేతులు కట్టుకుని వినయం ప్రదర్శిస్తూ, "ఆహా! దొరగారూ! మీ అందమే అందం. ఎంత బాగున్నారో" అంటూ ఆయనను పొగడ్తలతో ముంచెత్తుతాడు.

ఇక రెండో తోటమాలి ఎక్కువ మాట్లాడడు. కానీ కష్టపడి పని చేస్తాడు. అనేక రకాల పండ్లు, కాయగూరలు పండిస్తాడు. వాటిని స్వయంగా తలపై మోసుకుంటూ పోయి యజమాని ఇంటికి చేరుస్తాడు. ఈ ఇద్దరు తోటమాలులలో ఎవరంటే యజమానికి ఎక్కువ ప్రేమ ఉంటుందో చెప్పండి?

ఈ విశ్వమనే తోటకు ఆ పరమేశ్వరుడు యజమాని, ఇక్కడ రెండు రకాల తోటమాలులు ఉంటారు. ఒక రకంవారు సోమరిపోతులు, కపట భక్తిపరులు. ఆ పరమేశ్వరుని అందాన్నీ, ఆయన సొగసైన కన్ను ముక్కు తీరులనూ, ఆయన వివిధ భంగిమలనూ వర్ణిస్తూ కాలక్షేపం చేస్తారు. మరొక రకం వారు ఆ భగవంతుని బిడ్డలైన పేద, బలహీన వర్గాలవారికీ, ఆయన సృష్టించిన పశుపక్ష్యాదులకూ సేవ చేస్తూ ఉంటారు. వీరిరువురిలో ఆ భగవంతునికి ఎవరంటే ఎక్కువ ప్రీతి ఉంటుందో చెప్పండి? తప్పకుండా ఆయన బిడ్డలను సేవించే వారినే ఆయన ఇష్టపడతాడు. అలాగే ఆ పరమేశ్వరుని సేవించాలనుకునే వ్యక్తి ముందుగా సృష్టిలోని జీవరాశినంతటినీ సేవించాలి. భగవంతుని బిడ్డలను సేవించే వారు ఆయనకు అత్యంత ప్రీతిపాత్రులు. ❖

యాచకుడి నుండి యాచనా?

ఒకప్పుడు ఒక మహారాజు అడవికి పోయి అక్కడ ఒక యోగిని కలుసుకున్నాడు. ఆ యోగితో రాజు కొంతసేపు మాట్లాడాక ఆయనలోని పవిత్రత, జ్ఞానానికి ముచ్చటపడ్డాడు. అప్పుడా మహారాజు తన మీద దయ ఉంచి ఏదైనా బహుమతిని స్వీకరించవలసిందిగా ఆ యోగిని ప్రార్థించాడు.

ఆ యోగి అందుకు నిరాకరిస్తూ, "ఈ అడవిలో లభించే ఫలాలు నాకు సరిపడా ఆహారాన్నిస్తున్నాయి. పర్వత సానువుల నుండి ప్రవహించే సెలయేరు నాకు తగినంత నీటిని సమకూరుస్తుంది. ఇక్కడి చెట్ల బెరళ్ళు నా శరీరాచ్ఛాదనకు సరిపోతున్నాయి. ఈ కొండ గుహలు నా నివాసానికి అనువుగా ఉన్నాయి. ఇంకా నేను నీ నుండి గాని, ఇతరుల నుండి గాని బహుమతులు పొందాల్సిన అవసరం ఏముంది చెప్పు?" అని అన్నాడు.

అందుకు ఆ మహారాజు "స్వామీ! అలా అనకండి. నా సంతృప్తి కొరకు నాతో మా భవనానికి వచ్చి నా నుండి ఏదో ఒకటి తమరు స్వీకరించాలి. నా ప్రార్థనను మన్నించండి" అన్నాడు. రాజు చాలా ఒత్తిడి చేశాక ఇక తప్పదన్నట్లు అంగీకరించి ఆ యోగి రాజప్రాసాదానికి వెళ్ళాడు. రాజు ఆ యోగిని ఒక గదిలో కూర్చోబెట్టి దైవప్రార్థన ఇలా చేయసాగాడు:

"భగవాన్! నాకు మంచి సంతానాన్నివ్వు. ఇంకా అధికంగా సంపద నివ్వు. నా రాజ్యాన్ని విస్తరించు. నాకు తగిన ఆరోగ్యాన్నివ్వు". అతడు ప్రార్థన ముగించేలోపే యోగి దిగ్గున లేచి మౌనంగా గది బయటకు నడవసాగాడు. ఆ చర్యకు రాజు దిగ్భ్రాంతుడై యోగిని అనుసరిస్తూ, బిగ్గరగా "స్వామీ! తమరు వెళ్ళిపోతున్నారేమిటి? నా బహుమానం తమరు స్వీకరించనే లేదు" అంటూ అడిగాడు.

అప్పుడా యోగి, రాజు వంక తిరిగి, "నేను యాచకుల నుండి యాచించే వాడిని కాను. నీకు నువ్వే ఒక యాచకుడివి. ఇక, నాకు నువ్వేమి ఇవ్వగలవు? యాచించే వారి నుండి దేన్నైనా స్వీకరించేటంతటి మూర్ఖుణ్ణి కాను నేను" అన్నాడు.


రాజు ముఖం జేవురించింది. ❖

తెలుగు సేత: కె. త్రివిక్రమరావు

'యోగీశ్వరుడైన కృష్ణుడు ఎక్కడుంటాడో, ధనుర్ధారియైన పార్థుడు ఎక్కడుంటాడో అక్కడ లక్ష్మి, విజయం, వైభవం, నీతి స్థిరంగా ఉంటాయి' అని ధర్మానుష్ఠాన వైశిష్ట్యాన్ని స్పష్టం చేశాడు. శ్రీకృష్ణుడు పాండవుల వైపు ఉన్నాడనడం కన్నా, ధర్మం వైపు ఉన్నాడనడం సబబు. పాండవులు ధర్మం వైపు ఉండడం వల్లనే వారు భగవానుని అనుగ్రహాన్ని సంపూర్ణంగా పొందగలిగారు.

'My concern is not whether God is on my side; my greatest concern is to be on God's side, for God is always right' అని అబ్రహాం లింకన్ అన్నట్లు మన వైపు భగవంతుడు ఉన్నాడా? లేడా? అని ఆలోచించడం కన్నా, మనం ధర్మం వైపు ఉన్నట్లయితే అప్రయత్నంగానే ధర్మస్వరూపుడైన భగవంతుడు మనకు అండగా నిలుస్తాడు.


కాబట్టి ధర్మం వైపు ఉన్న పాండవులను భగవానుడు రక్షించినట్లు మనం కూడా ధర్మమార్గాన్ని అనుసరిస్తే భగవంతుడు మన వెంటే ఉండి శాశ్వత శాంతి సౌఖ్యాలను అనుగ్రహిస్తాడు. ❖




ఏకదంతుడు

కథ: శ్రీమతి ఎస్.శేషు చిత్రాలు: దాకోజు శివప్రసాద్ అనుసృజన: స్వామి జ్ఞానదానంద


1 ద్రవిడ దేశంలో శివదత్తుడనే బ్రాహ్మణునికి నలుగురు కుమారులుండేవారు. వారు తండ్రి దగ్గరే విద్యను అభ్యసిస్తూ తండ్రికి కావాల్సిన సమిధలు, ఫలాలు, పుష్పాలు వంటివి అడవి నుండి సేకరించి తెచ్చేవారు. ఒకరోజు నలుగురూ నదిలో స్నానం చేసి, సూర్యభగవానునికి అర్ఘ్యమిచ్చి దగ్గరలో ఉన్న కొండ ఎక్కారు. అక్కడి ప్రకృతి దృశ్యాలను చూసి పరవశిస్తూ సమిధలు, ఫలపుష్పాలు సేకరించసాగారు.



2 ఇంతలో ఒక అందమైన లేడి వచ్చి సెలయేటిలో నీరు తాగుతుంటే, శివదత్తుని నాలుగో కుమారుడైన సూరిశర్మ....




3 ఇంతలో పెద్దపులి వచ్చి లేడిని చంపింది. వారంతా భయంతో...




4 చనిపోయే ముందు లేడినై విహరించాలనుకున్నాడు కనుక సూరిశర్మ లేడిగా పుట్టి అడవిలో తిరుగుతున్నాడు. పులి చంపిన లేడి మరలా ఆడలేడిగా జన్మించి, లేడిరూపంలో ఉన్న సూరిశర్మను కలిసింది.



5 ఇంతలో ఒక కిరాతకుడు ఆ లేళ్ళ జంటను చూసి, వాటిని చంపబోయాడు. వాడి బారి నుండి తప్పించుకునే ప్రయత్నంలో రెండు లేళ్ళూ పరుగెత్తి పుష్కరమనే నదీతీరానికి చేరాయి.





6 నదిలో స్నానం చెయ్యడానికి ఆకృతవ్రణుడనే తన శిష్యునితో కలిసి వచ్చాడు పరశురాముడు.
7 పరశురాముడి తండ్రి జమదగ్నిని హైహయుడు చంపగా తల్లి దుఃఖంతో 21 మార్లు గుండె బాదుకుంది. అప్పుడు పరశురాముడు...
ఇరవై ఒక్కమార్లు రాజుల్ని వెతికి వెతికి చంపుతాను. ఇదే నా శపథం!
అందుకు అవసరమైన కృష్ణ కవచం కోసం తపస్సు చేస్తూ తన శిష్యుడైన ఆకృతవ్రణుడితో పాటు నదీ తీరంలో పరశురాముడు వసిస్తున్నాడు.
8 లేడి రూపంలో ఉన్న సూరిశర్మ తన భార్యతో ఇలా అన్నాడు...
ఇక మనకి భయంలేదు. నదిలో స్నానం చేస్తున్నది పరశురాముడు. ఆయన ఉండగా కిరాతకుడు మన జోలికి రాడు. పరశురాముడు కృష్ణ కవచం కోసం మూడేళ్ళుగా తపస్సు చేస్తున్నాడు. అగస్త్యముని ఆశ్రమానికి వెళ్ళి ఆయనను ప్రార్థిస్తే, కృష్ణ కవచం ఉపదేశిస్తాడు.
లేళ్ళు నిర్భయంగా నీళ్ళు తాగి సేదతీరాయి. ఇంతలో అక్కడికి వచ్చిన కిరాతకుడు, పరశురాముణ్ణి చూసి భయపడి లేళ్ళకు కీడు తలపెట్టే ప్రయత్నం మానుకున్నాడు.
9 లేడి రూపంలో ఉన్న సూరిశర్మ మాటలు విని పరశురాముడు తన శిష్యునితో పాటు అగస్త్యముని ఆశ్రమానికి బయలుదేరాడు.
లేడి రూపంలో ఉన్న సూరిశర్మ తన భార్యతో సహా వారిని అనుసరించాడు.
10 అగస్త్యుడు, పరశురాముడికి కృష్ణ కవచం ఉపదేశించాడు. దానిని వినడం వలన ఆ లేళ్ళ జంటకి మృగరూపాలు పోయి, మానవరూపాలు వచ్చాయి.
11 వైకుంఠం నుండి వారి కోసం విమానం రాగా, వారిద్దరూ విమానమెక్కి వెళ్ళిపోయారు.


12
పరశురాముడు మహావిష్ణువును ప్రార్థించాడు. విష్ణువు ప్రత్యక్షమై...
13
నీ తండ్రిని చంపిన హైహయుడు నా చక్రాంశతో పుట్టాడు. నా అంశను నీకిస్తున్నాను. నువ్వు ఇప్పుడు అతణ్ణి చంపగలవు; అంతేకాదు ఇరవై ఒక్కమార్లు వెతికి వెతికి రాజులను చంపగలవు. తరువాత రామావతారంలో సీతాకల్యాణ సమయంలో నా అంశను నేను తీసుకుంటాను. నీకు జయమవుతుంది ఈ ధనుస్సు తీసుకో.
ధన్యుణ్ణి స్వామీ!
14
పరశురాముడు హైహయుణ్ణీ, 21 మార్లు భూమంతా తిరిగి రాజుల్నీ చంపాక, నర్మదా నదిలో స్నానం చేసి కైలాసానికి వెళ్ళాడు. కైలాసంలో విఘ్నేశ్వరుడు పరశురాముడితో...
ఇది నా తండ్రి విశ్రాంతి తీసుకునే సమయం. నేను వెళ్ళి మీ రాక గురించి వారికి తెలియపరచి వస్తాను ఇక్కడే వేచివుండండి.
పార్వతీ పరమేశ్వరులు నాకూ తల్లితండ్రులే. నువ్వు వెళ్ళినట్లు నేనూ లోనికి వెళ్ళగలను. నన్నాపకు అడ్డులే!
15
విఘ్నేశ్వరునికి కోపం వచ్చింది.
తొండంతో పరశురాముణ్ణి గిరగిరా తిప్పాడు. అలా తిరుగుతున్న పరశురాముడికి పద్నాలుగు లోకాలూ కనిపించాయి.
16
అతణ్ణి ఇంకా భయపెట్టాలని విఘ్నేశ్వరుడు సప్త సముద్రాలలోనూ ముంచి వదిలిపెట్టాడు.


17
జరిగిన పరాభవానికి కోపం పట్టలేక
పరశురాముడు శివుడిచ్చిన పరశువుని ప్రయోగించి
విఘ్నేశ్వరుడి దంతాన్ని విరక్కొట్టాడు.
18
కోలాహలం విని
పార్వతీ పరమేశ్వరులు
బయటకు వచ్చారు.
19
దంతం విరిగి రక్తసిక్తమైన గణపతిని చూసి
పార్వతి దుఃఖించింది. పుత్రసమానుడైన
పరశురాముణ్ణి ఏమీ చెయ్యలేక దీనంగా నిట్టూర్చింది.
20
ఇంతలో అక్కడికి విచ్చేసిన
మహావిష్ణువు, పార్వతీ
దేవిని ఓదారుస్తూ...
పార్వతీ!
విచారించకు.
ఇక నుండి గణపతి
'ఏకదంతుడు'గా
పూజలందుకుంటాడు.
ఆ విధంగా విఘ్నేశ్వరుడు ఏకదంతుడనే నామంతో ప్రసిద్ధుడయ్యాడు.

గ్రంథ పరిచయం




ఐశ్వర్యం

(170 శివక్షేత్రాల వైభవం)


రచన : శ్రీమతి సింగరాజు నాగలక్ష్మి
వెల: రూ.100/-, పుటలు : 129
ప్రచురణ : ఆదిత్య ప్రచురణలు
2-2-1107/ఎ/3, తిలక్‌నగర్, న్యూనల్లకుంట
హైదరాబాదు-44, ఫోన్ : 040 -27562716

శ్రీ వేంకటేశ్వర సుప్రభాతమ్



(వ్యాఖ్యాన సహితము)


రచన : శ్రీ ప్రతివాది భయంకర అణ్ణన్ స్వామి
వ్యాఖ్యానము : అల్లూరు శివకోటేశ్వరరావు
వెల: రూ.111/-, పుటలు : 128
ప్రతులకు : అల్లూరు ఫణీంద్ర సాయి
5-112, మండల కార్యాలయం వద్ద,
కారంచేడు, ప్రకాశం జిల్లా



నారద భక్తి సూత్రాలు


రచన : శ్రీ చింతగుంట సుబ్బారావు
వెల: రూ.60/-, పుటలు : 104
ప్రతులకు : చింతగుంట సుబ్బారావు
4-102, ఐ.ఎల్.టి.డి. కాలనీ ఎక్స్‌టెన్షన్
కొత్తపేట, చీరాల - 523 157
సెల్: 9949119418

జ్ఞానజ్యోతులు




(గీతార్థ సంగ్రహము)

రచన : శ్రీ పింగళి పాండురంగరావు
వెల: రూ.15/-, పుటలు : 60
ప్రతులకు : పింగళి పాండురంగరావు
8-71, లాయరుపేట, ఒంగోలు-523 002
సెల్ : 9440554114



సుందరకాండ (వచనము)


వ్యాఖ్యాత:శ్రీ గోపావఝుల సుబ్రహ్మణ్యేశ్వర స్వామి
వెల: రూ.100/-, పుటలు : 184
ప్రతులకు : గోపావఝుల సుబ్రహ్మణ్యేశ్వర స్వామి
డోర్.నెం. 9-7-7, చందాసత్రం వెనుక
రాజమండ్రి - 533 101



గీతా సుగంధం

రచయిత : శ్రీ అమ్ము అన్నాజీరావు
వెల: రూ.100/-, పుటలు : 189
ప్రతులకు : డి. సర్వేశ్వరరావు
ఆధ్యాత్మిక పుస్తకషాపు, గణేష్ గుడి ప్రక్కన,
వనస్థలిపురం, హైదరాబాదు-500 070
సెల్ : 9299901355

మకరంద బిందువులు



(మన సంస్కృతీ సంప్రదాయాల తేనెచినుకులు)

రచన : శ్రీ ఎమ్. సూర్యప్రసాదరావు
వెల: రూ.150/-, పుటలు : 238
ప్రతులకు : ఎమ్. సూర్యప్రసాదరావు
ఇ.నెం.5-6-18/బి, పాకబండ బజార్
ఖమ్మం - 507 001, సెల్: 9885156844




శ్రీ శివసహస్రనామ స్తోత్రము

శ్రీ శివ & గౌరీదేవి అష్టోత్తర శతనామస్తోత్ర సహితమ్


తెలుగుసేత : శ్రీ పులవర్తి నూకాలరావు
వెల: రూ.60/-, పుటలు : 100
ప్రతులకు : పులవర్తి నూకాలరావు
శ్రీపూర్ణ సత్యాంబికా విహారము
4/23-2-10, వెంపటివారివీధి, కాకినాడ-1
ఫోన్: 9989260592

నాణాలు - నోట్లు



పుట్టు పూర్వోత్తరాలు

రచన : శ్రీ కొల్లు మధుసూదన రావు
వెల: రూ.100/-, పుటలు : 136
ప్రతులకు : స్వెన్‌పబ్లికేషన్స్, 1-6-141/19,
విద్యానగర్, సూర్యాపేట, నల్గొండ జిల్లా-
508 213, సెల్: 98484 20070




నిత్య జీవిత సత్య దీపిక

(మహాయోగుల మది నుండి వెలువడిన మార్గదర్శకాలు)

రచన : శ్రీమతి కాట్రావులపల్లి సుబ్బలక్ష్మి
వెల: రూ.150/-, పుటలు : 219
ప్రతులకు : శ్రీమతి కె. సుబ్బలక్ష్మి,
2-2-185/14/ఎ/జి, శ్రీసాయి ఎన్‌క్లేవ్,
ఆర్.కె.నగర్, అంబర్‌పేట్, హైదరాబాదు-13
సెల్: 9705499740

Printed and published by **Swami Jnanadananda** owned by Ramakrishna Math Trust
and printed at Kala Jyothi Process, 1-1-60/5, RTC Cross Roads, Musheerabad, Hyderabad - 500 020
and published at Ramakrishna Math, Domalguda, Hyderabad - 500 029. **Editor: Swami Parijneyananda**

Vol.71-8, Sri Ramakrishna Prabha (Telugu Monthly) August 2014, Regd. with the Registrar of Newspaper for India Under No.1120/57. Postal Registration No. HD-1071/2013-15. Licensed to Post Under WPP : AP/CPMG/HC-13/WPP/2013-14. Date of Publication : 18 July 2014



రాధాకృష్ణుల రూపం

ఒకసారి అతుల్ చంద్రఘోష్, శ్రీరామకృష్ణుల దర్శనార్థమై కోల్‌కతాలోని కాశీపూర్ ఉద్యాన గృహానికి వెళ్ళాడు. అప్పడు గురుదేవుల గది తలుపులు మూసి ఉన్నాయి. అతుల్ తలుపు తట్టాడు. కానీ చాలాసేపటి వరకూ ఎలాంటి స్పందనా రాలేదు. చివరికి గోపాల్ అనే శిష్యుడు తలుపులు తెరిచాడు. ఆ సమయంలో శశి మహరాజ్ గురుదేవులకు విసనకర్రతో విసురుతూ నిలబడ్డారు. అతుల్‌ని చూడగానే శశి మహరాజ్ విసనకర్రను అతని చేతికిచ్చి వెళ్ళిపోయారు.

అతుల్ గురుదేవులకు విసురుతూ ఉన్నప్పడు గురుదేవుల శరీర కుడిభాగంలో కృష్ణుణ్ణీ, ఎడమ భాగంలో రాధాదేవినీ దర్శించాడు. ఆ దర్శనంతో అతుల్ భావపరవశుడయ్యాడు. అప్పడు గురుదేవులు అతనితో "ఏమోయ్! నువ్వు వచ్చి ఎంతసేపైంది?' అని అడిగినప్పడు అతుల్ బాహ్యాస్పృహకు వచ్చాడు. ❖

ఆధ్యాత్మిక అమృతవాహిని

శ్రీ రామకృష్ణ ప్రభ

సెప్టెంబర్ 2014

వెల: ₹10





సుబోధ

శ్రీరామకృష్ణులు: సంసారంలో ఉంటూ భగవంతుడి పాదపద్మాలపై భక్తిని కలిగివుండేవాడు నిజంగా ధన్యుడు సుమా! నెత్తిమీద రెండు మణుగుల బరువు పెట్టుకొని కూడా దారిన వెళ్ళే పెళ్ళివారి ఊరేగింపును చూసే వ్యక్తి లాంటివాడు గృహస్థుడు. అతడు ఎంతో శక్తి ఉంటే తప్ప అలా జీవించలేడు.

సంసారంలో నిర్లిప్తభావంతో ఉండడానికిగాను కొన్ని సాధనలు చేయవలసి ఉంటుంది. కొంతకాలంపాటు ఏకాంతంలో ఉండడం అవసరం - అది ఏడాదిపాటు కావచ్చు, ఆరు నెలలు కావచ్చు, మూడు నెలలు కావచ్చు; లేకుంటే ఒక నెలైనా కావచ్చు. ఆ ఏకాంతంలో భగవచ్చింతన చేయాలి, వ్యాకులచిత్తంతో భగవంతుణ్ణి భక్తి కోసం ప్రార్థించాలి.

వెన్నతీశాక దాన్ని కొత్త కుండలో కనుక పెడితే అది చెడిపోవడానికి ఆస్కారం ఉండదు. కానీ దాన్ని పెరుగు పెట్టిన కుండలో పెట్టినట్లయితే, సందేహమే!

గృహస్థాశ్రమంలో ఉన్న జ్ఞానికి, సన్న్యాసాశ్రమంలో ఉన్న జ్ఞానికి మధ్య ఏమైనా తేడా ఉందా? అని అడిగితే దానికి సమాధానం - ఇద్దరూ ఒకే తరగతికి చెందిన వారే. ఇతడూ జ్ఞానే, అతడూ జ్ఞానే. కానీ కామినీ కాంచనాల నడుమ వసిస్తున్న గృహస్థునికి ఎంతోకొంత భయం ఉండనే ఉంటుంది. మసిబారిన ఇంట్లో వసిస్తున్నప్పుడు నువ్వు ఎంత జాగ్రత్త వహించినప్పటికీ శరీరం మీద కాస్తోకూస్తో నల్లని మరకపడే తీరుతుంది.

ఒకసారి జనకమహారాజు సభలోకి ఒక భైరవి వచ్చింది. స్త్రీని చూడగానే జనకుడు, తలను క్రిందకు దించుకొని నేలచూపులు చూడసాగాడు. అది చూసి భైరవి ఇలా అంది: 'ఓ జనకా! స్త్రీని చూసి నీకింకా భయం వేస్తోందా?' పూర్ణజ్ఞానం కలిగినప్పుడు పసిబాలుడి స్వభావం ఏర్పడుతుంది. అప్పుడు స్త్రీ పురుషులనే భేదభావం ఉండదు.

గృహస్థాశ్రమంలో ఉన్న జ్ఞానికి దేహం మీద కొన్ని మరకలు పడవచ్చు కానీ వాటితో అతడికి కలిగే నష్టమేమీ లేదు. చంద్రునిలో మచ్చలు ఉన్నాయి. కానీ వాటివల్ల చంద్రుని ప్రకాశానికి లోటేమీ లేదు కదా! ❖

శ్రీరామకృష్ణ ప్రభ
రామకృష్ణ మఠం, దోమల్‌గూడ, హైదరాబాదు-500 029
ఫోన్: 040-27667799, సెల్: 8801849494
E-mail : sriramakrishnaprabha@gmail.com

నిర్వాహక సంపాదకులు: స్వామి జ్ఞానదానంద   సంపాదకులు: స్వామి పరిజ్ఞేయానంద



సురభి

నేను (సరళ– ప్రవ్రాజిక భారతీప్రాణ) ఉద్బోధన్ గృహంలో ఉన్నప్పుడు మాస్టరు మహాశయ నాకు 'కథామృతం' ఇచ్చారు. "సరళా! నాకు చదివి వినిపించు" అన్నారు శారదమ్మ. అమ్మ తదేక ధ్యాసతో విని, ఆనాటి ముచ్చట్లు నాకు చెప్పేవారు. "మాస్టరు ఎంత తెలివైన వాడో! సమస్తం ఉన్నది ఉన్నట్లు వ్రాశాడు. గురుదేవులు అలాగే మాట్లాడేవారు. అంతా నెమరు వేసుకొని వ్రాశాడు. ఈ విషయాలు ఎందరికో తెలుస్తాయి. నేను కూడా ఎన్ని విషయాలు విన్నానో. ఈవిధంగా వెలువడుతాయని గ్రహిస్తే, నేను కూడా వ్రాసి దాచే దానిని. ఈ విధంగా జరుగుతుందని, అప్పుడు ఎవరికి తెలుసమ్మా!" అన్నారు.

రాధూ రెండు పిల్లుల్ని పెంచేది. ఒకదాని పేరు రంగ, రెండవదాని పేరు రమణి. రెండూ చాలా మంచివి, రాధూ లేదా గోలాప్–మా పెట్టినవే తినేవిగానీ ఎందులోనూ మూతి పెట్టేవి కావు. అమ్మ కూడా వాటిని ప్రేమించేవారు. ఒక ఉషోదయాన్న తన పక్క బట్టలు పాడు చేసిందని ఆగ్రహించి, రాసవిహారీ మహరాజ్ రంగను ఎక్కడో దూరంగా వదలివేసి వచ్చారు. 'అయ్యో! ఇదేమిటి తల్లీ. తెల్లవారనే రాసవిహారి ఎంత పని చేశాడు!' అని అమ్మ బాధపడ్డారు. రాధూ, గోలాప్–మా కూడా చింతించారు.

మూడు, నాలుగు నెలల తరువాత రంగ తిరిగి వచ్చింది. మునుపటి జీవకళ లేదు. బక్కచిక్కి నీరసంగా ఉంది. వచ్చిన కొద్ది దినాల తర్వాత ప్రాణాలు విడిచింది. గోలాప్–మా దానిని గంగానదిలో విడిచి వచ్చారు. 'అమ్మా! రంగ ఆత్మశాంతికి పూజాదికాలు చేయాలి' అన్నారు. 'అవును. శాపగ్రస్త భక్తుడు ఎవరో ఈ పిల్లిగా పుట్టాడు' అన్నారు అమ్మ. పదమూడవ రోజున దినం పెద్ద ఎత్తున జరిపించారు. బేలూరు మఠం నుండి సన్న్యాసులు వచ్చి కాళీ కీర్తన పాడారు. కీర్తన అనంతరం భూరిభోజనం. 'ఆహా, అదృష్టమంటే ఈ పిల్లిదే. అమ్మ ఇంట్లో 'దినం జరిగింది' అని అందరూ అన్నారు.

ఆ సమయంలో రాధూ గర్భిణి; రాధూకి పిచ్చి ముదిరి, ఊరికి వెళ్ళిపోదామని పట్టు పట్టింది. ఆమెను తీసుకొని అమ్మ కోయిలపాడా వచ్చి ఉంటున్నారు. గది ప్రక్కనే ఉన్న చెట్టుపై ఒకనాడు ఒక పక్షి వాలింది. అమ్మ చిన్న బాలిక వలె 'ఓ పక్షీ! రాధూకు పుట్టేది ఖోకా(బాబు) నా? లేక ఖుకీ(పాప) నా?' అని అడిగారు. ఆ పక్షి 'కోకా, కోకా, కోకా' అని అరచింది. అమ్మ, 'రాధూకు పుట్టబోయేది మగ పిల్లవాడే'నని సంబర పడ్డారు. ❖

ఆధ్యాత్మిక అమృతవాహిని

శ్రీ రామకృష్ణ ప్రభ

సంపుటం: 71 సంచిక: 9 సెప్టెంబర్ 2014



ఓం ద్యౌః శాంతిః అంతరిక్షం శాంతిః పృథివీ శాంతిః
ఆపః శాంతిః ఓషధయః శాంతిః వనస్పతయః శాంతిః
విశ్వే దేవాః శాంతిః బ్రహ్మ శాంతిః
సర్వం శాంతిః శాంతిరేవ శాంతిః ॥

ఆకాశంలో శాంతి నెలకొనుగాక! అంతరిక్షంలో శాంతి నెలకొనుగాక! భూమండలంలో శాంతి నెలకొనుగాక! నీటిలో శాంతి నెలకొనుగాక! చెట్టుచేమలలో శాంతి నెలకొనుగాక! సకల దేవతలు శాంతిని ప్రసాదింతురుగాక! సమస్తమూ మనకు ప్రశాంతతను ప్రసాదించుగాక! – శాంతి సూక్తమ్


సూక్తి సౌరభం

విద్యా వివాదాయ ధనం మదాయ
శక్తిః సర్వేషాం పరపీడనాయ
ఖలస్య సాధోః విపరీత మేతత్
జ్ఞానాయ దానాయ చ రక్షణాయ


"విద్య వితండ వాదానికీ, ధనం మదగర్వంతో తిరగడానికీ, బలం అందర్నీ పీడించడానికీ – ఈ విషయాలన్నీ దుష్టులకు వర్తిస్తాయి. సత్పురుషుల విషయంలో విద్య జ్ఞానానికీ, ధనం దానానికీ, బలం ఇతరుల సాయానికీ ఉపయోగపడతాయి."

మొదటను మతమున్ వదలక
తుదనెవ్వరి మతమునైన దూషింపక, తా
పదిలుండయి, కోర్కె కోరక
ముదమున చరియించు బుధుడు ముఖ్యుడు వేమా!

"ఓ వేమా! బుద్ధిమంతుడు తన మతాన్నిగానీ, స్వధర్మాన్నిగానీ వదలడు. అలాగని ఇతర మతాల్ని దూషించడు. ఏ కోరికలూ కోరడు. ఎటువంటి ప్రలోభాలకూ లోబడడు. నిత్య తృప్తుడైనవాడికి ఏ మతం అయితేనేం!"



శ్రీరామకృష్ణ ప్రభ శాశ్వత నిధి





ఆధ్యాత్మిక జ్ఞానాన్ని పంచి పెట్టేందుకు 'శ్రీరామకృష్ణ ప్రభ' కృషి చేస్తోంది. నిధుల కొరత లేకుండా ఈ జ్ఞానయజ్ఞం నిరంతరాయంగా సాగేందుకు 'శ్రీ రామకృష్ణ ప్రభ శాశ్వతనిధి'కి ధన దానం చేసి ప్రోత్సహించాల్సిందిగా కోరుతున్నాం. దాతల పేర్లు పత్రికలో ప్రచురిస్తాం.

మహారాజ పోషకులు......	రూ.	10,000/-, అంతకన్నా ఎక్కువ విరాళం ఇచ్చేవారు.
రాజ పోషకులు............	రూ.	5,000/-, అంతకన్నా ఎక్కువ విరాళం ఇచ్చేవారు.
పోషకులు.................	రూ.	1,000/-, అంతకన్నా ఎక్కువ విరాళం ఇచ్చేవారు.

	దాత పేరు చిరునామా	రూ.
మహారాజ పోషకులు :	శ్రీమతి లక్ష్మీదేవి & శ్రీ సుంకు వేంకటనరసయ్య, పుట్టపర్తి, అనంతపురం జిల్లా	10,116
మహారాజ పోషకులు :	శ్రీ ఎన్. నరేంద్ర & శ్రీగరికపాటి పురుషోత్తమరావు, సగ్గొండ, పోలవరం(మం), ప.గో.జిల్లా	10,000
రాజ పోషకులు :	శ్రీమతి యిన్ని వసుమతి, ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్, హైదరాబాద్ (కీ॥శే॥ వింజమూరి రామచంద్రాచార్యుల గారి జ్ఞాపకార్థం)	5,000
పోషకులు :	శ్రీ కందాళం ఆదిత్య నారాయణ, వేదాచలంనగర్, చిన్నచౌక్, కడప	1,116
పోషకులు :	శ్రీ సి.హెచ్. నరసింహారావు, సి.ఆర్.కె. ఫౌండేషన్, రామకృష్ణాపురం, సికింద్రాబాద్	1,000
పోషకులు :	శ్రీ దేవేంద్రనాథ్ పండా, బారువ, శ్రీకాకుళం జిల్లా	1,000

'శ్రీరామకృష్ణ ప్రభ' కానుక పథకం

యువతరానికి 'శ్రీరామకృష్ణ ప్రభ'ను మరింత చేరువ చేయాలని సంకల్పించాం. రాష్ట్రంలోని వివిధ పాఠశాలలు/ కళాశాలలు/ గ్రంథాలయాలకు పత్రికను పంపించడానికి మీ సహాయాన్ని కోరుతున్నాం. ఈ కానుక పథకం క్రింద చందా చెల్లించిన దాత పేరున (మీరు సూచించిన లేదా మేము ఎంపిక చేసిన) విద్యాసంస్థకు పత్రికను పంపుతాం. కానుక చందా రూ.1,500/- అంతకన్నా ఎక్కువ ఇచ్చిన దాత పేరు, విద్యాసంస్థ పేరు పత్రికలో ప్రచురిస్తాం.

దాత పేరు	విద్యాసంస్థ
శ్రీ చెంచయ్య యగతీల, నెల్లూరు జిల్లా (కీ॥శే॥ వై.సుబ్బారాయుడుగారి జ్ఞాపకార్థం)	జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, వీరుబొట్లపల్లి, కాలువాయ, నెల్లూరుజిల్లా
శ్రీ కాంభోజి ధర్మలింగం, మండీబజార్, కడప (కీ॥శే॥ కె.గంగిశెట్టిగారి జ్ఞాపకార్థం)	ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల, కడప
శ్రీ జి.స్వరూప్ కుమార్ యాదవ్, బంజారాహిల్స్, హైదరాబాద్ (కీ॥శే॥ మల్లికార్జునరావుగారి జ్ఞాపకార్థం)	10 పాఠశాలలకు ఒక సంవత్సరానికి పత్రికను స్పాన్సర్ చేశారు.
డా॥పి.చంద్రశేఖర్ & డా॥ బి.కోటేశ్వరి, పీలేరు, చిత్తూరు జిల్లా	పీలేరు మండలంలోని 80 పాఠశాలలకు ఒక సంవత్సరానికి పత్రికను స్పాన్సర్ చేశారు.
శ్రీ జి. డోకారెడ్డి, కృష్ణారెడ్డి నగర్, కర్నూలు	జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్యాలకుర్తి, కోడుమూరు, కర్నూలు జిల్లా
శ్రీ గాగుల వీరవేంకట సత్యనారాయణ, చామర్తివారి వీధి, కాకినాడ	అత్తిలి మండలంలోని 10 పాఠశాలలకు ఒక సంవత్సరానికి పత్రికను స్పాన్సర్ చేశారు.

చందా వివరాలు		భారతదేశంలో	విదేశాలకు
విడి ప్రతి	:	₹ 10	-
సంవత్సర చందా	:	₹ 100	₹ 1,500
మూడు సంవత్సరాలకు	:	₹ 280	₹ 4,500
ఐదు సంవత్సరాలకు	:	₹ 450	₹ 7,500
ఇరవై సంవత్సరాలకు	:	₹ 1,500	₹ 22,000

గమనిక: డిమాండ్ డ్రాఫ్ట్, మనియార్డర్లలో Ramakrishna Math, Hyderabad అని వ్రాయాలి.

పంపవలసిన చిరునామా: Sri Ramakrishna Prabha, Ramakrishna Math, Domalguda, Hyderabad - 500 029.

చందాను ఆన్‌లైన్ http://rkmath.org/srkp ద్వారా చెల్లించవచ్చు.

లోపలి పేజీల్లో...

శ్రీరామకృష్ణ ప్రభ చందాదారులకు విన్నపం

ప్రియ పాఠకులారా!

- 'శ్రీరామకృష్ణ ప్రభ' పత్రిక కవరు మీద చిరునామాకు పైన మీ చందా నంబరు, కుడి వైపున మీ చందా గడువు ముగిసే నెల ఉంటాయి. మీ చందా గడువు పూర్తయ్యే నెలకు ముందుగానే సొమ్మును చెల్లించి చందాను పునరుద్ధరించుకోండి.
- మీ ఉత్తర ప్రత్యుత్తరాలన్నింటిలో తప్పనిసరిగా చందా నంబరు పేర్కొనాల్సిందిగా మనవి.
- మీ చిరునామా మారిన పక్షంలో 7వ తేదీ లోగా మాకు తెలియపరచినట్లయితే, వచ్చే నెల సంచిక నుండి మీ కొత్త చిరునామాకు పంపబడును.
- ప్రతీ నెల 26 లేదా 27వ తేదీల్లో పత్రిక పోస్ట్ అవుతుంది. మీకు పత్రిక 15వ తేదీ లోపుగా చేరనట్లయితే, వెంటనే మాకు తెలియజేయగలరు.

శ్రీరామకృష్ణ ప్రభ ద్వారా అవిచ్ఛిన్నంగా సేవలు అందించాలన్నదే మా ఆకాంక్ష. అందుకు మీ సహకారం కోరుతూ.... - సర్క్యులేషన్ మేనేజర్

'శ్రీరామకృష్ణ ప్రభ' పత్రిక చందాను
ఆన్‌లైన్ **http://rkmath.org/srkp** ద్వారా చెల్లించవచ్చును.

ఆచార్యదేవా! అభివందనం!

సృష్టిలో ఏ జీవికీ లేని ఒక ప్రత్యేక శక్తి కేవలం మనిషికే ప్రసాదించాడు భగవంతుడు. అదే మేధాశక్తి. ఆ మేధాశక్తిని వృద్ధిచేసుకొనేందుకు విద్యయే మార్గం! మనిషికి ఓ విశిష్ట స్థానాన్ని కల్పించే విద్యయే లేకపోతే మనిషికీ, మిగిలిన జీవులకూ మధ్య వ్యత్యాసమే లేదు. అందుకే 'విద్యలేనివాడు వింత పశువు' అని అన్నారు పెద్దలు.

మనిషికి సిరిసంపదల్నీ, సుఖసంతోషాల్నీ, కీర్తిప్రతిష్ఠల్నీ సంపాదించిపెట్టేది విద్యయే అంటూ భర్తృహరి...

విద్యా నామ నరస్య రూపమధికం ప్రచ్ఛన్నగుప్తం ధనం,
విద్యాభోగకరీ యశస్సుఖకరీ విద్యా గురూణాం గురుః,
విద్యా బంధుజనో విదేశగమనే విద్యా పరం లోచనం,
విద్యా రాజసు పూజ్యతే నహి ధనం విద్యావిహీనః పశుః

"మానవులకు విద్యయే సౌందర్యం; విద్యయే గుప్తధనం; కీర్తి, సుఖభోగాలనిచ్చేది విద్యయే; విద్యయే గురువులకు గురువు; పరదేశాలకు వెళ్ళినప్పుడు విద్యయే బంధువు; విద్యయే మార్గదర్శిని; విద్య వల్లనే పూజార్హత కలుగుతుంది కానీ ధనం వల్ల కాదు; ఇన్ని విశిష్టతలున్న విద్య లేకపోతే మనిషి పశుతుల్యుడే" అని విద్యా వైశిష్ట్యాన్ని శ్లాఘించాడు.

మరి, అలాంటి విద్యను బోధించి మనిషిని ఉన్నతునిగా తీర్చిదిద్దేవాడు ఆచార్యుడు. అందుకే వేదాలు జన్మనిచ్చిన తల్లితండ్రుల తరువాత ఆచార్యుణ్ణి ప్రత్యక్ష దైవంగా భావించి 'ఆచార్యదేవో భవ' అని స్తుతించాయి. మన పోషణ, పరిరక్షణా బాధ్యతలను వహించే తల్లితండ్రుల పట్ల మనం ఎంత ఆరాధనా భావాన్ని కనబరుస్తామో, మనకు విద్యనేర్పే అధ్యాపకుని పట్ల కూడా అంతే ఆరాధనా భావాన్ని కనబరచాలి. "విద్య నేర్పిన గురువులను విమర్శించడం, నిందించడం, హేళన చేయడం లాంటి అనుచిత ప్రవర్తనతో అవమానపరిచే విద్యార్థులు ఎంతటి మేధాశక్తిసంపన్నులైనప్పటికీ జీవితంలో శాంతిసౌఖ్యాలను పొందలేరు" అని మనుస్మృతి హెచ్చరిస్తుంది.

గురువుని గౌరవించక, అహంకారపూరితులై ప్రవర్తించిన ఎంతోమంది మహారాజులు, మహాపండితులు, దేవతలు సైతం ఎలా కష్టాలపాలయ్యారో తెలిపే గాథలు భారత, భాగవతాది గ్రంథాలలో వివరింపబడ్డాయి. అందువల్ల విద్య వినయాన్ని పెంచాలేగానీ అహంకారాన్ని కాదు. అధ్యాపకుల పట్ల ఆరాధనాభావాన్ని కలగజేయాలిగానీ అగౌరవభావాన్ని కాదు. శ్రీరాముడు, శ్రీకృష్ణుడు, శ్రీరామకృష్ణులు తమ గురువుల పట్ల ఎలా వినయ విధేయతలు, భక్తిశ్రద్ధలను ప్రదర్శించారో తెలుసుకొందాం.

వినయమే భూషణం: శ్రీరాముడు వినయవిధేయతలకు ప్రతిరూపం. గురువు వస్తున్నప్పుడు శిష్యుడు గౌరవ సూచకంగా ఏం చేయాలో మనుస్మృతి చెబుతూ 'శయ్యాసనస్థ శ్చైవైనం



ప్రత్యుత్థాయాభివాదయేత్ – గురువు వచ్చినప్పుడు శిష్యుడు లేచి నిలబడి వందనం చేయాలి' అని సూచిస్తుంది.

రఘువంశ ఆచార్యుడైన వసిష్ఠ మహర్షి నేరుగా శ్రీరాముని భవనంలో ప్రవేశించాడు. ఆచార్యుల ఆగమనాన్ని గమనించిన శ్రీరాముడు వెంటనే లేచి వసిష్ఠునికి ప్రణమిల్లాడు. గురువుని రత్న సింహాసనంపై కూర్చోబెట్టి ఆయన పాదాలను కడిగి, ఆ తీర్థాన్ని తన శిరస్సుపై జల్లుకున్నాడు. అప్పుడు శ్రీరాముని భక్తి శ్రద్ధలను మెచ్చిన వసిష్ఠుడు 'రామా! శిష్యుడు, గురువుపట్ల గౌరవభావంతో ఎలా వ్యవహరించాలో లోకానికి తెలియజేశావు' అని రామునితో అంటాడు.

మరి నేడు ఎంత మంది విద్యార్థులు తమ ఉపాధ్యాయులను, ఆచార్యులను కనీసం గౌరవించకపోయినా, అవమానపరచ కుండా ఉంటున్నారో ఎవరికివారే ఆత్మావలోకనం చేసుకోవాలి.

అభీష్టాలను తీర్చే అద్భుతగుణం : 'నిజమైన విద్యార్థి గురువు అభీష్టాలను నెరవేర్చి సంతృప్తిపరచాలి. గురురుణాన్ని తీర్చుకొనే మార్గమిదే!' అని హితోపదేశం సూచిస్తుంది. బలరాముడు, కృష్ణుడు సాందీపని మహర్షి వద్ద విద్యాభ్యాసం చేసి సమస్త వేదాలు, ధర్మశాస్త్రాలు, తర్కశాస్త్రాలలో పరిపూర్ణ జ్ఞానాన్ని సంపాదించారు. గురువు నుండి సమస్త విద్యలను

అభ్యసించిన బలరామకృష్ణులు సాందీపని మహర్షి అభీష్టాన్ని తెలుపమని కోరారు. అప్పుడు గురువు పాంచజన్యుడనే రాక్షసుడు అపహరించిన తన కుమారుణ్ణి తెచ్చిమ్మని కోరాడు. ఆచార్యుని అభీష్టం మేరకు వారు గురుపుత్రుణ్ణి తీసుకువచ్చి అప్పగించారు. బలరామకృష్ణులు మధురానగరానికి బయలుదేరుతూ 'గురుదేవా! మీకు ఎప్పుడు ఏ అవసరం వచ్చినా మాకు తెలపండి. మీ అభీష్టాన్ని నెరవేరుస్తాం' అని గురువుకు ప్రణమిల్లారు. విద్యార్థులు, ఆచార్యుల అభీష్టాలను నెరవేర్చి వారిని సంతృప్తిపరచాలని బలరామకృష్ణులు విద్యార్థుల బాధ్యతను గుర్తుచేశారు.

సందర్శన సౌభాగ్యం : జీవితానికి మార్గనిర్దేశనం చేసిన గురువులను మరచిపోకుండా వారు ఎప్పుడు, ఎక్కడ తారస పడినా పరామర్శించడం, వారిని సందర్శించి గౌరవాభిమానాలను వ్యక్తపరచడం లాంటి సద్గుణాలను విద్యార్థులు అలవరచుకోవాలి. భగవాన్ శ్రీరామకృష్ణులు, భైరవీబ్రాహ్మణి అనే గురువు వద్ద తాంత్రిక విద్యను అభ్యసించారు. కొన్నేళ్ళ తరువాత ఆమె కాశీలో నివసిస్తున్నట్లు ఆయనకు తెలిసింది. శ్రీరామకృష్ణులు కాశీ వెళ్ళినప్పుడు తన గురువైన భైరవిని సందర్శించి ఆమె పట్ల తనకున్న గౌరవాన్ని వ్యక్తం చేశారు. నిజానికి శ్రీరామకృష్ణులు అప్పటికే అత్యున్నత ఆధ్యాత్మిక స్థితికి చేరుకున్నారు. కానీ శిష్యునిగా ఎంత ఉన్నతస్థితిని సాధించినా గురువుని నిర్లక్ష్యం చేయకూడదని లోకానికి చూపారు.



శ్రీరాముడు, శ్రీకృష్ణుడు, శ్రీరామకృష్ణులు – విద్యార్థి, ఆచార్యునిపట్ల ఎలా వినయవిధేయతలతో ప్రవర్తించాలో, ఎలా భక్తిశ్రద్ధలతో మెలగాలో, ఎలా గౌరవ మర్యాదలతో ప్రవర్తించాలో మార్గనిర్దేశనం చేశారు. అయితే, త్రేతాయుగపు రాముడు, ద్వాపరయుగపు కృష్ణుడు, 19వ శతాబ్దపు శ్రీరామకృష్ణులు చూపించిన ఆదర్శాన్ని ఆచరించడం ఈ కాలంలో ఎలా సాధ్యమవుతుంది? అనే సందేహం వస్తుంది. కాలం మారింది, మనుషుల మనస్తత్త్వాలు మారాయి, సమాజ వ్యవస్థలో మార్పులు వచ్చాయి... ఇలాంటి పరిస్థితుల్లో నాటి ఆదర్శాలను నేడు కూడా ఆచరించమని చెప్పేవాళ్ళను తెలివితక్కువ వాళ్ళుగా పరిగణిస్తుంది, ఛాదస్తపు మనుషులుగా ముద్రవేస్తుంది నేటి సమాజం.

యుగాలు మారినా, తరాలు తరలినా సత్యధర్మాలనే ఆదర్శాల్లో ఎన్నటికీ మార్పు ఉండదు. 'సత్యం వద, ధర్మం చర, మాతృదేవో భవ, పితృదేవో భవ, ఆచార్యదేవో భవ, అతిథిదేవో భవ... వేదకాలంలో మన ఋషులు ప్రబోధించిన ఈ ఆదర్శాలు సర్వకాల సర్వావస్థల్లోనూ నిత్యనూతనమైనవి, శాశ్వతమైనవి. సత్యయుగమైనా, కలియుగమైనా ఈ ధర్మాలు అనుసరణీయాలే! కానీ మనలో నైతికబలం సన్నగిల్లడం వలన, మన నాగరకతను మరచిపోయి, పాశ్చాత్య సంస్కృతి మోజులో పడడం వలన మన పూర్వీకులు ఆచరించిచూపిన ఆదర్శాలు మనకు ఇప్పుడు అసందర్భంగానూ, అనుచితంగానూ, అసాధ్యంగానూ తోస్తున్నాయి.

మన భారతీయ సంస్కృతీ సంప్రదాయాలను ఆచరించడం అసాధ్యంకాదని నిరూపిస్తూ, ఆదర్శవంతమైన జీవితాన్ని గడుపుతున్న మహాత్ములు నేటి సమాజంలో కూడా ఎందరో ఉన్నారు. ఉదాహరణకు – ఓ విశ్వవిద్యాలయ స్నాతకోత్సవంలో పాల్గొనడానికి వెళ్ళిన ఓ వ్యక్తికి అదే నగరంలో తనకు చిన్నప్పుడు పాఠాలు చెప్పిన ఉపాధ్యాయుడు ఉన్నాడని తెలిసింది. విశ్వవిద్యాలయ కార్యక్రమం కన్నా తనను తీర్చిదిద్దిన ఉపాధ్యాయుని ఆశీర్వాదబలమే ముఖ్యమని భావించాడు. అతడు ఆ ఉపాధ్యాయుణ్ణి సందర్శించి భక్తిప్రపత్తులతో పాదాభివందనం చేశాడు. 'ఆచార్యదేవో భవ' అన్న మన సనాతన ధర్మాన్ని అక్షరాలా పాటించిన ఆ వినయశీలి మరెవరోకాదు మన భారతరత్నం – డాక్టర్ అబ్దుల్‌కలాం.

మనమంతా మన సంస్కృతిని ఆచరిస్తే ప్రపంచమంతా ఏకమైనా మనల్ని ప్రతిఘటించలేదు. ఈ రహస్యాన్ని ఎరిగిన లార్డ్ మెకాలే "భారతదేశాన్ని జయించా లంటే భారతజాతి ఆధ్యాత్మికతను, సంస్కృతీ సంప్రదాయాలను నాశనం చేయాలి. అది ఆంగ్ల విద్యావిధానాన్ని ప్రవేశపెట్టడం వల్ల మాత్రమే సాధ్యమవుతుంది" అని ఒక వ్యూహాన్ని పన్నాడు. మెకాలే పన్నిన ఆ పద్మవ్యూహంలో చిక్కుకుపోయి మన భారతజాతి సతమతమవుతోంది. ఆ పద్మవ్యూహాన్ని ఛేదించి మన సనాతన ధర్మాన్నీ, సంస్కృతీ సంప్రదాయాల్నీ పునఃప్రతిష్ఠించాలి. అలాకాకపోతే భారతజాతి నశిస్తుందని హెచ్చరిస్తూ... "పాశ్చాత్య సంస్కృతి ఉప్పెనలా లేచి భారతదేశాన్ని ముంచెత్తుతుంది. మన సంస్కృతిని విడచి, పాశ్చాత్య నాగరకత ప్రభావానికి లోనైతే రాబోయే మూడు తరాలలో భారతజాతి కనుమరుగవుతుంది. అందువల్ల భారతదేశం వెన్నెముక అయిన సనాతన ధర్మాన్ని ఎన్నటికీ విస్మరించ కూడదు" అని స్వామి వివేకానంద భవిష్యవాణి పలికారు.

కాబట్టి మన సంస్కృతీ సంప్రదాయాలను పరిరక్షించు కోవడానికి కృషిచేయాలి. అందుకు నైతిక విలువలతో కూడిన విద్యకు ప్రాధాన్యమివ్వాలి. అప్పుడే 'భారతమాత ఇదివరకు ఎన్నడూలేని మహావైభవంతో, ఉత్తేజంతో శాశ్వత సింహాసనంపై ఆసీనురాలై విరాజిల్లుతుంది' అన్న స్వామీజీ కలలు సాకారమవుతాయి. భారతదేశం ప్రపంచదేశాల్లో ఆచార్య స్థానాన్ని సుస్థిరపరచుకోగలదు. ❖

జన్మనిచ్చిన తల్లితండ్రుల్నీ, వేదాభ్యాసం చేయించిన ఆచార్యున్నీ, వేదాలకు భాష్యం చెప్పే విద్వాంసుల్నీ, విద్యనేర్పిన గురువునీ, అతిథుల్నీ, యోగులనూ, గోవుల్నీ నొప్పించరాదు. -మనుస్మృతి

- స్వామి సుప్రియానంద

PIZZA
పిజ్జా

వార్తాపత్రికలలో అన్ని వార్తలు రావు. ఒక వేళ వచ్చినా, మనం చదవదలచుకోని విషయాలను చదివేలా, చదువుదామనుకున్న విషయాలను చదవనివ్వకుండా చేయగల సామర్థ్యం పత్రికల వాళ్ళ చేతుల్లో ఉంది. ఈ మధ్య ఒక కంపెనీ వారి 'ఫాస్ట్‌ఫుడ్' తిని కడుపు ఉబ్బరించిన పెద్ద మనిషి ఆసుపత్రి పాలయ్యాడు. ఆయన అనేక వ్యయప్రయాసలతో బతికి బయటపడి తన కడుపు ఉబ్బరానికి కంపెనీవారే కారణమంటూ కోర్టుకెక్కారు. "కంపెనీ వారి వాణిజ్య ప్రకటనలను చూసే తన క్లయింట్ బుట్టలో పడి అనారోగ్యానికీ, మానసికక్షోభకూ లోనయ్యారు. కావున కంపెనీ వారు పెద్ద మొత్తంలో నష్టపరిహారం చెల్లించాలి" అంటూ పట్టుపట్టారు లాయరు గారు. అందుకు కంపెనీ వారు, తమ వాణిజ్య ప్రకటనలలో ఎక్కడా తాము తయారు చేసే ఆహారపదార్థాలు ఆరోగ్యప్రదమైనవిగా చెప్పలేదనీ, అవి రుచికరమైనవని మాత్రమే ప్రకటించామనీ వాదించి కేసు గెలుచుకున్నారు.



పిజ్జా అనేది ఒక లావుపాటి రొట్టె. ఇది ఒకప్పుడు ఇటలీ దేశంలో అతి పేదవారి భోజనం. అప్పట్లో ఆ దేశంలో అతి చులకనగా చూడబడ్డ ఆహారం. మరి ఇప్పుడో! పేరుకు మాత్రమే అవి గుడిసెలు. కానీ నేడు ఆ గుడిసెల్లో పిజ్జాలు తినేవారంతా ధనికులే!

భారతదేశంలో హిమాలయాల దగ్గర ఉన్న ఒక కొండ ప్రాంతం. అక్కడి వారంతా ఆరోగ్యంగా, ఆనందంగా జీవిస్తున్నారు. రోజంతా కష్టపడి పని చేసి సాయంకాలం కుటుంబ సభ్యులంతా కలిసి కబుర్లు చెప్పుకుంటూ వేడివేడి రొట్టెలు తినేవారు. అక్కడికి ఎంతోమంది విహారయాత్రకు వచ్చేవారు. వారు కూడా ఈ రొట్టెలు తిని ఆనందించేవారు. ఇదంతా ఒక కంట కనిపెట్టిన ఓ కంపెనీ వారు అక్కడ 'పిజ్జా గుడిసె (pizza hut)' వేశారు. ఊరు ఊరంతా ఒక్కటై ఆ పిజ్జా గుడిసెను దివాలా తీయించారు. ఇది చూసిన కొంతమంది చదువుకున్న పెద్దమనుషులు 'అక్కడి వారంతా ఒట్టి మూర్ఖులు, అనాగరికులు' అని విమర్శించి మన దేశం ఇక బాగుపడదని వాపోయారు.

ఇప్పుడు అసలు విషయం... ఏది నాగరకత? పొరుగింటి పుల్లకూర మోజులోపడి మన దిబ్బరొట్టెలను 'ఛీ' అని పారేసి, మన కడుపును పెనం(పణం)గా పెట్టి పిజ్జాలు వేయించుకొని ఊపిరాడక పెనుగులాడి భయంకర పతనానికి గురి అవ్వడమా?

అందుకే స్వామి వివేకానంద "We must grow according to our nature. Vain is it to attempt the lines of action that foreign societies have engrafted upon us - మన స్వభావానుసారంగా ఎదగడానికి ప్రయత్నించాలి. అంతేగాని పాశ్చాత్యుల ఆచారవ్యవహారాలను అనుకరించడం వృథా ప్రయాసే అవుతుంది" అని అన్నారు.

అందువల్ల మన ఒంటికి సరిపడని ఆహారాన్ని తింటూ, మన ఇంటికి పనికిరాని ఆచారాలను ఆచరిస్తూ ఆధునికత పేరుతో అనారోగ్యాల బారిన పడకుండా జాగ్రత్త పడదాం. మనదైన నాగరకతను ఆచరిస్తూ ఉన్నతంగా ఎదుగుదాం. ❖



రామకృష్ణ భక్తి సూత్రాలు

– స్వామి యతీశానంద

నారద భక్తి సూత్రాలు, శాండిల్య భక్తి సూత్రాలు భక్తియోగానికి సంబంధించిన ప్రామాణిక గ్రంథాలు. అయితే ఆధునిక తరంలో భగవదన్వేషకులకు అనువైన రీతిలో భక్తితత్త్వాన్ని బోధించారు శ్రీరామకృష్ణులు. ఈ నేపథ్యంలో 'శ్రీరామకృష్ణ కథామృతం' నుండి కొన్ని ఉపదేశాలను 'రామకృష్ణ భక్తి సూత్రాలు'గా సులభరీతిలో వివరించే ప్రయత్నం చేస్తున్నాం.

బౌద్ధగ్రంథాలు పాళీ భాషలో, బైబిల్ హీబ్రూలో, ఖురాన్ అరబ్బీ భాషలో రచించబడ్డాయి. అలాగే శ్రీరామకృష్ణుల ఉపదేశాలు వారి మాతృభాష బెంగాలీలో ఆవిష్కృతమయ్యాయి. అవతార పురుషుని ముఖతః వెలువడిన ఆ అమృతోపదేశాలను యథాతథంగా ఉట్టంకిస్తూ వ్యాఖ్యానిస్తున్నాం. మహాశక్తిమంతమైన ఆ బోధనలను మననం చేసుకుంటూ కృతార్థులమవుదాం.

ఈశ్వరేర్ శక్తితే సబ శక్తిమాన్.

ఈశ్వరశక్తితో సర్వం శక్తిమంతమవుతుంది.

శ్రీరామకృష్ణ ఉవాచ : "ఈశ్వరుడే సమస్తం చేస్తున్నాడు. కానీ అంతా మనమే చేస్తున్నామని అనుకుంటాం. ఏ విధంగా అంటే? వేదాంతంలో ఒక ఉపమానం చెపుతారు. ఒక కుండలో బియ్యం, కూరగాయలు కలిపి వండుతున్నారు. అవి ఉడుకుతూ పైకి, కిందకి గెంతుతున్నాయి. మేమే గెంతుతున్నాం అని తలుస్తాయి. కానీ పొయ్యిలో కట్టెలు తీసివేస్తే గెంతవు. చిన్నపిల్లలు అవి గెంతుతున్నాయని తలుస్తారు. కానీ అవి స్వయంగా గెంతడం లేదనీ, పొయ్యిలో మంట వల్ల ఉడుకుతున్నాయనీ పెద్దవారికి తెలుసు. 'నేనే కర్తను' అనే భావం అజ్ఞానజనితం. తోలుబొమ్మలను ఆడించే వాడు ఉంటాడు. వాడి చేతినుండి జారిపోతే అవి ఆడలేవు".

వ్యాఖ్య : ఈ జగత్తులోని సృష్టిపదార్థాలన్నిటి మూలం సూర్యుడు. సూర్యుడు వెలుగు, వేడిమిలను ఇస్తాడు; వాటి మూలంగానే సర్వం సృష్టింపబడతాయి. దేని ద్వారా మన ఆలోచనలు జనిస్తాయో దాని ముఖ్యకారకుడు సూర్యుడు. సూర్యకాంతికి మూలం బ్రహ్మం. 'తమేవ భాంతం అనుభాతి సర్వం, తస్య భాసా సర్వమిదం విభాతి – అది ప్రకాశించడం వల్లనే సమస్తం భాసిల్లుతున్నది. ఆత్మజ్యోతి వల్లనే ఈ సర్వజగత్తు ప్రకాశిస్తున్నది'. భగవంతుడు (బ్రహ్మం) యొక్క చైతన్యం జగత్తంతా వ్యాపించి ఉంది. కనుక ఆ చైతన్యమే శక్తి. శ్రీరామకృష్ణుల ఉపమానంలో అగ్నియే ఆ శక్తి. మాయ భగవచ్ఛక్తియే. బ్రహ్మం, శక్తి అభేదమని శ్రీరామకృష్ణులు అనేక దృష్టాంతాల మూలంగా మరల మరల వక్కాణించారు. అనగా శక్తి సమస్తం భగవంతునిదే, మన శక్తి సామర్థ్యం అన్నది ఏదీ లేదు. భగవంతుని శక్తినే వివిధ దేవుళ్ళు, పంచభూతాల ద్వారా పని చేస్తున్న దన్నదే కేనోపనిషత్తులోని మూల తత్త్వం.

జే ఈశ్వరకే దర్శనకొరె, సే ఇ మాయా పార్ హోయె జేతే పారే.

భగవంతుడిని దర్శించినవాడే, మాయను దాటగలడు.

వ్యాఖ్య: మాయ మనిషిని మోహముగ్ధుడ్ని చేస్తుంది. కనుక భగవత్సాక్షాత్కారం సిద్ధించదు. మాయ పేరే అజ్ఞానం. మాయ భగవదాధీనం. భగవత్సాక్షాత్కారమైన వ్యక్తియే మాయను జయించగలడు. మాయను దాటగలడు. మాయ అంధకారం, అజ్ఞానం. అది మనను ఆవరిస్తుంది. భగవంతుడు జ్యోతిర్మయుడు కనుక జ్యోతి దర్శనమైతే అంధకారం దానంతట అదేతొలగిపోతుంది.

'నన్ను సంపూర్ణంగా శరణుపొందినవారు మాత్రమే మాయను దాటగలర'ని శ్రీకృష్ణుడు భగవద్గీతలో చెప్పాడు. సంపూర్ణంగా శరణుపొందినంతనే భగవంతుడు దర్శనం ఇస్తాడు. అప్పుడు అజ్ఞానావరణం తొలగిపోతుంది. 'జీవుడు తన నిజమైన సత్తాను తెలుసుకొన్నప్పుడు (పురుష దర్శనం అయినప్పుడు) మాయ సిగ్గుపడిపారిపోతుంద'ని సాంఖ్యశాస్త్రం చెబుతోంది. భగవత్సాక్షాత్కారం కానిదే మాయ నశించడం అసంభవమని శ్రీరామకృష్ణుల ఈ సూత్రం ద్వారా స్పష్టం అవుతున్నది. మాయ అనగా ఏమిటి? ఏది మనలో సుఖదుఃఖాలు, రాగత్యాగాలు, మంచిచెడు, నేను నాది అనే భావాలు కలిగిస్తుందో అదే మాయ. ❖

అనువాదం: డాక్టర్ కమల జయరావు

పరమాత్మ ఎదుట సూర్యుడు ప్రకాశించడు, చంద్రుడు, నక్షత్రాలు ప్రకాశింపవు. అగ్నిప్రకాశించదు. స్వయం ప్రకాశమానమైన పరమాత్మ యొక్క కాంతి వల్లనే సర్వమూ ప్రకాశిస్తున్నది. -కఠోపనిషత్తు

పలికెడిది భాగవతం

శ్రీ పాదాంబుజ భక్తి యుక్తుడగుచు జీవించునే?

– స్వామి జ్ఞానదానంద

అభిమన్యుడి అర్ధాంగి ఉత్తర గర్భంలో ఎదుగుతున్న పాండవ వంశోద్ధారకుణ్ణి, అశ్వత్థామ బ్రహ్మాస్త్ర ప్రమాదం నుంచి అనితర తేజంతో ఆ శ్రీకృష్ణభగవానుడు రక్షించాడు. మేఘం మీద మెరుపుతీగలాగా, నల్లని దేహం మీద పచ్చని చేలం ధరించినవాడై, శ్రీమహావిష్ణువు రూపంలో గదాధరుడై కన్నుల పండువగా గర్భంలోని పసికందు ముందు ఆవిర్భవించాడు. భక్తపరాధీనుడైన భగవానుడు మంచును పటాపంచలు చేసినట్లు, మండుతున్న ఉల్కలాంటి గదాదండాన్ని మండలాకారంగా శిశువు నలువైపులా తిప్పుతూ, సెగలు పొగలు గ్రక్కే బ్రహ్మాస్త్ర ప్రతాపాన్ని శాంతింప చేశాడు. పసికందు పరితాపాన్ని ఉపశమింపజేసి అమితా నందాన్ని కలిగించాడు. బాణాగ్ని జ్వాలల్ని పటాపంచలు చేసి నన్ను కటాక్షించి రక్షించిన ఈ దాక్షిణ్యమూర్తి ఎవరా? అని ఆ గర్భస్థ శిశువు పరీక్షించి నిరీక్షించేలోపే ఆ భగవానుడు అంతర్ధానమయ్యాడు. అనంతరం ఓ శుభముహూర్తంలో ఉత్తరకు పాండవుల ఏకైక ఆశాదీపం బాలుడి రూపంలో ఉద్భవించాడు. తాత ధర్మరాజు పురోహితులను పిలిపించి పుత్రోదయ మహోత్సవాన్ని వైభవోపేతంగా జరిపించాడు; అనాథలకు, బ్రాహ్మణులకు దానధర్మాలు చేశాడు. సంతుష్టులైన బ్రాహ్మణ



శ్రేష్ఠులు యుధిష్ఠిరుణ్ణి చూసి 'మహారాజా! దైవయోగం వల్ల భరతవంశం అంతరించి పోకుండా శ్రీమహావిష్ణువు పరమానుగ్రహంతో ఈ పసిబిడ్డను బతికించాడు. ఈ బాలుడు విష్ణువు చేత రక్షణ పొందడం చేత, విష్ణురాతుడనే పేరుతో విఖ్యాతుడై, జగన్మాన్యుడవుతాడు' అన్నారు. అయితే తాను గర్భంలో ఉండగా కటాక్షించి రక్షించిన ఆ దాక్షిణ్య మూర్తి ఎవరా? అని ఆ పసిబిడ్డ అందరినీ పరీక్షించి చూస్తూ ఉండటం వలన అతనిని పరీక్షిత్తు అని కూడా పిలుస్తారు. పురోహితుల ఆశీస్సులకు వినమ్రంగా కృతజ్ఞతలు చెబుతూ ఆ పాండవాగ్రజుడు...

ఓ పుణ్యాత్ములారా! నా పలుకు మీ రూహింపుడా మ్రొక్కెదన్
మా పెద్దల్ శ్రుతకీర్తులై సదయులై మన్నారు రాజర్షు లై
యీ పిన్నాతడు వారి బోలెడి కదా యెల్లప్పుడున్ మాధవ
శ్రీపాదాంబుజ భక్తి యుక్తు డగుచున్ జీవించునే! చూడరే.

"ఓ మహాత్ములారా! మీకు చేతులెత్తి నమస్కరిస్తున్నాను. నా పలుకులు ఆలకించి నా సందేహం తీర్చండి. మా పెద్దలంతా దిగంత విశ్రాంత కీర్తులై, కారుణ్యమూర్తులై, రాజర్షులై విరాజిల్లారు. ఈ చిన్నారి బాలుడు సైతం తన తాతముత్తాతల అడుగుజాడల్లో నడుస్తూ వారిలాగానే ఎల్లప్పుడూ శ్రీవల్లభుని పాదపద్మాలను భక్తితో సేవిస్తూ జీవిస్తాడు కదా! దయచేసి కొంచెం సెలవీయమ"ని వేడుకున్నాడు.

మనవడు భక్తిపరుడు, ధార్మికుడు, వంశగౌరవాన్ని నిలబెట్టేవాడు కావాలని ఆకాంక్షించాడు. ఎలాంటి బిడ్డల్ని కోరుకోవాలో, కన్నపిల్లల జాతకం ఎలా ఉండాలని ఆశించాలో ధర్మనందనుడు చెప్పకనే మనకు చెబుతున్నాడు. సంతానం భాగ్యవంతులు కావాలని కాదు, భక్తపుంగవులు, పుణ్యవంతులు కావాలని కోరుకోవాలి. అందుకే స్వామి వివేకానంద కూడా తన తల్లితండ్రులు తన కోసం చేసిన పూజలను, ప్రార్థనలను స్మరించుకుంటూ "నా జననం కోసం నా తల్లితండ్రులు ఏళ్ళ పర్యంతం నోములు నోచి, ప్రార్థనలు చేశారు. ప్రార్థనతో జన్మించినవారే ధర్మాత్ములు. ప్రార్థనా రహితంగా జన్మించిన ప్రతి శిశువుదీ ధర్మవిరుద్ధమైన జన్మే!" అంటారు.

కారుణ్యసాంద్రుడు...కారణజన్ముడు: పురోహితులు ఆ అజాతశత్రువుతో 'ధర్మరాజా! నీ మనుమడు కారుణ్యసాంద్రుడైన రామచంద్రునిలా సత్యసంధుడూ, సౌజన్యసింధుడూ అవుతాడని అభయమిచ్చారు. దయాశాలి శిబిచక్రవర్తిలా ఆర్తత్రాణ పరాయణతలో అగ్రగణ్యుడవుతాడన్నారు. సమదృష్టితో, ధర్మాతిశయంతో, భక్తి ప్రపత్తులతో, దాతృత్వగరిమతో, వినయవిధేయతలతో, చివరకు తన వంటి తనయులకు తండ్రియై వంశాన్ని ఉద్ధరిస్తాడని బ్రాహ్మణులు ఉద్ఘాటించారు. శుద్ధోధనుడు తమ కలల పంటగా సిద్ధార్థుడు అవతరించినప్పుడు కూడా అతని జాతకం గురించి ఆసక్తిగా ఆరా తీశాడు. అప్పుడు అసితుడు అనే ఋషి బాలుడైన గౌతముడిని చూసి ఆ బాలుని భవిష్యత్తు మహా ఉజ్జ్వలమైందని చెప్పాడు. అతడు ఇంటిలోనే ఉంటే మహా చక్రవర్తి అవుతాడని, లేదా ఇల్లు వదలి సన్న్యసిస్తే మహాప్రవక్త అవుతాడని జాతకం చెప్పాడు; అతని అపూర్వ సందేశాన్ని విని తరించే మహద్భాగ్యం వార్ధక్యంలో ఉన్న తనకు లేదని అసితుడు ఆవేదన చెందుతాడు. ఆ పలుకుల్ని నిజం చేస్తూ సిద్ధార్థుడు బుద్ధభగవానుడై వెలగడం

జగద్విదితమే! అలాగే భగవాన్ శ్రీరామకృష్ణులు జన్మించినప్పుడు కూడా పురోహితులు, జ్యోతిష్యులు వారి తండ్రి క్షుదీరామ్ ఛటోపాధ్యాయకు శుభసూచనలు చేస్తూ 'ఈ బిడ్డడు శుభలగ్నంలో జన్మించాడు. ఇతడు సద్గుణ సంపన్నుడు, మహాసమ్మాన్యుడు, సదా సత్కార్యాలు ఆచరించేవాడు అవుతాడు. ఈతడు అనేక మంది శిష్యులతో పరివేష్టితుడై దేవాలయంలో నివసిస్తాడు. సాక్షాత్తూ నారాయణాంశ సంభూతుడైన మహాత్మునిగా విరాజిల్లుతాడు' అని జోస్యం చెప్పారు.

సుపుత్రుడు సుగంధపు మాను... : మనవడు పుట్టాడనగానే ధర్మరాజు ముందు తన వంశ ప్రతిష్ఠను తలచుకున్నాడు. భీష్ముడంతటి మహాత్మునకు వారసుడిగా పరీక్షిత్తు ఆ పరంపరను కొనసాగించాలని తపన పడ్డాడు. పూర్వతరాల పుణ్యపథంలో పరీక్షిత్తు పయనించాలని, పరమాత్ముడికి పరమభక్తుడై భాసించాలని ఆశించాడు. ఆ పాండవాగ్రజుడు ఆకాంక్షించినట్లే, ఆ మనవడు చంద్రవంశాన్నే శోభాయమానం చేశాడు; శుకమహర్షి శ్రీమద్భాగవత ప్రబోధానికి కారణభూతుడయ్యాడు. అలా ఒక సుగుణవంతుడు పుట్టి ఆ వంశానికే వెలుగునిస్తాడు. అందుకే భగవాన్ శ్రీరామకృష్ణులు "ఒక వంశంలో మహాపురుషుడు జన్మిస్తే, ఆ వంశంలో వేయి దోషాలున్నప్పటికీ అతడు ఆ వంశాన్ని ఉద్ధరిస్తాడు" అంటారు. అందుకే కోట్లు సంపాదించేవాడు, కోటలు కట్టేవాడు కాదు, కన్నవారి పేరును నిలబెట్టేవాడు నిజమైన కుమారుడు. మన సనాతన ధర్మంలో ఎందరో ధన్యాత్ములు అలాంటి బిడ్డల కోసం వ్రతాలు, నోములు చేశారు. తరతరాలు స్మరించుకునే తనయులను కన్నారు. తమనే కాదు, తమ వంశాన్నీ ఉద్ధరించుకున్నారు. అందుకే యోగి వేమన...

కులములోన నొకడు గుణవంతుడుండిన
కులము వెలయు వాని గుణము చేత
వెలయు వనములోన మలయజంబున్నట్లు
విశ్వదాభిరామ వినురవేమ!

'అడవిలో ఒక్క మంచిగంధం చెట్టు ఉంటే ఆ వనమంతా పరిమళంతో విరాజిల్లినట్లు, వంశంలో ఒక్క సుగుణవంతుడైన కొడుకు పుడితే అతని వలన ఆ వంశమంతా శోభిస్తుంద'ని వివరిస్తారు. అలా సూర్యవంశంలో జన్మించి పెద్దవాడైన శ్రీరామచంద్రుని వలన ఆ వంశం కీర్తిప్రతిష్ఠలు యుగాంతం వరకు ఉండేట్లు ప్రసిద్ధి చెందింది. అదే విధంగా కురువంశంలో జన్మించి పెద్దవాడైన దుర్యోధనుని వలన ఆ వంశం నిర్మూలనమవడమే కాకుండా వారి కులానికి అప్రతిష్ఠ తెచ్చింది.

కుపుత్రుడు బీజదోషం... : దురదృష్టవశాత్తూ నేడు చాలామంది తల్లితండ్రులు కొడుకు అడ్డదారులు తొక్కినా ఫర్వాలేదు, అందలం ఎక్కేవాడైతే చాలనే దురాశకు పోతున్నారు. కుపుత్రుడు బీజదోషమన్న విషయాన్నే మరచిపోతున్నారు. ఆనాడు ధృతరాష్ట్రుడు కూడా దుర్యోధనుడు పుట్టగానే, ప్రకృతిలో చెలరేగిన దుశ్శకునాలను, ప్రాకృతిక వికారాలను చూసి, భయపడి బ్రాహ్మణులను, భీష్మ పితామహుడిని, విదురుడిని, ఇతర పెద్దలను పిలిచాడు. తన కొడుకు జాతకాన్ని చెప్పమంటూ...

యుధిష్ఠిరో రాజపుత్రో జ్యేష్ఠో నః కులవర్ధనః
ప్రాప్తః స్వగుణతో రాజ్యం న తస్మిన్ వాచ్యమస్తి నః
అయం త్వనన్తరస్తస్మాదపి రాజా భవిష్యతి
ఏతద్విబ్రూత మే తథ్యం యదత్ర భవితా ధ్రువమ్....

'ధర్మరాజు జ్యేష్ఠుడు, గుణవంతుడు కావటం చేత రాజ్యాధికారం అతనికే దక్కుతుంది. ఆ విషయంలో సందేహం లేదు. కానీ నా కుమారుడైన దుర్యోధనుడు రాజయ్యే సూచనలు ఏమైనా ఉన్నాయా?' అని ప్రశ్నించాడు. చక్కని కొడుకు కన్నా, చక్రవర్తి అయ్యే కొడుకు కోసమే ఆ ధృతరాష్ట్రుడు ఆదుర్దా పడ్డాడు. అప్పుడు పెద్దలందరూ 'నీ జ్యేష్ఠ పుత్రుడు పుట్టగానే అపశకునాలు కనబడుతున్నాయి. ఇతడు కుల నాశకుడవుతాడు' అని హెచ్చరించారు. అయినా ధృతరాష్ట్రుడు పుత్రప్రేమతో వాళ్ళ మాటను పెడచెవిన పెట్టాడు. చరిత్రహీనుడికి తండ్రయ్యాడు. ఇలా పుత్రవ్యామోహంతో నీచవర్తనులైన కుమారులను తయారు చేస్తూ తాము క్షోభ పడటమే కాకుండా, సమాజాన్నీ క్షోభపెడుతున్న తల్లితండ్రులు భాగ్యహీనులు. ల

పరిపూర్ణుడిగా పరీక్షిత్తు... : తండ్రి అభిమన్యుడు అసువులు బాసినా ఆత్మీయుల అండతో, శ్రీకృష్ణ పరమాత్ముడి ఆశీస్సులతో పరీక్షిత్తు సద్గుణ సంపన్నుడిగా ఎదుగుతూ ఉన్నాడు. అందుకే

> **కొడుకు నీతివంతుడు, ధర్మవర్తనుడై ఇంటిపేరును నిలబెట్టి, ఇంటికే దీపంగా వెలిగించమని ఆ భగవంతుడిని ప్రార్థించాలి. నడవడిక ఎలా ఉన్నా సరే! నాలుగు రాళ్ళు వెనకేసేవాడైతే చాలు అనుకుంటే, అలాంటి కొడుకులు తల్లితండ్రుల సమాధికి రాళ్ళెందుకు వృథా అని మట్టికే వదిలేస్తారు; వంశ ప్రతిష్ఠనే మంట గలుపుతారు. పిల్లల గొప్పతనాన్ని చూసి, ఎవరికి పుట్టిన బిడ్డోనని పరులు తలచుకుంటే అదే కన్నకడుపునకు సార్థకత.**

తాతలు దినదినమూ అనురాగంతో పెంచి పెద్దచేస్తూండగా బాలకుడైన పరీక్షిత్తు షోడశ కళల చేత పరిపూర్ణుడైన చంద్రునిలా క్రమంగా వృద్ధి చెందసాగాడని అభివర్ణిస్తూ....

కళల చేత రాజు క్రమమున పరిపూర్ణు
డయిన భంగి, తాతలనుదినంబు
పోషణంబు సేయ పూర్ణుడయ్యెను ధర్మ
పటల పాలకుండు బాలకుండు! అంటారు బమ్మెర పోతనామాత్యులు. ఇలా బిడ్డలు ఎదుగుతూ ఉంటే కన్నవారికి కన్నుల పండువుగా ఉంటుంది.

బాలరాముడిని వర్ణిస్తూ వాల్మీకి మహర్షి కూడా...

తేషాం కేతు రివ జ్యేష్ఠో రామో రతికరః పితుః।
బభూవ భూయో భూతానాం స్వయంభూ రివ సమ్మతః॥

'రాజకుమారులలో పెద్దవాడైన శ్రీరాముడు ధ్వజపతాకంలా వంశప్రతిష్ఠను ఇనుమడింప జేయుచూ తండ్రికి మిక్కిలి సంతోషాన్ని కలిగిస్తున్నాడు. సమస్త ప్రాణులకు శ్రీమహావిష్ణువులా ఎంతో ప్రేమపాత్రుడయ్యాడ'ని పొంగిపోతాడు. ❖

దైవభక్తి లేకపోవడమే మానవుడి అపరిమిత బాధలన్నింటికీ కారణం. కాబట్టి మానవుడు అవసాన కాలంలో నారాయణ స్మరణకు తోడ్పడే సాధన చేయాలి. అదే భక్తిసాధన. - భగవాన్ శ్రీరామకృష్ణులు

ప్రాచీన, మధ్యయుగాలనాటి

మన సంస్కృతి

- స్వామి హర్షానంద

"ఒక వ్యక్తి తనను తాను అసహ్యించుకొంటున్నట్లయితే అదే పతనానికి హేతువు. పూర్వీకుల చరిత్రను అవమాన కరంగా భావిస్తే, ఆ జాతి అంతానికి చేరుకున్నట్లే!" అంటారు స్వామి వివేకానంద. గత వైభవాన్ని మర్చిపోయినంత కాలం మనమూ, మన దేశం స్తబ్ధతలో మునిగిపోతాం. అందుకే, మన ప్రాచీన సంస్కృతి గురించి తెలుసుకోవాలి. గడచిపోయిన సంగతులు తెలుసుకొంటూ, భవిష్యత్ మహత్కార్యాల సాధన వైపు నడవాలి. మన ప్రాచీన భారతీయ సంస్కృతిని గుర్తు చేసేందుకు చేస్తున్న ప్రయత్నమే ఈ వ్యాసాల పరంపర. సుప్రసిద్ధ రచయిత, బెంగుళూరు రామకృష్ణ మఠం అధ్యక్షులు స్వామి హర్షానంద మహరాజ్ మధ్యయుగాల కాలం దాకా విలసిల్లిన మన సంస్కృతిని 'శ్రీరామకృష్ణ ప్రభ' పాఠకులకు 2014 ఫిబ్రవరి సంచిక నుండి వివరిస్తున్నారు.

భౌతిక శాస్త్రాభివృద్ధిలో హైందవుల పాత్ర

భారతీయ ఋషులు మతాన్ని, లౌకికశాస్త్రాలను వేరుగా చూడలేదు. మతము ఆంతరంగిక పరిశోధన అయితే, శాస్త్రాలు బహిరంగ పరిశోధనగా వారు భావించారు. నిజానికి అవి రెండూ రెండు పార్శ్వములు. అందుకే వాటిని పరావిద్య (ఆధ్యాత్మిక జ్ఞానము), అపరావిద్య (లౌకిక జ్ఞానము) అని పిలిచేవారు.

ఋషి అంటే జ్ఞాని. 'ఋష్' అనే ధాతువుకు 'జ్ఞానం' అని అర్థము. వసిష్ఠ మహర్షి, వ్యాసమహర్షి ఆధ్యాత్మిక సీమలో ఋషులైతే ధన్వంతరి, వరాహమిహిరుడు, భాస్కరుడు వైద్య, ఖగోళ, గణిత శాస్త్రాలలో ఋషులు. ఈ ఋషులందరి జ్ఞానము ప్రాథమికంగా ధర్మానికి కట్టుబడి సార్వజనీనక సౌభాగ్యం కోసం ఉద్దేశించబడింది. ఇక్కడ ఒక విషయము గుర్తుంచు కోవాలి. ఋషులు తెలుసుకున్నట్లు బాహ్యవిశ్వానికి బ్రహ్మము ఆధారమైతే ఆంతరంగిక ప్రపంచానికి ఆత్మ ఆధారము. ఈ రెండూ చైతన్య స్వరూపాలే కనుక వాటి మధ్య భేదాలు లేవు.

వాస్తు శాస్త్రము - నగర నిర్మాణము : హరప్ప, మొహంజదారో త్రవ్వకాలు (క్రీ.పూ. 3000), పురాతన మందిరాలు (క్రీ.శ. 325), గుహాలయాలు - భారతీయ వాస్తు, నగర నిర్మాణ కౌశలాన్ని తెలియజేస్తాయి. ఈ విషయాల మీద మానసార, మాయామత, మానసోల్లాస, సనత్కుమారవాస్తు శాస్త్రాల్లాంటి ఉత్తమ గ్రంథాలు వెలువడ్డాయి. విష్ణుధర్మోత్తర వంటి పురాణాలు కూడా ఈ అంశాలను ప్రస్తావించాయి.

'వాస్తుశిల్ప' అనే పదము అన్నిరకాల భవన నిర్మాణాలను, కోటలు, సైన్యాగారాలను, నగర నిర్మాణాన్ని కూడా కూలంకషంగా సూచిస్తున్నది. హరప్పా త్రవ్వకాలలో గుర్తించబడిన కాల్చిన ఇటుకలు, కొయ్యపని, భవనాలు, బావులు, చెరువులు, మురుగుకాల్వలు, ఈత కొలనులు, గిడ్డంగులు, భారతీయ వాస్తుశాస్త్ర అభివృద్ధిని తెలియజేస్తున్నాయి.

మెగస్తనీస్ (క్రీ.పూ. 300) చంద్రగుప్తుని కోట, రాజభవనము, ఇతర నిర్మాణాల గురించి ఆసక్తికర విషయాలను తెలియజేశాడు. బౌద్ధ స్థూపాలు, అశోక స్తంభాలు, బుద్ధ విగ్రహాలు, మౌర్యుల కాలమునాటి గుహలలోని శిల్పసంపద (క్రీ.పూ. 3వ శతాబ్దము), ఆ కాలపు వాస్తు నైపుణ్యాన్ని తెలియజేస్తున్నాయి.

అంతఃపురాలు, సైన్యాగారాలే కాకుండా ఆ కాలపు మందిరాలు భారతీయ పరిపాలకులకు ధైర్యాన్ని, స్ఫూర్తిని కలుగజేసేవి. అందుచేత మందిర నిర్మాణములో నాణ్యత, శిల్ప సౌందర్యము - అభివృద్ధిని ఆ కాలములో మనము చూస్తాము. గుప్తుల కాలమునాటి మందిరాలు (క్రీ.శ. 4-7 శతాబ్దాలు), పూరీ, భువనేశ్వర్, కోణార్క్ మందిరాలు (క్రీ.శ. 8-13 శతాబ్దాలు) ఇందుకు తార్కాణం. విజయనగర చక్రవర్తులు (క్రీ.శ. 17వ శతాబ్దం), పల్లవులు (క్రీ.శ. 7-10వ శతాబ్దాలు), చోళులు (క్రీ.శ. 10-12 శతాబ్దాలు) నిర్మించిన దక్షిణ భారతదేశములోని విశాలమైన మందిరాలు అద్భుతమైన వాస్తునిర్మాణాలు.

క్రీ.శ. 6వ శతాబ్దంలో నిర్మింపబడిన బాదామి గుహాలయాలు, క్రీ.శ. 983లో నిర్మించబడిన ఏకశిల గోమతేశ్వర విగ్రహం (20 మీటర్లు-57 అడుగుల ఎత్తు), బేలూరు, హలిబేడు, సొమంతపూర్ (కర్ణాటక) లలో హోయసలులు చేసిన మందిర నిర్మాణాలు ఆ కాలము నాటి శిల్ప వైభవాన్ని తెలియజేస్తున్నాయి.


ఖగోళశాస్త్రం : వైదికమైన హోమాలు చేసేకాలంలో వాటిని నిర్వర్తించే సమయనిర్ధారణ ఆవశ్యకత ఏర్పడింది. తత్ఫలితంగా జ్యోతిష లేక జవుతిష అనే వేద విభాగము ఒక శాస్త్రముగా వృద్ధిచెందింది. భారతీయ ఖగోళ శాస్త్రానికి ఇది పునాదిగా క్రీ.శ. 1400 ప్రాంతాలలో మొదలైంది. ఋషులకు ఖగోళశాస్త్రానికి సంబంధించిన ఈ క్రింది విషయాలు క్షుణ్ణంగా తెలుసు.

- భూమి గుండ్రంగా ఉంది. అది తన చుట్టూ తాను తిరుగుతూ సూర్యునిచుట్టూ పరిభ్రమిస్తున్నది.
- సూర్యకాంతి ఏడు రంగుల కలయిక. వీటినే సూర్యుని ఏడు రథాశ్వాలుగా పోల్చారు.
- పండ్రెండు రాశిచక్ర చిహ్నాలు.
- సంవత్సరానికి 366 రోజులు.
- ఒక నెలకు 29 16/21 లేక 29.762 రోజులు.
- అపౌరుషేయంగా చెప్పబడే సూర్యసిద్ధాంత గ్రంథము హిందూ ఖగోళ శాస్త్రానికి సంబంధించిన ప్రాచీన గ్రంథము. క్రీ.శ. 6వ శతాబ్దంలో వరాహమిహిరుడు దీనిని పూర్తిగా సంస్కరించారు. ఇతనే బృహజ్జాతక, లఘుజాతక, పంచ సిద్ధాంతిక, బృహత్ సంహిత కూడా వ్రాసినట్లు తెలుస్తోంది.

ఆర్యభట్ట–1 (క్రీ.శ. 476), బ్రహ్మగుప్త (క్రీ.శ. 7వ శతాబ్దం), భాస్కర (క్రీ.శ. 12వ శతాబ్దం) గొప్ప ఖగోళ శాస్త్రజ్ఞులు.

వృక్షశాస్త్రము : వేదకాలములోను, తదనంతర కాలములోను భారతీయులకు చక్కని వృక్షశాస్త్ర పరిజ్ఞానము ఉండేది. వేదకాలమునాటి ఆర్యులకు కిరణజన్య సంయోగ క్రియ గురించి తెలుసు. కౌటిల్యుని అర్థశాస్త్రము (క్రీ.పూ. 300), గుల్మవృక్షశాస్త్రము (చిన్న, పెద్ద వృక్షముల వివరములు) ప్రస్తావించి ఉన్నది. భూసారము, విత్తనముల ఎంపిక, విత్తులు, మొలకెత్తుట, అంటుకట్టడం, పంటలమార్పిడి, వృక్షముల వర్గీకరణ మొదలగు అంశాలు అగ్నిపురాణము (క్రీ.శ. 800) లాంటి పురాణాలలో పేర్కొనబడ్డాయి.

మొక్కల భాగాలైన వేర్లు, కాండములు, రెమ్మలు, ఆకులు, పూలు, ఫలాల గురించి ఋగ్వేదము, అధర్వ వేదము, తైత్తరీయ సంహిత, వాజసనేయ సంహితలలో ప్రస్తావించబడింది.



వేదముల తరువాతి కాలంలో (క్రీ.పూ. 600 – క్రీ.శ. 600) వృక్షములకు సంబంధించిన స్వరూపశాస్త్రము, వృక్షధర్మ శాస్త్రము, జీవావరణ శాస్త్రము, వర్గీకరణ గురించి భారతీయులకు అవగాహన ఉండేది. అమరసింహుడు సంస్కృతములో రచించిన అమరకోశము (క్రీ.శ. 400) 300 రకాల వృక్షజాతుల గురించి తెలియజేస్తున్నది. ఔషధమొక్కలు, వృక్షాలు ఆయుర్వేదంతో సంబంధించి ఉండటము వలన ఎక్కువగా పేర్కొనబడ్డాయి. నేడు మనకు తెలిసిన మొక్కల ఉత్పత్తి విధానాలు అప్పుడే ప్రాచుర్యములో ఉండేవి. విత్తనాలు, వేరు మూలాలు, అంట్లు కట్టడం వీటిల్లో ముఖ్యమైనవి. అర్థశాస్త్రం, బృహత్ సంహిత, మనుసంహిత మొదలగు గ్రంథాలు ఈ పద్ధతుల గురించి ప్రస్తావించాయి.

వేదకాలము నుండి మొక్కలు జీవించి ఉన్నట్లు తెలిసికొన బడింది. మొక్కల పేర్లు కూడా ఒక శాస్త్రీయ పద్ధతిననుసరించి పెట్టబడి ఆధునిక వర్గీకరణకు ధీటుగా కనిపిస్తాయి.

మధ్యయుగాల కాలములో (క్రీ.శ. 600 – 1500) వృక్ష పరిశోధన కొత్త వంగడాలు సృష్టించడముతో సహా ప్రోత్సహించ బడినట్లు శారఙ్గధరుడు రచించిన శారఙ్గధర పద్ధతిలో తెలియజేయబడింది.

రసాయనిక శాస్త్రము : న్యాయ, వైశేషిక దర్శనాల కాలము నుండి రసాయనిక శాస్త్రము ప్రారంభమైనట్లు ఆధారాలు కనిపిస్తున్నాయి. అలంకరణలతో కూడిన మట్టిపాత్రలు, పింగాణీ వస్తువులు, కాల్చిన ఇటుకలు, గాజు వస్తువులు, మిశ్రమ లోహాలు, రసాయనాల తయారీ లాంటి చేతివృత్తులు ఇందుకు నిదర్శనము.

సింధు నాగరికులు (క్రీ.పూ. 2500) అనేక రసాయనిక పద్ధతులలో నైపుణ్యం కలిగి ఉండేవారు. హరప్పా–మొహంజదారో త్రవ్వకాలలో బయటపడ్డ నీటికూజాలు, మట్టిపాత్రలు, పూత పెట్టబడిన పాత్రలు, నగలు, రాజముద్రికలు ఈ అభిప్రాయాన్ని సమర్థిస్తాయి. వేదాలలో చెప్పబడిన తోళ్ళ పరిశ్రమ, బట్టలకు సహజంగా దొరికే వృక్షజాతుల రంగులు వేయడం, కాపు కాచిన మత్తుపదార్థాలు, రసాయనిక పరిజ్ఞానాన్ని సూచిస్తున్నాయి. క్రీ.పూ. 600–800 మధ్యకాలంలో ఆయుర్వేద ఔషధాలు, శస్త్రచికిత్స బాగా అభివృద్ధి చెందాయి. వాటితోపాటు రసాయనికశాస్త్ర పురోగతి కూడా సహజంగా జరిగింది. క్రీ.శ. 400 సంవత్సరాలకే రసాయనిక ప్రయోగాలలో వేడి పుట్టడం, తీసుకోబడటం గుర్తించబడింది.

కౌటిల్యుని అర్థశాస్త్రం (క్రీ.పూ. 300), చరక సంహిత (క్రీ.శ. 300), సుశ్రుత సంహిత (క్రీ.శ. 500), రసాయనిక విజ్ఞానాన్ని గురించి, ఔషధ శాస్త్రాన్ని, లోహముల తయారీని వివరంగా తెలియజేస్తున్నాయి. బంగారం, వెండి, రాగి, సీసముల తయారీ, అనేకరకములైన మత్తుపదార్థముల కాపు, క్షారగుణములు కలిగిన సబ్బుల తయారీ పై గ్రంథాలలో వివరించబడ్డాయి. వాటితోపాటు సున్నము కలపటం (calcination), బట్టీ పెట్టడం (distillation), శుద్ధిచేయటం (sublimation), ఆవిరిపెట్టడం (steaming), వివిధరకములైన సేంద్రియ పదార్థముల కలయిక, వనస్పతి తయారీ, జంతుజాలము నుండి నూనెలు, అనేకరకములైన విషపదార్థముల వివరములు కూడా తెలుపబడ్డాయి.

మానవుల జీర్ణ వ్యవస్థలో ఆహార పదార్థముల రసాయనిక మార్పులు, వాగ్భటుడు–II వ్రాసిన అష్టాంగ హృదయసంహిత (క్రీ.శ.600), చరక సంహితల్లో తెలియజేయబడ్డాయి.

గాజు వస్తువుల తయారీ, కరిగించడం, రంగులు కలపడం, శుద్ధి చేయటం మొదలగు వివరములు క్రీ.పూ. 6వ శతాబ్దికే వాడుకలో ఉన్నట్లు భీర్‌మోండు, తక్షశిల త్రవ్వకాలలో తెలుస్తున్నది. రంగురంగుల పూతపూసిన కుండల తయారీ, క్రీ.పూ. 300 నాటికి నీలి, లక్క, పసుపు, కాషాయ రంగుల అద్దకం వాడుకలో ఉండేది. మధ్యయుగాల నాటి భారతదేశంలో తాంత్రిక ఆచారాల ప్రాబల్యము, రసాయనిక శాస్త్రము, యంత్రాల ఉపయోగాలను ప్రోత్సహించింది.

రసార్ణవము (క్రీ.శ. 12వ శతాబ్దం), ధాతువాద (క్రీ.శ. 8వ శతాబ్దం), రసేంద్ర చూడామణి (క్రీ.శ. 13వ శతాబ్దము) మొదలగు గ్రంథాలలో ఖనిజాల నుండి రాగి తయారీ, బట్టీ పెట్టడం ద్వారా పాదరసము తయారీ, సల్ఫ్యూరిక్ ఆమ్లము, క్యూప్రస్ సల్ఫైడ్ తయారీ ప్రస్తావించబడి ఉన్నాయి. ఖనిజాల నుండి లోహముల తయారీ లాంటి ప్రక్రియలకు దోహదంగా రసాయన శాస్త్రం పురోగమించి చెప్పుకోదగిన ప్రగతి సాధించింది. ❖ **అనువాదం: డాక్టర్ పి.వి. రెడ్డి**

జ్ఞానం పెన్నిధి లాంటిది. దీన్ని పోలిన ధనం ఏదీ లేదు. లోభం శత్రువు లాంటిది. అలాంటి వైరి మానవునికి మరొకటి లేదు. మానవునికి శీలం అలంకారం, సంతోషం బలం లాంటివి. - హితోపదేశం

మనం ఓడిపోవద్దు

- చక్కిలం హేమంత్ కుమార్



ఓడిపోవడం అంటే అవతలివాళ్ళు గెలవడం కాదు. వారిని గెలిపించడం అసలే కాదు. మనం తలపెట్టిన కార్యం, పరీక్ష, పోరాటం నుండి భయపడో, భంగపడో, విముఖులం కావడం.

ఓడిపోదాం. ఎందుకు! ఎప్పుడు? అధికాధిక శ్రేయస్సు మనం ఓడిపోవడంతో ముడిపడివున్నప్పుడు. అవగాహనతో ఓడిపోదాం. త్యాగంతో ఓడిపోదాం. త్యాగంతో కూడిన ఓటమి... అది గెలుపే. విజయం కోసం పోరాటం ప్రపంచానికి కొత్తకాదు. ప్రతి గెలుపూ, ప్రతి ప్రగతీ పోరాటం అందించిన కానుకలే. విజయ స్వరూపం మనం ఊహించినరీతిలోనే వుండకపోవచ్చు. అది మనం ఆశించిన దాని కన్నా ఎన్నో రెట్లు ప్రయోజనకారి కావచ్చు. దేవదానవులు కేవలం అమృతం కోసం క్షీరసాగరాన్ని మథించారు. ఏమైంది? ఐరావతం, చంద్రుడు, శ్రీమహాలక్ష్మి.... ఇలా ఎన్నని? ఊహించారా వారు?

జీవజాతి మొత్తం జీవితం... విజయం కోసం పోరాటమే. చిన్న చిన్న పక్షులు గూటిని సౌకర్యవంతంగా, కళాత్మకంగా అల్లుకునే విధానం చాలా సంభ్రమాశ్చర్యాలకు గురి చేస్తుంది. సాలెపురుగు గూడును పూర్తి చేసేదాకా వదలదు. చీమలు పుట్టల నిర్మాణంలో తమ కాలాన్నంతా వెచ్చిస్తాయి. తేనెటీగల పట్టు నిర్మాణం అత్యంత అద్భుతం. అసలు కాళ్ళూ, చేతులూ లేని వానపాము వ్యవసాయదారుడి పలుగు దెబ్బలకు శరీరం ఛిద్రం అయినా మళ్ళీ బ్రతికేదాకా శరీరాన్ని పునఃనిర్మించుకునే పోరాటంలో మునిగిపోతుంది. ఏ జీవీ ఓటమిని అంగీకరించదు. విజయం కోసం పోరాడడమే వాటి జీవన విధానం. జీవ స్వభావం.

మరి నిమ్న జాతి జీవులే ఓటమిని అంగీకరించనప్పుడు, వివేక విచక్షణలున్న మనిషెందుకు ఓడిపోవాలి? సమాజాన్ని, దేశాన్ని, ప్రపంచాన్ని ముందుకు తీసుకువెళ్ళాల్సిన బాధ్యత మనిషి మీద ఉంది. ఎందుకంటే తానే అవన్నీ కాబట్టి. చిన్న చిన్న విషయాలలో కూడా ఓటమిని అధిగమించలేకపోతే క్లిష్ట సమస్యల్నెలా పరిష్కరిస్తాం? అద్భుత విషయాలనెలా ఆవిష్కరిస్తాం? ఇక్కడ మరో అందమైన రహస్యం ఏమిటంటే విజయం కన్నా ప్రయత్నమే, పోరాటమే ఎక్కువ ఆనందాన్ని కలిగిస్తుందన్నది.

గెలుపు... అదంత సులభం కాదు. జంతువులు కేవలం జీవిక కోసం పోరాడతాయి. మనం అలా కాదు. మనం పోరాడాల్సింది మనుషుల్తో, మనసులతో, వారివారి భావోద్వేగాల్తో. కష్టమే, అత్యంత క్లిష్టమే! అయినా తప్పదు. మనిషి గర్భస్థ శిశువుగా ఉన్నప్పుడే తల్లిగర్భం లోపల అసౌకర్యాలతో, వ్యాధులతో పోరాడడం ప్రారంభిస్తాడు. అనాలోచితంగా, అప్రయత్నంగా పోరాటపటిమను అలవరచుకుంటాడు. దాని కొనసాగింపే జీవితం.

సమాజంలో ఎక్కడైనా భిన్న వ్యక్తిత్వాలు. విభిన్న మనస్తత్వాలు. ఇంటి బయట కాస్త నిక్కచ్చిగా వున్నా సరిపోతుంది. కుటుంబంలో అలా కాదు. కుటుంబ సంస్కృతి, ఎదుటివారి మనస్తత్వం... ఇవన్నీ పరిగణనలోకి తీసుకోవాలి. 'మన కుటుంబ జీవితం అంటే మనొక్కరిదే కాదు. కుటుంబ పెద్దలు, జీవిత భాగస్వామి, పిల్లలు, బంధువులు... అందరితో ముడివడి ఉంది. అందరితో పెనవేసుకు పోయి ఉన్నది. ఇక్కడే కొంచెం విచక్షణ అవసరం. సహనం అవసరం.

ఇక బయటి ప్రపంచం కూడా మనదే. మనమే గెలవాలనే భ్రమతో అందర్నీ కోల్పోవడం కూడా మన అమాయకత్వం అవుతుంది. కానీ గెలవాలి. ఎలా? ప్రేమతో, విచక్షణతో, అవగాహనతో, సహనంతో. దీనివల్ల ఇతరులు మనల్ని చేతగానివారనుకుంటారు. ఉదాసీనంగా వదిలివేయడమే! మరి... ఇది గెలవడమా? పూర్తిగా కాకపోవచ్చు. కానీ మన ప్రయత్నలోపం లేదనే సంతృప్తి మనకు కొంతైనా శాంతినిస్తుంది. శాంతి స్థాపన... అది ఎవరిలోనైనా సరే... గెలుపే. ❖

పండుగలు - పర్వదినాలు

సెప్టెంబర్ - 2014

5, 19	శుక్రవారం	: ఏకాదశి
17	బుధవారం	: స్వామి అభేదానంద జయంతి
24	బుధవారం	: స్వామి అఖండానంద జయంతి

అక్టోబర్ - 2014

03	శుక్రవారం	: విజయదశమి
04	శనివారం	: ఏకాదశి
07	మంగళవారం	: లక్ష్మీపూజ
19	ఆదివారం	: ఏకాదశి
23	గురువారం	: దీపావళి - కాళీపూజ



పొడగంటిమయ్య మిమ్ము పురుషోత్తమా
మమ్ము నెడయకవయ్య కోనేటి రాయడా॥
కోరిమమ్ము నేలినట్టి కులదైవమా
చాల నేరిచి పెద్దలిచ్చిన నిధానమా
గారవించి దప్పి తీర్చు కాలమేఘమా
మాకు చేరువ చిత్తములోని శ్రీనివాసుడా॥
భావింప కైవసమైన పారిజాతమా
మమ్ము చేవదేరగాచినట్టి చింతామణి
కావించి కోరికలిచ్చే కామధేనువా
మమ్ము తావై రక్షించేటి ధరణీధరా॥
చెడనీక బ్రతికించే సిద్ధమంత్రమా
రోగాలడచి రక్షించే దివ్యౌషధమా
బడి బాయక తిరిగే ప్రాణబంధుడా
మమ్ము గడియించినట్టి శ్రీవేంకటనాథుడా॥

పొడగంటిమయ్య పురుషోత్తమా!

- శ్రీమతి బి.కృష్ణకుమారి

ధరణీధరుడు...దివ్యాభరణుడు ఆ శ్రీవేంకటేశ్వరుడు. దర్శనమాత్రం చేతనే ధన్యతను ప్రసాదించే ఆ పురాణపురుషుడు, దిక్కై నిలిచి దరి చేర్చుకునే దీనజన బాంధవుడు. మూగనోమును దాల్చినట్లు మౌనంగా కనిపిస్తూ, నిమీలిత నేత్రాలతో నిలబడి ఉన్న ఆ మూలవిరాట్టు,తన అంతర్భావనతోనే ఈ అఖిలాండకోటి బ్రహ్మాండాల్ని పరిపాలిస్తున్నాడు; సకల చరాచర సృష్టికి సంరక్షకుడిగా నేటికీ తన లీలల్ని ప్రదర్శింపచేస్తున్నాడు. అంతటి పరమాద్భుతమూర్తి ప్రత్యక్షదర్శనంతో పదకవితా పితామహుడు పొంగిపోయి ప్రవహింప చేసిన పదామృత వాహినే ఈ **'పొడగంటిమయ్య మిమ్ము పురుషోత్తమా'** కీర్తన.

భగవంతుడి దర్శనభాగ్యంతో భక్తుడిలో ఉప్పొంగే భావపారవశ్యం వర్ణనాతీతం. ఆ స్థితిలో భక్తుడికి, భగవంతుడే సర్వము. అలాంటి భక్తితో అన్నమాచార్యులు శ్రీనివాసుడి పదార్చనలో పరవశించిపోయాడు; తమకు దైవమైనా, ధనమైనా ఆ ధరణీనాయకుడేనని ప్రకటించుకున్నాడు. ఇహలోక దాహాన్ని తీర్చే కాలమేఘంగా, అరచేతికందిన పారిజాతంగా, చింతలు తీర్చే చింతామణిగా, కోరికలీడేర్చే కామధేనువుగా ఆ ఏడుకొండలవాడిని కీర్తిస్తూ ఉన్నాడు. బుద్ధిని శుద్ధి చేసే సిద్ధమంత్రం...భవ, భౌతిక రుగ్మతలను రూపుమాపే దివ్యౌషధం... ఆ కస్తూరీతిలకుడేనని కొనియాడుతున్నాడు. దైవంతో సంబంధం ఏర్పరచుకున్న భక్తుడికి భగవంతుడు సొంతవాడైపోతాడు. అందుకే భగవాన్ శ్రీరామకృష్ణ పరమహంస 'భగవంతుడు మన సొంత మనిషి, ఆయనను ఏదైనా అర్థించే చొరవ మనకుంది' అంటారు.

ఎడయక వయ్యా...

నిజమైన భక్తుడు క్షణం కూడా భగవంతుడి ఎడబాటును భరించలేడు. అత్యంత ఆత్మీయులు దూరమైతే మనస్సు కలవరపడ్డట్టు, ఆ పరమాత్ముడు కాస్త దూరమైతే ప్రియభక్తుడు కలతపడిపోతాడు. అదే కోవకు చెందిన అన్నమయ్య ఆ ఆపద మొక్కులవాడి ఆత్మీయ భక్తుడు.


పొడగంటిమయ్య మిమ్ము పురుషోత్తమా
మమ్ము నెడయకవయ్య కోనేటిరాయడా! అని వేడుకుంటున్నాడు. 'పొడగంటిని' అంటే 'దర్శించాను' అని, 'ఎడయక' అంటే 'విడిచిపెట్టకుండా' అని అర్థం. కారణ జన్ముడయిన అన్నమయ్య అనితరసాధ్యంకాని సంకీర్తన సాధనతో ఆశ్రితపరిపాలకుడిని యుక్తవయస్సులోనే సాక్షాత్కరింప చేసుకున్నాడు. అటుపై ఆయన ఆత్మబంధువుగా వేంకటేశ్వరుడిని తన అంతరంగంలోనే కొలువుతీర్చాడు. భౌతికంగా ఈ లోకంలో ఉన్నన్నాళ్ళూ ఆ ప్రసన్నమూర్తే ప్రపంచంగా జీవించాడు; తన లక్ష్యం పూర్తి కాగానే ఆయనలోనే లయమైపోయాడు. శ్రీరామచంద్రుడి సేవానిరతుడిగా శ్రీత్యాగరాజస్వామి కూడా, ఆ అయోధ్యారాముడి విరహాన్ని అరనిమిషమైనా భరించలేక...

నన్ను విడిచి కదలకురా రామయ్య
నిన్ను బాసి అరనిమిష మోర్వనురా!
అబ్ధిలో మునిగి శ్వాసమును బట్టి,
ఆణిముత్యము గన్నట్లాయె శ్రీరమణ
తరముగాని ఎండవేళ కల్ప
తరు నీడ దొరికినట్లాయె శ్రీరమణ...

(మిగతా 34వ పేజీలో...)

పరమపావనమైన భగవన్నామంపై సంపూర్ణ విశ్వాసముంటే, నిరంతర నామస్మరణతో మనస్సు రమిస్తే అలాంటి వ్యక్తి ముందు స్వయంగా ఆ భగవంతుడే సాక్షాత్కరిస్తాడు. - భగవాన్ శ్రీరామకృష్ణులు





పరిప్రశ్న

– స్వామి భూతేశానంద
(రామకృష్ణ సంఘ 12వ సర్వాధ్యక్షులు)

రామకృష్ణ సంఘ 12వ సర్వాధ్యక్షులు - స్వామి భూతేశానందజీ మహరాజ్(1901-1998) భక్తుల ఆధ్యాత్మిక సందేహాలకు సరళమైన రీతిలో ఇచ్చిన సమాధానాలను 'శ్రీరామకృష్ణ ప్రభ' పాఠకుల ప్రయోజనార్థం 2013 జూలై సంచిక నుండి ధారావాహికంగా ప్రచురిస్తున్నాం.

భక్తుడు: మనం ఈ జగత్తులో ఎన్నో దృశ్యాలను, నిద్రలో ఎన్నో స్వప్నాలు చూస్తుంటాం. కానీ ఇవేవీ మనకు కొంతకాలం తరువాత గుర్తుండవు. అలాంటప్పుడు ఇష్టదైవాన్ని మన మనస్సులో ఎల్లప్పుడూ ఎలా నిలుపుకోగలం? ఈ జగత్తు, మనం వేర్వేరు అన్న భ్రాంతి ఎలా తొలగుతుంది?

స్వామీజీ: ఈ జగత్తులో మనం దర్శించే ప్రతీ విషయం యొక్క అనుభూతిని మనస్సు ద్వారా పొందుతాం. మనస్సు లేకుండా ఇది సాధ్యం కాదు. మనస్సు ద్వారా మనం గ్రహించే విషయాలు జ్ఞాపకం ఉండకపోవడానికి కారణం మనస్సు పరిశుద్ధంగా లేకపోవడమే!

మనస్సు ఓ అద్దం లాంటిది. అద్దం ఎంత శుభ్రంగా ఉంటే ప్రతిబింబం అంత స్పష్టంగా కనబడుతుంది. అదేవిధంగా మనస్సు ఎంత పరిశుద్ధమైతే మనం గ్రహించే విషయాలు అంత స్పష్టంగా గుర్తుంటాయి. మనం దర్శించే దృశ్యాలు బాగా జ్ఞాపకం ఉంటాయి.

అలలు ఉన్నంత వరకూ కొలను అడుగు భాగం కనబడదు. అలాగే, మనస్సులో ఆలోచనల అలజడి ఉన్నంతవరకూ ఇష్టదైవాన్ని సరిగ్గా చూడలేం. మనస్సు పరిశుద్ధమైనప్పుడు మనోనిశ్చలత కలుగుతుంది. అప్పుడు మన హృదయంలో ప్రతిష్ఠితమై ఉన్న దైవాన్ని దర్శించవచ్చు. అందుకే శ్రీరామకృష్ణులు 'శుద్ధమనస్సు, శుద్ధబుద్ధి, శుద్ధఆత్మ ఒక్కటే' అని అంటారు. మనస్సు పరిశుద్ధమైతే బుద్ధి కూడా పవిత్రమవుతుంది. మనస్సు, బుద్ధి పరిశుద్ధమైతే మనలో నిక్షిప్తంగావున్న ఆత్మను (దైవాన్ని) దర్శించగలుగుతాం.

ఈ జగత్తంతా ఒకే ఆత్మచైతన్యంతో నిండివుంది. కానీ మనస్సు పరిశుద్ధంగా లేకపోవడం వలన సర్వత్రా వ్యాపించి ఉన్న ఆత్మను దర్శించలేకపోతున్నాం. మనస్సులో మాలిన్యం తొలగనంతవరకూ మనం, ఈ జగత్తు వేర్వేరన్న భావన తొలగదు.

మనస్సు పరిశుద్ధమైతే మనలో ఉన్న జీవాత్మ, సర్వత్రా వ్యాపించి ఉన్న పరమాత్మ ఒకటేనని గ్రహిస్తాం. కానీ మనస్సులో విషయవాంఛలు ఉన్నంత వరకూ సుఖదుఃఖాలను అనుభవించాల్సి ఉంటుంది. మనస్సు ఈ ద్వంద్వాలకు అతీతమైనప్పుడే నిశ్చల స్థితికి చేరుకుంటుంది. ఆత్మానుభూతిని పొందుతుంది.

విషయవాంఛలు గల వ్యక్తి, వాటికి అతీతంగా ఉన్న వ్యక్తి ఎలా ఉంటారో రెండు పక్షుల దృష్టాంతంతో ముండకోపనిషత్తు ఇలా వర్ణిస్తుంది :

ద్వా సుపర్ణా సయుజా సఖాయా సమానం వృక్షం పరిషస్వజాతే ।
తయోరన్యః పిప్పలం స్వాద్వత్తి అనశ్నన్ అన్యో అభిచాకశీతి ॥

ఒకే చెట్టు పైన రెండు పక్షులు ఉన్నాయి. కింద కొమ్మ మీద ఉన్న పక్షి పళ్ళను తింటున్నది. అది తియ్యని పళ్ళను తిన్నప్పుడు సుఖాన్నీ, చేదు పళ్ళను తిన్నప్పుడు దుఃఖాన్ని పొందుతుంది. రెండవ పక్షి ఏమీ తినకుండా ప్రశాంతంగా కూర్చొంది. సుఖదుఃఖాలకు అతీతమైన ఆత్మానందాన్ని అనుభవిస్తోంది.

శరీరం–చెట్టు, పళ్ళు తింటున్న పక్షి–జీవాత్మ, పళ్ళు తినకుండా ఉన్న పక్షి–పరమాత్మ. విషయవాంఛలు అనుభవిస్తున్న వ్యక్తి సుఖదుఃఖాలను పొందుతాడు. వీటికి అతీతంగా ఉన్న వ్యక్తి ఆత్మానుభూతిని పొందుతాడు. జీవాత్మ, పరమాత్మతో ఏకమవ్వాలంటే వాంఛాతీత స్థితిని పొందడమే మార్గం. ఆధ్యాత్మిక సాధనల ఉద్దేశ్యం వాంఛారహిత స్థితికి చేరుకొని, తద్ద్వారా శుద్ధమనస్సును పొందడమే! అప్పుడు సర్వత్రా ఉన్నది ఒకే ఆత్మ అని అవగతమవుతుంది. ❖



ఉన్నతంగా జీవిద్దాం!

– రాచమడుగు శ్రీనివాసులు

మహాభారత యుద్ధం ప్రారంభమయింది. వీరాభిమన్యుడు చెలరేగాడు. కౌరవసైన్యం భీతిల్లింది. ద్రోణ కర్ణాదులగు ఆరుమంది యోధులు చేతులు కలిపారు. పద్మ వ్యూహంలోకి ప్రవేశించిన అభిమన్యుని అధర్మంగా, అన్యాయంగా హత మార్చారు. ధర్మరాజుకు ఈ విషయం తెలిసింది. ఆయన హృదయం బరువెక్కింది, కళ్ళు నీళ్ళతో నిండాయి. గద్గద స్వరంతో "నాకు ప్రియం చేయాలని నిర్భయంగా ఆవుల మందలోకి సింహమువలె ద్రోణ సైన్యములోనికి జొచ్చుకొని పోయాడు. రణ గర్వితులైన యోధులను ఎదుర్కొని వారి గర్వాన్ని అణచాడు. చివరకు వారి చేతిలో హతుడయ్యాడు. అర్జునునకు నా ముఖమెలా చూపించగలను? ఏమని చెప్పగలను? ప్రియపుత్రుని చూడగోరు ఆ సుభద్రను ఎట్లు చూడగలను? నాకు ఈ యుద్ధంలో ఒకవేళ జయము కలిగినా సంతోషము కాదు. రాజ్యము కూడా రుచించదు. దేవతలతో కూడిన ఆ దేవత్వమును నేను కోరను" అని అన్నాడు (ద్రోణ పర్వము).

ధర్మరాజు మానసికంగా క్రుంగిపోతున్న సమయంలో వ్యాస భగవానుడొచ్చి, ధర్మరాజుతో "ఓ యుధిష్ఠిరా! మహా ప్రాజ్ఞా! సర్వశాస్త్ర విశారదా! నీ బోటివారెవ్వరూ ఆపదలందు ధైర్యమును విడువరాదు. నీ కుమారుడు పెక్కురు వైరులను చంపి స్వర్గమునకేగినాడు. విధి తప్పింప రానిదని నీ వెఱుంగవా? మృత్యువు దేవ దానవ గంధర్వులను తీసికొని పోలేదా?" అని ప్రశ్నించాడు (ద్రోణ పర్వము).

షోడశ రాజుల చరిత్రను వివరించి ఎంతటి మహనీయులైనా ఏదో ఒకనాడు పోక తప్పదని సూచించాడు. అభిమన్యుని మరణాన్ని గూర్చి దుఃఖించడం తగదన్నాడు. మృత్యువు సంభవమగుట, సిరులు అస్థిరములగుట అందరికీ బాగా తెలిసిన విషయమేనన్నాడు. ఇలా వ్యాసుడు ఎన్నో విషయాలను ధర్మరాజుకు గుర్తుచేసి ఓదార్చాడు. ధర్మరాజు హృదయం అప్పుడు కొంత తేలిక అయింది. తన ముందున్న కర్తవ్యం తెలిసి వచ్చింది. లక్ష్యం స్పష్టంగా గోచరించింది. ధనుర్బాణాలు చేతబూని యుద్ధరంగంలో ముందుకెళ్ళాడు.

మహాభారతములోని ఈ సంఘటనను మనం జాగ్రత్తగా పరిశీలిద్దాం. ధర్మరాజు ఒకరాజు. శాంతిని కోరి యుద్ధం చేయవలసి వచ్చింది. యుద్ధరంగంలోకి ప్రవేశించినప్పుడు మానసికంగా సిద్ధమై ఉండాలి. ఎట్టి పరిస్థితుల్లోనూ లక్ష్యాన్ని మరచిపోరాదు. దృఢ నిశ్చయం కలిగి ఉండాలి. యుద్ధం నుంచి తనవారందరూ సజీవంగా బయట పడతారని అనుకోరాదు. అలా జరగాలని ఆశించడం పేరాశే అవుతుంది. భయంకరమైన యుద్ధం హోరాహోరీగా జరిగితే అటువైపు వారు, ఇటువైపు వారు కొందరు చావనే చస్తారు. తనవారు ఎవరో కొందరు చస్తే రాజు వారిని గూర్చి ఏడుస్తూ కూర్చొంటే, నిరాశ నిస్పృహలకు లోనయితే, ధైర్యాన్ని ఉత్సాహాన్ని కోల్పోయి డీలాపడి ఆయుధాలను వదిలేస్తే ఇక సాధారణ సైనికులు ఏమి చేస్తారు? యుద్ధం చేయడానికి, లక్ష్యమైన జయాన్ని పొందడానికి వారు కృషి చేయగలరా? వాళ్ళకు కాళ్ళు, చేతులు ఆడుతాయా? రాజే నీరసపడి కూలబడితే వాళ్ళను ప్రోత్సహించేవారెవరు? ముందుకు నడిపే వారెవరు? అందుకే సరైన సమయంలో వ్యాసభగవానుడు వచ్చి ధర్మరాజుకు తగిన బోధ చేయవలసి వచ్చింది. పోనీలే యుద్ధభూమిలో మరణించక పోయినంత మాత్రాన ఎవరన్నా చావు లేకుండా అలాగే ఎల్లకాలం జీవిస్తారా? అది అసంభవం. పుట్టినవాడు గిట్టక తప్పదు. మరి అలాంటప్పుడు ఒక క్షత్రియుడు క్షత్రియ ధర్మ నిర్వహణలోనే మరణిస్తే ఇంక అంతకన్నా మేలైనది, మెరుగైనదేముంటుంది?

నిజానికి మన జీవితమే ఒక రణరంగం. ఎప్పుడో ఒకప్పుడు మనవారిని ఎందరినో కోల్పోతాం. ఒకసారి తల్లి పోతుంది, మరొకసారి తండ్రి పోతాడు. అలా పోయిన వారిని గూర్చి చింతిస్తూ కూర్చుంటే, కన్నీరు కారుస్తూ కాలం గడిపితే, ధైర్యాన్ని కోల్పోతే, మానసికంగా క్రుంగిపోతే జీవచ్ఛవాలుగా మిగిలిపోతాం, కర్తవ్యాన్ని మరచిపోతాం. విలువైన కాలాన్ని, భగవంతుడిచ్చిన అమూల్యమైన మానవజన్మను వృథా చేసుకొంటాం. అలా ఎప్పటికీ జరుగరాదు. కష్ట సుఖాలు, చావు పుట్టుకలు చాలా సహజమైనవని మనం గ్రహించి దేని స్థానం దానికివ్వాలి, లక్ష్యం వైపు పురోగమించాలి. మనం జీవించాలి – ఇతరులను జీవింప చేయాలి. జీవచ్ఛవాలుగా మన మనుగడ సాగించరాదు. ఎంత కాలం జీవించామన్నది ముఖ్యం కాదు, ఎలా జీవించామన్నదే ముఖ్యం. పరోపకారం కోసం కృషి చేస్తూ అభిమన్యుడిలా మధ్యలోనే కన్ను మూస్తే మాత్రం వచ్చే నష్టమేముంది? విధ్యుక్త ధర్మాన్ని నిర్వహిస్తూ ప్రాణం కోల్పోయినవాడిని చూసి ఎవరైనా గర్వించాలేగానీ దుఃఖించరాదు, సంయమనం కోల్పోరాదని బోధిస్తుంది మహాభారతం. ❖

ప్రాపంచిక విషయాలు మనముందు ఒక్కక్షణం కనిపించి, మరుక్షణంలో అదృశ్యమైపోతాయి. 'నావారు' అని భావించేవారు కనుమరుగైపోతున్నారు. మోహపాశాలెంత బలీయమైనవో కదా! -శ్రీరామకృష్ణులు

మనకు 33

మనం తరచుగా ఒక కొంటె ప్రశ్న వింటూ ఉంటాం. అబ్బో మనకు 33 కోట్ల దేవుళ్ళా! అని. 'ఆవు దేహంలో 33 కోట్ల దేవతలూ ఉంటార'ని పురాణాల్లో చెప్పడం విన్నాం. మన పిల్లలు కూడా ఈ విషయమై ప్రశ్నిస్తూ ఉంటారు. ఇతర మతాల వాళ్ళు మనల్ని ఎగతాళి చేయడానికి కూడా ఈ విషయాన్ని ప్రస్తావిస్తూంటారు.

దేవుళ్ళ సంఖ్య గురించి అతి ప్రాచీనమైన ఋగ్వేదంలో వైశ్యదేవం అనే సందర్భంలో 'త్రయశ్చ త్రీచ శతా త్రయశ్చ త్రీచ సహస్రా' అంటూ దేవుళ్ళ సంఖ్య 3,306 అని చెప్పబడింది. దీన్నే యజుర్వేదంలోనూ చెప్పారు.

శుక్లయజుర్వేదానికి చెందిన బృహదారణ్యకోపనిషత్తులో దేవుళ్ళ గురించి చర్చ జరిగింది. బ్రహ్మజ్ఞాని అయిన యాజ్ఞవల్క్యుడు, రాజర్షి అయిన జనకుని సభకు వెళతాడు. అక్కడ వేదవేత్తలైన అనేక పండితులలో బ్రహ్మస్వరూపం గూర్చి చాలా రోజులు చర్చ జరుగుతుంది. ఆ చర్చలో శాకల్యుడు అనే పండితుడు దేవుళ్ళ సంఖ్య గురించి యాజ్ఞవల్క్యుడిని ప్రశ్నిస్తాడు. శాకల్యుడు అంటేనే శకలాలుగా, అంటే ముక్కలు ముక్కలుగా అన్నిటినీ విభజించి చూసే మనస్తత్త్వం కలవాడని అర్థం. ఇతని మరోపేరు విదగ్ధుడు. విదగ్ధుడంటే ఎప్పుడూ కోపంతో ఉండేవాడు. చాలామంది పండితులు యాజ్ఞవల్క్యుడితో వాదనలు చేసి ఓడిపోయిన సందర్భంలో ఇతను కోపావేశాలతో యాజ్ఞవల్క్యుడిని ప్రశ్నలతో ముంచెత్తుతాడు.

ఎందరు దేవుళ్ళు అన్న ప్రశ్నకు యాజ్ఞవల్క్యుడు ఋగ్వేద మంత్రాన్ని చెబుతూ '3,306' అని చెబుతాడు. దాన్ని సరిగా వివరించమని శాకల్యుడు అడగడంతో '33' మాత్రమే అంటాడు. సరే వాటిని మళ్ళీ వివరించు అంటే, కేవలం '6' మాత్రమే అంటాడు. వాటిని కూడా సరిగా వివరించమని అడిగితే '3' అంటాడు. ఆ తరువాత '2' మాత్రమే అంటాడు. మళ్ళీ అదే ప్రశ్నకే సమాధానం చెబుతూ దేవుళ్ళు '1 1/2' అంటాడు. మళ్ళీ శాకల్యుడు వివరించమన్నప్పుడు '1' మాత్రమే అంటాడు.

యాజ్ఞవల్క్యుడి సమాధానాలు విని 'సరే నువ్వు చెప్పిన సంఖ్యలన్నింటినీ వివరించు' అంటాడు శాకల్యుడు. మొదట్లో చెప్పిన 3,306 నిజమే. కానీ, అవన్నీ కూడా 33 దేవతల విభిన్న రూపాలు, 'మహిమానః ఏవ', అంటే అవన్నీ 33 విభాగాలుగా ఉన్న దేవతల విభూతులు మాత్రమే అని యాజ్ఞవల్క్యుడు సమాధానం చెబుతాడు. ఆ 33 విభాగాలు ఏమిటి? ఎనిమిది మంది వసువులు, పదకొండుమంది రుద్రులు, పన్నెండుమంది ఆదిత్యులు మొత్తం ముప్పైఒకరు. ఇంద్రుడు, ప్రజాపతి అనే ఇద్దరితో కలిపి ముప్పైమూడు అవుతుంది.

వసు అంటే జీవించడం అని అర్థం. వసువులు అంటే వసించేవారు, వసింపజేసేవారు; జీవించేవారు, జీవింపజేసేవారు. ప్రాణకోటి బ్రతకడానికి ఆధారమైనవి ఎనిమిది. అవి – అగ్ని, పృథ్వి, వాయువు, అంతరిక్షం, సూర్యుడు, ద్యులోకం(ఆకాశం), చంద్రుడు, నక్షత్రాలు. ఈ ప్రకృతి శక్తులన్నీ మనిషి జీవించడానికి అవసరం. ఇవే రూపాంతరం చెంది శరీరం, మనస్సు, ఇంద్రియాలుగా ఏర్పడ్డాయి. పైన చెప్పిన ఎనిమిది శక్తులూ జీవకోటిని జీవింపజేస్తాయి, ప్రాణాలు, దేహం, ఇంద్రియాలను కలిపి microcosm గా భావిస్తే విశ్వమంతా macrocosm అని భావించవచ్చు. విశ్వంలో ఉన్నదే శరీరంలోనూ ఉంది. విశ్వంలో ఉన్న పై శక్తులే తాము జీవిస్తూ ప్రాణుల్ని జీవింపజేస్తాయి కావున వీటిని వసువులు అన్నారు.

రుద్ అనే ధాతువు ఏడవడం అనే అర్థంలో చెప్పబడింది. ఏకాదశ రుద్రులు (పదకొండు రుద్రులు) – మన శరీరంలోని ఐదు జ్ఞానేంద్రియాలు, ఐదు కర్మేంద్రియాలు, మనస్సు. శరీరం నశిస్తే ఈ పదకొండూ నశిస్తాయి. కాబట్టి ఇవి మన బంధుమిత్రులను ఏడిపిస్తాయి, అందువల్ల వీటిని రుద్రులు అని భాష్యకారులు వ్యాఖ్యానించారు.

పన్నెండుగురు ఆదిత్యులు అంటే సంవత్సరంలో ఉన్న పన్నెండు మాసాలే! కాలం మనందరి ఆయుర్దాయాన్నీ, కర్మఫలాన్నీ మెల్లమెల్లగా క్షయం చేస్తూ వెళుతూంటుంది. ఆదదానం అంటే సంస్కృతంలో స్వీకరించడం అని అర్థం. మన ఆయుర్దాయాన్ని స్వీకరిస్తూ పోతున్నాయి కావున వీటిని 'ఆదిత్యులు' అన్నారు.

ఇంద్రుడు, ప్రజాపతి ఎవరు అంటే వర్షించే సమయంలో మెరపు (వజ్రాయుధం) ఆయుధంగా గల ఇంద్రుడు లోకరక్షణకు ప్రతీక. ప్రజాపతి అంటే యజ్ఞం అని అర్థం. యజ్ఞం అన్నది వైదిక సంస్కృతిలో మనుష్యులకు, దేవతలకు ఉన్న సంబంధాన్నీ, పరస్పరం ఆధారపడి ఉండడాన్నీ సూచిస్తుంది.

దివ్ అంటే ప్రకాశించేది, చైతన్య స్వరూపమైనది అని అర్థం. ప్రకృతిలోని పృథ్వి. వాయువు, మేఘము మొదలైనవన్నీ చైతన్య స్వరూపాలే. విశ్వంలో ఉన్న జీవశక్తి మొత్తాన్ని పరిశీలించి

యాజ్ఞవల్క్యుని సమాధానాల్ని చూస్తే 33 దేవతలు అనేవి ముప్పై మూడు తరగతులుగా మనం చూడగల్గిన జీవశక్తులే అని తెలుసుకోగలం.

యాజ్ఞవల్క్యుడు మళ్ళీ కుదించి చెప్పిన సంఖ్య ఆరు. అవి అగ్ని, పృథ్వి, వాయువు అంతరిక్షం, ఆదిత్యుడు, ద్యులోకం. వీటిని ఇంకా సంగ్రహించి చూస్తే అగ్ని కూడా పృథ్విలో ప్రకటితమయ్యేది. వాయువు అంతరిక్షంలో కలిపి చెప్పవచ్చు. అలాగే సూర్యుడిని ద్యులోకంతో కలిపి చూడవచ్చు. ఈ దృష్టికోణం నుండి ముగ్గురు దేవతలు (మూడు తరగతుల దేవతలు) అని యాజ్ఞవల్క్యుడు చెప్పిన మాట.

ఇప్పుడు మనం కోటి అనే పదానికి అర్థం తెలుసుకోవాలి. మామూలుగా కోటి అంటే నూరులక్షలు అనే అనుకుంటూంటాం. కోటి అనే సంస్కృత పదానికి అనేక అర్థాలు. నూరులక్షలు అనేది ఒక అర్థం మాత్రమే. ఈ సందర్భంలో కోటి అంటే తరగతి, category అని అర్థం. ప్రాణికోటి, వృక్షకోటి, జీవకోటి, శిష్యకోటి అన్నట్లుగా. ముప్పది మూడు కోట్ల దేవతలు అన్నప్పుడు ముప్పది మూడు తరగతుల దేవతలు అని అర్థం. ఇవే మనం పైన గమనించిన వసువులు, రుద్రులు, ఆదిత్యులు మొదలైనవారు.

కోట్ల దేవుళ్ళా?

– డాక్టర్ కె. అరవింద రావు, ఐ.పి.ఎస్.

మరో దృష్టికోణం నుండి చూస్తే విశ్వమంతా అన్నము, ప్రాణము అనే రెండు శక్తులు మాత్రమే. దీన్నే ఆధునిక భాషలో matter and energy అనవచ్చు. ఒకటి తినబడేది, మరొకటి తినేది. వైదికభాషలో దీన్నే అగ్ని, సోమము అంటారు. మనం తినే అన్నమంతా సోమము, ప్రాణుల దేహాల్లో వైశ్వానరుడు అనే పేరుతో ఉన్నదే అగ్ని. 'అహం వైశ్వానరో భూత్వా ప్రాణినాం దేహమాశ్రితః – అందరి శరీరాల్లో వైశ్వానరుడనే అగ్నిరూపంలో ఉన్నాను' అని కృష్ణుడు భగవద్గీతలో చెబుతాడు. మనం రోజూ భోజనం చేసేటప్పుడు ప్రాణాయస్వాహా, అపానాయస్వాహా అంటూ ప్రాణానికి వేసే ఆహుతులే వైశ్వానరుడనే అగ్నికి వేసే ఆహుతులు. ప్రాణం యొక్క మరో రూపమే అగ్ని. ఈ విధంగా ఆహుతి రూపంలో వేయడం అగ్నిష్టోమ యాగంలాంటిదని పెద్దలు చెబుతారు.

యాజ్ఞవల్క్యుడు చెప్పిన ఒకటిన్నర దేవతలు ఎవరు అంటే జగత్తు అంతటినీ తనలో ఉంచుకున్న వాయువు ఒక్కడే. జగత్తంతా అతనిలోనే వృద్ధిపొందుతూ ఉంది. చివరగా ఒక్కదేవుడు ఎవరు అంటే అదే ప్రాణము లేదా హిరణ్యగర్భుడు అని యాజ్ఞవల్క్యుడంటాడు. ఆ ప్రాణశక్తి ఒక్కటే రకరకాల పేర్లతో, వివిధ కర్మలతో, గుణాలతో, శక్తిభేదాలతో అనేక రూపాలు పొంది మూడు రకాలుగా, 33 రకాలుగా, 3306 రకాలుగా ప్రకటితమవుతూ ఉంటుంది.

ఇందులో ప్రకృతికి సంబంధించిన శక్తులు వసువులు, శరీరానికి సంబంధించినవి రుద్రులు, కాలానికి సంబంధించినవి ఆదిత్యులు.

అలాగే ముక్కోటి దేవతలు అన్నప్పుడు మూడు తరగతులుగా ప్రకటితమవుతున్న జీవశక్తి అని అర్థం. ఇవే భూమికి సంబంధించినవి, అంతరిక్షానికి సంబంధించిన, ద్యులోకానికి సంబంధించిన జీవశక్తులు.

మనం ఈనాడు దేవతలుగా పూజించే రాముడు, కృష్ణుడు, ఆంజనేయుడు మొదలైన వారంతా అనేక అవతార స్వరూపాలు. ధర్మం క్షీణిస్తున్నప్పుడు, అధర్మం పెరుగుతున్నప్పుడు ధర్మ సంస్థాపనకై జరిగే ప్రక్రియే అవతారం. వేదంలో పైన చెప్పిన దేవుళ్ళకు అర్థం వేరు, అవతార స్వరూపాలు వేరు.

ఉపనిషత్తులో ఆ తర్వాత జరిగే సంభాషణ గమనిస్తే విశ్వంలో ఉన్న జీవశక్తి అంతా కేవలం హిరణ్యగర్భుడు మాత్రమే అని తెలియడమే కాక ఈ విశ్వమనేదే సత్యం, జ్ఞానం, అనంతం, అనబడే శుద్ధచైతన్యంలో కనిపించే ఒకానొక దృశ్యం మాత్రమే అంటూ యాజ్ఞవల్క్యుని ప్రతిపాదన నడుస్తుంది. ఇది శుద్ధవేదాంత చర్చ, ప్రస్తుతం అనవసరం కావున దేవుళ్ళ గూర్చి చర్చ ఇక్కడితో ముగిద్దాం. 'ఏకం సత్ విప్రాః బహుధా వదన్తి' – ఉన్నది ఒకటే, పండితులు అనేక విధాలుగా వివరిస్తారు' అనే మాటలకు పై చర్చయే వ్యాఖ్యానం. ❖

తల్లికి నలుగురైదుగురు పిల్లలున్నారనుకోండి. ఎవరికే ఆహారం సరిపోతుందో వారికి ఆ ఆహారం వండి పెడుతుంది. అలాగే వివిధ సాధకులకు అనువుగా భగవంతుడు వివిధరూపాలను ధరిస్తాడు. -శ్రీరామకృష్ణులు

జ్ఞానమార్గంలో... ఓ సాధకుని ప్రస్థానం



– దీపంకర్ భౌమిక్

మానవుడు ఒకానొక పదార్థముతో రూపొందినవాడు కాదనీ, విశ్వచైతన్యంలోని సూక్ష్మభాగమనీ గుర్తించగలగడమే జ్ఞానయోగ మార్గానికి నాంది పలకడము. జీవాత్మ, పరమాత్మల మధ్య ఐక్యతను తెలిపి, ఏకత్వాన్ని నిర్ణయించడమే ఈ యోగం యొక్క ముఖ్య ఉద్దేశ్యము.

'రేజర్స్ ఎడ్జ్' నవలలో ప్రముఖ సాహితీవేత్త విలియమ్ – సోమర్‌సెట్ మామ్ ఈ పై సిద్ధాంతాన్ని వ్యక్తపరిచే విధంగా తన రచనను తీసుకువచ్చాడు. అసలు ఈ నవలకి పేరుని, కఠోపనిషత్‌లోని *'క్షురస్యధార నిశితా దురత్యయా దుర్గం పథస్తత్ కవయో వదంతి'* అనే ఈ శ్లోకం నుండి స్వీకరించబడింది. ఈ శ్లోకంలో 'జ్ఞానమార్గము పదునుగల కత్తి అంచు (రేజర్స్ ఎడ్జ్) వలె ఉంటుంద'ని తెలియజేయబడినది.

ఈ నవలలో ముఖ్య భూమికను పోషించిన నాయకునికి తోడుగా ఒక చిన్న పాత్రలో తనను తానే రూపకల్పన చేసుకున్నాడు ఆ రచయిత. ఇందులోని కథా నాయకుడు అమెరికాలోని చికాగో ప్రాంతవాసి అయిన 'లేరీ డారెల్' అనే యువకుడు. అతను మొదటి ప్రపంచ యుద్ధ సమయమున ఉత్సాహంతో యుద్ధవిమానాన్ని నడిపేవాడు. ఆ సమయమున తనకు అత్యంత ఆప్తుడైన స్నేహితుని మరణాన్ని చూసి క్రుంగిపోయాడు. జీవితం క్షణభంగురమనే సత్యాన్ని గ్రహించాడు. 14వ శతాబ్దానికి చెందిన, బెల్జియమ్ మతవాది అయిన జాన్ ఆదర్శాలను అనుసరిస్తూ, సత్యాన్వేషణ మొదలుపెట్టాడు. అతని చుట్టూ ఉన్నవారు అతనిని ఎగతాళి చేసినప్పుడు 'నా ఈ ప్రయత్నంలో ఓడిపోతే దివాలా తీసిన వ్యాపారస్తుని మించిన నష్టం నాకు కలుగదు, కానీ నేను గెలిస్తే అంతులేని ఆనందమును కనుగొన్నవాడినవుతాను' అని దృఢనిశ్చయంతో వారికి సమాధానం ఇచ్చాడు.

ఆ ప్రయత్నాలలో భాగంగా ముందుగా చికాగో నుండి పారిస్‌కు వెళ్ళి సైకాలజీ మరియు గ్రీకు, లాటిన్ వంటి భాషలను అధ్యయనం చేశాడు. రెండేళ్ళ ఈ కాలంలో అతను ఒక ఫ్రెంచి బొగ్గుగనిలోనూ, జర్మన్ వ్యవసాయక్షేత్రములోనూ పని చేశాడు. అక్కడ ఒక స్నేహితుని వలన రెండు ముఖ్యమైన విషయాలను తెలుసుకున్నాడు : ఒకటి – ప్రపంచము నిత్యము, శాశ్వతము అయిన ప్రకృతి నుండి తన ఉనికిని స్పష్టపరుచుకుంది; రెండవది – మంచి, చెడు అనేవి నాణేనికి గల బొమ్మ, బొరుసు లాంటివనీ, అవి చూసే దృక్పథాన్ని బట్టి ఉంటాయి. శ్రీరామకృష్ణులు విద్యామాయ, అవిద్యామాయ అని వీటినే ప్రస్తావించేవారు.

సత్యాన్వేషణలో అతడికి సరైన సమాధానాలు లభ్యం కాక, ఓడ మీద భారతదేశానికి వచ్చాడు. ముందుగా ముంబై చేరుకుని, అక్కడ గల 'ఎలిఫెంటా గుహ'లను సందర్శించాడు. శ్రీరామకృష్ణ మఠానికి చెందిన ఒక సన్న్యాసిని కలిసినప్పుడు ఆయన 'సృష్టి విధాత బ్రహ్మ, పరిరక్షకుడు మహావిష్ణువు, లయకారుడు శివుడు. నిత్యము, శాశ్వతము అయిన అనంతత్వానికీ, సచ్చిదానంద స్థితికీ త్రిమూర్తులు ప్రతిరూపాలు' అని అతడికి వివరించారు.

ఆ తరువాత అతను ముంబై నుండి కాశీపట్టణానికి చేరుకున్నాడు. తరువాత ఒక యోగి పరిచయంతో, ట్రావెన్‌కోర్‌లో పలు సంవత్సరాలు సాధనలో గడిపాడు. ఈ సమయంలో అతనిలోని ఆధ్యాత్మిక శక్తి జాగృతమైంది. పునర్జన్మ సిద్ధాంతమును గురుముఖతా తెలుసుకుంటాడు. శ్రీమద్భగవద్గీతలో తెలిపినట్లుగా 'అనిత్యం అసుఖం లోకమ్ – ప్రపంచము అనిత్యము, సుఖరహితమ'ని అర్థం చేసుకున్నాడు. ఆ సచ్చిదానందుని కనుగొనాలంటే సత్త్వ, రజ, తమో గుణములను దాటాలనీ, సాధనలో ఎన్నోశక్తులు కలగవచ్చనీ, వాటికి లొంగకుండా, మోహాన్ని విడనాడాలనీ అతనికి అర్థం అయింది. వాస్తవానికి నిర్గుణ నిరాకార స్థితిని పొందడమే ఈ జ్ఞానమార్గం యొక్క అంతిమ లక్ష్యమని గుర్తించాడు.

రచయిత ఈ సాధకుని జీవన విధానాన్నీ, అతని స్నేహితుల, బంధువుల భోగలాలస జీవన విధానంతో ఈ నవలలో పోల్చి చూపాడు. ఈ సాధకుడు చివరకు తన స్వదేశానికి వెళ్ళి, తన అనుభవాలతో కాలం గడుపుతున్నట్లుగా నవలను ముగిస్తాడు. ఈ అంశాలతో రెండు సార్లు చలన చిత్రములను తీశారు.

జ్ఞానయోగ మార్గం అన్ని మార్గముల కన్నా కష్టతరమైనదని, విజ్ఞులు దీనిని ఏ ఆధారము లేకుండా నిట్టనిలువుగా ఉండే గోడను ఎక్కడంతో పోల్చారు. అయితే వారివారి వ్యక్తిత్వానికి అనుగుణంగా ఉన్న మార్గాన్ని ఎంచుకుంటూ, ఈ పథంలో కూడా మరెంతోమంది ఆలోచనాపరులు, పండితులు, సాధకులు నడవాలని ఆశిద్దాం. ❖ తెలుగుసేత : డాక్టర్ అపర్ణా శ్రీనివాస్

కర్తవ్యనిర్వహణే ఆరాధన!

ధీరవాణి

– స్వామి వివేకానంద

పదిమంది కలిసి చేయాల్సిన పనులన్నీ – ఉద్యమాలన్నీ – భారతదేశంలో అడుగంటుతున్నాయి. కారణం ఏమిటి? ఖచ్చితమైన వ్యవహార లక్షణాలను మనం ఇంకా అలవరచుకోలేదు. 'ఎక్కడైనా బావేగానీ, వంగతోటలో బావకాదు' అన్నట్లుగా వ్యవహరించాలి. వ్యవహారం, వ్యవహారమేగాని అందులో మొహమాటం పనికిరాదు. అప్పగించిన పైకానికి, ఎవరైనాసరే, నిర్దుష్టంగా జమాఖర్చులు రాయాలి. ఒక పనికై ఉద్దేశించిన పైకాన్ని మరో పనికి వినియోగించరాదు. ఆ పని ఎలాంటిదైనాసరే – మరుక్షణంలో తాను పస్తుండి చావాల్సి వచ్చినాసరే – ఖర్చు పెట్టకూడదు. ఇదీ వ్యవహారంలో ఉన్న నీతి.

నా దృష్టిపథంలో, ఒక భావాన్ని పగటి వెలుగుగా, చూస్తున్నాను. దుఃఖానికి మూలకారణం అజ్ఞానమే... మహాధీరులు, మహావీరులు ఉత్తమోత్తములైనవారు 'బహుజనహితానికి, బహుజన సుఖానికి' స్వార్థాన్ని త్యాగం చెయ్యాల్సి ఉంది. నిరంతర ప్రేమ, సానుభూతి గల బుద్ధభగవానులు వందల కొద్దీ ఆవశ్యకమైవున్నారు.

ఓ పరమేశ్వరా! నా మొర ఆలకింపవా! ఉత్తమోత్తములు, విద్యావంతులు ఐన యువకులు కనీసం ఒక వందమంది అయినా, ఉజ్జ్వల దీక్షాదక్షులై, సత్యమనే యుద్ధంలో పోరాడడానికి సంసిద్ధులైతే భారతదేశం మేల్కొంటుంది.

నాయనా! నాకు కావలసింది ఇనుప కండలు, ఉక్కు నరాలు, దాని లోపల వజ్రాయుధంతో తయారైన మనస్సు, బలం, పౌరుషం, క్షాత్రవీర్యం, బ్రహ్మతేజం.


లోకంలోని మతాలన్నీ పరిహాసాస్పదాలై ఉన్నాయి. లోకానికి కావలసింది మంచి నడవడి (శీలం). ఎవరి జీవితం ఉజ్జ్వల ప్రేమయుతమై, నిస్వార్థమైవుంటుందో, అలాంటివారే లోకానికి ఆవశ్యకమై ఉన్నారు. అలాంటి ప్రేమతో కూడిన ప్రతిమాటా పిడుగుపాటవుతుంది.

నువ్వు ఏ పని చేపట్టినా దాన్ని చేస్తున్నంతవరకు అది నీకు ఆరాధన కావాలి. ఇప్పుడు నువ్వు చేస్తున్న పనియే నీకు ఆరాధ్యదైవం అవ్వాలి. అప్పుడు నీకు విజయం చేకూరుతుంది.

ధైర్యోత్సాహాలతో పని ప్రారంభించండి... నేను మీకు అండగా ఉన్నాను. నేను పోయాక నా అంతరాత్మ మీ వెంటవుండి పని చేస్తుంది... ముందంజ వెయ్యండి. ❖



ప్రతి కర్తవ్యమూ పవిత్రమైనదే. శ్రద్ధాభక్తులతో కూడిన కర్తవ్యనిర్వహణ పరమోత్కృష్టమైన భగవదారాధన. ఒక పని చేస్తున్నప్పుడు దానికి మించి వేరే దేని గురించీ ఆలోచించవద్దు. -స్వామి వివేకానంద



విశ్వచేతన ఝంఝా

అమెరికాలోని చికాగో మహానగరములో విశ్వమత మహాసభల్లో 1893 సెప్టెంబర్ 11న 'Sisters and Brothers of America! 'అమెరికా సోదరీ సోదరులారా!' అంటూ విశ్వప్రేమతో, విశ్వసౌహార్ద్ర సౌభ్రాతృత్వ భావనతో విశ్వమంతటా వినిపించిన వివేకానంద శంఖారావం 'ఇంతింతై వటుడింతై' అన్నట్లు విశ్వమానవ చైతన్యమును జాగృతం చేసింది.

భారతజాతి ఘోరతమస్సును, సోమరితనమును, పిరికితనమును తుత్తునియలు చేసేందుకు 1894 సెప్టెంబర్ 25వ తేదీన న్యూయార్క్ నుండి కలకత్తాలోని తన సోదర శిష్యులకు వ్రాసిన విద్యుల్లేఖలో వెలుగొందిన విస్ఫులింగం ఈ శ్లోకం...

కిం నామ రోదిషి సఖే త్వయి సర్వశక్తిః
ఆమంత్రయస్వ భగవన్ భగదం స్వరూపమ్ ।
త్రైలోక్య మేతదఖిలం తవపాదమూలే
ఆత్మైవ హి ప్రభవతే న జడః కదాచిత్ ॥

"మిత్రమా! ఏల ఏడుస్తున్నావు? సమస్త శక్తులు నీలోనే ఉన్నాయి. ఓ భగవత్ స్వరూపుడా! లే! సర్వశక్తిమయం, ఆనందమయం అయిన నీ స్వస్వరూపమును సంస్మరింపుము. ముల్లోకములూ (విశ్వమంతయూ) నీ పాదాల చెంతనే పడియున్నది. నీ ఆత్మయే సదా సర్వత్రా ప్రభవిల్లుచున్నది. జడమెన్నటికీ జయింపదు".

మనమంతా ఏడుస్తూనే పుడతాం. బహుశా మన సచ్చిదానంద స్థితిని విడిచిపెట్టి ఈ శరీరంలో బందీ అయిపోయామనే దుఃఖంతో ఏడుస్తామేమో! ఆ తరువాత తల్లిపాల కోసం ఏడుస్తాం; తరువాత తండ్రి పాలన కోసం ఏడుస్తాం; తరువాత ఆట బొమ్మల కోసం ఏడుస్తాం; ఆపై నాన్న కొట్టాడని ఏడుస్తాం; ఆ పై టీచరు తిట్టిందని ఏడుస్తాం; పరీక్షలలో ఫస్ట్ ర్యాంక్ రాలేదని ఏడుస్తాం; ఆ తర్వాత అమ్మా, నాన్నలు మనం అడిగినది ఇవ్వలేదని ఏడుస్తాం; ఆ తరువాత ఉద్యోగం రాలేదని ఏడుస్తాం; ఉద్యోగం వచ్చిన తరువాత జీతం ఎక్కువ కాలేదని ఏడుస్తాం; జీతం పెరిగిన తరువాత పదోన్నతి రాలేదని ఏడుస్తాం.... ఇలా కలకాలం ఏడుస్తూనే బ్రతకాలా? ఈ ఏడుపు గొట్టు జీవితం జీవించడానికే మనం పుట్టామా? మనలాంటి వారినే స్వామీజీ సింహగంభీర వాణితో పట్టికుదుపుతున్నారు, మన సోమరితనం, పిరికితనం, ఏడుపుగొట్టు తనం నుండి తట్టి 'కిం నామ రోదిషి సఖే త్వయి సర్వ శక్తిః – What makes you weep, my friend? All power is within you... Stand up oh mighty one,.... ఎందుకు ఏడుస్తున్నావు మిత్రమా? సమస్త శక్తీ నీలోనే ఉంది. ఓ ధీరుడా! లేచి నిలబడు! శక్తిశాలివి కమ్ము!' అంటూ గర్జిస్తూ తట్టిలేపుతున్నారు, మన దౌర్బల్యపు దుమ్ముదులుపుతున్నారు.

అదిగో, అల్లదిగో ఆ వివేక సింహనాదము... "ఇది లేదు, అది లేదు – ఇలాంటి నకారాత్మక, బలహీనపు ఆలోచనలతో, మితిమీరిన సోమరితనంతో యావద్దేశమూ నాశనమైపోతోంది! సకారాత్మక ఆలోచనల్నే పెంపొందించుకో! ప్రతి ఒక్క జీవిలోనూ అనంతమైన శక్తి, ప్రతిభ నిక్షిప్తమై ఉన్నాయి, ఎవరిని మీరు బలహీనులు, శక్తిహీనులు

అంటున్నారు? 'శివోహం, శివోహం – నేను శివుడను, శివ స్వరూపుడను'.... 'నాకు రాదు, నాకు చేతకాదు' – ఇలాంటి నకారాత్మక ఆలోచనలను వింటే నా తలపై పిడుగుపడినట్లుగా బాధపడతాను".

నిత్యజీవితంలో అనేక సమస్యలు, సవాళ్ళు ఎదురైనప్పుడు, నిరాశా, నిస్పృహ మేఘాలు ఆవరించినప్పుడు పెద్దలు, విద్యార్థినీ విద్యార్థులు, యువతీ యువకులు అందరూ ఈ వివేకానంద విద్యుత్ ఝంకార విస్ఫులింగాలను స్పర్శింతురుగాక! ఈ వివేక అగ్నిమంత్రాలతో దీక్షితులై, వివేకానంద ఝంఝూమారుతంతో పునీతులగుదురుగాక! – "నిర్గచ్ఛతి జగజ్జాలాత్ పింజరాదివ కేసరీ – He frees himself from the meshes of this world as a lion from its cage! - ధీరుడైనవాడు ఈ జగత్ జాలము (మాయాజాలము) అనే బోను నుండి బయటకు ఉరికే (వేదాంత) సింహములాగా, భవబంధాలను ఛేదించుకుని స్వతంత్రుడవుతాడు; ముక్తుడవుతాడు.

'నాఽయమాత్మా బలహీనేన లభ్యః – 'ఈ ఆత్మ బలహీనులకు లభ్యముకాదు.' "Hurl yourselves on the

మారుతం

– స్వామి అర్చనానంద

world like an avalanche - Let the world crack in twain under your weight! Hara! Hara! Mahadeva! What fear! whom to fear!.... – మహోన్నత హిమాలయ పర్వతములా ఈ ప్రపంచంపై విరుచుకుపడు! నీ ఆత్మశక్తితో, శీలబలంతో ఈ ప్రపంచం బీటలువారుగాక! తుత్తునియలైపోవుగాక! హర, హర! మహాదేవ! ఏమి భయం? ఎవరివల్ల భయం?" విశ్వమంతటా విరాజిల్లుచున్నది నీవొక్కడివే, నీ ఆత్మ ఒక్కటే! నిన్ను నీవు ఈ మనోదౌర్బల్యము, పిరికితనము నుండి జాగృతం చేసుకో! లే, మేలుకో!

కుర్మస్తారక చర్వణం త్రిభువనం ఉత్పాటయామో బలాత్।
కింభో న విజానాసి అస్మాన్ రామకృష్ణ దాసావయం ॥

We shall crush the stars to Atoms and unhinge the universe! Don't you know who we are? we are the servants of Sri Ramakrishna! – తారలను పిండి చేసేస్తాం, ముల్లోకాలనూ పెల్లగించివేస్తాం! మన మెవరమో మీకు తెలియదా? మనం శ్రీరామకృష్ణ దాసులం!"

మాయా మలినములను ఊడ్చిపారవేయుగాక! – "Each of us in the heir apparent to the Emperor of Emperors. We are the substance of God Himself – మనం అల్పులం కాము. మనలో ప్రతి ఒక్కరమూ చక్రవర్తులకే చక్రవర్తి అయిన వారి వారసులం. మనం సాక్షాత్ భగవంతుని స్వరూపమే అయి ఉన్నాము".

'We have wept long enough, no more weeping; but stand on your own feet and be men! - చాలా కాలం మనం రోదించాం! ఏడుపులింకచాలు! లేచి మీ కాళ్ళ మీద మీరు నిలబడి మనుష్యులు కండి! ధీరులుకండి!'.

"Arise, Awake, awake from this hypnotism of weakness. None is really weak. The soul is infinite, omnipotent, omniscient. Stand up, assert yourself. Proclaim the God within you, do not deny Him! - లే మేలుకో! ఈ దుర్బలత్వమనే మైకము, సమ్మోహనం నుండి మేలుకో! మేలుకో! నిజానికి ప్రపంచంలో ఎవ్వరూ దుర్బలులుకారు. ఆత్మ అనంతము, సర్వశక్తిమంతము, సర్వజ్ఞము అయినది. కాబట్టి లెమ్ము! నీ ఆత్మశక్తిని ప్రకటించుము! నీలో ఉన్న భగవంతుని చాటుము! అతనిని ఎన్నడునూ తిరస్కరింపకుము!"

విశ్వరూప వివేకానంద ఝంఝూమారుతం మన జన్మజన్మల అజ్ఞాన, అవిద్య, అలసత్వ, అంధకారాలను, వేళ్ళూనుకున్న జడత్వపు తమస్సును, కువాసనా కుసంస్కారాలను, అహంకారపు అడ్డుగోడలనూ సమూలముగా పెకిలించి పారవేయుగాక!

సంసార మాయా మోహములు మన మనస్సులను చంచలం చేయునప్పుడు; దుర్బల క్షణాలు మన అంతరంగమును కల్లోలం చేయునప్పుడు; నిరాశ నిశీథిలో జవజీవాలు కోల్పోతున్నప్పుడు; తుచ్ఛ భోగాకర్షణలు మన మనస్సును తల్లడిల్లజేస్తున్నప్పుడు; బంధుబాంధవుల బంధనాలలో చిక్కుకుని మన అంతరాత్మ స్వేచ్ఛా విహంగమై ఎగరాలని తహతహలాడుతున్నప్పుడు – మనమంతా ఈ విశ్వమానవాంతరంగ స్ఫూర్తిదాత, శక్తిప్రదాత వివేకానంద విద్యుత్ ఝంకార విస్ఫులింగాలను స్పృశించి, స్మరించి, తరింతుము గాక! ❖

విశ్వమత మహాసభల్లో స్వామి వివేకానందే అగ్రగణ్యుడు. ఆయన ప్రసంగం విన్న తరువాత జ్ఞాననిధి అయిన భారతదేశానికి మన మతప్రచారకుల్ని పంపించడం ఎంత అవివేకమో అర్థమైంది. -న్యూయార్క్ హెరాల్డ్

ఈ మధువును గ్రోలుదాం!

– స్వామి శితికంఠానంద

దేవదానవుల మధ్య తీవ్ర యుద్ధాలు జరుగుతున్న రోజులవి. దేవతలు ఎంతో కష్టపడి దానవులపై విజయం సాధించినా ఆ ఆనందం ఎక్కువ కాలం నిలిచేది కాదు. దానవ గురువు శుక్రాచార్యుడు అసురులను మృతసంజీవని విద్యను ప్రయోగించి బ్రతికించేవాడు. ఈ కారణంచేత దేవతల సంఖ్య క్రమేణా తగ్గుతూ వస్తున్నది. 'ఇది ఇలాగే కొనసాగితే మనం అంతరించిపోతాం, ఏదైనా మార్గాన్ని అనుసరించి మనల్ని మనం రక్షించుకోవాలి,' అని దేవతలందరూ భావించారు. దేవగురువైన బృహస్పతి కుమారుడు కచుడిని శుక్రాచార్యుడి దగ్గరకు పంపాలని నిశ్చయించారు. అతడు రాక్షస గురువు వద్ద మృతసంజీవని విద్యను నేర్చుకుని వచ్చి యుద్ధంలో చనిపోయిన దేవతలను తిరిగి బ్రతికిస్తుండాలి. ఆనాటి గురువులలో వివక్షత లేదు. దేవతల ప్రతినిధిగా వచ్చినప్పటికీ కచుడి వినయ విధేయతలు నచ్చి శుక్రాచార్యుడు కచుడిని శిష్యుడిగా స్వీకరించాడు. వినయ సంపదే విజ్ఞానార్జనకు మొదటి అర్హత అని చాటాడు. కచుడు గురుశుశ్రూష చేస్తున్నాడు. రోజులు గడుస్తున్నాయి. రాక్షసులు కచుడిని గమనిస్తున్నారు. అతడు దేవ గురువు కుమారుడని, తమ గురువు వద్ద మృతసంజీవని విద్యను నేర్చుకొని యుద్ధంలో దానవ సంహారాన్ని నిరాటంకంగా కొనసాగించటానికి దేవతలు వేసిన ఎత్తుగడ అని వారికి అర్థమయింది. ఒక రోజు కచుడు అడవిలో ఆలమందను మేపుతూ, ఒంటరిగా ఉన్నప్పుడు కచుడిని చంపి, శరీరాన్ని ఖండఖండాలుగా చేసి మృగాలకు ఆహారంగా వేశారు. శుక్రతనూజ దేవయానికి కచుడంటే మహాభిమానం. కూతురంటే శుక్రాచార్యుడికి వల్లమాలిన ప్రేమ. బ్రహ్మజ్ఞాని అయిన ఆ ఋషి మనసు కుమార్తె కారణంగానే లౌకిక ప్రపంచంలో నిలిచేది. ఆ రోజు ఆవులతో పాటు కచుడు రాలేదు. దేవయాని ప్రమాదాన్ని శంకించింది. తండ్రి దగ్గరికి వెళ్ళి కచుడు తిరిగి రాలేదని ఏడుస్తూ చెప్పింది. ఆత్మజ రోదించటం చూడలేని ఆ సంయమి వెంటనే దివ్యదృష్టితో జరిగిన విషయాన్ని గమనించాడు. మృతసంజీవని విద్యను ప్రయోగించాడు. కచుడు జంతువుల శరీరాలను చీల్చుకుంటూ బయటకు వచ్చాడు. ఇంకోసారి కచుడు దేవయానికి పూలను తీసుకురావటానికి అడవికి వెళ్ళినప్పుడు రాక్షసులు అదే అవకాశంగా కచుడిని చంపి, శరీరాన్ని కాల్చి ఆ బూడిదను సముద్రంలో కలిపారు. కచుడు ఆశ్రమానికి రాలేదని చూసి దేవయాని మళ్ళీ వెళ్ళి తండ్రి దగ్గర మొర పెట్టుకుంది. ఈసారి కూడా అసుర గురువు తన అద్భుత విద్యతో కచుడిని బ్రతికించాడు. దైత్యులు ఇక లాభం లేదనుకొని మరోసారి కచుడు ఏకాంతంగా ఉన్నప్పుడు అతడిని చంపి, ఆ శరీరాన్ని కాల్చి బూడిద చేసి, మద్యంలో కలిపి తమ గురువుతో తాగించారు. కచుడు కనపడకపోయేసరికి దేవయాని విచలిత మనస్కురాలైంది. కన్నీరు మున్నీరుగా ఏడుస్తూ కచుడిని బ్రతికించమని తండ్రిని వేడుకుంది. దేవయాని కచుడిని చూడనిదే అన్నపానీయాలు ముట్టనని భీష్మించింది. దైత్యగురువుకి ఇక తప్పలేదు. మళ్ళీ విద్యను ప్రయోగించి, 'నాయనా కచా! లేచి రా' అన్నాడు. 'గురువర్యా నేను మీ శరీరంలోనే ఉన్నాను' అని కచుడు బదులిచ్చాడు. శుక్రాచార్యుడికి దానవుల పన్నాగం అర్థమయింది. మహాతపశ్శాలి ఐన ఆయన సురాపానం వలన తాను మోసపోయినట్లు గ్రహించాడు. కచుడు బయటకు వస్తే తాను చనిపోవాల్సి ఉంటుంది. ఇక నిశాచర గురువుకి ప్రత్యామ్నాయం కనబడలేదు. కచుడికి మృతసంజీవని విద్యనుగ్రహించాడు. కచుడు గురువు శరీరాన్ని చీల్చుకొని బయటకు వచ్చి తరువాత తాను గ్రహించిన విద్య ద్వారా గురువుని బ్రతికించాడు. ఆచార్యుడి ఋణం తీర్చుకున్నాడు. ఆదర్శ శిష్యుడనిపించుకున్నాడు. అసురాచార్యుడు జరిగిన తంతునంతా విచారించి మద్యపానం ఎంత అనర్థానికి దారితీసిందో గ్రహించి అగ్రహోదగ్రుడయ్యాడు. భయంకర శాపాన్ని భవిష్యత్తు మద్యపాన ప్రియులపై ప్రయోగించాడు, 'ఎవరైతే జ్ఞాన విహీనులై సురాపానం చేస్తారో వారు ధర్మ భ్రష్టులవుతారు. వారిని అందరూ చీదరించుకుంటారు. ఈసడిస్తారు. ఈ నా ఆజ్ఞను పాటించనివాళ్ళు పతనమవుతారు' అన్నాడు శుక్రాచార్యుడు.

ఇది మహాభారతంలోని ఒక అద్భుత సన్నివేశం. ఈ గాథలో ఎన్నో ధర్మ సూక్ష్మాలు ఉన్నాయి. వాటిని ప్రక్కన పెట్టి మనం ఈ శాపం గురించి కొంచెం ఆలోచిస్తే బాగుంటుంది. ఈ మైరేయ పానం కూడా మనిషి పుట్టినప్పటినుండి ఉన్నదే. మద్యపానం వల్ల మనిషి విచక్షణను కోల్పోతాడు. గృహ హింస, దొంగతనాలు, అసత్యం, అనారోగ్యం, కుటుంబ ఆర్థిక పతనం.. మొదలుకొని ఎన్నో సామాజిక రుగ్మతలకు మద్యపానం ఆది అయి కూర్చుంది. ఫ్యాషన్ అని కొందరు, పెళ్ళని కొందరు, పార్టీ అని కొందరు, పండగని కొందరు జీవితాన్ని 'ఆస్వాదించడాని'కని కొందరు, ఆనందాన్ని పంచుకోవడానికని మరికొందరు... కారణమేమైతేనేమి నేటి భారత సమాజంలో ఈ దురలవాటు విశేషంగా ప్రబలుతున్నది. ప్రభుత్వాలే లక్ష్యాలు పెట్టి మద్యం అమ్మకాన్ని పెంచి ప్రజలను పెడత్రోవ పట్టిస్తున్నాయి. ఇలా వచ్చిన ధనంతో ప్రభుత్వ ఖజానాలు నిండిపోతున్నాయి. మద్యవిక్రయం ప్రభుత్వాలకు కాసుల పంటగా ప్రజలకు రోగాల మంటగా తయారైంది.

శుక్రాచార్యుడి వంటి ఋషికే ఈ అలవాటు ఉండేదంటే సామాన్యులు మధువును స్వీకరించటంలో ఆశ్చర్యమేమీ లేదు. కానీ ఎప్పుడైతే ఆ అలవాటు వలన జరిగిన అనర్థాన్ని గుర్తించాడో దానవ గురువు తన అలవాటును మానుకున్నాడు. అదే ఋషులకు సామాన్యులకు ఉండే తేడా! వారు సేవించారని మనం సేవించటం కాదు. అనర్థాన్ని గుర్తించిన వెంటనే తన అలవాటును మానుకునే సంకల్పశక్తి వారికుంటుంది. అందుకని మనం వారిని అనుకరించలేము. వారు దేనికీ బానిసలు కారు. వారు తమ స్వేచ్ఛను అలవాటుకు బానిసచేయరు. ఎప్పుడూ సర్వస్వతంత్రులుగా ఉంటారు. కానీ అలాంటి సంకల్పశక్తి లేని సాధారణ వ్యక్తులలో ఈ వ్యసనం ఒక కార్చిచ్చులా ప్రబలుతున్నది. మనసుతో వేగలేకపోవడం వలననే ఈ సాంఘిక దురాచారం రోజురోజుకీ ప్రబలుతున్నది. శీతలదేశాలలో చలిని తట్టుకోవడానికీ, శరీరంలో

ఉష్ణాన్ని నింపటానికీ వాళ్ళు ఒక మోతాదులో శీతకాలంలో రోజూ తాగుతారు. వారికి అది అవసరం. మనకు మాత్రం వ్యసనం. బహు సంక్లిష్టమైన మానవ జీవిత వ్యవహారంలో మనసుది అతి పెద్ద పాత్ర. మనసు ఇంటి దొంగలాంటిది. పట్టుకోవడం కష్టం. తనను గమనించ నివ్వదు. గమనిస్తే తన రహస్యం బయటపడి తన మనుగడకు ముప్పు ఏర్పడుతుందని కడు జాగరూకతతో మసలుకుంటుంది. గమనించడానికి పూనుకున్నవానిని భయపెట్టి ఆ ప్రయత్నం విరమించేటట్లు చేస్తుంది. తనను వ్యక్తి గమనించడం లేదని తెలుసుకున్న తరువాత మనిషిని ఒక గుర్రంగా గైకొని సవారీ చేస్తుంది. తాను వ్యక్తికి మిత్రుడననీ, అతి సన్నిహితుడననీ ఎప్పుడూ చాటింపు వేస్తూంటుంది. మనిషి నమ్మిన వెంటనే తన విశ్వరూపం చూపెడుతుంది. మనిషి 'తాను' 'మనసు' ఒకడే అనుకుంటాడు. శత్రువుని మిత్రుడని భావిస్తాడు. మనసు చేతికి బందీగా చిక్కిపోతాడు. ఇదిగో.. ఈ త్రాగుడు వ్యవహారంలో పూర్తిగా మునిగిపోయిన వారందరూ అలాంటి అభాగ్యులే. నిజానికి ఈ



మైరేయప్రియులలో ఎన్నో సులక్షణాలు ఉంటాయి. కానీ ఈ ఒక్క బలహీనత వల్ల అవన్నీ మసకబారిపోతుంటాయి. వీరే కాదు. ఇంకా రకరకాల మత్తుపదార్థాలకు, జూదం లాంటి వ్యసనాలకు బానిసలైనవారూ, అవుతున్నవారూ.. అందరూ ఇలా మనసు చేత తీవ్రంగా పీడింపబడుతున్నవారే. మనసును భరించలేక, మనసును మరచిపోవడానికి మనిషి ఈ మార్గాన్ని ఎంచుకుంటున్నాడు. కానీ అది సమస్యకు పరిష్కారం అవదు. మనసు చేత పీడింపబడని మనిషి ఉండడు. మనసు అంటేనే పిశాచం. మనమందరం మనోపిశాచంతో నిరంతరం సహవాసం చేస్తున్నాం. ఈ పిశాచం భగవద్భక్తితో గానీ మన అధీనంలోకి రాదు. శ్రీరామకృష్ణుల భక్తులలో కాళీపద ఘోష్ ఒక గృహస్థ భక్తుడు. మొదట చాలా పెద్ద తాగుబోతుగా ఉండేవాడు. ఒకరోజు శ్రీరామకృష్ణుల వారి దర్శనానికి వస్తాడు. శ్రీరామకృష్ణులు అప్పుడు 'పన్నెండు సంవత్సరాలు భార్యను యాతనలు పెట్టిన తర్వాత ఈ వ్యక్తి ఇక్కడకు వచ్చాడు' అంటారు. ఐనా సిగ్గువిడిచి కాళీపద ఘోష్, 'కాస్త మద్యం ఇస్తారా?' అని అడిగాడు. శ్రీరామకృష్ణులు చిన్నగా నవ్వి.. 'ఆ ఇస్తాను. ఐతే నేను ఇచ్చే మద్యం కల్పించే మత్తును నువ్వు భరించలేవు' అంటారు. ఆ మాటను మక్కీకి మక్కీ అర్థం చేసుకున్న కాళీపదుడు, 'అది బ్రిటన్‌లో తయారైన మధువా? గొంతు తడుపు కోవడానికి కాస్త ఇవ్వండి,' అంటాడు. మళ్ళీ నవ్వి శ్రీరామకృష్ణులు, 'ఇది విదేశీ వారుణి కాదు. పూర్తిగా స్వదేశీ మద్యం. కానీ అందరూ ఈ మధువును గ్రోలి తట్టుకోలేరు. కాబట్టి అందరికీ ఈ మద్యాన్ని ఇవ్వడం కుదరదు. ఒక్కసారి ఈ మద్యాన్ని చవిచూస్తే చాలు. మీ బ్రిటీష్ మద్యం బలాదూర్. ఆ మద్యానికి బదులు నేనిచ్చే మద్యం తాగడానికి నువ్వు సిద్ధమేనా?' కాళీపదుడు కాసేపు ఆలోచించి, 'యావజ్జీవితము నన్ను మత్తులో ముంచెత్తే ఆ మద్యాన్ని దయచేసి నా కివ్వండి' అంటాడు. కాళీనామం జపించమని, మధువు ముందు అన్నీ దిగదుడుపే అని చెప్పి కాళీపద ఘోష్‌ను ఒక మహాభక్తుడిగా తీర్చిదిద్దుతారు శ్రీరామకృష్ణులు. ఈ భగవన్నామ మధువును రుచి చూడలేకపోవటం వలననే మనిషి చవకబారు మద్యానికి అలవాటు పడుతున్నాడు.

ప్రహ్లాదుడు భాగవతంలో తండ్రితో **'మందార మకరంద మాధుర్యమున దేలు మధుపంబు పోవునే మదనములకు..** మందార పుష్పంలోని మకరంద మాధుర్యం అనుభవించే తుమ్మెద ఉమ్మెత్త పూలవైపుకి పోతుందా?' అంటాడు. భగవన్నామ మాధుర్యమును ఆస్వాదించ లేకపోవటం వలననే మన మనస్సనే తుమ్మెద మద్యమనే ఉమ్మెత్త పూవుపైకి పోవుచున్నది. కానీ ఈ మాధుర్యాన్ని గ్రోలాలంటే ఎంత ఆధ్యాత్మిక సంస్కారం కావాలి! శ్రీరామకృష్ణుల జీవితం పరిచయం అవడంతోనే ఆ ఆధ్యాత్మిక సంస్కారం వ్యక్తికి సమకూరుతుంది. అందుకే 'శ్రీరామకృష్ణుల జీవితం పరిచయం కాని వ్యక్తి జన్మ వ్యర్థం అంటారు' స్వామి వివేకానంద.

లౌకిక రాజ్యాంగం పేరుతో ఆధ్యాత్మికతకు పెన్నిధి ఐన భారతావనిలో కనీసం తద్వాసన కూడా తగలకుండా విద్యా విధానాన్ని రూపొందించుకున్నాం. ఇక జీవితం ఒత్తిడి, ఆందోళన, అశాంతి, అజ్ఞానం, అపోహల మయం కాక ఏమవుతుంది? మరి జనులు శాంతిమార్గం కానరాక తాత్కాలికోపశమనానికి ఇలాంటి మార్గాలను ఆశ్రయించక ఏం చేస్తారు? సమస్యకు పరిష్కారం కాని ఈ పద్ధతుల ద్వారా చిత్త మర్కటం మరింత చంచలం కాక ఏమవుతుంది? దాని చేష్టలకు అడ్డూ అదుపూ ఏముంటుంది? ప్రతినిమిషం మనిషిని ప్రమాదంలో పడవేస్తూనే ఉంటుంది. ఈ ప్రపంచమనే ప్రయోగశాలలో మనిషి చేయదగ్గ అతి పెద్ద ప్రయోగం తనను తాను చదువుకోవడమే. తనను తాను తెలుసుకోవడమే. తనను తాను తెలుసుకుంటే ప్రపంచాన్ని తెలుసుకున్నట్లే. అదే నిజమైన జ్ఞానం. మిగతాదంతా మిథ్య. శాంతిని, సంతృప్తిని అందిస్తే జ్ఞానం. తద్భిన్నమైనది అజ్ఞానం. మరి 'దయాస్వరూపుడైన ఆ శ్రీహరి అందరినీ సమగ్రజ్ఞానం వైపుకు నడిపించు గాక!' అని నిరంతరం ప్రార్థిస్తూ మధుపాన ప్రియులను మాధవ ప్రియులుగా మార్చటానికి మనవంతు ప్రయత్నం చేద్దామా? ❖

తెలిసిగానీ, తెలియకగానీ; స్ఫురణవుండిగానీ, స్ఫురణలేకగానీ; ఇష్టపూర్వకంగాగానీ, ఇతరుల ప్రేరణ చేతగానీ - ఏ విధంగానైనా భగవన్నామస్మరణ చేసేవాడు అమృతత్త్వాన్ని పొందుతాడు. - భగవాన్ శ్రీరామకృష్ణులు

అన్యోన్యతే అపురూపం

– శ్రీమతి సుధామూర్తి, ఇన్ఫోసిస్ ఫౌండేషన్

కొన్నేళ్ళ క్రితం బెంగుళూరులో నా విద్యార్థిని విజయ పెళ్ళికి హాజరయ్యాను. ఓ ప్రసిద్ధ కల్యాణ మండపంలో అంగరంగ వైభవంగా వివాహ వేడుకను ఏర్పాటు చేశారు. అక్కడ అతిథుల ఆహ్వానం మహోత్సవంలా ఉంది. ఎక్కడ చూసినా ఆడంబరమైన ఏర్పాట్లే! భోజన ఆతిథ్యం గురించి ఇక చెప్పనక్కర లేదు. వధూవరుల దుస్తుల, నగల ఖరీదు లక్షలను మించిపోయే ఉంటుంది. తన ఏకైక కుమార్తె కోసం విజయ వాళ్ళ నాన్న డబ్బును నీళ్ళలా ప్రవహింప చేశాడు; అందుకే ఆమెది యువరాణి కల్యాణం అని అందరూ అభివర్ణించారు. నూతన దంపతుల భవిష్యజీవితం అద్భుతంగా ఉండాలని అందరమూ శుభాకాంక్షలు తెలిపి వెనుతిరిగాం.

నా జ్ఞాపకాల పరదాల్లో విజయ వివాహం కనుమరుగై పోయింది. కొన్నాళ్ళకు నేను బెంగుళూరులోని ఓ ప్రసిద్ధ హోటల్లో వేడుకకు హాజరు కావాల్సి వచ్చింది. అక్కడ ఉత్సాహంగా, హడావిడిగా తిరుగుతున్న ఓ ముప్పై ఏళ్ళ యువకుడిని చూశాను. అతను నన్ను చూసి నవ్వుతూ తప్పక భోజనం చేసి వెళ్ళాల్సిందేనని పట్టుబట్టాడు. కానీ నేను అతనిని గుర్తుపట్టలేకపోతున్నాను. ఇంతలో అక్కడికి వచ్చిన విజయ నన్ను పలకరించింది. 'నువ్వు ఇక్కడున్నావేమిటి?' అని ఆశ్చర్యంగా అడిగాను. ఆ అమ్మాయి ఒక యువకుణ్ణి చూపిస్తూ 'అతను నా భర్త' అంది. ఆమె మాటల్లో ఉదాసీనత తప్ప ఆనందం, ఉత్సాహం మచ్చుకైనా లేవు.

విజయ సన్నగా పాలిపోయినట్లు ఉంది. ఆరోగ్యంగా లేదు; ఆమె ముఖంలో కళాకాంతులు లేవు. కళ్ళు ఉబ్బి ఉన్నాయి. నేనేమీ మాట్లాడకుండానే విజయ ఏడవడం మొదలుపెట్టింది. 'నీకు డబ్బుకు కొదువ లేదు. మంచి సంబంధాన్ని చూసి ఆడంబరంగా పెళ్ళి చేశారు. నీకు ఏం లోటు విజయ?' అని అడిగాను. 'మేడమ్! పెళ్ళైన అమ్మాయిలు, అబ్బాయిలు ఆనందంగా ఉండేందుకు కావాల్సింది డబ్బు, హోదా కాదు నమ్మకం, ఒకరినొకరు అర్థం చేసుకోవడం. ఖరీదైన కల్యాణ మంటపాల్లో, కన్నులపండువగా పెళ్ళిళ్ళు జరిపించినంత మాత్రాన ఆ దంపతులు సంతోషంగా ఉంటారనుకోవడం వట్టి భ్రమ!' అంటూ విజయ తన నిస్సహాయతను కన్నీళ్ళతో వ్యక్తం చేసింది. ఆ సందర్భంలో నేను దీర్ఘంగా నిట్టూర్చడం తప్ప ఏమీ చేయలేకపోయాను.

ముఖ్యంగా నాకు వివాహితులైన నా విద్యార్థుల నుంచి ఇలాంటి అనుభవాలతో కూడిన ఎన్నో ఉత్తరాలు వస్తూ ఉంటాయి. అన్నింటిలో నాకు కనిపించిన సారూప్యమైన సమస్య 'విశ్వాసరాహిత్యం'. ఒకరితో మరొకరు మనస్సు విప్పి మసలు కోకపోవడం! ప్రధానంగా దాపరికాలు, రహస్య వ్యవహారాలు వివాహబంధాన్ని బీటలు వారుస్తున్నాయి. వివాహమంటే అహాన్ని త్యాగం చేసుకొని, నమ్మకాన్ని నిలబెట్టుకోవడం అన్న ప్రాథమిక విషయాన్ని ఈతరం యువతీయువకులు విస్మరిస్తున్నారు. ఒకరికొకరు కట్టుబడి ఉండాలన్న విషయాన్నే మరచిపోతున్నారు. వారిలో కొంతమంది యువకులు, యువతులు తాత్కాలిక వ్యామోహాలతో, నమ్మకద్రోహాలతో చేతులారా కాపురాలను ఛిద్రం చేసుకుంటున్నారు.



ఈ ఆలోచనలతో, మా సేవాసంస్థ కార్యక్రమంలో ఓ మారుమూల గ్రామానికి వెళ్ళాల్సి వచ్చింది. ఆ పల్లెలో మర్రిచెట్టు కింద అక్కడి గ్రామీణులు నాతో తమ కష్టనష్టాలను ఏకరువు పెడుతూ ఉన్నారు. చిన్నగుడిసెలో జీవిస్తున్న కృష్ణయ్య, ఎల్లమ్మ అనే నిరుపేద కూలీ దంపతులను చూశాను. ఎల్లమ్మ అనారోగ్యంతో బాధపడుతోంది; భర్త ఆమెకు సేవలు చేస్తున్నాడు. ఇద్దరూ ఎంతో ఆప్యాయంగా మాట్లాడుకుంటూ ఉన్నారు. 'మీరు ఇంత ఒద్దికగా ఎలా ఉండగలుగుతున్నారు?' అని ప్రశ్నించాను. అప్పుడు ఎల్లమ్మ 'మేము ఒకరికి ఒకరమే కదమ్మా! ఏ పని చేసినా ఇద్దరమూ కలిసి చేస్తాం; మా ఇద్దరి మధ్య ఏ దాపరికాలూ లేవు. ఒకరంటే మరొకరికి ఎంతో నమ్మకముంది' అంది. రోజూ కూలీ చేసుకునే పేద దంపతుల్లో ఉన్న సఖ్యత, లక్షల ఖర్చుతో మూడుముళ్ళ బంధంతో ఒక్కటవుతున్న విద్యావంతులు, శ్రీమంతులు అయిన జంటల్లో ఎందుకు కొరవడుతుందో అర్థం కావడం లేదు! ❖ సేకరణ: జి. సతీష్



- స్వామి పరిజ్ఞేయానంద

మనస్సు మన మాట వినాలంటే...

సి. హెచ్. సంతోష్ కుమార్, నల్లగొండ

ప్రశ్న: ఈ సాంకేతిక యుగంలో ఎంత జాగ్రత్తగా ఉన్నా, ఏదోవిధంగా చెడు విషయాలను వినడం, చెడు దృశ్యాలను చూడడం తటస్థిస్తోంది. అందువల్ల మనస్సును నియంత్రించడం అసాధ్యమవుతుంది; ఇక ఈ జీవితం వ్యర్థమనే భావన నాలో కలుగుతోంది. ఈ సమస్యకు పరిష్కారం తెలపండి.

జవాబు: సత్యయుగమైనా, సాంకేతిక యుగమైనా మనస్సును నియంత్రించడమనేది మనిషికి ఓ సాహస కృత్యమే! నిజమైన పరాక్రమవంతులు ఎవరంటే మహాసామ్రాజ్యాలను జయించిన అశోకుడు, అలెగ్జాండర్ లాంటివారు కాదు. మనోరాజ్యాన్ని జయించిన భగవాన్ బుద్ధుడు, స్వామి వివేకానంద లాంటి మహాత్ములే మహావీరులు, మహాధీరులు. అందుకే భగవాన్ బుద్ధుడు "If one man conquers in battle a thousand men a thousand times, and if another conquers himself, he is the greater conqueror - రణరంగంలో వెయ్యి మందిని వెయ్యిసార్లు ఓడించిన వీరుని కన్నా తన మనస్సును తాను జయించినవాడే మహావీరుడు" అని అంటాడు.

విష్ణుచక్రం దుర్వాసమహర్షిని వెంటాడినట్లు, మనోనిగ్రహం అనే ఈ సమస్య మనిషిని వెంటాడుతూనే ఉంది. మరి, ఈ సమస్యకు పరిష్కారమేమిటి? విష్ణుచక్రం బారి నుండి తప్పించుకోవడానికి దుర్వాసమహర్షి, విష్ణుమూర్తిని శరణువేడితే 'నువ్వు ఎవరినైతే శపించావో అతడినే (అంబరీషుడు) ఆశ్రయించు' అని చెప్పాడు. అదేవిధంగా, చంచలమైన మనస్సును నియంత్రించడానికి ఏ మానవజన్మ వ్యర్థమని మీరు భావిస్తున్నారో ఆ మానవజన్మ ఆధారంతోనే సమస్యను పరిష్కరించుకోవాలి. అంతేగానీ, మీ మనస్సును వేరెవరోవచ్చి నియంత్రించలేరు.

శ్రీకృష్ణుని ప్రియసఖుడైన అర్జునుడు కూడా మనస్సును నియంత్రించడం అత్యంత దుష్కరంగా తోస్తుందని విచారం వ్యక్తం చేసినప్పుడు, శ్రీకృష్ణుడు మంత్రతంత్రాలతో అర్జునుడి మనస్సును నియంత్రించలేదు. 'అర్జునా! నిజమే, మనస్సును నియంత్రించడం చాలా కష్టమైనది' అని అంగీకరిస్తూ 'మనస్సును అభ్యాస, వైరాగ్యాలతో నియంత్రించవచ్చు' అని సలహా ఇచ్చాడు. అంటే నీ మనస్సును నువ్వే నిగ్రహించడానికి ప్రయత్నించాలని శ్రీకృష్ణుడు, అర్జునుడి ద్వారా మనందరికీ బోధించాడు.

'అభ్యాసం' ప్రాధాన్యాన్ని వివరించే ఓ చిన్న కథను తెలుసుకుందాం : ఒకసారి ఓ మహారాజు తన రాజ్యంలోని పశుకాపరుల తెలివితేటల్ని పరీక్షించదలచాడు. రాజభవనానికి వారందరినీ పిలిపించి, భటులను ఒక్కొక్కరికి ఒక్కొక్క మేకను ఇమ్మని ఆజ్ఞాపించాడు. ఆ మేకల్ని బలిష్ఠంగా పెంచినవారికి పదివేల రూపాయలు బహుమానం ఇస్తానని ప్రకటించాడు. అయితే, 'ఇక్కడకు వచ్చిన తరువాత మేకలు ఆకులను తిన కూడదు' అని షరతు విధించాడు. 'మేకలు కడుపునిండా ఆకుల్ని తింటే, వాటికి ముఖంమొత్తి వాటి జోలికి వెళ్ళవు'అని గ్రామస్తులు అనుకొన్నారు. అందువల్ల మేకలకు మేత బాగా పెట్టి పశుకాపరులందరూ తమ మేకల్ని తోలుకుంటూ రాజాస్థానానికి చేరుకున్నారు. అప్పుడు రాజు అక్కడ ఆకుల కుప్పను వేయించాడు. ఆ ఆకులను చూసిన వెంటనే మేకలు పరుగెత్తుకుంటూ వెళ్ళి ఆకులను మేయనారంభించాయి. కానీ ఒకే ఒక్క మేక మాత్రం అలాగే నిలబడి ఉంది. అప్పుడు రాజు 'ఆకుల్ని చూడగానే తినడానికి పరుగెత్తడం మేకల స్వభావం. అలాంటిది నీ మేక ఆకులు తినకుండా ఎలా ఉండ గలిగింది?' అని పశువుల కాపరిని అడిగాడు. అందుకు అతడు "రాజా! మేక ముందు రోజూ ఆకుల కుప్ప వేసి అది



తినడానికి నోరు తెరవగానే, దాని మూతి మీద కర్రతో ఒక దెబ్బ వేసేవాడిని. అలా ప్రతీరోజు చేయడం వల్ల అది దెబ్బలకు బయపడి ఆకులను తినడం మానేసింది" అని చెప్పాడు. మహారాజు ఆ పశువులకాపరి తెలివికి సంతోషించి పదివేల రూపాయలిచ్చి సత్కరించాడు.

మేక ఆకులను తినకుండా కర్రతో కొట్టిన రైతులా, మన మనస్సనే మేక ఆకులనే చెడు ఆలోచనలవైపు పోతుంటే, బుద్ధి అనే కర్రతో భయపెట్టాలి. అలా కొద్దికాలం అభ్యాసం చేస్తే మనస్సును నియంత్రించవచ్చు.

సత్యయుగమైనా, సాంకేతిక యుగమైనా 'అభ్యాసమే' ఈ సమస్యకు పరిష్కారం. పూర్వం ఋషులు సైతం మనోనియంత్రణకు ఎన్నో ఏళ్ళు అభ్యాసం చేసేవారు. అలాంటప్పుడు ఈ ఆకర్షణల యుగంలో ఉంటూ కొద్ది రోజుల్లోనే మనోనియంత్రణ సాధించాలనుకోవడం అత్యాశే కదా! అందుకే ఓర్పుతో, పట్టుదలతో, విశ్వాసంతో నిరంతరం అభ్యాసం చేసినట్లయితే తప్పక మనోనియంత్రణ సాధ్యమవుతుంది. అప్పుడు ఈ కథలోని మహారాజు, పశుకాపరి తెలివితేటలకు మెచ్చి బహుమానం ఇచ్చినట్లు, భగవంతుడు మన కృషికి, శ్రద్ధకు మెచ్చి జీవిత లక్ష్యాన్ని సాధించేలా ఆశీర్వదిస్తాడు. ❖

దురభ్యాసాలను, మంచి అభ్యాసాలతో నిరోధించాలి. చెడు ఆలోచనలు పెద్దపులుల లాగ మనస్సులో చొరబడి సర్వనాశనం చేస్తాయి. కాబట్టి పవిత్రమైన ఆలోచనలనే చేస్తూ ఉండండి. -స్వామి వివేకానంద

జ్ఞాపకార్థం
in memory

– బి. సైదులు



బీహార్ రాష్ట్రంలోని గెహలూర్ అనే గ్రామంలో ఫాల్గునిదేవి, దశరథ్ మంజి అనే యువదంపతులు ఉండేవారు. వారిద్దరూ అరమరికలు లేకుండా, కష్టనష్టాలను కలిసి భరిస్తూ అన్యోన్యంగా మసలుకునేవారు. పెళ్ళైన కొన్నాళ్ళకే దురదృష్టవశాత్తూ ఫాల్గునిదేవి తీవ్ర అస్వస్థతకు గురైంది. గ్రామవైద్యుడి మందులేవీ పని చేయలేదు. వాళ్ళు నివసించేది మారుమూల గ్రామం కావడంతో ఏ సమీప పట్టణానికి వెళ్ళాలన్నా, ఎన్నో మైళ్ళు ప్రయాణం చేయాల్సిన దుఃస్థితి. ఫాల్గునిదేవి విషయంలో చివరకు స్థానిక వైద్యుడు నిస్సహాయతను వ్యక్తం చేయడంతో దశరథ్ ఆమెను పట్టణంలోని ఆసుపత్రికి తీసుకువెళ్ళాలని నిర్ణయించుకున్నాడు. ఓ వైపు కుండపోత వర్షం; అయినా ఎలాగో అలా ఓ వాహనాన్ని కుదుర్చుకొని బయలుదేరాడు. కానీ విధి వక్రించి, తను ప్రాణప్రదంగా ప్రేమించే ఫాల్గునిదేవి మార్గమధ్యంలోనే దశరథ్ చేతిలో ప్రాణాలు విడిచింది. ఒక్కసారిగా అతనికి ప్రపంచమంతా శూన్యంలా తోచి, గుండెలవిసేలా రోదించాడు. పుట్టెడు దుఃఖంతో అర్ధాంగికి కడసారి వీడ్కోలు చెప్పి ఇంటికి చేరుకున్నాడు. కానీ ఫాల్గునిదేవి జ్ఞాపకాలు దశరథ్‌ని స్థిమితంగా ఉండనివ్వలేదు; ఆమె జ్ఞాపకార్థం ఏమైనా చేయాలనుకున్నాడు. వైద్యసాయం అందక ఫాల్గునిలా ఇంకెవరూ కన్ను మూయకూడదని దశరథ్ సంకల్పించాడు.

దశరథ్ తమ ఊరికీ, పట్టణానికీ మధ్య ఉన్న పెద్ద కొండను తొలిచి మార్గాన్ని నిర్మించాలని దీక్ష పూనాడు. స్థానికులు ఎంత వారిస్తున్నా, నిరుత్సాహ పడకుండా అర్ధాంగిని తలచుకుంటూ అదే పనిగా దశరథ్ ఇరవై రెండేళ్ళు శ్రమించాడు. తత్ఫలితంగా కొండ మధ్య నుంచి రహదారి ఏర్పడింది. ఫాల్గుని స్మృతిలో దశరథ్ చేసిన ఈ సాహసకృత్య ఫలితంగా గెహలూర్ గ్రామం సమీప పట్టణానికి ఎంతో దగ్గరయింది. ప్రయాణదూరం డెబ్భై అయిదు కిలోమీటర్ల నుంచి ఒక కిలోమీటర్‌కి తగ్గింది. ఇప్పటికీ ఆ దారిని ఫాల్గునిదేవి రహదారిగా పిలుస్తూ ఉంటారు. మనసైన వారు కనుమరుగైతే షాజహాన్‌లా తాజ్‌మహల్ కట్టించలేక పోవచ్చు; కానీ వాళ్ళ జ్ఞాపకార్థం ఇలా ఓ మంచి పనినైనా చేయగలిగితే అంతకు మించిన నివాళి మరోటి లేదు.

ఆవేదన నుంచి అంతర్ముఖానికి... : అత్యంత ఆత్మీయులు వీడ్కోలు పలికి ఈ లోకం నుంచి శాశ్వతంగా వెళ్ళిపోతే ఆ బాధ వర్ణనాతీతమే! నిజానికి మరణం ఎంత విషాదకరమో మన దగ్గరివారు దూరమైనప్పుడే తెలుస్తుంది. వారితో గడిపిన క్షణాలు, వారితో పంచుకున్న అనుభవాలు గుర్తొచ్చి గుండె బరువెక్కిపోతుంది. కానీ ఆ ఆవేదన మనల్ని అంతర్ముఖులను చేసి ఆత్మాన్వేషకులుగా మార్చాలి. కానీ ఒక్కోసారి మనకు ఆ విధాతని, 'మనసైన వారిని నిర్దాక్షిణ్యంగా, నిశ్శబ్దంగా మా మధ్య నుంచి తీసుకువెళ్ళి పోవడానికి నీకెలా మనసొప్పిందయ్యా?' అని నిలదీయాలనిపిస్తుంది. అయితే ఇలా సెలవంటూ వెళ్ళిపోయినవారి రూపంలో, ఆ భగవంతుడు మనకు అజ్ఞాత సంకేతాలేవో ఇచ్చాడని తెలుసుకోవాలి; అశాశ్వతమైన అనుబంధాల అస్తిత్వాన్ని అర్థం చేయిస్తున్నాడనుకోవాలి. అందుకే స్వామి వివేకానంద ఓ చోట '*Think of death always and you will realise the truth of every word I say* – మరణాన్ని గురించి ఆలోచిస్తూ ఉంటే జీవితానికి సంబంధించిన పరమసత్యాలన్నీ అవగతమవుతాయి' అని అంటారు.

విధివశాత్తూ సంభవించిన ఆత్మీయుల వియోగం మనలో పారమార్థిక పరిణతికి దోహదపడాలి. అంతటి సంతాప సమయాన్ని కూడా సాక్షిలా అనుభవించ గలిగే స్థైర్యాన్ని పెంపొందించుకోవాలి.

కన్నీటి నుంచి కర్తవ్యానికి... : అయినవారి అకాల మరణం చాలామంది జీవనగతినే మార్చేస్తుంది. అయితే ఓ వైపు పుట్టెడు దుఃఖంతో కుదిపేసిన భగవంతుడు, పాలిచ్చే వేళ కుడిస్తన్యం నుంచి తీసినప్పుడు ఏడ్చిన శిశువును, ఎడమస్తన్యాన్నిచ్చి ఓదార్చిన కన్నతల్లిలా మరోవైపు వైరాగ్యభావనలతో సాంత్వన పరుస్తాడు. ఉదాహరణకు భగవాన్ శ్రీరామకృష్ణ పరమహంస గృహస్థ శిష్యులైన మహేంద్రనాథ్ గుప్తా, మోహినీమోహన్ వంటివారు తమ కళ్ళముందే బడి ఈడు కూడా దాటని కొడుకులను కోల్పోయారు. అలాంటి దిక్కుతోచని దీనస్థితిలో శ్రీరామకృష్ణుల దరికి చేరారు; ఆ అవతారపురుషుడి కృపాకటాక్షానికి పాత్రులై ఆధ్యాత్మికోన్నతిని సాధించారు. మహేంద్రనాథ్ గుప్తా ఏకంగా గురుదేవుల అమృతభాషణలను 'శ్రీరామకృష్ణ కథామృతం'గా అందించారు.

అలాగే అలనాటి తెలుగు చిత్రపరిశ్రమలో భక్తిచిత్రాల కథానాయకుడిగా ప్రేక్షకుల నీరాజనాలందుకున్న చిత్తూరు

నాగయ్య తాను ఎంతో ప్రేమించే అర్ధాంగిని అర్ధంతరంగా కోల్పోయారు. దాంతో ఆయన హతాశుడై, ఎక్కడా ఉపశమనం లభించక ఇల్లు విడిచి వెళ్ళిపోయారు. అక్కడా, ఇక్కడా తిరిగి చివరకు భగవాన్ శ్రీరమణ మహర్షి పాదాల చెంతకు చేరారు. శ్రీరమణాశ్రమంలోనే ఉండిపోవాలనుకున్నారు. కానీ భగవాన్ రమణులు 'వెళ్ళు! ఆమె జ్ఞాపకాల స్ఫూర్తితో నీవు చేయాల్సిన కార్యాలు ఎన్నో ఉన్నాయి. వాటిని నెరవేర్చు' అన్నారు. అలా ఆ మహర్షి అనుగ్రహంతో ఆ నటుడు కొత్త జీవితాన్ని ప్రారంభించారు. ఆ తరువాత మరెన్నో అజరామరమైన భక్తి చిత్రాలకు జీవం పోశారు. ఇలా ప్రియమైనవారు ప్రత్యక్షంగా మన మధ్య లేకపోయినా వారి స్మృతులు మన మజిలీని మరింత అర్థవంతంగా మార్చాలి; వారి అనుభూతుల అడుగుజాడలు మనల్ని మరింత శక్తిమంతంగా ముందుకు నడపాలి.

సహచరుల స్మృతిలో సేవామూర్తులుగా... : ఎప్పటిలా ఆ భర్త పొలానికి నీళ్ళు పెట్టి వస్తానని చెప్పి వెళ్ళాడు. భార్య కొడుకుల్ని పాఠశాలకు పంపి, అత్తామామలకు అన్నం వడ్డిస్తూ ఉంది. ఇంతలో భర్త పొలం సమీపంలో విద్యుదాఘాతానికి గురై మరణించాడన్న దుర్వార్త చెవినపడింది. ముప్పై అయిదేళ్ళ ఆ అభాగినికి గుండె ఆగినంత పనయింది. భర్త తోడితే లోకంగా బతుకుతున్న ఆమె కొన్ని నెలల పాటు పిచ్చిదే అయిపోయింది. కానీ కొన్నాళ్ళకు బంధువుల, మిత్రుల సహకారంతో రామకృష్ణ మఠానికి చేరువయింది; గుండెబలాన్నివ్వమని ఆ భగవంతుణ్ణి ప్రార్థించింది; 'శ్రీరామకృష్ణ కథామృతం' చదివింది; మనోధైర్యాన్ని తెచ్చుకుంది. తత్ఫలంగా ఓ వైపు ఆర్థికంగా, హార్దికంగా ఎవరిపైనా ఆధారపడకుండా కొడుకుల్ని పోషించుకుంటూ, మరోవైపు భర్త పేరుతో సేవా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది; దేవాలయాల్లో సేవ చేసుకుంటూ, అనాథ పిల్లలను ఆదుకుంటూ భాగస్వామి ఆత్మశాంతికి పాటుపడుతోంది. ఇలా సామాజిక, ధార్మిక సేవలతో ప్రియతముల స్మృతికి నివాళ్ళర్పిస్తూన్న ధన్యజీవులెందరో! ఆత్మీయుల మధురస్మృతిగా విగ్రహాలు, చిత్రపటాలు పెట్టి, పూజించడమే కాకుండా వారి సంస్మరణలో ఓ సత్కార్యాన్ని చేస్తే పరోక్షంగా అది మనకు ఆత్మసంతృప్తినివ్వడమే కాకుండా, మనవారు ఏ జన్మనెత్తినా, వారికి కూడా అది శ్రేయస్సుని ప్రసాదిస్తుంది.

సంస్మరణ నుంచీ స్ఫూర్తి.... : వ్యక్తి దూరమైనా ఆ వ్యక్తి ఇచ్చిన స్ఫూర్తిని కొనసాగించటమూ అత్యుత్తమ నివాళే! శ్రీరామచంద్రుడు తండ్రి మాటను జవదాటకుండా అడవులకేగాడు! తీరా ఆయన వనవాసానికి వెళ్ళిన కొన్నాళ్ళకే దశరథుడు దివికేగాడు. ఆ విషాదవార్త భరతుడు చెప్పగానే ఆ దశరథనందనుడు తమ్ములతో...

పురాప్రేక్ష్య సువృత్తం మా పితా యాన్యాహ సాంత్వయన్
వాక్యాని తాని శ్రోష్యామి కుతః శ్రోత్రసుఖాన్యహమ్...



నీ స్మృతిలో...

పద్దెనిమిదేళ్ళ కుర్రాడు 'వెళ్ళొస్తానమ్మా!' అంటూ కళాశాలకు బయలుదేరాడు. అదే ఆఖరి వీడ్కోలని ఆ తల్లికి తెలీదు పాపం! వెళ్ళిన కొన్ని క్షణాలకే ఆ అబ్బాయి రోడ్డు ప్రమాదానికి గురై కన్నుమూశాడు. ఒక్కగానొక్క కొడుకు కళ్ళ ముందు హఠాత్తుగా అలా తెలియని లోకాలకు తరలిపోయేసరికి ఆ తల్లితండ్రుల మనస్సు తల్లడిల్లిపోయింది. అంతిమసంస్కారాలన్నీ ముగిశాక, కొన్నిరోజుల పాటు ఇద్దరూ వానకారు కోయిలల్లా మూగవేదనను భరించారు.


అయితే, కాలపు గాలితాకిడికి ఆరిపోయిన తమ ఆశాజ్యోతిని తిరిగి వెలిగించాలనుకున్నారు. భౌతికంగా బిడ్డను బతికించుకోలేకపోయినా, అతని ఆశల్ని బతికించాలనుకున్నారు. అతనిలా చదువుకుంటున్న విద్యార్థులకు చేయూత నివ్వాలనుకున్నారు. తమ యావదాస్తిని తమ కుమారుడు చదివిన విశ్వవిద్యాలయానికి రాసి ఇచ్చారు. అతని పేరిట ఓ విశ్వవిద్యాలయాన్నే స్థాపించారు. ఆ ప్రేమమూర్తులు తమ కుమారుడి ఆత్మకు శ్రద్ధాంజలి ఘటిస్తూ 'నీ స్మృతిలో...' అంటూ స్థాపించిన విద్యాలయమే ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన స్టాన్‌ఫోర్డ్ విశ్వవిద్యాలయం.

'ఇదివరలో మన తండ్రి తన ఆజ్ఞను శిరసావహిస్తున్న నా ప్రవర్తనను గమనించి, నాకు సంతృప్తినిచ్చేలా చెవికి ఇంపైన నాలుగు మంచిమాటలు చెబుతూ ఉండేవాడు; నన్ను సరిదిద్దుతూ ఉండేవాడు. ఇక శుభవచనాలను చెప్పేవారు ఇంకెవ్వరున్నారు?' అని దిక్కులు పిక్కటిల్లేలా విలపించాడు. ఆ తండ్రి స్మృతి సూచకంగా అవతార పరిసమాప్తి వరకు, ఆయన మాటకే కట్టుబడి ఉన్నాడు. అన్నగా ఆ తండ్రి బాధ్యతలను తనే నెరవేర్చాడు. ఇలా భౌతికంగా మన మధ్య లేకపోయినా, వారి ఆశలకు, ఆశయాలకు మనం విలువనిచ్చి, వాటిని నెరవేర్చగలిగితే, వారు ఏ లోకంలో ఉన్నా ఆనందిస్తారు; మనను ఆశీర్వదిస్తారు. తరలిపోయిన వారి తీపిగురుతులుగా మనం ఈ ప్రపంచంలో, వాళ్ళ కన్నా ఇంకొన్నాళ్ళు ఎక్కువగా జీవిస్తున్నాం! అంతే! ఆ సత్యాన్ని విస్మరించకుండా ఉన్నన్నాళ్ళూ స్వార్థాన్ని వీడి, సార్థకంగా, సామరస్యంగా జీవిస్తే మనం పోయాక ఏ కొద్దిమందైనా మనల్ని జ్ఞాపకం చేసుకుంటారు! ❖

భగవంతుని సంకల్పం మేరకే అంతా జరుగుతుంది. ఓర్పుతో దుఃఖాలను భరించాలి. మన కర్మఫలాలను అనుభవించి తీరాలి. మానవజన్మనెత్తిన భగవంతుడు సైతం వ్యథలను తప్పించుకోలేడు. - శ్రీశారదాదేవి

నూటికో కోటికో ఒక్కరు

– మహేందర్ మొలుమూరి



గుంటూరు హిందూ కళాశాల ఉన్నతపాఠశాలలో పాతికేళ్ళ క్రితం ఓ ఇంగ్లీషు మాష్టారు ఉండేవారు. విద్యార్థులంటే ఆయనకు అపారమైన ప్రేమ; వారికీ ఆయనంటే అమితమైన గౌరవం. మహాదైవభక్తుడైన ఆ మాష్టారి దగ్గర పాఠాలు వినడమంటే విద్యార్థులు అదృష్టంగా భావించేవారు. ఆయన ఉద్యోగంలో ఉన్న రోజుల్లో పెద్ద జబ్బుచేసి మాటపడిపోయింది. తను మాట్లాడలేకపోతున్నానన్న బాధ కన్నా, తను ప్రాణప్రదంగా ప్రేమించే ఉపాధ్యాయ వృత్తికిదూరమవుతున్నానన్న మనోవ్యథ వారిని క్షోభకు గురి చేసింది. అందుకే ఎన్నో రోజులు సెలవు పెట్టి తను నమ్ముకున్న భగవంతుడిపై విశ్వాసంతో ఒంటరిగా నిర్జన ప్రదేశానికి వెళ్ళి ఆధ్యాత్మిక సాధనలు చేసి మళ్ళీ మాట్లాడగలిగే శక్తిని సంపాదించుకున్నారు; గొప్ప గురువుగా విద్యార్థుల మన్ననలందుకున్నారు.

పదమూడు మంది సంతానాన్ని ఒంటి చేతితో పోషించుకుంటూ, ఆత్మాభిమానాన్ని కోల్పోకుండా జీవిస్తున్న ఆ మాష్టారికి విధి పాఠాలు నేర్పకుండానే పరీక్షలు పెట్టింది. కళ్ళ ముందే ఎదిగొచ్చిన కొడుకుల్ని, కూతుళ్ళని ఒక్కొక్కరినీ అకాలమరణాలతో వారికి దూరం చేసింది. మిగిలిన ఇద్దరు కొడుకుల్లో చిన్నకుమారుడికి మానసిక వైకల్యం. పదకొండు మంది అలా కాలధర్మం చెందాక, ఆ బాధనంతా దిగమింగుకొని ఆ మాష్టారు తన ఉపాధ్యాయ వృత్తిలోనే ఆనందాన్ని వెతుక్కుంటూ ఉండేవారు. తనకు ఆశాదీపంగా మిగిలిన ఒక్కగానొక్క కొడుకుచేత ఆ రోజుల్లో ఎంతో డిమాండ్ ఉన్న టైప్ ఇన్‌స్టిట్యూట్ పెట్టించారు. అది వృద్ధిలోకి వస్తూ, కొడుకు నిలదొక్కుకుంటున్నాడని అనుకుంటూ ఉండగానే, కాలం మరోసారి కాటేసి ఊపిరితిత్తుల వ్యాధితో ఆ కుమారుడినీ దూరం చేసింది. ఆస్తిపాస్తులు లేని ఆ మాష్టారికి వృద్ధాప్యంలో మిగిలింది భార్య, వికలాంగుడైన చిన్నకొడుకు. ఆ బాధలన్నింటినీ దిగమింగుకొని శక్తి ఉన్నంతకాలం, ఉపాధ్యాయ వృత్తిపై ఉన్న అనురక్తితో ఉత్తమ ఉపాధ్యాయుడిగా పేరు తెచ్చుకొని వారు పదవీ విరమణ చేశారు. ఎవరినీ చేయి సాచి అర్థించలేక, ఎంతటి కష్టాన్నైనా ఎవరికీ చెప్పుకోవడం ఇష్టం లేక ఒకరోజు రాత్రి ఎవరికీ తెలియకుండా కుటుంబంతో ఎటో వెళ్ళిపోయారు.

ఆ మాష్టారి దగ్గర చదువుకొని ఐ.ఏ.ఎస్. అధికారి అయిన ఓ విద్యార్థి అతి కష్టం మీద ఆయన ఆచూకీ తెలుసుకోగలిగారు. హైదరాబాదు, విజయవాడ రోడ్డుకి దగ్గరగా మూసీనది ఒడ్డున ఒక తాటాకుల పాక వేసుకొని వారు అజ్ఞాతంగా జీవిస్తున్నట్లు తెలిసి కలుసుకోవడానికి వెళ్ళారు. ఆ విద్యార్థి ఒకప్పుడు ఆ మాష్టారి దగ్గర చదువుకొని, రాష్ట్రస్థాయిలో ఉన్నతాధికారి హోదాకి ఎదిగాడు. ఆయన వెళ్ళేసరికి ఎనభై ఏళ్ళ వయస్సులో ఆ మాష్టారు భార్యతో కలసి దయనీయమైన జీవితాన్ని గడుపుతున్నారు. ఏం మాట్లాడాలో తెలియక, 'ఎలా ఉన్నారు మాష్టారు?' అని ఆ విద్యార్థి అడిగాడు. "ఏం చెప్పమంటావు బాబు! ఈ చేతుల మీదుగా పెళ్ళీడుకొచ్చిన, చేతికందివచ్చిన పన్నెండుమంది పిల్లలకి దహనకాండలు చేసిన తండ్రినయ్యా! మానసికంగా ఎదగని చిన్నవాడు మాతోనే ఉంటే చనిపోతాడని దత్తత ఇచ్చేసామయ్యా, కానీ వాడూ ఎన్నాళ్ళూ బతకడని తెలుసు. ఇప్పుడు ఎంతటి దుఃఖానికైనా కన్నీళ్ళు రావడం లేదు. అయినా ఇప్పటికీ నేను గంటలకొద్దీ ఆ సర్వేశ్వరుడి పూజలోనే ఎందుకు గడుపుతున్నానో తెలుసా? నాకు ఇన్ని కష్టాలు ఎందుకిచ్చావని అడగడానికి కాదు; ఏదో జన్మ కర్మఫలాన్నే అనుభవిస్తున్నానని తెలుసు. ఈ కష్టాల్ని అనుభవించే శక్తినిమ్మని, కనీసం ఇతరులనైనా సుఖశాంతులతో బ్రతకనిమ్మని కోరడం కోసమే. నా సమస్యల్లా నా భార్య ఉండుండీ రోదిస్తుంటే ఎలా ఓదార్చాలో తెలీకపోవడం. రేపు ఎలా గడుస్తుందో అర్థం కాకపోవడం. హఠాత్తుగా నేను కన్నుమూస్తే ఆమె గతి ఏమవుతుందో!" అంటూ దేవుడి పటం వైపు తిరిగారు.

అంతటి దుఃఖంలోనూ, నిస్సహాయస్థితిలోనూ అందరూ బాగుండాలని ఆ భగవంతుడిని ప్రార్థించే తమ మాష్టారుని చూసి ఆ విద్యార్థి గుండె కరిగిపోయింది; కన్నీరై కురిసింది. తనలాంటి ఎందరి జీవితాలనో వెలిగించి, తను మాత్రం ఆరిపోయే దీపంలా రెపరెపలాడుతుంటే ఆ విద్యార్థి మనస్సు తల్లడిల్లింది; ఆదర్శానికే అర్థంగా నిలిచిన తమ గురువుగారి ఋణంలో కొంతైనా తీర్చుకోవాలని తపించింది. నిత్యం దేవాలయాల్లో వేదపారాయణం చేసే వాళ్ళకి గౌరవవేతనం ఇచ్చే పథకంలో ఆయన పేరు చేర్చాడు; ఆయన తుదిశ్వాస విడిచే వరకు ఆ వేతనం అందే అవకాశాన్ని కల్పించాడు. అంత వేదనను గుండెలో దాచుకొని 'లోకాస్సమస్తా సుఖినోభవంతు' అని నిత్యం కోరుకునే ఆ మాష్టారి ప్రార్థనను మించిన వేదపారాయణం మరేముంటుంది! ❖ (సెప్టెంబర్ 5న ఉపాధ్యాయ దినోత్సవం)

సనాతన ధర్మ శాంతి సందేశం



– స్వామి రంగనాథానంద
(రామకృష్ణ సంఘం 13వ సర్వాధ్యక్షులు)

అనాదిగా ప్రేమ, సహనం తదితర సాత్త్విక సూత్రాల మీద నిలిచింది గనుకనే ఈనాడు మన భారతదేశం యావత్ ప్రపంచానికి శాంతి సందేశాన్ని, సౌభ్రాతృత్వ భావాల్ని చాట గలుగుతోంది. అయిదు వేల సంవత్సరాలకు పైగా ఉన్న తన సుదీర్ఘ చరిత్రలో విభిన్నమైన అనుభవాలను చవిచూసింది. సౌభాగ్యం–దారిద్ర్యం, జయాలు–పరాజయాలు, స్వేచ్ఛ – బానిసత్వం, ఔన్నత్యం–హీనత్వం అన్నీ ఎదురయ్యాయి. అయినా ఈ వైరుధ్యాలను అధిగమించి మన తత్త్వవేత్తలు, అత్యంత అమూల్యమైన సహనాన్ని, శాంతిని, మానవీయ విలువల్ని, సహజీవనాన్ని,సంఘీభావాన్ని ప్రపంచానికి పరివ్యాప్తం చేశారు. భయాలకు, సంఘర్షణలకు తావులేని సమాజాన్ని అభిలషించారు. ఇలా విశ్వశాంతి సాధనలో ముందు మనిషి నిర్భయుడవ్వాలి. అందుకు శ్రీకృష్ణ పరమాత్ముడు భగవద్గీతలో (12–15)...

యస్మాన్నోద్విజతే లోకో లోకాన్నోద్విజతే చ యః
హర్షామర్షభయోద్వేగైః ముక్తో యః స చ మే ప్రియః

'ఎవరి వలన లోకం భయపడదో, ఎవరు లోకానికి భయపడడో, ఎవరు సుఖదుఃఖాలు, భయోద్రేకాల నుంచి విడుదలవుతాడో అతడు నాకు ప్రియభక్తుడ'ని ఉద్ఘాటిస్తాడు.

ఆంతరంగిక ప్రశాంతతతో, సౌమ్యుడై అదే శాంతిని అనంత విశ్వానికి కూడా వ్యాపింప చేయగలిగిన వ్యక్తే తనకు అత్యంత ఆత్మీయుడైన భక్తుడని విస్పష్టం చేస్తాడు. భారతావనిలో ఇలాంటి శాంతి స్థాపనకు కృషి చేసిన వారెందరో! ఉదాహరణకు క్రీస్తుపూర్వం మూడవ శతాబ్దానికి చెందిన అశోకుడు చక్రవర్తిగా ఉండి కూడా శాంతి సాధనలో మైలురాయిలా నిలిచాడు. కళింగ యుద్ధంలో ఘనవిజయాన్ని కైవసం చేసుకున్నాడు. అయినా ఆ రణరంగంలో సంభవించిన మారణహోమం కళ్ళారా చూసిన తరువాత అతని హృదయం ద్రవించింది. అక్కడికక్కడే అశోకుడు ఆ రక్త దాహానికి స్వస్తిపలికాడు. అనంత రాజ్యానికి చక్రవర్తియై ఉండి కూడా ఇరుగుపొరుగు రాజ్యాలకి తనే శాంతి సందేశాలని పంపాడు. వివిధ శిలల మీద, స్థూపాల మీద శాంతి సందేశాల్ని చెక్కించి, భారతావని ఆత్మను ఆవిష్కరించాడు. ప్రపంచ పాలకుల చరిత్రలో మునుపెన్నడూ ఎరగని రీతిలో శాంతిపతాకాన్ని రెపరెపలాడించాడు. ఇంతకు ముందు ఎందరో ఆధ్యాత్మికవేత్తల, ధార్మికుల ప్రబోధం కన్నా కూడా అశోకుని శాంతి సహన ధర్మాల వల్ల భారతీయ మనస్తత్వం ఎక్కువగా ప్రేరేపితమైందని చెప్పవచ్చు.

వీటన్నింటి పరిణామమేమిటంటే– ఇంత సుదీర్ఘమైన భారతీయ చరిత్రలో ఏ ఒక్క పుట కూడా రక్తసిక్తం కాలేదు. మనదేశం ఏ దేశం మీదా దండెత్త లేదు; అక్కడి రక్తంతో తన దాహం తీర్చుకోలేదు. మరో దేశాన్ని కొల్లగొట్టి తను సంపన్నురాలు కాలేదు. విదేశాలతో మౌనంగా, ప్రశాంత వాతావరణంలో, వ్యాపార వ్యవహారాలు సాగించిందేగానీ ఏనాడూ దౌర్జన్యంతో తుపాకులు లేవదీయలేదు. నలుదిశలా వ్యాపించగల చైతన్యవంతమైన, ప్రాచీనమైన తన సంప్రదాయాల పట్ల భారతదేశానికి ఉన్న అధికారపూర్వకమైన పట్టుదల వల్లనే ఈ రోజు ప్రపంచశాంతి గురించి, సహన సౌభ్రాతృత్వాల గురించి మాట్లాడగలుగుతోంది.

మరోవైపు విశ్వశాంతికి చేయూత నివ్వాల్సిన మనిషే అశాంతితో రగిలిపోవడానికి ప్రధాన కారణం మానసికశక్తుల్ని దుర్వినియోగం చేయడమే! బాహ్యపరమైన ఉద్రిక్తతలను, ఉద్రేకాలను అదుపులోకి తెచ్చుకొని, మన దృష్టిని అంతర్గతం చేసుకోవడానికి ప్రయత్నించాలి. అప్పుడు మనలోని మానసిక శక్తి నైతికశక్తిగా పరిణమించి సమాజ ప్రగతికి వినియోగపడుతుంది. అయితే బాధాకరంగా మనిషిలో కానీ సమాజంలో కానీ అశాంతికి మూలకారణం 'భయం'. ఉదాహరణకు ఒక దొంగ బ్యాంకునో, రైలు ప్రయాణికులనో దోచుకోవాలని తలచినప్పుడు ఆ ప్రయత్నంలో భాగంగా ముందు ఏదో ఒక ఆయుధంతో అక్కడి వారిని భయపెట్టే ప్రయత్నం చేస్తాడు. తరువాత తన పని కానిస్తాడు. అంటే అశాంతి చెలరేగడానికి ముందు భయం పుడుతుంది. ఇప్పుడు ప్రపంచంలో చాలా దేశాలు ఇలానే భయం గుప్పిట్లో జీవిస్తున్నాయి. భారతరత్న సర్వేపల్లి రాధాకృష్ణన్ మాటల్లో చెప్పాలంటే... We find that the individual spirit is the creator of world conditions. The passions of the heart upset the balance of the mind and the even course of the world. అవును! వ్యక్తి అంతరాత్మే ప్రపంచ పరిస్థితులను నిర్దేశిస్తుంది. హృదయ ఆవేశ, ఆవేగాలు మనోనిబ్బరాన్ని, ప్రాపంచిక తీరుతెన్నులను ప్రభావితం చేస్తాయి. ఇలా వ్యక్తి ప్రశాంతతకు, సమాజశాంతికి అవినాభావ సంబంధం ఉంది. ❖

సేకరణ: ఆర్. కృష్ణ

(సెప్టెంబర్ 21న అంతర్జాతీయ శాంతి దినోత్సవం)

నీతిమంతునిగా ఉండు. ధైర్యశాలిగా ఉండు. విశాల హృదయంతో ఉండు. నిస్వార్థంగా జీవించు, సమస్త మానవాళి పట్ల ప్రేమ, కరుణ కలిగివుండు. ఇదే నిజమైన ధార్మికతకు పరీక్ష! -స్వామి వివేకానంద



(1884 – 1967)

ముందుకు సాగిపో!

దివ్యజనని శ్రీశారదాదేవి ప్రత్యక్ష శిష్యులైన స్వామి ప్రేమేశానంద (1884-1967) రామకృష్ణ సంఘంలో అత్యున్నత గౌరవాన్నీ, ప్రేమాభిమానాలనూ చూరగొన్న అగ్రశ్రేణి సన్న్యాసి. ఆయన జీవితం శ్రీరామకృష్ణ - వివేకానందుల ఆశయాలతోనూ, భగవద్గీత సారాంశంతోనూ నిండింది. చాలామంది యువతీ యువకులకూ, గృహస్థులకూ, బ్రహ్మచారులకూ, సన్న్యాసులకూ ఆయన ఎన్నో లేఖలు వ్రాశారు. జీవితంలో అంకితభావం, ఆధ్యాత్మిక, సేవా భావాలను అలవరచుకొనేందుకు ఆ లేఖా పరంపరలు మార్గదర్శకాలయ్యాయి. పాఠకుల ప్రయోజనార్థం విలువైన ఈ లేఖలను 'శ్రీరామకృష్ణ ప్రభ'లో 2009 జూన్ సంచిక నుంచి ధారావాహికంగా ప్రచురిస్తున్నాం.

సార్‌గాచీ
27-8-37

ప్రియమైన నరేష్!*

వృక్షజాలం లాగానే మానవుడు కూడా తన పూర్వ కర్మ బీజాలపైనే ఆధారపడి ఉన్నాడని మన శాస్త్రాలు చెబుతున్నాయి. ఒక మర్రి విత్తనం నుండి మర్రి మొక్క ఎలా తన స్వంత ప్రమేయం లేకుండా ఉద్భవిస్తుందో, అలాగే మానవ శరీరం కూడా మనస్సులో నిక్షిప్తమైన ప్రముఖ ఆలోచన వలన ఏర్పడుతుంది. వ్యక్తి చేసే పనులన్నీ ఏవైనా సరే అతని పూర్వ సంస్కారాల ప్రభావాన్ని అనుసరించే ఉంటాయి. అంటే మనిషి తన పూర్వ కర్మననుసరించే ప్రవర్తిస్తాడన్నమాట. అందువల్ల మనుష్యులు వారి వారి స్వభావాలను మార్చుకోలేకపోతున్నారు. ప్రకృతి జీవుణ్ణి మెడ పట్టుకొని సుఖదుఃఖాలనన్నింటినీ అనుభవింపజేస్తోంది. వ్యక్తి తాను చూడవలసినదంతా చూచి తెలుసుకోవలసిన దాన్నంతా తెలుసుకున్నాక మాత్రమే ప్రకృతి అతడిని విడుదల చేస్తుంది. అప్పుడు మాత్రమే ఆ వ్యక్తి "నాకు ఏమీ అక్కరలేదు" అని అనగలడు. అంతకు ముందుగా అది సాధ్యం కాదు.

సృష్టిమూలం ఏమిటో మానవజాతి తెలుసుకోలేకపోతోంది. కానీ మానవుడు తన జన్మజన్మల ప్రయాణాన్ని ఒక కీటకం స్థాయి నుండి ప్రారంభించాడని మాత్రం నేను చెప్పగలను. ఈ దౌర్భాగ్యం నుండి విడుదల కావాలంటే ఎప్పటికప్పుడు ఉన్నతమైన శరీరాలను ధరిస్తూ వాటితో సాధ్యమైనంత ముందుకు సాగిపోవాలి. ప్రపంచ జీవజాలం కోటానుకోట్లు. అందులో ఒక చిన్న చీమ కన్నంలోనే కొన్ని కోట్ల చీమలుంటాయి. అలాంటిది ప్రపంచం మొత్తం మీద ఉన్న చీమలను లెక్కించడం సాధ్యమా? ఒక్క చీమజాతి జీవులే ఇలా అయితే మిగిలిన అన్ని జీవరాసుల సంగతి ఏమిటి? లెక్కకు అందుతాయా? వీటిలో ఎన్ని జ్ఞానాన్ని పొంది ముక్తిని కాంక్షిస్తాయి? ఏ రెండో లేక మూడో. అలాగే మానవులందరిలో ఎందరు ముక్తిని కాంక్షిస్తారు? మానవులు భౌతిక సుఖాలకు నిరంతరం శ్రమిస్తూ ఉంటారు. జీవులకు సుఖం కావాలి. అదొక దాహం. మనం అలాంటి వారిని మతం పేరుతో అదుపులో పెట్టాలని చూస్తే భయంచేత వారు "నాకు కావాలి, నాకు కావాలి" అని పైకి అనకుండా మౌనంగా ఉంటారు. అంతమాత్రాన వారు మారినట్లు భ్రమపడరాదు.

పూర్వం ఋషులు ఈ పరిస్థితిని అవగాహన చేసుకున్నారు. వారి అవగాహన ప్రకారం మనిషికి నాలుగు అంశాలు ముఖ్యం. 1) ధర్మం – శరీరాన్ని, మనస్సును ఆరోగ్యంగా ఉంచడానికి అవసరమైన చట్ట సముదాయం. 2) అర్థం – సంపద. 3) కామము – సుఖాన్నిచ్చే వస్తు సముదాయం. 4) మోక్షం – ఆత్మ జ్ఞాన ప్రాప్తి. గతంలో ఋషులు ఈ మొదటి మూడైన ధర్మ, అర్థ, కామాలను జనులలో ఎక్కువ మందికి సూచించేవారు. మోక్షం అన్న నాలుగవ దాన్ని మాత్రం కొద్ది మంది పరిమిత వ్యక్తులకు బోధించేవారు.

బౌద్ధమతం వచ్చాక వారు అర్థకామాలను వదలి ధర్మాన్ని మోక్షమార్గంగా తీసుకోవడం జరిగింది. అప్పటి నుండి ధర్మం యెడల జనులకు సరియైన అవగాహన లేక యువకులు, వృద్ధులు కూడా మోక్షం, ధర్మం కొరకు ఒక రకమైన ప్రదర్శన మొదలుపెట్టారు. మానవునిలో కొంత వరకు జంతు లక్షణాలుంటాయి. కనుక అతడు ఒక ఆదర్శానికి పూర్తిగా అర్పణ కానప్పుడు, అంతా అగమ్యగోచరంగా, సంశయాత్మకంగా తయారవుతుంది. దేశమంతా దేవాలయాలలో నిండిపోతుంది. కానీ ఎవ్వరూ సామాన్య జనులను విద్యావంతులను చెయ్యడానికి లేశమాత్రమైనా ఖర్చుచెయ్యరు. ఆ దిశగా ఆలోచించాలి.

ప్రేమాశీస్సులతో
స్వామి ప్రేమేశానంద

తెలుగు సేత: కె. త్రివిక్రమరావు

(*నరేష్ చంద్రపాల్ విద్యార్థి దశ నుండీ స్వామి ప్రేమేశానందకు పరిచితుడు.)

ఆ మాటలే మహామంత్రాలు

– డాక్టర్ అల్పనా ఘోష్



నేను (డాక్టర్ అల్పనా ఘోష్) కళాశాలలో విద్యార్థులకు పాఠాలు చెబుతూ మధ్యమధ్యలో స్వామి వివేకానంద మాటల్ని ఉటంకిస్తూ ఉన్నప్పుడల్లా నా పూర్వ విద్యార్థిని రజియానే గుర్తొస్తుంది. ఆమె జీవితం గురించి ఆలోచించినప్పుడల్లా మహామంత్రంలాంటి స్వామి వివేకానంద **'3H formula'**నే మనస్సులో మెదులుతుంది. నేను జార్ఖండ్ రాజధాని రాంచీలో డిగ్రీ కళాశాలలో అధ్యాపకురాలిగా ఉన్నప్పుడు రజియా ఓ సగటు విద్యార్థిని. కళాశాలలో ఆమె హాజరు కూడా అంతంత మాత్రమే! ఇలాంటి పరిస్థితుల్లో రజియా ఒక రోజు అనుబంధ పరీక్ష(సప్లమెంటరీ) ప్రవేశ పత్రాన్ని భర్తీ చేసుకొని సంతకం కోసం నా దగ్గరకు వచ్చింది. ఆమె మార్కుల పట్టిక చూసి నాకు చాలా అసహనం కలిగింది. 'మీరు కళాశాలకు ఎందుకు వస్తారో అర్థం కావడం లేదు! ఈ వయస్సులో చదువు కాకుండా మీకు వేరే వ్యాపకం ఏముంటుంది?' అని నిలదీశాను. అప్పుడు రజియా కన్నీళ్ళతో 'మేడమ్! నాకూ రోజూ కళాశాలకు రావాలనే ఉంది; బాగా చదువుకోవాలనే ఉంది. కానీ మా ఇంటి పరిస్థితులు ఏ మాత్రం సహకరించడం లేదు. ఓ పేద రైతు పెద్దకూతురిగా అయిదుగురు చెల్లెళ్ళకు, ఆరుగురు తమ్ముళ్ళకు అక్కగా నా బరువు బాధ్యతలు చదువుకోవడానికి ఆటంకంగా మారాయి. అందుకే పరీక్షల్లో పాస్ కాలేకపోతున్నాను' అంది. ఆమె కష్టాలు విన్నాక మనస్సు కలుక్కుమంది. తరగతులకు రావాలని ఉన్నా, పూట గడవడమే గగనమయ్యే ఆ ఇంట్లో బస్సులో కళాశాలకు పంపే ప్రసక్తే లేదు. అందుకే ఇంట్లోనే ఉంటూ స్నేహితుల దగ్గర పుస్తకాలు తీసుకొని పాఠాలు నేర్చుకునే దయనీయ పరిస్థితి రజియాదని తెలిశాక బాధ కలిగింది.

ఇన్ని అననుకూల పరిస్థితుల మధ్య కూడా ఎలాగైనా డిగ్రీ పూర్తి చేయాలని పట్టుదలగా చదువుతున్న రజియాను చూసి ముచ్చటేసింది. అందుకే ఆమెకు పుస్తకాలు, ఇతర పఠనా సామగ్రి ఇచ్చి ప్రోత్సహించాలని నిర్ణయించుకొని వారం రోజుల తరువాత రమ్మన్నాను. ఆమె వచ్చాక సంబంధిత పుస్తకాలు ఇస్తూ "రజియా! నువ్వు చదువు విషయంలో అనుకున్నది సాధించాలంటే, ఈ పుస్తకాలే కాదు స్వామి వివేకానంద చెప్పిన ***'3H formula'*** – Head, Heart,Hands అనే విజయసూత్రాన్ని పాటించాలి. మహామంత్రం లాంటి ఈ సూత్రాన్ని అనుసరిస్తే ఎవరైనా అనుకున్నది సాధించగలరు" అన్నాను. "రజియా! ప్రస్తుతం నీవు ఉన్న పరిస్థితుల్లో స్వామీజీ ఈ సూత్రాన్ని నీకు అన్వయించుకుంటూ ముందు మెదడుకు పదునుపెట్టి చక్కగా చదువుకోవాలి; తరువాత మనస్సులో దాని గురించే మననం చేసుకుంటూ ఉండాలి; చివరగా పరీక్షల్లో చక్కగా రాయగలగాలి" అని వివరించాను. స్వామి వివేకానంద సాహిత్యం ఇచ్చే ఉత్తేజంతో ఎలాంటి వారైనా ఉన్నత శిఖరాలను అధిరోహించగలరని చెప్పాను. తరువాత పరీక్షలకు సంబంధించి కొన్ని సూచనలిచ్చాను. స్వామీజీ *3H* సూత్రం చెప్పగానే రజియా ముఖంలో కనిపించిన ఉత్సాహం నాకు సంతృప్తినిచ్చింది. పరీక్షలయ్యాక ఒకటిరెండు సార్లు రజియా కలిసింది. తదనంతరం ఆమె ఎక్కడికి వెళ్ళిపోయిందో నాకు తెలియలేదు.

కాలచక్రంలో ఏళ్ళు మరలిపోయాయి. ఒకసారి నేను వేసవివిడిదిలో భాగంగా విశ్రాంతంగా సాహిత్యపఠనం కోసం రాంచీకి దాదాపు నలభై కిలోమీటర్ల దూరంలో ప్రకృతి సౌందర్యానికి మారుపేరైన కిస్కో అనే ప్రాంతానికి వెళ్ళాను. వారమయ్యాక అక్కడ ఒక రోజు సాయంత్రం ఏకాంతంగా ఏదో పుస్తకం చదువుకుంటూ ఉండగా, నేనుండే విశ్రాంతిభవనం ముందు ఓ ప్రభుత్వ వాహనం ఆగింది. అటు వైపు తిరిగి చూశాను. ఓ యువ అధికారిణి ఆ వాహనం దిగి వడివడిగా నడుచుకుంటూ నా గది ముందుకు వచ్చి 'మేడమ్! లోనికి రావచ్చా?' అని అడిగింది; రమ్మన్నట్లు సైగ చేశాను. ఆ యువతి ఎవరా? అని ఆలోచిస్తూ ఉండగా, 'మేడమ్! నన్ను గుర్తుపట్టారా? నేను మీ రజియాని!' అంది. అప్పుడు నేను ఆశ్చర్యపోతూ, 'రజియా! నువ్వా? ఇలా? ఇక్కడ?' అంటూ ఉండగా, 'అవును మేడమ్! మీ నమ్మకాన్ని వమ్ము కానివ్వలేదు!' అంటూ ఆమె గెలుపుగాథ నంతా వివరించింది. చాలా ఆనందంగా ఆమెను దగ్గరకు తీసుకుంటూ 'నిన్ను చూస్తుంటే నాకు చాలా గర్వంగా ఉంది రజియా!' అన్నాను.

అప్పుడు ఆమె "మేడమ్! ఈ నా విజయానికి స్వామి వివేకానంద మూడు మాటలే మహామంత్రాలుగా పనిచేశాయి. ఆరోజు మీరు చెప్పిన స్వామీజీ *3H* సూత్రం నాపై ఎంతో ప్రభావాన్ని చూపింది. ఆ సూత్రాన్ని నా అన్ని పరీక్షలకు అన్వయించుకున్నాను. జార్ఖండ్ పబ్లిక్ సర్వీస్ కమీషన్ పరీక్షల్లో నెగ్గి బ్లాక్ డెవలప్‌మెంట్ ఆఫీసర్‌గా ఎంపికయ్యాను. నా కుటుంబమే కాదు, మా ప్రాంతమంతా గర్వపడేలా ఉన్నతహోదాలో ఉన్నాను. స్వామీజీ మూడు మాటలకు మరింత న్యాయం చేస్తూ ఇక్కడి గిరిజనులకు సేవలూ అందిస్తూ ఉన్నాను" అంటూ నా కాళ్ళకు నమస్కరించింది రజియా! నాకు ఏం మాట్లాడాలో అర్థం కాక, కన్నీళ్ళతో నా టేబుల్‌పై ఉన్న స్వామి వివేకానంద చిత్రపటం వైపు చూస్తూ కృతజ్ఞతలు చెప్పుకున్నాను. ❖

నిన్ను నువ్వు సంపూర్ణమైన సంకల్పంతో అనుసంధించుకొని పని చెయ్యి. విజయాన్ని సాధించాలనుకున్నవారు అచంచలమైన దృఢ సంకల్పంతో సాధన చేయాలి. -స్వామి వివేకానంద

(...15వ పేజీ తరువాయి)


'రామా! నన్ను విడిచిపెట్టకయ్యా! నిన్ను చూస్తుంటే, శ్వాసను బిగపట్టి సముద్రంలో మునిగి ఆణిముత్యాన్ని సంపాదించినట్లు, భరించలేని మండుటెండలో కల్పవృక్షం నీడలో సేదతీరినట్లు ఉన్నది' అంటూ త్యాగయ్య తన్మయుడైపోయాడు.

కులదైవమా... కాలమేఘమా!

భక్తుల అవసరమేంటో భగవంతుడికి తెలుసు. వారు ప్రత్యేకంగా ఏమీ కోరకుండానే, అన్నీ తనే సమకూర్చే దయామయుడు ఆయన. అదే భావనతో ఈ భక్తాగ్రేసరుడు ఆ కరుణాంతరంగుడిని కోరి మరీ మనల్ని ఏలుకునే కులదైవమనీ, వంశపరంపరగా పెద్దలు ప్రీతితో దాచి ఇచ్చిన నిధానమనీ, మక్కువతో దాహార్తిని తీర్చే కాలమేఘమనీ ప్రస్తుతిస్తూ...

కోరిమమ్ము నేలినట్టి కులదైవమా
చాల నేరిచి పెద్దలిచ్చిన నిధానమా
గారవించి దప్పి తీర్పు కాలమేఘమా
మాకు చేరువ చిత్తములోని శ్రీనివాసుడా... అని

పరవశించిపోతున్నాడు. మా చిత్తానికి చేరువలోనే ఉన్నావు శ్రీనివాసా! అని పొంగిపోతున్నాడు. 'శ్రీ' అంటే సంపదలనే కాక పుణ్యాత్ములని కూడా అర్థం. అలాంటి పుణ్యాత్ములైన శ్రీమంతులయందు నిత్యం వసించువాడైన భక్తవత్సలుడు శ్రీనివాసుడు. అందుకే **'శ్రీమత్సు నిత్యం వసతీతి శ్రీనివాసః'** అంటారు. ఆధ్యాత్మికపరంగా సత్య, ధర్మ, శాంతి, కారుణ్యాది దైవీగుణ సంపన్నులైన వారి పవిత్ర హృదయములందు వసించువాడుగా భగవానుడు 'శ్రీనివాసః' అన్న నామాన్ని సార్థకం చేస్తున్నాడు. ఇలా చిత్తంలో ఆ శ్రీనివాసుడు స్థిరపడాలంటే ధర్మపరులమై మెలగాలి; దయామయులమై వెలగాలి. అప్పుడే ఆ కమలదళాక్షుడి కృపకు పాత్రులం కాగలం.



పారిజాతమా... కామధేనువా!

పరమాత్ముడిని ప్రియతముడిగా భావించుకుంటూ సర్వవేళలా ఆయన మనకు సంరక్షకుడిగా ఉంటాడన్న విశ్వాసాన్ని పెంచుకునే భక్తుడు ఆ సర్వేశ్వరుడిని సొంత తల్లి దగ్గరో, తండ్రి దగ్గరో ప్రవర్తించినట్లు సాధికారంగా ప్రశ్నించగలడు. అలాంటి భావనతోనే మహాకవి ధూర్జటి కూడా శ్రీకాళహస్తీశ్వర శతకంలో ఆ పరమశివుడిని నిలదీస్తూ...

భవకేళీ మదిరా మదంబున మహాపాపాత్ముడై వీడు న
న్ను వివేకింప డటంచు, నేను నరకార్ణోరాశిపాలైన ప
ట్టవు బాలుండొకచోట నాటతమితోడ న్నూతకూలంగ తం
డ్రి విచారింపకయుండునా కటకటా శ్రీకాళహస్తీశ్వరా!

'శ్రీకాళహస్తీశ్వరా! పుట్టుక అనెడి ఆటలో మునిగిన వాడనై మద్యాన్ని తాగుతూ గర్వంతో మాయలో పడి జ్ఞానశూన్యుడనై మహాపాపినైతినని భావించి నీవు నన్ను పట్టించుకొనక వదిలివేశావు. అయ్యయ్యో! ఎక్కడైనా పిల్లవాడు ఆటలాడుకుంటూ ప్రమాదవశాత్తూ నూతిలో పడితే తండ్రి పట్టించుకోకుండా ఉంటాడా?' అని నిష్ఠూరమాడతాడు. ఇలా ఆ దేవాదిదేవుడిని మనవాడిగా, మన మార్గదర్శిగా చేసుకోవాలి. అదే సఖ్యభావంతో ఆ సంకీర్తనాచార్యుడు కూడా...

భావింప కైవసమైన పారిజాతమా
మమ్ము చేవదేర గాచినట్టి చింతామణి
కావించి కోరికలిచ్చే కామధేనువా
మమ్ము తావై రక్షించేటి ధరణీధరా॥ అంటూ ఆ పరంధాముడిని, మనసులో భావన తలెత్తగానే లభ్యమయ్యే పారిజాతం లాంటి వాడిగా, తన శక్తిమేరకు కాపాడుకునే చింతామణిగా, భారంతో కాకుండా ప్రేమతో కోరికలు తీర్చే కామధేనువుగా, తమకు సంపూర్ణ రక్షకుడైన ధరణీధరుడిగా అభివర్ణిస్తున్నాడు.

ప్రాణబంధుడా... శ్రీవేంకటనాథుడా!

ఏ శాస్త్రజ్ఞుడికీ, వైద్యనిపుణుడికీ అర్థంకాని విశేష పరిజ్ఞానంతో ఆ దైవం మన దేహాలకు రూపకల్పన చేయటమే కాక, పరోక్షంగా వాటి నిర్వహణ బాధ్యతను కూడా తనే తీసుకున్నాడు. సర్వశక్తిమంతుడిగా, సాక్షీభూతంగా జీవకోటి జననమరణ చక్రాన్ని నడుపుతున్నాడు. ఆ విధాతను మించిన విజ్ఞానం లేదు; వైద్యమూ లేదు. అందుకే భీష్మాచార్యులు అంతిమఘడియల్లో శ్రీవిష్ణు సహస్రనామ రూపంలో ఆ విశ్వాత్ముడి వైభవాన్ని వెల్లడిస్తూ...

ఔషధం జగత స్సేతుః సత్య ధర్మ పరాక్రమం.... అంటాడు. మనోబుద్ధుల బలహీనతల నుంచి, సంసారమనే తీవ్ర బాధల నుంచి స్వస్థత చేకూర్చే దివ్యౌషధమూ శ్రీమన్నారాయణుడేనని స్పష్టం చేస్తాడు. పదకవితాపితామహుడు అన్నమయ్య కూడా ఆ భక్తవత్సలుడిని కొనియాడుతూ...

చెడనీక బ్రతికించే సిద్ధమంత్రమా
రోగాలడచి రక్షించే దివ్యౌషధమా
బడి బాయక తిరిగే ప్రాణబంధుడా
మమ్ము గడియించినట్టి శ్రీవేంకటనాథుడా

"భవరోగాల నుంచి ఉపశమింప చేసే దివ్య ఔషధం. పంచభూతాత్మకమైన ఈ దేహాన్ని ప్రాణవాయువై నడిపిస్తున్నవాడు ఆ పైవాడే! మన ప్రమేయం లేకుండానే మన ఉచ్ఛ్వాస నిశ్వాసాలవడిని నియంత్రిస్తూ పరోక్షంగా మనకు జీవరక్షకుడై నిలుస్తున్నవాడు ఆ పరాత్పరుడే! అలా సప్తగిరులపై కామిత ఫలదాతగా కొలువుతీరి శ్రీవేంకటనాథుడు గట్టెక్కిస్తున్నాడ"ని అంటూ సంకీర్తనకు శుభం పలుకుతున్నాడు. ❖



వికాస మంత్రాలు

- స్వామి పార్థసఖానంద



"పరిచయం అందరితోనూ ఉండాలి; స్నేహం కొందరితోనే ఉండాలి; ఆత్మీయత అతి తక్కువ మందితోనే ఉండాలి."

స్నేహితుడు అంటే..

1. ఆగినప్పుడు మన వెన్ను తట్టి నడిపే ప్రోత్సాహం, దిక్కు తోచనప్పుడు మనకు అందే మార్గదర్శనం, ఒంటరితనంలో వినిపించే ఓ పలకరింపు, బాధలో తోడుగా నిలిచే ఓ చిరునవ్వు, ఆనందంలో మైమరపించే ఓ అద్భుత గానం.
2. పుస్తకాలు, మిత్రులు లక్షణానికి ఉత్తమంగా, లెక్కకు అత్యల్పంగా ఉండాలి.
3. బాహ్య నడవడిని బట్టి స్నేహితుడిగా ఎవరినీ స్వీకరించకండి, ఎందుకంటే ఈక గాలిలో ఎగురుతుంది, ముత్యం నీటి అడుగున దాగి ఉంటుంది.
4. పంచుకోవడం ద్వారా ఆనందాన్ని పెంచే వాడు, బాధను తుంచే వాడే నిజమైన మిత్రుడు.

"ఆవేశం అనేది విచిత్రమైంది, దాన్ని బయటకు తోయడం ద్వారా దాని బారి నుండి శాశ్వతంగా బయటపడలేం!"



కోపావేశం

1. "ఎవరైనా కోప్పడగలరు, అది సులభం. కానీ సరైన వ్యక్తి పట్ల, సరైన సమయంలో, సరైన కారణంతో, సరైన పద్ధతిలో కోపాన్ని ప్రదర్శించడం అనేది అందరి వల్లా అయ్యేది కాదు, అది అంత సులభమూ కాదు" అని అరిస్టాటిల్ అంటారు.
2. "క్రోధావేశాన్ని ప్రదర్శించడం అనేది మనం విషాన్ని తాగుతూ, ఎదుటి వారు చావాలని కోరుకోవడం లాంటిది" అని బుద్ధ భగవానుడు చమత్కరిస్తారు.
3. గాంధీజీ గది గోడపై ఇలా రాసి ఉండేది: "నీది ఒప్పే అయితే, నువ్వు కోపగించుకోవాల్సిన అవసరం లేదు. నీది తప్పే అయితే కోపాన్ని ప్రదర్శించకూడదు".

బలం

1. మనం చేయగలిగినవి చేయడం ద్వారా మనకు శక్తి రాదు. మనం చేయలేమని అనుకున్న వాటిని చేసినప్పుడే మనకు శక్తి వస్తుంది.
2. పాశ్చాత్యుల దృష్టిలో ధీరులు అంటే కండ బలం కలవారు. కానీ భారతీయుల దృష్టిలో ధీరులంటే నైతిక, ధార్మిక విలువలు కలవారు. 'కండ బలం కంటే గుండె బలం, మనో బలం నిజానికి శక్తివంతమైనవి' అని స్వామి వివేకానంద అంటారు.
3. ఓ దేవుడా! నేను ఇతరులను బాధిస్తే, వారి క్షమను అర్థించేంత శక్తిని ఇవ్వు; ఎవరైనా నన్ను బాధిస్తే, వారిని క్షమించేంత శక్తిని ఇవ్వు.



"బరువులు ఎత్తడం ద్వారా కండబలం పెరుగుతుంది, అణగదొక్కిన ప్రతిసారీ పైకి లేవడం వల్ల మనోబలం పెరుగుతుంది."



- స్వామి పరిజ్ఞేయానంద

స్వధర్మమే పరమధర్మం!

భగవాన్ శ్రీకృష్ణుడు కురుక్షేత్ర సంగ్రామం జరగకుండా కౌరవులతో సంధి ప్రయత్నాలు జరిపాడు, శాంతియుత పరిష్కారానికి ప్రయత్నం చేశాడు. కానీ ప్రయోజనం లేక పోయింది. యుద్ధం వలన ధన ప్రాణ ఆస్తి నష్టం సంభవిస్తుందని తెలిసినప్పటికీ ధర్మపరిరక్షణ కోసం యుద్ధం అనివార్యమైంది.

ధర్మపరిరక్షణే ధ్యేయంగా తలచిన అర్జునుడికి, సాక్షాత్తూ శ్రీకృష్ణుడే సంపూర్ణ మద్దతును ప్రకటించి అండగా నిలిచాడు; రథసారథియై మార్గనిర్దేశం చేయడానికి సన్నద్ధమయ్యాడు. ధర్మయుద్ధానికి రంగం సిద్ధమైంది. కురుక్షేత్రంలో కురు పాండవసేనలు నిలిచాయి. ఇలాంటి కీలక సమయంలో అర్జునుడు దుఃఖపూరితుడై విలపిస్తూ యుద్ధం చేయనని అస్త్రసన్యాసం చేశాడు. పైగా యుద్ధంలో పూజ్యనీయులైన భీష్మ, ద్రోణ, కృపాచార్యుల వంటి మహానుభావులను వధించడం తగదనీ; యుద్ధం వల్ల కుటుంబ జీవన వ్యవస్థ ఛిన్నాభిన్నమైపోతుందనీ; కులధర్మాలన్నీ నశిస్తాయనీ; మనం చేస్తున్నది పాపమనీ చెబుతూ...

అహో బత మహత్పాపం కర్తుం వ్యవసితా వయమ్ ।
యద్రాజ్యసుఖలోభేన హన్తుం స్వజనముద్యతాః ॥ *(గీత. 1-45)*

'రాజ్యసుఖాలను అనుభవించాలనే దురాశ వల్ల, సొంతవాళ్ళనే చంపడానికి సిద్ధమైన మనం ఎంత పాపానికి ఒడిగట్టాం!' అని సాక్షాత్తూ ధర్మస్వరూపుడైన శ్రీకృష్ణుడికే ధర్మసిద్ధాంతాలను వివరించాడు విజయుడు.

అర్జునుడి మాటలు విన్నవారెవరైనా అతడు ప్రతిపాదించిన అహింసా మార్గమే ఉత్తమమని అంగీకరించాల్సిందే! హింసా మార్గాన్ని ప్రతిఘటించిన అర్జునుణ్ణి సుగుణవంతుడని ప్రశంసించాల్సిందే! అయితే, సాక్షాత్తూ భగవానుడే ఇది ధర్మయుద్ధమని తీర్మానించాడనీ; అధర్మాన్ని అణచి, ధర్మాన్ని రక్షించడమే క్షత్రియధర్మమనీ తెలిసిన అర్జునుడిలో హఠాత్తుగా యుద్ధం చేయడం పాపం, అధర్మమనేభావన ఎందుకు కలిగింది? క్షత్రియుడిగా తన స్వధర్మాన్ని విస్మరించి సన్యాసిలా భిక్షమెత్తుకొని జీవించాలనే వైరాగ్యం అతడిలో ఎందుకు కలిగింది?



నిజానికి, అర్జునుడి వైరాగ్యం బుద్ధుడిలా సంపూర్ణ వైరాగ్యం కాదు. బుద్ధుడు ఆత్మజ్ఞానం పొందాలన్న తీవ్రవైరాగ్యంతో సంసారాసక్తినీ, బంధుజనప్రీతినీ, రాజ్యసుఖాలనీ త్యజించి అరణ్యాలకు వెళ్ళాడు. కానీ అర్జునుడికి యుద్ధం పట్ల విముఖత కలగడానికి కారణం బంధుప్రీతి అడ్డువచ్చింది, మమకార వ్యామోహం ఆవరించింది. అందువల్ల అతడు స్వధర్మాన్ని మరచిపోయి, తన భావన సరైనదే అని నిరూపించుకోవడానికి కృష్ణునికే ధర్మబోధలు వినిపించాడు.

నిజమైన అహింసావాదిలో అధైర్యం చోటుచేసుకోదు. నిజమైన సుగుణవంతుడిలో నైతికత కొరవడదు. భీష్మాచార్యుడు యుద్ధభూమిలో శిఖండిని చూసి అస్త్రసన్యాసం చేశాడు. తనపై అస్త్రవర్షం కురుస్తున్నప్పటికీ ప్రతిఘటించకుండా గాయాలతో అలాగే నేలకొరిగాడు. ఇతరులు తనను హింసిస్తున్నప్పటికీ, తాను వారిని హింసించకుండా ధైర్యంగా నిలబడగలిగిన వాడే నిజమైన అహింసాపరుడు. అంతేగానీ మనోదుర్బలతకు గురైనవాడు, పిరికితనానికి లోనైనవాడు ఎన్నటికీ అహింసావాది కాజాలడు. అందుకే మహాత్మా గాంధీ "I don't like the non-violence of the coward. Non-violence of the brave alone is non-violence - పిరికివాడి అహింసావాదాన్ని నేను అంగీకరించను. ధైర్యశాలి అయినవాడు అహింసను ఆచరిస్తే అది నిజమైన అహింస" అని అన్నారు.

అర్జునుడు స్వజనుల పట్ల మమకారం వల్ల క్షత్రియ ధర్మాన్ని విస్మరించి వైరాగ్యవంతునిలా, అహింసావాదిలా మాట్లాడు తున్నాడనీ; విషాదంలో మునిగివుండడం వల్ల ధర్మాధర్మాలను గుర్తించలేని స్థితిలో ఉన్నాడనీ శ్రీకృష్ణుడు గ్రహించాడు. అందుకే భగవానుడు శోకసంవిగ్నుడై ఉన్న అర్జునుడితో 'అర్జునా! ఈ విషమ పరిస్థితిలో చిత్తమాలిన్యం ఎక్కడి నుండి వచ్చింది? హృదయ దుర్బలతను విడిచిపెట్టి లెమ్ము. స్వధర్మమే శ్రేయస్కరమ'ని బోధించి కార్యోన్ముఖుణ్ణి చేశాడు.

స్వామి వివేకానంద కూడా బలహీనమనస్కులై పరాయిపాలనలో బానిసల్లా బ్రతుకుతున్న భారతజాతిలో ధైర్యాన్ని నింపుతూ... "We have wept long enough. No more weeping. Arise, Awake, stand on your feet and be men - మనం చాలా కాలం విలపించాం. ఇక రోదన ఆపి లేవండి, మేల్కోండి, మీ ☞



జీవన వేదం

స్వామీజీ కథల సారం

శుద్ధసత్త్వం

ఘాజీపూర్‌లో పవహారీ బాబా అనే ఒక యోగి ఉండేవారు. ఆయన చాలా వృద్ధుడు. భూమిలో ఒక గుహ ఏర్పరచుకొని అందులో నివసించేవారు. ఆయన వద్ద ఆహారం వండుకొనేందుకు రెండు పాత్రలు మాత్రమే ఉండేవి. ఆయన చాలా మితాహారి. ఎక్కువ సమయాన్ని ఆయన ధ్యానంలో గడిపేవారు.

మానవులందరూ ఆయనకు సమానమే. ఎవరికీ ఏ కొద్దిపాటి హింస కూడా కలిగించేవారు కాదు. ప్రతి వస్తువులోను, ప్రతి వ్యక్తిలోను, ప్రతి జంతువులోను ఈ చరాచర సృష్టిలో దేనిలోనైనా సరే ఆయన దర్శించేది పరమాత్మను మాత్రమే. ప్రతివ్యక్తీ, ప్రతిజీవీ నాకు దైవమే అనేవారాయన.

ఒకనాడు ఒక దొంగ ఆయన గుహలో చొరబడి ఆయన వంట పాత్రల్లో ఒకదాన్ని చేత బట్టుకొని పారిపోసాగాడు. అది చూసిన బాబా ఆ దొంగ వెనుక పరుగెత్త సాగారు. అలా వారు చాలా దూరం పరుగెత్తారు. చివరకు బాబా ఆ దొంగను సమీపించి అతని ముందు మోకరిల్లి "భగవాన్! తమరు నాయింటికి వచ్చి నన్ను ధన్యుణ్ణి చేశారు. దయిచేసి ఈ రెండవ పాత్రను కూడా స్వీకరించి నన్ను తరింప చెయ్యండి. ఇది కూడా తమరికి చెందినదే" అంటూ తాను పట్టుకు వచ్చిన తన చేతిలోని రెండవ వంటపాత్రను కూడా ఆ దొంగ చేతిలో పెట్టారు.

బాబా ప్రపంచంలోని ప్రతి దాన్నీ ప్రేమించేవారు. ఒక చీమ శ్రేయస్సు కొరకు కూడా ప్రాణ త్యాగానికి సమకట్టగల మహనీయుడు ఆయన. క్రూర జంతువులకు సైతం ఆయన స్నేహ భావం గురించి తెలుసుకోగల గ్రహణ శక్తి ఉండేది. పాములు, ఇతర పరస్పర విరోధి జంతువులు కూడా ఆయన ప్రక్కలో పరుండి ప్రశాంతంగా నిద్రించేవి. అవి కూడా పరస్పర ప్రేమతో ఆయన సమక్షంలో ఎన్నడూ పోట్లాడుకునేవి కావు. శుద్ధసత్త్వం ప్రభావం ఇలా ఉంటుంది. ❖

ఆశాసంకెళ్ళు

ప్రాచీన భారతదేశంలో ఒక మహారాజు ఉండేవాడు. ఒక సందర్భంలో ఆయన నాలుగు ప్రశ్నలకు సమాధానం చెప్పవలసి వచ్చింది. వాటిలో ఒక ప్రశ్న "ఈ ప్రపంచంలో అత్యంత అద్భుతమైన విషయం ఏమిటి?" అందుకు ఆ మహారాజు 'ఆశ' అని సమాధానం చెప్పాడు. నిజంగా అదే అద్భుతమైన విషయం. రాత్రింబవళ్ళు మన చుట్టూ జనులు మరణించడం చూస్తూ ఉంటాం. కానీ మనం కూడా చనిపోతామనీ, బాధలకు గురిఅవుతామనీ భావించం. ప్రతి మనిషి ఆశతో అర్రులు చాస్తూ, అవరోధాలతో పోరాడుతూ, లెక్కలు కట్టుకుంటూ విజయం తనదేననే ఆలోచనతో జీవిస్తూ ఉంటాడు. ఇక్కడ ఎవ్వరూ నిత్య సంతోషిగా ఉన్నవారు లేరు.

ఒక వ్యక్తికి ఇంటి నిండా సంపద ఉండి, తినడానికి దండిగా ఉన్నా అతను అజీర్ణ వ్యాధితో బాధపడుతూ ఉంటాడు. మరొక వ్యక్తికి మంచి జీర్ణశక్తి ఉండి, తిండిపోతు అయినప్పటికీ అతని నోటికి ముద్ద ఉండదు. ధనవంతునికి సంతానలేమి. ఆకలిగొన్న ఒక పేద నిర్భాగ్యునికి సైనిక పటాలమంత సంతానం. ఇదంతా ఎందుచేత జరుగుతోంది? సుఖదుఃఖాలనేవి ఒకే నాణానికి ఇరు ప్రక్కలు. సుఖాన్ని ఆశించేవాడు దుఃఖాన్నీ స్వాగతించాలి. మనమందరం దుఃఖం లేని సంపూర్ణ సుఖం ఉంటుందని భావించే మూఢులం. మన ఇంద్రియాల మీద మనకు అదుపు లేకపోవడం వల్లనే మనకు ఈ విధమైన స్థితి దాపురిస్తోంది. ❖

తెలుగు సేత: కె. త్రివిక్రమరావు


కాళ్ళపై మీరు నిలబడి మనుషులుగా మారండి" అంటూ తమోగుణంలో ఉన్న భారతీయులను మేల్కొల్పారు.


కుటుంబ బాధ్యతలను విడిచిపెట్టిన ఒక భక్తుడు శ్రీరామకృష్ణ పరమహంస దగ్గరకు వచ్చి, ఆధ్యాత్మిక సాధనలు చేసుకుంటూ ఇక్కడే ఉంటానని చెప్పాడు. అప్పుడు శ్రీరామకృష్ణులు 'నీ భార్యాపిల్లల్ని విడిచిపెడితే వారి బాధ్యతను ఎవరు వహిస్తారు? మీ అత్తమామలూ, ఇరుగుపొరుగువారూ ఆ బాధ్యత వహిస్తారా?' అని మందలించి స్వధర్మాన్ని ఆచరించడమే పరమధర్మం' అని బోధించారు.


మనం కూడా ఏదైనా బాధ్యతను నిర్వహించాల్సి వచ్చినప్పుడు, ఆ బాధ్యత నెరవేర్చడానికి తగిన సామర్థ్యం, ఆసక్తి, సమస్యల్ని ఎదుర్కొనేశక్తి లేకపోవడంవల్ల ఆ బాధ్యత నుండి తప్పించుకోవడానికి ఎన్నో కారణాలను వెతుకుతాం, మన తెలివితేటల్ని ప్రదర్శించి మన నిర్ణయాన్ని సమర్థించుకునేందుకు ప్రయత్నిస్తాం. అంతేకానీ మనలోని నిరాసక్తతకు కారణం ఆత్మన్యూనతభావం, రాగద్వేషాలు, అహంకార మమకారాల్లాంటి బలహీనతలని గుర్తించం. అందుకే మనం కూడా అర్జునుడిలా గీతామృతాన్ని గ్రోలి మనోదుర్బలత నుండి బయటపడాలి. స్వధర్మాచరణలో జీవితాన్ని సార్థకం చేసుకొని పరమపదాన్ని పొందడానికి ప్రయత్నించాలి. ❖


గురుభక్తిలో తరించిన శిష్యుడు


కథ : ఎమ్. భైరవ సుబ్రహ్మణ్యం   చిత్రాలు : వేంకట్   అనుసృజన : స్వామి జ్ఞానదానంద




5
త్యాగరాజస్వామి 'నౌకా చరిత్రము' (కృష్ణ లీలలను వర్ణించే రూపకం, భాగవతంలో లేనిది) అనే పుస్తకాన్ని తెలుగులో రచించారు. తంజావూరు మహారాజు ఆస్థాన పండితులు అది శృంగారరస ప్రధానమైన పుస్తకమని ఎంచి దాన్ని నిషేధింప విన్నపం చేశారు. రాజు త్యాగరాజస్వామిని సభకు రావించారు.
త్యాగయ్యగారూ! 'మీ నౌకా చరిత్రము' అద్భుతంగా ఉంది. దీనికి సంస్కృత మూలం ఏదన్నా ఉందా?
6
వేంకటరమణా! నౌకాచరిత్రమునకు సంస్కృత మూలం ఉందని నాకు తెలియకుండానే చెప్పేశాను. ఇప్పుడు ఏం చెయ్యాలో పాలుబోవడం లేదు...
స్వామీ! నేను మీ ఆ పుస్తకాన్ని చదివి, ముగ్ధుణ్ణై సంస్కృతంలో వ్రాసి ఉంచుకున్నాను. దాన్ని మీకు సమర్పిస్తాను.
ఆ సాహితీ అనర్ఘరత్నాన్ని మూడు రోజుల్లోనే వేంకటరమణుడు సంస్కృతంలో రచించాడట!
7
త్యాగరాజస్వామి ఇంట్లో నిర్వహించే ఏకాదశి భజనను వేంకటరమణుడే ముందుండి జరిపించడం రివాజు. ఒక ఏకాదశినాడు భారీ వర్షంలో జయంపేట నుండి తిరువయ్యూరుకు వెళ్ళడానికి వేంకటరమణుడు ఎంతో శ్రమపడ్డాడు.
గురుదేవా! ఎలాగైనా పూజలో నేను పాల్గొనేలా అనుగ్రహించండి.
8
వేంకటరమణుడు రాలేదని త్యాగరాజస్వామి దిగులుపడ్డారు. అప్పుడు ఒక పిల్లవాడు హఠాత్తుగా అక్కడకు వచ్చి త్యాగయ్యగారి భార్యతో...
అమ్మా! వేంకటరమణులు వర్షంలో చిక్కుపడ్డారు. ఆయన వచ్చి మంగళం పాడి భజనను ముగిస్తారని పెద్దాయనతో చెప్పండి.


9
ఇలా చెప్పి ఆ పిల్లవాడు మెరుపులా మాయమయ్యాడు. త్యాగరాజస్వామి భార్య పిల్లవాడు చెప్పిన సంగతి భర్తకు చెప్పింది.
స్వామీ! ఆ పిల్లవాడు ఎవరోగానీ నా హృదయంలో పరమానందాన్ని నింపి వెళ్ళాడు.
కమలా! నువ్వు భాగ్యశాలివి. వచ్చింది మరెవరో కాదు, సాక్షాత్తూ బాలకృష్ణుడే!



10
అదే సమయంలో వేంకటరమణుడు ఇంట్లోకి వచ్చాడు.
రండి, వేంకటరమణ భాగవతార్‌గారూ! మీరే నేడు బాలకృష్ణునికి మంగళం పాడాలి.
స్వామీ! ఆలస్యానికి మన్నించండి. దయచేసి మీరు నన్ను ఎప్పటిలాగే పిలవండి.
సాక్షాత్తూ ఆ పరంధాముడే సంబోధించిన నామం ఇది.


11
వేంకటరమణుడు గురుసేవకు ఆటంకం కలుగుతుందనే భయంతో తన వివాహాన్ని వాయిదా వేస్తూ వచ్చాడు. ఆతడి తల్లితండ్రుల ప్రోద్బలం వల్ల స్వయంగా త్యాగయ్యగారే పూనుకుని వివాహానికి ఆతణ్ణి సమ్మతింపజేశారు. తన 41వ ఏట వేంకటరమణుని వివాహం ఘనంగా జరిగింది.
తరువాత 26 ఏళ్ళు త్యాగయ్యగారికి సేవలందించాడు. కాలాంతరంలో వ్యాపార నిమిత్తం వేంకటరమణుడు వాలాజాపేటలో నివసించాడు. తన ఇద్దరు కుమారులు, శిష్యులతో ఆశ్రమం నెలకొల్పి సద్గురువు శ్రీత్యాగరాజస్వామి, శ్రీకృష్ణుడు, శ్రీరాముడు తదితరుల మీద సౌరాష్ట్రం, సంస్కృతం, తెలుగు భాషల్లో కీర్తనలు రచించి, గానంచేసి భక్తిని వ్యాప్తిచేస్తూ వచ్చాడు.

12



13



14 త్యాగయ్యగారి అవసాన కాలం.



26 ఏళ్ళు గురువుకు సేవలందించిన వేంకటరమణుడు గురువు గారి చివరి ఆశయాన్ని ఆజ్ఞగా శిరసావహించాడు.

15 వేంకటరమణుడు ఈ విధంగా దాదాపు 50 ఏళ్ళు భక్తి, సంగీత రంగాలకు ఎనలేని సేవలు అందించాడు. 1874లో తన 93వ ఏట అవసాన సమయంలో ఒక రోజు ...



శ్రీరామా! నా తదనంతరమూ నా గురుదేవులు ఉపాసించిన విగ్రహమూ, ఆయన తంబురా, తాళపత్రాలు, ఆయన పాదుకలు భక్తులచే పూజింపబడేలా అనుగ్రహించు.

వేంకటరమణుని కోరిక ప్రకారం నేటికీ త్యాగరాజస్వామిచే ఆరాధింపబడిన శ్రీరాముని విగ్రహమూ, ఇతర వస్తువులూ పూజలందుకుంటున్నాయి. వేంకటరమణ జన్మస్థలం జయంపేటలో ఏటా ఆయన జన్మతిథినాడు సంగీతోత్సవం ఘనంగా జరుపుతూ ఉన్నారు. తిరువయ్యూరులో వేంకటరమణ భాగవతార్ పేరిట ఒక ఆలయం వెలసింది. అక్కడ నిత్యపూజలు, జయంత్యుత్సవమూ జరుపబడుతూన్నవి. మదురై మొదలైన ఊళ్ళలోనూ సంగీతోత్సవాలు నిర్వహిస్తూ వస్తున్నారు.

రామకృష్ణ మిషన్ ఆశ్రమ

రామకృష్ణ బీచ్, విశాఖపట్నం-530 003, ఫోన్: 0891- 2562561

అమృతోత్సవాలు (ప్లాటినమ్ జూబ్లీ)

అఖిలాంధ్ర రామకృష్ణ - వివేకానంద భక్త సమ్మేళనము

2014 డిసెంబర్ 19,20, 21 (శుక్ర, శని, ఆదివారాలు)

1939లో స్థాపించబడిన విశాఖపట్నం రామకృష్ణ మిషన్ ఆశ్రమం, 2014 నాటికి 75 వసంతాలు పూర్తిచేసుకుంటోంది. ఈ అమృతోత్సవాలను పురస్కరించుకొని విశాఖపట్నం రామకృష్ణ మిషన్, **2014 డిసెంబర్ 19,20,21** తేదీల్లో భక్త సమ్మేళనాన్ని నిర్వహిస్తుంది. ఈ సమ్మేళనంలో పాల్గొనడానికి శ్రీరామకృష్ణ భక్తులందరికీ సాదర ఆహ్వానం పలుకుతోంది.

ఈ భక్త సమ్మేళనములో పాల్గొనదలచిన భక్తులు తమ పూర్తి చిరునామాను, సెల్ నంబర్‌ను ఎస్.ఎమ్.ఎస్. ద్వారా ఈ సెల్ -9440421320,9951474072 నంబర్లకు తెలియజేసినట్లైతే సభ్యత్వ రుసుము, ఇతర వివరాలతో కూడిన కరపత్రం పంప బడును. **సభ్యత్వ నమోదు ఆఖరు తేదీ 2014 నవంబర్ 20.**

ఈ సమ్మేళనంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణా రాష్ట్రాల నుంచి సుమారు 3,000 మంది భక్తులు, స్వచ్ఛంద సేవకులు, వివిధ మఠ కేంద్రాల నుండి స్వామీజీలు, శారదా మఠం నుండి మాతాజీలు పాల్గొంటారు.

ఈ మూడు రోజుల భక్తసమ్మేళనంలో పాల్గొన్న భక్తుల భోజన, వసతి సౌకర్యాలను సమకూర్చడం కోసం సుమారు ఇరవై లక్షల రూపాయల వ్యయం అవుతుందని అంచనా.


ఈ బృహత్ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించడానికి భక్తులు, మిత్రులు, శ్రేయోభిలాషులు ధన, వస్తు రూపేణ తమవంతు సహాయాన్ని అందించి భగవాన్ శ్రీరామకృష్ణుల కృపకు పాత్రులు కాగలరని ఆశిస్తున్నాం.

భక్తులు తమ విరాళములను మనియార్డర్/ డి.డి. ద్వారా **సెక్రెటరీ, రామకృష్ణ మిషన్ ఆశ్రమ, విశాఖపట్నం** పేరున తీసి పై చిరునామాకు పంపించవలెను. విరాళాల్ని ఆన్‌లైన్ ద్వారా కూడా పంపవచ్చు. **రామకృష్ణ మిషన్ ఆశ్రమ అకౌంట్ నెం:104710011000001 ఆంధ్రా బ్యాంకు, ఆర్.కె.బీచ్ బ్రాంచి, బ్రాంచి కోడ్ ANDB0001047.** ఆన్ లైన్ ద్వారా విరాళాల్ని పంపించినవారు, వెంటనే ఆ వివరాలను మాకు తెలియజేయవలెను.

ఈ మహాయజ్ఞం విజయవంతంగా నిర్వహించడానికి అందరూ ఇతోధికంగా విరాళాలిచ్చి సహకరించాల్సిందిగా కోరుతూ...

భగవత్సేవలో
స్వామి ఆత్మవిదానంద
కార్యదర్శి


గ్రంథ స్వీకారం



శ్రీ మహాత్మాగాంధీ

సంపూర్ణ జీవిత చరిత్ర (నాటకము)

రచయిత : శ్రీ కొత్లాపురం మఠం రాచయ్య
వెల: రూ.100/-, పుటలు : 137
ప్రతులకు: భారత వికాస పరిషత్
మహబూబ్‌నగర్, ఫోన్: 08542-221122




అష్టమూర్తి శివ క్షేత్రదర్శిని

రచన : డాక్టర్ (మేజర్) చల్లా సత్యవాణి
వెల: రూ.100/-, పుటలు :182
ప్రతులకు: డా॥ చల్లా సరస్వతి,
డోర్.నెం: 46-18-11, 'ప్రణవకుటి'
దానవాయిపేట, రాజమండ్రి - 533 103
ఫోన్:0883 - 2475802


నిత్యానుష్ఠానము

సంకలనం : శ్రీ రామచంద్రన్ పిడతల
వెల: రూ.65/-, పుటలు : 106
ప్రతులకు: శ్రీమతి సరళ పిడతల
'వైష్ణవి', ఫ్లాట్ నెం.2, 5-9-502,
తులసీ గార్డెన్స్, జె.జె నగర్ పోస్ట్,
సికింద్రాబాదు-87,సెల్: 9493150984



ఆదిశంకరుల అయిదు ప్రకరణాలు

రచన: ప్రొఫెసర్ వేదుల సుబ్రహ్మణ్య శాస్త్రి
వెల: జిజ్ఞాస, పుటలు : 142
ప్రతులకు: వేదుల సుబ్రహ్మణ్య శాస్త్రి
శారదా పీఠం, 46-15-35, దొండపర్తి,
విశాఖపట్నం - 530 016
సెల్: 94900 84217



Printed and published by **Swami Jnanadananda** owned by Ramakrishna Math Trust
and printed at Kala Jyothi Process, 1-1-60/5, RTC Cross Roads, Musheerabad, Hyderabad - 500 020
and published at Ramakrishna Math, Domalguda, Hyderabad - 500 029. **Editor: Swami Parijneyananda**

Vol.71-9, Sri Ramakrishna Prabha (Telugu Monthly) September 2014, Regd. with the Registrar of Newspaper for India Under No.1120/57. Postal Registration No. HD-1071/2013-15. Licensed to Post Under WPP : AP/CPMG/HC-13/WPP/2013-14. Date of Publication : 18 August 2014

శాంతి సందేశం



స్వామి వివేకానంద విశ్వమత మహాసభల్లో మత దురభిమానం, మతం పేరిట జరిగే హింసాప్రవృత్తి, ప్రపంచపు శోచనీయ స్థితిని చూసి ఆవేదన వ్యక్తపరుస్తూ ప్రపంచానికి ఆయన ఇచ్చిన శాంతి సందేశమిది:

"విషాద నిశీథిలో కాంతిరేఖల్లా విశ్వమత మహాసభలు విశ్వమానవ సౌభ్రాతృత్వాన్ని చాటుతూ ఈ ఉదయం మ్రోగిన జేగంటలు మత ఛాందసత్వానికీ, మతం పేరిట జరిగే హింసాత్మక చర్యలకూ, మనుషుల మధ్య ఉండే విద్వేషాలకూ చావు గంటలు కావాలి. అందరూ కలిసి ఈ దుష్టశక్తులను అణచి వేయాలి".

"ఇతర మతాల్ని అణగద్రొక్కి, ఏ ఒక్క మతమూ పైకెదగలేదు, ఇతర మతాల వినాశనాన్ని కోరే ఏ మతమూ బ్రతికి బట్టకట్టలేదు. ఏ ఒక్కరూ తమ తమ మతాలను మార్చుకోనక్కరలేదు, ఇతర మతాల్లోని మంచిని గ్రహించి, ఎవరి మతాన్ని వారు చిత్తశుద్ధితో అవలంబిస్తే గమ్యాన్ని చేరవచ్చు".

"పవిత్రత, పరిశుద్ధత అనేవి ఏ ఒక్కరి సొంతమూ కాదు, ప్రతీ మతమూ ఆధ్యాత్మిక ఉన్నతి నొందిన మహాత్ములను తయారు చేసింది. పరస్పర సహకారంతో, ఇతర మతాలలోని మంచిని గ్రహించి, ఆకళింపు చేసుకొని సమత, సమభావాలతో శాంతియుతంగా కలిసి జీవించాలి."❖

(సెప్టెంబర్ 21న ప్రపంచ శాంతి దినోత్సవం)

ఆధ్యాత్మిక అమృతవాహిని

శ్రీ రామకృష్ణ ప్రభ

అక్టోబర్ 2014

వెల: ₹10



సుబోధ

భక్తుడు: భగవంతుడూ, ఆయన శక్తీ వేర్వేరా?

శ్రీరామకృష్ణులు: 'మాణిక్యం, దాని ప్రకాశం మధ్య విభేదం లేదు. మాణిక్యపు ప్రకాశాన్ని తలచినప్పుడు మాణిక్యాన్ని కూడా తలచుకొంటాం. పాలు, దాని తెల్లదనం వేర్వేరు కావు. ఆ విధంగా ఒకదాన్ని తలచినప్పుడు మరోదాన్ని కూడా తలంపవలసి ఉంది. కానీ పరిపూర్ణ జ్ఞానం కలుగకుండా ఈ విభేదరహితమైన ఎరుక కలుగదు.

పరిపూర్ణ జ్ఞానం కలిగినప్పుడు సమాధిస్థితి ఏర్పడుతుంది. ఆ స్థితిలో 'నేను' అనే భావన ఉండదు. సమాధిస్థితిలో ఎలాంటి అనుభవం కలుగుతుందో వాక్కులతో చెప్పడం సాధ్యం కాదు. ఒకింత దిగి వచ్చి, చూచాయగా ఏదో చెప్పగలం. సమాధిస్థితి నుండి బాహ్యచైతన్యానికి వస్తూ, నేను 'ఓం, ఓం' అని పలుకుతున్నప్పుడు నూరు మూరలు క్రిందికి దిగివచ్చేస్తాను. వేద విహితాలకు అతీతమైనది బ్రహ్మం. దానిని వర్ణింప సాధ్యం కాదు.


'నేను', 'నువ్వు' అనే భావన ఉన్నంత వరకు భగవంతుడు ఒక వ్యక్తి అనే ఎరుక ఉంటుంది. 'నువ్వు యజమానివి, నేను దాసుడను; నువ్వు పూర్ణుడవు, నేను అంశను. నువ్వు తల్లివి, నేను బిడ్డను' అనే భావన ఉంటుంది; 'నేను వేరు, నువ్వు వేరు' అన్న భేదభావమూ ఉంటుంది.

'నేను' అనే భావన ఎంతవరకు నెలకొని ఉంటుందో, అంతవరకు బ్రహ్మం నిర్గుణమైనదని చెప్పడానికి మనం అర్హులం కాము. అంతవరకు సగుణబ్రహ్మాన్ని అంగీకరించి తీరాలి.

భక్తుడు: ఆద్యాశక్తి దర్శనం, బ్రహ్మజ్ఞానం ఏ విధంగా లభిస్తాయి?

శ్రీరామకృష్ణులు: పరితప్త హృదయుడవై భగవంతుణ్ణి ప్రార్థించు, విలపించు. దీని మూలంగా చిత్తశుద్ధి కలుగుతుంది. స్వచ్ఛమైన నీటిలో సూర్యుని ప్రతిబింబాన్ని చూడగలం. అదే విధంగా భక్తుడు 'నేను' అన్న దర్పణంలో సగుణబ్రహ్మమైన ఆద్యాశక్తిని దర్శించగలడు. మొదట దర్పణాన్ని బాగా తుడవాలి, మరకలు ఉంటే ప్రతిబింబం స్పష్టంగా కనిపించదు.

భగవంతుడు అంతర్యామి. సరళ హృదయంతో, శుద్ధ మనస్సుతో ఆయనను ప్రార్థిస్తే ఆయన సమస్తం విశదపరుస్తాడు. అహంకారం వీడి ఆయనను శరణు వేడితే, సమస్తం పొందగలవు. ❖



శ్రీరామకృష్ణ ప్రభ
రామకృష్ణ మఠం, దోమల్‌గూడ, హైదరాబాదు-500 029
ఫోన్: 040-27667799, సెల్: 8801849494
E-mail : sriramakrishnaprabha@gmail.com
నిర్వాహక సంపాదకులు: స్వామి జ్ఞానదానంద   సంపాదకులు: స్వామి పరిజ్ఞేయానంద

సురభి

1920వ సంవత్సరం ఫాల్గుణ మాసంలో శారదమ్మ జయరాంబాటీ నుండి కలకత్తా వెళ్ళాలని నిర్ణయమైంది. ఈ వార్త అందగానే శివు అన్నయ్య (శ్రీరామకృష్ణుల అన్న కుమారుడు) ఒకనాడు మధ్యాహ్న వేళ అమ్మను చూడటానికి వచ్చాడు. భోజనానంతరం అమ్మ, శివుతో 'ప్రొద్దున్నే రావలసింది. సరే, ఇప్పుడు వీళ్ళ గదిలో విశ్రమించు. రఘువీరుని నైవేద్యం కొరకు పళ్ళు, మిఠాయి కట్టి ఇస్తాను. చల్లబడగానే బయలుదేరుదువు గాని' అన్నారు. 'ఈరోజు నీతోనే ఉండి, రేపు ప్రొద్దున వెళతాను పిన్నీ!' అన్నారు. 'అదెలా? ఇంట్లో రఘువీర, శీతలాదేవి సంధ్య హారతి జరగాలి కదా!' అన్నారు అమ్మ.

శివు: పిన్నీ! అన్నీ చేసే వచ్చాను. ఇక్కడకు వస్తున్నానని పూజ అనంతరం, హారతి ఇచ్చి, దేవుళ్ళ శయన సేవ చేశాను. రేపు వెళ్ళి మేలుకొలుపు చేస్తాను.

అమ్మ విస్తుపోయారు.

అమ్మ: అదేమి మాటలురా! నీవు బతికి ఉండగానే రఘువీర, శీతల మాతల పూజ ఈ విధంగా జరిగితే ఇక నీ పిల్లలు ఎలా చేస్తారో!

శివు: ఫరవాలేదులే! ఒక్క దినమే కదా. ఇవ్వాళ నీతో గడపవలసినదే పిన్నీ!

శివు అన్నయ్య మా గదికి వచ్చి పడుకున్నారు. మూడు గంటల వేళ అమ్మ, శివు అన్నయ్యను పిలిచారు. పళ్ళు మిఠాయిల చిన్న మూట నా (స్వామి ఈశానంద) చేతికి ఇచ్చి, 'శివుతో వెళ్ళి, నది దాటించి తిరిగిరా' అన్నారు. 'శివూ! వెళ్ళి దేవుళ్ళను మేల్కొలిపి, మరల సంధ్యహారతి ఇవ్వు. ప్రొద్దున్న శయనం మధ్యాహ్నం విశ్రాంతి అనుకో. బెంగ ఎందుకురా? దక్షిణేశ్వరం వచ్చి నన్ను చూద్దువుగాని' అన్నారు.

నేను శివు అన్నయ్యను నది దాటించి వచ్చి, అమ్మ దగ్గర కూర్చొన్నాను. ఇంతలో శివు అన్నయ్య ప్రత్యక్షం! మూట వసారాలో పెట్టి వచ్చి, అమ్మ ముందు సాగిలపడి, విలపించ సాగారు. 'అమ్మా! నా గతి ఏమిటి?' అని విలపించారు.

అమ్మ: శివూ! లే తండ్రీ! అంత ఆవేదన ఎందుకు. గురుదేవుల సేవ చేస్తున్నావు. ఆయన నిన్ను ఎంతో ప్రేమిస్తున్నారు. ఇక ఏమి చింత? నీవు జీవన్ముక్తుడవు.

శివు: అమ్మా! నా భారం మీదే. మీ గురించి ఇంతక ముందు నాకు ఏమి చెప్పారో, అది సత్యం అని చెప్పండి. అమ్మ అనునయించిన కొద్దీ ఆయన కన్నీరు అధికం అవుతోంది. అమ్మ ఆ తర్వాత 'నేను చెప్పింది సత్యం' అన్నారు. వెంటనే శివు అన్నయ్య, మోకరిల్లి అమ్మ పాదాలపై తన శిరస్సు ఉంచి 'సర్వమంగళ మాంగల్యే' అని స్తుతించాడు.

శివు అన్నయ్య లేచి, కళ్ళు తుడుచుకొని బయల్దేరారు. నేను మూట ఎత్తుకుని వెంట నడిచాను. ఊరు దాటి మైదానంలోకి వచ్చాము. శివు అన్నయ్య నాతో 'తమ్ముడూ! అమ్మ సాక్షాత్తూ కాళి. ఆమె కపాల మోచని. ఆమె కృప కలిగితేనే మోక్షం... అర్థమైందా?' అన్నారు. ❖

(స్వామి ఈశానంద, శ్రీశారదాదేవి శిష్యులు)



ఆధ్యాత్మిక అమృతవాహిని
శ్రీ రామకృష్ణ ప్రభ
సంపుటం: 71 సంచిక: 10 అక్టోబర్ 2014



త్వమర్క స్త్వమిన్దు స్త్వ మగ్ని స్త్వ మాప
స్త్వ మాకాశ భూ వాయవస్త్వం మహత్త్వమ్ ।
త్వ దన్యో న కశ్చి త్ప్రపంచో ఽస్తి సర్వం
త్వ మానన్ద సంవి త్స్వరూపాం భజే ఽహమ్ ॥

అంబా! సూర్య, చంద్ర, అగ్ని, జల, వాయు, భూమి, ఆకాశములు నీవు. మహత్తత్త్వము నీవు. నీవు కానిదేమున్నది? సర్వప్రపంచము నీవు. ఈ ప్రపంచమునకు తెలివిని, సుఖమును ప్రసాదించు ఆనంద సంవిద్రూపవగు నిన్ను భజించెదను. – *భవానీ భుజంగ స్తోత్రమ్*


సూక్తి సౌరభం

కంటకానాం ఖలానాం చ
ద్వివిధైవ ప్రతిక్రియా
ఉపానన్ముఖ భంగోవా
దూరతో వా విసర్జనమ్


“ముల్లును చెప్పు కాలితో నలిపివేస్తాం. లేదా తీసి దూరంగా పారేస్తాం. అలాగే దుష్టుల్ని కూడా అణచివేయాలి, లేదా దూరంగా ఉంచాలి.”

మాటలాడ గలుగు మర్మము లెరింగిన
పిన్న పెద్దతనము లెన్న వలదు
పిన్న చేతి దివ్వె పెద్దగా వెలుగదా?
విశ్వదాభిరామ వినుర వేమ!

“ఓ వేమా! చిన్నవాళ్ళైనా మాటలాడడంలోని మర్మం తెలిసినట్లయితే వారు చెప్పింది వినాలి. చిన్నా పెద్దా తేడా చూడరాదు. చిన్న వాళ్ళ చేతిలో ఉన్న దీపం పెద్దగానే వెలుగుతుంది కదా!”



శ్రీరామకృష్ణ ప్రభ శాశ్వత నిధి





ఆధ్యాత్మిక జ్ఞానాన్ని పంచి పెట్టేందుకు 'శ్రీరామకృష్ణ ప్రభ' కృషి చేస్తోంది. నిధుల కొరత లేకుండా ఈ జ్ఞానయజ్ఞం నిరంతరాయంగా సాగేందుకు 'శ్రీ రామకృష్ణ ప్రభ శాశ్వతనిధి'కి ధన దానం చేసి ప్రోత్సహించాల్సిందిగా కోరుతున్నాం. దాతల పేర్లు పత్రికలో ప్రచురిస్తాం.

మహారాజ పోషకులు...... రూ. 10,000/-, అంతకన్నా ఎక్కువ విరాళం ఇచ్చేవారు.
రాజ పోషకులు............ రూ. 5,000/-, అంతకన్నా ఎక్కువ విరాళం ఇచ్చేవారు.
పోషకులు................. రూ. 1,000/-, అంతకన్నా ఎక్కువ విరాళం ఇచ్చేవారు.

దాతపేరు చిరునామా	రూ.
మహారాజ పోషకులు : శ్రీమతి అంతటి లక్ష్మి & శ్రీ అంతటి రవి, ఎమ్.జి.రోడ్, గోరెగావ్, ముంబాయి	10,000
మహారాజ పోషకులు : శ్రీ తాళ్ళపల్లి వేంకటనారాయణ, మధు, వి.టి.రోడ్, నల్లగొండ (కుమారి తాళ్ళపల్లి మహతి ప్రథమ జన్మదిన సందర్భంగా)	10,000
పోషకులు : శ్రీ ఎ. శివప్రసాద్, బద్ది పోచమ్మవీధి, వేములవాడ, (కీ॥శే॥ ఆకుల వేంకటి జ్ఞాపకార్థం)	3,000
పోషకులు : శ్రీ ఎన్. సత్యనారాయణ శాస్త్రి, తమిరసవారి వీధి, తణుకు, పశ్చిమగోదావరి జిల్లా	2,500
పోషకులు : శ్రీమతి మైథిలి రామచంద్రరావు, శాలివాహన నగర్, శ్రీనగర్ కాలనీ, హైదరాబాదు	1,500
పోషకులు : శ్రీమతి రాయసం సీతారామమ్మ, ఇందుకూరుపేట, నెల్లూరు జిల్లా	1,500
పోషకులు : శ్రీ ఎమ్.సూర్యనారాయణ రెడ్డి & శ్రీమతి సత్యవతి, పల్లకడియం,తూ.గో.జిల్లా (కీ॥శే॥ ఎమ్.రామిరెడ్డి,సత్తెమ్మగార్ల జ్ఞాపకార్థం)	1,116
పోషకులు : శ్రీ గాజుల సోమరాజు, గొల్లప్రోలు, తూర్పు గోదావరి జిల్లా	1,116
పోషకులు : కుమారి గరుడాచలం యామిని, శ్రీ జి. శంకరరావు, బనిశెట్టి వీధి, సోంపేట, శ్రీకాకుళం జిల్లా	1,100
పోషకులు : శ్రీ మంజుల శ్రీనివాస్, గుంజెవారి కాంప్లెక్స్, రాజీవ్‌నగర్, కర్నూలు	1,000

'శ్రీరామకృష్ణ ప్రభ' కానుక పథకం

యువతరానికి 'శ్రీరామకృష్ణ ప్రభ'ను మరింత చేరువ చేయాలని సంకల్పించాం. రాష్ట్రంలోని వివిధ పాఠశాలలు/ కళాశాలలు/ గ్రంథాలయాలకు పత్రికను పంపించడానికి మీ సహాయాన్ని కోరుతున్నాం. ఈ కానుక పథకం క్రింద చందా చెల్లించిన దాత పేరున (మీరు సూచించిన లేదా మేము ఎంపిక చేసిన) విద్యాసంస్థకు పత్రికను పంపుతాం. కానుక చందా రూ.1,500/- అంతకన్నా ఎక్కువ ఇచ్చిన దాత పేరు, విద్యాసంస్థ పేరు పత్రికలో ప్రచురిస్తాం.

దాత పేరు	విద్యాసంస్థ
శ్రీ పి.వి.సుబ్బారావు, భాస్కరపురం, మచిలీపట్నం, కృష్ణాజిల్లా	మచిలీపట్నం మున్సిపల్ లైబ్రరీ, రాబర్ట్‌సన్‌పేట, మచిలీపట్నం, కృష్ణాజిల్లా
శ్రీ పర్వత్ మల్లయ్య, భట్‌పల్లి, కాగజ్‌నగర్ (కీ॥శే॥పర్వత్ శ్రీనివాస్‌గారి జ్ఞాపకార్థం)	జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, భట్‌పల్లి,కాగజ్‌నగర్, ఆదిలాబాద్ జిల్లా
శ్రీ తంగిరాల ఈశ్వరచంద్ర (కీ॥శే॥ తంగిరాల వేంకట సత్యన్నారాయణగారి జ్ఞాపకార్థం)	మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, సోమవరప్పాడు, కృష్ణాజిల్లా
శ్రీ శంకర్ రెడ్డి, ప్రియాకాలనీ, గుడిమల్కాపూర్, హైదరాబాద్	5 పాఠశాలలకు 3 సంవత్సరాలకు పత్రికను స్పాన్సర్ చేశారు.

చందా వివరాలు		భారతదేశంలో	విదేశాలకు
విడి ప్రతి	:	₹ 10	-
సంవత్సర చందా	:	₹ 100	₹ 1,500
మూడు సంవత్సరాలకు	:	₹ 280	₹ 4,500
ఐదు సంవత్సరాలకు	:	₹ 450	₹ 7,500
ఇరవై సంవత్సరాలకు	:	₹ 1,500	₹ 22,000

గమనిక: డిమాండ్ డ్రాఫ్ట్, మనియార్డర్లలో **Ramakrishna Math, Hyderabad** అని వ్రాయాలి.
పంపవలసిన చిరునామా: **Sri Ramakrishna Prabha, Ramakrishna Math, Domalguda, Hyderabad - 500 029.**

చందాను ఆన్‌లైన్ **http://rkmath.org/srkp** ద్వారా చెల్లించవచ్చు.

లోపలి పేజీల్లో...

ఈ సంచికలోని రచయిత(త్రు)ల అభిప్రాయాలు వ్యక్తిగతమైనవి. సంపాదకులు గానీ, హైదరాబాద్ రామకృష్ణ మఠం గానీ వాటికి బాధ్యత వహించజాలరు. – సంపాదకులు

శ్రీరామకృష్ణ ప్రభ చందాదారులకు విన్నపం

ప్రియ పాఠకులారా!

- 'శ్రీరామకృష్ణ ప్రభ' పత్రిక కవరు మీద చిరునామాకు పైన మీ చందా నంబరు, కుడి వైపున మీ చందా గడువు ముగిసే నెల ఉంటాయి. మీ చందా గడువు పూర్తయ్యే నెలకు ముందుగానే సొమ్మును చెల్లించి చందాను పునరుద్ధరించుకోండి.
- మీ ఉత్తర ప్రత్యుత్తరాలన్నింటిలో తప్పనిసరిగా చందా నంబరు పేర్కొనాల్సిందిగా మనవి.
- మీ చిరునామా మారిన పక్షంలో 7వ తేదీ లోగా మాకు తెలియపరచినట్లయితే, వచ్చే నెల సంచిక నుండి మీ కొత్త చిరునామాకు పంపబడును.
- ప్రతీ నెల 26 లేదా 27వ తేదీల్లో పత్రిక పోస్ట్ అవుతుంది. మీకు పత్రిక 15వ తేదీ లోపుగా చేరనట్లయితే, వెంటనే మాకు తెలియజేయగలరు.

శ్రీరామకృష్ణ ప్రభ ద్వారా అవిచ్ఛిన్నంగా సేవలు అందించాలన్నదే మా ఆకాంక్ష. అందుకు మీ సహకారం కోరుతూ.... – సర్క్యులేషన్ మేనేజర్



దసరా మరియు దీపావళి శుభాకాంక్షలు

'శ్రీరామకృష్ణ ప్రభ' పాఠకులకు, రచయితలకు,
రచయిత్రులకు, ఏజెంట్లకు, దాతలకు,
శ్రేయోభిలాషులకు మా హృదయపూర్వక
దసరా మరియు దీపావళి శుభాకాంక్షలు. - సంపాదకులు



అబల కాదు..

ఈ ఆధునిక యుగంలో వనితలు ఎంత విద్యావంతులైనప్పటికీ, ఎన్ని ఉన్నత పదవులను నిర్వహిస్తున్నప్పటికీ, వైజ్ఞానిక, సాంకేతిక రంగాలలో తమ ప్రజ్ఞాపాటవాలను ప్రదర్శిస్తున్నప్పటికీ సమాజంలో స్త్రీ అంటే ఇంకా పరాధీనురాలు, బలహీనురాలు, నిస్సహాయురాలు అనే భావన పూర్తిగా తొలగిపోలేదు. స్త్రీ నిస్సహాయురాలు కాదు, సర్వశక్తిమంతురాలు; అబల కాదు ఆదిపరాశక్తి అని నిరూపించే దేవీభాగవతంలోని కథను తెలుసుకుందాం.

మహిషాసురుడు భూలోకాన్ని పరిపాలిస్తున్నప్పుడు ఆ దానవరాజుకు శాశ్వతంగా జీవించాలనే కోరిక కలిగింది. అందుకే మరణం లేకుండా ఉండేలా వరం పొందాలని ఘోరతపస్సు చేశాడు. మహిషుడి తపస్సుకు మెచ్చి బ్రహ్మ ప్రత్యక్షమై, 'మహిషా! ఏమి వరం కావాలో కోరుకో అనుగ్రహిస్తాను' అని అభయమిచ్చాడు. వెంటనే ఆ దానవరాజు 'నాకు మరణం లేకుండా ఉండేలా వరాన్ని ప్రసాదించు స్వామీ!' అని తన అభీష్టాన్ని తెలియజేశాడు. అందుకు బ్రహ్మ 'దానవరాజా! పుట్టినవాడు గిట్టక తప్పదు. ఇది ప్రకృతి నియమం. ఈ కోరిక తప్ప ఇంకేదైనా వరాన్ని కోరుకో' అని అన్నాడు. అప్పుడు మహిషుడు ఈ భూలోకంలో స్త్రీలు బలహీనులు, సుకుమార స్వభావులు. కాబట్టి వారిని ఎదుర్కోవడం సులభమని తలచి బ్రహ్మతో 'స్వామీ! నాకు స్త్రీల చేతిలో తప్ప, ఇంకెవరి వల్లా మరణం సంభవించకుండా ఉండేలా వరాన్ని ప్రసాదించండి' అని కోరాడు. మహిషుని కోరిక విన్న వెంటనే బ్రహ్మ 'తథాస్తు' అని ఆశీర్వదించాడు.

బ్రహ్మ నుండి వరం పొందిన మహిషాసురుడు మదగర్వంతో విర్రవీగుతూ ముల్లోకవాసుల్ని హింసించడం మొదలుపెట్టాడు. హరి హర బ్రహ్మాదులు, దేవతలు, గంధర్వులు, యక్షులు, కిన్నెర కింపురుషులు సైతం మహిషాసురుని దురాగతాలను అరికట్టలేక పోయారు. త్రిమూర్తులు, దేవతలందరూ ఒకచోట సమావేశమై మహిషాసురుణ్ణి అంతమొందించడమెలాగో ఆలోచించసాగారు. అప్పుడు సర్వదేవతాంశల నుండి ఒక మహాతేజోపుంజం వచ్చి ఆదిపరాశక్తిగా ఆవిర్భవించింది. ఆ మహామాయా స్వరూపిణి అయిన దేవికి, త్రిమూర్తులతో సహా దేవతలందరూ వివిధ ఆయుధాలను సమకూర్చారు.

స్త్రీలు అబలలనీ, శక్తిహీనులనీ, వారిని సునాయాసంగా ఎదిరించగలననీ, వారి చేతిలో మరణం సంభవించడం అసాధ్యమనీ అహంకరిస్తున్న మహిషాసురుణ్ణి మహామాయాదేవి సంహరించింది. ఆడది అబల కాదు ఆదిపరాశక్తి అని నిరూపించింది. స్వామి వివేకానంద కూడా మహిళల శక్తి సామర్థ్యాలను కొనియాడుతూ "భారతదేశం 500 మంది పురుషులతో విజయం సాధించడానికి 50 సంవత్సరాలు పడితే, అంతే మంది స్త్రీలతో కొన్ని వారాల్లోనే విజయం సాధించవచ్చు" అని అన్నారు.

జగన్మాత ఘోరయుద్ధం చేసి మహిషుణ్ణి వధించి విజయం సాధించిన రోజునే 'విజయదశమి'గా నేటికీ పండగ జరుపుకుంటున్నాం. అమ్మవారి సాహసకృత్యాలను స్మరిస్తూ, వైభవాన్ని స్తుతిస్తూ, శక్తిస్వరూపిణిగా ఆరాధిస్తూ విజయదశమిని ఆనందోత్సాహాలతో దేశమంతా జరుపుకుంటున్నాం. కానీ శక్తిస్వరూపిణీ, సహనమూర్తీ, కరుణాస్వరూపిణీ, మృదుస్వభావినీ, మధురభాషిణీ అయిన జగన్మాత అంశే - స్త్రీ అనే భావన మానవ హృదయాలపై ఏ కొంచమైనా ముద్రితమై ఉన్నా నేటి సమాజంలో మహిళలపై జరుగుతున్న వేధింపులు, హింసలు, అత్యాచారాలు మచ్చుకైనా కనిపించేవి కావు. స్త్రీలు జగన్మాత అంశలే అనే భావన కలగనంత వరకూ ఎన్ని కఠిన చట్టాలను చేసినా, రక్షణ బలగాలను ఎంత పెంచినా, న్యాయ స్థానాలను ఎన్నింటిని స్థాపించినా ఉపయోగం ఏముంది! 'మహిళలు అర్ధరాత్రి నడివీధిలో ఒంటరిగా నడిచివెళ్ళే పరిస్థితి నెలకొననంత వరకూ భారతదేశానికి నిజమైన స్వాతంత్ర్యం రానట్లే' అన్న గాంధీజీ మాటల్ని మరచిపోకూడదు.

ప్రకృతిని శాసించే శక్తి: మనిషి ప్రకృతికి అధీనుడు. ప్రకృతి నియమానికి విరుద్ధంగా పనిచేయడం ఎవరికీ సాధ్యం కాదు. అలాంటి ప్రకృతిని శాసించే శక్తి ఉన్న సీత, సుమతి, సావిత్రి, దమయంతి లాంటి సాధ్వీమణులు ఎందరో మన పుణ్యభూమిలో ఆవిర్భవించారు.

ఆంజనేయుని తోకకు రాక్షసులు నిప్పు అంటించినప్పుడు సీతామాత 'హనుమను ఏ మాత్రం బాధించవద్దు' అని అగ్నిదేవుణ్ణి శాసించింది. ఆమె ఆజ్ఞను శిరసావహించిన అగ్నిదేవుడు తన సహజ స్వభావాన్ని వీడి హనుమకు చల్లదనాన్ని ప్రసాదించాడు; సూర్యోదయమైతే తన భర్త ప్రాణాలు కోల్పోతాడని తెలిసిన సుమతి, సూర్యోదయం కాకుండా నిలువరించింది; వివాహమైన ఏడాదికే భర్త చనిపోతాడని తెలిసినా సావిత్రి, సత్యవంతుణ్ణి వరించింది. విధి నిర్ణయానుసారం భర్త మరణించాడు. కానీ మరణించిన భర్తను బ్రతికించుకోవడానికి సావిత్రి, యమధర్మరాజును మెప్పించి తన మాంగల్యాన్ని కాపాడుకుంది; పాచికలాటలో ఓడిపోయిన నలమహారాజు మూడేళ్ళపాటు అరణ్యవాసం చేయాల్సి వచ్చింది. దమయంతి కూడా భర్తతోపాటే అరణ్యాలకేగింది. ఒకరోజు నలదమయంతులు ఒక చెట్టు క్రింద విశ్రమిస్తున్నప్పుడు నాగదేవత శాపం వల్ల నలుడు కురూపిగా మారిపోయాడు. అతడికి ఆ శాపమే తరువాత కాలంలో ఓ వరమైంది. కానీ కురూపిగా మారిన నలుడు దమయంతిని విడిచి వెళ్ళిపోయాడు. అలాంటి పరిస్థితుల్లో ఒక వేటగాడు ఒంటరిగా ఉన్న దమయంతిని వేధించసాగాడు. సహనం కోల్పోయిన దమయంతి అతడు భస్మమైపోవాలని శపించింది. వెంటనే ఆ వేటగాడు బూడిదైపోయాడు.

సీతాదేవి, ఆంజనేయుణ్ణి రక్షించడానికి అగ్నిదేవుణ్ణి శాంతించమని శాసిస్తే, దమయంతి తనను వేధిస్తున్న వేటగాణ్ణి దహించ



ఆదిపరాశక్తి!

మని అగ్నిదేవుణ్ణి శాసించింది. సుమతి తన భర్తను కాపాడుకోవడానికి సూర్యుణ్ణి ఉదయించకుండా నిలువరిస్తే, సావిత్రి తన భర్తను బ్రతికించుకోవడానికి యముణ్ణే ధిక్కరించింది.

ఆధునిక మహిళలకు ఆదర్శమూర్తులు: నేటి మహిళలు అన్ని రంగాలలోనూ తమ ప్రతిభను చాటుతూ ఉన్నతంగా రాణిస్తున్నారు. భూతలం నుండి గగనతలం వరకూ సాహస కృత్యాలను ప్రదర్శిస్తూ కీర్తిపతాకలను ఎగురవేస్తున్నారు. కానీ మహిళల్ని ఇంకా అభద్రతాభావం వీడలేదు. పరాధీనత నుండి వారు పూర్తిగా బయటపడలేదు. మరి సీత, సుమతి, సావిత్రి, దమయంతి, శారదాదేవి లాంటి సాధ్వీమణులు అంతరిక్షంలో విన్యాసాలు చేయలేదు, వైజ్ఞానిక రంగంలో ప్రయోగాలు చేపట్టలేదు. అయినప్పటికీ వారంతా ప్రకృతిని శాసించగలిగారు, ఆపదలను అధిగమించగలిగారు, అకృత్యాలను అరికట్టగలిగారు. ఇది ఎలా సాధ్యమైంది? పవిత్రత, సహనం, సాహసం, ఆత్మస్థైర్యాలతో అది సాధ్యమని నిరూపించారు.

"ఆధునిక మహిళలు పవిత్రత, సహనం, ఆత్మస్థైర్యాలను పెంపొందించుకోవడానికి సీతామాత, శారదాదేవిలను ఆదర్శంగా తీసుకోవాల"ని స్వామి వివేకానంద సూచించారు.

దేవతలను సైతం లోబరచుకున్న మహాశక్తి సంపన్నుడైన రావణాసురుడు సీతామాతను స్వాధీనపరచుకోలేకపోయాడు. అలాగే శారదాదేవి ఒకసారి దక్షిణేశ్వరం నడిచి వెళుతున్నప్పుడు మార్గమధ్యంలో ఓ బందిపోటు దొంగ అడ్డుకున్నాడు. ఆమె దగ్గర ఉన్నవి దోచుకోవాలనుకున్న ఆ దొంగ శారదాదేవి ప్రసన్నవదనానికీ, మృదువచనాలకూ బందీ అయ్యాడు. పవిత్రత, ప్రసన్నతలతో ఎలాంటి క్రూరస్వభావుడినైనా జయించవచ్చని సీతామాత, శారదాదేవి నిరూపించారు.

అందుకే స్వామి వివేకానంద పవిత్రతకే వన్నెతెచ్చిన సీతామాతను శ్లాఘిస్తూ "భారతీయ మహిళలు ఆధునికత పేరుతో సీతమాత ఆదర్శాన్ని విస్మరిస్తే అపజయం పొందుతారు. భారతీయ మహిళలు ఉన్నత జీవనాన్ని గడపడానికి సీతామాత అడుగుజాడలను అనుసరించడమే సరైన మార్గం" అని హితవు పలికారు. అలాగే పవిత్రతకూ, సహనానికీ, కరుణకూ ప్రతీకగా నిలిచిన శారదాదేవి గురించి స్వామి వివేకానంద చెబుతూ "పవిత్రతకూ, ప్రశాంతతకూ పరాకాష్ఠగా నిలిచిన శారదాదేవి జీవితం కేవలం భారతీయ మహిళలనే కాదు ప్రపంచ దేశాల్లోని అందరినీ ప్రభావితం చేస్తుంది" అని ఉద్ఘాటించారు.

కారుణ్యమూర్తికి కాఠిన్యమూ అవసరమే!: మహిళలు సరళ స్వభావంతో ప్రవర్తించడమే కాదు, ప్రమాద పరిస్థితులు ఎదురైనప్పుడు కఠినంగా వ్యవహరించాలంటూ ఉత్తర రామాయణం ఇలా చెబుతోంది:

సర్వథా వ్యవహర్తవ్యం కుతో హ్యవచనీయతా ।
యథా స్త్రీణాం తథా వాచాం సాధుత్వే దుర్జనో జనః ॥

'స్త్రీల సాధుస్వభావాన్నీ, కోమలత్వాన్నీ చూసి జనులు అణగద్రొక్కడానికి ప్రయత్నిస్తారు. అందువల్ల స్త్రీలు కఠినత్వంతో వ్యవహరించాలి'.

శారదాదేవి సహనస్వరూపిణీ, మృదుభాషిణీ, కరుణరూపిణీ అయినప్పటికీ అవసరమైనప్పుడు కఠినంగా వ్యవహరించేవారు. ఒకసారి హరీశ్ అనే యువకుడు శారదాదేవిని వెంబడించి ఇబ్బంది పెట్టినప్పుడు అతడి బారి నుండి రక్షించుకోవడానికి దుర్గాదేవిలా అతడిని కిందపడవేసి మోకాలిని అతడి ఛాతీపై ఉంచి, రెండు చెంపలను వాయించారు. అందుకే స్వామీజీ "భారతీయ మహిళలు ఝాన్సీరాణిలా ధైర్యసాహసాలను ప్రదర్శించాలి. ఆత్మరక్షణకు అవసరమయ్యే ప్రక్రియలు నేర్చుకోవాలి" అని ప్రోత్సహించారు.

మహిళలు శక్తిహీనులని తలచిన మహిషాసురుడు సైతం అమ్మవారి చేతిలో అంతమయ్యాడు. ఆధునిక మహిళలు సీతాదేవి, శారదామాతల అడుగుజాడల్లో పయనించి పవిత్రత, సహనం, సాహస గుణాలను పెంపొందించుకొని 'మహిళలు అబలలు కాదు శక్తిస్వరూపిణు'లని నిరూపించాలి. ❖

మన దేశం ప్రపంచ దేశాలన్నింటిలోనూ అమిత బలహీనమైనదిగా, మిక్కిలి వెనుకబడినదిగా ఉండడానికి కారణం మహిళలను నిర్లక్ష్యం చేయడం, అగౌరవపరచడమే! -స్వామి వివేకానంద

గోరుముద్ద - స్వామి సుప్రియానంద



బొమ్మల కొలువు

మనకు ఎన్ని పండుగలో! ఆ పండుగల సమయంలో వాటికున్న మరెన్నో ప్రత్యేక ఆచార సంప్రదాయాలు. వాటిలో ఒకటి మన పిల్లలను బాగా ఆకర్షించే 'బొమ్మల కొలువు'. దీనిని ఒకప్పుడు దక్షిణ భారతదేశంలో శ్రీదుర్గా నవరాత్రులలో ఇంటింటా పెట్టుకొనేవారు. పేరంటానికి పిలిచి పిల్లల నెత్తిన రేగి పండ్లు కుమ్మరించేవారు. రేగిపండ్లు అనగానే ముక్కు పుటల్లోకి వాటి వాసన వచ్చింది కదూ! మరి ఆ బొమ్మల కొలువును కొంచెం తిలకిద్దామా!

రంగు రంగుల బొమ్మలు-చిన్నవి, పెద్దవి, అందమైనవి. మనుషుల బొమ్మలు; జంతువుల బొమ్మలు; చెట్లు, పుట్టలు; భవంతులు; రోళ్ళు, రోకళ్ళు; శ్రమ జీవుల చెమట మడుగులను అడుగున దాచి కనువిందు చేసే కొలనులు; పూతోటలు; రహదారులు; రచ్చ బండలు.

ఇక్కడ వీళ్ళెవరో చదరంగం ఆడుకుంటున్నారు. వాళ్ళక్కడ నృత్యం చేస్తున్నారు. ఒక్కొక్క మెట్టు ఎక్కుతూపోతే, అబ్బో, ఎంతమందో! కొలువు తీరున్నారు. ఒక మెట్టులో కూర్చొని సన్నాయి వాయిస్తున్నారు కొంత మంది అబ్బాయిలు. భజనలు చేస్తున్నారు ఇంకొందరు. బాగా పెరిగిన గడ్డాలతో కళ్ళు మూసుకొని ధ్యానం చేస్తున్నారు యోగులు. అందరి కంటే పై మెట్టున బొద్దుగా ఉన్న దేవుళ్ళ బొమ్మలు. వీళ్ళు ఎంచక్కా ఏమీ పట్టనట్టుగా కూర్చొన్నారు. ఆ మాటకొస్తే చిన్నా, పెద్దా అందరూ వాళ్ళవాళ్ళ లోకాల్లో వాళ్ళున్నారు.

ఈ బొమ్మల కొలువు చూస్తే మనకు ఏమనిపిస్తుంది? మనం బొమ్మలం, ప్రపంచం ఒక బొమ్మలాట. ఆ పరమాత్ముని అభివ్యక్తీకరణలోని భేదాలే ఈ బొమ్మలు. ఒక్కొక్క మెట్టు ఒక్కొక్క స్థాయిని తెలియజేస్తుంది. పై మెట్టున దేవుళ్ళను పెడతారు. ఆ పరమాత్మను చేరడానికి మానవుడు ప్రయత్నించాలని గుర్తుచేయడమే ఈ బొమ్మల కొలువు ఉద్దేశం.

ఈ చరాచర జగత్తు అంతా ఒకే చైతన్యంతో నిండివున్నదని దర్శించిన శ్రీరామకృష్ణుల మాటలను విందాం:

"చెట్టు చేమలు, మనుషులు, పశువులు, గడ్డి, నీరు తదితరాలన్నీ రకరకాల ఒరలు (కోశాలు)గా నాకు కనిపిస్తాయి. అవి తలగడ గలీబులు వంటివి. వాటిలో కొన్ని ఎర్రరంగు ముతకబట్టతో, మరికొన్ని పట్టుబట్టతో, కొన్ని వివిధ రకాల బట్టలతో తయారు చేయబడతాయి. మళ్ళీ వీటిలో కొన్నిటిని గుండ్రంగా, మరికొన్నింటిని చతుర్భుజాకృతిలో తయారు చేస్తారు. ఈ జగత్తు కూడా అలాగే ఉంటుంది. మళ్ళీ ఈ రకరకాల గలీబులన్నీ ఒకే ఒక్క పదార్థంతో, (దూదితో) ఎలా నింపబడి ఉంటాయో, అలాగే మనిషి, ఆవు, గడ్డి, నీరు, పర్వతం మొదలైన అన్ని ఒరలలోను ఆ ఒక్క అఖండ సచ్చిదానందమే నిండి ఉంటుంది. నాయనలారా! నిజానికి అమ్మ (జగజ్జనని) రకరకాల ముసుగులు వేసుకొని, రకరకాల రూపాలు దాల్చి, వాటిలోపల నుండి తొంగి చూస్తున్నట్లు నేను దర్శిస్తున్నాను. ఈ జగత్తు సదా సర్వదా ఆ విధంగా కనిపిస్తూ ఉన్న స్థితిలో నేను ఉన్నాను."

'భారతీయులు ఏ పని చేసినా అది ఆధ్యాత్మికతతో ముడిపడి ఉంటుంది' అని స్వామి వివేకానంద అన్నట్లు బొమ్మల కొలువు ద్వారా కూడా భగవంతుణ్ణి చేరుకోవడమే మానవజన్మ ఉద్దేశమని ప్రబోధించగల మహోన్నత సంస్కృతి మనది. ❖



శ్రీమాత మన లలిత

– ఎమ్. సత్యనారాయణమూర్తి

'శ్రీ' శబ్దం అమృతవాచకం. 'శ్రీ' అనే అక్షరం శుభానికి ప్రతిరూపం. 'శ్రీ' అనే అక్షరం ఓంకారానికి మరో రూపం. 'శ్రీ' కారం సత్త్వ రజ స్తమో గుణాలను తెలియజేస్తుంది. దేవి త్రిగుణమయి కాబట్టి శ్రీమాత అయింది. 'శ్రీ'లో శకారం, రకారం, ఈకారం ఉన్నాయి. వీటిలో 'శ' కారం ఆనందవాచకం. 'ర' కారం తేజోవాచకం. 'ఈ' కారం శక్తివాచకం. అంటే దేవి తేజోమయానందశక్తి స్వరూపిణి. అందుకే ఆమె శ్రీమాత అయింది. 'శ్రీ' అంటే అమృతం. అమృతం అంటే మృత్యువు లేని స్థితి. మృత్యువు లేకపోవడం అంటే జన్మ కూడా లేకపోవడం. జనన మరణాలు లేకపోవడం అంటే మోక్షస్థితి అని అర్థం.

మంత్ర స్వరూపానికి మాత అని పేరు. ఇక శ్రీ అంటే శ్రేష్ఠమైన అని అర్థం. జగదంబ శ్రేష్ఠమైన మంత్ర స్వరూపిణి అని అర్థం. ఆమె సకల మంత్రాలకూ తల్లి. శ్రీ అంటే లక్ష్మి, సరస్వతి, బుద్ధి, ధర్మార్థకామాలు, సంపత్తి, విభూతి, విద్య, ఉపకరణం, శోభ అనే అర్థాలు ఉన్నాయి. ఇవన్నీ ఆమె నుంచే వస్తున్నాయి. వీటన్నింటికీ ఆమే అధిష్ఠాన దేవత. అందుకే ఆమె శ్రీమాత. లలితా సహస్రనామస్తోత్రం తల్లితో ప్రారంభం అవుతోంది. తల్లితండ్రులను గౌరవించలేనివారు, తల్లితండ్రులను భారంగా భావించేవారు లలితా సహస్రనామ పారాయణకు అర్హులు కారు.

మనం దేవుని ప్రార్థించినా, ప్రార్థించకపోయినా ప్రకృతి మీద ఆధారపడక తప్పదు. మనం ఎంత ప్రయత్నించినా ప్రకృతి నియంత్రణను అధిగమించలేం. కాబట్టి మనం ఆమె మీద ఆధారపడినట్లే. అందువల్ల ఆమె శ్రీమాత అయింది. జీవుల పాపాలను ఆమె పరిహరించగలదు. జీవుల పుణ్యాలను పరిపక్వం చేయగలదు.

శ్రీమాత అంటే మానము, మాత, మేయము అని అర్థం. మానము అంటే కొలత. మాత అంటే కొలిచేది. మేయము అంటే కొలవబడేది. మరి ఎవరు కొలుస్తున్నారు? ఏమి కొలుస్తున్నారు? ఎవరిని కొలుస్తున్నారు? అని ఆలోచిస్తే కొలిచేది ఆమె. కొలవబడేది మనం. ఎవరికి ఎంత ఇవ్వాలో, ఎప్పుడు ఇవ్వాలో, ఎలా ఇవ్వాలో నాణ్యమైన కొలత తెలిసిన మాత ఆమె.

ఇంతకీ జగదంబ ఏమిటి కొలుస్తుంది? మన పాపపుణ్యాలను బహుజాగ్రత్తగా కొలుస్తుంది. మన మంచిచెడ్డలను కొలుస్తుంది. జన్మపరంపరను కొలుస్తుంది. మనలోని వంచనను కొలుస్తుంది. మనలోని ఆర్తిని కొలుస్తుంది. మన చిత్తశుద్ధి ఎంత? మనలోని సత్యం ఎంత? అసత్యం ఎంత? మన పూజలోని మర్మం ఏమిటి? మన నమస్కారాల్లోని నిజాయతీ ఎంత? వీటిని ఆమె చక్కగా కొలవగలదు. శుద్ధి లేని అక్రమద్రవ్యంతో ఆమెకు బంగారు తొడుగు తొడిగి, ఆమె మన పాపాన్ని క్షమిస్తుందనీ, మనకు అండగా నిలుస్తుందనీ వెర్రి భ్రమలో చిక్కుకుంటాము. మన ద్రవ్యంలోని శుద్ధిని జగదంబ కొలవగలదు. మన సమర్పణల్లోని పాపానికి పాపాన్నీ, పుణ్యానికి పుణ్యాన్నీ తలవెంట్రుక వాసి తేడా లేకుండా కొలవగలిగే శ్రీమాత ఆమె.

ఆమె – సర్వజీవులకూ తల్లి. సర్వదేవతలకూ తల్లి. ఆమె దేవజనని. 'చండీ సప్తశతి'లో ఆమెను "త్వమేవ సా త్వం సావిత్రీ త్వం దేవజననీ పరా – దేవతలకు తల్లి, పరదేవత అయిన సావిత్రివి నీవే" అని వర్ణించారు. కాళికా సహస్రనామాల్లో ఆమెను 'సర్వమాతా' అని వివరించారు. మన తల్లి మనకు మాత్రమే తల్లి. కానీ దేవి మాత్రం అందరికీ తల్లి. దుర్వాసుడు ఆమెను 'శ్రీమాతః త్రిపురే – శ్రీమాత ముల్లోకాలకూ తల్లి' అని ప్రశంసించాడు. "యా దేవీ సర్వభూతేషు మాతృరూపేణ సంస్థితా. నమస్తస్యై నమస్తస్యై నమస్తస్యై నమో నమః – సర్వభూతాలలో తల్లి రూపంలో ఉన్న నీకు శతకోటి ప్రణామాలు" అని చండీ సప్తశతి ఆ జగదంబకు నీరాజనాలు అర్పించింది. ఈ మంత్రాన్ని నిత్యం వేయి పర్యాయాలు జపిస్తే జన్మజన్మలకూ మాతృ వియోగం ఉండదు. మాతృభక్తికి లోటు ఉండదు. శ్రీమాత మనల్ని కటాక్షించు గాక! ❖

సమస్త జగత్తునూ జగన్మాత తన మాయతో కప్పి ఉంచింది. సృష్టి స్థితి లయలనే మహాలీలల్ని ఆమె సాగిస్తోంది. మోక్షద్వారం తెరవాలంటే అమ్మ అనుగ్రహం ఉంటేనే సాధ్యం. –శ్రీరామకృష్ణులు



పలికెడిది భాగవతం

వేరు తీర్థంబు లవనిపై వెదకనేల ?

– స్వామి జ్ఞానదానంద

మంచిముత్యం లాంటి మనుమడు పరీక్షిత్తు పుట్టాక, పాండవాగ్రజుడు అశ్వమేధ యాగం చేయాలనుకున్నాడు. దాయాదులైన దుర్యోధనాదులను రణరంగంలో తుదముట్టించి నందుకు, పాపపరిహారంగా తలపెట్టిన ఈ యజ్ఞానికి శ్రీకృష్ణ భగవానుణ్ణి బంధుసమేతంగా ఆహ్వానించాడు. అంతేకాకుండా ఆ ధర్మనందనుడు పురుషోత్తముడైన ఆ పరమాత్ముడిని యజ్ఞపురుషుడిగా భావించి మూడు అశ్వమేధ యాగాలు ఆచరించాడు. అనంతరం ఆ గోవిందుడు పాండవుల అభీష్టం మేరకు హస్తినాపురంలో కొన్ని మాసాల పాటు ఉండి, అర్జునుణ్ణి వెంటబెట్టుకొని ద్వారకా నగరానికి వెళ్ళిపోయాడు. ఈ కార్యక్రమాలన్నీ పూర్తయ్యాక కురుక్షేత్ర యుద్ధ సమయంలో తీర్థయాత్రలకు వెళ్ళి పరమార్థ జ్ఞానాన్ని పొందిన విదురుడు కృతార్థుడై తిరిగి హస్తినకు వచ్చాడు.

అత్యంత ఆత్మీయుడైన విదురుడు తీర్థయాత్రలు ముగించు కొని తిరిగి వచ్చాడని తెలిసి, ధృతరాష్ట్రుడు, ధర్మరాజు తదితరు లంతా సంతోషంగా ఎదురేగి స్వాగతం పలికారు. ధర్మనందనుడు ధర్మవిదురుడైన విదురునికి సకల సత్కారాలూ చేసి, వారు సేదతీరుతున్న సమయంలో సమీపించి మర్యాద పూర్వకంగా...

ఏ వర్తనంబు నింతకాలము మీరు సంచరించితి రయ్య జగతిలోన
నే తీర్థములు కంటిరెక్కడ నుంటిరి భావింప మీవంటి భాగవతులు
తీర్థసంఘంబుల ధిక్కరింతురు కదా!మీయందు విష్ణుండు మెరయు
కతన మీరు తీర్థంబులు;మీకంటె మిక్కిలి తీర్థంబులున్నవె తెలిసి చూడ

వేరు తీర్థంబు లవనిపై వెదకనేల
మిమ్ము పొడగని భాషింప మేల చాలు
వార్త లేమంద్రు, లోకులు వసుధలోన
మీకు సర్వంబు నెరిగెడి మేధ గలదు!

“అయ్యా! ఇంతకాలం మీరు ఏయే ప్రాంతాలు సందర్శించారు? ఎలా సంచరించారు? ఏయే పుణ్యతీర్థాలను సేవించారు? ఏయే ప్రదేశాల్లో నివసించారు? మీ వంటి పరమ భాగవతోత్తములు తీర్థాలను అంతగా పట్టించుకోరు కదా! మీలో భగవంతుడు సన్నిధి చేసి ఉన్నాడు. కనుక మీరే పుణ్యతీర్థాలు. ఆలోచించి చూస్తే మీ కంటే మించిన పుణ్యతీర్థాలు పుడమిలో ఎక్కడ ఉన్నాయి? మీ వంటి మహాత్ములను దర్శించి సంభాషించే అదృష్టం అబ్బితే చాలదా! వేరే తీర్థాల కోసం వెదకవలసిన పనేముంది? మీరు సర్వజ్ఞులు, వివేకవంతులు, ఉన్న చోట నుంచే లోకంలో ఉన్న విశేషాలన్నీ తెలుసుకోగలరు!” అన్నాడు.

పవిత్ర హృదయాలను మించిన పుణ్యతీర్థాలు లేవనీ, ధర్మాచరణుల పాదధూళిని తాకినా పుణ్యక్షేత్రాలను సందర్శించిన ఫలం కలుగుతుందనీ పాండవాగ్రజుడు పరోక్షంగా మనకు విస్పష్టం చేస్తున్నాడు. తీర్థయాత్రలకు వెళ్ళివచ్చిన వారిని ఎలా స్వాగతించి, విశేషాలను తెలుసుకోవాలో గుర్తుచేస్తున్నాడు.

పవిత్రమూర్తులే పుణ్యతీర్థాలు...: మహాపురుషుల సాన్నిధ్యం కంటే తీర్థస్థలం మరొకటి లేదు. జితేంద్రియులై, జీవితాన్ని సాధనకే అంకితం చేసిన పవిత్రమూర్తులు ఎక్కడ నడయాడితే, అదే పుణ్యతీర్థంగా భాసిస్తుంది. భవిష్యత్తులో అదే ఓ మహాక్షేత్రమై ముందు తరాలను ఆకర్షిస్తుంది. అందుకే ధర్మానుష్ఠాన పారీణులైన మహానుభావులను దర్శిస్తూ ఉంటే, వారి అభిభాషణలను ఆలకిస్తూ, ఆచరణలో పెడుతూ ఉంటే మనకు కోటిపుణ్యతీర్థాల్లో స్నానం చేసిన ఫలం దక్కుతుంది. స్థిరంగా ఓ ప్రదేశంలో ఉంటూనే, సాధనతో ఎంతో ఆధ్యాత్మిక ప్రగతిని సాధించవచ్చు.

అందుకే తమ ప్రత్యక్ష శిష్యుడు స్వామి అద్వైతానంద తీర్థయాత్రలు చేయాలన్న తలంపును తమ ముందు వ్యక్తం చేసినప్పుడు భగవాన్ శ్రీరామకృష్ణ పరమహంస “పలు పుణ్యక్షేత్రాలు తిరుగుతూ ఉండే సాధువు బహూదకుడు. అటూ ఇటూ తిరగాలన్న కోరిక తీరిపోయి స్థిరంగా ఒకచోట కూర్చొనే సాధువు కుటీచకుడు” అంటారు. ఇలా బహూదకుడు స్థాయి నుంచి కుటీచకుడు స్థాయికి ఎంత త్వరగా రాగలిగితే అంత త్వరగా ఆధ్యాత్మిక పరిణతి సాధ్యపడుతుంది. ఆ స్థితికి చేరుకోవడానికి సద్గురువులనూ, మహితాత్ములనూ ఆశ్రయించాలి. అందుకే భగవాన్ శ్రీరామకృష్ణులు భౌతికంగా జీవించి ఉన్న రోజుల్లో ఓ పరమభక్తుడు ‘కలకత్తా వాసులు

అవివేకులు. కౌస్తుభమణిని పక్కన పెట్టుకొని, సాధారణ మణుల కోసం వెతుకుతున్న అమాయకుల్లా, అవతార పురుషుడిని సమీపంలో పెట్టుకొని ఎక్కడెక్కడో పుణ్యక్షేత్రాలు తిరిగివస్తూ ఉంటారు' అని అనేవాడు.

విమల చరితులలో విష్ణువు... : ధర్మజుడు విదురుడిని ప్రస్తుతిస్తూ 'మీ యందు విష్ణుండు మెరయ కతన మీరు తీర్థంబులు' అంటున్నాడు. నిర్మలమైన వారి మనస్సులోనే ఆ భగవంతుడు కొలువై ఉంటాడని కొనియాడుతున్నాడు. అందుకే ద్వాపరయుగంలో సాక్షాత్తూ భగవానుడైన శ్రీకృష్ణుడు విదురుడిని ఆత్మబంధువుగా భావించాడు. రాయబార సమయంలో దుర్యోధనాదులు రాచమర్యాదలతో ఆతిథ్యానికి ఆహ్వానించినా ఆయన నిరాకరించాడు. దుర్యోధనుడు 'కృష్ణా! మేము నిన్ను పూజించాలనుకున్నాం. దీనిని నీవు స్వీకరించకపోవడానికి కారణమేమో తెలియడం లేదు. నీకూ, మాకూ వైరం ఏమీ లేదు కదా?' అని ప్రాధేయపడతాడు. అయినా శ్రీకృష్ణుడు సున్నితంగా తిరస్కరిస్తూ...

సర్వమేతన్న భోక్తవ్యమన్నం దుష్టాభి సంహితమ్
క్షత్తురేకస్య భోక్తవ్యమితి మే ధీయతే మతిః

'దుష్టులు సమకూర్చిన ఈ అన్నం తినదగినది కాదు. నేను తినదగినది ఒక్క సత్పురుషులు పెట్టే భోజనమేనని నా నిశ్చయం' అంటూ కౌరవుల రాజప్రాసాదాన్ని విడిచి, విదురుని గృహానికి వెళ్ళిపోతాడు. ప్రేమతో పెట్టిన అల్పాహారాన్నే అమిత ప్రీతితో స్వీకరిస్తాడు. పరోక్షంగా పరమాత్మ భక్తుడి వైభవానికి కాకుండా, అతని నిర్మల చిత్తానికే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తాడని ఇక్కడ ఋజువు చేశాడు. ఇలా భక్తుడైన వారి హృదయాలనే తన కోవెలలుగా చేసుకొని భగవంతుడు కొలువుంటాడు. అందుకే భాగవతోత్తములైన వారిని సేవించుకోవడం భగవంతుడిని సేవించుకోవడంతో సమానం అవుతుంది.

తపోభూమే తీర్థస్థలి : మహానుభావులు మానవాళి ఉద్ధరణ కోసం శరీరాన్ని దాల్చి, సాధనలు ఒనర్చి ఆ ఫలాన్ని మనందరికీ మిగిల్చి వెళతారు. భౌతికంగా వారు మన మధ్య లేకపోయినా, ఆ పుణ్యఫలం మనందరినీ ప్రభావితం చేయడమే కాకుండా, పరిరక్షిస్తూనే ఉంటుంది. అలాంటివారు తదేక దీక్షతో ఎక్కడో కొండల్లోనో, కోనల్లోనో కూర్చొని ఉన్నా సకల ప్రపంచాన్ని తమ జ్ఞాననేత్రంతో వీక్షించగలరు. అందుకే ధర్మనందనుడు తన పినతండ్రితో 'మీకు సర్వంబు నెరిగెడి మేధ కలదు' అన్నాడు.

ఓ సారి శంకరాచార్యుల వారు పాదచారియై నడుస్తూ ఉన్నప్పుడు ఎండ నుంచి సేద తీరడానికి ఓ చోట కూర్చొన్నారు. మంచి రోహిణీ కార్తె అది! అటువంటి సమయంలో దూరంగా ఎండకు శోషించిపోయి, ఓ కప్ప నీటిలోకి దూకలేక అలా ఉండిపోయింది. ఇంతలో పక్కన పుట్టలోని ఓ పెద్ద నాగుపాము కప్ప దగ్గరకు వచ్చింది. అది కప్పను మింగుతుందని శంకరాచార్యుల వారు అనుకున్నారు. కానీ ఆ తాచుపాము పడగ ఎత్తి ఆ పడగ నీడలో కప్పకు విశ్రాంతినిచ్చింది. కప్ప కొంతసేపు విశ్రాంతి తీసుకొని ఆ తరువాత నీటిలోకి దూకింది. ఆదిశంకరులకు ఆశ్చర్యమేసింది! వెంటనే అంతర్ముఖులై, ఒక నాగుపాము కప్పకు ఎందుకు పడగపట్టింది? అని ఆలోచించ సాగారు. అది ఋష్యశృంగ మహర్షి తపస్సు చేసిన ప్రదేశమని గుర్తించారు. అందుకే అక్కడ జీవులకు ఒకదానిపై మరొకదానికి శత్రుభావన లేకుండా, చెనకకుండా, అంత సంతోషంగా కలసిమెలసి ఉంటున్నాయని అర్థం చేసుకోగలిగారు. అందుకే అంత పరమ పవిత్రమైన స్థలంలోనే జగద్గురువులు శంకరాచార్యులు శృంగగిరి పీఠాన్ని స్థాపించారు; అదే శృంగేరి పీఠం.

ప్రేమ పంచిన పినతండ్రి... : పాండురాజు కన్నుమూసిన తరువాత కౌరవులు పాండవులను ఎన్నో బాధలు పెట్టారు. సర్పాల చేత కరిపించారు. విషాన్నం తినిపించారు. ఇంటికి నిప్పంటించారు. ఆ సమయంలో కుంతీదేవినీ, పాండవులనూ మృత్యువాత పడకుండా విదురుడే అత్యంత అనురాగంతో రక్షించి లాలించి పాలించాడు. కష్టాల నుంచి వారిని గట్టెక్కించాడు. ధృతరాష్ట్రుడు, దుర్యోధనుడు, శకుని తదితరులు ఎంత ప్రలోభపెట్టినా విదురుడు వారి వైపు వెళ్ళలేదు. ధర్మాన్నీ, న్యాయాన్నీ నమ్ముకున్న పాండవులకే తన మద్దతు తెలిపాడు. దాసి కొడుకైనా రాజభోగాల కోసం కక్కుర్తి పడలేదు. అందుకే ఆ పుణ్యమూర్తి పాదజలాన్ని ధర్మరాజు తన తలపై చల్లుకుంటూ...

పక్షులు తమ రెక్కలలో పక్షంబులు రాని పిల్ల పదువుల మమతన్ రక్షించిన క్రియ మీరలు,పక్షీకరణంబు సేయ బ్రతికితిమి కదే

'రెక్కలు రాని తమ పసికందుల్ని రెక్కల్లో దాచుకొని మమకారంతో రక్షించే పక్షుల విధంగా మీరు ఎంతో దాక్షిణ్యంతో మా పక్షం వహించి మమ్మల్ని రక్షించార'ని పాదాభివందనం చేశాడు. ❖

మహా భక్తులు, పుణ్యాత్ములు యాత్రాస్థలాలకే పావనత్వాన్ని ప్రసాదిస్తారు. ఆ మహాత్ముల పాదస్పర్శ చేత పుణ్యతీర్థాలూ పరవశించి, మరింత మాహాత్మ్యాన్ని సంతరించుకుంటాయి. అలాంటి మహానుభావులు తీర్థాలకే కాక, తమ భక్తిబలంతో, సాధనా సంపత్తితో ధార్మిక గ్రంథాలకూ ప్రామాణికతను తీసుకువస్తారు. అందుకే సాక్షాత్కరించిన సరస్వతీ పుత్రుల్లాంటి ఆ సాధకులను సేవించుకుంటూ, వారు చూపిన సన్మార్గంలో నడుస్తూ ఉంటే, సర్వతీర్థాలను సందర్శించిన పుణ్యఫలం దక్కుతుంది.

గుహుని నడవడి ఎలాంటిది? గజేంద్రుని చదువెంత? కుబ్జ సౌందర్యం ఎలాంటిది? కుచేలుడు ఎంతటి సంపన్నుడు? మాధవుడు కేవలం భక్తినే చూస్తాడుగాని, ఇతర గుణములను చూడడు. -శ్రీవత్సాంకశ్రీసూక్తి

"ఒక వ్యక్తి తనను తాను అసహ్యించుకొంటున్నట్లయితే అదే పతనానికి హేతువు. పూర్వీకుల చరిత్రను అవమాన కరంగా భావిస్తే, ఆ జాతి అంతానికి చేరుకున్నట్లే!" అంటారు స్వామి వివేకానంద. గత వైభవాన్ని మర్చిపోయినంత కాలం మనమూ, మన దేశం స్తబ్ధతలో మునిగిపోతాం. అందుకే, మన ప్రాచీన సంస్కృతి గురించి తెలుసుకోవాలి. గడచిపోయిన సంగతులు తెలుసుకొంటూ, భవిష్యత్ మహత్కార్యాల సాధన వైపు నడవాలి. మన ప్రాచీన భారతీయ సంస్కృతిని గుర్తు చేసేందుకు చేస్తున్న ప్రయత్నమే ఈ వ్యాసాల పరంపర. సుప్రసిద్ధ రచయిత, బెంగుళూరు రామకృష్ణ మఠం అధ్యక్షులు స్వామి హర్షానంద మహరాజ్ మధ్యయుగాల కాలం దాకా విలసిల్లిన మన సంస్కృతిని 'శ్రీరామకృష్ణ ప్రభ' పాఠకులకు 2014 ఫిబ్రవరి సంచిక నుండి వివరిస్తున్నారు.

అనేక శాస్త్రాల్లో ఆనాడే మనం దిట్టలం!

గణిత శాస్త్రం: వేదకాలం నాటి భారతీయులు యజ్ఞయాగాదులలో నిష్ణాతులు. హోమాలలో నివేదనలు చేయడానికి జామితీయ (Geometry), ఖగోళశాస్త్రాలు క్షుణ్ణంగా తెలిసి ఉండాలి. జామితీయ శాస్త్రం చక్కని యాగశాలల నిర్మాణానికి, ఖగోళశాస్త్రం తగిన ముహూర్తాలలో ఈ హోమాలు చేయడానికి అవసరం. 'సులభ సూత్ర గ్రంథం' మొదటి అంశాన్నీ, జ్యోతిశ్శాస్త్రం రెండవ అంశాన్నీ విశదపరచాయి.

సంఖ్యలకు అక్షరాలు, లెక్కకు మితిమీరిన సంఖ్యలను తెలియజేసే పద్ధతి (10^{14}), దశాంశ, ద్వంద్వ దశాంశ పద్ధతులు, అంకెలతో పాటు శూన్యం, అనంతం, వర్గసూత్రాలు, కరణులు, అనిర్ధారక సమీకరణాలు ప్రాచీన భారతీయులకు పరిచిత అంశాలే.

మరొక విలక్షణమైన భారతీయ గణితశాస్త్ర విశేషం - పదసంఖ్యల వాడకం. ఉదాహరణకు ఖ, ఆకాశ (అంతరిక్షం) లేక శూన్య పదం సున్నలను సూచించడానికీ; క్షితి, ధార, పృథ్వి (భూమి) ఒకటిని సూచించడానికి వాడేవారు. ఈ పద్ధతి వల్ల గణితాన్ని సూత్రగ్రంథాల పద్యాలలో క్లుప్తంగా చెప్పడానికి వీలైంది. పూర్ణాంక సంఖ్యల వర్గ, ఘనమూలాలు నిర్ణయించడాన్ని క్రీ.శ. 499లో ఆర్యభట్టు, క్రీ.శ. 7వ శతాబ్దంలో బ్రహ్మగుప్తుడు వివరించారు.

బీజగణితం గురించి ఆలోచిస్తే హోమ గుండాల నిర్మాణం, ఇటుకలు పేర్చడం వైదిక ఆర్యులకు ఒక తీవ్ర సమస్యగా మారింది. ఈ సమస్య పరిష్కారంలో వారికి బీజ గణితపు జామితీయ పద్ధతులు తెలిశాయి. ఆపస్తంభ (క్రీ.పూ. 400), బౌద్ధాయన (క్రీ.పూ. 600), కాత్యాయన (క్రీ.శ. 400) మొదలైనవారు సులభశాస్త్రాలలో ఏకఘాత, వర్గ, సమకాలిక, నిర్ధారక సూత్రాలు వివరించారు. బీజగణితాన్ని 'కుట్ట గణితం' అనేవారు. 'బీజగణితం' అనే పదాన్ని ప్రదూతకస్వామి (క్రీ.శ. 860) వాడారు. స్థానాంగ సూత్రాలు (క్రీ.పూ. 100)లో సాధారణ, వర్గ ఘన సూత్రాలు ఇవ్వబడ్డాయి.

జామితీయ పద్ధతులు వైదిక హోమగుండాల నిర్మాణంలో ప్రారంభమయ్యాయి. బౌద్ధాయనుడు (క్రీ.పూ. 600) పైథాగరస్ సిద్ధాంతాన్ని అప్పటికే వివరించి ఉన్నాడు. చతుర్భుజ వికర్ణ లేక వికర్ణ చతుర్భుజ వైశాల్యాలను బ్రహ్మగుప్తుడు తన 'బ్రహ్మస్ఫుట సిద్ధాంతం'లో వివరించాడు.

త్రికోణమితి ఖగోళశాస్త్రపు అంతర్భాగంగా అభివృద్ధి చెందింది. సైన్-కోసైన్‌లను, జ్యా-కోజ్యా అనేవారు. అనేక మూల సూత్రాలు $\sin(90-\theta) = \cos\theta$, $\sin 2\theta = 2 \sin\theta \cos\theta$ - మరియు త్రికోణమితి సూత్రాలు వివరించబడ్డాయి. ఇక సమకాలీన, అపకాలీన, కలనగణితం (Calculus), బ్రహ్మగుప్త, భాస్కర-II (క్రీ.శ. 1150) గణితాలలో కనిపిస్తాయి.

ప్రాచీన - మధ్యయుగాల నాటి భారతీయులు గణితశాస్త్ర వివిధ విభాగాల విజ్ఞానాన్ని కలిగి ఉన్నట్లు మనకు తెలుస్తుంది.


వైద్యం - శస్త్ర చికిత్స: ఆరోగ్యవంతమైన శరీరంలోనే దృఢమైన మనస్సు ఉండగలదు. ఈ రెండింటి సమాన శక్తి వల్లే దృఢమైన ఆత్మశక్తి ప్రకటితం కాగలదు. ఈ విషయం గురించి సమగ్ర ఆరోగ్యవంతమైన ఆయుర్వేదం (లేక ఆయుష్షును పెంచే శాస్త్రం) చతుర్ముఖ బ్రహ్మచే సృష్టింపబడిన అశ్వనీ దేవతలతో, భరద్వాజ మహర్షి ద్వారా మనకు అందించబడినది. భారతీయ సంస్కృతిలో వైద్యశాస్త్ర ప్రారంభం ఇలా జరిగింది.

ఆయుర్వేదం మూలసూత్రాలు ఋగ్వేదంలో ప్రస్తావించబడినప్పటికీ, అధర్వవేదములోనే వివరంగా, ప్రణాళికాబద్ధంగా సూచితమయ్యాయి. బొల్లి, కుష్ఠువ్యాధి,

క్షయ, పసరికల లాంటి వ్యాధులకు చికిత్స; దంతవైద్యం, కృత్రిమమైన చేతులు, కాళ్ళు, వాజీకరణం, కంటి జబ్బులకు చికిత్స ప్రస్తావితమయ్యాయి. వైద్యులకు మానవ శరీర ధర్మశాస్త్రం గురించి చక్కని అవగాహన ఉండేది. కన్ను మార్పిడి గురించి కూడా కొన్ని గ్రంథాలలో ప్రస్తావించారు.

చరక (క్రీ.శ. 200), సుశ్రుత (క్రీ.శ. 400) సంహితలు ఆయుర్వేదంలో ప్రామాణిక గ్రంథాలు. రెండవ వాగ్భటుని అష్టాంగ హృదయం (క్రీ.శ. 8వ శతాబ్దం) మరొక సూత్రగ్రంథం.

ఆయుర్వేద ప్రామాణిక గ్రంథాలు అష్టాంగాలు లేక ఎనిమిది విభాగాలను ప్రస్తావించేవి. అవి: కాయచికిత్స (రోగాలకు చికిత్స), శల్యతంత్ర (శస్త్ర చికిత్స), శాలాక్య తంత్ర (చెవి, ముక్కు, గొంతు, కంటి వైద్యశాస్త్రం), భూత విద్య (మానసిక వైద్యం), కౌమారభృత్య తంత్ర (చిన్నపిల్లల వ్యాధులు), అగదతంత్ర (విషశాస్త్రం), రసాయన తంత్ర (వృద్ధాప్య నివారణ), వాజీకరణ తంత్ర.



పై గ్రంథాలలోనూ, కౌటిల్యుని అర్థశాస్త్రంలోనూ అనేక విషయాలు ప్రస్తావితమయ్యాయి. మానవశరీరంలోని అస్థి నిర్మాణం, రక్త వాహికలు, నాడులు; విషచికిత్స నిపుణులు, సేవకుల విధులు; శల్య నిపుణుల ప్రవర్తన నియమావళి; కొన్ని రకాల తైలాలు, లేపనాల ప్రయోగం, కట్టు కట్టడం, శస్త్ర చికిత్సలో వాడే పనిముట్లు మొదలైనవి వివరింపబడ్డాయి.

పాశ్చాత్య యాత్రికులైన మెగస్తనీస్ (క్రీ.పూ. 302 – 288), స్ట్రాబా (క్రీ.పూ. 54 – 24) "భారతీయులు మంచి ఆహారం, స్వచ్ఛమైన గాలి, మంచి అలవాట్ల వల్ల దీర్ఘాయుష్కులు; హిందూ వైద్యులు శస్త్ర చికిత్సలో గ్రీకు సమకాలిక వైద్యుల కంటే నైపుణ్యం గలవారు; అలెగ్జాండర్ కూడా తన సైన్యానికి వైద్యం అందించడానికి హిందూ వైద్యులనే ఎంచుకున్నాడు; అశోకుడు మనుషులకే కాక పశువులకు కూడా వైద్యశాలలు ఏర్పాటుచేశాడు" అని ప్రస్తావించారు.

ఈ వైద్య గ్రంథాలలో వైద్యులకు విధించిన కఠిన నియమావళి ఇలా ఉండేది:

- వైద్యుడు రోగులకు శక్తివంచన లేకుండా చికిత్స చేయాలి.
- అవినీతిపరులైన వారికి, సంఘ విద్రోహులకు వైద్యము అందించరాదు.
- ప్రాణాంతకమైన అంత్య కాల వ్యాధులకూ, బాగు చేయలేని వ్యాధులకూ వైద్యం చేయరాదు.
- చికిత్స మొదలుపెట్టిన తరువాత చక్కని వైద్యసేవలను ప్రేమతో అందించాలి.
- మహిళారోగులకు వారి భర్త లేక సంరక్షకుల సమక్షంలోనే వైద్యం అందించాలి.
- వైద్యానికి సంబంధించిన వివరాలను గోప్యంగా ఉంచాలి.

భారతీయ వైద్యానికి సంబంధించిన చాలా గ్రంథాలు అరబిక్ భాషలోకి అనువదితమయ్యాయి. ఈ చికిత్సా విధానాలు ఐరోపా ఖండమంతా అరబ్బుల ద్వారా వ్యాప్తి చెందాయి.

యుద్ధనైపుణ్యం : ప్రాచీన కాలం నుండి భారతీయ సైనికుల శస్త్ర కళా నైపుణ్యం పేరుగాంచింది. విల్లంబులు, కత్తులు, బల్లేలు, శూలాలు, అనేక రకాలైన శిరస్త్రాణాలు, రక్షకకవచాలు వాడుకలో ఉండేవి.

యుద్ధంలో రథాలు వాడేవారు. రథసారథ్యం ఒక యుద్ధకళా నైపుణ్యంగా వృద్ధి చెందింది. అశ్వ, గజ దళాలను కూడా ఉపయోగించేవారు. ఆ రోజులలో ఏనుగులను, శతఘ్నుల లాగా వాడేవారు. శతఘ్నులు, సమ్మోహనాస్త్రాల లాంటి పదాలు, విషవాయువు ప్రయోగాన్ని పలువురు మేధావులు సూచించారు.

యుద్ధసామగ్రి మూడు విధాలుగా ఉండేది:

- **యంత్రముక్త** – యంత్రముల ద్వారా ప్రయోగించబడేవి.
- **హస్తముక్త** – చేతితో ప్రయోగించబడేవి.
- **ముక్తాముక్త** – చేతితో వాడబడేవి లేక విడువబడేవి.

ఇక వజ్ర, ఆగ్నేయాస్త్రాలు అనే పదాలు కొన్నిరకాలైన అగ్నిసంబంధ అస్త్రాలను సూచిస్తున్నాయి.

ఈ యుద్ధసామగ్రి గురించి ఒక కచ్చితమైన నిర్ధారణ చేయడం కష్టం. పురాణాలలోని యుద్ధవ్యూహ రచనలు, ప్రాచీన–మధ్య యుగాల యుద్ధ నైపుణ్యాన్ని తెలియజేస్తున్నాయి. ❖ **అనువాదం: డాక్టర్ పి.వి. రెడ్డి**

మహర్షులు ధర్మ స్వరూపాన్ని తమ తమ అనుభవజ్ఞానంతో అనేక విధాలుగా చెప్పి యున్నారు. వాటన్నిటికీ శిరోభూషణమైనది ఇంద్రియనిగ్రహమే అని చెప్పవలెను. - మనుస్మృతి

సాధనతో సత్ఫలం

– స్వామి అద్భుతానంద*

శ్రీకృష్ణుడు, ఉద్ధవుడితో ఇలాగన్నాడు: 'ముందుగా తపస్సాధనలు చేయి. అప్పుడే నేనెవరో, నా మహిమ ఏమిటో నీకు అర్థం కాగలదు. ఇప్పుడే తెలిపాననుకో, నీవు అర్థం చేసుకోలేవు. కనుక, ముందు సాధన చేయి'.

శ్రీరామకృష్ణులు, స్వామి వివేకానందల గురించి గొప్పలు చెబితే ఏమి లాభం? వారి బోధలు చదివినంత మాత్రాన ఏమి లాభం? వారు ఉభయులు చెప్పినవి అనుష్ఠింపకపోతే శ్రద్ధాభక్తులు ఎలా అలవడుతాయి? ఒక పక్కన అసత్యం పలుకుతారు, మోసాలు చేస్తారు, ఇంకా ఎన్నో అన్యాయాలు సలుపుతారు. మరొక ప్రక్క 'శ్రీరామకృష్ణ, శ్రీరామకృష్ణ' అంటూ గొప్ప భక్తులుగా చలామణి అయ్యే ప్రయత్నం చేస్తారు. వంచన ద్వారా ధనం, పేరు ప్రతిష్ఠలు సంపాదించవచ్చు కానీ ఆధ్యాత్మికంగా ఎదగజాలం.



స్వామి అద్భుతానంద

సరళ భావంతో నామస్మరణ చేయాలి. పెద్ద పెద్ద వ్యాఖ్యానాలు చేస్తూ జనాన్ని మోసపుచ్చి పేరుప్రతిష్ఠలు సంపాదించవచ్చు కానీ భగవంతునికి నీ మనస్సులోని భావాలన్నీ తెలుసు. భగవత్సాక్షాత్కారం కోరుకునేవారు పేరు ప్రతిష్ఠలకై ప్రాకులాడకూడదు. వాటిని చూసి మురిసిపోకూడదు. ఏకాంతంలో సాధన చేయాలి. భగవత్సాక్షాత్కారానంతరం, ఆయన ఆదేశం లభిస్తే భావ ప్రచారం చేయాలి. ప్రచారానికి వలసిన శక్తి ఆయనే ప్రసాదిస్తాడు. ముందు ఆదేశాలను శిరసావహించండి, అప్పుడు ఆదేశాలివ్వగల శక్తి వస్తుంది.

శ్రీరామకృష్ణులు గృహస్థులకు, సన్న్యాసులకు కూడా ఆదర్శప్రాయులు. అన్ని మత మార్గానుయాయులకు ఆయనే ఆదర్శం. సకల మార్గాల ద్వారా సాధన చేసి భగవత్సాక్షాత్కారం పొందారు. అంతేగాని చిలుక పలుకులు పలకలేదు. ఆయన జగద్గురువు. ఆయనను ఆదర్శంగా పెట్టుకొన్న వారికి సంసారబాధలు ఉండవు. నామాట నమ్మండి.

నేను విద్యావంతుణ్ణి, ధనికుణ్ణి... ఇటువంటి ధోరణి ఉంటే అహంకారం ఉబ్బిపోతుంది. నాకన్నా గొప్పవారున్నారని, నేను సాధించినదెల్ల దైవ కృప అని తలుస్తే అహంకారం పోతుంది. లేశమాత్రం అహంకారం లేని వ్యక్తి ఎన్ని ఘనకార్యాలైనా చేయగలడు. పోతే లోకహితం చేయడానికి కొంచెం అహంకారం అవసరం, అది హానికరం కాదు. 'నేను యంత్రాన్ని, ఆయన యంత్రచాలకుడు' అనే భావం ఉండాలి; అది స్థిరం కావడానికి సాధు సాంగత్యం అవసరం.

ఒకనాడు భవనాథ్‌ను, స్వామీజీని వంట చేయమన్నారు శ్రీరామకృష్ణులు. అందరం భోజనాలకు కూర్చొనే సమయానికి ఒక దాసరి వచ్చాడు. గురుదేవులు ఆయనను పంక్తిలోకి అనుమతించలేదు. 'ఇన్ని వంటకాలు చేసాం. ఆ దాసరికి పెడితే, లోటా? గురుదేవులు వట్టి పిసినారి' అని తలచాం. అప్పుడు గురుదేవులు 'అతడు ఎటువంటి పనులు చేశాడో మీకు తెలుసా? మీ పంక్తిలో కూర్చొని తినే అర్హత పొందేటంతటి సుకృతాలు చేశాడా అతడు?' అన్నారు. సహవాసదోషం అంటే ఏమిటో, అప్పుడు మాకు అర్థమైంది. సాధకులు ఎవరంటే వారితో సాంగత్యం చేసినా, సంభాషించినా, కలసి తిన్నా సాధన దెబ్బతింటుంది. గురుదేవులు ఈ విషయంలో చాలా కచ్చితంగా ఉండేవారు, మమ్మల్ని హెచ్చరించేవారు.

నిరంతరం సత్సాంగత్యం చేస్తే మనస్సు శుద్ధమగును. సద్గ్రంథ పఠనం కూడా సత్సాంగత్యంతో సమానం. సరైన బుద్ధి లేని వారికి సత్సాంగత్యం, సద్గ్రంథ పఠనం వృథా. పోతే సత్సాంగత్యం ఎన్నడో ఒకనాడు ఫలితం చూపుతుంది. బ్రహ్మచర్యం, ఆత్మసంయమనం లేనివారికి సద్బుద్ధి కలగదు, గ్రహణ శక్తి ఉండదు.

అహోరాత్రుళ్ళూ సంసార తాపత్రయంలో మునిగి ఉండి, మనసులో దురాలోచనలు చేస్తూ ఉంటారు. ఇటువంటి మనసులో భక్తిశ్రద్ధలు ఎలా జనిస్తాయి? శాస్త్రవచనాల పట్ల శ్రద్ధ కలగడానికి సాధుసజ్జనుల సాంగత్యమే మార్గం. సాధువుల ఉపదేశాలను పాటించే ప్రయత్నం చేయండి. క్రమక్రమంగా మనస్సు శుద్ధమై సంశయాలు తొలగిపోతాయి. ❖

(*భగవాన్ శ్రీరామకృష్ణుల ప్రత్యక్ష సన్న్యాస శిష్యులు)



అన్నమయ్య పదామృతం

అప్పులవారే అందరును
కప్పగ దిప్పగ కర్తలు వేరీ
ఎక్కడ చూసిన నీ ప్రపంచమున
చిక్కులు సిలుగులు చింతలునే
దిక్కెవ్వరు ఈతిబీపులలో
దిక్కుముక్కులకు దేవుడేగాక
ఏది తలంచిన నీకాలంబును
సూదుల మూటల సుఖములివి
కాదన నౌనా గడ కనిపించగ
పోదికాడు తలపున గలడొకడే
ఎన్నడు వీడీ నెప్పుడు వాసీ
పన్నిన తమ తమ బంధములు
ఉన్నతి సేయగ వొప్పులు నెరపగ
వెన్నుడు వేంకట విభుడే కలడు

అప్పులవారే అందరును

– శ్రీమతి బి.కృష్ణకుమారి

అమ్మానాన్నలు, అన్నదమ్ములు... భార్యాబిడ్డలు, బంధుమిత్రులు...ఇలా మనవారనుకుంటున్న పరివారమంతా ఏ జన్మలోనో మనం ఋణపడి, మనకు ఋణపడి ఉన్నవారే! అలాంటి ఆ బాకీలన్నీ బంధాలుగా అల్లుకొని, అనురాగాలు ఆత్మీయతల పేరిట మనల్ని సంసారంలో కట్టి పడేస్తున్నాయి. ఆ అప్పు తీరే వరకు మనం ఎంత వదిలించుకుందామన్నా వదిలే అనుబంధాలు కావవి! అలా ఈ ప్రపంచంలో ప్రేమైనా... పగైనా, స్నేహమైనా...శత్రుత్వమైనా, జన్మజన్మల ఋణాల పరిహారమే! అందుకే పదకవితా పితామహుడు అన్నమాచార్యులు కూడా **'అప్పుల వారే అందరును; కప్పగ దిప్పగ కర్తలు వేరీ'** అంటూ ఎవరేంటో ఎరుక పరుస్తున్నాడు. మనమే అవివేకంతో అనుబంధాలన్నీ అపురూపమని భ్రమపడుతున్నాం. అప్పులు తీరాక కూడా వడ్డీల మీద వడ్డీలు చెల్లిస్తున్న అమాయకుల్లా, అతి ప్రేమలు ప్రదర్శించుకుంటూ బతుకుతున్నాం. చివరకు మరెన్నో ఋణానుబంధాలతో మరుజన్మకు సిద్ధమవుతున్నాం. అమితమైన ఈ అప్పుల వ్యవహారంలో ఆశనిరాశలకు అంతే లేదు! నిజానికి ఈ బాకీలవారితో బాధలే తప్ప, శాశ్వతమైన సంతోషమేమీ దక్కదు! అందుకే "మనుషులను ప్రేమిస్తే దుఃఖం, కష్టం అనుభవించే తీరాలి. భగవంతుణ్ణి ప్రేమించగలిగిన వారే భాగ్యవంతులు. వారికి కష్టమో, దుఃఖమో ఉండదు" అంటారు దివ్యజనని శ్రీశారదామాత.

కర్తలు వేరీ...

సహచరుల, సేవకుల ప్రేమానురాగాల దగ్గర నుంచి సిరిసంపదలు, పేరుప్రతిష్ఠల వైభోగాల వరకు సమస్తం మనం గత జన్మల్లో చేసుకున్న పాపపుణ్యాలకు ఫలితంగా లభించిన ఫలాలే! ఆ కర్మల ఋణాలు తీరిపోయాక అవన్నీ వచ్చిన దారినే, మళ్ళీ వెనక్కి వెళ్ళిపోతాయి. ఆ బాకీ తీరాక మనం ఎంత బతిమాలినా, బాధపడినా ఏ బంధమూ నిలవదు! ఈ అశాశ్వతత్వాన్ని అర్థం చేసుకుంటూ, ఎప్పటికప్పుడు తామరాకుపై నీటిబొట్టులా సంసారంతో సంగమం పెట్టుకోవాలి. అందుకే మన సనాతన ధర్మం...

ఋణానుబంధ రూపేణ పశుపత్ని సుతాలయాః
ఋణ క్షయే క్షయం యాంతి కాతత్ర పరివేదనా!

'పశువులు, భార్య, సంతానం, ఇల్లు తదితర సంబంధాలన్నీ జన్మాంతర ఋణసంబంధం చేత ఏర్పడి ఆ ఋణం తీరగానే నశించిపోతాయి. కాబట్టి వాటి గురించి దుఃఖమెందుకు?' అని ప్రశ్నిస్తుంది. అదే భావాన్ని అన్నమాచార్యులు కూడా అచ్చమైన పల్లెపదాలతో పల్లవింపజేస్తూ... **అప్పులవారే అందరును; కప్పగ దిప్పగ కర్తలు వేరీ!** అంటున్నాడు. ఎంత ఆలోచించినా ఈ ప్రపంచంలో కర్తలంటూ ఎవరూ లేరనీ, అందరూ కర్మానుసారంగా వారి వారి ఋణాన్ని తీర్చుకోవడానికి ఈ లోకంలోకి వచ్చారనీ విస్పష్టం చేస్తున్నాడు. అయితే మానవుడు అహంకారంతో తానొక స్వతంత్రుడనని భ్రమపడుతూ ఉంటాడు. తదనుగుణంగానే ఎవరినీ లెక్క చేయకుండా ప్రవర్తిస్తూ ఉంటాడు. కానీ ఎన్నో ఎదురుదెబ్బలు తగిలాక అప్పుడు అసలు సత్యం తెలుసుకుంటాడు; అయితే అప్పటికే అతని ఖాతా మరిన్ని అప్పులతో నిండిపోతుంది.

(మిగతా 34వ పేజీలో...)

కోరికలతో కూడిన జీవితం, మురికి గుంటలో ఈగల బ్రతుకు లాంటిది. ఆశ వల్ల కలిగే దుఃఖం అనంతం. అందుకే సాధకుడు పరమాత్మయందే మనస్సును నిలిపి సాధన చేయాలి. - యోగివేమన



పరిప్రశ్న

– స్వామి భూతేశానంద

(రామకృష్ణ సంఘ 12వ సర్వాధ్యక్షులు)

రామకృష్ణ సంఘ 12వ సర్వాధ్యక్షులు - స్వామి భూతేశానందజీ మహరాజ్ (1901-1998) భక్తుల ఆధ్యాత్మిక సందేహాలకు సరళమైన రీతిలో ఇచ్చిన సమాధానాలను 'శ్రీరామకృష్ణ ప్రభ' పాఠకుల ప్రయోజనార్థం 2013 జూలై సంచిక నుండి ధారావాహికంగా ప్రచురిస్తున్నాం.

భక్తుడు: ఏది నిజమైన ప్రార్థన? మన ప్రార్థనలు ఫలించాలంటే భగవంతుణ్ణి ఏ విధంగా ప్రార్థించాలి?

స్వామీజీ: భోగాలను కోరుకుంటూ మాకు మనశ్శాంతి లభించడం లేదు అని చాలా మంది ఫిర్యాదు చేస్తూంటారు. భోగం వదులుకుంటేనే, యోగం సాధ్యమవుతుంది. కాబట్టి కోరికలు లేని స్థితికి చేరుకుంటేనే నిజమైన మనశ్శాంతి లభిస్తుంది. అలాంటి స్థితిని ప్రసాదించమంటూ ప్రార్థించడమే నిజమైన ప్రార్థన.

సాధారణంగా ప్రతి ఒక్కరూ ప్రాపంచిక ప్రయోజనాల నిమిత్తం భగవంతుణ్ణి ప్రార్థిస్తూ ఉంటారు. కొద్దిమంది మాత్రమే మనశ్శాంతిని ప్రసాదించమని కోరతారు. ఎవరు ఏ విధంగా ప్రార్థించినప్పటికీ భగవంతుడు వెంటనే వారి వారి ప్రార్థనలకు ప్రతిస్పందించకపోతే కొన్నాళ్ళకు ప్రార్థనలలోని తీవ్రత తగ్గిపోతుంది. అందువల్ల మొదట భగవంతుణ్ణి ఎలా ప్రార్థించాలో తెలుసుకోవాలి.



జీవితంలో కష్టసుఖాలు బొమ్మ బొరుసుల లాంటివన్న సత్యాన్ని మొదట గ్రహించాలి. సుఖం కావాలనుకున్నప్పుడు దుఃఖాన్ని కూడా అనుభవించాల్సి ఉంటుంది. అంతేగానీ జీవితంలో కేవలం సుఖమేగాని దుఃఖం కలగకూడదని భావించకూడదు. కానీ సాధారణంగా సుఖం కలిగినప్పుడు భగవంతుణ్ణి మరచిపోయి, దుఃఖం కలిగినప్పుడు మాత్రం భగవంతుణ్ణి నిందించడం మానవ నైజం.

జీవిత సత్యాలను అంగీకరించడం అంత సులభమైన విషయం కాదు. నిజానికి మనకు ఏది అవసరమో, ఏది అనవసరమో అర్థం చేసుకొని భగవంతుణ్ణి ప్రార్థించడానికి పరిపక్వత చాలా అవసరం. మనకు కావలసినదాని కోసం భగవంతుణ్ణి ప్రార్థించడం కన్నా, మనకు అవసరమైనదాన్ని అనుగ్రహించమని ప్రార్థించడం ఉత్తమం.

నిజమైన ఆర్తితో ప్రార్థించినదాన్ని భగవంతుడు తప్పక అనుగ్రహిస్తాడు. ఒక్కొక్కసారి మనం భగవంతుణ్ణి ఎంత వ్యాకులతతో ప్రార్థించినప్పటికీ మన ప్రార్థనలు సఫలం కావు. అంతమాత్రాన భగవంతుడు నిర్దయుడనే నిర్ణయానికి రాకూడదు. భగవంతుడు మనకు ఏది మంచిదో దానిని అనుగ్రహిస్తాడనే సంపూర్ణ విశ్వాసాన్ని కలిగి ఉండాలి. భగవంతుని లీలల్ని అర్థం చేసుకోవడం సాధారణ మానవులకు సాధ్యం కాదు.

ఒక పేదవాడికి ఒక ఆవు ఉండేది. ఆ ఆవు పాలను అమ్ముకొని జీవనం కొనసాగించేవాడు. ఒకసారి భగవంతుడు భిక్షగాని రూపంలో అతడి ఇంటికి వెళ్ళి భిక్ష అడిగాడు. ఆ పేదవాడు తన దగ్గర ఉన్నదాంట్లో అతడికి భిక్షనిచ్చాడు. ఆ భిక్షగాడు 'నీ ఆవు చనిపోవుగాక!' అంటూ వెళ్ళిపోయాడు. ప్రాపంచిక దృష్టితో చూస్తే భగవంతుడు ఆ పేదవాడి పట్ల ఇంత నిర్దయగా ఎందుకు వ్యవహరించాడనే సందేహం మనలో కలుగుతుంది. ఆ పేదవాడు మహాభక్తుడు. కానీ అతడికి ఆవు మీద ఉన్న మమకారం వల్ల భగవంతునిపై మనస్సును ఏకాగ్రం చేయలేకపోతున్నాడు. అందువల్ల ఆ ఆటంకాన్ని తొలగించి భక్తుని ఆధ్యాత్మికోన్నతికి తోడ్పడ్డాడు భగవంతుడు.

వ్యాకులతతో ప్రార్థిస్తే భగవంతుడు తప్పక స్పందిస్తాడన్న సత్యాన్ని ఎంతోమంది భక్తులు నిరూపించారు. ఆ మహాత్ముల బాటలో మనమూ పయనిస్తే భగవంతుని అనుగ్రహానికి తప్పక పాత్రులమవుతాం. ❖

పండుగలు - పర్వదినాలు

అక్టోబర్ - 2014

03	శుక్రవారం	: విజయదశమి
04	శనివారం	: ఏకాదశి
07	మంగళవారం	: లక్ష్మీపూజ
19	ఆదివారం	: ఏకాదశి
23	గురువారం	: దీపావళి - కాళీపూజ

నవంబర్ - 2014

03	సోమవారం	: ఏకాదశి
04	మంగళవారం	: స్వామి సుబోధానంద జయంతి
05	బుధవారం	: స్వామి విజ్ఞానానంద జయంతి
18	మంగళవారం	: ఏకాదశి
30	ఆదివారం	: స్వామి ప్రేమానంద జయంతి



రామకృష్ణ భక్తి సూత్రాలు

- స్వామి యతీశానంద

నారద భక్తి సూత్రాలు, శాండిల్య భక్తి సూత్రాలు భక్తియోగానికి సంబంధించిన ప్రామాణిక గ్రంథాలు. అయితే ఆధునిక తరంలో భగవదన్వేషకులకు అనువైన రీతిలో భక్తితత్త్వాన్ని బోధించారు శ్రీరామకృష్ణులు. ఈ నేపథ్యంలో 'శ్రీరామకృష్ణ కథామృతం' నుండి కొన్ని ఉపదేశాలను 'రామకృష్ణ భక్తి సూత్రాలు'గా సులభరీతిలో వివరించే ప్రయత్నం చేస్తున్నాం.

బౌద్ధగ్రంథాలు పాళీ భాషలో, బైబిల్ హీబ్రూలో, ఖురాన్ అరబ్బీ భాషలో రచించబడ్డాయి. అలాగే శ్రీరామకృష్ణుల ఉపదేశాలు వారి మాతృభాష బెంగాలీలో ఆవిష్కృతమయ్యాయి. అవతార పురుషుని ముఖతః వెలువడిన ఆ అమృతోపదేశాలను యథాతథంగా ఉట్టంకిస్తూ వ్యాఖ్యానిస్తున్నాం. మహాశక్తిమంతమైన ఆ బోధనలను మననం చేసుకుంటూ కృతార్థులమవుదాం.

బంధన్ ఆర్ ముక్తి - దుయేర్ కర్తాఇ తిని తాఁర్ దయా హోలేఇ ముక్త.

బంధం, ముక్తి-రెండింటి కర్త భగవంతుడే. ఆయన కరుణిస్తేనే ముక్తి సాధ్యం.

శ్రీరామకృష్ణ ఉవాచ: బంధం, ముక్తి - రెండింటి కర్త భగవంతుడే! ఆయన మాయ సంసారులను కామకాంచన బద్ధుల్ని చేస్తుంది. జగన్మాత భవబంధన హారిణి, తారిణి.

ఆమె లీలామయి. ఈ జగత్తు ఆమె లీల. ఆమె ఇచ్ఛామయి, ఆనందమయి. లక్షమందిలో ఒకరికి ముక్తిని ప్రసాదిస్తుంది. ఈ జగత్తులోని సమస్తంతో లీల జరపాలనేది ఆమె ఇచ్ఛ. మనోనేత్రాలకు గంతలు కట్టి, 'పో! పోయి ఇప్పుడు సంసారంలో దిగు' అంటుంది. అది మనస్సు దోషమా? ఆమె కరుణించి మనస్సును తన వైపు తిప్పుకొంటే విషయవాసనల నుండి ముక్తి కలుగుతుంది. అప్పుడు ఆమె పాదపద్మాలపై మనస్సు లగ్నమవుతుంది.

సంసారం, ముక్తి - రెండూ భగవత్సంకల్పాలు. ఎలాగంటే, పిల్లలు ఆటల్లో మునిగి ఉన్నప్పుడు భోజనం వేళకు తల్లి పిలుస్తుంది. అలాగే ఆయనే మనల్ని సంసారంలో దింపుతాడు. మరలా ఆయనే కరుణించి ముక్తిని ప్రసాదిస్తాడు.

సంసారబద్ధులుగా ఉంచడం మహామాయ ఇచ్ఛ. భవసాగరంలో అనేకమైన నావలు మునుగుతున్నాయి, తేలుతున్నాయి. లక్షల సంఖ్యలో గాలిపటాలు ఎగురుతున్నాయి. ఒకటో, రెండో తెగి పడతాయి. అప్పుడు తల్లి చప్పట్లు చరుస్తూ పకపక నవ్వుతుంది. లక్షమందిలో ఒకరిద్దరు ముక్తులు అవుతారు. మిగిలిన వారందరూ ఆమె ఇచ్ఛమూలంగా బద్ధులై ఉంటారు.

పిల్లలు దొంగాట ఆడతారు. వారిలో ఒకరు పెద్దమ్మ. ఆమెను తాకిన వారు ఆటలో గెలిచినట్లు. మరి ఆటగాళ్ళు అందరూ పెద్దమ్మను తాకితే, ఆట ఎలా సాగుతుంది? కనుక అందరూ ఆమెను తాకడం ఆమెకు ఇష్టం ఉండదు.

వ్యాఖ్య: కల కన్నప్పుడు, అది వాస్తవంగానే తోస్తుంది. మేల్కొని ఉండగా కనపడినవి అన్నీ వాస్తవమనే తలుస్తాం కదా! కానీ, నిద్ర నుండి మేల్కొన్న తర్వాత కల అనేది కల్ల అని తెలుసుకొంటాం. ఆ విధంగానే, భగవత్సాక్షాత్కారం కానంత వరకూ మాయావశులమై, బద్ధులమై ఉంటాం. మాయ భగవత్ శక్తి, కనుక భగవదనుగ్రహంతో మాయ తొలగితేనే జీవుడికి ముక్తి. జీవుడికి స్వతహాగా తన సత్తా అంటూ ఏదీ లేదు. బ్రహ్మమే జీవజగత్తుగా భాసిల్లుతోంది.

మరొక విధంగా చెప్పాలంటే, భగవంతుడు చలనచిత్ర దర్శకుడు. జీవులు పాత్రధారులు, సినిమా మనోరంజకం అయ్యే విధంగా దర్శకుడు తారలకు వివిధ పాత్రలు నిర్దేశిస్తాడు. ఈ జగత్తులో నడచేదంతా భగవంతుని లీల మాత్రమే.

భగవంతుని కృప కలిగితేనే మోక్షం. దొంగాటలో పెద్దమ్మ తన చేయి అందిస్తే దస్సిన (అలసిన) ఆటగాడు ఆమెను తాకగలడు. దీనికి ఉదాహరణ - భక్త కన్నప్ప కథ. అతడు వేటగాడు. భక్తి అంటే ఏమిటో తెలియదు. పూజావిధానం, నోములు ఎరుగడు. రాత్రిపూట మారేడు చెట్టు ఎక్కి జోగుతున్నాడు. చలికి దేహం కొద్దిగా వణుకుతున్నది. ఫలితంగా, కొన్ని మారేడు దళాలు, మంచుబిందువులు క్రిందనున్న శివలింగంపై పడ్డాయి. ఆశుతోషుడైన శివుడు సంతోషించి అతడికి దర్శనమిచ్చాడు. అలా కన్నప్ప ముక్తుడయ్యాడు.

శ్రీరామకృష్ణులు ఒక దృష్టాంతం చెప్పారు. గుంజకు కట్టివున్న గోవు అందుబాటులో ఉన్న పచ్చికను మేసివేస్తే దాని యజమాని దయ తలచి, దానిని మరొక చోటుకు తరలించి కట్టవచ్చు లేదా తాడు విప్పవచ్చు. గడ్డి మేయడం అంటే ప్రయత్నం చేయడం. ఇక, తాడు విప్పడం భగవదనుగ్రహం. ❖

అనువాదం: డాక్టర్ కమల జయరావు

తల్లీ! నిన్ను చేరినంతనే శివుడు ప్రాభవం కలిగినవాడవుతాడు. అలా కానినాడు ఈశ్వరుడైనా చలనం లేనివాడే. ఎంతో పుణ్యం చేస్తేగాని నిన్ను స్తుతించడమైనా సాధ్యం కాదు. - సౌందర్యలహరి

సత్పురుషుల సన్నిధి పవిత్రతకు పెన్నిధి!

సత్సాంగత్య మహిమ గురించి భారతీయులు ఆది నుండి వక్కాణిస్తూనే ఉన్నారు. టి.వి. రేడియో మొదలైనవి లేని కాలం అది. రాజధాని నగరానికి అనతిదూరంలో ఒక చిన్న గ్రామం. ఒక సాధువు ఆ ఊరికి వచ్చి, ఒక చెట్టు క్రింద ఆసీనుడైనాడు. కమండలం, గొంగళి, ఒకటి రెండు పుస్తకాలు – మరేమీ లేవు. కానీ ఏకాంతం లేదు, కోరికల చిట్టాలను పట్టుకొని జనం రాసాగారు. నోట్లో ప్రశ్న నోట్లో ఉండగానే సమాధానం చెప్పేవాడు సాధువు. ఆయన సత్యవాక్కు కారణంగా జనం తాకిడి రోజురోజుకూ ఎక్కువ అవుతోంది.



ఇదెక్కడి గోల అని తలచాడు సాధువు. సంధ్య రాగానే ఒక ఏకాంత స్థలం వెదకి, మరొక చెట్టు కింద ఆసీనుడై ధ్యానానికి కూర్చున్నాడు. అర్ధరాత్రి గడచింది, ధ్యాన భంగమైంది. ఎవరో అటు వస్తున్న నీడ గోచరమైంది. మెల్లగా ఇటే వస్తున్నాడు. వచ్చి నిలబడ్డాడు. 'ఎవరు నీవు?' అని అడిగాడు సాధువు. చాలా నెమ్మది స్వరంతో 'దొంగనండి' అన్నాడు. సాధువు ఆశ్చర్యపోయి 'దొంగిలించడానికి నా దగ్గర ఏముందని?'.

'అబ్బే, దొంగతనానికి రాలేదు. నా వృత్తి తెలిపాను. అంతే! మీ దగ్గర అసత్యం పలుకలేను.'

'ఇన్ని వృత్తులు ఉండగా, ఇదే నచ్చిందా? పట్టుబడ్డావనుకో, చావు దెబ్బలే కదా!'

'అయ్యా! అందుకే మీ వద్దకు వచ్చాను. మీది సిద్ధవాక్కు అట. ఎప్పుడూ జన సమ్మర్దమే. కనుక ఈ రాత్రివేళ వచ్చాను'.

దొంగ చేతులు జోడించి, 'చాలా పేదవాడిని. పట్టుబడ్డానంటే నా కుటుంబానికి ఆకలి చావులు తప్పవు. మీరే దిక్కు' అన్నాడు ఎంతో వినయంగా.

సాధువుకు ఏమీ పాలు పోలేదు. దొంగను తేరిపార చూశాడు. కళ్ళల్లో ఏదో దైన్యం. 'సరే, కానీ ఒక షరతు. ఎట్టి పరిస్థితిలో, ఏ కారణంగానైనా సరే, అసత్యం పలుకకూడదు. సత్యాన్ని సదా అంటిపెట్టుకొని ఉండు. భగవంతుడు సత్యస్వరూపుడు. ఆయన అప్పుడు నిన్ను రక్షిస్తాడు' అన్నాడు. దొంగ ఆలోచనలో పడ్డాడు. బాబోయ్, ఇదేమి షరతు. తాను చేపట్టిన వృత్తిలో సత్యవచనం ప్రాణాంతకం. కానీ సత్యమే కాపాడుతుంది అంటే, సత్యమే పలికితే సరి. ఇలా ఆలోచించుకొని, 'అయ్యా! మీ మాట శిరసావహిస్తున్నాను. పట్టుబడనంటే ఇక అసత్యం పలకవలసిన అగత్యం ఏమున్నది' అన్నాడు దొంగ.

ఇంకేమి – మహాత్ముని ఆశీర్వాదం దొరికింది – అది వ్యర్థం కాదు. సరాసరి రాజప్రాసాదానికే కన్నం వేస్తే సరి. అర్ధరాత్రి కోట గోడ దూకి రాజు శయ్యాగారం దగ్గరకు చేరుకున్నాడు. ఎటు నుండి కన్నం వేయాలి? ఇంతలో ఒక పొడుగాటి మనిషి పిల్లిలా అడుగులు వేస్తూ వచ్చాడు. పారిపోవడానికి దొంగకు దారి తెలియదు, సమయమూ లేదు. 'ఎవరు నీవు?' గద్దించాడు ఆ వ్యక్తి. 'దొంగను' అన్నాడు. క్రొత్త మనిషి నవ్వి 'భేష్! దొంగ తనను తాను బయటపెట్టుకుంటాడా?'

'దొంగనే కానీ అసత్యం పలుకను. నీవు ఎవరు?'

'నేనూ దొంగనే'.

'ఈ సంగతి ముందే చెప్పవలసినది. నా గుండె ఎలా దడదడలాడుతున్నదో చూడు. సరే, రాజుగారి శయ్యాగారానికి కన్నం వేయాలి. ఖోషాణంలో మూడు అమూల్య రత్నాలు ఉన్నాయట. నీకు తెలుసా?'

'నేనూ అందుకే వచ్చానుగా! కన్నం ఎక్కడ వేయాలో తెలుసు. చెబుతాను. లోనికి పోయి సొమ్ము తేవడం తేలిక. కానీ, నేను నీకు తోడ్పడుతున్నాను కనుక నీవు తెచ్చిన సొమ్ములో సగభాగం నాకు ఇవ్వాలి. సమ్మతమేనా?'

ఆ తర్వాత ఒక గంటలో తలచిన కార్యం ముగిసింది. దొంగ, రెండోవాడికి ఒక రత్నం ఇచ్చాడు.

'అక్కడ ఎన్ని రత్నాలున్నాయి?' అడిగాడతడు.

'మూడు. కానీ మూడవది పంచుకోవడం కష్టం కదా! అందుకే, రెండే తెచ్చాను' అన్నాడు దొంగ.

'నీవు సత్యవాదినన్నావు. కనుక నమ్ముతున్నాను. నీ ఇల్లు ఎక్కడో చెప్పు' అన్నాడతను. దొంగ కొంచెం తటపటాయించి, చెప్పేశాడు. ఇంటికి తిరిగి వచ్చి నిశ్చింతగా నిద్రపోయాడు. తెలతెలవారుతుండగా రాజభటులు వచ్చి, వాడిని పట్టుకుపోయారు! నిండు దర్బారులో రాజు, మంత్రి ఆసీనులై ఉన్నారు.

రాజు అడిగాడు, 'ఎవరు నీవు?'

'దొంగనండి'.

ఈ మాట అనగానే దర్బారు నవ్వులతో దద్దరిల్లింది.

'ఏమి దొంగిలించావు?'. 'రాజుగారి అనర్ఘ రత్నాలు'. సభలో విస్మయం. రాజు ఉద్విగ్నుడై 'మహామంత్రీ! వెంటనే అంతః పురంలో ఖోషాణం తెరచి చూడండి', అని ఆదేశించాడు. మంత్రి ఖిన్నుడై తిరిగి వచ్చి, 'అన్ని రత్నాలూ పోయాయి మహారాజా!' అన్నాడు.

'ఎన్ని రత్నాలు దొంగిలించావు?' అడిగాడు రాజు. 'రెండు' అన్నాడు దొంగ. 'ఈ పళ్ళెంలో పెట్టు' అన్నాడు రాజు.

దొంగ ఒకటి పెట్టి, రెండవది తోడు దొంగకు ఇచ్చానని చెప్పాడు.

రాజు మంత్రిని తీక్షణంగా చూచాడు. రాజు ముఖం మీద మృదుహాసం. రాజు తన జేబు నుండి ఒక రత్నం తీసి పళ్ళెంలో పెట్టాడు. 'మూడవ రత్నాన్ని మీరు పెట్టండి' అని మంత్రిని ఆదేశించాడు. మంత్రి వణకుతున్న చేతులతో మూడో రత్నం పెట్టాడు. మంత్రికి తల కొట్టేసినట్లు అయింది. సభలో చీమ చిటుక్కుమంటే వినపడేటంత నిశ్శబ్దం!

రాజు సభకు ఇలా చెప్పాడు: 'నిన్న రాత్రి నేను మారువేషంలో గస్తీ తిరిగాను. ఈ దొంగ చెప్పినది అంతా నిజం. నేనే ఆ 'తోడు దొంగ'ను. వీడు నిజంగా సత్యవాది. ఎవరిపై రాజ్యరక్షణ భారాన్ని మోపానో, ఆ మంత్రే ప్రలోభానికి గురి అయి, మూడవ రత్నం తీసికొని, అసత్యం పలికాడు.



'ఇటువంటి మంత్రి మాకు వద్దు!' అని సభికులు ఏకకంఠంతో పలికారు. అదే సమయానికి ప్రశాంత వదనంతో దర్బారులోకి మెల్లగా ప్రవేశించాడు సాధువు. దొంగ వడివడిగా వెళ్ళి ఆయన పాదాలపై పడ్డాడు. 'స్వామీ! గొప్ప పాఠం నేర్చుకున్నాను. చోరవృత్తి వదలివేస్తా. నన్ను శిష్యుడిగా స్వీకరించండి. రెండు వేషాలు వేసే సంసారంలో నేను ఉండలేను' అన్నాడు. సాధువు కళ్ళలో ఆశీర్వాదం కనపడింది దొంగకు. సాధువు వెనకాలే నడచి వెళ్ళిపోయాడు. పరుసవేదిని తాకిన ఇనుపముక్క బంగారంగా మారినట్లు, సత్పురుషుల సన్నిధి అపవిత్రుణ్ణి పవిత్రునిగా మారుస్తుంది. ❖

అనువాదం : డాక్టర్ కమల జయరావు


(శారదా మఠం – బెంగాలీ మాసపత్రిక 'నిబోధత' నుండి)

సత్సాంగత్య ఫలం

సంత్ హరిదాస్ కృష్ణ భక్తుడు. బృందావనంలో ఒక కుటీరంలో ఉంటూ సాధన చేస్తూవుండేవాడు. అతడి సాధుస్వభావానికి ప్రజలు ఆకర్షితులయ్యారు. అతడి పేరు ప్రఖ్యాతులు విని రామచంద్ర ఖాన్ అనే ధనికుడు అసూయ చెంది హరిదాస్‌ని అప్రతిష్ఠపాలు చేయాలని తలచాడు.

ఒక వేశ్యను పిలిచి 'హరిదాస్‌ను వశపరచుకుంటే నీకు కావలసిన ధనాన్ని ఇస్తాన'ని ప్రలోభపరిచాడు. అందుకు అంగీకరించిన వేశ్య ఒకరోజు రాత్రి హరిదాస్ కుటీరానికి వెళ్ళింది. ఆ సమయంలో హరిదాస్ కృష్ణ నామాన్ని జపిస్తున్నాడు. వేశ్య మనోభావాన్ని గ్రహించిన అతడు 'నేను కృష్ణనామాన్ని కోటిసార్లు జపించాలని సంకల్పించుకున్నాను. నా జపం పూర్తయ్యేవరకు వేచివుండు' అని చెప్పి హరిదాసు 'హరేకృష్ణ హరేకృష్ణ కృష్ణ కృష్ణ హరేహరే' అని బిగ్గరగా ఉచ్చరిస్తూ జపం చేయసాగాడు. అలా ఆ రాత్రంతా గడిచిపోయింది.

మరుసటి రోజు రాత్రి ఆమె మరలా హరిదాస్ కుటీరానికి వచ్చింది. రెండోరోజు కూడా హరిదాసు కృష్ణ నామాన్ని జపిస్తున్నాడు. అలా ఆ రెండో రాత్రి కూడా గడిచిపోయింది. హరిదాసును వశపరచుకోలేనందుకు రామచంద్ర ఖాన్ ఆమెను దుర్భాషలాడాడు. 'ఈరోజు గనుక అతడిని వశపరచుకోలేకపోతే నువ్వు కఠిన శిక్షను అనుభవించాల్సి ఉంటుంద'ని హెచ్చరించాడు. ఎప్పటిలాగే ఆమె మూడవరోజు రాత్రి హరిదాసు కుటీరానికి వెళ్ళింది. ఆమెను చూసిన హరిదాస్ 'ఈరోజుతో నా కోటిజపవ్రతం పూర్తవుతుంది. ఆ తరువాత నీతో మాట్లాడుతాను' అని చెప్పాడు. హరిదాసు కృష్ణనామాన్ని బిగ్గరగా జపిస్తున్నాడు. ఆమె ఆయన ముందు కూర్చొని నామాన్ని వింటూవుంది. అలా కృష్ణనామాన్ని వింటున్న ఆమెలో హరిదాస్ దేహం



నుండి ఒక తేజోమయ కిరణం ప్రవేశించింది. అప్పుడు ఆమెలో ఉన్న అపవిత్రభావాలన్నీ భస్మమైపోయాయి. ఆమె తాను తలపెట్టిన పాపకార్యాన్ని తలచుకొని పశ్చాత్తాపంతో హరిదాసు పాదాలపై పడి శరణువేడింది. అప్పటి నుండి ఆమె సాధనమయ జీవితాన్ని గడుపుతూ చివరికి శ్రీకృష్ణుని సాన్నిధ్యం పొందింది. సత్పురుషుల సాంగత్య మాహాత్మ్యాన్ని తెలియజేసే సంఘటన ఇది. ❖

పుణ్యకార్యాలను చేస్తూ ఉండు. సాధు సజ్జనులతో సాంగత్యం చేయడం వల్ల సద్భావాలు కలుగుతాయి. సర్వవేళలా శరీరం అనిత్యమని గుర్తుంచుకుని జీవనం సాగిస్తూవుండు. – చాణక్యనీతి



ఆత్మదీపాన్ని వెలిగిద్దాం!

– డాక్టర్ అపర్ణ శ్రీనివాస్

దీపావళి భారతదేశమంతటా విశేషమైన వైభవంతో, ఆహ్లాదకరంగా జరుపుకొనే పండుగ. భిన్నత్వంలో ఏకత్వాన్ని చాటే ఈ పర్వం కుల, మత, ప్రాంతీయ, భాషా భేదాలకు అతీతంగా అందరూ ఆనందంగా జరుపుకొనే పండుగ. ఉత్తర భారతదేశంలో ఈ పండుగను అయిదు రోజుల పాటూ, దక్షిణ భారతంలో రెండు రోజుల పర్వంగానూ జరుపుకుంటారు.

మొదటిరోజు – నరకచతుర్దశి. ఇది ఆశ్వయుజ మాసంలో వచ్చే బహుళ చతుర్దశి. ప్రాగ్జ్యోతిషపురాన్ని (నేటి అస్సాం) పరిపాలించిన నరకాసురుడనే రాక్షసుని వధను, శ్రీకృష్ణుడు సత్యభామా సహితుడై గావించినట్లు మన పురాణాలు తెలియజేస్తున్నాయి. ఈ నరకాసురుడు మాయకూ, అజ్ఞానానికీ సంకేతమైనవాడు. ఈతడు తన రాజ్యానికి రక్షణగా అయిదు దుర్గాలను (గిరి, శస్త్ర, సలిల, దహన, పవనాలు) అష్టపాశాలతో చుట్టి, ఐదు ముఖాలు కలిగిన మురాసురుడనే రాక్షసుణ్ణి కాపలాగా ఉంచాడు. లోక కంటకుడైన ఈ నరకుని బారి నుండి ప్రజలను రక్షించేందుకు, శ్రీకృష్ణుడు ముందుగా ఆ దుర్గాలను, పాశాలను ఛేదించి, 'ముర' అనే ఆ రాక్షసుని సంహరించి, మురారిగా కీర్తించబడి, ఆపై నరకునితో పోరు సలిపి విజయం సాధించాడు. విశ్లేషణపరంగా చూస్తే, నరకుని పట్టణమంటే, మాయ అనబడే మన శరీరం. కావలిగా ఉన్న పంచదుర్గాలు పంచభూత తత్త్వాలకు ప్రతీకలు. అష్టపాశాలు మనలో ఉన్న మనస్సు, బుద్ధి, అహంకారం, శబ్ద, స్పర్శ, రూప, రస, గంధాలనబడే అష్టవిధ ప్రకృతులుగానూ; మురాసురుని ఐదు ముఖాలు పంచేంద్రియాలకు సంకేతాలుగానూ భావించవచ్చు. సాధకులు ఈ మాయను జ్ఞానసంపద ద్వారా ఛేదించి, అజ్ఞానమనే అసురసంహారం చేయాలనే సత్యాన్ని నరకాసుర వధ అంతర్లీనంగా బోధిస్తుంది.

నరక చతుర్దశి తరువాత రోజు దీపావళి. దీపావళి పండుగ నాడు మహాలక్ష్మిని పూజిస్తాం. ఆ తల్లి అష్టవిధరూపాల్లో పూజించ బడుతుంది. జీవితపోషణకు అవసరమైన ధాన్యరూపంలో ధాన్య లక్ష్మిగా, విద్యలకు మూలంగా విద్యాలక్ష్మిగా, ఐశ్వర్యానికి సంకేత మైన ధనలక్ష్మిగా, ధైర్యానికి ప్రతీకగా ధైర్యలక్ష్మిగా, బలశౌర్యాలకు నిలయమైన వీర్యలక్ష్మిగా, పరిపాలనాదక్షత కలిగిన గజలక్ష్మిగా, సకల విధాల సౌఖ్యాలను ఇచ్చే సౌభాగ్యలక్ష్మిగా... ఇలా వివిధ రీతులలో పూజలందుకుంటూ, అపార కరుణామృతాన్ని కురిపించే ఆ శ్రీమహాలక్ష్మిని ఈనాడు భక్తి శ్రద్ధలతో ఆరాధిస్తాం.

రావణ వధానంతరం శ్రీరాముడు సీతాలక్ష్మణ సమేతంగా అయోధ్యకు తిరిగివచ్చింది దీపావళి రోజునే అనీ, ఆనాడు ప్రజలంతా ఆనందోత్సాహాలతో పట్టణ మంతా దీపాలతో అలంకరించి ఉత్సవం జరుపుకొన్నారనీ చెబుతారు. పాండవులు తమ అజ్ఞాత వాసానంతరం తిరిగి వచ్చింది కూడా దీపావళి నాడేనని తెలుస్తోంది. అసలు దీపావళి అంటే 'దీపానం ఆవళి దీపావళి' – అనగా దీపాల వరుస దీపావళి. ఈ సందర్భంగా దీపాన్ని పూజించడంలో ఉన్న అంతరార్థాన్ని తెలుసుకొనే ప్రయత్నం చేద్దాం.

చీకటి వల్ల మన నిత్యజీవితంలో ప్రతి ఒక్కరికీ అనేక ఇబ్బందులు కలుగుతూనే ఉంటాయి. దీన్ని పారద్రోలేందుకే దీపాన్ని వెలిగిస్తాము. దీపానికున్న మహత్తరశక్తి అంధకారాన్ని పటాపంచలు చేయగలగడమే; అందువల్లనే మనం ఏ పూజ ఆరంభంలోనైనా, సత్కార్యాచరణం లోనూ ముందుగా శుభసంకేతంగా, దేవతలకు ప్రీతికరంగా, దీపప్రజ్వలనం గావిస్తాము. ఈ దీపానికి ఉండే మరో విశేషం ఏమంటే, అది సదా ఊర్ధ్వదృష్టినే కలిగి ఉంటుంది. దీపజ్వాల ఎప్పుడూ పైకే ఉంటుంది కానీ కిందకు దిగదు. కనుక మనం దీపం నుండి అంధకారమనే అజ్ఞానాన్ని పారద్రోలడం, ఊర్ధ్వ దృష్టిని కలిగి ఉండడం (మనస్సును అల్పవిషయాల పైకి కాక శాశ్వత బ్రహ్మపథం వైపు మళ్ళించడం) అనే రెండు చక్కటి పాఠాలు నేర్చుకోవచ్చు.

దీపావళినాడు ప్రజలంతా తమ తమ గృహాలను పరిశుద్ధంగా ఉంచుకుని, గృహప్రాంగణమంతా తైలజ్యోతులతో, విద్యుద్దీపాలతో శోభాయమానంగా అలంకరిస్తారు. అయితే ఈ విశ్వంలో ప్రతీదానికి ఓ కాలపరిమితి అంటూ ఉంది. ప్రమిద దీపం నూనె లేకపోతే కొడిగడుతుంది, విద్యుద్దీపాలు విద్యుత్ సరఫరా లేకపోతే వెలగవు. సూర్యచంద్రులు, నక్షత్రాలు కూడా కాలగతిని అనుసరించే ఉంటాయి. అయితే ఎన్ని ప్రళయాలు సంభవించినా, అవిచ్ఛిన్నంగా, నిత్యతేజో విరాజితంగా వెలుగొందే ఒక ప్రకాశం ఉంది. ఆ ప్రకాశం ఎక్కడ ఉంది, అది ఏమిటి అని యోచిస్తే, దానికి సమాధానం మనకు భగవద్గీతలో లభ్యమవుతుంది.

జ్యోతిషామపి తజ్జ్యోతిః తమసః పరముచ్యతే ।
జ్ఞానం జ్ఞేయం జ్ఞానగమ్యం హృది సర్వస్య విష్ఠితమ్॥ (గీత–13.17)

"జ్యోతులకు జ్యోతియై, తమస్సునకు పరమై, జ్ఞానమూర్తియై, జ్ఞేయస్వరూపమై, ప్రతీ ప్రాణి హృదయ కోశంలో విరాజిల్లేది ఆత్మజ్యోతి." ఆ ఆత్మజ్యోతిని తెలుసుకునేందుకు ప్రయత్నం చేసిననాడే వాస్తవానికి దీపావళి పండుగకు పరమార్థం చేకూర గలదు. ఈ విధమైన పరిపూర్ణ అవగాహనతో, బాహ్యంగా దీపాలను వెలిగిస్తూ, ఆ ఆంతరంగిక జ్యోతిని కనుగొనే ప్రయత్నాన్ని మనమూ చేద్దాం. ❖ **(అక్టోబర్ 23న 'దీపావళి')**

ధీరవాణి

– స్వామి వివేకానంద

మేలు చేకూర్చే విద్య!



మన దేశంలోని స్త్రీలను విద్యావంతుల్ని చేయడానికి యథార్థమైన ప్రయత్నమేమీ చేస్తున్నట్లు కనబడడం లేదు. పురుషులు తమ పురుషాహంకారాన్ని మరింత అభివృద్ధి పరచుకోవడానికి విద్యావంతులు అవుతున్నారు. ఇళ్ళల్లో వారికి చాకిరీ చేయడానికి జీవిత సర్వస్వం ధారపోస్తూ, తమ సుఖదుఃఖాల్లో సమంగా పాలు పంచుకుంటూన్న స్త్రీలను విద్యావంతుల్ని చేసి, వృద్ధిలోకి తీసుకురావడానికి మనవారేం చేస్తున్నారు?

ప్రభుత్వపు లెక్కల ప్రకారం హిందూదేశంలోని ప్రజల్లో మూడు నాలుగు శాతం పురుషులే విద్యావంతులు, స్త్రీలు ఒక శాతం కూడా లేరు. కాకపోతే, దేశం ఇటువంటి దుఃస్థితికి ఎలా వస్తుంది? విద్యావ్యాప్తి లేనిదీ, జ్ఞానం కలుగనిదీ, దేశంలో అభివృద్ధి ఎలా కలుగుతుంది?

విద్యార్థినులకు నైతిక, ఆధ్యాత్మిక విధానాలలో కూడా శిక్షణనివ్వాలి. ఆదర్శ వ్యక్తుల జీవితాలను వారి ముందుంచాలి. దాని వల్ల బాలికలకు స్వార్థరహితమైన ఉత్తమాశయాల పట్ల భక్తి, శ్రద్ధలు కలుగుతాయి.

సీత, సావిత్రి, దమయంతి, లీలావతి, ఖానా, మీరాబాయి మొదలైన ఆదర్శ వనితల జీవితాల గురించి వారి మనస్సుకెక్కే టట్లు చెప్పాలి. ఆ ఆదర్శమార్గంలో తమ జీవితాలను మలచు కునేటట్లుగా వారిని ప్రోత్సహించాలి. అలాంటి విద్యావంతులు, పుణ్యాత్ములైన తల్లుల ఇండ్లలోనే మహాపురుషులు జన్మిస్తారు. కానీ, స్త్రీలను సంతానాన్ని ఉత్పత్తి చేసే యంత్రాల స్థాయికి దిగజార్చారు.

దైవమా! స్త్రీ విద్య, స్త్రీ జన సముద్ధరణ, పామర జనులలో జాగృతి – ఇవీ మొదట రావాలి. ఆ తర్వాతనే భారతదేశానికి నిజమైన మేలు చేకూరుతుంది. ❖

స్త్రీలకు విద్యనేర్పి వారి ఉన్నతికై పాటుపడాలి. స్త్రీలు ఉద్ధరించబడితే వారి పిల్లలు కూడా ఉద్ధరించబడి సచ్ఛీలురై దేశ ప్రతిష్ఠను నిలబెడతారు. అప్పుడు మాత్రమే శక్తి, భక్తి జాగృతమవుతాయి. – స్వామి వివేకానంద

అమ్మనే కోరుకుందాం!

– స్వామి అర్చనానంద

శ్రీజగన్మాతను ఎందుకు ఆరాధిస్తాం? అందరూ సుఖ, సంతోష, ఆయురారోగ్య సౌభాగ్యాలతో వర్ధిల్లాలని, దుఃఖములు తొలగి దారిద్ర్యములు నశించి శుభములు కలగాలని, శాంతి సమృద్ధులు వెల్లి విరియాలనీ!

ఒక మహా సామ్రాజ్యాన్ని ఓ గొప్ప చక్రవర్తి పరిపాలిస్తుండేవాడు. అతడికి సంతానం లేదు. సంతానం కోసం ఆ మహారాజ దంపతులు ఎన్నో నోములు, వ్రతాలు, పూజలు చేశారు. కొంత కాలానికి రాజదంపతులకు ఒక పుత్రుడు కలిగాడు. ఆ దివ్య శిశువును అత్యంత గారాబంగా పెంచుతుండగా, ఆ పుత్రుని ఒక జన్మోత్సవ వేడుకలలో లక్షలాది జనం వచ్చి రాజదంపతులను, శిశువును దర్శించి వెళుతున్నారు. ఆ లక్షల, కోట్ల జన సమ్మర్దంలో ఆ శిశువును హఠాత్తుగా ఎవరో అపహరించుకుని వెళ్ళిపోయారు. క్షణకాల ప్రమత్తతతో జరిగిన ఈ అకృత్యానికి మహారాజు, మహారాణి, రాజ్యమంతా శోక సాగరంలో మునిగిపోయారు. కాల ప్రవాహంలో రోజులు దొర్లిపోయాయి. దొంగిలింపబడిన రాజకుమారుడు విధివశాత్తు ఒక నిరుపేద కూలీ దంపతులకు దొరికాడు. వారే ఆ బాలుని తల్లీతండ్రియై అష్టకష్టాలు పడి వాణ్ణి పెంచి పోషిస్తున్నారు. ఆ బాలునికి కడుపునిండా చద్దన్నం తినడం కూడా గగనమే! ఇక మిఠాయిలు కలలోనైనా కనబడవు! ఒంటినిండా బట్టలు లేవు, చక్కటి ఇల్లూ, పడకా లేవు! ఇక ఆదరించే స్నేహితులు అసలే లేరు! ఇలాంటి పరిస్థితులలో 10-15 సంవత్సరాల వయస్సున్న ఆ బాలునికి తన నిజమైన తల్లితండ్రులెవరో తెలిసిపోయింది! ఆ రాజ దంపతులకు తమ అపురూప వంశ వజ్రం, యువరాజు, గారాల పట్టి దొరికిపోయాడు! ఆ బాలుని ఆనందానికీ, ఆ చక్రవర్తి దంపతుల ఆనందానికీ అంతులేదు! సామ్రాజ్యమంతా వేడుకలు, ఉత్సవాలతో మారుమ్రోగింది! 'యువరాజు దొరికారు, మన యువరాజు దొరికారు'– ఇదే వార్త! అతి పేద కూలీ కుర్రవాడు యువరాజైనాడు!

మన పరిస్థితీ సరిగ్గా ఇలానే ఉంది! సాక్షాత్తు ఆదిపరాశక్తి, అఖిలాండకోటి బ్రహ్మాండ భాండోదరి, విశ్వమాత, జగద్ధాత్రి, కరుణారససాగర, శ్రీమాతా శ్రీమహారాజ్ఞి, శ్రీమత్ సింహాసనేశ్వరీ, శ్రీమత్ త్రిపురసుందరీ, శ్రీరాజరాజేశ్వరీ, అవ్యాజకరుణామూర్తి, సర్వానుల్లంఘ్య శాసనం అయిన ఆ జగన్మాత – మనకు నిజంగా మాత. ఈ సత్యాన్ని విస్మరించి జన్మజన్మల కర్మల బంధనాల, సంస్కారాల ప్రభావం వల్ల మనల్ని మనం – 'నేను దుర్బలుణ్ణి, నేను పాపిని, నేను బీదవాణ్ణి, నేను నిస్సహాయుణ్ణి, నాకెవరూ దిక్కులేరు, నాచేత ఏమీ కాదు, నా బ్రతుకు దీనాతిదీనం, నా భవిష్యత్తు అంధకార బంధురం' అని అనుకొంటూ ఆత్మవశీకరణం



చేసుకుంటున్నాం! ఆ జగన్మాతే మన నిజమైన అమ్మ అని తెలుసుకున్న రోజే మన జన్మ ధన్యం.

అందుకే శ్రీరామకృష్ణులు ఇలా అన్నారు: "ఆ జగన్మాత నీ స్వంత తల్లి, నీ స్వంత తల్లిని నీవు అధికారంగా ఏది కావలిస్తే అది అడగవచ్చు! 'అమ్మా! నాకు ఇది కావాలి, అది కావాలి, ఇవ్వవా?' అని జోరు చేయవచ్చు. నీ స్వంత తల్లే కదా! అమ్మను సంపాదించుకోవాలంటే నీవు నిజంగా ఆ అమ్మకు శిశువు కావాలి! శిశువుకు అమ్మ తోడిదే లోకం, అమ్మ తప్ప అన్యమెరుగని అమాయకత్వం ఆ శిశువు స్వభావం!

ఆ విశ్వమాతను నీ స్వంత మాతగా ఆర్తితో, భక్తి విశ్వాసాలతో ఎలుగెత్తి పిలిచి చూడు! ఆ తల్లి తన బిడ్డల్ని విడిచి ఇక ఎక్కువ సేపు ఉండలేదు, పరుగుపరుగున వచ్చి తన బిడ్డల్ని ఒడిలోనికి తీసుకుని లాలిస్తుంది, పాలిస్తుంది, పోషిస్తుంది!"

అందుకే శ్రీకాళికామాత ముద్దుబిడ్డడైన స్వామి వివేకానంద "మనమందరం సమస్త శక్తి, జ్ఞానములకు మూలమైన విశ్వమాత బిడ్డలం! ఎన్నటికీ ఈ సత్యం మరువవద్దు. ఎన్నడూ దుర్బలుడివి కావద్దు, నీ దైవీ సంప్రదాయాన్ని ఎప్పుడూ విస్మరించవద్దు, 'అమ్మ'పై నమ్మకం సడలనీయవద్దు! బిక్షగానిలా యాచించవద్దు. స్వంత పుత్రునిలా 'అమ్మా! నాకు దర్శనం ఇవ్వు!' అని పట్టుబట్టి అడుగు!" అని అన్నారు.

అలా పట్టుపట్టే శ్రీరామకృష్ణులు 'అమ్మ'ను తన 'సొంత' తల్లిని చేసుకున్నారు. చిన్న పిల్లవానిలా 'అమ్మా! నీవు 'రాంప్రసాద్'కు దర్శనం ఇచ్చావు, 'కమలాకాంతు'నికి దర్శనమిచ్చావు. నాకెందుకు కనిపించవు? నీవున్నది నిజమైతే ఎందుకు దర్శనమీయవు? నీవు నిజంగా ఉన్నావా? కేవలం నీవు కవులు, పండితుల కవిత్వ కల్పన మాత్రమేనా?' అని ప్రశ్నించారు, ప్రార్థించారు. ఆ ఆవేదనా పూరిత ప్రార్థనలకు ఆ ఆర్తితోకూడిన భక్తికి ఆ తల్లి కరుణించింది, తన పుత్రునికి కనిపించింది.



బ్రహ్మలీన పూజ్య స్వామి ఆత్మానందజీ (రామకృష్ణమఠంలో పేరుపొందిన సన్యాసి, ప్రసిద్ధ హిందీ రామాయణ ప్రవచన కర్త) తమ ఉపన్యాసాలలో ఇలా అనేవారు– 'హమ్ భగవాన్ కో నహీ చాహ్‌తే హై, హమ్ లోగ్ భగవాన్ సే చాహ్‌తే హై'–'మనం భగవంతుణ్ణి కోరుకోవడం లేదు, మనం భగవంతుని నుండి కోరుకుంటున్నాం!.'

అందుకే స్వామీజీ "ఆ జగన్మాత అందరికీ దర్శనమివ్వడానికి సిద్ధంగా ఉన్నది, అందరినీ ఆదరించాలనీ ఆశిస్తున్నది! కానీ ఆ తల్లి ఎవరికి కావాలి? మనకు అమ్మ తప్ప అన్నీ కావాలి! సర్వానంద స్వరూపిణి అయిన అమ్మను విడిచి మనం ఆమెను తుచ్ఛమైన భౌతిక భోగాలను అడుగుతాం, ఎంత మూర్ఖులం మనం!" అని అన్నారు.

మనం ఆదిపరాశక్తి నుండి ఏమి కోరుకుంటున్నాం? 'అమ్మా! నాకు సిరి సంపదలు ఇవ్వు, పేరు ప్రతిష్ఠలు ఇవ్వు, ఆయురారోగ్యాలు ఇవ్వు' అని జగన్మాతను ప్రార్థిస్తున్నాం. తల్లి తన పసిబిడ్డ అవసరాలన్నీ కేవలం ఆ శిశువు ఏడుపు నుండే గ్రహిస్తుంది. శిశువుకి ఎప్పుడేం కావాలో పసిగట్టి ఆకలైతే పాలిస్తుంది, లాలిస్తుంది. శౌచం చేస్తే స్వంత వస్త్రంతోనే శుభ్రం చేస్తుంది. అర్ధరాత్రి ఉలిక్కిపడి లేచి ఏడిస్తే జోలపాటలతో, లాలిపాటలతో నిద్ర పుచ్చుతుంది. అన్ని కష్టాల్ని ఆనందంగా స్వీకరించి మాతృత్వపు మాధుర్యంలో మోక్షాన్ని చవిచూస్తుంది.

ఈ నశ్వర భౌతిక జగత్తులో జన్మనిచ్చిన ఈ అమ్మకే ఇంతటి దయ, కరుణ, త్యాగము, ప్రేమ, వాత్సల్యమూ ఉంటే సకల చరాచర సృష్టి జాతమునంతటికీ, సర్వలోకాలకీ జన్మనిచ్చిన ఆ అమ్మకు తన బిడ్డలపై ఎంతటి ప్రేమ, దయ, కరుణ, త్యాగము, వాత్సల్యమూ ఉన్నాయో, ఉంటాయో ఊహింపగలమా? కలలోనైనా కల్పించు కోగలమా? మనందరికీ జన్మనిచ్చిన ఆ అమ్మలగన్నయమ్మకు మన అవసరాలు తెలియవా? మన శరీర రక్షణకూ, భౌతిక అవసరాలకూ కావలసిన డబ్బు ఆ తల్లి ఇవ్వలేదా? దానిని యాచకునిలా 'అమ్మా నాకు డబ్బులివ్వు, ఆస్తులివ్వు' అని అడగడం ఎంత హాస్యాస్పదం! ఎంత అవివేకం!

ఈ ప్రార్థనల్ని మాని 'అమ్మా! విశ్వజననీ! నాకు నీ దర్శనం ఇవ్వు! నీ పాద పద్మాలపై శుద్ధ భక్తిని ఇవ్వు, జ్ఞానమునివ్వు, వైరాగ్యమునివ్వు, సదా నీ దివ్య రూపమును దర్శించే సౌభాగ్యము నివ్వు' అని ప్రార్థించిన గదాధరుడు, 'శ్రీరామకృష్ణ పరమహంస'గా విశ్వపూజ్యుడయ్యాడు.

ప్రపంచాన్ని ప్రచండ ఆధ్యాత్మిక శక్తితో అల్లల్లాడించిన నరేంద్రుడు, 'స్వామి వివేకానంద'గా విశ్వాచార్యుడయ్యాడు. వేంకటరామన్, 'భగవాన్ రమణమహర్షి' అయ్యాడు. వేశ్యాలోలుడు 'వేమన యోగి' అయ్యాడు. భార్యాలోలుడు, 'తులసీదాసు' అయ్యాడు.

మరి మనమెందుకు కలకాలం 'భిక్షగాళ్ళ'గానే ఉండిపోవాలి? మనం మారలేమా! ఇప్పుడు కాకపోతే ఇంకెప్పుడు? ఆ మహనీయుల మహితాదర్శంతో మనం కూడా ముందుకు నడుద్దాం. ఇప్పుడే, ఇక్కడే! అమ్మ తన పిల్లల కోసం వేచి ఉంది, కనులు చాచి, ఒడిని పరచి వేచి ఉంది! ఆలస్యం మనదే! అమ్మ నుండి కాదు, అమ్మనే కోరుకొందాం! ❖

జగన్మాతను ఎలుగెత్తి పిలువు, ఆమె కోసం విలపించు. అప్పుడు ఆమె ఎంత వేగంగా నీ వద్దకు పరిగెత్తుతూ వస్తుందో నీకే తెలుస్తుంది. మనసారా అమ్మను పిలిస్తే ఆమె ఉపేక్షించదు. - *శ్రీరామకృష్ణులు*

సంస్కారమే



ఆ రాకుమారుడూ, రాకుమారీ ఒకరి గురించి ఒకరు గొప్పగా విన్నారు. ఒక దేవహంస ఇద్దరి మధ్య రాయబారం నడుపుతుంది. దేవతలు తనను పెళ్ళి చేసుకుంటామన్నా వినక తన మనసులో మొదట ప్రవేశించిన ఆ రాకుమారుడినే స్వయంవర మహోత్సవం ద్వారా వివాహం చేసుకుంది ఆ రాజతనయ. కానీ సంసార సముద్రంలో వారి జీవననౌక సాఫీగా సాగలేదు. రాకుమారుడికి జూదం అంటే మక్కువ. పొరుగు రాజు జూదానికి ఆహ్వానించాడు. కలి పన్నాగమైన ఆ కపట ద్యూతంలో అన్నీ ఓడిపోయాడు. చివరకు కట్టుబట్టలు కూడా లేకుండా అడవుల పాలయ్యాడు. పట్టపు రాణి ఐన ఆ రాకుమారి భర్త కష్టాలలో ఉన్నప్పుడు భర్తతో ఉండడమే ధర్మమని భావించి పిల్లలను విదర్భరాజైన తన తండ్రి దగ్గరకు పంపించి తానూ భర్తను అనుసరిస్తూ కానలకేగుతుంది. తాను చేసిన తప్పుకి భార్య కష్టపడకూడదని ఆ రాజు ఆమెను కూడా పుట్టింటికి వెళ్ళమంటాడు. దుఃఖరోగార్తుడైన పతికి పత్నియే పరమౌషధమనీ, సర్వకాల సర్వావస్థలలో భర్తతో ఉండడమే భార్యకు ధర్మమనీ బోధించి, ఇంకెప్పుడూ తనను పుట్టింటికి వెళ్ళమని చెప్పవద్దని ప్రమాణం చేయించుకొని భర్తతో పాటు నరక యాతన అనుభవించడానికి సిద్ధపడుతుంది ఆ పుణ్యశీల.

భర్త అంత కష్టకాలంలో ఉన్నప్పుడు ఆయనను వదిలి వెళ్ళి తాను సుఖంగా జీవించలేనని, జీవచ్ఛవం లాగా తయారైన భర్తకు సేవచేస్తూ తనకు కలిగిన కష్టాలనన్నింటినీ సంతోషంగా భరిస్తుంది. కానీ ఆ రాజుకు తాను చేసిన దుష్కార్యం వలన తన అర్ధాంగి కష్టపడటం ఇష్టంలేదు. ఒకనాడు అడవిలో తనకు సేవ చేసీ చేసీ అలసి, ఆదమరచి నిద్రిస్తున్న భార్యను చూసి, దుఃఖాన్ని ఆపుకోలేక ఆ రాజు ఇలా తలపోస్తాడు, "ఇంతకు ముందు సూర్యుడు, గాలి కూడా ఈ స్త్రీమూర్తిని చూడలేదు. అంతఃపురంలో ఎండ కన్నెరుగని ఈ నిషధ రాజ్య పట్టమహిషి, ఎప్పుడూ హంసతూలికా తల్పాలపై పరుండే ఈ లలన, నేడు కటికనేలపై ఆదమరచి నిద్రిస్తున్నది. నాతో ఉంటే ఇక ఈమె కూడా కష్టాల కడలిని ఈదాల్సి ఉంటుంది. నేను ఈమెను వదిలి వెళితే కొద్దిసేపు నా కోసం వెదికి, ఈ అడవిలో నేను కానరాక చివరికి వారి పుట్టింటికి వెళుతుంది. పిల్లలతో ఉంటూ తనను మరచిపోతుంది. కష్టాలనుంచి గట్టెక్కుతుంది." ఇలా భావించి ఆమెను వదిలి వెళ్ళడానికి సిద్ధపడతాడు. కానీ ఆమె పుట్టింటికి వెళుతుందా? అని సందేహ మానసుడయ్యాడు. కొంచెం దూరం వెళ్ళి వెనక్కు వస్తాడు. మళ్ళీ కొద్ది దూరం వెళ్ళి భోరున విలపిస్తాడు. చివరకు గుండెదిటవు చేసుకొని **"ఆదిత్యా వసవో రుద్రా అశ్వినౌ సమరుద్గణౌ! రక్షన్తు త్వాం మహాభాగే ధర్మేణాసి సమావృతా!!** – ధర్మంచే పరివేష్టింపబడిన నిన్ను ఆదిత్యులు, వసువులు, రుద్రులు, అశ్వినులు, మరుత్తులు రక్షింతురు గాక! నీ పాతివ్రత్యమే నీకు శ్రీరామరక్ష అగుగాక!" అని ఆశీర్వాద వచనాలు పలికి అడవిలోకి వెళ్ళిపోతాడు. ఆ పతివ్రతాతిలకం మేలుకొంటుంది. భర్త కనపడలేదు. ఆమెకు అర్థమైంది. పతి తాను కష్టపడకూడదని తనను వదిలి వెళ్ళాడని గ్రహించింది. ప్రమాణం చేసీ తనను వదిలి వెళ్ళాడని ఆవేదన చెందుతుంది.

'నాకాలే విహితో మృత్యుమర్త్యానాం పురుషర్షభ! – మనిషి, కావాలనుకున్నా విధించిన సమయానికి ముందు మృత్యువు కూడా రాదు.' అందుకే హే నాథా! నీవు లేకున్నా ముహూర్తకాలం దాటి బ్రతుకుతున్నాను అని విలపిస్తుంది. దుఃఖం కట్టలు తెంచుకుంటుంది. ఆమెకు పుట్టిల్లు గుర్తుకు రాలేదు. భర్తను వెతకటం మొదలు పెడుతుంది. రాత్రి పగలు వెతికి వెతికి ఆ అరణ్యంలో మతిలేనిదానిలాగా తిరుగుతుంది. భర్త కనపడదు. విధి చివరకు పుట్టింటికి చేరుస్తుందామెను. ఐనా తన ప్రయత్నం మానలేదు. భర్త జాడ తెలియకపోతే శరీరాన్ని త్యజిస్తాననంటుంది. తండ్రి తన భర్తను వెదకడానికి చారులను, వేగులను పంపించేటట్లు చేసి, చివరకు భర్త ఆచూకీ కనుక్కొని తన దగ్గరకు రప్పించుకుంటుంది. తుదకు కథ సుఖాంతం అవుతుంది. కానీ ఆ పతివ్రతా శిరోమణి పడ్డ కష్టాలు అన్నీ ఇన్నీ కావు. అన్ని కష్టాలలోనూ భర్తను పల్లెత్తు మాట అనదు. విధి నిర్ణయం అలావుంది. విధి తనపై కక్ష కట్టిందని భావిస్తుంది తప్ప భర్తపై కోపగించుకోలేదు. పాపరహితుడైన తన భర్తను ఏదో దుష్టశక్తి ఆవహించిందని భావిస్తుంది, కలిని శపిస్తుంది. ఆ పతివ్రతా పరాయణ ఎవరో కాదు. భారతీయ ఆదర్శ స్త్రీమూర్తులలో ప్రథమంగా ఎన్నదగ్గ నారీమణి దమయంతి. ఆ రాజు మహాధర్మవేత్త, సదాచార పరాయణుడైన నలమహారాజు.

వివాహ జీవితంలో ఆనందం...స్వామి వివేకానంద ప్రవచనాలు విన్న తరువాత ఆల్బర్టా అనే ఒక పాశ్చాత్య మహిళ 'అయితే వివాహ జీవితంలో ఆనందం లేదంటారా స్వామీజీ?' అని అడుగుతుంది. అప్పుడు స్వామీజీ 'ఉంది. భార్యా భర్తలు ఇద్దరూ ఒకరికోసం ఒకరు పూర్తిగా త్యాగం చేయడానికి సిద్ధపడితే వివాహజీవితంలో ఆనందం ఉంటుంది' అంటారు.

స్వామీజీ యొక్క ఈ భావనకు అక్షరప్రతిరూపం మహాభారతంలోని నలదమయంతుల కథ. అందుకే స్వామీజీ అంటారు, 'భారతదేశంలో స్త్రీలకు సీత, సావిత్రి, దమయంతి ఆదర్శాలు కావాలి, వీళ్ళ అడుగు జాడలలో నడిచినంత కాలం భారతీయ స్త్రీలు ఆనందాన్ని పొందుతారు. వీరు చూపిన ఆదర్శాలకు దూరమైతే వాళ్ళ జీవితాలు దుఃఖమయమవుతాయి.'

ఇక నేటి భారతంలో యువతీ యువకులను చూస్తే వివాహం ఐన తరువాత ఏదో మనస్పర్థలు రాని కుటుంబాలు ఒక పదిశాతం కన్నా ఎక్కువ ఉండవేమో! ఒకరి ఆనందం కోసం

సాధికారత

– స్వామి శితికంఠానంద

ఇంకొకరు తమ జీవితాల్ని త్యాగం చేయాలనీ, ఇద్దరూ ఈ త్యాగంలో పోటీపడినప్పుడే గృహస్థజీవితం సంతోషదాయక మవుతుందనీ వారికి తెలియదనడం సత్యదూరం కాబోదు. ఇంతకు ముందు మహిళలు సంపాదించేవారు కాదు కాబట్టి వారు కొంత సహనాన్ని వహించేవారు. ఇప్పుడు ఆర్థిక స్వావలంబన కలగడంతో స్త్రీలు తాము ఎందుకు సహించాలి అని సర్దుకుపోయే మనస్తత్వానికి బదులుగా స్వేచ్ఛగా ఉండవచ్చని భావిస్తూ వివాహ బంధానికి స్వస్తి పలుకుతున్నారు. అందుకే భారతదేశంలోని ప్రతీ యువతీ యువకుడు నలదమయంతులు గాథ తప్పక చదవాలి. వారిద్దరిదీ ఎంతటి పవిత్ర ప్రేమ! వారు చూపిన ఆ ఆదర్శాలు సామాన్యమైనవా? యువత ఈ ఒక్క కథను చదివి అర్థంచేసుకుంటే భారతదేశంలో కుటుంబ న్యాయస్థానాల అవసరం ఉండదేమో! ఇక మహిళా సాధికారత పేరుతో మన ప్రభుత్వాలు స్త్రీల సహనాన్ని పూర్తిగా పరీక్షకు గురిచేసే పరిస్థితులను కల్పించాయి తప్ప వారికి తొలగిన దుఃఖమంటూ ఏమీలేదు.

ఇంతకు ముందు గృహిణులుగా, ఇంటి దేవతలుగా ఉన్నప్పుడు ఉన్న ప్రశాంతత, సౌకర్యం, ఆరోగ్యం వారికిప్పుడు సుదూరం. పురుషులతో పాటు స్త్రీలు కూడా అన్ని రంగాలలో సమానంగా రాణిస్తున్నారు. ఏదో సమానత్వం సాధించేసామని స్త్రీవాదులు, ప్రభుత్వాలు అనుకోవచ్చు. నిజానికి స్త్రీకి మానసికంగా, శారీరకంగా ఇంకా శ్రమ, కష్టం పెరిగిందేగానీ తగ్గలేదు. అటు ఉద్యోగం, ఇటు ఇల్లు, పిల్లలు, వారి చదువులు, ఉద్యోగాలలో ఉండే ఒత్తిడి.. సౌకుమార్యానికి, సున్నితత్త్వానికి ప్రతీకలైన వారి మనోశరీరాలు ఇంత ఒత్తిడిని తట్టుకోలేక పోతున్నాయి. అందుకే ఆధునిక మహిళలు పిన్న వయసులోనే అనారోగ్యానికి గురవుతున్నారు.

భారతనారి ఆదర్శం... 'భారతదేశంలో స్త్రీ అంటే అమ్మ అంటారు' స్వామి వివేకానంద. ఒక ఆదర్శ మాతృమూర్తి కావాలంటే ఎంతో ఆధ్యాత్మిక సంస్కారం కావాలి. ఆ సంస్కారం లౌకిక దేశంలో విద్యద్వారా రాదు కాబట్టి ఎవరికివారు శ్రమపడి పెంపొందించుకోవాలి. ఈ సంస్కారం లేకుండా సంతానమంటే అసుర సంతానమే. గత యాభై సంవత్సరాలుగా భారతదేశంలో అధిక సంఖ్యాకులు అసురాంశతోనే జన్మించారు. నిదర్శనం ఏమిటని మనం అడగవచ్చు. ప్రస్తుతం ఉన్న అవినీతే దానికి నిదర్శనం. ప్రార్థనతో పుట్టిన వాళ్ళు సర్వకాల సర్వావస్థలలోనూ ధర్మాభిరక్తులుగా ఉంటారు. వారు ప్రలోభాలకు లొంగరు. అక్రమ సంపాదనను కలలోనైనా ఆశించరు. అంటే ఆధ్యాత్మిక సంస్కారాలు కలిగి సత్సంతానానికి మాతృమూర్తులు అయ్యేదిశగా నేటి మహిళలు సాధికారతను సంపాదించుకోలేకపోతున్నారు. వారికావకాశం ఉండటంలేదు. లౌకిక విద్యను నేర్చుకొని ఉద్యోగాలు చేస్తున్నారు కానీ మానవజీవనపయనంలో మాతృమూర్తులుగా వారిది బృహత్తరమైన పాత్ర అనీ, ఆ పాత్రకు వారు న్యాయం చేయలేకపోతున్నారనీ వారికీ అర్థం కావడం లేదు. 'తన తల్లి దైవప్రార్థనలు చేసి తనను కనడం ద్వారా తనకు ఆధ్యాత్మిక సంస్కారం జన్మతః అలవడింది' అని స్వామీజీ అన్నారు. ప్రపంచానికి ఆయన చేసిన మేలును మనం ఎన్నగలమా? వారి జనని భువనేశ్వరీ దేవికేమన్నా పీజీలు, పిహెచ్‌డీలు ఉన్నాయా? ఆమె జపతపాల అనుష్ఠానంలో దిట్ట. తనకున్న దైవీసంస్కారంతో ఒక మహాపురుషుడికి తల్లి కాగలిగింది. అలాంటి సంస్కారంగల యువతులు పదిమంది ఉంటే చాలు; భూమి తన అక్షంలో స్థిరంగా నిలబడుతుంది. ఇదే నిజమైన సాధికారత.

దమయంతి దమన మహర్షి అనుగ్రహంతో పుట్టింది కాబట్టి ఆమెలో అంత సంయమనం, స్వధర్మనిష్ఠ ఏర్పడ్డాయి. పుట్టుకతోనే ధర్మసంస్కారంతో పుట్టిన పుణ్యమూర్తి కాబట్టి మహాసాధ్వి అవగలిగింది. ఒక మనిషిని ఈ ప్రపంచానికి పరిచయం చేయడమంటే అంత ఆషామాషీ వ్యవహారం కాదు. ఆ వ్యక్తి ప్రపంచానికి మేలుచేస్తాడో కీడు చేస్తాడో తల్లిగర్భంలోనే నిర్ణయమైపోతుంది. ప్రార్థనతో పుడితే పరోపకార పారీణులవుతారు. లేకపోతే స్వార్థపరులవుతారు. దైవీసంపత్తితో పుడితే వ్యక్తి లోకరక్షకుడవుతాడు. లేకపోతే లోకభక్షకుడవుతాడు. కనుక రేపటి జననీ జనకులైన నేటి యువతీ యువకులు ఉత్తమ జననీ జనకులవడానికే వివాహం అని గ్రహించి భరతవర్షాన్ని మళ్ళీ ఆర్యులతో నింపటానికి ముందుకు రావాలి అని కోరుకుందాం! ❖

విద్యావంతులు, పుణ్యాత్ములైన తల్లుల ఇళ్ళలోనే మహాపురుషులు జన్మిస్తారు. స్త్రీజన సముద్ధరణ ముందుగా జరగాలి. ఆ తరువాతనే భారతదేశానికి నిజమైన మేలు చేకూరుతుంది. -స్వామి వివేకానంద

తాతయ్య కల

- శ్రీమతి సుధామూర్తి, ఇన్ఫోసిస్ ఫౌండేషన్

మాది మధ్య తరగతి ఉపాధ్యాయ కుటుంబం. పుస్తకాలను సిరిసంపదల కన్నా ఎంతో విలువైనవిగా మా ఇంట్లో భావించేవాళ్ళు. అందుకే ఎన్నో అపురూపమైన పుస్తకాలు మా ఇంటి అరల్లో ఉండేవి. ఉపాధ్యాయుడిగా మా తాతయ్యను ఆ గ్రామంలో ఎంతో గౌరవించేవారు. పుస్తకమే ఆయనకు హస్తభూషణం. సాయంకాలాల్లో సలహాల కోసం ఎందరో ఆయన దగ్గరకు వచ్చేవాళ్ళు.

తాతయ్యతో నా అనుబంధం మరువలేనిది. ఆయనకు పుస్తకాలంటే మహాప్రాణం. ఆయన రాత్రివేళల్లో నీలాకాశంలో మినుకుమినుకుమనే తారల సాక్షిగా లెక్కలేనన్ని కథలు చెప్పేవారు. తాతగారు తన కథననైపుణ్యంతోనే నన్ను రాజస్థాన్‌లోని ఆరావళి పర్వతాలను అధిరోహింపచేశారు; ప్రాణాలొడ్డి రాణాప్రతాప్‌ను రక్షించిన అతని గుర్రం 'చేతక్' కోసం ఏడ్చేలా చేశారు; శివాజీ మహరాజ్ ఘనవిజయాలను కళ్ళకు కట్టినట్లు చూపించారు; స్వాతంత్ర్య సంగ్రామ ఘట్టాల్ని వర్ణించి, ఉద్వేగం తెప్పించారు; ఊహాలోకంలో అరబ్బును చేసి వారి దుస్తుల్లో బాగ్దాద్ నగరవీధుల్లో విహరింపజేశారు. అలా విజ్ఞానం, వినోదంతో కూడిన సాహిత్యంతో పసితనంలోనే పరిచయం చేసింది తాతయ్యే!

చిన్నారిగా ఆయనతో కలిసి నేను వెళ్ళిన మొట్టమొదటి ప్రదేశం - స్థానిక గ్రంథాలయం. నేను చిన్నపిల్లల పుస్తకాలు చదవడం ఆరంభించింది అక్కడే! చదువుతూ నన్ను నేను మరచిపోయేదాన్ని.

నాకు పన్నెండేళ్ళు వచ్చేసరికి ఆ చిన్న పల్లెటూరి గ్రంథాలయంలో ఉన్న పుస్తకాలన్నీ చదివేశాను. కొత్త పుస్తకాల్లేవు. గ్రంథాలయానికి వెళ్ళాలంటే విసుగనిపించేది. ఒక సాయంత్రం అలా తాతయ్యతో వాహ్యాళికి వెళుతున్నాను. తాతయ్యకు సరిగ్గా కళ్ళు కనిపించవు. అందుకే వీధిదీపాల వెలుగులో చేయి పట్టుకొని, మెల్లగా ఆయనను తీసుకువెళుతున్నాను. ఉన్నట్టుండి తాతయ్య ఆగిపోయి 'నేనొక పద్యం సగం చెబుతాను. నువ్వు పూర్తి చెయ్యగలవా?' అన్నారు. 'సరే తాతయ్యా! చెప్పు! ప్రయత్నిస్తాను' అన్నాను. తాతయ్య 'నాకే రెక్కలుంటే...' అనే అసంపూర్ణమైన పద్యపాదాన్ని ఇచ్చారు.



వెంటనే నేను 'పక్క ఊరి గ్రంథాలయానికి ఎగిరిపోతాను... మరిన్ని పుస్తకాలు చదివేందుకు!' అన్నాను. ఆశ్చర్యపోయిన తాతయ్య అలా నిలుచుండిపోయి, 'మళ్ళీ చెప్పు!' అన్నారు. అదే చెప్పాను. ఆయన నవ్వి 'పద్యం భలే తెలివిగా పూరించావే! అసలు పద్యం తెలుసునా?' అన్నారు. 'ఓ తెలుసు'...

'నాకే రెక్కలుంటే
నీలాకాశంలోకి ఎగిరిపోతాను
అందమైన చోట్లెన్నో చుట్టివస్తాను
గొప్పవారిని కలుస్తాను
గుప్తనిధులు వెతుకుతాను' అన్నాను. తాతయ్య మాట్లాడలేదు.



ఇంటికి చేరుకున్నాం. కింద చాప పరచి తను కూర్చొన్నారు. పక్కన నన్ను కూర్చోపెట్టుకొని, నా చిన్న చెయ్యి తన చేతిలోకి తీసుకొని 'వందేళ్ళ క్రితం అమెరికాలో ఆండ్రూ కార్నెజీ అనే కోటీశ్వరుడు ఉండేవాడు. ఆయన చనిపోయేప్పుడు తన యావదాస్తితో గ్రంథాలయాలు నిర్మించాలని వీలూనామా రాశాడు. అక్కడి గ్రామాల్లో ప్రతి గ్రంథాలయం ఆయన డబ్బుతో కట్టించిందేనట! ఇంకా ఎంత కాలం ఉంటానో తెలీదు. నీకు పుస్తకాలంటే ఎంత ఇష్టమో నాకు అర్థమైంది. నీవు పెద్దదానివైన తరువాత నీ దగ్గర అవసరానికి మించిన డబ్బుంటే కనీసం ఒక గ్రంథాలయానికైనా పుస్తకాలు కొనిస్తానని ప్రమాణం చెయ్యి' అన్నారు.

అది చలికాలం. ఆయన వణకుతున్న తన చేతిలో నా చిన్ని చేతిని పట్టుకోవడం నాకు ఇప్పటికీ జ్ఞాపకమే! తెలియకుండానే 'సరే తాతయ్యా!' అని మాట ఇచ్చాను. ఏళ్ళు గడిచాయి. చాలా డబ్బు సంపాదించిన తరువాత, గ్రంథాలయానికి పుస్తకాలు కొనిస్తానని తాతయ్యకిచ్చిన వాగ్దానం గుర్తుకొచ్చింది. ఆ సంకల్ప ఫలంగానే ఇన్ఫోసిస్ ఫౌండేషన్ ద్వారా పదివేల గ్రంథాలయాలకు పుస్తకాలు కొనిచ్చాము. ❖ సేకరణ: జి. సతీష్

యువవాణి

– స్వామి పరిజ్ఞేయానంద

ఎస్. విష్ణుతేజ, ఇంజనీరింగ్ విద్యార్థి, నెల్లూరు

ప్రశ్న: నరేంద్రుడు (స్వామి వివేకానంద) ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నప్పుడు కష్టాలను తీర్చమని కాళీమాతను ప్రార్థించడానికి వెళ్ళాడు. కానీ ఆలయంలోకి వెళ్ళి కాళీమాతను చూడగానే తాను అడగాల్సిన విషయాన్ని మరచిపోయాడు. అద్భుతమైన జ్ఞాపకశక్తి గల నరేంద్రునికి మరుపు ఎలా వచ్చింది?

జవాబు: మహాత్ముల ప్రతీ మాట, ప్రతీ చర్య మానవాళికి బోధించడానికే! మానవులను ఉన్నతంగా తీర్చిదిద్దడానికే! నిజానికి, నరేంద్రుడు మనం అనుకున్నట్లు జగన్మాతను చూడగానే తాను అడగాల్సిన విషయాన్ని మరచిపోలేదు. అడగాల్సిన అసలు విషయం జ్ఞాపకం వచ్చింది. మానవజీవిత పరమార్థమైన శాశ్వతానందస్థితి(ముక్తి)ని పొందడానికి అవసరమైన భక్తి, జ్ఞాన, వైరాగ్యాలను ప్రసాదించమని ప్రార్థించాడు.



అదే మనమైతే ఏం చేస్తాం? మనకు కావాల్సిన వాటిని మరచిపోకుండా ఓ చిట్టాను తయారుచేసుకుంటాం. పరీక్షల్లో ఉత్తీర్ణుల మవ్వాలనీ, మంచి ఉద్యోగం రావాలనీ, విదేశాలకు వెళ్ళడానికి వీసా త్వరగా రావాలనీ, ఆరోగ్యం బాగుండాలనీ... ఇలా మన కోరిక లన్నింటినీ ఒక చిట్టా రాసుకొని వెళ్ళి దేవునికి వినిపించేస్తాం. మనలాగే నరేంద్రుడు కూడా జగన్మాత ముందు కోరికల చిట్టాను విప్పివుంటే ఓ సాధారణ వ్యక్తిగానే మిగిలిపోయేవాడు. అలా జరిగివుంటే మనం ఈనాడు సర్వమానవాళిని జాగృతపరిచిన ఓ స్వామి వివేకానందను కోల్పోయి ఉండేవాళ్ళం.

సాధారణ మనుషులకూ, మహాత్ములకూ మధ్య ఉన్న తేడా ఏమిటి? ఒక ఊరికి ఓ యోగి విచ్చేశాడు. అతణ్ణి దర్శించిన వారికి బంగారుకడ్డీని ప్రసాదంగా ఇస్తున్నాడన్న వార్త ఊరంతా పాకిపోయింది. మరుక్షణమే ఊరి జనమంతా ఆ యోగిని దర్శించడం (బంగారుకడ్డీ) కోసం బారులు తీరి నిలబడ్డారు. అందరికీ బంగారుకడ్డీని ప్రసాదంగా ఇచ్చి ఆశీర్వదిస్తున్నాడు ఆ యోగి. ఒకతను మాత్రం యోగికి వందనాలర్పించి 'స్వామీ! బంగారపు కడ్డీలు ఎన్ని ఉన్నా కొంతకాలం తరువాత ఖర్చయి పోతాయి. అందువల్ల ఈ బంగారు కడ్డీలను తయారుచేసుకొనే మార్గాన్ని తెలపండి' అని అడిగాడు. వెంటనే ఆ యోగి సంతోషించి అతడికి ఓ పరుసవేదిని ఇచ్చాడు. పరుసవేదితో తాకిన ఇనుము బంగారంగా మారిపోతుంది. కాబట్టి అప్పటి నుండి అతడు తరగని సిరి సంపదలతో జీవించసాగాడు.

ఆ యోగి నుండి కేవలం బంగారు కడ్డీలను ఆశించిన వారిలాంటి సాధారణ వ్యక్తులం మనం. పరుసవేదిని కోరిన వ్యక్తిలాంటివాడు నరేంద్రుడు. మనం భగవంతుణ్ణి భోగభాగ్యాల కోసం ప్రార్థిస్తాం. అవి లభిస్తే మన కష్టాలు తీరిపోతాయనీ, సుఖవంతంగా జీవించవచ్చనీ అనుకుంటాం. కానీ వాటివల్ల కలిగే ఆనందం తాత్కాలికమే అని గ్రహించం. నిజమైన వివేకవంతుడు శాశ్వతానంద స్థితిని కోరుకుంటాడు. నరేంద్రుడు శాశ్వతానంద స్థితిని పొందడానికి భక్తి, జ్ఞాన, వైరాగ్యాలను (పరుసవేదిని) ప్రసాదించమని జగన్మాతను ప్రార్థించాడు.

మనిషి ప్రాపంచిక జీవితంలోగానీ, పారమార్థిక జీవితంలోగానీ ఉన్నత స్థాయిని చేరుకోవడానికి భక్తి, జ్ఞాన, వైరాగ్యాలు అవసరం. ప్రాపంచిక జీవితంలో ఏది సాధించాలన్నా చేస్తున్న పని పట్ల అభిరుచి, (భక్తి) కలిగివుండాలి; లక్ష్యాన్ని సాధించడానికి కావాల్సిన తెలివితేటలు, ప్రతిభ (జ్ఞానం) అవసరం; పని పూర్తయిన తరువాత

పరుసవేదిని కోరుదాం!

వచ్చే ఫలితం పట్ల అనాసక్తి(వైరాగ్యం) భావం ఉండాలి. అప్పుడు ఏ కార్యాన్నైనా సంతోషంతోనూ, నైపుణ్యంతోనూ, దృఢ మనస్సుతోనూ నిర్వర్తించగలం, ఉన్నతిని సాధించగలం.

అలాగే పారమార్థిక జీవితంలో పరమార్థాన్ని సాధించడానికి భగవంతుని పట్ల అనురాగం (భక్తి); కామక్రోధాలనే అవరోధాలను అధిగమించగల శక్తి (జ్ఞానం); భౌతిక సుఖాల పట్ల అనాసక్తి (వైరాగ్యం) భావం అవసరం.

సాంకేతిక రంగంలో చెరగని ముద్రవేసిన బిల్‌గేట్స్, స్టీవ్‌జాబ్స్ లాంటివారికైనా; పారమార్థిక జీవితంలో చరితార్థులైన ప్రహ్లాదుడు, నచికేతుడు లాంటివారికైనా ఉన్నత స్థాయికి చేరుకోవడానికి అవసరమైనవి పైన పేర్కొన్న మూడు లక్షణాలే!

ఈ మూడు లక్షణాలనే స్వామి వివేకానంద జగన్మాత నుండి కోరుకున్నారు. అందువల్ల స్వామి వివేకానంద తమ సందేశంతో విశ్వమానవాళిని జాగృతపరచి విశ్వవిఖ్యాతులయ్యారు. అలాగే అత్యున్నత ఆధ్యాత్మిక అనుభూతులను పొంది అపర శివునిగా ఆరాధనలందుకుంటున్నారు. స్వామీజీలాగ మనం కూడా ప్రాపంచిక జీవితంలోనూ, పారమార్థిక జీవితంలోనూ ఉన్నతిని సాధించడానికి ఆ జగన్మాత నుండి పరుసవేదిని కోరుకుందాం. ❖

ప్రారంభంలో కష్టంగా ఉన్నప్పటికీ, కాలక్రమంలో మీకు మేలు చేసే మార్గాన్నే స్వీకరించండి. సుఖంగా ఉన్నప్పటికీ, చివరికి కష్టాలను కొనితెచ్చే మార్గాన్ని వదలివేయండి. – స్వామి వివేకానంద

ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన బల్గేరియన్ చిత్రకారుడు జ్లాత్యు బొజాద్యేవ్ తన జన్మదినాన్ని అర్థవంతంగా జరుపుకోవాలని తపిస్తూ ఉండేవాడు. అందరిలా వేడుకలతో, విందులతో కాకుండా, తనలోని ప్రతిభకు పుట్టినరోజునే మైలురాయిగా పెట్టుకొని, ఏటా తను గీసిన చిత్రాలతో ప్రదర్శన ఏర్పాటు చేస్తూ ఉండేవాడు.

ఆ పరంపరలో భాగంగా ఓ ఏడాది తన పుట్టినరోజుకు కొన్ని నెలల ముందు నుంచే చిత్రాలు గీయడం ఆరంభించాడు. ఇంతలో విధి, ఇంద్రధనుస్సులాంటి ఆయన జీవనచిత్రికపై విషాదపు మేఘాన్ని కమ్మేసింది! పక్షవాతం రూపంలో ఆయన కుడిచేతిని కబళించింది. ఒక్క చిత్రం కూడా పూర్తి కాకుండానే, ఆయన ఆశల్ని చిదిమేసింది. కానీ ఆయన అజేయమైన ఆత్మసంకల్పం ముందు విధి కూడా చిన్నబోయింది. కుడిచేయి ఇక కదలదని నిర్ధారించుకున్న మరుక్షణం, ఎడమచేతితో బొమ్మలు గీయడం ఆరంభించాడు. అలుపెరుగని యోధుడిలా రాత్రింబగళ్ళూ కష్టపడి వందలాది చిత్రాలకు జీవం పోశాడు. అందరూ అబ్బురపడేలా తన పుట్టినరోజున అద్వితీయమైన చిత్రకళా ప్రదర్శన ఏర్పాటుచేశాడు. ఆహూతులందరి చేత పుట్టినరోజు జేజేలు పలికించుకున్నాడు.

ఇలా మన ప్రతి జన్మదినోత్సవం మన జీవితంలో ఓ శుభసంకల్పానికో, సేవాకార్యక్రమానికో శ్రీకారం చుట్టాలి. అలా కాకుండా పిల్లికి బిచ్చం కూడా వేయకుండా, మనం మాత్రం ఆడంబరంగా జరుపుకునే పుట్టినరోజు వేడుకలకు జనం హాజరై, మనమిచ్చే విందూవినోదాలు అనుభవిస్తూ మనస్సులో మాత్రం, **పెట్టిపోయలేని ఈ వట్టినరుడు భూమి, పుట్టనేమి వీడు గిట్టనేమి, పుట్టలోని చెదలు పుట్టవా? గిట్టవా?...** అనుకుంటారు.

పుట్టినరోజు జేజేలు

– బి. సైదులు



ఎదిగితేనే ఏడాది వేడుక...: మనలో చాలామంది తమ జన్మదినోత్సవాలకు జాతీయపండగలంత హడావిడి చేస్తూ ఉంటారు. అట్టహాసంగా, ఆడంబరంగా నిర్వహించుకోవాలని తహతహలాడుతూ ఉంటారు. పసితనంలో ముచ్చట కోసం చిన్నారులకు అలా పుట్టినరోజులు జరపడం, ఆ ఆనందాన్ని నలుగురితో పంచుకోవడం తప్పు కాదు. అయితే ఎదుగుతున్న కొద్దీ మన ఆలోచనల్లో మార్పు రావాలి. మన జన్మదినోత్సవం మరపురాని రోజుగా మిగిలిపోవడానికి, ఉన్నతమైనవీ, ఉదాత్తమైనవీ మనం ఏమైనా చేయగలమా? అని ఆత్మపరిశీలన చేసుకోవాలి. అందుకే ఓ భావకవి **'పుట్టినరోజు పండగే అందరికి, మరి పుట్టింది ఎందుకో తెలిసేది ఎందరికి?'** అని ప్రశ్నిస్తారు.

తెలుగు సారస్వతానికి విశేషమైన సేవలందించిన ఓ సాహితీవేత్త, యుక్తవయస్సులో ఉన్నప్పుడు, తన ప్రతి జన్మదినానికి ఓ కవితల పుస్తకాన్ని విడుదల చేయాలని సంకల్పించుకున్నారు. ఆ నిర్ణయానికి కట్టుబడి అప్పటి నుంచి ఏటా తన జన్మదినం నాడు ఓ కవితా సంపుటిని ఆవిష్కరిస్తూ వస్తున్నారు. ఈనాటికీ ఎనభై ఏళ్ళ పైబడిన వయస్సులో కూడా ఆయన ఈ పరంపరను కొనసాగిస్తూ, వ్యక్తిగతమైన తన ఉత్సవాన్ని పరోక్షంగా సాహితీసేవగా మలచుకొని, నవతరం సాహితీవేత్తలకు ఆదర్శంగా నిలుస్తున్నారు.

అలా అని పుట్టినరోజులు, పెళ్ళిరోజులు వంటి ఆత్మీయమైన వేడుకలను జరుపుకోకుండా, యాంత్రికమైన జీవితాన్ని గడపమని కాదు. కానీ వాటికి విశాలమైన దృక్పథాన్ని జోడిస్తే, ఆ సందర్భాలకు మరింత విలువను, వెలుగును దీపించగలరు.

వారి జన్మదినం జాతికే పండుగదినం... : మరికొంత మంది మహానుభావులు వారి జీవితాల్ని సమాజానికే అంకితం చేస్తూ వారి జన్మదినోత్సవాలను యావత్ మానవాళి, జాతీయ పండుగలుగా నిర్వహించుకునే మహద్భాగ్యాన్ని కల్పిస్తారు. అందుకే అలాంటి మహనీయులు వ్యక్తిగతంగా తాము జన్మదినోత్సవాలను జరుపుకోవడం కన్నా, నలుగురు నాలుగుకాలాల పాటు తలచుకునే రీతిలో ఏదైనా చేయాలని తపిస్తూ ఉంటారు.

డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ గారు ఉపాధ్యాయులుగా ఉన్నప్పుడు వారి శిష్యులు ఓ ఏడాది సెప్టెంబరు అయిదున వారి జన్మదినోత్సవాన్ని ఘనంగా నిర్వహించ దలచి, అందుకు వారిని ఆహ్వానించేందుకు వెళ్ళారు. అప్పుడు రాధాకృష్ణన్ గారు 'నా పుట్టినరోజును ఉత్సవంలా ఇలా వైభవంగా ఏర్పాటు చేయడం కన్నా, ఏటా ఈ రోజును నాకు అత్యంత అభిమానమైన ఉపాధ్యాయవృత్తికి గౌరవసూచకంగా ఉపాధ్యాయ దినోత్సవంగా నిర్వహిస్తే నేను ఎంతో సంతోషిస్తాను' అన్నారట! అందుకే వారి జయంతిని భారత ప్రభుత్వం ఉపాధ్యాయ దినోత్సవంగా ప్రకటించింది.



అదేవిధంగా 'నా ఆశలన్నీ యువతరంపైనే' అంటూ ఆగామి తరాలలో ఆత్మవిశ్వాసాన్ని రాజేసిన స్వామి వివేకానంద జయంతిని 'జాతీయ యువజన దినోత్సవం'గా; సత్యం, అహింసలనే ఆయుధాలతో తెల్లదొరలపై తిరుగుబావుటా ఎగరేసిన మహాత్మాగాంధీ జయంతిని 'అంతర్జాతీయ అహింసా దినోత్సవం'గా పాటించడం ఆనవాయితీగా వస్తోంది.

పంచుకునే పర్వదినంగా...: హైదరాబాదు రామకృష్ణ మఠంలోని 'వివేకానంద మానవవికాస కేంద్రం'లో కొన్నాళ్ళ క్రితం యువజాగృతివేదిక అనే శాఖను ప్రారంభించారు. ఎందరో యువతీయువకులు అందులో సభ్యులుగా చేరి, తమ వ్యక్తిత్వానికి మెరుగులు దిద్దుకోవడంతో పాటు సామాజిక సేవాకార్యక్రమాల్లో పాల్గొంటూ ఉంటారు. ఆ తరగతులతో, ఉపన్యాసాలతో స్ఫూర్తిపొందిన కొందరు యువతీయువకులు, ఏటా తమ తల్లితండ్రులు పుట్టినరోజు పండుగల కోసం ఇచ్చే డబ్బును అనాథ పిల్లల కోసం విరాళంగా అందజేస్తూ ఉంటారు. ఆ రోజు తమ జన్మదినాన్ని నిరాడంబరంగా జరుపుకొని, మిగతా సమయమంతా సమాజసేవకు కేటాయిస్తూ ఉంటారు. పుట్టినరోజు వేడుకలకు వేలు, లక్షలు ఖర్చుచేసే ఉన్నత వర్గాల యువతీయువకుల్లో కూడా చాలామంది, ఆ మొత్తాన్ని మఠానికి విరాళంగా ఇస్తూ తమ ఉదారతను చాటుకుంటూ ఆదర్శంగా నిలుస్తున్నారు. *Do all the good you can, In all the ways you can With all the means you can, To all the people you can For as long as you can...* అన్నదే నినాదంగా చేసుకొని కన్నవారు కూడా గర్వపడేలా తమ పెద్దమనస్సును చాటుకుంటున్నారు.

సమాజంలో కొందరు యువకళాకారులు కూడా తమ ఆత్మీయమైన వేడుకలను అనాథశరణాలయాలు, వృద్ధాశ్రమాల్లో ఏర్పాటుచేసుకుంటున్నారు. 'ఈ అనాథలు, అభాగ్యులతో కలిసి మా పుట్టినరోజులు జరుపుకుంటూంటే కలిగే ఆనందం ముందు, ఇన్నాళ్ళూ కేకులు కోసుకుంటూ, కానుకలు ఇచ్చుకుంటూ, రాత్రిపగలూ చేసుకున్న పార్టీలు ఎంత రసహీనమో ఇప్పుడర్థమవుతుంది' అన్నారు ఇటీవల తన జన్మదినాన్ని అనాథశరణాలయంలో జరుపుకున్న ఓ ప్రముఖ యువకళాకారుడు.

పుట్టినరోజుకు పరమార్థం : ఉన్నతంగా ఆలోచిస్తే పుట్టినరోజుకు నిగూఢమైన పరమార్థముందని అవగతమవుతుంది. అందుకే కొంతమంది కారణజన్ములు, తమ ఆధ్యాత్మిక సాధనాపథంలో ఈ జననమరణాలను మజిలీలుగా భావించుకుంటూ ముందుకు సాగిపోతారు. అలాంటి మహాత్ములు తమ జన్మదినాన్ని తమ ఆధ్యాత్మికోన్నతికి, విశ్వమానవాళి ఆధ్యాత్మికోద్ధరణకు పుణ్యతిథిగా భావించుకుంటూ ఉంటారు.

రామకృష్ణ సంఘం పదమూడవ సర్వాధ్యక్షులుగా బాధ్యతలు నిర్వహించిన వరిష్ఠ సాధుపుంగవులు స్వామి రంగనాథానంద మహరాజ్, తమ అభిమానులు, భక్తులు వారి జన్మదినాన్ని నిర్వహించేందుకు సంప్రతించినప్పుడు "*What are births and deaths? Merely punctuations. Just like when you write a sentence, you put a comma, put a semi-colon. Spiritual freedom is our birth right. Try to realize our birthright.* – అనంతమైన మానవజీవన యానంలో ఈ జనన, మరణాలనేవి వాక్యం రాసేటప్పుడు ఉపయోగించే విరామచిహ్నాలవంటివి. ఆధ్యాత్మికంగా స్వేచ్ఛను సాధించినప్పుడే జీవితం సంపూర్ణమవుతుంద"న్నారు. ఇంతటి పరమోన్నత భావనతో పుట్టినరోజులు జరుపుకోలేకపోయినా, ఆ రోజును దీపాలు ఆర్పే పండుగలా కాకుండా, పదుగురి దీవెనలతో ఆనందపు పండువెన్నెల్ని పంచే పర్వదినంలా జరుపుకోగలిగితే అంతకు మించిన పరమార్థం మరోటి లేదు. ❖

మృత్యువు అనివార్యమైనప్పుడు, రాళ్ళు రప్పల్లాగా ఉండడం కన్నా ధీరుల్లాగ మరణించడం శ్రేయస్కరం. తుప్పు పట్టే కన్నా, కొంతైనా పరులకు మేలు చేయడంలో అరిగిపోవడం మంచిది. -స్వామి వివేకానంద



విద్యార్థులకు...

– మహాత్మాగాంధీ

నేనూ అందరు విద్యార్థుల్లాగే, పాఠశాల స్థాయి నుంచి నా జీవితాన్ని ఆరంభించాను. అయితే నేను ఓ సాధారణ విద్యార్థిని మాత్రమే! చదువులో నాకు తక్కువ మార్కులు వచ్చినా నేను అంతగా బాధపడకపోయేవాణ్ణి. కానీ, నా ప్రవర్తన విషయంలో మాత్రం చాలా జాగ్రత్తగా ఉండేవాణ్ణి. ఆచరణలో దోషం కనబడితే ఏడుపు వస్తూ ఉండేది. ఉపాధ్యాయులు నన్ను మందలించడం కానీ, ఆ పరిస్థితి ఏర్పడడం కానీ నేను భరించలేకపోయేవాణ్ణి.

ఒకసారి ఏదో కారణం చేత నేను దెబ్బలు తినాల్సి వచ్చింది. దెబ్బలు తిన్నందుకు విచారించలేదు కానీ, దండనకు గురి అయ్యానన్న భావనకే అమితంగా బాధపడ్డాను; బాగా ఏడ్చాను. ఒకరి ముందు తల దించుకునేటంత తప్పు చేయడం తీవ్రమైన అవమానంగా భావించేవాణ్ణి. అదే విధంగా పెద్దల దోషాలను చూసి కళ్ళు మూసుకోవడం నా స్వభావం. నేను పెద్దల ఆజ్ఞ పాలించడమే నేర్చుకున్నానే తప్ప, వారి పనుల్ని గురించి తర్కించడం నేర్చుకోలేదు.

మా ప్రధానోపాధ్యాయులు ఉన్నత పాఠశాల విద్యార్థులకు వ్యాయామం, క్రికెట్టు అనివార్యం చేశారు. నాకు అవి ఇష్టం లేదు. నేను వాటిలో పాల్గొనేవాణ్ణి కాదు. చదువుకూ, వ్యాయామానికీ ఏ మాత్రం సంబంధం లేదని నేను ఆ రోజుల్లో అపోహపడేవాణ్ణి. కానీ నా అభిప్రాయం తప్పని తరువాత తెలిసింది. మానసిక శిక్షణతో పాటు, శారీరక శిక్షణ కూడా విద్యార్థికి అవసరమని తరువాత బోధపడింది. ఆ రోజుల్లో మా నాన్నకు ఆరోగ్యం క్షీణించింది; ఆయనకు సేవ చేయాలనే తలంపు కూడా, నేను వ్యాయామంలో పాల్గొనక పోవడానికి మరో కారణం. పాఠశాల మూసివేయగానే ఇంటికి వెళ్ళి ఆయనకు సపర్యలు చేస్తూ ఉండేవాణ్ణి.

స్నేహం నేర్పిన గుణపాఠం: హైస్కూల్లో నాకు ఇద్దరు స్నేహితులు ఉండేవారు. వారిలో ఒకరితో మైత్రి ఎక్కువ కాలం సాగలేదు. నేను మాత్రం ఆ మిత్రుణ్ణి వదలలేదు. మరొకరితో నేను స్నేహంగా ఉండడం ఇష్టం లేక అతడే నన్ను వదిలేశాడు. ఇక రెండో వ్యక్తితో స్నేహం చాలా కాలం సాగింది. కానీ అది నాకు ఓ గుణపాఠంగా మిగిలింది. అతణ్ణి సంస్కరించాలనే భావంతో నేను అతనితో స్నేహం చేశాను. కానీ నేనే ప్రమాదంలో చిక్కుకున్నాను. అతడూ, మా రెండో అన్నయ్య సహాధ్యాయులు. అతనిలో కొన్ని దోషాలు ఉన్నాయి. అవి నాకు తెలుసు. అయినా అతడు విశ్వసనీయుడనే భావించాను. చెడు సహవాసం వద్దని మా అమ్మ, పెద్దన్నయ్య తదితరులు హెచ్చరిస్తూనే ఉన్నారు. అప్పుడు నేను, 'మీరు చెప్పిన దోషాలు అతనిలో ఉన్నమాట నిజమే! కానీ అతనిలో గల సుగుణాలు తెలియవు. అతడు నన్ను చెడగొట్ట లేదు. అతడిని మంచి దారికి తీసుకొని వచ్చేందుకే అతనితో స్నేహం చేస్తున్నాను. దోషాల్ని సరిచేసుకుంటే అతడు ఉత్తముడవుతాడు. అందుకే అతనితో చేతులు కలిపాను. నా గురించి మీరు విచారపడవద్దు' అని వారికి నచ్చజెప్పాను. వాళ్ళు నన్నేమీ అనలేక, నా దారిన నన్ను పోనిచ్చారు. కానీ, నాదే పొరపాటని తరువాత తేలింది. ఇతరుల్ని సంస్కరించడం కోసం మరీ లోతుకు పోకూడదని గ్రహించాను. సమానగుణాలు కలిగిన వారి స్నేహమే శోభిస్తుంది, నిలుస్తుంది. అసలు అతి స్నేహం పనికిరాదనే నా అభిప్రాయం. సామాన్యంగా మనిషి సుగుణాల కంటే దుర్గుణాలనే త్వరగా గ్రహిస్తాడు.


మరో ముఖ్య విషయం – సత్యసంధత, సర్వమానవాళిపై ప్రేమ – ఈ రెండే ఈ ప్రపంచంలో మిమ్మల్ని ధైర్యవంతులుగా, ధీరులుగా నిలబెట్టగలవు. అప్పుడే మీ గురువుల, పెద్దల కలల్ని నిజం చేస్తూ, మీరు ఎక్కడికి వెళ్ళినా అజేయులుగా నిలవగలరు. ❖ సేకరణ: ఎమ్.రాంబాబు

(అక్టోబరు 2, గాంధీ జయంతి)

వాలే పొద్దుకూ వెలుగు

– స్వామి రంగనాథానంద

(రామకృష్ణ సంఘం 13వ సర్వాధ్యక్షులు)



ఒకసారి అమెరికాలోని క్లీవ్‌ల్యాంట్ వృద్ధాశ్రమంలో ప్రసంగించడానికి నన్ను (స్వామి రంగనాథానందను) ఆహ్వానించారు. అంత పెద్ద వృద్ధాశ్రమాన్ని సందర్శించడం నాకు అదే మొదటిసారి. వయస్సులో ఉన్నప్పుడు ఒక వెలుగు వెలిగి, వయస్సు మీరాక దీనంగా జీవితాల్ని వెళ్ళదీస్తున్న ఎంతోమంది వృద్ధులు నాకు అక్కడ కనిపించారు. వాళ్ళ ముఖాల్లో మచ్చుకైనా సంతోషం, ఉల్లాసం తొంగిచూడక పోవడం నాకు ఆశ్చర్యాన్ని కలిగించింది. 'వార్ధక్యాన్ని ఆనందమయం చేసుకోవడం ఎలా?' అన్న అంశంపై ప్రసంగించాల్సిందిగా నిర్వాహకులు నన్ను అభ్యర్థించారు. కానీ సాధారణంగా చాలామంది ఆ వయస్సులో ఏ కొత్త విషయాన్ని నేర్చుకోవడానికీ అంత ఉత్సుకత చూపరు. అందుకే ఆ సమావేశానికి చాలా తక్కువ మందే వృద్ధులు హాజరవుతారని భావించాం. కానీ ఎందుకో ఆ రోజు ఆ ఆశ్రమంలో ఉంటున్న వారందరూ వచ్చారు. అయితే అందరి ముఖాల్లో తాము ఏదో కోల్పోయామన్న దిగులు, మానసిక వ్యథ ద్యోతకమవుతున్నాయి. అందుకే నేను ముందు ఆ అంశాన్నే ప్రస్తావిస్తూ, నిజానికి వార్ధక్యంలో మనం అంత బాధపడాల్సిన అవసరం లేదనీ, కాలప్రభావంతో ప్రాప్తించే శారీరక రుగ్మతలతో కాస్త అసౌకర్యం కలిగినా, మానసికంగా అంత బాధపడాల్సిన అవసరం లేదనీ అనునయించాను. ఆ వయస్సులో వచ్చే ప్రతి సవాలునూ ధైర్యంగా ఎదుర్కోవాలనీ, యుక్తవయస్సులో కన్నా వృద్ధాప్యంలో అనుభవం ప్రసాదించిన మానసిక శక్తి ఎక్కువగా ఉంటుందనీ గుర్తుచేశాను. ఆధ్యాత్మిక పథంలో పయనిస్తూ, తమను తాము ముందుకు నడిపించుకోవాలని సూచించాను.

ఆ వయస్సులో బయటి వ్యక్తుల, సౌకర్యాల ఆలంబన కన్నా మన మనస్సే మనకు అండదండగా ఉండాలి. ప్రభుత్వపరంగా, కుటుంబపరంగా మనకు లభించే సౌకర్యాలు, ఆర్థిక సహకారం కొంతవరకే మనల్ని సంతృప్తిగా ఉంచగలవు. కానీ మనకు మనం కల్పించుకున్న పరిస్థితులే ఎక్కువ ప్రశాంతతనిస్తాయి.

ఇలా మీ ఆనందం మీ చేతుల్లోనే ఉందని మరచిపోకూడదు. నేను ఆనందంగానే ఉండాలని మీరు దృఢనిశ్చయాన్ని కల్పించుకోనంత కాలం... ప్రభుత్వం కానీ, సమాజం కానీ మీకు ఆనందాన్ని కలిగించలేవు. ముఖ్యంగా వయస్సులో, కాలంలో, పరిస్థితుల్లో వచ్చే అన్ని మార్పులనూ హుందాగా స్వాగతించడం అలవాటు చేసుకోకపోతే, ఈ వయస్సులో ప్రతి పరిణామం మనల్ని కలవరపెడుతూనే ఉంటుంది. అందుకే ఈ రోజుల్లో ఎందరో వయసు పైబడినవారు శారీరకంగా కన్నా, మానసికంగా ఎక్కువగా కుంగిపోతున్నారు. నైరాశ్యంతో నిండిన జీవితాన్ని గడుపుతున్నారు. మరికొందరు ఈ వయస్సులో ఒంటరితనాన్ని భరించలేక దుర్వ్యసనాలకు దగ్గరవుతున్నారు. ఇలాంటివి వార్ధక్యాన్ని మరింత దుఃఖభరితం చేస్తాయి. మన సనాతన ధర్మంలో వృద్ధాప్యాన్నీ సార్థకం చేసుకునే మార్గాలు ఎన్నో ఉన్నాయి.

జలంధర్‌లో రామకృష్ణ సంఘ భక్తులైన జగన్నాథ్ టాండన్, మాయాదేవి అనే దంపతులు ఉండేవారు. వారిరువురూ ఉన్నత హోదాలో ఉండి, పదవీ విరమణ చేశారు. ఉద్యోగాల్లో ఉన్నప్పుడు ఎంత ఉత్సాహంగా ఉన్నారో, ఆ తరువాతా అదే ఉత్సాహాన్ని కొనసాగించారు. ఆధ్యాత్మిక సాహిత్యం చదువుతూ, భజనల్లో పాల్గొంటూ ఉండేవారు. తమకు తామే ఆహ్లాదపూరిత వాతావరణాన్ని కల్పించుకున్నారు. ఓ రోజు జగన్నాథ్, మాయాదేవి ఉదయం నాలుగింటికే నిద్ర మేల్కొన్నారు. కలసి గంటసేపు భజన చేశాక మాయాదేవి తన భర్తతో 'మీరు అలసిపోయారు, పక్కగదిలోకి వెళ్ళి కాసేపు నిద్రపోండి' అని చెప్పి, కాసేపు కళ్ళు మూసుకున్నారు. తరువాత జగన్నాథ్ వచ్చి చూసేసరికి మాయాదేవి శాశ్వతంగా ఈ లోకాన్ని విడిచి వెళ్ళిపోయారు. అదీ అనాయాస మరణమంటే! మధ్యవయస్సు లాగానే వార్ధక్యాన్నీ ప్రణాళికాబద్ధంగా తీర్చిదిద్దుకుంటే, ఇలా మలిపొద్దు కూడా వెలుగులమయమే అవుతుంది! ❖ **సేకరణ: ఆర్. కృష్ణ**

(అక్టోబర్ 1వ తేదీ అంతర్జాతీయ 'వృద్ధుల దినోత్సవం')

రాగద్వేషాలు కలవాడు అరణ్యాలకు వెళ్ళినా మనశ్శాంతిని పొందడు. కోరికలను త్యజించినవాడు గృహం నందు ఉంటూ కూడా సాధన చేయగలడు. పుణ్యకార్యాలను చేసేవారికి ఇల్లే తపోవనం. -హితోపదేశం


(1884 – 1967)

ముందుకు సాగిపో!

దివ్యజనని శ్రీశారదాదేవి ప్రత్యక్ష శిష్యులైన స్వామి ప్రేమేశానంద (1884-1967) రామకృష్ణ సంఘంలో అత్యున్నత గౌరవాన్నీ ప్రేమాభిమానాలనూ చూరగొన్న అగ్రశ్రేణి సన్న్యాసి. ఆయన జీవితం శ్రీరామకృష్ణ - వివేకానందుల ఆశయాలతోనూ, భగవద్గీత సారాంశంతోనూ నిండింది. చాలామంది యువతీ యువకులకూ, గృహస్థులకూ, బ్రహ్మచారులకూ, సన్న్యాసులకూ ఆయన ఎన్నో లేఖలు వ్రాశారు. జీవితంలో అంకితభావం, ఆధ్యాత్మిక, సేవా భావాలను అలవరచుకొనేందుకు ఆ లేఖా పరంపరలు మార్గదర్శకాలయ్యాయి. పాఠకుల ప్రయోజనార్థం విలువైన ఈ లేఖలను 'శ్రీరామకృష్ణ ప్రభ'లో 2009 జూన్ సంచిక నుంచి ధారావాహికంగా ప్రచురిస్తున్నాం.

సార్‌గాచీ,
4-10-1940

ప్రియమైన విపత్ భంజన్!*

రజోగుణంలో ఒక అదృశ్యశక్తి దాగిఉంటుంది. అది మనిషిని దాని ఇష్టం వచ్చిన రీతిలో నడిపిస్తుంది. మొదట్లో దాని ఫలితాలు అందంగా కనపడినా రానురానూ అవి విషతుల్యాలవుతాయి. రావణాసురుడు కఠినమైన సాధనలు చేసేటప్పుడు అద్భుతంగా కనపడతాడు. అతడు బ్రాహ్మణుడు, వేదాలు తెలిసినవాడు, యోగి. కానీ మనం అతణ్ణి రాక్షసుడిగానే చూస్తాం.

భారతదేశమంతటా చట్టధిక్కరణ, మోహాలతో కూడిన పాలన కొనసాగుతోంది. ఎవరినీ ఎవ్వరూ నమ్మరు. ఏ ఒక్కడూ ఒక ప్రత్యేకమైన ఆశయాన్ని సాధించడానికి కచ్చితమైన మార్గాన్ని ఎక్కువకాలం అవలంబించడు. వ్యక్తి ఒక మార్గాన్ని అనుసరించి పోతూ పోతూనే క్షణంలో మరో దారికి మళ్ళుతాడు. అందుచేతనే మన ప్రయత్నాలన్నీ విఫలమవుతున్నాయి. మన వెనుకటి తరాల నుండి నేటి తరం వారు ఆశయాల గురించి ఉపన్యసించడం నేర్చుకున్నారు. కానీ ఆచరణ శూన్యం. ఇది అన్ని రకాల శిక్షణరంగాలలోనే గాక ఆధ్యాత్మికరంగంలో కూడా కనబడుతుంది. దీనికి నివారణ మార్గాన్ని కనుక్కోవాలి. మరణ పర్యంతం ఒక ఆశయానికి కట్టుబడి ఉండే శక్తిని సాధించుకోవాలి. మనస్సును పనిలో నిమగ్నం చెయ్యగల సామర్థ్యాన్ని సాధించుకోవాలి. మనస్సులను స్వాధీనం చేసుకోలేని వారి ఇంద్రియాలు కోరికల వెంట పరుగులు తీస్తాయి.

స్వామి వివేకానందుని వ్యక్తిత్వం బ్రహ్మాండమైన శక్తి యొక్క పరావర్తనం. నిర్నిరోధమైన రజోగుణ ప్రభావాన్ని మన ముందుంచుతుంది. క్రియాశీల శక్తి, ఆత్మశక్తి కొరవడినప్పుడు ఆధ్యాత్మికత కుంటుపడుతుంది. అమ్మ శారదాదేవి జీవనవిధానం గమనిస్తే, బంధ రాహిత్యం, నిరంతర బాహ్య క్రియాశీలతలను ఆమెలో చూస్తాం. అదే మన ఆదర్శం కావాలి.

'క్రియాశక్తి' అంటే నియంత్రణ, నిబద్ధతలతో ఆదర్శాన్ని అనుసరించడమే. ఆ శక్తి కలిగి ఉంటే పనిలోనే పరమాత్మ దర్శనం లభిస్తుంది. ఈ శరీరమనే యంత్రాన్నీ, మనస్సునూ, బుద్ధినీ మన ఇచ్ఛానుసారం నడపగలగడమే ఆత్మోన్నతి అని గ్రహించు. స్వేచ్ఛను సాధించడానికి వ్యక్తి తన మరణపర్యంతం పోరాడుతూ ఉండవలసిందే!

చేతనలోనో, అంతఃచేతనలోనో ఈ సృష్టిలోని ప్రతి జీవీ తనను తాను తెలుసుకొనే ప్రయత్నంలోనే ఉంది. రాజకీయ రంగంలో ప్రయోగించే 'స్వరాజ్' లేదా 'స్వాతంత్ర్యం' అనే పదాలు వేదాంత శబ్దమైన స్వరాజ్ అనే పదం నుండి ఉద్భవించినవే. 'స్వపరిపాలన' లేదా 'స్వయంప్రకాశం' అనేవి ఆ పదానికి అర్థాలు. మతం మన సంకెళ్ళను సులభంగా ఛేదించుకొనడానికి సహకరిస్తుంది, కానీ ఆ ప్రయత్నపు చివరిదశలో మనం అంతులేని భారానికి గురవుతున్నాం. అలాంటప్పుడు మతానికి మనం ఒక నమస్కారం పెట్టి బయటపడాల్సి ఉంటుంది. పరిపూర్ణ స్వేచ్ఛను పొందేమార్గంలో తుట్టతుదకు గురువు, ఇష్టదైవం అనే బంధాలను కూడా త్యజించవలసి ఉంటుంది. శ్రీరామకృష్ణులు జ్ఞానఖడ్గంతో కాళిని కూడా ఛేదించి పరిపూర్ణ స్వేచ్ఛను పొందారు. ఇది సామాన్యుల మేధకు అందే అంశం కాదు. ఆదర్శాన్ని ఎన్నుకోవడానికి ఎంత మానసిక బలం కావాలో ఆలోచించు!

ప్రేమాశీస్సులతో
స్వామి ప్రేమేశానంద

తెలుగు సేత: కె. త్రివిక్రమరావు

(*విపత్ భంజన్ కాలాంతరంలో రామకృష్ణ సంఘంలో స్వామి స్వాహానందగా సుప్రసిద్ధులు)

ఆనందమే ఆధ్యాత్మికోన్నతి!

– మహేందర్ మొలుమూరి



శ్రీరామచంద్రుని జీవితమంతా కష్టాలతో, ఆపదలతో నిండిపోయింది. పద్నాలుగు సంవత్సరాలు వనవాసాశ్రమం; అది చాలదన్నట్లు రావణుడు చేసిన సీతాపహరణం. ఇన్ని కష్టాల్లో ఉన్నా, అనుక్షణం స్వధర్మ నిష్ఠ, న్యాయబద్ధమైన జీవనసరళిని రఘురాముడు విడిచిపెట్టలేదు. అందుకే ఎన్నటికీ ఆయన పురుషోత్తముడే! అదే విధంగా శ్రీకృష్ణ పరమాత్ముడు. అవతరించింది మొదలు ఆయన ఎదుర్కొన్న విపత్తులు, సంకటాలు వర్ణనాతీతం. అయినా మనల్ని ఎవరైనా శ్రీకృష్ణుని జీవిత సందేశమేమిటని ప్రశ్నిస్తే, మనమిచ్చే సమాధానం 'నవ్వు రాజిల్లెడి మోము'; అంతే కదా! అదే విధంగా బుద్ధభగవానుడు, ఆదిశంకరులు ఇంకా ఎందరెందరో మహానుభావులు, పరిపూర్ణ పరివ్రాజకులు! వీరందరూ తమ తమ జీవితాల్లో ఎన్నో సమస్యల్ని, క్లిష్ట పరిస్థితుల్ని ఎదుర్కొన్నారు. కానీ వారెట్టి పరిస్థితుల్లోనూ అసంతృప్తి నెరుగరు. సర్వకాల సర్వావస్థల్లోనూ సంతృప్తిని కలిగి ఉండడమే ఆధ్యాత్మికతకు పరాకాష్ఠ.

ఆత్మశక్తే భగవంతుడే: సమస్తమూ మీలోనే ఉంది. మిమ్మల్ని మీరు విశ్వసించండి. భగవంతుడు, మేఘమండలంపై స్వర్ణ సింహాసనస్థుడై ఉన్నాడని అనుకోకండి. శుద్ధచైతన్య స్వరూపంగా మనందరిలోనూ భగవంతుడు కొలువై ఉన్నాడు. అయితే మనస్సు పరిశుద్ధంగా లేకపోతే భగవంతుడు హృదయంలో నివసించడు. మంచీ చెడూ, శుభం అశుభం – అన్నింటినీ సమదృష్టితో స్వీకరించినప్పుడే మనం నిజమైన భక్తులం కాగలం.

గజ ఈతగానికి సముద్ర కెరటాల్ని తట్టుకొని ఈదడం ఒక ఆనందానుభవం. అదే ఈత రాని మనిషికి ప్రాణం పోయేటంత ప్రమాద కారణం. అదే విధంగా ఆధ్యాత్మిక సత్యాల్ని ఆపోశన పట్టిన వ్యక్తి జీవన సంఘర్షణల్ని సమర్థంగా ఎదుర్కొంటాడు; తనకు తానే పరిష్కరించుకోగలుగుతాడు.

ఆదర్శ విద్యావంతుడు: విద్యకు రెండు ఫలాంశాలు ముఖ్యం – బాహ్య ప్రపంచానికి సంబంధించిన పూర్ణజ్ఞాన సముపార్జనం. అంతరంగిక జగతిని అవగాహన చేసుకోగల ఆత్మజ్ఞాన సాక్షాత్కారం. ఈ సిద్ధాంత దృష్ట్యా గమనిస్తే ఆధునిక విద్య సంతులనంతో సాగడం లేదని చెప్పవచ్చు. అంతరంగ జగతిని మనం పూర్తిగా విస్మరించేశాం. కేవలం బాహ్య ప్రపంచ విజ్ఞానానికి ప్రాధాన్యమిస్తూ ఉన్నాం. ప్రేమ, కరుణ, సేవ అనేవి మన విద్యా పాఠ్య ప్రణాళికలో భాగస్వామ్యం కావాలి. కేవలం పాఠ్యక్రమంలో బోధిస్తే చాలదు, మనమూ ఆదర్శ పాత్రను పోషించాలి.

అందరూ ప్రత్యేకమే: భగవంతుడి సృష్టిలో గడ్డిపరక రెండంచులు కానివ్వండి, ఒకే పుష్పానికున్న రెండు రేకులు కానివ్వండి, ఎట్టి పరిస్థితుల్లోనూ ఒకే మాదిరిగా ఉండవు. అటువంటప్పుడు మానవరూపాల గురించి చెప్పేదేముంటుంది! ఏదో ఒక ప్రతిభను మనలో అంతర్నిహితంగా నిక్షిప్తం చేసి, దేవుడు మనల్ని ఈ లోకంలోకి పంపాడు. మనకూ జీవన ప్రయోజనం ఒకటి ఉంది. మనలో ఉన్న ఆ అంతశ్శక్తిని జాగృతం చేయడం మనలోని ప్రతి ఒక్కరి విధి. దానిని సమర్థంగా ప్రదర్శించి, ప్రయోజనం పొందడమే మన ఇహలోక యాత్రకు పరమార్థం. అప్పుడే జీవితం మనతో సంతోష భాగస్వామ్యాన్ని అనుభవింపజేస్తుంది.

అదే విధంగా ఈ రోజుల్లో స్త్రీలు ఎక్కువా?, పురుషులు ఎక్కువా? అన్న వివాదాలు కూడా సమాజంలో అశాంతికి కారణమవుతున్నాయి. సమాజంలో తాము సముచిత స్థానాన్ని పొందేటందుకు చేసే ప్రయత్నంలో, స్త్రీలు తమ సహజ స్త్రీ స్వభావాన్ని విడువనవసరం లేదు. స్త్రీలకు నిజమైన స్వేచ్ఛ పురుషుల అనుకరణ వల్ల లభించదు. స్త్రీత్వ నియమాలకు స్త్రీలే విముఖత చూపితే అది స్త్రీలకే కాక, మొత్తం సమాజానికే అనర్థదాయకం. విశ్వమాతృత్వ సిద్ధాంతాన్ని అభివృద్ధి చేసుకోవడం ఈ సమాజానికి స్త్రీలు అందివ్వగలిగిన అత్యుత్తమ ప్రాతినిధ్యం! ❖

(ఆధారం: శ్రీమాతా అమృతానందమయి దేవి ప్రసంగం)

లభించనివాటికై విచారించక, లభించిన వాటితో సంతృప్తి చెందేవాడు సంతోషముగా జీవించగలడు. సంతృప్తియే ఆనందానికి మూలం, అసంతృప్తి దుఃఖానికి హేతువు. – మనుస్మృతి

(...15వ పేజీ తరువాయి)


చిక్కులు...చింతలు

పసిపిల్లవాడు తెలియక చెట్టుతొర్రలో వేలు పెట్టి, తేలు కుట్టగానే తోటిమిత్రులు ఎక్కడ నవ్వుతారోనని ఏమీ జరగనట్టు వేలు వెనక్కిపెట్టి నులుముకున్నాడట! మనం కూడా అలాగే ప్రకృతి మనకు ఎన్నిసార్లు సామ దాన దండోపాయాలతో పాఠాలు నేర్పినా వినడం లేదు; ప్రపంచపోకడలను అవగతం చేసుకోవడం లేదు. అందుకే అన్నమయ్య

ఎక్కడ చూసిన నీ ప్రపంచమున, చిక్కులు సిలుగులు చింతలునే
దిక్కెవరు ఈతిదీపులలో, దిక్కుముక్కులకు దేవుడే గాక

'ఏముందయ్యా! ఈ ప్రపంచంలో కష్టాలు, కన్నీళ్ళే కదా! ఈ ఈతిబాధల్లో దిక్కు మనకు ఆ దేవుడే కదా! మరెందుకు మరచిపోతున్నారు!' అని గుర్తుచేస్తున్నాడు.

'సిలుగులు' అంటే ఉపద్రవాలు, కష్టాలు అని అర్థం. అలాగని ఈ లోకంపై, మనుషులపై విరక్తి పెంచుకోమని ఆ భాగవతోత్తముడి భావన కాదు. ఈ జగతి స్వరూప స్వభావాలేమిటో ఒక్కసారి తెలుసుకొని మసలుకోమంటున్నాడు. ఆ భగవంతుడిని మరచిపోయేంతగా ప్రపంచంపై మమకారాన్ని పెంచుకో వద్దంటున్నాడు. మహాభారతం శాంతి పర్వంలో సగరునితో అరిష్టనేమి ఇలాంటి హితవచనాలే పలుకుతూ...



స్వజనే న చ తే చిన్తా కర్తవ్యా మోక్షబుద్ధినా
ఇమే మయా వినా భూతా భవిష్యన్తి కథం న్వితిః
స్వయముత్పద్యతే జన్తుః స్వయమేవ వివర్తతే
సుఖదుఃఖే తథా మృత్యుం స్వయమేవాధిగచ్ఛతి..

"నేను లేకపోతే వీళ్ళందరూ ఏమైపోతారో అనుకుంటూ స్వజనం విషయంలో చింతతో ఉండకూడదు. ప్రతి ప్రాణీ స్వయంగానే పుడుతున్నాడు; స్వయంగానే పెరుగుతున్నాడు; స్వయంగానే సుఖదుఃఖాలను అనుభవిస్తున్నాడు; స్వయంగానే మరణిస్తున్నాడు. తన పిల్లలు ఏ విధంగా వినయ విహీనులై ప్రవర్తిస్తున్నారో, చుట్టుపక్కల ఉన్నవాళ్ళందరూ ఎలా ధర్మ విరుద్ధమైన మార్గంలో పయనిస్తున్నారో చూస్తే ఎవరికైనా మోక్షం మీద అభిలాష కలుగుతుంద"ని అంటాడు.

ఇలా అరిష్టనేమి చెప్పినా, అన్నమయ్య చెప్పినా ఒక్కటే! ప్రపంచ వ్యవహారాలలో మన పరిమితి, పరిధి ఎంతో తెలుసుకోవాలి.

సూదుల మూటల సుఖాలు...

ఆకర్షణతో అగ్నికీలలకు దగ్గరై బూడిదయ్యే కీటకాల్లా, మనం కూడా ఈ ప్రపంచ సుఖాలపై ప్రీతి పెంచుకొని పడరాని కష్టాలు పడుతున్నాం. నిశితంగా పరిశీలిస్తే ఈ లోకంలో గులాబీల్లా కనిపించే భోగాల మాటున, కనిపించక గుచ్చుకొని గాయాలు చేసే కంటకాలెన్నో ఉన్నాయి. దురదృష్టవశాత్తూ, పూలు కనిపించినంత స్పష్టంగా, సూటిగా ముళ్ళు కనిపించడం లేదు! అదే తేడా! అందుకే ఆ పద్మావతీప్రియుడు మనపై పరమప్రేమతో అన్నమయ్య నోటి నుంచి...

ఏది తలంచిన నీకాలంబును, సూదుల మూటల సుఖములివి
కాదన నౌనా గడ కనిపించగ, పోదికాడు తలపున గలడొకడే

అనిపిస్తున్నాడు. కలికాలంలోని సుఖాలను సూదుల మూటలతో పోలుస్తున్నాడు ఈ పదకవితా పారీణుడు. ఆ మూటల్ని ఎంత పొదివి పట్టుకుంటే అంత బాధే తప్ప, సాంత్వన లభించదు. ఇలాంటి సంక్లిష్ట సమయాల్లో మనం పట్టుకోవలసింది పరమ పురుషుడి పాదాలే! అందుకే గట్టెక్కించే పోదికాడు, అంటే పోషకుడే మన తలపుల్లో మెదలాలని అన్నమయ్య ప్రబోధిస్తున్నాడు. అందుకే వేదాంత డిండిమ కూడా విషయవాంఛల్లో ఆశించినంత ఆనందమేదీ దొరకదంటూ....

'సుఖమల్పం బహుక్లేశో విషయగ్రాహిణాం నృణామ్–శబ్ద స్పర్శాది విషయాలను ఆకాంక్షించే వారికి కలిగే సుఖం స్వల్పం; దుఃఖాన్నే వారు ఎక్కువగా అనుభవిస్తార'ని ఉద్ఘాటించింది.

వెన్నుడు వేంకటవిభుడు...

పెనవేసుకున్న ఋణానుబంధాలు అంత త్వరగా వీడేవి కావు, అప్పులవారూ అంత త్వరగా వదిలేవారూ కాదు. బంది ఖానాల లాంటి ఈ మమతానుబంధాల నుంచి బంధవిముక్తిని చేసేది భగవంతుడు ఒక్కడే! ఏవో తెలియని పాశాలు తరిమి, తరిమి పనులకు మనల్ని పురమాయిస్తూ ఉంటాయి. అయితే ప్రాపంచిక నాటకానికి ప్రధాన సూత్రధారుడైన ఆ సర్వేశ్వరుడిని పట్టుకుంటేనే పరిపూర్ణ పరిష్కారం లభిస్తుంది.

అందుకే భగవాన్ శ్రీరామకృష్ణ పరమహంస 'ఓ భగవంతుడా! నా కర్మలు తగ్గించు. నా కోసం వేటిని కేటాయించావో వాటిని అనురక్తి లేకుండా నిర్వర్తించేట్లు అనుగ్రహించు. అధిక పనుల్లో, అనేక బంధాల్లో చిక్కుకోవాలనే ఇచ్ఛ నాకు రానివ్వకు' అని ప్రార్థించమంటారు. అప్పుడు ఆ ఆపద్బాంధవుడు మనల్ని ఆదుకుంటాడని అన్నమయ్య విన్నవిస్తూ...

ఎన్నడు వీడీ నెప్పుడు వాసీ, పన్నిన తమ తమ బంధములు
ఉన్నతి సేయగ వొప్పులు నెరపగ, వెన్నుడు వేంకట విభుడే కలడు

మన తప్పులన్నీ సరిదిద్ది మనకు ఒప్పులు నేర్పేందుకు, మనకు వెన్నుదన్నుగా నిలిచేందుకు వేంకటవిభుడు సిద్ధంగా ఉన్నాడని అభయమిస్తున్నాడు. ❖



వికాస మంత్రాలు

– స్వామి పార్థసఖానంద


"జీవితంలో పెరగడం అనేది తప్పనిసరి, కానీ పరిణితి చెందడం అనేది మన చేతుల్లోనే ఉంటుంది."



జీవించడం ఓ కళ

1. ప్రేమించే కన్నులతో చూసే వారికి జీవితం సుందరం, మృదువైన మాటలు పలికే వారికి జీవితం శాంతిమయం, సున్నితమైన చేతులతో సహకరించే వారికి జీవితం ఆనందమయం, సుతిమెత్తని హృదయంతో సంరక్షించే వారికి జీవితం సకల శుభప్రదం.
2. జీవితంలో ప్రతి సంఘటన ఏదో కారణం చేతనే జరుగుతుందని నమ్ముదాం. అవకాశం వస్తే దాన్ని స్వీకరిద్దాం. అది మన జీవితాన్ని మారిస్తే అనుమతిద్దాం. ఇది సులభమని ఎవరూ చెప్పలేదు, కానీ తప్పక ప్రయత్నించాల్సిందని మాత్రం అందరికీ తెలుసు.

"తప్పులెన్ను వారు తమ తప్పులెరుగరు. తప్పులెరుగ ఇష్టపడరు.."



తప్పుల తిప్పలు


1. తప్పులు దిద్దుకోవడానికి కానీ తిరిగి చేయడానికి కాదు.
2. మనిషి తన తప్పులు ఒప్పుకునేంత గొప్పవాడై ఉండాలి. వాటి నుండి లాభాన్ని పొందేంత తెలివైనవాడై ఉండాలి. వాటిని సరి చేసుకునేంత మనోబలసంపన్నుడై ఉండాలి.
3. నా గురువుల నుండి నేను ఎంతో నేర్చుకున్నాను. పుస్తకాల నుండి కూడా నేను ఎంతో నేర్చుకున్నాను. ముఖ్యంగా నా తప్పుల నుండి ఇంకా ఎంతో నేర్చుకున్నాను.
4. చేసిన తప్పులు తెలియకపోవడం ఒక తప్పు. తెలిసినా ఒప్పుకోక పోవడం మరో తప్పు. వాటిని కప్పిపుచ్చుకోవాలనుకోవడం అన్నిటి కన్నా పెద్ద తప్పు!

సమస్యల తో'రణం'

1. సమస్య అంటే మన ఆశకూ, వాస్తవానికీ మధ్య దూరం. కాబట్టి సమస్యల పరిష్కారానికి రెండు మార్గాలు ఉన్నాయి – తక్కువ ఆశించడం, వాస్తవాన్ని అంగీకరించడం; ఎక్కువ ఆశించడం, దాన్ని వాస్తవంగా మార్చుకోవడం.
2. మన సమస్యలకు ముఖ్యంగా రెండే కారణాలు: అనాలోచితంగా పని చేయడం; పని చేయకుండా ఆలోచిస్తూ ఉండడం.
3. జనాలకు మీ సమస్యల గురించి చెప్పుకోవద్దు. ఎందుకంటే, 80 శాతం మంది పట్టించుకోరు, 20 శాతం మంది ఆ సమస్యలు మీకు ఉన్నందుకు లోలోపల సంతోషిస్తారు.



"పెద్ద పెద్ద సమస్యల్ని పరిష్కరించడానికి కంప్యూటర్ కనుక్కోబడింది, కానీ అది పుట్టక ముందు ఆ సమస్యలు అసలు లేనే లేవు."



– స్వామి పరిజ్ఞేయానంద

పురోగమన సూత్రం!

సాధారణంగా పిల్లల ప్రవర్తన సరిగా లేకపోతే తల్లితండ్రులు దండిస్తారు; విద్యార్థులు క్రమశిక్షణతో మెలగకపోతే ఉపాధ్యాయులు మందలిస్తారు; ఉద్యోగుల పనిలో నైపుణ్యం కొరవడితే ఉన్నతాధికారులు నిందిస్తారు... ఇలా ఎవరైనా సరే తాము వ్యవహరించవలసిన రీతిలో వ్యవహరించకపోయినా, చేయాల్సిన రీతిలో పనిని చేయకపోయినా వారిపట్ల అసహనాన్ని ప్రదర్శించడమో, కోపగించుకోవడమో, నిందించడమో, పరుషంగా మాట్లాడడమో చేస్తూవుంటాం. ఇలాంటి చర్యల వల్ల ఎదుటి వ్యక్తిలో మార్పుని తీసుకురాలేం. ఒకవేళ మార్పు వచ్చినా అది తాత్కాలికమే!

నిజానికి, ఎదుటివారిని భయపెట్టడం వలన వారిలో ఆత్మస్థైర్యం సన్నగిల్లుతుంది; పరుషంగా మాట్లాడడం వలన వారిలో మొండితనం పెరుగుతుంది; లోపాలను ఏకరువు పెట్టడం వలన ఆత్మన్యూనతాభావం అధికమవుతుంది; అవమానపరచడం వలన ఆత్మాభిమానం దెబ్బతింటుంది; నిందించడం వలన నిరాశ చోటుచేసుకుంటుంది.

మరి, ఒక వ్యక్తి కర్తవ్యనిర్వహణలో విముఖత చూపించినప్పుడు; అనూహ్యరీతిలో ప్రవర్తించినప్పుడు; మరలా వారి కర్తవ్యాన్ని గుర్తుచేసి సన్మార్గంలో నడిపించడమెలా? నిర్వీర్యులైన వారిలో శక్తి సామర్థ్యాలను, ఆత్మవిశ్వాసాన్ని నింపడమెలా? నిరాశకు గురైన వారిని గమ్యంవైపు సాగేలా ప్రోత్సహించడమెలా? ఈ ప్రశ్నలకు శ్రీకృష్ణుడు, యుద్ధభూమిలో అర్జునుడితో వ్యవహరించిన తీరే సమాధానం.

కురుక్షేత్రంలో అందరూ యుద్ధానికి సిద్ధమైన సమయంలో అర్జునుడు 'నేను యుద్ధం చేయను, నా గొంతు ఎండిపోతుంది, నా శరీరం వణుకుతుంది, నా చేతిలో నుండి గాండీవం జారిపోతుంది' అంటూ అస్త్రాలను విసర్జించాడు. అత్యంత క్లిష్టసమయంలో అర్జునుడు అధైర్యాన్ని చూసినవారెవరైనా సహనం కోల్పోయి అర్జునుడి చపలత్వానికి చీవాట్లు పెట్టేవారు, పిరికితనాన్ని చూసి మందలించేవారు, బాధ్యతా రాహిత్యానికి ఆగ్రహించి యుద్ధభూమి నుండి వెళ్ళిపోయేవారు. కానీ శ్రీకృష్ణుడు అలా వ్యవహరించలేదు. దుఃఖితుడైన అర్జునుడితో...

కుతస్త్వా కశ్మలమిదం విషమే సముపస్థితమ్ ।
అనార్యజుష్టమస్వర్గ్యం అకీర్తికరమర్జున ॥ *(గీత. 2-2)*

'అర్జునా! ఇలాంటి క్లిష్టసమయంలో ఆర్యులకు తగనిదీ, స్వర్గగతికి ప్రతిబంధకమైనదీ, అపకీర్తిదాయకమైనదీ అయిన ఈ మోహం నిన్ను ఎలా ఆవరించింది?' అని ప్రశ్నించాడు.

సాధారణంగా, ఎవరైనా అర్జునుడిలా అసంబద్ధంగా ప్రవర్తిస్తే నీవు పిరికివాడివనీ, బుద్ధిహీనుడవనీ, పనికిరానివాడవనీ మందలిస్తారు. కానీ శ్రీకృష్ణుడు అర్జునుడితో 'అర్జునా! అనార్యజుష్టమ్ - ఆర్యులకు తగనిపని. అంటే నీవు ఆర్యుడవు (బుద్ధిమంతుడవు) కానీ అనార్యుడవు (బుద్ధిహీనుడవు) కావు' అని అతణ్ణి మెచ్చుకున్నాడు. అందువల్ల అర్జునుడిలో ఆత్మవిశ్వాసం పెరిగింది. ఆ తరువాత శ్రీకృష్ణుడు "ఇప్పుడు నువ్వు భయపడి, కర్తవ్యాన్ని విస్మరించడం వల్ల అస్వర్గ్యమ్ - ఉన్నత గతిని కోల్పోతావు, అకీర్తికరమ్ - అపకీర్తిపాలవుతావు" అని అర్జునుడి ప్రవర్తన వల్ల కలిగే పరిణామాల తీవ్రతను విశదపరిచాడు.

'నువ్వు బుద్ధిమంతుడవు, నీకు అపకీర్తి కలిగే పనులు చేయకు' అన్న శ్రీకృష్ణుని రెండు మాటల వల్ల నిరాసక్తుడైన అర్జునుడిలో ఆత్మస్థైర్యం పెరిగింది, సానుకూల దృక్పథం ఏర్పడింది. ఆ తరువాత యుద్ధభూమిలో అర్జునుడు ప్రదర్శించిన ధైర్యసాహసాల గురించి మనకు తెలిసిందే!

అందువల్ల పిల్లలనైనా, పెద్దలనైనా, తప్పుచేసిన వారినెవరినైనా... నిందించకూడదు, వారి లోపాలను ఎత్తిచూపకూడదు. శ్రీకృష్ణుడు, అర్జునుడిలోని సుగుణాలను మెచ్చుకున్నట్లు ముందుగా వారితో 'నువ్వు మంచివాడవు, తెలివైనవాడవు, ఇది నీలాంటి వాడు చేయదగిన పని కాదు' అని చెప్పి వారిలో సానుకూల దృక్పథాన్ని కల్పించాలి. అప్పుడు ఎలాంటివారిలోనైనా మార్పు వచ్చితీరుతుంది.

అందుకే స్వామి వివేకానంద "తప్పులను ఎత్తిచూపకూడదు. సానుకూలభావాలను అందిస్తే ఎలాంటివారైనా ఉన్నతంగా ఎదుగుతారు"అని అంటారు. కాబట్టి శ్రీకృష్ణుడు నిరాశతో నిండిన అర్జునుణ్ణి ప్రోత్సహించి కార్యోన్ముఖుణ్ణి చేసినట్లు తల్లితండ్రులు, ఉపాధ్యాయులు, అధికారులు... ఇలా మానవ ప్రతిభను జాగృతం చేయాలనుకున్న ఎవరైనా ఎదుటి వ్యక్తిని సానుకూల భావాలతో ప్రోత్సహించి, వారి పురోగమనానికి తోడ్పడాలి. ❖



జీవన వేదం
స్వామీజీ కథల సారం

నిజమైన సహాయం

ఒకసారి స్వామి వివేకానంద, 'ప్రపంచానికి మేలు చేసే నిమిత్తం మీరు మీ గుహ నుండి ఎందుకు బయటకురారు?' అని పవహరీ బాబాగారిని అడిగారు. అందుకు ఆయన తన సహజ వినయంతో కూడిన హాస్యధోరణిలో ఘాటైన సమాధానం ఇచ్చారు. ఆ కథ ఇది.

"ఒక మోసగాడు తాను చేసిన నేరానికి పట్టుబడ్డాడు. శిక్షగా అతడి ముక్కు కోసివేశారు. అతడు ముక్కు లేని తన ముఖాన్ని ప్రపంచానికి చూపడానికి సిగ్గుపడి, తన మీద తనకే అసహ్యం వేసి ఒక అడవిలోకి వెళ్ళిపోయాడు. అక్కడ ఒక పులి చర్మం పరుచుకొని కూర్చొని, ఎవరైనా ఆ దారి వెంట వెళుతున్నట్లు అలికిడి కాగానే గట్టిగా కళ్ళు మూసుకుని తీవ్రధ్యానంలో ఉన్నట్లు నటించేవాడు. ఈ చర్య మనుషులను అతడికి దూరం చెయ్యకపోగా, ఆ అద్భుత సాధువును చూడాలని జనం తండోప తండాలుగా రాసాగారు. ఆ అడవి జీవితం అతనికి సులభంగా జీవనోపాధి కలిగేటట్లు చేసింది.

అలా కొన్ని సంవత్సరాలు గడిచిపోయాయి. మౌనంగా ధ్యానం చేసుకునే ఆ సాధువు నుండి బోధలు వినగోరి చుట్టూ చేరిన వారు ఆతురత కనబరిచారు. వారిలో ఒక యువకుడు బాగా ప్రభావితుడై, ఆ సాధువుకు శిష్యుడవడానికి తొందరపడసాగాడు. ఒక రోజున ఆ సాధువు తన మౌనాన్ని వీడి, ఆ యువకునితో మరునాడు ఉదయమే ఒక పదునైన కత్తిని తీసుకుని తన వద్దకు రమ్మని ఆదేశించాడు. ఆ యువకుడు తన కోరిక అంత త్వరలోనే నెరవేరనున్నందుకు ఆనందంతో తబ్బిబ్బు అయ్యాడు.

జీవితం త్వరలో సాఫల్యం కాబోతున్నందుకు సంతోషంతో సాధువు చెప్పినట్లుగా కత్తిని తీసుకుని మరునాడు తెల్లవారీ తెల్లవారక ముందే అడవిలోకి చేరాడు. ఆ ముక్కులేని సాధువు ఈ యువకుణ్ణి అడవిలోని ఒక నిర్జన ప్రదేశానికి తీసుకువెళ్ళాడు. అతడు తెచ్చిన కత్తిని తన చేతిలోకి తీసుకుని "నాయనా! ఈ సంఘంలో చేరడానికి నేను తీసుకున్న మంత్రదీక్ష ఇదే. దీన్నే నీకూ ఇస్తున్నాను. అవకాశం లభించినప్పుడు నువ్వు కూడా కష్టమనుకోకుండా దీన్ని ఇతరులకు ప్రసాదించు" అంటూ ఆ యువకుని ముక్కును కోసివేశాడు. ఆ యువకుడు సిగ్గుతో ఆ అద్భుతమైన మంత్రదీక్ష ఏమిటో బహిరంగ పరచలేదు. కానీ తన శక్తి మేరకు తన గురువు చెప్పిన ఆదేశాన్ని పాటించాడు. ఆ విధంగా ముక్కులేని సాధువుల శాఖ ఒకటి దేశంలో విస్తరించింది. అలాగే మరొక రకమైన శాఖకు నన్ను ఆవిష్కర్తను అవమంటావా?" అని కథ ముగించారు పవహరీ బాబా.

ఆ తర్వాత చాలా గంభీరమైన స్థితిలో మరో ప్రశ్నకు ఆయన ఇచ్చిన సమాధానం ఏమిటంటే, "భౌతికమైన సహాయమే సహాయమని నీవు భావిస్తున్నావా? శరీరంతో ప్రమేయం లేకుండా ఒక మనస్సు ఎన్నో మనస్సులను ప్రభావితం చెయ్యడం సాధ్యం కాదంటావా?" ❖

మీపై మీకు విశ్వాసం!

ఏ దేశచరిత్రను పరిశీలించినా, మహాపురుషులు, బలశాలురు అయిన వారు ఆత్మవిశ్వాసం గల వ్యక్తులే అయి ఉంటారు. భారతదేశానికి ఒక ఆంగ్లేయుడు గుమస్తాగా వచ్చాడు. బీదరికంతోనో, మరి ఏ ఇతర కారణాల వల్లనో గాని అతడు రెండుసార్లు తుపాకితో కాల్చుకొని ఆత్మహత్య చేసుకోబోయాడు. రెండు పర్యాయాలూ అతడు కృతకృత్యుడు కాలేకపోయాడు.

అతడు ఏవో ఘనకార్యాలు చేయడానికే జన్మించానని నమ్మాడు. అతనిపై అతనికి విశ్వాసం జనించింది. అతడే భారతదేశంలో బ్రిటీష్ సామ్రాజ్యస్థాపన చేసిన లార్డు క్లైవ్. అతడే కనుక 'ఓ భగవంతుడా! నేను బలహీనుణ్ణి, చాలా అల్పుడను' అంటూ జీవితాన్ని దొర్లించుకుంటూ పోతే ఎక్కడ ఉండే వాడతడు? మానసిక రోగుల శరణాలయంలో ఉండేవాడు.

నేను ప్రపంచమంతా చుట్టి చూశాను. బలహీన బోధలే సమస్త మానవజాతిని నాశనం చేస్తున్నాయి. మన పిల్లలూ ఈ పంథాలోనే పెంచబడుతున్నారు. అందుచేతనే వారు పిచ్చాసుపత్రుల గుమ్మాల ముందు ఉన్నారంటే ఆశ్చర్యం ఏమీ లేదు.


మీపై మీరు విశ్వాసం కలిగి ఉండండి. మీకు భౌతిక సంపదలు కావాలంటే వాటికై శ్రమించి సాధన చెయ్యండి. అవి వచ్చి తీరతాయి. మీరు తెలివైనవారు కావాలనుకుంటే తెలివితేటల భూమికలో పనిచెయ్యండి, అపార మేధావంతులవుతారు. మీకు స్వేచ్ఛ కావాలని ఉందా? ఆధ్యాత్మిక భూమికలో కృషి చేయండి. మీరు తప్పక స్వేచ్ఛను పొంది, శాశ్వత ఆనందంతో నిండిన నిర్వాణంలో ప్రవేశిస్తారు. ❖


తెలుగు సేత: కె. త్రివిక్రమరావు

సత్పురుషుల చేష్టలు లోకానికి అత్యంత ఆనంద సంధాయకములు. చంద్రుని చల్లని వెన్నెల, సరోవరం నుండి వీచే చల్లని గాలులు, సజ్జనుల చేష్టల కన్నా ఆహ్లాదకరంగా ఉండవు. -నీతిసారః


ప్రేమస్వరూపుడు పరమాత్ముడు


మూలకథ: టి.ఎమ్.సుందరరామన్ చిత్రాలు: గోవి అనుసృజన: స్వామి జ్ఞానదానంద




5 కొంతకాలం గడిచింది. కేరళ రాజ్యంలోని తన ఆశ్రమంలో పరశురాముడు, జనమేజయునితో సంభాషించాడు.
జనమేజయా! నీకీ వ్యాధి నుండి విముక్తి లభిస్తుంది.
ధన్యుణ్ణి స్వామీ!
6 ఉద్ధవుని విన్నపం మేరకు, దేవగురువు బృహస్పతి, వాయుదేవుడు కలిసి శ్రీకృష్ణ విగ్రహాన్ని ప్రతిష్ఠించే అనువైన స్థలం కోసం వెతుకుతూ కేరళ రాజ్యానికి వచ్చారు.
ఆహా! ఈ స్థలం ఎంత రమ్యంగా ఉందో!
అవును గురుదేవా! మన స్వామిని ఇక్కడే ప్రతిష్ఠిద్దాం!
7 చివరికి ఇద్దరూ పరశురాముని ఆశ్రమానికి వచ్చారు. పరశురాముడు వారిని సాదరంగా ఆహ్వానించి, ఉపచర్యలు చేశాడు.
పరశురామా! ఈ శ్రీమన్నారాయణ విగ్రహాన్ని ఇక్కడ ప్రతిష్ఠించడానికి సముచితమైన చోటు చూపించండి.
స్వామీ! ఇక్కడికి సమీపంలో రుద్రతీర్థం అనే ఒక పావనమైన పద్మసరోవరం ఉంది. దాని పక్కనే మహాశివుడు ఉమాదేవితో తపస్సు చేస్తున్నాడు, అక్కడ ప్రతిష్ఠించండి.
8 రుద్రతీర్థం సమీపంలోనే శివుడు ఉమతో కొలువై ఉన్నాడు. ముగ్గురూ వారికి నమస్కరించి నిలబడ్డారు.
ఇక్కడే విశ్వకర్మ తోడ్పాటుతో ఒక ఆలయం నిర్మించి, ఈ విగ్రహాన్ని ప్రతిష్ఠించి, ఆరాధించండి. సర్వులకూ క్షేమం చేకూరుతుంది!


9
ఆ విధంగానే ఆలయ నిర్మాణం జరిగి విగ్రహం ప్రతిష్ఠించబడింది. మహాశివుడు దాని సమీపంలో ఒక చోట కొలువుదీరి, భక్తులను అనుగ్రహింప నారంభించాడు.
10
ఆహా, ఈ విగ్రహానికి మహాశివుడే స్వయంగా అభిషేకం చేశాడు. బృహస్పతీ, వాయుదేవుడూ ఈ విగ్రహాన్ని ఇక్కడ ప్రతిష్ఠింపజేశారు. కాబట్టి ఈ స్థలం 'గురువాయుపురం' అని పేర్కొనబడుతుంది.
చక్కగా సెలవిచ్చారు పరశురామ మునివర్యా!
11
కొన్ని రోజుల తరువాత పరశురాముడు, జనమేజయుని పిలిచి..
జనమేజయా! నిత్యం ఈ పుష్కరిణిలో స్నానమాచరించి, శ్రీకృష్ణుని గూర్చి తపస్సు చేయి. శ్రీగురువాయురప్ప అనుగ్రహంతో సత్వరమే నీ వ్యాధి నయమవుతుంది.
గురుదేవా! అలాగే చేస్తాను.
12
శ్రీకృష్ణుణ్ణి, మహాదేవుణ్ణి, పార్వతీదేవిని నిత్యం జనమేజయుడు భక్తితో ఆరాధిస్తూ వచ్చాడు. కొన్ని నెలలు గడిచాయి. ఒకరోజు శ్రీకృష్ణుడు అతడి ముందు ప్రత్యక్షమై....
జనమేజయా! నీ తపస్సు ఫలించింది. ఇక నీ వ్యాధి తొలగిపోతుంది.







భగవంతుడు అనంతుడు, అపరిచ్ఛిన్నుడు, సర్వశక్తిమంతుడు. ప్రేమ ద్వారా తన దివ్యత్వం స్థూలశరీరాన్ని దాల్చి అవతార మూర్తిగా మన మధ్యలో మెలగేట్లు అతడు నియమింపగలడు. అప్పుడు భగవదవతారం నుండి ప్రేమ వెల్లువలా ప్రవహించి మనల్ని పవిత్రుల్ని చేస్తుంది. భగవదవతారం యథార్థమైన సంఘటన. దీన్ని మాటల్లో విశదీకరించడం కష్టం!



- భగవాన్ శ్రీరామకృష్ణ పరమహంస



జాతీయ యువజన సమ్మేళనం













హైదరాబాదు రామకృష్ణ మఠం స్వామి వివేకానంద 150వ జయంత్యుత్సవాల ముగింపు కార్యక్రమంలో భాగంగా కోల్‌కతా బేలూరు మఠం ద్వారా కేంద్ర ప్రభుత్వం అందించిన ఆర్థిక సహాయంతో ఆగష్టు 8 నుంచి 10వ తేదీ వరకు జాతీయ యువజన సమ్మేళనాన్ని నిర్వహించింది.

మూడు రోజుల పాటు జరిగిన ఈ సమ్మేళనాన్ని తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్, ఐ.టి. శాఖ మంత్రి శ్రీ కె.తారకరామారావు ప్రారంభించారు. రామకృష్ణ మిషన్ సహాయ కార్యదర్శి స్వామి బోధసారానందజీ, వివేకానంద విశ్వవిద్యాలయం ఉపకులపతి స్వామి ఆత్మప్రియానందజీ, స్థానిక రామకృష్ణమఠాధ్యక్షులు స్వామి జ్ఞానదానందజీ, వివేకానంద మానవవికాస కేంద్ర సంచాలకులు స్వామి బోధమయానందజీ, సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల కార్యదర్శి శ్రీ ప్రవీణ్ కుమార్ తోపాటు పలువురు స్వామీజీలు,వక్తలు పాల్గొన్నారు.

ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించిన ప్రథమ వికలాంగ మహిళ – అరుణిమా సిన్హా; ప్రపంచంలో అతి పిన్నవయస్కుడైన ప్రధానోపాధ్యాయుడు – బాబర్ అలీ; ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించిన విద్యార్థులు – ఆనంద్, పూర్ణ; పారా ఒలంపిక్స్‌లో రజత పతకం సాధించిన–మనీష్ పాండే; పిహెచ్‌డీ పూర్తిచేసిన వికలాంగ యువకుడు– అరుణ్‌కుమార్ తమ అనుభవాలతో యువతకు స్ఫూర్తినిచ్చారు.

ప్రముఖ వక్తల వ్యక్తిత్వ వికాస ప్రసంగాలతో, సాంస్కృతిక కార్యక్రమాలతో అంగరంగ వైభవంగా జరిగిన ఈ సదస్సుకు దేశంలోని 13 రాష్ట్రాల నుంచి,వెయ్యి మంది విద్యార్థులు హాజరయ్యారు. ❖















Printed and published by **Swami Jnanadananda** owned by Ramakrishna Math Trust
and printed at Kala Jyothi Process, 1-1-60/5, RTC Cross Roads, Musheerabad, Hyderabad - 500 020
and published at Ramakrishna Math, Domalguda, Hyderabad - 500 029. **Editor: Swami Parijneyananda**

Vol.71-10, Sri Ramakrishna Prabha (Telugu Monthly) October 2014, Regd. with the Registrar of Newspaper for India Under No.1120/57. Postal Registration No. HD-1071/2013-15. Licensed to Post Under WPP : AP/CPMG/HC-13/WPP/2013-14. Date of Publication : 18 September 2014



హృదయ సరోవరంలో నిమజ్జనం

విజయదశమి పర్వదినం సాయంత్రం దుర్గాదేవి ప్రతిమను గంగానదిలో నిమజ్జనం చేయడానికి ఏర్పాట్లు జరుగుతున్న సమయంలో మథుర్‌బాబు వచ్చి "దేవి నిమజ్జనానికి నేను సమ్మతించను. పూజ ఎప్పటిలాగే కొనసాగుతుంది. నా అనుమతి లేకుండా ఎవరైనా నిమజ్జనం చేస్తే తీవ్ర పర్యవసానాన్ని చవిచూడవలసి ఉంటుంది" అని హెచ్చరించాడు.

మథుర్‌బాబుకి నచ్చజెప్పడానికి ఎంత మంది ప్రయత్నించినా ఫలితం శూన్యం. అప్పుడు మథుర్‌బాబు భార్య శ్రీరామకృష్ణుల వద్దకు వెళ్ళి పరిస్థితిని వివరించింది. శ్రీరామకృష్ణులు, మథుర్ దగ్గరకు వచ్చారు. అప్పుడు మథుర్ "స్వామీ! నా బొందిలో ప్రాణం ఉండగా నేను దుర్గాదేవి నిమజ్జనానికి అంగీకరించను. నేను నిత్యం అమ్మను పూజిస్తానని మాట ఇచ్చాను. అమ్మ లేకుండా అది ఎలా సాధ్యమవుతుంది?" అని శ్రీరామకృష్ణులకు చెబుతూ ఉద్వేగ భరితుడయ్యాడు.

మథుర్ మానసిక స్థితిని గ్రహించిన శ్రీరామకృష్ణులు అతడి ఛాతీని నిమురుతూ "మథుర్! అమ్మ ఎక్కడకు పోతుంది? బిడ్డను వదిలి తల్లి ఉండగలదా? అమ్మ ప్రతిమను నిమజ్జనం చేసినప్పటికీ ఆమె నీ హృదయంలో కొలువుతీరి ఉంటుంది. నిత్యం నీ పూజలను స్వీకరిస్తుంది" అని అభయమిచ్చారు. అప్పుడు మథుర్‌బాబు దుర్గాదేవి నిమజ్జనానికి సంతోషంగా అంగీకరించాడు.❖

ఆధ్యాత్మిక అమృతవాహిని

శ్రీ రామకృష్ణ ప్రభ

నవంబర్ 2014

వెల: ₹10





శ్రీరామకృష్ణులు: కెప్టెన్‌లో సుగుణాలు ఎన్నో ఉన్నాయి. కెప్టెన్ కర్మకాండను నిష్ఠతో ఆచరించే వ్యక్తి. అతడు ప్రతిరోజూ పూజ, హారతి, స్తోత్ర పఠనం, జపం మొదలైన నిత్యకర్మలు చేస్తూంటాడు. ఇంట్లో తానే స్వయంగా దేవతారాధన చేస్తుంటాడు. దేవతా ప్రతిమకు స్నానం చేయించేటప్పుడు ఎన్ని మంత్రాలు ఉచ్చరిస్తుంటాడనీ!

కానీ విషయమేమిటంటే... కెప్టెన్ రాత్రింబవళ్ళు ఐహిక కర్మల్లో మునిగి ఉంటాడు. నేను అతడి ఇంటికి వెళ్ళినప్పుడల్లా, అతడు భార్యాబిడ్డల నడుమ కూర్చొని ఉండడం చూస్తాను. అంతేకాకుండా జమా ఖర్చులు చూపించడానికని అతని గుమస్తాలు మధ్యమధ్యలో వస్తూ పోతూంటారు. కానీ అతడి మనస్సు అప్పుడప్పుడు భగవంతుడి వైపు కూడా మళ్ళుతూ ఉంటుంది. అది సన్నిపాత రోగి పరిస్థితి లాంటిది. సన్నిపాత రోగంతో ఒళ్ళెరగక పడివున్న వ్యక్తి అప్పుడప్పుడు కొద్దిగా స్పృహలోకి వచ్చి, 'మంచినీళ్ళు, మంచి నీళ్ళు' అని అరుస్తూంటాడు. కానీ మంచినీళ్ళు తెచ్చే లోపలే మళ్ళీ స్పృహ తప్పి పడిపోతాడు. అందుకనే నేను కెప్టెన్‌తో 'నువ్వు నిత్యకర్మలు అనుష్ఠించేవాడివి' అన్నాను. అతడు "అవునండి, పూజాది కర్మల ద్వారా నాకు ఎంతో ఆనందం కలుగుతుంది. మాబోటి జీవులకు కర్మకాండను మించి వేరే మార్గం లేదు" అన్నాడు.

నేను అతడితో ఇలా అన్నాను: కర్మలు ఎల్లకాలం చేస్తూనే ఉండాలా? తేనెటీగలు ఎంతసేపు ఝుంకారం చేస్తాయి? పువ్వులపై వ్రాలనంత వరకే! మధువును సేవించడం మొదలుపెట్టగానే ఆ ఝుంకారం ఆగిపోతుంది.

విషయాసక్తుడైన వ్యక్తి భగవంతుడికి చాలా దూరంగా ఉంటాడు. విషయాసక్తి కనుక లేనట్లయితే అతడికి భగవంతుడు అతి సమీపంలో ఉంటాడు. ❖

శ్రీరామకృష్ణ ప్రభ
రామకృష్ణ మఠం, దోమల్‌గూడ, హైదరాబాదు-500 029
ఫోన్: 040-27667799, సెల్: 8801849494
E-mail : sriramakrishnaprabha@gmail.com
నిర్వాహక సంపాదకులు: స్వామి జ్ఞానదానంద
సంపాదకులు: స్వామి పరిజ్ఞేయానంద

రామకృష్ణ - వివేకానంద భావ ప్రచార పరిషత్



23వ వార్షిక భక్త సమ్మేళనం, కదిరి, (అనంతపురం జిల్లా) తేదీలు: 2015 జనవరి 16,17,18

సమ్మేళన ప్రాంగణం : జిల్లాపరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, కదిరి

అనంతపురం జిల్లాలోని శ్రీరామకృష్ణ సేవాసమితుల ఆధ్వర్యంలో కదిరిలో **2015 జనవరి 16,17,18** తేదీల్లో జరగబోయే 23వ వార్షిక భక్త సమ్మేళనానికి సాదరంగా ఆహ్వానిస్తున్నాం.

- ఈ భక్త సమ్మేళనంలో పాల్గొనే భక్తులు, వ్యక్తిగతంగా కానీ, సమితి ద్వారా కానీ **రూ.200/-** ప్రతినిధి రుసుము చెల్లించవలెను. ఈ రుసుమును **31-12-2014** తేదీ లోగా **శ్రీరామకృష్ణ సేవాసమితి, కదిరి** పేరున ఎమ్.ఓ/డి.డి.ల ద్వారా క్రింద సూచించిన చిరునామాకు పంపవలెను. గడువు తేదీ 31-12-2014 తర్వాత నమోదు చేసుకొనే భక్తులు ప్రతినిధి రుసుము రూ.300/- చెల్లించాలి.
- ప్రతినిధులకు భోజన, వసతి సౌకర్యాలు 2015 జనవరి 16వ తేదీ శుక్రవారం ఉదయం నుండి జనవరి 18వ తేదీ ఆదివారం సాయంత్రం వరకు ఏర్పాటు చేయబడును.
- ప్రతినిధులకు సాధారణ వసతి సౌకర్యములు మాత్రమే ఏర్పాటు చేయబడును. ప్రత్యేక సదుపాయాలు కావాల్సినవారు హోటల్ నందు గదులు స్వయముగా రిజర్వు చేసుకొనగలరు.
- ఈ బృహత్ కార్యక్రమానికి సుమారు రూ.20 లక్షలు వ్యయం అవుతుందని అంచనా. ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి భక్తులు, శ్రేయోభిలాషులు, అభిమానులు యావన్మందీ పాల్గొని ధన, వస్తురూపేణ తమవంతు సహాయ సహకారములు అందించి భగవాన్ శ్రీరామకృష్ణుల కృపకు పాత్రులు కాగలరు.
- ఈ భక్తసమ్మేళనం సందర్భంగా ఒక స్మారక సంచికను విడుదల చేయనున్నాము. ఆ సంచికలో ప్రకటనలు ఇచ్చి ప్రోత్సహించాల్సిందిగా కోరుచున్నాము. ప్రకటన వివరాలతో కూడిన సి.డి.ని శ్రీ జె.ఆదినారాయణ, శ్రీరామకృష్ణ సేవాసమితి, రామకృష్ణ మందిరం రోడ్డు, కదిరి - 515 591 (సెల్:9441034597) అనే చిరునామాకు పంపగలరు.

ప్రకటనల ట్యారిఫ్ వివరాలు :

	పూర్తి పేజీ	అర పేజీ	పావుపేజీ
కలర్	5,000	2,500	1,500
బ్లాక్ & వైట్	3,000	1,500	800
2,3 కవరుపేజీలు	15,000	-	-
4వ కవరు పేజీ	20,000	-	-

- పై కార్యక్రమాలకు విరాళములు, ప్రతినిధి రుసుములు, ప్రకటనల రుసుములను మనియార్డర్/ డి.డి.ల ద్వారా **జె. గంగాధర్, నిర్వాహక కార్యదర్శి, శ్రీరామకృష్ణ సేవాసమితి, రాజేంద్రప్రసాద్ వీధి, కదిరి-515 591** అనే చిరునామాకు పంపవలెను. **చెక్కులు స్వీకరించబడవు.**
- విరాళాలను ఆన్‌లైన్ ద్వారా కూడా పంపవచ్చు. వివరాలు: **శ్రీరామకృష్ణ సేవాసమితి, కదిరి, అకౌంట్ నెం. 32312200001840, సిండికేట్ బ్యాంక్, కదిరి (IFSC-SYNB0003231).**

మీ అమూల్య సహాయ, సహకారములతో ఈ మహత్తర కార్యక్రమమును విజయవంతం చేయ ప్రార్థన.

పూర్తి వివరాలకు:

శ్రీరామకృష్ణ సేవా సమితి, కదిరి

ఆర్. చంద్రశేఖర్ గుప్త (అధ్యక్షులు) - **9966680680**
ఎమ్.వి. సుబ్బారావు (నిర్వాహక అధ్యక్షులు) - **9052027716**
జె. గంగాధర్ (నిర్వాహక కార్యదర్శి) - **9440693309**

ఆధ్యాత్మిక అమృతవాహిని

శ్రీ రామకృష్ణ ప్రభ

సంపుటం: 71 సంచిక: 11 నవంబర్ 2014



ప్రార్థన

మారమణ ముమారమణం ఫణధర తల్పం ఫణాధరాకల్పం
మురమథనం పురమథనం వందే బాణారి మసమభాణారిం

లక్ష్మీపతి, ఉమాపతి పాముపై శయనించినవారు; పాములను ధరించినవారు; మురాసురుని సంహరించినవారు; త్రిపురములను నాశనం చేసినవారు అయిన బాణాసుర సంహర్త, మన్మథ సంహర్తలకు నమస్కారం.

– అప్పయ్య దీక్షితులు


సూక్తి సౌరభం

సంపకం ఉదకం పీత్వా
భేకో బక బకాయతే।
దివ్యం చూత రసం పీత్వా
గర్వం నాయాతి కోకిలః॥


“బురదనీరు తాగిన కప్ప బెకబెకమని శబ్దం చేస్తూ మిడిసిపడుతుంటుంది. శ్రేష్ఠమైన మావి చిగుళ్ళ రసాన్ని ఆస్వాదించే కోకిల ఏ ఆర్భాటం లేకుండా తీయగా పాడుతుంది.”

ఘటపు జలములందు గగనము కాన్పించు
ఘటము జలములేమి - గగన మేది?
ఘటములోన జ్యోతి క్రమమున చూడరా!
విశ్వదాభిరామ వినుర వేమ!

“ఓ వేమా! కుండలో నీరు ఉన్నప్పుడే అందులో ఆకాశం కనిపిస్తుంది. నీరు లేకుంటే ఆకాశం కనిపించదు. అట్లే శరీరం ఉంటేనే ఆత్మతత్త్వం తెలుసుకోగలం! దేహం ముక్తికి సాధనం”



శ్రీరామకృష్ణ ప్రభ శాశ్వత నిధి




ఆధ్యాత్మిక జ్ఞానాన్ని పంచి పెట్టేందుకు 'శ్రీరామకృష్ణ ప్రభ' కృషి చేస్తోంది. నిధుల కొరత లేకుండా ఈ జ్ఞానయజ్ఞం నిరంతరాయంగా సాగేందుకు 'శ్రీ రామకృష్ణ ప్రభ శాశ్వతనిధి'కి ధన దానం చేసి ప్రోత్సహించాల్సిందిగా కోరుతున్నాం. దాతల పేర్లు పత్రికలో ప్రచురిస్తాం.

మహారాజ పోషకులు......	రూ.	10,000/-, అంతకన్నా ఎక్కువ విరాళం ఇచ్చేవారు.
రాజ పోషకులు...........	రూ.	5,000/-, అంతకన్నా ఎక్కువ విరాళం ఇచ్చేవారు.
పోషకులు................	రూ.	1,000/-, అంతకన్నా ఎక్కువ విరాళం ఇచ్చేవారు.

	దాత పేరు / చిరునామా	రూ.
మహారాజ పోషకులు :	శ్రీ శంకర్ రెడ్డి, ప్రియాకాలనీ, గుడిమల్కాపూర్, మెహిదీపట్నం, హైదరాబాదు	1,00,000
మహారాజ పోషకులు :	శ్రీమతి మోతుకూరి సత్యవతి, తణుకు, పశ్చిమగోదావరి జిల్లా (కీ॥శే॥ పెరుమాళ్ళ త్రిమూర్తులుగారి జ్ఞాపకార్థం)	11,111
మహారాజ పోషకులు :	శ్రీ చాగంటి సత్యనారాయణమూర్తి, అశోక్‌నగర్, మిర్యాలగూడ, నల్గొండ జిల్లా	10,000
పోషకులు :	శ్రీ జి.వి.బి.ఎస్. శ్రీరామమూర్తి, మల్కాజ్‌గిరి, హైదరాబాదు (కీ॥శే॥ జి.సుందరరావు, శకుంతలాదేవిగార్ల జ్ఞాపకార్థం)	1,116
పోషకులు :	శ్రీమతి జి.లక్ష్మీసుందరమాణిక్యాంబ, మల్కాజ్‌గిరి, హైదరాబాదు (కీ॥శే॥ బి.పూర్ణచంద్రరావు, భాస్కరమ్మగార్ల జ్ఞాపకార్థం)	1,116
పోషకులు :	డాక్టర్ కె. రాజమోహన్, కూకట్‌పల్లి, హైదరాబాదు	1,116
పోషకులు :	శ్రీమతి వి. సత్యవతి, భీమవరం, పశ్చిమ గోదావరి జిల్లా	1,116
పోషకులు :	శ్రీమతి కె.జి.వి. ప్రసాదిని, మురళీనగర్, విశాఖపట్నం (కీ॥శే॥ కె.వి. సుబ్బారావు గారి జ్ఞాపకార్థం)	1,000
పోషకులు :	శ్రీ రాళ్ళ జోగయ్య చారి & శ్రీమతి విజయమ్మ, జిల్లెలగూడ, కర్మాన్‌ఘాట్, హైదరాబాదు	1,000

'శ్రీరామకృష్ణ ప్రభ' కానుక పథకం

యువతరానికి 'శ్రీరామకృష్ణ ప్రభ'ను మరింత చేరువ చేయాలని సంకల్పించాం. రాష్ట్రంలోని వివిధ పాఠశాలలు/ కళాశాలలు/ గ్రంథాలయాలకు పత్రికను పంపించడానికి మీ సహాయాన్ని కోరుతున్నాం. ఈ కానుక పథకం క్రింద చందా చెల్లించిన దాత పేరున (మీరు సూచించిన లేదా మేము ఎంపిక చేసిన) విద్యాసంస్థకు పత్రికను పంపుతాం. కానుక చందా రూ.1,500/- అంతకన్నా ఎక్కువ ఇచ్చిన దాత పేరు, విద్యాసంస్థ పేరు పత్రికలో ప్రచురిస్తాం.

దాత పేరు	విద్యాసంస్థ
శ్రీ కె. భాస్కరం, ఎ.సి.గార్డెన్స్, రాజమండ్రి	జెడ్.పి.హెచ్. పాఠశాల కైకరం& ఎస్.సి.హెచ్.బి.ఆర్.ఎమ్. ఉన్నతపాఠశాల భీమవరంలకు స్పాన్సర్ చేశారు.
శ్రీ జి. దోకారెడ్డి, విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు, కృష్ణారెడ్డినగర్, కర్నూలు	జెడ్.పి.హెచ్.ఎస్. గూడూరు, కోడుమూరులకు పత్రికను స్పాన్సర్ చేశారు.
శ్రీ మడతల గురివిరెడ్డి & శ్రీమతి ఓబులమ్మ, కమలాపురం రోడ్డు, కడప (కీ॥శే॥ఎమ్.పిచ్చిరెడ్డి, సాయమ్మ & యు.యెరికలరెడ్డి, రామక్కగార్ల జ్ఞాపకార్థం)	మేనేజర్, అమ్మవొడి, సైనిక్‌నగర్, సెంట్రల్ జైలు దగ్గర, కడప కడప జిల్లాలోని 2 ప్రభుత్వ పాఠశాలలకు, ఓ సేవాసంస్థకు జీవితచందాను స్పాన్సర్ చేశారు.
శ్రీ బి. కృష్ణమోహన్‌రావు, కడప (కీ॥శే॥ బేతంశెట్టి వేంకటేశ్వర్లుగారి జ్ఞాపకార్థం)	విజయవాడ రామకృష్ణ మిషన్ పాఠశాలకు జీవిత చందాను స్పాన్సర్ చేశారు.
శ్రీమతి బి.అక్షయ, బెల్ కాలనీ, బెంగుళూరు	స్వామి వివేకానంద స్వచ్ఛంద సేవాసంస్థ, 25వ వార్డు, విశాఖపట్నం
శ్రీ తిమ్మాపురం అంజయ్య, చెర్ల అంకిరెడ్డిపల్లి, చిన్న కోడూరు, మెదక్ జిల్లా	జెడ్.పి. & ఎమ్.పి. ఉన్నత పాఠశాలలు, చెర్లఅంకిరెడ్డి పల్లి, మెదక్ జిల్లా
శ్రీ ప్రహ్లాద్ మానె, రాజీవ్‌నగర్, ఆల్వాల్, సికింద్రాబాదు	50 పాఠశాలలకు ఒక సంవత్సరానికి పత్రికను స్పాన్సర్ చేశారు.
శ్రీ కె.వేంకటరెడ్డి, నేరేడుచర్ల,నల్గొండజిల్లా (కీ॥శే॥చినరంగారెడ్డి, వేంకటనర్సమ్మల జ్ఞాపకార్థం)	నేరేడుచర్ల మండలంలోని 15 పాఠశాలలకు ఒక సంవత్సరానికి పత్రికను స్పాన్సర్ చేశారు.

చందా వివరాలు		భారతదేశంలో	విదేశాలకు
విడి ప్రతి	:	₹ 10	-
సంవత్సర చందా	:	₹ 100	₹ 1,500
మూడు సంవత్సరాలకు	:	₹ 280	₹ 4,500
ఐదు సంవత్సరాలకు	:	₹ 450	₹ 7,500
ఇరవై సంవత్సరాలకు	:	₹ 1,500	₹ 22,000

గమనిక: డిమాండ్ డ్రాఫ్ట్, మనియార్డర్లలో **Ramakrishna Math, Hyderabad** అని వ్రాయాలి.

పంపవలసిన చిరునామా: **Sri Ramakrishna Prabha, Ramakrishna Math, Domalguda, Hyderabad - 500 029.**

చందాను ఆన్‌లైన్ **http://rkmath.org/srkp** ద్వారా చెల్లించవచ్చు.

లోపలి పేజీల్లో...

ఈ సంచికలోని రచయిత(త్రు)ల అభిప్రాయాలు వ్యక్తిగతమైనవి. సంపాదకులు గానీ, హైదరాబాద్ రామకృష్ణ మఠం గానీ వాటికి బాధ్యత వహించజాలరు. – సంపాదకులు

శ్రీరామకృష్ణ ప్రభ చందాదారులకు విన్నపం

ప్రియ పాఠకులారా!

- 'శ్రీరామకృష్ణ ప్రభ' పత్రిక కవరు మీద చిరునామాకు పైన మీ చందా నంబరు, కుడి వైపున మీ చందా గడువు ముగిసే నెల ఉంటాయి. మీ చందా గడువు పూర్తయ్యే నెలకు ముందుగానే సొమ్మును చెల్లించి చందాను పునరుద్ధరించుకోండి.
- మీ ఉత్తర ప్రత్యుత్తరాలన్నింటిలో తప్పనిసరిగా చందా నంబరు పేర్కొనాల్సిందిగా మనవి.
- మీ చిరునామా మారిన పక్షంలో 7వ తేదీ లోగా మాకు తెలియపరచినట్లయితే, వచ్చే నెల సంచిక నుండి మీ కొత్త చిరునామాకు పంపబడును.
- ప్రతీ నెల 26 లేదా 27వ తేదీల్లో పత్రిక పోస్ట్ అవుతుంది. మీకు పత్రిక 15వ తేదీ లోపుగా చేరనట్లయితే, వెంటనే మాకు తెలియజేయగలరు.

శ్రీరామకృష్ణ ప్రభ ద్వారా అవిచ్ఛిన్నంగా సేవలు అందించాలన్నదే మా ఆకాంక్ష. అందుకు మీ సహకారం కోరుతూ.... – సర్క్యులేషన్ మేనేజర్

'శ్రీరామకృష్ణ ప్రభ' పత్రిక చందాను
ఆన్‌లైన్ **http://rkmath.org/srkp** ద్వారా చెల్లించవచ్చును.



చిన్నారులు చిరుదివ్వెలు

ఈ లోకంలో తల్లితండ్రులకు ముఖ్యంగా మూడు విషయాల కారణంగా కష్టం కలుగుతుందని పంచతంత్రం చెబుతోంది.

అజాత మృత మూర్ఖేభ్యో, మృతా జాతౌ సుతౌ వరమ్।
యతస్తౌ వల్ప దుఃఖాయా, యావజ్జీవం జడో దహేత్ ॥

"పుత్రుడు పుట్టకపోవడం, పుట్టినవాడు మరణించడం, బ్రతికినవాడు మూర్ఖుడు కావడం – ఈ మూడూ తల్లితండ్రులకు దుఃఖాన్ని కలిగించే విషయాలు. అయితే ఈ మూడింటిలో మొదటి రెండు కారణాల వల్ల కలిగే దుఃఖం కొంతకాలమే ఉంటుంది. కానీ పుత్రుడు మూర్ఖుడిగా మారితే ఆ దుఃఖం తల్లితండ్రులను జీవితాంతం వేధిస్తుంది."

అయితే, తల్లితండ్రులు తమ పిల్లల్ని ప్రయోజకులుగా తీర్చిదిద్దాలంటే ఏం చేయాలి? సచ్ఛీలురుగా, ఉన్నతులుగా మలచాలంటే ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి?

ఒక గది అంతా వెలుగుతో నిండాలంటే ఓ చిరు దీపాన్ని వెలిగిస్తే చాలు. అంతేగానీ, గది పరిమాణం ఎంత ఉందో అంత దీపాన్ని వెలిగించనవసరం లేదు కదా! అలాగే చిన్నారులు జీవితాంతం సద్గుణ వంతులుగా జీవించాలంటే మహాత్ముల త్యాగమయ జీవిత విశేషాలతో, స్ఫూర్తివచనాలతో, సద్బోధలతో వారి హృదయ దీపాలను వెలిగించాలి. ఆ స్ఫూర్తికిర ణాలు చిన్నారుల జీవితాలను తేజోవంతం చేస్తాయి.



హితోక్తులతో, ధీరవచనాలతో తమ పిల్లల శీలనిర్మాణానికి తోడ్పడిన మాతాపితరులు ఎంతోమంది మన చరిత్రపుటల్లో స్థానాన్ని సంపాదించుకున్నారు. అలాంటి ఆదర్శ మాతాపితరుల అడుగుజాడలను అనుసరిస్తే చిన్నారులంతా మహోన్నతులుగా తయారవుతారు.

మాతృమూర్తులకు మార్గదర్శి మదాలస: పూర్వం ఋతధ్వజుడు అనే మహారాజు ఉండేవాడు. అతడికి మదాలసతో వివాహం జరిగింది. ఋతధ్వజుడు మహా పరాక్రమవంతుడు. మదాలస ఆత్మతత్త్వం తెలిసిన జ్ఞానవంతురాలు. మదాలస తమకు పుట్టిన ప్రతి బిడ్డనూ ఊయల్లో వేసి 'శుద్ధోఽసి, బుద్ధోఽసి, నిరంజనోఽసి – నీవు శుద్ధుడవు, నీవు జ్ఞానివి, నీవు నిర్మలుడవు' అంటూ జోలపాట పాడుతూ ఉండేది. ఈ విధంగా పుట్టిన ముగ్గురు బిడ్డలకూ ఆత్మబోధ చేసింది మదాలస. ఆ ముగ్గురు పుత్రులూ ప్రాపంచిక సుఖాలను త్యజించి, ఆత్మసాక్షాత్కారం కోసం తపస్సు చేసుకోవాలని అరణ్యాలకు వెళ్ళిపోయారు. అప్పుడు ఋతధ్వజ మహారాజు 'పుట్టిన ప్రతీ పుత్రుడు తపస్సుకై అరణ్యాలకు వెళ్ళిపోతున్నాడు. రాజ్యభారాన్ని వహించడానికీ, వంశాన్ని కొనసాగించడానికీ ఒక్క కుమారుడనైనా తీర్చిదిద్దు' అని మదాలసతో అంటాడు.

అప్పుడు మదాలస తమకు కలిగిన నాలుగో కుమారుడైన అలర్కుణ్ణి ఊయలలో పడుకోబెట్టి "నాయనా! నీ వంశ ప్రతిష్ఠను నిలబెట్టేలా జీవించు; ఎల్లప్పుడూ సత్కర్మలు చేయి; పరస్త్రీలను మాతృమూర్తుల్లా, పరధనాన్ని మట్టిబెడ్డలా భావించు; పరోప కారమే పరమధర్మంగా జీవించు; ప్రజలు సుఖసంతోషాలతో జీవించేలా రాజ్యాన్ని పరిపాలించు; పెద్దల పట్ల వినయ విధేయతలతో ప్రవర్తించు; అహంకార మమకారాలకు లోబడకు..." – ఇలా ఉన్నత వ్యక్తిత్వానికి అవసరమైన సద్గుణాలను వల్లిస్తూ జోల పాడుతూ ఉండేది. అలా తల్లి సద్బోధ క్షీరపానంతో పెరిగిన అలర్కుడు రాజ్యభారాన్ని స్వీకరించాడు. ప్రజలను ప్రేమతో పరిపాలించసాగాడు. కామ క్రోధ లోభాలకు వశమవకుండా ఉన్నతంగా జీవించ సాగాడు. జీవితంలో ప్రలోభాలు ఎదురైనప్పుడు బాల్యంలో తల్లి చేసిన సద్బోధలు అతణ్ణి సన్మార్గంలో నడిపించసాగాయి. అలర్కుడు ఉన్నత విలువలతో జీవించి చివరికి రాజ్యభారాన్ని తన కుమారునికి అప్పగించి, తపోమయ జీవనం గడపడానికి అరణ్యాలకు వెళ్ళిపోయాడు.

మదాలస పసిబిడ్డకు జోలపాట పాడుతూనే నైతిక విలువలను బోధించింది. బాల్యంలో తల్లి చేసిన ఆ సద్బోధ అలర్కుణ్ణి శీలవంతునిగా తీర్చిదిద్దింది.

ఆధునిక యుగంలో ఆచరణీయమా?: "మదాలస జీవించిన దేశ కాల పరిస్థితులు వేరు. నేటి సమాజ స్థితిగతులు వేరు. అలాంటప్పుడు మదాలస అడుగుజాడల్ని అనుసరించడం ఆధునిక తరానికి ఎలా సాధ్యమవుతుంది?" అనే సందేహం వస్తుంది. పిల్లల్ని శీలవంతులుగా తీర్చిదిద్దాలన్న సంకల్పం, సహనం, సౌశీల్యం తల్లితండ్రులకుంటే ఏ తరం వారికైనా మదాలస జీవితం అనుసరణీయమే! నేటి తరంలో కూడా ఎంతో మంది తల్లితండ్రులు ఆదర్శవంతంగా జీవిస్తూ, తమ పిల్లల శీలనిర్మాణంలో ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారు.

మదాలస, ఋతధ్వజుల జీవన వృత్తాంతం కొన్ని వేల సంవత్సరాల క్రితం జరిగింది. కానీ కొన్ని సంవత్సరాలు, కొన్ని నెలల క్రితం జరిగిన రెండు సంఘటనలను తెలుసుకుంటే ఈ ఆధునిక యుగంలో కూడా తమ పిల్లల్ని ఉన్నతులుగా తీర్చిదిద్దే తల్లితండ్రులు ఉన్నారని తెలుస్తుంది.

లాల్‌జీగా అందరూ పిలుచుకొనే శ్రీచిమన్‌లాల్ శీతల్‌వాడ్ బొంబాయి విశ్వవిద్యాలయానికి ఉప కులపతిగా బాధ్యతలను నిర్వహించారు. లాల్‌జీ ఉప కులపతిగా నియమితులు కాకముందు న్యాయ మూర్తిగా పనిచేసేవారు. ఒకసారి ఒక నేరస్థుడు లాల్‌జీ దగ్గరకు వచ్చి 'నాకు అనుకూలంగా తీర్పు చెబితే, లక్ష రూపాయలు ఇస్తాన'ని ప్రలోభపరిచాడు. అందుకు లాల్‌జీ అంగీకరించలేదు.

అప్పుడు అతడు లాల్‌జీతో, 'సార్! మీకు ఇంత పెద్ద మొత్తాన్ని ఇచ్చేవాడు ఇంకొకడు దొరకడు' అని గర్వంగా చెప్పాడు. అందుకు బదులుగా లాల్‌జీ 'ఇంత పెద్ద మొత్తం ఇచ్చేవాళ్ళు చాలా మంది ఉండవచ్చు. కానీ ఇంత పెద్ద మొత్తాన్ని తిరస్కరించే వ్యక్తి మీకు ఇంకొకరు దొరకడం కష్టం' అని చిరునవ్వుతో సమాధానమిచ్చారు. 'మీరు ఉన్నత వ్యక్తిగా ఎదగడానికి ప్రేరణ ఏమిట'ని లాల్‌జీని అడిగితే 'మనిషికి గౌరవాన్ని తెచ్చిపెట్టేవి ఉన్నత విద్య, అధికారం, సంపదలు కావు. సచ్ఛీలమే శాశ్వత కీర్తిని ఆర్జించిపెట్టేది – అని బాల్యంలో మా తండ్రి నూరిపోసిన నీతివాక్యాలే' అని చెప్పేవారు.

అలాగే, రెండు నెలల క్రితం హైదరాబాద్‌లో ముగ్గురు యువకులు తమ స్నేహితుడికి పుట్టినరోజు కానుక కొనడానికి రెండు వందల రూపాయలు తీసుకోవడం కోసం ఒక ఏ.టి.యమ్.కు వెళ్ళారు. అక్కడ ఏ.టి.యమ్. యంత్రం తెరుచుకొని, కట్టలుగా పడివున్న దాదాపు 25 లక్షల రూపాయల నగదును చూశారు. కేవలం 200 రూపాయల కోసం వెళ్ళిన ఆ యువకులకు 25 లక్షల రూపాయల నగదు కనిపించగానే కళ్ళు చెదిరాయి. కానీ మనస్సు మాత్రం చలించలేదు. అందుకే వారు పోలీసుస్టేషన్‌కు విషయాన్ని తెలియజేశారు. పోలీసు అధికారులు, బ్యాంక్ అధికారులు అక్కడకు వచ్చి నగదును స్వాధీనపరచుకొనే దాకా అక్కడే ఆ ఏ.టి.యమ్.కూ, ఆ డబ్బుకూ కాపలాగా నిలుచున్నారు. అధికారులు ఆ యువమిత్రుల నీతి నిజాయతీలకు మెచ్చుకొని, వాళ్ళను సన్మానించారు. ఇంతకీ ఆ ముగ్గురు మిత్రులు జీవితంలో ఇంకా స్థిరపడనివారే! ఒక యువకుడు ఉద్యోగ ప్రయత్నం చేస్తున్నాడు. రెండో యువకుడు చిరుద్యోగం చేస్తూ పోటీ పరీక్షలకు తయారవుతున్నాడు. మూడో యువకుడు చిరుద్యోగం చేస్తూ చదువుకుంటున్నాడు. ఈ కాలంలో కూడా ఇంత నిజాయతీగా ఉండడానికి మీలో ఆ నైతికబలం ఎలా వచ్చిందని ప్రశ్నిస్తే 'మా తల్లితండ్రులు మాకు నేర్పిన నైతిక విలువల పుణ్యమే' అని ఆ ముగ్గురూ ముక్తకంఠంతో తమ తమ తల్లితండ్రులను కొనియాడారు.



కోపం వద్దు... ప్రేమే ముద్దు

అమెరికా ప్రథమ అధ్యక్షుడైన జార్జ్ వాషింగ్‌టన్ ఒక రైతు కుటుంబంలో జన్మించాడు. అతడు చిన్నతనంలో తండ్రితో పాటు పొలానికి వెళుతూ ఉండేవాడు. ఒకరోజు పొలం పని పూర్తిచేసుకొని తండ్రి ఓ చెట్టు క్రింద విశ్రాంతి తీసుకుంటున్నాడు. ఆ సమయంలో వాషింగ్‌టన్ అక్కడ ఉన్న గొడ్డలిని తీసుకొని పళ్ళ చెట్టును నరికేశాడు.

తండ్రి జరిగినదంతా గమనించాడు. తాను ఎంతో కాలంగా పెంచిన పళ్ళ చెట్టును కొడుకు నరికినందుకు అతడికి కోపం వచ్చింది. కానీ అతడు కోపాన్ని అణచుకొని జార్జ్‌తో "చూడు నాయనా! ఈ చెట్టు తన పండ్లతో మన ఆకలిని తీరుస్తుంది. మనకు మేలుచేసే వాటికి ఎన్నడూ కీడు తలపెట్టకూడదు" అని ప్రేమతో సున్నితంగా చెప్పాడు.

అమెరికా దేశాధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహిస్తున్నప్పుడు కూడా 'బాల్యంలో తండ్రి చెప్పిన మాటలు నన్ను ఎంతగానో ప్రభావితం చేశాయి' అని వాషింగ్‌టన్ గుర్తుకు తెచ్చుకునేవారు. దేశ ప్రజల సంక్షేమం కోసం నిజాయతీగా సేవలందించి చరిత్రలో చిరస్మరణీయుడిగా నిలిచారు.

ఈ సంఘటనలను తెలుసుకున్న తరువాత పిల్లల్ని సచ్ఛీలురుగా మార్చడంలో తల్లితండ్రులదే ప్రధానపాత్ర అనీ, ఈ ఆధునిక యుగంలో కూడా అది సాధ్యమేననీ అంగీకరించక తప్పదు. నేటి సమాజంలో మనిషి వ్యక్తిత్వం ఎలా ఉన్నప్పటికీ పట్టాలు, పదవులు, సంపదలు ఉంటే ఆ వ్యక్తి ఉన్నతుడనే భావన ప్రబలింది.

అందుకే అబ్రహామ్ లింకన్ సచ్ఛీలత ప్రాధాన్యాన్ని వివరిస్తూ... *"Character is like a tree and reputation its shadow. We give importance to the shadow and forget the tree* - సచ్ఛీలం ఒక చెట్టు అయితే, ఖ్యాతి దాని నీడ లాంటిది. మనం నీడ లాంటి ఖ్యాతికి ప్రాధాన్యమిస్తూ, చెట్టు లాంటి సచ్ఛీలతను విస్మరిస్తున్నాం" అని గుర్తుచేశారు. కాబట్టి 'మనిషికి శాశ్వత కీర్తిని ఆర్జించిపెట్టేది సచ్ఛీలమే!' అన్న స్ఫూర్తి వచనాలతో చిరు హృదయాలను ప్రకాశింపజేయాలి. అందుకు అందరూ దృఢ సంకల్పంతో ముందుకు సాగాలి. ❖

తల్లిలాంటి దైవం లేదు. తండ్రిలాంటి గురువు ఉండడు. భూమి మీద ఏ ప్రాణికైనా తల్లిని మించిన బంధువు లేదు. కాబట్టి తల్లి తండ్రులను గౌరవించని పుత్రునికి శ్రేయస్సు కలుగదు. -సుభాషితం

గోరుముద్ద - స్వామి సుప్రియానంద

'పిల్లలు భయపడకూడదు. ధైర్యంగా ఉండాలి. పిరికితనం లేశమంతైనా ఉండకూడదు' అని అనుకోవడం ప్రతి తల్లితండ్రులకు సర్వ సాధారణం. అయినప్పటికి పిల్లలను నిగ్గదీసి 'నీ కన్నలు భయం లేదా?' అని అడగని తల్లిదండ్రులు అరుదు.

స్వామి వివేకానంద 'భయమే మరణం' అంటారు. అది విన్న మనం, 'పిల్లలూ! జీవితంలో దేనికీ భయపడకూడదురా!' అని ఉగ్గుపాలతో నూరిపోస్తాం. ఎప్పుడైతే వారు మన మాట వినరో అప్పుడు 'పిల్లలకు భయం లేకుండా పోతోంది' అని వాపోతాం.

ఇప్పుడు పిల్లల్ని 'ఇదిగో పాము! అదిగో పులి!' అని భయపెట్టే రోజులు పోయాయి. వీపు తట్టి 'హనుమంతుణ్ణి తలుచుకోరా, భయం పోతుంది' అన్నా నమ్మే చిన్నారులు నేడు కంటికి కనపడరు. దీనికి కారణం - సరళంగా ఆలోచించడం మనతోపాటు మన పిల్లలూ మరచిపోయారు.

మన ఆలోచనలు మన సొంతం కాదు. అరువు తెచ్చుకున్న



నీ కన్నలు భయం లేదా?



ఆలోచనలు. నిప్పులో చేయి పెడితే కాలుతుందని తెలిసినా అస్సలు భయపడకుండా అతి ధైర్యంతో నిప్పులో చేతులు పెట్టి కాల్చుకుని లబోదిబో అంటూ విలపించే స్థితి. చేతులు కాల్చిన నిప్పు మీద కోపంతో అన్నం వండుతున్న పొయ్యిని ఆర్పే అతి తెలివితేటలు. దీనికి ఉదాహరణలు కావాలా?

ఈ మధ్య అమెరికాలో ఒక తండ్రి తన కూతురికి కొనిచ్చిన 'ల్యాప్‌టాప్' (కంప్యూటర్)ను తుపాకితో కాల్చేసి, ఆ వీడియోను 'ఫేస్‌బుక్'లో పెట్టాడు. ఎందుకంటే ఆ అమ్మాయి 'ల్యాప్‌టాప్'లో 'ఫేస్‌బుక్' అకౌంట్ తెరచి అందులో అమ్మా నాన్నలను నిందిస్తూ ఒక ఉత్తరం వ్రాసి పెట్టింది. అందుకు ఆ తండ్రి ప్రతీకార చర్యయే 'ల్యాప్‌టాప్'ను చంపేసింది.

మరొక వీర బాలుడి కథ - ఆ అబ్బాయికి పదేళ్ళు. తన సమ వయస్కులను సమావేశపరచి తన వీరత్వాన్ని, ధైర్యసాహసాలను ప్రదర్శించాడు. అదేమిటంటే ఒక చిన్న పిల్లి కూనను, తోక పట్టుకుని గిరగిరా తిప్పి నేలకేసికొట్టి చంపేశాడు. తన మిత్రులంతా ఆనందంతో చప్పట్లు కొట్టడం, తనను అభినందించడం... ఇదంతా మొబైల్ ఫోన్‌తో వీడియో తీసి గర్వంగా 'ఫేస్‌బుక్'లో పెట్టాడు.

ఈ రెండు వాస్తవిక ఉదాహరణల నుండి మనం తెలుసుకోవలసినది ఏమిటి? పిల్లలకు 'భయం' అంటే ఏమిటో 'ధైర్యం' అంటే ఏమిటో తెలియని పరిస్థితి. నేటి పిల్లలలో చెడు పనులు చేయడానికి 'భయం' లేదు. మంచి పనులు చేయడానికి 'ధైర్యం' లేదు. అందుకు పిల్లల్ని నిందించి ప్రయోజనం లేదు. పిల్లలకు నిజమైన ధైర్యసాహసాలంటే ఏమిటో తెలియాలంటే అభిమన్యుడు, శివాజీ, స్వామీజీ, నేతాజీ లాంటి ధీరపురుషుల వ్యక్తిత్వాలను పరిచయం చేయాలి. అలాగే పిల్లలు దేనికి భయపడాలో తెలుసుకోవాలంటే అసత్యం, అవినీతి మార్గాలను అనుసరించడానికి భయపడిన హరిశ్చంద్రుడు, గౌతమ బుద్ధుడు, గోఖలే, గాంధీజీ లాంటి సత్యవాదుల జీవిత విశేషాలను బోధించాలి.

అందుకే స్వామి వివేకానంద తల్లితండ్రులను ఉద్దేశిస్తూ... *"Let positive, strong, helpful thought enter into their brains from very childhood* - పిల్లలకు చిన్నప్పటి నుండే సకారాత్మక, శక్తిజనిత భావాలను బోధించాలి" అని హితవు పలికారు.

ముందు పెద్దలుగా మన నడవడిక పిల్లల ప్రాణసంకటానికి దారితీయకుండా జాగ్రత్త పడాలి. అప్పుడే పిల్లలకు మన జీవితాల ద్వారా నిజమైన ధైర్యాన్ని ఇవ్వగలుగుతాం. పిల్లల వ్యక్తిత్వ నిర్మాణానికి ఇదే మూలసూత్రం. ❖



దేవతల దీపావళి

కార్తీక పౌర్ణమి

– డాక్టర్ అపర్ణా శ్రీనివాస్

'పౌర్ణమి' అనగానే నిండు చంద్రుడు గుర్తుకు వచ్చి, మనస్సు అప్రయత్నంగానే ఆహ్లాదాన్నీ, ఆనందాన్నీ పొందుతుంది. చంద్రుడు మనస్సుకు అధిపతి అయినందున, పున్నమి నాటి చంద్రుడు మనలోని భావనలు మరింతగా ప్రస్ఫుటమయ్యేందుకు దోహదపడతాడు. ఆధ్యాత్మికంగా సాధకులకు ఇది ఉపయోగకరం. అందుకే, పౌర్ణమి తిథి ఒక విశిష్టతను సంతరించుకుని ఉంది. కార్తీక పౌర్ణమి విశేషాలు తెలుసుకునే ముందు, వివిధ పౌర్ణముల వైశిష్ట్యాలను ఒకసారి గుర్తుకు తెచ్చుకుందాం – వేదాలను విభజించిన వ్యాసుడు జన్మించింది ఆషాఢ పౌర్ణమి (గురు పౌర్ణమి); జ్ఞానానికి నిలయమైన హయగ్రీవుడు జన్మించింది శ్రావణ పౌర్ణమి (జంధ్యాల పౌర్ణమి); త్రిమూర్త్యాత్మకమైన దత్తాత్రేయుడు జన్మించింది మార్గశిర పౌర్ణమి; గౌతమ బుద్ధుడు జన్మించిన రోజు వైశాఖ పౌర్ణమి. ఈ విధంగా పౌర్ణమి తిథికి ఎంతో ప్రాముఖ్యం ఉంది. అగ్ని నక్షత్రమైన కృత్తికకు దగ్గరగా పౌర్ణమి చంద్రుడు ఉన్నందున కార్తీకమాసంగా పిలువబడే ఈ మాసంలోనూ, పౌర్ణమి అనేక ప్రత్యేకతలను కలిగి ఉంది.

ఈ కార్తీక పౌర్ణమి నాడు చేసే స్నాన, జప, ధ్యాన, అర్చనాదులు విశేష ఫలదాయకాలనీ, ఆ రోజున హరిని పూజించినా, హరుని పూజించినా, శక్తిని పూజించినా విశేష ఫలితాలు లభిస్తాయనీ పురాణాలలో వివరించబడింది. ఉపవాసాది సాధనలతో పాటూ ఈ పౌర్ణమినాడు అసంఖ్యాకంగా దీపాలను వెలిగించి ఆరాధించడం ఆనవాయితీ.

ఈ పౌర్ణమిని 'దేవ దీపావళి' అని అంటారు. దీని వెనుక ఉన్న కథనాన్ని చూస్తే, త్రిపురాసురులనే ముగ్గురు రాక్షసులను పరమశివుడు ఈనాడు సంహరించినందున, ఈ పున్నమిని 'త్రిపుర పౌర్ణమి' లేదా 'త్రిపురారి పౌర్ణమి' అని కూడా అంటారు. తారకాసురుడనే రాక్షసుని ముగ్గురు కుమారులు (తారాక్షుడు, కమలాక్షుడు, విద్యున్మాలి) మూడు పురాలలో స్వేచ్ఛగా సంచరించేవారు. ఆ ముగ్గురూ బ్రహ్మదేవుని వద్ద నుండి ఒక విచిత్రమైన వరాన్ని పొందారు. మూడు పురాలను ఒకే రేఖ మీద, ఒకే బాణంతో కొట్టేంతవరకూ చావు లేకుండా వరాన్ని సంపాదించుకున్నారు. దాంతో, వరగర్వంతో లోక కంటకులుగా ప్రవర్తించసాగారు. వీరి ఆగడాలను భరించలేక దేవతలు, మహర్షులు, పరమశివుని ప్రార్థించగా, ఆ మహాదేవుడు త్రిపురాసురులతో యుద్ధం చేస్తూ, ఒకే బాణంతో వారి మూడు పురాలతో పాటూ వారినీ అంతం చేశాడు. ఈ అసురుల వధకు హర్షాన్ని వ్యక్తం చేస్తూ ఆరోజును వెలుగుల పర్వంగా భావించినందున, ఈ పౌర్ణమిని 'దేవతల దీపావళి' లేక 'దేవ దీపావళి' అని అంటారు. శ్రీమహావిష్ణువు మత్స్యావతారాన్ని ధరించింది ఈ రోజునే కావడం ఇంకో విశేషం.

మహోత్కృష్టమైన ఈ కార్తీక పౌర్ణమి నాడు చేసే ఉపవాసాది సాధనలు విశేష ఫలదాయకాలని చెబుతారు. అయితే 'ఉపవాసం' అంటే 'భగవంతునికి దగ్గరగా ఉండడం' అన్నది సరైన నిర్వచనం. చంచలమైన మనస్సును నియంత్రిస్తూ, ముఖ్యమైన కొన్ని పర్వదినాలలోనైనా భగవంతునితో మానసిక సాన్నిహిత్యాన్ని పెంపొందించుకునేందుకే ఈ ఉపవాసాలు నిర్దేశితమయ్యాయి. కార్తీక పౌర్ణమి నాటి సాయంత్రం ప్రమిదలతో ఇళ్ళలో దీపాలను వెలిగించడమే కాక, అరటి దొన్నెలలో దీపాలను వెలిగించి తటాకాలలోనూ, నదులలోనూ వదలడం ఆచారంగా వస్తోంది. దీపారాధన సమయంలో ఈ క్రింది శ్లోకాన్ని పఠిస్తారు.

కీటాః పతంగాః మశకాశ్చ వృక్షాః, జలే స్థలే యే నివసంతి జీవాః
దృష్ట్వా ప్రదీపం న చ జన్మ భాగినః, భవన్తిత్వం శ్వపచాహి విప్రాః

'మానవులు, పశువులు, పక్షులు, కీటకాలు అనే భేదం లేక సమస్త ప్రాణికోటిలో ఎవరెవరి మీద ఈ దీపజ్యోతి ప్రసరిస్తుందో వారంతా తమ తమ పాపాల నుండి విముక్తులై, పునర్జన్మ లేని స్థితిని పొందాలి'.

అపురూపమైన మన సంస్కృతిలో, మనం చేసే ప్రార్థనల్లో, మనకు మాత్రమే కాక, అన్ని ప్రాణులకూ క్షేమం చేకూరాలనే హితం నిబిడీకృతమై ఉంటుంది. అదే విశేషాంశం.

కార్తీక పౌర్ణమి నాటి మరో విశిష్టత – 'జ్వాలా తోరణోత్సవం'. ఆనాటి సాయంకాలం, శివాలయ ప్రాంగణాల్లో, ప్రధాన ఆలయానికి ఎదురుగా రెండు ఎత్తైన కర్రలను పాతి, వాటిని అడ్డంగా ఉంచిన మరో కర్రతో కలుపుతారు. ఎండుగడ్డితో, ఒక దిట్టమైన తాడు లాగా పేని, అడ్డంగా ఉంచిన కర్రకు తోరణంలా చుట్టి, దాన్ని నిప్పుతో వెలిగిస్తారు. ఆ తోరణం ఎగసిపడే జ్వాలలతో శోభాయమానంగా కనిపిస్తుంటే, పల్లకీలో

(మిగతా 13వ పేజీలో...)

ధర్మ మార్గాన్నే ఎల్లప్పుడూ అవలంబించు. సత్పురుషులను సేవించు, అత్యాశలను విడనాడు. పరుల గుణదోషాలను ఎంచకు. భగవత్సేవ గావించు. భగవత్కథారస పానం చేయు. –పద్మపురాణం

వేయి తీర్థక్షేత్రాలకు సమానుడైన విదురుడు, కురుక్షేత్ర రణరంగాన్ని కళ్ళారా చూడలేక పుణ్యతీర్థాలన్నీ సందర్శించి వచ్చాడు. కనుల ముందే అన్నల కొడుకులైన కౌరవులు, పాండవులు కుత్తుకలు తరుక్కోవడానికి సిద్ధపడుతుంటే, తట్టుకోలేక, భారమంతా భగవంతుడైన శ్రీకృష్ణ పరమాత్ముడిపైన వదిలేశాడు. యుద్ధం ముగిశాక పాండవుల పట్టాభిషేకం అనంతరం, రాజ్యంలోకి ప్రవేశించి, ధర్మరాజాదులచే స్వాగత సత్కారాలు అందుకొని, తీర్థవిశేషాలన్నీ వారికి వినిపించాడు. అనంతరం విదురుడు అన్నావదినలు ధృతరాష్ట్రుడు, గాంధారీ దేవిల అంతఃపురంలోకి అడుగుపెట్టాడు. వారు పాండవులు సమకూర్చిన అంగనా జనాలూ, ఆనంద భవనాలూ, అపార



మదిన్ చింతింపు ధాత్రీశ్వరా!

– స్వామి జ్ఞానదానంద

ధనాలూ, అందాల వనాలూ తదితర భోగభాగ్యాలలో మునిగి తేలుతూ ఉన్నారు. ఆ వయస్సులోనూ అంత వైభోగాలను అనుభవిస్తూ, పారమార్థికత ప్రసక్తినే మరచిపోయిన ఆ వృద్ధ దంపతులను చూసి ధర్మస్వరూపుడైన విదురుడు...

కనకాగార కళత్ర మిత్ర సుత సంఘాతంబులన్ ముందటం
కని ప్రాణేచ్ఛల నుండు జంతువుల నే కాలంబు దుర్లంఘ్యమై
యనివార్యస్థితి చంపునట్టి నిరుపాయంబైన కాలంబు వ
చ్చె నుపాంతంబున మారు దీనికి మదిన్ చింతింపు ధాత్రీశ్వరా!

“రాజా! ప్రపంచంలోని మానవులు బంగారు భవనాలను, పుత్ర, మిత్ర, కళత్ర పరివారాలనూ నిరంతరం ఎదురుగా చూసుకుంటూ, ప్రాణాల మీద ప్రీతిని పెంచుకుంటూ ఉంటారు. అయితే దుర్నివారమైన కాలం వాళ్ళను చంపి తీరుతుంది. కాలాన్ని కాదని ఎదిరించే శక్తి ఎవరికీ లేదు. అక్కడ ఏ ఉపాయాలూ పనిచేయవు. అటువంటి కాలం నీ సమీపానికి వచ్చి నీ కోసం ఎదురుచూస్తోంది మహారాజా! దీనికి ప్రతిక్రియ ఏదైనా ఆలోచించమ”ని హితవు పలికాడు.

విదురుడు సాక్షాత్తూ యమధర్మరాజు అంశ. పూర్వకాలంలో మాండవ్యుడనే మహామునిని అకాల మృత్యువు పాల్జేసినందుకు యముడు, శాపవశాత్తూ నిమ్నకులంలో విదురుడిగా పుట్టాల్సి వచ్చింది. అందుకే ధర్మ, అర్థాలను నిర్ణయించడంలో, దారి తప్పిన ఆత్మీయులను హెచ్చరించడంలో ఆయన నిష్పక్షపాతంగా వ్యవహరిస్తాడు. అదే భావనతో అన్నావదినలను కాలం చేసే మోసానికి లోను కావద్దని అప్రమత్తం చేస్తున్నాడు.

పరివారం...ప్రాణం: ధృతరాష్ట్రుడిని మనందరి ప్రతినిధిగా చేసుకొని విదురుడు పలికిన పసిడి పలుకులివి! మనమూ అజ్ఞానంతో పరివారంపై, ప్రాణంపై ప్రీతిని పెంచుకొని, వయస్సు మీరాక కూడా వైభోగాల కోసం వెంపర్లాడుతూ, అతి వ్యామోహాలతో కాలనియమాల్నే ధిక్కరిస్తూ ఉంటాం. చాదస్తాలతో, చపలత్వాలతో కళ్ళుండీ అంధుల్లా ప్రవర్తిస్తూ ఉంటాం.

వృద్ధాప్యంలో ఓ భక్తుడు భగవాన్ రమణ మహర్షిని సందర్శించి, ‘భగవాన్! మనస్సు ఇప్పటికీ భగవంతుడి వైపు మరలడం లేదు! ఎందుకని?’ అని ఆవేదన పడతారు. అప్పుడు శ్రీరమణులు “మనిషికి ధనమే ఎక్కువ ప్రియం; ఆ ధనం కన్నా పుత్రుడు; ఆ పుత్రుడి కన్నా శరీరం, శరీరం కన్నా ఇంద్రియాలు, ఆ ఇంద్రియాలలో కెల్లా కన్ను, కన్ను కన్నా ప్రాణంపై ప్రీతి! ఉదాహరణకు పుత్రుడు ఏదైనా అకృత్యం చేస్తే, వాడిని రాజుగారు దండించేందుకు సిద్ధమైనప్పుడు, తల్లితండ్రులు అది సహించలేక ఇంట్లో ఉన్న వస్తువులన్నీ ఇచ్చైనా విడిపించుకుంటారు. అలా విత్తం కన్నా పుత్రుడు ప్రియం. ఆ అకృత్యం చేసిన పుత్రుడిని లంచాలతో వదలక వానికి బదులు నీవు లోబడితే వదులుతామని భటులు అన్నారనుకో, అప్పుడా తండ్రి దానికి ఒప్పుకోక, ‘నాకూ! వాడికీ సంబంధమే లేదు’ అని చెప్పి తప్పించుకుంటాడు. అందుకే సంతానం కన్నా కూడా సొంత శరీరం, ఇంద్రియాలు, ప్రాణం ప్రియం. ఇలా ఉంటుంది మనిషి అపేక్ష, స్వార్థం. ఈ అపేక్షలన్నీ తగ్గించుకుంటే అప్పుడు మనస్సు భగవంతుడిపై నిలుస్తుంది” అంటారు.

మునివర్తనుడికే ముక్తిసంపద: భగవంతుడి మాయ ఏమిటో కానీ, అలవాటైన వస్తువును వదులుకోవటానికి మనస్సు ఎంత తల్లడిల్లిపోతుందో, అన్నేళ్ళు తన తనువుతో, తత్సంబంధీకులతో తాదాత్మ్యం చెందిన మనిషి వాటిపై వ్యామోహాన్ని తెంచుకోవటానికి కూడా అంత పల్లటిల్లిపోతాడు. వయస్సు పెరుగుతున్న కొద్దీ, ఆ తాపత్రయం మరింత పెరుగుతుంది. యుక్తవయస్సులో కన్నా వార్ధక్యంలో దేహచింతన ఎక్కువ! అందుకే చాలామంది ఆ వయస్సులో శరీరానికి ఏ మాత్రం

అనారోగ్యం కలిగినా విలవిలలాడిపోతారు. ఈ దుఃస్థితి నుంచి బయటపడేందుకు విదురుడు ప్రత్యక్షంగా అన్నకు, పరోక్షంగా మనకు కొన్ని సూచనలిస్తూ...

దేహము నిత్యము కాదని,
మోహము తెగ కోసి సిద్ధ మునివర్తనుడై
గేహము వెలువడు నరుడు
త్సాహముతో చెందు ముక్తిసంపద ననఘా!

"ఈ దేహం నిత్యం కాదన్న సత్యం తెలుసుకొని, దేహం మీద వ్యామోహం తెంచుకొని, యోగ్యమైన వైరాగ్యమార్గంలో ఉత్సాహంగా ముందడుగు వేసేవాడే మోక్షలక్ష్మిని కైవసం చేసుకోగలుగుతాడ"ని స్పష్టం చేస్తాడు.

ఇలా దేహంపై ధ్యాస తగ్గించుకుంటూ వస్తుంటే, ముక్తి కన్నా ముందు మనకు మనం ప్రశాంతంగా ఉండగలం, చుట్టుపక్కల వారినీ ప్రశాంతంగా ఉంచగలం. అయితే దురదృష్టవశాత్తూ మనలో చాలామందికి ఉన్నతమైన అభిరుచులు, వ్యాపకాలు, ఆసక్తులు లేకపోవడం వల్ల మూడు కాళ్ళ వయస్సులోనూ ముప్ఫై ఏళ్ళ వయస్సులో వాళ్ళలాగే జీవించడానికి ప్రయత్నిస్తూ ఉంటారు. అదే ఉద్దేశంతో విదురుడు ధృతరాష్ట్రుడిని తీవ్రంగా హెచ్చరించాడు.

ఆ నియమాలు ఆచరణీయాలు...: మానసికంగా, శారీరకంగా సంసిద్ధం కాకపోతే, నియమబద్ధమైన జీవితాన్ని గడపకపోతే వార్ధక్యం భూలోక నరకమవుతుంది. అందుకే ఆ వయస్సులో మూడు రకాల నియమాలు పాటించాలి. అవి **ఆహార నియమాలు, ఆవాస నియమాలు, అనుష్ఠాన నియమాలు.** వయస్సు పైబడుతుందన్న సంకేతాలు రాగానే ముందు ఆహారం విషయంలో అప్రమత్తంగా ఉండాలి. యుక్తవయస్సులోలాగా కళ్ళకు కనిపించిందల్లా తినకుండా, జిహ్వాచాపల్యాన్ని నియంత్రించుకోవాలి. కేవలం ఆకలి తీరేందుకే ఆహారం అనుకోవాలి! ఆ తరువాత ఆవాస నియమాలూ అత్యంత ప్రధానమే! మలిసంధ్యలో మౌలికమైన వసతులతో, సరళమైన సౌకర్యాలతో ఎక్కడైనా సర్దుకుపోగల మనస్తత్వాన్ని అలవరచుకోవాలి. ప్రతిచోటా ప్రాధాన్యం కోసం పాకులాడకుండా, స్వచ్ఛందంగా ఆ పరుగు నుంచి పక్కకు తప్పుకోవాలి. ఇక చివరివి, చిత్తశాంతిని ప్రసాదించేవి అనుష్ఠాన నియమాలు! అవే ఆధ్యాత్మిక, పారమార్థిక చింతనలు!

పెళ్ళిళ్ళకు, పేరంటాలకు; విందులకు, వేడుకలకు వెళ్ళడం మానుకొని శుభకార్యాలకు మానసికంగానే తమ ఆశీస్సులు అందిస్తూ, ఏకాంత జీవితానికి, జపధ్యానాలకు, భగవదన్వేషణకు అంకితం కావాలి. విదురుడి హితబోధ తరువాత ధృతరాష్ట్రుడు ఈ నియమాలతోనే జీవితాన్ని గడుపుతూ, తనను పరామర్శించడానికి వచ్చిన ధర్మరాజుతో "రోజులోని నాల్గవ భాగంలో కాని, ఒక్కొక్కప్పుడు ఎనిమిదవ భాగంలో కాని కేవలం దాహం మాత్రం తీర్చే గంజి లాంటి ఆహారం తీసుకుంటున్నాను. ఈ విషయం గాంధారికీ తెలుసు. వ్రతం అనే పేరుతో నేల మీద దర్భలు పరచుకొని, మృగచర్మం కప్పుకొని, జపం చేసుకుంటూ శయనిస్తూ ఉన్నాను. గాంధారి కూడా అలాగే చేస్తోంది" అని వివరించాడు.

తస్మాత్ జాగ్రత...జాగ్రత: విదురుడి హితవాక్యాలను హృదయంలో పదిలపరచుకొని, సంసార సౌఖ్యాలను విడిచి, మోహబంధాలను తుంచి ధృతరాష్ట్రుడు, ఆ తమ్ముడితోనే కలసి కార్తీక పౌర్ణమి నాడు నారచీరలు, అజినమూ ధరించి హిమాలయాల సమీపంలోని దుర్గమ వనాంతరాల వైపు మహాప్రస్థానాన్ని సాగించాడు. సహధర్మచారిణిగా పుణ్యపురంధ్రి గాంధారీ పతిని అనుసరించింది. వయస్సు పండిపోతున్నా,

> **ప్రాపంచికుడి మనస్సు పేడకుప్పలోని పురుగులాంటిది. అది ఎప్పుడూ పేడలోనే కాలం గడుపుతూ, దాన్లోనే ఉండగోరుతుంది. ఎవరైనా దాన్ని ఆ మలినస్థలం నుండి తీసి తామరపువ్వులో ఉంచితే, ఆ పువ్వు వెదజల్లే కమ్మని సువాసనను భరించలేక అది చస్తుంది.**
>
> **అలాగే లౌకికుడు తుచ్ఛమైన లోకవ్యవహారాలను, చింతలను, వాంఛలను వీడి నిమిషమైనా మనలేడు. అతడు అశుద్ధంలో పుట్టి అశుద్ధంలో చచ్చే పురుగు లాంటివాడు. - భగవాన్ శ్రీరామకృష్ణ పరమహంస**

సంసారకూపంలో పీకలలోతు కూరుకుపోయిన మనందరి జీవితంలో ఎప్పుడో ఒకప్పుడు, ఎవరో ఒక హితైషి ఆగమించి...

ఆశయా బధ్యతే లోకో కర్మణా, బహు చింతయా
ఆయుక్షీణం న జానాతి తస్మాత్ జాగ్రత, జాగ్రత

'అయ్యో! ఆశకు బద్ధులై, కర్మల్లో పడి, ఎన్నో చింతలతో ఆయుష్షు క్షీణించిపోతుందన్న విషయాన్ని కూడా మరచి పరుగులు పెడుతున్నారే! జాగ్రత్త, జాగ్రత్త మీ సమయం మించిపోతోంద'ని జాగరూకులను చేస్తారు. కానీ మనమే వాటిని పెడచెవిన పెడుతూ ఉంటాం. అప్పుడే తొందరేమొచ్చిందను కుంటూ మునిమనవడి పెళ్ళి కోసం ఎదురుచూస్తూ ఉంటాం. తీరా మృత్యుపాశం మెడను చుట్టుకుంటున్న వేళ, పరీక్ష సమయం ముగిసిపోయి, పరీక్షకుడు జవాబు పత్రం లాగేసుకుంటున్న సమయంలో జవాబు గుర్తొచ్చి ఆందోళన పడే విద్యార్థిలా పశ్చాత్తాపపడతాం. అందుకే కురువృద్ధుడిలా వృద్ధాప్యంలో అరణ్యాలు పట్టకపోయినా, కనీసం ఇంటిని అడవిని చేయకుండా, 'కృష్ణా! రామా!' అనుకుంటూ భగవంతునితో అనుబంధం పెంచుకోవడానికి ప్రయత్నిస్తే మేలు! ❖

- స్వామి హర్షానంద

"ఒక వ్యక్తి తనను తాను అసహ్యించుకొంటున్నట్లయితే అదే పతనానికి హేతువు. పూర్వీకుల చరిత్రను అవమాన కరంగా భావిస్తే, ఆ జాతి అంతానికి చేరుకున్నట్లే!" అంటారు స్వామి వివేకానంద. గత వైభవాన్ని మర్చిపోయినంత కాలం మనమూ, మన దేశం స్తబ్ధతలో మునిగిపోతాం. అందుకే, మన ప్రాచీన సంస్కృతి గురించి తెలుసుకోవాలి. గడచిపోయిన సంగతులు తెలుసుకొంటూ, భవిష్యత్ మహత్కార్యాల సాధన వైపు నడవాలి. మన ప్రాచీన భారతీయ సంస్కృతిని గుర్తు చేసేందుకు చేస్తున్న ప్రయత్నమే ఈ వ్యాసాల పరంపర. సుప్రసిద్ధ రచయిత, బెంగుళూరు రామకృష్ణ మఠం అధ్యక్షులు స్వామి హర్షానంద మహరాజ్ మధ్యయుగాల కాలం దాకా విలసిల్లిన మన సంస్కృతిని 'శ్రీరామకృష్ణ ప్రభ' పాఠకులకు 2014 ఫిబ్రవరి సంచిక నుండి వివరిస్తున్నారు.


వివిధ శాస్త్రాల విజ్ఞానం

ఖనిజాల త్రవ్వకం : విలువైన లోహాలు, వజ్రాల కోసం గనుల త్రవ్వకాలు భారతీయులకు తెలుసని మెగస్తనీస్ ఇలా వర్ణించాడు:

"భారాగుండ (సింగభూమ్), మొసబాని (సింగ్‌భూమ్), అగ్నిగుండాల (ఆంధ్రప్రదేశ్), వేనాడ్ (కేరళ)లలో జరిపిన పురావస్తు త్రవ్వకాలలో - వదలివేసిన రాగి, బంగారు గనులు బయల్పడ్డాయి. వైదిక కాలం నాటి భారతీయులకు బంగారం, వెండి, రాగి, సీసం, ఇత్తడి, ఇనుప లోహాలు తెలుసు. అంటే వీరికి గనులలో త్రవ్వకాలు, లోహశాస్త్రం తెలిసి ఉన్నట్లే భావించాలి".

ఢిల్లీలోని కుతుబ్‌మీనార్ దగ్గర ఉండే నాలుగో శతాబ్దపు పాత ఇనుప స్తంభం ఇప్పటికీ ఒక ఆశ్చర్యకరమైన వస్తువుగా గోచరిస్తుంది. దాని పరిమాణమే కాకుండా, త్రుప్పుపట్టని పనితనం ఆ రోజులలో లోహశాస్త్ర నైపుణ్యాన్ని సూచిస్తోంది. సుల్తాన్‌గంజ్ (బీహార్)లోని రాగి బుద్ధ విగ్రహం మరొక అద్భుతం. హ్యూయన్‌సాంగ్ (క్రీ.శ.600 - 624) దాదాపు 24 మీటర్ల ఎత్తైన (80 అడుగులు) నలంద విశ్వవిద్యాలయం (బీహార్)లోని బుద్ధుని రాగివిగ్రహాన్ని గురించి ప్రస్తావించి ఉన్నారు.

మౌర్యరాజులు రాగి నాణేలను ముద్రించినట్లు ఆధారాలు ఉన్నాయి. రాగి, ఇత్తడి మీద వెండి, బంగారు పూత పూసిన ఆభరణాలు తక్షశిల (క్రీ.పూ. 3వ శతాబ్దం) త్రవ్వకాలలో బయట పడ్డాయి. వాటి ఆధారం గానే 2 వేల ఏళ్ళ క్రితమే భారతీయులకు రాగి లాంటి లోహాలు కరిగించడం తెలుసని నిర్ధారించబడినది. తిరునల్వేలి లేక తిన్నెవేలి (తమిళనాడు)లో బయటపడిన ఇనుప పనిముట్లు క్రీ.పూ. 4వ శతాబ్దానికి చెందినవని నిర్ధారించడమైనది. రేడియో యాక్టివ్ కార్బన్ డేటింగ్ ప్రక్రియతో ఢిల్లీ పరిసరాలలో లభించిన ఇనుప వస్తువులు క్రీ.పూ 1025 నుండి 537 సంవత్సరాలకు చెందినవని నిర్ణయించారు.



పురుషోత్తమ చక్రవర్తి 13.6 కిలోల (30 పౌండ్లు) బరువున్న ఉక్కు వస్తువును అలెగ్జాండర్ ప్రభువుకు బహుమతిగా సమర్పించాడు. సుశ్రుత సంహిత ఉక్కుతో చేసిన శస్త్రవైద్య పనిముట్ల గురించి ప్రస్తావించింది. క్రీస్తు శకం ప్రారంభంలోనే పాశ్చాత్య దేశాలకు భారతీయ ఉక్కు ఎగుమతై, ప్రఖ్యాతి గాంచిన డెమాస్కస్ కత్తుల తయారీలో వాడబడింది. వరాహమిహిరుడు క్రీ.శ. 6వ శతాబ్దం నాటి 'బృహత్ సంహిత'లో ఉక్కును పదునుపెట్టడం గురించి ప్రస్తావించారు.

ప్రాచీన, మధ్యయుగాల భారతీయులకు వివిధ లోహాలను కరిగించడమే కాక అనేక రకాల వస్తువుల తయారీ కూడా తెలుసని నిర్ధారించవచ్చు.

పశువైద్య శాస్త్రం: వ్యవసాయాధారిత సమాజంగా హిందువులు పాడిపశువులు, ఇతర జంతువుల మీద ఆధారపడి జీవించేవారు. దేశాన్ని పరిపాలించే రాజులకు సైన్యంలో ఏనుగులు, గుఱ్ఱాల అవసరం ఉండేది. ఈ మూడు రకాల పశువుల వైద్యశాస్త్రం కాలాంతరంలో అభివృద్ధి చెందింది. గవాయుర్వేద

(గోవులకు సంబంధించిన ఆయుర్వేదం), అశ్వాయుర్వేదం, హస్త్యాయుర్వేదాలుగా ఈ శాస్త్రాన్ని పిలిచేవారు.

గవాయుర్వేదం గౌతమ మహర్షి ప్రణీతమై మధ్యయుగాల వరకు ప్రాచుర్యంలో ఉండేది. పశురోగ నివారణే కాకుండా ఈ గ్రంథం పశువుల మేత, సంకరపరచడం, ఈతలు, పాలు తీయడం లాంటి అంశాలను కూడా ప్రస్తావించింది. 'సాలిహోత్ర సంహిత' అశ్వాయుర్వేదం గురించి తెలియజేస్తుంది. దీని కాలనిర్ణయం నిర్దిష్టంగా తెలియదు. అగ్నిపురాణంలో ఇందులోని కొన్ని విషయాలు ప్రస్తావితమయ్యాయి. కల్హణుడి సాలిహోత్ర, సముచ్చయ (క్రీ.శ. 12వ శతాబ్దం) దీని శాఖగా భావించబడుతోంది. ఇందులో శరీర నిర్మాణశాస్త్రం, జంతుధర్మ శాస్త్రం, రోగనిర్ధారణ కారకాలైన లక్షణాలను సమగ్రంగా చెప్పారు. సంకరపరచడం, వయో నిర్ధారణ, లింగ నిర్ధారణ లాంటి అనేక విషయాలు ఈ గ్రంథంలో ఉన్నాయి. పాలకాప్యముని రాసిన 'పాలకాప్య సంహిత' హస్త్యాయుర్వేదం గురించి సమగ్రంగా తెలియజేస్తుంది. పాలకాప్యునికీ, అతని శిష్యుడు రోమపాదునికీ జరిగిన ప్రశ్నోత్తరాలరూప గ్రంథమిది. ఇందులో శరీరనిర్మాణ శాస్త్రం, జంతుధర్మ శాస్త్రం, రోగనిర్ధారణ, ముఖ్యమైన రోగాలు, ఔషధపరమైన, శస్త్రపరమైన చికిత్స, ఔషధాలు, పథ్యపానాలను వివరించారు. ఈ విషయం మీద నీలకంఠాచార్యుల 'మాతంగ లీల' కూడా వచ్చింది. అయితే, ఈ గ్రంథాల కాలం ఏమిటన్నది నిర్ణయం కాలేదు.



ఈ సందర్భంలో నలందా విశ్వవిద్యాలయంలో నిత్యం పనిచేసే పశువైద్యశాల ఉండేదన్న విషయం అప్రస్తుతం కాదు.

జంతుశాస్త్రం: వైదిక వాఙ్మయంలో జంతుశాస్త్రం జంతువుల వర్గీకరణతో సూచితమైంది.

చరక, సుశ్రుత సంహితలు సింహాలు, పులులు, ఎలుగుబంట్లు, ఒంటెలు, ఏనుగులు, కుక్కలు, తోడేళ్ళు, గాడిదలు, దేగలు, గ్రద్దలు, హంసలు మొదలైన చతుష్పాద జంతువులు, పక్షుల గురించి ప్రస్తావించాయి. వాటితోపాటు కప్పలు, బల్లులు, పాకే జంతువులు, జలచరాలైన జాతులు, హంసలు, కొంగలు, రాజహంసలు, గూడకొంగలు, ఇతర జాతి పక్షులైన పావురాలు, లకుముకి పిట్టలు, కీటకాల గురించి ఈ గ్రంథంలో తెలిపారు.

కౌటిల్యుని అర్థశాస్త్రం (క్రీ.పూ. 300)లో చేపల పెంపకం, పశుపోషణ, గొర్రెలు, అశ్వాలు, ఏనుగుల పెంపకం గురించి ప్రస్తావించారు.

గరుడపురాణం (క్రీ.శ. 900) కొన్ని పశువులు – ముఖ్యంగా అశ్వాలు, ఏనుగుల రోగాల గురించి వివరిస్తే డల్లణుడు (క్రీ.శ. 10వ శతాబ్దం) 'నిబంధ సంగ్రహ'లో అనేక జంతువుల, పక్షుల, కీటకాల వివరాలు తెలిపాడు.

ప్రకృతితో సన్నిహితమైన సంబంధం ఉండడం వల్ల ప్రాచీన హిందువులు వృక్షజంతు సంబంధమైన విషయాలను నిశితంగా పరిశీలించగలిగారు. ఈ సాహిత్యం మనకు నిజంగా విలువైనది. ❖ **అనువాదం: డాక్టర్ పి.వి.రెడ్డి**

(...9వ పేజీ తరువాయి)

దేవతల దీపావళి - కార్తీక పౌర్ణమి

శివపార్వతుల విగ్రహాలను ఉంచి, ఆ తోరణం కిందుగా మూడుసార్లు తిప్పుతారు. ఈ ఉత్సవానికే జ్వాలాతోరణమని పేరు. దీని గురించి అనేక గాథలున్నా, రాక్షసులతో యుద్ధంచేసి విజయం సాధించి వచ్చిన పరమశివునికి, విజయచిహ్నంగా పార్వతీదేవి జ్వాలాతోరణం ఏర్పాటు చేసినట్లు చెప్పే కథ ప్రముఖమైనది. ఈ ఉత్సవానంతరం పల్లెటూళ్ళలోని రైతులు కాలుతూ మిగిలి ఉన్న ఎండుగడ్డిని ఆర్పి, దానిని తీసుకువెళ్ళి పశువులకు వేస్తారు. దీని వలన పశువులు అభివృద్ధి చెందుతాయని భావిస్తారు.

అయితే కార్తీక పౌర్ణమి ప్రాశస్త్యానికి మూలమైన త్రిపురాసురవధలోని అంతరార్థాన్ని యోచిస్తే, మానవులు తమలోని స్వార్థపరత్వం, భ్రాంతికారకమైన విషయవ్యామోహం, అహంకారం అనే మూడు పురాలను జయించగలిగితే, మిగిలేది శివస్వరూపమే అని తెలుస్తుంది. దీన్ని అర్థం చేసుకుంటూ, ఆచరణలో పెట్టగలిగితే కార్తీక పౌర్ణమి మన జీవితాలలో విశేషమైన వెలుగు నింపుతుందనడంలో సందేహం లేదు. ❖

(నవంబర్ 6వ తేదీ, గురువారం 'కార్తీక పౌర్ణమి')

సత్యమే భగవంతుడు; ధర్మము సత్యమునందే సుప్రతిష్ఠితమై ఉంటుంది. సర్వవేదముల స్వరూపమే సత్యం. సత్యం ద్వారానే పరమార్థమును పొందడం సాధ్యమవుతుంది. -రామాయణం



పరిపూర్ణతకు మార్గం

– స్వామి యతీశ్వరానంద*

ఆధ్యాత్మిక పురోగతి కోసం ప్రయత్నించాలి. అయితే అది ఎలా సాధించాలన్న విషయంపై ప్రణాళికలు వేస్తూ ఉంటాం. అలా చెయ్యకుండా ఉండలేం. కాబట్టి క్రమక్రమంగా భగవంతుడి ఇష్టమే మన ఇష్టంగా భావించడం నేర్చుకోవాలి. భగవత్సంకల్పాన్ని అనుసరించగలగాలి.

ఒకటి గుర్తుంచుకోండి! ఎవరైతే పరిపూర్ణమైన ఆత్మార్పణను సాధిస్తారో వారు పొరపాట్లు చెయ్యరు. మనుష్యులు తరచుగా, 'అన్నీ భగవంతుడే చూసుకుంటాడు!' అని అంటారు. కానీ వారికి ఇష్టం వచ్చినట్లు ప్రవర్తిస్తారు. ప్రాపంచిక బంధాలను పెంచుకొన్నవారికి ఆత్మార్పణబుద్ధి సాధ్యం కాదు.

సాధకుడు తనకు అవసరమైన దానికన్నా దేనినీ ఎక్కువ కోరకూడదు. ధనికుడైన సాధకుడు 'ఈ ఆస్తికి నేను ధర్మకర్తను మాత్రమే' అన్న భావాన్ని పెంపొందించుకుని, దేవుడిచ్చిన దాన్ని అందరి మేలు కోసం ఎలా ఉపయోగించవచ్చునో యోచించాలి. మామూలు ఆస్తిపాస్తుల విషయంలోనే కాక, ఒకరికున్న మేధాశక్తి విషయంలోనూ, ఆధ్యాత్మికమైన శక్తియుక్తుల విషయంలో కూడా ఇది వర్తిస్తుంది. మీకు సంగీతంలో కౌశలం ఉండవచ్చు. పనిలో సామర్థ్యం ఉండవచ్చు. గొప్ప తెలివితేటలు, ఆలోచనాశక్తి ఉండవచ్చు. వీటన్నింటినీ భగవంతుడిచ్చిన బహుమతులుగా భావించి, బహుజన హితం కోసం ఉపయోగించాలి.

మానసిక ప్రశాంతత కోసం ఇప్పటినుంచే దిగులు చెందకండి. ఈ ప్రశాంతతలో కూడా రెండు రకాలున్నాయి. అహంకారాన్ని కేంద్రంగా చేసుకోవడం వల్ల కలిగేది, రెండవది భగవంతుణ్ణి కేంద్రంగా చేసుకోవడం వల్ల లభించేది. ఇతరుల పట్ల లేశమైనా జాలీ, దయా లేనివారు కూడా ప్రశాంతతతో ఉంటారు. వారికి తోటివారి కష్టాలు పట్టవు. నిశ్చలమైన స్థిరచిత్తంతో ఉన్నట్లు కనిపిస్తారు. ఈ రకమైన ప్రశాంతత ఉండేకంటే ప్రశాంతత లేకపోవడమే మంచిది. ఈ విశ్వమంతా వ్యాపించివున్న చైతన్యాన్ని కేంద్రంగా చేసుకున్నప్పుడు కలిగే అఖండమైన ప్రశాంతత మనకు కావాలి. అది భగవంతుడితో నిరంతరమైన అనుసంధానాన్ని సాధించినప్పుడే కలుగుతుంది. అది కలిగినప్పుడు మాత్రమే మనం అన్ని పరిస్థితులలోనూ ప్రశాంతంగా, నిశ్చలంగా ఉండగలం.

క్రమం తప్పకుండా సాధన చేస్తూ జీవితంలో కొంత మార్పును తీసుకురండి. ఆ పిదప 'పనియే ఆరాధన!' అన్న ఆదర్శాన్ని జీవితంలో ఆచరణలో తేవచ్చు. అయితే మీరు సంతోషంగా చెయ్యగలిగే దానికన్నా ఎక్కువ పనిని చేపట్టకండి. ఈ విషయంలో కొంత జాగ్రత్త అవసరం. ప్రారంభంలో ఈ ఆదర్శం ప్రకారం పని చేస్తున్నప్పుడు భగవంతుణ్ణి నిరంతరం స్మరించడం సాధ్యం కాకపోవచ్చు. అందుచేత పని ప్రారంభంలోనూ, పని పూర్తయినప్పుడూ మీరు చేసేదంతా భగవంతునికే సమర్పించండి.

మీరు ఏ పని చేసినా అది ఓ ఆధ్యాత్మికసాధన అని మరచిపోయినప్పుడు చేసే పని యాంత్రికంగా మారుతుంది. అలా యాంత్రికంగా చేయడం వల్ల ఉపయోగమేమీ లేదు. ఎంత చేశామన్నది కాకుండా ఎలా పని చేశాం, ఎంత నాణ్యతతో పని చేశామన్నదే ముఖ్యం.

పని చెయ్యడాన్ని ఒక ఆధ్యాత్మిక సాధనగా మలచుకోవడంలో ఇంత కష్టం ఎందుకు కలుగుతుంది? ఎందుకంటే, ఆ పనిని మనం భగవదర్పణబుద్ధితో చెయ్యలేకపోవడం వల్లనే. భగవంతుణ్ణి సాక్షాత్కరించుకోవాలన్న భావం నిరంతరం మనస్సులో మెదిలితే తప్ప అది సాధ్యం కాదు.

ఆత్మార్పణ చేసుకున్నవాడిగా ఉండమంటే తెలివితక్కువ వాడిలాగా ఉండమని కాదు. ఒకరోజు ఓ పండితుడి భార్య పని మీద బయటకు వెళ్ళవలసి వచ్చింది. తాను వచ్చేలోపల పొయ్యిమీద ఉడుకుతున్న పప్పుని చూడమని చెప్పి వెళ్ళింది. పండితుడు చూస్తున్నాడు. క్రమంగా గిన్నె నుండి పప్పు పొంగిపోసాగింది. దాన్ని ఎలా ఆపాలో తెలియక అతడు దేవుణ్ణి ప్రార్థించడం మొదలుపెట్టాడు. భార్య తిరిగివచ్చి గందరగోళమంతా చూసి భర్తతో 'దానిలో కొంచెం నూనెపోస్తే సరిపోయేది కదా!' అని తిట్టిపోసింది.

మనం భగవంతుణ్ణి సత్యమేదో, అసత్యమేదో; మంచి ఏదో, చెడు ఏదో; ధర్మమేదో, అధర్మమేదో తెలుసుకునే విచక్షణాజ్ఞానాన్ని ప్రసాదించమని ప్రార్థించాలి. ఆ భగవంతుడు మనకిచ్చిన అవగాహనాశక్తితో, ప్రయత్నలోపం లేకుండా, సాధన చేస్తూ ఉంటే భగవంతుడు మనకు పరిపూర్ణతను ప్రసాదిస్తాడు. ❖

(*స్వామి యతీశ్వరానంద – శ్రీరామకృష్ణుల ప్రత్యక్ష సన్న్యాస శిష్యులైన స్వామి బ్రహ్మానంద మహరాజ్ శిష్యులు)



నిన్ను తలచి నీ పేరు తలచి

– శ్రీమతి బి.కృష్ణకుమారి

అన్నమయ్య పదామృతం

నిన్ను తలచి నీ పేరు తలచి
నన్ను కరుణించితే నెన్నిక గాక॥
అధికుని కాచు టేమరుదు, నన్ను
నధముని కాచుట అరుదుగాక నీకు
మధురము మధురమౌటేమరుదు, చేదు
మధురమౌటే మహిలో నరుదుగాక॥
అనఘుని కరుణింప నరుదుగాదు నీకు
ఘన పాపుని నన్ను కాచు టరుదు గాక
కనకము కనకము కానేల యినుము
కనకమవుటే కడు నరుదుగాక॥
నెలకొన్న భీతితో నిన్ను చెనకితి గాక
తలకొన్న సుఖినైన తలపనేల నిన్ను
యెలమితో తిరువేంగళేశుడ నాపాల
కలిగి నీ కృప కలుగజేతువు గాక॥

ఆపన్న ప్రసన్నుడు...ఆశ్రిత పాలకుడు ఆ భగవంతుడు. మనన మాత్రం చేతనే, మనసెరిగి మనకు దారిని చూపే దయాసముద్రుడు. తోవ తప్పిన తనయుడు బుద్ధిమారి, ఇంటికొస్తే కించిత్తు కూడా కన్నెర్ర చేయక, కడుపులో ప్రేమనంతా కంచంలో అన్నంతో కలిపి ముద్దలు పెట్టే కన్నతల్లి లాంటి వాడు ఆ దయార్ద్ర హృదయుడు. ఎంతటి పాపాత్ముడినైనా, పుణ్యాత్ముడిని చేయడానికి ఆఖరిక్షణం వరకూ వేచిచూస్తూ ఉంటాడు ఆ పాపవిమోచనుడు. ఈ లోకమంతా ఏకమై, కనికరం చూపని కళంకితుడికి కూడా కట్టకడపటి దిక్కై నిలిచేవాడు ఈ దేవుడొక్కడే! ఆ శాశ్వత సత్యానికి సంకీర్తన సొబగులద్దుతూ, **'నిన్ను తలచి... నీ పేరు తలచి'** నిరీక్షిస్తూ ఉన్నానయ్యా! నన్ను కరుణించవయ్యా! అని పాడుకుంటున్నాడు పదకవితాపితామహుడు అన్నమాచార్య.

ఆ భగవంతుడిని మన పరమబాంధవుడిగా భావించుకుంటూ ఆత్మీయంగా అర్థించడం భక్తికి పరాకాష్ఠ. నిజానికి ఆయన మనకు పరాయివాడు కాదు. మనతోనే... మనలోనే ఉండి ముందుకు నడిపిస్తున్నాడు. అందుకే "భగవంతుడు మన సొంత మనిషి, ఆయనను బలవంతం చేసే హక్కు మనకుంది. చొరవతో ఆయనను ఏదైనా అడిగే అధికారం మనకుంది" అంటారు భగవాన్ శ్రీరామకృష్ణ పరమహంస. ఈ అనుబంధానికి అక్షర రూపమిస్తూ అన్నమయ్య అజరామరమైన పదాల మాలికను కూర్చి సప్తగిరులపై వెలసిన శ్రీనివాసుడికి సమర్పించుకున్నాడు.

నన్ను కరుణించితే ఎన్నిక...

పరమాత్మకు నిర్వచనం పోతపోసుకున్న ప్రేమమూర్తి. మనం పక్కవారి చిన్న పొరపాటును కూడా భరించలేక బడబాగ్నిలా రగిలిపోతూ ఉంటాం! కానీ సహనమూర్తి అయిన ఆ దేవదేవుడు, ఈ లోకంలో మనం ఎన్ని తప్పులు చేస్తున్నా తను మాత్రం ఎంతో ఓరిమితో భరిస్తూ, ఎప్పటికైనా మారకపోతారా అని ఆశతో ఎదురుచూస్తూ ఉంటాడు. కరుణాంతరంగుడి ఆ నిజతత్త్వం తెలిసిన వాడు కనుకనే అన్నమాచార్యులు...

నిన్ను తలచి నీ పేరు తలచి, నన్ను కరుణించితే నెన్నిక గాక॥

అంటూ, ఆ చరాచర సృష్టికర్తను తలచి, తలచి చనువుతో ప్రార్థిస్తూన్నాడు. నిన్ను, నీ నామాన్ని మరువకుండా జీవిస్తున్న నేను ఎన్ని కానిపనులు చేసినా, కాపాడుకుంటావనే విశ్వాసం నాకుందయ్యా! అన్న విన్నపాన్ని వేంకటేశ్వరుడి భక్తాగ్రేసరుడు ఈ రూపంగా వ్యక్తం చేస్తున్నాడు. ఇలాంటి నమ్మకమే భక్తుడికి, భగవంతుడికి మధ్య అనుసంధానాన్ని పటిష్ఠం చేస్తోంది. అలాంటి భావనతోనే శేషప్ప కవి కూడా తన 'నృసింహ శతకం'లో...

నరసింహ!నాకు దుర్జయములే మెండాయె సుగుణమొక్కటి లేదు;
దుర్బుద్ధులన్ని నాకున్నవి, నేను చేసెడివన్ని నీచకృతులు
నా వంటి పాపిష్ఠినరుని భూలోకాన పుట్ట చేసితివేల? భోగిశయన?
నా తండ్రివైన ఫలము, నేరములు కాచి రక్షించు నీవె దిక్కు

(మిగతా 34వ పేజీలో...)

'ఓ పరమేశ్వరా! నేను చేయరాని పనులెన్నో చేశాను. తండ్రీ! నన్ను క్షమించు' అని ఒక్కసారి మొరపెట్టుకో. భగవంతుడిపై విశ్వాసముంచు. తప్పక పాపవిముక్తుడవు అవుతావు. –శ్రీరామకృష్ణులు



పరిప్రశ్న

– స్వామి భూతేశానంద


(రామకృష్ణ సంఘ 12వ సర్వాధ్యక్షులు)

రామకృష్ణ సంఘ 12వ సర్వాధ్యక్షులు - స్వామి భూతేశానందజీ మహరాజ్ (1901-1998) భక్తుల ఆధ్యాత్మిక సందేహాలకు సరళమైన రీతిలో ఇచ్చిన సమాధానాలను 'శ్రీరామకృష్ణ ప్రభ' పాఠకుల ప్రయోజనార్థం 2013 జూలై సంచిక నుండి ధారావాహికంగా ప్రచురిస్తున్నాం.

భక్తుడు: భగవంతుణ్ణి ఇంట్లోనే ఉంటూ ప్రార్థించవచ్చు కదా! దేవాలయాల అవసరం ఏముంది?

స్వామీజీ: భగవంతుణ్ణి ఇంట్లో ఉంటూ ప్రార్థించవచ్చు, దేవాలయానికి వెళ్ళి కూడా ప్రార్థించవచ్చు. ముఖ్యంగా అంతా మన మనస్సుపై ఆధారపడి ఉంటుంది. ఇంట్లోనే కూర్చొని భగవంతుని మీద మనస్సును ఏకాగ్రం చేయగలిగితే మంచిదే! కానీ అలా చేయగలగడం ఎంతమందికి సాధ్యం?

సాధారణ వ్యక్తులు వినోదం కోసం సినిమాలకు, పార్కులకు, విహారస్థలాలకు వెళుతూ ఉంటారు. అలాగే భక్తులు ఆనందం పొందడం కోసం దేవాలయాలకు వెళతారు. అందరూ ఇళ్ళల్లోనే ఉంటూ భగవంతుణ్ణి ధ్యానించగలిగితే మన దేశంలో అనేక దేవాలయాలను ఎందుకు నిర్మించారు? ప్రతి ఏటా ఇంకా ఎన్నో నూతన దేవాలయాలు ఎందుకు ఆవిర్భవిస్తున్నాయి? దేవాలయాలు కేవలం శిల్పకళా సౌందర్యం, నిర్మాణకౌశలం ప్రదర్శించడానికి మాత్రమే కాదు. దేవాలయాలు భగవన్నిలయాలు. భగవత్‌శక్తి కేంద్రీకృతమైన ప్రదేశం పవిత్ర వాతావరణం సంతరించుకుంటుంది. అలాంటి అనుకూల వాతావరణంలో మనస్సు సులభంగా ఏకాగ్రమై, మనం చేసిన ప్రార్థన, జప, ధ్యానాలు శీఘ్రఫలితాలనిస్తాయి.



దేవాలయాల ప్రాముఖ్యాన్ని వివరిస్తూ స్వామి వివేకానంద ఇలా అంటారు: "ప్రతిరోజూ పవిత్ర స్థలాలను సందర్శిస్తే మనస్సు పవిత్రమవుతుంది. మనలో కామ క్రోధాల ప్రభావం తగ్గి సత్త్వగుణం వృద్ధి చెందుతుంది. తద్వారా ప్రశాంతత చేకూరుతుంది."

సర్వత్రా వ్యాపించి ఉన్న భగవంతుణ్ణి కేవలం దేవాలయంలోనే దర్శించడం ఎందుకనే సందేహం కలుగుతుంది. అందుకు సమాధానంగా "ఆవు పొదుగును పిండితే పాలు లభిస్తాయి కానీ శరీరాన్నంతా తాకితే లభించవు కదా!" అని శ్రీరామకృష్ణులు అంటారు.

దేవాలయాల్లో అనేకమంది భక్తులు సమూహ ప్రార్థనలు, భజనలు చేయడం వల్ల మనలో కూడా ఆ భక్తిభావం వృద్ధి చెందుతుంది. శ్రీరామకృష్ణులు కాశీ నగరంలో అడుగుపెట్టిన వెంటనే ఆయనకు విశ్వనాథుని దర్శనం కలిగింది. పుణ్యక్షేత్రాల ప్రభావం వల్ల మనలో నిబిడీకృతమై ఉన్న భక్తిభావం ఉప్పొంగుతుంది. భగవంతుణ్ణి సర్వకాల సర్వావస్థల యందూ స్మరించే స్థితి కలిగిననాడు మనం ఇంట్లో ఉన్నా, దేవాలయానికి వెళ్ళినా ఒక్కటే! అలాంటి స్థితి కలగనంత వరకూ పుణ్యక్షేత్రాల సందర్శనం ఆధ్యాత్మిక ప్రగతికి ఎంతైనా అవసరం.

భక్తుడు: నిష్కామకర్మ, జీవసేవే శివసేవ – ఈ రెండూ ఒక్కటేనా? భగవంతుణ్ణి సేవించడం ఎలా?

స్వామీజీ: నిష్కామకర్మ అంటే ఇతరుల నుండి ఏమీ ఆశించకుండా నిస్వార్థంగా చేసే కర్మ. జీవునిలో శివుణ్ణి సేవించడమంటే మనం సేవిస్తున్న వ్యక్తిలో సాక్షాత్తూ ఆ భగవంతుడే కొలువై ఉన్నాడన్న దృఢ సంకల్పంతో చేసే కర్మ.

భగవంతుణ్ణి ఎన్నో విధాలుగా సేవించవచ్చు. అందులో ముఖ్యంగా భగవన్నామస్మరణ చేయడం, మనకు వీలైనంత వరకూ తోటివారికి సహాయపడడం భగవత్సేవే అవుతుంది. ముఖ్యంగా ఏ పద్ధతి ద్వారా భగవంతుణ్ణి సేవించినప్పటికీ మనలో గొప్ప భక్తుడనని గానీ, ఎంతో మందికి సేవ చేస్తున్నానని గానీ అహంకారం పొడసూపకుండా జాగ్రత్త వహించాలి. అప్పుడే భగవదనుగ్రహం పొందడానికి అర్హులమవుతాం. ❖

పండుగలు - పర్వదినాలు

నవంబర్ - 2014

03	సోమవారం	: ఏకాదశి
04	మంగళవారం	: స్వామి సుబోధానంద జయంతి
05	బుధవారం	: స్వామి విజ్ఞానానంద జయంతి
06	గురువారం	: కార్తీక పౌర్ణమి
18	మంగళవారం	: ఏకాదశి
30	ఆదివారం	: స్వామి ప్రేమానంద జయంతి

డిసెంబర్ - 2014

02	మంగళవారం	: ఏకాదశి
13	శనివారం	: దివ్యజనని శ్రీశారదాదేవి జయంతి
18	గురువారం	: ఏకాదశి, స్వామి శివానంద జయంతి
24	బుధవారం	: క్రిస్టమస్ ఈవ్
27	శనివారం	: స్వామి శారదానంద జయంతి

రామకృష్ణ భక్తి సూత్రాలు

- స్వామి యతీశానంద



నారద భక్తి సూత్రాలు, శాండిల్య భక్తి సూత్రాలు భక్తియోగానికి సంబంధించిన ప్రామాణిక గ్రంథాలు. అయితే ఆధునిక తరంలో భగవదన్వేషకులకు అనువైన రీతిలో భక్తితత్త్వాన్ని బోధించారు శ్రీరామకృష్ణులు. ఈ నేపథ్యంలో 'శ్రీరామకృష్ణ కథామృతం' నుండి కొన్ని ఉపదేశాలను 'రామకృష్ణ భక్తి సూత్రాలు'గా సులభరీతిలో వివరించే ప్రయత్నం చేస్తున్నాం.

బౌద్ధగ్రంథాలు పాళీ భాషలో, బైబిల్ హీబ్రూలో, ఖురాన్ అరబ్బీ భాషలో రచించబడ్డాయి. అలాగే శ్రీరామకృష్ణుల ఉపదేశాలు వారి మాతృభాష బెంగాలీలో ఆవిష్కృతమయ్యాయి. అవతార పురుషుని ముఖతః వెలువడిన ఆ అమృతోపదేశాలను యథాతథంగా ఉట్టంకిస్తూ వ్యాఖ్యానిస్తున్నాం. మహాశక్తిమంతమైన ఆ బోధనలను మననం చేసుకుంటూ కృతార్థులమవుదాం.

జారా తాఁకే లాభ కొరేఛే, తారా
జానే దేఖితేఇ 'స్వాధీన ఇచ్ఛా'-
బస్తుత: తినిఇ జంత్రీ ఆమి జంత్ర.
తిని ఇంజినియార్, ఆమి గాడి.

'స్వాధీనేచ్ఛ' ఒక ఆభాసం మాత్రమేనని భగవత్సాక్షాత్కారం కలిగిన వారు ఎరుగుదురు. నిజానికి ఆమె (జగన్మాత) యంత్రి, నేను యంత్రాన్ని. ఆమె ఇంజనీరు, నేను వాహనాన్ని.

శ్రీరామకృష్ణ ఉవాచ: కనపడుతున్నదెల్లా జగన్మాత శక్తియే. ఆమె శక్తిని కాదని ఎవరూ ఏమీ చేయలేరు.

అందరూ భగవదధీనులే. అంతా ఆమె లీల. ఆమె వివిధ పదార్థాలను సృష్టించింది. భగవత్సాక్షాత్కారం కానంత వరకు, మనం స్వాధీనులమని భావిస్తాం. ఈ భ్రమ ఆమె సృష్టియే.

భగవత్సాక్షాత్కారం కలిగిన వారి భావం ఏమిటో తెలుసా? నేను యంత్రాన్ని, నీవు యంత్రి. నేను గృహం, నీవు గృహిణి. నేను రథం. నీవు రథి. ఏ విధంగా నడిపిస్తే ఆ విధంగా నడిచెదను. ఏ విధంగా పలికిస్తే ఆ విధంగా పలికెదను. సర్వం చేసేది ఆమెనే. ఆమె కర్త, మానవులు యంత్రాల వంటి వారు.

ఏ మాత్రం 'నేను' భావం ఉన్నా, ఆద్యాశక్తి అధీనంలోనే ఉండాలి. ఆమెను విడిపించుకుపోలేరు.

నీవు స్వాధీనుడవు కావు. ఆమె ఎలా ఆడిస్తే అలా ఆడవలసినదే.

వ్యాఖ్య: 'స్వాధీనేచ్ఛ' అనగా నాకు స్వయంగా చేసే శక్తి సామర్థ్యాలు ఉన్నవని తలవడం. నేను చేయాలంటే చేస్తాను, లేదంటే లేదు అనే తలంపు. నిజానికి మానవులకు 'స్వాధీనేచ్ఛ' అనేది ఏమీ లేదు. సర్వం భగవదేచ్ఛతోనే జరుగుతోంది. 'ఆయన సర్వం సృష్టించిన, సృష్ట పదార్థాలన్నిటిలోకి ప్రవేశించాడు' అంటుంది ఉపనిషత్తు. ఆ ఫలితంగా ప్రతి జీవిలో జడం, చేతనాశక్తి ఉంటాయి. భగవంతుడు ఒక్కడే చేతనా స్వరూపుడు. ఈ శక్తియే జీవ, జగత్తును నడిపిస్తుంది. యంత్రాలు, బళ్ళు జడమైనవి. స్వయంగా నడవలేవు. ఒక చేతనాశక్తి వాటిని నడిపించాలి కదా!

ఒకే ఒక విద్యుచ్ఛక్తి విభిన్న యంత్రాలతో విభిన్న కార్యాలు చేయిస్తుంది. ఫ్రిజ్, హీటర్, బల్బు, ఫ్యాన్ మున్నగు యంత్రాలు. ఆధునిక కాలంలో కంప్యూటర్లు, రోబోలు వాడుకలోకి వచ్చాయి. అవి ఎన్ని రకాల పనులు చేస్తాయని, అవి చేస్తున్నాయి అంటాం కానీ నిజానికి ఆదిలోనే వాటికి ప్రోగ్రామింగ్ చేసి ఉంచుతారు. ఆ విధంగానే జీవులను కూడా భగవంతుడు నడిపిస్తున్నాడు. అప్పుడు అవి పనులు చేస్తాయి, నడుస్తాయి ఎగురుతాయి, ఆలోచిస్తాయి.

'నేను' అన్నది నా శరీరం, ఇంద్రియాలు, మనో బుద్ధి, అహంకారాల సమష్టి అని తలుస్తాం. అవన్నీ జడపదార్థాలు. బ్రహ్మంలో ఉన్న చైతన్యసత్తా అన్నీ చేయిస్తుంది. అజ్ఞానం మూలంగా 'నేను చేస్తున్నాను' అంటాం.

యంత్రాన్ని నడిపేవాడు యంత్రి. బండిని నడిపేవాడు చాలకుడు. అంటే డ్రైవరు. డ్రైవరునే శ్రీరామకృష్ణ 'ఇంజనీర్' అన్నారు. అందులో తప్పు లేదు, బండిలో ఇంజను ఉంటుంది కదా!

ఈశ్వరః సర్వభూతానాం హృద్దేశే అర్జున తిష్ఠతి।
భ్రామయన్ సర్వభూతాని యంత్రారూఢాని మాయయా॥(గీత.18-61)

'అర్జునా! భగవంతుడు సర్వప్రాణుల హృదయాలలో ఉన్నాడు. తన మాయ లేదా శక్తి ద్వారా ఈ యంత్రాలలో ఉంటూ వాటిని నడిపిస్తున్నాడు.'❖

అనువాదం: డాక్టర్ కమల జయరావు

యోగమాయ అంటే ప్రకృతి పురుషుల సంయోగం. ఈ లోకంలో కనిపించే సర్వం ఈ ప్రకృతి పురుష సంయోగమే! యోగమాయ ప్రభావంచేత సృష్టి స్థితి లయలు జరుగుతున్నాయి. -శ్రీరామకృష్ణులు

జపం... మనోతపం

– చక్కిలం హేమంత్ కుమార్

యజ్ఞాల్లో జపయజ్ఞం మహత్తరమైంది. అంతరంగ యజ్ఞ కుండంలోకి జపించే మహామంత్రాన్ని హవిస్సుగా సమర్పించే మహత్వపూర్ణ ఉపకరణం జపమాల. జపించేవారికి, జపానికి అనుసంధానమైనది జపమాల.


జపమాలను రంగు దారాలతో గోముఖం కుట్టబడిన చిన్న సంచీలో వేసుకుని భద్రపరచుకుంటారు. చాలా మంది సంచీ మూతికి అమర్చిన చిన్న తాళ్ళతో కుడిచేతి మణికట్టు దగ్గర చుట్టుకుని, సంచీలో హస్తాన్ని ఉంచి సంచీలోని జపమాలను వేళ్ళతో తిప్పుతూ జపం చేస్తూ ఉంటారు. లేదా ఉత్తరీయం చాటునో, స్త్రీలైతే కొంగుచాటునో మాలను ఉంచుకుని జపం చేస్తారు. జప సమయంలో మాల ఇతరుల కంట పడకూడదు.

జపమాలను రుద్రాక్షలు, తులసిపూసలు, గంధం పూసలు, స్ఫటికాలు, తామర మణులు (విత్తనాలు), బంగారు పూసలతో అల్లుతారు. శివ మంత్ర జపానికి రుద్రాక్షలను విధిగా వాడతారు. విష్ణు రూప దేవతా జపానికి తులసిమాలలు, లక్ష్మీనామానికి తామర మణులను ఉపయోగిస్తారు. మాలను ఉపయోగించే అవకాశం లేనివారు లెక్క కోసం వక్కలు, పసుపు కొమ్ములు వాడతారు. వేళ్ళతో లెక్కించడమూ ఉంది.

అమాయకంగా మన చేతి మడుపుల్లో ఒదిగిపోయి, సంచీలోకి జారిపోయి, వినయంగా ముడుచుకుని ఉండే జపమాల, మనం జపానికి సిద్ధమై బయటికి తీయగానే పుట్టలోని మహాసర్పంలా, మూలాధారంలోని కుండలినీ శక్తిలా సహస్రారానికి ఎగసేందుకు ఆయత్తమౌతుంది... కాదు... సాధకుణ్ణి ఆయత్తం చేస్తుంది. ఒకటి లేదా రెండు చదరపు అడుగుల దర్భాసనం మీద పద్మాసనంలో కూర్చొన్న ఓ సాధకుడు... నయనాలు పూరేకుల్లా మృదువుగా మోడ్చి ఏం చేస్తున్నాడు? నిద్రపోతున్నాడా? విశ్రాంతి తీసుకుంటున్నాడా? కలలు కంటున్నాడా? కలం, కంప్యూటర్, సెల్‌ఫోన్, మరో పనిముట్టు, మరే పనిముట్టు... ఏమీ లేదు. అతను అంతరంగంతో పనిచేస్తున్నాడు. ఆంతర్యంతో పరిశోధిస్తున్నాడు. అతని సమస్య అరిషడ్వర్గాలు, ఇంద్రియాలు, విషయవిషాలు, బంధాలు... ఇంతోటి వైరివర్గాన్ని అతనెలా ఎదుర్కొంటాడు. యుద్ధక్షేత్రమేది? సేనావాహిని ఏది? గజాశ్వదళాలేవి? ఆయుధాలేవి? పోనీ... ఆధునిక మానవుడు... బాంబులు, మిసైల్స్, స్కడ్స్, పేట్రియాట్స్, యుద్ధవిమానాలు... ఏవీ? అతను ఆస్తికుడు, సాధకుడు. అతనికి బాహ్య యుద్ధ సంచయం అక్కర్లేదు. అతను బాహాబాహీ యుద్ధం చేయడు. అతనికి అనంతమైన ఆంతర్య క్షేత్రముంది. సహనం, క్షమ, విచక్షణ, వైరాగ్యం, నిత్యానిత్య వస్తు వివేకం, భక్తి, జ్ఞానం అనే అత్యంత సాత్విక యుద్ధ సంచయం ఉంది. జపం, ధ్యానం అనే బ్రహ్మాస్త్రాలున్నాయి. ఇవన్నీ విజృంభించినప్పుడు శత్రుబలం అసలు సమవుజ్జీ కూడా కాలేదు.

ఇక యుద్ధ మెక్కడిది? అతని యుద్ధం నిజానికి యమ నియమ సాధనతోనే ఆగిపోయింది. పూర్తి అయిపోయింది. అరిషడ్వర్గాలతో, విషయాలతో, శషభిషలతో, ప్రస్తుతం ప్రశాంత మానసంతో ప్రపంచపుటంచులు దాటి పరిశీలిస్తున్నాడు. పరిశోధిస్తున్నాడు. సంసారం సారహీనం... తెలిసిపోయింది. మమకారాలు మాలిన్య సమానాలు... అర్థమైపోయింది. మిగిలినది? సారభూతమైనది? శాశ్వతమైనది? సత్యం... పరమార్థం... అనంతం. దాని కోసమే అన్వేషణ. తల్లి కోసం బిడ్డలా! ఆవు కోసం దూడలా! బయట పడడం కోసం నీట మునిగిపోతున్న వాడిలా!

ఈ యుద్ధం అందమైనది. ఆవేదనా పూరితమైనది. అయినా ఆపలేనిది. ఎదురీత ఆటంకాల అలలు, అడ్డంకుల మొసళ్ళు, ఆరళ్ళ సర్పాలు. కానీ ఈదాలి. ఆవలి ఒడ్డుకు చేరాలి, తప్పదు. ఎందుకంటే తానున్నది నడిసముద్రమని తెలుసుకున్నవాడు కాబట్టి. తెలీనివాడు చుట్టూ కనిపిస్తున్న ముత్యాలు, పగడాలను చూస్తూ మురిసిపోవచ్చు. అందమైన జలచరాలను చూస్తూ ఆనందపడిపోవచ్చు. కానీ మిగిలిన ఆపద కారకాలు? ముంచి వేసే ప్రమాదకారణాలు? తప్పకుండా వాటిని అధిగమించే ప్రయత్నం చేస్తాడు, చేయాలి. సాధకుడూ అంతే, ప్రాణాల్ని పణంగా పెట్టి చేస్తున్నాడు. ప్రాణాలు పోయినా ఫరవా లేదు. మిగిలిన ప్రయాణం వచ్చే జన్మకు అనుకునే ఆశాజీవి. ఎందుకంటే ఆధ్యాత్మిక సాధనకు అంతం లేదు. జనన మరణాలు జన్మపరంపరలు ఈ ప్రయాణాన్నీ, ప్రయత్నాన్నీ ఆపలేవు... గమ్యం చేరే దాకా! ❖



నేతి గారెలు నేర్పిన నీతి!

భారతదేశంలో అడుగడుగునా సన్న్యాసులు కనపడుతారు. కాషాయరంగంటే ఈనాటికీ ఎంతో గౌరవం. ఆ రంగు సర్వసంగ పరిత్యాగానికి చిహ్నం. భగవల్లాభానికై నిరంతర సంగ్రామం. ఈ మార్గం ఒక్కొక్కసారి నల్లేరు బాట, మరి కొన్నిమార్లు రాళ్ళు రప్పలు, ముళ్ళతో నిండినది. బోర్లాపడే ప్రమాదం ఉండనే ఉంటుంది. జన్మజన్మల కోరికలు, వాసనలు తెగనరికి, ముందుకు పోతేనే చందనం, మణిమాణిక్యాలు దొరకుతాయి. పోతే, చిన్న చిన్న కోరికలు ఎరచూపి మహామాయ సాధకుని చిత్తాన్ని హరిస్తుంది.

ఒక యువ సన్న్యాసి, అడవి నడుమ చిన్న పర్ణశాలలో వసిస్తున్నాడు. పూర్తి నీరవం, పక్షుల కిలకిలరావాలు మాత్రమే వినిపిస్తాయి. అడవి మృగాల ఉపద్రవం లేదు. దగ్గరలోనే స్వచ్ఛమైన నీటికొలను. పచ్చగడ్డి, పెద్ద పెద్ద చెట్లు, సురభిళ్లే పుష్పాలు. భగవంతుని ఈ మహిమను గురించి చింతిస్తే, మనస్సు సహజంగా అంతర్ముఖమవుతుంది. మధ్యాహ్నం ఊళ్ళోకి వెళ్ళి భిక్ష తెచ్చుకుంటాడు ఆ సన్న్యాసి. దినమంతా జపధ్యానాలు, లేదా ప్రకృతి శోభను ఆస్వాదించడం. అదొక ఏకాంత జీవనం. ఎవరి మాయ ఇంత సుందరమో,ఆయన మరెంత సుందరుడో! దర్శనమిస్తాడా?

ఉన్నట్లుండి ఒకనాడు చిన్నపిల్లల నవ్వులు, కబుర్లు వినపడ్డాయి. పొరుగూరి పిల్లలు ఈ పర్ణశాలను కనుగొన్నారు. ప్రతి దినం ఆయన కోసం తినుబండారాలు తెస్తారు. అవే తిని ఉంటున్నాడు. ఉదరం పూర్తిగా నిండాలనే చింత లేదు. ఇక భిక్షకు పోవడం లేదు. కాలం గడచిపోతున్నది.

ఒక దినం పర్ణశాల పక్కనే పెద్ద కోలాహలం. వెలుపలకు వచ్చి చూశాడు సన్న్యాసి – ఇప్పటికి యౌవనం గడచిపోయింది. పిల్లలు ఒకరి చేతి నుండి మరొకరు ఏదో లాగుకొని తింటున్నారు. 'ఏమిట్రా ఈ గోల?', 'మాలో ఒకరు ఇంటి నుండి నేతి గారెలు తెచ్చాడండి. తింటున్నాము.'

కమ్మని నేతి వాసన ముక్కుపుటాలకు తాకింది. ఎన్నాళ్ళయిందో – కరకరలాడే, ఎర్రగా వేగిన నేతి గారెలు తిని! ఒక్కసారి మళ్ళీ తినాలి. ఆ రాత్రంతా ఈ ఒక్క ఆలోచనతో గడచింది. దీని నుండి విడుదల ఎలా? ఒక్కసారి తింటే సరి, ఇక మళ్ళీ ఆ కోరిక రాదు. ఆలోచన – వెనువెంటనే కార్యాచరణ. గ్రామం వైపు బయలుదేరాడు. ఇన్ని ఏళ్ళ తర్వాత ఎంత నడచినా, ఇంకా అడవి దారే. దారి తప్పానా? ఆకలి, ఆపై నాలుక ఎండుకు పోయింది. ఒక చిన్న మెరుపు లాంటి కోరిక ఎంత విపత్తు తెచ్చింది. సరే! నిద్ర సర్వచింతాహరం. ఒక చెట్టు నీడలో పడుకొని, కన్నులు మూసికొన్నాడు.

అప్పుడే ఒక దొంగల ముఠా ప్రక్క నుండి పారిపోతోంది. వెనుక రాజభటులు వస్తున్నారు. దొంగిలించిన సొమ్ము మూటను సన్న్యాసి ప్రక్కన పడవేసి పోయారు. భటులు వచ్చి సన్న్యాసి చేతులకు బేడీలు వేశారు. 'ఛీ ఛీ, సన్న్యాసి వేషం వేసి, దొంగతనాలు చేస్తున్నావా? నీ వంటి వారి మూలంగానే రాజ్యం సర్వనాశనం అవుతోంది' అంటూ తీసుకుపోతున్నారు.



రాజధానిలోకి ప్రవేశించారు. జనం నిలబడి చూస్తున్నారు. సన్న్యాసి ఒక దొంగ అని విని గుంపు మరింత పెద్దది అయింది. సిగ్గుతో తల ఎత్తలేకపోయాడు సన్న్యాసి. అప్పుడు గుర్తుకు వచ్చాడు ఇష్టదైవం. లజ్జాహరణా! మధుసూదనా! ఎక్కడ ఉన్నావయ్యా!

హఠాత్తుగా ఒక గంభీర కంఠస్వరం వినవచ్చింది. 'ఆగండి' ఎవరనుకొని పట్టుకుపోతున్నారు? అతను సన్న్యాసి. కనబడటం లేదూ?' 'కాదండి! వీడి దగ్గరే దొంగిలించబడిన సొత్తు దొరికింది'. 'పడుకొని నిద్రపోతున్నాడు కదా? మూట పెట్టుకొని దొంగ నిశ్చింతగా నిద్రపోగలడా? అటు పొండి! అసలు దొంగలు దొరకుతారు'.


సన్న్యాసి ఆ మాటలు విని మెల్లగా తల పైకి ఎత్తాడు. ఎదుట జటాజూటధారి అయిన ఒక సౌమ్యమూర్తి. ఆయన దగ్గరగా వచ్చి, 'చూడు నాయనా! ఒక చిన్న కోరిక మూలంగా ఎంత ఇబ్బందిలో పడ్డావో కదా! కోరికలే పరమ శత్రువులు, నిరీహుడవు కమ్ము, నాయనా! భగవల్లాభం ప్రాప్తిస్తుంది'.

ఆ మహాపురుషుడు గుమిగూడిన జనం వైపు తిరిగి 'నిష్కారణంగా సన్న్యాసిని అవమానించారు. తీసుకు వెళ్ళి, సత్కారం చేయండి. సన్న్యాసికి తనివితీరా నేతి గారెలు తినిపించండి' అని చిన్నగా నవ్వుతూ అన్నాడు. సన్న్యాసి కంట కృతజ్ఞతాపూర్వక భాష్పాలు. ❖

అనువాదం : డాక్టర్ కమల జయరావు

(శారదా మఠం – బెంగాలీ మాసపత్రిక 'నిబోధత' నుండి)

ఆశకు దాసులైనవారు లోకమంతటికీ దాసులే. ఆశ ఎవరికి దాసి అవుతుందో వారికి లోకమంతా దాసీభూతమవుతుంది. ఆశకు బందీకానివారే పరమపథానికి అర్హత సాధించినవారౌతారు-సూక్తి వారధి



మనిషి భగవంతుని విషయంలో కూడా వ్యతిరేక భావాలనే గ్రహిస్తాడు. శ్రీకృష్ణుడికి పదహారుమంది భార్యలు. ఇంకా చెప్పాలంటే పదహారు వేల మంది గోపికలు కూడా ఉన్నారు. అటువంటప్పుడు మనం ఎంతమందితో తిరిగితేనేం? ఇది మనిషి ఆలోచన. ఏనాడైనా ఈ పదహారు మంది ఎవరు? పదహారు వేల మంది గోపికలు అంటే ఎవరు? అని ఆలోచించామా?

మనలో ఉండకూడనివి...

– శ్రీమతి భమిడిపాటి బాలాత్రిపురసుందరి

మనిషిలో కామ క్రోధ లోభాలు ఉండకూడదు. అవి లేకుండా చేయడం కోసమే భగవంతుడు అవతారాలెత్తాడు. రావణుడిది కామస్వభావం. శిశుపాల దంతవక్త్రులది క్రోధ స్వభావం, హిరణ్యాక్ష హిరణ్యకశిపులది లోభ స్వభావం. అందుకే భగవంతుడు రామునిగా అవతరించి రావణాసురుణ్ణి చంపేశాడు. అంటే, కామం పనికిరాదని తెలియజెప్పాడు. కామం కంటే తీవ్రమైంది క్రోధం. కనుక, శిశుపాల, దంతవక్త్రుల్ని సంహరించడానికి కృష్ణావతారం ఎత్తాడు.

మానవుని ఉద్రేకాల్లో తీవ్రతరమైంది లోభం. దాన్ని అంతరింపజెయ్యడానికి రెండు అవతారాలు ఎత్తాడు భగవంతుడు. హిరణ్యాక్షుణ్ణి చంపడానికి వరాహావతారం ఎత్తాడు. 'వర' అంటే శ్రేష్ఠం, 'అహం' అంటే దినం. శ్రేష్ఠమైన దినం అంటే జ్ఞానప్రాప్తి కలిగిన సమయం అని అర్థం. జ్ఞాన ప్రాప్తి అయ్యే వరకు అజ్ఞానం ఉంటుంది అని తెలియజెప్పడమే దీని సారాంశం. వరాహావతారం ఎత్తే వరకు హిరణ్యాక్షుడు ఉన్నాడు. హిరణ్యకశిపుడు అంటే అహంకారం. అతణ్ణి సంహరించడానికి నృసింహావతారం ఎత్తాడు భగవంతుడు.

ప్రశాంత జీవితం గడపాలంటే మనిషికి నిగ్రహం చాలా అవసరం. కామక్రోధాదుల్ని వశంలో పెట్టుకోవాలి. దాని ద్వారా మహాత్ముల సాంగత్యం లభిస్తుంది. వారు జ్ఞాన ప్రాప్తిని కలుగజేస్తారు. ఎప్పుడూ కోపంతో రగిలిపోవడం ఆత్మఘాతుక చర్య అవుతుంది. మనస్సును ప్రసన్నంగా పెట్టుకుని జీవితం ఆనందమయం చేసుకోవాలి. త్యాగంతో లోభాన్ని చంపాలి. వినయంతో అహంకారాన్ని చంపాలి. జీవితాన్ని పవిత్రమయంగా చేసుకుంటూ భక్తిజ్ఞానాల్ని పొందాలి.

శ్రీకృష్ణుణ్ణి హృషీకేశుడు అంటారు. హృషీకము అంటే ఇంద్రియం. హృషీకేశుడు అంటే ఇంద్రియాలకు నాథుడు. మనిషికి ఇంద్రియాలు ఎన్ని ఉన్నాయి? పంచ జ్ఞానేంద్రియాలు, పంచ కర్మేంద్రియాలు, పంచ ప్రాణాలు, అంతఃకరణం కలిసి పదహారు. వీటినే శ్రీకృష్ణుని భార్యలుగా చెబుతున్నారు. 'కర్షయతీతి కృష్ణః' అని అర్థం. అన్నిటినీ తనవైపు ఆకర్షించేవాడు కనుక హృషీకేశుడయ్యాడు.

పదహారు వేలు అంటే ఏమిటి? ఇప్పుడు మనం చెప్పుకున్న పదహారు ఇంద్రియాలకు ఒక్కొక్కదానికి వేల రూపాలు ఉన్నాయి. కన్ను చూసేది వేలకొద్దీ రూపాలు. చెవి వినేది వేలకొద్దీ శబ్దాలు. ఈ విధంగా అనంత స్వభావాల్ని అర్థమయ్యేలా చెప్పడం కోసం వేయి అన్నారు. భగవంతుని అనంతరూపాన్ని వర్ణించేటప్పుడు కూడా 'సహస్రశీర్షా పురుషః సహస్రాక్షః సహస్రపాత్ – ఆయనకు తలలు వేయి, కన్నులు వేయి, పాదాలు వేయి' అంటూ వర్ణించారు. తలలు వేయి అయినప్పుడు చేతులు రెండు వేలు, కన్నులు రెండు వేలు అనాలిగా... ఇక్కడ వేయి అంటే అనంతములైన అని అర్థం.

ఇంద్రియాలు పదహారైనా వాటి అభిరుచులు భిన్నతత్త్వాలు. భగవంతుని గురించి చదివేటప్పుడు మనిషి భగవంతుణ్ణి తనతో పోల్చుకోకుండా పరమాత్మ అంటే ఏమిటి? అనే జిజ్ఞాసతో పారాయణ చేయాలి. అప్పుడు మనస్సు భగవంతుణ్ణి చేరుకోవడానికి ప్రయత్నిస్తుంది. ఆయన లీలల్ని తప్పుగా భావించి అదే విధంగా జీవిత పారాయణ చేస్తే జన్మజన్మలకూ పరమాత్మకు దూరమవుతాం. ఈ విషయం తెలుసుకోవాలంటే 'అనుభవ పరిపాకం, జ్ఞానపరిపాకం, వయఃపరిపాకం, బుద్ధిపరిపాకం కలిగి ఉండాలి' అని అంటాడు నారదుడు. వాటిలో ఏ ఒక్కటి పొందగలిగినా మనిషి జన్మ ధన్యమైనట్లే! ❖

ద్వేషించకండి! ప్రేమించండి!!

ఏ వ్యక్తి గాని, ఏ సంఘం గాని ఇతరులతో, ఇతర సంఘాలతో సంబంధాన్ని విడనాడి, ఒంటరిగా జీవించ లేదని నా నిశ్చితాభిప్రాయం. తాము గొప్పవారమనే అహంకారం చేతనో, అది ఒక మహానీతి అనే దురభి ప్రాయంతోనో ఎవరైనా ఏకాకిగా ఉండడానికి ఎప్పుడెప్పుడు ప్రయత్నిస్తారో, అప్పుడప్పుడు మహోపద్రవం సంభవిస్తుంది.

ఇతరులను ద్వేషించడం అనే పునాది మీద దేశాచారం అనే అడ్డుగోడను తన చుట్టూ నిర్మించుకోవడమే భారత జాతి పతనానికి ముఖ్య కారణమని నా అభిప్రాయం.


ఇచ్చిపుచ్చుకోవడం అనేది నియమం. భారతజాతి మళ్ళీ అభివృద్ధి చెందాలనుకుంటే మరుగున పడిపోయిన తన రత్నరాశులను విధిగా వెలికితెచ్చి, బాహాటంగా ప్రపంచంలోని ఇతర జాతులకు అందజెయ్యాలి. దానికి ప్రతిఫలంగా ఇతరులు మనకిచ్చినదాన్ని స్వీకరించడానికి సంసిద్ధంగా ఉండాలి. ఈ ఇచ్చిపుచ్చుకోవడాలు ఎంతో ఆవశ్యకాలు.

వికాసమే జీవనం. సంకోచమే మరణం; ప్రేమే జీవనం. ద్వేషమే మరణం. మనం ఏనాడు ఇతర జాతులను ద్వేషించడం ప్రారంభించామో ఆనాడే మన క్షీణదశ, మరణదశ ఆరంభమయ్యాయి. మళ్ళీ మనం ఉజ్జీవనమైన వికాసం వైపు దృష్టిని సారించకపోతే, మన వినాశనాన్ని ఏదీ అడ్డుకోలేదు.

కాబట్టి లోకంలోని జాతులన్నింటితోనూ మనం కలసిమెలసి ఉండాలి. కేవలం గుడ్డినమ్మకాల కుప్ప మీద స్వార్థపరత్వంతో తాము అనుభవింపక, ఇతరులను అనుభవింపనివ్వక కుక్క కున్న లక్ష్యమే, జీవితాదర్శమైన వందల కొద్దీ మానవుల కంటె - ఇతర దేశాలలో పర్యటించి వచ్చిన ప్రతి హైందవుడూ తన దేశానికి ఎక్కువ మంచి చేకూర్చినవాడవుతున్నాడు. పాశ్చాత్య దేశస్థులు చేసిన అద్భుత జాతినిర్మాణానికి దృఢమైన స్తంభం - వారి శీలమే. కాబట్టి అలాంటి శీలవంతులు రూపొందే వరకు మనం వీరి మీద, వారి మీద మండిపడడం వ్యర్థం.

ఇతరులకు స్వాతంత్ర్యం ఇవ్వడానికి సిద్ధపడనివారు స్వాతంత్ర్యాన్ని పొందడానికి అర్హులా? ఇతరులను చూసి ఊరకే - చిర్రుబుర్రుమంటూ - శక్తిసామర్థ్యాలను వ్యర్థం చేసుకోవడానికి బదులుగా నడుం బిగించి పౌరుషవంతులమై శాంతంగా పనిచేయడానికి పూనుకొందాం! ఎవడు దేనికి అర్హుడో, అతడు దాన్ని పొంది తీరుతాడు. దీన్ని లోకంలో ఏదీ అడ్డుకోలేదని నా దృఢవిశ్వాసం. మన ప్రాచీన భారతదేశం మహత్తరమైనది అనడంలో సందేహం ఏమీ లేదు. కానీ భావి భారతదేశం ఇంకా అధిక మహిమోపేతమై వెలస్తుందని నా నమ్మకం; సహనంలోనూ, నిర్మలత్వంలోనూ, కార్యదీక్షలోనూ మహేశ్వరుడు మనల్ని సుస్థిరుల్ని చేయుగాక! ❖





ఆకులున్నాయి. ఈ అన్ని సమాచారాల వల్ల ప్రయోజనమేమిటి? జన్మజన్మాంతరాల గురించి తెలుసుకోవడం అవసరమా?

ఏమి వాక్కులు? ఎంత నిత్యసత్యాలు! అమృతవాణి అంటే ఇదే మరి! శ్రీమహేంద్రనాథ్ గుప్తా ఈ శ్రీరామకృష్ణుల ఉపదేశ సంగ్రహానికి 'శ్రీరామకృష్ణ కథామృతం' అని ఊరకే పేరు పెట్టలేదు కదా? (బెంగాలీలో 'కథా' (కొథా) అంటే మాటలు, వాక్కులు అని అర్థం). ఆధ్యాత్మిక సాధకులం, దైవభక్తులం, అనిపించుకునే మనలో చాలా మంది శ్రీరామకృష్ణులు చెప్పిన ఈ హీనబుద్ధుల శ్రేణికి చెందినవారే! భగవత్ సాక్షాత్కారం పొందిన వ్యక్తి నిజంగా

మానవజన్మ ముఖ్యోద్దేశ్యం

– స్వామి అర్చనానంద

శ్రీరామకృష్ణ కథామృతంలో ఒక రోజు సంభాషణ ఇలా సాగింది:

భక్తుడు: మహాశయా! పునర్జన్మ నిజంగా ఉంటుందా?

శ్రీరామకృష్ణులు: 'మృత్యు సమయంలో మనిషి ఏ చింతనతో ప్రాణం విడుస్తాడో, అతడు ఆ భావాన్ని అనుసరించే మళ్ళీ జన్మించవలసి ఉంటుంది' అని భగవద్గీత చెబుతోంది. భరత మహారాజు ఆఖరిక్షణాలలో తన పెంపుడు జింక గురించి తలచినందువల్ల అతడు మళ్ళీ జింకగా జన్మించవలసి వచ్చింది.

భక్తుడు: ఇలా ఇలా అవుతుంది అని ఎవరైనా స్వయంగా చూసి చెపితేనే కదా నమ్మకం కలిగేది!

శ్రీరామకృష్ణులు: ఆ విషయం నాకేమీ తెలీదు నాయనా! నేను నా కొచ్చిన రోగాన్నే (గొంతులో ప్రారంభమైన క్యాన్సర్ వ్రణం) నయం చేసుకోలేకపోతున్నాను. చనిపోయిన తరువాత ఏమవుతుందని నీ బాధ? (ఆ చింత నాకు లేదు). నీవేదైతే మాట్లాడుతున్నావో ఇవన్నీ హీనమైన ఆలోచనలు.

భగవంతుని పట్ల భక్తి ఎలా కలుగుతుందో, ఆ ప్రయత్నం చేయి నాయనా! ఫలోద్యానంలో మామిడి పళ్ళు తినడానికి వచ్చావు. ఎన్ని వేల కొమ్మలున్నాయి, ఎన్ని లక్షల

నిర్భయుడవుతాడు. నిజం చెప్పడానికి, భగవత్ తత్త్వం నైజం తెలుపడానికి ఎవరేమనుకుంటారో, ఏమో, ఏమవుతుందో అని ఏ మాత్రం భయపడడు!

భగవాన్ శ్రీరామకృష్ణుల అమృత ఉపదేశాలలో ఈ నిర్భయత్వం అత్యంత ప్రభావితంగా ప్రత్యక్షమవుతున్నది. నిజమే కదా! జన్మజన్మలలో మనం చేసిన పాపకర్మలు, కుసంస్కారాలు, దుశ్చింతలు, షడ్వికారాలు– ఎన్నెన్నో మనతోనే ఉన్నాయి! భగవత్ ప్రార్థన, కీర్తన, జపం, ధ్యానం, సత్సంగం, సద్గ్రంథ పఠనం, నిస్వార్థ సేవ, సత్యవాక్కు, అవినీతి రహిత సంపాదన – ఇత్యాది అనుష్ఠానాల ద్వారా మనలోని మాలిన్యాలన్నీ పోగొట్టుకుని ఆ సర్వేశ్వరుని పాదపద్మాలపై నిర్మల నిశ్చల పూర్ణ భక్తిని పెంచుకోవడానికి ప్రయత్నించ కుండా మనం ఏమి చేస్తున్నాం?

పునర్జన్మ నిజంగా ఉందా? ఉంటే ఏ జన్మ లభిస్తుంది? చనిపోయిన తర్వాత పునర్జన్మ ఎత్తేటంత వరకు ఆ జీవాత్మ ఎక్కడ ఉంటుంది? ఏం చేస్తుంటుంది? ఏ రూపంలో ఉంటుంది? ఎక్కడ పుడుతుంది? ఎలా పుడుతుంది? ఆ తరువాత ఏమవుతుంది?... ఎవరిని పూజిస్తే అధిక ధనధాన్యాలు సమకూరుతాయి? ఆయురారోగ్యాలు

చేకూరుతాయి? పేరు ప్రతిష్ఠలు ఒనగూరుతాయి? ఇవండీ భక్త శిఖామణులు, ఆధ్యాత్మిక చింతనాశీలురు వేసే ప్రశ్నలు. ఇలాంటి ఆధ్యాత్మిక చింతనాపరుల గురించి శ్రీరామకృష్ణులు ఇలా అన్నారు: 'లంకలో రావణుడు మరణిస్తే అయోధ్యలో 'బేహుల' (ఒక స్త్రీ) విలపించిందట!'.

ఈనాటి ఆధునిక హైటెక్ సమాజంలో ఈ మాటలు ఎంతో నిజాలు కాదా? అనంతమైన శాంత్యానందాలను ఒసగే మన వాఙ్మయం– నాలుగు వేదాలు, ఉపనిషత్తులు, భక్తిసూత్రాలు, పురాణాలు, భగవద్గీత, ఆది శంకరుల జ్ఞానభరిత గ్రంథాలు, ఆధునిక వేదాలైన శ్రీరామకృష్ణ శారదా వివేకానందుల జీవిత చరిత్రలు, సాహిత్యం... ఇవన్నీ ఎంతమంది చదువుతున్నారు? చదివి ఎంతమంది అర్థం చేసుకొంటున్నారు? అర్థం చేసుకుని ఎంతమంది ఆచరణలో పెడుతున్నారు? లేదా ఆచరణలో పెట్టడానికి కనీస ప్రయత్నమైనా చేస్తున్నారు? ఇంతటి అపార జ్ఞాన సంపదలను విస్మరించి పాశ్చాత్యుల సంప్రదాయాలు, ఆహార్యం, ఆహారపు అలవాట్లకు బానిసలమవుతున్నాం.



భగవంతునికి దగ్గరగా చేర్చి, ఆత్మానందాన్ని అందించే మన శాస్త్రీయ సంగీతం, నృత్యాలను చులకనగా చూస్తూ వెస్టర్న్ డాన్స్ పేరుతో ఆటవిక మృగాల్లా ఎగిరి గంతులేస్తూ భుజాలెగరేస్తున్నాం! 'మేము మహా మోడ్రన్' అంటూ మురిసిపోతున్నాం!

'శ్రీరామకృష్ణ కథామృతం'లోనే ఒక భక్తుడు 'సిద్ధులు (మహిమలు) గురించి మీ ఉపదేశం సెలవివ్వండి' అని అడుగగా శ్రీరామకృష్ణులిలా బోధించారు: 'మహిమలను, సిద్ధులను ప్రదర్శించే జాలకుల వద్దకు చేరవద్దు. వారు భగవత్ సాక్షాత్కార మార్గాన్ని వీడి తిరుగాడేవారు, మార్గభ్రష్టులు. వారి మనస్సు యోగ సిద్ధులలో తగుల్కొని ఉంది. బ్రహ్మమార్గంలో మాయతో పన్నిన వలలివి. వీటితో మోసపోక మెలకువ కలిగి వర్తించండి, సిద్ధులనెన్నడూ వాంఛించవద్దు... రోగ నివారణ చేయడం, వ్యాజ్యాలు గెలవడం, నీటి మీద నడవడం మొదలైన వాటి కోసం తోడ్పడే యోగసిద్ధుల కోసం పాకులాడేవారు అల్పబుద్ధులు'.

పరమేశ్వర చరణారవిందాలను, శుద్ధభక్తి, జ్ఞానాలను తప్ప మరిదేన్నీ నిజమైన భక్తులు ఆశ్రయించరు. ఒకసారి శ్రీకృష్ణుడు అర్జునునికిలా బోధించాడు. 'నువ్వు నన్ను పొందాలనుకొంటే నీ వద్ద అష్టసిద్ధులలో ఏ ఒక్కటి ఉన్నా కృతార్థుడవు కాజాలవు'. ఎందుకంటే సిద్ధులు, మహిమలు మానవుడి అహంకారాన్ని పెంచి భగవంతుణ్ణి మరచి పోయేలా చేస్తాయి.

ఒకడు పధ్నాలుగు సంవత్సరాలు అరణ్యంలో ఘోర తపస్సు చేసి చివరకు నీళ్ళ మీద నడవగల సిద్ధిని సముపార్జించాడు. ఈ సిద్ధి లభించిన బ్రహ్మానందంలో గురువు వద్ద కెళ్ళి ఇలా అన్నాడు: "గురుదేవా! నేను నీళ్ళ మీద నడిచే మహిమను పొందాను!"

అందుకు ఆ గురువు, "ఛీ ఛీ! పధ్నాలుగేళ్ళు పడిన శ్రమ, తపస్సుకు ఇదా ఫలం? నువ్వు సంపాదించిన శక్తి పావలా విలువ చెయ్యదు. పధ్నాలుగేళ్ళు కష్టపడి నువ్వు చేసిన ఈ కార్యాన్ని సామాన్య మానవులు ఒక పావలా ఇచ్చి పడవ సహాయంతో నదిని దాటగలరు" అని శిష్యుణ్ణి చీవాట్లు పెట్టాడు. కావున సాధకులు, భక్తులు సిద్ధులను అశుద్ధం మాదిరి త్యజించాలి. సిద్ధుల మీద మనస్సు నిలిపేవారు వాటిలో తగుల్కొని ఇక పురోభివృద్ధి పొందలేరు."


మరి మన సంగతేమిటి? ఎవరైనా మంచి సాధకులు, సాధువులు నిజంగా నిస్వార్థంగా భక్తి, జ్ఞానాలను బోధిస్తూ, ఉపనిషత్తులు, గీత, రామాయణాది గ్రంథాలు, భజన కీర్తనలు నేర్పిస్తూ పవిత్రంగా జీవిస్తూంటే వారిని చులకనగా చూస్తాం. ఎన్నో విధాలుగా విమర్శిస్తాం! 'ఆ! వారి దగ్గరికెళితే మనకేం వస్తుంది!' అంటూ పెదవి విరుస్తాం!

భగవాన్ శ్రీరామకృష్ణుల జీవనదాయక ఉపదేశాలను, వారి దివ్య జీవిత చరిత్రను చదవకుండా, అర్థం చేసుకోకుండా, ఏవేవో వ్యర్థ ప్రాపంచిక విషయాలలో మునిగి తేలుతున్న వారు ఒక్కసారి ఆత్మావలోకనం చేసుకుని, ఆత్మవిమర్శ చేసుకుని, మానవ జన్మకు పరమార్థం తెలుసుకోవడానికి ప్రయత్నించాలి. 'మామిడి పండ్లు తిని ఆనందించు; ఆకులు, కొమ్మల్ని లెక్కిస్తూ కాలాన్ని వృథాగా గడిపేయకు!' అని శ్రీరామకృష్ణులు ఉపదేశించింది ఇందుకే మరి! 'సత్ చిత్ ఆనంద స్వరూపుడైన ఆ పరమాత్ముణ్ణి పొందడమే ఈ మానవజన్మ ముఖ్యోద్దేశ్యం' అన్న శ్రీరామకృష్ణుల ప్రబోధాన్ని స్మరించుకుంటూ జీవిత లక్ష్యాన్ని సాధించేందుకు ప్రయత్నిద్దాం. ❖

నిరంతర సాధన వల్ల సాంసారిక చింతలు పూర్తిగా తొలగిపోయి భగవచ్చింతన మనస్సును ఆక్రమిస్తుంది. అప్పుడు అవసానకాలంలో సైతం మనస్సులో అదే మెదలుతూ ఉంటుంది.- శ్రీరామకృష్ణులు

జీవితం ఓ మజిలీ

– స్వామి శితికంఠానంద



సమకాలీన ప్రపంచంలో మనిషికి ఉన్న అతిపెద్ద సమస్య అనారోగ్యం. ప్రపంచ వ్యాప్తంగా ఇంతకు ముందెన్నడూ లేనంతగా మనిషి మానసిక శారీరక ఆరోగ్యం రోజురోజుకూ పతనమవుతున్నది. కారణం ఆధునిక జీవితంతో పెనవేసుకుపోయిన ఒత్తిడి.

అలానే భయం, ఒత్తిడి, ఆందోళన, తాపత్రయం, నకారాత్మక ఆలోచనలు ఈ ఒత్తిడిని నిరంతరం పెంచుతూనే ఉన్నాయి. ఇలా ప్రతికూల ఆలోచనలతో, భావోద్వేగాలతో బలహీనపడిన మనసు తన ప్రభావాన్ని శరీరంపై చూపిస్తుంది.

రెండు విధాల అనారోగ్యం: ఆధి, వ్యాధి అని అనారోగ్యం రెండు రకాలు. ఆధి అంటే మానసిక రోగం. వ్యాధి అంటే శారీరక రోగం. 'వీటి ఉత్పత్తికి మూలకారణం ఏమిటి?' అన్న శ్రీరాముడి ప్రశ్నకు యోగవాసిష్ఠంలో వసిష్ఠ మహర్షి అద్భుతమైన, సశాస్త్రీయమైన వివరణను ఇస్తారు. 'ఆధి, వ్యాధి అనేవి మనిషి దుఃఖానికి కారణాలు. వీటిని తప్పించుకోగలిగితే ఆనందం. వీటిని నిర్మూలిస్తే పరమానందం. కొన్నిసార్లు రెండూ ఒకేసారి మనిషిని బాధిస్తాయి. కొన్నిసార్లు మొదటిది రెండవరోగానికి దారితీస్తుంది. ఇంకొన్ని సందర్భాలలో ఒకటి ప్రకటితమైన తర్వాత రెండవది ప్రకటితమవుతుంది. మనిషి తనను తాను తెలుసుకున్నప్పుడు మాత్రమే ఈ వ్యాధులు పూర్తిగా నివారింపబడతాయి. అజ్ఞానం లేదా విచక్షణా రాహిత్యం ఆత్మనిగ్రహావలంబనకు అవరోధంగా మారుతుంది.

మనిషి ఆకర్షణ, వికర్షణలకు లోనవుతాడు. ప్రియాప్రియాలు విపరీతంగా ఉంటాయి. 'నేను దీనిని సాధించాను. నేను ఇంకా వాటిని సాధించాల్సింది' అనుకుంటూ నిరంతరం మధనపడుతూండటం మానసిక క్లిష్టాలకు దారితీస్తుంది. శారీరక అనారోగ్యం మనోనియంత్రణలేకపోవడం వలన, భోజన, శయనాది క్రియలను నిర్దిష్ట సమయాలలో, పరిమితులలో చేయలేకపోవడం వలన కలుగుతుంది. దురలవాట్లు, చెడుసహవాసాలు, దుష్ట ఆలోచనలు..ఇవన్నీ కూడా శరీరం రోగగ్రస్తమవడంలో తమవంతు పాత్రను పోషిస్తాయి. అలానే అనారోగ్యకరమైన ఆలోచనలు శరీరంలోని ప్రాణవాయువును నాడీకేంద్రాలలో స్వేచ్ఛగా ప్రవహించనీయవు. మరి ఈ నకారాత్మక ఆలోచనలు మనసులో నిరంతరం ఎందుకు వస్తున్నాయంటే పూర్వజన్మలో చేసిన సుకృత దుష్కృతాల వలన, ఏర్పడిన సంస్కారాల వలన, అజ్ఞానం వలన, విపరీతమైన దేహభావంతో జనించిన స్వార్థం వలన. ప్రతికూల ఆలోచనల వలన నాడులలో ప్రాణవాయువు సంచారం సరిగా జరగదు. తద్వారా దేహాంగాలను నియంత్రిస్తున్న నాడులు క్షోభిస్తాయి. అంగాలు నిర్వహిస్తున్న క్రియలు సమతౌల్యాన్ని కోల్పోతాయి. ఉదాహరణకు గ్రంథులు అవి ఉత్పత్తి చేసే హార్మోనులను లేదా రసాలను అధికంగా లేదా అల్పంగా స్రవిస్తాయి.

అధికంగా స్రవించి, స్రవించి తర్వాత పూర్తిగా శక్తిని కోల్పోయి ఇక పనిచేయకుండా కూడా పోవచ్చు లేదా మోతాదులో స్రవించకుండా మిగతా జీవక్రియలు సక్రమంగా జరుగకుండా చేయవచ్చును. దేహావయవాలు, గ్రంథుల మధ్య ఒక చక్కని సమన్వయం ఉంది. మనసు ఎప్పుడైతే తీవ్రభావోద్వేగాలకు గురవుతున్నదో అప్పుడు దేహంలో కూడా మార్పులు వస్తాయి. ప్రాణసంచలనంలో తేడా వస్తుంది. అది నాడీ కేంద్రాలను ప్రకోపింప చేస్తుంది. నాడులు తమ తమ నియంత్రణలో ఉన్న అవయవాల క్రియలను ప్రభావితం చేస్తాయి. అంటే దేహంలోని అన్ని అంగాలు కూడా ఉద్విగ్నంగా ఉన్న మనసు చేత ప్రభావితమవుతాయి. తమ పనిని సక్రమంగా చేయలేకపోతాయి.

భౌతిక రోగాలు: భౌతిక రోగాలు రెండు రకాలు. అవి సాధారణ అస్వస్థత; దీర్ఘకాలికమైన రోగాలు లేదా పుట్టుకతో వచ్చిన జబ్బులు. మొదటి రకం రోగాల నుంచి మనం రోజువారీ ఔషధాలతో ఉపశమనాన్ని పొందవచ్చును. కానీ పుట్టుకతో కలిగినవి, ఇతర దీర్ఘకాలిక రోగాల వల్ల నైరాశ్యానికి గురి కాకూడదు. మనకు ఆ వైకల్యాన్ని భగవంతుడు ప్రసాదించాడని, ఆ సవాలు లేకపోతే దైవమార్గంలో ప్రవేశించడానికి మనకు ప్రేరణ లభించేదేకాదని భావించి ఆత్మసాక్షాత్కారం కోసం ప్రయత్నించాలేగానీ, దైవనింద చేయకూడదు.

మనోశరీర వ్యాధులు వ్యావహారికాలు. వీటిని సామాన్యరోగాలు అంటారు. వీటినుండి శాశ్వత ఉపశమనాన్ని పొందాలంటే జన్మయే ఒక రోగమని తెలుసుకొని జన్మరాహిత్యానికి ప్రయత్నించాలి. వసిష్ఠరామాయణంలో వసిష్ఠ మహర్షి రాముడితో అంటారు, **'ద్వివిధో వ్యాధిరస్తేహ సామాన్యః సార ఏవచ ! వ్యవహారస్తు సామాన్యః సారో జన్మమయః స్మృతః –** వ్యాధులు రెండు రకాలు. మనోదేహాల ద్వారా కలిగే వ్యాధులు సామాన్యమైనవి. జన్మను పొందటమే అసలు వ్యాధి.' ఇది ఆదివ్యాధి. ఈ మూలవ్యాధిని

నిర్మూలిస్తే శాశ్వత ఉపశమనం కలుగుతుంది. ఈ కారణ వ్యాధి నిర్మూలనయే కైవల్యం. అహంకార త్యాగం లేదా వివేక బుద్ధితో కోరికలను నిగ్రహించి ఆ స్థితిని పొందటమే మానవ జీవిత ఉద్దేశ్యం.

జీవిత ప్రయోజనం తెలుసుకోవాలి: మానవ జీవిత ప్రయోజనం, పరమార్థం అర్థం కాకపోతే మనసు నిరంతరం ఒక సందిగ్ధావస్థలో ఉంటుంది. రకరకాల సందేహాలు మనసును తొలుస్తూంటాయి. మనసులో స్పష్టత లోపించినప్పుడు ప్రాణవాయువు సంచారం నిర్దిష్టంగా ఉండదు. నాడులు ప్రకోపిస్తాయి. అప్పుడు జీవక్రియలు సక్రమంగా జరగవు. అజీర్తి, లేదా విపరీతమైన ఆకలి మొదలవుతాయి. తిన్న ఆహారం సరిగ్గా జీర్ణమవకపోతే అది విషాహారం అవుతుంది. దీర్ఘకాలిక అజీర్తి మధుమేహ వ్యాధికి దారితీస్తుంది. ఇలా ప్రాణవాయువు అస్తవ్యస్తంగా సంచలించటం రక్తపోటు, నరాల బలహీనత, కీళ్ళనొప్పులు లాంటి రకరకాల దేహరోగాలకు దారితీయవచ్చు.

సత్సాంగత్యం, ఆధ్యాత్మిక గ్రంథ పఠనం, ప్రార్థన, పరోపకారం, భగవన్నామజపం..ఇవన్నీ మన మనసుకు ప్రశాంతతను ప్రసాదించి ప్రాణవాయువు నాడుల వెంట సరిగ్గా సంచలించేటట్లు చేస్తాయి. దేహం ఎప్పుడూ ఆరోగ్యంగాఉండటానికి దోహదపడ తాయి. వ్యక్తిలో రోగనిరోధకశక్తిని పెంపొందిస్తాయి. సంకల్పశక్తి కూడా పెరుగుతుంది. ఈ సాధనలు మనిషిని భయవిరహితుడిగా కూడా చేస్తాయి. అందుకని మనిషికి మానవ జీవిత చరమ లక్ష్యంపై ఒక స్పష్టత రావాలి. జీవితంపై ఒక నిర్దిష్టమైన అవగాహన కలగాలి.

'మనం ఇక్కడెందుకున్నాం? కేవలం ఒక ఉద్యోగం సంపాదించుకొని వివాహం చేసుకొని ఒక కుటుంబి అవటమే జీవితమా? ఆ తర్వాత, అంతకు మించి ఏమన్నా ఉందా? ఎవరు ఈ ప్రపంచాన్ని సృష్టించారు? ఎందుకు సృష్టించి ఉంటారు? దేవుడంటే ఎవరు? ఆయనకు మనకు ఉన్న సంబంధం ఏమిటి? అసలు ఈ ప్రపంచంలో దుఃఖమెందుకున్నది? అసలు నేనెవరిని?' అని ప్రతి మనిషి ప్రశ్నించుకొని సమాధానాలను రాబట్టుకోవాలి. జీవితం ఒక గమ్యం కాదని అది కేవలం ఒక మజిలీ అని తెలుసుకుంటే మనం దుఃఖం నుంచి చాలావరకు ఉపశమనాన్ని పొందుతాం.

జీవిత ప్రయోజనం గురించి సరియైన అవగాహన లేనప్పుడు మనస్సు చిన్న చిన్న విషయాలనే పెద్దవి చేసి చూపుతుంది. రకరకాల సందేహాలు, అపోహలు మనసులో పేరుకుపోతాయి. స్పష్టత లోపిస్తుంది. సంశయాత్మకమైన మనస్సులో భయం, అభద్రతా భావం జనిస్తాయి. వీటితో అంతర్గత శక్తుల అమరిక చెదురుతుంది.

తాపత్రయం అనర్థదాయకం: తాపత్రయం వల్ల శాంతి ఉండదు. శాంతి లేకుండా ఆనందం ఉండదు. కాబట్టి మనం ఏది చేసినా, దేనిని సాధించాలన్నా మన మనస్సులో అనవసర ఆరాటం, ఆందోళన ప్రవేశించకుండా చూసుకోవాలి. మానసిక ప్రశాంతత దెబ్బతిననంతవరకూ మన ప్రయత్నాలన్నీ సత్ప్రయత్నా లవుతాయి. వ్యక్తిలో భయం, కంగారు, చింత ఉన్నప్పుడు చేసే ప్రయత్నం సత్ప్రయత్నమవదు. అలాంటి ప్రయత్నం మనకు ఏ ఫలాన్నివ్వకపోగా ఆరోగ్యం పాడవడం మాత్రం ఖాయం. ఒకవేళ మనం అనుకున్నది సాధించగలిగినా మనం చెల్లించిన మూల్యం వస్తువు విలువకన్నా ఎక్కువని గ్రహించాలి. అనవసర తాప త్రయంతో నవీన మానవుడు ఆరోగ్యాన్ని పోగొట్టుకుంటున్నాడు. పోయిన ఆరోగ్యాన్ని పొందడానికి సంపాదించిన ధనాన్ని ఖర్చుపెడు తున్నాడు. మళ్ళీ ఆ ఖర్చుపెట్టిన ధనాన్ని సంపాదించుకోవడానికి ఆరోగ్యాన్ని పోగొట్టుకుంటున్నాడు. అంతా మన చేతిలో ఉండదు. కానీ కనీసం మన చేతిలో ఉన్నంతవరకైనా మనం జాగ్రత్తగా చూసుకుంటే మానసిక, శారీరక ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవచ్చును.

వ్యక్తికి జీవితమంతా కుటుంబ కనీసావసరాలు తీర్చే ప్రయత్నంలోనే గడచిపోతున్నది. ఆధునిక మానవుడికి తీరిక, విరామం..ఈ రెండూ లేవు. ఆగి ఆలోచించటానికే భయపడు తున్నాడు. పరుగుతోనే జీవితం పరిసమాప్తమవుతున్నది. అదేవిధంగా ప్రయాణాలు, విరామం లేకపోవడం కూడా మనసులో ఒత్తిడిని పెంచుతాయి. అలసట జీవనం, ఆయాస మరణం.. ఇవి ఆధునిక నాగరకత మనిషికి పంచిన ప్రసాదాలు. అలానే మనిషి తనలో ఏ భయం ప్రవేశించకుండా జాగ్రత్త పడాలి. ఈ భయపిశాచం చెట్టు తొర్రలో పడి చెట్టును దహించే నిప్పుకణిక వలె మనిషిని లోపలినుంచి దహించివేస్తుంది. సందేహం భయానికి దారితీస్తుంది. భయం అజ్ఞాన ఫలం.

గమ్యం ఎటో తెలియాలి: నిర్వాణ సామ్రాజ్యానికి కాపలాదారులు నలుగురు – సంతృప్తి, విచారణ, ఆత్మనిగ్రహం, సాధు సాంగత్యం. ఈ నలుగురిని మెప్పించి ఆ సామ్రాజ్యం లోనికి ప్రవేశించాలి. ఈ ప్రయాణంలో ఉంటే మనిషి ఆనందంగా ఉండగలుగుతాడు. గమ్యం ఎక్కడికో తెలిసినప్పుడు మనసు స్థిరంగా ఉంటుంది. ఒక వ్యక్తి ఒక రహదారి కూడలి దగ్గరకు వెళ్ళి అక్కడున్న పెద్దాయనతో ఈ మార్గం ఎటువెళుతుంది? ఆ మార్గం ఎటువెళుతుంది? అని అడగటం మొదలుపెట్టాడు. అప్పుడు ఆ పెద్దాయన 'నువ్వెక్కడకు వెళ్ళాలో చెప్పు ముందు' అన్నాడు. ఆ వ్యక్తి 'నేనెక్కడికి వెళ్ళాలో నాకు తెలియదు' అని అంటాడు. వెంటనే ఆ పెద్దాయన, 'ఓహో అలా ఐతే అన్ని మార్గాలూ నీవే. నీవు ఏ మార్గంలోనైనా వెళ్ళు. నా సమయాన్ని వృథా చేయకు' అంటాడు.

కథలోని వ్యక్తిలా మనజీవితాలు ఉంటున్నాయి. తొంభై శాతం మందికి జీవితం ఏమిటో, ఎందుకో తెలియదు. అందుకని వాళ్ళను నిరంతరం భయాందోళనలు బాధిస్తూనే ఉంటాయి. ఇలాంటి సందిగ్ధంలోనే జీవితాలు గడచిపోతున్నాయి. ఇక్కడ స్పష్టత లేనప్పుడు మనస్సు నిరంతర కల్లోల సాగరంలా ఉంటుంది; శాంతిని, ప్రశాంతతను పొందదు. భయరహిత, శాంతిమయ జీవితం సౌశీల్యంతోనే లభిస్తుంది. మన పూర్వీకులు మనను వ్యక్తిత్వం, సచ్ఛీల నిర్మాణంపై దృష్టి పెట్టమన్నది అందుకే.

కనుక పరుగెత్తి పాలుత్రాగడం కన్నా నిలబడి నీరు త్రాగడం ఉత్తమమన్న సామెతను గుర్తుతెచ్చుకొని జీవితంలో అనవసర తాపత్రయాన్ని తగ్గించుకొని జనులందరూ ప్రశాంతతను పొందెదరు గాక! ❖

సదాచారం వల్ల ఆరోగ్యం వృద్ధి చెందుతుంది. దురాచారుడైన మానవుడు లోకనిందను పొందడమే కాకుండా రోగపీడితుడు, అల్పాయుష్కుడై దుఃఖాన్ని అనుభవిస్తూ ఉంటాడు. –మనుస్మృతి

బోన్సాయ్ మొక్క

– శ్రీమతి సుధామూర్తి, ఇన్ఫోసిస్ ఫౌండేషన్

ఒకసారి నేను బెంగుళూరు నుంచి బెల్గామ్‌కు రైల్లో ప్రయాణిస్తూ ఉన్నాను. నా ఎదురు సీట్లలో ఓ చిన్న కుటుంబం ప్రయాణిస్తోంది – భర్త, భార్య, కుమారుడు! పంథొమ్మిదేళ్ళ ఆ అబ్బాయిని ఆ తల్లితండ్రులు కనిపెట్టుకొని ఉన్న తీరును చూస్తూంటే ఆ దంపతులకు ఒకే ఒక సంతానంలా అనిపించింది. వారు ఆ కుర్రాడిపై చూపిస్తున్న ప్రేమను గమనిస్తూ ఉంటే, వాళ్ళిద్దరూ తమ పంచప్రాణాలు అతనిపైనే పెట్టుకున్నట్లనిపించింది.

ఏం తినాలో, ఎప్పుడు తినాలో, ఎలా కూర్చోవాలో, ఏ సబ్బు వాడాలో, ఏ చెప్పులు వేసుకొని బాత్‌రూమ్‌కు వెళ్ళాలో కూడా అన్నీ అమ్మానాన్నలే చెబుతూంటే ఆ యువకుడు చాలా అసౌకర్యానికి గురవుతున్నాడు. చెట్టంత ఎదిగిన కొడుకును కాస్తా ఓ పసిపిల్లాడిని చేసి జాగ్రత్తలు చెబుతూంటే, చుట్టుపక్కల వాళ్ళకూ చాలా ఆశ్చర్యంగా ఉంది. ఆ తల్లితండ్రులతో నేను మాటలు కలుపుతూ, 'మీరు బెల్గామ్‌కు మొదటిసారి వెళుతున్నారా?' అని అడిగాను.

'అవునండీ! మా బాబుకు బెల్గామ్ వైద్యకళాశాలలో సీటొచ్చింది. వాడిని అక్కడ చేర్చేందుకు వెళుతున్నాం. పునీత్ మాకు ఒక్కగానొక్క కొడుకు. వాడంటే మాకు ప్రాణం. అపురూపంగా పెంచుకున్నాం. బాబును ఒంటరిగా ఎప్పుడూ ఎక్కడికీ పంపలేదు. వాణ్ణి వదిలి ఉండడం ఇదే మొదటిసారి. అక్కడ హాస్టల్‌లో వాడు ఉండలేకపోతే, మేమే ఈ అయిదేళ్ళూ బెల్గామ్‌లో ఇల్లు అద్దెకు తీసుకొని ఉండాలనుకుంటున్నాం' అంటూ ఆ దంపతులు దాదాపు ఏడ్చినంత పనిచేశారు. వాళ్ళ బెంగను చూస్తుంటే నాకు జాలేసింది.



ఒక్కగానొక్క కొడుకు ఇల్లు వదిలిపోతుంటే కన్నవారు ఎంత బాధపడతారో నాకు తెలుసు. బలమైన రెక్కలొచ్చి ఎగిరేందుకు సిద్ధంగా ఉన్న పక్షుల్ని పంజరాల్లో ఎంతకాలం ఉంచగలం? మనం మన పిల్లలకు ఇవ్వాల్సిన విలువైన కానుకలు రెండే– బలమైన వ్రేళ్ళు, శక్తిమంతమైన రెక్కలు. అప్పుడు వాళ్ళెక్కడైనా ధైర్యంగా బతకగలరు. కానీ ఈ కొద్ది పరిచయంతో ఇవన్నీ వాళ్ళకు చెప్పలేక, నాలో నేను ఆలోచించుకుంటూ, వాళ్ళు చెప్పేదంతా వింటూ కూర్చొన్నాను. 'బాబుకు ఆటల్లో, పాటల్లో ఏమన్నా ప్రవేశం ఉందా?' అని అడిగాను.

'అవన్నీ ఎందుకండీ! వాడు పుట్టగానే డాక్టర్ని చేయాలనుకున్నాం' అన్నారు. అప్పుడు నాకు ఆ అబ్బాయి భవిష్యత్తును తలచుకుంటే చాలా బాధేసింది. భోజనాలయ్యాక, ఏ బెర్తుపై, ఎలా పడుకోవాలో కూడా చెప్పి మరీ కొడుకును నిద్రపుచ్చి, వాళ్ళూ కునుకుతీశారు.

ఆ తరువాత ఒక్కదాన్నీ అక్కడ కూర్చోలేక, పక్క బోగీలో ఉన్న మా స్నేహితురాలి దగ్గరకు వెళ్ళి కూర్చొని మాట్లాడుతూ టిఫిన్ బాక్సులు తీశాం. ఇంతలో ఎదురుసీట్లో కూర్చొన్న ఓ అబ్బాయి, మాతో ఏ పరిచయమూ లేకపోయినా తన బ్యాగులో నుంచి అరటిపళ్ళు తీసి మా అందరికీ ఇచ్చాడు. ఆ సంస్కారానికి మాకు ఎంతో ముచ్చటేసింది.

'నీ పేరేంటి? ఎక్కడికెళుతున్నావ్?' అని అడిగాను.

'శరత్ మేడమ్! బెల్గామ్ వెళుతున్నాను. అక్కడ మెడికల్ కాలేజీలో సీటొచ్చింది' అన్నాడు. 'చేరడానికి ఒక్కడివే వెళుతున్నావా?' అన్నాను. 'ఎక్కడికైనా ఒక్కడినే వెళతాను మేడమ్! నాకు అలవాటే' అని బదులిచ్చాడు. "మా నాన్న పోస్ట్‌మాన్, మా అమ్మ టీచర్. మా అమ్మా నాన్నలకు నేనొక్కడినే! అయినా నేనెప్పుడూ ఒంటరితనంతో బాధపడలేదు. నాకు మా ఇరుగుపొరుగు వాళ్ళందరూ తెలుసు. చిన్నప్పటి నుంచి నేను చాలా స్వతంత్రంగా పెరిగాను. చాలా చిన్నప్పుడే సైకిల్ తొక్కడం నేర్చుకున్నాను. సాయంకాలాల్లో ఆటపాటల లాంటి కార్యక్రమాల్లో పాల్గొంటాను. జీవితంలో అతి ఎప్పుడూ పనికిరాదంటూ ఉంటారు నాన్న. అందుకే ఎప్పుడూ చదువే కాకుండా కాస్త సంగీతం, ఆటలు, సాంఘిక సేవా కార్యక్రమాల వంటి వాటిపై ఆసక్తిని పెంచుకున్నాను. దీని వల్ల నాకు చాలా మేలు జరిగింది. ఇప్పుడేమాత్రం భయం లేకుండా ఎక్కడికైనా పోగలను. ఎన్.సి.సి.లో ఉన్నాను. నా జట్టుతో చాలా చోట్లకు వెళ్ళాను. నా తల్లితండ్రులు నా కోసం చాలా త్యాగం చేశారు. నా చదువు కోసం బ్యాంకులో అప్పు తీసుకున్నారు. నేను డాక్టర్‌గా ప్రాక్టీసు ప్రారంభించిన తరువాత ఆ రుణం తీర్చేస్తాను. నాకు ఆ నమ్మకం ఉంది" అన్నాడు.

'సరే! శరత్! జీవితంలో ఒక యువకుడికి అతి ముఖ్యమైంది ఏమని అనుకుంటున్నావు?' అని అడిగాను.

శరత్ వెంటనే 'స్వతంత్రం. జీవనమార్గాన్ని ఎంచుకునే స్వతంత్రం. తన కిష్టమైంది చేసేందుకు స్వతంత్రం. అయితే అది తనకూ, సమాజానికీ హానికరం కాకూడదు' అన్నాడు.

అడవిలో మానులా స్వతంత్రంగా ఎదిగిన శరత్‌కీ, అవతలి కంపార్ట్‌మెంట్‌లో తల్లిచాటు బిడ్డగా బోన్సాయ్ మొక్కలా ఎదిగిన ఆ కుర్రాడికీ ఎంత భేదం! ❖ సేకరణ: జి. సతీష్



యువవాణి

– స్వామి పరిజ్ఞేయానంద



ప్రదీప్, కళాశాల విద్యార్థి, మహబూబ్‌నగర్

ప్రశ్న: **నేను నా స్నేహితుడిలాగే చాలా కష్టపడి చదువుతున్నాను. కానీ ప్రతీసారి నా స్నేహితుడే మంచి మార్కులతో ఉత్తీర్ణుడవు తున్నాడు. అందువల్ల నా మేధాశక్తి అతడి కన్నా తక్కువనిపిస్తుంది. చదువులో పురోగతి సాధించలేకపోవడం వల్ల ఇక చదువు చాలించాలనే భావన కలుగుతుంది. నా నిర్ణయం సరైనదేనా?**

జవాబు: మీరూ, మీ స్నేహితుడిలా కష్టపడి చదువు తున్నప్పటికీ అతడిలా మంచి మార్కులు సంపాదించలేక పోవడం వల్ల అతడితో పోల్చుకొని మీ మేధాశక్తి తక్కువని నిర్ణయించుకున్నారు. మీరు చదువులో కేవలం మీ మిత్రుని కన్నా వెనుకబడినందుకు బాధపడుతున్నారు. కానీ తరగతిలో అందరి విద్యార్థుల కన్నా వెనుకబడిన ఒక విద్యార్థి గురించి తెలుసుకుంటే అతడికన్నా మీరు చాలా మేధావంతులనే నమ్మకం మీలో కలుగుతుంది.

ఉపాధ్యాయుడు ఏం చెప్పినా, ఎన్నిసార్లు చెప్పినా ఆ విద్యార్థి బుర్రకెక్కేది కాదు. చివరికి ఉపాధ్యాయుడు 'నీది వట్టి మట్టి బుర్ర, ఎందుకూ పనికిరావు' అని చీవాట్లు పెట్టాడు. అప్పటి నుండి ఆ విద్యార్థి పట్టుదలతో చదవడం ప్రారంభించాడు. మట్టి బుర్రగా ముద్రపడిన అతడు కేవలం తన తోటి విద్యార్థు లందరిలోనే కాదు ప్రపంచంలోనే అత్యంత మేధాశక్తి సంపన్నుడిగా ప్రసిద్ధికెక్కాడు. అతడు కూడా మీలాగే మిగిలిన విద్యార్థుల కన్నా తన మేధాశక్తి తక్కువనుకొని చదువు మానేద్దామని నిర్ణయించుకొనివుంటే ప్రపంచం ఓ మహోన్నత శాస్త్రవేత్తను కోల్పోయి ఉండేది. ఆ బాలుడు మరెవరో కాదు 'ఐన్‌స్టీన్'.

ఇంతకీ ఐన్‌స్టీన్ చేసిందల్లా మరింత పట్టుదలతో చదవడం, అందరికన్నా ఇంకా ఎక్కువగా శ్రమించడం. అందుకే ప్రఖ్యాత శాస్త్రవేత్త ఎడిసన్, నిజమైన మేధావిగా మారడానికి కావాల్సిన లక్షణం గురించి చెబుతూ *"Genius is one percent inspiration and ninety nine percent perspiration* - స్ఫూర్తి, అదృష్టాలపై ఒక శాతం నమ్ముకొని, తొంభైతొమ్మిది శాతం చెమటోడ్చేవాడే మేధావి" అని గుర్తుచేశారు.

'నా మిత్రుడు ఎన్ని గంటలు చదువుతున్నాడో, అన్ని గంటలు నేనూ చదువుతున్నాను కదా! మరి నేనెందుకు చదువులో వెనుకబడుతున్నాను?' అని పోల్చుకోకూడదు. ఎందుకంటే విద్యార్థికీ, విద్యార్థికీ మధ్య గ్రహణశక్తిలో తేడా ఉంటుంది. ఓ పాఠ్యాంశాన్ని అర్థం చేసుకోవడానికి ఒక విద్యార్థి గంట చదవాల్సివస్తే, అదే విషయాన్ని గ్రహించడానికి ఇంకొక విద్యార్థికి రెండు గంటల సమయం పట్టవచ్చు. అలాగే మరో విద్యార్థికి మూడు గంటల సమయం పట్టవచ్చు. కాబట్టి మీ మిత్రుడిలాగే కష్టపడి చదువుతున్నప్పటికీ మీకు మంచి మార్కులు రావడం లేదంటే అతడి కన్నా ఇంకా ఎక్కువ సమయం శ్రమించాలన్న విషయాన్ని గ్రహించాలి. అంతేగానీ చదువుకే స్వస్తిచెప్పాలన్న నిర్ణయం సరైంది కాదు.

మన గ్రహణశక్తి పెరగాలంటే చదివేటప్పుడు మధ్య మధ్యలో సెల్‌ఫోన్‌లో మాట్లాడడం, టీవీ కార్యక్రమాలు చూడడం, వృథాగా మాట్లాడడం లాంటివి చేయకూడదు. అలా చేస్తే విచలితమైన మానసికశక్తిని మరలా చదువుపై కేంద్రీకరించడానికి చాలా సమయం పడుతుంది. కాబట్టి చదువుతున్నప్పుడు మానసిక శక్తిని వేర్వేరు విషయాలపైకి పోనీయకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. అలా మనోభంగం లేని వాతావరణంలో చదివితే గ్రహణశక్తి వృద్ధి చెందుతుంది.

భారతదేశంలో మహోన్నత న్యాయవాదిగా ప్రఖ్యాతిగాంచిన శ్రీతేజ్ బహదూర్ దగ్గరకు ఒక విద్యార్థి వెళ్ళి 'సర్! మీరింత ఉన్నత స్థితికి ఎలా చేరుకోగలిగారు?' అని ప్రశ్నించాడు. 'నేను నీకన్నా గొప్ప మేధావిని' అని ఆయన చెప్పలేదు. 'నాయనా! నా విద్యార్థి దశలో (సుమారు 22 సంవత్సరాలలో) నేను ఒక్క సినిమా కూడా చూడలేదు' అని బదులిచ్చారు. అంటే ఆయన మనోవికారాలను కలిగించే విషయాలకు దూరంగా ఉంటూ చదువే లోకంగా విద్యార్థి దశను కొనసాగించారు.

అయితే ఈ అంతర్జాలయుగంలో ఉన్న నేటి విద్యార్థులకు ఇది వింతగా తోస్తుంది, అసాధ్యమనిపిస్తుంది. కానీ జీవితంలో మహోన్నత స్థితికి చేరుకున్నవారంతా శ్రద్ధ, పట్టుదలతో శ్రమిస్తే లక్ష్యాన్ని సాధించవచ్చని నిరూపించారు. అందుకే స్వామి వివేకానంద **'మనిషికీ, మనిషికీ మధ్య ఉన్న తేడా శ్రద్ధలో వ్యత్యాసమే'** అన్నారుగానీ మేధాశక్తిలో వ్యత్యాసం అనలేదు. కాబట్టి మీ స్నేహితుడికన్నా మీ మేధాశక్తి తక్కువని చింతించ కండి. ఇక చదువుకు స్వస్తి చెప్పకుండా, శ్రమను స్వాగతించండి, విజయం మీ ముంగిట నిలుస్తుంది. ❖

మథించినచో కర్రల నుంచి అగ్ని పుడుతుంది. త్రవ్వినచో భూమి నుండి జలం లభిస్తుంది. యత్నశీలురైన మనుష్యులు ఉత్సాహంతో చేసే ప్రయత్నములు ఫలించి తీరుతాయి. -స్వప్న వాసవదత్తం

మన గెలుపు మాటున...



– బి. సైదులు

తెలుగు చలనచిత్ర గీతానికి జాతీయస్థాయి గుర్తింపును తెచ్చిన ప్రముఖ గీత రచయిత ఓ సభా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సారస్వత సవ్యసాచిగా అటు పండితుల నుంచి ఇటు పామరుల వరకు ఆబాలగోపాలాన్ని అలరించ గలిగిన ఆ సాహితీమూర్తిని వేదికపై ఓ పాత్రికేయుడు "మీరు ఈ స్థాయికి చేరుకోవడానికి ఎవరు కారణమనుకుంటున్నారు?" అని ప్రశ్నించాడు. అప్పుడు ఆ గీతరచయిత ఉద్వేగంగా "నా కన్నా ఎన్నో రెట్లు ప్రతిభ ఉండీ, నాకు దక్కినన్ని అవకాశాలు దక్కక, తమ సామర్థ్యాన్ని నిరూపించుకునే మార్గాలూ తెలియక, అజ్ఞాతంగా మిగిలిపోయిన ఎందరో గేయ రచయితలే! నా అణువంత ప్రతిభనే ఆకాశమంతగా భావించి అవకాశాలిచ్చిన దర్శకనిర్మాతలకు, నా పాటలకు బ్రహ్మరథం పట్టి నా రచనా సామర్థ్యం పూలతీగై పల్లవించి పరివ్యాప్తించడానికి తోడ్పడిన ప్రేక్షకులకు నా కృతజ్ఞతలు" అని వినమ్రంగా ప్రకటించారు.

కీర్తిశేషులై దివికేగిన ఆ మహానుభావుడు ఏ లోకంలో ఉన్నా, మన తరానికే కాదు ముందు తరాలకు కూడా స్వర్ణాక్షరాలతో రాసుకొని స్మరించుకోదగ్గ సందేశాన్నిచ్చారు. ఏ ఒక్కరి విజయమైనా సంపూర్ణంగా వారి స్వార్జితమే కాదు, వారి కృషితో పాటు ఎన్నో ప్రత్యక్ష, పరోక్ష కారకాల ప్రేరణతోనే అది సుసాధ్యమవుతుందన్నది నిర్వివాదాంశం. అయితే ఈ రోజుల్లో చాలా మంది యువతీయువకులు తమ గెలుపునకు తామే కర్త, కర్మ, క్రియలని గర్విస్తూ ఉంటారు. ఆత్మాభిమానం పేరుతో అహంకారాన్నే ఎక్కువగా ప్రదర్శిస్తూ ఉంటారు.

అందుకే స్వామి వివేకానంద *"Every successful man must have behind him somewhere tremendous integrity, unknown support, tremendous sincerity with great humility, and that is the cause of his success in life* – ప్రతీ మనిషి విజయం వెనుక నిజాయతీ, సహచరుల సహకారం, నిబద్ధతతో కూడిన వినమ్రతలే కారణం" అని అంటారు.

విజయం వెనుక....: సీతాన్వేషణలో భాగంగా ఆంజనేయుడు అనితర సాధ్యమైన సాహసంతో సముద్రాన్ని లంఘించి లంకకు చేరుకున్నాడు. మారుతి మహత్కార్యానికి విస్మయపడిన వైదేహి 'నాయనా! నీ సాహసానికి సాటి ఎవరూ లేరు. ఇంత శక్తిసంపత్తులను నీవెలా సాధించావు? నీవంటి అవక్ర పరాక్రములెవరైనా ఉన్నారా?' అని సందేహాన్ని వ్యక్తం చేస్తుంది. అప్పుడు హనుమంతుడు 'నా సాహసం వెనుక ఎందరో వీరుల ప్రోత్సాహం ఉంది; వారందరూ నన్ను ఉత్తేజపరచకపోతే నేనీ సాహసకృత్యానికి పూనుకునేవాడినే కాద'ని సీతమ్మతో అంటూ...

మద్విశిష్టాశ్చ తుల్యాశ్చ సంతి తత్ర వనౌకసః ।
మత్తః ప్రత్యవరః కశ్చిత్ నాస్తి సుగ్రీవసన్నిధౌ ॥

'సుగ్రీవుని సన్నిధిలో ఉన్న భల్లూక వానరులు అందరూ నా కంటే కూడా ఘనులు, నాతో సమానులు. వారిలో నా కంటే తక్కువ వారు ఒక్కరు కూడా లేర'ని తన వినమ్రతను చాటుకుంటాడు.

అందుకే ఆ మహావీరుడు సాక్షాత్తూ శ్రీరామచంద్రుడికి ఆత్మీయసేవకుడే కాదు, ఆత్మబంధువయ్యాడు. అయితే మనం చాలా సందర్భాల్లో మన శక్తిసామర్థ్యాలకు, ప్రతిభాపాటవాలకు ఊతమిచ్చిన వ్యక్తులను విస్మరిస్తూ ఉంటాం. అదృశ్యంగా మనను ప్రోత్సహించిన, మన విజయానికి కారకులుగా నిలిచిన పరిస్థితులను, వ్యక్తులను ప్రస్తావించకుండా దాటవేస్తూ ఉంటాం.

అవకాశాలు...అనుకూలతలు : నిజానికి పరీక్షలో కానీ, ఉద్యోగంలో కానీ, ఆటపాటల్లో కానీ ఎక్కడైనా మనల్ని విజయం వరించిందంటే దానికి కేవలం మన నైపుణ్యం ఒక్కటే కారణం కాదు. పరిస్థితులు మనకు అనుకూలించి, అవకాశాలు రావడం వల్లనే మనల్ని మనం నిరూపించుకోగలిగామన్న విషయాన్ని ఎన్నటికీ మరచిపోకూడదు.

మహాత్మాగాంధీతో ఓ అభిమాని 'భారత స్వాతంత్ర్య సముపార్జనలో మీ సేవలు అనుపమానమైనవి; మీరే లేకపోతే భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చేదా?' అన్నాడట. అప్పుడు గాంధీజీ 'ఈ ఫలం, ఫలితం నా ఒక్కడిదే కాదు. ప్రపంచం దృష్టికి నేనొక్కడినే కనిపిస్తున్నాను. నన్ను ముందు నిలబెట్టి నా పరోక్షంగా ఎంతో మంది, ఈ ఉద్యమానికి సమిధలయ్యారు. నిజానికి వారందరి ప్రతినిధినే తప్పా నాదంటూ ప్రత్యేకమైన విజయమేదీ లేదు' అన్నారట. ఇలా మహానుభావులంతా తమ ఘనతను వ్యక్తిగతంగా పరిగణించుకోవడానికి ఇష్టపడరు. సాధించినదేదైనా సమష్టి ఫలితంగా భావిస్తూ, ముందుకు సాగిపోతూ ఉంటారు. తమ విజయంలో ఎందరికో భాగస్వామ్యాన్ని కల్పిస్తూ ఉంటారు.

ఈ తరంలో చాలామంది కనీసం తమ విజయంలో కుటుంబసభ్యులను, గురువులను, మార్గదర్శకులైన పెద్దలను భాగస్వాములను చేయడానికి కూడా వెనకాడుతున్నారు. అందుకే రచయిత జాన్ రస్కిన్ నిజమైన విజేతలు ముందు తమ మార్గదర్శకులను స్మరించుకొని, తరువాత తమ గురించి ప్రస్తావిస్తారు. సాధారణమైన వ్యక్తులు తమ విజయానికి అసలు మార్గదర్శకులే లేరని విర్రవీగుతారని చెబుతూ... *'I believe the first test of a truly great man is his humility* – మహోన్నత వ్యక్తిత్వానికి తార్కాణం వినయమే!' అని ఉద్ఘాటించారు.

విజయపు వేళ వినయం... : కొన్నేళ్ళ క్రితం మనదేశ వ్యవసాయ రంగంలో అత్యున్నతమైన డాక్టర్ ఎమ్.ఎస్. స్వామినాథన్ పురస్కారం ప్రపంచ ప్రఖ్యాత వ్యవసాయ శాస్త్రవేత్త, నోబెల్ బహుమతి గ్రహీత ప్రొఫెసర్ నార్మన్ బొర్లాగ్‌ను వరించింది. దేశరాజధానిలో తనకు వైభవంగా జరిగిన ఆ సన్మానోత్సవం అనంతరం బొర్లాగ్ ప్రసంగిస్తూ 'నా పరిశోధనలకు స్ఫూర్తినిచ్చిన శాస్త్రవేత్తలు భారతీయులే కావడం విశేషం. వారిలో కొందరు ఈ సభలోనే ఉన్నారు. పరోక్షంగా వారి పరిశోధనల ప్రోత్సాహం వల్లనే నేను వ్యవసాయ పరిశోధనల్లో పురోగతిని సాధించాను' అంటూ ఎక్కడో ప్రేక్షకుల్లో చివర్లో కూర్చొన్న ఆ శాస్త్రవేత్తల పేర్లను పిలిచి, వారిని సభికులకు పరిచయం చేశారు. వారికి ప్రేక్షకులు సమధికోత్సాహంతో కరతాళ ధ్వనులతో అభిషేకించేటట్లు చేస్తూ, తనూ చేతులు కలిపారు. డా.నార్మన్ బొర్లాగ్ ఈ ఉదాత్త వర్తన వైజ్ఞానికుడి విశాల హృదయానికి నిరూపణగా, నిజమైన నాయకత్వ చిహ్నంగా భావించుకోవచ్చు.

మనం జీవితంలో ఉన్నత లక్ష్యాలు సాధించాలంటే ఇలాంటి వినయంతో కూడిన విశాల హృదయాన్ని పెంపొందించుకోవాలి. ఇలా వినమ్రత జతకూడినప్పుడే మన మేధస్సు, ప్రతిభ పూలకు పరిమళమబ్బినట్లు పది కాలాల పాటు శోభిస్తుంది. కాబట్టి వివిధ రంగాలలో సమున్నత స్థానాలను అలంకరించినవారు తమకు శక్తిస్థానాలుగా నిలిచిన క్రాంతదర్శులను మరచిపోకూడదు.

పోటీకి దిగని ప్రత్యర్థులు... : మనం గెలిచామని గర్విస్తున్న చాలా పోటీల్లో సరైన ప్రత్యర్థులు బరిలోకి దిగడం లేదని గమనించాలి. ఎన్నో పరీక్షల్లో అంతంత మాత్రం పోటీదారులతోనే మనం తలపడుతున్నామని భావించుకుంటే, ఎంతటి ఘనవిజయంలో కూడా గర్వం మనకు తలకెక్కదు. నిజానికి ఎన్నో అవాంతరాలతో చివరి నిమిషంలో పోటీ నుంచి తప్పుకుంటున్న అభ్యర్థులెందరో అజ్ఞాతంగా మన గెలుపునకు దోహదపడుతున్నారు. ఇలా ఆ భగవంతుడు మనల్ని గెలిపించడం కోసం ఎందరిని ఓడిస్తున్నాడో ఆలోచిస్తే, మనలో అహంకారం అంకురించదు. అలా అని మన విజయాలలో మన ప్రమేయం ఏమీ లేదనీ, మనం నిమిత్తమాత్రులమేననీ నిరుత్సాహ పడమనికాదు. కానీ మన ప్రతి గెలుపు వెనుకా ఓ మహత్తర శక్తి పనిచేస్తుందని స్మరించుకుంటూ, ఏ విజయాన్నైనా వినమ్రంగా స్వీకరించాలి. మన సంకల్పశక్తికి సమాంతరంగా ఎన్నో సహకార శక్తులు తోడ్పడుతున్నాయని గుర్తుంచుకుంటూ అణకువతో మసలుకోవాలి. ❖

ప్రతిభకు పరోక్ష కారకులు

గణితంలో అత్యున్నతమైన పురస్కారాన్ని అందుకున్న ఓ ఆచార్యుడిని ఓ విశ్వవిద్యాలయం సన్మానించింది. 'మీరు బీజగణితం నుంచి రేఖాగణితం వరకు ఏ విభాగంలో చూసినా అద్భుతమైన మేధస్సును కనబరిచారు కదా! చిన్నప్పటి నుంచి ఇప్పటి వరకు గణితంలో మీకు దరిదాపుల్లో నిలిచినవారెవరైనా ఉన్నారా?' అని ఓ విద్యార్థి ప్రశ్నించాడు.

అప్పుడు ఆ ఆచార్యుడు గంభీరంగా మారిపోయి, తన అంతరంగాన్ని ఆవిష్కరిస్తూ "నేను మూడో తరగతి చదివేటప్పుడు నా మిత్రుడు అద్భుతంగా లెక్కలు చేసేవాడు. లెక్కలు చేయడంలో అతని వేగాన్ని మేమెవరమూ అందుకోలేకపోయేవాళ్ళం. అంత చిన్న వయస్సులో కూడా అతన్ని చూస్తే మా అందరిలో స్పర్థ తొంగిచూసేది. కానీ వాడు ముక్కుపచ్చలారని వయస్సులోనే రోడ్డు ప్రమాదంలో చనిపోయాడు. అలాగే నేను ఏడవ తరగతిలో ఉన్నప్పుడు మా తరగతిలో ఓ అమ్మాయికి గణితంలో నూటికి వంద మార్కులకు తక్కువ రావడం మేమెన్నడూ చూడలేదు. కానీ కడుపేదరికం, తల్లితండ్రులు చనిపోవడం వల్ల ఏడవ తరగతిలోనే చదువు మానేసింది.

నిజానికి వారిద్దరూ పోటీలో ఉండుంటే, నేను ఎక్కడ ఉండేవాణ్ణో! ఇలా ఎందరో స్వచ్ఛందంగా పోటీ నుంచి తప్పుకోవడం వల్లే మా లాంటి వాళ్ళం గెలుస్తున్నాం; గర్వంతో మీ ముందు నిలబడుతున్నాం" అన్నారు.

విజేతలు ముందు తమ మార్గదర్శకులను స్మరించుకొని, తరువాత తమ గురించి ప్రస్తావిస్తారు. సాధారణమైన వ్యక్తులు తమ విజయానికి తామే కారణమనుకొని అహంకరిస్తూ ఉంటారు. - జాన్ రస్కిన్



మధురగాయని మంచి మనస్సు

–సి. హెచ్. శివకృష్ణ

సుప్రభాతంతో ఆ వేంకటేశ్వరుని నిదురలేపినా... సహస్ర నామాలతో ఆ విష్ణుమూర్తిని స్తుతించినా స్వరసామ్రాజ్ఞి ఎమ్మెస్ సుబ్బులక్ష్మికే చెల్లుతుంది. ఆమె మధురగాయనే కాదు, మానవత్వం మూర్తీభవించిన మనస్విని కూడా! ఎమ్మెస్ గారి పాట ఎంత లలితమో, ఆమె మనస్సు అంత కన్నా లలితమని నిరూపించే ఉదంతాలెన్నో! ఆ సుమగాత్రి వద్ద రామజయం అనే తంబురా సహవాద్యకారుడు ఉండేవారు. ఆ కుటుంబానికి ఆ తల్లే ఆధారం. కడు పేదరికం నుంచి వచ్చిన రామజయం అంటే ఆ సంగీత సరస్వతికి ఎంతో అభిమానం.

ఇది దాదాపు ముప్ఫై ఏళ్ళ క్రితం మాట! ఒక రోజు ఎమ్మెస్ తన స్వగృహంలో సంగీతసాధన చేసుకుంటూ ఉన్నారు. ఇంతలో రామజయం పేరిట ఓ ఉత్తరం వచ్చింది. అది కేరళలోని ఓ మారుమూల గ్రామం నుంచి ఆయన తండ్రి నాయర్ రాసిన ఉత్తరం. అది అందుకొని చదువుతూండగానే రామజయం ముఖకవళికలే మారిపోయాయి. కుటుంబ అవసరాల కోసం ఆర్థిక బాధలు తట్టుకోలేక, రామజయం తండ్రి ఇంటిని తాకట్టుపెట్టి బ్యాంకులో మూడు వేల అయిదు వందల రూపాయల రుణం తీసుకున్నాడు. ఆర్థికంగా నిలదొక్కుకున్నాక రుణం తీర్చవచ్చనుకున్నాడు ఆ పెద్దాయన! కానీ అతని ఆశలు అడియాశలయ్యాయి. ఆ అప్పు కాస్త ఎనిమిదివేలయింది.

ముప్ఫై ఏళ్ళ క్రితం అంత సొమ్మంటే సాధారణ విషయం కాదు. ఈ దీనావస్థను తెలియజేస్తూ, బాధతో చెన్నైలో ఉంటున్న కొడుకు రామజయానికి తండ్రి ఉత్తరం రాశాడు. 'ఆ అప్పు తీర్చే మార్గం లేదు; బ్యాంకు అధికారులు కొన్ని రోజుల్లో ఇంటిని స్వాధీనం చేసుకుంటామన్నారు. మేమంతా రోడ్డున పడతాం. అది దైవేచ్ఛగా భావిస్తున్నాం' అని కొడుకుకు వివరిస్తూ లేఖ రాశాడు.

ఆ ఆలోచనలతో రామజయం మనస్సు కలవరపడి, కన్నీరైంది. ఇంతలో ఎమ్మెస్‌గారు పిలిచినట్లనిపించింది. రామజయం పరుగు పరుగున వెళ్ళాడు. అతని వంక చూశారామె! కళ్ళు పత్తికాయల్లా ఎర్రగా ఉన్నాయి! 'రామూ! ఏంటి సమస్య? ఆరోగ్యం బాగా లేదా?' అని అడిగారు – అమ్మలా, ఆలయంలో అమ్మవారిలా! అలా ఆప్యాయంగా అడిగేసరికి రామజయం కన్నీటి మేఘమై పోయాడు. అసలు విషయం చెప్పి భోరున విలపించాడు.

ఆ మనస్విని ఏదో ఆలోచిస్తున్నట్లు ఒక్క క్షణం కళ్ళు మూసుకున్నారు. ఆ విషయం ఏమీ మాట్లాడకుండా, రాబోయే కచ్చేరీకి సిద్ధం కమ్మంటూ కొన్ని సూచనలిచ్చి వెళ్ళిపోయారు. ఎప్పటిలా తన గదిలో సంగీతసాధనలో నిమగ్నమయ్యారు.

కొన్నాళ్ళకు ఓ సాంస్కృతిక సంస్థ సుబ్బులక్ష్మిగారి సంగీత కచ్చేరీని ఘనంగా ఏర్పాటు చేసింది. ఆ కచ్చేరికి తన తండ్రినీ, ఆయన రుణం తీసుకున్న బ్యాంకు మేనేజర్‌నూ కూడా ఆహ్వానించమని రామజయానికి చెప్పారు ఎమ్మెస్‌గారు.

ఆ రోజు సభాంగణమంతా ఎప్పటిలా ప్రేక్షకులతో క్రిక్కిరిసి పోయింది. సంగీత కచ్చేరీకి రామజయం తండ్రి, బ్యాంకు మేనేజర్ సహా ఇతర కుటుంబసభ్యులు కూడా హాజరయ్యారు. ఆ సంగీత సామ్రాజ్ఞి గానానికి ప్రేక్షకులు మంత్రముగ్ధులయ్యారు. కార్యక్రమం పూర్తవగానే కరతాళ ధ్వనులతో ప్రాంగణం మారుమోగిపోయింది. కొన్ని క్షణాలు కాగానే ఎమ్మెస్‌గారు రామజయం కుటుంబసభ్యులనూ, బ్యాంకు మేనేజర్‌నూ వేదికపైకి ఆహ్వానించారు. ఎందుకో ఎవరికీ అర్థం కాలేదు. ఇంతలో ఎమ్మెస్‌గారు తనకు ఆ కచ్చేరీలో పారితోషికంగా ఇచ్చిన ఎనిమిది వేల రూపాయలను బ్యాంకు మేనేజర్ చేతిలో పెడుతూ 'రామజయం తండ్రి నాయర్ రుణం తాలూకు సొమ్ము ఇది. దీంతో నాయర్ బాకీ తీరిపోయింది' అన్నారు.

నాయర్, రామజయాల ఆనందానికి అవధుల్లేవు. కన్నీళ్ళతో 'అమ్మా! మీరు మా ప్రత్యక్షదైవం' అంటూ ఆ స్వరధాత్రి పాదాలపై పడిపోయారు. ఇన్నాళ్ళూ 'ఎందరో మహానుభావులు అందరికీ వందనాలు' అన్న త్యాగరాజస్వామి కీర్తనను ఆలపించి మైమరపించిన ఆ మధురగాయని, ఆనాడు ఆ మహానుభావుల్లో తానూ ఒకరైనందుకు సంగీతాభిమానులు పరవశంతో హర్షధ్వానాలు చేశారు. ❖

అధికార ప్రభావం

- స్వామి రంగనాథానంద
(రామకృష్ణ సంఘం 13వ సర్వాధ్యక్షులు)



మనిషి నిజస్వరూపం, నడవడిక, మనస్తత్వం ఎలాంటివో తెలుసుకోవాలంటే అతనికి అధికారం ఇచ్చి చూడమని చెబుతారు పెద్దలు. నేను (స్వామి రంగనాథానంద) చాలామందిని చూశాను. సాధారణంగా ఎలాంటి హోదాలూ, భుజకీర్తులూ లేనప్పుడు చక్కగానే ఉంటారు. కానీ కాలక్రమంలో వాళ్ళ దశ తిరిగి స్థాయి పెరగగానే సంపూర్ణంగా వాళ్ళ ధోరణే మారిపోతుంది. ఇలా అధికారాన్నీ, హోదానూ జీర్ణించుకోవాలంటే ఎంతో మానసిక శక్తి కావాలి. అయితే మనలో చాలామందికి ఆ శక్తి చాలా తక్కువ స్థాయిలో ఉంటుంది.

''We need a philosophy to guide the holders of power. If that philosophy doesn't inspire the holders of power, he or she runs amuck, becoming inebriated by power – అధికారంలో ఉన్నవారిని మార్గదర్శనం చేయడానికి ఓ ఉదాత్తమైన తత్త్వం అవసరం. అలాంటి ఉన్నత తత్త్వం లేకపోతే అధికారం వచ్చాక మత్తు తలకెక్కి గంగవెర్రులెత్తే మద్యపాన ప్రియుల్లా మారిపోతారు".

నిజానికి ఏ కొద్దిమందో పరిణతి సాధించినవారు తప్ప, చాలామంది ఉన్నత స్థానాల్లో హుందాగా ప్రవర్తించలేరు. అప్పటి వరకు ఎంతో సౌమ్యంగా, సరదాగా, నలుగురితో కలసి తిరిగిన వ్యక్తి స్థాయి పెరగగానే తన స్వభావాన్నే మార్చేసుకుంటాడు. తనను తాను ఎక్కువగా, ఓ ప్రత్యేకమైన వ్యక్తిగా ఊహించుకుంటూ, అందరి కన్నా ఓ మెట్టు పైన ఉన్నానని భ్రమపడుతూ ఉంటాడు. ఆ హోదాతోనే నిరంతరం తాదాత్మ్యం చెందుతూ ఉంటాడు. అవకాశం కల్పించుకొని మరీ *'Don't you know who I am now?*– నేనెవరినో నీకు తెలియదా?*'* అన్నట్లు ప్రవర్తిస్తూ ఉంటాడు. అంటే ఆ వ్యక్తి ఆ హోదా తాలూకు అహంకారాన్ని తలకెక్కించు కున్నాడన్న మాట! ఇలాంటి వ్యక్తులు ఉన్నత స్థానాలకు న్యాయం చేయలేరు. ఆ పదవులకు శోభనివ్వలేరు.

అధికారాన్ని సరైన పద్ధతిలో జీర్ణించుకోలేకపోతే, ఎదుటివారి కన్నా అది మనకే ఎక్కువ హాని చేస్తుంది. అధికార వేళల్లో మన దగ్గర పనిచేసే వారు నిస్సహాయ స్థితి వల్లనో, తప్పనిసరి పరిస్థితుల్లోనో మన ముందు తలవంచవచ్చు. కానీ మనస్ఫూర్తిగా వాళ్ళు మనకు సహకరించరు. దీని వల్ల దీర్ఘకాలంలో మన నాయకత్వం ఉత్తమ ఫలితాలనివ్వదు. *That power can be political power, intellectual power, money power, or feudal power. And there is only one energy that can digest them; that is the spiritual energy within you. That fire of spirituality can digest all kinds of power* - రాజకీయంగా తీసుకున్నా, విజ్ఞానపరంగా తీసుకున్నా, సిరిసంపదల్లో తీసుకున్నా, ఆధిపత్యాన్ని జీర్ణించుకోవడానికి మనలోని ఆధ్యాత్మిక శక్తి ఒక్కటే తోడ్పడుతుంది. ఈ శక్తి వల్ల మనం ఎంతటి ఉన్నత పదవుల్లో కూడా సంయమనాన్ని కోల్పోకుండా ఉండగలం. కాలప్రవాహంలో మనకు లభించిన అధికారాలు, హోదాలు అదే కాలప్రవాహంలో కనుమరుగవుతాయని గుర్తుంచుకుంటే చాలావరకు మన మిడిసిపాటు తగ్గుతుంది.

అధికార బాధ్యతలు నిర్వర్తించేటప్పుడు మన ఆధ్యాత్మిక శక్తితో ఎప్పటికప్పుడు మన ప్రవర్తనను అంచనా వేసుకుంటూ ఉండాలి. అధికారం వచ్చాక మన అహంకారమే మనల్ని పతనావస్థకు చేరుస్తుంది. అది మన కింద ఉద్యోగులూ, మన కన్నా హోదాలో తక్కువ స్థాయిలో ఉన్నవాళ్ళు, మన అధీనంలో ఉన్నవాళ్ళు చెప్పే మాటల్ని మనం వినిపించుకోకుండా అడ్డుపడుతుంది. ఎంత ఉన్నత పదవిలో ఉన్నా నువ్వు ఎదుటివారిని అనుమానిస్తూ, అవమానిస్తూ ఎన్నటికీ ఉన్నత లక్ష్యాలను సాధించలేవు.

పనితీరులో కచ్చితంగా ఉండడానికీ, కటువుగా చెప్పటానికీ; పటిష్ఠమైన నాయకత్వానికీ, పెత్తనం చేయడానికీ; క్రమశిక్షణకూ, నిరంతరం తప్పులు పట్టడానికీ మధ్య తేడా ఉంటుంది. కానీ ఉన్నత పదవులను సమర్థంగా నిర్వహించాలంటే వీటి మధ్య తేడాను గుర్తుంచుకోవాల్సిందే! ❖

సేకరణ: ఆర్. కృష్ణ

క్షుద్రలోహమైన ఇనుము చల్లగా ఉన్నప్పుడు కఠినముగానూ, వేడిగా ఉన్నప్పుడు మెత్తగానూ ఉన్నట్లు దుష్టుల మనస్సు అధికారం ఉన్నప్పుడు కఠినముగానూ, ఆపదల యందు మెత్తగానూ ఉంటుంది. - ఆర్యధర్మ



రామకృష్ణ మఠం

'సౌత్ నాడ, అశోక పెట్రోల్ పంప్ ఎదురుగా, హరిపాడ్-690 514. అలెప్పి జిల్లా, కేరళ. ఫోన్: 09745325834;
E mail: srkmathharipad@gmail.com; viveka.vira@gmail.com; www.rkmathharipad.org

శ్రీరామకృష్ణ మఠ కేంద్ర పునర్నిర్మాణానికై విజ్ఞప్తి

కేరళ రాష్ట్రంలో శ్రీరామకృష్ణుల ఉద్యమాన్ని వ్యాప్తి చేసిన స్వామి నిర్మలానందజీ మహరాజ్, ప్రప్రథమంగా 1913లో దక్షిణ కేరళలోని హరిపాడ్‌లో రామకృష్ణ మఠ శాఖను ప్రారంభించారు. భగవాన్ శ్రీరామకృష్ణుల ప్రత్యక్ష సన్న్యాస శిష్యులైన స్వామి బ్రహ్మానందజీ మహరాజ్, రామకృష్ణ సంఘ వరిష్ఠ సన్న్యాసుల సందర్శనంతో ఈ ఆశ్రమం పునీతమైనది.



పూర్తిగా శిథిలమైన ఆశ్రమ భవనం

ఈ ఆశ్రమం స్థాపించి వందేళ్ళు గడిచాయి. కాలగతిలో ఆశ్రమంలోని భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. అందువల్ల నూతన భవనాల నిర్మాణం అత్యంత ఆవశ్యకమైనది. ఈ నేపథ్యంలో విశ్వజనీన శ్రీరామకృష్ణ దేవాలయం, కార్యాలయం, సేవా కార్యక్రమాల నిర్వహణ భవనం, గ్రంథాలయం, సాధునివాస భవనాలను నిర్మించాలని సంకల్పించాం. ఈ పథకానికి ఐదు కోట్ల రూపాయల వ్యయం అవుతుందని అంచనా వేయడం జరిగింది.



ఈ పవిత్ర సేవాయజ్ఞంలో ప్రతి ఒక్కరూ పాలుపంచుకోవాలన్న ఉద్దేశంతో ఐదు కోట్ల రూపాయలను ఉదార హృదయులైన భక్తులు, మిత్రులు, హితులైన 50,000 మంది నుండి రూ. 1,000/- చొప్పున విరాళాలను స్వీకరించదలచాం. రూ. 1,000/- కన్నా ఎక్కువ విరాళాలను కూడా ఇవ్వవచ్చును.

మీ విరాళాన్ని Ramakrishna Math, Haripad పేరున చెక్కు/ డి.డి తీసి Ramakrishna Math, South Nada, Opp.Asoka Petrol Pump, Haripad - 690514, Dist.Alleppey, Kerala చిరునామాకు పంపాల్సిందిగా మనవి. విరాళాలకు 80జి సెక్షన్ కింద ఆదాయపు పన్ను మినహాయింపు లభిస్తుంది.



రెండు గదులున్న పురాతన గోదాము - ప్రస్తుత సాధునివాసం

ఈ బృహత్ సేవా యజ్ఞానికి మీవంతు ఆర్థిక సహాయాన్ని అందించి భగవాన్ శ్రీరామకృష్ణుల కృపకు పాత్రులు కాగలరని ఆశిస్తున్నాం.

భగవత్సేవలో
స్వామి వీరభద్రానంద
అధ్యక్షులు

విరాళాలను ఆన్‌లైన్ ద్వారా కూడా పంపవచ్చు :

NEFT Transfer: Account Number - 30642551603, State Bank of India, Haripad. RTGS/NEFT/IFSC code: SBIN0010596.

విరాళాలను ఆన్‌లైన్ ద్వారా పంపించిన దాతలు తమ పూర్తి పేరు, చిరునామా, పాన్ నెంబర్, ఫోన్ నెంబర్‌తో సహా పూర్తి విరాళ వివరాలను ఈమెయిల్ srkmathharipad@gmail.com కు తెలియజేయగలరు.

Foreign Donation: Kindly draw a Cheque / Draft in favour of "Ramakrishna Math" and send it to the General Secretary, Ramakrishna Math, Belur, Dt. Howrah (West Bengal), Pin - 711 202, India.

In the covering letter please mention that it is a donation for 'Haripad Centre Building Fund' and inform all the details of the donation to e-mail:srkmathharipad@gmail.com, viveka.vira@gmail.com

Advt.,



(1884 – 1967)

ముందుకు సాగిపో!

దివ్యజనని శ్రీశారదాదేవి ప్రత్యక్ష శిష్యులైన స్వామి ప్రేమేశానంద (1884-1967) రామకృష్ణ సంఘంలో అత్యున్నత గౌరవాన్నీ, ప్రేమాభిమానాలనూ చూరగొన్న అగ్రశ్రేణి సన్న్యాసి. ఆయన జీవితం శ్రీరామకృష్ణ - వివేకానందుల ఆశయాలతోనూ, భగవద్గీత సారాంశంతోనూ నిండింది. చాలామంది యువతీ యువకులకూ, గృహస్థులకూ, బ్రహ్మచారులకూ, సన్న్యాసులకూ ఆయన ఎన్నో లేఖలు వ్రాశారు. జీవితంలో అంకితభావం, ఆధ్యాత్మిక, సేవా భావాలను అలవరచుకొనేందుకు ఆ లేఖా పరంపరలు మార్గదర్శకాలయ్యాయి. పాఠకుల ప్రయోజనార్థం విలువైన ఈ లేఖలను 'శ్రీరామకృష్ణ ప్రభ'లో 2009 జూన్ సంచిక నుంచి ధారావాహికంగా ప్రచురిస్తున్నాం.

1 ఆగష్టు 1963

ప్రియమైన బాదల్!

నీవు వ్రాసిన ఉత్తరం, పంపిన డబ్బు అందాయి. చాలా సంతోషం. 'ఆశ్రమం' అని ఉదహరిస్తూ నీవు వ్రాసినది కేవలం బాహ్యరూపం మాత్రమే. నీవు జాగ్రత్తగా పరిశీలించినట్లయితే మన పూర్వీకులు 'ఆశ్రమం' అనే పదాన్ని దేన్ని ఉద్దేశించి వాడారో దాన్ని మనమిప్పుడు చూడలేం. హైందవ జీవితోన్నతికి మన సనాతన ఋషులు నాలుగు ఆశ్రమ విధానాలను నిర్ణయించారు.

1. బ్రహ్మచర్య ఆశ్రమం (విద్యార్థి దశ): మనిషి తన శరీరాన్నీ, మనస్సునూ మలచుకోవలసిన విధానాలనూ, ఆనందమయంగా జీవించే పద్ధతులనూ నేర్చుకునే దశ.

2. గృహస్థ ఆశ్రమం (గృహస్థ దశ): ప్రపంచం గురించిన శ్రేష్ఠమైన స్వానుభవజ్ఞానాన్ని పొంది, సంసార జీవనాన్ని సాగించే దశ.

3. వానప్రస్థ ఆశ్రమం (బాధ్యతల విరమణ దశ): సంసార బాధ్యతల నుండి తొలగి, శేష జీవితాన్ని ఆధ్యాత్మిక సాధనల్లో గడిపే దశ.

4. సన్న్యాస ఆశ్రమం (పరిత్యాగ దశ): భవబంధాలను త్యజించి, ముక్తిని సాధించడానికి శారీరక, మానసిక బలాలు రెంటినీ సమీకరించి ప్రయత్నించే దశ.

మన శాస్త్రాలు ఏమి చెబుతున్నాయో తెలుసా?

'జ్ఞేయః స నిత్య సన్న్యాసీ యో న ద్వేష్టి న కాంక్షతి... – దేనినీ కోరనివాడు, దేనినీ ద్వేషించని వాడే నిజమైన సన్న్యాసి' *(గీత. 5-3)* అని భావం. ఇంకా చెప్పాలంటే శ్రీరామకృష్ణులు చెప్పినట్లు, అన్ని పరిస్థితులలోను తన ఇష్టాలు, అనిష్టాలను త్యజించి, సంపన్నుని ఇంట్లో పనిమనిషి లాగా జీవించడమన్నమాట.

మతం అన్నది కూడా ఒక 'ఇంజనీరింగ్' అని నీకు తెలియదా? ఈ శరీరం, మనస్సులతో తయారైన యంత్రం పాడైపోకుండా, అభివృద్ధి పథంలో అది పయనించేలా చూడాలి. ఒక సైకిలు త్రొక్కాలంటే దాని వివిధ భాగాలు పని చేసే విధానం తెలుసుకోవాలి గదా! సైకిలు పాడైపోకుండా, దెబ్బతినకుండా నడిపే విధానం మనం తెలుసుకుంటాం. ఇదే సూత్రం మన జీవితాలకు కూడా వర్తించదంటావా? కాస్త ఖరీదైనది, అనుభవజ్ఞులైన కంపెనీ వారు తయారుచేసినది అయిన సైకిలు అనుకో ఆ సైకిలు రక్షణకు మరింత కష్టపడాలి గదా! ఈ మానవ జీవితం కూడా అంతే? సైకిలు మీద కూర్చొని వెళ్ళే వ్యక్తి, దాని పైనుండి ఎలా దిగాలో కూడా నేర్చుకోవాలి గదా! నిజమైన సన్న్యాసం అంటే సైకిలు పైనుండి దిగిపోయే నేర్పును సాధించడానికి కృషి సల్పడమే. అంటే ఈ మనస్సు శరీరాలతో తయారైన మానవ జీవితం నుండి దిగిపోవడమన్న మాట.

మనం 'ఋషులు' అని పిలుస్తున్న మన సనాతన శాస్త్రజ్ఞులు ఈ మానవ యంత్రాన్ని నిర్మాణం చెయ్యడం, దాన్ని నడపడం, మరల దాని నుండి జాగ్రత్తగా దిగిపోవడం ఎలాగో కనిపెట్టారు. మన తాత ముత్తాతలు వర్ణాశ్రమ ధర్మాలను అనుసరిస్తూ ఈ శాస్త్రజ్ఞానం పని చేసే విధానాన్ని ఆమోదించి వారి జీవితాలను ఒక పెద్ద ఉత్సవంగా నిర్వహించుకున్నారు. అదే భారతదేశపు నిజమైన చరిత్ర.

ఈ ఇంజనీరింగ్ శాస్త్రీయ సిద్ధాంతం వేదాలలో, పురాణాలలో, మరెన్నో లెక్కలేనన్ని మత గ్రంథాలలో నిక్షిప్తమై ఉంది. దాని సారాంశమంతా శ్రీమద్భగవద్గీతలో క్లుప్తంగా వివరించబడింది. అవే భావాలను శ్రీరామకృష్ణులు 'కథామృతం'లో సులభతరంగా విశదీకరించారు.

తెలుగు సేత: *కె. త్రివిక్రమరావు*

ప్రేమాశీస్సులతో

స్వామి ప్రేమేశానంద

సన్న్యాసులు - ఇంద్రియనిగ్రహము; వానప్రస్థులు - నియమపాలన; గృహస్థులు - దానము; బ్రహ్మచారులు - గురుశుశ్రూష. ఇవి నాలుగు ఆశ్రమాల వారు పాటించాల్సిన ధర్మములు. - మనుస్మృతి

(...15వ పేజీ తరువాయి)

భూషణవికాస! శ్రీధర్మపుర నివాస!
దుష్టసంహార! నరసింహ! దురితదూర! అంటూ వేడుకుంటాడు.

నిజానికి భగవంతుడి దృష్టిలో పాపాత్ములంటూ ఎవరూ ఉండరు. పిల్లల దుర్గుణాలను తప్ప పిల్లల్ని ద్వేషించని తండ్రిలా, మనలోని పాపపు భావనలను తప్ప మనల్ని ఆయన ఎన్నడూ దునుమాడడు.

అధముని కాచుటే అరుదు...

పావనులపై కన్నా పతితులపైనే ఆ పరమాత్మ ఎక్కువ దృష్టి పెడతాడు. అన్నీ బాగున్నవారిని ఉద్ధరించడంలో ఆయన ఘనత ఏముంటుంది? అధమాధములను ఉన్నతి చేయడంలోనే ఆయన గొప్పతనం దాగి ఉంది. తేనెను తీపిగా మార్చినవాడు కాదు, కషాయాన్ని కదుతియ్యగా చేయగలిగినవాడే ఘనుడు. అంతటి అరుదైన కార్యాన్ని సమర్థంగా చేయగలిగినవాడు శేషాద్రి శిఖరాన కొలువైన ఆ సర్వేశ్వరుడేనన్న పూనికతో ఈ పదకవితా పితామహుడు....

అధికుని కాచు టేమరుదు, నన్ను,
నధముని కాచుట అరుదు గాక నీకు
మధురము మధురమౌటేమరుదు
చేదు మధురమౌటే మహిలో నరుదుగాక! అంటున్నాడు.

రామచంద్రుడి నుంచి రామకృష్ణుల వరకు ఇలా ఎన్నో అవతారాల్లో, లోకం పాపాత్ములంటూ నిరసించిన వారందరినీ ఆ పరంధాముడు పునీతులను చేసి తన ప్రేమను, ప్రత్యేకతను చాటుకున్నాడు. భక్త కవులెందరో భగవంతుడి ఈ దయాగుణాన్ని కొనియాడారు. అదే పరంపరలో పట్టాభిరాముడి ప్రియభక్తుడు త్యాగరాజస్వామి కూడా తన కష్టసమయంలో....

నా మనసులోని మర్మమును తెలుసుకో మానరక్షక! మరకతాంగ ఇనకులాప్త నీవే గాని,వేరెవరు దిక్కు లేరయా; ఆనందహృదయ మునుపు ప్రేమగల దొరవై, సదా చనువు నేలినది గొప్ప కాదయా కనికరంబుతో నీవేళ నా కరము బట్టు, త్యాగరాజ వినుత! అని కీర్తించారు.

ఘనపాపుని కాచుట అరుదు...

భగవాన్ శ్రీరామకృష్ణుల గృహస్థ భక్తుడు గిరీష్‌చంద్రఘోష్ పూర్వజీవితంలో ఎన్నో దుర్వ్యసనాలకు లోనయ్యాడు. బలహీనతలకు బందీ అయ్యాడు. అయినా సరళహృదయుడైన గిరీష్, శ్రీరామకృష్ణులకు ఆకర్షితుడయ్యాడు. ఆ శరణాగతితో సంపూర్ణంగా తన మార్గాన్నే మార్చేసుకున్నాడు. ఆ మార్పు చుట్టుపక్కలవారినే కాదు, స్వయంగా గిరీష్‌ఘోష్‌నే ఆశ్చర్యపరచింది. తదనంతర కాలంలో ఆయన ఓ మిత్రుడితో సరదాగా 'ఇంత పాపప్రక్షాళన చేయగల మహాత్ముడు ఒకడుంటాడని తెలిస్తే, నేను ఇంకా ఎన్నో తప్పులు చేసేవాణ్ణి' అంటాడు. భగవంతుడు తలచుకుంటే ఎంతటి దుష్టుడినైనా, ధన్యాత్ముడిని చేస్తాడనటానికి కలియుగంలో శ్రీరామకృష్ణులే నిదర్శనం.

విశ్వేశ్వరుడి ఈ విశేషగుణాన్ని నుతిస్తూ అన్నమయ్య తనను ఈ సామాన్యలోకానికి ప్రతినిధిగా చేసుకొని, ఆ ఆపదమొక్కులవాడిని ఎంతో ఆత్మీయతతో...

అనఘుని కరుణింప నరుదుగాదు నీకు
ఘన పాపుని నన్ను కాచు టరుదు గాక
కనకము కనకము కానేల యినుము
కనకమవుటే కడు నరుదుగాక...

'అయ్యా! పాపాలే చేయనివారిని నీవు కరుణించడంలో ప్రత్యేకత ఏమీ లేదు! ఘన పాపుణ్ణి కటాక్షించయ్యా; బంగారానికి మెరుగు పెట్టడంలో నీ మాహాత్మ్యం ఏముందయ్యా, ఇసుమంతైనా కాంతిలేని ఇనుమును స్వర్ణం చేయవయ్యా, నీ సత్తా బయటపడుతుంది!' అని ఎద్దేవా చేస్తున్నాడు.

నా పాల కలిగి...

కలకత్తా దక్షిణేశ్వరంలోని కాళికాలయంలో శ్రీరామకృష్ణ పరమహంస అమ్మవారిని సాక్షాత్కరింపచేసుకునేవారు. ఇంట్లో అమ్మతో మాట్లాడినంత చనువుగా మాట్లాడేవారు. అలాంటి ఓ సందర్భంలో వారు కాళికామాతతో 'అమ్మా! మంచివాడిని, మంచివాడిని చేయడంలో నీ గొప్పతనం ఏముంది? చెడ్డవాడిని మంచివాడిని చేయడంలోనే కదా, నీ గొప్పతనమంతా! చచ్చినవాడిని చంపడం వల్ల ఏం ఒరుగుతుంది? ఎదురుగా నిలబడ్డ దుష్టుణ్ణి చంపినప్పుడే కదా, నీ మహిమ బయటపడేది' అంటారు. ఇలా అరమరికలు లేని ఆత్మీయత పరమాత్మతో పెనవేసుకోవాలంటే పసిపిల్లల్లాంటి నిర్మలత్వాన్ని నింపుకోవాలి. అడిగినా ఆయననే, అలిగినా ఆయనపైనే అన్నట్లు ఆత్మబంధం పెంచుకోవాలి. అలా కారణజన్ముడిగా అవతరించి, ఆ కాంచనాంబరధరుడికి కీర్తనల కైంకర్యం చేసిన అన్నమయ్య కూడా...


నెలకొన్న భీతితో నిన్ను చెనకితి గాక
తలకొన్న సుఖినైన తలపనేల నిన్ను
యెలమితో తిరువేంగళేశుడ నాపాల
కలిగి నీ కృప కలుగజేతువు గాక..

భవబంధాల భయంతో నీతో కాస్త దురుసుగా మాట్లాడాను వేంకటేశా! సుఖంగా ఉన్నప్పుడు కాదు, ఇలాంటి కష్టకాలంలోనే నాపై కృపను కురిపించాలంటూ ఆర్తితో ఆలపిస్తున్నాడు. ❖



వికాస మంత్రాలు


– స్వామి పార్థసఖానంద



కృతజ్ఞత

1. చెడులో మంచిని చూడడం; విషాదంలో సంతోషాన్ని చూడడం; నష్టంలో లాభాన్ని చూడడం మనం అభ్యసించాలి. అది మనలో ద్వేషానికి బదులుగా కృతజ్ఞతను పెంచుతుంది.
2. పొందిన కష్టాలను ఇసుకలో రాసుకోవాలి, అందిన కరుణను రాయిపై రాసుకోవాలి! ఎందుకంటే.. వచ్చిన కష్టాల్ని మరచి, దేవుని కరుణ కోసం కష్టించే వారే ఆయన కృపకు అర్హులు.
3. అంతర్ముఖత్వాన్ని పెంచుకోవడం, జీవితం నేర్పిన అనుభవాలను ఆస్వాదించడం ద్వారా మాత్రమే మనం ఆనందాన్ని పొందగలం. దీని కోసం మనం పేరాశను వదిలి కృతజ్ఞతను పెంచుకోవాలి.

మనం ఎంత
శ్రీమంతులమో
తెలుసుకోవాలంటే,
సిరి సంపదలతో
కొనలేనివి మన వద్ద
ఎన్ని ఉన్నాయో
లెక్క వేసుకోవాలి!



ధనం సాధించలేనిది


డబ్బుతో..

పట్టు పరుపుల్ని కొనవచ్చు, కానీ నిద్రను కాదు;
పుస్తకాల్ని కొనవచ్చు, కానీ జ్ఞానాన్ని కాదు;
నగల్ని కొనవచ్చు, కానీ అందాన్ని కాదు;
మందుల్ని కొనవచ్చు, కానీ ఆరోగ్యాన్ని కాదు;
తిండిని కొనవచ్చు, కానీ ఆకలిని కాదు;
సుఖాల్ని కొనవచ్చు, కానీ శాంతిని కాదు;
సౌకర్యాల్ని కొనవచ్చు, కానీ ఆనందాన్ని కాదు;
డబ్బు లేకుంటే కష్టపడాలి, కానీ డబ్బే అన్ని
కష్టాలకూ పరిష్కారం అనుకుంటే, అది పొరపాటు.

'డబ్బు జీవితంలో ఓ భాగం మాత్రమే,
కానీ డబ్బే జీవితం కాదు! కాలేదు!! కాకూడదు!!!'

తప్పొప్పులు

1. తప్పుల్ని దిద్దుకునేందుకు ఓ సులభ సూత్రం: ఓ పనిని తప్పుగా ఎందుకు చేశామో వివరించడానికి పట్టే సమయం కన్నా ఆ పనిని సరిగా చేయడానికి తక్కువ సమయం పడుతుంది.
2. అన్ని వేళలా, అంతా సరిగా చేయగలిగినప్పుడే ఆత్మవిశ్వాసం రాదు, తప్పులు చేస్తానేమో అనే భయాన్ని అధిగమించినప్పుడే ఆత్మవిశ్వాసం వస్తుంది.



ఈ లోకంలో ఏదీ
ఎప్పుడూ పూర్తిగా తప్పు
కాదు. ఆగిపోయిన
గడియారం కూడా
రోజుకు రెండుసార్లు
సరైన సమయాన్నే
సూచిస్తుంది.



భగవద్గీత - సద్గుణ సుధ

- స్వామి పరిజ్ఞేయానంద

తెలియనివాడనై మెలిగితిన్...

'తప్పులు చేయుట మా వంతు, సరిదిద్దుట మీ వంతు' అని భక్తిపాటలు పాడినంత మాత్రాన భగవంతుడు మన తప్పుల్ని సరిదిద్దుతాడా? మనం తప్పులు చేస్తూవుంటే వాటిని సరిదిద్దడమే ఆయన పని అని అనుకుంటే పొరపాటే! భగవంతుడు మన తప్పుల్ని క్షమించి, సన్మార్గంలో నడిపిస్తాడు. కానీ ఎప్పుడు? ముందు మనం చేసిన తప్పులకు పశ్చాత్తాప్పడి, మరలా తప్పులు చేయమని ప్రాధేయపడినప్పుడు.

నిజానికి మనం చేసిన తప్పులను ఒప్పుకోవడానికి మనలో నైతికబలం ఉండాలి. అలాంటి నైతికబలం కలవారినే మహాత్ములంటాం. మోహన్‌దాస్ కరమ్‌చంద్ గాంధీ తాను చేసిన తప్పులను నిర్భయంగా ఒప్పుకున్నాడు. అంతేకాదు, రాబోయే తరాల వారికి కూడా తెలియాలని తాను చేసిన తప్పులను పుస్తకంలో రాసి మరీ తన నైతికబలం ఏమిటో ప్రపంచానికి చూపించాడు. అందుకే ఆయన్ని మహాత్మునిగా కీర్తిస్తున్నాం.

అసలు తప్పులే చేయనివాడు పరమాత్ముడు; చేసిన తప్పులను ఒప్పుకొని, మరలా తప్పులు చేయనివాడు మహాత్ముడు; చేసిన తప్పులను ఒప్పుకొని కూడా మరలా తప్పులు చేసేవాడు దురాత్ముడు; చేసిన తప్పులను ఒప్పులుగా సమర్థించుకునేవాడు పాపాత్ముడు. మనం వీటిలో ఏ కోవకు చెందినవారమో తెలుసుకోవాలంటే కొంచెం ఆలోచిస్తే సమాధానం దొరుకుతుంది. కానీ మనకు ఆలోచించేటంత సమయమూ లేదు. అలాంటి సాహసం చేసే ధైర్యమూ లేదు. ఈ రెండూ లేవు కాబట్టే మనకు పాపపుణ్యాల చింతే లేదు. ఈ రెండూ ఉన్న అర్జునుడికి మాత్రం ఎంతో విచారం, అంతా విషాదం.

అవినీతి, అధర్మం ప్రబలినప్పుడు సమాజంలో శాంతి భద్రతలకు భంగం వాటిల్లుతుంది. అందువల్ల దుర్మార్గులను శిక్షించి, అధర్మాన్ని అరికట్టడం క్షత్రియునిగా అర్జునుడి బాధ్యత. కానీ అతడు బంధుప్రీతితో బాధ్యతలను మరచిపోయి, రణభూమి వదలి తపోభూమికి వెళ్ళిపోవాలని నిశ్చయించుకున్నాడు. 'అర్జునుడు భయాందోళనలకు గురవడం వలన ధర్మాధర్మాల విచక్షణ కోల్పోయాడు' అని గ్రహించిన శ్రీకృష్ణుడు 'అర్జునా! మోహపాశాలకు బద్ధుడవై పిరికివాడిలాగ వ్యవహరిస్తున్నావు' అని అతడిలోని లోపాన్ని ఎత్తిచూపాడు. ఉత్తమ స్వభావం కలిగిన అర్జునుడు వెంటనే తన లోపాన్ని అంగీకరించి, తనకు సరైన మార్గం చూపమంటూ శ్రీకృష్ణుణ్ణి...

కార్పణ్యదోషోపహత స్వభావః
పృచ్ఛామి త్వాం ధర్మసమ్మూఢచేతాః ।
యచ్ఛ్రేయః స్యాన్నిశ్చితం బ్రూహి తన్మే
శిష్యస్తేఽహం శాధి మాం త్వాం ప్రపన్నమ్ ॥ (గీత-2.7)

"దైన్యత్వం వల్ల భయం నన్ను ఆవరించింది. అందువల్ల ధర్మాధర్మ వివేకాన్ని కోల్పోయాను. నాకు ఏది శ్రేయస్కరమో దాన్ని నిశ్చయముగా తెలుపు. నీ శిష్యుణ్ణి, శరణాగతుణ్ణి అయిన నన్ను శాసించు" అని ప్రార్థించాడు.

అర్జునుడు తన తప్పుని అంగీకరించడం వలన శ్రీకృష్ణుడు అతణ్ణి విజయపథంలో నడిపించడమే కాదు, భవసాగరాన్ని దాటే మోక్షమార్గాన్ని కూడా చూపించాడు.

సాధారణంగా మనందరిలో ఉన్న బలహీనత ఏమిటంటే, మన తప్పుల్ని మనం గుర్తించం. ఎవరైనా చెబితే వాటిని అంగీకరించం. ఉత్తములు తమ తప్పులను తెలుసుకుంటారు, లేదా ఇతరులు చెబితే వాటిని అంగీకరిస్తారు. అందుకే సోక్రటీస్ సాధారణ మనుషులకు, మహాత్ములకు మధ్య ఉన్న తేడాను తెలుపుతూ "మహాత్ముల్లో ఉన్న సుగుణం ఏమిటంటే తమ తప్పులను అంగీకరించడానికి వెనుకాడకపోవడమే!" అని అన్నారు.

'మనం ఇతరుల కన్నా విద్యాధికులం, ఉన్నతాధికారులం, ప్రతిభావంతులం' అన్న భావన మనస్సులో నాటుకుపోతే మన లోపాలను, తప్పులను తెలుసుకోలేం, ఇతరులు చెప్పినా అంగీకరించం. ఎందుకంటే మనకన్నీ తెలుసుననే అహంకారం అడ్డువస్తుంది. అదే మన పురోగతికి అవరోధంగా నిలుస్తుంది.

అర్జునుడు తన తప్పును ఒప్పుకోకుండా తన నిర్ణయమే సరైనదని సమర్థించుకొని ఉంటే జీవితంలో ఉన్నత స్థితిని కోల్పోయేవాడు. శ్రీకృష్ణుని అనుగ్రహానికి పాత్రుడయ్యేవాడు కాదు. అందుకే మనం కూడా అర్జునుడిలా 'తెలియనివాడనై మెలిగితిన్...' అంటూ భగవంతుని ముందు మన తప్పులను ఒప్పుకొని, లోపాలను సరిదిద్దమని వేడుకుంటే జీవిత పరమార్థాన్ని సాధించగలుగుతాం. ❖



జీవన వేదం
స్వామీజీ కథల సారం

స్థితప్రజ్ఞత!

వ్యాసమహర్షి కుమారుడైన శుకుడు జన్మతః పరిపూర్ణుడు. వ్యాసుడు, కుమారునికి జ్ఞాన బోధ చేశాడు. సత్యాన్ని బోధించాడు. పిదప పరిపూర్ణ జ్ఞానసిద్ధి పొందడానికి జనక మహారాజు వద్దకు శిష్యునిగా శుకుణ్ణి పంపాడు. జనకుడు మహాజ్ఞాని. ఆయనను విదేహ జనకుడు అని కూడా అంటారు. 'విదేహ' అంటే శరీర ధ్యాస లేనివాడని అర్థం. నిరంతరం ఆత్మభావనలో ఉండేవాడు.

శుకుడు జ్ఞానార్థియై తన వద్దకు వస్తున్న సంగతి జనకునకు ముందే తెలుసు. అందుచేత ఆయన ముందుగానే కొన్ని ఏర్పాట్లు చేసి ఉంచాడు. శుకుడు రాజప్రాసాదం సింహద్వారం వద్దకు చేరాడు. ద్వారపాలకులు అతణ్ణి పట్టించుకోలేదు. వారు అతనికి కూర్చొనేందుకు ఒక ఆసనం మాత్రం చూపించారు. అతడక్కడ మూడు రాత్రులు, మూడు పగళ్ళు గడిపాడు. ఏ ఒక్కరూ అతనితో మాట్లాడటం గానీ, నీవెవరివి, ఎక్కడి వాడివి అని అడగడం గానీ జరగలేదు. అతడు గొప్ప మహర్షి కుమారుడు అయినప్పటికీ రాజసౌధపు రక్షకభటులు అతడిని ఏ మాత్రం పట్టించుకోలేదు.

అలా ఉండగా అకస్మాత్తుగా మంత్రులు, దండనాయకులు, ఇతర రాజోద్యోగులు అక్కడకు వచ్చారు. వారు శుకుణ్ణి సకల మర్యాదలతో లోపలికి తీసుకు వెళ్ళారు. కోటలోని మణిమయ గృహాలు చూపెట్టారు. పన్నీటి స్నానాలు చేయించి, పట్టు వస్త్రాలు కట్టబెట్టారు. ఆ విధంగా శుకుణ్ణి ఎనిమిది రోజుల పాటు రాజభోగాలలో ముంచి తేల్చారు. ప్రశాంత గంభీరమైన శుకుని మోములో ఈషణ్మాత్రమైనా మార్పు కనిపించలేదు. అతడు కోట బయట ముఖద్వారం వద్ద వేచి ఉన్నప్పుడు ఎలా ఉన్నాడో, ఈ భోగాల నడుమ కూడా అలాగే ఉన్నాడు.

తుదకు శుకుణ్ణి జనకుని వద్దకు తీసుకువెళ్ళారు. రాజు తన సింహాసనంపై ఆసీనుడై ఉన్నాడు. వాద్యాలు మనోహర సంగీతాన్ని ప్రవిస్తున్నాయి. నాట్యగత్తెలు నాట్యం చేస్తున్నారు. మరెన్నో వినోదాలతో అలరారుతోంది సభా భవనం. అంచుల వరకు పాలతో నిండి ఉన్న ఒక పాత్రను శుకుని చేతికి ఇప్పించాడు జనకుడు. ఆ పాత్ర నుండి ఒక్క చుక్క పాలైనా భూమిపై పడకుండా ఆ సభ చుట్టూ ఏడుసార్లు ప్రదక్షిణ చేసి రమ్మని శుకుణ్ణి ఆజ్ఞాపించాడు రాజు. శుకుడు ఆ పాత్ర చేతబట్టి, సంగీత ఘోషతో, నాట్యగత్తెల అందాలతో ఆకర్షణీయమైన ఆ సభ చుట్టూ ఏడుసార్లు తిరిగి వచ్చాడు. ఒక్క చుక్క కూడా పాత్ర నుండి భూమిపై పడలేదు. ఆ బాలుని మనస్సును ఈ ప్రపంచంలోని ఏదీ ఆకర్షించలేక పోయింది. అతడు స్థితప్రజ్ఞుడు.

క్షీరపాత్రతో రాజును సమీపించాడు శుకుడు. అప్పుడు జనకుడు ఇలా అన్నాడు – "నీ తండ్రి నీకు బోధించిన జ్ఞానం, నీకు నీవై నేర్చుకున్న జ్ఞానం పరిపూర్ణమైనవి. నేను కేవలం వాటిని మాత్రమే తిరిగి నీకు చెప్పగలను. నీవు సత్యాన్ని తెలుసుకున్నావు. ఇక ఇంటికి వెళ్ళవచ్చు" అని అభినందించాడు. ❖

సార్థకత!

చాలా మంది జనులు ముక్తి అనే నెపం పెట్టుకుని, ఒకదాని తర్వాత మరొక ఆదర్శాన్ని మార్చుకుంటూ పోతారు. క్రొత్త విషయాలను వినడం వారికొక వ్యాధిగా పరిణమిస్తుంది. ఒక విధమైన మతదాహం లాంటి పిచ్చి అది. తాత్కాలికమైన నరాల ఉత్తేజంతో వారు క్రొత్త క్రొత్త విషయాలను వినడం, వాటి ప్రభావం పడగానే మరొక క్రొత్త విషయం కొరకు సిద్ధంగా ఉండటం జరుగుతూ ఉంటుంది. వారి విషయంలో మతం అన్నది మేధావుల నల్లమందు సేవనం లాంటిది. అది అక్కడితోనే సరి.

శ్రీరామకృష్ణులు మరొక రకం మనుషులను గురించి చెప్పేవారు. వీరు ముత్యపుచిప్ప లాంటివారు. ముత్యపు చిప్ప స్వాతి నక్షత్రం రోజున సముద్రపు అడుగున ఉన్న తన స్థావరాన్ని వీడి సముద్రపు ఉపరితలానికి వస్తుంది. అలా వచ్చి తన కవచాన్ని విస్తారంగా తెరిచి ఉంచి, స్వాతి చినుకులకై ఎదురు చూస్తూ ఉంటుంది. చివరకు ఆ చిప్పలో ఒక్క వానచినుకు పడగానే అది మూసుకొనిపోయి సముద్రపు అట్టడుగు భాగాన తన స్థావరానికి చేరి, ఆ వాన చినుకును ఒక స్వచ్ఛమైన, అందమైన ముత్యంగా మారేలా చేస్తుంది. ఇలాంటివారి వల్లనే మతానికి సార్థకత చేకూరుతుంది. ❖

తెలుగు సేత: కె. త్రివిక్రమరావు


ఇంద్రియాలను విషయములందు స్వేచ్ఛగా ప్రవర్తింపనిచ్చుటే బంధమనీ, ఇంద్రియాల సంయమమే మోక్షపథానికి మార్గమనీ నిశ్చయముగా తెలుసుకొనినవాడే నిజమైన జ్ఞాని. -ఉద్ధవగీత

గురుదక్షిణ

చిత్రకథ : వీరరాఘవన్ **చిత్రాలు : శంకర్** **అనుసృజన : స్వామి జ్ఞానదానంద**

1 కాశీలో హరిదాసు అనే గొప్ప గురువు వద్ద పలువురు శిష్యులు విద్యను అభ్యసిస్తూ ఉండేవారు. వారిలో మహామతి అనే శిష్యుడు అగ్రగణ్యుడు.








3 అనేక గురుకులాల నుండి వచ్చిన విద్వాంసుల కఠినమైన ప్రశ్నలకు మహామతి మాత్రమే సరైన జవాబులిచ్చి ప్రశంసలందుకున్నాడు. ఈ పోటీలో ఉత్తమ గురుకులంగా హరిదాసు గురుకులం ఎంపికైంది. ఉత్తమ విద్యార్థిగా మహామతి ఎంపికయ్యాడు.



మహామతి పట్ల తోటి విద్యార్థుల ఈర్ష్య అసూయలు మరింత పెరిగాయి. వాళ్ళు గురువు వద్దకు వెళ్ళి ...


4
గురువుగారూ! మీరు మహామతికి మాత్రమే ప్రత్యేకంగా బోధించి, అతడు బహుమతి పొందేట్లు చేయడం న్యాయమా?
నాయనలారా! మీ అందరికీ నేను సమానంగానే బోధిస్తున్నాను. మీరూ అతడిలా శ్రమిస్తే, బహుమతి తప్పక పొందవచ్చు.
5
ఒకసారి గురువు తన కుటుంబంతోనూ, శిష్యులతోనూ దక్షిణ దేశ తీర్థయాత్రలకు వెళ్ళాడు. పలు పుణ్యస్థలాలను దర్శించుకున్న తరువాత తిరువారూర్ వెళ్ళాడు. అక్కడ కొంతకాలం ఉండి త్యాగరాజస్వామిని దర్శించుకుని ఆనందభరితుడయ్యాడు. అప్పుడు మహామతి గురుకులవాసం పూర్తి చేసుకుని వెళ్ళిపోయే సమయం ఆసన్నమైంది.
6
స్వామీ! మీకు సముచితమైన గురుదక్షిణ సమర్పించినప్పుడే నా విద్య ఫలప్రదమవుతుంది. మీకు గురుదక్షిణగా ఏమివ్వాలో తెలిపితే సత్వరమే దాన్ని మీకు సమర్పించుకుంటాను.
నాయనా! నువ్వు ఉత్తమోత్తమ విద్యార్థిగా పేరుపొందావు, అదే నాకు చాలు. అయినప్పటికీ రేపు ఉదయం రా! యోచించి చెబుతాను.
ఈ విషయం తెలుసుకున్న తక్కిన శిష్యులంతా గురుపుత్రికతో కలసి దురాలోచన చేశారు. ఆ మేరకు ఆమె తండ్రి వద్దకు వెళ్ళి...
7
నాన్నగారూ! మహామతిని పదివేల ఆణిముత్యాలు కూర్చిన ముత్యాలహారం అడగండి. నాకు అలాంటి హారం ఎలాగైనా సరే కావాలి.
అంత విలువైన ముత్యాలహారం అతడు ఎలా ఇవ్వగలడు తల్లీ?
కుమార్తె ముత్యాలహారం కోసం ఏడ్వసాగింది. మరో దారి కనిపించక తండ్రి అందుకు అంగీకరించాడు.


8 మర్నాడు ఉదయం మహామతి గురువు వద్దకు వచ్చాడు.
దీర్ఘాయుష్మాన్ భవ! నాయనా! నీకు సాధ్యమైతే పదివేల ఆణిముత్యాలు కూర్చిన ముత్యాలహారాన్ని గురుదక్షిణగా ఇవ్వు.
మీ అనుగ్రహంతో అది తప్పక సాధ్యమవుతుంది గురువర్యా!
9 మహామతి ఆ ఆణిముత్యాలను వెతుకుతూ చాలాకాలం తిరిగాడు.
దక్షిణ పాండ్యరాజ్యంలో ముత్యాలు సేకరించే వారిని, నగల వ్యాపారస్థులను వాకబు చేశాను. ఆణిముత్యాలు లభించినా కోట్ల బంగారు రూకలు ఇచ్చి వాటిని కొనుగోలు చేసే స్తోమత నాకు లేదే! ఏం చేయగలను?
స్వీయ సామర్థ్యంతో గురుదక్షిణ ఇవ్వలేనని నిర్ణయించుకుని మహామతి, తామ్రపర్ణి నదీతీరాన ఒక కుటీరం నిర్మించుకుని తిరువారూర్ త్యాగరాజస్వామిని గూర్చి తపస్సు చేయసాగాడు.
10 గురుదక్షిణగా ముత్యాలహారాన్ని ఇస్తానని గురువుకు వాగ్దానం చేసి మూడేళ్ళు గడచిపోయాయే! భగవంతుడా! నీవే నాకు ఏదో దారి చూపించు.
11 అప్పుడు ఒక బెస్తవాడు ఆణిముత్యాల హారంతో అక్కడ కనిపించాడు.
నాయనా! ఇక్కడ ఏం చేస్తున్నావు?
అయ్యా! మీ చేతిలో ఉన్న ఆణిముత్యాలహారం కోసం వెతికి వేసారిపోయాను. దీని కోసం నా ప్రాణాన్ని అడిగినా ఇచ్చేస్తాను. మీరు నాకు దీన్ని ఇవ్వగలరా?





నీరు తగలగానే బంకమన్ను మెత్తబడిపోతుంది. అదే బండరాయి ఎన్ని ఏళ్ళు నీటిలో మునిగి ఉన్నప్పటికీ అది ఒక్క చుక్క నీటినైనా స్వీకరించదు. అలాగే సున్నిత హృదయుడు ఏ కొంచెం కష్టం వచ్చినా తట్టుకోలేడు. దృఢ విశ్వాసం గల వ్యక్తి ఎన్ని బాధలు కలిగినా, ఎన్ని హింసలకు గురైనా కుంగిపోడు. తాను అనుకున్నది సాధించి తీరతాడు. *- భగవాన్ శ్రీరామకృష్ణ పరమహంస*





వివేకానంద ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యూమన్ ఎక్సలెన్స్
వార్షికోత్సవాలు










హైదరాబాదు రామకృష్ణ మఠం అనుబంధ సంస్థ 'వివేకానంద ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యూమన్ ఎక్సలెన్స్' పదిహేను సంవత్సరాలు పూర్తిచేసుకుంది. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని 2014 సెప్టెంబర్ 10,11 తేదీల్లో యువజన సమ్మేళనం నిర్వహించింది.

ఈ కార్యక్రమాల్లో రామకృష్ణ మఠాధ్యక్షులు స్వామి జ్ఞానదానందజీ, వివేకానంద ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యూమన్ ఎక్సలెన్స్ సంచాలకులు స్వామి బోధమయానందజీ; శ్రీ ఎల్.వి. సుబ్రహ్మణ్యం, ఐ.ఏ.ఎస్; శ్రీ జె.ఎస్.వి. ప్రసాద్, ఐ.ఏ.ఎస్; డాక్టర్ సౌమ్యమిశ్రా, ఐ.పి.ఎస్; శ్రీ చుక్కా రామయ్య; శ్రీ శేఖర్ బాబు పాల్గొని విద్యార్థినీ విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. స్వామి వివేకానంద జీవిత సందేశంపై విద్యార్థులు ప్రదర్శించిన లఘునాటికలు అందరినీ అలరించాయి. ఈ సదస్సులో పాల్గొన్న 1,500 మంది విద్యార్థినీ విద్యార్థులకు స్వామి వివేకానంద సాహిత్యాన్ని ఉచితంగా పంపిణీ చేశారు. ❖

గ్రంథ పరిచయం




శ్రీ యోగవాసిష్ఠసారము
(వచనము)

సంక్షిప్తకర్త: శ్రీ పేర్నేటి గంగాధరరావు
వెల: రూ.200 /- పుటలు : 562
ప్రతులకు: శ్రీ సిరి పబ్లిషర్స్, డోర్ నెం: 21-122/10, బచ్చుపేట, మచిలీపట్నం
సెల్: 9247566401

భారతీయ ఆధ్యాత్మిక సాహిత్యంలో యోగవాసిష్ఠానిది విశిష్టస్థానం. 'నేనెవరు' అన్న శ్రీరాముని సందేహానికి సమాధానంగా ఆవిర్భవించిందే యోగవాసిష్ఠం. చక్కని ఉపమానాలతో హృదయానికి హత్తుకునే కథలతో రచించిన ఈ గ్రంథం విస్తారమైంది.

అటువంటి బృహత్తర గ్రంథంలోని విషయభంగం జరగకుండా శుద్ధ ఆధునిక వచనంలో వ్రాయడం గంగాధరరావు గారి సామర్థ్యానికి నిదర్శనం. ముముక్షువులందరూ తప్పక చదువవలసిన గ్రంథమిది.



ధర్మధ్వజం

రచన : డాక్టర్ పి. భాస్కరయోగి
వెల: రూ. 80 /- పేజీలు : 198
ప్రతులకు: నవోదయ బుక్ హౌస్, ఆర్య సమాజ మందిరం దగ్గర, కాచిగూడ, హైదరాబాదు.

వర్తమాన సమాజంలో లౌకికవాదం, ప్రపంచీకరణ పేరుతో హిందూ సమాజానికి జరుగుతున్న అన్యాయాల మీద ఎత్తిన ధ్వజమే ఈ ధర్మధ్వజం. భారతీయులలో వైదిక ధర్మం పట్ల ఆసక్తి పెరగాలనీ; ఎక్కువ మందిని ధార్మిక మార్గంలోకి తీసుకురావాలనీ; మానవీయ విలువలు పెరగాలనీ ఆశించిన భాస్కరయోగిగారి అంతరంగ మథనానికి నిదర్శనాలే ఈ వ్యాసాలు. ఈ పుస్తకంలో ఆర్థిక, రాజకీయ, సామాజిక, విద్యా విషయకమైన వ్యాసాలున్నాయి. వీటిలో కొన్ని ఆలోచింపచేస్తాయి. కొన్ని ఆవేశాన్ని కలిగిస్తాయి. మరికొన్ని ఆవేదన కలిగిస్తాయి. వర్తమాన భారతం గురించి ఆలోచించేవారు తప్పక చదువవలసిన పుస్తకమిది.

–ఎం.వి.నాగప్రసాద్

Printed and published by **Swami Jnanadananda** owned by Ramakrishna Math Trust and printed at Kala Jyothi Process, 1-1-60/5, RTC Cross Roads, Musheerabad, Hyderabad - 500 020 and published at Ramakrishna Math, Domalguda, Hyderabad - 500 029. **Editor: Swami Parijneyananda**

Vol.71-11, Sri Ramakrishna Prabha (Telugu Monthly) November 2014, Regd. with the Registrar of Newspaper for India Under No.1120/57. Postal Registration No. HD-1071/2013-15. Licensed to Post Under WPP : AP/CPMG/HC-13/WPP/2013-14. Date of Publication : 18 October 2014

చిరుహృదయంలో చిగురించిన సేవాభావం

నరేంద్రుడు (స్వామి వివేకానంద) తన స్నేహితులను ఎంతో ప్రేమించేవాడు. వారికి ఏదైనా కష్టం కలిగితే సహాయం చేసేవాడు. అందువలన స్నేహితులందరూ అతణ్ణి ఎంతగానో అభిమానించేవారు.

ఒకసారి స్నేహితులతో కలసి నరేంద్రుడు 'ఫోర్డ్ విలియం' కోటను చూద్దామని బయలుదేరారు. కేరింతలు కొడుతూ, ఉత్సాహంతో కబుర్లు చెప్పకుంటూ నడుస్తున్నారు. అలా అందరూ వెళుతుండగా ఒక మిత్రుడు నడవలేక తూలిపోసాగాడు. మిగతా వాళ్ళంతా అతణ్ణి అనుకరిస్తూ, పరిహసించడం మొదలుపెట్టారు. కానీ నరేంద్రుడు తూలుతున్న స్నేహితున్ని పట్టుకొని నడిపిస్తున్నప్పుడు అతడికి జ్వరం వచ్చిందని గ్రహించాడు. నరేంద్రుడు వెంటనే ఆ స్నేహితున్ని ఒక బండిలో ఇంటికి చేర్చాడు.




ఎవరైనా బాధలో ఉంటే మనకు చేతనైన సహాయం చేయాలి. అంతేగానీ వారిని చూసి పరిహాసం చేయకూడదు. మనం కష్టాల్లో ఉన్నప్పుడు ఎవరైనా మనల్ని పరిహసిస్తే మనకు ఎంత బాధ కలుగుతుందో ఒక్కసారి ఆలోచించాలి. ఎదుటివాడు ఏ పనిచేస్తే మనకు బాధ కలుగుతుందో అలాంటి పనిని మనం ఇతరులకు చేయకూడదు.❖


(నవంబర్ 14, బాలల దినోత్సవం)

ఆధ్యాత్మిక అమృతవాహిని

శ్రీ రామకృష్ణ ప్రభ

డిసెంబర్ 2014 వెల: ₹10





సుబోధ

శ్రీరామకృష్ణులు: పులి జంతువులను ఆవురావురుమంటూ కబళించివేసే రీతిలో భగవత్ ప్రేమ అనే పులి కామక్రోధాదులనే శత్రువులను కబళించివేస్తుంది. ఒకసారి హృదయంలో భగవత్ ప్రేమ కలిగితే కామక్రోధాదులు అంతర్ధానమవుతాయి. శ్రీకృష్ణుని పట్ల అంతటి అనురాగం ఉండబట్టే బృందావనగోపికలకు అటువంటి స్థితి కలిగింది.

'అనురాగ అంజనం' అంటే ప్రేమ కాటుక. రాధ తన సఖీమణులతో 'నేను సర్వత్రా కృష్ణుణ్ణి చూస్తున్నాను' అన్నది. అందుకు వారు ఇలా అన్నారు: 'సఖీ! నువ్వు 'ప్రేమ కాటుక'ను కళ్ళకు రాసుకొన్నావు కదా! అందుచేతనే నువ్వు కృష్ణుణ్ణి సర్వత్రా చూడగలుగుతున్నావు.'

భగవంతుని స్మరించని బద్ధజీవులు సర్వదా కామినీ కాంచనాలలోనే వాసం చేస్తూ ఉంటారు. అలాంటప్పుడు వారి నుండి మహత్కార్యాలు ఎలా ఆశించగలం? వారు కాకులు కొట్టిన మామిడి పండు లాంటివారు. అలాంటి పండు దేవుని నైవేద్యానికి పనికిరాదు; మనుషులు కూడా తినడానికి సంకోచిస్తారు.

సంసారంలో బందీలైనవారు, పట్టుపురుగు లాంటివారు. ఈ పురుగు తాను స్వయంగా కట్టుకున్న గూటి పట్ల అమితమైన అపేక్ష కారణంగా గూటిని వదలి రాదు. చివరకు అది అక్కడే మరణిస్తుంది. ముక్తజీవులు కామినీ కాంచనాలకు వశులు కారు.

లౌకికులు భగవన్నామ స్మరణ చేస్తారు; కానీ దానిలో అనురాగం ఉండదు. లౌకికులకు పట్టుదల ఉండదు. జరిగితే జరగనీ, జరగకుంటే పోనివ్వు - ఇదే వారి వ్యవహారం.

మంచినీళ్ళు అవసరమైనప్పుడు బావి త్రవ్వడం ప్రారంభిస్తారు. కానీ త్రవ్వకంలో బండరాయి అడ్డుపడ్డప్పుడు అక్కడ త్రవ్వడం ఆపుచేసి, మరో చోట త్రవ్వడం మొదలుపెడతారు. బహుశా అక్కడ ఇసుకపొర పడితే, ఆ స్థలం కూడా వదలిపెట్టి ఇంకో చోటుకు వెళతారు. మొదలుపెట్టిన స్థలంలోనే గట్టి పట్టుదలతో త్రవ్వకం కొనసాగిస్తేనే కదా నీరు లభిస్తుంది! ❖

శ్రీరామకృష్ణ ప్రభ
రామకృష్ణ మఠం, దోమల్‌గూడ, హైదరాబాదు-500 029
ఫోన్: 040-27667799, సెల్: 8801849494
E-mail : sriramakrishnaprabha@gmail.com
నిర్వాహక సంపాదకులు: స్వామి జ్ఞానదానంద
సంపాదకులు: స్వామి పరిజ్ఞేయానంద

రామకృష్ణ - వివేకానంద భావ ప్రచార పరిషత్



23వ వార్షిక భక్త సమ్మేళనం, కదిరి, (అనంతపురం జిల్లా) తేదీలు: 2015 జనవరి 16,17,18

సమ్మేళన ప్రాంగణం : జిల్లాపరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, కదిరి

అనంతపురం జిల్లాలోని శ్రీరామకృష్ణ సేవాసమితుల ఆధ్వర్యవంలో కదిరిలో **2015 జనవరి 16,17,18** తేదీల్లో జరగబోయే 23వ వార్షిక భక్త సమ్మేళనానికి సాదరంగా ఆహ్వానిస్తున్నాం.

- ఈ భక్త సమ్మేళనంలో పాల్గొనే భక్తులు, వ్యక్తిగతంగా కానీ, సమితి ద్వారా కానీ **రూ.200/-** ప్రతినిధి రుసుము చెల్లించవలెను. ఈ రుసుమును **31-12-2014** తేదీ లోగా **శ్రీరామకృష్ణ సేవాసమితి, కదిరి** పేరున ఎమ్.ఓ/డి.డి.ల ద్వారా క్రింద సూచించిన చిరునామాకు పంపవలెను. గడువు తేదీ 31-12-2014 తర్వాత నమోదు చేసుకొనే భక్తులు ప్రతినిధి రుసుము రూ.300/- చెల్లించాలి.
- ప్రతినిధులకు భోజన, వసతి సౌకర్యాలు 2015 జనవరి 16వ తేదీ శుక్రవారం ఉదయం నుండి జనవరి 18వ తేదీ ఆదివారం సాయంత్రం వరకు ఏర్పాటు చేయబడును.
- ప్రతినిధులకు సాధారణ వసతి సౌకర్యములు మాత్రమే ఏర్పాటు చేయబడును. ప్రత్యేక సదుపాయాలు కావాల్సినవారు హోటల్ నందు గదులు స్వయముగా రిజర్వు చేసుకొనగలరు.
- ఈ బృహత్ కార్యక్రమానికి సుమారు రూ.20 లక్షలు వ్యయం అవుతుందని అంచనా. ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి భక్తులు, శ్రేయోభిలాషులు, అభిమానులు యావన్మందీ పాల్గొని ధన, వస్తురూపేణ తమవంతు సహాయ సహకారములు అందించి భగవాన్ శ్రీరామకృష్ణుల కృపకు పాత్రులు కాగలరు.
- ఈ భక్తసమ్మేళనం సందర్భంగా ఒక స్మారక సంచికను విడుదల చేయనున్నాము. ఆ సంచికలో ప్రకటనలు ఇచ్చి ప్రోత్సహించాల్సిందిగా కోరుచున్నాము. ప్రకటన వివరాలతో కూడిన సి.డి.ని శ్రీ జె.ఆదినారాయణ, శ్రీరామకృష్ణ సేవాసమితి, రామకృష్ణ మందిరం రోడ్డు, కదిరి - 515 591 (సెల్:9441034597) అనే చిరునామాకు పంపగలరు.

ప్రకటనల ట్యారిఫ్ వివరాలు :

	పూర్తి పేజీ	అర పేజీ	పావు పేజీ
కలర్	5,000	2,500	1,500
బ్లాక్ & వైట్	3,000	1,500	800
2,3 కవరు పేజీలు	15,000	-	-
4వ కవరు పేజీ	20,000	-	-

- పై కార్యక్రమాలకు విరాళములు, ప్రతినిధి రుసుములు, ప్రకటనల రుసుములను మనియార్డర్/ డి.డి.ల ద్వారా **జె. గంగాధర్, నిర్వాహక కార్యదర్శి, శ్రీరామకృష్ణ సేవాసమితి, రాజేంద్రప్రసాద్ వీధి, కదిరి-515 591** అనే చిరునామాకు పంపవలెను. **చెక్కులు స్వీకరించబడవు.**
- విరాళాలను ఆన్‌లైన్ ద్వారా కూడా పంపవచ్చు. వివరాలు: **శ్రీరామకృష్ణ సేవాసమితి, కదిరి, అకౌంట్ నెం. 32312200001840, సిండికేట్ బ్యాంక్, కదిరి (IFSC-SYNB0003231)**.

మీ అమూల్య సహాయ, సహకారములతో ఈ మహత్తర కార్యక్రమమును విజయవంతం చేయ ప్రార్థన.

పూర్తి వివరాలకు:


శ్రీరామకృష్ణ సేవా సమితి, కదిరి

ఆర్. చంద్రశేఖర్ గుప్త (అధ్యక్షులు) - **9966680680**

ఎమ్.వి. సుబ్బారావు (నిర్వాహక అధ్యక్షులు) - **9052027716**

జె. గంగాధర్ (నిర్వాహక కార్యదర్శి) - **9440693309**

ఆధ్యాత్మిక అమృతవాహిని
శ్రీ రామకృష్ణ ప్రభ
సంపుటం: 71 సంచిక: 12 డిసెంబర్ 2014



ప్రార్థన

శారదాం శర్మదాం వన్దే శ్రద్ధాశీల శుభప్రదాం ।
హంస కాన్తాం హంస చిత్తాం హంస సేవా పరాయణాం ॥

శ్రద్ధను, శీలమును, శుభములను, నిరతిశయ సుఖములను ప్రసాదించునదీ; పరమహంస పత్ని, పరమహంస యందే చిత్తం కలది, పరమహంస సేవయందే ఆసక్తి కలది అయిన దివ్యజనని శారదాదేవికి వందనములు.

– విష్ణుభట్ల విరచిత 'శ్రీశారదా వన్దనం'


సూక్తి సౌరభం

మూలం భుజంగైః శిఖరం విహంగైః
శాఖా ప్లవంగైః కుసుమాని భృంగైః
సంపేవ్యతే చందన పాదపోయం
పరోపకారాయ పరాం ప్రవృత్తిః


"చందనపు చెట్టు పాదులో పాములు, పై భాగంలో పక్షులు, కొమ్మలపై కోతులు, పువ్వుల నిండా తుమ్మెదలు ఉంటాయి. వీటన్నిటినీ నిశ్శబ్దంగా భరిస్తూ, పరోపకారం లోనే బతుకు సాగిస్తుంది చందనపు చెట్టు."

చిత్తశుద్ధి కలిగి చేసిన పుణ్యంబు
కొంచెమైన నదియు గొదువగాదు
విత్తనంబు మఱ్ఱివృక్షంబునకు నెంత
విశ్వదాభిరామ వినుర వేమ!

"ఓ వేమా! మఱ్ఱి వృక్షం ఎంతో విస్తారంగా ఉంటుంది. కానీ దాని విత్తనం చాలా చిన్నది. అలాగే మంచి మనసుతో చేసిన పుణ్యకార్యం ఎంత చిన్నదైనప్పటికీ ఉత్తమ ఫలితాన్నే ఇస్తుంది."



శ్రీరామకృష్ణ ప్రభ శాశ్వత నిధి





ఆధ్యాత్మిక జ్ఞానాన్ని పంచి పెట్టేందుకు 'శ్రీరామకృష్ణ ప్రభ' కృషి చేస్తోంది. నిధుల కొరత లేకుండా ఈ జ్ఞానయజ్ఞం నిరంతరాయంగా సాగేందుకు 'శ్రీ రామకృష్ణ ప్రభ శాశ్వతనిధి'కి ధన దానం చేసి ప్రోత్సహించాల్సిందిగా కోరుతున్నాం. దాతల పేర్లు పత్రికలో ప్రచురిస్తాం.

మహారాజ పోషకులు......	రూ.	10,000/-, అంతకన్నా ఎక్కువ విరాళం ఇచ్చేవారు.
రాజ పోషకులు............	రూ.	5,000/-, అంతకన్నా ఎక్కువ విరాళం ఇచ్చేవారు.
పోషకులు.................	రూ.	1,000/-, అంతకన్నా ఎక్కువ విరాళం ఇచ్చేవారు.

	దాత పేరు / ఊరు	రూ.
మహారాజ పోషకులు :	శ్రీ కైపా సంజీవరెడ్డి & శ్రీమతి శారదాదేవి, హైదరాబాదు (కీ॥శే॥యిడమకంటి నాగమ్మగారి జ్ఞాపకార్థం)	10,000
రాజ పోషకులు :	శ్రీమతి సి. లీలావతి, ధర్మారెడ్డికాలనీ, కె.పి.హెచ్.బి. కాలనీ, హైదరాబాదు	5,120
పోషకులు :	శ్రీ కందుకూరి కృష్ణమూర్తి, జనగామ, వరంగల్ జిల్లా (భార్య కీ॥శే॥ కందుకూరి రామలక్ష్మిగారి జ్ఞాపకార్థం)	1,500
పోషకులు :	శ్రీమతి లంకా గాయత్రి, చందానగర్, హైదరాబాదు (కీ॥శే॥ లంకా వేంకటేశ్వరరావుగారి జ్ఞాపకార్థం)	1,116
పోషకులు :	శ్రీ కె. మల్లారెడ్డి, విశ్వనాథకాలనీ, వరంగల్	1,116
పోషకులు :	శ్రీ అంబటి వేంకటేశ్వరరావు & శ్రీమతి లక్ష్మీకాంతం, సికింద్రాబాదు (కుమార్తె కీ॥శే॥ ఎ.అరుణకుమారిగారి జ్ఞాపకార్థం)	1,116
పోషకులు :	శ్రీమతి నేదునూరి కనకతార & శ్రీ లింగయ్య, కరీంనగర్ (కీ॥శే॥ ఎన్.లసుమమ్మ, వెంకయ్యగార్ల జ్ఞాపకార్థం)	1,116
పోషకులు :	శ్రీ పాశం దినేష్ నిశ్చల్, కె.ఆర్.ఎమ్.కాలనీ, విశాఖపట్నం (కీ॥శే॥ గణపా సాయికుమారి జ్ఞాపకార్థం)	1,116
పోషకులు :	శ్రీ ఎస్. నవీన్ కుమార్, ఒనుకడెల్లి, కొరాపుట్ జిల్లా, ఒరిస్సా	1,000

చందా వివరాలు		భారతదేశంలో	విదేశాలకు
విడి ప్రతి	:	₹ 10	-
సంవత్సర చందా	:	₹ 100	₹ 1,500
మూడు సంవత్సరాలకు	:	₹ 280	₹ 4,500
ఐదు సంవత్సరాలకు	:	₹ 450	₹ 7,500
ఇరవై సంవత్సరాలకు	:	₹ 1,500	₹ 22,000

గమనిక: డిమాండ్ డ్రాఫ్ట్, మనియార్డర్లలో Ramakrishna Math, Hyderabad అని వ్రాయాలి.

పంపవలసిన చిరునామా: Sri Ramakrishna Prabha, Ramakrishna Math, Domalguda, Hyderabad - 500 029.

చందాను ఆన్‌లైన్ http://rkmath.org/srkp ద్వారా చెల్లించవచ్చు.

లోపలి పేజీల్లో...

ఈ సంచికలోని రచయిత(త్రు)ల అభిప్రాయాలు వ్యక్తిగతమైనవి. సంపాదకులు గానీ, హైదరాబాద్ రామకృష్ణ మఠం గానీ వాటికి బాధ్యత వహించజాలరు. – సంపాదకులు

శ్రీరామకృష్ణ ప్రభ చందాదారులకు విన్నపం

ప్రియ పాఠకులారా!

- 'శ్రీరామకృష్ణ ప్రభ' పత్రిక కవరు మీద చిరునామాకు పైన మీ చందా నంబరు, కుడి వైపున మీ చందా గడువు ముగిసే నెల ఉంటాయి. మీ చందా గడువు పూర్తయ్యే నెలకు ముందుగానే సొమ్మును చెల్లించి చందాను పునరుద్ధరించుకోండి.
- మీ ఉత్తర ప్రత్యుత్తరాలన్నింటిలో తప్పనిసరిగా చందా నంబరు పేర్కొనాల్సిందిగా మనవి.
- మీ చిరునామా మారిన పక్షంలో 7వ తేదీ లోగా మాకు తెలియపరచినట్లయితే, వచ్చే నెల సంచిక నుండి మీ కొత్త చిరునామాకు పంపబడును.
- ప్రతీ నెల 26 లేదా 27వ తేదీల్లో పత్రిక పోస్ట్ అవుతుంది. మీకు పత్రిక 15వ తేదీ లోపుగా చేరనట్లయితే, వెంటనే మాకు తెలియజేయగలరు.

శ్రీరామకృష్ణ ప్రభ ద్వారా అవిచ్ఛిన్నంగా సేవలు అందించాలన్నదే మా ఆకాంక్ష. అందుకు మీ సహకారం కోరుతూ.... – సర్క్యులేషన్ మేనేజర్

SRI RAMAKRISHNA PRABHA, RAMAKRISHNA MATH
DOMALGUDA, HYDERABAD - 500 029.
Phone No: 040- 27667799, 88018 49494 E-mail : sriramakrishnaprabha@gmail.com

సంపాదకీయం



ఆధునికత అనర్థదాయకమా?

మనం ఆధునిక యుగంలో జీవిస్తున్నాం. కాబట్టి మనమంతా ఆధునికులం. నిజానికి ఆధునికత అంటే పరిసరాలు, పరికరాలు, సౌకర్యాలు, అలంకారాలు... ఒక్క మాటలో చెప్పాలంటే మన జీవనశైలి. సాధారణంగా ఆధునిక వ్యక్తి అంటే స్మార్ట్‌ఫోన్, ల్యాప్‌టాప్, ట్యాబ్‌లెట్, ఫేస్‌బుక్ ఖాతాలు మొదలైనవి ఉపయోగించేవాడనీ; ఆధునిక జీవనమంటే టీవీ, ఫ్రిజ్, ఏసీ, వాషింగ్‌మెషీన్ లాంటి యంత్రసాధనాలను వినియోగించేవాడనీ మన భావన. ఈ ఆధునికత మనిషి సుఖమయ జీవనానికి తోడ్పడుతుందే గానీ, ఆనందమయ జీవనానికి సహకరించడం లేదన్న విషయాన్ని విస్మరిస్తున్నాం. కేవలం బాహ్య పరికరాలు, సౌకర్యాల వల్లనే మనిషి ప్రశాంతంగా జీవించడం సాధ్యమని అనుకుంటే, ఈ ఆధునిక పరికరాలు లేనికాలంలో మనుషులు ప్రశాంతంగా జీవించలేదని అనగలమా?

"ఈ సౌకర్యాలేవీ లేనికాలంలో కుటుంబ బాంధవ్యాలు పదిలంగా ఉండేవి; మానవ సంబంధాలు గుబాళించేవి; ప్రశాంతత పరవళ్ళు తొక్కుతూ ప్రవహించేది" అన్న భావవీచికలు మనందరి హృదయాల్ని తాకుతూనే ఉన్నాయి. ఇది ఎవరూ కాదనలేని నిజం! అయితే, ఈ ఆధునిక జీవనం అనర్థదాయకమా? ఏ ఆధునికత అయినా, ఏ అభివృద్ధి అయినా మానవ హృదయ వికాసానికి దోహదపడేదిగా ఉండాలి; మానవత్వపు పరిమళాలు వెదజల్లేదిగా ఉండాలి; సంకుచిత్వం నుండి విశాలత్వం వైపు నడిపించేదిగా ఉండాలి; ఆత్మీయతానురాగాలను పెంచేదిగా ఉండాలి; భగవంతుని వైపు పురోగమింపజేసేదిగా ఉండాలి; చివరిగా మానవజన్మ లక్ష్యమైన ముక్తిపథాన్ని చేర్చేదిగా ఉండాలి. అలా జరగనినాడు ఏ ఆధునికత అయినా అనర్థదాయకమే! ఏ అభివృద్ధి అయినా అశాంతిదాయకమే!!

మూలాలు లేని చెట్టును ఊహించగలమా? పునాది లేని భవనాన్ని చూడగలమా? అలాగే, సంస్కృతీ సంప్రదాయాలనూ, మానవతా విలువలనూ, ఆధ్యాత్మిక జీవన విధానాలనూ విస్మరించిననాడు మానవజాతి మనుగడకు అర్థమే లేదు. మనిషి బాహ్యంగా ఎంత పురోభివృద్ధి సాధించినా, ఎంత ఆధునికంగా జీవించినా ఆంతరిక ఆనందానికి నోచుకోలేడు. ప్రశాంత జీవనాన్ని కొనసాగించలేడు. అన్నీ ఉన్నా ఆనందంగా జీవించలేని మనం, ఏమీ లేకపోయినా ఆనందంగా జీవించడమెలాగో తెలుసుకోవాలంటే మాతృమూర్తి శారదాదేవి జీవన విధానాన్ని అలవరచుకోవాలి. ఆధునికులమని భావిస్తూ అనాగరకుల్లా ప్రవర్తిస్తున్న మనకు పురాతన కాలంలోనే అధునాతన భావాలతో మాతృమూర్తి వ్యవహరించిన తీరు కనువిప్పు కావాలి.

ఆత్మీయతను దూరం చేసే ఆధునికత: శారదాదేవి చిన్నప్పుడే వంటచేయడం, చెరువు నుండి నీళ్ళు తీసుకురావడం, తమ్ముళ్ళకు స్నానం చేయించడం, బట్టలు ఉతకడం లాంటి గృహకృత్యాల్లో తల్లికి సాయపడేవారు. అలాగే పొలానికి వెళ్ళి పశువుల కోసం గ్రాసం కోసి తీసుకురావడం, పొలంలో పనిచేసే వారి కోసం భోజనం తీసుకువెళ్ళడం, జంధ్యాలు వడకడం లాంటి పనులు చేసి, తండ్రి పనిభారాన్ని తగ్గించేవారు. ఇలా శారదాదేవి తన వయస్సుకు మించిన పనిభారాన్ని వహించినందుకు ఆమె తల్లితండ్రులు మురిసిపోయేవారు. శారద లాంటి కూతుర్ని కన్నందుకు మా జన్మ ధన్యమైందని ఆనందపడేవారు.

అక్క శారదాదేవి చిన్నతనం నుండి తమ కోసం పడిన కష్టాలను తమ్ముడు కాళీకుమార్ తలచుకుంటూ, "అక్కయ్య ఇంట్లో అన్ని పనులూ చేసేది. ఆమె ఎన్ని కష్టాలుపడినా మాకు మాత్రం ఎలాంటి కష్టమూ కలగకుండా చూసుకునేది. జన్మజన్మలకు శారదే మాకు అక్కయ్యగా లభించాలి" అనేవాడు.

నేటి బాలబాలికలు తల్లితండ్రుల పట్ల, కుటుంబ సభ్యుల పట్ల వ్యవహరించే తీరును గమనిస్తే మనం ఆధునిక యుగంలో ఉన్నా ఆత్మీయతానురాగాలను కోల్పోతున్నామన్న భావన కలుగుతుంది. అంటే పిల్లలందరూ శారదాదేవిలా చిన్నప్పటి నుండే ఇంటి పనులన్నీ చేయాలని కాదు. కానీ కనీసం తల్లితండ్రులకు కష్టం కలిగించకుండా ప్రవర్తిస్తే చాలు, వారికి చిన్న చిన్న పనుల్లో సాయపడితే సంతోషమే! కానీ అలా జరగడం లేదు. అందుకు ముఖ్య కారణం ఆధునిక పరికరాల వినియోగం ఓ వ్యసనంగా మారడమే! సెల్‌ఫోన్‌లో ఎక్కడో దూరంగా ఉన్నవారి మాటల్లో పడి, పక్కనే ఉన్నవారిని పట్టించుకోకపోవడం; అంతర్జాలం సహాయంతో విశ్వాన్నంతా దర్శించి, పక్కనే ఉన్నవారిని గమనించలేకపోవడం. శారీరకంగా అందరూ ఒకే ఇంట్లో ఉన్నా, మానసికంగా దూరం చేయడంలో సెల్‌ఫోన్, ఇంటర్‌నెట్ లాంటి ఆధునిక సౌకర్యాలు విజయవంతమయ్యాయని చెప్పవచ్చు. ఈ మధ్య నిర్వహించిన ఒక సర్వేలో "సెల్‌ఫోన్, ఇంటర్‌నెట్‌ల ఉపయోగం, ఫేస్‌బుక్ లాంటి సామాజిక మాధ్యమాల వినియోగం ఓ వ్యసనంగా మారిందనీ,

తిథి ప్రకారం - డిసెంబర్ 13వ తేదీ శనివారం 'శ్రీశారదాదేవి జయంతి'



"చిన్నతనంలోనే నేను వంటచేసేదాన్ని. చెల్లి, తమ్ముళ్ళకు స్నానం చేయించి, వారి బట్టలు ఉతికేదాన్ని. నడుము లోతు నీళ్ళలో దిగి పశువుల కోసం గ్రాసం కోసి తెచ్చేదాన్ని."

- శ్రీశారదాదేవి

వాటిని వినియోగిస్తున్న వారిలో అధికశాతం 14 నుండి 19 సంవత్సరాల వయస్సు విద్యార్థులే" అని తేలింది. ఒక మానసిక వైద్యనిపుణుడు 'నేటి పిల్లలపై ఆధునిక పరికరాల ప్రభావం' అనే వ్యాసంలో సగటున ఓ పదిహేడేళ్ళ విద్యార్థి రోజుకు 12 గంటలు ఇంటర్‌నెట్ వినియోగంలో సమయాన్ని దుర్వినియోగ పరుస్తున్నాడని పేర్కొన్నాడు. ఈ ఆధునిక పరికరాల వినియోగం వల్ల కుటుంబ సభ్యులతో సన్నిహితంగా ఉండలేకపోవడం, చదువుల్లో వెనుకబడడం జరుగుతుందని విశ్లేషించారు.

కాబట్టి ఈ ఆధునిక పరికరాలు మన ఆత్మీయతానురాగాలకు అవరోధం కాకుండా జాగ్రత్త పడాలి. కుటుంబంలో తల్లి, తండ్రి, పిల్లలు - అందరూ కలివిడిగా మాట్లాడుకోవాలి; ఒకరి అవసరాలకు మరొకరు స్పందించాలి. అప్పుడే కుటుంబ సభ్యుల మధ్య ఆత్మీయతానురాగాలు బలపడతాయి. అలా కాకుండా కేవలం ఆధునిక పరికరాలతోనే అనుబంధం పెంచుకుంటే మన అవసరాలకు స్పందించే హృదయం వాటికి లేదు. అలాంటి సౌభాగ్యం కేవలం మనిషికి మాత్రమే భగవంతుడు ప్రసాదించాడు. అదే మానవజాతికి వరం. ఆ మహావరాన్ని సద్వినియోగం చేసుకోవాలంటే మనం పరికరాలను వాడుకోవాలే గానీ, అవి మనల్ని వాడుకునేంత బలహీనులం కాకూడదు. అప్పుడే ఆత్మీయతానురాగాలకు దూరం కాకుండా జీవించగలం.

ఆధ్యాత్మికతను మరిపించే ఆధునికత: శారదమ్మ రోజంతా ఎన్ని పనుల్లో మునిగివుండేవారో అమ్మ జీవిత చరిత్రను చదివిన వారికి తెలుస్తుంది. ఏళ్ళ తరబడి కట్టెలతో వంట చేస్తూ, గొట్టంతో గాలి ఊదుతున్నప్పుడు వచ్చిన పొగను పీలుస్తూ, కళ్ళ వెంట నీళ్ళుకారుస్తూ ఎంతో కష్టపడి వంటచేసేవారు. శ్రీరామకృష్ణులకు సపర్యలు చేస్తూ, అక్కడకు వచ్చిన భక్తుల కోసం కూడా వంట చేయడం, వడ్డించడం, భోజన ప్రదేశాన్ని శుభ్రం చేయడం, వంట పాత్రలు కడగడం... ఇలా అన్ని పనులూ విసుగూ విరామం లేకుండా చేసేవారు శారదాదేవి. ఎన్నో పనులతో రోజంతా తీరిక లేకుండా గడిపిన శారదమ్మ రోజుకు లక్షసార్లు భగవన్నామాన్ని జపించేవారు.

మనం కొంతసేపు పనిచేస్తే చాలు కోపతాపాలను వ్యక్తం చేస్తాం. పైగా అందరూ మనల్ని గుర్తించాలని భావిస్తాం. కానీ శ్రీరామకృష్ణులకూ, భక్తులకూ అమ్మ ఏళ్ళ తరబడి సేవలు చేస్తూ దక్షిణేశ్వరంలో ఉన్నప్పటికీ అక్కడున్నవారిని అడిగితే 'శారదాదేవి గురించి వినడమేగానీ మేము ఎప్పుడూ ఆమెను చూడలేదు' అని చెప్పేవారు. దీన్నిబట్టి శారదమ్మ ఎంత నిశ్శబ్దంగా, నిగూఢంగా, నిరాడంబరంగా, నిర్మలంగా జీవించారో అర్థం చేసుకోవచ్చు.


ఆ రోజుల్లో గ్యాస్‌స్టౌలు లేవు, గ్రైండర్లు లేవు, వాషింగ్ మెషీన్‌లు లేవు, మోటార్ పంపులు లేవు. ఈ యంత్ర సాధనాలేవీ లేని కాలంలో కూడా అన్ని పనులూ చేస్తూ శారదమ్మ ఆధ్యాత్మిక సాధనలను చేయగలిగేవారు. మరి ఈ సౌకర్యాలన్నీ ఉన్న నేటి కాలంలో ఎందరం సంతోషంగా మన పనులు చేయగలుగుతున్నాం? ఎందరం భగవన్నామస్మరణ, సద్గ్రంథపఠనం, స్తోత్రపారాయణాలు చేయగలుగుతున్నాం? పైగా సాధనలు చేయడానికి సమయం సరిపోవడం లేదని వాపోతుంటాం. నిజానికి ఈ ఆధునిక పరికరాల సహాయంతో పనులన్నీ శీఘ్రంగా ముగించుకొని, మిగిలిన సమయాన్ని ఆధ్యాత్మిక సాధనలకు వినియోగించుకోవాల్సిందిపోయి టీవీలకు, సినిమాలకు అంకితమిస్తున్న ఆధునికులం మనం. అలాకాకుండా ఈ ఆధునిక సౌకర్యాలను మన ఆధ్యాత్మిక ప్రగతికి తోడ్పడేలా మలచుకోగలిగితే శ్రేయోదాయకమే!

సనాతనంలో అధునాతనం: సమాజంలో జాతివివక్ష, కులమత పట్టింపులు, ఆచారాలు, అంటరానితనం, బాల్య వివాహాలు ప్రబలంగా ఉన్న రోజుల్లో ఆధునిక భావజ్వాలతో సమాజంలోని అనాగరక అంధకారాన్ని పారద్రోలారు శ్రీశారదాదేవి. సనాతన జీవనమార్గంలో పయనిస్తూ అధునాతన భావాలకు అంకురార్పణ చేసిన శారదాదేవి ధైర్యసాహసాలు,విశాలదృక్పథం, దూరదృష్టి ఆధునికులమైన మనల్ని ఆశ్చర్యపరచక మానవు.

శారదాదేవి బాల్యవివాహాలను వ్యతిరేకించి, బాలికల విద్యను ప్రోత్సహించారు. బాలికల కోసం సోదరి నివేదిత ప్రారంభించిన పాఠశాలను సందర్శించి ఆమె చేస్తున్న కృషిని అభినందించారు. విదేశాలకు వెళ్ళినవారు కఠినశిక్షను అనుభవించాలనే నియమాన్ని ఉల్లంఘించి, స్వామి వివేకానందను విదేశాలకు వెళ్ళమని ఆశీర్వదించి పంపారు. కులమత పట్టింపులకు వ్యతిరేకంగా మహమ్మదీయులను, నిమ్నకులస్థులను ఆదరించేవారు. ఆధ్యాత్మిక సంస్థలు కేవలం శాస్త్రాధ్యయనం, జపధ్యానాలు, పూజాపునస్కారాలు, జ్ఞానయజ్ఞాలకే పరిమితమైన రోజుల్లో 'సేవాయోగం' కూడా ఒక ఆధ్యాత్మిక సాధనే అని ప్రోత్సహించారు. కాశీలో రామకృష్ణ సంఘ సన్న్యాసులు అనాథలకూ, రోగులకూ చేస్తున్న సేవలను ప్రశంసించారు. ఆ సేవా కార్యక్రమాలకు పది రూపాయలు విరాళంగా కూడా ఇచ్చి మనస్ఫూర్తిగా ఆశీర్వదించారు.

సనాతనంలో అధునాతన భావాలతో జీవించిన శారదాదేవి అడుగుజాడలను అనుసరిస్తూ అధునాతనంలో సనాతన భావాలను విడువకుండా జీవించగలిగిననాడు ఈ ఆధునికత అనర్థదాయకం కాదు, ఆనందదాయకమే! ❖

ఎవరితోనూ మరీ చనువుగా మెలగవద్దు. ఇతరుల విషయాలలో కుతూహలం కనబరచవద్దు. ప్రాపంచిక వ్యవహారాలను తగ్గించి జపధ్యానాల యందు సమయాన్ని వినియోగించు. - శ్రీశారదాదేవి



గోరుముద్ద – స్వామి సుప్రియానంద

సంకల్పసిద్ధి

అనేక రకాల సంకల్పాల్ని చేసుకొని 'జనవరి ఒకటి నుండి మొదలు పెట్టాలి' అనుకుంటాం. మొదలు పెడతాం కూడా! ఆ సంకల్పాలు ఫిబ్రవరి నెల చూడ కుండానే మాయమైనప్పుడు 'మనసు గతి ఇంతే' అను కుంటూ సర్దుకుపోతాం.

అసలు మన సంకల్పాలకు బలం (శక్తి) ఎక్కడ ఉంది? ఎక్కడ నుండి వస్తుంది? ఈ ప్రశ్నలకు సమాధానం కోసం వైద్య, మనోవైజ్ఞానిక శాస్త్రవేత్తలు ప్రయత్నిస్తున్నారు. వారు కనుగొన్న విషయాలు మనకేమన్నా పని కొస్తాయేమో చూద్దాం.

'సంకల్పం' అనేది కోరిక నుండి పుడుతుంది. ఆ కోరిక యొక్క తీవ్రత (intensity) ఇచ్ఛాశక్తి. దీనినే 'విల్ పవర్' (will power) అంటారు. ఇచ్ఛాశక్తి వల్లనే సంకల్పం సిద్ధిస్తుంది. మనిషి తన కోరిక తీరకపోతే మానసిక ఆందోళన (mental stress)కు గురి అవుతాడు.

ఇచ్ఛాశక్తి, మానసిక ఆందోళన – ఈ రెండూ ఉత్తర, దక్షిణ ధ్రువాలు. వాటికి పొంతన కుదరదు. దీనికి ఉదాహరణ: పొగ త్రాగడం అలవాటున్న వ్యక్తి 'నేను ఇక నుండి సిగరెట్ తాగను' అని తీర్మానించుకుంటాడు. కానీ దాన్ని అమలు చెయ్యలేక పోతాడు. కారణం, అతని సంకల్పంలో 'విల్ పవర్' లేదు. అందులో ఉన్నది కేవలం 'వోన్ట్ పవర్' (నకారాత్మక శక్తి).

'విల్ పవర్' మనసుకు సంబంధించినది అనుకుంటాం. కానీ ఇది శరీరం – మనసు (body-mind) రెండిటికీ సంబంధించినది అంటున్నారు శాస్త్రవేత్తలు. శరీరానికి కావలసిన విశ్రాంతి, పౌష్టికాహారం అందకపోతే, దానివల్ల 'విల్ పవర్' దెబ్బతింటుందట!


'విల్ పవర్' పెరగాలంటే శరీరానికి వ్యాయామం (exercise), మనసుకు ధ్యానం (meditation) అవసరమట. 'అలాగైతే రోజూ వ్యాయామం, ధ్యానం చెయ్యాలి' అన్న సంకల్పం ఎలా సిద్ధిస్తుంది?

ఈ సందేహానికి సమాధానం స్వామి వివేకానంద మాటల్లో...

"Do not say we are weak; What can we not do? Everything can be done by us; we all have the same glorious soul, let us believe in it - 'మేము దుర్బలులము' అని ఎన్నడూ అనకండి. మనం చేయలేనిది ఏమిటి? మనం సమస్తం చేయగలం. మనందరిలో ఆ దివ్యాత్మ కలదు. ఆ ఆత్మశక్తి యందు నమ్మకం కలిగి ఉందాం!"

కాబట్టి మన ఆత్మశక్తి (spirit) యందు విశ్వాసం ఉంచి ప్రయత్నిస్తే మన సంకల్పం తప్పక సిద్ధిస్తుంది. ❖

శ్రీరమణుల దృష్టిలో శ్రీరామకృష్ణులు



– మహేందర్ మొలుమూరి

భగవాన్ శ్రీరామకృష్ణ పరమహంసపై శ్రీరమణ మహర్షి విశేషమైన వ్యాఖ్యలు చేసేవారు. ఒక మహానుభావుడి అంతరంగం మరో మహానుభావుడికే తెలుస్తుందన్నట్లుగా, శ్రీరామకృష్ణుల అవతారతత్త్వాన్ని అర్థం చేసుకొని, విశ్లేషించిన అతి కొద్దిమందిలో శ్రీరమణ మహర్షి ఒకరు. శ్రీరామకృష్ణులకు సంబంధించిన ఎన్నో ఆధ్యాత్మిక అనుభూతులను రమణ మహర్షి తనదైన రీతిలో విశ్లేషించి, తమ సన్నిధికి వచ్చిన భక్తుల సందేహాలు తీర్చేవారు.

భక్తి, జ్ఞాన సంగమం : ఒకసారి స్విట్జర్ల్యాండ్‌కి చెందిన కార్ల్ జంగ్ అనే మనోవైజ్ఞానికుడు ఓ వ్యాసంలో భగవాన్ శ్రీరామకృష్ణ పరమహంసనూ, శ్రీరమణ మహర్షినీ పోలుస్తూ 'భక్తి నుంచి జ్ఞానానికి పురోగమనం అది! ఒకరు భక్తికి ప్రతీక అయితే, మరొకరు జ్ఞానానికి!' అన్నారు.

ఆ మాటల్ని వినగానే శ్రీరమణులు వెంటనే నిటారుగా కూర్చొని, ఆ పోలికకు అభ్యంతరం చెప్పారు. 'ఏ దారిన శిఖరాన్ని చేరినా తరువాత మిగిలిన మార్గాలన్నీ అర్థమవుతాయి. అయినా శ్రీరామకృష్ణుల గురించి మీకు ఏమర్థమవుతుంది? అసలు రామకృష్ణులకు తెలియనిదేమిటి? ఆయనలో భక్తి, జ్ఞానం అన్నీ ఉన్నాయి. ఆయనలో లేనిదేమిటి?' అని ఉద్ఘాటించారు.

అరుదైన గురుశిష్యులు : ఒకనాడు విద్యావంతుడైన ఓ యువకుడు వచ్చి, భగవాన్ శ్రీరమణ మహర్షిని ఉద్దేశించి 'శ్రీరామకృష్ణ పరమహంస, స్వామి వివేకానందను అత్యున్నత ఆధ్యాత్మిక శిఖరంగా మలచారు; కేవలం స్పర్శ వల్లే నిర్వికల్ప సమాధి స్థితికి తీసుకెళ్ళగలిగారు. భగవాన్! మీరు నాక్కూడా అలా చేయగలరా?' అని ప్రశ్నించాడు.

కాసేపు మౌనంగా ఉన్న తరువాత శ్రీరమణులు నెమ్మదిగా అతనితో, 'అయితే నీవు ఇంకొక వివేకానందవన్నమాట!' అన్నారు. ఆ యువకుడు ఆశ్చర్యపోతూ, ఏం చెప్పాలో తెలియక ఇబ్బందిపడ్డాడు. ఆ తరువాత మహర్షి ఏమీ మాట్లాడకపోయేసరికి, ఆ యువకుడు నెమ్మదిగా ఆ మందిరంలో నుంచి బయటకు వెళ్ళిపోయాడు. ఆ తరువాత భగవాన్ రమణులు అక్కడి భక్తులతో "ఆత్మవిమర్శ, ఆత్మవివేచన – వీటి ఆవశ్యకతను గుర్తించడం చాలా కష్టం. ఎవరికి వారే పరిపూర్ణులమనుకుంటారు. ఈ యువకునికి, నేను కూడా శ్రీరామకృష్ణుల లాగా శక్తిమంతుడనేనా అని పరీక్షించే కుతూహలం ఉందే గానీ, తాను అసలు వివేకానందుని వలె అర్హుడనేనా? అన్న విచక్షణ లేకపోయింది. తాను పరిపూర్ణుడనని అనుకోవడం వల్లే అతనికి నన్ను పరీక్షించాలనిపించింది. శ్రీరామకృష్ణులు, వివేకానంద అరుదైన గురుశిష్యులు. శ్రీరామకృష్ణులు తన అవతార లక్ష్యానికి ఒక్క వివేకానందనే ఎన్నుకోవడానికి కారణం – ఆయన విశేషమైన ఆధ్యాత్మికోన్నతిని కలిగి ఉండడమే!' అన్నారు భగవాన్ రమణులు.


జ్ఞాని స్థితి అనిర్వచనీయం : ఓసారి ఓ భక్తుడు శ్రీరమణ మహర్షితో 'జ్ఞానికి సుఖ దుఃఖాలూ, శరీరబాధలూ లేవంటారు కదా! మరి శ్రీరామకృష్ణ పరమహంస "అమ్మా! నీ దర్శనమైనదని నవ్వి, కాలేదని నేల మీద పడి విలపించేవారట కదా! అదీ కాకుండా శరీరానికి వ్యాధి వల్ల బాధ కలిగినప్పుడల్లా సహించ లేక, 'అమ్మా! అమ్మా!' అంటూ దుఃఖించేవారట! అదేమిటి? జ్ఞానులకూ ఈ సుఖదుఃఖాలు ఉంటాయా?" అని ప్రశ్నించాడు.

అప్పుడు శ్రీరమణులు "బాహ్యంగా మీరు వారి శరీర చేష్టల్ని చూసి అలా మాట్లాడుతున్నారు. దేహక్రియలను బట్టి జ్ఞాని స్థితిని నిర్ణయించడానికి వీలు లేదు. ఆ సుఖం సుఖమా? ఆ దుఃఖం, దుఃఖమా? 'ఆహా! నాకు దర్శనమిచ్చావే?' అని ఆనందంతో హసించేవారు కొందరు. 'ఎంత కరుణ ప్రభో!' అని కన్నీరు కార్చేవారు కొందరు! శ్రీరామకృష్ణ పరమహంసా అంతే! 'అమ్మా! నీ కరుణ! అమ్మా! నీ దయ!' అంటూ విలపించి, నవ్వి ఏమేమో చేసేవారట. ఇంతకూ వారి స్థితి మనకు అర్థం కావాలంటే ముందు మన స్థితి మారాలి. అయినా ఆయన అవతారపురుషు డనడానికి నీ ధ్రువీకరణ పత్రం ఏమీ అవసరం లేదు" అని అభిప్రాయపడ్డారు. దాంతో ఆ భక్తుడు నిశ్శబ్దమైపోయాడు. ❖

(డిసెంబర్ 30న భగవాన్ రమణమహర్షి జయంతి)

వ్యక్తిత్వ భావన పూర్తిగా రూపుమాసినప్పుడు సమాధి స్థితిలో బ్రహ్మసాక్షాత్కారమవుతుంది. అప్పుడే 'జగత్తు సత్యమా? మాయా?' అనే సందేహాలన్నీ శాశ్వతంగా సమసిపోతాయి. – శ్రీరామకృష్ణులు





పలికెడిది భాగవతం

కపటమింత లేదు కరుణ కలదు

– స్వామి జ్ఞానదానంద

విజ్ఞతతో కూడిన విదురుడి హితవాక్యాలు విని, కనువిప్పు కలిగి అతనితోనే కలసి ధృతరాష్ట్ర దంపతులు అరణ్యాలకు పయనమయ్యారు. మరునాడు ఉదయమే యథావిధిగా తన దినచర్యలో భాగంగా, పెదనాన్న, పెద్దమ్మ, పినతండ్రిలకు నమస్కరించేందుకు ధర్మరాజు రాజమందిరానికి విచ్చేశాడు. అయితే అక్కడ ధృతరాష్ట్రుడు, గాంధారి, విదురుడు కనిపించలేదు. దాంతో ఆ పాండవాగ్రజుడు పలవరించిపోయాడు. అదే భవనంలో సుదూరంగా సుఖాసీనుడైన సంజయుడితో యుధిష్ఠిరుడు కలవరపాటుతో "సంజయా! మా పెత్తల్లీ, పెదతండ్రీ ఈ మేడలో కనిపించడం లేదు. వారెక్కడికి వెళ్ళారో తెలియదు. మా పెదతండ్రి గారు కంటిచూపు కరవైన ముదుకాళ్ళ ముసలి. మా పెద్దమ్మ కడివెడు శోకంతో కన్నీరుమున్నీరుగా విలపిస్తూ ఉంటుంది. మా పినతండ్రిగారు మాకు ప్రాణ సమానుడు, సౌజన్యమూర్తి. ఈ ముగ్గురూ మమ్మల్ని వదలిపెట్టి ఎటు వెళ్ళిపోయారో తెలియదు. మా పెదనాన్న ఒకవేళ తాము చేసిన తప్పులకు పశ్చాత్తాపం చెంది భార్యతో కలసి గంగలో దూకాడేమోనని అనుమానంగా ఉంది" అని ఆవేదనపడుతూ...

భార్యతోడ తండ్రి పరితాపమున బడు
కపటమింత లేదు కరుణ కలదు
పాండు భూవిభుండు పరలోకగతుడైన
మమ్ము పిన్నవాండ్ర మనిచె నతడు... అని కన్నీరు మున్నీరుగా విలపించాడు. ధర్మరాజు పితృప్రేమ చూసి సంజయుడు కరిగిపోయాడు. కన్న తల్లితండ్రులు కాకపోయినా, పెదనాన్న, పెద్దమ్మ, పినతండ్రిల విషయంలో యుధిష్ఠిరుడు ఎంతో మన్ననతో మెలిగేవాడు. వార్ధక్యంలో పెద్దల విషయంలో పిల్లలు ఎలా మసలుకోవాలో ఆ పాండవాగ్రజుడు పాటించి చూపాడు.

సార్థక నామధేయుడు: మహాభారతంలో యుధిష్ఠిరుడంటే సాక్షాత్తూ ధర్మస్వరూపుడు. ఎన్ని అవాంతరాలు ఎదురైనా సత్యాన్నీ, ధర్మాన్నే నమ్ముకొని ముందుకు నడిచినవాడు. నిజానికి పాండవులకు తీరని ద్రోహం చేశారు కౌరవులు. వారి గృహానికి నిప్పంటించారు; ద్రౌపదిని నిండుసభలో అవమానించారు; ఆ అమాయకుల్ని అన్యాయం చేసి అరణ్యాలకు వెళ్ళగొట్టారు. ధృతరాష్ట్రుడు ఏ సందర్భంలోనూ కొడుకులను వారించలేదు; పాండవుల విషయంలో జరుగుతున్న అఘాయిత్యాలకు అడ్డు చెప్పలేదు. అయినా ధర్మరాజు ఇవేవీ మనసులో పెట్టుకోలేదు. పైగా పెదనాన్నను **'కపటమింత లేదు; కరుణ కలదు'** అని శ్లాఘిస్తూ తన హృదయవైశాల్యాన్ని చాటుకున్నాడు. తమను కని, పెంచి ప్రయోజకుల్ని చేసిన కన్నవారినే కనికరం లేకుండా వదిలేస్తున్నవారు, ఇలాంటి ధర్మాత్ముల నడవడికను చూసి ఎంతో నేర్చుకోవాలి. ఇంటికి పెద్దగా, వంశానికి వారసుడిగా, రాజ్యాధినేతగా ఆ పాండవాగ్రజుడి పరిణతితో కూడిన ప్రవర్తన పదుగురికి ఆదర్శం.

ధర్మనిరతితో ఆ కుంతీపుత్రుడు సాక్షాత్తూ శ్రీకృష్ణభగవానుడి అభినందనలను, ఆశీస్సులను అందుకున్నాడు. అందుకే భగవాన్ శ్రీరామకృష్ణులు కూడా ఓ సందర్భంలో తమ భక్తులతో "కౌరవవంశంలో పుట్టిన మహాపురుషుడు యుధిష్ఠిరుడు. అలాంటి వ్యక్తి తమ వంశంలో వేయి దోషాలున్నా ఆ వంశజులను ఉద్ధరిస్తాడు. ధర్మరాజు సుగుణాల కలబోత. పాండవుల విషయంలో దుర్యోధనుడు పగబూనాడు; అడవుల పాల్జేశాడు. నానా కష్టాలు పెట్టాడు. అయినా కౌరవులను గంధర్వుడు బంధించినప్పుడు తమకు చేసిన అపకారాన్ని మరచి వారిని విడిపించాడు. అదీ అతని గొప్పతనం" అన్నారు.

ధర్మాత్ముడు... ధన్యాత్ముడు: మనం ఈ రోజుల్లో ఏదో ఒక నెపంతో విలువలకు తిలోదకాలిస్తూ, చేసే తప్పుడు పనులకు సమర్థనలు వెతుక్కుంటూ, మంచికి కాలం లేదని అవకాశవాదులుగా మారిపోతూ, మరోవైపు దెబ్బకు దెబ్బ తీయాలని తహతహలాడుతూ ఉంటాం. కానీ పరిస్థితులు ఎంత ప్రలోభపెట్టినా మహాపురుషులు సత్యానికీ, ధర్మానికీ కట్టుబడే ఉంటారు. కాలాతీత వ్యక్తులుగా నిలిచిపోతారు. దుర్యోధనుడు, శకుని, కర్ణుడు, దుశ్శాసనాదులు పాండవుల పట్ల ధర్మం తప్పి వ్యవహరించారు. అరణ్యవాసమే కాక అజ్ఞాతవాసమూ చేయాలని

ఆజ్ఞాపించారు. ఆ కష్టకాలంలో దాయాదుల దాష్టీకాలు భరించలేక, తమ్ముళ్ళు, భార్య ద్రౌపది ఎంతో కుమిలిపోయారు. చివరకు ఓ రోజు భీముడు, "రాజా! మనం ఈ విధంగా ధర్మార్థ కామాలకు దూరమై అరణ్యంలో నివసించడం బాగా లేదు. నీ మూలాన మేమందరమూ ఈ విధంగా 'ధర్మం, ధర్మం' అంటూ ఓర్పు వహిస్తుంటే శత్రువులు మనల్ని చేతకానివాళ్ళనుకుంటారు. ఏ ధర్మం తనకూ, మిత్రులకూ బాధాకరంగా ఉంటుందో అది ఒక దుర్వ్యసనం, ఆ ధర్మం కుధర్మం" అన్నాడు. అప్పుడు ధర్మరాజు ఎంతో నిబ్బరంతో...

మమ ప్రతిజ్ఞాం చ నిబోధ సత్యాం, వృణే ధర్మమమృతాజ్జీవితాచ్చ।
రాజ్యం చ పుత్రాశ్చ యశో ధనం చ సర్వం న సత్యస్య కలాముపైతి॥

'నా ప్రతిజ్ఞ సత్యమైందని తెలుసుకో! అమృతం కంటే, జీవితం కంటే ధర్మాన్నే నేను అధికంగా కోరుకుంటాను. రాజ్యం గాని, పుత్రులు గాని, యశస్సు గాని, ధనం కాని సత్యంలో పదహారో వంతుకు కూడా సరితూగవ'ని స్పష్టం చేశాడు. అందుకే ఆ ధర్మాత్ముడు ధన్యాత్ముడయ్యాడు.

ఆశ్రిత పాలకుడు...ఆదర్శనాయకుడు: నమ్ముకున్న విలువల విషయంలోనే కాదు, తనను నమ్ముకున్న వ్యక్తుల విషయంలో కూడా యుధిష్ఠిరుడు ధర్మనిరతిని తప్పనివాడు! అందుకే యక్షుడి ప్రశ్నలకు సమాధానాలు చెప్పి, చనిపోయిన తమ్ముళ్ళలో ఎవరి ప్రాణాలు కావాలో కోరుకొమ్మంటే తన సొంత తమ్ముళ్ళయిన భీముడి, అర్జునుడి ప్రాణాలు కాకుండా, పినతల్లి మాద్రి కొడుకైన నకులుడి ప్రాణాలు కోరుకున్నాడు. చివరకు స్వర్గంలో అడుగుపెట్టే సమయంలో కూడా తనను నమ్మి వచ్చిన శునకానికి ప్రవేశం కల్పిస్తేనే, నేనూ స్వర్గంలోకి వస్తానని పట్టుపట్టాడు. దేవతలు ధర్మరాజుకు, అతని సోదరులు నరకంలో బాధపడుతూన్నట్లు మాయాబలం చేత చూపించి, 'నీవు మాత్రం ఉత్తమలోకాలకు వెళ్ళవలసి ఉంది; రా! తీసుకొని వెళతాం!' అంటారు. అప్పుడు ధర్మరాజు 'నేను కూడా నా బంధుజనంతో ఈ నరకంలోనే ఉంటాను; నాకు మీరిచ్చే ఉత్తమ లోకాలతో పని లేదు' అంటాడు. ఆ మాటలు విని, దేవతల్లోని ధర్మదేవుడు అతనితో 'కుమారా! నేను నిన్ను యక్షుడిగా కనబడి ప్రశ్నలు వేసినపుడు, శునకంగా నీ వెంట వచ్చినప్పుడు పరీక్షించాను. ఇది మూడవ పరీక్ష. అన్ని పరీక్షల్లోనూ నీ ధర్మస్థైర్యాన్ని నిరూపించుకున్నావు' అని మెచ్చుకుంటాడు. ఇలా ఎన్నో సందర్భాల్లో యుధిష్ఠిరుడు నైతిక నిబద్ధత నుంచి కించిత్తు కూడా పక్కకు తప్పుకోలేదు. ఎన్నో శక్తిసామర్థ్యాలున్నప్పటికీ ప్రదర్శనకూ, అహంకారానికీ పోకుండా సౌమ్యత్వానికీ, సౌహార్దానికే అతడు ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చాడు. అందుకే తిక్కన గారు ఆయనను 'మెత్తని పులి' అని అభివర్ణించారు.

కేవల మర్త్యుడే ధర్మసుతుడు... : ఇంటికి పెద్ద అయినవారు మాటలతో కన్నా, ప్రవర్తనతో చిన్నవారిని ప్రభావితం చేయగలగాలి. అలా తన తమ్ముళ్ళకే కాదు తన వారందరికీ ఆ పాండు నందనుడు గౌరవనీయుడయ్యాడు. అందుకే విరాట పర్వంలో ఓ మారు ద్రౌపది తన భర్త ఘనతను కొనియాడుతూ, ఆయన మామూలు మనిషి కాదు...

ఎవ్వని వాకిట నిభమద పంకంబు; రాజభూషణ రజోరాజి నడగు
నెవ్వని చారిత్రమెల్ల లోకములకు నొజ్జయై వినయంబు నొరపు గరపు
నెవ్వని కడకంట నివ్వటిల్లెడు చూడ్కి మానిత సంపద లీనుచుండు
నెవ్వని గుణలత లేడు వారాసుల కడపటి కొండపై కలయబ్రాకు
నతడు భూరి ప్రతాప మహాప్రదీప
దూర విఘటిత గర్వాంధకారవైరి
వీర కోటిరమణివేష్టితాంఘ్రి
తలుదు కేవల మర్త్యుడె ధర్మసుతుడు

"ఎవరి ముంగిట్లో మదపుటేనుగుల శరీరాల నుంచి కారే మదజలధారల వలన ఏర్పడిన బురదను, ఆయనను సేవించడానికి వచ్చే మహారాజుల అలంకారాల ఒరిపిడి వల్ల రాలిన ధూళి కలిగిన దుమ్ము అణచివేస్తుందో... ఎవరి ఉత్తమ ప్రవర్తన లోకాలకన్నిటికీ ఆదర్శమై, వినయ వర్తనానికి ఒరవడి అవుతుందో... ఎవరి కటాక్ష వీక్షణం గొప్ప సంపదలను కలుగజేస్తుందో... ఎవరి సుగుణాలనే తీవెలు సప్తసముద్రాలు దాటి మేరు పర్వతం మీదకు కలయ పాకుతాయో... ఎవరి పరాక్రమమనే ఘనదీపం శత్రువుల గర్వమనే అంధకారాన్ని దూరంగా పారదోలుతుందో... ఎవరి పాదాలు శత్రువీరుల కిరీటాలలోని రత్నకాంతులతో సదా చుట్టబడి వెలిగిపోతూ ఉంటాయో... అలాంటి ధర్మరాజు కేవలం మానవుడా? కాదు!" అని కీర్తిస్తుంది.

మనసంతా స్వార్థపూరితంగా మారిపోయిన మన తరం, సంపూర్ణంగా ఆ స్థాయిలో ధర్మాన్ని అనుష్ఠించలేకపోయినా, కొంతైనా అనుసరించగలిగితే అలాంటి పుణ్యాత్ములు పుట్టిన భూమిలో పుట్టినందుకు సార్థకతను చేకూర్చుకున్న వారమవుతాం. ❖

'ధర్మం' అనగానే రామాయణంలో శ్రీరామచంద్రుడు స్ఫురిస్తాడు; మహాభారతంలో ధర్మరాజు గుర్తొస్తాడు. ధర్మదేవుని అంశావతారమైన యుధిష్ఠిరుడిని నాయకుడిగా చేయడం ద్వారా పంచమవేదమైన మహాభారతాన్ని ధర్మోపదేశ ప్రధాన గ్రంథమని వ్యాసుడు సూచించాడు.

ప్రత్యర్థులలో కూడా పవిత్రతను చూసే గుణగ్రహణ పారీణత్వం ఆ పాండవాగ్రజుడిది. ఆయనను ధర్మం నుంచి తప్పించడం సాక్షాత్తూ దేవతలకే సాధ్యం కాలేదు. అందుకే ధర్మరాజు లాంటి కుమారుడు ఒక్కడున్నా, ఆ వంశమే తరించిపోతుంది.

పరుడైననూ ఎవడు హితమొనర్చునో వాడే బంధువు; స్వకీయుడే యైననూ బాధ కలిగించువాడు శత్రువే! దేహంలో పుట్టిన రోగం బాధాకరం, కానీ అరణ్యంలో పుట్టిన ఓషధి బాధను నివృత్తి చేస్తుంది. - హితోపదేశం

ప్రాచీన, మధ్యయుగాలనాటి

మన సంస్కృతి

- స్వామి హర్షానంద

"ఒక వ్యక్తి తనను తాను అసహ్యించుకొంటున్నట్లయితే అదే పతనానికి హేతువు. పూర్వీకుల చరిత్రను అవమానకరంగా భావిస్తే, ఆ జాతి అంతానికి చేరుకున్నట్లే!" అంటారు స్వామి వివేకానంద. గత వైభవాన్ని మర్చిపోయినంత కాలం మనమూ, మన దేశం స్తబ్ధతలో మునిగిపోతాం. అందుకే, మన ప్రాచీన సంస్కృతి గురించి తెలుసుకోవాలి. గడచిపోయిన సంగతులు తెలుసుకొంటూ, భవిష్యత్ మహత్కార్యాల సాధన వైపు నడవాలి. మన ప్రాచీన భారతీయ సంస్కృతిని గుర్తు చేసేందుకు చేస్తున్న ప్రయత్నమే ఈ వ్యాసాల పరంపర. సుప్రసిద్ధ రచయిత, బెంగుళూరు రామకృష్ణ మఠం అధ్యక్షులు స్వామి హర్షానంద మహరాజ్ మధ్యయుగాల కాలం దాకా విలసిల్లిన మన సంస్కృతిని 'శ్రీరామకృష్ణ ప్రభ' పాఠకులకు 2014 ఫిబ్రవరి సంచిక నుండి వివరిస్తున్నారు.

హిందువుల చిత్ర, శిల్ప కళలు

సారస్వత - విజ్ఞానాలకు ప్రతీకగా హైందవులు ఆరాధించే సరస్వతీదేవి చతుర్భుజగా కన్పిస్తుంది. ఒక చేతిలో పుస్తకం, రెండు చేతులలో వీణావాద్యం, మరొక చేతిలో జపమాలతో దేవి సాక్షాత్కరిస్తుంది. ఆమె రూపానికి గొప్ప సాంకేతిక వైశిష్ట్యం ఉంది. పుస్తకం - అపరావిద్యకు చిహ్నం. వీణ - లలిత కళలకూ, జపమాల - ఆధ్యాత్మిక జ్ఞానానికీ ప్రతీకలు. లౌకిక విద్యలు మానవుని జీవనభృతికి తోడ్పడతాయి. లలితకళలు వారి జీవితాన్ని సుసంపన్నం చేసి ఆనందాన్నీ, భావసౌఖ్యాన్నీ కలుగజేస్తాయి. ఆధ్యాత్మిక జ్ఞానం జీవిత పరమార్థాన్ని నెరవేరుస్తుంది. సరస్వతీదేవిని ఈ విధంగా చిత్రించిన హైందవం అన్నిరకాల విద్యలనూ దైవభావంతో చూస్తుంది.



హైందవ కళలు బహుముఖాలు. చిత్రలేఖనం, రంగులు వేయడం, శిల్పం, నాట్యం, నటన, సంగీతం అందులోని భాగాలు. నిజానికి వీటిని చతుష్షష్టి (64) కళలుగా తెలియజేస్తారు. వీటిలో కొన్ని: పువ్వుల అలంకరణ, అనేక రకాల పడకల అలంకరణ, మాయాజాలం, వంటలు -వార్పులు, పుస్తకపఠనం, కొయ్యపని, పోట్లాటలు, పద్యరచన, శారీరక వ్యాయామం, శిరోజాల అలంకరణ మొదలైనవి.

చిత్రలేఖనం : హిందూ సంస్కృతి అన్ని కళలనూ దైవీభూతంగా భావిస్తుంది. వీటి సృష్టి, ప్రాచుర్యం చతుర్ముఖ బ్రహ్మ లాంటి దేవతలు లేక భరతముని లాంటి మహర్షులచే జరగడం విశేషం. చిత్రకళ లేక రంగులు వేయడం నర - నారాయణులలో నారాయణ మహర్షితో ప్రారంభమైనట్లు భావిస్తారు. ఊర్వశి చిత్రాన్ని భూమి మీద ఆయన గీసి దానికి ప్రాణం పోసినట్టు ఐతిహ్యం. ఆయన విశ్వకర్మకు బోధించిన 'చిత్రసూత్ర' ఇప్పుడు లభించడం లేదు.

చిత్రలేఖనంలో ప్రామాణిక గ్రంథాలు రూపానికీ, సాముద్రికానికీ, భావ వ్యక్తీకరణకూ, సౌందర్యానికీ, రంగులకూ ప్రాధాన్యమిస్తాయి. ఈ గ్రంథాలు దామోదర గుప్తా 'కుట్టనిమత', విష్ణు దివ్యోత్తర పురాణ (క్రీ.శ. 1129), శిల్పరత్న.

రంగుల వేయడంలో నాలుగు విషయాలను వివరించారు: తెల్లని రంగులు వేయడానికి తగిన వస్త్రాన్ని ఎంచుకోవటం; ఆ వస్త్రం దృఢంగా ఉండడానికి బియ్యపు పిండి లాంటి పూత పూయడం; చిత్రం రూపురేఖలు నల్లని రంగులో వేయడం; తగిన రంగులు పూసి చిత్రాన్ని పూర్తి చేయడం.

ఈ గ్రంథాలలో రంగుల వాడకాన్ని గురించి అనేక వివరాలున్నాయి. ఎగుడు దిగుడుగా ఉన్న భూ ఉపరితలాలు, సముద్రపు అలలు, మంటలు, పొగ, మేఘాలు, జీవాలు, మానవుల అవయవాలను చిత్రించడాన్ని ఇందులో వివరించారు.

భారతదేశంలో ఇప్పటి వరకు బయల్పడిన పురాతన చిత్రకళను పరిశీలిస్తే అతి ప్రాచీనమైన ఖైమోర్, వింధ్య పర్వతాలలోని గుహచిత్రాలు; రాయగఢ్, మీర్జాపూర్ గుహలలోని చిత్రాలు ఉన్నాయి. ఇవన్నీకూడా కొన్ని వందల ఏళ్ళకు పూర్వం మొరటు రాతి పనిముట్లతో గీసిన వేటకు సంబంధించిన చిత్రాలు.

రాయగఢ్ కొండలలోని జోగిమర గుహల చిత్రాలు (సర్గూజ జిల్లా, మధ్యప్రదేశ్ - క్రీ.పూ. 200), అజంతా (క్రీ.పూ. 100, మహారాష్ట్ర) అతి ప్రాచీనమైనవి.

అజంతా చిత్రాలు నిపుణుల ద్వారా (క్రీ.పూ. 100 - క్రీ.శ.700 కాలంలో) చిత్రితమయ్యాయి. ఈ చిత్రాలు ఆసియా ఖండంలోని టిబెట్, ఆఫ్ఘనిస్తాన్, చైనా, కొరియా, జపాన్ లాంటి దేశాల చిత్రలేఖనాన్ని ప్రభావితం చేసినట్లు కన్పిస్తుంది. ఈ చిత్రరాజాలు అన్నివిధాలుగా పరిపూర్ణత చెంది చక్కని హావభావాలతో, రంగులతో అందంగా ఉంటాయి. ప్రకృతిలోని

వృక్షాలు, పుష్పాలు, జంతువులు, మానవులు (రాజులు, రాణులతోసహా), స్వర్గాధిదేవతలు, బుద్ధుడు, బోధిసత్త్వుడు వగైరా ఈ చిత్రాలలోని కొన్ని అంశాలు. 'భాగ్' గుహలు (గ్వాలియర్ – మధ్యప్రదేశ్)లోని చిత్రాలు వేరొక పద్ధతికి చెందినవైనా అజంతా చిత్రాలలాగే కనిపిస్తాయి. కర్ణాటకలోని బాదామి (క్రీ.శ. 700), శిట్టనివాసల్ – పుదుక్కోటై (తమిళనాడు, క్రీ.శ. 750), మహారాష్ట్రలోని ఎల్లోరా (కైలాస మందిరం, క్రీ.శ. 800), తంజావూరు బృహదీశ్వరాలయం (క్రీ.శ. 1100), తిరువాన్కూర్ (కొచ్చిన్ – కేరళ) మందిరాలలోని చిత్రాలు ప్రఖ్యాతి గాంచిన కళాఖండాలు.



తరువాత కాలంలో ప్రఖ్యాతి గాంచిన చిత్రకళ రాజపుత్ర లేక రాజపుట్ సంప్రదాయానికి చెందినది. హైందవ సంస్కృతిలో ఒక విశిష్టమైన స్థానం ఈ సంప్రదాయానికి ఉంది. ఆనాటి చిత్రలేఖనం లౌకిక, అలౌకిక జీవిత సత్యాలను సమపాళ్ళలో చూపగల్గింది. క్రీ.శ. 15 నుండి 18వ శతాబ్దం వరకు ప్రభవించిన ఈ చిత్రకళకు జైపూర్ కేంద్రం.

వివిధ మానవ భావోద్రేకాలను చిత్రిస్తూ ఇంద్రియ లోలత్వం, దానిని అధిగమించడానికి మానవ ప్రయత్నాలను చక్కగా చిత్రీకరించారు. శ్రీ రామాయణ–భారత దృశ్యాలు, రాధాకృష్ణుల రాసలీలలు, కృష్ణ–శివారాధన సంప్రదాయాలు ఆనాటి చిత్రకళకు ప్రధానాంశాలు. ఈ సంప్రదాయంలో హిందూ సంగీతంలోని ప్రామాణిక గ్రంథాల ఆధారంగా రాగ–రాగిణుల చిత్రీకరణ ఒక గొప్ప విశేషంగా చెప్పుకోవాలి. రాజపుత్ర సంప్రదాయం హిమాలయ ప్రాంతాలైన నూర్పూర్, చంబల్, జమ్మూ, కాంగ్రా ప్రాంతాలకు వ్యాపించింది. ఈ వ్యాప్తితో దానికి పహాడీ సంప్రదాయం అనే పేరు వచ్చింది. ఖటోక్ రాజుల (క్రీ.శ. 15–17వ శతాబ్దాలు) కాలంలో ఈ కళ అత్యున్నత స్థాయికి చేరుకుంది.

శిల్పకళ: చిత్రలేఖనానికి అనుబంధంగా శిల్పకళ అభివృద్ధి చెందింది. వేదాలలో దేవతల మూర్తి వర్ణనలు ఉన్నాయి. కనుక ఈ కళ క్రీ.పూ. 3000 నాటికే వ్యాప్తిచెందినట్లు భావించవచ్చు. బోధాయన గృహ్య సూత్రాలు (క్రీ.పూ. 600) విష్ణువు, గణేశ, యమ మూర్తుల వర్ణనే కాకుండా వాటి ప్రతిష్ఠాపన, ఆరాధన పద్ధతులను వివరించినవి. హరప్పా (క్రీ.పూ. 3000) త్రవ్వకాలలో ఇత్తడి విగ్రహాలు బయల్పడ్డాయి.

వైదిక కాలంలో విగ్రహాలను కొయ్య, రాతి, లోహం, మట్టి, ఇంకా అరుదైన రాళ్ళతో చెక్కారు. మౌర్యుల కాలం (క్రీ.పూ. 300) నాటికి దేవాలయాలలో అర్చా విగ్రహాలు, ఇండ్లలో ఆరాధనకు విగ్రహాలు కనిపిస్తాయి. మూర్తి ఆరాధనతో ఈ శిల్పకళ ఒక శాస్త్రంగా రూపొందింది. శుక్రనీతి సార, మాయామత, మానసార, బృహత్ సంహిత, శిల్పరత్న, శిల్పసార, సుప్రభేదాగమ, కారణాగమ మొదలైనవి ఈ కళకు సంబంధించిన ప్రామాణిక గ్రంథాలు. మూర్తి శిల్పానికి అవసరమైన వివరాలను ఈ గ్రంథాలు ప్రస్తావించాయి.

అర్చామూర్తులను శైవ, వైష్ణవ సంప్రదాయాలుగా విభజించారు. అవి మళ్ళీ 3 రకాలు – చల ప్రతిమలు, అచల ప్రతిమలు, చలాచల ప్రతిమలు. చలప్రతిమలంటే లోహంతో చేసి, ఉత్సవాలలో ఉపయోగించేవి. వాటిని 'ఉత్సవ విగ్రహాలు' అని పిలుస్తారు. ఇక, అచల ప్రతిమలను 'ధ్రువబేరాలు' లేక 'మూల విగ్రహాలు'గా పిలుస్తారు. వీటిని రాతితో చెక్కి, అచల ప్రతిష్ఠ చేస్తారు. గుడిలో ప్రతిష్ఠ చేసి, ఉత్సవ విగ్రహాలుగా కూడా వాడే మూర్తులను 'చలాచల ప్రతిమలు'గా పిలుస్తారు. పూరీ జగన్నాథ విగ్రహాలను ఇందుకు ఉదాహరణగా చెప్పుకోవచ్చు.


విగ్రహాలను స్థానక (నిలుచున్నవి), ఆసన (కూర్చొని ఉన్నవి), శయన (విశ్రాంతి స్థితి) భంగిమలలో చెక్కుతారు. విష్ణు విగ్రహాలే శయన భంగిమలో కనిపిస్తాయి. విగ్రహాలు ఉగ్ర, శాంత రూపాలలోనూ ఉంటాయి. దేవతామూర్తుల హస్తముద్రలు, ఆసనం, చిహ్నాలు, వసనాలు, ఆభరణాలను అనుసరించి ఆ దేవత భావప్రకటనను గుర్తించవచ్చు. హస్తముద్రలలో అభయ, వరద ముద్రలు, ఆసనాలలో పద్మాసన, యోగాసనాలు సర్వ సాధారణం. శివ–శక్తుల విగ్రహాలు డమరు, త్రిశూలం, పాశం, అంకుశం, బాణాలు, ఖడ్గం మొదలైన చిహ్నాలు కలిగి ఉంటాయి. చక్రం, శంఖం, గద, పద్మాలు వైష్ణవ విగ్రహ సూచకాలు.

ఈ విగ్రహ నిర్మాణానికి చాలా నియమ నిబంధనలున్నాయి. విగ్రహం ఎత్తు, వెడల్పు పరిమాణం, హస్తాల పరిమాణం తాళమాన సంప్రదాయాన్ని అనుసరించి నిర్ణయించేవి. ఒక తాళము అరచేతి ప్రమాణం కలిగి (మధ్య వ్రేలు నుండి అరచేతి మొదలు వరకు) ముఖం పొడవుకు సమానం. నవతాళ పద్ధతిలో విగ్రహం ఎత్తు తొమ్మిది తాళాల పరిమాణం కలిగి, దేవతా విగ్రహాలకు అనుకూలంగా ఉండేది.

కాలాంతరంలో నాలుగు రకాల శిల్పకళా పద్ధతులు అభివృద్ధి చెందాయి. అవి – మదురై పద్ధతి, కంచి పద్ధతి, చాళుక్య–హోయసాల పద్ధతి, బెంగాలీ పద్ధతులు (బెంగాల్, ఒరిస్సా, అస్సామ్‌లలో ఆచరించే పద్ధతి). ఈ సంప్రదాయాల వారు ఒకే రకమైన ప్రమాణాలను పాటించినా, వారి వారి ప్రత్యేకత ఉండేది. ❖ **అనువాదం: డాక్టర్ పి.వి.రెడ్డి**

జీవితంలో పురోభివృద్ధిని సాధించదలచిన వ్యక్తి అతినిద్ర, ఆలస్యం, భయం, కోపం, సోమరితనం, ఎంతకాలమైనా పనిని తెమలనీయకపోవడం - ఈ ఆరు దోషాలను విడువవలెను. - *హితోపదేశం*

జీవితం అన్నాక గెలుపోటములు సహజం. మనం ఓడినా, గెల్చినా, పైకెదిగినా, పతనమైనా అది మన ఒక్కరికే సంబంధించిన విషయం అనుకుంటాం. మనం ఏమైనా ఎవరికి బాధ అనుకుంటాం. ఎవరికీ నష్టం లేదనుకుంటాం. కష్టం కాదనుకుంటాం. కానీ నిజంగా మనతో, మన మంచి చెడులతో, గెలుపోటములతో ఎవరికీ సంబంధం లేదా? పొరపాటు. మనం ఒక్కరుగా, ఒకే ఒక్కరుగా పైనుంచి నీరవ నిశ్శబ్ద శూన్యంలోకి ఊడిపడలేదు. పుట్టడం ఒంటరిగానే అయినా, పుట్టాక మన చుట్టూ కన్న తల్లితండ్రులున్నారు. మన కుటుంబం ఉంది. సమాజం ఉంది. దేశం ఉంది. ప్రపంచం ఉంది. మనతో అన్నివిధాలా అందరికీ బంధం ఉంది. సంబంధం ఉంది. అలాగే, మనకూ అందరితో!



అందరివాళ్ళం!

– చక్కిలం హేమంత్ కుమార్

అరణ్యంలో ఓ చెట్టుంది. చూడడానికి అది ఒంటరిది. ఉన్నది అడవిలోనైనా దానితో ఎవరికీ సంబంధం లేదని ఎలా చెప్పగలం? అది ఆయుర్వేద మూలికలిచ్చే ఔషధ వృక్షం కావచ్చు. పళ్ళిచ్చే పనస చెట్టు కావచ్చు. పరిమళాన్నిచ్చే గంధపు చెట్టూ కావచ్చు. కొండ కోనల్లో ప్రవహించే నది ఉంది. దాని మానాన అది అవకాశం ఉన్న మార్గంలో ప్రవహిస్తూ వెళ్ళి సముద్రంలో కలుస్తుంది. దానితో మనకు సంబంధం లేదా? తాగునీళ్ళు, సాగునీళ్ళు, అభిషేక సంబారం. ఇక ఆకాశంలో చంద్రుడు... ఒడిలోని పసివాడు అన్నం తినాలన్నా, మనస్సుకు హాయినిగొలిపే వెన్నెల కావాలన్నా – ఇలా ఎన్నని? ఇక సూర్యుడో! చెప్పనే అక్కర్లేదు.

భగవంతుని సృష్టిలో వ్యర్థ సృజన ఏదీ లేదు. చిన్నా పెద్దా తారతమ్యం లేదు. ఎంత పెద్ద బట్ట కుట్టాలన్నా చిన్న సూది కావాలి. ఎంత భారీ వంట రుచిగా చేయాలన్నా చిటికెడు ఉప్పు కావాలి. మరి మనిషి? భగవంతుని సృజనలోనే అత్యంత శ్రేష్ఠమైన, ఉత్కృష్టమైన జీవి. ఆయన తనకు ప్రత్యామ్నాయంగా అత్యంత శ్రద్ధతో, ప్రత్యేకంగా సృష్టించుకున్న ఉన్నతోన్నత మానవ రూప మాధవుడు. మరి అలాంటి మనిషి ఇతరులకు చెందకుండా ఎలా ఉంటాడు!

ఒక రామకృష్ణ పరమహంస... ఆయన పండించిన ఆధ్యాత్మిక మధుర ఫలాలను ప్రపంచం మొత్తం ఆనందంగా ఆస్వాదిస్తూనేవుంది. ఒక హిట్లర్... అతడు సృష్టించిన మారణ హోమం సంబంధం లేని దేశాలతో సహా ప్రపంచాన్ని అగ్నిగుండం చేసింది. గాంధీ మహాత్ముడందించిన సత్యాహింసల శాంతి పవనాలతో ప్రపంచం నేటికీ సేదదీరుతోంది. స్వామి వివేకానంద అందించిన సేవాయోగం స్ఫూర్తిగా నేటికీ (రేపు కూడా) ఎందరో ఆ మార్గంలో నడుస్తున్నారు, మరెందరో నడిచేందుకు ముందుకు వస్తున్నారు. ఒక ఇంట్లో వెన్న కాస్తే వీధి మొత్తం కమ్మని నేతి వాసన వస్తుంది. ఒక ఇంట్లో కూర మాడితే ఆ ఘాటు చుట్టు ప్రక్కల ఎందర్నో ఉక్కిరిబిక్కిరి చేస్తుంది. ప్రాణాలతో నడియాడే మనిషి, పరమాత్మకు ప్రత్యామ్నాయమైన మనిషి కనురెప్ప కదిల్చినా ప్రపంచం మీద ప్రభావం చూపిస్తుంది. ఆ స్పృహతో మనం జీవించాలి.

ఇతరుల మీద ప్రభావం చూపించగలిగేది ‘సెలబ్రిటీలు’ మాత్రమే కాదు. సృష్టిలోని ప్రతి జీవీ, ప్రతి అణువూ వారి వారి, వాటి వాటి జీవన విధానం ద్వారా, జీవ స్వభావం ద్వారా, వ్యక్తిత్వం ద్వారా, ఉపకార, అపకార ప్రవృత్తి ద్వారా ఇతర ప్రపంచం మీద ప్రభావాన్ని కలిగి ఉంటాయి. పక్షిని చూసి మనిషి విమానాన్ని కనిపెట్టాడు. చేపను చూసి నావ నిర్మాణాన్ని చేపట్టాడు. యోగాసనాలన్నీ జీవ, జంతువుల చేష్టలే, అంగ విన్యాసాలే.

మనిషిగా, మహోన్నత జీవిగా మనం ప్రపంచానికి ఆదర్శం కావాలి. కనీసం... హితకారకం కాకపోయినా, అపకారకం కారాదు. కానీ జీవించాలనుకున్నప్పుడు ఆ జీవన విధానాన్ని ఎంచుకునే స్వేచ్ఛ, అవకాశం మనకున్నప్పుడు ఉన్నతంగా జీవిద్దాం. ఉత్తమంగా జీవిద్దాం. నిజమే! పూలు పరచిన బాటలో నడవాలన్నా ఆ అవకాశం మనకు లేకపోవచ్చు. కానీ ముళ్ళ బాటను, మురికి త్రోవను తప్పుకుని నడిచే అవకాశం మాత్రం కచ్చితంగా మనకుంది. విధి లేకపోతే శుభ్రం చేసుకునైనా! మనం ఎవరికో ఏమో కానక్కర లేదు. మన మానసిక జీవన విధానం ద్వారా అందరికీ బంధువవుదాం! అందరివాళ్ళమవుదాం!! ❖



తానె తానె ఇందరి గురుడు

– శ్రీమతి బి.కృష్ణకుమారి

తానె తానె ఇందరి గురుడు
సానబట్టిన భోగి జ్ఞానయోగి
అపరిమితములైన యజ్ఞాలు వడిజేయ
ప్రపన్నులకు బుద్ధి పచరించి
తపముగా ఫలపరిత్యాగము సేయించు
కపురుల గరిమల కర్మయోగి ॥
అన్ని చేతలును బ్రహ్మార్పణ విధిజేయ
మన్నించి బుద్ధులను మరుగ జెప్పి
ఉన్నత వదమున కొనరంగ కరుణించు
పన్నగ శయనుడె బ్రహ్మయోగి
తనరగ కపిలుడై దత్తాత్రేయుడై
ఘనమైన మహిమ శ్రీవేంకటరాయడై
ఒనరగ సంసార యోగము కృపసేయ
అనిమిష గతులను అభ్యాసయోగి

ధర్మసంరక్షణార్థం దయామయుడైన భగవంతుడు అపురూప అవతారాలెన్నో దాల్చాడు. సృష్టి, స్థితి, లయకారకుడైన ఆ సర్వేశ్వరుడు, నిర్గుణ నిరాకారుడే కాదు సంకల్పమాత్రాన సగుణ సాకారుడిగా సాక్షాత్కరించగలడని పలుమార్లు నిరూపించాడు. ఆ పరంపరలో పరమాత్ముడు పరమ భాగవతోత్తములైన అత్రిమహర్షి, అనసూయ దంపతులకు వరప్రసాదంగా దత్తాత్రేయుడై ఈ లోకంలో అవతరించాడు. ఆధి దైవిక, ఆధి భౌతిక, ఆధ్యాత్మిక తాపాలను అధిగమించిన అత్రిమహర్షి, దుర్గుణాలకు మూలమైన అసూయను జయించిన అనసూయ దంపతులు లక్ష్మీనాథుడిని వివిధ సాధనలతో ప్రత్యక్షం చేసుకున్నారు. వారి భక్తికి మెచ్చిన ఆ శ్రీహరి 'ఓ ముని దంపతులారా! నేను మీకు దత్తుడనయ్యాను' అంటూ మీకు సుపుత్రుడిగా జన్మిస్తానని వరమిచ్చాడు. అలా సాక్షాత్తూ శ్రీమన్నారాయణుడు శ్రీరామ, శ్రీకృష్ణ అవతారాల కంటే ముందే అత్రి, అనసూయ దంపతులకు దత్తాత్రేయుడై ఈ లోకానికి దిగివచ్చాడు. ఆ అవతార తత్త్వాన్ని అన్నమయ్య **'తానె తానె ఇందరి గురుడు'** అన్న కీర్తనలో అద్భుతంగా అక్షరీకరించాడు. సర్వజీవులను ఉద్ధరించడమే తన లక్ష్యంగా విచ్చేసిన దత్తాత్రేయుడు చతుర్యుగ అవతారమని సనాతన గ్రంథాలు శ్లాఘించాయి. అలాంటి మూర్తికి పదకవితా పితామహుడు గురుస్థానమిచ్చి జ్ఞానయోగి, కర్మయోగి, బ్రహ్మయోగి, అభ్యాసయోగి అని అభివర్ణిస్తున్నాడు.

జ్ఞానయోగి....

దత్తాత్రేయులు ఇప్పటి నేపాల్ ప్రాంతంలోని చిత్రకూటం దగ్గరనున్న 'అనసూయ పహాడ్' అనే చోట అవతరించాడని భక్తుల విశ్వాసం. అందుకు చిహ్నంగా ఇప్పటికీ అక్కడ ఒక దత్తమందిరముంది. ప్రహ్లాదుడు లాంటి భాగవతోత్తములకు యోగ విద్యను ఉపదేశించి కృతార్థులను చేసిన దత్తాత్రేయ స్వామిని శ్రీవాసుదేవానంద సరస్వతిస్వామి తమ 'దత్త పురాణం'లో...

దత్తాత్రేయం శివం శాంత మింద్రనీల నిభం ప్రభుమ్ ।
ఆత్మ మాయారతం దేవ మవధూతం దిగంబరమ్ ॥
భస్మో ద్ధూళిత సర్వాంగం జటాజూట ధరం విభుమ్ ।
చతుర్బాహు ముదారాంగం దత్తాత్రేయం నమామ్యహమ్ ॥

అని ఆ దివ్యరూపాన్ని కీర్తించారు. అంతటి మహిమాన్విత దేహం దాల్చిన భగవానుడిని పద్మావతీపతి ప్రియభక్తుడు పరమగురువుగా సంబోధిస్తున్నాడు. తానే ఇందరి గురువని, భోగానికి పదును పెట్టి, అధిగమించిన భోగియే కాదు జ్ఞానసిద్ధిని పొందిన జ్ఞానయోగి అని కూడా కొనియాడుతూ...

తానె తానె ఇందరి గురుడు, సానబట్టిన భోగి జ్ఞానయోగి అని స్తుతిస్తున్నాడు. భోగాలను అణచుకోవటం కాకుండా, వాటికి అతీతస్థితికి చేరుకొని, కామక్రోధ భయాలను వీడి అంతర్ముఖులు అయినవారే జ్ఞానానికి అర్హులు. అలాంటి స్థితితో పరోక్షంగా మనకు భగవంతుడు దత్తాత్రేయుల రూపంలో ప్రబోధించారు.

కర్మయోగి....

త్యాగబుద్ధితో చేసే ఈశ్వరారాధన, యజ్ఞయాగాదులు, లౌకిక కర్మలు కాలక్రమంలో యోగంగా మారతాయి; బంధవిముక్తులుగా మార్చి భగవంతుడికి దగ్గర చేస్తాయి. అయితే, చాలామంది కర్మకలాపాలు, ఆచారవ్యవహారాలు బంధహేతువులవుతాయని భ్రమపడుతూ వాటిని నిరసిస్తూ ఉంటారు. అలాంటి వారి బుద్ధిని

(మిగతా 34వ పేజీలో...)

కేవలం పామరులవలె వ్యవహరించుటకంటే వైదిక కర్మానుష్ఠానం మంచిది. దానికంటే సగుణోపాసన శ్రేష్ఠం. సగుణోపాసనకంటే నిర్గుణోపాసన శ్రేష్ఠతమం. ఇది అర్హతగలిగిన వారికి మాత్రమే! – పంచదశి



పరిప్రశ్న

– స్వామి భూతేశానంద
(రామకృష్ణ సంఘ 12వ సర్వాధ్యక్షులు)

రామకృష్ణ సంఘ 12వ సర్వాధ్యక్షులు - స్వామి భూతేశానందజీ మహారాజ్ (1901-1998) భక్తుల ఆధ్యాత్మిక సందేహాలకు సరళమైన రీతిలో ఇచ్చిన సమాధానాలను 'శ్రీరామకృష్ణ ప్రభ' పాఠకుల ప్రయోజనార్థం 2013 జూలై సంచిక నుండి ధారావాహికంగా ప్రచురిస్తున్నాం.

భక్తుడు: ధ్యానాన్ని ఎవరైనా, ఎప్పుడైనా అభ్యసించవచ్చా? 'సమాధి' అంటే ఏమిటి?

స్వామీజీ: మనం మేడపైకి వెళ్ళాలంటే మెట్లు ఒక్కొక్కటీ ఎక్కుతూ పైకి చేరుకుంటాం. అలాగే ధ్యానాభ్యాసానికి ముందు యమ (అహింస, సత్యం, అస్తేయం, బ్రహ్మచర్యం, అపరిగ్రహం); నియమ (శౌచం, సంతోషం, తపస్సు,



స్వాధ్యాయం, ఈశ్వరప్రణిధానం)లను అభ్యసించాలి. సాధారణంగా చాలామంది ధారణ, ధ్యానం ఒక్కటే అని భావిస్తారు. కానీ ధారణ (చిత్తాన్ని ఒకే ప్రదేశమందు నిలపడం)లో కృతకృత్యులైతే, ఆ తరువాత ధ్యానం (చిత్తాన్ని దేనియందు లగ్నం చేశామో దాని యందే చిత్తవృత్తి అఖండ ధారావాహికగా సాగడం) అభ్యసించడం సులభతరమవుతుంది.

ధ్యానాభ్యాసం ఎలాంటిదంటే శాస్త్రీయ సంగీతం నేర్చుకోవడం లాంటిది. సంగీతం నేర్చుకోవడానికి మొదట స, రి, గ, మ, ప, ద, ని, సల సాధన ఎంత అవసరమో, ధ్యానాభ్యాసానికి ముందు యమ నియమాలను అభ్యసించడం అంత ముఖ్యం.

ధ్యానంలో చిత్తానికి ఎలాంటి స్వరూపమూ ఉండదు. అంటే ధ్యేయం తప్ప ఇంకేమీ గోచరించదు. అలాంటి స్థితిని పొందిన ధ్యానావస్థే – సమాధి.

క్షీణవృత్తే రభిజాతస్యేవ మణేర్గ్ర హీతృ గ్రహణ
గ్రాహ్యేషు తత్థతదంజనతా సమాపత్తిః

(పతంజలి యోగసూత్రాలు–1.41)

"చిత్తం స్ఫటికమణిలా అత్యంత నిర్మలమవుతుంది. ఆ స్థితిలో ఇతర బాహ్యవృత్తులన్నీ నశించిపోయి కేవలం ధ్యేయవస్తువు (ఆత్మ)తో చిత్తం తాదాత్మ్యం చెందుతుంది. ఈ స్థితినే సమాపత్తి (సమాధి)" అని అంటారు.

'మనస్సును దేహం నుండి వేరుచేసి పరమాత్మతో అనుసంధానించడమే సమాధి' అని ఘేరండ సంహిత చెబుతోంది.

'కర్మేంద్రియాలు, జ్ఞానేంద్రియాలతో ఎలాంటి సంబంధమూ లేనట్టి మనోస్థితియే సమాధి' అని 'హఠయోగ ప్రదీపిక' వివరిస్తోంది.

సాధకుడు ముందుగా కర్మ, జ్ఞానేంద్రియాలను నిగ్రహించాలి. అప్పుడే అష్టాంగయోగంలో వివరించిన ఆసన, ప్రాణాయామ, ప్రత్యాహార, ధారణ, ధ్యాన, సమాధి అనే మిగతా మెట్లు అధిరోహించడం సులభతరమవుతుంది.

భక్తుడు: భగవల్లీలల గురించి ఆలోచించడం కూడా ధ్యానమే అవుతుందా?

స్వామీజీ: వైష్ణవ శాస్త్రాలు 'సేవాధ్యానం, లీలాధ్యానం, గుణధ్యానం' లాంటి ధ్యాన పద్ధతులను వివరించాయి. భగవంతుని లీలల్ని గురించి ఆలోచించడం వల్ల మనస్సులో విజాతీయ ఆలోచనలు తొలగిపోతాయి. అలా నిర్మలమైన మనస్సు భగవంతుని యందు సులభంగా లగ్నమవుతుంది. మనస్సును భగవంతుని యందు ఏకాగ్రం చేయడానికి ఈ ధ్యాన పద్ధతులు సహకరిస్తాయి. ❖

పండుగలు-పర్వదినాలు

డిసెంబర్ - 2014

02	మంగళవారం	:	ఏకాదశి
13	శనివారం	:	దివ్యజనని శ్రీశారదాదేవి జయంతి
18	గురువారం	:	ఏకాదశి, స్వామి శివానంద జయంతి
27	శనివారం	:	స్వామి శారదానంద జయంతి

జనవరి - 2015

01	గురువారం	:	కల్పతరు దినోత్సవం, వైకుంఠ ఏకాదశి
04	ఆదివారం	:	స్వామి తురీయానంద జయంతి
12	సోమవారం	:	స్వామి వివేకానంద జయంతి (తిథి ప్రకారం) జాతీయ యువజన దినోత్సవం
15	గురువారం	:	సంక్రాంతి
16	శుక్రవారం	:	ఏకాదశి
22	గురువారం	:	స్వామి బ్రహ్మానంద జయంతి
23	శుక్రవారం	:	స్వామి త్రిగుణాతీతానంద జయంతి
24	శనివారం	:	సరస్వతీ పూజ
30	శుక్రవారం	:	ఏకాదశి



రామకృష్ణ భక్తి సూత్రాలు

– స్వామి యతీశానంద

నారద భక్తి సూత్రాలు, శాండిల్య భక్తి సూత్రాలు భక్తియోగానికి సంబంధించిన ప్రామాణిక గ్రంథాలు. అయితే ఆధునిక తరంలో భగవద న్వేషకులకు అనువైన రీతిలో భక్తితత్త్వాన్ని బోధించారు శ్రీరామకృష్ణులు. ఈ నేపథ్యంలో 'శ్రీరామకృష్ణ కథామృతం' నుండి కొన్ని ఉపదేశాలను 'రామకృష్ణ భక్తి సూత్రాలు'గా సులభరీతిలో వివరించే ప్రయత్నం చేస్తున్నాం.

బౌద్ధగ్రంథాలు పాళీ భాషలో, బైబిల్ హీబ్రూలో, ఖురాన్ అరబ్బీ భాషలో రచించబడ్డాయి. అలాగే శ్రీరామకృష్ణుల ఉపదేశాలు వారి మాతృభాష బెంగాలీలో ఆవిష్కృతమయ్యాయి. అవతార పురుషుని ముఖతః వెలువడిన ఆ అమృతో పదేశాలను యథాతథంగా ఉట్టంకిస్తూ వ్యాఖ్యా నిస్తున్నాం. మహాశక్తిమంతమైన ఆ బోధనలను మననం చేసుకుంటూ కృతార్థులమవుదాం.

తాఁకె దర్శన్ హోలె సబ్ సంశయ్ మిటే జాయ్.

ఆయన (భగవంతుని) సాక్షాత్కారం అయితే, సంశయాలన్నీ సమసిపోతాయి.

శ్రీరామకృష్ణ ఉవాచ: భగవత్సాక్షాత్కారం అయితే, సంశయాలన్నీ పోతాయి. వినడం ఒకటి, చూడడం మరొకటి. విన్నంత మాత్రాన పదహారణాల (సంపూర్ణ) విశ్వాసం కలుగదు. సాక్షాత్కారమైతే ఇక ఏ మాత్రమూ అపనమ్మకం ఉండదు.

వ్యాఖ్య: భగవత్సాక్షాత్కారం అన్నా, భగవద్దర్శనం అన్నా, భగవంతుణ్ణి పొందడం అన్నా – అన్నీ ఒకటే. మనిషి మస్తిష్కంలో నానా సంశయాలు కలుగుతాయి. భగవంతుడున్నాడా? ఆయనను దర్శించగలమా? ఆయన సాక్షాత్కారం పిదప దుఃఖనివృత్తి అయి, చిరశాంతి లభిస్తుందా? మహాపురుషులు, శాస్త్రాలు చెప్పినది నిజమేనా?

మొదటి సంశయం భగవంతుణ్ణి దర్శించగలమా అన్నది! ఈ ప్రశ్నకు సమాధానం శ్రీరామకృష్ణులు స్వయంగా ఇలా చెప్పారు: "భగవంతుడున్నాడు. ఆయన్ని తప్పక దర్శించవచ్చు. అడపాదడపా ఏకాంత వాసం, ఆయన నామగుణగానం, నిత్యానిత్య వస్తువిచారణ – ఈ ఉపాయాలు చేపట్టాలి. భక్తి ద్వారానే దర్శనం కలుగుతుంది."

నీరు రెండు మూలకాల సమ్మేళనం అని పాఠశాల ఉపాధ్యాయులు చెబుతారు. విద్యార్థులు దాన్ని అంగీకరిస్తారు. కానీ ఒక మూల కొద్దిగా సందేహం ఉంటుంది. రెండు వాయురూప పదార్థాలు కలసి ద్రవంగా ఎలా మారుతాయి? ఉపాధ్యాయుడు చెప్పినది నిజమేనా? కానీ ఆ విద్యార్థులు ప్రయోగశాలలో ఆక్సిజన్ (ఆమ్లజని), హైడ్రోజన్ (ఉదజని) వాయువులను సరైన పరిమాణంలో కలిపి నిజంగానే నీరు ఉత్పన్నమైనదని కనుగొన్నప్పుడు, వారి సంశయం తొలగిపోతుంది.

మన సంశయాలన్నిటి మూల కారణం అజ్ఞానం. సచ్చిదానంద స్వరూప బ్రహ్మం సాక్షాత్కారమైనంతనే అజ్ఞానం నాశనమవు తుంది. తత్ఫలితంగా సంశయాలు దూరమవు తాయి. "భిద్యతే హృదయ గ్రంథిః ఛిద్యంతే సర్వసంశయాః.. తస్మిన్ దృష్టే పరావరే'– పర బ్రహ్మ దర్శనమైతే సంశయాలన్నీ నాశనమవు తాయి" అని ముండకోపనిషత్తు చెబుతోంది.

తాఁర్ దయా హోలె కి నా హోయ్!
హజార్ బత్సరేర్ అంధకార్ ఘొరె ఆలో
ఆనలె కి ఏక్‌టు ఏక్‌టు కొరే అంధకార్
జాయ్? ఏకేబార్ ఆలో హోయ్।

భగవంతుని కృపతో సాధ్యంకానిది ఏమైనా ఉంటుందా? వెయ్యేళ్ళుగా చీకటిగా ఉన్న గదిలోకి దీపం తెస్తే, ఆ అంధకారాన్ని కొద్ది కొద్దిగా పోగొడుతుందా? ఒక్కసారిగా ఆ గది అంతా వెలుగుతో నిండిపోతుంది.

శ్రీరామకృష్ణ ఉవాచ: భగవంతుని కృప కలిగితే ఒక్క క్షణంలో అష్టపాశాలు సడలుతాయి. ఎలాగో తెలుసా? వెయ్యేళ్ళుగా చీకటిగా ఉన్న గదిలోకి దీపం తెస్తే, ఒక్క క్షణంలో అంధకారం పటాపంచ లవుతుంది. గారడీ చూచావా! ఒక తాడుకు ఎన్నో ముళ్ళు వేస్తాడు. తాడు కొస ఒకటి దేనికో కట్టుతాడు, రెండోది పట్టుకొని ఒకటి రెండుసార్లు తాడును విదిలిస్తాడు. అంతే! ముడులన్నీ ఊడిపోతాయి. మరొకడు ఎంత ప్రయత్నించినా అలా చేయలేడు.

భగవంతుని దయ కలిగితే ఇక భయం లేదు. పిల్లవాడు తండ్రి చేయిపట్టుకొని నడుస్తుంటే, క్రింద పడవచ్చు. కానీ తండ్రి గనక పిల్లవాడి చేయి పట్టుకుంటే ఇక భయం ఉండదు. అలాగే, ఆయన అనుగ్రహించి సందేహాలను పోగొట్టి, సాక్షాత్కరిస్తే ఇక బాధలుండవు, బంధాలుండవు.

వ్యాఖ్య: భగవదనుగ్రహం గురించి శ్రీరామకృష్ణులు 'ఎందుకు కాదు? ఎందుకు జరుగదు?' అని గట్టిగా అనేవారు. అంటే, భగవంతుని అనుగ్రహంతో అసంభవం సంభవమవుతుంది. వెయ్యేళ్ళుగా చీకటిగా ఉన్న గదిలోకి దీపం తెచ్చే దృష్టాంతం చెప్పారు శ్రీరామకృష్ణులు. అంటే అనేకానేక జన్మలుగా పేరుకు పోయిన అజ్ఞానాన్ని, భగవంతుని కృప అనే జ్యోతి పటాపంచలు చేస్తుంది. కనుకనే భగవంతుణ్ణి అహేతుక కృపాసింధువు అంటారు. ❖ **అనువాదం: డాక్టర్ కమల జయరావు**

మానవునిలో నిరతిశయము, ఉత్తమము అయిన సుఖం కలుగవలెననీ, విషయదుఃఖం నశించవలెననే దృఢమైన సంకల్పం కలిగివుండాలి. అలాంటి సంకల్పం నుండే మోక్షేచ్ఛ జనిస్తుంది. – హితోపదేశం



పని మంచిదైతే... సమయం మంచిదే!

– రాచమడుగు శ్రీనివాసులు

మాయా జూదంలో పాండవులు ఓడిపోయారు, కౌరవులు గెలిచారు. నియమాలను అనుసరించి పాండవులు హస్తినాపురాన్ని వదలి అరణ్యాలకు వెళ్ళారు. మూడు రోజులు నడక సాగించి కిమ్మీర వనంలోకి ప్రవేశించారు. భయంకర ఆకారంతో ఉన్న ఒక రాక్షసుడు వారికి ఎదురయ్యాడు. “నేను బకాసురుని తమ్ముడిని. నా పేరు కిమ్మీరుడు. నేను మనుషులను చంపి తినేవాడను” అని తనను తాను పరిచయం చేసుకొన్నాడు. అప్పుడు ధర్మరాజు అతనితో “మేము పాండవులము. నేను యుధిష్ఠిరుడను, వీరు నా తమ్ములు – భీమార్జున నకుల సహదేవులు. ఈమె ద్రౌపది” అని చెప్పాడు. అప్పుడా రాక్షసుడు భీముని వైపు చూస్తూ “ఇతడేనా భీముడు? ఇతనిని చంపాలని ఎంతోకాలంగా ఎదురు చూస్తున్నాను. ఈ రోజు పుణ్యదినం. దైవయోగం వల్ల ఈ రోజు ఇతడు నా కంటబడ్డాడు. ఇతడు నా సోదరుడైన బకాసురుడిని చంపాడు, నా స్నేహితుడైన హిడింబుని చంపి, వాని చెల్లెలు హిడింబిని వశపరచుకొన్నాడు. ఇప్పుడు వీనిని చంపి వీని రక్తంతో బక, హిడింబులకు తర్పణం చేస్తాను. వారి ఋణం తీర్చుకొంటాను” అని భీమునితో తలపడ్డాడు.

భీమ, కిమ్మీరుల మధ్య అతి భయంకరమైన యుద్ధం జరిగింది. భీముడు వానిని తన రెండు చేతుల మధ్య బంధించి, మెడను వంచి, పైకి ఎత్తి గిరగిర తిప్పి, వాని దేహాన్ని సగానికి విరచి నేల మీదికి విసిరి కొట్టాడు. కిమ్మీరుడు రక్తం కక్కి చచ్చాడు. భీముడు వాని శవాన్ని దూరంగా విసిరి పారేశాడు. ఇది మహాభారతంలోని అరణ్యపర్వంలో ఉండే కథ.

పై కథలో కిమ్మీరుడు పాండవులను చూసిన ఆ దినం ‘పుణ్యదినం’ అన్నాడు; వారి కలయిక ‘దైవయోగం’ అన్నాడు; భీముడిని చంపడం, అతని రక్తంతో ‘తర్పణం’ విడవడం తాను బక, హిడింబులకున్న ‘ఋణాన్ని’ తీర్చుకోవడం అన్నాడు. కానీ జరిగిన విషయాన్ని బాగా గమనిస్తే మనకు తెలిసేది ఏమిటంటే ‘పుణ్యదినం’ అనుకొన్న ఆ దినం వానికి మృత్యుదినం అయింది. భీముని చంపి అతని రక్తంతో తర్పణం చేద్దామనుకొంటే వాని రక్తంతోనే భీముడు తర్పణం చేశాడు. తాను తీర్చుకోదలచిన మిత్ర ఋణం, భ్రాతృ ఋణం కిమ్మీరునకు అలాగే మిగిలిపోయాయి. పుణ్య దినం, దైవయోగం, తర్పణం, ఋణం లాంటి మంచి మాటలను ఎన్ని వాడినా కిమ్మీరునకు దక్కవలసిందేదో అదే దక్కింది.

సర్వసాధారణంగా మనం ఏ పని ప్రారంభించాలన్నా ఏ పండితుడినో, పూజారినో సంప్రతించి ఆయన సలహాను కోరుతాం. ఆయన పంచాంగం చూసి తిథి, వార, నక్షత్రాలను పరిశీలించి, ఒక శుభదినాన్ని, శుభలగ్నాన్ని, ముహూర్తాన్ని సూచిస్తాడు. మనం ఆయన సలహా పాటించి పనిని ప్రారంభిస్తాం. కానీ కొన్ని సందర్భాలలో విజయం సాధించలేం, విఫలమవుతాం. ఎందుకనేది ఆలోచించం. తిథి, వార, నక్షత్రాలు, ముహూర్తాలు – అన్నీ బాగున్నా మన తలంపులు, మన పనులు మంచివి కాకపోతే దుష్ఫలితాలే ఉంటాయి. కిమ్మీరునకు ‘దినం’ మంచిదని తెలుసు గానీ భీముడు తన వారిని ఎందుకు చంపాడో తెలియదు. భీముడిని చంపాలన్న తన ఆలోచన ప్రమాదకరమనీ తెలీదు. భీమునికి దైవబలం, ధర్మబలం అండగా ఉన్న విషయం తెలీదు. అందుకే వానికి ఆ దుఃస్థితి. అందుకే ఆ దుర్మరణం.

పని మంచిదైతే ఏ ముహూర్తమైనా మంచిదే!
పని చెడ్డదైతే ఏ ముహూర్తమైనా చెడ్డదే!
మంచి పనిని వాయిదా వేయరాదు.
చెడ్డ పనిని వెంటనే చేయరాదు!

సర్వశక్తి సంపన్నుడు, సర్వజ్ఞుడు అయిన భగవంతుని విశ్వసించి, ధర్మాన్ని అనుసరించి, సత్యాహింసలను పాటిస్తే ప్రతి నిమిషమూ మంచిదే! ప్రతి దినమూ పవిత్రమైనదే! ప్రతి ఘడియా శుభఘడియే!

భీమునికి అనుకూలం – ధర్మం, దైవం. అవి రెండూ అనుకూలమైతే, ఏది ఎట్లా ఉన్నా విజయం మనదే. ఆద్యంతం మహాభారతం మనకు చేసే బోధ అదే. ❖



మహాపురుషుని సాన్నిధ్య స్మృతులు

– స్వామి అర్చనానంద

జగద్గురు ఆదిశంకరాచార్యులు 'వివేక చూడామణి'లో ఇలా బోధించారు–'దుర్లభం త్రయమేవైతత్ దైవానుగ్రహ హేతుకమ్, మనుష్యత్వం ముముక్షుత్వం మహాపురుష సంశ్రయః'– 'విశ్వంలో ఈ మూడూ దుర్లభమైనవి, ఆ విశ్వేశ్వరుని అనుగ్రహం వల్ల మాత్రమే సంభవించేవి. మనుష్యత్వం – మనిషిగా జన్మించడం; ముముక్షుత్వం – మోక్షాన్ని పొందాలనే ఆకాంక్ష; మహాపురుషుల సంశ్రయం – మహాత్ముల సాన్నిధ్యం. శ్రీరామకృష్ణ మహాసంఘ 13వ సర్వాధ్యక్షులు అయిన పరమ పూజ్య స్వామి రంగనాథానందజీ మహరాజ్ వారిని స్మరిస్తే పైశ్లోకమే గుర్తుకు వస్తుంది.



హైదరాబాద్ రామకృష్ణ మఠంలో పూజ్య స్వామీజీ రోజూ కొబ్బరితోట మధ్యనున్న దోవలో నడిచేవారు. వారు నడుస్తూంటే 'నిర్గచ్ఛతి జగజ్జాలాత్ పింజరాదివ కేసరీ – జీవన్ముక్తుడు మాయా మోహ జగత్ జాలాన్ని ఛేదించి సింహంలా ఆత్మస్వాతంత్ర్యంతో విహరిస్తాడు' అనే శ్లోకం గుర్తుకు వచ్చేది. మఠం అంతా వారి ఆధ్యాత్మిక శక్తి ప్రకంపనాలతో కంపిస్తోందా? అనిపించేది. స్వామీజీ ఆజాను బాహువు. వారి నుదురు, చెవులు, చేతులు, కాళ్ళు, హృదయమూ అన్నీ పెద్దవే! శంకరాచార్యుల మేధాశక్తి; వివేకానందుల ఆత్మశక్తి, దేశభక్తి; శ్రీరంగనాథస్వామి (మహావిష్ణువు) విశ్వవ్యాపక చైతన్య దీప్తి – అన్నీ సమ్మిళితమై నడుస్తున్నాయా? అని అనిపించేది.

పూజ్యస్వామీజీ పూర్వాశ్రమ నామధేయం – శంకరన్. దైవేచ్ఛగా ఆదిశంకరుల జన్మస్థలమైన కేరళలోని 'కాలడి' గ్రామానికి దగ్గరే ఉన్న 'త్రిక్కూర్' అనే గ్రామంలో స్వామీజీ జన్మించారు. 'When I sit and speak I am Shankara, When I lie down I am Ranganatha – నేను కూర్చొని ప్రసంగించేటప్పుడు శంకరుణ్ణి, శయనించి ఉన్నప్పుడు శ్రీరంగనాథుణ్ణి అనే వారట హాస్యంగా!

చిన్న పనైనా పెద్ద మనస్సుతో... పూజ్య స్వామీజీ మఠం ఉద్యానంలో నడకకు వెళ్ళినపుడు అక్కడక్కడ నిమ్మకాయలు, పచ్చి మిరపకాయలు గాలికి రాలిపడి ఉండేవి. వాటిని ఎంతో శ్రద్ధతో చేతిలోకి తీసుకుని వంటశాలకు వెళ్ళి 'ఇవి గార్డెన్‌లోని నిమ్మకాయలు, మిరపకాయలు' అని చిన్న పిల్లవాడిలా చెప్పి, ఇచ్చేవారు. 'పెద్ద మనసుతో చేస్తే చిన్నపని కూడా పెద్ద పని అవుతుంది; చిన్న మనసుతో చేస్తే పెద్దపని కూడా చిన్నదైపోతుంది' అని వారు గీతోపన్యాసాలలో బోధించిన దానిని ఆచరణలో చూపిన 'అనుష్ఠాన వేదాంతి' పూజ్య స్వామీజీ.

ప్రకృతి పట్ల ఆరాధనాభావం: ఉద్యానంలోని చెట్లు చేమలపై స్వామీజీకి విశేషమైన ప్రేమ ఉండేది. అనవసరంగా ఏ మొక్కల్నీ పీకవద్దనేవారు. గడ్డిపూల చెట్లను చూపిస్తూ– 'ఈ పూలు కూడా ఎంత అందంగా ఉన్నాయో' అంటూ ఆనందించేవారు. మఠం తపోవనంలా ఉండాలని చాలా చెట్లను నాటించారు. అందులో కొన్ని వెదురు చెట్లు చాలా ఎక్కువగా పెరిగిపోయాయనీ, అడ్డంగా ఉన్నాయనీ స్వామీజీ లేని సమయంలో గార్డెన్ ఇన్‌ఛార్జి స్వామి వాటిని నరికివేయించారు. తిరిగి వచ్చిన తరువాత అది చూసిన స్వామీజీ, అతణ్ణి పిలిపించి "You have not cut the bamboo trees, but you have cut my hands. This is Math. We want a forest here. What harm those trees have done to you? – నువ్వు నరికింది వెదురుచెట్లను కాదు, నా చేతుల్ని. ఇది మఠం. తపోవనంలా ఉండాలి. ఈ చెట్లు నీకేమి హాని చేశాయి?" అని మందలించగానే, ఆ స్వామి సాష్టాంగపడి క్షమాపణవేడుకున్నారు!

పూజ్య స్వామీజీ ఓసారి మైసూరు రామకృష్ణ మఠం నుండి కొన్ని పూల విత్తనాలు తీసుకొచ్చి, ఆ విత్తనాల పొట్లం నాకు అందిస్తూ "ఇవి Evening glory అనే చాలా అందమైన పూలవిత్తనాలు. ఈ చెట్లపూలు తెలుపురంగులో ఇంత పెద్దవిగా (చేతులు చాపి చూపిస్తూ) సాయంత్రం పూట విరబూస్తాయి. దేవాలయ ప్రవేశమార్గం దగ్గర రెండు వైపులా ఈ విత్తనాలు నాటు" అన్నారు. రామకృష్ణ సంఘ ఉపాధ్యక్షులైన పూజ్య స్వామీజీ ఈ పూల విత్తనాలను స్వయంగా తీసుకురావడం, అంత శ్రద్ధతో అందివ్వడం నాకు ఆశ్చర్యం, ఆనందం కలిగించాయి.

కొన్నాళ్ళకు ఆ విత్తనాలు చెట్లయి, పెద్ద పెద్ద పూవుల నివ్వసాగాయి. శ్రీరామకృష్ణుల దేవాలయం రెండు వైపులా గోడలకు కంచె మీదుగా పాకుతూ ఈ తెల్ల పుష్పాలు సాయంవేళలలో ఎంతో దివ్య శోభనిస్తూ, 'అవతార వరిష్ఠుని ఆరతికి మేమూ సిద్ధమే!' అని తలలూపుతున్నట్లు అనిపించేది. పూజ్య మహరాజ్ సాయంత్రంపూట అలా నడుస్తూ ఆ పుష్పాలను, తీగలను చాలా ప్రేమతో చూసేవారు. ❖

(డిసెంబరు 15న స్వామి రంగనాథానందజీ జయంతి)


శ్రేష్ఠుడు దేనిని ఆచరించునో ఇతరులు దానినే ఆచరించును. అతడు దేనిని ప్రామాణీకరించునో, లోకం దానినే అనుసరించును. తాను సకల కర్మలు చేస్తూ ఇతరులకు కర్మలందు శ్రద్ధను కలిగించును. – శ్రీకృష్ణుడు

వస్తు వినియోగ దోషం

- శ్రీమతి భమిడిపాటి బాలాత్రిపురసుందరి

ధర్మం నాలుగు పాదాలతో నడుస్తుంటే అధర్మం ఎక్కడుంటుంది? అధర్మం లేని చోట కలి నిలబడలేదు. ఎవరి ఇంట్లో అయితే దైవభక్తి, పెద్దల యందు భక్తి, మంచి నడవడిక ఉంటాయో అక్కడ కలికి ప్రవేశం ఉండదు.

ధర్మరాజు పాలనలో కలికి ప్రవేశం లేదు. పరీక్షిత్తు కలిని చంపబోయినప్పుడు కాళ్ళమీద పడి ప్రాణభిక్ష పెట్టమని అడుగుతాడు. కలిని తన రాజ్యం నుండి దూరంగా వెళ్ళిపొమ్మంటాడు పరీక్షిత్తు మహారాజు. 'ఎటు చూసినా నీ రాజ్యమే ఆక్రమించి ఉంది. అడవులు, గుట్టలు, నదులు అంతా ఆక్రమించి ఉన్నావు. నేనుండడానికి ప్రదేశమే లేదు' అన్నాడు కలి. పరీక్షిత్తు ఆలోచించి ప్రాణహింస, జూదం, వ్యభిచారం, పానం, అసత్యం, మదం, కామం, హింస, వైరం అనే తొమ్మిది ప్రదేశాల్లో నివసించమన్నాడు.



పరీక్షిత్తు మహారాజై కూడా కలిని ఎందుకు చంపలేదు? కలియుగంలో ఒక విశేషం ఉంది. పాపాలు చేసినప్పుడే పాపం కలుగుతుంది. కానీ 'పుణ్యం చేస్తాను' అని అనుకోగానే పుణ్యం కలుగుతుంది. ఇంత మంచి అవకాశాన్ని మనిషి ఎలా వదులుకుంటాడు? పుణ్యాలే పొందుతాడు అనుకుని కలిని వదిలేశాడు పరీక్షిత్తు.

ఒక గృహస్థు ఒక సన్న్యాసిని భోజనానికి పిలుస్తాడు. వెండి కంచంలో వడ్డిస్తాడు. భోజనం చేశాక సన్న్యాసి కంచాన్ని కడిగి, తన జోలెలో వేసుకుని వెళ్ళిపోతాడు. అది చూసిన గృహస్థు తన పాపం పోయిందనుకుని ఊరకుంటాడు. సన్న్యాసి తిరిగి తిరిగి సాయంత్రం ఒక నది దగ్గర కూర్చొని అనుష్ఠానం చేసుకుందామని విభూతి కోసం జోలెలో చెయ్యి పెట్టాడు. చేతికి వెండి కంచం తగులుతుంది. అసలు వెండి కంచం తనెందుకు తెచ్చాడో తెలియక దివ్యదృష్టితో దాని చరిత్ర చూస్తాడు. గృహస్థు తాను దొంగతనం చేసి తెచ్చిన వెండి కంచంలో భోజనం పెట్టడం వల్ల ఆ సంస్కారం సన్న్యాసిలో ప్రవేశించింది.

పరీక్షిత్తు మహారాజు వేటకు వెళుతూ తాత భీమసేనుడు గతంలో జరాసంధుణ్ణి చంపి తెచ్చిన మణులు పొదిగిన బంగారు కిరీటాన్ని ధరించాడు. అది ధరించగానే ఆయనలో రజోగుణం ప్రవేశించింది. వేటాడి అలిసిపోయిన పరీక్షిత్తు దాహంతో చుట్టూ చూస్తాడు. నిశ్చలంగా తపస్సులో లీనమైన శమీక మహర్షి కనిపిస్తాడు. ఎన్నిసార్లు పిలిచినా పలకలేదన్న కోపంతో ఒక చచ్చిన పాముని తెచ్చి ఆయన మెడలో వేస్తాడు. శమీక మహర్షి కొడుకు శృంగి జరిగినదాన్ని తెలుసుకుని తపస్సు చేసుకుంటున్న తండ్రిని అవమానించాడన్న కోపంతో ఆనాటికి ఏడవ రోజు తక్షకుడి విషంతో రాజు దగ్ధమవ్వాలని శపిస్తాడు.

పరీక్షిత్తు మహారాజుకు జరిగినదేమీ తెలియదు. రాజమందిరానికి రాగానే కిరీటం తీసి పక్కన పెడతాడు. అప్పుడు ఆయనలో ఉన్న రజోగుణం తగ్గి, తాను చేసిన పనిని తలచుకొని పశ్చాత్తాపం పొందుతాడు. అప్పటికే జరగవలసినది అంతా జరిగిపోయింది. అసలు విషయం శమీక మహర్షి శిష్యులు వచ్చి తెలియజేస్తారు. మహారాజు ఉత్తమ సంస్కారం కలవాడు కనుక తనకు మంచే జరిగిందనుకున్నాడు. మరణం ఎప్పుడు సంభవిస్తుందో ఎవరికీ తెలియదు. తనకు తెలుసు కనుక, భగవచ్చింతనలో సమయాన్ని సద్వినియోగపరుచుకోవాలనుకున్నాడు.

పవిత్రమైన భారతదేశంలో పుట్టినవాడు, పరమ భాగవతోత్తముడు, అశ్వమేధయాగం చేసినవాడు, సదాచార సంపన్నుడు, రాజనీతిజ్ఞుడు, రాజకులభూషణుడు పరీక్షిత్తు మహారాజు. శాపాలకు ప్రతిశాపం ఇవ్వగల సమర్థుడైనా గోవులకూ, దేవతలకూ, బ్రాహ్మణులకూ అపకారం చెయ్యకూడదన్న వివేకం ఆయనను ఆపింది.

పరీక్షిత్తు అసుర గుణాలు కలిగినవారి వస్తువులను వాడడం వల్ల వివేకాన్ని కోల్పోయాడు. అదే ఆయనకు శాపమైంది. కాబట్టి సాధకులు అవినీతిపరులకు దూరంగా ఉండాలి. అన్యాయంగా సంపాదించిన వాటిని స్వీకరించకుండా జాగ్రత్తపడాలి. ❖

ధీరవాణి

- స్వామి వివేకానంద

పూర్ణత్వమే మన సహజగుణం



నా సోదరులారా! మనం బాగా గ్రహించవలసిన ముఖ్యాంశమిది. భవిష్యత్కాలంలో మనం పట్టుదలతో అనుసరించవలసింది ఈ ఒక్క విషయమే అని మీకు తెలుపుతున్నాను. మీరు దీన్ని చక్కగా గ్రహించాలని నా ప్రార్థన. దివారాత్రాలు తాను వ్యర్థుడనని మననం చేస్తూ ఉండే మనిషి వల్ల ఎలాంటి శుభమూ కలగబోదు. మనుష్యుడు రేయింబవళ్ళు తాను దుఃఖితుడననీ, అధముడననీ, పనికిమాలిన వాడిననీ భావిస్తూ వుంటే అతడు పనికిమాలినవాడే అయిపోతాడు. నిన్ను నువ్వు... 'నేను ప్రయోజకుణ్ణి' అని అనుకుంటే అలాగే అవుతావు. ఈ మహాసత్యాన్ని గుర్తు పెట్టుకోవాలి.

మనం ఆ సర్వశక్తిమయుని బిడ్డలం; మనం ఆ అఖండ దివ్యాగ్నిలోని రవ్వలం. మనం పనికిమాలినవారం ఎలా అవుతాం? మనం దేన్నైనా చేయగలం. ఈ ఆత్మ విశ్వాసం మన పూర్వుల హృదయాల్లో ప్రకాశించింది. నాగరకతా భివృద్ధిలో వారిని ముందుకు తీసుకొని వచ్చిన క్రియాశక్తి ఈ ఆత్మవిశ్వాసమే! మనకు భ్రష్టత్వం వాటిల్లితే, దోషం చేకూరితే, నా మాటను గుర్తుపెట్టుకోండి – తనపై తాను విశ్వాసం పోగొట్టుకోవడమంటే భగవంతుని పట్ల విశ్వాసం పోగొట్టుకోవడమే! ఈ అంతర్యామి ప్రతి పరమాణువులో వెలసి, నీ శరీరమంతటా, నీ మనస్సులో, నీ ఆత్మలో ఓతప్రోతంగా, (పడుగుపేకగా) వ్యాపించి ఉన్నట్లు నీవు విశ్వసిస్తే ఇక అధైర్యపడడం ఎందుకు? నేను ఒక చిన్న నీటిబుడగను కావచ్చు; నీవు పర్వతోత్తుంగ తరంగానివి కావచ్చు. విచారమెందుకు? ఆ అనంత సాగరం నీకు, నాకు కూడా ఆధారక్షేత్రమై ఉంది.

కాబట్టి నా సోదరులారా! ఈ జీవప్రదమైన, మాన్యమైన, ప్రభావవంతమైన, మహాసిద్ధాంతాన్ని మీ బిడ్డలకు వారు పుట్టిననాటి నుండే బోధించండి. మీరు వారికి అద్వైతం నేర్పనక్కర్లేదు; ద్వైతమే బోధించండి; లేక మీ కిష్టమైన ఏ మతాన్నైనా బోధించండి. ఏది బోధించినా – భారత దేశమంతటా ఆత్మ యొక్క పూర్ణత్వం గూర్చిన ఈ సిద్ధాంతమే శాశ్వతమై నిలువగలదు. దీన్నే సకల సంప్రదాయాలూ విశ్వసిస్తున్నాయి. ఆ మహాతత్త్వవేత్త కపిలాచార్యులు చెప్పినట్లు, జీవాత్మ స్వభావం చేతనే పవిత్రమైంది. కాబట్టి, మన తత్త్వవేత్త లందరూ పవిత్రతే మన స్వభావమనీ, పూర్ణత్వమే మన సహజగుణమనీ అంటారు. అంతేకానీ, అపూర్ణత, మాలిన్యం మన స్వభావం కాదు.

ఒక మహర్షి ప్రాణావసానకాలంలో తన మహా కార్యాల నన్నిటినీ, తన మహోత్తమ సంకల్పాలనన్నిటినీ జ్ఞప్తికి తెచ్చుకోమని తన మనస్సును హెచ్చరించాడట! తన దోషాలనూ, లోపాలనూ జ్ఞప్తికి తెచ్చుకోమని మనస్సుకు చెప్పలేదు. చూశారా! మనోహరమైన ఈ ఉదాహరణను ఎన్నడూ మరువకండి. లోపాలా... ఉంటాయి! దుర్బలత్వమా... ఉండి తీరుతుంది! అయినా, మీ యథార్థ స్వభావాన్ని నిరంతరం జ్ఞప్తిలో ఉంచుకోండి. మన దౌర్బల్యాన్ని పోగొట్టుకోవడానికి ఇది ఒక్కటే మార్గం! మన దోషాలను నివారించుకోవడానికి ఇది ఒక్కటే త్రోవ! ❖

పరతత్త్వమైన బ్రహ్మం ఎక్కడో గుహాదులయందుగానీ, తీర్థములయందుగానీ, కర్మకాండలయందు గానీ లేదు. శోధించి చూసిన ప్రాజ్ఞులకు తానే బ్రహ్మమని తెలుస్తుంది. - సర్వసిద్ధాంతసార సంగ్రహం

అద్భుతం అమ్మ జీవితం

– స్వామి శుద్ధిదానంద

భగవంతుడు అవతరించడానికి ముఖ్యకారణాలు రెండు. భగవద్గీతలో చెప్పినట్లు 'ఎప్పుడెప్పుడైతే ధర్మగ్లాని సంభవిస్తుందో, అప్పుడప్పుడు భగవంతుడు స్వయంగా మానవరూపం దాల్చి ధర్మప్రతిష్ఠాపన తిరిగి చేస్తాడ'నేది ఒక కారణం. దేవీ మాహాత్మ్యం (చండీ సప్తశతి) కూడా 'ఆద్యంతరహిత అయిన జగజ్జనని ప్రపంచాన్ని కాపాడేందుకు మరల మరల మానవ రూపాన్ని ధరించి అవతరిస్తుంద'నే సత్యాన్ని స్పష్టం చేస్తోంది.

ఇక రెండో కారణం – 'ఆధ్యాత్మిక సాధకులకు మార్గదర్శనం చేసేందుకే నిరాకార పరబ్రహ్మం రూపుదాల్చి సాకారమవుతుంద'ని శ్రీరామపూర్వతాపిన్యుపనిషత్‌లో పేర్కొనబడింది. 'భక్తుల కొరకు భగవంతుడు స్వయంగా ప్రత్యక్షం అవుతాడ'ని భాగవతంలో కూడా ఉంది. అయితే ఇందులో రెండు అంశాలను గమనించాలి. 1. భక్తుడు భగవంతుణ్ణి సాకారరూపంలో దర్శించాలని కోరుకుంటాడు. 2. భగవంతుడు కూడా భక్తుని ప్రేమను అంతే ఆనందంగా స్వీకరిస్తాడు. ఈ రెండు కారణాల వల్ల భగవంతుడు మానవాకృతి దాలుస్తాడు. భగవంతునికి భక్తుని పట్ల గల వాత్సల్యం, భక్తునికి భగవంతుని పట్ల ఉన్న ప్రేమ కలగలిసి ఒక లీలకు దోహదపడుతుంది. ఈ కోణంలో మనం మాతృదేవి జీవితానికి సంబంధించిన విషయాలను గమనించే ప్రయత్నం చేద్దాం.

జగన్మాతలో అనంతశక్తి విభూతులు, సకలైశ్వర్యాలు ఇమిడి ఉన్నాయి. అయితే ఇవన్నీ బాహాటంగా ప్రదర్శిస్తే, భక్తులు భయభక్తులతో దూరంగా నిలచి ఉంటారనీ, వారిలోని భయాన్ని దూరంగా నెట్టి ఆప్యాయతానురాగాలతో దగ్గరకు చేర్చుకోవాలనే ఉద్దేశ్యంతో, ఆ అమ్మ తనలోని అనంత ప్రాభవాన్నీ, ఐశ్వర్యాన్నీ మరుగుపరచి, సామాన్య మానవదేహాన్ని ధరించి, ఒక విధమైన లీల ప్రదర్శించేందుకే దిగి వచ్చింది. ఆ తల్లి మరెవరో కాదు – సాక్షాత్తూ దివ్యజనని శారదాదేవే! ఆమె ఈ లోకంలో మానవ రూపంతో అవతరించి, తన అఖండశక్తులను బహిర్గతం చేయకుండా, భక్తులకు ఒక సాధారణ రీతిలో, మృదువైన హృదయంతో, అపారమైన కృప, ఓరిమి కలిగి ఉన్న చల్లని తల్లి రూపంతో దర్శనమిచ్చింది.

ఆ తల్లి తన వాస్తవికతను దాచి ఉంచినందున, సాధారణరీతిగా చూస్తే ఆమెను అర్థం చేసుకోలేం. శ్రీరామకృష్ణుల చరిత్ర చదివినప్పుడు ఆయనకు కలిగిన ఆధ్యాత్మిక శక్తులు, అనుభవాలు, సమాధి స్థితులు – ఇవన్నీ ఎంతో ఉత్తేజకరంగా తోస్తాయి. అలాగే స్వామి వివేకానంద చరిత్ర చదివినప్పుడు ఎంతో సాహసోపేతంగా, గగుర్పాటు కలిగించే రీతిగా తోస్తుంది. ఇలాంటి అనుభవమేదీ అమ్మ గురించి తెలుసుకున్నప్పుడు మనకు కలుగదు. భారతదేశంలోని ప్రతీ ఇంటిలో ఉండే అమ్మ లాగానే, ఒక సాధారణ గృహిణిగానే ఆమె తోస్తుంది. సాధారణ రీతిలో ఇంటిని శుభ్రపరుస్తూ, వంట చేస్తూ, బట్టలు ఉతుకుతూ, గృహసంరక్షణ చేసే మామూలు స్త్రీగానే ఆమె కనిపించారు. ఇలాంటి సాధారణ జీవనం గడిపే స్త్రీలో దివ్యత్వం దాగి ఉందని గ్రహించడం సాధ్యమేనా?

జయరామ్‌బాటిలో ఉన్న గ్రామస్థులు కూడా అమ్మమహిమను అర్థం చేసుకోలేకపోయారు. వారికి ఆమె ఒక అక్కగా, అత్తగా, మేనకోడలిగా, లేదా అమ్మగా మాత్రమే తోచింది. ఆ గ్రామస్థులలో ఒకరు ఆమెను ఇలా ప్రశ్నించారు : 'నిన్ను చూసేందుకు ఎంతో దూరాల నుండి జనం వస్తున్నారు, అయితే మాకు ఇది ఏమీ అర్థం కావడం లేదు, నీవెవరు?' అని. దానికి అమ్మ సమాధానమిస్తూ, 'నీకు అర్థం కాకపోతే ఏమైంది? మీరందరూ నాకు స్నేహితులే! నేనూ మీకు అంతే!' అని అన్నారు.

ఇంకోసారి అంబికాచరణ్ అనే వయసు మళ్ళిన కాపలాదారుడు శారదాదేవితో 'అందరూ నిన్ను దేవత అనీ, ఇంకేదో అనీ అంటూ ఉన్నారు. నా వరకు నాకు ఏమీ అర్థం కావడం లేదు' అన్నాడు. దానికి కూడా చాలా సామాన్యంగా, 'ఏదో అర్థం చేసుకోవాలని ఎందుకు అనుకుంటున్నావు? నీవు నా సోదరుడవు. నేను నీ చెల్లెలు శారదను. అంతే!' అని జవాబిచ్చారు. ఆమె చాలా మామూలుగా ప్రవర్తించేవారు అనేందుకు దృష్టాంతాలు ఎన్నో కనిపిస్తాయి. ఒకసారి ఒక చిన్న బాలుడిని, 'నాకు కొన్ని పూలు కోసుకురాగలవా?' అని బ్రతిమాలుతూ, అతను నిరాకరించినా వదలక బుజ్జగించి తెప్పించుకున్నారు.

అలాగే మరో సందర్భంలో, ఒక స్త్రీని 'కాళ్ళు నొప్పులుగా ఉన్నాయి. కొంచెం మర్దన చేయమ'ని బ్రతిమాలుకున్నారు. అయితే మనమంతా ఆమెను ఒక మామూలు వ్యక్తిగా భావించేందుకు ఈ రీతిలో ప్రవర్తిస్తూ ఉన్నా, మరోపక్క తన దివ్యకిరణాలను ప్రసరింపజేస్తూ వినోదాన్ని పొందేవారు.

మహానుభావులైన శ్రీశంకరాచార్యుల వారు అమృతత్త్వపు మాటలతో జగన్మాతను 'నిత్యానందకరీ!' అని సంబోధించారు.

ఆ మాత మనందరికీ అనంతమైన ఆనందాన్ని ప్రసాదిస్తూ, శారదామాత రూపంలో తన పిల్లల కష్టాలను చూడలేక సాధారణ స్త్రీ లాగా కంటతడి పెట్టింది.

ఆ మాత *'సౌందర్య రత్నాకరీ!'* అనంతమైన సౌందర్యాన్ని కలిగి ఉన్నది. అయితే శారదామాత రూపంలో సౌందర్యాన్ని పూర్తిగా వెల్లడి కానివ్వలేదు. శ్రీరామకృష్ణులు, గోలాప్‌మాతో ఈ విధంగా అన్నారు: 'ఆమె శారద-సరస్వతియే, జ్ఞానాన్ని అందించేందుకు వచ్చింది, అయితే ఈసారి తన సౌందర్యాన్ని మరుగు పరచింది'. అయితే నిజసౌందర్యం బహిర్గతం కాకపోయినా, అమ్మ రూపం మనసులను ఆకర్షించే రీతిగా



కనిపిస్తుంది. ఏ పదాలు అమ్మను వర్ణించేందుకు సరితూగుతాయి? మనకు సీతామాత, రాధాదేవిలవి ఊహాచిత్రాలు మాత్రమే ఉన్నాయి. అయితే ఆ ఊహాచిత్రాలు కూడా అద్భుతంగానే తోస్తాయి. కానీ ఇక్కడ శారదామాతను చూస్తూ ఉంటే మనకు సీతామాత, రాధాదేవిల సాక్షాత్కారం కలిగిన భావన వస్తుంది. మానవాళి అంతా, దివ్యజనని ఛాయాచిత్రాన్ని తీసి మనకు అందించిన శ్రీమతి ఓల్‌బుల్‌కు ఋణపడి ఉంటుంది. ఈ సౌందర్య రత్నాకరి తన శుద్ధ స్వరూపంతో, అనేకులకు భగవత్సాక్షాత్కారసాధనలో అనుగ్రహ వర్షం కురిపించిందనేది అందరికీ తెలిసిన సత్యమే!

ఆమె *'నానా-రత్న-విచిత్ర-భూషణకరీ!'* ఆ జగన్మాత ఎల్లప్పుడూ చిత్రవిచిత్రమైన కాంతులీనే ఆభరణాలతో అలంకృతయై ఉంటుంది. అయితే శారదామాతగా ఆవిడకు ఏ ఆభరణాలూ లేవు. పెళ్ళిరోజున శ్రీరామకృష్ణుల తల్లి చంద్రమణీదేవి చిన్నారి శారదను ఆభరణాలతో అలంకరించినా, మరునాటి ఉదయమే ఆ చిన్నారి నిద్రలో ఉండగానే ఆమెకు తెలియకుండా వాటిని శ్రీరామకృష్ణులు తీసివేస్తారు. మెలకువ వచ్చాక అది గమనించిన ఆమె ఏడవడం మొదలుపెట్టింది. అలా ఎందుకు బాధపడదు? ఆమె నిజప్రవృత్తి నానా-రత్న-విచిత్ర-భూషణకరి కదా మరి! ఆమె లీలను ఎవరు అర్థం చేసుకోగలరు?

ఆ దివ్యమాత *'బ్రహ్మాండ భాండోదరీ!'* అనంత విశ్వాన్ని తన గర్భంలో దాచి ఉంచుకున్న మహాశక్తి! అలాంటి ఆమె, శారదామాతగా కలకత్తా, దక్షిణేశ్వరంలోని నహబత్‌లో అతి చిన్నగదిలో ఎన్నో ఏళ్ళు గడిపింది. అంతటి చిన్న గదిలో నివసించిన ఆ తల్లి నిజతత్త్వం గురించిన ఎరుక సాధారణ మానవులకు కలుగుతుందా? అత్యున్నత దాపరికం అంటే ఇదే! దివ్యమాయ అద్వితీయ ప్రాభవానికిదే చక్కటి నిదర్శనం!

దివ్యజనని శారదామాత తన చుట్టూ ఉన్న వారందరితోనూ తనకు కూడా రక్షణ, పోషణ అవసరమే అనే విధంగానే ప్రవర్తించారు. ఆ దివ్యజనని *'అభయంకరీ!'* – మనకు భయం లేని స్థితిని ప్రసాదించగలిగేది. అయినా శారదామాతగా, పిచ్చివాడైన హరీశ్‌ను చూసి భయపడి పరుగెత్తింది. అయితే సృష్టిస్థితి వినాశిని అయిన ఆ తల్లి హరీశ్‌కు భయపడినట్లుగా పరుగిడినా, బగళామాతగా తన శక్తిని ప్రదర్శించి హరీశ్‌ను శిక్షించింది. సాధారణంగా పిచ్చివారికి అధిక బలం ఉంటుంది. అలాంటి హరీశ్‌ను అవలీలగా నేలపై పడవేయడం లీల కాదా! ఈ నాటకం అంతా భక్తుల మనోఫలకాలపై చెరగని రీతిగా ముద్రను వేసి, వారిని తన మాయాలీలా ప్రదర్శనలతో ముంచెత్తి సమాధి స్థితిలోకి చేర్చేందుకే అని చెప్పవచ్చు.

ఆ తల్లి అనుగ్రహం లేనిదే మానవులు ఆమె శక్తియుక్తులను గ్రహించలేరు. ఎవరి తేజోమయకాంతితో విశ్వమంతా వెలుగొందుతూ ఉందో, ఏ కాంతితో జగమంతా చూడబడుతూ ఉందో, ఆ కాంతికి మూలమైన తల్లి మేలిముసుగును ధరించి ఉంది! ఆమె మన యందు కృపతో దానిని తొలగించినప్పుడే మనం ఆమెను చూడగలం! అయితే ఏదో రీతిగా ఆ మహత్తర శక్తి కాంతిపుంజాలు మనల్ని తాకుతూనే ఉండి, లిప్తకాలం పాటు ఆ శక్తికి నివ్వెరపడుతూ ఉన్నా, తిరిగి మాయతో కప్పబడుతూనే ఉంటాం. అరుదైన కొన్ని సత్యాల ద్వారానే ఆ శక్తి తేటతెల్లమవుతూ ఉంటుంది.

అమ్మ అతి సాధారణ ప్రవర్తన వల్ల, 'ఈమె దివ్యజనని అన్నది నిజమేనా?' అని అందరికీ సందేహం కలిగేది. శ్రీరామకృష్ణుల గొంతు వ్రణం గురించి కూడా ప్రాపంచికుల మనస్సులలో, ఇలాంటి సందేహమే కలిగింది. 'ఆయన సాక్షాత్తూ భగవదవతారం అయితే, ఆ వ్యాధి ఎందుకు వచ్చింది?' అనే అపోహ కలిగింది. ఇదీ అలాంటిదే. శారదాదేవి ఎవరికీ తాను మహాశక్తిననే సంగతి తెలియనీయకుండా అతి జాగ్రత్తగా మసలుకునేవారు. 'రాధూ'తో శారదామాతకున్న అనుబంధం ప్రాపంచికమైన బాంధవ్యంగా

(మిగతా 32వ పేజీలో...)

తల్లీ! నాకు మంత్ర తంత్రాలు, స్తోత్రాలు, ఆవాహనలు, ధ్యానాలు తెలియవు. నీ మాహాత్మ్య కథనాలు తెలియవు. విలపించడం కూడా తెలియదు. 'సర్వసంతాపహారిణి' అని మాత్రం తెలుసు. - ఆదిశంకరాచార్యులు

జీవనయానంలో

ప్రపంచంలో ఇప్పుడు సగం మంది నాస్తికులుగానో లేదా అజ్ఞేయవాదులు (భగవంతుడున్నాడని చెప్పలేం, లేడని చెప్పలేం అనేవారు) గానో ఉన్నారు. కారణం భగవంతుడి గురించి ఆలోచించే సమయం మనిషికి లేదు. దేవుడు ఈ ప్రపంచాన్ని సృష్టిస్తే ఇంత దుఃఖం, ఇన్ని బాధలు, ఇన్ని అసమానతలు ఎందుకు ఉన్నాయని వారి భావన. అంటే మన ఆలోచనలకు అనుగుణంగా ఉంటే దైవమున్నట్లు, లేకపోతే లేదు. కానీ మన అవగాహనలో ఇంకా పరిణతి రావాలని మాత్రం మనకు ఎన్నడూ అనిపించదు. ప్రశ్నవేసినంత తొందరగా సమాధానం రాదనీ, కొంత త్యాగం, తపస్సు అవసరమనీ మనం గ్రహించం.

సాంకేతిక పురోభివృద్ధి భౌతికంగా మనిషి జీవితాన్ని కొద్దిగా సుఖవంతం చేసిందేమో కానీ దుఃఖాన్ని మాత్రం ఏమీ తగ్గించలేక పోయింది. విలాసాలు పెరిగాయి. ధన ప్రాధాన్యం పెరిగింది. ఆదాయం హెచ్చుగా ఉంటేనే జీవితం సుఖకరంగా ఉంటుందన్న భావన మనలో పాదుకుంది. కుబేరుడుగా ఎదిగి విలాసవంతమైన జీవితం గడపడానికి కాదు గదా కనీసం మధ్యతరగతి జీవితం గడపడానికి కూడా అవిశ్రాంత ప్రయత్నం చేయాల్సిన పరిస్థితి మనది.

జంతువులు మనకన్నా నిర్భయంగా ఉన్నాయేమో!: అడవిలో సింహం తనకు ఆకలైనప్పుడు మాత్రమే వేటకు బయలుదేరుతుంది. దొరికిన జంతువును తిని తన ఆకలి చల్లార్చుకున్న తరువాత మళ్ళీ ఆకలి అయ్యేదాక ఇంకోజంతువు దానికి గుర్తురాదు. గుహలో విరామాన్ని ఆస్వాదిస్తుంది. 'నేను తీరుబడి లేకుండా ఉన్నాను' అని మాత్రం బోర్డు పెట్టదు. రేపటి ఆలోచన.. అంటే రేపు తనకు మళ్ళీ ఆహారం దొరుకుతుందో లేదోనన్న సంశయంతో మరో జంతువును చంపి మరుసటి రోజుకు దాచుకోదు. ఇక రేపటి రోజు గురించే ఆలోచించని జీవికి 'వార్ధక్యంలో ఎలా జీవించాలి? ఏ బ్యాంకుల్లో డిపాజిట్లు పెట్టుకోవాలి? పింఛను ఎలా వస్తుంది?..' ఇలాంటి ఆలోచనలే ఉండవు. ఆ జీవి సదా వర్తమానంలో ఉంటుంది. గంభీరంగా ఉంటుంది. ప్రశాంతతను అనుభవిస్తుంది. భగవంతుడి మీద పూర్తి విశ్వాసమున్న జీవిలాగా జీవిస్తుంది. 'నన్ను సృష్టించిన నా తండ్రికి నా ఆకలి తీర్చడం ప్రథమ కర్తవ్యం' అన్న ధీమాను ఒలకబోస్తుంది.

ఒక విధంగా చూస్తే మనిషికన్నా నిబ్బరంగా జీవితాన్ని గడుపుతుంది. సింహమే కాదు, మిగతా జీవులకు వేటికీ రేపటి గురించిన ఆలోచన, ఆదుర్దా ఉండదు. వర్తమానాన్ని విస్మరించి నిరంతరం గతంలోనో లేదా భవిష్యత్తులోనో జీవించే మనిషి మనసు లాంటి చిత్రమైన మనసు వాటికి లేదు. అందుకని మనిషికన్నా ఎక్కువ ప్రశాంతతను పొందుతున్నాయి. మనకన్నా వాటికే భగవంతుడి మీద ఎక్కువ నమ్మకముందనిపిస్తుంది! మనిషి జీవులన్నింటిలోకి సర్వోత్కృష్ట జీవి అని పేర్కొంటాం. మరి జంతువులకన్నా మనం ఏ విధంగా ఉన్నతులం? వాటికన్నా మనకే ఎక్కువ భయాలు ఉన్నాయి కదా!

భయం లేని మనిషి లేడు... భయంలేని మనిషి ఈ ప్రపంచంలో ఎవరూ లేరు. నేడు మనల్ని భయంతో కుంగదీస్తున్న విషయాలు అనేకం. వివేకానంద స్వామి 'మనిషి దుఃఖానికి కారణం ఈ భయమే. భయమే మృత్యువు, భయమే దైన్యం, భయమే పాపం' అని అంటారు. మనం జాగ్రత్తగా విశ్లేషిస్తే 'మనిషి పాపం చేయడం వెనుక ఏదో భయం ఉండబట్టే' అని అర్థం అవుతుంది. మరి ఈ భయాన్ని ఎలా తొలగించుకోవాలి? మార్గమేమన్నా ఉన్నదా? భర్తృహరి మహారాజు తన వైరాగ్యశతకంలో...

"భోగే రోగభయం, కులే చ్యుతిభయం, విత్తే నృపాలాద్భయం;
మానే దైన్యభయం, బలే రిపుభయం, రూపే జరయా భయం;
శాస్త్రే వాదిభయం, గుణే ఖలభయం, కాయే కృతాన్తాత్ భయం;
సర్వేవస్తు భయాన్వితం భువి నృణాం వైరాగ్యమేవ అభయం –

భోగంలో రోగభయం, కులంలో కులభ్రష్టత భయం (కులాచారాల ప్రకారం జీవించాలన్న నిబంధన వలన కలిగిన భయం. అప్పటి సమాజంలో ఉన్నటువంటిది), ధనాగారం పెద్దదైతే తోటిరాజుల వలన భయం(ధనంతో చోరభయం), గౌరవంలో అవమాన భయం, శక్తివంతమైన రాజుగా ఉందామంటే శత్రువుల భయం (పదవిలో పదవీచ్యుతి భయం), రూపసౌందర్యంలో ముసలితనం వలన భయం, పాండిత్యంలో ప్రతివాద భయం,



ధైర్యాన్ని చుక్కానిగా చేసుకొని ముందుకు సాగినప్పుడే జీవననావ సజావుగా తీరం చేరుతుంది.

శీలంలో శీలభ్రష్టత భయం, శరీరానికి మరణభయం; భూమిపై అన్నీ భయంతో కూడుకున్నవే.. వైరాగ్యమే మనిషికి అభయాన్ని ప్రసాదిస్తుంది" అని అంటాడు.

భర్తృహరి మహారాజు జీవితాన్ని ఎన్నో కోణాల నుంచి విశ్లేషించాక చెప్పిన మాటలివి. కాన ఈ ప్రపంచంలో మనిషి దేనిపైనా మమకారాన్ని పెంపొందించుకోవడానికి లేదు. మరి మనిషి ఏం చేయాలి? తనను తాను అధ్యయనం చేయాలి. అప్పుడు సమగ్రజ్ఞానం కలుగుతుంది. కానీ అది అంత తేలిక కాదు. నిజానికి **ఈ అధ్యయనానికి అవరోధాన్ని కలిగిస్తున్న పరిస్థితులనే మనం మాయ అంటాం.**

సమగ్ర జ్ఞానాన్ని పొందటం ఎలా? : భర్తృహరి విశ్లేషించినట్లు వైరాగ్యం ద్వారానే అభయాన్ని పొందుతాం. వైరాగ్యానికి వివేకమే మూలహేతువు. వివేకం ద్వారానే విజ్ఞానం సాధ్యమవుతుంది. విజ్ఞానమే సర్వదుఃఖాపహారి. ఆధ్యాత్మిక జ్ఞానానికే విజ్ఞానం అనిపేరు. అందుకనే అన్ని దానాల్లోకి పారమార్థిక జ్ఞానదానం

అసలు పాఠం

- స్వామి శితికంఠానంద

ఉత్తమోత్తమం అని మహాభారతంలో వ్యాసమహర్షి మైత్రేయ మునితో అంటాడు. అలానే వివేకానందుడు కూడా దానం గురించి మాట్లాడుతూ జ్ఞానదానమే సర్వోత్కృష్టం అంటారు. భరతఖండంలో నిరంతరం ఈ పరావిద్య దానం చేయబడుతూనే ఉన్నది. ఐతే దురదృష్టవశాత్తు ఈ దానాన్ని స్వీకరించడానికి కావలసిన సంస్కారం (సత్త్వగుణం, అంతర్ముఖత, నివృత్తి మార్గాన్ని అవలంబించే శక్తి) అందరికీ లేదు.

ప్రపంచాన్ని ఆస్వాదించడం ఎలా? : 'సంసార సముద్రంలో మనం ఎలా ఈ జీవన నౌకను నడపాలి?' అన్నది ప్రశ్న. సర్వం ఏదో భయంతో కూడుకున్న ఈ ప్రపంచాన్ని పట్టుకొని ఉండటం అవివేకమని మనకు ఇప్పుడు అర్థమైంది. ఐతే అందరికీ తీవ్రమైన వైరాగ్యం కలగడం అంత తేలికకాదు కాబట్టి, రెండో మార్గంగా మనం భగవంతుడిని ఆలంబనగా చేసుకొని జీవితాన్ని గడపడం నేర్వాలి. మనం ప్రయత్నం చేసేటప్పుడు ఆయన ఉపకరణంగా భావిస్తూ చేయాలి. మనం సాధించిన ప్రతి విజయం వెనుక దైవానుగ్రహం ఉందని భావించాలి. అంతా స్వీయకృషితోనే సాధించామని విర్రవీగకూడదు. జయాపజయాలను రెండింటినీ సమంగా స్వీకరించాలి. ఏది కలిగినా మన మంచికే అని తెలుసుకోవాలి.

భాగవతంలో కుచేలుడు ధనసహాయం కోసం శ్రీకృష్ణ పరమాత్ముడి దగ్గరకు వెళతాడు. నోరు తెరిచి తానుగా ఏదీ అడగలేక పోతాడు. ఐనా ఆ దేవదేవుడు, ఆ విప్రుడు ఎందుకొచ్చాడో తెలుసుకొని ఆయన అడగకుండానే సర్వసంపదలను అనుగ్రహిస్తాడు. అప్పుడు ఆ విప్రుడు మాధవుడి అనుగ్రహానికి ఎంతో సంతోషపడి ఇహపరాలలోనూ మనిషికి ఏసంపదలు సమకూరాలన్న భగవంతుడి అనుగ్రహమే మార్గమని వక్కాణిస్తాడు. **'కించిత్కరోత్యర్వపి యత్ స్వదత్తం సుహృత్కృతం ఫల్ల్వపి భూరికారీ..** భగవంతుడు తాను మనకు ఇచ్చినది గొప్ప సంపదైనా కొద్దిదిగానే భావించి, మనం ఇచ్చింది స్వల్పమైనా, అల్పమైనదైనా మహాదక్షిణగా పరిగణిస్తాడు' అని అంటాడు. భగవంతుడికి మానవుడిపై అంత అనుకంప ఉంటుంది. కానీ విశ్వాసం లేనప్పుడు మనం దైవాలంబనగా జీవించడం నేర్చుకోలేం. మనకు జీవన కళ అబ్బదు.

జీవన కళ...: జీవన కళ అంటే ప్రతి వ్యక్తి తనను తాను భగవంతుడి పనిముట్టుగా భావించుకుంటూ తన విధియుక్తకర్మలను చేసుకుంటూ పోవడమే. భగవంతుడే తనను ఆ పనిలో నియోగించాడని తెలుసుకొని పనిని శ్రద్ధతో, ఫలాపేక్ష లేకుండా, ఒక యోగంలా చేసుకుంటూ పోవాలి. ఇలాంటి భావం లేకపోతే 'అంతా నేనే చేస్తున్నాను' అన్న అహంపైకొని మనిషికి బంధాన్ని పెంచుతుంది. మమకారం పైకొని తన ఇచ్ఛ ప్రకారం జరగనిది ప్రతీదీ దుఃఖాన్ని కలుగజేస్తుంది. జంతువులు పిల్లలను కంటాయి. కానీ పూర్తిగా తమకు తాము సహాయం చేసుకోలేని పరిస్థితిలో ఉన్నంత వరకే వాటిని కాపాడతాయి. తర్వాత వేటి దారి వాటిదే. వాటిపై మమకారాన్ని పెంచుకోవు. ప్రేమను ప్రకటిస్తాయి..కానీ కొద్ది కాలం మాత్రమే. ఇది స్వలాభాపేక్ష లేనిదైనప్పటికీ నిజమైన ప్రేమ అవదు. ఎందుకంటే ఈ ప్రేమ నిత్యనూతనం కాదు కనుక. అందుకే ఖలీల్ జిబ్రాన్ 'సదా వృద్ధిచెందని ప్రేమ, ప్రేమ అవదు' అని అంటారు.

ఐతే మనిషికన్నా జంతువులే మేలు. మనిషిలాగా అవి మమకారాన్ని ప్రేమ అనుకోవడం లేదు, మమకారంతో బాధలు పడడంలేదు. సంతానాన్ని ప్రేమించాలి. కానీ మమకారం ఉండకూడదు. ఆ ప్రేమించడం కూడా తనవాళ్ళని కాకుండా భగవంతుడి రూపాలుగా భావించి ప్రేమించాలి; నిజమైన ప్రేమలో లేశమాత్రం ఆపేక్ష ఉండదు. పిల్లలు వాళ్ళ కాళ్ళ మీద వాళ్ళు నిలబడ్డ తర్వాతనైనా కుటుంబి తన మనసును భగవంతుడి వైపుకు త్రిప్పాలి. మానవుడికి మాత్రమే ఈ అవకాశం ఉంది. కానీ సమకాలీన సమాజంలో మనిషి కూడా పూర్తి ప్రాపంచిక వ్యామోహంతో, సంసారసాగరంలో చుక్కాని లేని నావలాగా మిగులుతున్నాడు. తన ఉన్నతజన్మ ప్రయోజనాన్ని పరిరక్షించుకోలేక పోతున్నాడు.

మనిషికీ భగవంతుడికీ మధ్య సంబంధం : ఒక సన్న్యాసిని ఒక భక్తుడు మనిషికీ, భగవంతుడికీ మధ్య సంబంధం ఏమిటని అడుగుతాడు. ఆయన 'మనిషి ('నేను' అన్న అహం) ఉన్నంత సేపు భగవంతుడు లేడు. భగవంతుడున్నచోట మనిషి లేడు' అంటాడు. అంటే అర్థం ఈ ప్రపంచం మొత్తంలో నిరంతరం ఒకే ఒక్క సంకల్పం అభివ్యక్తమవుతుంది. అదే దైవసంకల్పం. కానీ మనిషి అహంభావం వలన 'నా వలన జరుగుతుంది' అనుకుంటాడు. ప్రమాదంలో పడతాడు. తన వ్యక్తిగత ఇష్టాయిష్టాలను ప్రక్కన బెట్టి అంతా భగవదిచ్ఛకు సమర్పించాలి. నిరంతరం సులక్ష్యాలను కలిగి, తనను తాను సత్ప్రయత్నంలో నియోగించుకుంటూ ఫలితాలు అనుకూలంగా ఉన్నా, ప్రతికూలంగా ఉన్నా ఒకేరకంగా స్పందించటం నేర్చుకోవాలి. అదే మనిషి జీవితంలో నేర్చుకోవాల్సిన అసలు పాఠం. అప్పుడే జీవితంలో నిజమైన శాంతి, ప్రశాంతత కలుగుతాయి. ❖

జీవుడి అహంకారమే మాయ. ఈ తెరే ఆత్మప్రకాశాన్ని కప్పేస్తుంది. అహంకారం నశించిందా అన్ని చిక్కులూ తొలగిపోతాయి. అప్పుడు ఈజన్మలోనే ముక్తుడవుతాడు. - శ్రీరామకృష్ణ పరమహంస

వదాన్యత... కృతజ్ఞత

- శ్రీమతి సుధామూర్తి, ఇన్ఫోసిస్ ఫౌండేషన్

నా చిన్ననాటి మిత్రులు రమేశ్, షీలాలు తాము కొత్తగా కట్టుకున్న ఇంటి గృహప్రవేశానికి ఆహ్వానించారు. రమేశ్ ప్రొఫెసర్. షీలా క్లర్క్‌గా పనిచేస్తోంది. ఎంతో పొదుపుగా జీవిస్తూ, బెంగుళూరు శివారులో ఇల్లు కట్టుకున్నారు. అందరికీ రావడానికి వీలు కుదరాలని రమేశ్ ఓ ఆదివారం గృహప్రవేశ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసుకున్నాడు. ఈ రూపంగానైనా బాల్యమిత్రులందరినీ కలుసుకోవచ్చన్న ఉద్దేశంతో, పనులన్నీ వదులుకొని ఆ ఆదివారం రమేశ్ వాళ్ళ గృహప్రవేశానికి వెళ్ళాను. దాదాపు పాతస్నేహితుల మందరమూ ఆ వేడుకలో కలిశాం. అతిథులందరూ వెళ్ళిపోగానే, చిన్ననాటి మిత్రులమందరం ఆరుబయట కూర్చొని కబుర్లు చెప్పుకుంటూ ఉన్నాం.



ఇంతలో నా చూపు రమేశ్ వాళ్ళ కొత్త ఇంటి నామఫలకం (నేమ్‌ప్లేట్) పైకి వెళ్ళింది. నల్లటి గ్రానైట్ రాయిపై 'శ్యామకమల్' అన్న పేరును చెక్కి అమర్చారు. సాధారణంగా ఏ ఇంటికైనా యజమానుల పేర్లో, పిల్లల పేర్లో, దేవుళ్ళ పేర్లో, తల్లితండ్రుల పేర్లో పెట్టుకుంటారు. అయితే నాకు రమేశ్, షీలాల బంధువర్గం గురించి చిన్నప్పటి నుంచి తెలుసు. వాళ్ళ ఇళ్ళలోని వ్యక్తుల పేర్లకూ, ఆ ఇంటి నామఫలకానికీ ఎలాంటి సంబంధమూ లేదు. అదే సందేహాన్ని రమేశ్‌తో వ్యక్తం చేస్తూ, 'రమేశ్! ఈ 'శ్యామ కమల్' నామఫలకం వెనుక మర్మమేంటి?' అన్నాను సరదాగా!

అప్పుడు రమేశ్ నవ్వుతూ "సుధా! శ్యామారావు, కమలల పేర్లు కలిపి 'శ్యామకమల్' అని ఇంటికి పేరుపెట్టాం. నేను కాలేజీలో చదివే రోజుల్లో ఓ వృద్ధ దంపతుల ఇంట్లో ఉండేవాడిని, నీకు గుర్తుంది కదా! వాళ్ళే శ్యామారావు, కమలగార్లు" అన్నాడు. నాకు అప్పుడు గుర్తొచ్చారు, మేము కాలేజీలో చదివేరోజుల్లో విద్యార్థులకు ఇల్లు అద్దెకిచ్చే ఆ వృద్ధ దంపతులు! అలా అద్దెకున్న వాళ్ళలో రమేశ్ ఒకడు. దాదాపు ఆరేళ్ళు అతను అక్కడే ఉన్నాడు. అయితే ఆ ఇద్దరి పేర్లు రమేశ్ తన ఇంటికి ఎందుకు పెట్టాడో అర్థం కాలేదు.

నా సంశయాన్ని గుర్తించిన రమేశ్ తన సమాధానం కొనసాగిస్తూ, "ఆ రోజుల్లో పై చదువులు చదివేందుకు నన్ను పల్లె నుంచి పట్టణాలకూ, నగరాలకూ పంపడానికి మా వాళ్ళు అంగీకరించలేదు. ఇంటి దగ్గరే ఉండి, వ్యవసాయం చేసుకోమన్నారు. అయితే మా నాన్నకు రిటైర్డ్ పోస్ట్‌మాస్టర్ శ్యామారావు గారిపై గురి. వారంటే మా నాన్నకు అమితమైన గౌరవం. నన్ను బాగా చదివించమని, మా నాన్నను ప్రోత్సహించింది ఆయనే! నన్ను తమ పట్టణంలోని కాలేజీలో చేర్పించమనీ, నా బాగోగులు చూసుకునే బాధ్యత తనదేననీ చెప్పి నేను కాలేజీలో చేరడానికి ఆయన కారణమయ్యారు.

శ్యామారావుగారు నన్ను తమ ఇంట్లోనే ఉంచుకున్నారు. అద్దె తీసుకోలేదు. వారి అర్ధాంగి కమలగారు నన్ను కన్నబిడ్డలా చూసుకునేవారు. ఆ తల్లి దయ వల్ల నేను ఒక్కరోజు కూడా ఆకలితో పస్తులుండ లేదు. మా నాన్న ఆర్థిక పరిస్థితి కూడా అంతంత మాత్రంగానే ఉండేది. ఆ సమయంలో శ్యామారావు గారు తన కొచ్చే కొద్ది పింఛనుతోనే నా కాలేజీ ఫీజు కట్టేవారు" అని ఉద్వేగంగా చెప్పాడు.

ఇంతలో పక్కనే ఉన్న రాఘవ, 'నువ్వు వాళ్ళకు చిన్న చిన్న పనులు చేసి పెడుతూ ఉండేవాడివి. ఎంతో సహాయకారిగా ఉండేవాడివి కదా! వాళ్ళు ఉచితంగా చేశారని ఎందుకనుకుంటున్నావు!' అన్నాడు. రమేశ్ వెంటనే "అందుకు నేనొప్పుకోను రాఘవా! వాళ్ళు నా కోసం అవన్నీ చేయాల్సిన అవసరం లేదు. వాళ్ళు ధనవంతులేమీ కాదు; పింఛనుపై జీవిస్తున్న వృద్ధదంపతులు. వాళ్ళ సహాయమే లేకపోతే నేనీరోజు ఎక్కడ, ఎలా ఉండేవాడినో తెలీదు. ఆ పుణ్యాత్ముల వల్ల నా కాలేజీ జీవితం సజావుగా సాగిపోయింది. వాళ్ళ ఔదార్యాన్ని నేనెన్నటికీ మరచిపోలేను. ముఖ్యంగా నా కాలేజీ చదువైపోయి, నిరుద్యోగిగా ఉన్నప్పుడు కూడా శ్యామారావుగారు ఎంతో ఆదుకున్నారు; నాలో ఆత్మవిశ్వాసం నింపారు" అన్నాడు.

'ఇంతకూ మీ ఇంటికి వాళ్ళ పేరు ఎందుకు పెట్టాలని పించింది' అన్నాను. అప్పుడు రమేశ్ "మా నాన్న నాకు అతి విలువైన పాఠం నేర్పించారు. అది ఏమిటంటే - చేసిన మేలును మరచిపోకూడదనే పాఠం! మనవాళ్ళు మనల్ని చూడడం గొప్ప విషయం కాదు. కానీ రక్తసంబంధమేదీ లేని ఆ వృద్ధదంపతులు నేను పైకి రావడానికి కారకులై మానవ సంబంధాలకు కొత్త అర్థాన్నీ, అందాన్నీ ఇచ్చారు. ఇంటికి వాళ్ళ పేరు పెట్టమని మా నాన్నే సూచించారు. నా చదువులో వాళ్ళ పాత్ర ఘనమైనది. ఆ విషయాన్ని నా పిల్లలకు చెప్పాలి. వాళ్ళు మాటల ద్వారా కాక చేతల ద్వారా అది నేర్చుకోవాలి" అన్నాడు. ఆ వృద్ధదంపతుల వదాన్యత, నా మిత్రుడి కృతజ్ఞత తలచుకొని నాకు కళ్ళు చెమర్చాయి. ❖ సేకరణ: జి. సతీష్



మనస్సును దహించే మాత్సర్యం

పి.మేఘన, కళాశాల విద్యార్థిని, హైదరాబాదు

ప్రశ్న: నా స్నేహితురాలితో ఈ మధ్య మనఃస్పర్థలు వచ్చాయి. అప్పటి నుండీ మేము మాట్లాడుకోవడం మానేశాం. కానీ ఆమెను చూసినప్పుడల్లా నాలో ద్వేషం రగులుతుంది, ప్రతీకారభావం కలుగుతుంది. ఇలాంటి భావాలవల్ల ప్రశాంతంగా ఉండలేక పోతున్నాను. ఈ సమస్యకు ఏదైనా పరిష్కారం తెలపండి.

జవాబు: మనం ఎదుటివారిని చూసి ఓర్వలేక పోతున్నామంటే మనస్సు అనే కట్టెకు, అసూయ అనే నిప్పు అంటుకుందని అర్థం. ఈ అసూయ అనే నిప్పుకు, ద్వేషం అనే గాలి తోడైతే ప్రతీకారజ్వాల రగులుతుంది.



అయితే, ఈ అసూయారాక్షసి సాధారణ మానవులమైన మనల్నే కాదు, ఆకులూ అలములూ తింటూ అరణ్యాలలో తపస్సు చేసిన విశ్వామిత్రునిలాంటి మహర్షులను, సకలభోగ భాగ్యాలతో రాజప్రాసాదంలో నివసించే దుర్యోధనుడిలాంటి మహారాజులను కూడా పట్టిపీడించింది.

అసూయ ముఖ్యంగా మూడు అనర్థాలకు దారితీస్తుంది. *"Jealousy only widens the chasm of misunderstanding, increases hate and retaliation* - అసూయ, అపార్థాల అగాధాన్ని పెంచుతుంది. ద్వేష, ప్రతీకార భావాలను రగులుస్తుంది" అని మనస్తత్వశాస్త్రం తెలుపుతోంది.

విశ్వామిత్రుడు, వసిష్ఠమహర్షిని చంపేయాలని పగబూనాడు. అందుకు కారణం అతడు వసిష్ఠమహర్షిని అపార్థం చేసుకోవడమే! దుర్యోధనుడు, పాండవుల ఉన్నతిని చూడలేక వారిని తుదముట్టించాలని ఎన్నో పన్నాగాలు పన్నాడు. అందుకు కారణం అతడికి పాండవులపట్ల ఉన్న ద్వేషమే! దుర్వాసమహర్షి, సముద్రరాజ తనయ లక్ష్మి వివాహానికి తనను ఆహ్వానించలేదని అవమానంగా భావించి, సముద్రరాజును శపించాడు. అందుకు కారణం ప్రతీకారభావమే!

వసిష్ఠమహర్షికి తనపట్ల సదభిప్రాయమే ఉందని తెలుసుకున్న విశ్వామిత్రుడు తన అపార్థానికి చింతించాడు. అందువల్ల అనుమానాలకు, అపోహలకు, చెప్పుడు మాటలకు ప్రాధాన్యం ఇవ్వకుండా, అసలు వ్యక్తితో స్వయంగా మాట్లాడి సమస్యలను పరిష్కరించుకోవాలి. కానీ మనం అసలు వ్యక్తితో తప్ప మిగతా అందరితో చర్చిస్తాం. అదే అపార్థాలకు కారణం.

దుర్యోధనుడు, తన సోదరులైన పాండవులను ప్రేమించి వుంటే, జీవితాంతం ద్వేషభావంతో దహించుకుపోయేవాడు కాదు. అలాగే, దుర్వాసమహర్షి, సముద్రరాజు చేసిన తప్పును క్షమించగలిగివుంటే ప్రతీకార చర్యకు పాల్పడేవాడు కాదు.

ఇతరులపట్ల మనకు కలిగిన ద్వేష, ప్రతీకారభావాల నుండి బయటపడాలంటే ఏం చేయాలి?

ఒక విద్యార్థి తన తోటి మిత్రుడితో కలిగిన అపార్థాల కారణంగా అతడిపట్ల ద్వేషంతో రగిలిపోతూ ఉండేవాడు. దీని నుండి బయటపడే మార్గాన్ని చూపించమని భగవంతుణ్ణి ప్రార్థించాడు. అప్పుడు భగవంతుడు ప్రత్యక్షమై అతడితో "నాయనా! నీ బాధ నాకు అర్థమైంది. నేను నీకు రెండు డబ్బాలిస్తాను. ఇతరులు నీకు చేసిన ఉపకారాలను కాగితం మీద రాసి మొదటి డబ్బాలోనూ; ఇతరులు నీకు చేసిన అపకారాలను కాగితం మీద రాసి రెండో డబ్బాలోనూ వేయి. నెలరోజుల తరువాత ఆ రెండు డబ్బాలను తెరచి చూస్తే నీ సమస్యకు పరిష్కారం దొరుకుతుంది" అని చెప్పి అంతర్ధానమయ్యాడు.

భగవంతుడు చెప్పిన ప్రకారం అతడు రోజూ ఆ డబ్బాల్లో చీటీలను రాసి వేసేవాడు. నెల రోజుల తరువాత ఆ డబ్బాలను తెరచి చూస్తే మొదటి డబ్బా నిండుగా ఉంది. రెండో డబ్బా ఖాళీగా ఉంది. నిజానికి అతడు రెండో డబ్బాలోనే ఎక్కువ చీటీలను వేశాడు. ఇలా జరగడానికి కారణం ఏమిటో తెలుసుకుందామని రెండు డబ్బాలను తెరచి చూశాడు. మొదటి డబ్బా బాగానే ఉంది. కానీ రెండో డబ్బాకి కింద రంధ్రం ఉంది. అందువల్ల దానిలో వేసిన చీటీల్లో ఒక్కటి కూడా లేదు. అప్పుడు అతడికి అర్థమైంది 'ఇతరులు మనకు చేసిన ఉపకారాలను గుర్తుంచుకోవాలి. అపకారాలను మరచిపోవాలి' అని.

ఇతరులు మనకు చేసిన అపకారాలకు, అవమానాలకు, విమర్శలకు కలతచెందకుండా ఉండగలగడం అంత సులభమైన విషయమేమీ కాదు. కానీ అలా ఉండగలగాలంటే ముందు మన

(మిగతా 41వ పేజీలో...)

భారతజాతిని పట్టిపీడిస్తున్న మహమ్మారి అసూయ. ఈ అసూయను పూర్తిగా విడిచిపెట్టండి. కాల యాపన చేయకుండా అప్రతిహతమైన శక్తితో కర్తవ్య నిర్వహణలో నిమగ్నమవండి. - స్వామి వివేకానంద



సడి లేని సెలయేరులా...

– బి. సైదులు

ఈ ఏడాది నోబెల్ శాంతి పురస్కారం వరించిన కైలాస్ సత్యార్థి మన భారతీయుడు కావడం గర్వకారణం. బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు, వెట్టిచాకిరీ విముక్తికి ఆయన సాగించిన నిశ్శబ్ద విప్లవం అభినందనీయం. దాదాపు మూడు దశాబ్దాలకు పైగా కైలాస్ తన ఆశయసాధనకు అలుపెరగకుండా శ్రమిస్తున్నారు. వెండితెర తారల్లాగో, వ్యాపార దిగ్గజాల్లాగో ఆయన పేరు ప్రముఖంగా పత్రికల్లో ప్రచురితం కాకపోవచ్చు!నలుగురి నోట్లో నానకపోయి ఉండవచ్చు. కానీ కైలాస్ కృషి మాత్రం నిష్ఫలం కాలేదనడానికి, ఎనభై వేలమంది బాలకార్మికుల విముక్తే నిదర్శనం; అంతర్జాతీయ స్థాయి శాంతి పురస్కారమే పసిడిపూలహారం. మోడువారిన మానులు మారాకు వేయాలని, సడి లేక సాగిపోయే సెలయేరులా శ్రమించేవారినే శాశ్వత విజయాలు వరించగలవు. వనాలను వేలపూలతో పలకరించి పులకరింపజేసే వసంతం అలికిడి లేకుండానే ఆగమిస్తుంది; మహావృక్షాల్ని కూడా కూకటివేళ్ళతో పెకిలించే తుపాను మాత్రం భీకర హోరుతో వరదగుడేస్తుంది.

అందుకే స్వామి వివేకానంద *'Like the gentle dew that falls unseen and unheard,and yet brings into blossom the fairest of roses'* అంటారు. నిజమే! ఉషోదయంలో ఎక్కడో ఆకాశం నుంచి ఎవరికంటా పడకుండా, ఏ రవమూ లేకుండా రాలే మృదుతుషారం నవకోమలమైన గులాబీలను వికసింపజేస్తుంది. అలా ఆ మంచుబిందువులా సమాజంపై మనదైన ప్రభావాన్ని చూపాలి. అయితే ఈతరంలో చాలామంది అలా అజ్ఞాతంగా, అనామకంగా శ్రమించడం వృథా ప్రయాస అనుకుంటున్నారు; విత్తు వేయగానే ఫలాల్ని ఆశిస్తున్నారు. నలుగురు ఎంత త్వరగా తమను గుర్తిస్తే తమ అడుగులు, ఆలోచనలు అంత ప్రత్యేకం అనుకుంటున్నారు.

గుప్తంగా...గుర్తింపునకు దూరంగా! : ఈనాడు యువతీయువకుల్లో సృజనాత్మక ఆలోచనలకు, నవీనభావనలకు కొదువలేదు. చాలా విషయాల్లో తమదంటూ ఓ ముద్రను వేసుకునేందుకు ఎంతైనా శ్రమించేందుకు వెనుకాడటం లేదు. అయితే గుప్తంగా, గుర్తింపు లేకుండా వారి ఆలోచనలకు, ఆశయాలకు పరిపూర్ణ ఆకృతి నిచ్చుకునే సహనం మాత్రం చాలామందిలో కొరవడుతోంది. ప్రతిభను, ప్రావీణ్యాన్నీ సానబెడుతూ సమయం వచ్చే వరకు వేచి చూసే ఓపిక సన్నగిల్లుతోంది. మనస్సులో ఏ కొత్త భావన అంకురించినా, స్వల్ప సేవాకార్యక్రమానికి శ్రీకారం చుట్టినా వెనువెంటనే నలుగురి ముందు పెట్టాలనే తాపత్రయం పెరుగుతోంది. అందుకే ముఖస్తుతుల కోసం ఎంతోమంది ముఖపుస్తకపు ఖాతా(ఫేస్‌బుక్ అకౌంట్) విన్నపాలతో(రిక్వెస్ట్స్) నిండిపోతుంది. ఇలాంటి ఆర్భాటాల వల్ల మన కృషి మరుగుజ్జు మొక్కలా మారిపోతుంది. మన నైపుణ్యం నాణ్యతను కోల్పోతుంది. అందుకే సమాజంలో ఘనవిజయాలను సాధించేవారందరూ, చాలా వరకు ఎవరి కంటా పడకుండా మౌనంగా తమ పనిలో తాము మునిగిపోతూ, ఫలితాలతోనే ప్రభావితం చేస్తూ చిరకీర్తిని ఆర్జిస్తారు. కేవలం పదుగురిని ఆకర్షించేందుకు హడావిడి చేస్తూ ప్రచారం కల్పించుకునేవాళ్ళు మెరుపులా మెరిసి మాయమైపోతూ ఉంటారు. అందుకే మన సనాతన ధర్మం...

మౌఖర్యం లాఘవం కరం మౌనమున్నతి కారకమ్ ।
ముఖరం నూపురౌ పాదౌ కంఠే హారం విరాజతే ॥

'ఉన్నతత్వాన్ని సూచించేది మౌనమైతే శబ్దం చేయటం అల్పత్వాన్ని సూచిస్తుంది. పాదాలను అలంకరించే మంజీరాలు చప్పుడు చేస్తాయి; కానీ కంఠంలో భాసించే హారం మాత్రం శబ్దం చేయద'ని విస్పష్టం చేసింది.

మరుగే మెరుగు... : పాతతరంలో ఎందరో రచయితలు, చిత్రకారులు మారుపేర్లతోనే తమ సృజనాత్మకతను పండించుకున్నారు. తమపై, తమ సామర్థ్యంపై అమితమైన ఆత్మవిశ్వాసం కలిగినవారు, తమ లక్ష్యంపై స్పష్టమైన గురి కుదిరినవారు ఎక్కువ శాతం ఇలా లోప్రొఫైల్‌నే ఇష్టపడతారు; తెరవెనుక ఉండేందుకే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తారు. తెలుగు సినీగీత రచనకు సాహితీ సొబగులద్ది, సంక్లిష్టమైన ఆధ్యాత్మిక సత్యాలనూ సలలితమైన పాటల పదాలలో పొదిగిన రచయిత మల్లాది రామకృష్ణశాస్త్రిగారు. వారు చాలా వరకు తన పేరును మరుగుపరచుకొని, మధుర గీతాలన్నింటికీ మరొకరి పేరుననే ప్రచారాన్ని కల్పించారు. అదృశ్యంగా, ఆర్భాటాల అలికిడి లేకుండానే తమ సారస్వతసేవను కొనసాగించారు. అంతమాత్రం

చేత వారిని సాహితీలోకం స్మరించుకోవడం మానలేదు; ఆయన కీర్తి మరుగున పడిపోలేదు. ఆణిముత్యాల్లాంటి వారి గీతాలను తదనంతర కాలంలో ఆయన అభిమానులే సంఘంగా ఏర్పడి ఆయన పేరుతో ముద్రించారు. అన్ని రంగాల్లో ఇలాంటి ప్రముఖులు ఎంతో మంది తెరచాటు దీపాల్లా తాము మరుగున ఉండి, కాంతులను లోకానికి పంచారు. అయితే ఈ తరంలో మనకు మన కృషిపైన కానీ, కాలంపైన కానీ అంత విశ్వాసం లేదు. ఆ విశ్వాసరాహిత్యమే మనల్ని ఎక్కువ అలజడికి, హడావిడికి గురిచేస్తుంది. నిజానికి మనల్ని మనం ఎంత మరుగు పరుచుకుంటే మనపై అంత ఒత్తిడి తగ్గుతుంది. అందుకే *The successfull man is low-profile in his movements and earnest in his work*...తనకు తాను తెరచాటుగా ఉండేందుకే ప్రాధాన్యమిస్తూ , కార్యదీక్షలో మాత్రం ఉత్సుకతగా మెలిగేవాడే నిజమైన విజేత' అంటారు కన్ఫ్యూషియస్.

నిలకడ నుంచే నడకలు... : తాను ఎంచుకున్న ఉద్యమపథంలో కైలాస్ సత్యార్థి కేవలం కితాబులే అందుకోలేదు. కఠినమైన కష్టాలనూ ఎదుర్కొన్నారు. దుష్టశక్తుల దాష్టీకాలకూ ఎదురొడ్డారు. కానీ తన కష్టనష్టాల గురించి ఆ సమయంలో సమాజం ముందు నిరసనను ప్రదర్శించలేదు. పైగా ఆ అనుభవాల నుంచి నిలకడగా నిలబడటం, ఆ నిలకడ నుంచి నడకల్ని మరింత పటిష్ఠం చేసుకోవడం నేర్చుకున్నారు. ఇవన్నీ కూడా ఆయన జీవితంలో తెరపై నిశ్శబ్దచిత్రాల్లాగే సాగిపోయాయి. ఈ నేపథ్య నిజాలన్నీ ఆయనకు నోబెల్ బహుమతిని ప్రకటించాకే, వెలుగులోకి వచ్చాయి. ఇలా మనం ఏ రంగంలో తీసుకున్నా, ప్రచారానికి దూరంగా పరిశ్ర మిస్తున్నప్పుడు తాత్కాలికంగా ఎలాంటి సహకారం లభించకపోవచ్చు. కొన్నిసార్లు సమీపంగా మెలిగే వ్యక్తులు కూడా మన శ్రమను గుర్తించకపోవచ్చు. పైగా ఆటంకాలనూ సృష్టించ వచ్చు. అంతమాత్రం చేత నిరుత్సాహ పడాల్సిన పనిలేదు. అశాంతికి గురికావలసిన అవసరం లేదు. సహయోధులు లేని ఒంటరిపోరాటం వల్ల మన శక్తిసామర్థ్యాలు సంపూర్ణంగా ఆవిష్కృతమవుతాయని గుర్తుంచుకుంటూ ముందడుగు వేయాలి. నిజానికి పటాటోపం, ప్రచారహోరుల మధ్య మన లక్ష్యం చాలా వరకు మసకబారుతుందని మరచిపోకూడదు. ఈ రోజుల్లో చాలా మంది యువతీయువకులు, సంస్థలు ఆది లోనే హంసపాదులా తడబడటానికి ప్రధాన కారణం ఈ హంగూఆర్భాటాలే! నిలకడ నుంచి నడకలు నేర్వకముందే పరుగులు తీయాలని తహతహలాడటమే!

కాలమే పరీక్షనాళిక.... : మన కృషికి ప్రామాణికం కాలం మాత్రమే! మనం చేయగలిగినదంతా చేసిన తరువాత మిగిలినదంతా కాలానికి వదిలివేయడంలోనే నిజమైన ప్రశాంతత దాగి ఉంది. పరిశోధనా సంస్థల్లో ఏళ్ళుగా ప్రయోగాలు చేస్తున్న శాస్త్రజ్ఞులను చూస్తూంటే ఆనందాశ్చర్యాలు కలుగుతూంటాయి. హైదరాబాదులో జీవశాస్త్రానికి సంబంధించిన అంతర్జాతీయ పరిశోధనా సంస్థ సి.సి.ఎమ్.బి.(సెంటర్ ఫర్ సెల్యూలర్ అండ్ మాలిక్యులర్ బయాలజీ)లో ఓసారి వృక్షశాస్త్రవేత్తల యువబృందం తాము కొత్తగా కనుగొన్న వరివంగడాన్ని పరిచయం చేసేందుకు పత్రికా సమావేశాన్ని ఏర్పాటు చేశారు. పదేళ్ళపాటు బాహ్యప్రపంచంతో సంబంధం లేకుండా ప్రయోగశాలకే పరిమితమై వారు ఆ వంగడాన్ని ఆవిష్కరించిన విధానాన్ని వివరిస్తూంటే అబ్బురమనిపించింది. కాలపరీక్షకు నిలబడి అద్భుత ఫలితాల్ని సాధించిన వారి కార్యదీక్ష యువశాస్త్రవేత్తలకు ఆదర్శంగా నిలిచింది. ఇలా చైతన్యప్రవంతిలా సాగిపోయేవారు ఆలస్యంగానైనా, అజరామరమైన ఫలితాల్ని సాధిస్తారు. అయితే నేడు చాలామంది హంగులతో, హోదాలతో కూడిన వృత్తులవైపే ఆకర్షితులవుతూ, ఇలాంటి పరిశోధనలు, పాఠాలు చెప్పడాల్లాంటి వృత్తులను చిన్నచూపు చూస్తున్నారు. కానీ కాలక్రమంలో ఇలాంటి ప్రదేశాల నుంచే పెనుమార్పులు సంభవిస్తాయి.

నిశ్శబ్దం నుంచే విప్లవం...: ఈ రోజు మనం చూస్తున్న సామాజిక, సాంకేతిక విప్లవాలన్నింటికీ ఆధారం అజ్ఞాతమైన



మేధోమథనమే! ఎంతో మంది జ్ఞానులు,విజ్ఞానులు దార్శనికతతో నిశ్శబ్దంగా ఆవిష్కరించి, నిష్క్రమించారు. అందుకే ఓ ఆధ్యాత్మికవేత్త ఈ స్థితిని వర్ణిస్తూ, 'సముద్రం ఉపరితలంలో తరంగాలతో నాట్యమాడుతుంది. నురగతో నవ్వుతుంది, మెరుస్తుంది. గాలివాన వచ్చినప్పుడు ఘోష పెడుతుంది. అయినా లోలోపల అగాధాలలో ప్రశాంతంగా, మౌనంగా, శాంతంగా ఉంటుంది. అటువంటి దివ్యమైన, దార్శనికమైన అంతరాంతరమే లేకపోతే మన కార్యకలాపాలు, లక్ష్యహీనమూ, వ్యర్థమూ అవుతాయి. మన సనాతన ధర్మంలో ఉన్న రహస్య సిద్ధాంతమిదే!' అంటారు. ఇలాంటి నిశ్శబ్ద విప్లవాలకు మనం శక్తిస్థానాలుగా నిలిచి, సడిలేని సెలయేరులా ప్రవహించినప్పుడే ముందు తరాలకు మార్గదర్శకులం కాగలం. ❖

స్వకీయ ప్రతిభను ఎంత గోప్యంగా ఉంచుకుంటే అంత రాణిస్తుంది. గుప్తంగా, నిరాడంబరంగా పనిచేయడం సాత్త్విక గుణానికి ప్రతీక. అది మనలోని అహంకారాన్ని తగ్గిస్తుంది. - శ్రీరామకృష్ణులు

విషాద నిశీథిలో...

– స్వామి విమూర్తానంద

ప్రణయ్, మాధవి దంపతులది అన్యోన్యమైన దాంపత్యం. ముప్ఫై ఏళ్ళు కూడా నిండని ఇద్దరూ రసాయనశాస్త్రంలో ఉన్నత చదువులు చదివి చెన్నైలో పరిశోధకులుగా స్థిరపడ్డారు. ఆ జంటకు యుక్తవయస్సులోనే శ్రీరామకృష్ణ మఠం, మూర్తిత్రయ భావ జాలంతో అనుబంధం ఏర్పడింది. వారి వృత్తి శాస్త్రపరిశోధన అయితే, ప్రవృత్తి ఆధ్యాత్మిక



సాధన! వారు ప్రయోగశాలలో ఐన్‌స్టీన్ లాంటి శాస్త్రవేత్తల సిద్ధాంతాలతో మునిగితేలుతూ, పూజ గదిలో శ్రీరామకృష్ణులు, శారదాదేవిల భావాలతో మమేకమవుతూ ఉండేవారు. ఇలా దాదాపు నాలుగేళ్ళ పాటు దాంపత్యానికే సరికొత్త నిర్వచనమిస్తూ మాధవి, ప్రణయ్‌ల జీవితం పూలతేరులా సాగిపోయింది. అయితే కాలం ఒక్కసారిగా కాలనాగై కాటేసింది. ప్రత్యేక పరిశోధనల నిమిత్తం చైనా వెళ్ళిన ప్రణయ్‌ని ప్రమాదం రూపంలో కబళించింది. ప్రయోగశాలలోనే పరిశోధనలు వికటించి, ఆ మంటల్లోనే ఆయన దేహం మసిగా మారిపోయింది. ప్రణయ్ 'ఇక లేడని' తెలియగానే మాధవి మూర్ఛపోయింది. ఆ తరువాత ఆమె కన్నీళ్ళను ఆపడం ఎవరి తరమూ కాలేదు. ప్రణయ్ మిగిల్చిన స్మృతులు తప్ప, కనీసం కడసారి చూపులు కూడా దక్కలేదని మాధవి రోదించని రోజు లేదు.

శారదమ్మ ఒడిలో సాంత్వన: చోటు మారితేనన్నా మాధవి మనస్సు కుదుటపడుతుందని ఆమె అన్నావదినలు చెన్నైకి సమీపంలోని తమ ఇంటికి తీసుకువెళ్ళాలనుకున్నారు. ఒకరోజు ముగ్గురూ కలిసి కారులో బయలుదేరారు. మార్గమధ్యంలో ఓ చోట రామకృష్ణ మఠం కనిపించింది. అప్పటి వరకు ఒక్క మాట కూడా మాట్లాడని మాధవి, ఒక్కసారిగా 'నాకు అమ్మను చూడాలని ఉంది!' అంది. 'ఇంటికే కదా వెళుతున్నాం!' అన్నారు అన్నావదినలు. 'ఆ అమ్మను కాదు, శారదమ్మను' అంది మాధవి! అప్పటికే ఆమె కళ్ళలో నీళ్ళు సుడులు తిరుగుతున్నాయి. శారదాదేవి దగ్గరకని వాళ్ళకు అర్థమై, మఠంవైపు కారు మళ్ళించారు.

అక్కడికి వెళ్ళగానే, మాధవి ఆలయంలోకి వెళ్ళి, శారదాదేవి ఛాయాచిత్రం ముందు మోకరిల్లింది. అమ్మ వదనం చూడగానే, ఆమె కళ్ళు ధ్యానంతో మూతపడ్డాయి. కానీ కన్నీళ్ళు ధారాపాతంగా కురవసాగాయి. అలా మాధవి కన్నీళ్ళు ఇంకిపోయే దాకా ఏడ్చింది. అప్పుడు హఠాత్తుగా 'అమ్మా! నీకూ నాలాగే దుఃఖం ప్రాప్తించిందా?' అని శారదామాత ప్రశ్నించినట్లు స్ఫురించింది. కష్టంతో పుట్టింటికొచ్చిన కన్నబిడ్డను తల్లి తన ఒడిలోకి తీసుకొని ఓదార్చినట్లనిపించింది మాధవికి!

వెంటనే మాధవికి శారదామాత జీవితంలోని ఉదంతాలు కళ్ళ ముందు కదలసాగాయి. ఒక్కగానొక్క కొడుకు అకాలమరణంతో కంటికి మింటికి ఏకధారగా రోదిస్తూ, తన దగ్గరకు వచ్చిన ఓ అభాగినిని శారదామాత ఓదార్చిన తీరు గుర్తొచ్చింది. ఆ కన్నతల్లి కష్టాన్ని చూసి శారదమ్మ విలపిస్తుంటే అక్కడి వారికి ఎవరి బిడ్డ కన్నుమూసిందో తెలియలేదట! అప్పుడు ఆ తల్లితో, శారదాదేవి 'నీకు ఏ కష్టమొచ్చినా ఈ అమ్మ ఉందని మరచిపోకు' అని ఓదార్చి, ప్రసాదం పెట్టి, విషాదాన్ని ఉపశమింపజేసింది. తనను ఆశ్రయించిన వారి బాధలతో శారదామాత అంతగా తాదాత్మ్యం చెందేవారు. ఇలాంటి సంఘటనలే కదా అమ్మ జగన్మాత అనడానికి నిదర్శనం అనుకుంది మాధవి. ఆ తరువాత ఆమె మఠం నుంచి కారులో అన్నావదినలతో కలిసి ప్రయాణమైంది.

అమ్మ జీవితంలోనూ అంతులేని కష్టాలు : ప్రయాణంలో మాధవి మనస్సు మళ్ళీ శారదామాత జీవనఘట్టాల్లోకి మరలింది. "భగవాన్ శ్రీరామకృష్ణ పరమహంస భౌతికంగా ఈ ప్రపంచం నుంచి సెలవు తీసుకొని వెళ్ళిపోయిన రోజు శారదామాత దుఃఖం వర్ణనాతీతం. సాధారణ అర్ధాంగిలా అమ్మ కూడా కుమిలి కుమిలి రోదించింది. అప్పుడు శ్రీరామకృష్ణులు ప్రత్యక్షమై, 'శారదా! నేను ఎక్కడికి వెళ్ళిపోయానని బాధపడుతున్నావు. ఒక గదిలో నుంచి, మరొక గదిలోకి వెళ్ళానంతే!' అన్నారు. అప్పుడు శారదాదేవికి అర్థమైంది – ఆయన అమరులు, శాశ్వతులని! అప్పటి నుంచి శ్రీరామకృష్ణులు ఎప్పుడూ తనతోనే ఉన్నట్లు అమ్మ భావించేది!"

ఒక్కసారిగా ఆ సంఘటనను తలచుకోగానే మాధవి మనస్సులో ప్రణయ్ మెదిలాడు. ఇక తను ఒంటరిని కానన్న భావన మాధవికీ కలిగింది. ఆయన ఆశలనూ, ఆశయాలనూ సఫలం చేస్తూ, శాస్త్రపరిశోధనలో నిమగ్నమైంది. శారదామాత చరితామృతం, వచనామృతం పఠనంతో జీవితాన్ని సార్థకం చేసుకుంది. ❖



పరివర్తనకే ప్రాధాన్యం

– స్వామి రంగనాథానంద (రామకృష్ణ సంఘం 13వ సర్వాధ్యక్షులు)

ఒకసారి నేను (స్వామి రంగనాథానంద) అమెరికాలో పర్యటిస్తూ ప్రవాస భారతీయులు ఏర్పాటుచేసిన సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యాను. అక్కడ ప్రసంగించి అనంతరం సభికుల సందేహాలకు సమాధానాలిస్తూ ఉన్నాను. ఇంతలో ఓ వ్యక్తి నిలబడి, 'స్వామీజీ! మీ అభిప్రాయం ప్రకారం ఆధునిక కాలంలో శాకాహారం మంచిదా? మాంసాహారం మంచిదా? అని ప్రశ్నించాడు. చాలా మంది వ్యక్తిగతంగా ఈ విషయమై నా దగ్గర సందేహాలు వ్యక్తం చేస్తూ ఉంటారు. సభాముఖంగా ఈ అవకాశాన్ని వినియోగించుకొని 'శాకాహారమా? మాంసాహారమా?' అన్న విషయమై నేను అక్కడ కొద్దిసేపు మాట్లాడాల్సి వచ్చింది.

ఎలాంటి ఆహారం తీసుకోవాలన్నది వ్యక్తిగత నిర్ణయం! అందరికీ ఒకే ఆహార నియమాల్ని నిర్ధారించలేము. కానీ ఆధునిక కాలంలో చాలా మంది భారతీయులే కాదు విదేశీయులు కూడా శారీరక సౌలభ్యం దృష్ట్యా శాకాహారులుగా మారేందుకు ఇష్టపడుతున్నారు. మంచిదే! అయితే శాకాహారం తీసుకోవడం వల్ల మనిషి సాత్త్వికుడైపోతాడనీ, మాంసాహారంతో క్రూరత్వం పెరిగిపోతుందనీ అనుకోవడం పొరపాటు. ఎందుకంటే *'I have seen many people in India, very vegetarian but sucking the blood of people* - పేరుకు శాకాహారులే కానీ, సాటిమనిషి రక్తం పీల్చే మనుషుల్ని ఎంతోమందిని చూశాను'.

ఇలాంటి శాకాహారుల వల్ల సమాజానికి మేలేమీ జరగదు. మాంసాహారాన్ని తీసుకున్నప్పటికీ ఎంతో ఉదారతతో ప్రవర్తించే మంచి మనుష్యులూ మనకు చాలామంది కనిపిస్తూ ఉంటారు. ఆహారం కొంత మేరకు మన మానసిక స్థితిపై, ప్రవర్తనపై ప్రభావాన్ని చూపుతుందన్నది వాస్తవమే! కానీ శాకాహారమైనా, మాంసాహారమైనా పూర్తిగా మన వ్యక్తిత్వానికి మాత్రం కారణం కావు.

మనస్ఫూర్తిగా శాకాహారం వైపు మరలడం వేరు! మనస్సులో తినాలని ఉన్నా, ఎవరో చెప్పారని, నలుగురి కోసం మాంసాహారం మానుకోవడం వేరు! అందుకే స్వామి వివేకానంద ఓ చోట *'Vegetarianism is a beautiful idea if you choose it, as you need it for your own inner growth. If it is thrust upon people then, it is not very desirable. Secondly, character is not essentially a product of either vegetarianism or non-vegetarianism* – ఆంతరంగిక పరివర్తన కోసం స్వచ్ఛందంగా ఆమోదించి, అనుసరించగలిగితే శాకాహారవాదం మంచి భావనే! కానీ ఆహార అభిరుచిని నిర్బంధం చేయడం మాత్రం సమర్థనీయం కాదు. ముఖ్యంగా శాకాహారా? మాంసాహారా? అన్న విషయాన్ని బట్టి వ్యక్తి శీలాన్ని నిర్ణయించలేమన్నది సత్యం' అంటారు.

అయితే ఈ రోజుల్లో వ్యక్తి బాహ్యంగా నలుగురి ముందు ప్రదర్శించే అలవాట్లను బట్టి అతని వ్యక్తిత్వాన్ని అంచనా వేస్తున్నాం. ఆహారం విషయంలోనూ అంతే! శాకాహారియై ఏదో ఆకుకూరలు, కూరగాయలు మాత్రమే తినే వ్యక్తి సౌమ్యుడని ఒక నిర్ధారణకు వస్తూ ఉంటాం. అలాంటి అంచనాలు అన్ని సమయాల్లోనూ సరికాకపోవచ్చు. చాలా మంది లోకం కోసం బాహ్యపరమైన మార్పులకు ఇచ్చినంత ప్రాధాన్యం ఆంతరంగిక పరివర్తనకు ఇవ్వరు. అందుకే ఏసుక్రీస్తు బైబిల్‌లో ఓ చోట *'We wash the outside of the cup but inside it is dirty* – మనం కప్పుని బయట శుభ్రం చేస్తాం. కానీ దాని లోపలంతా మలినమే' అంటారు.

ఆహారం దగ్గర నుంచి ఆహార్యం వరకు బయటకు సాత్త్విక లక్షణాలతో కనిపిస్తూ, మానసికంగా మాత్రం రజోగుణాత్మకమైన క్రోధంతో, ద్వేషంతో రగిలిపోయే వారెందరో! అందుకే శాకాహారులుగా కన్నా ముందు మానవతా వాదులుగా, ఆధ్యాత్మిక అన్వేషకులుగా మారేందుకు ప్రయత్నించాలి. అప్పుడు వాటంతట అవే సాత్త్వికగుణాలు పెంపొందుతాయి. స్వామి వివేకానంద మాటల్లో చెప్పాలంటే, "ఆధ్యాత్మిక జీవితంలో ఈ మాంసాహారం నాకిక అవసరం లేదు; శాకాహారం చాలు! అని సహజంగానే అనిపించే స్థితికి చేరుకుంటే అదే నిజమైన శాకాహార వాదం". ❖

సేకరణ: ఆర్.కృష్ణ

కామ క్రోధాలలో చిక్కుకొన్న వ్యక్తిని మాంసాహారం తినకుండడం, శిరోముండనం చేసుకోవడం, జడలుకట్టిన జుట్టుతో ఉండడం లాంటి బాహ్యవృత్తులేవీ పవిత్రుణ్ణి చేయజాలవు. *- భగవాన్ బుద్ధుడు*

(...23వ పేజీ తరువాయి)

పలువురికి తోచేది. ఒకనాడు స్వామి విశ్వేశ్వరానంద అమ్మను, 'అస్తమానం మీరు ఆమెను (రాధూను) ఎందుకు తలుస్తూ ఉంటారు' అని అడిగారు. 'ఏం చేస్తాం నాయనా! మేము ఆడవాళ్ళం, ఇలాగే ఉంటాము' అని అమ్మ బదులిచ్చారు. ఈ వాక్యం ఎంతో చాతుర్యంతో, సహజనటనా కౌశలాన్ని ప్రతిబింబించే రీతిలో ఉంది.

రాధూ, ఆమె తల్లి – ఇద్దరూ శారదామాతను విసిగించిన విధం మనకు తెలుసు. వారు ఎప్పుడూ ఆమెతో వాదిస్తూ, చెడు భాషణాలు చేస్తూ ఉండేవారు. అయితే శారదాదేవి దివ్యజనని కనుకనే వారిని మన్నించగలిగింది. దీన్ని ఎంతమంది అర్థం చేసుకోగలరు? వీరిరువురే కాక, ఇతర బంధువులు కూడా అమ్మను ఎన్నో విధాలుగా ఇబ్బందులు పెట్టినా సహనంతో అన్నింటినీ భరించారు. వీరంతా ఆమెచే సృష్టించబడినవారైనా, వారి దయాదాక్షిణ్యాలపై ఆధారపడి ఉన్నట్లుగా మెలిగారు! ఇది అద్భుతాలలో అద్భుతం కాదా?



ఒకసారి 'అమ్మ' పూజాకార్యక్రమంలో నిమగ్నమై ఉండగా, రాధూ తల్లి దుష్టమైన పదజాలాన్ని ఉపయోగించగా, పూజానంతరం ఆమె మీద జాలిపడి – 'నేను సాధారణ వ్యక్తినని భావించవద్దు. దివ్యాంశతో జన్మించిన దానిని. నీవు అన్నవి ఏవీ నేను పరిగణనలోకి తీసుకోవడం లేదు. కేవలం శబ్దమాత్రంగా భావిస్తున్నాను. ఒకవేళ నేను నిజంగా వాటిని పరిగణనలోకి తీసుకుంటే, నీవు తప్పించుకోగలననే అనుకుంటున్నావా?' అని సూటిగా ప్రశ్నించారు. ఇక్కడ ఈ సందర్భంలో అనుకోకుండా ఆమె తన శక్తిని వెల్లడి చేశారు.

అలాగే ఇంకోసారి, రాధూ తల్లితో 'ఎందరో యోగులు తమ సాధనల ద్వారా కూడా నన్ను పొందలేకపోయారు, నేను నీ ఎదురుగా ఉన్నా, నీవు నన్ను పొందలేకున్నావు' అని అన్నారు. మనమంతా ఎన్నో సాధనలు చేస్తాం. పరిత్యాగాలు చేసి అమ్మ దర్శన భాగ్యానికై పరితపిస్తాం. అయితే అమ్మ చుట్టూ ఉండే సన్నిహితులు, ప్రతీ క్షణం ఆమెతో గడిపే వారంతా ఆ దివ్యత్వాన్ని గుర్తించలేకపోయారు. ఇది ఆశ్చర్యకరమైన విషయం కాదా?

మాతృదేవి తన మేనల్లుడైన 'భూదేవ్' వివాహానికి ఎంతో శ్రమించారు. దీనికే కాక, అన్ని కార్యాలకూ ఆమె తన శక్తినంతా ధారపోశారు. వివాహం జరిగిన రెండు రోజుల అనంతరం, అమ్మ వాచి ఉన్న తన రెండు పాదాలను చూస్తూ, 'వీరు (ఈ బంధువులు) తమ పూర్వజన్మలో ఘోరమైన తపస్సులు చేసి, చివరికి తమ శిరస్సులను కూడా ఆహుతి చేసి ఉంటారు. అందుకే జగన్మాత వారి ఇంట వెలసింది అన్న గిరీశ్ మాటలు వాస్తవమే సుమా!' అని తలచుకున్నారు.

స్వామి వివేకానంద అమెరికా నుండి తిరిగి వచ్చాక, అమ్మను దర్శించడానికి వెళ్ళారు. అప్పుడు అమ్మ, స్వామీజీతో 'నీవు చేసిన పనిని ఇతరులు ఎవ్వరూ చెయ్యలేరు' అని అన్నారు. దానికి స్వామీజీ స్పందిస్తూ 'ఏమిటి అమ్మా! ఇవన్నీ నీవు చేయించినవి కావా? నీవు తలచుకుంటే, నా లాంటి వివేకానందలను వేలమందిని సృష్టించగలవు!' అని పలికారు. అందుకు ఆ తల్లి నవ్వసాగారు. ఆ నవ్వులోనే ఒక మహాతత్త్వం ఇమిడి ఉంది, అందులో, "నీవు అన్నది నిజమే! నీవు నా సృష్టిలోని వాడివే! అనే సత్యావిష్కరణం ఉంది. లక్షల కొద్దీ రామకృష్ణులు, వివేకానందులు, అనంతమాయా స్వరూపిణి అయిన దివ్యజనని శారదామాత నుండి ఉద్భవించగలరు".

శారదామాత రామేశ్వరం వెళ్ళినప్పుడు, శివలింగాన్ని చూడగానే అప్రయత్నంగా ఇలా అన్నారు: 'ఆహా! అచ్చం నేను వదిలివెళ్ళినప్పుడు ఎలా ఉందో అలానే ఉంది!' ఈ మాటలు త్రేతాయుగంలో శ్రీరామునితో కలిసి ఆ శివలింగాన్ని అర్చించిన సీతామాతను స్ఫురణకు తీసుకువస్తాయి. అలాగే బృందావనం వెళ్ళినప్పుడు, 'నేను రాధనే' అని తెలిపారు. రామావతారంలో సీతగా, కృష్ణావతారంలో రాధగా ఉన్న ఆమె ఈసారి రామకృష్ణావతారంలో శారదామాతగా రామకృష్ణులతో వచ్చారు. సీతామాత, రాధాదేవిల నామమహిమ మాత్రమే తెలిసిన మనకు శారదామాత రూపం కూడా తెలియడం ఎంత అదృష్టం!

మనందరికీ శారదాదేవిని దివ్యజననిగా శ్రీరామకృష్ణులు ఏ విధంగా చూసేవారో తెలుసు. మేనల్లుడైన హృదయ్ ఒకసారి ఆమె పట్ల అవిధేయత చూపాడు. శ్రీరామకృష్ణులు దాన్ని తీవ్రంగా ఖండిస్తూ, "కోరి వినాశనాన్ని తెచ్చుకుంటున్నావు. ఆమెకు కోపం వస్తే బ్రహ్మ విష్ణు మహేశ్వరులు కూడా నిన్ను కాపాడలేరు" అని హెచ్చరించారు. సాక్షాత్తూ సరస్వతీదేవి, శారదామాత రూపంలో వచ్చింది అని అందరికీ ఆయన తెలిపేవారు. మహోన్నత వ్యక్తిత్వమున్న వివేకానందుడు కూడా, 'మాతృదేవి బగళాదేవి అంశ అనీ, సరస్వతీదేవి రూపంలో దిగివచ్చారనీ' తెలిపారు.

మానవత్వం, దివ్యత్వం కలగలిసిన మాతృదేవి అద్భుత జీవితం ఓ మహిమోపేతమైన లీలగా అజరామరమై నిలిచి ఉంటుంది. ❖ **అనువాదం: డాక్టర్ అపర్ణా శ్రీనివాస్**



(1884 – 1967)

ముందుకు సాగిపో!

దివ్యజనని శ్రీశారదాదేవి ప్రత్యక్ష శిష్యులైన స్వామి ప్రేమేశానంద (1884-1967) రామకృష్ణ సంఘంలో అత్యున్నత గౌరవాన్నీ, ప్రేమాభిమానాలనూ చూరగొన్న అగ్రశ్రేణి సన్న్యాసి. ఆయన జీవితం శ్రీరామకృష్ణ - వివేకానందుల ఆశయాలతోనూ, భగవద్గీత సారాంశంతోనూ నిండింది. చాలామంది యువతీ యువకులకూ, గృహస్థులకూ, బ్రహ్మచారులకూ, సన్న్యాసులకూ ఆయన ఎన్నో లేఖలు వ్రాశారు. జీవితంలో అంకితభావం, ఆధ్యాత్మిక, సేవా భావాలను అలవరచుకొనేందుకు ఆ లేఖా పరంపరలు మార్గదర్శకాలయ్యాయి. పాఠకుల ప్రయోజనార్థం విలువైన ఈ లేఖలను 'శ్రీరామకృష్ణ ప్రభ'లో 2009 జూన్ సంచిక నుంచి ధారావాహికంగా ప్రచురిస్తున్నాం.

సార్‌గాచీ,
5-12-60

ప్రియమైన తల్లీ సుశ్రీ!*

నేను యమధర్మరాజుతో యుద్ధం చేయడంలో మునిగి ఉన్నందున నీకు వెంటనే జాబు వ్రాయలేకపోయాను.

లక్ష్మి నీ స్నేహితురాలే కదా! ఆమెను చూసి గేలిచేయడం గానీ, ఆమె భావాలను అగౌరవపరచడం గానీ నీకు తగిన పని కాదు.

వేల సంవత్సరాలుగా మనం సుఖదుఃఖాల మధ్య ఊగిసలాడుతున్నాం. సుఖం నుండి దుఃఖానికీ, కలయిక నుండి వేర్పాటుకూ, ఉష్ణం నుండి శీతలానికీ, గౌరవం నుండి అగౌరవానికీ – ఇంకా ఇలాంటివి ఎన్నిటి మధ్యనో ఊగిసలాడుతూనే ఉన్నాం. ఈ రెండు పార్శ్వాల మధ్య ముందుకూ, వెనక్కూ ఊగకపోతే మన మనస్సును అత్యంత విషాదం ఆవరిస్తుంది. అందుచేతనే కొంతకాలం నవ్వులు పూయించాక మనమందరమూ క్షమాపణలకు గురై, రోదిస్తున్నాం.

ఈ జీవిత సత్యాన్ని అర్థం చేసుకున్నారు కాబట్టే మీరంతా ఆ ఊగిసలాట నుండి బయటపడ్డారు. కనుక మళ్ళీ నువ్వు కొన్ని సమయాల్లో ఆ ఊగిసలాట జోలికి పోవడమెందుకు తల్లీ? అది ఎలాగంటే మనస్సులో కొన్ని సంశయాలు బయలుదేరతాయి. బహుశః ఈ ఊగిసలాట వ్యవహారం వ్యక్తి అంతః చేతనలో దాగివుండవచ్చు.

చూడు తల్లీ సుశ్రీ! స్వామి వివేకానంద సలహాను నూటికి నూరుపాళ్ళూ పాటించకపోతే వ్యక్తి తాను చేసిన కఠిన సాధనల ఫలితమంతా ఏ రంధ్రాల గుండా బయటకు నిష్క్రమిస్తుందో అర్థం చేసుకోలేడు.

అందుచేతనే '**క్షురస్య ధారా నిశితా దురత్యయా దుర్గం పథస్తత్కవయో వదన్తి** – భగవన్మార్గంలో పయనించడం పదునైన కత్తి అంచు మీద నడవడం లాంటిదని ప్రాజ్ఞులు అంటారు' అని కఠోపనిషత్తు (1.3.14) హెచ్చరిస్తుంది. అనేకమంది యోధులు కూలిపోవడం కళ్ళారా చూశాక కూడా ఎల్లకాలం భయంతో మనమలాగే ఉండిపోతుంటాం.

మీరంతా తెలివైనవారు. మీరు జ్ఞానదీపాన్ని వెలిగించి ప్రపంచం మొత్తానికీ వెలుగులు పంచాలి తల్లీ! ఒకసారి జ్ఞానోపలబ్ధి కలిగాక, భక్తి, యోగం, కర్మ అన్నవి బానిసల లాగా అనుసరిస్తాయి!

నీ బుద్ధిబలం మీద ఆధారపడకుండా భగవంతుని చరణాలపై భక్తి విశ్వాసాలను ఉంచి నీ కర్తవ్యాన్ని నిర్వహించు. శ్రీరామకృష్ణులను శరణువేడినవారు ఎలాంటి భయాందోళనలు చెందనవసరం లేదు. ఆయన మనల్ని ఎక్కడ ఉంచితే అక్కడ ఉండగలగాలి. మనతో ఏ పని చేయిస్తే ఆ పనిని చేయగలగాలి. నువ్వు ఎలాంటి భయానికి లోనుకావద్దు. శ్రీరామకృష్ణులను శరణువేడు తల్లీ!

(*సుశ్రీ కాలాంతరంలో ప్రవ్రాజిక నిర్భయప్రాణా మాతాజీగా సుప్రసిద్ధులు)


ప్రేమాశీస్సులతో
స్వామి ప్రేమేశానంద

తెలుగు సేత: కె. త్రివిక్రమరావు

జీవితంలో నిరాశ చెందిన పిదపే లౌకికులు భగవంతుణ్ణి వెదకనారంభిస్తారు. కానీ నిర్మలమైన పుష్పం లాగ చిన్నతనం నుండే తన హృదయాన్ని భగవత్ పాదపద్మాలకు సమర్పించే వ్యక్తి ధన్యుడు. - శ్రీశారదాదేవి

(...15వ పేజీ తరువాయి)
సరిదిద్ది, కర్మఫలాల పరిత్యాగమూ తపస్సేనని నిరూపించిన కర్మయోగిగా దత్తాత్రేయుడిని ఈ సంకీర్తనాచార్యుడు కీర్తిస్తూ....

అపరిమితములైన యజ్ఞాలు వడిజేయ
ప్రపన్నులకు బుద్ధి పచరించి
తపముగా ఫలపరిత్యాగము సేయించు
కపురుల గరిమల కర్మయోగి...అంటున్నాడు. పచరించి అంటే 'ప్రసరించి' అని, కపురుల అంటే 'శోభల', గరిమల అంటే 'ఘనత కలిగిన' అని అర్థం. అవగాహన లేకుండా, మిడిమిడి జ్ఞానంతో సంప్రదాయాలపై, ఆచారాలపై విముఖత వ్యక్తం చేయడం మన అజ్ఞానానికి నిదర్శనమే! ముఖ్యంగా కర్మాధ్యక్షుడు ఆ భగవంతుడే అన్న సత్యాన్ని మరచిపోయి, మనమే కర్తలమనుకోవడం కూడా అజ్ఞానమే! ఇదే సూచనతో భగవద్గీతలో సవ్యసాచితో శ్రీకృష్ణభగవానుడు...



యజ్ఞార్థాత్ కర్మణో௨ న్యత్ర లోకో௨ యం కర్మబంధనః ।
తదర్థం కర్మ కౌంతేయ ముక్తసంగః సమాచర ॥ *(గీత. 3-9)*

'ఈశ్వరప్రీత్యర్థం చేసే కర్మ కాకుండా, కర్తృత్వభావనతో చేసే కర్మలు బంధకారకాలు. అనాసక్తితో కర్మలను చేయి' అని అంటాడు. ఇలా లోకవ్యవహారాల్లో ఉంటూనే, లంపటంలో పడకుండా తామరాకుపై నీటిబొట్టులా మనగలగడమే కర్మయోగం.

బ్రహ్మయోగి....

అవధూత స్థితికి సంపూర్ణ నిర్వచనంగా నిలిచిన పరమపురుషులు దత్తాత్రేయులు. సర్వప్రకృతి వికారాలకు సుదూరంగా దేహం,ఇంద్రియ సంబంధ విషయాలతో మమేకం కాకుండా మనస్సును ఆత్మలోనే లీనం చేసిన నిష్ప్రపంచులే అవధూతలు. సశరీరంగా అలాంటి మహోన్నత స్థితితో దత్తాత్రేయులు గురూపదేశాలను బోధించారు. పంచభూతాల నుంచీ, పశుపక్ష్యాదుల నుంచీ పాఠాలు నేర్చుకోవచ్చని దత్తాత్రేయ అవతారంలో దేవదేవుడు నిరూపించారు. ఆ ఆచార్యదేవుడిని స్మరించుకుంటూ...

అన్ని చేతలును బ్రహ్మార్పణ విధిజేయ
మన్నించి బుద్ధులను మరుగ జెప్పి
ఉన్నత వదమున కొనరంగ కరుణించు
పన్నగ శయనుడె బ్రహ్మయోగి...

'ఈ కలియుగంలో అన్ని క్రియలనూ పరబ్రహ్మకే అర్పించి, ఉన్నతపదానికి చేరుకొమ్మనీ; పన్నగశయనుడైన పరంధాముడినే దత్తాత్రేయుల రూపం దాల్చిన బ్రహ్మయోగి' అనీ అన్నమయ్య ప్రబోధిస్తున్నాడు. కురుక్షేత్ర సంగ్రామానికి ఆరంభంలో అర్జునుడికి ఆ భగవానుడు కూడా బ్రహ్మార్పణ విశిష్టతను వివరిస్తూ...

బ్రహ్మార్పణం బ్రహ్మహవిః బ్రహ్మాగ్నౌ బ్రహ్మణా హుతమ్ ।
బ్రహ్మైవ తేన గంతవ్యం బ్రహ్మకర్మ సమాధినా ॥ *(గీత. 4-24)*

'యజ్ఞం చేసే వ్యక్తి, హోమానికి అర్పించే ద్రవ్యాలు, వాటిని దగ్ధం చేసే అగ్ని, పరబ్రహ్మ స్వరూపాలే! ఆ యజ్ఞఫలితం కూడా పరబ్రహ్మ స్వరూపమే' అని ఉద్ఘాటించాడు.

ఇలా సర్వకర్మలనూ యజ్ఞదృష్టితో చేయడమే బ్రహ్మకర్మ సమాధి నిష్ఠ. ఇలాంటి నిష్ఠ కలిగిన వ్యక్తి పరబ్రహ్మస్థితినే పొందుతాడు. యుగయుగాల్లోనూ భగవంతుడు జీవుల కర్మఫలాల భారాల్ని మోసేందుకు సంసిద్ధంగా ఉన్నాడు. అయితే మనమే అహంభావంతో అలవి కాని కర్మల భారాల్ని మోపుల్లా మోసుకుంటూ జన్మల పరంపరను పెంచుకుంటున్నాం.

అభ్యాసయోగి...

దత్తాత్రేయుడు యోగ సంప్రదాయకులని నారద పరివ్రాజక ఉపనిషత్తు చెబుతోంది. భగవాన్ శ్రీరామకృష్ణ పరమహంస కూడా దత్తాత్రేయ అవతార ప్రాధాన్యాన్ని ప్రస్తావిస్తూ "బ్రహ్మజ్ఞానం పొంది, సమాధి స్థితి ఏర్పడితే ఆ తరువాత 'నేను' అనే అహంకారం ఉండదు. అందుకే దత్తాత్రేయుడూ, జడభరతుడూ, తాము పొందిన బ్రహ్మదర్శనం గురించి ఏమీ వివరించలేకపోయారు. దత్తాత్రేయుడు మూగజీవాలను కూడా తన గురువులుగా చేసుకొని ఆధ్యాత్మిక జ్ఞానాన్ని బోధించాడు" అని గుర్తుచేసుకున్నారు. నిజమే! మనస్సు సిద్ధంగా ఉండాలే కానీ, మనకు ప్రకృతిలోని ప్రతి జీవీ పాఠాన్ని నేర్పుతుందనడానికి కొంగ నుంచి కొండచిలువ వరకు, తుమ్మెద నుంచి తేనెటీగ వరకు ఇలా ప్రతి ఒక్కదాన్నీ గురువుగా భావించిన దత్తాత్రేయులే నిదర్శనం.


తనరగ కపిలుడై దత్తాత్రేయుడై
ఘనమైన మహిమ శ్రీవేంకటరాయడై
ఒనరగ సంసార యోగము కృపసేయ
అనిమిష గతులను అభ్యాసయోగి...

భాగవత పరంగా భగవానుడు కపిల మహర్షిగా, తదనంతరం దత్తాత్రేయుడుగా లోకాన్ని ఉద్ధరించి, శ్రీవేంకటరాయుడై తిరుమలపై కొలువు తీరాడని కొండలరాయుడి ప్రియభక్తుడు పరవశించిపోతున్నాడు. సంసారాన్ని కూడా యోగంగా మలచేందుకు ఆదర్శయోగిగా, అభ్యాసయోగిగా మనకు దత్తాత్రేయులు ఎన్నో మెలకువలు నేర్పి తరించే మార్గాల్ని చూపారని అంజలి ఘటిస్తున్నాడు. ❖

డిసెంబరు 6వ తేదీన 'శ్రీదత్తజయంతి'



- స్వామి పార్థసఖానంద



"నేను తేడాగా ఉన్నానని అందరూ నన్ను చూసి నవ్వుతారు, అంతా ఒకేలా ఉన్నారని నేను వారిని చూసి నవ్వుతాను."

నేను - నా మార్గం

నేను

కాకతాళీయంగా కాక కోరుకున్న విధంగా జీవించాలని అనుకుంటాను.
సాకులు చెప్పాలని కాక మార్పులు చేయాలని అనుకుంటాను.
వంచింపబడాలని కాక స్ఫూర్తిని పొందాలని అనుకుంటాను.
వాడుకోబడాలని కాక ఉపయోగపడాలని అనుకుంటాను.
గెలవాలని కాక ఎదగాలని అనుకుంటాను.
ఓదార్పును కాక ఆత్మగౌరవాన్ని పొందాలని అనుకుంటాను.
తోచినట్లు చెప్పే ఇతరుల అభిప్రాయాలను కాక
నా అంతరాత్మ ప్రబోధాన్ని వినాలని అనుకుంటాను.

"ఓ పండులో ఉండే విత్తనాల్ని ఎవరైనా చూడగలరు, కానీ ఓ విత్తనంలో ఎన్ని పండ్లున్నాయో చూడగలవారే వివేకవంతులు."



విత్తనంలోని పండ్లు

నిజాయతీ అనే విత్తనాన్ని నాటితే,
దానికి ఫలంగా ఇతరుల విశ్వాసాన్ని పొందవచ్చు.

నిష్కపటం అనే విత్తనాన్ని నాటితే,
దానికి ఫలంగా ఆత్మీయతను పొందవచ్చు.

వినయం అనే విత్తనాన్ని నాటితే,
దానికి ఫలంగా అభిమానాన్ని పొందవచ్చు.

పట్టుదల అనే విత్తనాన్ని నాటితే,
దానికి ఫలంగా విజయాన్ని పొందవచ్చు.

దయ అనే విత్తనాన్ని నాటితే,
దానికి ఫలంగా ఇతరులతో సమన్వయాన్ని పొందవచ్చు.

శ్రమ అనే విత్తనాన్ని నాటితే,
దానికి ఫలంగా అభివృద్ధిని పొందవచ్చు.

"హాస్య రసం మనలో లోపిస్తే మన కష్టాల బలం వేయి రెట్లు కావడం ఖాయం."



కష్టాలు, కడగండ్లు

1. కష్టం అనేది ఓ గులకరాయి లాంటిది. దాన్ని కంటికి మరీ దగ్గరగా ఉంచుకుంటే మిగతా వాటిని కనపడనీయకుండా చేస్తుంది. కానీ దాన్ని కంటికి సరైన దూరంలో ఉంచుకుని చూస్తే, మనం దాన్ని బాగా గమనించగలం. ఇక దాన్ని మన కాళ్ళ దగ్గర పడేస్తే, అది మన జీవన గమనంలో ఎదురైన మరో చిన్న అవరోధం మాత్రమే అని తెలుసుకోగలం.

2. మన జీవితంలోకి సమస్యలు రావడానికి కారణం ఏమిటో తెలుసుకోవాలంటే, వాటి ప్రభావం నుండి బయట పడ్డప్పుడు మాత్రమే అది సాధ్యమవుతుంది.

3. కష్టంలోనూ చిరునవ్వు చెరిగిపోనీయని వారు, బాధ నుండి బలాన్ని కూడగట్టుకునే వారు, పరిణతి పొంది ధైర్యాన్ని పెంచుకునే వారే మహాత్ములు.

భగవద్గీత - సద్గుణ సుధ



ఈ గూటిలోని చిలుక ఎగిరేదెప్పటికో!

- స్వామి పరిజ్ఞేయానంద

అర్జునుడు యుద్ధభూమిలో తన కర్తవ్యాన్ని మరచి ఎంతో కరుణాస్వరూపుడిలా, విరాగిలా, జ్ఞానవంతునిలా ప్రవర్తించాడు. అర్జునుడి బాల్యచేష్టల్ని ఎంతో సహనంతో భరించి, అతడి తప్పుల్ని గుర్తుచేశాడు శ్రీకృష్ణుడు. అప్పుడు అర్జునుడు తన తప్పులను తెలుసుకొని, తనకు సరైన మార్గాన్ని చూపించమంటూ శ్రీకృష్ణుణ్ణి వేడుకున్నాడు.

అయితే, అర్జునుడు 'భగవాన్! నేను మీ ఆజ్ఞను శిరసా వహించడానికి సిద్ధంగా ఉన్నాను' అని చెప్పినప్పుడు, భగవానుడు వెంటనే అతడిని అస్త్రశస్త్రాలను ధరించి యుద్ధానికి సిద్ధం కమ్మని చెప్పలేదు. ఎందుకంటే అర్జునుడిలో మళ్ళీ భయం, ఆందోళన, నిరాశ, చపలత్వం, మోహం లాంటి బలహీనతలు పొడసూప కూడదని భావించాడు. అందువల్ల శ్రీకృష్ణుడు కర్తవ్య నిర్వహణకు ముందు అర్జునుడికి ప్రేరణదాయకమైన బోధనలు చేశాడు.

నేటికాలంలో ఐ.ఏ.ఎస్., ఐ.పి.ఎస్; బహుళ జాతీయ సంస్థల్లో ఎంపికైన అభ్యర్థులకు, పదవీ బాధ్యతల్ని చేపట్టే ముందు శిక్షణ శిబిరాలను నిర్వహిస్తున్నారు. కానీ శ్రీకృష్ణుడు, అర్జునుడికి ఆనాడే బాధ్యతల్ని సమర్థంగా నిర్వహించడానికి శిక్షణ తరగతులను నిర్వహించాడు.

ఇంతకీ అర్జునుడి సమస్య ఏమిటి? భయం, నిరాశ, అలజడి, ఒత్తిడి, మోహం... ఇవన్నీ కేవలం అర్జునుడి సమస్యలే కావు. మనందరి సమస్యలు కూడా! ఈ సమస్యలకు కారణం - 'నేను, నాది' అనే భావం.

మన జీవితాల్లో కూడా ప్రతి నిత్యం జరిగే సంఘటనల పట్ల మనం ప్రతిస్పందించే తీరును ఒక్కసారి ఆలోచిస్తే మన పరిస్థితి ఏమిటో అర్థమవుతుంది. పక్కింట్లో ఎవరైనా చనిపోయినా, 'అయ్యో పాపం' అనేసి, మనం హాయిగా భోజనం చేసి నిద్రపోతాం. అదే మన ఇంట్లో ఎవరైనా చనిపోతే నిద్రాహారాలు మాని విలపిస్తాం. అలాగే పక్కింట్లో లక్షల ఖరీదు చేసే నగలు పోతే స్థితప్రజ్ఞునిలా నిశ్శబ్దంగా ఉంటాం. అదే మన ఇంట్లో ఒక గుండుసూది పోతే పక్కింటి వారిని నిద్ర పోనివ్వం. మన ఈ పక్షపాత వైఖరికి కారణం మమకారమనే సంకెళ్ళలో బందీ కావడమే!

"నా సోదరులు, నా బంధువులు, నా గురువులు... ఇలా 'నా వారు' అనుకున్న వారంతా యుద్ధంలో చనిపోతారు" అనే భయం అర్జునుణ్ణి ఆవరించింది. అర్జునుడిది నిజమైన ప్రేమ, దయ, కరుణ అయినట్లయితే యుద్ధంలో పాల్గొన్న మిగతా సైనికుల కోసం కూడా విలపించి ఉండేవాడు. కానీ అలా జరగలేదు. అర్జునుడి దుఃఖానికి కారణం- 'నావాళ్ళనే మమకారమే!'

ఈ మమకారపు సంకెళ్ళ నుండి విడిపించడానికే శ్రీకృష్ణుడు దేహ పరిణామక్రమాన్నీ, అశాశ్వతత్వాన్నీ, పరమార్థతత్త్వ జ్ఞానాన్నీ బోధిస్తూ...

దేహినోఽస్మిన్ యథా దేహే కౌమారం యౌవనం జరా ।
తథా దేహాన్తరప్రాప్తిః ధీర స్తత్ర న ముహ్యతి ॥ *(గీత. 2-13)*

'మానవుడికి ఈ దేహంలో బాల్యం, యౌవనం, ముసలితనం ఎలా కలుగుతున్నాయో, మరణం తరువాత మరొక దేహాన్ని పొందడం కూడా అలాంటిదే! ఈ విషయంలో జ్ఞానులు (ధీరులు) మోహవశులు కారు' అని వివరించాడు.

బాల్యం, యౌవనం, వార్ధక్యం - ఈ మార్పులన్నీ మనకు తెలుస్తున్నాయి కాబట్టి దుఃఖం లేదు. కానీ మరణం తరువాత ఏం జరుగుతుందో తెలియదు కాబట్టి మరణమంటే మనకు భయం కలుగుతుంది. అందుకే 'చిరిగిన వస్త్రం వదలి, కొత్త వస్త్రాన్ని ధరించినట్లు- మరణం తరువాత ఆత్మ మరో దేహాన్ని ధరిస్తుందని గ్రహించినవారే ధీరులు' అని ఉద్ఘాటించి, అర్జునుడి మోహపాశాన్ని త్రుంచి వేశాడు శ్రీకృష్ణుడు.

మన దృష్టిలో ధీరులంటే అశోకుడు, అలెగ్జాండర్ లాంటివారు. కానీ శ్రీకృష్ణుని దృష్టిలో నిజమైన ధీరులు - సోక్రటీస్, రమణమహర్షి లాంటి జ్ఞానులు. సోక్రటీస్ మరణ సమయంలో అతడి శిష్యులు 'మీరు చనిపోయిన తరువాత మీకు అంతిమ సంస్కారాలు ఎలా చేయాలి?' అని ప్రశ్నించారు. అప్పుడు సోక్రటీస్ 'అసలైన నేను (ఆత్మ) మీకు దొరకను. మీరనుకున్న ఈ నేను (దేహం)కు అంతిమ సంస్కారాలు అందరికీ చేసినట్లే చేయండి' అని నవ్వుతూ బదులిచ్చారు. ☞



జీవన వేదం

స్వామీజీ కథల సారం

అది తెలిస్తే... ఇది వదిలేస్తాం!

మతం, భగవంతుడు వీటి గురించి నీకు అర్థం కావాలంటే నీవు నీ మేధాశక్తితో, గ్రంథపఠనంతో, దేవీదేవతల విగ్రహాలతో ఎంత కుస్తీపట్టినా ప్రయోజనం శూన్యం. దానికి గొప్ప ఆర్తి, పరితాపం కావాలి.

ఒక మహానుభావుడైన జ్ఞాని ఇలా చెప్పేవారు.

"ఒక గదిలో దొంగ ఉన్నాడు. అతనికి ఎలాగో అలా ప్రక్క గదిలోనే బంగారు రాశులున్నాయని తెలిసింది. ఈ రెండు గదులకూ మధ్యన ఓ గోడ మాత్రమే అడ్డంగా ఉంది. ఆ దొంగ పరిస్థితి ఏమిటి? అతని మనఃస్థితి ఎలా ఉంటుంది? అతడు నిద్రపోలేడు, ఏమీ తినలేడు, త్రాగలేడు. అతని మనస్సంతా ఆ బంగారాన్ని ఎలా దోచుకోవాలన్న ఆలోచనతోనే నిండివుంటుంది.

ఆనందపు ఖని, అనుగ్రహపు రాశి, భగవత్ వైభవం – అన్నీ ఇక్కడే ఈ భూమిపైనే ఉన్నాయని నిజంగా నమ్మిన జనులు ఆ భగవత్ ప్రాప్తికై ప్రయత్నించకుండా ఉండగలరా చెప్పండి?"

భగవంతుడున్నాడని నమ్మిన తక్షణం వ్యక్తి ఆయనను పొందాలనే కోరికతో పిచ్చివాడై పోతాడు. ఒక వ్యక్తి తాను ప్రస్తుతం గడుపుతున్న జీవితం కన్నా మహత్తరమైన జీవితం మరొకటి ఉందని తెలుసుకున్ననాడు, ఈ ఇంద్రియాలే సర్వస్వం కాదని గ్రహించిననాడు, ఈ క్షణికమైన భౌతిక శరీరం మరణం లేని శాశ్వతమైన ఆత్మానందం కన్నా అధికం కాదని తెలిసిననాడు – ఆ శాశ్వత ఆనందాన్ని తనంతట తానుగా పొందేందుకు పిచ్చివాడైపోతాడు. ఆ విధమైన పిచ్చి, దాహం, నిరంతర కృషినే 'మేలుకొలుపు' అంటుంది మతం. ఆ స్థితి మనిషికి కలిగిననాడు అతడు మతం గురించి ప్రాథమిక జ్ఞానం పొందినవాడవుతాడు. ఉప్పు బొమ్మ ఒకటి సముద్రపు లోతు కొలవడానికి సముద్రంలోకి వెళ్ళి అందులో కరిగిపోయినట్లన్నమాట! ❖

నువ్వే అతడు.. అతడే నువ్వు!

రెండు రకాల ధైర్య సాహసాలు ఉన్నాయి. ఒకటి తుపాకీకి రొమ్మిచ్చి నిలవడం, రెండవది ఆధ్యాత్మిక దృఢ నిశ్చయం. భారతదేశంపై దండెత్తిన ఒక చక్రవర్తికి అతని గురువు అచ్చటి కొందరు యోగులను దర్శించమంటూ సలహా ఇచ్చాడు. చక్రవర్తి చాలా చోట్ల యోగుల కోసం వెతికాడు. చివరకు ఒక చోట బండరాతిపై కూర్చొని ఉన్న ఒక వృద్ధుణ్ణి చూశాడు. ఆ చక్రవర్తి అతనితో కొంతసేపు మాట్లాడి, అతని తెలివితేటలకు చాలా ప్రభావితుడయ్యాడు. ఆ యోగిని తనతో పాటు తన దేశానికి రమ్మని కోరాడు.

"లేదు. నేను ఇక్కడ ఈ అరణ్యవాసంతో చాలా సంతోషంగా ఉన్నాను" అన్నాడా యోగి. "నేను ప్రపంచాధినేతను. నేను నీకు అపారమైన సంపదను, పదవిని ఇస్తాను" అని చెప్పాడు చక్రవర్తి.

"వద్దు. అవన్నీ నాకు అవసరం లేదు" అని బదులిచ్చాడు యోగి. "నీవు నాతో రాకపోతే నిన్ను చంపివేస్తాను" అని హెచ్చరించాడు చక్రవర్తి. ఆ యోగి ప్రశాంతంగా చిరునవ్వు నవ్వి, "నువ్వు ఎంత మూర్ఖుడివి? నీవు నన్ను చంపలేవు. నన్ను సూర్యుడు ఎండించలేడు, అగ్ని కాల్చలేదు, శస్త్రం చంపజాలదు. నాకు చావు పుట్టుకలు లేవు. నేను సర్వశక్తిమంతమైన, సర్వవ్యాపినైన ఆత్మను" అని ఆ చక్రవర్తికి సమాధానమిచ్చాడు. ఇదే ఆధ్యాత్మిక దృఢత్వమంటే! మిగిలినవన్నీ సింహం, పెద్దపులి వంటి వాటి కుండే దృఢత్వం.

మరొక సంఘటన చెబుతాను– 1857వ సంవత్సరంలో సిపాయిల తిరుగుబాటు జరుగుతున్న సమయంలో ఒక స్వామీజీ ఉండేవారు. ఆయనను ఒక మహమ్మదీయ తిరుగుబాటుదారుడు క్రూరంగా పొడిచివేశాడు. హిందూ తిరుగుబాటుదారులు కొందరు ఆ మహమ్మదీయుణ్ణి పట్టుకొని ఆ స్వామీజీ ముందుకు తీసుకొనివచ్చి, అతణ్ణి చంపి వేయమని కోరారు. కానీ ఆ స్వామీజీ ప్రశాంతంగా చూస్తూ, "సోదరా! నువ్వే అతడు... అతడే నువ్వు..!" అంటూ మరణించాడు. ❖

తెలుగు సేత: కె. త్రివిక్రమరావు

అలాగే ఒకసారి రమణమహర్షి దగ్గరకి ఒక భక్తుడు వచ్చి 'స్వామీ! నేను కొత్తగా కొన్న కారులో మీరు ఒక్కసారి వచ్చి కూర్చొని పావనం చేయండి' అని వేడుకున్నాడు. అందుకు రమణమహర్షి 'నేను ఇప్పటికే ఒక వాహనంలో (శరీరంలో) కూర్చొని ఉన్నాను' అని చమత్కరించారు.


ఆత్మజ్ఞానం పొందిన మహాత్ములు అతి కొద్దిమందే ఉంటారు. ఆ స్థితిని పొందడం అందరికీ అంత సులభం కాకపోవచ్చు. కానీ ఈ దేహం శాశ్వతం కాదని గుర్తెరిగి వ్యవహరిస్తే మన సమస్యలన్నీ పరిష్కారమవుతాయి. నిజానికి మనలోని అసూయా ద్వేషాలకూ, అహంకార మమకారాలకూ, లోభ మోహాలకూ, కోపావేశాలకూ, పంతాలు పట్టింపులకూ, భయాందోళనలకూ ముఖ్య కారణం ఈ భూమ్మీద మన జీవితం మూన్నాళ్ళ ముచ్చటేనని మరచిపోవడమే!

'ఈ దేహం వేరు, ఆత్మ వేరు' అన్న అనుభూతి మనకు కలగకపోయినా 'ఈ దేహం ఎప్పుడు రాలిపోతుందో, ఈ గూటిలోని చిలుక ఎక్కడికి ఎగిరిపోతుందో' అన్న భావన మన మదిలో మెదిలితే మమకారం పటాపంచలవుతుంది. అప్పుడు ఈ ప్రపంచమనే నాటక రంగంలో మన పాత్రలను సమర్థంగా నిర్వహించి, సంతోషంగా నిష్క్రమించే ధీరులుగా రూపొందగలుగుతాం. ❖




ఫలించిన అమ్మ ప్రార్థన


చిత్రాలు: వేంకట్ చిత్రకథ: స్వామి విమూర్తానంద అనుసృజన: స్వామి జ్ఞానదానంద





2 ఆ సమయంలో ఒరిస్సాకు చెందిన ఒక సన్న్యాసి కామార్పుకూర్‌కు వచ్చాడు. జపధ్యానాలలో సమయాన్నంతా గడుపుతున్న ఆయనకు కుసంస్కారులైన తుంటరులు కొందరు చెప్పలేనంత ఇబ్బంది కలిగించ సాగారు. అప్పుడు ఊరి పెద్దమనుషులు కొందరు ఇలా అన్నారు:



3 సన్న్యాసి ఊరు వదలిపెట్టి పోతున్నాడని తెలిసి మాతృదేవి ఊళ్ళోని కొందరితో మాట్లాడారు.




4
ధ్వంసమైన ఆయన కుటీరాన్ని పునర్నిర్మిద్దాం.
ఇతరుల సహాయంతో మాతృదేవి ఆ కుటీరాన్ని తిరిగి కట్టనారంభించారు.
5
అప్పుడు హఠాత్తుగా ఆకాశం మేఘావృతమైంది. భారీ వర్షం వచ్చేట్లు అనిపించింది.
ఆహా! చినుకులు మొదలయ్యాయే!
అయ్యో! కుటీర నిర్మాణం ఆగితే సన్న్యాసి ఎక్కడ బస చేస్తారు?
6
తక్షణమే మాతృదేవి భగవంతుణ్ణి ప్రార్థించారు.
భగవాన్! ఇదేం పరీక్ష? కుటీర నిర్మాణం పూర్తయ్యాక మీ ఇచ్ఛ మేరకు వర్షం కురిపించండి.
ఏమాశ్చర్యం! వర్షం ఆగిపోయింది. ఆకాశం నిర్మలమైంది. జనులు మాతృదేవి ప్రార్థనాశక్తిని చూసి మహదానందం చెందారు.
7
అమ్మా! మీ ప్రార్థన మేరకు వాన ఆగిపోయింది. ఇదిగో! సాధువుగారి కుటీర నిర్మాణం ఇప్పుడే పూర్తిచేస్తాం.
కుటీర నిర్మాణం పూర్తయి, సాధువు అందులో ప్రవేశించే దాకా వర్షం కురవలేదు.


8
కాలాంతరంలో ఒకసారి జయరామ్‌బాటిలో మాతృదేవి ఉన్నప్పుడు ఆ చుట్టుపక్కల ప్రాంతాల్లో క్షామం తలెత్తింది. వర్షాలు లేవు. వ్యవసాయం మూలపడింది. జనులు ఆకలితో అలమటించడం చూసి మాతృదేవి తల్లడిల్లిపోయారు.
9
ఒకరోజు గ్రామస్థులు కొందరు...
అమ్మా! ఈ ఏడాది వర్షాలు పడకపోతే, మా చావులు తథ్యం.
10
మాతృదేవి వారిని సాంత్వన పరిచారు; తరువాత వారితో పొలాలకు బయలుదేరారు. పొలాలు బాగా బీడుపట్టిపోయాయి. మాతృదేవి కన్నీటితో ప్రార్థించారు.
భగవంతుడా! జనులు కరవుతో చావవలసిందేనా? దీనబంధూ! పేదలపాలిట పెన్నిధీ! కాపాడు ప్రభూ!
11
నాటి రాత్రే భగవత్కృప వల్ల కుంభవృష్టి కురిసింది.
ఆహా! ఇలా కుండపోతగా వర్షం కురవడానికి మాతృదేవి అశ్రుధారలే కారణం. ఇక మన కరవు సమసిపోయింది.
అవునవును! మాతృదేవి నాడు వాన కురవవద్దని ప్రార్థించారు, వర్షం ఆగింది. నేడు వాన కురివాలని వేడుకొన్నారు, కుండపోతగా కురుస్తోంది. జై మా! జై మా!

జీవనోద్యానంలో
మానవత్వ పరిమళాలు

ఉత్తమ సంస్కారం

మహారాష్ట్రకే మకుటాయమానుడు ఛత్రపతి శివాజీ. ఆయన సేనాపతి ఒకరు కల్యాణ దుర్గాన్ని జయించాడు. ఎన్నో అస్త్రశస్త్రాలతో పాటు, అపారమైన ధనం కూడా అతడి వశమైంది. ఒక సైనికుడు కల్యాణ దుర్గాన్ని పాలించే రాజు యొక్క కోడలిని తీసుకువచ్చి సేనాపతి ఎదుట ఉంచాడు. ఆమె అత్యంత సౌందర్యవతి. సేనాపతి ఆమె సౌందర్యానికి ముగ్ధుడైపోయాడు. ఆమెను శివాజీ మహారాజుకు ఇవ్వాలని నిర్ణయించుకొని, ఆమెను ఒక పల్లకీలో కూర్చోబెట్టి శివాజీ వద్దకు తీసుకొని వెళ్ళాడు.



శివాజీ ఆ సమయంలో తన సేనాపతులతో పాలనా వ్యవస్థకు సంబంధించిన సంభాషణలు జరుపుతున్నాడు. ఆ సేనాపతి చక్రవర్తికి నమస్కరించి 'మహారాజా! కల్యాణ దుర్గం నుండి మీకొక అపురూపమైన కానుక తెచ్చాను' అన్నాడు పల్లకీవైపు చూపుతూ.

శివాజీ వెంటనే లేచి పల్లకీ పరదాను తొలగించి చూశాడు. అందులో ఓ నవయవ్వన సౌందర్యవతి కూర్చొని ఉన్నది. వెంటనే శివాజీ సిగ్గుతో తలదించుకున్నాడు. శివాజీ పరాయి స్త్రీలను సైతం సొంత తల్లిలా గౌరవించేవాడు. ఆయన బాధతో సేనాపతివైపు చూస్తూ "అయ్యో! మన అమ్మలు కూడా ఇంత అందంగా ఉండి వుంటే మనం కూడా ఎంత అందంగా ఉండేవారమో!" అన్నాడు. "నువ్వు నాతో ఉండి కూడా నా స్వభావాన్ని తెలుసుకోలేకపోయావు కదా!" అని సేనాపతిని కోపగించుకున్నాడు. "వెళ్ళు, వెళ్ళి ఈమెను సగౌరవంగా వాళ్ళ ఇంట్లో దింపిరా" అని సేనాపతిని ఆజ్ఞాపించాడు. ఇది శివాజీ మహరాజ్ మహోన్నత సంస్కారం. ❖

మనల్ని రక్షించేది..!

ఒకసారి కొంత మంది సైనికులు మహమ్మద్ గారిని వెంబడించారు. అప్పుడు ఆయన వెంట ఒక్క వ్యక్తి మాత్రమే ఉన్నాడు. "మహానుభావా! వాళ్ళు దగ్గరికి వచ్చేస్తున్నారు. మనం దగ్గరలో ఉన్న గోతిలో దాక్కుందాం" అన్నాడు. వాళ్ళు అక్కడికి చేరుకుని చూడగా అందులో ఒక సాలెపురుగు గూడు ఉంది. ఆ వ్యక్తి ఆ గూడుని తీసి పారేయాలనుకున్నప్పుడు మహమ్మద్ అతడిని ఆపారు. "మిత్రమా! ఖుదా కోసమైనా ఈ సాలెగూడును పాడు చెయ్యవద్దు. పాపం, ఆ సాలీడు ఎంత శ్రమ పడి ఈ గూడు కట్టుకున్నదో కదా! దానిని పడగొట్టొద్దు" అన్నారు.

కానీ మిత్రుడికి ఈ మాట రుచించలేదు. "సమయం చాలా తక్కువగా ఉంది. మన ప్రాణాల కోసం దీనిని పడగొట్టడంలో తప్పు లేదు. ఇది దయ తలిచేందుకు తగిన సమయం కాదు" అన్నాడు.

"నువ్వు చెప్పింది నిజమే. కానీ మన ప్రాణాలను రక్షించుకునేందుకు ఇతరులను శిక్షించడం సరైన పని కాదు. ఇటువంటి సమయంలో దయ చూపించక పోతే, ఇక దయ ఎప్పుడు చూపిస్తాము?" అన్నారు మహమ్మద్.

విషయం అతడికి అర్థమైంది. ఇద్దరూ సాలెగూడును కొంచెం కూడా పాడు చెయ్యకుండా, ఆ గూటి క్రిందికి వెళ్ళి దాక్కున్నారు. సైనికులు అక్కడికి చేరుకొని, వాళ్ళ కోసం అటూ ఇటూ వెతికారు. గొయ్యిలో చూశారు. చెక్కు చెదరకుండా ఉన్న సాలెగూటిని చూసి "వాళ్ళే గనక ఈ గొయ్యిలో దాక్కుని ఉంటే సాలెగూడు చెదిరిపోయి ఉండేది. కాబట్టి వాళ్ళిక్కడ లేరు" అని అనుకుని వెళ్ళిపోయారు. ❖

అనువాదం: డాక్టర్ వై.సరోజా నిర్మల

(రామకృష్ణ సంఘం - హిందీ మాసపత్రిక 'వివేకజ్యోతి' నుండి)

(...27వ పేజీ తరువాయి)

మంచితనం మీద, మన ప్రతిభ మీద, మన భావాల మీద మనకు విశ్వాసం ఉండాలి. అసూయాద్వేషాలు కలగడానికి కారణం ఇతరులతో పోల్చుకుంటూ, మనల్ని మనం తక్కువగా భావించుకుంటూ ఆత్మన్యూనతకు గురికావడమే!

జీవితంలో మనం అనుకున్నట్లు ఇతరులు చేయకపోయినా, ఇతరులు చెప్పినవి మనకు నచ్చకపోయినా అభిప్రాయభేదాలు, అపార్థాలు, కోపతాపాలు తలెత్తుతాయి. ఇలా ప్రతి చిన్న విషయాన్నీ మనస్సులో పెట్టుకొని మధనపడినా, ప్రతిదాన్నీ భూతద్దంలో చూసి ఆవేశపడినా మనం ఎవరితోనూ కలసిమెలసి ఉండలేము. అందుకే *"If you leave petty things as petty, your life will be pretty. Instead, if you see petty things as pretty, then your life will become petty* - ప్రాధాన్యం లేని విషయాలను పట్టించుకోకుండా ఉంటే జీవితం ఆనందమయం. అలా కాకుండా ప్రతి చిన్న విషయాన్నీ పెద్దదిగా ఊహించుకొని బాధపడితే జీవితం దుఃఖమయం అవుతుంది' అన్న సత్యాన్ని గ్రహించాలి.

అలాగే, ఇతరుల లోటుపాట్లను లెక్కించడంలో సమయాన్ని వెచ్చించకుండా ముందు మనలోని లోపాలను తెలుసుకోవాలి. అందుకు 'నా తప్పులను సరిదిద్దుకోవడానికే సమయం సరిపోవడం లేదు. ఇక ఇతరుల తప్పులను వెతకడానికి సమయమెక్కడిది?' అన్న కబీర్‌దాస్ వచనాలను గుర్తుతెచ్చుకోవాలి.

ఇతరుల గురించిన చెడు అభిప్రాయాలను మనస్సులో పెట్టుకోకుండా ఉండడం, ప్రాధాన్యం లేని విషయాలను తలచుకొని మధనపడకుండా ఉండడం, మనలోని లోపాలను సరిదిద్దుకోవడానికి ప్రయత్నించడం - ఇవి మన జీవితంలో ఏ కొంచమైనా ఆచరించగలిగితే అసూయాద్వేషాలకు, పగలూప్రతీకారాలకు లోనుకాకుండా అందరితోనూ కలసిమెలసి ఉండగలుగుతాం. ప్రశాంతంగా జీవించగలుగుతాం. ❖

మానవుడు తన మనస్సును దిగజార్చుకున్న తరువాతే ఇతరుల దోషాలను ఎన్నుతాడు. పరులు మనల్ని విమర్శించినంత మాత్రాన మనకేమి నష్టం? విమర్శించేవాడే బాధపడతాడు. - శ్రీశారదాదేవి



వార్తావాహిని





సహయోజన సదస్సు

హైదరాబాదు రామకృష్ణ మఠం అనుబంధ సంస్థ 'వివేకానంద ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యూమన్ ఎక్సలెన్స్' హైదరాబాద్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్, కంపెనీ సెక్రటరీస్ ఆఫ్ ఇండియా, కాస్ట్ అకౌంట్స్ ఆఫ్ ఇండియా, ఉస్మానియా యూనివర్సిటీ సంస్థల సహకారంతో 2014 అక్టోబర్ 28న 'వ్యాపార అనుబంధ సంస్థల సామాజిక బాధ్యత' అనే అంశంపై సదస్సును నిర్వహించింది.

ఈ సదస్సుకు గవర్నర్ శ్రీ ఇ.ఎస్.ఎల్. నరసింహన్ ముఖ్యఅతిథిగా విచ్చేశారు. స్థానిక రామకృష్ణ మఠాధ్యక్షులు స్వామి జ్ఞానదానందజీ; వివేకానంద ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యూమన్ ఎక్సలెన్స్ సంచాలకులు స్వామి బోధమయానందజీ; శాంతా




బయోటెక్ సంస్థ సి.ఎమ్.డి డాక్టర్ కె.ఐ.వరప్రసాద్ రెడ్డి; పెన్నార్ ఇండస్ట్రీస్ చైర్మన్ శ్రీ నృపేంద్రరావు ప్రసంగించారు. ఈ సదస్సులో 600 మంది వ్యాపారవేత్తలు, విద్యావేత్తలు, సమాజ సేవకులు పాల్గొన్నారు. ❖ నివేదిక : డి.ఎన్. సంజీవ

భక్తులకు మంత్రదీక్ష

కడప రామకృష్ణ మిషన్‌లో, రామకృష్ణ సంఘ ధర్మకర్త, పాలకవర్గ సభ్యులు మరియు చెన్నై, శ్రీరామకృష్ణ మఠాధ్యక్షులు శ్రీమత్ స్వామి గౌతమానందజీ మహరాజ్, 2015 జనవరి 6,7 తేదీలలో భక్తులకు మంత్రదీక్ష ప్రసాదించెదరు.

పూర్తి వివరాలకు సంప్రతించండి : కార్యదర్శి, రామకృష్ణ మిషన్, పుట్లంపల్లి, కడప -516 002. ఫోన్: 08562 - 200120


గ్రంథ స్వీకారం



శ్రీ సీతారామాంజనేయ సంవాదము

(తాత్పర్య విశేషార్థ వ్యాఖ్యాన సహితము)

సంకలనం : శ్రీచంద్రగిరి యస్. సుబ్రమణ్యం
వెల: రూ. 350/-, పుటలు : 564
ప్రతులకు: బ్రహ్మస్వర్ణిని ప్రచురణలు
21/303, మురుగేశం కాంపౌండ్,
ఎస్.ఎఫ్.ఎస్.వీధి, కడప-516 001



చతుర్వేదాంతర్గత


ఉపనిషత్ ఉద్యానవనము

తాత్పర్య-వ్యాఖ్యానములు:శ్రీ వై హెచ్. రామకృష్ణ
వెల: రూ.500/-, పుటలు: 638
ప్రతులకు: శ్రీమతి యేలేశ్వరపు కనకదుర్గ,
ఇంటి నెం.2/8, శివాలయం వీధి,
కూచిపూడి, కృష్ణాజిల్లా - 521 136
ఫోన్: 08671-251164, 92479 25278

మహాభారతము

ప్రశ్నోత్తరమాలిక

సంకలనం: డా॥ నందూరు గోవిందరావు
వెల: రూ.125/-, పుటలు : 278
ప్రతులకు: డా॥ నందూరు గోవిందరావు,
ఇంటి నెం.1-9-1113/31, విద్యానగర్
హైదరాబాదు - 500 044
ఫోన్: 040-27610835, 98498 01490



ఆత్మసంవాదాలు

రచన: శ్రీ దోనెపూడి వెంకయ్య
వెల: రూ.75/-, పుటలు : 151
ప్రతులకు: రమణ భక్త మండలి ట్రస్టు,
రెండవ అంతస్తు, ఫ్లాట్ నెం.377,
ఎఫ్ బ్లాక్, 12వ క్రాస్, 16వ మెయిన్,
సహకార నగర్, బెంగుళూరు-560 092
ఫోన్: 90353 15104



Printed and published by **Swami Jnanadananda** owned by Ramakrishna Math Trust
and printed at Kala Jyothi Process, 1-1-60/5, RTC Cross Roads, Musheerabad, Hyderabad - 500 020
and published at Ramakrishna Math, Domalguda, Hyderabad - 500 029. **Editor: Swami Parijneyananda**

Vol.71-12, Sri Ramakrishna Prabha (Telugu Monthly) December 2014, Regd. with the Registrar of Newspaper for India Under No.1120/57. Postal Registration No. HD-1071/2013-15. Licensed to Post Under WPP : AP/CPMG/HC-13/WPP/2013-14. Date of Publication : 18 November 2014

దివ్యజనని ప్రథమ ఛాయాచిత్రం

దివ్యజనని శ్రీశారదాదేవి తొలి ఛాయాచిత్రాన్ని తీసి, ప్రపంచానికి అందించిన భాగ్యం స్వామి వివేకానంద పాశ్చాత్య శిష్యురాళ్ళు శ్రీమతి సారా బుల్, సోదరి నివేదితలకు దక్కింది. సనాతన సంప్రదాయాన్ని గౌరవించే శ్రీశారదాదేవి అపరిచిత వ్యక్తుల ముందు, బయట స్టూడియోల్లో ముఖానికి ఉన్న ముసుగు తీసి ఛాయాచిత్రం దిగేందుకు నిరాకరించారు. అయితే శ్రీమతి సారా బుల్, 'అమ్మా! మీ ఛాయాచిత్రాన్ని అమెరికా తీసుకువెళ్ళి, ఆరాధించుకునే భాగ్యాన్ని కల్పించండి' అని ప్రాధేయపడడంతో శ్రీశారదాదేవి అంగీకరించారు.



ఈ నేపథ్యంలో 1898 నవంబరులో కలకత్తా, బాగ్‌బజార్‌లో 10/2, బోస్‌పారా వీథిలోని, సోదరి నివేదిత గృహంలో శ్రీశారదాదేవి ప్రథమ ఛాయాచిత్రాన్ని తీయడం జరిగింది.

ఆ రోజు శ్రీమతి సారా బుల్, సోదరి నివేదితలు శ్రీశారదాదేవిని ఆసీనురాలిని చేసి శిరోజాలను, చీర పైటను సర్ది ఛాయాచిత్రం తీయడం కోసం సిద్ధం చేశారు. అప్పటి వరకు సహజంగానే ఉన్న దివ్యజనని ఆ ఏర్పాట్లు జరుగుతూ ఉండగానే క్షణాల్లో సమాధిస్థితిలోకి వెళ్ళిపోయారు. వికసిత నేత్రాలతో కూడిన ఆ భావాతీత స్థితిలోనే ఛాయాగ్రాహకుడు హ్యారింగ్‌టన్ శ్రీశారదాదేవి ఛాయాచిత్రాన్ని తీశాడు.

ఆ ఛాయాచిత్రాన్ని రాస్‌విహారీ మహరాజ్ (స్వామి అరూపానంద) శ్రీశారదాదేవికి చూపి, 'అమ్మా! మీ ఛాయాచిత్రం ఎలా ఉంది?' అని అడిగారు. అప్పుడు అమ్మ "బాగుంది! కానీ అప్పుడు యోగీన్ (స్వామి యోగానంద) ఆరోగ్యం బాగాలేదు. ఆ ఆలోచనల వల్ల చిక్కిపోయాను" అని అన్నారు. ❖

(తిథి ప్రకారం - డిసెంబర్ 13వ తేదీ - శనివారం 'శ్రీశారదాదేవి జయంతి')



0883 - 246 2565
903 246 2565

MOHAN PUBLICATIONS

మోహన్ పబ్లికేషన్స్

అజంతా హోటల్ ఎదుట, కోటగుమ్మం, రాజమహేంద్రవరం - 533101.

WWW.MOHANPUBLICATIONS.COM

మావద్ద లభించు గ్రంథములు

1. వ్రతకథలు - పూజలు

1.	శ్రీ వినాయక వ్రతం	వెల రూ.10-00
2.	శ్రీ విఘ్నేశ్వరపూజా-పుణ్యాహవాచనం	30-00
3.	శ్రీ విఘ్నేశ్వరపూజ (కాణిపాకక్షేత్రమాహాత్మ్యంతో)	10-00
4.	సంకష్టహరచతుర్థి శ్రీమహాగణపతి వ్రతం	30-00
5.	వరలక్ష్మీ వ్రతం	10-00
6.	కేదారేశ్వర వ్రతం	10-00
7.	త్రినాధ వ్రతం(కలర్)	10-00
8.	త్రినాధవ్రతం(సాదా)	5-00
9.	క్షీరాబ్ధి వ్రతం	12-00
10.	మంగళ గౌరీవ్రతం	10-00
11.	వైభవలక్ష్మీ వ్రతం ఫోటో యంత్రంతో	25-00
12.	శ్రీలక్ష్మీ కుబేర వ్రతం (ఫోటో యంత్రంతో)	25-00
13.	కనకమహాలక్ష్మీ వ్రతం (కామేశ్వరీపాటతో)	25-00
14.	సంతోషీమాతా వ్రతం	25-00
15.	ఏడు శనివారాల వ్రతం	25-00
16.	సత్యనారాయణవ్రతం	25-00
17.	శ్రీ సువర్చలాహనుమద్దీక్ష	30-00
18.	శివదీక్ష	10-00
19.	కాత్యాయనీ వ్రతం	20-00
20.	సౌభాగ్య గౌరీవ్రతం	20-00
21.	తిరుప్పావై (ధనుర్మాసవ్రతం)	36-00
22.	స్త్రీల వ్రతకథలు	36-00
23.	స్త్రీలవ్రతకథలుస్థూలాక్షరి (నేదునూరిగంగాధరరావుగారి)	54-00
24.	పెళ్ళి పాటలు - స్త్రీలపాటలు (కామేశ్వరిపాటతో)	36-00
25.	సర్వదేవతా పూజావిధానం	25-00
26.	ఆరువ్రతాలు	30-00
27.	రాహుకాలంలోదుర్గాదేవీపూజా	10-00

ఈ ధరలు నికరముకాదు, ఎప్పటికప్పుడు మారుచుండవచ్చును.

28.	తులసి నిత్యపూజ, తులసీఉపయోగాలు	10-00
29.	శ్రీ చక్ర రహస్య విజ్ఞానమ్	36-00
30.	శ్రీచక్ర పూజావిధానం(పెద్దది)	36-00
31.	లక్ష్మీ - గౌరీ నిత్యపూజ	10-00
32.	శ్రీ సరస్వతీ నిత్యపూజ	10-00
33.	శ్రీ దుర్గానిత్యపూజ	10-00
34.	కాలభైరవ నిత్యపూజ	10-00
35.	శివపూజ	10-00
36.	వీరభద్ర పూజ	10-00
37.	ఆంజనేయ నిత్యపూజ	10-00
38.	నాగేంద్ర స్వామి పూజ	10-00
39.	సుబ్రహ్మణ్య నిత్యపూజ	10-00
40.	రామదేవుని కథ	10-00
41.	శివదేవుని కథ	10-00
42.	లక్ష్మీనరసింహపూజ	10-00
43.	వేంకటేశ్వరపూజ	10-00
44.	బ్రహ్మంగారి నిత్యపూజ	10-00
45.	సూర్య నిత్యపూజ	10-00
46.	నవగ్రహ నిత్యపూజ	10-00
47.	రుక్మిణీ కల్యాణం	25-00
48.	ఉమామహేశ్వర వ్రతం	36-00
49.	శ్రీ కామేశ్వరీ వ్రతం	36-00
50.	16 సోమవారముల వ్రతము	25-00
51.	పార్వతీకల్యాణం	25-00
52.	సహస్రకమలవర్తి వ్రతము	25-00
53.	పంచముఖ ఆంజనేయ పూజావిధానము	36-00
54.	అష్టనాగపూజ	36-00
55.	పూజలు ఎందుకుచేయాలి ?	36-00
56.	ఏ దేవునికి ఏపుష్పాలతో పూజించాలి?	36-00
57.	ఏ దేవునికి ఏప్రసాదం నైవేద్యం పెట్టాలి?	36-00
58.	ఏదేవునికి ఏవిధముగాదీపారాధనచెయ్యాలి?	36-00
59.	ఏదేవునికి ఎన్ని ప్రదక్షిణలుచేయాలి ?	36-00
60.	హనుమద్ వ్రతం	36-00
61.	పంచాయతన పూజ	63-00
62.	28 వ్రతములు	120-00

63.	కలశపూజలు (9ఒకేసారి)	150-00
64.	కలశపూజలు (విడివిడిగా) (ప్రింటులో)	....
65.	హ్రీంకార మహాయజ్ఞం (ప్రింటులో)	....
66.	గోమాత	40-00

2. స్తోత్రాలు-సుప్రభాతములు సహస్రనామములు

1.	శ్రీ లలితా విష్ణు సహస్రనామస్తోత్రాలు పురాణపండ రాధాకృష్ణమూర్తిగారి సంకలనం	45-00
2.	లలితావిష్ణు సహస్రనామస్తోత్రములు (హిందీ) ,,	50-00
3.	లలితావిష్ణు సహస్రనామస్తోత్రములు (ఇంగ్లీషు) ,,	50-00
4.	స్థూలాక్షరిలలితావిష్ణుసహస్రనామస్తోత్రములు(పత్రికసైజ్)	99-00
5.	లలితావిష్ణు (కేస్ బైండ్) 1/8 డెమ్మి	63-00
6.	స్థూలాక్షరీ లలితావిష్ణు (క్రౌన్‌సైజు)కేస్‌బైండ్	108-00
7.	సర్వదేవతా స్తోత్రమంజరి	120-00
8.	సకలదేవతా అష్టోత్తరశతనామావళిః (63)	24-00
9.	విష్ణుసహస్రనామస్తోత్రమ్ (క్రౌన్)	25-00
10.	లలితా సహస్రనామ స్తోత్రమ్ (క్రౌన్)	36-00
11.	లలితా సహస్రనామములు	24-00
12.	లక్ష్మీ సహస్రనామములు	24-00
13.	దుర్గా సహస్రనామములు	24-00
14.	ఆంజనేయ సహస్రనామములు	24-00
15.	శివ సహస్రనామములు	24-00
16.	విష్ణు సహస్రనామములు	24-00
17.	గణపతి సహస్రనామములు	24-00
18.	సుబ్రహ్మణ్య సహస్రనామములు	24-00
19.	గాయత్రి సహస్రనామములు	24-00
20.	లలితావిష్ణు సహస్రనామస్తోత్రాలు	24-00
21.	శ్రీరామా సహస్రనామములు	24-00
22.	సరస్వతి సహస్రనామములు	24-00
23.	సూర్యసహస్రనామములు & ఆదిత్యహృదయం	24-00
24.	శ్రీవేంకటేశ్వరసహస్రనామములు	24-00
25.	మణిద్వీపవర్ణన (పెద్దది)	24-00
26.	సంధ్యావందనం	24-00
27.	మంత్రపుష్పమ్	....
28.	త్రిభాషా హనుమాన్‌చాలీసా	15-00
29.	హనుమాన్ చాలీసా	10-00

30.	మణిద్వీపవర్ణన (పాకెట్)	10-00
31.	ఆరు చాలీసాలు	10-00
32.	శివారాధన (శివస్తోత్రాలు)	10-00
33.	వేంకటేశ్వర సుప్రభాతం (పాకెట్)	10-00
34.	ఆరుదండకాలు	5-00
35.	వేంకటేశ్వర గోవిందనామములు	5-00
36.	అష్టలక్ష్మీ స్తోత్రమ్ కనకధారాస్తోత్రమ్	10-00
37.	దేవీఖడ్గమాలాస్తోత్రమ్ (మహిషాసురమర్దనీస్తోత్రంతో)	10-00
38.	సుందరకాండ (పాకెట్)	10-00
39.	భగవద్గీత మూలం	27-00
40.	రామరక్షాస్తోత్రమ్	15-00
41.	స్తోత్ర రత్నావళి	36-00
42.	పురాణపండ లలితా-విష్ణు సహస్రనామస్తోత్రమ్(మినీ)	10-00
43.	పురాణపండ లలితాసహస్రనామస్తోత్రమ్(మినీ)	10-00
44.	పురాణపండ విష్ణు సహస్రనామస్తోత్రమ్	10-00
45.	పురాణపండ ఆదిత్య హృదయం	10-00
46.	మంత్రపుష్పం (మినీ)	10-00
47.	శివానందలహరి-సౌందర్యలహరి	36-00
48.	కుజదోషం	10-00
49.	కాలసర్ప దోషం	10-00
50.	మీ అప్పులు తీరాలా?	10-00
51.	దృష్టిదోషాలు నివారణ	10-00
52.	పంచసూక్తములు	10-00
53.	సంధ్యావందనం	10-00
54.	రుద్రనమకమ్-చమకమ్	10-00
55.	గాయత్రీమంత్రాలు	10-00
56.	హయగ్రీవ స్తోత్రమాల	10-00
57.	దక్షిణామూర్తి స్తోత్రమాల	10-00
58.	ద్వాదశ జ్యోతిర్లింగాలు - పంచారామాలతో	10-00
59.	శ్రీసూక్తం పురుష సూక్తం	10-00
60.	నవగ్రహస్తోత్రమాల	36-00
61.	మహాన్యాసమ్	36-00
62.	సుందరకాండ గానామృతం	36-00
63.	గోమాతపూజావిధానము	10-00
64.	ఆనందసిద్ధి - 1 శ్రీదేవీ స్తోత్రమాల	108-00

65.	ఆనందసిద్ధి - 2 ఏ సమస్యకు ఏ స్తోత్రమ్ పారాయణచేయాలి	108-00
66.	ఆనందసిద్ధి-3 మానసదేవీ స్తోత్రమాల	108-00
67.	శ్రీ కాలభైరవ రక్షా కవచమ్	63-00
68.	అర్చన	40-00
69.	నిత్యదేవతార్చన	40-00
70.	సర్వదేవతా స్తోత్ర నిధి	99-00
71.	శ్రీచక్ర నవవరణార్చన	63-00
72.	చండీ సప్తశతి పారాయణ క్రమం	99-00
73.	శ్రీదేవి స్తోత్ర రత్నావళి 32 దేవి స్తోత్రాలకు తాత్పర్యంతో	99-00
74.	వనదుర్గా మంత్రానుష్ఠాన క్రమమ్	63-00
75.	శ్రీ కాలభైరవ వ్రతము	63-00

3. శ్రీ సాయి దత్త గ్రంథములు

1.	శ్రీ సాయిబాబా సచ్చరిత్ర	120-00
2.	సంపూర్ణ శ్రీ గురు చరిత్ర	120-00
3.	శ్రీ సాయిఆరాధన-షిర్డివైభవం	120-00
4.	శ్రీ సాయిబాబా జీవిత చరిత్ర (క్రౌన్)	63-00
5.	శ్రీ గురుచరిత్ర (క్రౌన్)	63-00
6.	నవనాధ చరిత్ర	99-00
7.	శ్రీసాయిచరిత్ర (బైండు) ప్రయాణపుపారాయణగ్రంథం	63-00
8.	శ్రీగురుచరిత్ర (బైండు) ప్రయాణపుపారాయణగ్రంథం	63-00
9.	సత్యదత్తవ్రతం దత్తాత్రేయపూజాకల్పం,సహస్రంతో	30-00
10.	అనఘాదేవీ వ్రతం	30-00
11.	భక్తుల ప్రశ్నలకు బాబా జవాబులు	30-00
12.	శ్రీ సాయిపూజాకల్పం (సహస్రంతో)	25-00
13.	శ్రీ సాయిభజనమాల	20-00
14.	శ్రీ సాయి భజన్స్	20-00
15.	శ్రీ సాయిభక్తి గీతాలు	20-00
16.	శిరిడిహారతులు (భావంతో)	20-00
17.	"శ్రీసాయి"కోటి	27-00
18.	"శ్రీసాయిరామ్"కోటి	20-00
19.	శ్రీ సాయినాథ స్తోత్రమంజరి	10-00
20.	శ్రీ సాయివేయినామాలు	8-00
21.	శ్రీ సాయి హారతులు (పాకెట్)	15-00
22.	శ్రీ సాయి స్తవనమంజరి	10-00
23.	హిందీ శ్రీ సాయి హారతులు	15-00

24.	శని సింగణాపూర్ క్షేత్రమాహాత్మ్యం	63-00
25.	ఇంగ్లీషు శ్రీ సాయిహారతులు	15-00
26.	షిరిడి దర్శనం-శ్రీసాయి వైభవం	99-00
27.	సాయిసత్యవ్రతం	30-00
28.	సాయి అనుగ్రహమ్	120-00
29.	నవగురువారాల వ్రతకల్పము	15-00
30.	శ్రీదత్తలీలామృతము	99-00
31.	హృదయంలో సాయి	15-00
32.	శ్రీషిరిడీసాయి లీలామృతం(శ్రీసచ్ఛరిత్ర)	120-00
33.	గజాననమహరాజ్ చరిత్ర	99-00

4. జ్యోతిషాలు

1.	'కాలచక్రం' గంటలపంచాంగం (గార్గేయ)	72-00
2.	గ్రహభూమి పంచాంగము (గార్గేయ)	108.00
3.	ఆనందసిద్ధి పంచాంగం (వై.వి.శాస్త్రి)	63.00
4.	ములుగు వారి రాశిఫలితాలు (12రాశులువారికి)	50.00
5.	ములుగు వారి రాశిఫలితాలు విడివిడిగాఒక్కొక్కటి	12.00
6.	కాలచక్రంజ్యోతిషక్యాలండర్	25.00
7.	గ్రహబలం క్యాలండర్ (శ్రీనివాసగార్గేయ-భక్తిటివి)	25.00
8.	శుభమస్తు (పిడపర్తి) క్యాలండర్	25.00
9.	సాదా క్యాలండర్	5.00
10.	పాకెట్ క్యాలండర్	15.00
11.	తాజకనీలకంఠీయమ్	100-00
12.	కేరళ జ్యోతిష రహస్యాలు	180-00
13.	జ్యోతిష బ్రహ్మ రహస్యాలు	180-00
14.	మానసాగరి జాతకపద్ధతి	180-00
15.	వరాహమిహిర జాతకపద్ధతి	180-00
16.	వధూవర వివాహమైత్రిద్వాదశకూటములు	99-00
17.	సింపుల్ రెమిడీస్	180-00
18.	శంభు హోరప్రకాశిక	250-00
19.	పూర్వ పరాశరి	100-00
20.	పరాశర జ్యోతిషవిజ్ఞాన సర్వస్వం	200-00
21.	ప్రశ్న సింధు	99-00
22.	నక్షత్ర విశేష ఫలితాలు	63-00
23.	సూర్యసిద్ధాంతపంచాంగగణితంచేయడంఎలా?	180-00
24.	దృక్సిద్ధాంతపంచాంగగణితం చేయడంఎలా?	180-00

25.	ఆయుర్దాయ నిర్ణయం	63-00
26.	జాతక గణిత ప్రవేశిక	63-00
27.	జ్యోతిషమర్మబోధిని	63-00
28.	జ్యోతిష ప్రశ్నోత్తరమాల	63-00
29.	ముహూర్తం నిర్ణయించడంఎలా?	63-00
30.	జాతక మకరందం	63-00
31.	జ్యోతిష సరస్వతి	63-00
32.	మీజననకాల విశేషాలు	63-00
33.	ముహూర్త విజ్ఞాన భాస్కరం	63-00
34.	జ్యోతిష స్వయంబోధిని	63-00
35.	శుభముహూర్త శిరోమణి	63-00
36.	నక్షత్ర ఫలమంజరి	36-00
37.	పంచాంగం చూసే విధానం	36-00
38.	సర్వార్థ జ్యోతిషం	36-00
39.	ప్రాథమిక జ్యోతిషం	36-00
40.	నవరత్నములు శుభయోగములు	36-00
41.	శుభశకునాలు	30-00
42.	హస్తరేఖాఫలితాలు	36-00
43.	సంఖ్యల్లో భవిష్యత్	36-00
44.	ముహూర్త దీపిక	99-00
45.	పుట్టుమచ్చలు ఫలితాలు	30-00
46.	కలలు ఫలితాలు	30-00
47.	జాతక చక్రం వేయడం ఎలా?	36-00
48.	మానసాగరి (ప్రాచీనజ్యోతిషగ్రంథం) -పుచ్చాశ్రీనివాసరావు	250-00
49.	జ్యోతిషశాస్త్ర చిట్కాలు	120-00
50.	గుప్తా శతాబ్ది పంచాంగం (1940-2050)	999-00
51.	ప్రశ్నచండేశ్వరమ్	63-00
52.	ద్వాదశభావ ఫలచంద్రిక	250-00
53.	జ్యోతిష శతయోగరత్నావళి (నూరుయోగాలఫలితాలు)	120-00
54.	అంగసాముద్రికం	36-00
55.	హస్త సాముద్రికం	63-00
56.	లాల్ కితాబ్	99-00
57.	శకునశాస్త్రం	63-00
58.	ఆధునికప్రశ్నశాస్త్రం	120-00
59.	పరాశరజ్యోతిష ప్రశ్నజ్యోతిషం	180-00

60. అష్టకవర్గు (కొండపల్లి)	63-00
61. బృహత్‌జాతకం (ప్రాచీనప్రతికిపునర్ముద్రణ)	250-00
62. లగ్నరత్నాకరం	63-00
63. షట్పంచాశిక	120-00
64. 40 రోజుల్లో జ్యోతిషంనేర్చుకొనండి	270-00
65. 40 రోజుల్లో సాముద్రికంనేర్చుకొనండి	180-00
66. 40 రోజుల్లో సంఖ్యాశాస్త్రం	180-00
67. 40 రోజుల్లో నక్షత్ర (నాడీ) ఫలితములు	270-00
68. 40 రోజుల్లో వైద్యజ్యోతిషం నేర్చుకోండి	250-00
69. మీ పుట్టినతేదీ అద్భుతరహస్యాలు (సాయిగణపతిరెడ్డి)	270-00
70. కె.పి.జ్యోతిషం (పరిచయం)	63-00
71. ముహూర్తచింతామణి	99-00
72. సూర్యచంద్ర గ్రహణములు	63-00
73. ప్రసిద్ధవ్యక్తుల జాతకాలు (వేరేకొండప్ప)	180-00
74. అదృష్టరెమెడీస్	144-00
75. గ్రహసంచార ఫలనిర్ణయదీపిక	63-00
76. జ్యోతిష రెమిడీస్	300-00
77. జాతకమార్తాండం పాతప్రతికి యథాతథం (కొండపల్లి)	250-00
78. జ్యోతిషవిద్యాప్రకాశిక పాతప్రతికి యథాతథం (కొండపల్లి)	250-00
79. నాడీజ్యోతిషం	63-00
80. నక్షత్రపారిజాతం (గోరసవీరభద్రాచార్య)	63-00
81. లగ్నపారిజాతం (గోరసవీరభద్రాచార్య)	63-00
82. గౌతమసంహిత	63-00
83. హోరరత్నమాల	63-00
84. జాతకఫల మణిమంజరి	200-00
85. పుష్కర పంచాంగం (2013-14నుండి 2024-25)	560-00
86. దశాభుక్తిఫల నిర్ణయం	250-00
87. వింత జోష్యములు	63-00
88. షోడశవర్గులు	200-00
89. రవిగ్రహ సమస్త ప్రభావములు	99-00
90. చంద్ర గ్రహ సమస్త ప్రభావములు	99-00
91. కుజ గ్రహ సమస్త ప్రభావములు	99-00
92. బుధ గ్రహ సమస్త ప్రభావములు	99-00
93. గురు గ్రహ సమస్త ప్రభావములు	99-00
94. శుక్ర గ్రహ సమస్త ప్రభావములు	99-00

95.	శని గ్రహ సమస్త ప్రభావములు	99-00
96.	రాహు & కేతు గ్రహముల సమస్త ప్రభావములు	99-00
97.	ఆధునిక గ్రహములు-ఉపగ్రహములు సమస్త ప్రభావములు	99-00
98.	ముహూర్తమార్తాండం	63-00
99.	లఘుజాతకం	63-00
100.	జాతకాలంకారము	63-00
101.	మేషలగ్న ఫలితములు	99-00
102.	వృషభ లగ్న ఫలితములు	99-00
103.	మిధున లగ్న ఫలితములు	99-00
104.	కర్కాటక లగ్న ఫలితములు	99-00
105.	సింహలగ్న ఫలితములు	99-00
106.	కన్యలగ్న ఫలితములు	99-00
107.	తుల లగ్న ఫలితములు	99-00
108.	వృశ్చిక లగ్న ఫలితములు	99-00
109.	ధనుస్సు లగ్న ఫలితములు	99-00
110.	మకర లగ్న ఫలితములు	99-00
111.	కుంభ లగ్న ఫలితములు	99-00
112.	మీన లగ్న ఫలితములు	99-00
113.	నారద సంహిత	200-00
114.	పంచాంగపీఠికలేఖికాగణితం	250-00
115.	తారాబలం - చంద్రబలం (వేరే కొండప్ప)	99-00
116.	సులభలగ్న సాధన (చిత్రాలగురుమూర్తిగుప్తా)	200-00
117.	రాహు కేతువుల యోగము	99-00
118.	ఛాయాగ్రహములు	99-00
119.	జ్యోతిషవిజ్ఞాన దీపిక	63-00

బి.వి.రామన్ గారి గ్రంథములు

120.	జ్యోతిష విద్యారంభం	50-00
121	గ్రహభావ బలములు	50-00
122.	కాలచక్రదశ	50-00
123.	అనుభవ ప్రశ్నాజ్యోతిషం	50-00
124.	జ్యోతిషశాస్త్రంలో వాతావరణ భూకంపాలు	50-00
125.	పురోగామి జాతకం	50-00
126.	భావార్ధరత్నాకరం	75-00
127.	భారతీయజ్యోతిష సర్వస్వం	75-00
128.	అష్టకవర్గ పద్ధతిః	75-00

129.	జ్యోతిషశాస్త్రంలో సందేహాలు,సమాధానాలు	75-00
130.	ప్రశ్నతంత్ర	75-00
131.	ముహూర్తం	75-00
132.	విశిష్ట జాతకములు	125-00
133.	భారతీయఫలితజ్యోతిషం	125-00
134.	300 ముఖ్యమైన యోగములు	125-00
135.	జాతకంపరిశీలించడంఎలా ?	300-00

రాష్ట్రపతి అవార్డుగ్రహీత, మహామహోపాధ్యాయ, వాచస్పతి శ్రీ మధురకృష్ణమూర్తిగారి గ్రంథములు

136.	బృహత్పరాశరహోరాశాస్త్రము-1	200-00
137.	బృహత్పరాశరహోరాశాస్త్రము-2	200-00
138.	బృహత్పరాశరహోరాశాస్త్రము-3	200-00
139.	బృహత్పరాశరహోరాశాస్త్రము-4	200-00
140.	భావార్థరత్నాకరము	100-00
141.	ముహూర్త చింతామణి	100-00
142.	ముహుర్త చింతామణి-పార్టు2	200-00
143.	స్వప్న శాస్త్రము	36-00
144.	శతయోగమంజరి	50-00
145.	వ్రతనిర్ణయకల్పవల్లి	250-00
146.	దైవజ్ఞవల్లభం	75-00
147.	వసంతరాజశకునమ్ (బృహత్శకునశాస్త్రం)	250-00
148.	వాస్తుశాస్త్రవివేకము-1	100-00
149.	వాస్తుశాస్త్రవివేకము-2	200-00
150.	వాస్తుశాస్త్రవివేకము-3	100-00
151.	వాస్తుశాస్త్రవివేకము-4	200-00
152.	అనుభవసులభవాస్తు - 1	50-00
153.	అనుభవసులభవాస్తు - 2	100-00
154.	పంచాంగ వివేకము	99-00
155.	వశిష్ఠ సంహిత	360-00
156.	పంచపక్షి శాస్త్రం (కేస్బైండ్)	200-00

5. వాస్తులు

1.	40 రోజుల్లో "వాస్తువిద్య" నేర్చుకొనండి	180-00
2.	వాస్తుశాస్త్ర రహస్యములు	200-00
3.	వాస్తునుబట్టి మీ ఇల్లు	63-00
4.	మీరూ మీ వాస్తు	63-00

5.	గృహవాస్తు చిట్కాలు	63-00
6.	వాస్తు పూజ	63-00
7.	వాస్తు సూత్రములు	63-00
8.	వాస్తుశాస్త్ర రహస్యాలు	63-00
9.	గృహవాస్తు వర్గులు	99-00
10.	విశ్వకర్మవాస్తు శాస్త్రరీత్యా మీ ఇంటి ప్లానులు	63-00
11.	విశ్వకర్మ వాస్తుశాస్త్రరీత్యా మీఇండ్లఆయములు	99-00
12.	విశ్వకర్మ వాస్తు శాస్త్రం(చిత్రాలగురుమూర్తిగుప్తా)	180-00
13.	ఆధునిక గృహవాస్తు	99-00
14.	శుభవాస్తు	270-00
15.	వాస్తుయంత్ర రత్నావళి	120-00
16.	వాస్తుశాస్త్రం	120-00
17.	హౌస్ ప్లాన్స్	63-00
18.	గృహనిర్మాణ వాస్తు	63-00
19.	వాస్తు రెమెడీస్	63-00
20.	గృహవాస్తు దర్పణం	63-00
21.	జ్యోతిష-గృహవాస్తుచంద్రిక	200-00
22.	వాస్తురత్నాకరం (కొండపల్లి)	63-00
23.	వాస్తుశిరోమణి ,,	120-00
24.	వాస్తుసంగ్రహమ్ ,,	63-00
25.	పంచవాస్తు పారిజాతం ,,	120-00
26.	వాస్తుడిండిమమ్ ,,	63-00
27.	వాస్తుదుందిభి ,,	120-00
28.	విశ్వకర్మవాస్తుప్రకాశిక (కేస్‌బైండ్)	250-00
29.	కృష్ణవాస్తుశాస్త్రము	63-00
30.	జలవాస్తు,శల్యవాస్తు (దంతూరిపండరీనాథ్)	99-00
31.	మయవాస్తు (గోరసవీరభద్రాచార్య)	120-00
32.	వాస్తు జ్యోతి	63-00
33.	మన ఇల్లు-మనవాస్తు	99-00
34.	వాస్తవ వాస్తుపూజావిధానము	108-00
35.	వాస్తు దర్పణం	120-00

6. మంత్రశాస్త్రాలు

1.	మంత్రసాధన	63-00
2.	తంత్రజాలం	63-00
3.	మంత్రశక్తి	63-00

4.	దత్తాత్రేయ తంత్రవిద్య	63-00
5.	దత్తాత్రేయ మూలికాతంత్రమ్	63-00
6.	తాంత్రిక పంచాంగం	63-00
7.	యక్షిణీ తంత్రం	63-00
8.	మంత్రానుష్ఠాన చంద్రిక	63-00
9.	సర్వదేవతా మంత్రకవచములు	63-00
10.	మంత్రాక్షరాలరహస్యం (బీజాక్షరనిఘంటువు)	63-00
11.	సర్వదేవతా మంత్రరత్నావళి	63-00
12.	సదాచార దీపిక	63-00
13.	యోగినీ-వామకేశ్వరతంత్రం	63-00
14.	ప్రపంచసారతంత్రం	63-00
15.	బదనిక తంత్రమ్	63-00
16.	ఉచ్ఛిష్ట గణపతి తంత్రమ్	63-00
17.	గుప్త సాధన తంత్రం	63-00
18.	గంధర్వ తంత్రమ్	63-00
19.	సౌందర్యలహరి (మంత్రయంత్రరత్నావళి)	63-00
20.	యంత్ర మంత్ర తంత్ర	63-00
21.	పాశుపత తంత్రం	99-00
22.	పంచదశ మహాఖడ్గ తంత్రం	99-00
23.	రుద్రాష్టాధ్యాయః	99-00
24.	మంత్రసిద్ధి	120-00
25.	పరశురామతంత్రమ్	108-00
26.	శ్రీలలితావిలోమ పంచదశీ	108-00
27.	శ్రీ గురు తంత్రం	108-00
28.	గాయత్రీ తంత్రమ్	108-00
29.	మహాశక్తి మంత్ర తంత్ర రహస్యాలు	150-00
30.	శ్రీ దుర్గ తంత్రమ్	200-00
31.	మహామృత్యుంజయఅమృతపాశుపతమ్	200-00
32.	సర్ప (నాగ)తంత్రం	250-00
33.	హవన తంత్రం	250-00
34.	షోడశనిత్యతంత్రం	250-00
35.	శాక్తేయతంత్రం	250-00
36.	రుద్రయామళతంత్రం	250-00
37.	లక్ష్మీప్రత్యంగిరా తంత్రమ్	250-00
38.	హిరణ్యశూలినీ తంత్రమ్	250-00

39.	మాయాప్రత్యంగిరా తంత్రమ్	250-00
40.	శ్రీ విశ్వరూప ప్రత్యంగిరా తంత్రమ్	250-00
41.	స్వర్ణాకర్షణభైరవతంత్రం	250-00
42.	కాశీవిశాలాక్షి తంత్రం	250-00
43.	శాంతితంత్రమ్	250-00
44.	యంత్రసిద్ధి	360-00
45.	శ్రీ లక్ష్మీతంత్రమ్	360-00
46.	మంత్రమహోదధి (స్త్రీదేవతాఃకల్పమ్)	360-00
47.	మంత్రమహోదధి (పురుషదేవతాఃకల్పమ్)	360-00
48.	మంత్రశాస్త్రం (గ్రంథము)	360-00
49.	ప్రత్యంగిరాకృత్యాతంత్రం	360-00
50.	కామధేనువు తంత్రం	360-00
51.	శూలినీదుర్గాతంత్రం	360-00
52.	శ్రీవిద్య రహస్యం	290-00
53.	కులార్ణవ తంత్రమ్	150-00
54.	ఆచార్య సిద్ధ నాగార్జునతంత్రం (ఒరిజనల్)	390-00
55.	సిద్ధమూలిక రహస్యం (మంత్ర,యంత్రసహితం)	63-00

7. గ్రంథాలు - ఆరాధనలు

1.	భగవద్గీత శ్లోక తాత్పర్య సహితం	54-00
2.	భగవద్గీత (వచనం)	99-00
3.	భగవద్గీత శ్లోకతాత్పర్యం-కేసుబైండింగ్	72-00
2.	గణేశ ఆరాధన 1	99-00
3.	గణేశోపాసన 2	99-00
4.	నవగ్రహవైభవం	99-00
5.	నవగ్రహ రెమెడీస్	99-00
6.	నవగ్రహ వేదం	99-00
7.	శనిగ్రహారాధన	99-00
8.	ఆదిత్యారాధన	99-00
9.	సుబ్రహ్మణ్యారాధన	99-00
10.	శ్రీ శివ ఆరాధన	99-00
11.	లక్ష్మీ ఆరాధన	99-00
12.	హనుమదారాధన	99-00
13.	లలితారాధన	99-00
14.	శ్రీ చక్రారాధన	99-00
15.	గాయత్రీ ఆరాధన	99-00

16.	వీరభద్రారాధన	99-00
17.	కుజగ్రహారాధన	99-00
18.	భైరవారాధన	99-00
19.	దైవారాధన	99-00
20.	గీతారాధన (భగవద్గీత శ్లోకతాత్పర్యసహిత)	99-00
21.	శ్రీవేంకటేశ్వరాధన	99-00
22.	హయగ్రీవారాధన	99-00
23.	లక్ష్మీనరసింహారాధన	99-00
24.	శ్రీ బాలాత్రిపురసుందరీ స్తోత్ర కదంబం	99-00
25.	దేవీ లీలామృతం	99-00
26.	పురాణపండ సుందరకాండ వచనం	99-00
27.	పురాణపండ రామాయణం	99-00
28.	పురాణపండ భారతం	99-00
29.	పురాణపండ భాగవతం	99-00
30.	(సూరి) వాల్మీకి రామాయణం	99-00
31.	కాలసర్ప యోగం	99-00
32.	నిత్య జీవితములో రుద్రాక్షలు	99-00
33.	నిత్య జీవితములో నవరత్నాలు	99-00
34.	వేదసూక్తములు	99-00
35.	వేమన పద్యసారామృతం	99-00
36.	పండగలు పర్వదినాలు	99-00
37.	సూక్తిరత్నాలు	99-00
38.	హనుమచ్చరిత్ర	99-00
39.	నవగ్రహ దర్శనమ్	99-00
40.	నిత్యజీవితంలో నవగ్రహాలు	99-00
41.	సాలగ్రామములు	99-00
42.	గురుశుక్ర ప్రభావము చంద్రకళానాడీ	99-00
43.	శనిగ్రహరెమిడీస్	99-00
44.	జాతకసుధాసారము-జాతకమోక్షప్రదాయిని	99-00
45.	వివాహజ్యోతిషమంజరి-మ్యారేజ్‌మ్యాచింగ్‌గైడ్ (సాయిగణపతిరెడ్డి)	99-00
46.	మీపుట్టినతేదీనిబట్టి మీజీవితరహస్యాలు (న్యూమరాలజీ లైఫ్‌గైడ్) ,,	99-00
47.	మీఅదృష్టానికి (పేరు) నేమ్‌కరక్షన్ ,,	99-00
48.	న్యూమరాలజీ రెమిడీస్	99-00
49.	మూకపంచశతీ	99-00
50.	శ్రీరామకర్ణామృతం	99-00

51.	రహస్యకుక్కుటశాస్త్రం	300-00
52.	ఉపాసన విధానం	99-00
53.	పంచమవేదం మహాభారతం	99-00
54.	దేవుళ్ళు డాట్ కామ్	99-00
55.	గణపతిభాష్యం	99-00
56.	యజుర్వేద ఉపనయనవివాహప్రయోగమంజరి	99-00
57.	నవయోగులు	99-00
58.	ఆంధ్రప్రదేశ్‌లోనిదర్శించవలసిన ప్రముఖదర్గాలు	99-00
59.	సకలదేవతాఅష్టోత్తరాలు(పెద్దది)-(180అష్టోత్తరశతనామావళులతో)	99-00
60.	సకలదేవతా అష్టోత్తరశతనామావళులు (కేస్‌బైండింగ్)	216-00
61.	సకలదేవతా సహస్రనామములు	99-00
62.	ఆధ్యాత్మిక సూక్తి నిధి	99-00
63.	బ్రాహ్మణులు గోత్రాలు,ప్రవరలు	99-00
64.	సర్వదేవతాస్వరూపుడు శ్రీ వేంకటేశ్వరుడు	99-00
65.	శ్రీ లక్ష్మీసన్నిధి	99-00
66.	శ్రీలక్ష్మీగణపతి హోమకల్పం	99-00
67.	మార్షల్‌ఆర్ట్స్ (కరాటే,కుంగ్‌ఫూనేర్చుకోండి)	99-00
68.	మ్యాజిక్‌గైడ్	99-00
69.	చదరంగం	99-00
70.	పంచముఖ హనుమత్ వైభవం	63-00
71.	గరుడపురాణం	40-00
72.	మాఘపురాణం	36-00
73.	శివపురాణం	36-00
74.	వైశాఖపురాణం	36-00
75.	కార్తీక పురాణం	36-00
76.	కార్తీక పురాణం (చిన్నది)	25-00
77.	సర్వకార్యసిద్ధికి రామాయణపారాయణ	63-00
78.	పెద్దబాలశిక్ష	50-00
79.	గాయత్రీ మహిమ	36-00
80.	వృక్షదేవతలు	63-00
81.	యాజుష స్మార్త సంస్కార చంద్రిక	200-00
82.	సనాతనవైదిక బ్రాహ్మణస్మార్తాగమకల్పమ్	150-00
83.	చతుర్వేదములు	120-00
84.	నవగ్రహారాధన	120-00
85.	తాళపత్ర సమాహార గోపురం	120-00
86.	మనుధర్మ శాస్త్రం (వచనంలో...) (కేస్‌బైండు)	250-00

87.	మానవధర్మములు		120-00
88.	వేదమంత్ర సంహిత		120-00
89.	సహస్రలింగార్చన		120-00
90.	శ్రీ శివగీత		120-00
91.	ద్వాదశఉపనిషత్తులు		120-00
92.	పురాణపండవారి సౌందర్యలహరి	(కేస్‌బైండ్)	250-00
	(శ్లోకతాత్పర్యసహిత విపులవ్యాఖ్యతో)	సాదా	120-00
93.	బృహత్ శివ స్తోత్ర రత్నాకరము		200-00
94.	బృహత్ దేవీ స్తోత్రరత్నాకరము		200-00
95.	బృహత్ విష్ణు స్తోత్రరత్నాకరము		200-00
96.	కేదారనాథ్ బదరీనాథ్ యాత్రాగైడు		63-00
97.	దక్షిణావృత శంఖములు		63-00
98.	108 దివ్యదేశాల విష్ణుక్షేత్రదర్శని		36-00
99.	ధర్మసింధువు(కేస్‌బైండింగ్)		270-00
100.	భారతీయ శైవక్షేత్రయాత్రాదర్శిని		99-00
101.	చిలుకూరి బాలాజీచరిత్ర		36-00
102.	భగవత్‌స్తుతి		63-00
103.	సూర్యోపాసన		36-00
104.	కాశీఖండం		250-00
105.	దేవీభాగవతం		360-00
106.	శ్రీ ఆంజనేయం		216-00
107.	ధర్మసందేహాలు		216-00
108.	ఆధ్యాత్మిక దైవిక వస్తువులు		250-00
109.	రామాయణం		600-00
110.	పోతన భాగవతం		900-00
111.	శివమంత్రములు		63-00

8. వైద్య గ్రంథాలు

1.	ఆహారం ఆరోగ్యం	36-00
2.	మూలికావైద్య చిట్కాలు	36-00
3.	ఆయుర్వేద వైద్య చిట్కాలు	30-00
4.	గృహవైద్య రహస్యాలు	36-00
5.	గృహవైద్యసారం	36-00
6.	హోమియోవైద్యం (ద్వాదశలవణచికిత్స)	63-00
7.	ప్రకృతివైద్యం	36-00
8.	ఆహారం-వైద్యం	99-00

9.	సంపూర్ణ ఆయుర్వేద-చిట్కా వైద్యం	99-00
10.	ఆయుర్వేదమ్	36-00
11.	ఆయుర్వేద మూలికావైద్యదీపిక	99-00
12.	దుంపకూరలు, ఆకుకూరలు, కాయగూరలు (వాడకం - ఉపయోగాలు)	99-00
13.	ఏకమూలికావైద్యం	99-00
14.	అష్టాంగ హృదయం (4భాగాలు)	1200-00
15.	రహస్యసిద్ధయోగవైద్యసారమ్	99-00
16.	ప్రాథమిక హోమియోవైద్యం	99-00
17.	ఒబెసిటి	99-00
18.	హెల్త్‌గైడ్	99-00
19.	ఆయుర్వేదం-జీవనవేదం	99-00
20.	ఫుడ్‌థెరపి	63-00
21.	న్యాచురల్‌థెరపి	99-00
22.	సంపూర్ణఆరోగ్యానికి 20ని॥	63-00
23.	కీళ్ళనొప్పులు మీ సమస్యలైతే...	99-00
24.	యోగామంత్ర	63-00
25.	యోగా మండే టు సండే	63-00
26.	హెర్బల్ మెడిసిన్-హెల్త్‌టుడే	99-00
27.	హెల్త్‌ఫైల్	108-00
28.	వస్తుగుణపాఠం	250-00
29.	రసాయన వాజీకరణ తంత్రం	150-00
30.	వస్తుగుణ మకరందం	400-00
31.	నాటువైద్యం -(కేస్‌బైండ్)	360-00
32.	నాటువైద్యం (చిన్నది)	99-00
33.	ప్రాణాయామము-యోగ	63-00

9. అయ్యప్ప - భవానీ రకాలు

1.	శ్రీ అయ్యప్ప లీలామృతం	30-00
2.	శ్రీ అయ్యప్ప భజనపాటలు	63-00
3.	శ్రీ అయ్యప్ప పూజాకల్పం	20-00
4.	శ్రీ అయ్యప్ప భక్తి గీతాలు	20-00
5.	హారతిగైకొనుమా	40-00
6.	శ్రీ అయ్యప్ప దీక్ష F	10-00
7.	శ్రీ అయ్యప్ప భజనమాల F	10-00
8.	శ్రీ అయ్యప్ప నిత్యపూజ P	10-00

9.	శ్రీ అయ్యప్ప నిత్యనియమావళి P	10-00
10.	భవానీదీక్ష (శ్రీ భవానీ లీలామృతం)	36-00
11.	దేవీలీలామృతం	99-00
12.	శ్రీ దేవీ పూజాకల్పం	20-00
13.	దేవీ భక్తిగీతాలు	20-00
14.	భవానీదీక్ష P	10-00
15.	దేవీ భక్తిమాల F	10-00
16.	శ్రీ అయ్యప్ప భజనావళి	120-00
17.	అయ్యప్పపూజావిధి (జేసుదాసుసాంగ్స్‌తో)	24-00

10. భజనలు - కీర్తనలు

1.	అన్నమయ్య కీర్తనలు	20-00
2.	శ్రీరామదాసు కీర్తనలు	20-00
3.	సర్వదేవతా మంగళహారతులు	20-00
4.	వసుంధర మంగళ హారతులు	25-00
5.	సౌభాగ్య దేవతా మంగళహారతులు	36-00
6.	సర్వదేవతా భజనలు	36-00
7.	చిట్టి పొట్టి పాటలు	10-00
8.	జాతీయ గీతాలు	10-00
9.	దేశభక్తి గీతాలు	36-00
10.	పండుగలు-పుణ్యక్షేత్రాలు భక్తిగీతాలు	36-00
11.	గొబ్బిళ్ళపాటలు,లాలిపాటలు,కోలాటపాటలు	36-00
12.	అన్నమయ్య సంకీర్తనలు	99-00
13.	పెళ్ళిపాటలు-స్త్రీలపాటలు	36-00
14.	భక్తానంద భజనకీర్తనలు(ఓల్డ్‌సినీస్టైల్)	36-00
15.	సర్వదేవతాభక్తిమణిమాల	36-00
16.	బతుకమ్మ ఉయ్యాల పాటలు	36-00
17.	అన్నమయ్య సంకీర్తనానిధి(1000కీర్తనలు)	270-00

11. హిట్స్ సాంగ్స్

1.	ఘంటసాల భక్తిగీతాలు-భగవద్గీత	36-00
2.	ఎస్.పి.బాలు భక్తిగీతాలు	36-00
3.	ఘంటసాల సుమధురగీతాలు	99-00
4.	పి. సుశీల సుమధురగీతాలు	99-00

5.	ఎస్.పి. బాలు సుమధురగీతాలు	99-00
6.	ఎస్.జానకి సుమధురగీతాలు	99-00
7.	వేటూరి సుందరరామమూర్తిహిట్స్	99-00
8.	సర్వదేవతా సినీభక్తిగీతాలు	99-00

12. స్త్రీలకు ఉపయుక్త పుస్తకములు

1.	శ్రీకాంతామణి వంటలు (వెజ్)	63-00
2.	శ్రీకాంతామణి వంటలు (నాన్‌వెజ్)	63-00
3.	శాకాహార వంటలు	30-00
4.	మాంసాహారవంటలు	30-00
5.	చిట్టిచిట్కాలు	30-00
6.	అందానికి చిట్కాలు	30-00
7.	పిల్లల పేర్లు (పెద్దది)	30-00
8.	పిల్లల పేర్లు (చిన్నది)	10-00
9.	లేటెస్ట్ ఎంబ్రాయిడరీ శాలీబోర్డర్స్	36-00
10.	లేటెస్ట్ ఎంబ్రాయిడరీ డిజైన్స్	36-00
11.	చిన్నారులకు చిరుతిళ్ళు	30-00
12.	పసందైన ఫాస్ట్‌ఫుడ్ వంటలు	30-00
13.	పలావ్‌లు, ఫ్రైడ్ రైస్‌లు, వెరైటీరైస్‌లు	30-00
14.	వేపుళ్ళు-ఇగుర్లు	30-00
15.	బ్రేక్‌ఫాస్ట్ వంటలు	30-00
16.	పండుగలలో చేసుకొనే పిండివంటలు	30-00
17.	మైక్రోవేవెన్ వంటలు	99-00
18.	సర్వదేవతాభక్తిమాల	36-00
19.	పిల్లలపేర్లు (బాబు)	36-00
20.	పిల్లలపేర్లు (పాప)	36-00
21.	మోడ్రన్ మెహంది (గోరింటాకు డిజైన్స్)	36-00
22.	మోడ్రన్ పిల్లలపేర్లు	99-00
23.	నోరూరించే నాన్‌వెజ్‌వంటలు	99-00
24.	మోడ్రన్ టైలరింగ్ (లేడీస్ & జంట్స్)	99-00

వివిధ రకాలు

ఎందరోమహానుభావులు	270-00
యోగాసనాలు	36-00
సూర్యనమస్కారములు	36-00
పొడుపు కథలు (చిన్నవి)	10-00

హిందీ-తెలుగు-స్వబోధిని	20-00
ఇంగ్లీషు-తెలుగు-స్వబోధిని	20-00
జనరల్ నాలెడ్జ్	20-00
నూరు ఎక్కాలు	10-00
1-100 టేబుల్ బుక్	10-00
1-100 టేబుల్‌బుక్ (క్రౌన్‌సైజు)	4-50
శ్రీరామకోటి	27-00
శ్రీశివకోటి	27-00
మేజిక్	30-00
అంకెలతో గారడీ	30-00
హృదయస్పందన (కవితలు)	30-00
వాత్స్యయన కామసూత్రాలు	36-00
ఎ.పి.టూరిస్ట్ గైడు	36-00
ఇంద్రజాల రహస్యాలు	30-00
మహేంద్రజాల రహస్యాలు	30-00
శరీరభాష (బాడీ లాంగ్వేజ్)	99-00
క్రియాయోగం	36-00
ఆనందంగా జీవిద్దాం	99-00
హరిశ్చంద్ర నాటకం	50-00
వాత్సాయనకామసూత్రాలు	99-00
పంచసాయకం	99-00
రతిరహస్యాలు	99-00
అనంగరంగం (కంభంపాటి స్వయంప్రకాష్)	99-00
శృంగారకేళి (కంభంపాటి స్వయంప్రకాష్)	99-00
గాయత్రీవిజ్ఞాన్	99-00
చింతామణి (నాటకం)	50-00
బాలనాగమ్మ	50-00
కాళహస్తి స్త్రీల వ్రతకథలు	36-00
కాళహస్తి రామాంజనేయ యుద్ధం(బదిరెడ్డి)	50-00
కాళహస్తి గోవింద నామాల భగవద్గీత	36-00
కాళహస్తి గృహవాస్తు చింతామణి	99-00
కాళహస్తి గృహవాస్తు మర్మాలు (బైండు)	63-00
రామరాయవాస్తుశాస్త్రం(ముద్రగడరామారావు)	90-00
ఎం.ఎస్.ఆర్.హనుమాన్‌చాలీసా	10-00
ఎం.ఎస్.ఆర్.సుందరకాండ	80-00
బ్రహ్మంగారిజీవితచరిత్ర (జవంగుల)	125-00
శ్రీ ఆదిశంకరాచార్య దివ్యచరితామృతం	40-00

కాశీరామేశ్వర మజిలీ కథలు		63-00
శ్రీలలితాసహస్రనామము(భాస్కరభాష్యం)		600-00
ప్రకృతిసిద్ధాంతములు-వేదవిజ్ఞానము-ఫలితజాతక సూత్రములు		595-00

ముదుండి విశ్వనాథరాజుగారి గ్రంథములు

విశ్వకర్మ ప్రకాశము		80-00
ప్రాచీనవాస్తుశాస్త్రాలు-ఆధునికవాస్తుపరిశీలన	,,	250-00
నారద సంహిత	,,	150-00
వాస్తురాజవల్లభము-మూలానువాదము	,,	60-00
మయమతము - వచనము	,,	80-00
బృహత్సంహిత - వచనము	,,	160-00
వాస్తువిజ్ఞానజ్యోతి		......
పురోహిత దర్శని (గోరసవీరభద్రాచార్య)		....
విశ్వకర్మవాస్తువిద్యారహస్యములు	,,	....
వాస్తు విజ్ఞాన చంద్రిక	,,	....
మహాదశా పారిజాతం	,,	....
వాస్తు నారాయణీయం	,,	120-00
యోగావళీఖండం	,,	120-00
ముహూర్తసింధువు		150-00
సర్వార్థచంద్రిక (4భాగాలు)		1208-00
మీరే న్యూమరాలజిస్ట్ (దావూద్)		370-00
నిర్ణయసింధు (2భాగాలు)		590-00
సాయి...	,,	45-00
శ్రీ దుర్గానందలహరి	,,	200-00
ఆరతిసాయిబాబా	,,	11-00
ప్రతిష్ఠకల్పః(సాగి నరసింహమూర్తి)		500-00
తాజుద్దీన్‌బాబా సచ్చరిత్ర		100-00

సుమారు 100 సం॥రాలునాటి ప్రాచీన ప్రతులు తిరిగి
ఈ క్రింది గ్రంథములు ప్రచురించబడినవి.

శ్రీరామ మంత్రానుష్ఠానము	300-00
శ్రీరామనవరాత్రోత్సవకల్పః	300-00
సీతారామ కథా సుధ అయోధ్యకాండ	200-00
సీతారామ కథా సుధ బాలకాండ	150-00
అరణ్యకాండ	100-00
శ్రాద్ధము ఎందుకు పెట్టాలి ? షోడశ సంస్కారములు	200-00
స్మార్త కాపర్ది కారికలు	200-00
నపుంసక సంజీవనము, వైద్య శిరోమణి	200-00
విషవైద్య చింతామణి	200-00

హేమాద్రి సూరిణా ప్రాయశ్చిత్తాధ్యాయః	300-00
సర్వమూలికా గుణరత్నాకరం	300-00
ఆపస్థంబీయ ధర్మసూత్రాలు	300-00
సర్వశాంతి దర్పణం - అపర ప్రయోగ దర్పణం	200-00
గణకరంజని	200-00
సంతాన దీపిక	200-00
తిథినిర్ణయ కాణ్డః	250-00
ముహూర్త దర్పణం	200-00
జ్యోతిష శాస్త్ర రత్నము (శ్రీపతిజాతక పద్ధతి)	250-00
లఘుతాచకము	200-00
శ్రీ వైఖనస పైతృమేదిక ప్రయోగః	300-00
స్మృతి రత్నాకరము (ధర్మశాస్త్రం)	400-00
జాతకామృతతసారం	300-00
జాతక బోధిని	300-00
సంగీత విద్యాదర్పణం	300-00
సంగీత సర్వార్థసారసంగ్రహం	300-00
ముహూర్త మార్తాండం(టీకతాత్పర్యం)	450-00
జాతకరహస్యం	200-00
రాజమార్తాండం	200-00
ఆయుర్దాయదీపిక	200-00
వైద్యామృతం	200-00
అనుపానమంజరీ	200-00
నవగ్రహశాంతి విధానం-ఉదకశాంతి విధిః	200-00
చికిత్సరత్నము	200-00
స్వరచింతామణి	200-00
ద్వాదశలోహ భస్మవిధానం	200-00
దైవజ్ఞయశో విభూషణం	200-00
అనుపాన రత్నకరము	200-00
కాలామృతము	250-00
దైవజ్ఞకర్ణామృతము	300-00
రసేంద్ర చింతామణి	300-00
రసరత్న సముచ్చయం	300-00
వస్తుగుణరత్నాకరము	300-00
హోరానుభవదర్పణము	360-00
విశ్వకర్మ ప్రకాశిక వాస్తుశాస్త్రము	250-00
స్త్రీజన కల్పవల్లి	450-00
సంగీత సర్వార్థ సంగ్రహం	300-00
సంగీత సుధాసంగ్రహము	250-00
అర్క ప్రకాశము	200-00
సంగీత మార్తాండము	200-00
సంగీత ప్రథమబోధిని	200-00

వైద్యకల్పతరువు	200-00
రసప్రదీపిక	250-00
గణకానందము	250-00
శ్రీ లలితాసహస్రనామావళిః-వివరణాత్మక భావంతో	200-00
నవచండీ వేదోక్త శ్రీ దేవీ పూజాకల్పం	200-00
శ్రీ గాయత్రీ అనుష్ఠాన తత్త్వప్రకాశిక	360-00
సంగీతమార్తాండము	250-00
సారావళి	360-00
భేషజకల్పము	200-00
గురుశిష్య ఆయుర్వేద వైద్యచింతామణి	360-00
జాతకమణి	200-00
సర్వశకున ప్రకాశిక	200-00
యాజుష ప్రయోగ చంద్రిక	250-00
శిక్షావల్లీ-ఆనందవల్లీ-భృగువల్లీ	300-00
వసంతరాజ శకునము	250-00
తొట్టి వైద్యం	450-00
జ్యోతిష సిద్ధాంత సంగ్రహము (పంచాంగ గణితం)	300-00
సహస్ర యోగప్రకాశిక	300-00
శ్రీవిద్యారహస్యం	290-00
మహర్షుల చరిత్ర 1,3 300+300	
వేంకట సోమయాజీయం అను ధర్మశాస్త్రకాండము	250-00
శ్రీఆంజనేయం	216-00
రాశితుల్యవత్సర ఫలితం	200-00
నాడి జ్యోతిష విశ్లేషణ	400-00
రహస్యకుక్కుటశస్త్రం	300-00
స్త్రీ ధర్మరత్న బాండాగారము	200-00
శైవోత్సవరత్నాకరం	300-00
యాజుషప్రయోగ చిన్తామణి	300-00
సుస్వర ఋగ్వేద ప్రయోగదర్శిని	300-00
ఆయుర్వేద వైద్య సంగ్రహం	300-00
వశిష్ఠ సంహిత	360-00
హోమియోపతి గృహవైద్యం	200-00
వ్రతచూడామణి	300-00
వైశ్యధర్మప్రకాశిక	300-00
ఆలయ నిత్యార్చన పద్ధతి	200-00
స్మృతిముక్తాఫలం	300-00
ఆపస్థంబయల్లాజీయమ్	300-00
జ్యోతిషశాస్త్రసంగ్రహము	200-00
కర్మవిపాకాఖ్యయం	360-00
ముహూర్త రత్నావళి	250-00
సుదివిలోచనం	300-00
ఉత్తర కాలామృతం	200-00
సర్వవిషయ సర్వస్వసంగ్రహం	200-00